వి.ఎస్.ఆర్ & ఎన్.వి.ఆర్ కళాశాల

(స్వయం ప్రతిపత్తి) - రీఅక్రిడియేట్

తెనాలి - 522 201, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్.



భావవీణ ప్రత్యేక సంచిక

Journal of Literary, Culture & Language Studies

Vol. 17 - Issue. 8 - Spl. Edition - August 2020 - ISSN No. : 2456-4702

అంతర్జాతీయ అంతర్జాల సదస్సు (వెబినార్)

24, 25 ఆగష్టు 2020

తెలుగు సాహిత్యం - సమకాలీనత



ప్రధాన సంపాదకులు :

కె. వి. పీద్మావతి

వైస్ ప్రిన్సిపాల్ & శాఖాధిపతి, తెలుగు విభాగం, వి.ఎస్.ఆర్ & ఎన్.వి.ఆర్ కళాశాల, తెనాలి.






తెలుగు భాష - శిక్షణా శిబిరం



మాతెలుగు తల్లికి మల్లెపూదండ - మాకన్న తల్లికి మంగళారతులు



BHAVA VEENA (భావ వీణ)

Journal of Arts, Literary, Culture & Language Study

(కళలు - సాహిత్య-సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక)

Editor : Kolla Sri Krishnarao
E-mail : parisodhanatelugu@gmail.com

7989781963,
9490847482.
Rohini Towers,
2/11 Brodipet,
GUNTUR-2.

Vol. 17 - Issue. 8 - August 2020 - ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 - Rs. : 15/-

EDITORIAL BOARD

Chief Editor
PITTA SANTHI
M.A.(Tel), M.Sc(Psy).,M.Ed.,M.Phil(Edu),(Ph.D).,
C/o. Dr. Busi Venkataswamy
Holy Homes Apartment, Postal colony ,
4 Th Line,- 522 002, Guntur Dist., A.P. Cell no : 7386529274, 7989781963.

ADVISORY COMMITTEE

1. **Prof. G. Yohan Babu,** M.A., PhD.
Dept. of Telugu,
Andhra University, Visakhapatnam.
2. **Prof. K. Madhu Jyothi,** M.A., PhD.
Dept. of Telugu,
Sri Padmavathi Mahila University,
Tirupathi.
3. **Prof. C. Srirama Chandra Murthy,** M.A., PhD.
Dept. of Telugu, Faculty of Arts,
Benaras Hindu University, Varanasi, Utter Pradesh.
4. **Dr. Busi Venkataswamy,** M.A. (Tel)., M.A (San)., M.A (Ling)., PhD.
HOD & Research Guide, Dept. of Telugu
PAS College, Pedanandipadu.
5. **Prof. V. Sankara Rao**, M.A.,M.A.,M.Phil, PhD.
HOD, Dept. of Telugu,
Madras University,
CHENNAI, Tamilnadu.
6. **Prof. Darla Venkateswara Rao,** M.A., M.Phil., Ph.D.
Dept. of Telugu,
Central University of Hyderabad, Hyderabad. Telangana.

ASSOCIATE EDITORS

1. **Dr.N. R. SADASIVA REDDY**, M.A.,M.Phil,PhD.
Asst. Professor,
Dept. of Telugu & Comparative Literature,
Sri Krishna Deva Raya University,
Ananthapuram, Andhra Pradesh.
2. **THOTTEMPUDI SREE GANESH,** M.A., M.Phil (Computational Linguistics) (Ph.D)
Research Scientist, Centre for Applied Linguistics and Transalation Studies, Universityof Heidelberg, Germany.
3. **Dr. D. SESHUBABU**, M.A.,M.Phil,PhD.
Asst. Professor, Dept.of Hindi,
Moulana Azad National Urdu University,
HYDERABAD, Telangana.
4. **Dr. K. Lavanya,** M.A., M.Phil., PhD.
Board of Studies Chairman,
Telangana University, Dichpally,
Nizamabad, Telangana.
5. Prof. **N.V. KRISHNA RAO,** M.A.,M.Phil,PhD.
Dept. of Telugu & O.L.,
Acharya Nagarjuna University,
Nagarjuna Nagar, Guntur District.
6. **Dr. A. JYOTHI,** M.A.,M.Phil,PhD.
Associate Professor, Dept. of Telugu,
Kakatiya University, Warangal District.
Telangana.

7. **Dr. J. VENKATA RAMANA,** M.A.,M.Phil,PhD.
Asst.Professor, Dept.of Modern Indian Languages,
Madhurai Kamaraj University, Madhurai,
Tamilnadu.

8. **Dr. N. Eswar Reddy,** M.A., PhD.
Associate Professor, Dept. of Telugu,
Yogi Vemana University, Kadapa.

9. **Prof. P.R. Harinadh,** M.A., M.Ed., M.Phil,PhD.
Dept. of Telugu,
Regional Institute of Education (NCRT)
Manasa Gangothri, Mysore, Karnataka.

10. **Dr. B. Tirupathi,** M.A., PhD.
Associate Professor, Dept. of Telugu,
Dravidian University, Kuppam, Chittor Dist.

11. **Dr. T.SATYANARAYANA,** M.A.,M.Phil,PhD.
Asst.Professor, Dept. of Telugu,
Adikavi Nannaya University,
RAJAMUNDRY, East Godavari, A.P.

12. **Mr. D.ESWARA RAO,** M.A.,
Principal,
P.A.S.College, PEDANANDIPADU-522 235,
Guntur, A.P.

13. **Dr. P. VIJAYA KUMAR**, M.A.,M.Phil,PhD.
Asst. Professor, Dept. of Telugu,
Central University of Andhra Pradesh,
Ananthapuram District. A.P.

14. **Dr. K. RAVI**, M.A., M.Phil,PhD.
HOD, Dept. of Telugu, C.R. Reddy College,
West Godavari District. A.P.

15. **Dr. G. Swarnalatha,** M.A., PhD.
Asst. Proffesor, Dept. of Telugu,
Govt. Women's College (A), Guntur.

16. **Dr. V. Naga Rajyalakshmi,** M.A., PhD.
Rt Principal,Govt .Degree College,
Chebrole , Guntur, A.P.

17. **Dr. Guntupalli Gowri,** M.A., PhD.
Dept. of Telugu,
Govt. College for Women, Guntur - 522 002.

18. **Dr. Kakani Sudhakar,** M.A., M.Phil., PhD.
Dept. of Telugu,
S.S.N. College, Narasaraopet - 522 601.

19. **Dr. K. Pushpamma,** M.A., PhD.
HOD, Dept. of Telugu,
SVRM College,
Nagaram - 522 035.

20. **Dr. P. Srinivasa Rao,** M.A., M.Phil., PhD.
PDF Scholar, Dept. of Telugu,
Andhra University, Visakhapathan.

21. **Dr. Ch. Praveen Kumar,** M.A., M.Phil., PhD.
PDF Scholar, Dept. of Telugu,
Kakatiya University, Warangal.

22. **Dr. N. Rambabu,** M.A., M.Phil., PhD.
Project Senior Fellow, Dept. of Classical
Literature, Nellore.

23. **Dr. G. Sailamma,** M.A., M.Phil., PhD.
Editorial Assistat,
Centre for Publications Dravidian University,
Kuppam, Chittor Dist.

24. **Dr. M. Sangeetha Rao,** M.A., M.Phil., PhD.
Guest Faculty, Dept. of Telugu,
Central University of Andhra Pradesh,
Ananthapuram District. A.P.

25. **Dr. M. Prasad,** M.A., M.A.(San)., PhD. Diploma in Maliyalam.
School Assistant (Telugu)
Govt. High School,
Rapuru, SPSR Nellore.

26. **Dr. V. Triveni**
Head & Assistant Professor,
Dept. of Telugu Studies,
Telangana University, Dichpally, Nizamabad.

27. **Dr. Mark Poloneyes,** M.A., M.Phil., PhD.
Principal & HOD,
P.G. Centre, Gadwal,
Palamuru University, Mahabobnagar, Telangana.

LEGALADVISER

Dr. A. GURAVAIAH, ***M.A., L.L.M., PhD.,***
Principal & Research Guide, Dept., of Law, A. C. Law College, GUNTUR - 522 002, A.P.

DTP & PRINTING

TENALI PRAKASH, G.L.S. GRAPHICS, LEMALLE, Guntur. 94 94 660 509.

గమనిక : రచయితల అభిప్రాయములతో సంపాదక వర్గమునకు సంబంధం లేదు - **ఎడిటర్.**

Edited, Printed, Published and owned by Kolla Srikrishna Rao, Rohini Towers, 2/11 Brodipet,
GUNTUR - 522 002. Andhra Pradesh. Cell : 7386529274, 7989781963.
E-mail : parisodhanatelugu@gmail.com.Printed at : GLS Enterprises, Kavitha Nagar, Guntur - 522 002. Ph. 94 94 660 509.

వి.ఎస్.ఆర్ & ఎన్.వి.ఆర్ కళాశాల (స్వయం ప్రతిపత్తి)

రీఅక్రిడియేట్

తెనాలి - 522 201, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్.

తెలుగు సాహిత్యం - సమకాలీనత

అంతర్జాతీయ అంతర్జాల సదస్సు (వెబినార్)

తేది : 24, 25 ఆగష్టు 2020

నిర్వహణ :

తెలుగు శాఖ

వి.ఎస్.ఆర్ & ఎన్.వి.ఆర్ కళాశాల (స్వయం ప్రతిపత్తి)

తెనాలి - 522 201, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్.

తెలుగు సాహిత్యం – సమకాలీనత

అంతర్జాతీయ అంతర్జాల సదస్సు (వెబినార్)

భావవీణ ప్రత్యేక సంచిక

ISSN No. : 2456-4702

RNI No. APTEL/2003/12253

UGC CARE - Journal - Arts & Humanities, Sl. No. : 35

ప్రథమ ముద్రణ : **24 ఆగష్టు 2020**

ప్రతులు : **500**

కాపీలకు : **ప్రిన్సిపాల్, వి.ఎస్.ఆర్ & ఎన్.వి.ఆర్ కళాశాల (స్వయం ప్రతిపత్తి), తెనాలి, ఆంధ్రప్రదేశ్.**

: **శ్రీమతి కె.వి. పద్మావతి, వైస్ ప్రిన్సిపాల్ & శాఖాధిపతి, తెలుగు విభాగం, వి.ఎస్.ఆర్ & ఎన్.వి.ఆర్ కళాశాల (స్వయం ప్రతిపత్తి), తెనాలి, ఆంధ్రప్రదేశ్.**

గమనిక : **ఈ సంచికలోని వ్యాసకర్తల అభిప్రాయములతో సంపాదక వర్గమునకు సంబంధం లేదు – సంపాదకవర్గం.**

ఎడిటోరియల్ చిరునామా : **హోలీ హౌస్ అపార్ట్‌మెంట్స్, పోస్టల్ కాలనీ, 4వ లైను, గుంటూరు – 522 002.**

డి.టి.పి & ప్రింటింగ్ : **తెనాలి ప్రకాష్, జి.యల్.ఎస్. గ్రాఫిక్స్, లేమల్లె, అమరావతి మండలం, గుంటూరు జిల్లా.** సెల్ : 9494 660 509.

తెలుగు సాహిత్యం - సమకాలీనత

అంతర్జాతీయ అంతర్జాల సదస్సు (వెబినార్)

ప్రధాన సంపాదకులు :

శ్రీమతి కె. వి. పద్మావతి

సంపాదకవర్గం :

డా॥. టి. వెంకటలాల్

డా॥. ఎల్. రాజీవ్‌బాబు

డా॥. సి.హెచ్. బాలకృష్ణ

వి.ఎస్.ఆర్ & ఎన్.వి.ఆర్ కళాశాల (స్వయం ప్రతిపత్తి)

రీఅక్రిడియేట్

తెనాలి - 522 201, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్.



నన్నపనేని సుధాకర్

సెక్రెటరీ & కరెస్పాండెంట్



అభినందనీయం

ప్రపంచ మానవాళి 'కరోనా' మహమ్మారికి భయపడి 'స్టే హోం స్టే సేఫ్' నినాదానికి బద్ధులై ఇంటికే పరిమితమైనప్పటికీ సాంకేతిక పరిజ్ఞానం వల్ల ప్రపంచనలుమూలల్లో వున్నవారందరు ఒకేవేదికమీదికి చేరి విజ్ఞానాన్ని పెంపొందించుకోవడమనేది హర్షించదగ్గవిషయం. ఈ నేపథ్యంలోనే తెలుగు శాఖవారు 'తెలుగుసాహిత్యం - సమకాలీనత' అనే అంశంపై అంతర్జాతీయ అంతర్జాల సదస్సును ఏర్పాటు చెయ్యడం మెచ్చుకోదగ్గ విషయం. సాహిత్యం ఎల్లప్పుడు సామాజిక బాధ్యతను మోస్తూ వుంటుంది. సమాజంలో జరిగే ప్రతి సంఘటన సాహిత్యాంశంగా మారుతుంది అలాగే సాహిత్యం ద్వారా ప్రస్పుటించే ప్రతి అంశం సామాజిక ప్రయోజనాన్ని కోరుకుంటున్నట్లుగా వుంటుంది. తెలుగు మాతృభాషగా కలిగివున్న మనందరం గర్వంగా చెప్పుకోదగ్గ విషయం తెలుగు సాహిత్యం ప్రపంచ సాహిత్యాలతో పోటీపడే స్థాయిని సంపాదించుకోవడం. ఆదికవిగా చెప్పుకుంటున్న నన్నయ దగ్గరినుండి ప్రస్తుత కాలంలో వస్తున్న కరోనా సాహిత్యం వరకు తెలుగు సాహిత్యం స్పృశించని అంశం లేదు అని ఖచ్చితంగా చెప్పొచ్చు. తెలుగు సాహిత్యంలో వచ్చిన అనేక ప్రక్రియలు తెలుగు భాషా సౌష్టవాన్ని ప్రతిబింబిస్తాయి . కాబట్టి తెలుగు భాషను, తెలుగు సాహిత్యాన్ని ఎన్నిసార్లు పునర్మూల్యాంకనం చేసుకున్నా ఇంకా ఏదో మిగిలివుందనే భావన కలుగుతూనే వుంటుంది. తెలుగు శాఖవారు నిర్వహించిన ఈ అంతర్జాల అంతర్జాతీయ సదస్సు కూడా ఇటువంటి ప్రయత్నంలో భాగమే. ఈ సదస్సు ద్వారా అనేకమంది సాహితీవేత్తలు,

కవులు, రచయితలు, పరిశోధకులు తమ ఆలోచనా శక్తికి పదునుపెట్టి అనేక అంశాలపై పత్రసమర్పణ చెయ్యడం ఎంతో అభినందనీయం. అటువంటి వ్యాసాలన్నింటినీ క్రోడీకరించి పుస్తకంగా ప్రచురించడం ఇంకా అభినందనీయం. ఒక మంచి పుస్తకం ద్వారా తెలుగు సాహిత్యాన్నంతటిని పునఃశ్చరణ చేసుకునే అవకాశం కలిగిందని అనిపిస్తోంది. ఇంత మంచి సదస్సును నిర్వహించడం, తద్వారా ఒక మంచి పుస్తకాన్ని తెలుగు సాహిత్యాభిమానులకు పరిచయం చెయ్యడం అనే బృహత్కార్యాలను చేపట్టిన వి.యస్.ఆర్ %డ% ఎన్.వి.ఆర్ కళాశాల ప్రిన్సిపల్ శ్రీ ఎన్.నిరంజనరావు గారిని, తెలుగు విభాగాధిపతి శ్రీమతి కె.వి పద్మావతి గారిని మిగిలిన అధ్యాపక బృందాన్ని, 'భావవీణ' పత్రికా సంపాదకులను, వారికి అన్నిరకాలుగా సహకరించినవారందరినీ అభినందిస్తూ శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను.



నన్నపనేని సుధాకర్

వి.ఎస్.ఆర్ & ఎన్.వి.ఆర్ కళాశాల (స్వయం ప్రతిపత్తి)

రీఅకిడ్రియేట్

తెనాలి - 522 201, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్.



ఎస్. నిరంజన రావు

ప్రిన్సిపాల్



తొలి పలుకులు

తెలుగు భాషా సాహిత్యాలు భారతీయ సంస్కృతీ సంప్రదాయా లను కాపాడుతూ సామాజికాభివృద్ధికి తోడ్పాటును అందిస్తున్నాయి. తెలుగు భాష భావ వ్యక్తీకరణకు అత్యంత అనువైన భాషగా గుర్తింపు పొందింది . అలాగే తెలుగు సాహిత్యం కూడా భూత, వర్తమాన, భవిష్యత్కాలాలకు అనుగుణంగా తన రూపురేఖలను మార్చుకుంటూ సమాజ ప్రయోజనాలను కోరుకుంటూ తన వునికిని చాటుకుంటూ వుంటుంది. అందుకే మారుతున్న కాలానికి అనుగుణంగా ఎప్పటికప్పుడు కొత్త కొత్త అంశాలను తనలో కలుపుకొని సాహిత్యం తన సౌష్టవాన్ని పెంపొందించుకుంటూ వుంటుంది. ఇందులో భాగంగానే తెలుగు శాఖవారు నిర్వహించిన 'తెలుగు సాహిత్యం-సమకాలీనత' అనే అంతర్జాల అంతర్జాతీయ సదస్సు ఎన్నో సామాజిక విలువలు దాగివున్న సాహిత్యాంశాలను వెలికి తీయడానికి దోహదంచేసిందనడంలో సందేహంలేదు. ఈ సదస్సు ద్వారా సమర్పించబడిన పత్రాలు ఎన్నో విలువైన అంశాలను తెలియజేస్తున్నాయి. అటువంటి వ్యాసాలన్నింటినీ సేకరించి పుస్తకంగా అచ్చువేయడం ప్రశంసించదగ్గ విషయం. ఈ గ్రంధంలోని ప్రతి వ్యాసం తెలుగు సాహిత్యంలోని ఒక కొత్త కోణాన్ని చూపించే విధంగా వున్నాయి. ఇలాంటి మంచి ప్రయత్నం చేసి విజయవంతమయిన తెలుగు శాఖ వారికి ప్రత్యేకమైన అభినందనలు తెలియజేస్తున్నాను.

యస్. నిరంజన రావు

BHAVAVEENA
Vol. 17, Issue. 8, August 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category



వి.ఎస్.ఆర్ & ఎన్.వి.ఆర్ కళాశాల (స్వయం ప్రతిపత్తి)

రీఅకిడ్రియేట్

తెనాలి - 522 201, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్.



శ్రీమతి కె.వి. పద్మావతి
వైస్ ప్రిన్సిపాల్ & శాఖాధిపతి,
తెలుగు విభాగం



ముందుమాట

సదస్సు ఉద్దేశం ఆవశ్యకత

"హితేన సహితం సాహిత్యం".

హితంతో కూడినది సకలశాస్త్రాలతో కూడుకున్నది సాహిత్యం. హితాన్ని చేకుర్చేది మేలుతో కూడింది సాహిత్యం అన్నప్పుడు ఏది హితం, ఎవరికీ హితం అనే ప్రశ్నలు ఎదురౌతాయి. వీటికి సమాధానాలు కాలాన్ని బట్టి, సంస్కృతిని బట్టి, దేశాన్ని బట్టి మారుతూ ఉంటాయి. సమాజానికి మేలు చేకుర్చేది సాహిత్యం అవుతుంది. సాహిత్యానికి సమాజానికి అవినాభావ సంబంధముంది. సమాజంలోంచి సాహిత్యం పుడుతుంది. సాహిత్యం మనుగడ సమాజం పై ఆధారపడి ఉంది. సాహిత్యం మానవుని ఆలోచనలకు పదును పెట్టి సంస్కారాన్ని పెంచుతుంది మరియు మానసిక పరివర్తనకు దారి చూపిస్తుంది. సాహిత్యం సమాజానికి ప్రతిబింబం మాత్రమె కాక సమాజాన్ని చైతన్యపరుస్తుంది. ఈ సాహిత్యం మౌఖికంగా మొదలై లిఖిత రూపంలో వివిధ ప్రక్రియలలో దేశ సంస్కృతి సంప్రదాయాలకు అనుగుణంగా మారింది. ఆదికవి నన్నయ తో ప్రారంభమై నేటి వరకు ఎందతో కవులు వివిధ సాహిత్య ప్రక్రియలలో సాహిత్యాన్ని సృజించారు.

దేశవిదేశాలలో ఉన్న వివిధ విశ్వవిద్యాలయాల ఆచార్యులు, వివిధ కళాశాల అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు, ప్రాచీన సాహిత్యం నుండి నేటి వరకు వివిధ ప్రక్రియలలో వచ్చిన సాహిత్యం

మీద పరిశోధనలు చేస్తున్నారు. ఆ పరిశోధనల కొనసాగింపులో భాగంగా తెనాలి వి.ఎస్.ఆర్ & ఎన్.వి.ఆర్ కళాశాల తెలుగు శాఖ ఆధ్వర్యంలో రెండు రోజుల అంతర్జాతీయ అతర్జాల వెబినార్ (సదస్సు) "తెలుగు సాహిత్యం లో సమకాలీనత" అనే అంశం పై ఆయాకాలాలలో వచ్చిన సమకాలీన అంశాలు తెలుగు సాహిత్యం లో ఏవిధంగా ప్రస్ఫుటించాయో అని అధ్యయనం చేసి, ఆశావహ పరిశోధకుల ద్వారా పరిశోధక పత్రాలు సమీకరించి గ్రంథస్థం చేసి సాహితీ ప్రియులకు అందించాలనే సదుద్దేశంతో ఈ సదస్సును ఏర్పాటు చేయడమైనది.

దేశంలో పేరెన్నికగన్న వివిధ విశ్వవిద్యాలయాల ఆచార్యులు, విదేశాలలో ఉంటూ తెలుగు భాషా సాహిత్యం సంస్కృతి పరిరక్షణకు కృషి చేస్తున్న సాహితీవేత్తలు, వివిధ విశ్వవిద్యాలయాలో పరిశోధక విద్యార్థులు,రెండు తెలుగు రాష్ట్రాలలో వివిధ విద్యాసంస్థలలో పనిచేసస్తూ పరిశోధనల పట్ల మక్కువ గలిగిన తెలుగు అధ్యాపకులు మరియు సాహితీవేత్తలు ఈ వేబినార్ లో ప్రత్ర సమర్పణ చేయడం తెలుగు భాషా సాహిత్యం సుసంపన్నమవుతుందనడంలో ఏమాత్రం అతిశయోక్తి లేదు.

కళలకు కాణాచి ,సాహిత్యానికి పుట్టినిల్లు మేట్టినిల్లై ఆంధ్రా ప్యారీస్ గా పిలవబడే తెనాలి పట్టణం లో వి.ఎస్.ఆర్ & ఎన్.వి.ఆర్ కళాశాల పేరొందిన విద్యావనం. విద్యా, సాంస్కృతిక సాహిత్య, కళా రంగాలకు స్ఫూర్తి దీప్తి నొసగి ఉత్తమ ఫలితాలు సాధించుటలో ఆదర్శ ప్రాయమైనది. గొప్ప సదస్సులను నిర్వహించే విషయంలో మా కళాశాల కరస్పాండెంట్ శ్రీ నన్నపనేని సుధాకర్ గారి సహకారం, ప్రోత్సాహమే మాకు స్ఫూర్తిదాయకం. వీరి సహకారంతో "తెలుగు సాహిత్యం సమకాలీనత" అనే అంశం పై సాహిత్యాన్ని పునర్ ముల్యాకనం చేసి, తెలుగు భాషను, సాహిత్యాన్ని ప్రపంచ భాషా సాహిత్యాలా సరసన నిలబెట్టి తెలుగు సాహిత్యం అప్రతిమానంగా విరాజిల్లాలని ఆశిస్తూ .....



కె.వి.పద్మావతీ
సదస్సు సంచాలకులు

కృతజ్ఞతలు

"తెలుగు సాహిత్యం సమకాలీనత" అనే అంశంపై ఈ అంతర్జాతీయ అంతర్జాల వెబినార్ (సదస్సు) ఆవిర్భావం ఎందరో మహానుభావుల ఆలోచనలకు ప్రతిరూపం. తెలుగు సాహిత్యం సమిష్టి సంపద. అలాగే ఈ సదస్సు నిర్వహణకు కూడా సమిష్టి భాగస్వామ్యం. సదస్సు ఈ రూపం సంతరించుకోవడానికి తోడ్పడిన వారికి ఎన్ని విధాలుగా కృతజ్ఞతలు తెలిపిన అది తక్కువే అవుతుంది. ప్రతి ఒక్కరు ఈ సదస్సు మాట సదస్సుగానే భావించి,వారు ఏవిధంగా ఈ సదస్సు నిర్వహణకుతోడ్పదగాలరో అలా తమ సహకారాన్ని అందించగలిగారు.

ముందుగా మా కళాశాల యాజమాన్యం ప్రత్యేకమైన ధన్యవాదాలు మా కళాశాల ఈ సదస్సును ఏర్పాటు చేస్తానని చెప్పిన వెంటనే ఒప్పుకొని అమూల్యమైన సందేశాన్ని ఇస్తూ సదస్సు నిర్వహణకు తోడ్పడిన కరస్పాండెంట్ శ్రీ నన్నపనేని సుధాకర్ గారికి నా హృదయపూర్వక ధన్యవాదాలు. సదస్సు సహకర్తలు ప్రిన్సిపాల్ శ్రీ యస్ నిరంజన్ రావు గారికి ధన్యవాదాలు. సదస్సు నిర్వహణలో తగిన సలహాలు ఇచ్చిన కళాశాల పీజీ కోర్సులు డైరెక్టర్ డా.నన్నపనేని సూర్య కుమారి గారికి మరియు %ూా ూ% డా.నన్నపనేని సుగుణ గారికి ధన్యవాదాలు.

ఈ సదస్సు నిర్వాహణకు సంపూర్ణ సహకారంతోపాటు తన మిత్రబృందాన్ని సమీకరించి సదస్సు దిగ్విజయంగా కొనసాగడానికి అవిరళ కృషి సల్పిన సోదర సమానులు మద్రాసు విశ్వవిద్యాలయం తెలుగు శాఖాధ్యక్షులు ఆచార్య విస్తాలి శంకర్ రావు గారికి హృదయపూర్వక ధన్యవాదాలు.

అంతర్జాతీయ సదస్సును నిర్వహించడమే కాక సదస్సుకు సంబంధించిన ప్రత్యేక సంచికను రూపొందించడం ఎంతో కష్టం. అటువంటి కార్యాన్ని నిర్వహించిన ఘనత భావవీణ సంపాదకులు మరియు పెదనందిపాడు ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల తెలుగు శాఖా అధ్యక్షులు, సదస్సు ఆత్మీయ అతిథి డా.బూసి వెంకటస్వామి గారికే దక్కుతుంది. సంచికను సకాలంలో తీసుకువచ్చిన వీరికి ప్రత్యేకమైన ధన్యవాదాలు.

ప్రారంభ సమావేశంలో పాల్గొన్న ముఖ్యఅతిథి అన్నమయ్య ఆధ్యాత్మిక గ్రంధాలయ నిర్వాహకులు శ్రీ లంకా సూర్య నారాయణ గారికి, గౌరవ అతిథి ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం రెక్టార్ ,ఆచార్య పి. వర ప్రసాద మూర్తి గారికి, విశిష్ట అతిథి ఆచార్య పేట శ్రీనివాసులు రెడ్డి గారికి, ఆత్మీయ అతిథులు ఆచార్య కొలకలూరి ఆశాజ్యోతి గారికి, తొట్టెంపూడి గణేష్ గారికి, డా.కె.గీతా గారికి, కీలకోపన్యాసం చేసిన బూదాటి వెంకటేశ్వర్లు గారికి హృదయపూర్వక ధన్యవాదములు.

సమాపనోత్సవం లో ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రాంతీయ సంయుక్త సంచాలకులు డా.వి.ఆర్.జ్యోత్స్నా కుమారి గారికి , విశిష్ట అతిథి మాజీ తానా అధ్యక్షులు డా.తోటకూర ప్రసాద్ గారికి, ఆత్మీయ అతిథులు ఆచార్య గొనా నాయక్ గారికి, ఆచార్య జర్రా అప్పారావు గారికి, డా. కాకాని సుధాకర్ గారికి సమాపనోత్సవానికి సందేశమిచ్చిన ఆచార్య మేడిపల్లి రవి కుమార్ గారికి ప్రత్యేక ధన్యవాదాలు.

రెండు రోజుల సమావేశాలకు అధ్యక్షత వహించిన వివిధ విశ్వవిద్యాలయాల ఆచార్యులకు, పత్ర సమర్పణ చేసిన సాహిత్యాభిమానులందరికీ మరియు మా కళాశాల తెలుగు శాఖా అధ్యాపకులు డా.జి వెంకట్ లాల్ గారికి, డా. ఎల్.రాజీవ్ బాబు గారికి, డా.సిహెచ్ బాలకృష్ణ గారికి ధన్యవాదాలు...



Contents (విషయ సూచిక)

1. సాహిత్యం - ఆధునికత - సమకాలీనత	- డా॥ పి. విజయకుమార్	16
2. భగవద్గీత - భక్తి తత్వం	- డా॥. ఆవుల గిరిబాబు	23
3. కొలకలూరి ఇనాక్ 'రంధి' నవల - సమకాలీనత	- తోట రామకృష్ణ	26
4. ఆధునిక మహేతిహాసం - కన్యాశుల్కం - సమకాలీనత	- డా॥. యన్.సి. సంజీవ రెడ్డి	29
5. చండాలుడు నవల - సమకాలీనత	- తంగి ఓగేశ్వరరావు	32
6. కందుకూరి 'బ్రహ్మ వివాహం' - సాంఘిక విశ్లేషణ	- డా॥. కిలారి గౌరినాయుడు	37
7. కవిత్రయ మహాభారతం - నామాల విశ్లేషణ	- తోట వెంకటస్వామి	40
8. ఆంధ్ర మహా భారతం లో రాజనీతి - సమకాలీనత	- కె. సుజన	49
9. తెలుగు జాతీయోద్యమ, దేశభక్తి సాహిత్యం - సమకాలీనత	- డా॥. కొయ్యా శ్రీనివాసులు	54
10. నన్నయ భారతంలో సమకాలీనత	- తంత్రవహి శ్రీరామమూర్తి	59
11. గుణనిధి కథ - సమకాలీనత	- డా॥. ఏ. వెంకటప్రసాదు	63
12. తెలుగు కథా కావ్యాలు : సమకాలీన పరిస్థితులు	- కె.ఎస్. అన్నపూర్ణాదేవి	67
13. 'రక్తస్పర్శ' కవుల కవిత్వం - సమకాలీనత	- భూక్యా కాశీరామ్	71
14. భాగవతం - సమకాలీనత	- డా॥. బ్రహ్మానందరెడ్డి	74
15. చిలుకూరి నారాయణరావు 'అంబ' (మొండి శిఖండి) నాటకం	- డా॥. చుక్కా యశోద	78
16. ఆధునిక వేమన శతకము - సమకాలీనత	- డా॥. నల్లపనేని విజయలక్ష్మి	82
17. జానపదకళలు - సమకాలీనత	- డా॥. రాచపాళెం పురంధీశ్వరి	85
18. తొలితరపు తెలుగు నవలలు - సమకాలీనత	- డా॥. వి. బాలిరెడ్డి	89
19. లయాత్మక భావరూపం - వచనకవితా ప్రస్థానం	- డా॥. వి. శివనాగార్జున రెడ్డి	93
20. 'శారద లేఖలు' ఆధునిక భావ, రాగాల స్వరపేటికలు	- గొల్లంగి చిన్నబాబు	96
21. 'ఒక పరిమళ కాంతిదీపం' కవిత్వం - సమకాలీనత	- శశికళ యస్.	103
22. యువతరం భవిష్యత్తుకు నిలువుటద్దం 'ప్రలోభం' నవల	- అంకిరెడ్డి సునీల్ కుమార్ రెడ్డి	106
23. అతడు అడవిని జయించాడు - ఏరుకల జీవిత అధ్యయనం	- చౌట బాలకృష్ణ	111
24. గిరిజన సాహిత్యంలో సుగాలీల మౌఖిక సాహిత్యంలో కథా సాహిత్యం	- డా॥. భూక్యా జ్యోతి	114
25. రాయలసీమ రాగాల సొరభాలు	- డా॥. జి. స్వర్ణలత	118
26. జానపద కళల పరిరక్షణ	- డా॥. కొమ్మనబోయిన సుజాత	122
27. సమకాలీన సమాజ ప్రతిఫలనం ప్రాచీన సాహిత్యం	- డా॥. ఒభిన్ని శ్రీహరి	125
28. కవి శిఖామణి కవిత్వం - సమకాలీనత	- ఎలగొండ రాములు	129
29. స్వేచ్ఛనవల పాత్రలు - సమకాలీనత	- కవాడపు లలిత	133
30. సమకాలీన తెలుగు సాహిత్యంలో 'హైకూ' ప్రక్రియ విశిష్టత	- మాదా శంకరబాబు	138
31. జానపదవైద్యం - సమకాలీనత	- పి. దర్గాబాబు	141
32. మహాభారతంలో కొన్ని స్త్రీ పాత్రలు సమకాలీనత	- పప్పుల శైలజ	145

33. ఆధునిక సాహిత్య కవిత ప్రక్రియలో - మొగ్గలు కవిత ప్రక్రియ - బసవరాజప్ప 150
34. శైవ సాహిత్యం - నవవిధ భక్తి మార్గాలు - చంద్రమౌళి నాగమహాలక్ష్మి 153
35. ఆముక్త మాల్యద - సామాజికాంశాలు - డా॥. భూపతిరాజు బంగార్రాజు 161
36. ఆచార్య కొలకలూరి ఇనాక్ గారి కథలలో స్త్రీ వాదం-సమకాలీనత - డా॥. కాగిత సుబ్బారావు 164
37. ఆధునిక దళిత కథానిక - సమకాలీనత - డా॥. తొండాటి రాజశేఖర్ 169
38. ''తూరుపు'' పొలికేక - డా॥. జి.వి.యస్. జయపాలరావు & 173
- డా॥. బి. వేణుగోపాల్
39. తెలంగాణ ఉద్యమ కవిత్వం - ప్రాంతీయ అస్తిత్వం - గడ్డం నాగేందర్ 178
40. ఆముక్తమాల్యద - వ్యవసాయ జీవన ప్రతిఫలనం - గల్లా వెంకటేష్ 184
41. మధ్య యుగ ధిక్కార స్వరాలు : శివ కవులు - నందిగామ నిర్మల కుమారి 188
42. నువ్వు లేవు నీ కథ ఉంది - సుంకర గోపాలయ్య 193
43. రామాయణంలో 'పిల్లల పెంపకం' - సమకాలీనత - బమిడిపాటి గౌరీశంకర్ 196
44. దళిత ధిక్కార స్వరం ''నిప్పుల వాన'' - డా॥. ఎ.ఎ. నాగేంద్ర 199
45. విశ్వగీతి - సమకాలీన అభ్యుదయ దృక్పథం - డా॥. సిహెచ్. పవన్‌కుమార్ 203
46. వేమన శతకం - మానవతా విలువలు - డా॥. ఎం. ప్రభావతి 209
47. ఉత్తరాంధ్ర గిరిజనుల జీవనం - సమకాలీనత - డా॥. ఎం. ప్రసాదరావు 213
48. తొలి తెలుగు వీధి నాటకం - క్రీడాభిరామం - డా॥. మూల మల్లికార్జునరెడ్డి 216
49. ప్రాచీన సాహిత్యం - రామాయణం - సమకాలీనత - డా॥. వైరాగ్యం ప్రభాకర్ 221
50. తెలంగాణ గిరిజనుల జాతరలు - పరిచయమం - కుర్రా ఝాన్సీ 225
51. దళిత స్త్రీవాద కవిత్వం - సమకాలీన ధోరణులు - సూరేపల్లి పద్మావతి 229
52. గురజాడ రచనల్లో సమకాలీనత - రవిందర్ అచ్చ 232
53. చిల్లర దేవుళ్ళు నవల విశ్లేషణ - బి. మోహన్ నాయక్ 235
54. 'బంజారా పండుగలు - మానవ సంబంధాలు' - బానోత్ స్వామి 241
55. శైవసాహిత్యం- పాల్కురికి సోమన - సమకాలీనత - డా॥. ఏటూరు జ్యోతి 244
56. ఆంధ్రుల జానపద కళా సాహిత్యం - సమకాలీనత - డా॥. బి. సరస్వతి 248
57. పోతన భాగవతం - సమకాలీనత - డా॥. బశెట్టి ఉపేంద్ర 252
58. భాగవతంలో నవవిధ భక్తి మార్గాలు, అనుసరణ - డా॥. బోడిరెడ్డి మహేంద్రరెడ్డి 255
59. రాయల కాలంలో ఆవిర్భవించిన శైవ ప్రబంధం - డా॥. కె. ఈశ్వరమ్మ 259
60. ఆధునిక కవిత్వ రూపం - సమకాలీనత - డా॥. గోనిపాటి ధర్మారావు 262
61. వేమన శతకం - సమకాలీనాంశాలు - డా॥. కె. శ్యామలాదేవి 267
62. సినిమా ముసుగులో నవ్య సంప్రదాయం - డా॥. పి.ఎ. సత్యనారాయణ 270
63. అంటరాని వసంతం - సమకాలినత - డా॥. పి.సి. వెంకటేశ్వర్లు 272
64. గుర్రం జాషువగారి ఖండకావ్యాలు - సమకాలీనత - డా॥. టి. జాన్ కిరణ్ బాబు 276
65. అస్తిత్వవాదం - సమకాలీనత - డా॥. ఉడుము ఝాన్సీ 283

66. తీరాన్ని చేరిన 'అల్పజీవి' మనోవ్యథలు - మనోవైజ్ఞానిక దృక్పథాలు - డా॥. జాడ సీతాపతిరావు 287
67. మాడభూషి కవిత్వం - సమకాలీనత - జి. యన్. శ్యామలరాణి 294
68. యన్.పూజిత ప్రేమకు పట్టాభిషేకం నవల - సమకాలీనత - పి. జ్యోతి 298
69. అత్యాధునిక సాహిత్య ధోరణులు - సమకాలీనత - డా॥. పి. కాళియప్ప 302
70. గురజాడ రచనల్లో స్త్రీలు - సమకాలీనత - పల్లెమోని జయమ్మ 307
71. పింగళి నాగేంద్రరావు నాటకం-పరిశీలన-సమకాలీనత - పేరం శాంతి 311
72. 'మోడి' - జానపద కళారూపం - ఆచార్య డి.వి. శ్రవణ్‌కుమార్ 314
73. డా॥ దేవపాలన "బతుకు పాట" - సమకాలీనత - తన్నీరు బాలాజి 319
74. చలం వ్యాసా - పరిశీలన - ఆంజనేయులు.బి. 323
75. దోనయమాత్యుని సస్యానందము - సమకాలీనత - డా॥. అప్పిరెడ్డి హరినాథరెడ్డి 326
76. దాశరథి "నేనంటాను"లో నేటి రాజకీయ పరిస్థితులు - డా॥. ఆర్. హరీన కళ 331
77. హెలన్ కెల్లర్ స్త్రీవాదం - సమకాలీన దృకోణం - వై. బుజ్జి 335
78. దళిత సాహిత్య రచనలు - సమకాలీనత - సారంగపాణి బండి 339
79. వర్తమాన సమకాలీన కవిత్వం - పరిశీలనం - ఆచార్య జి.బి. ఆనందకుమార్ 342
80. స్త్రీవాదకవిత్వంలో - వాస్తవిక అంశాలు - డా॥. కసప నరేందర్ 345
81. జాషువా రచనల్లో దేశభక్తి - డా॥. మందలపు నటరాజ్ 350
82. సమకాలీనతకు అద్దం పట్టే చా.సో గారి "ఎంపు" కథ - డా॥. ఢిల్లీశ్వరరావు సనపల 353
83. తెలుగు కథాసాహిత్యం - ముస్లిం స్త్రీల జీవన చిత్రణ - పి. ఉషారాణి 356
84. బసవేశ్వరుడు మరియు దళిత మూల వచన కారులు - డా॥. సి. శివన్న 359
85. దక్షిణాంధ్రయుగ కవయిత్రులు - డా॥. ఎన్. దీపిక 366
86. మూడో కన్నీటి చుక్క - సామాజిక దర్శనం - డా॥. ఎన్. సుజాత 370
87. నా ఊరు (దీర్ఘ కవిత) - సమకాలీనత - డా॥. శివ కుమార్ నందనవనం 372
88. స్వాతంత్రోద్యమంలో స్త్రీవాదుల పాత్ర హక్కులు - డా॥. ఉమ్మిడి శాంతి 377
89. సామాజిక సమస్యలపై సమర శంఖారావం-అలిశెట్టి ప్రభాకర్ కవిత్వం - శ్రీమతి నారోజు వెంకటరమణ 379
90. జగదభిరాముడు శ్రీరాముడు - యం. రామనాథం నాయుడు 382
91. 'కాలుష్యం కోరల్లో' కథలోని సమకాలీనత - డా॥. చిలక అనిత 388
92. తెలుగు సాహిత్యం - సమకాలీనత - కె.వి. పద్మావతి & చెళ్ళపిళ్ళ శ్యామల 390
93. 1980వ దశకం నవలలు - సమకాలీనత - డా॥. గడ్డం శ్యామల 393
94. భాగవత సప్తమ స్కంధం - సమకాలీనత - డా॥. పైడిపాటి ఉమానాథశర్మ 397
95. తెలంగాణ కథ - సమకాలీనత - భానోతు కిష్ణ 401
96. మధుసూదన్ కవిత్వం - మానవతా దృక్పథం - డా॥. ఎ. విజయలక్ష్మి 403
97. 'ప్రజల మనిషి' నవలా కాలంనాటి పరిస్థితులు, సందేశం - డా॥. దేవినేని జ్యోతి 407
98. రామాయణం - సమకాలీనత - పరుచూరి విజయలక్ష్మి 412

BHAVAVEENA
Vol. 17, Issue. 8, August 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

సాహిత్యం – ఆధునికత – సమకాలీనత

– డా॥. పి. విజయకుమార్, సహాయ ఆచార్యులు (తెలుగు), ఆంధ్రప్రదేశ్ కేంద్రీయ విశ్వవిద్యాలయం, అనంతపురం.

ప్రపంచంలోని ఏ దేశంలోనైనా ఆధునికత ఎప్పుడు ప్రారంభమైందో, ఆధునిక యుగం ఎప్పటి నుండి ఆరంభమైందో గీతగీసి చెప్పలేం. 'ఆధునికత' అనే పదానికి స్పష్టమై నిర్వచనం లేదు. కాని వివిధ అర్థాలలో ఈ పదాన్ని పదే పదే వాడక తప్పడం లేదు. సాహితీవేత్తలు కొందరు 'ఆధునికత' కాలవాచి అన్నారు. మరికొందరు 'ఆధునికత' అనేది ఒక తాత్త్విక దృక్పథాన్ని సూచిస్తోందని అన్నారు. రెండవ అభిప్రాయం కొంతవరకు సమగ్రంగాను, సంపూర్ణంగాను ఉన్నట్లు కనిపిస్తోంది. అంతకు ముందు వ్యవస్థలోని సామాజిక, రాజకీయ, సాంస్కృతికాంశాలు పోయి అవి కొత్త స్వరూపాన్ని పొందటం ఆధునికత అనుకొంటే అది హఠాత్తుగా ప్రారంభమయ్యే పరిణామం కాదు. 'ఆధునికత' అనేది ఆకాశాన్నుంచి ఊడిపడే అంశం అంతకన్నా కాదు. ఆధునికతని కాలవాచిగా తీసుకుంటూనే ఆ కాలానికి సంబంధించిన వివిధ పరిణామాల పర్యవసానంగా ఏర్పడిన ఒక దృక్పథంగా కూడా భావించాలి.

సాహిత్యానికి సంబంధించినంత వరకు 20వ శతాబ్దంలో సామాజిక పునాదుల్లో వచ్చిన మార్పులు సాహిత్య స్వభావాన్ని సమూలంగా మార్చాయి. తత్ఫలితంగా సాహిత్య ప్రయోజన దృక్పథం ఒకటి ఏర్పడింది. దీంతో సాహిత్యకారుడి మనో ప్రపంచానికి భౌతిక ప్రపంచంలో అనుసంధానం కుదిరింది. సమకాలీన తెలుగు కవిత్వంలో ఈ అనుసంధానం పెద్ద కుదుపు. అప్పటి వరకూ వచ్చిన తెలుగు కవిత్వానికి భౌతిక సంబంధం లేదని కాదు, కాని రాజ్యవ్యవస్థని నిరాకరించిన కవులలో మాత్రమే అది సాధ్యపడింది.

మధ్యయుగం లేక భూస్వామ్యదశ నుంచి ఒక్కసారి ఆధునిక యుగం ప్రారంభం కాదు. పాతయుగం క్షీణ దశలోనే కొత్తయుగం లక్షణాలు కనిపిస్తాయి. మధ్య యుగం నుండి ఆధునిక యుగానికి మార్పు ఒక క్రమ పరిణామ పద్ధతిలో జరుగుతుంది. మధ్యయుగం అంటే ఒకానొక ఆర్థికవ్యవస్థ ఆధారంగా ఏర్పడిన రాజకీయ, సామాజిక వ్యవస్థ నిర్మాణం. ఆ ఆర్థిక వ్యవస్థ ఆధారంగా నిర్మితమైన ఆధునిక రాజకీయ, సామాజికవ్యవస్థ, యూరప్ దేశాలలో 15, 16 శతాబ్దాలలో ప్రారంభమైంది. దీన్నే పునరుజ్జీవన దశ అంటారు. అమెరికాను తెలుసుకోవటం, భారతదేశానికి కొత్త సముద్రమార్గాన్ని కనిపెట్టడంతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థలోనే గొప్ప మార్పు వచ్చిందని అది ఆధునికయుగ పరిణామానికి దారి తీసిందని కొందరి భావన. ఫ్రెంచి విప్లవంతో ఆధునిక ఆలోచనా విధానం ప్రారంభమైందని మరికొందరి అభిప్రాయం. భారతదేశానికి సంబంధించినంత వరకు ఆధునికత సుమారుగా పందొమ్మిదవ శతాబ్దం ఉత్తరార్ధంలో ప్రారంభమైందని భారతదేశపు ఆధునికయుగ చరిత్రకారులు భావిస్తున్నారు.

ఆధునిక జీవితం వెయ్యి ముఖాలుగా విస్తరించింది. మానవ ప్రపంచంలోకి పారిశ్రామిక విప్లవం వెంట ఎన్నో ఎన్నెన్నో వినూత్న పరిణామాలు ప్రవేశించాయి. భౌతిక ప్రపంచంలోని వస్తువులలో వచ్చిన మార్పు మానసిక ప్రపంచాన్ని సమూలంగా మార్చివేసింది. ప్రాపంచిక సంబంధాలు మారిపోయాయి. మానసిక చలనంలో సంచలనం కలిగింది. ఒకదాని వెంట ఒకటిగా ఒక దశలో ఒకే స్థాయిలో ఉమ్మడిగా వస్తున్న పరిణామాలు మానవ మేధస్సుని సందిగ్ధంలో పడేశాయి. మానవుడు రెప్పపాటులో దూసుకుపోతున్న మార్పుల్ని అందుకునే స్థితిలో లేడు. మనిషికి భౌతిక, మానసిక ప్రపంచాల మధ్య సమన్వయం సాధించడం చాలా కష్టమైపోయింది. దినదిన ప్రవర్ధనీయమానంగా పెరుగుతున్న విజ్ఞానం, సాంకేతిక సంబంధాలు మనుషుల మధ్య దూరాన్ని తగ్గిస్తున్నట్లే

తగ్గించి పెంచుకుంటూ పోయాయి. జీవితం లోకి యంత్రం ప్రవేశించినపుడే మనిషి సంక్షోభంలోకి అడుగుపెట్టాడు. మానవుని మనుగడకి మరింత బలాన్ని చేకూర్చాల్సిన యంత్రం మనిషిని అస్తిత్వవేదనకి గురి చేసింది.

ఈ అస్తిత్వ వేదనలోంచే రకరకాల ఆధునిక వాదాలు పుట్టకొచ్చాయి. మనిషిలోని చీకటి కోణాల్ని అన్వేషించే అధివాస్తవికత, మనిషిలోని విధ్వంసక తత్వాన్ని వెలికితీసే డాడాయిజం మొదలైన వాదాలన్నీ ప్రధానంగా మనిషిలో గుప్తంగా అవలక్షణాలపై దృష్టి నిలిపాయి. ఆధునిక మానవుడు తనని తాను అన్వేషించుకుంటూ వెళ్ళిన అడుగుజాడలే ఈ వాదాలన్నీ ఇవి శూన్యంలోంచి వూడి పడ్డాయి మేధావుల అంతర్ముఖ కోణాల్లోంచి ఉత్పన్న మయ్యాయని ఒక నిరాధారమైన విమర్శ వుంది. వీటిలో కొన్నింటిని కొందరు విమర్శకులు పనికట్టుకుని మార్క్సిస్టు వ్యతిరేక వాదాలుగా ప్రచారం చేశారు. ముఖ్యంగా అధివాస్తవికతని మార్క్సిస్టు ధరణికి వ్యతిరేకమైందని చెప్పి, దాని నీడ కూడా మిగలకుండా చేశారు. కాని విశేషమేమి టంటే మిగిలిన వాదాలు ఎలా వున్నా అధివాస్తవికత పునాదులు మార్క్సిజంలోనే వున్నాయి. అధివాస్తవికత మార్క్స్ - ఫ్రాయిడ్‌ల మేధోశిశువు అని సర్రియలిస్టులే తేల్చి చెప్పారు. మార్క్సు మనిషిని భౌతికమైన దోపిడీల నుంచి, సంకెళ్ళ నుంచి కాపాడితే, ఫ్రాయిడ్ మానసికమైన దోపిడి నుంచి, సంకెళ్ళ నుంచి కాపాడాడని సర్రియ లిస్టులు చెప్తారు. ఒక్క శిల్పం విషయంలో పట్టుదల. కొంచెం అతివాదం తప్ప సర్రియలిస్టులు మార్క్సిస్టులతో పేచీపడిన సందర్భాలు చాలా తక్కువ.

రెండు ప్రపంచ యుద్ధాలు మనిషికి ఎన్నో చేదు అనుభవాల్ని మిగిల్చి వెళ్ళాయి. యంత్రం వికృత రూపం చూసి మానవ ప్రపంచం బిక్క చచ్చిపోయింది. భౌతిక ప్రపంచం సాధిస్తున్న నిర్విరామ ప్రగతి మీద మనిషిలో సరికొత్త అనుమానాలు మొదలయ్యాయి. భవిష్యత్తుని కలగనడమే భయం పుట్టిస్తోంది. ఈ స్థితిని అధివాస్తవికత కళ్ళకి కట్టినట్లు చిత్రించగలిగింది. తెలుగు సాహిత్యంలో అధివాస్తవికత ముందుగా ప్రవేశించింది కవిత్వం ద్వారానే.

శ్రీరంగం నారాయణబాబు 'రుధిరజ్యోతి' సకాలంలో రాకపోతే తెలుగు కవిత్వం ఆధునిక జీవనచిత్రణకి ఆమడ దూరంలోనే వుండేది. ఎన్నో సందిగ్ధాల మధ్య నిలిచి, జీవన స్వప్నాన్ని పట్టుకోవాలనే యదార్థ తపన 'రుధిర జ్యోతి'లో కనిపిస్తుంది. ఒక్క కవిత్వరూపం మినహాయిస్తే, నారాయణబాబు ఆలోచనాసరళిలో అణువణువునా అధివాస్తవికుడు కనిపిస్తాడు. అయితే నారాయణబాబు ఇప్పటి వరకూ తెలుగు కవిత్వంలో అపరిచితుడిగానే మిగిలిపోయాడు. కాని పరోక్షంగా నారాయణబాబు నీడ దిగంబర కవులను దాటి కొందరు అత్యాధునిక కవుల మీద కూడా పడింది. అధివాస్తవికతని నవ్వులాటగా తీసుకున్న శ్రీశ్రీ 'ఖడ్గసృష్టి'లో కొన్ని కవితలు అనువదిం చాడు. నిజానికి ఇవన్నీ ఆణిముత్యాలే. ఒక్కో కవిత ఒక ఖడ్గ ప్రహారంలా సాగిపోతుంది. కాని సర్రియలిజం మీద తనకేమి ప్రేమలేదని చెప్పడానికి ప్రయత్నించి శ్రీశ్రీ అనేక సార్లు విఫలమయ్యాడు. గందరగోళాన్ని పద్ధతిలో పెట్టడం అనే సర్రియలిజాన్ని చక్కగా నిర్వచించిన శ్రీశ్రీ 'కోనేటిరావు కలలోనూ, 'చరమరాత్రి' కథలోనూ సర్రియలిస్టుగా బయటపడ్డాడు.

సాహిత్యానికి ప్రచార ప్రయోజనమే వుండాలని వాదించేవాళ్ళు అంగీకరించినా, అంగీకరించకపోయినా తెలుగు కవిత్వంలో ఆధునిక జీవనతత్వం సరిగా పట్టుకో గలిగింది నారాయణబాబే. ఇటీవలి కాలంలో తెలుగు కవిత్వాన్ని శాసిస్తున్న కొత్తధోరణుల వేళ్ళు నారాయణబాబు కవిత్వంలోనే వున్నాయి. ఆ వారసత్వాన్ని ప్రతిభావంతంగా అందుకున్న కవి ఆలూరి భైరాగి. 'ఊహకీ, వాస్తవానికి, క్రియకీ, కదలికకీ మధ్య వ్యవధిలో నీడలు పడుతున్నాయ్ అంటూ చీకటి నీడల్ని అక్షరబద్ధం చేయడానికి ప్రసవవేదనే పడ్డాడు భైరాగి.

"ప్రతి మనిషీ ఒక నదిలో
సుడిగుండం ప్రతి ఎదలో
ప్రతి మనిషీ ఒక చెరలో
ఉరికంబం ప్రతి హృదిలో"

ఇలా సాగే భైరాగి కవిత్వం పాఠకుణ్ణి కొద్దిసేపు అంతర్ముఖుణ్ణి చేస్తుంది. అంతర్ముఖత్వమంటే నత్తలా లోపలికి ముడుచుకుపోవడం అని మనవాళ్ళు అర్థం చేసుకుంటారు. రాజకీయ ప్రచారకుల చేతుల్లో నలిగి ఇలా వికృతార్థాలు పొందిన చాలా పదాల్లో అంతర్ముఖత్వం ఒకటి. ఆత్మలోకి తొంగి చూడడం అంటే నిరాశ నిస్పృహల్లో మునిగిపోవడమే అంటారు. దానివల్ల సమాజానికి ఏమి ప్రయోజనం లేదంటారు. కొంతమంది విప్లవ విమర్శకులు సాహిత్యంలో అంతర్ముఖత్వమే ప్రమాదకరమనీ, అంతర్ముఖులైన కవులే వర్గ శత్రువులన్నట్టుగా మాట్లాడతారు. నిజానికి ఇవన్నీ పెడ ధోరణులు.

సాహిత్యానికి సంబంధించినంతవరకు అంతర్ముఖత్వం, బాహ్యముఖత్వం అనే ప్రసక్తి లేదు. మనిషిలోనే రెండు పరస్పర విరుద్ధ కోణాలుంటాయి. ఆ రెండు కోణాల మధ్య సమన్వయం సాధిస్తుంది ఆలోచన. ఆ రెండు ప్రపంచాల మధ్య వారధి కడ్తుంది సాహిత్యం. అది ఏ ప్రయోజనాలను కాపాడుతుందనేది పాఠకుడు నిర్ణయించుకుంటాడు. దురదృష్టవశాత్తు, తెలుగు సాహిత్యంలో ఇలాంటి వాతావరణం లేదు. అందుకే మనం ఆధునిక జీవన చిత్రంలో వెనుకబడిపోయాం. ఆ మాటకొస్తే తెలుగులో వచన రచయితలకన్నా కవులు మరింత ఆధునికులు. తెలుగు కథ ఏనాడో కొడవటిగంటి కుటుంబరావు గారి దగ్గరే ఆగిపోయింది. ఆ తర్వాత కథలు 'రొటీన్'గా మారిపోయాయి. చెప్పిన కథలే మళ్ళీ చెబ్తున్నారు. కథకులు బుచ్చిబాబులాంటి కొందరు ఆ 'రొటీన్' నుంచి బయటపడి నిజజీవన చిత్రణకి కల్పించిన అవకాశాన్ని తర్వాత అతికొద్ది మంది కొనసాగించి విఫలమయ్యారు. కవిత్వం ఆ పాతచట్రంలో ఇమడలేక పోయింది. శ్రీశ్రీ సంస్కృత భాషాడంబరంతో విసిగిపోయి 'నయాగరా' కవులు వచ్చారు. వచన కవిత్వంలోని 'రొటీన్'ని దెబ్బతీస్తూ తిలక్ కవిత్వానికి మళ్ళీ అనుభూతి స్పర్శనిచ్చాడు. అభ్యుదయ కవిత్వంలో విలువలు క్షీణించిన దశలో తిలక్ కవిత్వమే గొప్ప రిలీఫ్. ఆ తర్వాత వచ్చిన దిగంబర కవులు తెలుగు కవిత్వ చరిత్రనే తిరగరాశారు.

అప్పటివరకూ అసహజమైన పరిధుల్లో కుంచించుకుపోతున్న తెలుగు కవిత్వం దిగంబరుల ప్రవేశంతో హాయిగా ఊపిరి పీల్చింది. దిగంబర కవుల్లో ముఖ్యంగా నగ్నముని, మహాస్వప్నలది బలమైన గొంతు. తెలుగు కవులకి స్వచ్ఛంగా ఒక అనుభూతిని ఎలా వ్యక్తం చేయాలో నేర్పింది దిగంబరులే. స్పష్టంగా చెప్పాలంటే, కవిత్వంలోకి రక్తం ప్రవహించే రహస్యం దిగంబరులు చెప్పారు. రకరకాల ఒత్తిళ్ళలో, ప్రభావాల్లో సొంత వ్యక్తిత్వం అంటూ లేకుండాపోయిన తెలుగు కవిత్వానికి ఆత్మవిశ్వాసాన్ని ఇచ్చింది దిగంబర కవిత్వం. ఆధునిక జీవితంలోని రకరకాల పలాయన వాదాల్ని, ఆత్మవంచనల్నీ అద్దంలో చూపించారు దిగంబర కవులు.

"నాకూ ఈ నటనకీ నడుమ
ప్రపంచదేశాల ప్రళయ పరాచికాల నడుమ
నత్యానికీ సత్యానికీ నడుమ నిల్చున్న ఆ మబ్బు
తునక పేరేమిటి?"

నగ్నముని అంటున్న కంఠంలోని నిజాన్ని, నిజాయితీని ఎవరైనా గుర్తుపట్టవచ్చు.

జీవితం పరిమితులకు లొంగదు, అలాగే కవిత్వం కూడా. సాహిత్యం నిబద్ధత జీవితానికేగాని, రాజకీయ సంస్థలకు కాదని చరిత్ర ఎన్నో సందర్భాలలో నిరూపించింది. జెండాలు సాహిత్య ఎజెండా నిర్ణయించి, శాసించే దుర్భల పరిస్థితుల్లోనే తెలుగు కథ కన్నుమూసింది; వ్యాపార సంస్కృతి విజృంభించింది. ఈ దశలో తెలుగు కవిత్వం కనివిని ఎరుగని పాపులారిటీని సంపాదించింది. ముఖ్యంగా విప్లవ కవిత్వం క్షీణించిన తర్వాత ఆధునిక తెలుగు కవిత్వం మారాకు వేసింది. శివసాగర్ మినహా దిగంబర కవుల్లోంచి వచ్చిన కవులు తప్ప 'విప్లవ దశాబ్దం'లో ఇంకెవరూ మిగల్లేదు. ఆధునిక జీవన స్వరూపాన్ని అక్షరబద్ధం చేయడంతో విఫలమైన వాళ్ళు ఏనాడో తెరమరుగయ్యారు.

కవిత్వంలో ఇది కొత్తకాలం. ఎన్నో పరాజయాలు, ఎన్నో వైఫల్యాలను చవిచూసిన ఈతరం ఎన్నో ప్రభావాల నుంచి కూడా బయటపడింది. ముఖ్యంగా శ్రీశ్రీ ప్రభావం

నుంచి శ్రీశ్రీలా ఇప్పుడెవరూ సంస్కృత పదాడంబరం ప్రదర్శించడం లేదు పోనీ అని అమాయకంగా ఒక సిద్ధాంతాన్ని భుజానికెత్తుకోవడమూ లేదు. సునిశితమైన దృష్టితో ఆలోచించి స్పష్టమైన కవిత్వ రూపాన్ని వెతుక్కుంటున్న తరం ఇది. ఆధునిక కవికి శ్రీశ్రీ కన్నా విశాలమలైన రాజకీయ అవగాహన ఉంది. కవులు భావజాలంలో వచ్చిన మార్పే విషయాన్ని సూటిగా నిరూపిస్తుంది. కవిత్వంలో వచ్చిన ఈ మార్పుని మనవాళ్ళు స్పష్టంగా చూస్తున్నారు. అయినా ఇది కొరుకుడు పడడానికి కొంత ఆలస్యం అయితే కావచ్చు. రకరకాల 'దృష్టి' లోపాలతో బాధపడుతున్న వెనకతరం వాళ్ళు పాత పదజాలంలోనే ఇంకా మగ్గిపోతున్నారు. కాలం వాళ్ళని మూర్ఖుల జాబితాలో పడేస్తుంది. మార్పుని తనలో పొదుగుకొని రేపటితరాలకి అందిస్తుంది.

ఈతరం కవిత్వంలో వచ్చిన గొప్ప మార్పు స్పష్టత. చాలామంది కవులు ఖచ్చితమైన కవితా వస్తువుతో రాస్తున్నారు. పకడ్బందీగా పదచిత్రాలని ఎన్నుకుంటున్నారు. అయితే, కవిత్వం అస్పష్టంగా వుంటుందన్న ఒక విమర్శ వుంది. ఇంకా మనం అలవాటుపడని వస్తువు కావడం వల్ల వచ్చిన ఇబ్బంది ఇది. అయితే సోషలిజం గురించి, కాకపోతే దీపావళి గురించి రాసిన కవిత్వమే చదివే అలవాటు వున్న మనకు ఈ కవిత్వం కొంతకాలం కొత్తగానూ, 'అస్పష్టం'గాను కనిపించవచ్చు. కాని అత్యాధునిక కవి సామాజిక వ్యక్తిగత జీవితాల మధ్య గొప్ప సమన్వయం సాధించాడు. ఈ విషయాన్ని గుర్తించనంత కాలం మనం చీకట్లో వున్నట్టే తన ఏకాంత గోపురంలో రాలిన కన్నీళ్ళకీ, కాన్పూరులోనో, మీరట్‌లోనో ఏ సామాజిక దౌష్ట్యానికో రాలిన జీవానికీ కవి ఒకే విధంగా స్పందిస్తున్నాడు. నియంతృత్వాలపై స్వేచ్ఛా సమరం సాగిస్తున్న యువతరం భావాలకు ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. ఈ సామాజిక నేపథ్యం తెలియని వాడికి ఆధునిక కవిత్వం అర్థం కాదు. ఆధునిక కవిత్వం వేళ్ళు నిఘంటువుల్లోనో, రాజకీయ మేనిఫెస్టోల్లోనో దొరకవు. జీవితంలోనే దొరుకుతాయి. ఎందుకంటే జీవన ప్రతిబింబమే కవిత్వం కనుక.

ఆధునికత నుండి అత్యాధునికత వరకూ...

సమాజ పరిణామక్రమంలో భాగంగా ఆధునికత నుండి అత్యాధునికతవైపు పరిణమించిన సాహితీ విశేషాలని పరిశీలిద్దాం.

వీరేశలింగం పంతులు 'సరస్వతీ నారద సంవాదం' ద్వారా సంబంధించిన కొత్త పార్శ్వాన్ని బహిర్గతం చేశారు. తను ఉద్దేశించిన సంఘ సంస్కరణోద్యమానికి సాహిత్యాన్ని కందుకూరి ఒక సాధనంగా మలుచుకోగలిగారు. ఆనాటి కవిత్వంలోని ప్రయోజనారాహిత్యాన్ని ఆయన సరిగ్గా గుర్తించగలిగారు గానీ అంతకంటే ఆయన కవిత్వానికి చేసింది లేదు. ఆయన అసంపూర్తిగా వదిలిపెట్టిన ఆ బాధ్యతని గురజాడ స్వీకరించారు. ఆంగ్లవిద్య ప్రభావం వల్ల ఆంధ్రుడి మనో ప్రపంచంలో కలుగుతున్న సంచలనాన్ని పట్టుకుంది గురజాడ కవిత్వం. ఎన్నో ప్రభావాలకు గురవుతూ కొత్త సామాజిక విలువల్ని అన్వేషిస్తున్న తెలుగు జాతికి గురజాడ కవిత్వం వైతాళిక గానంగా వినిపించింది. అందుకే తెలుగు కవిత్వంలో ఇప్పటికీ ఏ విషయాన్నయినా సునిశితంగా అంచనా వేయాలంటే గురజాడ దాకా వెళ్లాల్సిందే.

గురజాడలోని ఒక పార్శ్వాన్ని మాత్రమే తీసుకుని స్త్రీ సామాజికస్థితి, అంతస్తుని మార్చే ప్రయతనం భావకవులు చేశారు. స్త్రీ పురుషుల సంబంధాలకు సంబంధించిన ఎన్నో కొత్త భావనల్ని భావకవులు ప్రచారంలోకి తెచ్చారు. కాని స్త్రీని ఒక ఆరాధ్య వస్తువు స్థాయికి తీసుకువెళ్ళడంతో భావకవిత్వం మరో విధంగా ప్రబంధ లక్షణాలను పునరుద్ధరించే స్థితికి చేరుకుంది. కవిత్వ వస్తువు పరిధి సంకుచితమవడంతో భావకవిత్వం కొద్ది కాలంలోనే తన ఉనికిని కోల్పోయింది. భావకవుల 'అతి' సున్నితత్వాన్ని, కృత్రిమత్వాన్ని అవహేళన చేస్తూ పఠాభి 'పిడేలు రాగాల డజన్'లో తీవ్ర నిరసన స్వరం ఎత్తాల్సి వచ్చింది. 'పఠాభి' కంఠంలో కొంత అరాచకత్వం ఉండి వుండవచ్చుగాని, ఆనాటి కవిత్వ దుస్థితికి అది అద్దం పట్టింది. ఆర్థికమాంద్యం

వైపు తరుముకెళ్తున్న భౌతిక పరిస్థితులకూ, భావకవుల అసందర్భభ్రాంతి ప్రపంచానికీ మధ్య ఒక వాస్తవికతని పునఃప్రతిష్టించే ప్రయత్నం 'పిడేలు రాగాల డజన్'లో కనిపిస్తుంది. నగర జీవితాన్ని ప్రతిబింబించిన తొలి ఆధునిక కవిగా విమర్శకులు పఠాభిని గుర్తించారు. ఆధునిక మానవుడి చేతనలో వస్తున్న మార్పుల్ని తొలిసారిగా పఠాభి గుర్తించడమే దీనికి కారణం. భావకవిత్వానికి భౌతిక పునాది కనుమరుగైపోతున్నప్పుడు పఠాభి దాన్ని భూమార్గం పట్టించాడు. కవిత్వంలో స్థలం, కాలం మారాయి. కవిత్వ క్షేత్రం గ్రామీణ జనజీవనంలోని సున్నితత్వం నుంచి పారిశ్రామిక నాగరికతలోని కర్కశత్వానికి మారింది. పఠాభి ఇక్కడ Modern Sensibilities లోకి ప్రవేశిస్తున్నాడని భావించవచ్చు. అనుభూతుల మధ్య అంతరాన్ని, కవికి, పాఠకుడికి మధ్య తెగిపోయిన సహృదయ సంబంధాన్ని పఠాభి కవిత్వంతో గమనించవచ్చు. సున్నితమైన విషయాల్ని కర్కశంగా చెప్పడం ద్వారా రెండు భిన్న వైరుధ్యాల మధ్య ఘర్షణని పఠాభి తన కవిత్వంలో ప్రవేశపెట్టాడు. కవిత్వంలో తక్షణం రావాల్సిన పరిణామానికి 'పిడేలు రాగాలడజన్' ఒక ప్రాతిపదిక సమకూర్చింది.

ఈ దశలో ఆధునిక కవి కేవలం జాతీయోద్యమానికే కాదు, వివిధ అంతర్జాతీయ ఉద్యమాల ప్రభావంలో పడ్డాడు. సమకాలీనవ్యవస్థ గురించి కవిలో అస్పష్టంగా మెదుల్తున్న భావాలకు అక్టోబర్ విప్లవం వంటి అంతర్జాతీయ పరిణామాలు ఒక స్పష్టమైన రూపాన్నిచ్చాయి. తనదైన స్వీయ ప్రపంచంలోకి తప్పించుకోవడానికి కవికి ఏ విధంగానూ అవకాశం లేకపోయింది. ప్రపంచం బాధని తన బాధగా పలికించడం తప్పనిసరయింది. ప్రతి అనుభవానికి సమకాలీన జీవితం అనివార్యమైన ప్రేరణగా మారింది. సున్నితమైన కవి 'మనఃకార్మికశాల' చండాగ్ని సెగలు కక్కింది. 'నేనుసైతం ప్రపంచాగ్నికి సమిధనొక్కటి ఆహుతిచ్చానంటూ' కవి విస్తృతమైన భావపరిధి నుంచి గొంతెత్తాడు. శ్రీశ్రీ 1934లో రాసిన 'మరోప్రపంచం'గేయం కొత్త సంప్రదాయానికి నాందీ గీతంగా మారింది. శ్రీశ్రీ కవిత్వం రావడంతో అప్పటి వరకూ 'సంధి' ప్రేలాపనగా వున్న కవిత్వానికి ఒక నిర్దిష్టమైన స్వరం ఏర్పడింది. మొదట శ్రీశ్రీతో పాటు కొంత కాలం భావకవిత్వ ప్రభావంలో వున్న నారాయణబాబు కూడా వాస్తవికత వైపు దృష్టి సారించాడు. 'కుక్కపిల్లా, అగ్గిపుల్లా, సబ్బుబిల్లా, అన్నీ కవితామయ మేనోయ్' అన్న శ్రీశ్రీ అభినవ 'ఋక్కు'లను నారాయణ బాబు లక్ష్యరూపంలో ప్రదర్శించాడు. శ్రీశ్రీ, నారాయణ బాబు ఇద్దరూ అక్టోబరు విప్లవం ప్రభావానికి గురయిన వారే, కాని నారాయణబాబుది ప్రయోగవాద దృష్టి ఒక్కసారి మార్క్సిస్ట్ నిబద్ధుడైన తర్వాత శ్రీశ్రీకి మరో దృక్పథం మీద దృష్టి నిలవలేదు.

వస్తువు దృష్ట్యా శ్రీశ్రీ చూపిన మార్గం స్థిరపడిన తర్వాత కవిత్వంలో స్వేచ్ఛ ఒక ప్రధాన లక్షణంగా ఉబికి వచ్చింది. ఈ స్వేచ్ఛ కవిని విస్తృతమైన జీవనపరిధిలోకి తీసుకువెళ్ళింది. తర్వాత వచన కవిత రూపపరంగా మిగిలివున్న అరకొర సంకెళ్ళని కూడా ఛేదించింది. దీంతో అభివ్యక్తికి అందకూడని విషయం అంటూ లేకపోయింది. నిత్యవ్యవహార భాషకి సన్నిహితంగా కవిత్వం చేరుకుంది. కవిత్వంలో ఈ స్థితి వచ్చేటప్పటికి శ్రీశ్రీలో ప్రయోగవాదం బయటికి వచ్చింది. 'పిడేలురాగాల డజన్'లోని అరాచకత్వాన్ని నారాయణబాబు 'రుధిరజ్యోతి'లోని వస్తు-రూప పరిమితత్వాన్ని దాటి ముందుకు వెళ్లాడు శ్రీశ్రీ. శ్రీశ్రీలో అభ్యుదయవాది ఎంత బలంగా వున్నాడో, తనలోని సౌందర్యాన్వేషణను తృప్తిపరిచే ప్రయోగవాది కూడా అంతే బలంగా వున్నాడు. 'మహాప్రస్థానం'లోనే కొన్ని కవితల్ని నిర్మాణ వ్యవస్థలుగా (Structural Systems) వర్గీకరిస్తే ఈ విషయం తెలుస్తుంది. ఈ ప్రయోగవాద ధోరణ 1956లో శ్రీశ్రీ వెలువరించిన 'ఖడ్గసృష్టి'లో కనిపిస్తుంది. శ్రీశ్రీ అధివాస్తవికులను ఆటపట్టించినా, 'ఖడ్గసృష్టి'లో తాను చేసిన అనువాదాల్లో అధికభాగం అది వాస్తవికులవే అయి వుండడం యాదృచ్ఛికం కాదు. అభ్యుదయ కవిత్వ ప్రభావం తగ్గుముఖం పట్టి, ఆధునిక కవిత్వంలో వైయక్తిక స్వరాలు వినిపిస్తున్న సంక్షోభ దశలో 'ఖడ్గసృష్టి' వెలువడింది. ఆ కాలానికి సంబంధించిన అంతర్ముఖత్వం ఛాయలు 'ఖడ్గసృష్టి'లో కనిపిస్తాయి. 'ఖడ్గసృష్టి'లో శ్రీశ్రీ

ఉపయోగించిన భాష వచన కవిత్వ ప్రభావంలోంచి పుట్టిందే.

ఇదే సమయంలో మధతరగతి ఆదర్శవాసుల అనుభూతులను అక్షరబద్ధం చేసిన 'తిలక్' కవిత్వానికి ఇంతకు ముందెన్నడూ లేని ప్రాముఖ్యం వచ్చింది. అనువాదాలలో తప్ప శ్రీశ్రీ స్వంతంగా మనస్ఫూర్తిగా చేయలేక విడిచి పెట్టిన కొన్ని చీకటి కోణాల్లోకి తిలక్ కవిత్వం ప్రవేశించింది. ఉద్యమ నేపథ్యం కొరవడిన సందర్భంలో వాస్తవికతకూ, ఆదర్శానికి మధ్య వుండే సున్నితమైన సంఘర్షణ తిలక్ కవిత్వంలో కనిపిస్తుంది. అందుకే తిలక్ కవితా వస్తువు అంతర్ముఖమైనా, బాహ్యముఖమైనా అందులో ప్రాధాన్యత వహించేది అనుభూతి. తిలక్‌ని ప్రత్యేకంగా నిలబెట్టిన భావగాఢత, ఆర్ద్రత ఈ అనుభూతి తీవ్రత లోంచి వచ్చినవే. ఈ కాలంలో ఒకవైపు భాషాపరంగా కవిత్వంపై విధించిన నియమాలను కుందుర్తి ఉల్లంఘించాడు. మరోవైపు అనుభవపరంగా వుండిన విధి నిషేధాల్ని తిలక్ తొలగించాడు. వచన కవిత్వాన్ని విస్తృత ప్రాచుర్యంలోకి తీసుకురావడానికి కుందుర్తి చేసిన కృషి వల్ల రూపపరంగా ఒక మేలు జరిగింది. అది కవిత్వ భాషని సామాన్య జనం మధ్యకు తీసుకురావడం.

వచన కవిత్వం అంటే కేవలం 'ముక్తచంధమే' అనుకుంటే దాని పరిధి సంకుచితమయ్యే అవకాశం ఉంది. పైగా, చంధస్సు నుంచి బయటపడడం ఈ దశలోనే జరిగిన కొత్త పరిణామమేమీ కాదు. వచన వ్యవస్థని విచ్ఛిన్నం చేస్తున్న కొత్త భాషా వ్యవస్థలోకి అడుగు పెడుతున్నారు. కవిత్వం అంటే భాష మాత్రమే అనే అపోహను తొలగిస్తూ దానికి కొత్త విలువల్ని తీసుకువస్తున్నారు. వచన కవిత్వం అంటూ ఒకటి ఏర్పడిన తర్వాతనే ఆధునిక కవిత్వ రూపం కొత్త నిర్మాణ వ్యవస్థల్ని స్వీకరించగలిగింది. దిగంబర కవులు వచ్చేసరికి ఈ నిర్మాణవ్యవస్థ కూడా పాతబడిపోయి మళ్ళీ రూపాన్వేషణ మొదలయింది. ఆధునిక కవిత్వంలో రూపం మారుతున్నప్పుడల్లా కవి వ్యక్తీకరణ పరిధిలో ఇమిడే వస్తువు కొత్త చేతనాన్ని అందుకుంది. సమకాలీన చారిత్రక సందర్భాలు మార్చినప్పుడల్లా కవిత్వ నిర్మాణంలో సందిగ్ధత ఏర్పడింది. దీనిలోంచి తేరుకోవడానికి 'తిరగబడు' కవులు వచ్చారు. పార్లమెంటరీ రాజకీయాల్లో కమ్యూనిస్టుల అస్తిత్వం కోల్పోతున్నప్పుడు, ఈ ధోరణిమీద నిరసనతో గిరిజన రైతాంగ పోరాటాల నేపథ్యంతో మార్క్సిస్టు, లెనినిస్టు ఆలోచనకు మావో ఆచరణాత్మక విధానం కూడా జత కలుపుకొని కవిత్వానికి మళ్ళీ ఒక నిర్దిష్టమైన ప్రయోజన దృక్పథాన్ని అందించింది.

వచన కవిత్వానికి లక్ష్యం పాఠకుడు విప్లవ కవిత్వానికి లక్ష్యం శ్రోత. వచన కవిత్వం మధ్యతరగతి పాఠకులకే పరిమితమైతే విప్లవ కవిత్వం గ్రామీణ జనంలోకి కూడా వెళ్ళే ప్రయత్నం చేసింది. ఈ ప్రయత్నంలో భాగంగా కవుల దృష్టి గ్రామీణ ప్రాంతాలపై పడింది. అలాగే జనపదాల ప్రభావానికి కవి గురికాక తప్పలేదు. జనపదాల్లోకి వెళ్తేగాని కవిత్వ ప్రయోజనం నెరవేరేటట్టు లేదు. ఈ ప్రయోజన రీత్యా వచన కవిత్వం పెద్దగా ఉపయోగపడలేదు. సహజంగా వేగవంతమైన పాట ఎక్కువ మంది శ్రోతల్ని తయారు చేసుకోగలిగింది. ఈ దశాబ్దంలో పాట, కవిత్వం అనే రెండు ప్రక్రియలు పరస్పర ప్రభావానికి గురవడం కనిపిస్తుంది. వచన కవిత్వంలో పదును సూటిదనం రావడానికి పాట కారణమైతే, పాటలో కవిత్వపరమైన నిర్మాణం, సౌందర్య దృష్టి పెరగడానికి కవిత్వం కారణమైంది. చెరబండ రాజు, శివసాగర్, గద్దర్ పాటల్లో ఆధునికత కవిత్వ లక్షణాలు బాగా కనిపిస్తాయి. అలాగే, వరవరరావు, శివారెడ్డి కవిత్వంలో పాట లక్షణాలు కొన్ని ఛాయామాత్రంగా కనిపిస్తాయి. అంటే వేల సంవత్సరాల చరిత్ర ఉన్న గేయ సంప్రదాయం. వందేళ్ళ చరిత్ర వున్న కవిత్వం ఒక పరిపూర్ణమైన రూపం పొందే దశ ఈ దశాబ్దంలో కలిగిందన్న మాట.

ఈ నేపథ్యం బలంలోంచి వచ్చిందే '80'ల కవిత్వం. నిబద్ధత పరిధిని విస్తరిస్తూ శివారెడ్డి తరహా కవులు ముందుకు వచ్చారు. నిమగ్నమై వున్న వరవరరావు లాంటి విప్లవ కవుల వ్యక్తీకరణలో కూడా '80'ల కవిత్వ లక్షణాలు కనిపిస్తాయి. కవిత్వ ప్రయోజనాన్ని గురించి సంశయాలన్నీ

తొలగిపోయిన ఈ దశాబ్దంలో కవికి విస్తృతమైన జీవన అనుభవాలే ప్రాతిపదిక అయ్యాయి. విప్లవ కవిత్వం గ్రామీణ జీవితం మీద దృష్టి కేంద్రీకరిస్తే, ఈ అత్యాధునిక కవి పల్లె నుంచి పట్నసీమలకు వలస వెళ్లాడు. ఈ దశాబ్దపు కవిత్వ లక్షణాలు కొన్ని చెప్పుకోవలసి వస్తే అందులో పల్లె, పట్నాలు తన వేళ్ళు ఎక్కడున్నాయో తెలుసుకోవాలనే తపన, వలస జీవితం గడుపుతున్న వాళ్ళలోనే అధికంగా ఉంటుంది. కవి బాల్యస్మృతుల్లోకి వెళ్లిపోవడం వెనుక ఈ 'అంతరం' ప్రభావం ఎంతైనా వుంది. కవిత్వంలో పరాయీకరణ అనుభూతుల పేర్లు కూడా ఇక్కడే వున్నాయి.

1980 ఒక సందిగ్ధ దశాబ్దం . పద్దెనిమిది నెలల అత్యధిక స్థితి తర్వాత భారత రాజకీయ వ్యవస్థ బలపడింది. సామాజికంగా నిరాశాపూర్తి వాతావరణం నెలకొంది. దేశాన్ని పట్టి పీడిస్తున్న సమస్యల ప్రభావం ముఖ్యంగా యువ తరం పైన బాగా పడింది. భౌతిక పరిస్థితులే జీవన విలువల్ని శాసించే స్థితి ఏర్పడింది. ఆదర్శ ప్రమాణాలనేవి నిత్య జీవితంలోంచి తప్పించుకున్నాయి. వివిధ దశలలో ఆర్థిక, సామాజిక, రాజకీయ, నైతిక రంగాలలో పెరిగి పోయిన తేడాలకు, నిరాటంకంగా సాగుతున్న అణచివేతలకు వ్యతిరేకంగా కొందరు, ఆ పరిస్థితుల ఆధిక్యం వల్ల 'శూన్యవరణ'లో చిక్కుబడిపోయిన నిరాశావాద కవులు కొందరు ఈ తరంలో కనిపిస్తారు. కానీ, మౌలికంగా వీళ్లు స్థిరపడి వున్న యదాతథ వ్యవస్థకి వ్యతిరేకులే. వ్యవస్థ మారాలన్న స్పృహ, ఎలాంటి వ్యవస్థ కావాలన్న చైతన్యం వీరిలో వున్నాయి. కాని అవగాహనలో ఉన్న స్థాయీ భేదాల వల్ల వ్యక్తీకరణలో ఒకవిధమైన సందిగ్ధ సంఘర్షణ కొనసాగుతోంది. ఈ సందిగ్ధత వల్ల ఈ కవులలో అక్కడక్కడా బైరాగిలో వుండే అస్తిత్వవేదన, నారాయణ బాబులో వుండే అధివాస్తవిక రోదన, తిలక్‌లో వుండే రూపశ్రద్ధ కనిపిస్తాయి. అంతమాత్రాన వీళ్ళని అభ్యుదయ సంప్రదాయం నుంచి విచ్ఛిన్నమైన వాళ్ళని భావించడానికి వీలు లేదు.

ఏకకాలంలోనైనా ఏదో ఒక రూపంలో కవిత్వం మారుతుంది. ఒక్కోసారి ఆ మార్పు ఆకస్మికంగా, వేగవంతంగా జరిగినట్టు కనిపిస్తుంది. 80లలో ఖచ్చితంగా ఇలాగే జరిగింది. సృజనాత్మక రంగంలో వచ్చిన మార్పుని తక్షణమే అందుకునే విమర్శనాత్మక దృష్టిలో వుంచుకుని ఈతరం కవిత్వాన్ని అంచనా వేయాలి. లేకపోతే, వర్తమాన కవిత్వం గుర్తించి ఇప్పటికప్పుడే చేసే నిర్ణయాల వల్ల భవిష్యత్తులో పశ్చాత్తాపపడే స్థితి ఏర్పడవచ్చు.

ఉపయుక్త గ్రంథసూచి :

1. అభ్యుదయ సాహిత్యం - ఇతర ధోరణులు : డా॥ యస్వీ సత్యనారాయణ
2. ఆధునిక తెలుగు సామాజిక కవిత్వ ఉద్యమాలు : కేతవరపు రామకోటిశాస్త్రి
3. ఆధునిక సాహిత్యం - దళిత స్పృహ : యువభారతి ప్రచురణ
4. ఆధునికాంధ్ర కవిత్వం - హరిజనాభ్యుదయం : డా॥ కల్లూరి ఆనందరావు
5. ఆధునికాంధ్ర కవితాతత్త్వం : జి. లలిత
6. ఆధునికాంధ్ర కవితా సమీక్ష : ఆచార్య కాకర్ల వేంకట రామనరసింహం
7. ఆధునికాంధ్ర కవిత్వము సంప్రదాయములు - ప్రయోగములు : డా॥ సి. నారాయణరెడ్డి
8. ఇరవయ్యవ శతాబ్ది తెలుగు కవిత్వం : డా॥ కడియాల రామమోహన్ రాయ్

⌘⌘⌘

BHAVAVEENA
Vol. 17, Issue. 8, August 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

భగవద్గీత – భక్తి తత్వం

- డా॥. ఆకుల గిరిబాబు

భారతీయులకు భగవద్గీత విశిష్టమైన గ్రంధం మన విలువలకు మత విశ్వాసాలకు భగవద్గీత ప్రామాణికం మానవ జీవిత పరమార్ధమేదో గ్రహించడానికి, సాధించ డానికి గీతను మించిన గ్రంధం మరొకటి లేదు. కురు క్షేత్ర సంగ్రామంలో ధర్మ సమ్మూడచేతస్కుడైన అర్జునుణ్ణి నిమిత్తంగా చేసుకొని శ్రీకృష్ణ పరమాత్మ మానవ జాతికి ప్రబోధించిన తత్వబోధ గీత శాస్త్రంగా చెప్పవచ్చు.

పద్దెనిమిది అధ్యాయాల్లో ఏడు వందల శ్లోకాలకు విస్తరించిన గీత సర్వోపనిషత్తుల సారమే అన్ని కాలాలకు ఉపయోగపడుతూ అన్ని జాతులకు సముద్ధరించే విశ్వజనీయ మహాగ్రంధం భగవద్గీత. ఖండ ఖండాంత రాలలో గీతకు గల ప్రాశస్త్యం, ప్రచారం ఈనాటిది కాదు. హిందువులకు నిత్య పారాయణ గ్రంధమైన భగవద్గీత.

భగవద్గీత ఆనాడు నరునికి శ్రీక ృష్ణుడు బోధించినా నర జాతి ఉన్నంత కాలం చిరస్థాయిగా ఆచరణాత్మకమైన దివ్య ప్రబోధం. హిందూధర్మం సనాతనమైంది. సదా నూతనమైంది కూడా ఏ విధమైన భేదభావన లేకుండా ఈలోకాస్స మస్తా స్సుఖినో భవంతు'' అని భూలోకంలో ఉంది. ఇతరులకు సుఖం, శాంతి కలగాలని ఆకాంక్షించే జాతి మన భారతజాతి. తన సుఖాన్ని కోరుకుంటూ తోటివారికి సుఖాన్ని ఆలోచించే సంస్కారం.మానవులను సేవించడం ద్వారా మాధవసేవచేయాలని పరితపించిన దైవ పరంపర మనది. ఇలాంటి మహోన్నత ధర్మానికి, మానవత్వానికి మూలస్తంభం లాంటిది భారతీయ మనస్తత్వం. భారతీయ తత్వ శాస్త్ర సారమే భగవద్గీత.

గీతోపదేశం :

మహా భారతంలో భారత వంశంలోని సుప్రసిద్ధ వీరులైన పాండవ, కౌరవుల చరిత్రను సమూలంగా వర్ణిస్తుంది. అన్నదమ్ములైన పాండవులపై వైరంతో దృతరాష్ట్రుని పెద్ద కొడుకు దుర్యోధనుడు శకుని సహాయంతో పాండవుల సర్వసాన్ని పొంది వారిని అవ మానించి అడవులకు పంపిస్తాడు. ధర్మానికి కట్టుబడి పాండవులు పన్నెండు సంవత్సరాలు అరణ్యవాసం, ఒక సంవత్సరం అజ్ఞాతవాసం విజయవంతంగా పూర్తి చేస్తారు. తమ రాజ్యాన్ని తమకు ఇవ్వమని అడుగగా దుర్యోధనుడు నిరాకరిస్తాడు. అన్ని ప్రయత్నాలు విఫలమై సంధి పొసగక యుద్ధం శరణం అవుతుంది. కురు క్షేత్రంలో శత్రువుల పక్షంలో బంధువులను చూచి బాధపడుతూ యుద్ధం చేయలేనన్న అర్జునుడికి కృష్ణుడు సందేహాలను తీర్చి, అజ్ఞానాన్ని పోగొట్టి దుఃఖ మోహాల నుండి విముక్తి చేయుటకు ప్రబోధించినది భాగవద్గీత ,

లోకైక మత గ్రంధం :

శ్రీమద్భవద్గీత మహా భారతంలో పద్దెనిమిది పర్వా లలో నాల్గొ పర్వమైన భీష్మ పర్వం నందు కలదు భాగ వతంలో పద్దెనిమిది అధ్యాయాల్లో ఏడువందలు శ్లోకాలు ఉన్నాయి. ఇంత చిన్నదానిలో వైదిక మతసారమే గాక సర్వమతాల సారము ఇమిడి వుంది. అందుకే దేనికి మోక్షసప్తశతి అంటారు. పది, పదికొండో అధ్యాయాములో వైదిక సంప్రదాయం, దేవతలకు సంబంధించి వుంది. మిగిలిన అధ్యాయాలలో ఇతర మతస్తులకు కూడా అంగీకరంగా వుంటాయి. ఈ రెండు అధ్యాయాలు కూడా వైదిక దేవతల పేర్లు బదులు ఆయా మతస్తుల వారు తమ తమ దేవతల పేర్లు పెట్టుకొనా చక్కగా సరి పోతాయి.

దేశకాల జాతి మత వివక్షతో సంబంధం లేకుండా విశ్వంలో మనుషులందరికి గీతా సిద్ధాంతాలు వర్తిస్థాయి. అర్జునునికి గీతను ఉపదేశించి వేల సంవత్సరాలు అయినప్పటికి మానవ లోకానికి గీతా సారమువల్ల

ఇప్పటికి లాభం పొందుతున్నారు. ఈ రోజుకి గీతలో నూతన అభిరుచులు నవీన భావాలు కనిపిస్తున్నాయి. అందుకే శ్రీ వివేకానంద స్వామి భగవద్గీతను లోకైక మత గ్రంధం అని ప్రకటించాడు.

వేద తత్వం :

హిందూ మతానికి పరమ ప్రమాణం వేదాలు. ప్రజల ఉపయోగార్థమై వేదాలను వేద వ్యాసుడు నాలుగు భాగాలుగా విభజించాడు. వేద భాష అతిప్రాచీన కాలం దాని సారాన్ని అర్థం చేసుకోవటం సామాన్యులకు సులభం కాదు. ఈ వేద విద్యను సామాన్యులకు తెలియజెప్ప టానికి మహర్షులు శాస్త్రాలను రచించారు. ఈ శాస్త్రాలకు కూడా అర్థం చేసుకోనే శక్తి లేకపోవడం చేత వ్యాసుడు వేద శాస్త్రములోని అర్థాన్ని అనుసరించి సులభమైన కథా రూపంలో వాటి సారాన్ని ప్రజలకు తెలియజేయుటకు పురాణాలకు రచించాడు. వీటిలో భగవంతుని సృష్టి దేవతలు, రాక్షసులు, మానవులు మొదలైన వివిధ పాత్రల తీరు తెన్నులు ద్వారా తెలియజేశాడు. పురాణా లలో భారతీయుల సాంఘిక నైతిక ఆద్యాత్మిక జీవితాన్ని గూర్చి విపులంగా వివరించారు.

గీతా ప్రసస్తి :

భగవంతుడు తనతో పాటు ప్రయాగాది సర్వ క్షేత్రాలుంటాయని భగవద్గీత పవిత్రతను చెప్పాడు. తీతలో జగత్తుకు ఆధారమైన నిర్గుణకార తత్వబోధ చేశాడు. విష్ణువు పాదాల నుండి పుట్టిన త్రిలోక పావని గంగలో మునిగితే శరీరంపై వున్న మట్టిపోతుంది. కాని విష్ణువు ముఖ పద్మం నుండి వెలువడిన గీత అనే గంగలో ఒకసారైనా మునిగితే మనుస్సులోని నైతిక ఆధ్యాత్మికాలను కలిగి జీవన మరణ ప్రవాహములగు సంసారం నుండి విముక్తి అవుతారు తత్వ విచారణ బలపడిన కొద్ది నిశ్చయ జ్ఞానం అలవడి ఆచరణగా మారుతుంది .ఆచరణ వల్ల అనుభవం వస్తుంది. ఈ విధంగా అల్పారంభం నుండి మర్త్యుడు అమరుడుగా నరుడు నారాయణుడుగా పరిణమిస్తారు.

జ్ఞానమంత్రం :

గీత యొక్క ప్రతి అధ్యాయాంతములో ఉప నిషత్తులని, బ్రహ్మవిద్యని, యోగశాస్త్రములని చెప్ప బడింది. వేదంలో మూడు భాగాలు వున్నాయి 1. సంహిత లేక మంత్రభాగం 2. బ్రహ్మణం ఇది మంత్ర, కర్మ కండాలను గూర్చి తెల్పుతుంది 3. ఉపనిషత్తులు ఉప నిషత్తు అనగా సమీప మందుకూర్చోవటం వీటిని చదువుట వల్ల భగవత్సాన్నిద్య మందు కూర్చుండుట లేక భగవతస్థితిని పొందిన భావం కలుగుతుంది కాబట్టి ఉపనిత్తులని వేదాంతాలని అంటారు. వేదాంతం అనగా వేదం యొక్క చివరి భాగం, ఉపనిషత్తుల అనే గోవు నుండి శ్రీక ృష్ణుడును గొల్లవాడు అర్జునుడను దూడ నిమిత్తంగా చేసుకొని ఉపనిషత్సారముగు పాలను లేక గీతమంత్రాన్ని పితికాడు. ఆవు దూడ పాలు పితుకుటకు నిమిత్త మాత్రమే గాని పాలలో చాలా భాగం ప్రజలే ఉపయోగిస్తారు అట్లే అర్జునుని నిమిత్తముగా జేసి శ్రీకృష్ణుడు లోకోద్ధరణకై గీత మంత్రాన్ని ఇచ్చాడు. ఈ విధంగా ఉపనిషత్సారమైన గీత కూడా బ్రహ్మ విద్య ప్రతి భోదకమై భక్తులకు జ్ఞాన మంత్రాన్ని అందజేస్తుంది. బ్రహ్మ విద్యను నిత్య జీవితంలో అనుసంధించుకోవడం యోగ శాస్త్రమని భాగవద్గీత లో చెప్పబడింది

భగవద్గీత -మార్గాలు :

భగవద్గీత లో భగవంతుని పరమసిద్ధి ప్రాప్తికై రెండు మార్గాలను చెప్పారు. వీటిలో ఒకటి సాంఖ్యాయోగం రెండోది కర్మయోగం.

1. సాంఖ్యా యోగం :

పదార్థాలన్నీ మృగతృష్ణలోని నీటి వంటివి స్వప్న జగత్తులోని సృష్టి లాంటివి శరీరేంద్రియ మనస్సుల చేత జరుగు సమస్త కర్మలలో కర్తృత్వ భయాలను వీడాలి పరమాత్ముని యొక్క స్వరూపం నందు భక్తి భావంతో వుండాలి. భగవంతుని యందు మనస్సుకు లగ్నం చేయాలి.

2. కర్మయోగం :

జగత్తు అంతా భగవంతునిదే తాను నిమిత్త మాత్రు డని తెలసుకోవాలి.

ఈ భగవంతుని మీద భారం వేసి బుద్ధితో అన్ని కర్మలను ఆచరించాలి. త్రికరణ శుద్ధిగా భగవానుని శరణు వేడుకొని నామ, రూప గుణ, ప్రభోదాలచే భగవానుని నిరంతరం భక్తితో పూజించాలి. ఈ విధంగా చేయుట నిష్కామకర్మయోగ సాధనం.

ముగింపు :

గానం చేయబడినది గీత, భగవంతునిచేత గానం చేయబడినది. భగవద్గీత. భాగవతంలో భగవత్ప్రాప్తి మార్గా లను వివరించబడింది కావున ఇది భగవద్గీత, ప్రతి అద్యాయం చివరి గీతా శబ్దం బహువచనంలో వాడ బడింది దీని బట్టి ప్రతి అధ్యాయం ఒక గేయంగా గ్రహించవచ్చు రామాయణం వలే భారతం కూడా గానం చేయుటకు రచించబడిందని భావించవచ్చు. జగత్తుకు ఉపయోగములైన అరణ్యా కారములైన ప్రబోధాత్మక గ్రంధాలు చాలా వున్నాయి గీతలో జ్ఞానం, ద్యానం, కర్మ, భక్తి, యోగ సాధకాలు తెల్పబడ్డాయి భగవద్గీత సాక్షాత్తు భగవంతుని దివ్యవాణి దీని మహిమ అపారమైంది ఇట్టి భగవద్గీత మాటలలో వర్ణించుట ఎవ్వరికిని సాధ్యం కాదు.

ఆధార గ్రంథాలు :

1. పోతన -భాగవతం
2. తిక్కన- మహాభారతం
3. ద్వానా శాస్త్రి - తెలుగు సాహిత్య చరిత్ర

⌘⌘⌘

BHAVAVEENA
Vol. 17, Issue. 8, August 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

కొలకలూరి ఇనాక్ 'రంధి' నవల – సమకాలీనత

– తోట రామకృష్ణ, పరిశోధన విద్యార్థి, తెలుగు శాఖ, ఆదికవి నన్నయ విశ్వ విద్యాలయం, రాజమహేంద్రవరం.

'రంధి' నవల సమకాలీన పరిస్థితులను చిత్రించిన నవలలో అగ్రగణ్యమైనది గుంటూరు జిల్లా, వేజండ్ల గ్రామంలో కూలీనాలీ చేసికొని జీవించే మాదిగ పల్లెలో ఒకపసిబిడ్డ చదువుకోవాలన్న ఆశను గుండెలో నింపుకొన్న ఆ బిడ్డ ఎదుర్కొన్న పరిస్థితులను రచయిత మన కళ్ళ ముందు సాక్షాత్కరింప చేశారు. ఆ నవల చదువు తున్నంతసేపు పల్లెలోని మాదిగల స్థితి గతులను మన మనో నేత్రం దర్శిస్తాము. ఈ నవలలోని ముఖ్యమైన పాత్రలు సువ్వి, రాముడు, నాంచారయ్య, చందిరి, కోటి.

రాముడిది ముట్టుకుంటే మాసిపోయే అందం. తండ్రి నాంచారయ్యకు చంకలో సంతానం. తల్లిదండ్రులు గారాబంగా, గౌరవంగా గర్వంగా పెంచటం వల్ల తనకు తిరుగులేదనే విశ్వాసం, పొగరు, తిక్క, నెత్తికెక్కింది. రాముడు గర్వాన్ని, అతిగారాన్ని అహంకారాన్ని చూచి తల్లిదండ్రులు ఆనందించారేకానీ వాడికిది చేటు అని గుర్తించలేదు. దీనితో రాముడు కూడా తాను ఏం చేసినా, తనకు తిరుగులేదనుకోసాగాడు. థర్డ్‌ఫాంలో ఉన్నప్పుడు డ్రిల్ మాస్టరు రాముణ్ణి ఆడపిల్ల పాత్రు అనువుగా ఉంటావు వేషం వెయ్యి అంటే అమ్మనా బూతులు తిట్టాడు. తిట్టింది డ్రిల్ మాస్టర్‌ని ఒళ్ళంతా డ్రిల్లు చేయించాడు. అవమానమైనది. అవమానం భరించవలసిందే కాని, బయట పెట్టుకొనేది కాదని అర్థ మైంది. మనుషులంటే జీతగాళ్ళే అని అతడి దృష్టి గురువులు కూడా జీతగాళ్ళే అని భావించే తత్త్వం ఏర్పడింది. మనుషుల్ని అసహించుకొనే దశలోకి వచ్చాడు రాముడు. వేజండ్ల మాదిగవాళ్ళ అమ్మాయి గుంటూరులో ఆడపిల్లల హైస్కూలులో ఫస్ట్‌ఫారంలో చేరిందని, రోజూ ఉదయం రైల్లో వస్తుందని, సాయంకాలం తిరిగి వస్తుదని తెలిసే సరికి రాముడికి వింతగా అనిపించింది. ఆడది అందులోనూ మాదిగది స్కూల్ చేరటమేంది.

గర్ల్స్ హైస్కూల్ నిండా ఆడపిల్లలు చదువుకొన్నా సరేగాని, వేజండ్ల మాదిగది చదవటం ఏమిటి? అని తనలో అనుకున్నాడు. సువ్విని చూడగానే 'దీనెమ్మ ఇది తుమ్మ మొద్దు, కారు నలుపు. దీనికి చదువెందుకు, అని ఈసడించుకొన్నాడు. 'ఏందే నీ పేరు? అని అడిగాడు రైల్లో 'సువ్వి' అంది. 'నువ్వు నల్లతుమ్మ మొద్దువు, నాకు కనబడకు' అన్నాడు రాముడు. సువ్వి ఏడ్చింది. నేనెక్కిన రైలు పెట్టిలో ఇవాళ ఎక్కితే ఎక్కావు గానీ, రేపు నేనెక్కే పెట్టెలో వద్దు అన్నాడు. సువ్వి తలూపి, తలొంచుకొని ఏడ్చింది. 'నీ ముఖం చూస్తే నాకు కంపరం' అన్నాడు. సువ్వి ఇంటికి వచ్చి అమ్మానాన్నలతో చెప్పుకొని ఏడతెరిపి లేకుండా ఏడ్చింది.

కాకిపిల్ల కాకికి ముద్దు అన్నట్లుగా సువ్వి వేజెండ్ల మాదిగ కులస్థుడైన కోటి కూతురు. రూపు రేఖలు తీర్చి దిద్దినట్లు ఉంటుంది. నల్లని ఛాయతో అందంలో పాటు చురుకైన తెలివితేటలు కలిగిన పల్లిల్ల హైస్కూల్ చదువుకోసం గుంటూరు రావాలి. తల్లిదండ్రులను ఒప్పించి చదువుకొని టీచర్ అవ్వాలనే ఆశయం కలిగిన సువ్వి ధైర్యంగా ప్రతి రోజు గుంటూరు పాలబండి (రైలు) ఎక్కివస్తుంది. అదే బండిలో నాంచారయ్య కొడుకు రాముడు కూడా గుంటూరులో చదువు నిమిత్తం ప్రతిరోజు వచ్చేడు. ఒకనాడు రాముడు తానెక్కిన రైలు పెట్టెలో సువ్విని ఎక్కవద్దు అంటాడు.

రాముడ్ని అతని జీతగాళ్ళు తీసుకొస్తే సువ్విని మాటలు రాని (మూగవాడు) మనసున్న తల్లి దండ్రులు లేని చందిరి బండి ఎక్కించి తిరిగి దించుకొని తీసుకు వెళ్ళేవాడు. నాంచారయ్యకు డుబ్బు వల్ల వచ్చినది అహంకారం, అధికారం. పిల్లికి బిచ్చం పెట్టడు. బంధువులు లేరు. కులం వాళ్ళు ఉన్నా కలవనీయుడు.

కలవడు. కలిస్తే అప్పులడుగుతారని భయం. తన ఆస్తులుతో పాటు అహంకారం కూడా పెరిగింది. చెప్పా లంటే ఒకానొక దశలో దేశానికి స్వాతంత్ర్య రావడం కూడా పెద్ద ప్రమాదకరంగా మారింది. రైతుకు రైతుకూలీకి ఒక ఓటు మునసబు కరణం.పెద్దమాదిగ, వెట్టితో పాటు ఆడది కూడా సమానమా? అనే అభిప్రాయాన్ని కలిగి ఉంటాడు.

'అణిగి మణిగి ఉండే మాదిగల వద్ద ప్రెసిడెంట్ ఓట్లను బిచ్చం లాగా అడ్డుకోవడం వల్ల మాదిగలకు కొమ్ములు మొలసి దున్నపోతులయ్యారు" అంటాడు. అటువంటి మనస్తత్వం కలిగిన నాంచారయ్య కొడుకు రాముడుది అదే దారి కనీసం సువ్వి రాముడు ఎక్కిన పెట్టిలో ఎక్కినా ఊరుకునేవాడు కాదు సరికదా! "ముండ నేనెక్కిన పెట్టెలో నువ్వెందుకెక్కావు" అంటాడు.

తన దృష్టిలో సువ్వి మా ఊరి మాదిగది మా మీద ఆధారపడ్డ కుటుంబంలోనిది అనుకుంటాడు. అప్పటి నుండి సువ్వి అతడు ఎక్కిన పెట్టెను వదిలి మరో పెట్టెలో ఎక్కుతుది. అనుకోకుండా అదే పెట్టిన ఎక్కిన రాముడికి సువ్వికి మాటా మాటా పెరిగి ఆత్మాభిమానం కలిగిన సువ్వి రాముణ్ణి ముక్కుపై గుద్దడంతో రక్తం కారడం, తనను తన శరీరాన్ని ఎవ్వడు తాకడానికి ఇష్టపడని సువ్వి రాముడు వాటేసు కోవాలనుకోవడం తప్పించుకున్న సువ్విని లంజ అని తిట్టడంతో చెంప మీద చాచ్చి కొట్టింది. అప్పుడు 'లంజా! నిన్ను నెత్తురు కారేటట్టు చెరచకపోతే నా పేరు రాముడే కాదు. అన్నాడు రాముడు. చందిరికి తల్లిదండ్రుల్లేరు. దగ్గరకు తీసిన వారు కూడా కాలం చేయడంతో వేజండ్ల మాదిగ పల్లిలోనే సువ్వి ఇంటి ప్రక్కన ఉంటాడు. నోరు లేకపోయినా ఊరందరికి తల్లో నాలుకలా మెలగుతాడు. చందిరి ఆరోగ్యంగా ఉండటానికి కారణం వేజండ్ల గాలి పీల్చి కాదు. అయ్యా, అమ్మా ఇచ్చిన ప్రేమను పొంది మనిషితనం, మంచితనం పుష్కలంగా ఇచ్చి అమితంగా సంపాదించి ఏనుగంత మనిషి అయ్యాడు పులిబిడ్డ అయ్యాడు.

రాముడు అన్నట్లుగానే అఘాయిత్యానికి తలపడ తాడు. రేపు ఉదయం పెండ్లి అనగా చెంబు పట్టుకు పోయిన సువ్వి రాకపోవడంతో ఆ విషయం ఊరంతా దావానంలా వ్యాపించి అందరూ తాటితోపు వైపుకు వెళ్ళి చూస్తే అక్కడ తీవ్రగాయాలతో పడి ఉన్న సువ్విని కోటి (సువ్వి తండ్రి) ఇంటికి తెచ్చి ఆ మురికి బట్టలు తీసి శు భ్రమైన బట్టలు కట్టి మెల్లగా విషయాన్ని తెలుసు కుంటారు. పెళ్లి ఆగిపోయింది. ఎవరూ చేసుకోవడానికి ముందుకురారు. చివరకు మనసున్న మనిషి పులిబిడ్డ అయిన చందిరి సువ్విని వివాహం చేసుకుంటాడు. చందిరి సువ్వికి కొండంత అండ.

రాముడు సువ్విని చంపడానికి అనేక పన్నాగాలు పన్నినా అవన్నీ ఫలించవు. బుర్ర బద్దలు కొట్టి చంపాలని, విషపు ఇంజక్షన్ ఇచ్చి చంపాలనుకుంటాడు. నగలు నాణేలు, రత్నాలు, ధనరాశులు ఉన్న లంకె బిందుల్ని కాపాడటానికి వాటి చుట్టూ నాగుపాములాగా చందిరి సువ్వికి రక్షణగా ఉన్నాడు. చివరకు ప్రక్కనున్న చందిరిని చూసి సువ్విని ఏమి చెయ్యలేక చెరచి, పీక పిసికి, రైలు కింద పెడతానని శపదం చేస్తాడు. ఈ శపదం రాముడు అభిమానికి, అంతస్థుకు, అధికారానికి, అహంకారానికి గుర్తు రాముడు అడుగడుగునా తన అహంకారాన్ని ప్రదర్శిస్తున్నాడు.

పెద్ద మాదిగలందరూ మునసబును ఆశ్రయిస్తే ఉన్నత కులస్థుడైన నాంచారయ్య రాడు. మునసబే నాంచారయ్య ఇంటికి రావాలి. అందరూ కలిసి పిల్ల తప్పేది లేదు కాని దానిక్కారణమైన వాణ్ణి నిలదీయా లంటే అదివాళ్ళ వల్ల కాదు. అందుకే నాంచారయ్య కొడుకు రాముడికి శాపనాన్ని ర్థాలు పెట్టారు అయితే నాంచారయ్య ఇది పెద్ద గొడవగా కూడా పోలీస్ స్టేషన్‌కు కోర్టుకు తిరుగుతూ డబ్బు తగలేసి బదులు ఇక్కడే సర్దుబాటు చేసుకుంటే పోతుంది అనుకుని డబ్బు ఇవ్వడానికి ప్రయత్నం చేస్తే అది తప్పు చేసిన వాడే తమ మాదిగ పల్లికి వచ్చి ఇమ్మనడంతో ఇష్టం లేక పోయినా

రాముడు డబ్బు తీసుకుని వచ్చి సువ్వికివ్వడం. ఆమె డబ్బులు తిరిగి ఇచ్చేసి తన వ్యక్తిత్వాన్ని నిరూపించుకుంది. అప్పుడు నాంచారయ్య చేసేదేమో దొరలు చేష్టలు కూసేదేమో కూలి కూతలు అంటాడు నాంచారయ్య.

నాంచారయ్య సువ్విని చంపాననే వార్త నా చెవిన పడితే నువ్వు నిజంగా నా కొడుకువని నమ్ముతాను అంటూ ఉంటాడు. దాని అన్ని ఏర్పాట్లు చేస్తాడు. కావలసినంత డబ్బు స్వేచ్ఛను ఇస్తాడు. అది తన కొడుకును పతనావస్థ చేర్చుతున్నాని మరిచిపోయాడు. మనిషి అందలమెక్కినా, అశ్వాలనెక్కినా, గజాల నెక్కిన, సింహాసనమెక్కినా నేలమీద పాడెమీదె పడుకోవాలన్న సత్యాన్ని గ్రహించలేకపోయాడు. ఒక ప్రక్క రాముడు సువ్విని కోరాడు-దక్కట్లేదన్న అక్కసుతో చంపాలను కున్నాడు. ప్రేమ చావును కోరుతుంది. ఏ దేశంలోనైనా ఇదే తంతు. భారతదేశంలో మరీ అధికంగా వుంటుంది. కారణం కులహీనత, ధనహీనత, సువ్విని చంపాలనుకున్న రాముడే రైలు కిందపడి మరణించడంతో నాంచారయ్య బ్రతికున్న శవంలా ఉన్నాడు. ఎంతో వైరం ఉన్న శత్రువులు కూడా కన్నీరు పెట్టి నాంచారయ్యను ఓదార్చు తుంటే ప్రేమానురాగాలు, మమకారాలు చావలేదనిపి స్తుంది. శవయాత్రకు ఊరివారు కాని ప్రక్క గ్రామాల వారు ఎవరూ రాలేదు. వారి దృష్టిలో నాంచారయ్య డబ్బు వడ్డీకి ఇస్తాడు. తీర్చుతామ ఆయనకు మాకు ఆర్థిక సంబంధాలే తప్ప మరేమీ లేదు అంటారు.

తనను మానభంగం చేసి చంపుతానన్న రాముడి శవాన్ని చూసి సువ్వి నిర్ఘాంతపోయి చూచింది. 'సక్కనోడు సచ్చిపోయేడు' అనుకొని ఏడ్చింది. సువ్వి రావడం అశ్చర్యమయితే ఆమె ఏడవటం అందరి హృదయాలను పిండిచేసింది. సాధారణంగా మాదిగలు పాడెమోయరు. హిందువుల స్మశానానికి రారు. అటువంటిది నాంచా రయ్య వంటి దుర్మార్గుడి కొడుకు పాడె పట్టడానికి ఎవరూ లేకపోవడంతో నమ్మిన బంట్లైన మాదిగలే చిన్న దొరగారిని మేము ఎత్తుకొని పెంచాం. మేమే పాడెమోస్తామన్నారు. మాదిగ పెద్దలు ఐదుగురు నాంచారయ్యను ఓదార్చుతో కాళ్లమీద పడితే మీ చేతుల్లోనే కదా వాడి చివరి ప్రయాణం అన్నాడు నాంచారయ్య అంటే కొడుకు దహనం చేసేది మీరే కదా అని ఉద్దేశమైతే మీవల్ల కదా నా కొడుకు చనిపోయిందని అర్థం గోచరించి మాదిగ పెద్దలు ఉలిక్కి పడతారు.

నాంచారయ్య తన కొడుకుకు పట్టిన గతే తనకు పడుతుందేమోనని ఆస్థి తనకు శాపం కాకూడదు. అది వరం అవ్వాలనుకున్నాడు నాంచారయ్యలో కొత్త ఆలో చనలు ఊరిపిపోసుకున్నాయి. డబ్బు స్థానంలో మను షుల్ని సంపాదించుకోవాలన్న ఆసక్తి పెరిగింది. తనకాష్టానికి వారసుడిగా చందిరిని తన ఆస్థికి వారసుడిగా చందిరికి పుట్టబోయే బిడ్డకు ప్రకటించాడు. సమయం సందర్భం వస్తే అమూర్త ప్రేమ కూడా మూర్తి దాల్చిన ప్రేమగా మారుతుందని గ్రహించాడు. దాంతో మాదిగపల్లి నాంచారయ్య ప్రేమను పొందింది. సువ్వి ఇది వరకు తండ్రిచాటు బిడ్డ ఇప్పుడు ఒకరికి ఆలి. సువ్వి ఆత్మ గౌరవం కోసం పోరాడిన పెద్దలు నిజానికి ఆత్మగౌరవాన్ని సాధించి అసాధ్యాన్ని సుసాధ్యం చేశారు. ఐకమత్యంతో అద్భుతాలు జరుగుతాయని గుర్తించిన వేజండ్ల మాదిగ పెద్దలు గొప్ప పోరాట పటిమను పెంపొందించుకోగలి గారు. ఇది శతాబ్దాల మాదిగల నిరీక్షణ.

ఆధార గ్రంథాలు :

1) రంధి నవల - కొలకలూరి ఇనాక్

⌘⌘⌘

BHAVAVEENA
Vol. 17, Issue. 8, August 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

ఆధునిక మహేతిహాసం – కన్యాశుల్కం – సమకాలీనత

– డా॥. యస్.సి. సంజీవరెడ్డి, తెలుగు ఉపన్యాసకులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, యర్రగుంట్ల, (కడప జిల్లా).

సారాంశము :

గురజాడ రచించిన కన్యాశుల్క నాటకం ఆనాడు సమాజంలో వున్న కన్యాశుల్క దురాచారానికి వ్యతిరేకంగా వ్రాయబడింది. ఈనాడు సమాజంలో కన్యాశుల్కం లేదు. కాని ఆ నాటకం ఇంకా సజీవంగా నిలిచి వుంది. అందుకు గల కారణం కన్యాశుల్కం ఒక ఆధునిక మహాయితిహాసం అని చెప్పవచ్చు. రామాయణ భారతాలు సమగ్రమైన రాచరిక వ్యవస్థను ప్రతిబింబించాయి. ఇవాళ రాజరిక వ్యవస్థ లేదు. కానీ రామాయణ భారతాలను నాట కాలుగా, సినిమాలుగా, సీరియల్స్‌గా, ఈనాటికి ప్రజలు ఆదరిస్తున్నారు. కన్యాశుల్క నాటకం కూడా ఆధునిక మహేతికాసం అని ఈ వ్యాసంలో వివరించడం జరిగింది.

కన్యాశుల్కం సమస్య నశించిపోయినా నాటకం ఇంకా నిలిచి ఉండటానికి కారణం అది ఒక ఆధునిక మహా యితిహాసం.

ఏ రచనకైన శాశ్వతత్వం అనేది ఉండదు. ఎక్కువ కాలం ఒక రచన ప్రజలలో నిలిచి ఉంటే అది అంత గొప్పది అవుతుంది. ఒక వ్యవస్థను చిత్రించిన రచన ఆ వ్యవస్థ నశించిపోగానే తన స్థానాన్ని కోల్పోతుంది. ఆ తర్వాత కూడా దానిని ప్రజలు ఆదరిస్తూ ఉంటే దానికి వేరే కారణాలుంటాయి. రామాయణం, భారతం సమగ్ర మైన రాచరిక వ్యవస్థను ప్రతిబించాయి. ఇప్పుడు రాచరికం లేదు. కానీ రామాయణ భారతలను నాటకాలుగా, సినిమాలుగా, సీరియల్స్‌గా, భారతీయులు చూస్తునే ఉన్నారు. పురాణాలుగా వింటూనే ఉన్నారు. ఇందుకు రెండు కారణాలు చెప్పుకోవచ్చు.

1. మన వ్యవస్థ మారినా మన ఆలోచనలు, అభి రుచులు మారినా, ఆలోచనల పరంగా, భావజాలం పరంగా మనం గతంలో నివశించాము.
2. ఒకనాటి వ్యవస్థను అప్పటిరచనలుగ భారత, రామాయణాలు ఒక సమగ్ర చిత్రంగా మనకు అందివ్వడం వస్తువు నశించినా రూపం ఇంకా ఆకర్షణీయంగా ఉండడం మరొక కారణం కావచ్చు.

ఈనాడు ఏ స్త్రీ కూడా ద్రౌపదిని అనుసరించడానికి సిద్ధంగా లేదు. అలాగే సీతలాగా భర్త అగ్నిలో దూకమంటే సిద్ధంగా లేదు. అయినా సీత, ద్రౌపదుల గాధలను నేటి మహిళల ఆసక్తిగా వింటూనే ఉన్నారు. ఇందుకు కారణం ఆ పాత్రలోని సజీవ గుణాలే.

ఈ అవగాహనతో కన్యాశుల్కం గురించి ఆలోచిస్తే ఈ నాటకం కన్యాశుల్క సమస్య నశించిపోతున్న రోజుల్లో వ్రాయబడింది. బాల్యవివాహాలు బలంగా ఉన్న రోజుల్లో వ్రాయబడింది. ఇది ఒక బ్రాహ్మణ కుటుంబ కథ విజయ నగర ప్రాంత భాషలో వ్రాయబడింది. అయినా నేటికి ఆ నాటకానికి ఆదరణ తగ్గలేదు. వరకట్నం ప్రారంభంలో వచ్చిన కాళ్ళకూరి నారాయణరావు గారి వరవిక్రయ నాటకం ఆ రోజుల్లో విఫలమయిపోయింది. వరకట్న సమస్య హద్దు మీరిపోయి స్త్రీల పాలిట శత్రువుగా మారిన ప్రస్తుత సందర్భంలో ఆ నాటకానికి ఎంతో విలువ ఉం డాలి. కానీ ఆ నాటకం విద్యార్థుల పాఠ్య గ్రంథాల్లో తప్పా ప్రజల హృదయాలలో స్థానం సంపాదించలేక పోయింది. కన్యాశుల్క నాటకం బాల్య వివాహాలు నశించి పోయినా ఇంకా చూస్తూనే ఉన్నారు. అది ఒక బ్రాహ్మణ కుటుంబ కథ అయినా కులాల కతీతంగా జనమంతా చూస్తునే ఉ న్నారు. కన్నడం, తమిళం లాంటి భారతీయ భాషల్లోనే కాక ఆంగ్లంలోకి, రష్యన్ భాషలోకి కూడా ఈ నాటకం అనువదింపబడింది. ఇందుకు కారణాలు ఏమిటి?

నిలకడగా ఉన్న సమాజాన్ని చిత్రించడం చాలా సులభం, మారతున్న సమాజాన్ని చిత్రించడం కష్టం.

సమాజంలో వచ్చే మార్పులను, మార్పుల వల్ల జీవితంలో సంభవించే సంఘర్షణలను వర్ణించడానికి రచయిత మేధావి కావాలి. గురజాడ అలాంటి మేధావి ఆధునిక పాలన, ఆధునిక విద్యా విధానం, అగ్ని హోత్రావధాని వెంకమ్మ భార్య భర్తల మధ్య ఎంతటి సంఘర్షణ సృష్టించిందో గురజాడ అద్భుతంగా చిత్రించాడు. ఆధునిక విద్య సంప్రదాయ విద్యను ఎంత చిన్న చూపు చూసిందో కరటక శాస్త్రి పాత్ర ద్వారా నిరూపించాడు.

సామాజిక మార్పులలో భాగంగా స్త్రీ పురుష సంబంధాలలో వస్తున్న మార్పులను చాలా సృజనాత్మకంగా చిత్రించాడు గురజాడ. వెంకమ్మ మొదలు కొని మధురవాణి దాకా నాటకంలోని '5' మంది మహిళలు పురుషుల ఆధిపత్యాన్ని ఏతే ఒక రూపంలో ప్రశ్నించారు. ధిక్కరించారు. ఈ ప్రశ్నలు, ఈ ధిక్కరణలు నేటికి కొనసాగుతూనే ఉన్నాయి.

సమాజమంతా చెడు అనుకున్న దానిలో మంచిని చూడడం మధురవాణి పాత్ర ద్వారా గురజాడ నేర్పించాడు. కుటుంబాలను చెడుగొట్టేదిగ భావింపబడేవేశ్య అయిన మధురవాణి లుబ్ధావధాని కుటుంబాన్ని రామప్పంతులు కుటుంబాన్ని రక్షించడం ఆమెలోని విశిష్టత. ఈ నాటకం వచ్చిన తర్వాత అనేక మంది రచయితలు ప్రాచీన సాహిత్యాన్ని కొత్తగా వ్యాఖ్యానిస్తూ రచనలు చేయడం ప్రారంభించారు.

కన్యాశుల్క నాటకంలోని భాషాపరమైన సృజనాత్మక ఇప్పటికి రచయితలకు ఒక ఆదర్శంగా ఉంది. నాటక పాత్రలను ఉత్తమ పాత్రలని, అధమ పాత్రలని విభజించి, రెండు రకాల భాషలు వాడే సంప్రదాయానికి చరమగీతం పాడి గురజాడ ప్రతి పాత్రకూ తనదైన భాష ఉపయోగించాడు. దీనినే వ్యక్తి మాండలికం అంటారు. ఈ విషయంలో నేటి రచయితలకు గురజాడ మార్గదర్శి.

నాటకంలోని కథను పక్కన పెట్టి రచయిత సృష్టించిన కొన్ని సంభాషణలు నేటికి మన జీవిత సందర్భాలకు ఉపయోగపడుతుండడం ఆశ్చర్యకరమైన విషయం.

వేషన్స్ ఉంటేనేగానీ లోకంలో నెగ్గలేం.
అట్నుంచి నరుక్కురమ్మంటున్నారు.
నాతో మాట్లాడడమే ఒఖ ఎడ్యుకేషన్.
మనవాళ్ళు ఒట్టి వెధనాయిలోయ్
ఆత్మాను భవం అయితే కాని తత్వం భోదపడదు.
మొగాడికైనా, ఆడదానికైనా నీతి ఉండాలి.
తాంబూలం యిచ్చేశాను యిక తన్నుకు చావండి.
అప్పుడప్పుడు ఒపీనియన్స్ ఛేంజ్ చేస్తూ ఉంటేనేగానీ పాలిటేషన్ కానేరుడు.
నమ్మిన చోట వేస్తే మోసం. నమ్మని చోట చేస్తే లౌక్యం.

ఇలాంటి వ్యాఖ్యలు నేటికి జనం జీవిత సందర్భాలను వ్యాఖ్యానించుకోవడానికి భాష సామాజిక విమర్శకు గొప్ప ఆయుధంగా ఉపయోగపడుతుంది.

నాటకంలోని పాత్రలు నాటంకలోనే నిల్చిపోకుండా బయటి సమాజంలోకి వచ్చి 12సం॥ నుండి ఫలానవాడు గిరీశం అని ఫలానవాడు లుబ్ధావధాని అన్ని ఫలానవాడు అగ్నిహోత్రావధాని అని జనం, చెప్పుకోవడానికి సహకరిస్తున్నాయి. ఇవాళ ఏ ఉద్యమంలో చూసినా గిరీశం దర్శనమిస్తాడు. ప్రపంచ అంతా ఒక గ్రామం అయిపోయిన హైటెక్ యుగంలో కూడా అగ్నిహోత్రావధాన్లకు కొదవలేదు.

ఈ లోకం అంతా స్వార్థపరులు నిండిపోయారని కన్యాశుల్కం నాటకంలో మధురవాణి చేసిన విమర్శ మరింత అర్థవంతంగా కన్పిస్తున్నా సౌజన్యారావులు మిణుకు మిణుకు మంటూనే ఉన్నారు. ఎంతోమంది అమాయక మహిళలు మీనాక్షిలాగ స్వార్థపరులైన పురుషుల చేతిలో మోసపోతున్నారు. అలాగే పెళ్ళి చేసుకోమని ఆమె రామప్పంతులను వెంటపడినట్లుగానే ఈనాడు ఎంతో మంది మహిళలు ధైర్యంగా వీధుల్లోకి వచ్చి తమను మోసం చేసిన పురుషులను నిలదీస్తున్నారు. ప్రపంచం శాస్త్ర సాంకేతిక రంగాలలో ఎంతో ప్రగతి సాధిస్తూ

సిద్ధాంతాలకు, జ్యోతిష్యులకు, అంజనం వేసి చూసే వాళ్ళకు, బైరాగులకు మన దేశం ఆశ్రయం ఇస్తూనే వుంది. వీళ్ళంతా కన్యాశుల్క నాటకంలో కల్పిస్తారు.

హాస్యాన్ని సామాజిక విమర్శకు పదునైన ఆయుధంగా ఎలా వాడుకోవాలో గురజాడ స్పష్టంగా కన్యాశుల్క నాటకంలో రుజువు చేశాడు. ఆ తర్వాత హాస్యప్రధానంగా ఎంతో సాహిత్యం వచ్చినా, సహజత్వ లోపం వల్ల అది కన్యాశుల్క నాటకం అంచులదాకా కూడా రాలేక పోతున్నది.

అనేక సామాజిక వైరుద్యాలలో భాషా వైరుద్యం కూడా ఒకటి. కన్యాశుల్కం నాటకంలో ఇంగ్లీషు భాష పట్ల అగ్నిపోత్రావధాని చూసిన వ్యతిరేకత ఆ కాలానికి ఒక చాదస్తమే కావచ్చు కానీ ఇవాల తెలుగు భాష చచ్చిపోయే ప్రమాదం ఉందని ఆందోళన పడుతున్నారు. మాతృ భాషాదినోత్సవాలు జరుపుతున్నారు. కన్యాశుల్క నాటకం కాలంలో అగ్నిపోత్రావధాని లాంటి ఛాందస్తులను మాత్రమే భయపెట్టిన ఆంగ్లభాష యిప్పుడు మాతృ భాషాభిమానులను, మేధావులను ఆందోళన పరుస్తుంది.

ఇన్ని కారణాల చేత కన్యాశుల్క సమస్య నశించి పోయినా నాటకం ఇంకా ఇంకా సజీవంగా వుంటున్నది. కన్యాశుల్క నాటకం ఒక మేధావి రచన ఇది ఒక ఆధునిక మహేతిహాసం అని చెప్పవచ్చు.

ఆధార గ్రంధాలు :

1. కన్యాశుల్క నాటక కళ, సర్దేశాయి తిరుమల రావు
2. కథాశిల్పం, వల్లంపాటి వెంకట సుబ్బయ్య
3. కన్యాశుల్క పునసృష్టి నరాల వీరయ్య

⌘⌘⌘

BHAVAVEENA
Vol. 17, Issue. 8, August 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

చండాలుడు నవల – సమకాలీనత

– తంగి ఓగేశ్వరరెడ్డి, పరిశోధక విద్యార్థి, తెలుగు శాఖ, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, గుంటూరు.

కరణం బాలసుబ్రహ్మణ్యం పిళ్ళె గారు 1936 ఫిబ్రవరి 1న చిత్తూరు జిల్లా తలుపుల పల్లెలో జన్మించారు. ఆయన చిత్తూరు జిల్లాలోని పలు పాఠశాలల్లో తెలుగు ఉపాధ్యాయులుగా పనిచేసి, 1994 లో కలిచెర్ల ఉన్నత పాఠశాలలో పదవీ విరమణ చేశారు. పదవీ విరమణ అనంతరం పిళ్ళె గారు తన పూర్తి సమయాన్ని తెలుగు భాషాభివృద్ధికి వినియోగించారు. అచేతన స్థితిలో ఉన్న మదనపల్లి రచయితల సంఘంలో తిరిగి చైతన్యం నింపారు. తెలుగు సాహిత్యంలో పద్యం, నవల, కథ, వ్యాసం, నాటకం మొదలైన అన్ని ప్రక్రియలలోనూ రచనలు చేశారు.

కరణం బాలసుబ్రహ్మణ్యం పిళ్ళెగారు మధ్రిమాను సాక్షిగా...., చండాల-ుడు, బోయకొట్టములు పండ్రెండు అనే మూడు నవలలు రచించారు.వీటిలో మొదటిది సాంఘిక నవల కాగా రెండవది పౌరాణిక నవల. చివరిది చారిత్రక నవల. పిళ్ళెగారు రచించిన గొప్ప పరిశోధనాత్మక నవల చండాలుడు. పంచమ వర్ణ ఆవిర్భావానికి సంబంధించిన అనేక అంశాలను ఈ నవలలో రచయిత చర్చించారు.

"చాతుర్వర్ణ్యం మయాసృష్టం గుణకర్మవిభాగశ:"అని భాగవతంలో శ్రీకృష్ణుడు చెప్పాడు. "బాహ్మణ: క్షత్రియో వైశ్యస్తయో ద్విజాతయ:చతుర్థ ఏక జాతిస్తు శూద్రో, నాస్తి తు పంచమ:" అని మనుధర్మశాస్త్రంలో చెప్పబడింది. పై శ్లోకంలో పంచమజాతి లేనే లేదని మనువు చెప్పాడు. కాని అదే మనువు మనుధర్మశాస్త్రం పదవ అధ్యాయంలో శ్వపచుడు, పుల్కసుడు, క్షత్ర, మృతపుడు మొదలైన అరవైకి పైగా అధమ వర్ణాలను పేర్కొన్నాడు. పంచమజాతి లేనే లేదని కంఠోత్తిగా చెప్పిన మనువు అంతలోనే ఈ పంచమజాతి ఆవిర్భావానికి అవకాశం ఎట్లా ఇచ్చాడు? ఎన్ని వేల సంవత్సరాలైన వెలిసిపోని ఈ వర్ణం ఎలా ఆవిర్భవించింది? మన నీళ్ళతో మన చేతులతో కడుక్కోలేక ఏ దేశస్తులో వచ్చి వారి నీళ్ళు వారి చేతులతో కడుక్కోవలసి వస్తున్న ఈ పంచమవర్ణం మన జాతికి ఎలా అంటుకుంది? ఈ పంచమ వర్ణం యొక్క ఆవిర్భావాన్ని గురించిన ఆలోచనలకు రూపమే ఈ చండాలుడు నవల.

చరిత్ర పరిశోధకులూ, సామాజిక శాస్త్ర పరిశోధకులూ ఈ పంచమ వర్ణ ఆవిర్భావాన్ని గురించిన అనేక సిద్ధాంతాలు ప్రతిపాదించారు. కొందరు పరిశోధకులు బౌద్ధ భిక్షువులను వైదిక మతప్రచారకులు బలవంతంగా, దుర్మార్గంగా అస్పృశ్యులుగా చేశారని సిద్ధాంతీకరించారు. మరికొందరు పరిశోధకులు ఆర్యవర్తనంలోని వారు విజాతీయులతో జరిపిన యుద్ధాల్లో విజాతీయులు ఓడిపోయి, బందీలుగా పట్టుబడినప్పుడు వారిని అస్పృశ్యులుగా పరిగణించి దాస్యానికి వినియోగించుకునేవారని ప్రతిపాదించారు. ఇంకొందరు పరిశోధకులు మధ్య ఆసియా నుండి ఆర్యులు మనదేశంపైకి దండెత్తి వచ్చి ఇక్కడ నివసిస్తున్న అనార్యులను ఓడించి, వారిని అస్పృశ్యులుగా పరిగణించారని పేర్కొన్నారు.

కాని పిళ్ళెగారు పై సిద్ధాంతాలతో విభేదించి వాటికి పూర్తి భిన్నమైన అభిప్రాయాన్ని వ్యక్తంజేశారు. "అక్కడొకరూ, ఇక్కడకొందరూ. ఒకప్పుడు ఒకడూ, మరొక్కప్పుడూ మరికొందరూ నిస్సాయస్థిలో, తిరిగి తమ మునుపటి స్థితికి వెళ్ళలేని స్థితిలో చండాలురుగా మారిన వారు గనుకనే అంక్షలకూ, దిగ్బంధాలకు గురై అచిరకాలంలోనే అధమస్థికి చేరుకున్నారు. కాబట్టి ఈ పంచమజాతి ఒక్కపారిగా ఆవిర్భవించింది కాదు. సహజంగా ఆవిర్భవించినదీ కాదు. పూర్వం నుండి ఉండినదీ కాదు. వీరిలో కొదరు మాత్రమే విజాతీయులు. ఈ వర్ణంలో అధికభాగం

భారతజాతి నుండి పరిణామం చెందినదే. మన చతువర్ణం నుండి పుట్టుకొచ్చిందే. మన రక్తమే. మన మాంసమే. మన వర్ణమే" అని పిళ్ళెగారు పంచమజాతి ఆవిర్భావాన్ని గురించి పేర్కొన్నారు. ఇలా పుట్టుకొచ్చిన చండాలుర సంఖ్య పెరిగి, చండాలవాటికలు ఏర్పడ్డాయి.

ఈ నవలను పిళ్ళెగారు రామాయణంలోని త్రిశంకు మహారాజు కథ ఆధారంగా రాశారు. వాల్మీకి రామాయణం లోని బాలకాండ నందలి 57 నుండి 60 సర్గలలో త్రిశంకు మహారాజు కథ వర్ణించబడింది. రామలక్ష్మణులను వెంటబెట్టుకొని విశ్వామిత్ర మహర్షి సీత స్వయంవరానికి మిథులనగరానికి వెళ్తాడు. అక్కడ జనకమహారాజు పురోహితుడు శతానందుడు, రామలక్ష్మణులతో విశ్వా మిత్రుని వృత్తాంతాన్ని వివరిస్తూ, అందులో భాగంగా త్రిశంకుని వృత్తాంతాన్ని చెబుతాడు. ఇక్ష్వాకు వంశంలో త్రిశంకుడనే గొప్ప మహారాజు ఉండేవాడు. అతడు 'ఎంత గొప్ప యజ్ఞమైన చేసి నన్ను బొందితో స్వర్గానికి పంపండి' అని వసిష్ఠుని అడుగుతాడు. వసిష్ఠుడు 'అది సాధ్యంకాదు' అంటాడు. త్రిశంకుడు వసిష్ఠపుత్రుల దగ్గరికి వెళ్ళి ఇదే కోరిక కోరతాడు. వాళ్ళు ' మా తండ్రికాదన్న పనిని మేము చేస్తామా. అదిసాధ్యం కాదు' అంటారు. 'అయితే మరే ఋషినైన ఆశ్రయించి నా కోరిక నెరవేర్చుకుంటాను' అంటాడు త్రిశంకుడు. వెంటనే వసిష్ఠపుత్రులు కోపించి 'నీవు చండాలుడవైపోదువు గాక' అని శపిస్తారు. రాత్రికి రాత్రే త్రిశంకుడు చండాలుడైపోతాడు - తర్వాత విశ్వా మిత్రుడు ఒక యజ్ఞంచేసి త్రిశంకుడిని బొందితో స్వర్గానికి పంపుతాడు. అక్కడ ఇంద్రుడు చండాలుడికి స్వర్గప్రవేశంలేదని త్రిశంకుడిని త్రోసివేస్తాడు. విశ్వా మిత్రుడు త్రిశంకుడిని అంతరిక్షంలోనే నిలిపి అక్కడే ఒక స్వర్గం నిర్మిస్తాడు. ఇదే స్థూలంగా రామాయణంలో పేర్కొన్న త్రిశంకుమహారాజు కథ. ఈ ఉపాఖ్యానాన్ని ఆధారంగా చేసుకొని, దానికి కొన్ని కల్పనలు జోడించి పిళ్ళెగారు భారతదేశంలో పంచమజాతి ఆవిర్భావాన్ని గురించి వివరించారు.

ఋషులు మతానికి మాత్రమే ప్రతినిధులు. మతం వ్యక్తిగతం. ప్రభుత్వం ప్రజల సంక్షేమానికీ, భద్రతకూ జవాబుదారీగా నిలుస్తుంది. మతం వ్యక్తిగత, ఆధ్యాత్మికోన్నత్యానికీ, ఆత్మవిముక్తికీ జవాబుదారీగా నిలుస్తుంది. ఏసుక్రీస్తు రెండు వేల సంవత్సరాల క్రితమే మతాన్నీ, ప్రభుత్వాన్నీ ఖచ్చితంగా వేరు చేసి చూపాడు. "సీజరుది సీజరుకీయుడి, దేవునిది దేవునికీయుడి" అని తేల్చి చెప్పాడు. ప్రభుత్వం మతం చెప్పుచేతుల్లో ఉంటే సమాజం లౌకికంగా ఉన్నత స్థితికి చేరుకోదు. ఇది చరిత్ర నిరూపించిన సత్యం. పాశ్చత్యదేశాలలో సైతం మతం (చర్చి) ప్రభుత్వం (క్రౌన్)పైన పెత్తనం సాగించినంత కాలం పాశ్చత్య రాజకీయ, సాంఘిక జీవనాలు ఎంత కల్లోలితంగా, అంధాకారమయంగా ఉన్నాయో చరిత్ర చదివిన వారందరికీ తెలుసు.చర్చి పెత్తనం నుండి క్రౌన్ బయట పడిన తరువాతే అక్కడి సమాజంలో చైతన్యం వెల్లు విరిసింది. ఈనాటికీ కొన్ని దేశాలు మతానికీ, మతాచార్యు లకూ అధికారం కట్టబెట్టి ఎంత వెనుకబడి ఉన్నాయో, ఆ దేశ ప్రజలు ఏ స్థితిలో ఉన్నారో, మిగతా ప్రపంచాన్ని కూడా ఎలా అతలాకుతలం చేస్తున్నారో మనం చూస్తునే ఉన్నాం. ప్రస్తుతం కూడా ప్రపంచ వ్యాప్తంగా పాలనా వ్యవహారాలలో మత ప్రమేయం అధికమౌతుంది. దీని ప్రభావం మన దేశంలో కూడా కనిపిస్తుంది. ప్రభుత్వం మత ప్రమేయం నుండి సాధ్యమైనంత తొందరగా బయటపడకపోతే పర్యావసానం ఏ విధంగా ఉంటుందో రచయిత చండాలుడు నవల ద్వారా ప్రస్తుత సమాజం ముందు ఉంచారు.

"మన పిచ్చిగానీ, రాజు తన రాజ్యంలోనే రాజు. ఋషులు భరతఖండాని కంతటికీ రాజులు. వారి మాటలు ప్రపంచంలో ఏ మూల ఉన్నవారికైనా శిరో ధార్యాలు. వారి మాటలకు అంతటి ప్రాధాన్యమిచ్చి వారిని తలపైన పెట్టుకొని పూజించినదీ యీ మహారాజులే. ఇద్దరూ ఒకరినొకరు హెచ్చించుకుంటూ, ఇద్దరూ ఒకరినొకరు దైవాంశ సంభూతులని ఎత్తి పాడుకుంటూ

ఇద్దరూ కలసి సామాన్య జనాన్ని తొక్కిపెట్టి....." అని రచయిత వ్యక్తం చేసిన అభిప్రాయం త్రేతాయుగానికే కాదు ఆధునిక యుగానికీ సరిగ్గా సరిపోతుంది. ప్రస్తుత కాలంలో పాలకులు, రాజకీయ పార్టీల ప్రముఖులు, ధనవంతులు కొందరి బాబాల చుట్టు తిరుగుతూ వారికి కల్పిస్తున్న ప్రచారం వలన సామాన్య జనం ప్రభావితులై, వారి చేతిలో మోస పోతున్నారు. సామాన్య జనం నమ్మకాన్ని బాబాలు, పాలకులు తమ స్వార్థం కోసం ఉపయోగించుకోవడం మనం తరచుగా చూస్తున్నాం.

"కనబడే ఆపద కంటే కనబడని ఆపదను గురించే మానవునికి భయం ఎక్కువ" అని మన సమాజంలో మూఢనమ్మకాలకు ప్రభలడం వెనుక ఉన్న ప్రధాన కారణాన్ని రచయిత ఈ నవలలో వివరించారు. ఒక అమ్మవారి విగ్రహాన్ని ఇంటి ముందరికి తెచ్చి 'ఈ అమ్మవారికి పూజించి కానుకలు సమర్పించకపోయారో, ఒక వారం లోపల నెత్తురు కక్కుకొని చస్తారు' అని పూజారి అంటే చాలు ఆ పూజారి అడిగినదాని కంటే ఎక్కువ సమర్పించుకుంటారు జనం. అది అబద్ధమని పూజారికీ తెలుసు. కానీ నిజమనే సామన్య ప్రజలు నమ్ముతారు. సున్నం కలిపిన పసుపు నీళ్ళలో రెండు బొగ్గు ముక్కలు వేసి వీధిలో అడ్డంగా పోస్తే చాలు, అందరూ అలా చుట్టు తిరిగి తొలగిపోతారు. దాటితే ఏ గాము పట్టుకుంటుందో అని కనబడని దాని పైన భయం.ప్రస్తుత కాలంలో ఈ భయాన్ని ఆసరాగా చేసుకొని అనేక మంది మంత్ర గాళ్ళగానూ, మంత్రగత్తెళ్ళనూ మారి అమాయకులైన ప్రజలను మోసం చేస్తున్నారు.

త్రిశంకుడు వసిష్ఠుని చేత చండాలునిగా శపించ బడగానే అతని బంధువులైన శత్రంతపుడూ, విక్రమవర్మ రాజ్యాన్ని ఆక్రమించడానికి ప్రయత్నిస్తారు. చివరికి త్రిశంకుని కుమారుడు ధుంధుమారుని చంపడానికి కూడా వెనుకాడరు. ప్రస్తుత కాలంలో కూడా అధికారం, సంపద కోసం బంధువుల మధ్య తగాదాలు, హత్యలు మనం చూస్తున్నాం.

త్రిశంకుడు చండాలునిగా శపించబడగానే అతనికి అందరూ దూరంగా జరిగిపోతారు. ఎవరూ మాట్లాడరు. అయోధ్య మహామంత్రి అర్జునదేవుడు 'మహారాజు చండాలునిగా శపించబడ్డారు. అతని విషయంలో మీరు ఏమి చేయాలను కుంటున్నారు?' అని మహారాణి అనంగరచ్యాదేవిని అడగగానే తన భర్తతోపాటే తానూ అని సమాధానమిస్తుంది. త్రిశంకుడిని కలిసినా, అతనితో మాట్లాడినా తానూ, తన కుమారుడు శాశ్వతంగా చండాలురుగా మారిపోతారని తెలియగానే త్రిశంకుని వంశాన్ని, తన కుమారుని క్షత్రియత్వాన్ని కాపాడటం కోసం మహామంత్రి చెప్పినట్లు తన పుట్టిల్లు అయిన కౌశాంబికి వెళ్ళిపోతుంది. అందరిలా తన భర్తను వదిలేయకుండా నిరంతరం అతని క్షేమ సమాచారాన్ని వేగుల ద్వారా తెలుసుకుంటుంది. విశ్వామిత్రుని సహాయంతో త్రిశంకుడు తన చండాలత్వాన్ని పోగొట్టుకొని, తిరిగి క్షత్రియునిగా మారడంలో మహారాణిది కీలకమైన పాత్ర. ఏ సమాజంలో నైనా ఒక స్త్రీకి తన భర్త పిల్లలే ప్రపంచం. వారి క్షేమం కోసం ఆమె పడే కష్టాలు, త్యాగాలను రచయిత ఈ నవలలో ఎంతో ఆర్ద్రంగా చిత్రించారు.

త్రిశంకుడు చండాలునిగా శపించబడగానే అతని గురించిన అబద్దాలు, పుకార్లు రాజ్యమంతటా వ్యాపిస్తాయి. వసిష్ఠుడు శపించగానే త్రిశంకుడూ, అతని బట్టలు నల్లగా మారిపోయాయనీ, చీనాంబరాలు నారదుప్పట్లుగా మారిపోయాయనీ, తల వెంట్రుకలన్నీ ఏదుపంది ముళ్ళలాగా నిక్కపొడుచుకున్నాయనీ, గడ్డమూ, మీసాలూ గుబురు గుబుర్లుగా పెరిగిపోయాయనీ, శరీరంలో చెడ్డవాసన అలముకుందనీ, భాష కూడా మారిపోయిందనీ, అయోధ్య ప్రజలు అతనిని రాళ్ళతో కొట్టి తరిమేశారనీ ఇలా అతని గురించి అవాస్తవాలు రాజ్యమంతటా వ్యాపిస్తాయి. "కట్టుకథలు ఎంత బాగా, ఎంత వేగంగా అల్లబడతాయి! ఎంత తొందరగా వ్యాపిస్తాయి!" అని రచయిత అన్న మాటలు సర్వకాలికం. గతంలో కన్నా ప్రస్తుత కాలం శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి

చెందటం వల్ల అసత్యాలు చాలా వేగంగా వ్యాపించి అనేక అనార్థాలకు కారణమౌతున్నాయి.

స్త్రీల మానసిక ప్రవృత్తిని ఈ నవలలో రచయిత అద్భుతంగా చిత్రించారు. త్రిశంకుని చండాలునిగా శపించిన తరువాత వసిష్ఠుడు అయోధ్యకు వచ్చినప్పుడు అయోధ్య నందలి స్త్రీలు వసిష్ఠుడునీ, అతని శిష్యులనూ దూషిస్తారు. అది గమనించిన వసిష్ఠుడు త్రిశంకుని కుమారుడు ధుంధుమారుడిని అయోధ్యకు రాజుగా ప్రకటించగానే అదే నోళ్ళతో వసిష్ఠుడిని కీర్తిస్తారు. స్త్రీలు భావోద్వేగాలకు తొందరగా లోనవుతారు. వారిలో క్షమా గుణం ఎక్కువ. "ఆడవాళ్ళకు మనస్సు ప్రసన్నంగా ఉంటే దేవుళ్ళపైనా, స్వాములవారిపైనా విపరీతమైన భక్తి ప్రవత్తులు పుట్టుకొస్తాయి. నిలువు దోపిడీలు సైతం ఇచ్చేస్తారు. వాళ్ళ మనస్సులో ద్వేషం కలిగిందంటే దేవునికీ భయపడరు. దెయ్యానికీ భయపడరు. తమ కోపాన్ని కుండ పగల కొట్టినట్లు ప్రకటిస్తారు" అని రచయిత స్త్రీల మానస్సును మన కళ్ళకు కట్టారు. ఈ మాటలు కూడా సర్వకాలికమే.ఏ కాలంలోనైనా స్త్రీలు సున్ని మనస్కులు. ప్రేమ మూర్తులు.

మానవుడు సంఘజీవనానికి దూరమైతే ఎంత శీఘ్రంగా నాగరిక సమాజానికి దూరమవుతాడో రచయిత ఈ నవలలో త్రిశంకుని పాత్ర ద్వారా మన ముందుంచారు. చండాలునిగా శపించబడగానే నాగరిక సమాజం తనపై చేస్తున్న నిరంకుశమైన పెత్తనం దుర్భరంగానూ, అన్యాయంగానూ తోస్తుంది త్రిశంకునికి. త్రిశంకుడు బహిష్కృతుడైన కొన్ని దినాలకే తన పూర్వ స్థితి నుండి చాలా దూరంగా వెళ్ళిపోతాడు. షడ్రసోపేత భోజనాలు మరచిపోతాడు. హంసతూలికా తల్పాలు, స్నాన సంధ్యలు మరచిపోతాడు. ఏది దొరికినా తింటాడు.ఎక్కడైనా పడుకోవడానికి అలవాటుపడిపోయాడు.ఇలా సమాజం నుండి సంఘజీవనానికి దూరం కాగానే అనేక యుగాలుగా నిర్మించుకొన్న నాగరికత నుండి చూస్తూ ఉండగానే వాయువేగంతో విసిరివేయబడతాడు. మళ్ళీ ప్రాథమిక ఆటవిక దశ నుండి జీవితాన్ని ప్రారంభించుకోవాలి. త్రిశంకుని వృత్తాంతాన్ని బట్టి మానవ సమాజం నుండి బహిష్కృతుడైనవాడు చండాలుడు కావడాని ఎంతో సమయం పట్టదని స్పష్టమవుతుంది. శబలుడు, చండాల వాటికలలోని బహిష్కృతులైన వ్యక్తుల జీవితాలను పరిశీలిస్తే అలా ప్రారంభించుకోవడానికైనా ఈ నాగరిక సమాజం వారికి అవకాశం ఇవ్వదని తెలుస్తుంది. ఈ నాగరిక సమాజం అవకాశాలన్నింటినీ హరించివేస్తుంది. దేనిని చేతికి చిక్కనివ్వదు. సర్వ ప్రకృతిపైనా గుత్తాధిపత్యం సంపాదించుకుంది ఈ నాగరిక సమాజం. ఇదే అణచివేత.

ఆధునిక కాలంలో కూడా ప్రకృతి వనరులు కొందరి చేతుల్లో కేంద్రీకృతం కావడం మనం చూస్తున్నాం. అటవీ సంపదకు నిజమైన వారసులైన గిరిజనులు పెట్టుబడిదారులు, పాలకుల చేతిలో ఏ విధంగా మోసపోయి, వారి ఆవాసాలకు దూరంగా నెట్టివేయబడుతున్నారో మనం చూస్తున్నాం. ప్రాచీన కాలం నాటి అణచివేతకు కొనసాగింపే ప్రస్తుత సమాజంలోని ధనక పేద, పెట్టుబడిదారుడు శ్రామికుడు, ఉన్నత నిమ్న కులాలు అనే తారతమ్యాలూ, వాటి మధ్య ఘర్షణలని స్పష్టమవుతుంది.

"పట్టణాలలో, జనపదాలలో ఎంతో ముందుకు సాగిపోయిన నాగరికత ఈ చండాలవాటికలో ఇప్పుడిప్పుడే లేచి తప్పటడుగులు వేస్తూ ఉంది" అని రచయిత అన్న మాటలు నేటికీ మానవ నాగరికతకు దూరంగా అడవులలో, దీవులలో నివసించే ఆదిమ సమాజాల విషయంలో యథార్థం.

వర్ణభేదం లేకుండా ఎవరైనా చేసుకుంటూపోతున్న పనిని ఒక వర్గానికి పరిమితం చేయడం మంచిది కాదని రచయిత ఈ నవల ద్వారా వివరించారు. ఏ వృత్తి అయిన ఒకే వర్గానికి పరిమితం కావడం వల్ల ఆ వృత్తి బాగుపడుతుంది. దాని నైపుణ్యం, సౌందర్యం పెరుగుతుంది. కాని దానిని చేపట్టిన వ్యక్తుల స్థాయి సమాజంలో దిగజారిపోతుంది.ఆ వర్గంవారు అణగారి పోతారు. ఇది సమాజానికి ప్రమాదకరం. ఈ నవలలో రేవణుడి ముత్తాత

వ్యవసాయం చేసేవాడు. రేవణుడి తాత పశుపోషణ చేశాడు. రేవణుడి తండ్రి క్షురకర్మ నేర్చుకుంటాడు. కొడుక్కూ ఆ పనే నేర్పుతాడు. ఈ రెండవ తరానికే రేవణుడిది క్షురక వంశం అని ముద్ర పడిపోతుంది. ఇది వృత్తి నైపుణ్యానికి మంచిది కావచ్చు. కానీ వ్యక్తులకు ప్రమాదకరం. పూర్వం కొందరు వ్యక్తులకు చర్మకార వృత్తి వంటి వాటిని అప్పగించారు. వారు ఆ వృత్తి పని నెరవేర్చే క్రమంలో గ్రామాలకు దూరంగా నివశించవలసి వచ్చేది. ఇలా ఎక్కువ కాలం అపరిశుభ్రమైన పనిలో ఉండటం వల్ల ఇతరులు వారిని అస్పృశ్యులుగా చూడటం జరిగింది. క్రమంగా వారిపై బాహ్యులుగా,అస్పృశ్యులుగా ముద్రపడి ఇప్పటికీ వారు అణగారిన వర్గాలుగానే మిగిలిపోయారు. ప్రస్తుత సమాజాన్ని చీడపురుగుల తొలిచివేస్తున్న ఈ అస్పృశ్యతకు మూలకారణాన్ని రచయిత ఈ నవలలో వివరించే ప్రయత్నం చేశారు.

మహాకవి శ్రీశ్రీ " వ్యక్తికి బహువచనం శక్తి" అన్నారు. పిళ్ళెగారు కూడా ఈ నవలలో అస్పృశ్యులు సమాజంలో తమ స్థాయిని మెరుగు పర్చుకోవాలంటే వారు సంఘంగా ఏర్పడటమే పరిష్కారమని వివరించారు. "చండాలుడు ఒంటరిగా ఉంటే బహిష్కృతుడే కాని కొందరు చండాలురు ఒక సంఘంగా ఏర్పడితే వాళ్ళ బహిష్కరణలో కొన్ని సవరణలూ, సడలింపులూ ఏర్పడతాయి. సంఘంలో జనశక్తి ఉంటుంది. అది కూడా కారు చౌకగా లభిస్తుంది. అది సమాజానికి కావాలి. అదీ మానవ సంఘమంటే" అని రచయిత సంఘానికి నిజమైన నిర్వచనం ఇచ్చారు.

శబలుడు బ్రాహ్మణ స్త్రీకి, శూద్రునికి పుట్టడం వల్ల చండాలుడు అయ్యాడు. త్రిశంకుడు వసిష్ఠుని శాపం వలన చండాటుడు అయ్యాడు. ఇద్దరూ కొంత కాలం కలిసి జీవించారు. ఇద్దరూ ఒకే ఆహారం తిన్నారు, ఒకే దగ్గర నిద్రించారు. కాని విశ్వామిత్రుడు త్రిశంకుని మాత్రమే శాప విముక్తుడిని చేస్తాడు. శబలుడు తన పూర్వ కర్మ ఫలం అనుభవించాలని చెబుతాడు. " అగ్రవర్ణస్తుడు ఎన్ని తప్పులు చేసినా అగ్రవర్ణస్తుడే అయిపోయాడు. చండాలుడు చండాలుడుగానే ఉండిపోయాడు. వర్ణవభేదం కానీ వర్గవిభేదం కానీ కేవలం ప్రయోజనాపేక్షితాలే" అని రచయిత కులవ్యవస్థ వెనుక అంతర్గతంగా ఉన్న స్వార్థ ప్రయోజనాన్ని పాఠకుల ముందుంచే ప్రయత్నం చేశారు.

ఇలా రచయిత త్రేతాయుగం నాటి వస్తువును తీసుకొని పంచమవర్ణ ఆవిర్భావాన్ని వివరించినప్పటికీ,ఈ నవలలో అనేక అంశాలు ప్రస్తుత కాలానికి కూడా వర్తిస్తాయి.

ఉపయుక్త గ్రంథాలు :

1. చండాలుడు నవల - కరణం బాలసుబ్రహ్మణ్యం పిళ్ళె, మదనపల్లె, ప్రథమ ముద్రణ ఫిబ్రవరి 2007
2. భగవద్గీత(తెలుగు అనువాదం) - మొదలి వెంకట సుబ్రహ్మణ్యం, హైదరాబాద్, 2011
3. మనుస్మృతి(తెలుగు అనువాదం) - డా॥నల్లందిఘుళ్ లక్ష్మీనరసింహాచార్యులు,వరంగల్, 2000.

⌘⌘⌘

కందుకూరి 'బ్రహ్మ వివాహం' – సాంఘిక విశ్లేషణ

– డా॥. కిలారి గౌరినాయుడు, పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం.

ఆధునికాంధ్ర సాహిత్యంలో అనేక ఇతర ప్రక్రియల లాగనే ప్రహసన రచన వీరేశలింగం గారితోనే ప్రారంభం అయింది. ఆనాడు సంఘంలో కనబడుతున్న అనేక దురాచారాలను రూపుమాపడానికి ఆయన ప్రహసన రచనకు ఉపక్రమించారు. ఆనాడు మితిమీరివున్న లంచ గొండితనం, వేశ్యాలోలత్వం, వృద్ధ వివాహం, కన్యా శుల్కం, మతమౌడ్యం, ప్రభుత్వ ఉద్యోగుల్లో అవినీతి మొదలైనవన్నీ ఆయన ప్రహసనాల్లో చోటు చేసుకున్నాయి.

గురజాడ అప్పారావు గారు తన కన్యాశుల్కం పీఠికలో వీరేశలింగం సంపుటాలన్నింటిలో ప్రహసన సంపుటమే తనను చాలా ఆకర్షించిందనీ, అదే ఆయన ప్రశస్త రచనా సంపుటంగా తాను భావిస్తున్నాననీ చెప్పారు. సంఘంలో వున్న వివిధ దురాచారాలను వెల్లడి పరిచి వాటిని రూపు మాపాలనే ఉద్దేశముతో వినోద రూపకముగాను ప్రహసన రచనకు పూనుకున్నానని వీరేశలింగంగారు స్వీయ చరిత్రలో చెప్పారు. తన ప్రహసనాలలోని పాత్రలన్నింటిని పంతులుగారు ఆనాటి సజీవ సమాజం నుండే స్వీకరిం చారు. ఆనాటి స్వార్థపరుల బండారాల్ని, దుర్మార్గాలని ఆయన ప్రహసనాల ద్వారా బట్టబయలుచేశారు. ఆనాడు తాను చూసిన సమస్త హేయ ప్రవృత్తులను ఆయన కటువుగా విమర్శించటమేకాక సందర్భాన్ని బట్టి మెత్త మెత్తగా చీవాట్లు పెట్టారు.

వివేక వర్ధినికి అనుబంధంగా వెలువడిన "హాస్య సంజీవని" పత్రికలో బ్రహ్మ వివాహం మొదట కొంత భాగం ప్రకటింపబడినది. ఆ కాలమున జనులు సాధా రణముగా బ్రహ్మ వివాహమును "పెద్దయ్య గారి పెండ్లి పుస్తకము" అని వ్యవహరించేవారు. "ఈ గ్రంథమును నేను కేవల వినోదము కొరకు మాత్రమే కాక అతి బాల్య వివాహము, వృద్ధ వివాహము, కన్యాశుల్కం మొదలైన దురాచారముల వలన అనర్థకములను చూపి జనులను వాని నుండి విముఖులను జేయు తలంపుతో గూడ వ్రాసితిని" అని వీరేశలింగం గారు చెప్పారు. ఒక్క మాటలో చెప్పాలంటే బ్రహ్మవివాహం నాటి అతి లోప భూయిష్టమైన వివాహ వ్యవస్థకు దర్పణం అని చెప్పవచ్చు. ఇందులో వీరేశలింగం చెప్పదలచిన ప్రధాన దురాచారం కన్యాశుల్కం అయినా ఇందులో వ్రాయబడిన ప్రతి వాక్యము ఏదో ఒక దురాచారాన్ని వెల్లడి చేస్తుంది.

కథానాయిక చిన్నమ్మ రెండేళ్ళు నిండిన పిల్ల. తండ్రితో పాటు తల్లి అజ్ఞానమ్మ కూడా తన అచ్చట ముచ్చట చూసుకోవాలని బంధువైన పుల్లయ్యను కుమార్తెకు సంబంధం చూడమని అడుగుతుంది. తాను చని పోతామోనని భయం వ్యక్తం చేసి తాను బ్రతికుండగానే కార్యం చక్కబెట్టమంటుంది. రెండేళ్ళు నిండిన పిల్లను కామశాస్త్రి అనే ఇరవై ఏళ్ళ వరుడి కిమ్మని బంధువు సంబంధం చెప్పగా పిల్లతండ్రి ధనాల కామయ్య "నా మనసుకు ఈ సంబంధం ఎంత మాత్రం బాగా వున్నది కాదు. మాన్యాలా! మళ్ళా! ఏమి ఉన్నవి. తండ్రి పది రూపాయలు తెస్తే వాటితో జీవనం చేస్తూ ఉన్నారు. పట్టుమంటే యిప్పుడు తేలేరు. ఇకనెప్పుడో పిల్లవాడు ఉద్యోగం సంపాదించి గడించి పెడతాడని యిప్పుడు నోట్లో వేలుపెట్టుకొని కూర్చోవలెను. అవతల గడిస్తాడో లేడో ఎవరు చూచారు? కీడెంచి మేలెంచమన్నాడు. ఒక వేళ గ్రహచారం చాలక పిల్లవాడు కాలం చేసిన తరువాత చిన్నది పూట కూటికి గతి లేక యావజ్జీవమూ మా ప్రాణాల కుసూరుమని ఏడుస్తూ ఉంటుంది. ఆ పిల్ల బ్రహ్మత్య వచ్చి నాకు చుట్టుకుంటుంది. చూస్తూ-చూస్తూ పిల్ల దాని గొంతుక ఎట్లాకొయ్యను! నాకీ సంబంధం పనికి రాదు" అంటాడు. రెండేళ్ళు నిండిన పిల్లను ఇరవై ఏళ్ళ

యువకుడికిచ్చి వివాహం చేయడానికి అతండ్రి చెప్పిన అభ్యంతరం వయోభేదం కాదు. అతడు అంత సంపన్నుడు కాడని సంతృప్తికరంగా కన్యాశుల్కం ఇవ్వ లేడని మాత్రమే. ఒక వేళ వరుడు కాలం చేసినా తన కుమార్తె వితంతువు అవుతుందని విచారం లేదు. మళ్ళు మాన్యాలు లేవు కనుక కూటికి గతి లేక యావజ్జీవము తనపై ఆధారపడి ఉంటుందేమోనని ఆనాటి వివాహేయమైన వివాహ వ్యవస్థకు ఇది ప్రతీక.

ఈ ప్రహసంలోని పాత్రల పేర్లు వాటి స్వభావాలకు చక్కగా అతికేటట్లుగా ఉంచారు. ధనాల కామయ్య తన కుమార్తెకు తన కంటే పెద్దవాడు నాల్గవ పెళ్ళివాడు అయిన పెద్దయ్య సంబంధం ప్రసక్తి తేగా బంధువులైన పిచ్చయ్య పుల్లయ్యలు తమలో తాము రహస్యంగా...

పిచ్చయ్య :

(తనలో) పెద్దయ్య గారికి వివాహ మహోత్సవం కంటే దినవార మహోత్సవం చేస్తే బాగా వుంటుంది. పుల్లయ్య (రహస్యంగా) పెద్దయ్య పెళ్ళిపాలకీ యెక్కడం కంటే యేడు కట్ల పాలకి ఎక్కి వూరేగితే దివ్యంగా వుంటుంది" అనుకుంటారు. పాడె ఎక్కాల్సిన వయసులో కూడా వివాహం చేసుకోవానికి సంకోచం లేనివారు, అలాంటి వారికి పసిపిల్లను కట్టబెట్టడానికి సందేహించని వారు జీవించివున్న మూఢ సమాజం అది.

పరమేశ్వరరావధానులు పెద్దయ్యతో "మగవాళ్ళకేమి? రేపీపాటికి చక్కగా మళ్ళీ భార్య వస్తుంది. పదమూడో నాడే వివాహ కార్యం జరగడానికి ప్రయత్నం చెయ్య వలసినది చేసినారు కారు. ఇక మూడో నెల దాటకుండా నైనా శుభకార్యం జరగటానికి తగిన ఆలోచన చేస్తూ ఉన్నారు కదా?" పరమేశ్వరవధానులు వంటి స్వార్థ పరులు చావుకు సిద్ధంగా ఉన్న వృద్ధుల్ని సైతం వివాహానికి సుముఖులుగా చేయడానికి ముఖస్తుతులు చేస్తుండే వారు.

పెద్దయ్య తనకు కామం ఉడిగిపోయిందని చెప్తే నీలకంఠ సోమయాజులు తొంభై ఏళ్ళు దాటిన బులుసు బుచ్చయ్య శాస్త్రి మూడేళ్ళ పిల్లను వివాహం చేసు కున్నాడని, భూమి మీద పేరు నిలపటానికి, అగ్ని హోత్రాలకు భంగం కలగకుండా ఉండటానికి సంసార ధర్మంలో భార్య అని ఒకతే ఉండాలని చెప్తాడు. ఆనాటి సమాజంలో స్త్రీ స్థానం వివాహ వ్యవస్థ పట్ల వారికున్న అతి చులకన భావం వ్యక్తమవుతుంది.

మధ్యవర్తి వచ్చి కామయ్య కుమార్తెను ఇవ్వటానికి పన్నెండు వందలకు బేరం కుదుర్చుకు వచ్చానని కాని పిల్ల తల్లిదండ్రులు పరువుగా బ్రతికిన వారు కాబట్టి ఇచ్చిన మాట ఎక్కడా బయటపడకుండా రహస్యంగా ఉంచాలని పెద్దయ్యతో చెప్తాడు. శుల్కం తీసుకోవడం పరువు తక్కువ పని అయినా డబ్బు మీద ఆశతో వాళ్ళు పుచ్చుకోవటం ఆ బలహీనతను ఆసరాగా తీసుకొని మధ్యవర్తులు రహస్యమంటూ కొంత డబ్బు తాము సంగ్రహించటం ఇవి ఆనాటి వివాహ వ్యవస్థలో సర్వ సామాన్యాలు. పెళ్ళి వేడుకలన్నీ ముగిసాక కామయ్య యింతకాలం బ్రతుకుతాడని తెలిస్తే పిల్లదాన్ని యిస్తున్నా" అంటాడు.

అజ్ఞానమ్మ "ఇకనైనా పెద్దయ్య వేగిరం చస్తే బాగా ఉండును. ఆ పిల్లది యెదిగి డెబ్బయి ఏళ్ళ ముండా కొడుకుతో కాపురం చేసి యేడుస్తుందా ఏమిటి?" కామయ్య "మొన్న సీతారామస్వామి వారి కోవెలకు వెళ్ళినప్పుడు పెద్దయ్య వేగిరం పోతే గరుడ వాహనం చేయిస్తానని మొక్కుకున్నాను" పూటకూటి ఇంటిలోని వీధి అరుగు మీద పైడిపాటి పాపవధాన్లు, బంధకవి భానుమూర్తిల సంభాషణలో చిన్నమ్మ రజస్వల కాకముందే శోభనం జరిపించటం, పెళ్ళి అయిన పదేళ్ళకు పెద్దయ్య మరణించటం, అతని మరణానంతరం తల్లిదండ్రులు ఆస్తుల కోసం కోర్టులో వ్యాజ్యాలు వేయటం, న్యాయాధి కార్లు లంచాలు పుచ్చుకోవటం, న్యాయాన్ని వేలం పాడిం చటం, వయసులో ఉన్న ప్లీడరు చిన్నమ్మను రహస్యంగా కలుసుకోవటం, పుత్ర సంతానం కలగటం, చెరువుగట్టు మీద చంపబడ్డ మగశిశువు మొహంలో చిన్నమ్మ

పోలికలున్నాయని లోకులు అనుకోవటం మొదలైన సంఘటనల్ని ఇందులో చెప్పబడ్డాయి.

బాల్యవివాహ ఫలితంగా కోర్కెలు తీరని చిన్నమ్మ పురుషులతో విచ్చలవిడిగా ప్రవర్తిస్తుంటే ఒక మంత్రవేత్త ఆమెను వశపరచుకొని ధనం అపహరించిపోగా జీవనం కష్టమయిన చిన్నమ్మ అటుకులు తింటూ జీవితం వెళ్ళదీస్తుంది. కాని ఒక సారి విశృంఖలతకు అలవాటు పడ్డది కావటం చేత తన విశృంఖల జీవితానికి ఆటంక మని భావించి పూట కూటింటి యజమానురాలిగా డబ్బు గడిస్తూ దూర ప్రాంతాల నుండి వచ్చిన పురుషులను సంతృప్తిపరుస్తూ ఉంటుంది. అనేకమంది వైద్యులు మిత్రులగుట చేత గర్భధారణ జరిగినా తొమ్మిది నెలలకు మూడో వంతున గర్భస్రావాలు జరుగుతున్నాయి. చిన్నమ్మ ఎంతగా చెడిపోయిందో చెప్పడానికి కొందరు స్త్రీలను జీతానికి కుదుర్చి పడుచుకత్తెలను పనిలో పెట్టుకోవటం, ఇరుగుపొరుగు ఇళ్ళలోని స్త్రీలను తన మార్గంలో పెట్టటం నిదర్శనం.

ఆనాటి వివాహవ్యవస్థలోని అతి బాల్య వివాహమనే దురాచార ప్రభావం చేత ఒక స్థితి నుండి వేరొక స్థితికి చివరకు చిన్నమ్మ జీవితం అధ:పతనం కావడానికి దోహదమైంది. వీరేశలింగం గారు ఈ విషయాన్ని భానుమూర్తి పాత్రచే ప్రహసనం చివర సందేశంగా చెప్పించారు.

భానుమూర్తి "ఇటువంటి నష్టాలన్నీ తల్లిదండ్రులు డబ్బుకాశపడి కడుపున పుట్టిన బిడ్డలను ముసలివాళ్ళకు కట్టబెట్టటం చేత కలుగుతూ ఉన్నవి. కన్యాశుల్కం పుచ్చుకునే వార్ని పదిమందే చేరి వెలివేస్తే బహు నష్టాలు మాని పోతాయి" అని సందేశాత్మకంగా చెప్తారు. మొత్తం మీద పంతులుగారి బ్రహ్మవివాహ ప్రహసనం ఆనాటి వివాహ వ్యవస్థలోని లోపాల్ని కళ్ళకు కట్టినట్లు మనముందుంచు తుంది. వీరేశలింగం గారి ఈ ఒక్క ప్రహసనం ఆనాటి మితిమీరిన ఒక సాంఘిక దురాచారాన్ని దుయ్యబడుతూ ప్రతిబింబింప చేస్తుంది.

⌘⌘⌘

BHAVAVEENA
Vol. 17, Issue. 8, August 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

కవిత్రయ మహాభారతం – నామాల విశ్లేషణ

– తోట వెంకటస్వామి, సహాయ సంపాదకులు, ప్రచురణల కేంద్రం, ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం.

ఆధునిక భాషాశాస్త్ర విభాగాలలో నామ విజ్ఞానం ఒకటి. నామాలను గురించి అన్ని కోణాలలో శాస్త్రీయంగా అధ్యయనం చేయటం నామ విజ్ఞానశాస్త్ర లక్ష్యం. ఈ శాస్త్రపు పరిధి బహు విస్తృతమైనది. భౌగోళిక సాంస్కృతిక చారిత్రక నేపథ్యంలో నామాలను పరిశీలించటం ఈ శాస్త్రంలో భాగం. పురాతత్త్వశాస్త్రంలో ప్రాచీన అవశేషాలకు ఎంత విలువ ఉన్నదో సాంస్కృతిక అధ్యయనంలో నామాలకు కూడా పరిశోధనాత్మక విలువ ఉంది. ఈ నామ విజ్ఞానాన్ని ప్రధానంగా రెండు రకాలుగా భాషాశాస్త్ర వేత్తలు వింగడించి విశ్లేషించారు. అవి- 1. స్థలనామ విజ్ఞానం (Topnomastics), 2. వ్యక్తినామ విజ్ఞానం (Anthroponomastics). వ్యక్తినామాలను, స్థలనామాలను, పశుపక్ష్యాదుల పేర్లను, వృక్షాల పేర్లను ప్రకృతిలో కనిపించే అన్నిటి పేర్లను గురించి అధ్యయనం చేయటం అంటే మానవజాతి సంస్కృతి, నాగరికతల వికాసాన్ని గురించి తెలుసుకోవటమే. ఇలా నామాలను పరిశీలించటమంటే మన సంస్కృతిని గురించి తెలుసుకోవటమే. మహాభారతంలోని నామాల విశేషాలను పరిశీలించటమే ప్రస్తుత నా వ్యాస ఉద్దేశం.

ఒకే పేరుగల భిన్నవ్యక్తులు :

లోకంలో ఒకే పేరుతో భిన్న వ్యక్తులు తారసపడతారు. వాళ్ళందరి గుణగణాలు ఒకేవిధంగా ఉంటాయని చెప్పలేం. అలాగే భారతంలో కూడా ఒకే విధమైన పేర్లుగల భిన్నవ్యక్తులు కనిపిస్తారు. ఉదాహరణకు అంగరాజు. అంగదేశానికి అధిపతి అయినవాడు అనే అర్థంలో దీనిని గమనించాలి. అంగదేశానికి భిన్న కాలాలలో భిన్న వ్యక్తులు రాజ్యం చేయటంవలన వారికి ఆ పేరు సార్థకమే అవుతుంది. ధర్మరాజు రాజసూయ యాగానికి వచ్చి కానుకలు సమర్పించిన అంగరాజు ఒకడైతే, దుర్యోధనుడివలన అంగరాజ్యాన్ని పొంది అంగదేశానికి రాజైన కర్ణుడు మరొకడు. ఇద్దరూ అంగరాజులే. కర్ణుడికి పూర్వం ఆ దేశాన్ని పరిపాలించిన అంగరాజు ఒకడు. కర్ణుడి పట్టాభిషేకంతో కర్ణుడే అంగరాజయ్యాడు. కర్ణ శబ్దంతో ధార్తరాష్ట్రులలో, కిరాత రాజులలో కూడా వ్యక్తులు కనిపిస్తారు. ఈ పదాలన్నింటికి వ్యుత్పత్తి అర్థం ఒకటే.

ఉగ్రసేనుడు అనగానే మనకు కంసుని తండ్రియే కనిపిస్తాడు. కాని ధృతరాష్ట్రునికి గాంధారియందు జన్మించిన ఉగ్రసేనుడు ఒకడు. పరీక్షిత్తుకు జన్మించిన సంతానంలో నాల్గవవాడైన మరో ఉగ్రసేనుడు కన్పిస్తాడు. ఇతడు జనమేజయునికి సోదరుడు. గంధర్వులలో మరో ఉగ్రసేనుడు కనిపిస్తాడు. యాదవ రాజులలో మరొక ఉగ్రసేనుడు కనిపిస్తాడు. ఈ పేరు వాళ్ళ శౌర్య లక్షణాల్ని బట్టి పెట్టిన పేరుగా వ్యుత్పత్తిని బట్టి మనం గమనించవచ్చు.

జయంతుడు అనగానే అత్యంత సౌందర్యవంతుడైన ఇంద్రుని కుమారుడే మన స్మృతిపథంలో మెదులుతాడు. పాండవులు అజ్ఞాతవాస కాలంలో తమలో తాము రహస్యంగా మెలగటానికి భీముడికి పెట్టుకున్న పేరు జయంతుడు. అలాగే కురుక్షేత్రయుద్ధంలో పాండవులవైపు యుద్ధంచేసిన పాంచాల దేశానికి చెందిన ఒక మహారథుడు కనిపిస్తాడు. ఈ పేరు 'జి-జయే' అనే ధాతు నిష్పన్నం. 'జయతి శత్రూనితి' అన్న వ్యుత్పత్తికి 'జిజయే సౌందర్యేణ సర్వానభి భవతీతి' అని చెప్పుకోవాలి. అంటే సౌందర్యంతోగాని శక్తిసామర్థ్యాలతో గాని శత్రువుని జయించేవాడు జయంతుడని తాత్పర్యం.

అలాగే ధృతరాష్ట్రుడనగానే జాత్యంధుడైన దుర్యోధనుని తండ్రి మన స్మృతిపథంలో మెదలుతాడు. కాని శల్యపర్వంలో మరొక ధృతరాష్ట్రుడు కనిపిస్తాడు. అతను

బకుడనే మునిని అవమానించి చెడిపోయి తిరిగి మళ్ళీ ఆ మునిని ప్రసన్నం చేసుకొని తరుణోపాయాన్ని పొందుతాడు. ఇద్దరి వ్యక్తిత్వం ఒకటిగానే కనిపిస్తుంది. అందువల్ల ఆ పదానికి ఉన్న ''ధృతం రాష్ట్రం యేన సః'' అనే వ్యుత్పత్త్యర్థం ఇద్దరికీ సరిపోతుంది.

భీమ శబ్దం విశేషణంతో కలిసి 12 మందికి పేర్లుగా కనిపిస్తుంది. వారిలో భీమసేనుడు, భీముడు అనే పేర్లతో ఆరుగురు కనిపిస్తారు. భీమసేనుడు, భీముడు, భీమబలుడు సమానార్థకాలుగానే ప్రయోగించడం కనిపిస్తుంది. దమయంతి తండ్రిని భీమకుడని, భీమసేనుడని, భీముడని ప్రస్తావించడం కనిపిస్తుంది. కౌరవ సంతానంలో భీమబలుడు, భీమబాహుడు, భీమరథుడు, భీమవేగుడు, భీముడు అనే ఐదుగురు కనిపిస్తారు. ఈ ఐదుగురి పేర్లలో భీమశబ్దం సాధారణమే అయినప్పటికి భీమబాహుడు, భీమరథుడు, భీమవేగుడు విశేషణాలను పృథక్ లక్షణాలుగల బలసంపన్నులని విదితమౌతుంది. వీరుకాక తపుడనే అగ్ని కుమారుడైన భీమబలుడు కనిపిస్తాడు. భీమబలుడు, భీముడు సమానార్థకాలే. ఒక్క భీమసేన శబ్దంతో నలుగురు కనిపిస్తారు. చంద్రవంశంలోని శంతనుడి తండ్రి ప్రతీపుడి పితామహుడైన భీమసేనుడు ఒకడు, అభిమన్యుడి కుమారుడైన పరీక్షితునకు మద్రవతియందు కలిగిన మూడవ కుమారుడు భీమసేనుడు మరొకడు. పాండవులలో భీముడు దమయంతి తండ్రి భీమసేనులుగా కనిపిస్తారు. వీళ్ళ పేర్ల తాత్పర్యార్థం ఒకటే. ఒకరు దేహ బలసంపన్నులైతే మరొకరు సేనా బల సంపన్నులు.

ఒకే పేరుగల ఇద్దరు వ్యక్తులు ఏకకాలంలో ఉన్నప్పుడు ప్రత్యేక గుర్తులతో వ్యక్తులను పిలుస్తాము. వసుదేవుని కుమారుడైన వాసుదేవుడు ఉన్న కాలంలో పౌండ్రక దేశాధిపతి కూడా వాసుదేవ శబ్దాన్ని తన పేరులో ధరించి నేనే నిజమైన వాసుదేవుణ్ణి అని శ్రీకృష్ణుడిని వాసుదేవుడుగా పిలువరాదని తన దేశంలో చాటింపు వేయించాడు. ఇతని గురించి చెప్పాల్సివచ్చినప్పుడు పౌండ్రక వాసుడని లోకం పిలిచింది.

ఒకే గోత్రంలో పుట్టినవారిని అదే పేరుతో వ్యవహరించటం :

లోకంలో వ్యక్తుల్ని ఉద్దేశించి ప్రత్యక్షంలోగాని పరోక్షంలోగాని మాట్లాడేటప్పుడు ఫలానా వంశంలో పుట్టినవాడని మంచి సందర్భంలోనైనా, చెడు సందర్భంలోనైనా ప్రస్తావించటం మనం గమనించే విషయమే. అలాగే ఒకే గోత్రంలో పుట్టినవారిని ఆ గోత్ర సంభవునిగా వ్యవహరించినప్పుడు ఒకే పేరుండటం సహజం. అలా భారతంలో కాశ్యపుడు, కౌశికుడు, గౌతమి, గౌతముడు, భారద్వాజుడు, యాదవుడు, వైఖానసుడు వంటిపేర్లు కనిపిస్తాయి. వంశాన్ని ఉద్దేశించి చెప్పినప్పుడు ఇక్ష్వాకుడు (ఇక్ష్వాక వంశీయుడు), కాకుత్థుడు (కకుత్థ వంశీయుడు - శ్రీరాముడు), పౌలస్త్యుడు (పులస్తుని వంశీయుడు), భార్గవి (భృగు వంశీయురాలు), భార్గవుడు (భృగు వంశీయుడు), యాదవుడు (యదువంశీయుడు), రాఘవుడు (రఘు వంశీయుడు), వార్ష్ణేయుడు (వృష్ణి వంశీయుడు), శైనేయుడు (శిని వంశీయుడు), శౌరి (శూరుని వంశీయుడు), మాధవి (మధువు అనే యాదవ వంశంలో జన్మించడం చేత కుంతిని మాధవి అని పేర్కొనడమైంది).

ఒకే దేశస్థులను అదే పేరుతో వ్యవహరించటం:

భారతదేశానికి సంబంధించిన పౌరులనందరిని భారతీయులు అన్నట్లుగానే ఒకే దేశస్థులను, ఆ దేశానికి చెందినవాళ్ళు అని చెప్పే సందర్భంలో ఆ దేశస్థులందరినీ స్థూలంగా ఒకే పేరుతో వ్యవహరించటం లోకంలో ఉన్నదే. అలాగే భారతంలో కూడా మాగధుడు (మగధ దేశానికి చెందినవాడు), పాంచాలుడు (పాంచాల దేశానికి చెందినవాడు), వైదేహుడు (విదేహ దేశానికి చెందినవాడు), పౌండ్రుడు (పుండ్ర దేశానికి సంబంధించిన వాడు), సైంధవుడు (సింధూదేశానికి చెందినవాడు), చైద్యుడు (చేది దేశానికి చెందినవాడు) వంటి పేర్లతో ఆ దేశపు రాజులను, పౌరులను ఉద్దేశించి చెప్పటం కనిపిస్తుంది. ఇలా దేశంతో ముడిపెట్టి చెప్పే సందర్భంలో ఒకే పేరుతో భిన్నమైన వ్యక్తులు కనిపిస్తారు. దానికి కారణం

వారంతా ఆయా దేశాలకు చెందినవారు. భారతీయుడు అంటే ఏ ఒక్క వ్యక్తో కానట్లే పై పేర్లు కూడా భిన్న వ్యక్తులకు ఆయా దేశాలకు చెందిన వ్యక్తుల సంకేతంగా పేర్కొనటం భారతంలో కనిపిస్తుంది. పాంచాలి, మాద్రి, గాంధారి, కౌసల్య, కైకేయి, వైదర్భి వంటి స్త్రీల పేర్లు కూడా ఆయా దేశాలకు ముడిపెట్టి చెప్పినవే. కాని రూఢ్యర్థంగా పాంచాలి అంటే ద్రౌపది అని, మాద్రి అంటే పాండురాజు ద్వితీయ కళత్రమని, గాంధారి అంటే ధృతరాష్ట్రుని పట్టమహిషి అని కౌసల్య అంటే శ్రీరాముని తల్లి అని, కైకేయి అంటే దశరథుని భార్య అని ప్రసిద్ధి. కాని ఆయా దేశాలకు చెందిన రాకుమార్తెలను, స్త్రీలను పై పేర్లతో పిలువవచ్చు.

అపత్యార్థంలో తల్లిదండ్రులతో ముడిపెట్టి వ్యవహరించటం :

లోకంలో ఫలానా వాళ్ళ అబ్బాయి, అమ్మాయి అని పిలిచినట్లే భారతంలో కూడా అపత్యార్థంలో స్త్రీ, పురుష లిద్దరిని తల్లితోనో తండ్రితోనో ముడిపెట్టి చెప్పటం కనిపిస్తుంది. ఉదాహరణకు అంజనేయుడు (అంజనీ కుమారుడు), అంబాలికేయుడు (అంబాలికా సంతానం), అంబికేయుడు (అంబ సంతానం), ఆదిత్యులు (అదితి సంతానం), దైత్యులు (దితి సంతానం), కార్తికేయుడు (కృత్తికల సంతానము) కాద్రవేయులు (కద్రువ సంతానం), కౌంతేయులు (కుంతీ కుమారులు), కౌంతేయుడు (కుంతీకుమారుడు), గాంగేయుడు (గంగ కుమారుడు), ద్రౌపది (ద్రుపదరాజకుమార్తె), ధార్తరాష్ట్రులు (ధృతరాష్ట్రుని సంతానం), పార్థుడు (పృథ సంతానం), పార్వతి (పర్వత పుత్రి), వాసుదేవుడు (వసుదేవుని కుమారుడు), వైశ్రవణుడు (విశ్రవసుని కుమారుడు), శాంతనవుడు (శంతనుని కుమారుడు), శాకుంతలుడు (శకుంతల కుమారుడు), శాక్తేయుడు (శక్తి కుమారుడు- పరాశరుడు), శారద్వంతుడు (శరద్వంతుని కుమారుడు-కృపుడు), సాత్యవతేయుడు (సత్యవతి సంతానమైన వ్యాసుడు), మొదలైనవి. ఇలా చెప్పటం తద్ధిత పద్ధతిగా వ్యాకరణ వేత్తలు చెపుతారు.

ఒకే వ్యక్తిని భిన్న-మైన పేర్లతో వ్యహరించటం :

ఒక వ్యక్తికి లోకంలో ఒకే పేరుండటం సహజమే అయినప్పటికీ ఆ వ్యక్తి గుణాన్ని బట్టి, చర్యలను బట్టి, వ్యవహారాన్ని బట్టి భిన్నభిన్నమైన పేర్లతో వ్యవహరించటం కనిపిస్తుంది. ఉదాహరణకు భారతదేశ ప్రధాని పదవి నిర్వహిస్తున్న వ్యక్తిని గురించి ప్రస్తావించేటప్పుడు ప్రతిసారీ భారత ప్రధాని నరేంద్రమోడి అని చెప్పరు. మన ప్రధాని అనే అంటారు. అంటే ప్రధానిగా వేరే వ్యక్తులు లేనందున ప్రధాని అంటే వెంటనే నరేంద్రమోడినే స్ఫురిస్తాడు. అదే మరొక వ్యక్తి ఉన్నప్పుడు ప్రత్యేకించి చెప్పవలసి ఉంటుంది. అలాగే ప్రసిద్ధ వ్యక్తులకు వారు నిర్వహించిన పదవులను బట్టి, గుణశీలాదాలను బట్టి ప్రధానమైన పేరుతో పాటు పర్యాయంగా వ్యవహరించే పేర్లుకూడా ఏర్పడతాయి. అలాగే భారతంలో ప్రసిద్ధ దేవతలు, దిక్పతులు, వ్యక్తులకు కూడా పర్యాయంగా వ్యవహరించే కొన్ని నామాలు కనిపిస్తాయి. ఉదాహరణకు యమునికి భారతంలో కనిపించే పర్యాయపదాలు అంతకుడు, కాలుడు, కీనాశుడు, కృతాంతుడు, జముడు, దండధరుడు, ధర్మదేవత, ధర్మరాజు, పితృపతి, యమరాజు, యముడు, శమనుడు, సమవర్తి, పాశపాణి ఇవన్నీ యమధర్మరాజు వ్యక్తిత్వాన్ని, వేష భూషలను తెలియజేస్తుంది. అంతకుడు, కృతాంతుడు అనే పేర్లు యమధర్మరాజు వృత్తిని తెలియజేస్తే, ధర్మదేవత, సమవర్తి, శమనుడు అనే పేర్లు అతని వ్యక్తిత్వాన్ని తెలియజేస్తాయి.

ఇంద్రునికి పర్యాయపదాలుగా భారతంలో 70 పదాలు కనిపిస్తాయి. వాటిలో ఎక్కువగా స్వర్గాధిపతిగా, శచీవల్లభునిగా, దేవపతిగా, శతయజ్ఞకర్తగా, వజ్రధరునిగా తెలియజెప్పేవే కనిపిస్తాయి. కుశిక తనూజుడు, గిరిభేది, బలారి, నముచిసూదనుడు, పాకశాసనుడు వంటివి తక్కువగా కనిపిస్తాయి. ఇలా విష్ణువుకు, కృష్ణునికి, శివునికి మరియు ఇతర ప్రసిద్ధ దేవతలకు సంబంధించిన పదాలకు వివిధ పర్యాయపదాలు కనిపిస్తాయి. ఈ పర్యాయ పదాలన్నీ ఎక్కువగా ఆయా వ్యక్తుల శీలాన్ని

వ్యంజింపజేసే విశేషణాలే. ఉదాహరణకు అర్జునునకు ఉన్న పది పేర్లు అర్జునుని విశిష్ట వ్యక్తిత్వాన్ని తెలియ జెప్పేవే. కిరీటి, శ్వేతవాహన, ధనంజయ, సవ్యసాచి, జిష్ణుడు, విజయుడు అనే పదాలు అర్జునుని విక్రమత్వాన్ని తెలియజేస్తే పార్థుడు వంటి ఇతర నామాలు అతని వ్యక్తిగత వివరాలను తెలియజెపుతాయి.

పుట్టుక సందర్భాన్ని తెలియజేసే పేర్లు :

ఉదాహరణకు ఆనకదుందుభి, వసుషేణుడు, పరీక్షిత్తు. ఆనక దుందుభి అనేది వసుదేవునకున్న పేరు. వసుదేవుడు జన్మించినప్పుడు ఆకాశంలో ఆనకములు (తప్పెట్లు, భేరి, మద్దెల) దుందుభులు మోగాయి. అందుచేత వసుదేవునికి ఆనకదుందుభి అన్న పేరు వచ్చింది. అలాగే వసుషేణుడు అంటే కర్ణుడు. వసువు (బంగారం) తో కూడిన మంజూష (పెట్టె) లో అతిరథుడికి లభించినందున కర్ణునకు ఈ పేరు వచ్చింది. పరీక్షిత్తు ఉత్తర గర్భంలో ఉన్నప్పుడు అశ్వత్థామ ప్రయోగించిన బ్రహ్మశిరోనామకాస్త్రపు బారినుండి కృష్ణుడు సుదర్శనంతో కాపాడాడు. గర్భనుండి వెలువడగానే ఆ దివ్యతేజస్సుని పరీక్షగా వెతికాడని అందువలన అతనికి ఆ పేరు కలిగిందని భాగవతం చెపుతుంది. కాని వారసత్వం పరిక్షీణమయ్యే సమయంలో జన్మించినందున ఈతనికి పరిక్షిత్తు అన్న పేరు కలిగిందని భారతం పేర్కొంటుంది. (భార. అశ్వ. 3-200)

పుట్టుకను తెలియజేసే పేర్లు :

పైన పేర్కొన్న తద్ధిత ప్రత్యయ సహితమైన పేర్లులాగే కనిపించినప్పటికి వాళ్ళ పుట్టుకను తెలియజెప్పే ప్రత్యేక మైన పేర్లు కొన్ని కనిపిస్తాయి. ఉదాహరణకు ద్రౌపదిని ఉద్దేశించి అయోనిజ (నయోని జాయతీతి) అనటం. ద్రౌపదిని యజ్ఞంలో జన్మించింది. ఎవరి గర్భవాసాన జన్మించలేదు. అందువల్ల ఆమెకు అయోనిజ అనే పేరు సార్థకమైంది. అలాగే అగస్త్యుని ఉద్దేశించి కలశజుడు (కం జలం లా తీతి) అనటం, కౌరవపాండవుల విద్యాగురువైన అశ్వత్థామ తండ్రిని ద్రోణుడ (ద్రుణతీతి ద్రోణః)ని రూఢంగా పిలవటం, మన్మథుణ్ణి మనోజుడు (మనోర్జాతః) అనటం, పాండవాగ్రజుని ధర్మజుడు (యమధర్మరాజస్య అపత్యమ్) అనటం, అర్జునుడిని ఇంద్రజుడు (ఇందతీతి ఇంద్రః, ఇంద్రాత్ జాయతే ఇతి) అనటం, వ్యాసులవారిని కృష్ణద్వైపాయనుడు, పరాశరాత్మజుడు (కృష్ణ ఇవ యమునా ద్వీపస్య మహర్షేః గోత్రాపత్యమ్) పరాశరాత్మ జుడు అనటం, భీముడిని అనిలజుడు (అనంత్యనేనేత్య నిలః, అనిలస్య అపత్యమ్) అనటం, కంసుని తండ్రిని అహుకాత్మజుడు (అహిరివ కన్ స్వార్థేంఅణ్, అహుకస్య ఆత్మనః జాయతే ఇతి) అనటం, ఉత్తరుని విరాటాత్మ జుడు (విరటస్య ఆత్మని జాత) అనటం వాళ్ళ పుట్టుకతో ముడిపడిన వ్యక్తులను, సందర్భాన్ని ప్రస్తావించటమే. కౌరవులను కుండకులని, పాండవులను గోళకులని అనటం ఇటువంటిదే.

చంపిన శత్రునామంతో వ్యవహరించిన పేర్లు :

కంసారి (కంసస్య ఆరాతిః కంసుని శత్రువు - కృష్ణుడు), మురారి (మురం మర్దయతీతి. మురుని మర్దించినవాడు - కృష్ణుడు), ధుంధుమారుడు (బృహదశ్వపుత్రః - కువయాశ్వుడు) బకారి (బకాసురని సంహరించినవాడు - భీముడు), బలారి (బలాఖ్యస్య అసురస్య అరాతిః. బలాసురునికి శత్రువు-ఇంద్రుడు), ప్రలంబవైరి (ప్రలంబ మసురం హతవాన్, ప్రలంబుడను రాక్షసుని చంపినవాడు - బలరాముడు) మధుసూదనుడు (మధువనెడి రాక్షసుని సంహరించినవాడు-విష్ణువు) మొదలైనవి.

ధరించిన వస్త్రాలను బట్టి వ్యవహరించిన పేర్లు:

నీలాంబరుడు (నీలమంబరం వాసో యస్య సః, నల్లని వస్త్రము గలవాడు-బలరాముడు, శని), పీతాంబరుడు (పీతమంబరం యస్య సః. పచ్చని వలువగలవాడు - విష్ణువు), దిగంబరుడు (దిక్ అంబరం అస్యేతి దిగంబరః. దిక్కులు వస్త్రముగా గలవాడు. దిన మొలవాడు-ఈశ్వరుడు) మొదలైనవి.

గుణాలను వ్యంజింపచేసే పేర్లు :

తల్లిదండ్రులు తాము కన్న సంతానానికి మంచి పేర్లనే

ఎంపిక చేసి పెడతారు. ఆ పేర్ల వెనుక తల్లిదండ్రుల ఆకాంక్షలు ప్రస్ఫుటంగా కనిపిస్తాయి. అయితే ఆ పేర్లను సార్థకం చేసే గుణగణాలతో ఒప్పే సంతానం అరుదుగా కనిపిస్తాయి. అలా సార్థక నామధేయులైన సంతానం లభించటం ఒక విధంగా తల్లిదండ్రుల సుకృతమనే భావించాలి. సాధారణంగా సాహిత్యంలో కవులు పెట్టే పేర్లన్నీ తాను సృష్టించదలచుకున్న పాత్రల గుణాన్ని వ్యంజింపజేసేదిగానే ఉంటుంది. భారతేతిహాసంలో వ్యాసుడు పెట్టిన పేర్లుకూడా అటువంటివే. అచలుడు, అజాతశత్రువు (ధర్మరాజు), అజితుడు, అనస్యుడు, ధర్మరాజు, దుర్యోధనుడు, దేవవ్రతుడు తరువాత భీష్ముడు, దుశ్శాసనుడు, శకుని, ధనంజయుడు, సవ్యసాచి, విదురుడు, యుధిష్ఠిరుడు, యోజనగంధి, సర్వదమనుడు, సుపర్ణుడు, సుధన్వుడు, సువర్చసుడు, స్థాణుడు, సమవర్తి, శాంతమూర్తి, శతానందుడు, ధర్ముడు, ధర్మవ్యాధుడు, ప్రద్వేషిణి వంటి వందల పేర్ల వ్యుత్పత్తులను పరిశీలిస్తే ఈ విషయం తేటతెల్లమవుతుంది.

జంతుసాదృశ్యంతో వ్యవహరించే పేర్లు :

మానవునిలోని జంతు సదృశమైన ప్రవృత్తికి నిదర్శనంగా చేష్టలతోపాటు జంతువులతో పోల్చి చెప్పుకోవటం కనిపిస్తుంది. వాడు దున్నపోతులాంటివాడు, వాడు సింహంలా గర్జిస్తున్నాడని, వాడు ఏనుగులాగా లెక్క చేయకుండా నడుస్తున్నాడు, వాడు ఎద్దులాగా కొమ్ము విసురుతున్నాడని, కోతిలాగా నవ్వుతున్నాడని, నక్కలాగా జిత్తులమారి అని, వాడు గాడిద చాకిరి చేస్తున్నాడని, వాడు కుక్కలాగా విశ్వాసంతో ఉన్నాడని ఇలా ఎన్నో ఉపమానాలు మన వ్యవహారంలో కనిపిస్తాయి. అలా పెట్టిన పేర్లే కొన్ని భారతంలో కనిపిస్తాయి. ఉదాహరణకు అజగరుడు (అజం ఛాగం గిరతీత్యజగరః. మేకలను మ్రింగునది - కొండచిలువ), అజపాదుడు, అశ్వగ్రీవుడు, అశ్వశీర్షుడు, అశ్వత్థామ (అశ్వస్యేవస్థామ-బలమ్ యస్య అశ్వః స్థామ వృషోదరాదిః అశ్వత్థామః - జనన కారణమున గుఱ్ఱమువలె ధ్వనించిన ద్రోణాచార్యుని పుత్రుడు), గోముఖుడు, వ్యాఘ్రదత్తుడు, శార్దూలి, సురభి, నారసింహుడు, గజానందుడు, ఋక్షుడు, ఉలూకుడు, కరేణుమతి, కీటకులు, కేసరి, జంతు మొదలైనవి.

సహోదరత్వాన్ని తెలియజేసే పేర్లు :

ఒక కుటుంబంలో పదిమంది సంతానం ఉంటే ఆ పదిమందిలో మంచి ప్రతిభా సంపన్నుడైన వాడు ఒక్కడు ఉంటే మిగిలినవాళ్ళంతా వాడి ముందు రక్తికి రంగానికి రాకుండా పోతారు. ఉదాహరణకు విశ్వనాథ సత్యనారాయణగారి సోదరుడు విశ్వనాథ వేంకటేశ్వర్లు, విశ్వనాథ సత్యనారాయణ ముందు నిలబడలేకపోయాడు. వాస్తవానికి విశ్వనాథ కంటే శక్తి సంపన్నుడు విశ్వనాథ వేంకటేశ్వర్లు. కాని విశ్వనాథవారి కీర్తి ప్రతిష్ఠలముందు, ప్రతిభావ్యుత్పత్తుల ముందు గణనకెక్కలేకపోయాడు. అలాగే భారతంలో కూడా కీచకుని 105 మంది సోదరులు ఎంత పరాక్రమోపేతులైనప్పటికి కీచకుని ముందు కీచకుని సోదరులుగానే మిగిలిపోయారు. కీచకునికే ప్రసిద్ధి. ఇక్కడ కీచకుని ప్రసిద్ధి సుగుణాల వలన కాదు. అతని బలసంపన్నత, సమకాలీన రాజులందరికీ సింహస్వప్నం కావటం, ద్రౌపది పట్ల ఉన్న కామకత, అజ్ఞాతవాసంలో పాండవులకు తలనొప్పి కలిగించే ప్రశ్నగా మిగలటం వంటి కారణాలవలన కీచకుడు ప్రసిద్ధుడయ్యాడు. కీచకవధానంతరం సోదరులుకూడా అన్న మరణానికి ప్రతీకారేచ్ఛ తీర్చుకోవాలని యత్నించి భీముని చేతిలో నశించటం వంటి కారణాలవలన కూడా కీచకుని సోదరులు రక్తికి, రంగానికి రాలేకపోయారు. అందువలన కీచకులందరిలో అగ్రజుడైన కీచకుడే భారత కథలో ప్రసిద్ధికెక్కాడు. అలాంటి సంబోధనయే కీచకాగ్రజుడు. ఇటువంటివే గదాగ్రజుడు, శల్యానుజుడు, పాండవాగ్రజుడు, కౌరవాగ్రజుడు వంటి సంబోధనలు. పాండవాగ్రజుడు అన్నప్పుడు ధర్మజుడు సంకేతమే అయినప్పటికి భీమార్జునులు కూడా ప్రసిద్ధులే. కాని ధర్మ నిర్వహణలో ధర్మరాజుముందు మిగిలిన వారి స్థితప్రజ్ఞత వ్యాసాది

మహర్షులు మెచ్చుకొన్నది కాదు. కౌరవులలో కూడా ఒక్క దుశ్శాసనుడు తప్ప మిగిలిన వారంతా అప్రసిద్ధులే. దానికి కారణం భారత కథా భిత్తిక మీద వారి పాత్ర స్వల్పం కావటమే. ఇలాంటిదే ఇంద్రానుజుడు (వామనుడు), ధనదానుజుడు (కుబేరుని సోదరుడు).

శారీరక నిర్మాణ రీతుల అనుసరించి అంటే శారీరక లోపాదులను దృష్టిలో పెట్టుకున్న పేర్లు:

సకాలాంగులైన మానవులు ఎల్ల ఎడల కనిపిస్తారు. ఏదో ఒక అవయవలోపంతో పుట్టేవాళ్ళు, సాధారణమైన వ్యక్తులకంటే భిన్నమైన శక్తిసామర్థ్యాలు కలిగిన ఏదో ఒక అవయవం కలిగిన వాళ్ళు లోకంలో తారసపడుతుంటారు. అలాంటి పేర్లు కొన్ని భారతంలో కనిపిస్తాయి. ఉదాహరణకు ఏకపాదుడు (ఒక పాదం కలవాడు), అష్టావక్రుడు (ఎనిమిది వంకర్ల శరీరం కలవాడు), అర్జునుడు (తెల్లని కాంతి కలవాడు), అనూరుడు (తొడలు లేనివాడు), జరాసంధుడు (జర అనే రాక్షసి చేత సంధించబడిన అవయవాలు కలవాడు), దీర్ఘబాహుడు (పొడవైన దేహం కలవాడు), ఉగ్రశ్రవసుడు (తీవ్రమైన వినికిడి శక్తికలిగిన చెవులు కలవాడు), దంతవక్త్రుడు (ఏనుగు దంతం కలవాడు), నాగాయుత బలుడు (పదివేల ఏనుగుల బలంకలవాడు), మహోదరుడు (పెద్ద పొట్ట కలవాడు), ముక్కంటి (మూడు కన్నులు కలవాడు), ముంజకేశుడు (గడ్డిలాంటి వెంట్రుకలు కలవాడు), వికటాననుడు (వికృతమైన ముఖము కలవాడు), విద్యుజ్జిహ్వుడు (పదునైన నాలుక కలవాడు), శంఖుకర్ణుడు (శంఖము వంటి చెవులు కలవాడు), శుభాంగి (అందమైన శరీరం కలది), సుపర్ణుడు (బలమైన రెక్కలు కలవాడు), విరూపాక్షుడు (సూర్య చంద్ర అగ్ని అనే మూడు రూపాలతో మూడు విధాలైన నేత్రాలు కలవాడు), ఏకశృంగుడు (ఒకే కొమ్ము కలవాడు), విష్టరశ్రవుడు (దర్భముడిలాంటి చెవులు కలవాడు)

ప్రకృతిలోని ఉపమాద్రవ్యంతో ఉపమించి చెప్పిన పేర్లు :

మానవుడు తనకు ప్రకృతిలో కనిపించిన తాను దర్శించిన ఇష్టమైన వస్తువులతో హృదయాన్ని సంవదింప చేసుకొని ఆయా వస్తువులతో పోల్చి చెప్పుకోవటం కనిపిస్తుంది. కవులు కూడా అలాగే ఉపమాద్రవ్యాన్ని స్వీకరిస్తారు. కళ్ళను పద్మాలతో, ముఖాన్ని చంద్రునితో, చెవులను శంఖాలతో, ముక్కుని సంపెంగతో, దంతాలను మల్లెమొగ్గలతో చేతులను తామరతూండ్లతో, ఊరువులను అరటిబోదెలతో, స్త్రీ నడుమును ఆకాశంతో ఇలా పోల్చిచెప్పటం కవి సమయ సిద్ధమైన విషయం. భారతంలో కమలానికి ఉన్న అన్ని పర్యాయపదాలతో స్త్రీ పురుషుల ముఖాన్ని, నేత్రాలను ఉపమించి చెప్పటం కనిపిస్తుంది. అయితే కమలాన్ని లక్ష్మికి పర్యాయపదంగా భారతీయ సాహిత్యంలో కనిపిస్తుంది. భారతంలో కూడా లక్ష్మీదేవికి పర్యాయపదంగా కమలా అనే శబ్దం కనిపిస్తుంది. సందర్భాన్ని బట్టి కమలాక్షి అంటే స్త్రీ. కమలాక్షుడు అంటే శ్రీమహావిష్ణువు. ఇంకా ఈ విధంగా భారతంలో పల్లవుడు (పల్లవం లాంటి దేహం కలవాడు), ఋతుపర్ణుడు (వసంత ఋతువులో జీవచైతన్యంతో తొణికిసలాడే ఆకులతో కూడిన వృక్షం వంటి వాడు), కుముదుడు (కలువవంటి వర్ణం కలవాడు), కమలపాలిక (ఇది హిడింబకున్న మరోపేరు), కోకిలాదేవి (ద్రుపదుని భార్య), గిరిక (శుక్తిమతికి కుమార్తె), పర్వతుడు, పశుసఖుడు (ఋషులకు పరిచారిక అయిన గండ భర్త), ప్రభాత (దేవుడనే ప్రజాపతి భార్యలలో ఒకతె), ప్రభావతి (భరద్వాజుని పుత్రిక), మత్స్యగంధి (దాశరాజు కుమార్తె), వృకోదరుడు (భీముడు), మృగలాంఛనుడు (చంద్రుడు), శకుంతల (భరతుని తల్లి), శంఖుడు (విరటుని పెద్ద కుమారుడు) వంటి పేర్లు భారతంలో కనిపిస్తాయి.

వనచరులు/కొండజాతులుగా వ్యవహరించబడిన వారికి ఉన్న పేర్లు :

నాగరికతా గంధం లేని అనాగరక జాతుల వారిని

కిరాతులు, కీచకవనవాసులు, పుళిందులు, శబరులు, బర్బరులు, వనచరదస్యులు వంటి పేర్లతో పిలవటం కనిపిస్తుంది.

రథ ధ్వజాలను అనుసరించి పెట్టిన పేర్లు :

ప్రాచీన కాలంలో వీరులు, యోధులు, సంపన్నులు రథాన్ని వాహనంగా ఉపయోగించటం సర్వసాధారణమైన విషయం. వాళ్ళ వాళ్ళ ఇష్టాఇష్టాలను బట్టి ఏర్పరచుకున్న నమ్మకాలను బట్టి రథంమీద ధ్వజాలను ఏర్పాటు చేసుకునేవారు. ఆ ధ్వజాలను అనుసరించి వాళ్ళను ఆయా ధ్వజవాహనులుగా సంబోధించటం ఆనాటి సంప్రదాయం. నాగ కేతనుడు (దుర్యోధనుడు), కపికేత నుడు (అర్జునుడు) గోవృషభకేతనుడు (కృపాచార్యుడు), మకరధ్వజుడు (మన్మథుడు), వృషభధ్వజుడు (ఈశ్వ రుడు), వైజయంతి (ఇంద్రుడు), సింహలాంగూల ధ్వజుడు (అశ్వత్థామ), సింహధ్వజుడు (భీముడు) చంద్రకేతనుడు (ధర్మరాజు), గరుడ ధ్వజుడు (శ్రీకృష్ణుడు), తాళధ్వజుడు (భీష్ముడు), హస్తి ధ్వజుడు (సహదేవుడు), కర్ణికారధ్వజుడు (అభిమన్యుడు) వంటివి ఆయా వ్యక్తుల ధ్వజాలననుసరించి పెట్టిన పేర్లు.

తరులతా గుల్మాదులు అనుసరించి పెట్టిన పేర్లు:

చెట్లను కూల్చేవాడు అసిపత్రనరకంలో పడతాడని భారతంలోని ఆనుశాసనిక పర్వంలో ఉంది. మన ప్రాచీన ఆర్ష వాఙ్మయంలోని 'వాతసూక్తం, 'నదీసూక్తం', 'పర్జన్య సూక్తం', ఉషస్సూక్తం', 'పృథివీ సూక్తం' ఇవన్నీ వస్త్వాశ్రయంగా సాగిన వర్ణనలు. మనప్రాచీన కవులు కూడ ప్రకృతిని అఖండ చైతన్యంలో భాగంగానే భావించారు. ఆదికావ్యం రామాయణంలో ప్రకృతి వర్ణనల్ని చదివి పరవ శించని ప్రకృతి ప్రేమికుడుంటాడా? 'నదీం పుష్పోదుప వహం' - అని వాల్మీకి అన్నా, 'పృథ్వీగత యౌవనా' అని వ్యాసుడన్నా ఈ ప్రకృతి చైతన్యాన్ని ప్రేమించిన వారి భావనావధికి నిదర్శనాలే. అసలు ప్రకృతి, మానవ సమన్వయం లేనిదే జీవితం లేదు. ప్రకృతి ఉద్దీపింప జేయని రసానుభవ స్థితికూడ ఉండదేమో?

భారతంలో ప్రస్తావించిన తరులతా గుల్మాదులలో మన ప్రాచీనుల వృక్షజ్ఞానం తెలుస్తుంది. వట వృక్షాన్ని భారతం వర్ణించిన తీరు తరువాతి కవులకు ఆదర్శ ప్రాయమైంది. వటవృక్షంతోపాటు అలాబు, కర్ణికార, కల్పము, గోశర్కర, జంబూ, తడ, నందిని, వేణుయష్టి, సుదర్శనం వంటి ఫలవృక్షాలను పేర్కొన్నారు.

పశుపక్ష్యాదులలో పేర్కొన్న పేర్లలో ముఖ్యంగా పక్షుల పేర్లన్నీ ఎక్కువగా మగజాతికి చెందినవే. చంద్రకుడు, జరితారి, జటాయువు, గరుత్మంతుడు, తారుడు వంటివి. నాడీజంఘుడు అనే పేరుతో కనిపించే కొంగ, సక్తుప్రస్థుడు అనే పేరుతో కనిపించే ముంగిస డుండుభము అనే పేరుతో కనిపించే ముసలి పాము ఇవి కాక వివిధ పశు పక్ష్యాదుల పేర్లు భారతంలో కనిపిస్తాయి. కద్రువ సంతాన మైన పాముల పేర్లన్నీ మనుషులకున్న పేర్లలాగానే విశేషణాలతో కనిపిస్తాయి. సర్పాలలోని కొన్నిపేర్లు కౌరవులపేర్లతో పోల్చేలాగా కనిపిస్తాయి. వాసుకి, తక్షకుడు వంటి నాగదేవతల పేర్లు పౌరాణిక ప్రసిద్ధమైనవి. ఈ పేర్లన్నింటిని పరిశీలిస్తే పేర్లలోని ఔచిత్యానౌచిత్యాలు తెలుస్తాయి.

ధరించే ఆయుధాలను అనుసరించి పెట్టిన పేర్లు:

వజ్రి (వజ్రాయుధాన్ని కలిగినవాడు), శూలి (శూలాన్ని ధరించినవాడు), పినాకపాణి (పినాకమును ధరించిన వాడు) శార్ఙ్గి (శార్ఙ్గమనే ధనువును ధరించినవాడు) చక్రి (సుదర్శన చక్రాన్ని ధరించినవాడు), ఖట్వాంగధరుడు (ఖట్వాంగము అనే ఆయుధాన్ని ధరించినవాడు), కీనాశు డు (జీవఘాతువులను నశింపచేసేవాడు-యముడు), పాశి (పాశములను ధరించినవాడు-వరుణుడు)

భావుకతతో పెట్టిన పేర్లు :

దినమణి, నభోమణి, నలినీ బాంధవుడు, పద్మినీ వరుడు, జలజాక్షుడు, శుచిశ్రవుడు, ఉగ్రశ్రవుడు, కర్ణి కారము (కొండగోగు చెట్టు), సురక్ష్మాజము (పారి జాతము), ఉచ్చైశ్రవము (చెవులను రిక్కించి వినేది),

సుప్రతీకము (ఏనుగు పేరు), అజగవము (శివుని వింటికి పేరు)

విపరీత లక్షణసహిత నామధేయములు :

గొప్పవ్యక్తులపట్లగల ఆరాధనా భావంలో తమ పిల్లలకు ఆయా వ్యక్తులపేర్లను పెడుతుంటారు. కాని ఆ వ్యక్తులకు పేరు తెచ్చిన గుణాలకు భిన్నంగా ఆ నామధారులు ప్రవర్తిస్తుంటారు. ఉదాహరణకు హరిశ్చంద్రుడనే పేరు పెట్టుకొని హరిశ్చంద్రుడి ఖ్యాతికి కారణమైన సత్యగుణాన్ని విస్మరించి నిరంతరం అబద్ధాలాడుతుంటారు. అలాగే గాంధీ పేరు పెట్టుకొని నిరంతరం హింసా కార్యకలాపాలు చేస్తుంటారు. అలాగే భారతంలో కూడా పేరుకు భిన్నంగా వర్తించే పాత్రలు లేకపోలేదు. కౌరవులలో నూరు పేర్లను పరిశీలిస్తే వాటిలో ఎన్ని సార్థక నామధేయాలో చెప్పలేం. ఎందుకంటే భారత కథలో ఆయా నామాలున్న పాత్రలకు ఉన్న నిడివి దీనిని ధ్రువీకరించలేదు. ఉదాహరణకు దుర్జయుడు. దుర్జయుడు నూరుగురు కౌరవులలో 71వ పేరు. దుర్జయుడు అంటే జయించటానికి వీలులేనివాడని కదా అర్థం. కాని కురుక్షేత్ర సంగ్రామంలో 14వ రోజున భీముని చేతిలో హతుడయ్యాడు. అలానే దృఢరథుడు, భీమబలుడు, భీమరథుడు, వీరబాహుడు, దుష్ప్రధర్షణుడు వంటి పేర్లు ఎంతటి విపరీతలక్షణో చెప్పటానికి అనువైన సంఘటనలు భారతంలో కనిపించవు కాని వీరంతా కురుక్షేత్ర సంగ్రామంలో మరణించినవారు.

దీర్ఘాయువు (ఆయుతాయువు కుమారుడు) కురుక్షేత్ర సంగ్రామంలో 14వ రోజున అర్జునుని చేతిలో మరణించాడు. తన తండ్రి అర్జునుని చేతిలో ఐంద్రాస్త్రంతో మరణించటంతో తట్టుకోలేక యుద్ధరంగానికి వచ్చాడు. అంటే యుద్ధరంగానికి వచ్చేటప్పటికి తరుణ వయస్కుడేనని తెలుస్తుంది. దీనిని బట్టి ఈ పేరు విపరీత లక్షణతో కూడి ఉన్నదని చెప్పాలి.

వివిధ విజ్ఞానాత్మక విషయాలకు ఉన్న పేర్లు :

నాగాస్త్రము, పాశుపతాస్త్రము, బ్రహ్మశిరోనామక అస్త్రం, అనిలాస్త్రం, పర్జన్యాస్త్రం, గరుడాస్త్రం, నారాయణాస్త్రం, అనలాస్త్రం, మేఘాస్త్రం వంటి వివిధ అస్త్రాల పేర్లు, ఇంద్రోత్సవం, అకాల కౌముది వంటి క్రీడా విశేషాలు, కుండలి, దండలాసకం, నాగగీతం, ప్రేంఖణం వంటి కళావిశేషాలు, ముసలము, ధనుర్బాణాలు, ఖడ్గము, చక్రము, గద, తోమరము, క్రకచము, కౌక్షేయకము, ఖట్వాంగదుడు, దండాయుధం, హలము వంటి ఆయుధ విశేషాలు, అచల వ్యూహం, కూర్మ వ్యూహం, క్రౌంచవ్యూహం, గరుడవ్యూహం, చక్రవ్యూహం, పద్మవ్యూహం, మండల వ్యూహం, మకర వ్యూహం, మానుషవ్యూహం, వజ్రవ్యూహం, శృంగాటక వ్యూహం, సర్వతోభద్రవ్యూహం వంటి యుద్ధవ్యూహాలు, ఉపతాయి, చళుకి, జలికి, పెలుకురితాళం, డొక్కరము, తోరహత్తము, పట్టిసం, మండిపెట్టు, ముష్టిబలుపు, వంటి మల్ల యుద్ధపు పట్లు, ఉంగిడి, అదురుత్రిక్క వంటి పశు వ్యాధుల పేర్లు, మృతసంజీవని, ప్రతిస్మృతి వంటి వైద్య విజ్ఞానానికి సంబంధించిన పేర్లు ఆనాటి జీవన విధానాన్ని, సాంస్కృతిక వైభవాన్ని తెలియజేస్తున్నాయి.

కాలాన్ని గణించే ఆనాటి పద్ధతినే ఇప్పటికీ జ్యోతిష వేత్తలు పాటిస్తున్నారనిపిస్తుంది. త్రుటి, క్షణము, కళ, కాష్ఠ, ముహూర్తము, కుతపం, నిమేషము, పక్షము, మానము, లవ, రాత్రి పగలు వంటి కాల విజ్ఞాన బోధకాలైన పదాలు ఆనాటి విజ్ఞానాన్ని పట్టి చూపిస్తున్నాయి.

ప్రకీర్ణకము :

ప్రకృతికి సంబంధించిన కనిపించే పేర్లలో ఒకప్పటి భారతదేశపు నైసర్గికపు స్వరూపం తెలుస్తుంది. జంబూద్వీపంగా పిలవబడే ఈ దేశంలో పర్వతాలు, అరణ్యాలు, నదులు, తీర్థాలు, వాటి పేర్లను గమనిస్తే దేనిని శైలమనాలో, దేనిని పర్వతమనాలో, దేనిని వనమనాలో, దేనిని తీర్థమనాలో వంటి వివరాలు తెలుస్తాయి.

సూర్యుడిని దినమణి, అంబరమణి అని మణితో అభేదం చెప్పటం వ్యవహర్త భావుకతను తెలియజేస్తుంది.

సహదేవుడు దక్షిణ దిగ్విజయ యాత్ర చేస్తూ గోశృంగగిరి పై నున్న వారిని జయిస్తాడు. వాస్తవానికి ఈ పేరు కొండ యొక్క ఆకారాన్ని బట్టి పెట్టిన పేరు. అలాగే చక్రవాళం పర్వతం. గండకి నది ఇప్పటికీ ఆనవాలు లభిస్తున్న ప్రవాహము. ఇది నేపాల్‌లోని ఖాండ్మండుకు సమీపంలో ఉంది. ఇది సాలగ్రామాలకు ప్రసిద్ధి. అలాగే పౌరాణిక ప్రసిద్ధమైన ఈ పేర్లన్నింటికి ప్రస్తుత భారతదేశంలో ఎక్కడున్నాయో వివరించి చెప్పటం ప్రత్యేక పరిశోధన.

మహాభారతంలో నామాలను గమనించినప్పుడు దాదాపు 95 శాతం పేర్లు సంస్కృతమే. దీనికి కారణం సంస్కృతంలో వెలసిన భారతాన్ని తెలుగులో అనువదించ టానికి పూనుకోవటమే. తిక్కన సంస్కృత పదాలను తెలుగుచేసే ప్రయత్నం కనిపిస్తుంది. రథము అనటాన్ని 'అరథము' అని నాగాస్త్రాన్ని 'పాపతూపు' అని శరాసనాన్ని 'అంపపాన్పు' అని అగ్నినేత్రాన్ని 'చిచ్చుఱకన్ను' అని ఉద యాద్రిని 'పొడుపుగొండ' అని యుద్ధవీరులను 'పోటు మగలు' అని, శూరులధర్మాన్ని 'మగపాడి' అని, మనస్తాప వచనాలను 'ఉల్లికుట్టుమాటలు' అని మాయద్యూతాన్ని 'కల్లజూదము' అని, అనువదించారు.

తిక్కన అనువాదంలో చోటుచేసుకున్న తెలుగు పదా లను గమనిస్తే ఆశ్చర్యం కలుగుతుంది. ఎంతటి అమూర్త భావాలనైనా తిక్కన గారు దేశ్య శబ్దాలతోనే చెప్పారు. అతిశయం (పెంపు), అసంతృప్తి (ఆపోవక ఉనికి), ఆశ్చర్యం (వెరగు), ఈర్ష్య (ఈసు), ఉద్ధతి (ఉబ్బు), ఉపాయం (వెరవు) దుఃఖం (అలమట) వంటి సంస్కృత పదాలను సహితం తెలుగులోనే చెప్పారు. ఆయా పదా లను బట్టి ఆయా సందర్భాలను బట్టి అప్పటి సంస్కృతిని ఊహించగలమేగాని దానికి సంబంధించిన సమస్త విజ్ఞానం తెలియదు. ఉదాహరణకు పాశుపతాస్త్రం, నాగాస్త్రం లాంటి వివిధ అస్త్రాల పేర్లను బట్టి ఆయా అస్త్రాలను వినియోగించారని చెప్పగలమే గాని వాటికి సంబంధించిన విజ్ఞానం మనకు తెలియదు. అలాగే మల్లయుద్ధ విశేషాలలో ప్రస్తావించిన వివిధరకాల బంధాలను (పట్లు) వేరే చోట చదివి ఆయా బంధ విశేషా లను తెలుసుకోవలసి ఉంటుంది.

ప్రాచీన సాహిత్యాన్ని అధ్యయనం చేసే సందర్భంలో ఇటువంటి ఆలోచన కూడా చేయటానికి అవకాశం ఉం దని నా ఈ వ్యాసం ద్వారా తెలియచేస్తున్నాను. పేర్లను వివేచించటం అంటే ఆ పేర్ల వెనుక ఉండే సాంస్కృతిక నేపథ్యాన్ని వివేచించటమేనని ఋజువుచేసే ప్రయత్నంలో భాగమే ఈ వ్యాసం.

ఆధార గ్రంథాలు :

1. పుల్లారెడ్డి పుత్తా. 2010. శ్రీ మదాంధ్ర మహాభారత నామ సర్వస్వం (రేవంతీయం). కడప: పుత్తా పుల్లారెడ్డి.
2. వేంకట సుబ్రహ్మణ్యము, త్రోవగుంట (సంకలనం). 2017. నామకోశము (కవిత్రయ శ్రీమదాంధ్ర మహాభారతము) ప్రథమ, ద్వితీయ భాగములు. హైదరాబాద్.
3. శ్రీహరి, రవ్వా 2015. పాణినీయ అష్టాధ్యాయి (వామన జయాదిత్యకృత కాశికావృత్తి సహితం) తెలుగు అనువాదం. సంపుటం-1 & 2. హైదరాబాదు: తెలుగు అకాడమి.
4. సుబ్రహ్మణ్యం, జి.వి. 2008. శ్రీ మదాంధ్ర మహాభారతము. (1-18) తిరుపతి: తిరుమల తిరుపతి దేవస్థానములు.
5. సూరకవి అడిదము 1920. ఆంధ్రనామ శేషము (ప్రతిపదటీకాను క్రమణికాసహితము)చెన్నపురి: వావిళ్ల రామస్వామి శాస్త్రులు & సన్స్.

⌘⌘⌘

BHAVAVEENA
Vol. 17, Issue. 8, August 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

ఆంధ్ర మహా భారతం లో రాజనీతి – సమకాలీనత

– కె. సుజన, తెలుగు శాఖ, హైదరాబాద్ విశ్వ విద్యాలయం, హైదరాబాద్.

ప్రాచీన గ్రంథాలలో అత్యంత ప్రాముఖ్యతను సంత రించుకున్న గ్రంథం మహాభారతం. మహాభారతాన్ని సూక్ష్మంగా పరిశీలిస్తే అందులో చెప్పబడిన ప్రతి మాట ఆచరణీయమే, విద్యా విధానం మొదలుకొని సూక్ష్మ ధర్మాలు తెలుసుకునేంత వరకు, జ్ఞానాన్ని సముపార్జిం చడం మొదలుకొని ఆధ్యాత్మికతను సాధించడం వరకు, భూమండలం యొక్క స్థితి గతుల దగ్గర నుండి తీర్థ యాత్రల విశేషాల వరకు, దౌత్య సంబంధాలు మొదలు కుని రాజనీతి చాతుర్యతను ప్రదర్శించేంత వరకు ప్రతి అంశం, ప్రతి కథ ఒక విశిష్టతను సంతరించుకుంది. వేదసారాంశాన్నంతా పునికి పుచ్చుకున్న పవిత్ర గ్రంథం మహాభారతం. లౌకిక జ్ఞానానికి పునాది వంటిది మహా భారతం. ఇందులోని రాజనీతి విషయాలు రాజ్యాన్ని సక్రమంగా పరిపాలించడానికి, రాజ్యాభివృద్ధికి తోడ్పడు తాయి.

రాజనీతి శబ్దం నేటి 'పాలిటిక్స్'కి పర్యాయంగా వాడ బడినది. ప్రస్తుతం మనం ప్రజాస్వామ్యంలో ఉన్నా మన ప్రాచీన చరిత్ర నిండా రాజరికాలే. రాజులు, చక్రవర్తులు వారి వంశాలు. వారి జయాపజయాలు, సాహస పరా క్రమాలు, స్థూలంగా ఇదే చరిత్ర. కాగా ప్రజా పరిపాలనా విధానమనేది రాజరికంతో అవినాభావం సంబంధం కలిగిఉండేది. రాజు లేకుండా పాలన లేదన్నట్లు ఉండేది మన ప్రాచీన సామాజిక వ్యవస్థ. అందుకనే నేటికి మనం సత్ పాలనకు పర్యాయంగా 'రామరాజ్యం' అన్న పదాన్ని వాడుతున్నాం.రాజుకి చెందినది రాజ్యం, సమ్రాట్టుకి చెందిన సామ్రాజ్యం రాజ్యమంటే స్థూలంగా ప్రజా సమూహంతో కూడిన భూభాగం, రాజ్యానికి రాజరికపు పుట్టుకకు సప్త ప్రకృతులుండాలంటారు విజ్ఞులు. అవి స్వామి(రాజు), అమాత్యులు, జన పదం(జన ఆవాసం), దుర్గం, కోశం(ధన ఆకారం), దండం(సేన), మిత్రులు(మిత్ర రాజులు, రాజ్యాలు), ఇవీ సప్త ప్రకృతులు, వీటిలో మనం గమనించవలసిన అంశమేమిటంటే రాజ్యానికి మొదట కావలసినది రాజు. అందుకే నిన్న మొన్నటిదాకా మన దేశంలో రాజరికాలు వర్ధిల్లినప్పుడు రాజు సంతతికి అమిత ప్రాధాన్యముండేది. ఆ సంతతిని భద్ర పరచడం, ఒక అపరిహార్యమైన అంశంగా రాజ్యాధికారులు వ్యవహరించేవారు.

రాజరికం ఉన్న చోట దేశకాల భేదం లేకుండా ఎక్కడైనా పైన చెప్పిన ప్రాథమిక స్థితి గతులు ఉండ వలసిందే అన్నది వాస్తవం. అలాగే మనకు రాజ్య తంత్రంలో చతుర్విధ ఉపాయాలు సామ, దాన, భేద , దండములు, చతురంగ బలాలు (రథ, గజ, తురగ, పదాతులు), శక్తులు(ప్రభు, మంత్ర, ఉత్సాహములు), ఇలాంటివి రాజనీతికి అన్వయించే సామాన్య లక్షణాలు, వీటిని ప్రయోగించే రీతులలో భేదాలుండవచ్చు, కాలాలనుబట్టి, స్థలాలను బట్టి, పరిస్థితులను బట్టి, మనిషి ప్రాకృతికంగా ప్రాణి మాత్రుడే అయినా అతని బుద్ధి కారణంగా సృష్టిలో సర్వోన్నత స్థితిని పొంది ప్రకృతినే శాసించే స్థితికి ఎదిగాడు. ఆ ఎదుగుదలకు సమిష్టి జీవనం మూలం, సమిష్టి జీవనం లేనిదే భాష లేదు, భాష లేనిదే పురా సముపార్జిత జ్ఞానాన్ని దాచి భావితరాలకు అందించే మార్గమేలేదు. కాగా మనిషికి సంఘ జీవనం అనివార్యం, ఆ సంఘముండే రాజు అతనితో పాటు మిగిలిన అంగాలు, రాజనీతి, విజ్ఞానము, వికాసము అన్నీ ఆవిర్భ విస్తాయి.

రాజనీతిలో ప్రధానమైనది నాయకత్వం నాయక స్థానంలో ఉన్న వ్యక్తి తన సంస్థకు, ప్రత్యర్థి సంస్థలకు గల బలాలు, బలహీనతలు, సంస్థలు ముందున్న అవ

కాశాలు, పొంచి ఉన్న ప్రమాదాలు చక్కగా విశ్లేషించు కోవాలి. సభాపర్వంలో రాజనీతికి సంబంధించిన అంశాలు ప్రస్తావించబడ్డాయి. ఇవి నారదుడు ధర్మ రాజుని కుశల ప్రశ్నల రూపంలో ఉంటాయి. ఇందులో ప్రధానంగా కొన్ని విషయాలను గమనిస్తే రాజు యొక్క ప్రధానమైన విధివిధానాలు ఎలా ఉండాలో తెలుస్తుంది.

1. రాజ్య కార్యాలను స్వబుద్ధితో ఎల్లప్పుడూ అర్ధరాత్రి దాటిన తర్వాతే ఆలోచించాలని, రహస్యంగా ఆలోచించిన విషయాలను ప్రజల చెవిన పడ కుండా జాగ్రత్త పడటం.

   నేటి కాలంలో దీనిని పరిశీలిస్తే ఎవరూ ఊహంచని విధంగా జమ్మూ కాశ్మీర్ కి సంబంధించిన ఆర్టికల్ 370 ని తొలగించడం. ఇది చరిత్ర లో ఒక చారిత్రాత్మకమైన ఘట్టం. ఇలాంటి సంఘటనలు అప్పుడప్పుడు చోటుచేసుకోవడం వంటివి రాజ నీతిలో భాగమే.

2. అలాగే ప్రభుత్వ ఉద్యోగాల్లో శక్తి సామర్థ్యాలను అనుసరించి వారి ప్రతిభాపాటవాలను గుర్తించి వారిని ఉద్యోగాల్లో స్థిరంగా ఏర్పరచడం కూడా రాజ్యానికి లాభదాయకమైన విషయాలలో ఒకటని నారదుడు వివరిస్తాడు. నేడు శక్తి సామర్థ్యాలకు కాకుండా ధనానికి ప్రాముఖ్యత లభించడం, పలుకుబడికి లోబడి స్వార్థ పూర్వకంగా ఉద్యోగా లను నియమించడం జరుగుతుంది. దాని వలన పాలన తప్పు దోవ పట్టే ప్రమాదం ఉంది.

3. ఎక్కువ పలుకుబడి కలిగిన క్రియాశీలి, సమర్థ వంతులైన మంత్రులను నియమించడం. ఇక్కడ మంత్రి ఆలోచన విధానాన్ని అతని ప్రవర్తనను పరిశీలించడం, రాజ్య క్షేమానికి ప్రథమ కర్తవ్యంగా తెలుస్తుంది.

4. జ్యోతిష్యం చేత భూమండలంలో గ్రహాల స్థితిని తెలుసుకుని దానికి తగ్గట్లు రాజ్య క్షేమం కొరకు శాంతి క్రియాదులు జరపడం.

5. పన్నులు వసూలు చేయడం, యోగ్యులైన వారిని ఉద్యోగాల్లో నియమించి జీతాలను సకాలంలో అందజేయడం.

6. యుద్ధంలో మరణించిన వారి పైన కుల కుటుంబా లకు కూడు గుడ్డకు లోటు లేకుండా ఇవ్వడం.

   ఈ మధ్య జరిగిన భారత్ చైనా సైన్యం ఘర్షణలో మరణించిన కల్నల్ సంతోష్ కుటుంబానికి భరోసాగా ప్రగతి భవన్ లో అతని భార్య సంతోషికి ముఖ్యమంత్రి కే.సి.ఆర్ డిప్యూటి కలెక్టర్గా నియ మిస్తూ నియామక పత్రాన్ని అందజేశారు. అలాగే ఇళ్ళస్థలాలను, ఐదు కోట్ల రూపాయాలను అంద జేశారు. ఇలాంటివి భరతమాత కోసం ప్రాణాలు విడిచిన వారి కుటుంబాలను ఆదుకోవడమనేది అనాటి నుండే అమలులో ఉందని అర్థమవు తుంది.

7. పేద రైతులకు ధాన్యపు విత్తనాలు, వర్తకులకు నూటికి, ఒక రూపాయి వడ్డి వంతున అప్పులు ఇవ్వడం.

   నేటి కాలంలో చాలా మంది రైతులు అప్పులు తీర్చలేక పండిన పంటకు సరైన ధర అందక ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. అలాంటి పరిస్థితి అప్పట్లో లేదు ఎందుకంటే పంటలు, ధాన్యాన్ని పండించే రైతుల విలువ అనాటి రాజులకు తెలుసు. ఎంతో మంది ఆకలి చావులు చూసిన తర్వాత గాని ప్రభుత్వం మేల్కోలేని పరిస్థితి నేడు కనబడుతుంది. రైతులకు ఊరటనిచ్చే అంశాలను చూస్తే ప్రధానమంత్రి కొన్ని మార్గదర్శకాలను వారి కోసం కేటాయించడం. అవి రూపాయికే పంట బీమా, ప్రీమియం చెల్లిస్తే ఫసల్ బీమా వర్తింపు, రైతుల వాటా ప్రభుత్వమే చెల్లింపు, రైతులందరికి వర్తింపజేయాలని ఉత్తర్వులు, ఖరీఫ్ బీమా యోజనకు మార్గ దర్శకాలు ఇలాంటి పథకాలు రైతులు కోసం ప్రవేశ పెట్టడం చూస్తున్నాము.

8. చేసిన మేలు గుర్తించి ఆ మేలు చేసిన వ్యక్తిని పదిమంది పెద్దలున్న సభలో ఉచిత రీతిని సత్కరించగల రాజు ప్రజలను పరిపాలించగలడు అని చెప్తాడు.

   ఇప్పటి కాలంలో వివిధ రంగాలలో విశిష్ట సేవలు అందించిన భారతీయు పౌరులకు పద్మ భూషణ్, భారత రత్న, పద్మ విభూషణ్ లాంటి పురస్కారాలను అందజేసి వారిని సత్కరించడం లాంటిది.

9. ''పంగుల మూకాంధుల వికల / లాంగులను నబాంధవుల దయవ బ్రోతే? భయా

   ర్తుంగడిఉది శత్రునైనను / సంగర రంగమున ఉ గాతె శరణం బనినన్.

కుంటి వాళ్ళను, మూగ వాళ్ళను, గ్రుడ్డి వాళ్ళను, అంగ విహీనులైన వాళ్ళను, బంధువులు లేని వాళ్ళను దయతో పోషిస్తున్నావు కదా! అని నారదుడు అడుగుతాడు.

నేటి కాలంలో వికలాంగులకు ఫించన్ రూపంలో చేయుతనివ్వడం మహాభారత కాలం నాటి నుండే ప్రారంభమైందని అర్థమవుతుంది. నేటి కాలంలో వారిని పిలిచే పిలుపులో కూడా గౌరవం ఉండాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోడి గారు వికలాంగులు పేరుకు బదులుగా దివ్యాంగులుగా పేరు మర్చడం జరిగింది. విభిన్న సామర్థ్యపు వ్యక్తులు కోసం జాతీయ విధానం (National Policy for with Disabilities) వారు వారి కోసం ప్రత్యేక చట్టాలను తీసుకొచ్చింది, అలాగే వారి కోసం ప్రత్యేక సంస్థలను ఏర్పాటుచేసింది.

1. శారీరక వికలాంగుల సంస్థ, న్యూడిల్లి, 2. జాతీయ మానసిక వికలాంగుల సంస్థ, సికింద్రాబాద్.3. జాతీయ పునరావాస శిక్షణ మరియు అధ్యయన సంస్థ, కటక్ 4. జాతీయ బహుళ వికలాంగత్వ సాధికారత సంస్థ చెన్నై వంటి సంస్థ లు వారి ప్రత్యేక అవసరాలు తీర్చడం కోసం ఏర్పడ్డాయి.

10. రాజుకు వచ్చిన ఆదాయంలో ఎంత ఖర్చు చేయాలో నారదుడు వివరిస్తాడు. ఆదాయంలో నాల్గవ భాగాన్ని లేద మూడవ భాగాన్ని లేద సగ భాగాన్ని మాత్రమే ఖర్చు చేయాలి కాని అంతకు మించి చేయకూడదని గ్రహించమన్నాడు.

దేశ ఆర్థిక వ్యవస్థ తీరు తెన్నులు మార్చి ఆధునిక భారతానికి దారిని నిర్మించిన ఆర్థిక సంస్కరణలు ప్రవేశ పెట్టి దేశానికి అంతర్జాతీయ ఖ్యాతి సాధించిన వ్యక్తి గా పి.వి నరసింహారావు గారిని చెప్పుకోవాలి. ఇలాంటి వారెందరో ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేశారు.

9. గూఢాచార వ్యవస్థ గురించి, శత్రురాజుల ప్రవర్తనను తెలుసుకోవాలని చెప్తున్నాడు.

ఈనాడు రాజకీయ నాయకులు వారి గురించి కాకుండా ప్రతిపక్ష నాయకుల గురించి తెలుసుకోవాలనే కుతూహలంతో వారి వివరాలను సేకరించి విమర్శించడం మనం చూస్తూనే ఉన్నాం.

10. ''వార్తయంద జగము వర్తిల్లుచున్నది / యదియు లేనినాఉడ యఖిల జనులు

    నంధ కారమగ్ను లగుదురు గావున/ వార్త నిర్వహింప వలయుఉబతికి.''

వార్తను ప్రభువులు సక్రమంగా నడపాలి, వార్తలను సేకరించడం, ప్రసరించడంలో నిపుణతను కలిగి ఉండాలి. అలా లేకపోతే ప్రజలంతా అజ్ఞానాంధకారంలో ఉండవలసి వస్తుందని తెలుస్తుంది.

ప్రపంచ సమాచారాన్ని ప్రజలకు చేరవేయడంలో వార్తలు ప్రధాన పాత్ర పోషిస్తాయి. అటువంటి వార్తను ప్రచురించడంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్తున్నాడు. నేడు చాలా పత్రికలు, దూర దర్శన్ లు, రక రకాల కార్యక్రమాలతోనూ, రాజకీయ వార్తలతోనూ పోటి పడుతున్నాయి ఈ పోటి కారణంగా వాస్తవాన్ని చెప్పడం మరచి పోయి, గుర్తింపు కోసం పాటుపడుతున్నట్టు తెలుస్తుంది. కొన్ని పత్రికలు మాత్రమే నిజాన్ని నిర్భయంగా తెలియజేయకలుగుతున్నాయి.

11. ఆయుర్వేదంలో సమర్థులైన వైద్యులు లోకానికి మేలు చేసే బుద్ధితో ప్రజల మీద ప్రేమతో ఎనిమిది శాఖలుగా వ్యాపించిన ఆ వైద్య విధానంలో సేవలు చేస్తున్నారా అని విచారిస్తాడు.

నారదుడు వైద్యులను జగద్ధిత బుద్ధిన్ అని విశేషించి ప్రయోగించాడు. బాధా పీడితుడై ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగికి చికిత్స చేసి, అతని బాధను తొలగించి, ప్రాణం నిలిపే వైద్యుణ్ణి భారత దేశం విష్ణు స్వరూపునిగా భావించాలి. 'వైద్యో నారాయణో హరి:' అని ప్రవచించింది.

ఇప్పటి కాలంలో కొంత మంది వైద్యులు ధనాన్ని బట్టి మెరుగైన వైద్యాన్ని అందిస్తారు. ఇక్కడ వ్యక్తి ప్రాణం కంటే ధనానికి ప్రాముఖ్యతను ఇస్తారు. కొన్ని ప్రైవేటు హాస్పిటల్స్ లక్షలు రుసుము తీసుకుని ఆ వ్యక్తి మరణించినా ఆ శవాన్ని తీసుకుని వెళ్ళడానికి కూడా డబ్బు చెల్లించాలని చెప్పే మనస్తత్వం గల వైద్యులు అక్కడక్కడా కనబడుతున్నారు.

12. ధర్మరాజు భుజ బలంతో నీవు పరిపాలిస్తున్న భూమిలో అనావృష్టి భయం లేకుండా చెరువులు నిండి కనుల పండువుగా ఉన్నాయి కదా

ఇప్పటి కాలంలో చెరువులు అన్నింటినీ ఆక్రమించి భవనాలు కట్టి వరదలు వస్తే నిలువు లోతు నీళ్ళలో మునిగి తేలుతున్నాము ఇది నేటి పరిస్థితి.

13. ముందుగా నిర్ణయించుకున్న పనులు చేయక పోవడం.

సంవత్సరంలో పూర్తి కావల్సిన పనులు వాయిదాల మీద పదేళ్ళయినా పూర్తి చేయకపోవడం , ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేయడం నేడు మనం గమనిస్తున్నాము.

14. ''చోర భయ వర్జితముగా / ధారుణిఉ బాలింతె
యధికధనలోభమునం
జోరుల రక్షింపరుగా/ వారలచే ధనముగొని భవద్
భృత్యవరుల్.''

దొంగ భయం లేకుండా నీవు రాజ్యాన్ని ఏలుతున్నావు కదా నీ ప్రభుత్వోద్యోగుల్లో ముఖ్యులైన వాళ్ళు ధనాశ పరులై ఆ దొంగల దగ్గర డబ్బు పుచ్చుకొను వాళ్ళకు రక్షణ కల్పించడం లేదు కదా!

ఆధునిక కాలంలో దొంగల సంఖ్యతో పాటు రకరకాల దొంగలు పుట్టుకొస్తున్నారు. కొత్తగా ఇంటర్నెట్ వచ్చినప్పటి నుండి సాంకేతికత అభివృద్ధి చెంది చదువుకున్న దొంగలు కొంతమంది సైబర్ నేరస్థులుగా మారుతున్న వైనం మనం ఇప్పుడు చూస్తున్నాము.

నారద మహర్షి వేసిన కుశల ప్రశ్నలు ఏ ప్రభువుకైనా ఉత్తమ రాజనీతి పాఠాలు.

ఆశ్రమ వాస పర్వంలో ధృతరాష్ట్రుడు ధర్మరాజుతో రాజైన వాడు అతని తప్పులు కొంచెం కూడా ఇతరులకు తెలియకుండా దాచి పెట్టుము. ఇతరుల దోషాలు మాత్రం జాగ్రత్తగా తెలుసుకోవాలని శత్రువుల వద్ద ఉన్న వాళ్ళలో బుద్ధిమంతులూ, శక్తిమంతులూ అయిన వ్యక్తులను దానాదులతో సత్కరించి వాళ్ళ మనసులు నీ వైపు తిప్పుకొనుము, అంటారు ఇది రాజకీయ మంత్రం ,తనతో సమానమైన బలం కలిగిన రాజుతో తగు విధంగా అతడిని గౌరవించి సంధి చేసుకోవాలి. అని చెప్తారు.

తిననివ్వదగిన సమయం ఏదో, కక్కించవలసిన సమయం ఏదో గ్రహించి శత్రు రాజును పుల్లావు వలె పొడుగాటి త్రాడు తో స్వేచ్ఛగా విడిచి పెట్టుము, లోబరుచుకొమ్ము, లోబరుచుకున్నప్పుడు ఆ శత్రు రాజువలన లాభాలు జాగ్రత్తగా పిండుకొమ్ము అని తెలియజేస్తాడు.

ఎక్కడ తగ్గాలో ఎక్కడ నెగ్గాలో తెలుసుకుని శత్రువులను విడిచి పెట్టడము, లోబరచుకోవడమనే రాజనీతి తత్వాన్ని పగ్గాలుగా తన చేతిలో ఉంచుకుని శత్రురాజుల లాభాలను ఆర్జించాలని అర్థమవుతుంది.

ద్వాపరమైనా, కలియుగమైనా నాటి చక్రవర్తుల నుంచి నేటి ప్రధాన మంత్రులు దాకా అధికారమే పరమా వధిగా వ్యూహ ప్రతి వ్యూహాలతో సాగిపోయే ఓ పద్మవ్యూహమే రాజకీయం. అధికారంలో లేనివారు దాన్ని సాధించుకోవడం కోసం తాపత్రయపడితే, ఉన్న వారు దాన్ని ఎలా

నిలుపుకోవాలని ఆలోచిస్తారు. నిలుపుకోవడమే కాదు దానిని తమ వారసులకు అప్పగించడంలోనూ రాజనీతిని ప్రదర్శిస్తారు. ఈ కోవకు చెందిందే మహాభారత సంగ్రామం.

రాజనీతి విషయాలు గురించి మాకియో వెల్లి వ్రాసిన 'ద ప్రిన్స్' అనే పుస్తకంలో ప్రస్తావించడం కనబడుతుంది. రాజు ఆలోచన తీరు ఏ విధంగా పని చేయాలో ప్రస్తావించారు. 'రాజుకు సగం పశువుగా సగం మనిషి ఈ రెండు స్వభావాలను ప్రదర్శించడం ఎలాగో తెలియడం అవసరం. అలాగే ఈ రెంటిలో ఒకటి లేకుండా మరొకటి స్థిరత్వాన్ని కలిగి ఉండరు అయితే ఒక రాజుకు పశు స్వభావాన్ని వివేకవంతంగా ఎలా ఉపయోగించాలో తెలిసి ఉండాలి కనుక అతడు పశువులలో నక్కను మరియు సింహాన్ని రెండింటిని ఎంపిక చేసుకోవాలి. ఎందుకంటే సింహం ఉచ్చుల బారి నుండి తనను తాను రక్షించుకోలేదు, అలాగే నక్క తోడేళ్ళ బారి నుండి తనను తాను రక్షించుకోలేదు. కనుక తోడేళ్ళను హడల గొట్టడానికి సింహం గాను, ఉచ్చులను కనిపెట్టడానికి నక్కగాను ఉండటం అవసరం. కనుక వివేకవంతుడైన రాజు మాట నిలుపుకున్న పక్షంలో అది తనకు నష్ట దాయకంగా పరిణమించేటప్పుడు అలాగే మాట ఇవ్వడానికి దారితీసిన కారణాలు కనుమరుగై పోయినప్పుడు మాట నిలుపు కోలేడు, నిలుపుకోకూడదు అని వివరిస్తారు. ఇలాంటి రాజనీతి విషయాలు అనేకం ఈ గ్రంథంలో ప్రస్తావించ బడ్డాయి.

నేడు ఇలాంటి రాజకియ వ్యవస్థలే కనిపిస్తున్నాయి.

ఆధార గ్రంథాలు :

1. కవిత్రయ విరచిత శ్రీమదాంధ్ర మహాభారతం, తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి, 2008.
2. రాజేంద్ర కుమార్, చెక్కిళ్ళ, శ్రీ రాముడు నీతి, నేత, నేతృత్వం.
3. జగన్నాథం, పేర్వారం. సాహిత్యం -సమాజం- రాజకీయాలు, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్, 1997
4. http://shankharavam.blogspot.com/

⌘⌘⌘

BHAVAVEENA
Vol. 17, Issue. 8, August 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

తెలుగు జాతీయోద్యమ, దేశభక్తి సాహిత్యం – సమకాలీనత

– డా॥. కొయ్యా శ్రీనివాసులు, తెలుగు విభాగాధిపతి, యస్.టి.యస్.యన్.ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కదిరి.

ఇరవయ్యేవ (20వ) శతాబ్దం ఆరంభం నుండి మన దేశానికి భరతభూమికి స్వాతంత్ర్యం వచ్చేదాకా, మన దేశాన్ని తెలుగు నేలనూ కుదిపేసిన ఉద్యమాల్లో ప్రముఖ మైనది జాతీయోద్యమం. ఈ మహోద్యమం మొత్తం భారతీయ సాహిత్యాన్ని, ఆదేవిధంగా తెలుగు సాహిత్యాన్ని ఎంతగానో ప్రభావితం చేసింది. తెలుగు సాహిత్యంలోని అన్ని ప్రక్రియల పైన జాతీయ స్వాతంత్ర్యోద్యమ ప్రభావం మనకు స్పష్టంగా కనబడడమే గాకుండా జాతీయోద్యమ నేపథ్యంలో పలు ప్రక్రియా రూపాల్లో అనేక రచనలు వెలువడ్డాయి. ఇవి విస్తృత ప్రచారాన్ని పొందాయి. మేధావుల ఉపన్యాసాల కన్నా కవుల రచనలు, గేయాలు పాటలు ప్రజల్ని ఎక్కువగా కదిలించాయి. జాతీయోద్యమ సాహిత్యాన్ని సృజించిన పలువురు కవులు, రచయితలు స్వాతంత్ర్య సమరంలో పాల్గొన్నవారు కావడం గమనార్హం.

తెలుగులో జాతీయోద్యమ సాహిత్యం చిలకమర్తి వారి

"భరత ఖండంబు చక్కని పాడియావు
హిందువులు లేగదూడలై ఏడ్చుచుండ
తెల్లవారను గడుగరి గొల్లవారు
పితుకుచున్నారు మూతులు బిగియగట్టి"

గీత పద్యం తెలుగులో వచ్చిన తొలి జాతీయోద్యమ రచనగా భావిస్తున్నారు. ఈ పద్యం 1907 ఏప్రిల్ నెలలో బిపిన్ చంద్రపాల్ గారి రాజమండ్రి పర్యటనల సందర్భంగా 'పాల్' ఆంగ్లోపన్యాసాలను అనుదిస్తున్న చిలకమర్తి వారు ఆశువుగా వినిపించారు.

అయితే ఈ తేటగీతి పద్యానికి ప్రారంభమైన ప్రేరణలు 1905 డిసెంబరు 15 నాటి 'కృష్ణపత్రిక'లో అచ్చయిన "దిక్రై ఆఫ్ మదరిండియా" గీతంలో కనబడుతున్నాయి. బెంగాల్ విభజనలో జాతిజెనుల సమరనాదంగా మారిన బంకించంద్ర చటర్జీ 'వందేమాతరం' ప్రేరణతో ఒక అజ్ఞాత కవి ఈ ప్రబోధ గీతాన్ని ప్రకటించారు.

'హిందువులారా! ఎన్నాళ్లీ గతి
మందమతులరై యాటికి జెడెదరో
నందనులగు మీరందఱు ప్రుక్కగ
యెందుకు నా బ్రతుకితరుల కోసమ
నా వంటను గల సారంబంతయు
నావంతయు లేకే వెలికేగెను
చేవ చెడిన నేనే విధి బ్రతుకుదు
జీవించిన సార్థక్యం బేమిక
దూడనోరు గొట్టి ద్రోహంబు గొల్లలు
పాడి సమస్తము పరులకమ్ము గతి
కూడులేని నా కొడుకుల గాదని
యేడకో నా ధనమెల్లను బోయెడి
చీము నెత్తురు చిక్కెనో లేదో
ఏ మెయి బ్రతుకుదు - నీ దుర్దశతో
ప్రేమ జూపరే - ప్రేమ జూపరే
రామ! రామ! నా లావు చెడియెనిక
ఇకనైనను మీరెల్లరు సోదరులై
ప్రకటింపుడు నాపై ప్రేమమ్మును'

అంటూ సాగుతుందీ గీతం. ఈ అజ్ఞాత గీత రచయిత ఎవరో ఇంతవరకు తెలయలేదు. ఈ గీతాన్ని చిలకమర్తి వారే అజ్ఞాత కర్తృకంగా రచించినా రచించివుండవచ్చు.

చిలకమర్తి రచించిన "చెరసాలల్ పృథు చంద్రశాల లెయగున్ - చేదోయి గీలించు నయ్యర దండల్ విరిదండలయ్యెడును", భరతఖండంబె యొక పెద్ద బందిఖానా...." వంటి పద్యాలు కూడా ఎంతో గొప్పగా వున్నాయి. నవల, కథ, ఆత్మకథ, వ్యాసం, నాటకం వంటి పలు ప్రక్రియల్లో రచన చేసిన చిలకమర్తి వారు తదనంతర కవులకు ఎంతో మార్గదర్శకులయ్యారు.

భారత జాతీయతను ప్రబోధించిన భావకవుల్లో గురజాడ అప్పారావు, రాయప్రోలు సుబ్బారావు ముందువరుసలో ఉంటారు. 'జన్మభూమి' గేయంలో రాయప్రోలు సుబ్బారావు గారి జాతీయ భావన ఇలా సాగింది.

"ఏ దేశ మేగిన ఎందు కాలిడినా
ఏ పీఠ మెక్కినా ఎవ్వరేమనిన
పొగడరా నీతల్లి భూమి భారతిని
నిలపరా నీజాతి నిండు గౌరవము"

తెలుగులో గేయ సాహిత్యం ఉన్నంతకాలం ఈ గీతం ఉంటుందని చెప్పవచ్చు. రాయప్రోలు సుబ్బారావు వారు తన కవితా వర్ణనలో దేశితనం, భాషా నిర్మాణంలో మార్గతత్వం పాటించారు. జాతీయోద్యమ కాలంలో తన కవిత్వంతో భిన్న మార్గంలో పయనించారు.

గురజాడ అప్పారావు రచించిన 'దేశభక్తి' గేయంలో జాతీయ అభిమానంతో పాటు విశ్వమానవ ప్రేమను ప్రబోధించినాడు.

'దేశమును ప్రేమించుమన్నా
మంచి అన్నది పెంచుమన్నా
వొట్టిమాటలు కట్టిపెట్టోయ్
గట్టిమేల్ తలపెట్టవోయ్'

అని ఉద్బోధించిన ఈ గేయంలో

"సొంత లాభం కొంత మానుకొని
పొరుగా వారికి తోడుపడవోయ్
దేశమంటే మట్టి కాదోయ్
దేశమంటే మనుషులోయ్"

అంటూ ఎలుగెత్తి చాటినాడు.

గురజాడ దేశభక్తి గేయము కొందరి దృష్టిలో వాచక పుస్తకములలోని నీతులు వంటిది మాత్రమే.కానీ శ్రీశ్రీ వంటి మహాకవికి "సమస్త ప్రపంచ మహాజనుల జాతీయ గీతం"గా కనిపించింది. దేశభక్తికి, జాతీయతకు సరియైన అర్థమును మానవతాదృష్టితో రంగరించి రచించిన 'దేశ భక్తి' గేయం అంతర్జాతీయ ప్రసిద్ధికెక్కింది.

గరిమెళ్ల సత్యనారాయణ తెలుగు జాతీయోద్యమ సాహిత్యంలో ఈయన రచించిన 'మాకొద్దీ తెల్లదొర తనము" వంటి పాట చారిత్రాత్మక పాత్ర పోషించింది. అది సామాన్య ప్రజల వాణిగా స్వాతంత్ర్య సమర శంఖారావంగా మార్మోగింది.

పల్లవి : మా కొద్దీ తెల్లదొరతనము దేవ
మా కొద్దీ తెల్ల దొరతనము
అను పల్లవి : మా ప్రాణాలపై పొంచి
మానాలు హరియించే ॥మాకొద్దీ॥

జానపద బాణీలో సూటిగా హృదయానికి తాకే రీతిలో గరిమెళ్ళ గేయాన్ని పాడుతుంటే ప్రజలు ఉర్రూతలూగే వారంట ! తెల్లదొరల 160 ఏళ్ళ దౌర్జన్యాల్ని కళ్లకు కడుతూ 160 పాదాలుగా సాగే ఈ పాట ప్రపంచ సాహిత్యంలో అతి పెద్ద పాటగా చరిత్రకెక్కింది.

"మా కొద్దీ తెల్ల దొరతనం" గీతాన్ని గరిమెళ్ల 1922లో రచించారు. ఈ గీతంలో అర్థంకాని పద ప్రయోగం ఎక్కడా లేదు. మొత్తం గీతంలోనూ చక్కని భావ అన్వయం ఉంది. ఈ గీతం బ్రిటీష్ వారి పరిపాలనలోని కౌటిల్యాన్ని స్పష్టపర్చింది. ఇది వైయక్తికంగా పాడుకొనేందుకు, సామూహిక స్థాయిలో ఆలపించేందుకు కూడా చక్కని సాధన మవుతుంది. ఈ గీతంలో ఎక్కడా అభ్యర్థన, ప్రాధేయ పడడం వంటి లక్షణాలు లేవు. ప్రజల్ని చైతన్యవంతుల్ని చేసి జాతీయోద్యమంలో పాల్గొనే విధంగా తీర్చిదిద్దాలనే తపన గరిమెళ్ల గీతంలోని ప్రతి అక్షరం ప్రతిబింబిస్తుంది. కొన్ని వందల పుటల మహాకావ్యానికి దక్కే కీర్తి కన్నా, కొన్ని పంక్తుల్లో ముగిసిన ఈ పాటకు ఎక్కువ ప్రఖ్యాతి లభించింది. ప్రసిద్ధ జాతీయ నాయకులు తీసుకురాలేక పోయిన చైతన్యాన్ని గరిమెళ్ల తన పాట ద్వారా తీసుకొని వచ్చారని సాహితీ విమర్శకుల అభిప్రాయం. శ్రీశ్రీ తన వచన రచనల్లో గరిమెళ్ల గీతానికి ఘనమైన కితాబు నిచ్చారు.

జాతీయోద్యమాన్ని ప్రేరేపించే సాహిత్యం తెలుగులో ఇబ్బడిముబ్బడిగా వెలువడింది. కవులు, రచయితలు

తమ రచనల్లో జాతీయత, దేశభక్తి విషయాల్లో తమ స్థిర సంకల్పాన్ని ప్రకటించారు. ప్రముఖ హేతువాద కవి త్రిపురనేను రామస్వామి చౌదరి రచించిన "వీరగంధము తెచ్చినారము వీరుడెవ్వడో తెల్పుడీ" అన్న గేయము ఎంతో ప్రాచుర్యాన్ని పొందింది. వడ్డాది సీతారామాంజనేయులు "దండాలు దండాలు భారతమాతా, అవి అందుకొని దీవించు భారతమాతా..." అనే గేయాన్ని రచించారు. ఇది ఎంతో విస్తృత ప్రచారాన్ని పొందింది. వడ్డాది కవి స్వాతంత్రోద్యమంలో కూడా పాలుపంచుకొన్నారు.

జాతీయోద్యమ, దేశ భక్తి సాహిత్యంపై గాంధీజీ ప్రభావం :

స్వాతంత్ర్యోద్యమ కవిత్వంలో మహాత్మాగాంధీ పై వచ్చినంత కవిత్వం మరి ఏ అంశంపైనా రాలేదు. అది గాంధీ నాయకత్వ ప్రభావం, గాంధీ వ్యక్తిత్వ ఔన్నత్యమే కారణం. మహాత్ముని ఆస్థాన కవిగా పేరొందిన తుమ్మల సీతారామమూర్తి చౌదరి గారు

"గాంధి యుగమున పుట్టితి, గాంధి నడుపు
నుద్యంబుల నలిగితి నోపినంత
గాంధి నీక్షించితిని గాంధి కవిత్రాయ
గంటి నీ జన్మమునకు నీ పంట చాలు"

అంటూ పొంగిపోయారు. ఈయన రచించిన రాష్ట్ర గానం, ఆత్మార్పణం, ఆత్మకథ తదనంతర జాతీయ వాద కవులకు మార్గదర్శనం చేశాయి.

మంగిపూడి వేంకటశర్మ గాంధీ అనుయాయిగా అభ్యుదయ భావాలతో పద్యాలు రాశారు. అస్పృశ్యతపై మంగిపూడి రాసిన నిరుద్ధ భారతం కావ్యమే మొట్ట మొదటిది.

'పరతంత్రత సౌఖ్యహరము
పరతంత్రత ప్రాణమాన భంగకరంబున్
పరతంత్రత బహు హేయము
నరకమువలె భరతమాత ! న్యాయసమేతా !

అంటూ సంస్కరణాత్మక దృక్పథంతో 'శ్రీగాంధీ నామం మరువాం మరువాం / సిద్ధము జైలుకు వెరువాం వెరువాం' అనే పాటను ఆనాటి జనం ఒక మంత్రంలా జపించారు. భావకవి బసవరాజు అప్పారావు "కొల్లాయి గట్టితేనేమి? మా గాంధి / కోమటై పుట్టతేనేమి / వెన్నపూసా మనసు / కన్నతల్లి ప్రేమ / పండంటి మోము పై బ్రహ్మ తేజస్సు ..... " అనే గీతాన్ని రచించారు. ఆనాటి రోజుల్లో ఈ పాటను సామూహిక రీతిలో గానం చేసేవారు.

గుర్రం జాషువా గాంధీని భార్యా బిడ్డలున్న ప్రత్యక్ష దైవంగా కీర్తించాడు. కనుపర్తి వరలక్ష్మమ్మ, సుబ్రహ్మణ్య భాగవతులు గాంధీపై దండకాలు రచించారు. దాదాపు ఇరవైమంది దాకా గాంధీశతకాలు రచించారు. ఆనాటి నిజాం సంస్థానానికి చెందిన రత్నమ్మ దేశాయ్ అనే కవయిత్రి గాంధీజీపై మంగళహారతి రచించారు. మొత్తం మీద గాంధీ యుగంలోనే ఎక్కువ సంఖ్యలో జాతీయోద్యమ, దేశ భక్తి గేయాలు వచ్చాయి. ఈ సాహిత్యానికి ప్రేరకుడు గాంధీ కావడం గమనార్హం.

ప్రసిద్ధ కవి దువ్వూరి రామి రెడ్డి "మేలుకో భారత కుమారా మేలుకోరా తరుణధీరా ....." అనే గేయాన్ని రచించారు. స్వాతంత్ర్య సమర యోధుడు దుగ్గిరాల గోపాల క్రిష్ణయ్య గుంటూరు జిల్లా చీరలా - పేరాల సత్యాగ్రహంతో ప్రసిద్ధులు, ఆయన స్వయంగా చక్కని కవి ఆనాటి జాతీయోద్యమానికి ఉపకరించే గీతరచనలు చేశారు. ఇవి భజనల రూపంలో ఉన్నాయి. "ముప్పయి కోట్ల ప్రజలు రాంభజన, పంజర బంధనమైనారు రాం భజన ....." అంటూ దుగ్గిరాల వారు జాతీయోద్యమ సాహిత్యాన్ని రచించి సమకాలీన ప్రజల చైతన్యానికి ప్రత్యక్షంగా కారకులయ్యారు.

భారత స్వాతంత్ర్యోద్యమ కాలంలో జరిగిన అనేక సంఘటనల్ని నాటక రచయితలు వివిధ నాటకాలుగా మలిచి ప్రజల్ని చైతన్య పరిచారు. జాతీయోద్యమ ముఖ్య లక్షం ఆంగ్లేయుల్ని పారద్రోలడమే ముఖ్యమైనప్పటికీ, నాటకాల్లో నాడు జాతీయోద్యమం సామాజిక రంగంలో కనిపించే అనేక సమస్యల్ని నాటక రచయితలు

ప్రస్తావించారు. వందేమాతరం, విదేశీ వస్తు బహిష్కరణ, సత్యగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమం, మద్యపానం అనర్థాలు, అస్పృశ్యత, దేశభక్తి, హరిజనోద్యమం, తిలక్ జీవితం, గాంధీజి విజయాలు మొ॥ విషయాలను తెలుగు నాటకాల్లో ప్రతిఫలించారు.

జాతీయోద్యమ సమయంలో తెలుగులో ఎక్కువగా చారిత్రక నాటకాలు ఎక్కువగా వచ్చాయి.

మహమ్మదీయుల పరిపాలనలో హిందూ ధర్మానికి జరిగిన హాని ప్రస్తావిస్తూ నాటకాలు అధికంగా వచ్చాయి. చారిత్రక పురుషులు స్వాతంత్ర్యయోధులలో మరింత ఉత్సాహాన్ని నింపాయని, ఆ నాటకాలను పరిశీలిస్తే మనకు అర్థమవుతుంది.

వేదం వేంకటరాయశాస్త్రి ''ప్రతాప రుద్రీయం'', శ్రీపాద కృష్ణమూర్తి 'బొబ్బలియుద్ధం'. కోలాచలం శ్రీనివాసరావు 'సుల్తాన్ చాంద్‌బీబీ', కొప్పరపు సుబ్బారావు 'రోషనార', ముత్తురాజు సుబ్బారావు 'చంద్రగుప్త', శేషు బాబు 'అశోక రాజ్యం', ఉన్నవ లక్ష్మీనారాయణ 'నాయకురాలు', ప్రభులింగాచార్యులు 'పల్నాటి వీర చరిత్ర', పోతుకూచి సుబ్బయ్య 'ఆంధ్రవాణీ సామ్రాజ్యము', కాళ్ళకూరి సాంబశివరావు 'రంగనాయ కదన సమవాకారం', నండూరి బంగారయ్య 'ఆంధ్రతేజం' మొ॥ నాటకాలు చక్కని పాలన అందించిన పాలకుల స్ఫూర్తిని వారి పోరాట పటిమని, మహమ్మదీయులు, విదేశీయులతో పోరాడిన చారిత్రక సంఘటనలను అభివర్ణించాయి. ఈ నాటకాలన్నీ జాతీయోద్యమ ప్రభావంతో రావడమే గాక ప్రజల్లో దేశభక్తిని రేకిత్తించి, ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొనేట్టు చేశాయి.

జాతీయోద్యమ కాలంలో స్వాతంత్ర్య స్ఫూర్తితో అనేక కావ్యాలు ఆవిర్భవించాయి. ఈ కావ్యాలు ప్రత్యక్ష, పరోక్ష రీతిలో జాతీయోద్యమానికి ఊతాన్ని అందించాయి. దర్భాక రాజశేఖర శతావధాని రచించిన 'రాణా ప్రతాప సింహ చరిత్ర', గడియారం వేంకట శేష శాస్త్రి రచించిన 'శివభారతం' ఈ రెండు కావ్యాలు మన జాతి చరిత్ర ఎంతో మహోన్నతమైనదనీ, భారతజాతి స్తబ్దుగా ఉండ కూడదని, తన కర్తవ్య పాలనలో భవిష్య భారతాన్ని నిర్మించేందకు ప్రజలు సంసిద్ధం కావాలని ఉద్బోదించాయి. రాణా ప్రతాప సింహ చరిత్రలో కథానాయకుడు రాణా ప్రతాపుడు, శివభారతములో కథానాయకుడు ఛత్రపతి శివాజీ, ఈ ఉభయులూ భారత జాతీయాత్మకు ప్రతీకలని రాజశేఖర శతావధాని, గడియారం వేంకటశేష శాస్త్రి భావించారు. ఈ రెండు కావ్యాలు తెలుగు జాతీయోద్యమ సాహిత్య చరిత్రలో చిరస్థాయిగా నిలుస్తాయి.

జాతీయోద్యమ సాహిత్యంలో మరికొన్ని కావ్యాలు, రచనలు తలమానికాలుగా నిలిచాయి. వాటిలో బలిజేపల్లి లక్ష్మీకాంతం గారి 'స్వరాజ్య రథము-స్వరాజ్య సమస్య', దుగ్గిరాల రామమూర్తి 'స్వాతంత్ర్య ప్రదర్శనము', కొండపర్తి వీరభద్రాచార్యులు 'భారత దర్పణం', భాస్కర రామానాయుడు 'ప్రపుల్లముఖ', భానుమూర్తి 'భారతి ప్రదర్శనం', దామరాజు పుండరీకాక్షుడు 'స్వరాజ్య సోపానము గాంధీ', 'మహోదయం గాంధీ విజయం', 'పాంచాల పరాభవం' మొ॥ ఎన్నదగినవి.

సమకాలీనత :

జాతీయోద్యమ సాహిత్యంపై భిన్నాభిప్రాయాలున్నాయి. ఇది నాటి స్వాతంత్రోద్యమ స్ఫూర్థిని వేగవంతం చేసిందని కొందరు, గత వైభవస్మరణకే పరిమితమైందని, మూసకట్టు ధోరణి జాస్తిగా కనిపిస్తుందని మరికొందరు అభిప్రాయపడ్డారు. తెలుగు జాతీయోద్యమ సాహిత్యం తెలుగు సాహిత్య చరిత్రలోనే వెలకట్టలేని ఆణిముత్యం వంటిది. సమకాలీన సమాజాన్ని జాగృత పరచడంలో కృతకృత్యం అయ్యింది అనడంలో ఎటు వంటి బేదాభిప్రాయాలు లేవు. జాతి ఆత్మగౌరవం, అస్తిత్వాన్ని, స్వాతంత్ర్య కాంక్షను ప్రజల్లో రగుల్కొల్పి, దేశభక్తిని నరనరాల్లోని త్యాగనిరతికి బాటవేశాయనడంలో ఎటు వంటి సందేహం అక్కరలేదు.

ఆధార గ్రంధాలు :

1. తెలుగు సాహిత్య సమీక్ష - ఆచార్య జి.నాగయ్య (రెండవ సంపుటం)
2. తెలుగు సాహిత్య చరిత్ర - డా॥ద్వానా శాస్త్రి ,
3. జాతీయోద్యమ కవిత్వం - మద్దూరి సుబ్బారావు
4. తెలుగు నాటకాలు - జాతీయోద్యమం - డా॥ రావి రవిప్రకాష్
5. తెలుగు సాహిత్య చరిత్ర - ప్రొఫెసర్ వెలమల సిమ్మన్న

⌘⌘⌘

BHAVAVEENA
Vol. 17, Issue. 8, August 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

నన్నయ భారతంలో సమకాలీనత

– తంత్రవహి శ్రీరామమూర్తి, తెలుగు అధ్యాపకులు, పి. ఆర్. ప్రభుత్వ జూనియర్ కళాశాల, కాకినాడ.

తెలుగు సాహిత్యంలో ఆదికవి నన్నయ. ఆంధ్ర మహా భారతం ఆది గ్రంధం. వ్యాసమహర్షి సంస్కృత భారతంలో "యదిహాస్తి తదన్యత్ర యన్నేహాస్తి నతత్ క్వచిత్" అన్నారు. అంటే ఇక్కడ ఏది ఉందో ఇదే ఇతరచోట్ల ఉంది. ఇక్కడ ఏది ఐతే లేదో ఇంక ఎక్కడా ఉండదు. ఈ ప్రతిన ప్రకారం చూస్తే భారతంలో ప్రపంచం అంతా ఉంది. సాంకేతిక అంశాలు కూడా ఉన్నాయా అని ఎవరైనా ప్రశ్నిస్తే అది పరిశోధకులు వెతికితే దొరుకుతుంది. 'మానవ జీవితమే ఒక మహాభారతం' అంటారు ఒక కవి. ఆ విధంగా పరిశీలించినపుడు ఆ నాడు జీవనంలో ఎదుర్కొన్న అనేక అంశాలు ఈ రోజు మానవుడు ఎదుర్కొంటాడు. సంక్లిష్ట సందర్భాలలో, సంఘర్షణలు ఎదురైనపుడు మానవుడు ఏ కాలంలోనైనా ఒకలాగే ప్రవర్తిస్తాడు. ఆ జాతిలో జీర్ణించుకున్న సంస్కృతి, ధర్మం, అతని దృక్పథాన్ని, ప్రవర్తనను నిర్దేశిస్తాయి. మహాభారత కాలంనాటి ప్రభుత్వ వ్యవస్థ, దేవ మానుష సంబంధాలు, దివ్యశక్తులు రీత్యా చాలా వైవిధ్యాలుంటాయి. వాటిని కాక ఆనాటికి ఈనాటికి సారూప్యంగా ఉన్న అంశాలను మాత్రమే తెలపటమే ఈ వ్యాస ఉద్దేశం.

మహాభారత కథారంభంలో వచ్చే తొలికథ సరమ వృత్తాంతం. ఈ సరమ ఒక దివ్యశునకం. దాని కొడుకు సారమేయుడు. ఆ కుక్కపిల్ల ఆట నిమిత్తం వచ్చి జనమేజయుని యజ్ఞవాటిక ప్రదేశంలో తిరుగుతుంది. జనమేజయుని తమ్ములు శ్రుత సేనుడు, భీమసేనుడు, ఉగ్ర సేనుడు పవిత్రమైన సంబారాలను కుక్క తాకుతుందేమో అని కొట్టారు. సారమేయుడు ఏడుస్తూ తల్లివద్దకు వచ్చి చెప్పాడు. సరమ కోపంతో జనమేజయుని వద్దకు వచ్చి

కం. క్షితినాథ! కడు నకరుణాన్వితులై నీ తమ్ము
లతివివేకదూరులో
మతి దలపక నా పుత్రకు నతిబాలకు ననపరాధు
నడిచిరి పెలుచన్ (ఆం.ప్ర.84)

"ఓ రాజా! మిక్కిలి జ్ఞానహీనులైన నీ తమ్ములు దయ లేనివారై చిన్నవాడని కూడా చూడకుండా ఏ నేరం చేయ కుండానే నా కుమారుని కొట్టారు. యుక్తాయుక్తాలు ఆలో చించక పేదసాదలకు అపకారం చేస్తే కారణంలేని ఆపదలు కలుగు తాయి" అంటుంది. కొడుకుని కొడితే అతని తల్లి, కొట్టిన వారి తల్లిదండ్రులకో, పెద్దలకో ఫిర్యాదు చేయటం ఈనాడూ కనిపిస్తుంది. అంతేకాక ఏ కారణం లేకుండానే కుక్కలను తన్నటం, రాళ్లతో కొట్టడం వంటివి చేసేవారు వీధులలో ఇప్పటికీ కనిపిస్తూ ఉం టారు. కుక్క పిల్లలకు ఆపద కలిగితే ఆ వీధిన వచ్చేవారిని కుక్క అరవటం, కరవటం వంటివి కూడా నేడు మనం చూస్తూ ఉంటాం. మానవుల తల్లియైనా, పశు పక్ష్యాదుల తల్లియైనా మాతృహృదయం ఒకటే కదా!

ఉదంకుని కథలో ఉదంకుడు రాజైన పౌష్యుని వద్దకు గురుకార్యంమీద వెళ్లినపుడు కార్యం అయిన తరువాత భోజనం చేసి వెళ్లమంటాడు. పెట్టిన భోజనంలో తల వెంట్రుక వచ్చిందని కోపించి అంధుని కమ్మని శపిస్తాడు. అపుడు పౌష్యుడు చిన్న తప్పు జరిగితే నన్ను శపిస్తావా? నీకు సంతానం లేకుండా పోవాలని ఉదంకుని శపిస్తాడు రాజు. ఈ సన్నివేశాన్ని చూస్తే అన్నంలో తలవెంట్రుకలు రావడం ప్రతి ఇంట్లో జరుగుతుంటాయి. పిలిచి ఏ విందు భోజనమో పెడితే అక్కడ వడ్డనలోనో, ఇంకొకటో తేడా వచ్చి కోపంతో అరుచుకోడాలు, మాటలు ముదిరి కొట్లాటలు జరగడం కూడా అక్కడక్కడా చూస్తుంటాము.

పౌష్యుని భార్యనుండి కుండలాలు పొందిన ఉదంకుడు వెళుతూ ఉంటే తక్షకుడు అనే నాగరాజు వాటిని అపహరించి నాగలోకానికి వెళ్ళిపోతాడు. అపుడు

ఉదంకుడు నాగలోకానికి వెళ్ళి అక్కడ అనంతుడు, వాసుకి, ఐరావతుడు, తక్షకుడు మొదలైన నాగులను ప్రస్తుతించాడు. లోకంలో పసివారు ఏదైనా వస్తువు తెలిసీ తెలియక అపహరించి పట్టుకుపోతే ఆవస్తువు సొంతదారు వారింటికి వెళ్లి " మా వస్తువు మీవాడు తెచ్చాడు. మాకు ఇవ్వండి " అని అడుగుతారు. పట్టుకుపోయిన వాడు గౌరవ మర్యాదలుపొందిన కుటుంబంలో వారి పిల్లవాడు అయితే, సొంతదారు ఆర్థికంగా, సామాజికంగా దిగువ వర్గంవారైతే పైవారిని వినయంగా, గౌరవంగా ప్రాథేయ పడుతూనే అడగవలసివస్తుంది. నాగులు దివ్యులు, ఉ దంకుడు సామాన్యుడు కాబట్టి నాగులను ఉదంకుడు ప్రసన్నులు చేసుకోవటానికి స్తుతించాడు.

గరుడోపాఖ్యానంలో గరుడుడు తల్లి వినత దాస్యాన్ని విముక్తి చేయటానికి స్వర్గానికి వెళ్లి అమృతాన్ని తీసుకు వస్తాడు. తల్లి కష్టాన్ని తొలగిస్తాడు. తల్లి కష్టపడుతుంటే దానిని పోగొట్టి సుఖాలను కలిగించాలని ప్రతి కొడుకూ కోరుకుంటాడు. దానికి ప్రయత్ని స్తాడు. అలాంటి కొడుకును చూసి తల్లి కూడా సంతసిస్తుంది. అందుకే వినత ' కొడుకులు సమర్థులైనం దల్లిదండ్రులు యిడుమలు వాయుట యెందునుం గలయది. గావున నీయట్టి సత్పుత్రుం బడసియు దాసినై యుండుదాననే' (ఆం.ద్వి. 51) అని సంతోషాన్ని గరుత్మంతునితో పంచు కుంటుంది. ఇది కొడుకు సమర్థత పై తల్లి చూపే నమ్మకం. ఇపుడు కూడా అలాగే జరుగుతోంది కదా!

ఇంద్రుడు అడ్డుపడితే 'నేను అమృత భాండం ఇచ్చాక నీవు వెళ్లి తీసుకో' అంటాడు. ఒక వ్యక్తి తన పని జరగ టానికి అడ్డుపడిన పరిస్థితిని చక్కబెట్టటానికి ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో ఈ సంఘటన తెలుపుతుంది. ఎవరికైనా డబ్బులు ఇవ్వవలసివస్తే అది తీర్చటానికి అతడు పూనుకుంటే ఆ ధనం మరొకరు తీసుకోవలసినది ఐతే 'నేను ఇచ్చిన తరువాత మీరు వెళ్లి తెచ్చుకోండి, అది మీకు నాకూ తెలియాలి. వారికి తెలియకూడద'ని ఒప్పందం చేసుకుంటాం. మూడవ వ్యక్తి వద్ద మాట పోకుండా ఈ ఇద్దరూ లాభపడేలా చేసుకోవడం లోకంలో సామాన్యమే.

కచదేవయాని కథలో కచుడు దేవతల గురువైన బృహస్పతి కుమారుడు. రాక్షస గురువైన శుక్రాచార్యుని వద్దకు మృత సంజీవని విద్యకోసం వెళతాడు.కూతురుపై ఉన్న ప్రేమతో దేవయాని మాటలను శుక్రుడు జవ దాటడు కాబట్టి ఆమెను సుముఖురాలిగా చేసుకొని గురు శుశ్రూష చేస్తే, కార్యసిద్ధి కలుగుతుందని దేవతలు చెప్పారు. కాబట్టి గురు శుశ్రూషతో బాటు గురుపుత్రి "దేవయానికి సువిధేయు డై ప్రియహిత భాషణములఁ బుష్ప ఫల విశేష దానములను సంతతఁ ప్రీతి జేయుచు" (ఆం. తృ. 110) గౌరవంగా చూస్తుంటాడు. రాక్షస బాధల వలన కచుడు పీడింపబడి, మరణించి గురువు యొక్క మృతసంజీవని విద్యా ప్రదానంతో పునరుజ్జీవితుడౌతాడు.

కచుడు ఆశ్రమాన్ని విడిచిపెట్టే సమయంలో దేవ యాని ఓ కచుడా! నీవు వినయవంతుడివి, అవివాహితు డవు, నేను కూడా కన్యకను, నీకు నాకు ఇంతకుముందే మన్మథుడి శక్తిచేత పెళ్లి అయిపోయింది. అందుచేత శు క్రుడిదయతో సంజీవనీ విద్యతో పాటుగా నన్ను స్వీక రించి, వివాహమాడి నాకు ప్రీతి కలిగించుము(ఆం. తృ. 129) అంటుంది. అపుడు కచుడు ' లోకనింద్యమగు నర్థము నీ వాకునకుఁ దెచ్చుటుచితమె? నాకు సహో దరివి నీవు నా చిత్తమునన్' అంతేకాక ' గురులకు శిష్యులు పుత్రులు పరమార్థమ లోకధర్మ పథమిది; దీనిం బరికింపక యీ పలుకులు తరుణీ! గురుపుత్రి! ,నీకుఁ దగునే పలుకన్' (ఆం. తృ. 130,131) అంటాడు. గురువుని తండ్రిగా భావించి గౌరవించటం, గురువులు శిష్యులను పుత్రులుగా సంభావించి వారి అభివృద్ధికి బాటలు వేయటం నేడుకూడా చూస్తుంటాం.

విద్యనభ్యసించటమో, ఒకరి ఆశ్రయం పొంది జీవిం చటమో పురుషుడు చేయవలసి వచ్చినపుడు అక్కడి వారిఅమ్మా యిని గౌరవంగా చూడటం, ఆమెకు నచ్చే కానుకలను ఈయటం సర్వసాధారణం. కచుడు అదే

చేసాడు. కాని స్త్రీ పురుషులు ఒకచోట చనువుగా ఉండే టపుడు వారి మనసులలో కలిగే సాన్నిహిత్యం, ప్రణయంగా, ఆకర్షణగామారటం చూస్తుంటాము. ఇతరులు చూపే స్నేహాన్ని ప్రేమగా భావించడం కూడా కద్దు. దేవయాని ఇలాంటి భావానికి లోనయింది. ఎదుటివారిలో మనల్ని ఆకర్షించే గుణం ఏదో మనల్ని ఆకట్టుకొని మనమే ఊహలలో తేలిపోతూ కారణం వారేనని వాదిస్తుంటాము కూడా. దేవయానిలో నేటితరం యువతీ యువకుల సంబంధ పరిణామాలు స్పష్టంగా కనబడతాయి.

లోకంలో కొందరు తమ ఇచ్ఛ నెరవేరక పోవటానికి కారణమైన వారికి అపకారం తలపెట్టడానికి వెనుకాడరు. దాని పరిణామం వలన వారికి అనర్థమే కలుగుతుంది. దేవయాని ఇదే చేసింది. తనతండ్రి వద్ద పొందిన సంజీవనివిద్య పనిచేయకుండా పోవాలని కచుని శపించింది. ఫలితంగా కచుని వలన శాపం పొందిన దేవయాని, రాజైన యయాతిని పెళ్లిచేసుకోవాలసి వచ్చింది. అతని అనురాగం శర్మిష్ఠ పొందటం చేత అతని పుత్రుడు 'పూరు' చక్రవర్తి అయ్యాడు. దేవయాని కుమారులు రాజార్హతను కోల్పోయారు. తల్లి లేదనే కారణంతో గారాబం చేసే శుక్రాచార్యుని వంటి తండ్రులు, దానిని మిషగా తీసుకుని అన్నిటిని సాధించాలనుకునే సంతానం మనకు కనబడుతూనే ఉంటారు. జీవితాన్ని చేజేతులతో అశాంతి పాలు జేసుకొనే దేవయాని వంటి ఉద్వేగపరులు నేడు కూడా ఉన్నారు.

శకుంతలోపాఖ్యానంలో దుష్యంత చక్రవర్తి వేటకు అరణ్యానికి వచ్చి విశ్రాంతి సమయంలో కణ్వ మహర్షి ఆశ్రమాన్ని కనుగొని తాను వచ్చేవరకు దండ, సామంత, పురోహిత, మంత్రి, భట వర్గాన్ని "ఇక్కాశ్యపుండైన కణ్వమహామునీంద్రునకు నమస్కరించి వచ్చెద; నావచ్చు నంతకు నందఱు నిచ్చోటన యుండునది" (ఆం. చ 24)అని ఆశ్రమంలోకి అడుగుపెడతాడు. ఇంతమందితో వెళితే ఆ ఆశ్రమ వాసుల ప్రశాంతతకు భంగం అనీ ఆ విధంగా చేసాడు. ఇపుడు కూడా రాజకీయ నాయకులు వంటి వారు తమ గురువుల ఆశ్రమాలకో, పీఠాలకో వెళ్ల వలసి వస్తే మందీ మార్బలాన్నీ దూరంగా ఉండమని వారొకరే గురువుల సన్నిధికి వెళ్లడం గమనిస్తుంటాము.

అక్కడ ఆశ్రమంలో రూపలావణ్యవతియై, గుణవతి యైన శకుంతల తండ్రిగారు లేరని తగిన మర్యాదలు చేసింది. ఇంటికి వచ్చిన వారికి తగిన మర్యాదలు చేయటం ఇపుడు కూడా ప్రతివారు చేస్తుంటారు. శకుంతల కణ్వమహర్షి తన తండ్రి అని చెబితే ఆశ్చర్యపడి జితేంద్రియుడైన మునికి కూతురెలా? అని అడిగి శకుంతల మేనకా విశ్వామిత్రుల కుమార్తెయని తెలుసుకుంటాడు. మనకు సందేహం కలిగితే వారి పుట్టు పూర్వోత్తరాలు అడిగి తెలుసుకోవడం నేటికీ మన మందరమూ చేసే పనే.

విశ్వామిత్రుడు తపము చేయటం, మేనక వలన తపోభంగం కావటం, అంతా జరిగిన తరువాత కానీ విశ్వామిత్రుడు తన తప్పు గుర్తించకపోవడం ఇక్కడ పరిశీలించాలి. మనం కూడా ఒక కార్యసిద్ధి కోసం ప్రయత్నించినపుడు ఇతరుల వలన ప్రలోభానికి గురై మనపని మరచి తప్పు చేస్తాం. దాని ఫలితం అనుభవించాక అపుడు మన కార్యసాధన ఆగిపోయిందని తెలిసి, విచారించి మరలా పూనుకోవడమో, సమయం దాటిపోతే దానిని వదిలిపెట్టడమో చేస్తుంటాం. కానీ జీవితంలో మరలా అలాంటి తప్పు చేయకుండా ఈ అనుభవం మాత్రం తప్పకుండా ఉపయోగపడు తుంది. శకుంతలను దుష్యంతుడు రాజకుమార్తెయని తెలుసుకొని సంతోషిస్తాడు. శకుంతలతో ఇలా అంటాడు.

ఉ. **ఈ మునిపల్లెనుండు టిదియేల? కరంబనురాగ మొప్పగా భామిని! నాకు భార్య వయి భాసురలీల నశేష రాజ్య ల లక్ష్మీ మహనీయ సౌఖ్యముల మేలుగ నందు మనిందితేందు, పా దామలతుంగహర్మ్యముల హారి హిరణ్మయ కుట్టిమంబులన్ (ఆం. చ.54)**

ఆమె తనకు కలిగే తనయుని యౌవరాజ్య అభిషిక్తుని చేయాలని షరతు పెడుతుంది.అంగీకరించి దుష్యంతుడు

ఆమెను గాంధర్వ విధిన వివాహం చేసుకుంటాడు. అభిమత సుఖాలనుభవిస్తాడు. 'మంత్రులను మీ తండ్రి వద్దకు పంపి నా వద్దకు నిన్ను పిలిపించుకుంటాను' అని చెప్పి వెళ్లిపోతాడు. శకుంతల గర్భవతియై, పుత్రవతియైన పిదప పుత్రుని యౌవరాజ్య అభిషిక్త సమయం వచ్చిందని కణ్వమహర్షి శకుంతలతో 'ఎట్టి సాధ్వులకును బుట్టిన యిండ్లను బెద్దకాలమునికి తద్ద తగదు' (ఆం. చ.66)అని శిష్యులను తోడిచ్చిపంపాడు. పై పద్యాన్ని చూస్తే నగరాలకు దూరంగా పల్లెలలో ఉండే లేదా ఆర్థికంగా దిగువ వర్గాలకు చెందిన అమాయక యువతులను, ధనవంతులై, అధికారంతో ఉండే పురుషులు ఎలాంటి ఆశలు పుట్టిస్తారో, వారిని లోబరుచుకోవడానికి ఎన్ని మాయలు పన్నుతారో అర్థమవుతుంది. ఇక కణ్వుడు చెప్పిన మాటలు సాధ్వులు ఎక్కువ కాలం పుట్టినింటిలో ఉండరాదనడం కూడా బాధ్యత కలిగిన తండ్రి చెప్పే మాటే. భార్య భర్త దగ్గర ఉండటమే గౌరవం కదా!

శకుంతల కుమారునితో రాజసభలో అడుగుపెట్టి జరిగినది గుర్తుచేసింది. తనయుని స్వీకరించి మాట నిలుపు కొమ్మం టుంది. 'నీవెవరవో నాకు తెలియదు నీవు వచ్చిన చోటికే వెళ్లిపో' అంటాడు దుష్యంతుడు. భార్య, పుత్రుడు, యజమాని, సత్యం ఈనాలుగు గృహస్థాశ్రమ ధర్మానికి నాలుగు స్తంభాలని తెలిసి వాటి గొప్పదనాన్ని చెప్పి ధర్మపథాన్ని తప్పవద్దని చెబుతుంది. ఏదైనా తప్పు భర్త చేస్తుంటే దానిని వారించి సరియైన మార్గంలో నడవమని భార్య భర్తకు చెప్పటం ఇప్పటికీ లోకంలో జరుగుతున్నదే.

తన కుమారుడో కాదో తెలియాలంటే పుత్రగాత్ర పరిష్వంగసుఖము అనుభవించి చూడమంటుంది. ముత్యాలసరాలు, కర్పూరము, చందనము, చంద్రుని వెన్నెలలో కూడా పుత్రగాత్ర పరిష్వంగ సుఖము వలన కలిగే చల్లదనము ఉండదంటుంది. విజ్ఞానాభివృద్ధి జరిగి జీవకణ పరీక్షల ద్వారా తమ పిల్లల తండ్రి నీవేనని చెప్పి నవతరం అమ్మాయిలు మోసగాళ్ల ఆటకట్టిస్తున్నారు. తల్లిదండ్రులకు తెలియకుండా మగవారి మాటలకు చిక్కి నష్టపోయే అమ్మాయిలు, నా స్థోమత, పరపతితో ఏతప్పు నుంచైనా తప్పించు కోవచ్చుననుకునే అబ్బాయిలు రోజూ మనకు కనిపిస్తుంటారు. దాంపత్యానికి భార్యాభర్తల పరస్పర అనురాగం ప్రధానం. వివాహ సాక్ష్యాలు, చట్టాలు, వారిని ఒకచోట ఉంచడానికి ఉపయోగపడతాయి కాని వారి మధ్య అన్యోన్యతను, సంతోషాన్ని పుట్టించలేవు. ఇది ఈ రోజులకు వర్తించేదే. తానెపుడూ శకుంతల మొగమైనా చూడలేదని అసత్యమాడిన భర్త మాటలకు దీనయై ఇలా అనుకుంటుంది.

> **మధ్యాక్కర. తడయక పుట్టిననాడ తల్లిచే దండ్రిచే విడువఁ బడితి; నిప్పుడు పతిచేతను విడువఁ బడియెదనొక్కొ నుడువులు వేయు నింకేల? యిప్పాటి నోములు తొల్లి కడగి నోచితిని గాకేమి' యనుచును గండె డెందమున. (ఆం.చ.103)**

ప్రస్తుతం ఏదైనా ఆపద కలిగి అది దాటడానికి శక్యం కానపుడు ఆ సమయంలో అంతకుముందు వరకు వెంటాడిన దురదృష్టాలను తలచుకొని బాధపడతాం. ఆ కష్టానికి కారణమైనవారిని నిందించలేని నిస్సహాయ స్థితిలో మనల్ని మనమే నిందించుకుంటాం. ఇంత పుణ్యమే చేసుకున్నాం, ఇంతవరకే రాసిఉంటే ఏమిచేస్తాం? అని శకుంతల లాగా మనల్ని మనమే ఓదార్చుకుంటాం. ఆకాశవాణి శకుంతల చెప్పినది సత్యమేనని, భార్యను, కుమారుని స్వీకరించమని సభాసదులు వినేలా చెబుతుంది. లోకనిందకు భయపడి తానే అసత్యమాడానని దుష్యంతుడు ఒప్పుకొని శకుంతలను, కుమారుని ఆదరిస్తాడు. వివేకవంతులు ఒక భయంవలనో, పరిస్థితి వలనో చిన్న తప్పు చేసినా సమయం వచ్చినపుడు దానిని సరిదిద్దుకుంటారు. ఇలా చాలా అరుదుగానే జరుగుతుంది. ఎందుకంటే వివేకవంతులు లోకంలో చాలా అరుదుగానే ఉంటారుకదా!

ఆధార గ్రంధాలు :

1. ఆంధ్ర మహాభారతం ఆదిపర్వం - తి.తి. దేవస్థానములు 2014.
2. నన్నయ భారతి - తెలుగు విశ్వవిద్యాలయం 1993.

BHAVAVEENA
Vol. 17, Issue. 8, August 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

గుణనిధి కథ – సమకాలీనత

– డా॥. ఓ. వెంకటప్రసాదు, సహాయ ఆచార్యులు, ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాల, వనపర్తి.

తెలుగు సాహిత్య చరిత్రలో పురాణయుగానికి, ప్రబంధయుగానికి మధ్య శ్రీనాథుడు కావ్యయుగకర్తగా ప్రసిద్ధిపొందాడు. శ్రీనాథుని సాహిత్యంలోని సమకాలీనత అంశాలను ప్రస్తావించడంలో భాగంగా శ్రీనాథుడు రచించిన కాశీఖండము చతుర్థాశ్వాసమునందలి గుణనిధి కథలోని సమకాలీన అంశాలను పరిశీలిద్దాము. (గుణనిధి కథను అందులోని సమకాలినతను పరిశీలిస్తే ఆనాటికి ఈనాటికి ఎలాంటి తేడాలు లేవనేది యదార్థమేమో ననిపిస్తుంది.)

గుణనిధికథ :

కాంపిల్యనగరంలో వేదవేదాంగాలు చదివిన మహా పండితుడు, యాగదీక్షుతుడు అయిన యజ్ఞదత్తుడు అనే బ్రాహ్మణుడు వుండేవాడు. అతను నిత్యం క్రమం తప్పక ఆచారాలు పాటించేవాడు. అతనికి మన్మథుని వంటి కొడుకు వున్నాడు. అతని పేరు గుణనిధి. వాడు మంచి గుణాలకు అతీతుడు. గుణనిధికి ఆచారం ప్రకారం ఉపనయనం చేసి తల్లిదండ్రులు గురువు దగ్గరకు చదువుకోవడానికి పంపారు. యజ్ఞదత్తుడు ఇంటిపనుల తొందరలో, యజ్ఞయాగాదిక్రతువుల కార్యకలాపాలలో అనునిత్యం మునిగి వుండటం వల్ల కొడుకును గురించి శ్రద్ధ తీసుకోలేదు. గుణనిధి జూదపు ఆటలో ఆసక్తి పెంచుకుని రాత్రింబగళ్ళు జూదం ఆడుతూ చెడు నడవడితో బ్రాహ్మణాచారాలను పరిహాసం చేస్తూ, సంధ్యావందనం, అగ్నికార్యాలుమాని గీత వాద్య వినోదాలతో కాలం గడిపే వాడు. పాషాండులు, భండులు, జూదరులు, నాస్తికులు, ధాతువాదులు, నటులు, విటులు, మొదలైన దుష్టులతో స్నేహం చేస్తూ సజీవ, నిర్జీవ ద్యూతాలు ఆడి, జూదంలో ఓడిన సొమ్మును తల్లి నగలను అమ్మి చెల్లించేవాడు.

సమకాలీనత :

ఈనాటి సమకాలీన సమాజంలో యజ్ఞదత్తుని లాంటి తండ్రులు, గుణనిధిలాంటి కుమారులు ఎంతోమంది కనిపిస్తున్నారు. వారు తమ సంతానము ఉన్నత విద్యావంతులు కావాలని, ఉన్నత విద్యాభ్యాన నిమిత్తము దూరప్రాంతాలకు పంపుతుంటే వారు విద్యను సరిగ అభ్యసించక చెడు నడతలకు లోనై, ఎంతో కష్టపడి సమకూర్చిన ధనాన్ని వ్యసనాలకు విచ్చలవిడిగా ఖర్చు చేస్తూ తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. తల్లి దండ్రులకు చక్కని పాండిత్యము, చక్కని విద్య, సమాజంలో చక్కటి హోదా ఉన్నప్పటికీ కూడ వారిలా ఉన్నత విద్యావంతులు కాలేకపోతున్నారు. " పండిత పుత్ర: పరమశుంఠ" అనే సామెత ఇలాంటి వారి వల్లే వచ్చి వుంటుంది.

గుణనిధి తల్లి ఉపదేశము :

గుణనిధి సోమిదమ్మ యజ్ఞదత్తుడికి లేక లేక జన్మించిన సంతానం. అందువల్ల సోమిదమ్మ తన కుమారుడిని ఎంతో ప్రేమగా పెంచింది. తెల్లారేటప్పటికి గిన్నెలో పెరుగు, వడపిందెలతో చద్ది అన్నం గుణనిధికి పెట్టేది. గుణనిధికి పెళ్ళి అయినా కూడ జూదం ఆటపై ఆసక్తితో, తల్లి నగలను అమ్మి జూదం ఆడేవాడు. సోమిదమ్మ కుమారుడికి నిత్యం మంచిని బోధించేది. గుణనిధిని తల్లి జూదరులతో స్నేహం విడిచి, మంచివారితో స్నేహం చేయమని, తండ్రి చెప్పినట్లు చేయమని గట్టిగా బోధించేది. స్నేహార్ద్రహృదయంతో కొడుకు చేసేపనులు మాన్పించడానికి ఎన్నోవిధాల ప్రయత్నించేది.

సమకాలీనత :

నేటి తల్లిదండ్రులు తమ సంతానంపై విపరీత ప్రేమాభిమానాలు కల్గి, వారి ప్రయోజనం కోసం దేనికి

కూడ వెనుకాడకపోయేవారు కనిపిస్తారు. తండ్రి ఉద్యోగనిమిత్తము ఉదయాన్నే బయలుదేరి వెళ్ళితే, ఇక ఇంట్లో తల్లి తమ సంతానంపై విపరీత ప్రేమ చూపిస్తూ వారికి కావలసిన సకల సదుపాయాలు, అందిస్తుంటారు. తమకు లేకున్నా తమ వారికి రుచికరమైన ఆహారాన్ని అందిస్తుంటారు. వారు అడిగినంత ధనాన్ని సమకూరుస్తూ, వారి విలాసాలకు తగ్గట్లుగా తమ శక్తికి మించి అందిస్తూ, వారిపై వున్న అధిక ప్రేమతో చెడువ్యసనాలకు లోనవుతున్నట్లు తెలిసినా చూసి చూడక వూరకుంటున్నారు. ఆ అలవాట్లకు లోను కావద్దని చెప్పరు. ఎందుకంటే నేటి పిల్లలు తల్లిదండ్రులను మోసగించటం ఒకటే కాదు. అవసరమైతే వారిని బెదిరించటం, ఇంట్లోనుండి వెళ్లిపోతానని చెప్పటం, చనిపోతానని బెదిరించటం చేస్తారు. పిల్లలు అలా చేస్తే సంఘంలో తమకు చెడు పేరు వస్తుందనో, తమ పరువుకు భంగం వాటిల్లుతుందనో వారి బెదిరింపులకు తల ఒగ్గుతూ వారిని మార్చే ప్రయత్నం చేస్తూ వారిలో మార్పు కోసం ఎదురు చూస్తుంటారు. కాని అప్పటికే చెడువ్యసనాలకు బానిసలయినవారు వాటినుండి మారలేరు. అలా మారే వాళ్ళు ఏ ఒక్కరో ఇద్దరో మాత్రమే వుంటారు.

గుణనిధి తల్లి సోమిదమ్మ ఉపదేశము :

"నాయనా! నీవు వీధులలో వెఱ్ఱివాడిలా తిరుగుతూ ఉంటే, రాజుగారికి తెలుస్తుంది. రాజుగారు మీ నాన్నగారిని విడిచిపెట్టి ఆయనకు ఇచ్చిన మాన్యాలు తిరిగి తీసుకుంటారు. అప్పుడు కూడుగుడ్డలు లేకుండా, మన కుటుంబమంతా పాడవుతుంది" అని చెప్పి సోమిదమ్మ కుమారుడిని హెచ్చరించింది. కుమారుడి చెడుపనులను చూసి, ముందు కొడుకును చూసి నవ్వుతారని, తరువాత అతని తండ్రిని చూసి నవ్వుతారని, అంతేగాకుండా తల్లికి తగ్గ తనయుడు అని, తప్పనంతా తనమీద వేసి తనను కూడ లోకులు నిందిస్తారని వారి నోరు మూయలేమని ఆ తల్లి వాపోయింది.

సమకాలీనత :

నేటి కాలంలో సంతానము తల్లిదండ్రుల మాట వినడమే లేదు. తప్పుడు దారిన పోతున్నా, అలా పోవద్దని సుతిమెత్తగానే కొందరు చెబుతారు తప్ప వారిని దారికి తెచ్చుకునే ప్రయత్నమే చేయరు. కారణం వారిపై వున్న వల్లమానిన ప్రేమ. వారు సైతం లోకభయం లేకుండా విచ్చలవిడిగా ప్రవర్తిస్తూనే వుంటారు. కారణం లోకుల వల్ల భయమనేది తమ వారికి మొదటి నుండి లేకుండా చేయడమే. తద్వారా తల్లిదండ్రులే తమ పిల్లల చెడు నడతకు ప్రధానకారణం. సమాజంలో ఎవరైన మీ పిల్లలు చెడునడతకు గురవుతున్నారని చెప్పినా, మా వారు తప్పు చేయరని, వారిని తమ కుటుంబవిషయంలో జోక్యం చేసుకోవద్దని అంటారే కాని, వారిలో మార్పుకు మాత్రం ప్రయత్నించరు.

యజ్ఞదత్తుని కోపము :

ఒకసారి యజ్ఞదత్తుడు వీధిలో వెళ్తుండగా తాను ప్రేమతో తన భార్యకు ఇచ్చిన రత్నపు ఉంగరం, ఒక జూదరి వ్రేలుకు చూసి ఆ జూదరికి అది ఎలా వచ్చిందని నిలదీస్తాడు. ఆ జూదరి గుణనిధి జూదంలో ఓడిపోయి ఆ ధనాన్ని చెల్లించలేక తనకు ఈ ఉంగరాన్ని ఇచ్చాడని, ఇంకా ఎన్నో వస్తువులు తాకట్టు పెట్టి జూదం ఆడుతున్నాడని, యాగదీక్షుతులలో యజ్ఞదత్తుని వంటి గొప్పవారు లేరని అలాగే, జూదం ఆటలో యజ్ఞదత్తుని కొడుకు గొప్పవాడని తెలిపాడు. ఆ మాటలు విన్న యజ్ఞదత్తుడికి సిగ్గు, కోపం కలిగి ఇంటికి వెళ్లి కొడుకు ఎక్కడికి వెళ్ళాడని భార్యను అడిగి, తాను ఇచ్చిన ఉంగరాన్ని తెచ్చిఇమ్మని పట్టుపట్టగా సోమిదమ్మ కంగారుపడి, భోజనం చేయమని భోజనం పూర్తయ్యాక ఇస్తానని భర్తకు శతవిధాలుగా నేర్పు చేత నచ్చజెప్ప ప్రయత్నం చేసింది. కాని యజ్ఞదత్తుడు సోమిదమ్మ తనను మోసం చేసిందని, కుమారుడిని, ఇంటిని పాడు చేసిందని కోప్పడతాడు.

సమకాలీనత :

నేటి సమాజంలో తల్లిదండ్రులు తమ పిల్లలపై విపరీత ప్రేమాభిమానాలు కల్గివున్నారు. తల్లి (కొందరు) మరో అడుగుముందు వేసి వారి చెడునలతలకు కూడ

కారణమవుతుంది. వారి చెడు అలవాట్ల విషయాన్ని భర్తలకు తెలియనివ్వకుండా దాచేస్తున్నారు. " పండితపుత్ర పరమశుంఠ" అనే సామెత ఈ సందర్భంలోనే వచ్చి వుండవచ్చు. ఒకవేళ తండ్రులు కూడ కొడుకు చెడు నడతలు తెలిసినా తెలియనట్లు నటిస్తూనే వుంటున్నారు. కాని కొందరు భర్తలు, భార్యలను మందలించలేని స్థితిలో కూడ వున్నారు.

యజ్ఞదత్తుని పశ్చాతాపము :

గుణనిధి చదువు సంధ్యలు మాని, తిరుగుతుంటే, భార్య తనకు అబద్దాలు చెప్పిందని యజ్ఞదత్తుడు సోమిదమ్మపై కోప్పడతాడు. తాను కొడుకు విషయం పట్టించుకోనందుకు పశ్చాత్తాపపడతాడు. తాను చేతులార తన కొడుకును భ్రష్టుణ్ణి చేశానని విచారించాడు. తన ఇంట్లో వస్తువులు ఏమయ్యాయోనని బాధపడ్డాడు. తన భార్య తన ఇంటిని కొడుకును పాడుచేసిందని ఆమెను నిందించి, తనకు ఇంక కొడుకు చచ్చినట్లే లెక్క అని అతనికి తిలోదకాలిస్తానన్నాడు. చివరికి భార్యపై కోపం ఆపుకోలేక, ఆమెను విడిచి మరొకరిని పెళ్ళాడతాడు.

సమకాలీనత :

నేటి కాలంలో తమ పిల్లలు చెడు అలవాట్లకు గురైన విషయాలు తనకు తన భార్య చెప్పటం లేదని ఏ భర్తకూడ భార్యను నిలదీయటంలేదు. కారణం భార్యపై గల అమిత ప్రేమకావచ్చు, లేక భార్యచాటు భర్త అయినా కావచ్చు, లేకపోతే కుటుంబపోషణ భారమంతా భార్యయే చూస్తుండవచ్చనే కారణమయినా కావచ్చు. ఏది ఏమయినప్పటికి నేటి కాలపు భర్త తమ భార్యలను నిలదీయటం లేదన్నది సత్యం.

గుణనిధి పశ్చాత్తాపం :

గుణనిధికి తండ్రి కోపం తెలిసింది. తాను చేసిన తప్పు అతనికి తెలిసింది. తన దగ్గర అప్పుడు ధనం కాని, విద్యకాని లేవని, ఒకరికి పెట్టిన తన చేతితో తాను ముష్టి ఎత్తుకోలేనని బాధపడ్డాడు. మనిషికి విద్యయే సరియైన ధనమని, దొంగలు దొంగిలించే ధనం, ధనం కాదని గ్రహించాడు. యజ్ఞములు చేసినవారి వంశములో పుట్టి జూదం ఆడానని, తాను తప్పు చేశాననీ, బాధపడ్డాడు. తెల్లవారేటప్పటికి గిన్నెలో పెరుగు, వడపిందెలతో చద్ది అన్నము పెట్టే తన తల్లివంటి, ప్రాణానికి ప్రాణమైన వారు మరొకరు లేదని పశ్చాత్తాపపడ్డాడు. గుణనిధి సార్థక నామధేయుడు (కాదు). యౌవన ప్రాయంలో తల్లి ఉప దేశాన్ని పెడచెవిన పెట్టి తల్లిదండ్రులకు చెడ్డపేరు తెచ్చాడు. తన ప్రవర్తనతో తల్లి కాపురానికి ముప్పు తెచ్చాడు. చివరికి తన తప్పును గ్రహించి పశ్చాత్తాప పడ్డాడు.

సమకాలీనత :

సమాజంలో తల్లిదండ్రులు తమ పిల్లలు తప్పు చేసినప్పటికి వారిమీద వున్న అనురాగంతో మందలించరు. నేడు గుణనిధిలాంటి వ్యక్తులు కోకొల్లలుగా వున్నారు. కాని వారెవరు తాము చేసే పనులలో తప్పులున్నా సరిదిద్దుకోలేని పరిస్థితులలో వున్నారు. గుణనిధిలాంటి కొందరు తల్లిదండ్రుల మాటమీరి అసాంఘిక శక్తులుగా మారుతున్నారు తప్ప పశ్చాత్తాపపడి తమ నడవడికను మార్చుకోలేక పోతున్నారు. చాలా తక్కువ శాతం కుటుంబాలలో కొంతమంది మాత్రం తమనడవడికను మార్చుకుంటున్నారు. నాటి సమాజమైన, నేటి సమాజంలోనైన సార్థకనామధేయులు దివిటీలు వేసి వెదికినా కనిపించరు. లక్షల్లో ఏ ఒక్కరో, ఇద్దరో సార్థకనామధేయులు వుంటారు. విద్యాధనాన్ని మించిన ధనంలేదని, చక్కని విద్యను అందుకుని ప్రయోజకులు అయ్యేవారు చాలా కొద్దిమంది మాత్రమే. కొన్ని నిరుపేద కుటుంబాలలో అవిద్యావంతులైన తల్లిదండ్రులు ఉన్న వారింట్లోని సంతానం ఎంతో ఉన్నతవిద్యను అందుకుంటున్నారు. అలాంటి వారు కూడ ఏ లక్షల్లో ఏ కొద్దిమంది మాత్రమే ప్రయోజకులవుతున్నారు.

పురాణయుగం తీసుకున్నా, ప్రబంధయుగం తీసుకున్నా ఏ కాలాలు తీసుకున్నా గుణనిధి లాంటివారు

ప్రతీ సమాజంలో కనిపిస్తూనే వుంటారు. ప్రతీ తల్లి దండ్రులు తమసంతానాన్ని సరియైన దారిలో పెట్టే ప్రయత్నం చేస్తుంటారు. కాని కొంతమందిలో మాత్రమే కాలానుగుణంగా మార్పులు వస్తున్నా, సమాజంలో చాలా మంది మారకపోవటం వల్ల సమాజానికి చీడపురుగులుగా మారుతున్నారు. కాబట్టి ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లల విషయంలో చక్కని జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం వుంది. మొదట తల్లిదండ్రుల ప్రవర్తనలో మార్పు రావాలి. ఎందుకుంటే నీతి నిజాయితీలు తల్లిదండ్రులలో లేకుంటే పిల్లలకు అవి రావు. తల్లిదండ్రుల ప్రవర్తనను చిన్ననాటి నుండే పిల్లలు నిశితంగా గమనిస్తూ పెద్దలదారిలో నడుస్తుంటారు. నేటి తల్లిదండ్రులు తమ పిల్లలపై విపరీత ప్రేమతో పాఠశాలల్లో ఉపాధ్యాయులు మంద లిస్తే వెంటనే వెళ్ళి తమ వారి ముందే ఉపాధ్యాయులను దూషించడం వల్ల చెడు నడతకు తామే అవకాశమిస్తున్న విషయం అర్థం చేసుకోలేరు. తీరా చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందంలా, తేలుకుట్టిన దొంగల్లా తమ సంతానము చెడిపోయాక తీరిగ్గా బాధపడుతుంటారు. కాబట్టి మొదట తల్లిదండ్రులు తమను తాము, నీతి నిజాయితీలతో తమజీవనాన్ని సాగిస్తున్నామా లేదా అనే విషయాన్ని, పిల్లల నడవడికనూ ఎప్పటికప్పుడు, పరిశీలించకుంటూ, సమాజపరివర్తనలో వారు భాగం పంచుకుంటున్నట్లయితే నేటి సమాజంలో గుణనిధిలాంటి వారు తయారుకాకుండా చేసిన వారవుతారు.

ఆధార గ్రంధాలు :

కాశీఖండం - శ్రీనాథుడు.

⌘⌘⌘

BHAVAVEENA
Vol. 17, Issue. 8, August 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

తెలుగు కథా కావ్యాలు : సమకాలీన పరిస్థితులు

– కె.ఎస్. అన్నపూర్ణాదేవి, తెలుగు అధ్యాపకురాలు, శ్రీమతి కందుకూరి రాజ్యలక్ష్మీ మహిళా కళాశాల, రాజమహేంద్రవరం.

చిత్రరచనకు కుడ్యం ఎంత అవసరమో, కావ్య రచనకు కథ అంత అవసరం. కథా కావ్యాలు అన్నంతనే బాణుని కాదంబరి, దండి దశకుమార చరిత్ర, శుకసప్తతి మొదలైనవి మన దృష్టికి కనిపించేవి. కాని రామాయణ భారతాదులు కావు. ఇందు కథలు ప్రసిద్ధం. అంతేకాక పురాణవ్యక్తులకు సంబంధించినవి. కథాకావ్యాల్లో కథలు అలాంటివి కావు. అన్ని కథలూ కల్పితాలు. నమ్మరాని అద్భుత సంఘటనలతో, అమానుష కృత్యాలతో ఉంటాయి. పౌరాణికత్వం కంటే లౌకికత్వం ఎక్కువగా కనిపిస్తుంది. ప్రాచీన పామర కథా సమూహమంతా (Folk Lore) నిక్షిప్తమౌతుంది. కథాకావ్యాల్లో కథ ప్రధానంగా ఉత్పాద్యంగా ఉంటుంది. ఈ గుణాలున్నవి కథా కావ్యాలు.

కేతన దశకుమార చరిత్రలో పదిమంది రాజ కుమారులు దిగ్విజయాలను, పది కథలలో వర్ణిస్తాడు. పాత్రల మనసులలోని భావాలను ఎక్కువగా విశదీకరించక, వాళ్ళ రూపాన్నీ, కట్టూ, బొట్టూ, అలంకారాలను విపులంగా వర్ణించాడు.

ఆభరణాలు :

మట్టియలు, ఉజ్జ్వల మణి నూపురాలు, మొలనూలు, కమ్మపూవు, కట్టువడములు (కట్టిన పూలదండలు), గట్టి నూళ్ళు, సుద్ద సరితీగ (బంగారు తీగ), మినుకులు (తాళిబొట్టు), సంది దండలు (హస్తాభరణాలు), అంగుళీయకములు, హారికంకణాలు, చేకట్టు పాలెలు, మెరుగుటాకులు, సరిపెణలు (బంగారు గొలుసు), ఆలక్తక పూత (పారాణి), కాటుక, తిలకం మొదలైనవి ఆనాటి ఆభరణాలు, అలంకారాలుగా కేతన వర్ణించాడు. ఈనాడు ఆ ఆభరణాలు ఎన్ని ఉన్నాయో పరిశీలించవచ్చు.

దురలవాట్లు :

అపహారవర్మ కథలో జూదవర్ణన, ప్రతిమ కథలో కోడి పందాల వర్ణన, మద్యపాన వర్ణన ఇలాంటి అలవాట్లు ఆనాటి ప్రజల్లో ప్రబలంగా వ్యాపించి ఉన్నాయని తెలుస్తున్నది.

జక్కన, విక్రమార్క చరిత్రలో :

విక్రమార్కుడు పుట్టిన సందర్భంలో 'జ్యోతిశ్శాస్త్ర' ఫలితాలను కవి పేర్కొనడం ద్వారా ఆ కాలం నాటి నమ్మకాలెలాంటివో తెలుస్తున్నాయి. అంతేకాక, తీర్థయాత్రల ప్రసక్తి, పుణ్యక్షేత్రాల ప్రశంస, కోడికూత, యోగినీ రూపం, వృద్ధ విప్రులు, కస్తూరి వాసన, తమ్ములతావి మొదలైనవాని గురించి వివరించాడు. ఆనాటి భోజన పదార్థాలేమిటో వివరిస్తాడు.

"మించు కన్నులగోరగించు రాజాన్నంబు
నుపమింపరాని సద్యోఘృతంబు
నమృతోపమానంబులగు పిండివంటలు
నుజ్జ్వలంబై యొప్పునొలుపుబప్పు
మదికింపుబెంచు కమ్మని పదార్థంబులు
బహుపాక రుచులైన పచ్చళ్ళు
వడియగట్టిన యానవాల పెరుగు
సరస మధురరసావళి సముదయములు
పంచదార సమంచిత పానకములు
గమ్మకస్తూరి నెత్తావిఁగైపు చేసి
యూరుఁగాయలుఁజల్లని యుదకములను

వివాహ భోజనానంతరం, విదర్భేశ్వరుడు అతిథులందరికీ తాంబూల, మణి భూషణాది సత్కారాలు చేసి పంపాడు.

పరిమళద్రవ్యాలు, పునుగు, తిలకం, కస్తూరి, పచ్చకర్పూరంతో కూడిన తమ్ములములతావి, కుంకుమ

పంకము మొదలైన సుగంధ ద్రవ్యాలను అనాటి విలాసినులు ఉపయోగించినట్టు తెలుస్తున్నది.

అనంతామాత్యుడు - భోజరాజీయము లో సాంస్కృతిక విజ్ఞానాన్ని రెండు విధాలుగా విభజించాడు. రాజకీయ విజ్ఞానం, సాంఘిక విజ్ఞానం.

రాజకీయ విజ్ఞానంలో ఆకాలంలో ప్రజలను అన్యాయంగా హింసించే రాజుల ప్రసక్తే కనిపించదు. నేరస్తులకు అనేక రకాలైన శిక్షలుండేవి. అపరాధం చేసినవాడ్ని గడ్డి పరకలతో చుట్టి, పురం చుట్టూ తిప్పేవారు. తెకతెక ఉడికే ఉక్కు కంచాలతో నెత్తిపట్టి, ఇనుప రాగోలతో ఇరికించేవారు. ప్రత్యక్ష సాక్ష్యం లేనప్పుడు ఆ నేర నిరూపణానికి ప్రమాణాలు చేయించేవారు. యుద్ధంలో పరాక్రమం చూపిన సైనికులకు రాజులు కొన్ని గ్రామాల్నిగాని, భూమినిగాని గౌరవ సూచకంగా ఇచ్చేవారు.

సాంఘిక విజ్ఞానంలో 'స్త్రీలు': స్త్రీలకు విశిష్ట స్థానముండేది. స్త్రీవిద్య ఉందనడానికి సాక్ష్యాలున్నాయి. స్త్రీలు పురుషులతో స్వేచ్ఛగా మాట్లాడేవారని, ధైర్య సాహసాలు మెండుగా ఉండేవని తెలుస్తుంది. అంతే కాకుండా న్యాయాన్యాయ పరిగ్రహణశక్తి కూడా వీరి కున్నట్లు తెలుస్తున్నది. తనను నిరాకరించిన పరపురుషుని రాకుమార్తె 'కటకట మగతనము లేదుగా నీయందున్" అని హేళన చేయడం ఆనాటి స్త్రీల స్వేచ్ఛకు నిదర్శనం. భర్త తప్పుచేస్తే దానిన సవరించి భర్తకు ధర్మాధర్మాలను నిర్భయంగా ఉపదేశించే సాహసమానాటికి స్త్రీలలో విశేషంగా కన్పిస్తుంది.

వేశ్యలు :

భోజరాజీయంలో కన్పించే వేశ్యలకు భోగలాలసత కంటే అధికంగా వారికి విద్యపై ఆసక్తి ఉన్నట్లు కన్పిస్తుంది. యోగులను సైతం విటులనుగా మార్చగలిగిన వేశ్యలూ ఉన్నారు. సంగీతసాహిత్యవిద్యా ప్రవీణులున్నారు.

యోగులు - యోగినులు, ఆ కాలంలో యోగులను దైవాంశ సంభూతులుగా మన్నించేవారు. కేవలం పురుషులే కాక సామాన్య గృహిణులు, రాకుమార్తెలు, వేశ్యలు కూడా ఆనాడు యోగులను సేవించేవారు. యోగులే కాక యోగ కాంతలు కూడా ఆనాడు విశిష్టస్థానాన్ని ఆక్రమించారు. వాళ్ళవద్ద అనేకమైన సిద్ధులుంటాయని ప్రజలు, ప్రభువుల గాఢ విశ్వాసం.

వేషధారణం :

మణిమాణిక్యాదులు పొదిగిన కంకణాలతోనూ, దక్షిణముపైపు ధరించే అంగద హారాలతోను, కర్ణావతంసాదిక కవితాభూషణాలతోనూ, అలంకృతులైన పురుషులు నారీలోకానికే ఆకర్షణ గావించేవారు. వీరు స్త్రీలవలె శిరోజాలను ముడివైచి పూలమాలను చుట్టేవారు.

ప్రాతఃకాలములో మేల్కొగానే భగవంతుణ్ణి స్మరిస్తూ, తన అరచేతుల్ని చూచుకొనే ఆచారం అనంతుడు చెప్పాడు.

"అతడట్లు మేలకనియు,
చ్యుతు సంస్కృతియందు దగిలి శుభలక్షణల
క్షితములగు నిజకరాంభో
జ తలంబుల చూచుచుండ సమయమునందున్"

నేటికీ ఈ సంప్రదాయం ఆచరణలో ఉంది.

ఆటలు :

అంజి సొగటాలు, అచ్చనగండ్లు, ఓమన గుంటలు మొదలైన ఆటలు స్త్రీలు విశేషంగా ఆడే ఆటలు. భోజ రాజీయంలో వివిధ సంస్కృతులను, ఆచారాలను తెలుసుకోవచ్చు. నీతికథలను తెల్పేదే కాదు, సాంస్కృతిక పునర్నిర్మాణానికి ఉపయోక్తమైన గ్రంథంగా దీన్ని చెప్పవచ్చు.

'పాలవేకదిరీపతి - శుకసప్తతి' లోని సంప్రదాయాలు - విశ్వాసాలు లో ఏ జాతికైనా ఆ జాతి విశిష్టతను వ్యక్తం చేసే కొన్ని సంప్రదాయాలు, విశ్వాసాలు ఉంటాయి. ఇవి ఎప్పటినుంచి ప్రారంభమయ్యాయో చెప్పటం కష్టం.

ఆనాటి పల్లెలు 'నిత్యకళ్యాణం పచ్చతోరణం' లాగా ఉత్సవాలతో, ఊరేగింపులతో కళకళలాడుతుండేవి.

రథోత్సవాలు :

రథోత్సవాలు, జాతరలు వంటివి ఏడాదికోసారి నిర్ణీత దినాల్లో జరుపబడుతుండేవి. స్వామి రథం కదిలిందంటే ''పణవాలూ, మురజాలూ, దర్దమాలూ రోదసి బ్రద్ధ లయ్యేట్లు మ్రోగేవి. ఆ సమయంలో పొర్లుదండాలు పెట్టేవాళ్ళతోను, నృత్యం చేసే భాగవతులతోనూ, కావల్సిన వారికి నీరు, మజ్జిగ అందించే వారితోను, రాజవీధులందు రథం కదలడానికి వీలులేకుండా క్రిక్కిరిసిన ప్రజానీకంతో అతిలోకంగా ఉన్న సన్నివేశాన్ని సహజ సుందరంగా, వాస్తవంగా ఉట్టిపడేటట్లు కదరీపతి వర్ణించాడు.

సంక్రాంతి పండుగ :

మకర సంక్రాంతి మరునాడు పనులనలంకరింపచేసే ఉత్సవాన్ని 'పసులపొంగలి' అని కదిరీపతి తెలిపాడు రాయలసీమలో నేటికీ 'పసుల పొంగలి' దినంగా పేర్కొంటారు. ఆంధ్రదేశంలో 'కనుమ'గా వ్యవహరిస్తారు.

బల్యన్నం :

వ్యాధులు సోకినప్పుడు భూత బలిగా రోగికి నిండు కుండ అన్నం దిగదీసి నాలుగు బాటలు కలిసేచోట పోసి పోయేవారు. ఇలా చేస్తే వ్యాధి తగ్గి స్వస్థత చేకూరు తుందనే విశ్వాసం. ఈ ఆచారం రాయలసీమ పల్లెల్లో ఇప్పటికీ ఉంది.

తూకాలు, కొలతలు :

నూనె, ధాన్యం కొలవడానికి 'చిట్టెడు', 'పుట్టెడు' వంటి కొలతలు ఉండేవి.

జీవనవిధానం - వృత్తులు - వేషాలు - ఆభరణాలు - ఆచార వ్యవహారాలు :

శుకసప్తతిలో వివిధ వర్ణాలకు చెందిన ప్రజల వేషభాషలు సహజంగా చిత్రించబడ్డాయి. గ్రామాల పెత్తనం కరణాల చేతుల్లో, రెడ్ల చేతుల్లో ఉండేది.

కరణం :

ముదురు తలపాగతో, బాహుమూలమందు కవిలెతో, చర్మపుటొరలోని కత్తి గంటముతో, నీర్కావి దోవతితో ఆనాటి కరణం ఉన్నట్లు వర్ణించాడు.

రెడ్డి :

హలంకుడనెడిరెడ్డి రూపాన్ని ఇలా వర్ణించాడు. నడుముకు సగం, తలకు సగం వస్త్రం, అల్లిక కల్గిన పైపంచ, పాదరక్షలు, చేతిలో కఱ్ఱ, కత్తెర గడ్డము, కరకు మీసాలు, రోమాలు రొమ్ముభాగంలో, ఇలా ఆనాటి రెడ్డి ఆకారం.

రౌతు :

గీరనామం, చిన్న కోరమీసాలు, వెనుక కట్టు రుమాలు, కమ్మిపంచె, దుప్పటి వల్లెవాటు, చేతిలో కత్తి - ఇలా నిండుగా మెండుగా ఉండి చూచేవారికి ఆకర్షణీయంగా ఉండేవాడు.

స్త్రీలు :

కస్తూరి బొట్లు, పుక్కిట కర్పూర తాంబూలం లేని స్త్రీలు ఆ కాలంలో ఉండేవాళ్ళు కారు. 'జవ్వాది పదనిచ్చి' వాటిలో క్రొవ్విరులు ముడిచేవారు. రవల మట్టెల రవళితో మొలనూలి చిఱుగలంటల ఝళంఝుంఝ ధ్వనులతో, భుగ భుగ వాసించు పుత్తడి బొమ్మలాగా తిరిగేవారు. డబ్బు బాగా ఉన్న స్త్రీలు వజ్రపు కడియాలను, రవల మట్టెలను ధరిస్తే, కాపుస్త్రీలు గొంటుపూసలు, రెండు గుండ్ల ముంగరలు, పెద్ద మట్టెలు, బొబ్బిలికాయలు, ఒత్తులతోడి కడియాలు పెట్టుకొనేవారు. నాటి జంగము రాళ్ళు నాగబెత్తం, రాగినంది ముద్రగల ఉంగరం, యాగపట్టె విధిగా ధరించేవారు.

చీరలు :

'మైజరుచీర' (ఒకరకమైన పైటకొంగు చీర) చిటి కమ్మలచీర, నల్ల గరల చీరల ప్రస్తావన శుకసప్తతిలో చేయబడినది. ధనికస్త్రీలు మృదువైన శాలువా వంటి 'బురనీసు' కప్పుకొనేవారు. ఈ విధంగా 17వ శతాబ్ది నాటి సాంఘిక చరిత్రను సంతరించిన సరస కావ్యంగా శుకసప్తతి పేరుగాంచింది.

అయ్యలరాజు నారాయణామాత్యుని హంసవింశతి లో తెలుగుదేశంలోని మండలాలు, వేగినాడు, పాకనాడు,

పొత్తిదినాడు, మురికినాడు అని ఆకాలంలో వివిధ మండలాలు నాడులుగా చెలామణి అవుతుండేవి.

వ్యాపారి :

రెడ్డి - తలవరి - రూపాలు సహజంగా ఉన్నాయి.

తెల్లపైఠాణి పాగా చుట్టుకొనేవాడు. చలువవేసిన అంగీజోడు తొడుక్కుని ఎఱ్ఱని పాపోసులు వేసుకొని, చెవులకు ముత్యాల పోగులు పెట్టుకుని బయలు దేరేవాడు వ్యాపారి.

రెడ్డిగారైతే, కమ్మిపచ్చడం, గంటీలు, పోగులు, చలువ రుమాలు, జోడుంగరాలు, చేతిలో కర్ర, కాళ్ళకు కిర్రు కిర్రుమనే చెప్పులు వేసుకొని బయలుదేరేవాడు.

తలవరైతే కోరసిగ ధరించి, చలువ దుప్పటి వేసుకొని, కావియంచు రుమాలతో ఆనాడు ప్రవేశించేవాడు.

గొల్లపిల్లలు :

గొల్లల్లో సుద్దలగొల్లలు అనే తెగవారుండేవారు. వీళ్ళు ఫెళీ ఫెళమని వీరణాలు వాయిస్తూ, కొమ్ము లూదుతూ, కాటమరాజు కథలూ, కృష్ణలీలలూ గానం చేసే గొల్లలు, కంబళి, కర్ర, కావడి, మజ్జిగ ముంత, పాగాకు తిత్తి, కోత కత్తి గల రూపంతో ఉండేవారు.

బ్రాహ్మణుల ఇండ్లు :

బ్రాహ్మణుల ఇండ్లలో నిండు సున్నపుపూత వెరచాలు బోదెలు దిద్దిన దేవతార్చన మిద్దె ఉండేది. పంచ వన్నెల ముగ్గులు నింపిన బృందావనం లోగిలి గల ఇల్లు. నారికేళపు మట్టలాగ అలికిన ముంగిలి మలెసాలె ఉం డేది. ఆ ఇంట్లో మడి ధోవతి, మడతవేలే దండము, అక్షతలచిప్ప, చిత్రాసనం, చిటిచాప, దర్భలు, సమిధలు ఉండేవి. రైతుల ఇండ్లముందు పులి జూదములు గీచిన రచ్చబండలు, ప్రహారీగోడ, కోళ్ళగూళ్ళు, కంప పాతిన లేగలదొడ్డి, పిడకల కుచ్చెల, దాలిరోలు, తొట్టి, పలకల వేట ఉండేవి.

విలాసినుల అలంకారాలు :

ఆనాటి విలాసినుల అలంకారాలు ఈనాటికీ చెవు లూరించేవిగా ఉన్నవి. సరిగంచు చీర, మణులు, కమ్మలు, ఆణిముత్యాల హారం ధరించి, కలపం అందుకొని, సవరపు కొప్పు పెట్టుకొని ముంగిట నిలిస్తే దారినపోయే రసికుల కాళ్ళకు బంధాలు పడేవి. మరి కొందరు స్త్రీలు రతనాల బవిర కమ్మలు, గరుడ పచ్చల కీలు కడియాలు, కెంపుల సంది దండలు, నానుగుండ్ల వేర్లు ధరించేవాళ్ళు.

ఇంకొందరు సుందరీమణులు పగడపు చీకట్లు, రవల పల్లేరు, పువ్వులు, మణులు దాపిన ముక్కెర, గిల్కు మెట్టెలు ధరించి చూపరులకు పుల్కలు కలిగించేవారు.

పరిమళ ద్రవ్యాలు :

అంబరు, కచ్చూరం, గంబూర, జిల్లరసం, కురువేరు మొదలైన పరిమళ ద్రవ్యాలను ఆనాటి భోగులు పయోగించేవారు.

తిరునాళ్ళ వైభవం :

ఊళ్ళల్లో ప్రతిఏటా జరిగే తిరునాళ్ళ వైభవం వర్ణనాతీతంగా ఉండేది. కాండాలు, మోంబత్తులు, తిర్వళిఘలు, దివ్విటీలు వెల్లుతూ పదియారు కుజ్జుల ప్రభతో పెరుమాళ్ళ విగ్రహం తిరువీధుల్లో ఊరేగింపు వెళ్ళేది.

అప్పుడు పటహ, తమ్మట, నిస్సాణ, మర్దళాదులు, ధణధణమ్రోగేవి. అడుగడుగునకు ఏకారతి, పంచారతి, కుంభారతి, గరుడారతి మొదలైన ఆరతులు సమర్పించే వారు. సంపదలకోసం, సంతుకోసం జనం సాగిలపడి మ్రొక్కుతుంటే ఉత్సవం హృదయపర్వంగా ముగిసేది.

ఈ విధంగా 18వ శతాబ్ది నాటి ప్రజల వేషభాషలు, ఆచార వ్యవహారాలు, భోజన భాజనాదులు, హంస వింశతిలో కన్నులకు కట్టినట్టుగా కన్పిస్తాయి. ఇది ఒక విజ్ఞాన సర్వస్వం.

⌘⌘⌘

BHAVAVEENA
Vol. 17, Issue. 8, August 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

'రక్తస్పర్శ' కవుల కవిత్వం – సమకాలీనత

– భూక్యా కాశీరామ్, పరిశోధక విద్యార్థి, సెంట్రల్ యూనివర్సిటీ, హైదరాబాదు.

ఖమ్మం జిల్లా నుంచి తెలుగు కవిత్వంలో 1980 - 85 లలో దూసుకొచ్చిన వర్తమాన కవులు అఫ్సర్, ప్రసేన్, నీతారాం. వీరినే 'రక్తస్పర్శ కవులు'గా, 'ఖమ్మం కవిత్రయం'గా పిలుస్తున్నారు. అయితే రక్తస్పర్శ కవుల కవిత్వంలో తమకాలం నాటి సమకాలీనతనం గురించి, సామాజిక ఆర్థిక, రాజకీయ పరిస్థితులను గురించి ప్రతీది వివరణాత్మకంగా తమ రచనల్లో ప్రస్తావించారు. ఈ ముగ్గురు యువ కవులు కలిసి ఉమ్మడిగా 'రక్తస్పర్శ' అనే కవిత సంకలనం వేశారు. అప్పటినుండి 'రక్తస్పర్శ' కవులుగా ప్రసిద్ధి చెందారు. చాలామంది 1980ల కవుల్లో ఉన్న నిర్దిష్టత, కొత్త కవితా వస్తువుల కోసం నిరంతరం అన్వేషణ, పదచిత్రాల అల్లిక మీద కొత్త అభివ్యక్తి మీద శ్రద్ధ వంటివి చేశారు.

'రక్తస్పర్శ' కవులలో మొదటివాడైన అఫ్సర్ కవిత్వంలో ఎప్పుడూ విలక్షణ ప్రయాణమే. అఫ్సర్ తన 40 ఏళ్ళ సాహిత్య ప్రయాణంలో సమాజంలోనూ, సాహిత్య ప్రపంచంలో అనేక మార్పులు వచ్చాయి. 'రక్తస్పర్శ' కాలానికీ, 'ఇంటివైపు' కాలానికీ మధ్య నెలకొన్న పరిణామాలు అనేకం. ప్రపంచాన్ని కదపిన సంఘటనల ప్రతిస్పందనలు, సమకాలీన సమాజంలోని, సంస్కృతుల్లో, జీవన విధానాల్లో, ఉద్యమాల్లో అనేక పెనుమార్పులు సంభవించాయి.

"యెప్పుడూ ఓ నల్లబూటు కాలు నా శరీరాన్ని
కసిదీరా నలుపుతూ వుంటుంది
నీకు తెలిసో లేదో కానీ
నా కలలోకి అది వొక వెయ్యికాళ్ల దేహంగమారి గంతులేస్తుంది
భాకీరంగుల కీకారణ్యంలో బందీని
నాభాష నాకు నిషిద్ధం
నా రాత నాకు నిషిద్ధం" **(ఊరి చివర:38)**

పై కవిత్వంలో మైనారిటీ పేదల ఆవేదన కనిపిస్తుంది. అణచివేయబడ్డ వర్గాల ఆర్తనాదాలు, పోరాటాలు తిరుగుబాటు మొదలైనవి కనిపిస్తాయి. ఈ కవిత రాజకీయ పూరితమైన కవిత. సమకాలీన సమాజంలో రాజకీయ నాయకుల తీరును, పోలీసుల దౌర్జన్యాలను పేద ప్రజలను ఏవిధంగా పీడించారో ఈ కవిత్వంలో కవి అఫ్సర్ ప్రజల దమనీయ స్థితిని తెలంగాణ బతుకులను తన కవిత్వంలో ప్రస్తావించాడు.

"కుష్టు పట్టిన ఈ ఉదయం కోసమేనా
అన్ని నెత్తుటి కాల్వలు పారించాం
అంతగా నిరీక్షించాం
కాదు కాదు! కానే కాదు ...
ఈ బలహీనమైన కాంతిపుష్పం కోసం కాదు
మనం కన్నీటి సముద్రాలు అధిగమించింది!"
(రక్తస్పర్శ: 63)

భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్లు గడుస్తున్నా సమాజంలోను, మనుష్యుల్లోనూ ఎటువంటి మార్పులు రాలేదు. ఎక్కడ చూసినా అవినీతి, దొంగతనం, హత్యలు, మోసాలు, మానభంగాలు, అత్యాచారాలు. ఇటువంటి భ్రష్ట పట్టిన సమాజంకోసం మహానుభావులు త్యాగాలు చేసి, అమరుల ప్రాణత్యాగాలు చేసి స్వాతంత్ర్యం కోసం పోరాటాలు చేసి ఇటువంటి సమాజం కోసమేనా ఇన్నాళ్ళు ఎదురుచూశాం అంటూ కవి సమాజంలోని దుష్పరిణామాలను గురించి చర్చించారు.

అఫ్సర్ సామాజిక పరిణామాల్ని అర్థం చేసుకోవడంలో బాధ్యతాయుతమైన నృజనకారుడుగా ఎప్పుడు మెలకువతో, చైతన్యంతో నిరంతరం కృషి చేస్తున్నాడు. ప్రపంచాన్ని సాహిత్యంతో అధ్యయనం చేయడం వల్ల అఫ్సర్ కవిత్వం ఎప్పటికప్పుడు వైవిధ్యాన్ని సంతరించుకుంది.

'రక్తస్పర్శ' కవుల్లో రెండవ కవి 'ప్రసేన్'. రక్తస్పర్శ నించి ఏదీ కాదు వరకు కవిత్వ రచన బహుముఖంగా సాగిన ప్రసేన్ సాహితీ ప్రస్థానం. ఎప్పటికప్పుడు వ్యవస్థీకృతమైన అజ్ఞానాన్ని ప్రశ్నించడానికి ప్రసేన్ నిత్యం ప్రయత్నిస్తుంటాడు. ముఖ్యంగా ప్రసేన్ దళితుల జీవన విధానాన్ని, సమాజంలో దళితులకు ఎటువంటి గౌరవం, వారి పరిస్థితి ఎలా ఉందో ప్రసేన్ కవిత్వంలో పూసగ్రుచ్చినట్లు వివరించాడు.

వ్యవస్థీకృతమైన అజ్ఞానాన్ని ప్రశ్నించడానికి ప్రసేన్ నిత్యం ప్రయత్నిస్తుంటాడు. ముఖ్యంగా ప్రసేన్ దళితుల జీవన విధానాన్ని, సమాజంలో దళితులకు ఎటువంటి గౌరవం, వారి పరిస్థితి ఎలా ఉందో ప్రసేన్ కవిత్వంలో పూసగ్రుచ్చినట్లు వివరించాడు.

"అదే చనుబాల జోల
పూలిటి చావిడిలోంచి అదే పాతజన్మ వాసన
లక్షన్నొకొటోసారి బాలింత పరిమళం
బొడ్డు రాలిపడ్డ చప్పుడు
అంతా గతంలోలానే
రొట్టెముక్క రాజసమూ నీరుగారిన దాహం రీవీ
మింగిన రోకళ్ళ గిరాకీలూ అనాది వారసత్వమే"
(ఏదీకాదు : 8)

ఈ కవిత 'ఏదీకాదు' కవితా సంపుటిలోని 'ఐదోగోడ' ఖండికలోనిది. ఈ కవిత్వం ప్రధానంగా దళితులను సమాజంలో అగ్రవర్ణాల వ్యతిరేకతను తెలియజేస్తుంది. సమసమాజంలో కొంచెమైనా మార్పులేదని, కులసమస్య ఇంకా ఉందని, కుల సమస్య ఎప్పుడూ పాత సమస్యగానే ఆవిష్కృతం అవుతుందే తప్ప దళితులను హీనంగానే చూస్తున్నారని కవి ప్రసేన్ చెబుతున్నాడు. కులవ్యవస్థ చెదరలేదంటూ దళితచైతన్యం అంతకంతకూ పెరుగుతున్నప్పటికీ బయట సమకాలీన ప్రపంచంలో దళితులను తక్కువగా చూడడం జరుగుతుందని ప్రసేన్ తన భావాన్ని కవిత్వంలో ప్రస్తావించాడు. అలాగే 'ఏదీకాదు' సంపుటిలో 'సెకండ్ కమింగ్', 'మాలవాడలో గుణితం', 'హరిజన్ వాలాబాగ్', 'అంటరానిపాదం' మొదలైన కవితలు దళిత దృక్పథాన్ని కనబరుస్తాయి.

"రాజ్యాంగపుటల్లో ప్రశ్నార్థకాలను మొలపించి
కవితా కన్యను బూతు స్నానం చేయిస్తోన్న
కలాలను శకలాలుగా చేసి
మోడువారిన ఎడారి జీవితాలలోకి
నదులను జుట్టుపట్టి ఈడ్చుకొచ్చి
జాతి పతాకాన్ని నడి బజారులో అమ్మే చేతులను
నరికినందుకు
అందుకు
ఈ సంకెలలు" - (రక్తస్పర్శ-82)

భారత రాజ్యాంగం ఎంతో విలువలతో, నియమాలతో నిర్మించబడింది. కాని కొంతమంది స్వార్థపు రాజకీయ నాయకులు సమాజంలో ప్రజలను దోచుకొని రాజ్యాంగానికి వ్యతిరేకంగా ఉంటూ నీతి నియమాలను లెక్కజేయకుండా న్యాయాలను తప్పుదోవ పట్టిస్తూ, అన్యాయ మార్గాన్ని అనుసరిస్తున్నారని, జాతి పతాకాన్ని సైతం తాకట్టు పెడుతున్నారని ప్రసేన్ తన కవిత్వంలో చెబుతున్నాడు. కవి తను రాసే కవిత్వాన్ని జీవితంలో జన ప్రవాహాల ఉద్రిక్తతల్ని గమనిస్తూ, మదన పడుతూ ఒక తటస్థత్వాన్ని తరువాత దాని దార్శనికత్వాన్ని సాధించే కవి సమాజ పోకడలని అర్థం చేసుకుంటూ రచన చేస్తున్నాడు.

'రక్తస్పర్శ' కవులల్లో మూడవ కవి 'సీతారాం'. మనిషిని మనిషిగా చూసే మానవతావాది. వ్యత్యాసాలు, అణచివేతలు లేని సమాజం కోరే పిపాసకుడు.

సీతారాం ఓ నిరాడంబర సాహితీమూర్తి. సమాజంలో ఆవేదనలను చూసినప్పుడు కవి హృదయం తల్లడిస్తుంది. సీతారాం కవిత రచనలు సమాజంలో మార్పును కాంక్షిస్తాయి. పాఠకులను పరిణామాత్మకమైన ఆలోచనలవైపు ఆకర్షించేలా ఉంటాయి. సమకాలీన సమాజంలోని సామాజిక పరిస్థితుల మీద తన ఆవేదనను వ్యక్తం చేస్తూ 'మృత్యువు' గురించి వివరించటం, మృత్యువు అంటే

చనిపోవడం కాదు, పోగొట్టుకోవడం, కోల్పోవడం, ఒక చరిత్ర సంస్కృతి కనుమరుగవడం. మానవుడి చర్యల వల్ల ఇతర జీవజాలానికి ప్రకృతికి నష్టం కలగడం. నేడు సమకాలీన ప్రపంచంలో సమాజం నేర సమాజంగా, హింసాత్మకమైన సమాజంగా, ఉన్మాద సమాజంగా మారిపోయింది. 'పంకజవల్లి కన్నీళ్ళు' కవిత్వంలో 'పంకజవల్లి' అనే ఆవిడ భర్త గల్ఫ్ దేశంలో పనిచేస్తూ చనిపోవడంతో భర్త శవం కోసం నెలరోజులు విమానాశ్రయంకి వెళ్ళి వట్టి చేతులతో కన్నీళ్ళతో రావడం చూసి పంకజవల్లి కన్నీళ్ళు కవితను పుట్టించి ఆవేదనను వ్యక్తం చేశాడు.

"అసమర్థుడి జీవయాత్రకు
ఆత్మహత్యతో ముగింపునిస్తుంది గోడ
సినిమా కాగితాలు కప్పుకుని రెప్పలు మూస్తుంది
గోడకు నోరుంది
నక్సలైట్లే దేశ భక్తులంటుంది
తూపాకీ గొట్టాలే విప్లవ రహదారంటుంది
ప్రజాస్వామ్యం గోడమీద అసెంబ్లీ పెడ్తాయి."

(రక్తస్పర్శ : 99)

సీతారాం కవి వస్తువు నిర్మాణంలో గోడను సైతం ప్రాణముందని, చరిత్ర పేజిల్లో గోడకి సముచిత స్థానం ఇవ్వాలని కవి వ్యక్తం చేస్తాడు. గోడ మీద రాజకీయ నాయకుల పబ్లిసిటి పోస్టర్లు అంటిస్తారు. అలాగే సినిమా కాగితాలు గోడకి అంటిస్తారు. నక్సలైట్లను దేశభక్తులుగా చూపెడుతుంది గోడ అంటూ గోడను ప్రతీకగా తీసుకుని సమసమాజంలో రాజకీయనాయకుల ఆగడాలు, సినిమా వాళ్ళు జీవితాలు గోడ ఆవిష్కరింపబడతాయని, గోడకు ప్రాధాన్యం ఇవ్వాలి కవి, గుర్తింపు ఇవ్వాలని కోరుతున్నాడు.

అలాగే 'ఇదిగో ఇక్కడిదాకే' కవితా సంపుటిలో కొన్ని కవితలు సమకాలీన సామాజిక పరిస్థితులకు అద్దం పడతాయి. శిథిల సమాధి, నేను నువ్వు శవము, ఈ నీడ కరగదు లాంటి కవితలు సీతారాం కవిత్వం నిత్య నూతనంగా వికసిస్తుంది. సన్నాఫ్ మాణిక్యం కవితా సంపుటిలో అంతర్ముఖత్వం, మార్మికత, అధివాస్తవికత, లోతైన గాఢత కనిపిస్తాయి. సామాజికాంశాల సారాన్ని వైయక్తిక అనుభవాల ద్వారా వ్యక్తీకరిస్తుంది సీతారాం కవిత్వం.

సమకాలీన తెలుగు కవిత్వం ప్రధానంగా సమసమాజ నిర్మాణానికి, అభ్యుదయ దృక్పథాలను కలిగి భ్రష్టు పడుతున్న సమాజంలో సమస్యలను తెలియజేయడానికి ఎన్నో ఉద్యమాలు, రచనలు, కవిత్వాలు కవులు, రచయితలు తమ కలాన్ని పదునుపెట్టి సమాజంలో అన్ని విషయాలపై ప్రతిస్పందించి కవిత్వీకరిస్తున్నారు. ఈ 'రక్తస్పర్శ' కవులు కూడా నవ నిర్మాణానికి కృషిచేస్తూ సమకాలీన విషయాలను తీసుకొని కవిత్వంలో మానవ మనుగడను, జీవన విధానాన్ని, రాజకీయ పరిస్థితులను, ఆర్థిక, సామాజిక అంశాలను కవిత్వ రచన చేశారు.

ఆధార గ్రంథాలు :

1. 'రక్తస్పర్శ' కవితా సంపుటి - అఫ్సర్, ప్రసేన్, సీతారాం
2. ప్రసేన్ సర్వసం - ప్రసేన్
3. సీతారాం సాహిత్యం-విశ్లేషణ వ్యాసాలు - పగిడిపల్లి వేంకటేశ్వర్లు
4. ఏదీకాదు - ప్రసేన్
5. ఊరి చివర - అఫ్సర్
6. సన్నాఫ్ మాణిక్యం - సీతారాం
7. ఇదిగో ఇక్కడిదాకే - సీతారాం

⌘⌘⌘

BHAVAVEENA
Vol. 17, Issue. 8, August 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

భాగవతం – సమకాలీనత

– డా॥. బ్రహ్మానందరెడ్డి

పురాణేతిహాసాలలోని యుగపురుషులు నడిచిన విధానం, వారు అలవర్చుకున్న అలవాట్లు, వారు సమాజానికి చూపిన బాటలు అన్నీ ఆయా కాలాలకు సరిపోయే విధంగా ఉండడం గమనించదగ్గ విషయం. ప్రాక్తన మానవుడి నుండి నేటి ఆధునిక మనిషిదాకా పరంపరాను గతంగా జరిగే అన్ని విషయాలకు ఏదో ఒకచోట సంబంధం ఉంటుంది. అయితే అన్ని విషయాలలోను ఏకరూపత ఉండవచ్చు. ఉండకపోవచ్చు కూడా. ముఖ్యంగా పురాణేతిహాసాలలో మనం దైవాలుగా భావించే రాముడు, కృష్ణుడు వంటి వాళ్ళ విషయాలను కూలంకషంగా పరిశీలిస్తే, వారి జీవితాలలో జరిగిన అనేక సంఘటనలు ఇప్పటి సమాజంలోని మన జీవితాల విషయాలతో సారూప్యత కలిగి ఉంటుంది. అంటే వారు దైవస్వరూపులు అయినప్పటికీ వారి జీవితాలు సాదాసీదా మానవుడిలాగే జరిగాయన్నదానికి ప్రబల సత్యాలివి.

ప్రాచీన సాహిత్యంలో దేవతల గురించో, లేక శృంగారాది రసపోషణో, రాజులు, రాజ్యాల గురించి మాత్రమే ఉందని సమాజోపేతమైన విషయాలు లేవని చెప్పే విమర్శకుల కళ్ళు తెరిపించడానికి వీటిపై మరింత లోతైన పరిశోధనలు జరపాల్సిన అవసరముంది. వీటిలో భాగంగా సురవరం ప్రతాపరెడ్డిగారు తన ఆంధ్రుల సాంఘిక చరిత్రలోనూ, ఆచార్య పి.నరసింహారెడ్డి తన ఎర్రన జనజీవనంలోనూ అందులోని సాంఘిక జీవనాన్ని, సమకాలీన విషయాలను మనకందించడం జరిగింది. ముఖ్యంగా శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో వివిధ పరిశోధకులు పాల్కురికి సోమన రచనలు, విక్రమార్క చరితం, ఆముక్తమాల్యద, భోజరాజీయం, తెనాలి రామకృష్ణుని రచనల్లోని సాంఘిక, సాంస్కృతిక, సమకాలీన విషయాలపై పరిశోధనలు చేసి విలువైన విషయాలను అందించారు.

ప్రాచీన సాహిత్యంలోని సమకాలీన విషయాలపై పరిశోధనలు మూడురకాలుగా జరిగాయి. 1. సాహిత్య పరంగా 2.భాషాపరంగా 3. సాంఘిక, సాంస్కృతిక అంశాలపరంగా.

పై మూడింటిలో మొదటి రెండు విషయాలపై ఎక్కువ స్థాయిలో పరిశోధనలు జరిగాయి. సౌందర్య దృష్టితో చాలామంది పరిశోధన చేశారు. సాంఘిక, సాంస్కృతికపరంగా మరింత పరిశోధన జరగాల్సిన అవసరం ఉంది.

భాగవతాన్ని అధ్యయనం చేస్తే శ్రీకృష్ణుడి జీవితానికి సంబంధించిన అనేక విషయాలు నేటి సమకాలీన సమాజానికి అన్వయించడం జరుగుతుంది. ముఖ్యంగా భాగవతంలోని దశమస్కంధంలోని విషయాలు నేటి మానవ జీవితానికి, వారి చేష్టలకు దగ్గరగా ఉంటాయి.

దేవకీవసుదేవుల వివాహాన్ని ఘనంగా చేసిన కంసుడు తానే సారధిగా తన చెల్లెల్ని అత్తారింటిలో దింపడానికి బయలుదేరుతాడు. ఆకాశవాణి ద్వారా తన మృత్యువు దేవకీ అష్టమగర్భం ద్వారా వస్తుందని తెలుసుకొని, వారిని ఖైదుచేసి ఏడుమంది సంతానాన్ని బలి తీసుకుంటాడు. అష్టమసంతానం కోసం ఎదురుచూస్తుంటాడు. దేవకీ నీళ్ళోసుకుందని తెలిసి విపరీతమైన మనోవ్యాకులత చెందుతాడు. ఆమె గర్భం దినదిన ప్రవర్ధమానమౌతుంటే ఇతని వ్యాకులత అంతే స్థాయిలో పెరుగుతుంటుంది. ఒకనాడు కంసుడు చెరసాలకు వచ్చి దివ్యతేజస్సుతో వెలిగిపోతున్న దేవకిని చూస్తాడు. ఇంతటి తేజస్సుకు కారణం గర్భంలో పెరుగుతున్న తన మృత్యువు 'హరే' నని గ్రహిస్తాడు. ఇప్పుడే చంపేద్దామా అనుకుంటే స్వయాన తన చెల్లెలు అదీకాక నిండు గర్భిణీ. ఈ అపనింద ఎందుకని ప్రసవం జరిగేదాకా ఎదురు చూద్దామనుకుంటాడు.

అలా అనుకున్నాడే కానీ మృత్యుభయం అతన్ని ఎంతగా భయపెట్టిందంటే తిన్నగా కూర్చోలేడు. ప్రశాంతంగా ఉండలేడు. ఏ చిన్న శబ్దం చెవిసోకినా హరి వచ్చాడేమోనని భయం, కంటిముందు ఏది కనపడిన హరి రూపమేమో అన్న సంశయం, శరీరానికి చిన్న వస్తువు తాకిన హరిచేతి దెబ్బేమో అనే అనుమానంతో అనుక్షణం చస్తూ బ్రతుకుతుంటాడు. ఎవరు ఏది మాట్లాడిన 'హరి' అన్న మాటే వినిపించేటంతగా మారాడంటే అతన్ని భయం ఎంత ఆవహించిందో మనం అర్థం చేసుకోవచ్చు. ఈ విషయాలను పోతన అంతే హృద్యంగా పద్యమాలికల్లో అమర్చాడు.

క॥ తిరుగుచు కుడుచుచు త్రావుచు
నరుగుచు కూర్చుండి లేచుచనవరతంబుల్
హరి దలచి దలచి జగమా
హరి మయమని తలచె కంసుడారని యలుకన్

సీ॥ శ్రవణ రంధ్రములనే శబ్దంబు వినబడునది హరి
పలుకని యాలకించు
అక్షిమార్గమున నెయ్యది చూడబడు నది
హరిమూర్తిగా నోపునంచు జూచు
తిరుగుచో దేహంబు దృఢమైన సోకిన
హరికరాఘాతమో యనుచు కలుగు
గంధంబు లేమైనఘ్రాణంబు సోకిన హరిమాలికా
గంధమనుచు నదరు

ఆ॥ పలుకు లేవ్వియైన పలుకుచో హరిపేరు పలుక
బడియెననుచు భ్రమసిపలుకు
తలపులెట్టివైన తలచియా తలపులు హరితలంపు
లనుచు నలుగదలచు.

నేటి సమాజంలో కూడా శత్రుభయం, మృత్యుభయం ఆవహించినప్పుడు పైన పేర్కొన్న విషయాలు అన్ని మన శరీరంలో జరగడం వాస్తవం. కాకపోతే కంసుడు ధీశాలి కనుక గుండెపోటు (Heart attack) రాలేదు. మనం అయితే భయంవల్ల గుండెపోటు వచ్చి పైకిపోయేవాళ్ళం.

శ్రీకృష్ణుణ్ణి చంపాలని కంసుడి అనుయాయులు రావడం వారు ఒక్కొక్కరుగా బాలకృష్ణుడి చేతిలో చని పోవడం జరుగుతుంటుంది. ఈ మాయలు తెలియని నందగోపుడు తన బిడ్డకు ఏదో బాలగ్రహం సోకిందని, వాటి ద్వారా ఎలాంటి అరిష్టాలు జరగకుండా వుండాలని హోమాలు వేయించి, దానాలిస్తాడు. ఈ బాలగ్రహ దోష నివారణార్థం ఇప్పుడు మనం కూడా చిన్నపిల్లలకు మంత్రించడం, రక్షరేకులు కట్టించడం ఆనవాలు తీగా ఉంది.

మంచి కొడుకుని కన్నతల్లిగా యశోదను అందరూ కీర్తిస్తారు. యశోద జన్మసార్థకమైందని పొగడుతారు.

జగదధీశ్వరునకు చన్నిచ్చు తల్లిగా
నేమి నోము నోచె నీ యశోద
పుత్రుడనుచు నతని పోషించు తండ్రిగా
నందుడేమి చేసె నందితాత్మ.

ఇంతటి దైవాంశసంభూతుణ్ణి కొడుకుగా కలిగిన నందుడు ఎంత తపస్సు చేసుకున్నాడోనని అందరూ కొనియాడుతారు. ప్రయోజకులైన బిడ్డలు కలిగిన తల్లిదండ్రుల్ని పొగడడం అనేది సర్వకాలాలయందు మామూలు విషయమే కదా!

యశోదకు చిన్నికృష్ణుడు తలనొప్పిగా మారుతాడు. తాను చేసే ఆకతాయి పనులవల్ల విపరీతమైన కోపంవచ్చి కొట్టాలనిపిస్తుంది, తిట్టాలనిపిస్తుంది. లేక లేక కలిగిన సంతానం. అందులోనూ సాక్షాత్తు హరిస్వరూపం. ఎలా కొట్టాలో, తిట్టాలో యశోదకు అర్థంకాదు. భయపెట్టకపోతే ఎక్కడ దారి తప్పుతాడో అని భయం. చిన్నపిల్లలను దండించకపోతే తననేమి చేయరని మరింతగా రెచ్చిపోయే అవకాశముంది. ఇంటిపట్టునే ఉండమంటే ఇల్లు పీకి పందిరేస్తాడు. ఏమైతే అది అయిందని యశోద కర్రచేత పట్టుకుని కృష్ణున్ని దండించడానికి పోతే అతను అందకుండా తప్పించుకుంటూ యశోదకు అలుపు తెప్పిస్తాడు. పై విషయాలు భాగవత పద్యాల్లో

సీ॥ బాలుడీతండని భావింతునందునా యేపెద్దలును నేరరీ క్రమంబు
వెరపెరంగుటకునై వెరపింతునందునా, కలిగి లేకొక్కడుగాని లేడు
వెరపుతో నా బుద్ధి వినిపింతునందునా, తను దానయై బుద్ధి తప్పకుండు
నొండెరుంగక యింట నుండెడినందునా చొచ్చి చూడనిదొక్కచోటులేదు.

ఆ॥ తన్ను నెవ్వరైన తలపోయ బారెడు, నోజలేదు భీతి యొకటెరుంగ
డెలమి నూరకుండ డెకసక్కెములాడు పట్టిశాస్తి చేయు భంగియెట్లు

క॥ లాలనమున బహుదోషయు, లోలంబ్రాపించు తాడనోపాయములం
జాల గుణంబులు కలుగును బాలురకును తాడనంబు పథ్యంబరయన్.

చిన్నపిల్లల అల్లరి ఎక్కువైనప్పుడు గానీ, పెద్దవారిని తక్కువచేసి మాట్లాడినప్పుడు కానీ చిన్నపిల్లలను దండించడం పరిపాటే. అందుకే 'మొక్కై వంగనిది మానై వంగునా' అనే సామెతను పదే పదే వాడుతుంటారు. చిన్నప్పుడు అలవరచుకున్న విషయాలు చనిపోయేదాకా ఉంటాయని పెద్దలు పుట్టుకతో వచ్చినవి పుడకలదాకా ఉంటాయన్న సామెతను వాడుతుంటారు. యశోద స్థానంలో ఏ తల్లున్నా తన బిడ్డని క్రమశిక్షణలో పెట్టడానికి అలాంటి నిర్ణయమే తీసుకుంటుంది.

చిన్నికృష్ణుడు నందగోపుడి కొడుకైనప్పటికీ ఆలమంద లను కాయడానికి వెళ్ళడం వంశవృత్తిని పాటించడమనే విషయానికి ప్రతీక. ఆ కాలంలో పశుసంపద చాలా విలువైనది. ఇప్పుడు తన తండ్రి అనుసరించిన బాటలో బిడ్డలు పయనించడం అనేది సర్వసాధారణం. రాచబిడ్డ డైనా, సాధారణ మనిషైనా తమ పనిని నిర్వర్తించడం అనేది గొప్ప విషయం.

దేవదేవుడైన కృష్ణుడు తన బాల్యదశలో తాను గొప్పవాడన్న సంగతిని మరిచి తోటి గోపబాలురతో హాయిగా ఆడుకోవడం ఆశ్చర్యచకితుల్ని చేస్తుంది. 'ధన మిచ్చినచో మదమిచ్చున'న్న విషయాన్ని పక్కనబెట్టి వారితో కలిసిపోవడం, ఒకరి పదార్థాలను ఇంకొకరు మార్చుకొని తినడం, ఒకరిమీద ఒకరు పడి కొట్టుకోవడం, తన్నుకోవడం, ఒకరి ఎంగిళ్ళు ఒకరు తినడం ఇలాంటి విషయాన్ని సమాజ గమనంలోని మానవుడు అను సరించాల్సిన విషయాలను తెలిపేవే. పోతన కృష్ణుడు ఏ విధంగా చల్దులు తిన్నాడో అందంగా చెప్పారు.

సీ॥ కడువున దిండుగా గట్టిన వలువలో లాలితవంశనాళంబు జొనిపి
విమలశృంగంబును వేత్రదండంబును జాతిరానీక డాచంక నిఱికి
మీగడ పెరుగుతో మేళవించిన చల్దిముద్ద డావలిచేత వెలునయనునుచి
చెలరేగి కొనరి తెచ్చిన యూరుగాయలు వ్రేళ్ళసందులను దా వెలయనిఱికి

ఆ॥ నంగడీల నడుమ జక్కన గూర్చుండి నర్మభాషణముల నగవునెఱపి
యాగభోక్త కృష్ణుడమరులు వెఱగంద శైశవంబు మెఱసి చల్దిగుడిసె

భాగవతంలో సాంఘిక, సాంస్కృతిక విషయాలు కోకొల్లలుగా కనిపిస్తాయి. చాలావరకు విమర్శకులు ప్రాచీన తెలుగు కావ్యాలలో సమాజానికి పనికి వచ్చే విషయాలు పెద్దగా లేదని చెప్పడం దారుణమైన విషయం. ఎందు కంటే సమాజగమనానికి, సమాజాభ్యుదయానికి కావలసిన సరంజామా మొత్తం అందులోనే ఉందన్న నగ్నసత్యాన్ని దాయడం సూర్యుడ్ని అరచేతిలో మూయడం లాంటిదే.

నేడు తల్లిపాల వారోత్సవాలు లాంటివి చేసి, తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరమని చెప్పడం జరుగుతుంది. అయితే ఈ విషయాన్ని 14వ శతాబ్దానికి చెందిన ఎఱన తన

హరివంశంలో తల్లిపాల శ్రేష్ఠతను పేర్కొనడం వారి దూరదృష్టికి నిదర్శనం.

"తల్లిపాలు గ్రుక్కెడు తక్కినయవి పుట్టెడు
అన్న నుడువునీయెడ విశతంబయ్య కదా!"

సాహిత్యమేదైనా సమాజానికి హితాన్ని చేకూర్చేదే కానీ అహితాన్ని చెప్పేది సాహిత్యమనిపించుకోదు. ప్రాచీన తెలుగు సాహిత్యాలపై మరింత పరిశోధన జరిపి అందులోని సాంఘిక, సాంస్కృతికాంశాలు నేటి సమాజా నికి ఏవిధంగా దోహదపడుతాయో పరిశోధించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఆధార గ్రంథాలు :

1. శ్రీమద్భాగవత సంగ్రహము, గీతాప్రెస్, గోరఖ్‌పూర్, 2009.

⌘⌘⌘

BHAVAVEENA
Vol. 17, Issue. 8, August 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

చిలుకూరి నారాయణరావు "అంబ" (మొండి శిఖండి) నాటకం – సమకాలీనత

– డా॥. చుక్కాయశోద, అసోసియేట్ ప్రొఫెసర్, తెలుగుశాఖాధిపతి, శాతవాహన కళాశాల, విజయవాడ.

నాటకం - రచనా కాలం :

మహాభారత స్త్రీ పాత్రలలో "అంబ"ను ప్రధాన ఇతి వృత్తంగా స్వీకరించిన ఏకైక నాటకాన్ని చిలుకూరి నారా యణరావుగారు 1930 ప్రాంతంలో రచించారు. 1933లో ప్రథమ ముద్రణ, 1937లో దీని ద్వితీయ ముద్రణ వెలు వడింది. వ్యావహారిక భాషావాదం బలపడుతున్న రోజుల్లో దానివల్ల విజ్ఞానం వ్యాపించగలదన్న విశ్వాసంతో రచించిన ఈ నాటకాన్ని వ్యావహారిక భాషా వాదానికి రూపకర్త అయిన గిడుగు రామమూర్తి పంతులుగారికి అంకిత మిచ్చారు.

తెలుగు భాష యావత్తూ 'సంస్కృతం' నుంచే పుట్టిం దని తెలుగు భాషా చరిత్రలో నిరూపించిన నారాయణ రావుగారే భాషాభివృద్ధికి వ్యావహారం ముఖ్యమని భావించి ఈ నాటకమును రాశారు. "కొత్త తీరున నాటక కళనభి వృద్ధి చేయవలెననే ఉద్దేశ్యముతో, వ్యావహారిక భాషలో నెట్టి కావ్యములనైనా రచించి ఎంతటి ఆనం దమునైనా కలిగించవచ్చునని రూఢి చేయటానికి వ్రాసినదీ నాట కము" అని నారాయణరావుగారు తెలిజేశారు. (అంబ - మనవి మాట)

అంబ (మొండి శిఖండి) - వృత్తాంతం :

మహాభారతం - ఉద్యోగపర్వంలో అంబ వృత్తాంతం వర్ణించబడింది. ఆదిపర్వం - నాల్గవ ఆశ్వాసంలో కూడా సంక్షిప్తంగా 'అంబ' కథ ఉంది. ఆదిపర్వంలో ఉన్న కథే తిరిగి ఉద్యోగపర్వంలో కూడా చెప్పబడింది.

కాశీరాజుకు ముగ్గురు కుమార్తెలని, వారి స్వయంవర సమయంలో భీష్ముడు రాక్షస వివాహ పద్ధతిలో తీసుకొని వచ్చి విచిత్రవీర్యుడికిచ్చి వివాహం చేశాడని ఆదిపర్వంలో ఉంది.

అంబను అప్పటికే సాళ్వుడికి వాగ్దానం చేసిఉన్న విషయం హస్తినాపురం చేరిన తర్వాత అంబ చెప్పటం, భీష్ముడు అంబను సాళ్వరాజు దగ్గరికి పంపడం వరకే ఆదిపర్వంలో కనిపిస్తుంది. భీష్ముడు తన మరణకారణం "శిఖండి" అవుతాడని దుర్యోధనునికి చెప్పిన విషయం ఉద్యోగపర్వం నాల్గవ ఆశ్వాసంలో విస్తారంగా ఉంది.

ఆంధ్ర మహాభారతము - ఉద్యోగపర్వంలోని కథాసారాంశం :

కాశీరాజు కుమార్తెలు ముగ్గురిని భీష్ముడు తెచ్చిన తరు వాత సాళ్వుడిని తాను ప్రేమించినట్టు 'అంబ' సత్యవతికి చెప్పడం - సత్యవతి పెద్ద ముత్తైదువులను తోడిచ్చి అంబను సాళ్వుడి వద్దకు పంపడం - సాళ్వుడు అంబను తిరస్కరించడం - అంబ భీష్ముడిపై ప్రతీకారం తీర్చుకోవా లని శాలిహోత్ర మహాముని ఆశ్రమం చేరి శివుడిని గురించి తపస్సు చేయడం - గంగాదేవి అంబ తపస్సును మాన్పించాలని ప్రయత్నించి చివరికి "నది" కాగలవని అంబను శపించడం - ఇదిలా ఉండగా హోత్రవాహ నుడనే రాజర్షి శాలిహోత్రుని ఆశ్రమానికి రావటం - అంబను తన కూతురి కూతురుగా గుర్తించడం - విషయం తెలుసుకొని తన ఆప్తమిత్రుడైన పరశు రాముడిచేత చెప్పించి భీష్ముడికి అంబకు వివాహం జరిపించాలనుకోవడం - గురువు చెప్పినప్పటికీ భీష్ముడు తన బ్రహ్మచర్య వ్రతాన్ని వదులుకోనని చెప్పడం వల్ల కోపించిన పరశురాముడు భీష్మునితో ఇరవై ఒక్కరోజులు యుద్ధం చేసి కూడా భీష్ముని జయించలేకపోవడం - అంబ సగభాగం నదిగా మారడం - మిగిలిన సగంశక్తితో 'పరమేశ్వరుని ప్రసన్నం చేసుకోవడం - ఈజన్మ విడిచిన

తర్వాత రెండవ జన్మలో భీష్ముడిని చంపగలవని శివుడు వరమివ్వటం-

ద్రుపద మహారాజుకు సంతానం లేకపోవటం వల్ల పుత్ర సంతానానికి ఆ కాలంలోనే శివుని గూర్చి తపస్సు చేయడం - శివుడు ప్రత్యక్షమై ముందుగానే ఆడపిల్ల జన్మిస్తుందని, ఆమె కొంతకాలానికి మగవాడవుతుందని వరమివ్వటం - ద్రుపద మహారాజు కూతురు పుట్టిందనే సంగతి లోకానికి తెలియనివ్వక ఆమెను కొడుకుగానే పెంచి "శిఖండి" అనే పేరు పెట్టడం - యుక్తవయస్సు వచ్చిన తరువాత దశార్ణరాజు కుమార్తెను ఇచ్చి వివాహం చేయటం - రహస్యం తెలుస్తుందనే భయంతో శిఖండి ఆత్మహత్యకై ప్రయత్నించడం - స్థూలకర్ణుడనే యక్షుడు పదిరోజులపాటు తన మగతనం తీసుకొని ఆపద దాటించుకొమ్మని శిఖండిని మగవాడిని చేయటం - కుబేరునికి ఈ విషయం తెలిసి శిఖండి బ్రతికి ఉన్నంత కాలం నీ మగతనం అతడి దగ్గరే ఉంటుందని యక్షుడిని శపించడం - శిఖండి ద్రోణాచార్యుడి శిష్యుడై శస్త్రాస్త్ర విద్యలనభ్యసించడం - ఆ శిఖండి ఎదురుపడినప్పుడు అస్త్ర సన్యాసం చేస్తానని భీష్ముడు తన మరణ రహస్యాన్ని దుర్యోధనుడితో చెప్పటం భారతంలోని కథ.

గంగ సంగతి తప్ప చిలుకూరి వారీ కథనంతా నాటకంలో కూర్చారు. కొద్దిపాటి మార్పులు కూడా ఈ నాటకంలో కనిపిస్తాయి.

చిలుకూరివారు చేసిన మార్పులు :

- అంబా సాళ్వుల ప్రేమ వృత్తాంతం ఈ నాటకంలో కనిపించదు.
- అంబ స్వతంత్రంగా భీష్ముడితో ధర్మాన్ని గురించి చర్చించటం, ఆ చర్చలో భరతవంశ స్త్రీలలోని గుణ దోషాలు విస్తారంగా ఈ నాటకంలో చర్చించ బడ్డాయి.
- "గంగా శంతనులు - సత్యవతీ పరాశరులు - సత్యవతీ శంతనులు" అనే మూడు జంటల దాంపత్యాన్ని గూర్చి ఉన్న చర్చ ఆలోచింప చేస్తుంది. యయాతి దేవయాని కులాంతర వివాహం కూడా ధర్మ సమ్మతం ఎలా అయిందనే ప్రశ్న ఉదారవాదులకు ప్రోత్సాహాన్నిస్తుంది.
- అంబ మొదటి నుండి స్త్రీ స్వభావమైన లక్షణాలకు వ్యతిరేకంగా నడచుకొన్నట్టే కనిపిస్తుంది. పెండ్లి తరువాత ఎక్కువమంది స్త్రీలనుభవించే అవస్థను ఆమె వ్యతిరేకించడం ఈ నాటకం మొదట్లోనే కవి వర్ణిస్తాడు.
- మహాభారతంలో కేవలం "స్వయంవరం" అని మాత్రమే ఉంటే నారాయణరావుగారు "పరాక్రమ శుల్కం"గా వర్ణించారు. స్త్రీ ఇష్టానికి విరుద్ధంగా ఇలాంటి ఏర్పాటును కూడా అంబ వ్యతిరేకించడం అంబ స్వతంత్ర ఆలోచనలకు నిదర్శనం. అంబలో స్త్రీ సహజమైన లక్షణాలు లేవని చెల్లెళ్ళే అనటం, తోబుట్టువులే ఆమెను వ్యతిరేకించడం ఈ నాటకంలో కనిపిస్తుంది.
- ఒక ఉత్తమ లక్షణం మాత్రం ఈమెలోని ప్రేమ తత్వానికి పరాకాష్టగా కవి వర్ణించాడు.

అంబ :

"అందగాడైనా - కురూపి అయినా, ఎక్కువ కులము వాడైనా - తక్కువ కులమువాడైనా, బలవంతుడైనా - బలహీనుడైనా, మహారాజైనా - గంజి త్రాగేవాడైనా - నేను కోరాలి. నేను చేపట్టాలి. నేను వానింటికి పోవాలి. అప్పుడే స్వయంవరం. లేకపోతే పరంపదమే" (అంబ - పుట 14).

కోరుకున్నవాడితో సంసారం చేయటం ఆనందహేతువని, భోగభాగ్యాలకు, హొదాలకు ప్రేమ అతీతమైనదని ఆమె చెప్పిన మాట దంపతులంతా ఆచరించదగింది.

అంబ :

"నీకు భుజబలముంటే నీవు పెండ్లి చేసుకొనవలెను. చేతగానివానికా మమ్మల్ని కట్టబెడతావు మంచి ధర్మాత్ముడివే. బలవంతపు పెండ్లి వల్ల వచ్చే అనర్థాలు నీ ధర్మ

శాస్త్రాలలో లేవేమో?" - అని భీష్ముడిని ఎదిరించి పూర్వా చారాన్నే ప్రశ్నించిన ఆమె వాక్చాతురి స్త్రీ జాతికే మార్గ దర్శకంగా కవి వర్ణించాడు. (అంబ - పుట 26).

అంబ (మొండి శిఖండి) లో సామాజిక సమ కాలీనత :

పంతొమ్మిదవ శతాబ్దం తొలిరోజుల్లో సమాజంలో మూఢాచారాలు విశేషంగా పెరిగిపోయాయి.

- బాల్యవివాహాలు
- వివాహాలలో స్త్రీ ఇష్టానికి ఏమాత్రం ప్రాధాన్యం లేకపోవడం.
- వివాహం తర్వాత స్త్రీ అన్నివిధాలా నీరసించిపోవటం.
- బ్రతుకు దుర్భరం కావటం అప్పటి సాహిత్యంలో విస్తారంగా కనిపిస్తుంది.

సహజంగా సంప్రదాయాభిమానులైన నారాయణ రావుగారు సామాన్య స్త్రీని దృష్టిలో పెట్టుకొని ఈ నాటకాన్ని రాశారు. 'స్త్రీల ఆలోచనలు ఎలా ఉండేవో ! అలా ఎందుకు ఉండకూడదో' ! కవి చక్కగా వర్ణించారు. 'మగ వాళ్ళ ముఖమే చూడని ఆడవాళ్ళు ఉన్నారని' వర్ణించడం, 'బహుభార్యత్వం' - వీటన్నింటినీ వారీ నాటకంలో ఘాటుగా విమర్శించారు.

పెండ్లి చేసుకున్నవాడు కాదంటే స్త్రీ పడే బాధను స్పష్టంగా వర్ణించారు. ధర్మమన్నది మనిషి సుఖంగా బ్రతకటానికి కాలం ప్రకారం మారాలని, ధర్మం మూల స్వరూపం మారకుండా మనం ధర్మంగా భ్రాంతిపడి పాటించే ఆచారంలో మార్పు రావాలని రచయిత ఆలో చించారు. ఎవ్వరికీ కష్టం కలగకూడదనేది మౌలిక ధర్మం. కులం, స్త్రీలు స్వతంత్రించకపోవటం, ఆచారం, మూల ధర్మమైన ప్రాణి సుఖం దృష్టిలో ఆలోచిస్తే తాత్కా లికమైన ఆచారాన్ని ప్రాణి క్షేమం కోసం ప్రక్కన పెట్టాలనే రచయిత అభిప్రాయపడ్డారు.

1. అంబ వివాహ విషయంలో తప్పెవరిదో నిర్ణయిం చడం కష్టమే. కన్యలను ముగ్గురిని వీర్యశుల్కులుగా నిర్ణయించినప్పుడు వారి అభిప్రాయాన్ని అడగక పోవటం తండ్రిగా కాశీరాజు చేసిన అపరాధమే. అయితే బలమున్నవాడిదే అధికారం కనుక అత్యధిక బలసంపన్నుడికి ఇచ్చి వివాహం చేయాలనుకోవడం అప్పటి తండ్రిగా తప్పుకాదు.
2. అంబ తన ఇష్టం ప్రకారం ఎన్నుకున్న సామాన్యుడి కైనా ఇచ్చి వివాహం చేయటం ధర్మమని తండ్రితో చెప్పినా ఆ మాట వినకపోవటం కాశీరాజు చేసిన తప్పు.
3. స్వయంవరం ప్రారంభం కాగానే అంబ సాళ్వుడిని ప్రేమించిన సంగతి స్పష్టంగా చెప్పాలి. కనీసం భీష్ముడు వచ్చినప్పుడైనా చెప్పి ఉండాలి. హస్తిన చేరిన తర్వాత గంగకు చెప్పటం మరొక తప్పు. లేకపోతే ప్రేమ విఫలమైన స్త్రీలందరూ సర్దుకొని పోయినట్లే ఆమె సంసారం విచిత్ర వీర్యుడితో చక్కగా సాగిపోయేది.
4. కాశీరాజు భీష్ముడికి ఆహ్వానం పంపలేదు కాబట్టి భీష్ముడు స్వయంవర ప్రాంతానికి వెళ్ళడం లౌకిక దృష్టిలో తప్పే. కానీ భీష్ముడు ధర్మాన్ని ఆలోచించ లేదని చెప్పవచ్చు. తనను నిర్లక్ష్యం చేయటం భీష్ముడు సహించలేకపోయాడు. అది వీర ధర్మం. క్షత్రియ ధర్మాన్ని పాటించాడు. అంబ సాళ్వుడి సంగతి చెప్పగానే ఆమెను అతని వద్దకు పంపటంతో తప్పు సరిదిద్దుకున్నాడు. సాళ్వుడు ప్రేమను మరచి సగటు మగవాడిగానే ప్రవర్తించాడు.

కర్ణుడి చావుకి కారణాలనేకమన్నట్లుగా కాశీరాజు, భీష్ముడు, సాళ్వుడు - అందరూ అంబ జీవితానికి అన్యాయం జరగటంలో సమానమైన బాధ్యత వహించ వలసి ఉంటుంది.

చివరిగా ... తన ప్రేమ విఫలం కాగానే ఇక సంసారంపై కోరిక అనవసరమని భావించిన అంబ ప్రేమ కూడా అసామాన్యమైనది. తన ఒక్కదాని సంగతి కాక

స్త్రీ జాతి నంతటిని చైతన్యవంతం చేయాలన్న ఆమె ఆలోచన సంస్కర్తలకు కూడా మార్గదర్శకం అవుతుంది. స్వతంత్రమైన ఆలోచనలతో, సహేతుకంగా ప్రశ్నించే ఈమె మాట తీరు స్త్రీజాతి అంతా అలవరచుకుంటే పురుషాధిక్యాన్ని ఎదిరించడం పెద్ద కష్టం కాదు.

అంబగా పుట్టి జీవితంలో ఎన్నో అవమానాలు, కష్టాలు చవిచూసి వాటికి జన్మాంతరంలో అయినా ప్రతీకారం తీర్చుకొని ''మొండి శిఖండి''గా పిలిపించుకోవడానికి ఇష్టపడిన అంబ స్త్రీ చైతన్యానికి సంకేతంగా నారాయణ రావు గారు వర్ణించిన తీరు ముదావహం.

ఆధార గ్రంథాలు :

1) అంబ - (మొండి శిఖండి) - చిలుకూరి నారాయణరావు
2) ఆంధ్ర మహాభారతం - ఉద్యోగపర్వం - తిక్కన
3) ఆంధ్ర సాహిత్య చరిత్ర - పింగళి లక్ష్మీకాంతం.

⌘⌘⌘

BHAVAVEENA
Vol. 17, Issue. 8, August 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

ఆధునిక వేమన శతకము – సమకాలీనత

– డా॥. నల్లపనేని విజయలక్ష్మి, తెలుగు అధ్యాపకురాలు, ప్రభుత్వ మహిళా కళాశాల (స్వయం ప్రతిపత్తి), గుంటూరు.

ప్రాచీన సాహిత్యాన్ని మనం జాగ్రత్తగా గమనించినట్ల యితే గొప్ప విలువలను బోధించే పురాణాలు, ఇతి హాసాలు, కావ్యాలు ప్రజల మదిలో నిలిచిపోయాయని గ్రహిస్తాం. అయితే సాధారణ ప్రజల మదిలో ఆయా గ్రంధాలలోని కథలు నిలిచినంతగా కవిత్వం నిలబడ లేదు. భారత, భాగవతాల్లోని కొన్ని ఘట్టాలకు సంబంధిం చిన పద్యాలు, బాగా ప్రసిద్ధి పొందిన నాటకాల్లోని పద్యాలు మాత్రమే ప్రజల నోట నిలిచాయి. కాని శతకాల విషయం అలా కాదు. వేమన శతకం, సుమతీ శతకం, భాస్కర శతకం - ఇలా అనేక శతకాల్లోని పద్యాలు, వాటి భావాలు జనం నాలుకల మీద శాశ్వతంగా నిలిచి పోయాయి.

ప్రాచీన కాలంలో వెలువడ్డ శతకాలు ప్రధానంగా భక్తి శతకాలు గానో, నీతి శతకాలు గానో, ఆధ్యాత్మిక తత్వాన్ని బోధించేవి గానో ఉన్నాయి. ఆధునిక కాలంలోనూ అనేక శతకాలు వెలువడ్డాయి. ఇవి భక్తికో, నీతికో, తత్వ బోధకో మాత్రమే పరిమితం కాలేదు. కాలానుగుణంగా వ్యక్తుల ప్రవర్తనల్లో, వ్యవస్థలో చోటు చేసుకుంటున్న మార్పులను కూడా ఇవి ప్రతిబింబించాయి. ఈ శతకాలను మనం పరిశీలించినపుడు అవి వెలువడిన కాలంలోని సామాజిక, వ్యక్తిగత స్థితిగతులను తెలుసుకోగలం. ఆ విధంగా ఉపయోగపడగల శతకాలలో ఒకటి ఆర్వీయస్ సుందరం గారు రచించిన 'ఆధునిక వేమన శతకము'.

21-04-1948లో నెల్లూరులో జన్మించిన ఆర్వీయస్ సుందరం పదహారు, పదిహేడేళ్ల వయసుకే రచనలు చేయటం ప్రారంభించారు. ఇరవై సంవత్సరాల వయసులో అయన రచించిన 'తెలుగు సాహిత్యంలో దేశి కవిత' గ్రంథానికి ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ అవార్డు లభించింది. వీరు 'ఆధునిక వేమన శతకము'తో పాటు 'సుందర ప్రభవ', 'నది - నగరం' అనే కవితా సంపుటాలను వెలువరించారు. 'భావన', 'విద్యార్థి' అనే నవలలు రచించారు. 'ఆలి చిప్పలు -ఆణి ముత్యాలు' పేరుతో తొలి జానపద గేయ సంకలనాన్ని వెలువరిం చడంతో పాటు జానపద సాహిత్య స్వరూపం, ఆంధ్రుల జానపద విజ్ఞానం, 'తెలుగు - కన్నడ జానపద గేయాలు' మొదలైన గ్రంథాలను రచించారు. కన్నడం, తెలుగులలో కలిపి పదమూడు పుస్తకాలకు ఆయన సంపాదకత్వం వహించారు. పఠాభి 'ఫిడేలు రాగాల డజన్' ను, గుంటూరు శేషేంద్రశర్మ గారి 'గొరిల్లా' ను, దిగంబర కవితల్ని కన్నడంలోకి అనువదించారు. ప్రసిద్ధ కన్నడ రచయిత యు.ఆర్. అనంతమూర్తి రచించిన 'సంస్కార' నవలను తెలుగులోనికి అనువదించారు. ఉన్నవ వారి 'మాలపల్లి' నవలను కన్నడంలోనికి అనువదించారు. ఈ విధంగా ఉద్యమ స్ఫూర్తితో తెలుగు, కన్నడ సాహిత్య రంగాలలో కృషి చేసిన ఆర్వీయస్ సుందరం గారి తొలి ముద్రిత రచన 'ఆధునిక వేమన శతకము'.

సుందరం గారు ఈ శతకాన్ని 1969లో, తనకు ఇరవై సంవత్సరాల వయసులో రచించారు. ఈ శతకంలో ఆయనకు గల సామాజిక స్పృహ, సునిశిత పరిశీలనా శక్తి చక్కగా వెల్లడయ్యాయి. ఆధునిక కాలంలో మనుషు లలో పెరిగిపోతున్న స్వార్థం, మోస ప్రవృత్తి, కుటుంబ వ్యవస్థలో చోటు చేసుకుంటున్న మార్పులు మొదలైన సమకాలీన అంశాలను ఆయన ఈ శతకంలో ప్రస్తావిం చారు.

స్వార్థం - మోస ప్రవృత్తి :

ఎంత సంపాదించినా తృప్తి పడక తరతరాలకు సరిపడా ధాన్యపురాశులను పోగు చేయటం కోసం పరిగెత్తే మనుషుల లోని స్వార్థాన్ని సుందరం గారు చిన్న వయసులోనే పసిగట్టారు.

'గణపతి భుజియించు కడుపు నిండుగ నంట
నిజమొ కాదొ కాని నేటి ఘనులు
దేహమెల్ల నింప దీరదు క్షుద్బాధ'

అంటూ అటువంటి వారికి చురక వేశారు.

తన బంధువులను, ఆప్తులను కూడా నమ్మని మనిషి మనస్తత్వాన్ని గురించి ఆయన బాధను వ్యక్తం చేశారు. దేశ దేశాలు తిరిగినా గాని మనిషి కొంచెం కూడా మార లేదని, తనను తాను సంస్కరించుకొని స్వార్థాన్ని వీడ వలసిన అవసరం ఉందని సూచించారు.

'తల్లి దండ్రి గురుని తాతల నైనను
నమ్మలేడు భువిని నరుడు చూడ
మృగము కంటె నెట్లు మేలైన వాడొకో'

మనుషుల్లో పెరుగుతున్న మోస ప్రవృత్తిని ఆయన గమనించారు. పూర్వం రామాయణ కథలో మాయలు తెలిసిన రాక్షసుడు మారీచుడు మృగ రూపం ధరించి సీతను మోసం చేయడం చూశాం కాని ఇప్పుడు చూస్తే మనుషులందరూ మారీచులే అన్నారు.

'మాయ లెఱిగి నాఁడు మారీచు డొక్కడు
తాల్చె మృగపు రూపు తలఁచి చూడ
మనుజులందఱిపుడు మారీచులే కదా'

కొద్దిపాటి దానం చేసి దానిని గొప్పగా చాటింపు వేసు కునే వారి పద్ధతిని ఆయన నిరసించారు.

'ముష్టి యొకటి పెట్టి ముల్లోకములలోన
డప్పు కొట్టి చాటి చెప్పి తాము
దాన కర్ణులమను దబ్బఱ కనుమయా'

బూజు దులిపినట్లుగా మదిలోని ద్వేష భావాలను దులిపి వేయాలని అప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందని ఆయన ప్రకటించారు. అందరి భయాన్ని పోగొట్టటానికి శివుడు విషం త్రాగితే నీచులు గొంతు వరకు విషాన్ని నింపుకొని భయం గొల్పుతుంటారని, నక్షత్రాలకైనా నాశనం ఉంటుందేమో కాని కలియుగంలో నీచులు/ మూర్ఖులకు మాత్రం నాశనం ఉండటం లేదని, వారి సంఖ్య పెరుగుతూనే ఉందని బాధ పడ్డారు. చీమలలో, తేనెటీగలలో ఉన్న ఐకమత్య గుణం మనుషులలో లేదని చింతను వ్యక్తం చేశారు.

'కలదు చీమకయిన కలసి యుండు గుణంబు
తేనెటీగ కూడ తిరుగు కూడి
గుణము లేక నరుఁడు కొట్టుకొంటది యేల'

కుటుంబ వ్యవస్థలో చోటు చేసుకుంటున్న మార్పులు :

సమకాలీన సమాజంలో కుటుంబ వ్యవస్థలో చోటు చేసుకుంటున్న మార్పులను ఆయన గుర్తించారు. స్త్రీలు విద్యావంతులు కావటం, ఉద్యోగస్తులై కుటుంబ భారాన్ని మోయటానికి ముందుకు రావటం అప్పుడే ప్రారంభమైన కాలమది.

'మగఁడు ధనమొసంగ మగువలు గృహమును
దీర్చియుంతు రపుడు తెలివి కలిగి
భార్యలందఱిపుడు భర్తలైనారయా'

అంటూ కుటుంబంలో స్త్రీ స్థానం మారడాన్ని వెల్లడిం చారు. భర్త సంపాదించి తెస్తే భార్య గృహాన్ని తీర్చిదిద్దే కాలం పోయి భార్య సంపాదించి తెస్తే భర్త గృహాన్ని తీర్చి దిద్దే కాలం రావడాన్ని ముందుగానే దర్శించారాయన.

భార్యాభర్త లిద్దరూ ఉద్యోగాలకు వెళ్లడం వల్ల, ఉమ్మడి కుటుంబాలు తొలగిపోయి వ్యష్టి కుటుంబాలు ఏర్పడటం వల్ల పిల్లలకు మార్గ నిర్దేశనం చేసేవారు లేక వారు చెడిపోతున్న తీరును ప్రస్తావించారు.

'ఇంట నుండలేదు వంట చేయను లేదు
భర్త ననుగమించె భార్య కూడ
పెద్ద దిక్కు లేక పిల్లలు చెడినారు'

అప్పటివరకు ఏడేడు జన్మలుగా భావించబడుతున్న వివాహబంధం తన ప్రాభవాన్ని కోల్పోయి మూడునాళ్ల ముచ్చటగా ముగిసిపోతున్న తీరును

'ముచ్చట పడి వరుడు మూడు ముళ్లను వేసె
మూడు దినములుండి మూతి ముడిచి
ఇంతి మగని వీడి యిచ్చె విడాకులు'

అంటూ వివరించారు.

పుత్రులు పున్నామ నరకం నుండి విముక్తి కలిగిస్తారనే నమ్మకం క్రమంగా సన్నగిల్లి, నలుగురు కొడుకులున్న తల్లిదండ్రుల జీవితం నరకంగా మారుతున్న క్రమాన్ని గమనించారు. తల్లిదండ్రులను వంతులు వేసుకొని పోషించే కొడుకులు, వృద్ధాశ్రమాలకు పంపే కొడుకులు అప్పుడే తయారవుతున్న కాలమది.

'తప్పు నరకబాధ తనయులు కలిగిన
ననుచు మదిని తలచిరపుడు జనులు
నరకమందు రిపుడు నల్వురు సుతులున్న'

స్త్రీల కట్టుబొట్టులో చోటుచేసుకుంటున్న మార్పులను సైతం ఆయన ప్రస్తావించారు.

'పసువు పూయరిపుడు విసువుతో మొరటంచు
కాటుక గనినంత కనుల నీరు
స్త్రీల గతుల జెప్ప సిగ్గుచున్నది'

తత్త్వ బోధ :

తత్త్వబోధ చేసే సమయంలో సైతం సుందరం గారు సమకాలీన అంశాలను దృష్టాంతంగా చేర్చారు.

'తనువులోన జీవతత్వ మెరుంగక
వేరె కలదంచు వెదుకనేల
భానుడుండ దివ్వె బట్టి వెదుకు రీతి'

అని వేమన ఆత్మతత్త్వాన్ని తెలియజెబితే సుందరం గారు

'శీతకరుని జేరి చెచ్చెర రావచ్చు
సూర్యు చెంత జేర సులభమగునె
యాత్మ దెలియలేక యాయాసపడుటేల'

అంటూ ఆత్మతత్త్వాన్ని తెలియజెప్పే సందర్భంలో మానవులు చంద్రయానాన్ని సాకారం చేసుకున్న తీరును దృష్టాంతంగా తీసుకున్నారు. మరొక చోట కూడా ఈ విషయాన్ని ప్రస్తావించారు. మన పూర్వీకులు ఆత్మను తెలుసుకోవటం ద్వారా సమస్త విశ్వ రహస్యాన్ని బోధ పరచుకోగలిగితే ఇప్పటివారు చంద్రుని మీదికి వెళ్లడమే గొప్ప ప్రజ్ఞగా సంబరపడుతున్నారని వెక్కిరించారు.

ఇతర సమకాలీన అంశాలు :

'కర్షకాళి నింపు కన్నీటి కాలువల్
పాఱునిపుడు భువిని పైరులందు
వేయి కనుల వేల్పు వీక్షింపడు దయను'

అంటూ రైతుల కష్టాలను సైతం ఆయన స్పృశించారు.

'పరుగు లెత్తి పోయి పట్టి యాడను వచ్చు
గగనమందు నున్న గ్రహము నయిన
చుక్కలంటు ధరలు చూపున కందవు'

అని అంతకంతకు పెరిగిపోతున్న ధరలను గురించి ప్రస్తావించారు.

ముగింపు :

కేవలం నీతిబోధకో, తత్త్వ బోధకో మాత్రమే పరిమితం కాకుండా కాలానుగుణంగా వ్యక్తుల ప్రవర్తనల్లో, వ్యవస్థలో చోటు చేసుకుంటున్న మార్పులను కూడా ప్రతిబింబించిన ఈ శతకంలో 'తృప్తి లేని యపుడు తీరదు తాపంబు', 'మౌనముగా నున్న దప్పు తప్పెగాని యొప్పుగాదు' వంటి చక్కని సూక్తులున్నాయి. ఆరవయ్యవ దశకంలోని సామాజిక, వ్యక్తిగత స్థితిగతులను అధ్యయనం చెయ్యడానికి ఈ శతకం చక్కగా ఉపయోగపడుతుంది.

⌘

ఆధార గ్రంథాలు :

1. ఆధునిక వేమన శతకము - ఆర్వీయస్ సుందరం
2. వేమన శతకము
3. రచనాస్వాదనం - ఆర్వీయస్ సుందరం

BHAVAVEENA
Vol. 17, Issue. 8, August 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

జానపదకళలు – సమకాలీనత

– డా॥. రొచపాళెం పురంధీశ్వరి, తెలుగు అధ్యాపకురాలు, శ్రీ వేంకటేశ్వర ప్రాచ్యకళాశాల, తి.తి.దే. తిరుపతి.

ఆధునిక కాలంలో ప్రారంభమైన జానపద సాహిత్యం అనాదిగా ప్రజల నోళ్ళలో సజీవంగానే వుంది ఒకప్పుడు జానపద సాహిత్యమంటే కేవలం పల్లెపదాలు మాత్రమే. Folk Songs, Folk Literature. Folk lore అనే మాటలకు జానపదగేయాలు, జానపద సాహిత్యం -జాన పద సారస్వతం, జానపద విజ్ఞానం అంటారు. జాన పదులంటే సామాన్యంగా గ్రామీణులు లేదా నిరక్ష రాస్యులు అని అనుకుంటాం గానీ జనపదమంటే గ్రామమని ఆగ్రామంలో నివసించే వారిని జానపదులని ఆజానపదుల భాష, జాతి వృత్తి, ప్రాంతం జన సముదాయం. ఈ జనసముదాయం యొక్క సంప్ర దాయాలు ఆచారాలు, నమ్మకాలే జానపదవిజ్ఞానం. జాన పద విజ్ఞానం ఒక తరం నుంచి మరొక తరానికి సంక్ర మిస్తూ వుంటుంది. జానపద విజ్ఞానంలో జానపద సాహిత్యం ఒక భాగం చాలా ప్రాచీనమైంది. సంస్కృతికి సంబంధించిన అంశాలు కాలగర్భంలో కలిసి పోకుండా జానపద సాహిత్యం కాపాడుతుంది.

జానపద మనస్తత్వం కల్గిన జనసమూహంలో సాంప్ర దాయకంగా గానీ, మౌఖికంగా గానీ అభ్యాసం వల్ల గానీ పరోక్షంగా గానీ ప్రసారం పొందే వివిధ పారాలు కల్గిన సంస్కృతీ సంబంధమైన విషయాన్ని జానపద విజ్ఞానం అనవచ్చు అని ఆర్.వి.ఎస్. సుందరం నిర్వచించాడు. సంస్కృతిని, జీవితంలో అన్ని విషయలను తనలో ఇముడ్చుకో గలిగినంత విశాలమైంది జానపద విజ్ఞానం. సంస్కృతికి సంబంధించినవి, ఏ జనసముదాయంలోనైనా సాంప్రదాయికంగా జానపద విజ్ఞానం జానపదులకు ఉ ల్లాసాన్ని ఆనందాన్ని కల్గిస్తుంది. సంస్కృతిని పరిరక్షిస్తుంది. జానపదుల విద్యాభ్యాసానికి తోడ్పడుతుంది. సంప్ర దాయకంగా ప్రసారమయ్యేవి, వివిధ రూపాంతరాలు, మౌఖికంగా గాని మరో విధంగా గాని ఒక తరం నుంచి మరోతరానికి సంక్రమించేవి జానపద విజ్ఞానంలో చేరు తాయి. జానపద విజ్ఞానాన్ని నాలుగు రకాలుగా వర్గీకరించ వచ్చు. 1.మౌఖిక జానపద విజ్ఞానం 2. సాంఘిక జానపదా చారాలు 3. వస్తు సంస్కృతి 4. జానపదకళలు ప్రస్తుత నాప్రత ముఖ్య ఉద్దేశ్యం జానపదకళల విశ్లేషణ.

జానపవిజ్ఞానంతో ఆంధ్రుల జానపద కళలు చాలా ప్రాచీనమైనవి. జానపద సాహిత్యంతో పాటే జానపద కళలు పుట్టి వుంటాయని, ప్రాచీన సాహిత్యంలోని శాసనాలు వలన తెలుస్తుందిశిల్పాలలో జానపద కళలకు సంబంధించిన అంశాలున్నాయి. మానవుని జీవితంలో కళలకు ప్రముఖస్థానముంది. మానవ జీవన వికాసానికి కళలెంతో దోహదపడుతాయి. మానవ సంస్కృతిని, సంప్ర దాయాలను, ప్రజల జీవన విధానాన్ని, జీవిత సమస్యలు, కష్ట సుఖాలు, హస్యం, ఆచార వ్యవహారాలు గురించి అధ్యయనం చేయాల్సిన అవసరం ఎంతైనా వుంది. జానపదకళలులో సంగీతం, నృత్యం, రూపకం ఈ మూడిండిని జానపద కళలుగా పేర్కొన్నారు. 64 కళలలో నృత్యం సంగీతానికి పండుగలకు, వినోదాలకు సంబంధిం చిందిగానూ, రూపకం కవిత్వం, వినోదం చిత్రకళ వేష భూషణాలకు సంబంధించినవి గానూ వుంటాయి. సంగీతంలో వాద్యాలు, రూపకాలలో వేషభూషణాలు, చిత్రకళ, శిల్పం వుంటాయి.

జానపద సంగీతం :

జానపద సంగీతం సామూహిక సృష్టి ప్రాచీన మాన వుడు తన సంతోషాన్నో దుఃఖాన్నో వ్యక్తం చేయడానికి కూని రాగాలు తీసిననాడే సంగీతం ఆవిర్భవించందని చెప్పవచ్చు. ఇది అందరి సొత్తు వైవిధ్యంగా వున్నా సరళమైంది.

జనసముదాయంలో సాంప్రదాయిక ప్రచారమైన సంగీతం జానపదసంగీతం. 64 కళల్లో సంగీతం ఉత్తమ మైంది. సామూహిక కళ జానపద సంగీతం అన్ని రకాలు కలది భారతదేశం. మహోన్నతమైన సాంస్కృతిక పరంపర కల్గినది. ఈ దేశంలో ప్రతి భాషా జానపద సంగీత సంపత్తులో కళకళ లాడుతూ వుంటుంది. రాగప్రధానంగా వుంటుంది వాద్యసంగీతం, గాత్ర సంగీతం, సాహిత్యం అని సంగీతం మూడుభాగాలు వాద్య సంగీతం 64 కళల్లో ఒకటి. సంగీత వాద్యాలు 500 వున్నా వాటిలో మేళ, దేవాలయ, రణ,జానపద వాద్యాలు ముఖ్యమైనది.

- మేళవాద్యాలలో శ్రుతి, తంబుర, లయవ్యాద్యాలలో మృదంగం, సంగీత వాద్యాలలో వీణ, ఫిడేలు, నాదస్వరం.
- దేవాలయ వాద్యాలలో తంతార, ముఖవీణ, శంఖం, గంట, నగారా జీగంట
- రణవాద్యాలలో భేరి, దుందుభి
- జానపద వాద్యాలలో ఏకనాదం, తంబుర, కొమ్ము, పిల్లనగ్రోవి, డప్పు మొదలైనవి.

భారతీయ సంగీతానికి నటరాజు అధిదేవతని దీనికి మూలం సామవేదం అని జానపద సంగీతానికి సామ గానానికి వున్న పోలిక గణనీయమైంది. మానవుని గాన ప్రవృత్తి జానపద సంగీతానికి ఎలా కారణభూతమైందో అలాగే సామవేదానికి కారణమైందని విద్వాంసుల అభిప్రాయం ఆదిమమానవుడు నృత్తం చేస్తూన్నపుడు అతని శరీరావయవాల కదలికకు అనుగుణంగా కొన్ని శబ్దాలు పలకడంతో ముందుగా నృత్తం, తర్వాత అర్థ రహితమైన నాదభరిత శబ్దాలు, తర్వాత అర్థం కల్గిన పదాలు చేరి పాట పుట్టింటి. జానపదవాద్యాలు సరళ మైనవి. తెలుగు జానపద సంగీతానికి వందల ఏళ్ళుగా ప్రాణభిక్ష పెట్టినవారు భిక్షుక గాయకులు ఆదిమ వాసులైన, యానాదులు, సవరలు కోయలు, చెంచులు వున్నారు.

యానాదులో ఎట్లు బొయ్యిరో
యానాదులో ఎర్రగడ్డలో

- నెల్లూరు జిల్లాలో అందరికి పరిచితమే పందిటి మీది సొరకాయ, ఎవరికిస్తమే, రెడ్డోరికా, కాదు, కమ్మోరికా, లేదు కరణానికా, పోనీ మునిసీబుకా అనే పాట ప్రసిద్ధ చెందింది. దేశదిమ్మరులైన జానపద భిక్షుక గాయకులైన పిచ్చు కుంట్లు, శారదకాండ్రు, వీరముష్టలు, జంగాలు, భాగ వతులు, గంగిరెద్దులవారు, దాసర్లు, బుడబుడకల వారు, బవనీలు, కొమ్ములవారు, జక్కులవారు బొమ్మలాట కాండ్రు జానపద సంగీతాన్ని గాత్ర సంగీత రూపంగా కాపాడు కుంటూ వస్తున్నారు. వీరముష్టివారు జేగంట, తప్పెటను వాడుతారు.

జానపద సంగీతానికి ప్రాణభిక్ష పెట్టిన భిక్షుక గాయకులతో ఒక్కో కులం వారు ఒక్కో రకమైన పాట పాడుతారు. భిక్షాటన చేస్తూ ఒక ప్రాంతం నుండి మరో ప్రాంతానికి వెళ్తుంటారు.

శిశుర్వేత్తి పశుర్వేత్తి వేత్తి గానరసంఫణి సాంప్ర దాయికంగా చెప్పున్నమాట. సామాన్య జానపదునికి కావాల్సింది జాన పద సంగీతమే గాని శాస్త్రీయ సంగీతం కాదు. శిశువులను పశువులను ఎక్కువగా అలరించేది జానపద సంగీతమే మానవుని హృదయాన్ని ఆర్ద్ర మొన రించే గుణంతో కూడినదే జానపదసంగీతం.

జానపద నృత్యం :

మానవుడు మొట్టమొదట సృష్టించుకున్న కళాప్రక్రియ నృత్యం. నృత్యం మాటకంటే పాట కంటే ప్రాచీనమైంది. మనిషికి నృత్యం మానసిక అవసరం అది మనిషికి తృప్తి నిస్తుంది. మనిషి నమ్మకాలకు ఆచరణలకు, సంప్ర దాయాలకు నృత్యం ప్రతినిధిగా నిలుస్తుంది. జానపద నృత్యాలో గెంతడం, కుంటడం, చిందులేయడం, ఆడడం ప్రధానం.

జానపద విజ్ఞానంలోని అతి ప్రాచీనమైన విభాగాలలో నృత్యం ఒకటి ప్రాచీనకాలంలో మానవుడు ధార్మిక

సంబంధమైన ప్రతి పనిలో నృత్యం చేస్తూ ఆదేవాడు పాడేవాడు నృత్యం పాట కంటే ప్రాచీనమైంది. మానవుని అనుభవం సంతోషం దుఃఖం వేదన ఆప్యాయత, పుట్టుక, చావు, మానసికమైన అవసరం లయాత్మకమైనవి మనిషికి నమ్మకాలకు ఆచరణలకు, సంప్రదాయాలకు నృత్యం ప్రతినిధిగా నిలుస్తుంది. ప్రకృతిలోని వివిధ ప్రాణుల లాస్యమే మానవుని నృత్యానికి మూల మైందని చెప్ప డానికి మగనెమలి శృంగారకేళి నృత్యాన్ని చెప్పవచ్చు.

సరళసుందరమైన జానపదనృత్యంలో ఉత్సాహా వేశాలు జానపదులనృత్యానికి జీవం వ్యక్తి కంటే సమిష్టికే ప్రాధాన్యానిచ్చిన జానపదులు సామూహిక నృత్యాలుకు ప్రాధాన్యతనిచ్చారు. నేటికీ చెంచులు, యానాదులు, సవరలు, తొదవలు బెట్టకురుబలు, గోండులు, కోయలు నృత్యాలు చేస్తుంటారు. గోండల గూసాడి నృత్యం, కొండ రెడ్ల మామిడి, ఖోందుల నెమలి, అరకులోయలో దిమ్సా లంబాడీ, సిద్ధి, బతకమ్మ, బొడ్డెమ్మ, తప్పెటగుళ్ళు, డప్పు, పులివేషం, బుట్ట బొమ్మలాట, గొబ్బి, గుర్రపు, కురువ, కోలాటం, గరగ వీర, గరగ అశ్వ, చెక్కభజన, పండరి భజన, ఘట, పులివేషం, డప్పులు, దోమ్మరాట వీరభద్ర విన్యాస నృత్యాలు జానపద నృత్యాలుగా చెప్ప వచ్చు.

లంబాడీ నృత్యం :

ఆంధ్రప్రదేశ్‌లో చాలా ప్రాంతాల్లో ఆదిమావాసులైన లంబాడీలు నివశిస్తున్నారు. వీరినే సుగాలీలు అని అంటారు. లంబాడీ స్త్రీలు పర్వదినాల్లో తీరిక సమయాల్లో బృందనృత్యం చేస్తారు. తప్పెటలకునుగుణంగా తమ చేతి దంతపు గాజుల, కడియాల శబ్దాలను లయగా చేసుకొని వీరు ఎంతో వైవిధ్యంగా నృత్యాలు చేస్తారు.

జానపదరూపకం :

జానపదరూపకం ఒక ప్రదర్శనకళ మిశ్రకళ జానపద రూపకంలో నృత్యం, సంగీతం, వేషధారణ, చిత్రలేఖనం, సంభాషణలు మొదలైనవి వుంటాయి. వివిధ రూపాలతో, భావాభినయంతో వికాసం చెందిన కళ జానపదరూపకం. బయలాటలు, వీధిభాగవతాలు, తోలుబొమ్మలాటలు దొమ్మరాటలు, మొదమైనవి జానపదరూపకాలు. రూపకం కూడా ఒక ఆట ఆటలలో వున్న సంఘర్షణ రూపకాలలో వున్నాయి. జానపద రూపకాలు జానపదులకు ఆనందాన్ని మనోల్లాసాన్ని కల్గిస్తాయి. నాట్యశాస్త్రంతో ప్రారంభమైన రూపకాలు నేటి అటవికుల ఆటల వరకు ప్రతిబింబించాయి.

జానపద రూపకాల్లో అత్యంత ప్రసిద్ధమైనవి పగటి వేషాలు. ప్రజలకు వినోదాన్నిచ్చి ఆనందింపచేసేవి పగటి వేషాలు. జాన పదులకు ఏకైక వినోదసాధనాలు జానపద రూపాలు పగటివేషాలు ఆంధ్రుల అపురూప ప్రదర్శన రూపకం. నాయకరాజుల కాలంలో తంజావూరు, మధుర రాజ్యాలలో యక్షగానాలతో పాటు పగటి వేషాలు ప్రాచుర్యం పొందాయి. ఆంధ్రులు గర్వించదగ్గ జానపద రూపకం పగటివేషాలు బాపన, చాకలి, దాదినమ్మ, లంబాడీ, తాటకివేషాలు సంచారి పగటి వేషాలుగా చెప్పవచ్చు. అర్ధనారీశ్వర, రామలక్ష్మణులు, ఎచ్చలకారి, ఆంజనేయ గాంధీ, కృష్ణుడు, జాంబవంతుడు లాంటి వేషాలు స్థానిక పగటి వేష ప్రదర్శనలుగా చెప్పవచ్చు.

బొమ్మలాటలు శాతవాహనుల కాలం నాటికే ప్రచారంలో వున్నాయి. శాసనాల్లోనూ, పండితారాధ్య చరిత్రలోనూ బొమ్మలాటల ప్రసక్తి వుంది. తెలుగు సాహిత్యంలో కొయ్య, తోలు, జంత్రపు, కీలుబొమ్మల ప్రస్తావన వుంది. ఆంధ్రులకు గర్వకారణమైన తోలు బొమ్మలాటలు తెలుగు వారి సొత్తు బొమ్మలాటలు కొయ్యబొమ్మలాటలు తోలుబొమ్మలాటలని రెండురకాలు ఆంధ్రదేశం తోలుబొమ్మలాటలకు ఉత్తర భారతదేశం కొయ్య బొమ్మలకు ప్రసిద్ధం. ఆంధ్రప్రదేశ్‌లో అనంత పురం జిల్లాలో హిందూపురం, చిత్తూరు జిల్లా సంత వేలారుల్లో కొయ్యబొమ్మలాటలు ప్రదర్శించే బృందం వుంది.

జానపద రూపకంలో ప్రాశస్యం పొంది తెలుగువారి ఖ్యాతిని భారతదేశంలోనే కాక ప్రపంచదేశాలకు వ్యాపింప

చేసింది తోలుబొమ్మలాట తోలుబొమ్మలాటలకు పుట్టిల్లు ఆంధ్రదేశంలోని తూర్పుగోదావరి జిల్లా. వీటి తయారీకి జింక దుప్పి, మేక, గొర్రె, గాడిదల చర్మాన్ని ఉపయోగిస్తారు. వీరు సంచార జీవులు మంచి చిత్రకళా నైపుణ్యం తోలు బొమ్మల తయారీతో కన్పిస్తుంది.

వీధిభాగవతాలను వీధి భాగోతమని, వీధి నాటకమని, బయలాటలని రకరకాల పేర్లున్నాయి. ఆంధ్రప్రదేశ్ తీర ప్రాంతాలలో నేటికి సజీవంగా వున్న జానపద కళారూపకం వీధి భాగోతం, భరతుడు రూపకాలును 10 రకాలుగా చెప్పాడు. దీనిలో వీధి కూడా ఒకటి వీధిలో ఆడేది వీధి అని ఒక్కమాటలో చేప్పవచ్చు. వీటి ప్రదర్శన రాత్రి 10 గంటలకు ప్రారంభమై మర్నాటి ఉదయం వరకు జరుగుతుంది.

ముగింపు :

జానపద సంగీతం ఆవేశాన్ని, ఉద్వేగాన్ని, సంతోషాన్ని ఇస్తుంది చిన్నపిల్లలను నిద్రపుస్తుంది. పెద్దవారిని మేల్కొల్పుతుంది జాన పద సంగీతంలో ఒక విధమైన సమ్మోహనాశక్తి వుంది పూనకాలుకు జానపద సంగీతమే ఉపకరిస్తుంది జానపదుల నృత్యంలో జానపదులు వేసే చిందులు ఎంతో ప్రయోజనాత్మకమైనవి వానకోసం, రోగనివారణకోసం దేవతా ప్రీతికోసం ధార్మిక నృత్యాలు చేస్తారు. జానపదుల ఉద్వేగాన్ని తగ్గించుకోవాలంటే చిందులు తొక్కడం ఒక మార్గం. ధార్మిక ఆచరణలకు సంబంధించిన రూపకాలు జానపద కళలలో చోటుచేసుకున్నాయి.

ఈ విధంగా జానపదసాహిత్యంలో ఆంధ్రుల జానపద విజ్ఞానంలో జానపదకళలకు ఒక ప్రత్యేక స్థానాన్ని కల్పించారు జానపద సాహిత్యంతో పాటే జానపదకళలు పుట్టాయని భావిస్తున్నారు. అందుకే ఆంధ్రుల జానపదకళలు చాలా ప్రాచీనమైనవని చెప్పవచ్చు.

ఆధార గ్రంథాలు :

1. ఆంధ్రుల జానపదవిజ్ఞానం - డా॥ ఆర్వీయస్. సుందరం

⌘⌘⌘

BHAVAVEENA
Vol. 17, Issue. 8, August 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

తొలితరపు తెలుగు నవలలు – సమకాలీనత

– డా॥. వి. బాలిరెడ్డి , రీడర్, తెలుగుశాఖ, యస్.వి. ఆర్ట్స్ & సైన్స్ కళాశాల, గిద్దలూరు, ప్రకాశం జిల్లా.

ఆధునికాంధ్ర సాహిత్య ప్రక్రియలన్నింటికీ ఆంగ్ల సాహిత్యమే ఆధారభూమిక అన్నది తెలిసిన విషయమే. ఇట్టి ఆధునిక ప్రక్రియలుగా నవల, కథానిక, జీవిత చరిత్ర, స్వీయ చరిత్ర, వ్యాసం, విమర్శ, పరిశోధన మొదలై నవి కన్పిస్తున్నవి. వీటిల్లో ప్రథమంగా చెప్పుకోదగినది నవల. ఇది అత్యంత విస్తారంగా వ్యాపించిన సాహిత్య ప్రక్రియ. ఆంగ్లంలోని 'Novel' అనే పదం తెలుగులో 'నవల'గా రూఢికెక్కినది. దీనిని అనేక మంది నవలా కారులు అనేక రీతుల్లో నిర్వచించినప్పటికీ వాటన్నింటి సారాంశంగా "సమాజంలోని వ్యక్తుల యథార్థ జీవన విధానాన్ని కళాత్మకంగా చిత్రిస్తూ వ్యక్తుల ఆచార వ్యవహారాదులను సమకాలీయంగా సహజంగా వర్ణించేది నవల అని తెలుస్తున్నది. ఈ నేపథ్యంతో ఆధునిక కాలంలో 1872 ప్రాంతంలో నరహరి గోపాలకృష్ణమచెట్టి రచించిన శ్రీరంగరాజుచరిత్రను తొలితెలుగు నవలగా భావించినప్పటికీ 1878 ప్రాంతంలో కందుకూరి వీరేశలింగంగారు రచించిన 'రాజశేఖర చరిత్ర' తొలి తెలుగు నవలగా స్థిరపడినది. తరువాతి కాలంలో నవలా రచన ప్రభంజనంగా మారటంతో అనేక నవలలు తెలుగులో తామరతంపరగా ఆవిర్భవించి సమకాలీన సామాజిక జీవన చిత్రణను పరిపరి విధాలుగా ఆవిష్కరించిన విషయం తెలిసినదే. వీటిల్లో కొన్ని తొలితరం నవలలు చిత్రించిన సమకాలీనతను ఈ వ్యాసం పరిశీలిస్తున్నది.

కందుకూరి వారి రాజశేఖర చరిత్ర-సమకాలీనత:

ఆంగ్ల సాహిత్యంలోని ఆలివర్ గోల్డ్‌స్మిత్ గారు రచించిన "ది వికార్ ఆఫ్ వేక్ ఫీల్డ్" అనే నవల ఆధారంగా వీరేశలింగం పంతులుగారు దీనిని రచించారు. వివేక చంద్రిక అనేది దీని నామాంతరం. హచిన్‌సన్ అనే ఆంగ్ల రచయిత దీనిని 'ఫార్చ్యూన్స్‌వీల్' అనే పేరుతో ఆంగ్లంలోకి అనువదించారు. ఆధునిక కాలంలో కూడా మూఢనమ్మకాలతో, అంధవిశ్వాసాలతో, బాల్యవివాహాలతో, సంప్రదాయ కట్టుబాట్లతో కొట్టుమిట్టాడుతున్న ఆంధ్రసమాజం సామాజికస్పృహతో, జనచైతన్యంతో సంస్కరణలతో కూడిన నూతనత్వంవైపు అఱ్ఱులు చాస్తున్న సమయంలో రాజశేఖరచరిత్ర నవలగా సరికొత్త సాహిత్యప్రక్రియగా 1878 ప్రాంతంలో రూపుదిద్దుకొన్నది.

క్రీ.శ.1878 నాటికి దేశంలో పాతికేళ్ళలోపు వితంతువులు దాదాపుగా 12 లక్షల దాకా ఉన్నట్లు అంచనా వేయబడింది. బాలవితంతువుల పరిస్థితి అత్యంత హృదయవిదారకం. వీరికి అక్షరజ్ఞానం అసలే లేదు. లోకజ్ఞానం దాదాపు శూన్యం. వీరి జీవితంలో పునర్వివాహమనేది కలలో కూడా కాంచలేనిది. పరపురుషుణ్ణి చూడటమే మహాపాతకంగా భావిస్తున్న రోజులు. మత కల్లోలాలు, కులకల్లోలాలు, చాతుర్వర్ణ్యవ్యవస్థ, అంటరానితనం, మూఢనమ్మకాలు, అంధవిశ్వాసాలు, భూతాలు, ప్రేతాలు, పిశాచాలు, మంత్రాలు, యంత్రాలు, తంత్రాలు మొదలైనవి ఆనాటి జనజీవన విధానంలో అతి సాధారణాలు. వీటన్నింటిపై ఎక్కుపెట్టిన మహాస్త్రమే రాజశేఖర చరిత్ర.

గోదావరి తీరప్రాంతమందు బ్రాహ్మణ కుటుంబాల జీవన విధానాన్ని, వారి కాలం చెల్లిన ఆచారవ్యవహారాల్ని, సంస్కృతి సంప్రదాయాల్ని అద్దంపడుతూ ఆవిష్కరింపబడినదే రాజశేఖర చరిత్ర. ఆనాటి సాంఘిక పరిస్థితులన్నింటినీ ఇది ప్రతిబింబిస్తున్నది. సంపన్న మధ్యతరగతి బ్రాహ్మణ కుటుంబానికి చెందిన రాజశేఖరుడు ఈ నవలలో నాయకుడు. బంధుప్రీతి, ఆశ్రితపాలన, దొంగ బైరాగులపై నమ్మకం, తద్దినాలు శ్రాద్ధకర్మలు మొదలైన వాని వలన సంపదనంతటినీ చేజార్చుకొన్న సదాచార సంపన్నుడితడు. కటిక దారిద్ర్యాన్ని భరించలేక లంకంత

ఇంటిని తాకట్టుపెట్టి కట్టుబట్టలతో వితంతు కూతురుతో సకుటుంబంగా కాశీయాత్ర చేశాడు. తుదకు మూఢ నమ్మకమనే చట్రాన్ని చ్ఛేదించుకొని లోకజ్ఞానంవైపు పయనించాడు. ఈతని ముఖంగా కందుకూరివారు సమ కాలీన సంఘసంస్కరణను సాధించారని చెప్పాలి.

ఉన్నవవారి మాలపల్లి నవల - సమకాలీనత :

1920 ప్రాంతంలో సమాజంలో అతి బలిష్ఠంగా వేళ్ళూ నుకొని పోయిన సామ్రాజ్యవాదాన్ని పెకళించాలనే ధ్యేయంతో, జాతీయవాదాన్ని విస్తరింపచేయాలనే ఆకాంక్షతో, దీన దళిత జనోద్ధరణ నేపథ్యంతో మానవ విలువలను పెంపొందిస్తూ సామ్యవాద స్థాపనా లక్ష్యంగా ఉన్నవ లక్ష్మీనారాయణ గారి నుండి ఊపిరిపోసికొన్నదే 'మాలపల్లి' నవల. ఉన్నవ వారు జాతీయోద్యమంలో భాగంగా పలనాడు పుల్లరి సత్యాగ్రహానికి నాయకత్వం వహించడం వలన ప్రాప్తించిన జైలు వాసంలో మాలపల్లి మొదటి భాగం పురుడుపోసికొనడం విశేషం. 1923 సం॥లో రెండో భాగం పూర్తిచేసికొని ప్రచురింపబడింది. నిరంకుశ బ్రిటిష్ ప్రభుత్వ ఆగ్రహానికి లోనై 1928 లోను మరల 1935 లోను రెండుసార్లు నిషేధింపబడి 1937లో కాంగ్రెస్ మంత్రివర్గం ఏర్పడినపుడు నిషేధం ఎత్తి వేయబడింది. దీనినిబట్టి సమకాలంలోని జాతీయోద్య మాన్ని మాలపల్లి ఎంతగా ప్రతిబింభించిందో అర్థమౌ తున్నది.

మాలపల్లి నవలలో ఆనాటి కార్మికోద్యమం, రైతు కూలీ ఉద్యమం, స్వాతంత్ర్యోద్యమం ముప్పేటలా కన్పి స్తాయి. వ్యవసాయదారుడైన రామదాసు పెద్దకొడుకు వెంకటదాసు. రెండో కొడుకు సంగదాసు. ఇతడు నాయ కుడుగా కన్పిస్తాడు. కరుడు కట్టిన చౌదరయ్యకు ఇతడు పెద్ద జీతగాడు. ఇతడు సాటి కూలీల కొఱకు "వ్యవ సాయానికి కూలీవాడు ముఖ్యుడుకాని మీరు చెప్పే భూస్వామి కాదని" కూలీల తరపున వాదించి కూలీని పెంచిపించి యజమాని చౌదరయ్యపై విజయం సాధిం చాడు. దానితో కక్ష్య పెంచుకున్న చౌదరయ్య రామదాసు భూమినంతటినీ ఆక్రమించికొనడంతో భరించలేని వెంకటదాసు 'జగ్గడు'గా పేరు మార్చుకొని బందిపోట్ల నాయకుడై పోలీసులచేత శిక్షింపబడి మరణిస్తాడు.

అత్యంత క్రూరుడైన చౌదరయ్య ఆస్తి హక్కును, దోపిడీతనాన్ని ఎదిరించిన సంగదాసును కడుపులోంచి కట్టలు త్రెంచుకున్న ఆవేశంతో, ఆక్రోశంతో, భయంకర క్రూరత్వంతో సంగదాసును వధించిన తీరును ఉన్నవ వారు ఇలా చెబుతారు.

"సంగదాసు తల దానిమ్మపండువలె బద్దలైంది. లోకంలో అక్రమాలను చూసి ఆక్రోశించిన రక్తం, ఉన్నత భావాలను ఉద్రేకించిన రక్తం, పరుల సేవలో పొంగి పోయిన రక్తం, పవిత్ర భావాలచేత పావనమైన రక్తం గొట్టాన చిమ్మినట్లు చిమ్మి భూమి పావనమైంది." ఈ మాటలు ఆకాలంనాటి సాంఘిక పరిస్థితులన్నింటికీ అద్దం పడుతున్నవి.

వధింపబడుతున్న సంగదాసు తాను మరణించి నప్పటికీ తన సిద్ధాంతాలు, ఆశయాలు భావికాలంలో విజయాలను పొందుతాయని విశ్వసించి "తాను తప్పక విజయం పొందుతానంటూ, చివరిమాటలతో నేల కొరిగాడు. అందుకే ఈ నవల 'సంగవిజయం' అనే నామాంతరంతో కూడా ప్రచారమైనది.

విశ్వనాథవారి నవలలు - సమకాలీనత :

ఆధునికాంధ్ర సాహిత్యంలో ఒక గొప్ప మైలురాయి కవిసామ్రాట్టు శ్రీ విశ్వనాథ సత్యనారాయణగారు. భార తీయ జ్ఞానపీఠ అవార్డు గ్రహీతయైన విశ్వనాథగారు ఆధునికాంధ్ర సాహిత్యంలో దాదాపు సాహిత్య ప్రక్రియ లన్నింటిలోను అందెవేసినచేయి. ముఖ్యంగా నవలా రచనలో వీరు తనదైన ముద్రను సాధించారు. అత్యంత క్లిష్టమైన మానవ జీవితాన్ని అందలి వ్యథలను, వేదనలను అతిసన్నిహితంగా సమకాలీన భూమిక మీద వీరు దర్శించి, అనుభవించి, విశ్లేషించి దాదాపు 60 నవలల్ని రచించి నవలా రచనలో బిగువైన పట్టు సాధించారు. ఈ నవలలన్నింటినీ స్థూలంగా సామాజిక, రాజకీయ, చారిత్రక నవలలుగా వర్గీకరింపవచ్చు.

వీరి తొలి నవల 'అంతరాత్మ,' ఇందలి కథావస్తువు 1916 నుండి 1923 వరకు కొనసాగుతుంది. ఇందులో విశ్వనాథ గారు జాతీయోద్యమం, సహాయ నిరాకరణోద్యమాల గూర్చి చెప్పడంతోపాటు అప్పటి సామాజిక, రాజకీయ, ఆర్థిక విషయాలను చక్కగా చర్చించారు.

వీరి 'ఏకవీర' నవల విశిష్టరీతిలో రచింపబడింది. ఊహాప్రేయసికి, విశృంఖల ప్రణయానికి బదులు సామాజిక ధర్మబద్ధమైన ప్రణయంతో సామాజిక వ్యవస్థ ప్రాధాన్యాన్ని చాటిచెప్పిన నవల ఇది. ఏకవీర - వీరభూపతి, మీనాక్షి - కుట్టాన్‌ల మధ్య తొలిప్రణయం చిగురించింది. విధివశాత్తున ఏకవీరకు కుట్టాన్‌తో, వీరభూపతికి మీనాక్షితో వివాహం కావడం, ప్రాణమిత్రులైన వీర భూపతి కుట్టాన్‌లు విషయం తెలిసికొని విషాదమగ్నులవ్వడం విశేషం. పూర్వప్రియుడైన వీరభూపతి స్పర్శను అనుసరించిన ఏకవీర తన భర్త (కుట్టాన్) స్పర్శను భరించలేక మరణించడం మరో విశేషం. ఉత్తరరామ చరిత్ర యందలి సీతారాముల స్పర్శవిధానాన్ని ఈ నవలలో విశ్వనాథవారు ప్రతిపాదించడం వీరి ప్రజ్ఞా పాఠవం.

సనాతన ధర్మ భూమిక మీద నిలచి అడుగంటి పోతున్న జీవితపు ఉదాత్తవిలువల్ని పునరుద్ధరింపజేసే ఉద్దేశ్యంతో ఆవిర్భవించిన నవలే వీరి 'వేయి పడగలు'. ఇదొక ఆధునిక మహేతిహాసం. అతిక్లిష్టమైన, సంకీర్ణమైన మానవ జీవితాన్ని ముఖ్యంగా ప్రాకృతిక, మానసిక, ఆధ్యాత్మిక, ప్రకృతి జీవన సంబంధాల్ని వ్యక్తీకరిస్తూ జీవన లక్ష్యాల్ని, విలువల్ని అనుకూల ప్రతికూల రీతుల్లో చిత్రించిన మరో మహాభారతమే వేయిపడగలు.

జమీందారి వ్యవస్థ ఇందు ప్రధాన వస్తువు. దీనిని పాలనా వ్యవస్థగా (రాజరిక వ్యవస్థ) విశ్వనాథ వారు సంకేతపఱచారు. జమీందారు రంగారావు పాలకధర్మాన్ని సమర్థంగా నిర్వహించి పాలితులందరికీ సుఖశాంతులతో కూడిన జీవితాన్ని ప్రసాదించినట్లు వీరు చిత్రించారు.

ఇందు ధర్మారావు, ఆతని చదువు, అది సాగిన తీరు, ఆతని స్నేహితులు, వారివారి వృత్తాంతాలు ప్రధానం. వీని ముఖంగా అనాటి సమాజంలోని అనేకాంశాలు, సన్ని వేశాలు, సంబంధాలు, సమస్యలు, పరిష్కారాలు ఒక్కటే మిటి పడుగుపేకలాగా అల్లుకుపోయిన మానవ జీవితాన్నంతటినీ విస్తరించిన వేయిపడగలుగా దీనిని విరచించారు విశ్వనాథవారు.

పేరంటూ లేని పాత్రలతో వ్యక్తి జీవితంలో విభిన్న రీతుల్లో ఎదురయ్యేటి అపారమైన దుఃఖాన్ని చిత్రించిన వీరి నవల 'మాబాబు'. స్వేచ్ఛాప్రణయం - వివాహం సామాజిక వ్యవస్థను సంక్షోభంలోకి నెట్టివేస్తుందని వివిధ కోణాల్లో చిత్రించిన నవలే వీరి 'చెలియలికట్ట'. దేశీయ స్వాతంత్ర్యోద్యమ ప్రాతిపదికగా రచింపబడిన నవల 'బద్ధన్నసేనాని'. బద్ధన్న అనే హరిజనవీరుడు బాదమ్మ సహాయంతో సేనానిగా ఎదిగి దేశ స్వాతంత్ర్య సాధనకు ఉపక్రమించడం ఇందు ప్రధానం. ఇదే కోవకు చెందినవి వీరి 'కడిమిచెట్టు, స్నేహఫలం' నవలలు. జీవితంలో స్నేహ ప్రాధాన్యాన్ని, దాని విఘటనంలో కలిగే విషాదాన్ని చక్కగా చిత్రించిన నవల 'జేబుదొంగలు'. సమకాలీన రాజకీయ, సామాజిక, ఆర్థిక విషయాలలో సాగుతున్న అవినీతిని, స్వార్థాన్ని చిత్రించిన నవల 'సముద్రపుదిబ్బ'. రాజరిక వ్యవస్థనుండి సామ్యవాద వ్యవస్థ వరకు సాగిన పరిణామక్రమంలో ఎటువంటి వ్యవస్థకూడా నిశ్చిత మైనది, దోషరహితమైనది కాదని ప్రతిదీ తనను తాను సంస్కరించుకొంటూ సాగుతుందంటూ సామాజిక గమన విధానాన్ని చక్కగా చిత్రించిన నవల ఇది. దొంగ యోగ సిద్ధులను గూర్చి చక్కగా చిత్రించిన నవల 'స్వర్గానికి నిచ్చెనలు'.

వీరి 'పురాణవైరిగ్రంథమాల' 24 నవలల సమాహారం. వీనిన్నింటిలోను మానవీయ సంబంధాలు, కుటుంబ సంబంధాలు, స్త్రీ-పురుష సంబంధాలు, రాజకీయ విప్లవాలు మొదలైనవి చక్కగా చిత్రింపబడినవి.

కొడవటిగంటివారి నవలలు - సమకాలీనత :

సమాజ ఎదుగుదలకు సంస్కారం ఆయుధమని దాని సాధనకు సాహిత్యం ఆకురాయి వంటిదని కలం పట్టిన గొప్ప రచయిత కొడవటిగంటి కుటుంబరావు.

మనిషి సంస్కారానికి పదునుపెట్టే సాహితీ పోరాటంలో ఆయనొక రోల్‌మోడల్. ఈ నేపథ్యంతో ఈయన రచనలకు సామాజిక ప్రయోజనం ఒక బలమైన ఉత్తేజం. ఇదే ఈయన కలాన్ని గమ్యంవైపు నడిపించింది. 1931 ప్రాంతంలో సంభవించిన ఆర్థికమాంద్యం సృష్టించిన అనర్థాలు, పరిశ్రమల మూసివేత, కార్మికుల సమ్మెలు, ప్రేమలు, పెళ్ళిల్లు, ఐశ్వర్యం తెచ్చే మార్పు, నాగరికత విస్తరణ మార్పులు మొదలైనవన్నీ సమకాలీయంగా ఈయన రచనల్లో కొట్టొచ్చినట్లు కన్పిస్తాయి. ఇవి ఈయన నవలలకు కథావస్తువులు.

స్వాతంత్ర్యానంతరం దేశంలో డబ్బుదే ప్రధానపాత్ర. దీని పర్యవసానంగా వచ్చిన సామాజిక హోదా వ్యక్తుల మధ్య అఘాతాన్ని సృష్టించింది. పారిశ్రామికవేత్తలు ధనవంతులు రోజురోజుకు మరింతగా ఎదుగుతుండగా పేదలు - రైతుకూలీలు రోజురోజుకు తరిగిపోతున్న సమయంలో శ్రమజీవులు కూడా ఎదిగే అవకాశాలున్నట్లు కన్పించినా, నిజానికవి ఎండమావులేనని వివరిస్తుంది వీరి 'ఎండమావులు' నవల. ఇందులో ప్రధానపాత్ర రంగారావు. ఇతడు కంపోజిటర్‌గా పనిచేస్తూ, నవలలు రచిస్తూ పెట్టుబడిదారి సమాజం సృష్టించిన భ్రమలో చిక్కుకొని చివరకు వాస్తవం తెలిసికొని బాధతో ఎండమావుల్లాంటి జీవితానికి స్వస్తిచెప్పి శ్రమజీవిగా సిద్ధమవ్వడం విశేషం.

పురుషస్వామ్య సమాజంలో పురుషుడిని మార్చవచ్చని స్త్రీ భ్రమించినప్పటికీ స్త్రీపురుషుల మధ్య వ్యత్యాసం వ్యక్తిగతం కాదని అది సామాజికమని చాటిచెప్పిన నవల వీరి 'పంచకళ్యాణి'. విభిన్న వాతావరణాల్లో పెరిగి విభిన్న మనస్తత్వాలతో వివాహ వయస్సుకు వచ్చిన ఐదుగురు కన్యల ఆశలు, ఆశయాలకు, సామాజిక వాస్తవాలకు మధ్యనున్న సంఘర్షణలో ప్రేమ అనేది అందని మ్రాని పండని నిరూపించిన నవల ఇది. తమ చుట్టూరా ఉన్నట్టి సమాజంలో భర్తల చేతుల్లో భార్యలు పడుతున్న నరకాన్ని చూసి భరింపలేక ఐదుగురు యువతులు తమకనుకూలమైన వారిని భర్తలుగా పొందాలనుకోవడమే ఇందులో కథావస్తువు. 'సుశీల' తనకంటే పెద్దవాడైనప్పటికీ మర్యాదగా చూసికొనేవాడు 'మగడు' కావాలను కొంటుంది. 'లక్ష్మి' తనను కాల్చుకతినడని కమలాకరాన్ని మగడుగా ఎంచుకొంటుంది. అలాగే తక్కిన లలిత, తాయారు, జానకి వీరు ముగ్గురు కూడా తగినరీతిలో భర్తల్ని కోరుకొంటారు.

జాతీయోద్యమ నేపథ్యాన్ని సజీవంగా చిత్రించిన నవల వీరి 'చదువు'. ఆంధ్రదేశ గ్రామీణ వాతావరణాన్ని, రాజకీయ ఘటనల్ని కళ్ళకు కట్టిన నవల ఇది. చదువు కొరకు మధ్యతరగతివారి ఆవేదనను అర్థం చేసికొన్న నవల ఇది. మధ్యతరగతికి చెందిన సీతమ్మ కొడుకు 'సుందరం' ఇందులో నాయకుడు. నిజానికిది అతని ఆత్మచరిత్ర. అనాడు సమాజంలో ఇంగ్లీషు చదువుపై గల సామాజిక గౌరవం, ఆర్థిక భద్రతలు మధ్యతరగతి వారిపై వ్యామోహాన్ని పెంచింది. సమకాలీన సమాజంలో ఉప్పెనలా ఎగసిపడుతున్న 1919 నాటి జలియన్‌వాలాబాగ్ ఉదంతం, 1920 నాటి సహాయ నిరాకరణోద్యమ సంఘటనలకు క్రియాశీలంగా స్పందించని సుందరం చదువులో ఒక్కొక్క మెట్టు ఎదిగి పుస్తకాలద్వారా, ప్రత్యక్ష జీవితానుభవం ద్వారా చాలా నేర్చుకొని మధ్యతరగతి మనస్తత్వానికి ప్రతిబింబమయ్యాడు. ప్రపంచ ఆర్థికమాంద్యం రోజుల్లో ఆస్తినంతటినీ కోల్పోయి అప్పులపాలై ఉద్యోగం లేక అట్టడుగు జీవితాన్ని గడుపుతూనే తన నాలుగేళ్ళ కొడుకు పుస్తకంలో అక్షరాల్ని గుర్తుపడుతుంటే అమితంగా మురిసిపోయాడు సుందరం. ఈ వ్యామోహమే ఇంగ్లీషోళ్ళు భారతదేశంలో రుద్దిన బానిస విద్యావిధానం వారసత్వంగా సంక్రమించటానికి కారణమైందని కుటుంబరావు గారు ఉద్ఘోషించారు.

ఆధార గ్రంథాలు :

1. తెలుగు సాహిత్య సమీక్ష
2. కందుకూరివారి రాజశేఖరచరిత్ర నవల
3. ఉన్నవవారి మాలపల్లి నవల
4. విశ్వనాథవారి నవలలు
5. కుటుంబరావుగారి నవలలు

⌘

BHAVAVEENA
Vol. 17, Issue. 8, August 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

లయాత్మక భావరూపం – వచనకవితా ప్రస్థానం

– డా॥. వి. శివనాగార్జున రెడ్డి , తెలుగు అధ్యాపకుడు, ఐఐఐటి, ఒంగోలు.

సాహిత్యరంగంలో పొడసూపిన మార్పుల కను గుణంగా తెలుగులో వచన కవిత ప్రారంభమైంది. స్వాతంత్ర్యానంతర కాలంలో బహుళ వ్యాప్తి పొందిన కవితారూపం వచన కవిత్వం. భావకవిత్వానంతరం వెలువడిన కవితా ధోరణులన్నీ వచన కవితా రూపాన్నే ఆశ్రయించాయి. వచన కవిత ఆరంభ దశలో దీన్ని ముక్తి చ్ఛందం, స్వేచ్ఛాగీతి, బద్ధకవిత, వచనపద్యం, వచన గేయం ఇలా పలుపేర్లతో పిలుస్తూ వచ్చారు. భావ ప్రకటనలకు అడ్డుగా వచ్చే నియమాలన్నిటినీ వదిలించు కొని స్వేచ్ఛగా కొనసాగిన కవితా రూపమే వచన కవిత.

అక్షర నియమం మాత్రాగణనియమం. పాద నియమం లేనిది వచన కవిత. ఛందస్సుతో అస్కారం లేకపోవడంతో పాదనియతి ఇందులో కన్పించదు. ఛందస్సులోని లయ లక్షణ బద్ధమైనది కాగా వచన కవితలోని లయ కవి స్వకీయమైనది. విషయ వైవిధ్యం కాకుండా పాఠకునిలోని భావోద్వేగం కలిగించే అంతర్లయ వచన కవిత ప్రధాన గుణం.

వచన కవితా వికాసం :

వచన కవిత్వం 1940 తర్వాత ఒక విశిష్టమైన సౌష్టవ మైన రూపాన్ని సంతరించుకొని పరిణతి దశవైపు పురోగ మించింది. వచన కవితా ప్రస్థానంలో నయాగర కవులకు ఒక విశిష్ట స్థానం ఉంది. ఇందులో కుందిర్తి ఆంజ నేయులు ప్రప్రథమ వచన కథాకావ్యం "తెలంగాణా" (19856) రచనను వెలువరించి వచన కవితా చక్రవర్తిగా కీర్తి గడించాడు. 18 పర్వాలలో తెలంగాణ విముక్తి పోరాటాన్ని సరళమైన భాషలో స్పష్టమైన భావాభివ్యక్తిలో చిత్రించాడు.

"రచనల పూలతోటలో
ఛందస్సుల పూలమొక్కలు నాటను
భావనలో సామాన్యుడి
జీవితం వలయాలు దాటును"

ఇలా ప్రతిజ్ఞ చేసిన కుందుర్తి కావ్యభాష ప్రజలకు సన్ని హితంగా ఉండాల్సిన వ్యవహార భాషకు పట్టం కట్టాడు. అయితే వచన కవితా ప్రక్రియలో ప్రప్రథమంగా కావ్యాలు వెలువరించిన కీర్తి శిష్టా ఉమామహేశ్వరరావు. పఠాభిలకు దక్కింది. శిష్టా నవమిచిలుక, విష్ణుధనువు కావ్యాలు రచించారు.

"ఇది పూర్వకవిత్వం గాదు
ఇది నవ్యకవిత్వం గాదు
ఇది భావకవిత్వం గాదు
ఇది నూతనములో బహునూతన కవిత్వం"

పై విధంగా "నవమి చిలుక" ముందుమాటలో పేర్కొన్న శిష్టా తన కవిత్వాన్ని ప్రహ్లాద కవిత్వంగా పేర్కొ న్నారు. మనస్సనే నరసింహమూర్తి హృదయస్తంభం నుంచి చీల్చుకొని విజృంభించగా శంక, ఆ ధైర్యాలకు ప్రతిరూప మైన హిరణ్యకశిపుడు నశిస్తాడని ప్రహ్లాద కవిత్వం పండిత పామరులకు ఆహ్లాదం కల్గిస్తుందని కవి వ్యక్తపరచాడు.

పఠాభిగా పేరు పొందిన తిక్కవరపు పట్టాభిరామిరెడ్డి భావ కవిత్వాన్ని తీవ్రంగా నిరసించాడు. ముఖపత్రం పై ఫిడేల్ బొమ్మవేసి దానిక్రింద రాగాల డజన్ అనే అక్షరాలు అచ్చువేయించి రూపనవ్యకవిత్వానికి దారి తీసాడు. ఇందులో గ్రంథం పేరుకు తగట్టుగానే 12 వచన గేయాలున్నాయి.

"నా ఈ వచన పద్యాలనే దుడ్డు కర్రల్తో
పద్యాల నడుములో విరగదంతాను
చిన్నయసూరి బాలవ్యాకరణాన్ని
చాలా దండిస్తాను"

పై విధంగా చెప్పినదాన్ని అక్షరాల ఆచరించి చూపాడు. పఠాభి భాషలో వాక్యాలలో క్రమపద్ధతుల్లో లేదు. గ్రాంథిక భాషా హేళన అడుగడుగునా కనబడుతుంది. ఇతని వచన గేయాలకు ఏ నియమాలులేవు. భాకవిత్వంపై తిరుగుబాటుగా ప్రయోగవాద ధోరణితో ప్రారంభమైన వచన కవిత ప్రగతివాద దృక్పథాన్ని అలవర్చుకొని ముందుకు సాగింది. అందుకే పఠాభి

"అనుసరిస్తాను నవీన పంథా కానీ
భావకవిని మాత్రము కాను
నేను అహంభావ కవిని"

అని పేర్కొన్నాడు. అభ్యుదయ కవితా యుగకర్తయైన శ్రీశ్రీ వచన కవిత్వంకు కూడా రాచబాట వేశాడు.

"శ్మశానాల వంటి నిఘంటువుల దాటి
వ్యాకరణాల సంకెళ్ళు విడిచి
ఛందస్సుల సర్ప పరిష్వంగం వదలి
వడిగా వడివడిగా
వెలువడినై, పరుగిడనై, నా ఎదునడు గిడినై"

ఈ విధంగా వచనకవితలో స్వేచ్ఛా ప్రియత్వాన్ని ఎలుగెత్తి చాటాడు. అయితే సమకాలీన కవుల్లోని భాషా విశృంఖలత శ్రీశ్రీలో గోచరించదు. తరువాత కవిత్వ పాఠకులను విశేషంగా ఆకర్షించిన వచన కవి బాల గంగాధర తిలక్. భావకవిత్వానికి కృష్ణశాస్త్రి వలె, వచన కవిత్వానికి తిలక్ మారు పేరుగా నిలిచాడు. సుకుమార మైన వెదర్భీరీతిలో కోమల పదచిత్రాలు, సుందర రూపకాలు మేళవించకున్న' "అమృత కురిసినరాత్రి" ఆహ్లాదకరమైన కవితావాతావరణాన్ని నెలకొల్పింది.

"అగ్నిజల్లినా అమృతం కురిసినా కవిత్వం
అంతరాంతర జ్యోతిసీమల్ని బహిర్గతం చేయాలని
అందం - ఆనందం దాని పరమాధి కావాలని"

అని కవిత్వం గురించి చెప్తూనే తన కవిత్వం లలితంగా ముగ్ధమోహనంగా ఉండాలనే ఆకాంక్ష క్రింది కవితా పంక్తులలో తెలుస్తుంది.

"నా అక్షరాలు కన్నీటి జడులలో తడిసే
దయాపారవతాలు
నా అక్షరాలు ప్రజాశక్తుల వహించే విజయ ఐరవతాలు
నా అక్షరాలు వెన్నెలలో ఆడుకునే అందమైన
ఆడపిల్లలు"

ఆధునిక కవిత్వాభిమానుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిన కీర్తిమూర్తి కుందుర్తి. వచన కవిత్వాన్ని ఒక ఉద్యమంగా భావించి దాని వ్యాప్తికి, ప్రచారానికి అమిత మైన కృషి సల్పిన విశిష్టకవి ఈయన, అయితే వచన కవితా వ్యాప్తి కోసం ఉద్యమిస్తున్న రోజుల్లో సంప్రదాయ సాహిత్యానికి, పద్యకవిత్వానికి ఆదరణ బాగా ఎక్కువ. ఇటువంటి స్థితిలో పద్యకవిత్వానికి ఎదురొడ్డి నిలిచాడు. వచన కవిత్వాన్ని ఎందరు చులకన చేస్తున్నా. తనను హేళన చేస్తున్నా.

"పాతకాలం పద్యమైతే వర్తమానం వచనగేయం"

అని ధైర్యంగా ఎలుగెత్తిచాటాడు.

కావ్యభాష అనే సంకెళ్ళు తెంచుకోమన్నాడు. పద్య కవిత్వం ప్రజలకీ కవులకీ మధ్య "ఇనుపతెర" అన్నాడు. శవాకారంగా ఉన్న కవి సమయాలను నేటి కాలని రుచించవని అక్కర్లేని పాండిత్య ప్రకర్షా విషయ సంపద లను వ్యతిరేకించమన్నాడు. కాశీకి కాలినడకన వెళ్తే పుణ్యం వస్తుందని ఇంకా నమ్ముతారా అని నిల దీశాడు. ఛందస్సులో ఉంటే చాలు కవిత్వమా? అని కొత్త ప్రశ్న వేశాడు. అందుకేనేమో

"వచనకవితా విచారణలో ఉరిశిక్షపడ్డ
మొదటి ముద్దాయిని నేను
అలనాటి కవితా లతాంగిని హత్య చేశాను
అలంకార ఆభరణాలు అపహరించాను
అన్నీ ఒప్పేసుకున్నాను అనాడు బోనులో ఎక్కి
క్రింది కోర్టు వేసిన శిక్షను
మానవ కారుణ్య దృక్పథంతో సడలించి
జన్మ ఖైదువేశారు హైకోర్టు న్యాయమూర్తులు

ఒకతరం పాటు బ్రతకాలన్నారు బందీగా
పాఠకుల గుండెల చెరసాలలో"

అని నగర్వంగా పలికి పాఠకుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిన చరిత్ర కుందుర్తికి ఉంది. ప్రీవర్స్ ఫ్రంట్ స్థాపించి మంచి కవితా సంపుటికి బహుమతి ఇచ్చేవాడు. కవిత్వానికే పురస్కారం తప్ప వ్యక్తులకు, సిద్ధాంతాలకీ కాదని వచన కవిత్వ రచనని ప్రోత్సహించాడు.

వచన కవిత్వం పట్ల కుందుర్తి గారి ప్రమాణాల నిర్వచనాలు సాధారణీకరణలో ఇమడదు "నగరంలో వాన" వాటిని చీల్చుకొని పెగల్చుకుని ఎదిగింది ఈ కావ్యం. అభివ్యక్తిలోనూ నిబద్ధతా, నిర్దుష్టతా చట్టాల్ని చేధించుకుని ఎంతగా వ్యాప్తి చెందగలదో తెలియడానికి "నగరంలోవాన" ఓ ప్రతీక ఈ కవితా ఆరంభంలోనే

"కవిత్వం నా ఊహంచల్లో కదలాడినట్లు
జల్లులై జల్లులై కురుస్తొంది
అభుకవితతో నగర ప్రజలకు
ఆశీస్సులు పలుకుతున్నట్లు....
అనంత ధారా సమేతంగా అంబరం మెరుస్తుంది
అంబరానికి అంత సంబరమెందుకంటే"

అని కవిత ప్రారంభించి ఒకే వానని పల్లెలూ, పట్నాలూ ఎట్లా స్వీకరిస్తాయో తెలిపాడు.

"భూమ్మీద పస్తులున్న మనుషుల్ని చూసి
ఆకాశం కంటతడి పెట్టినట్లు
వానముమ్మరంగా కురుస్తుంటే"
"అవసరం లేనప్పుడు అడిగితే అప్పులు సులువుగా లభించినట్లు
అక్కరలేని నగరంలో కూడా పుష్కలంగా కురు స్తుంది"

ఈ విధంగా వచన కవితలో కొత్త కారణ కల్పనలూ చేస్తాడు. వాస్తవికతతో కూడిన ఉపమానాలు వాడి పాఠకుల్ని దగ్గరికి తీసుకుంటాడు. సంక్రాంతి సూర్యుడిని" వర్ణిస్తూ

"అత్తవారింటికి వెళ్లేకొత్త పెండ్లికొడుకులా
అప్పుడే పొడిచాడు సూర్యుడు
ప్రభాతం వెండి నౌకమీద నీతి గగన నీరధిలో
నీటుగా నడిచాడు సూర్యుడు"

అలాగే శీతాకాల ప్రకృతి ధర్మాన్ని వర్ణిస్తూ

"కురచై పోయిన పగళ్లు
పెదవుల మీద ప్రారంభమైన పగుళ్లు
ఎముకలు కొరికే చలి
అమ్మో! పుష్యమాసం పులి!"

ఇలా సులువైన పదజాలం వాడి పాఠకల మనస్సులను హత్తుకొనే విధంగా కవిత్వం అల్లడంతో వచనకవితా పితామహుడు కుందుర్తి ఆంజనేయులుగారిది అందె వేసిన చెయ్యి.

ముగింపు :

చాలామంది దృష్టిలో సమకాలీనత కవిత్వం. వచన కవిత్వంలోనే దాగి ఉందనే అభిప్రాయం ఉండింది. అయితే ఆర్వాచీన కాలంలో బహుళ వ్యాప్తి పొందిన విప్లవాద కవులు వచన కవితా రూపాన్నే ఆశ్రయించటంతో స్వాతంత్ర్యానంతర కవితా ధోరణులన్నింటికి వేదికగా నిలిచింది వచన కవిత. పద్య రచనకు లక్షణ పరిజ్ఞానం గ్రాంధిక భాషా పరిచయం అత్యావశ్యకం కావటం వల్ల సౌలభ్యంతో కూడిన వచన కవితా మార్గాన్నే యువతరం అనుసరించడం కూడా ఈ వచన కవిత్వం పరివ్యాప్తికి దోహదం చేసిందనవచ్చు.

ఆధార గ్రంథాలు :

1. తెలుగు సాహిత్య చరిత్ర - ద్వా.నా. శాస్త్రి
2. ఆధునికాంధ్ర సాహిత్య వికాసం - ఎస్.కె.యు.
3. తెలుగు సాహిత్య సమీక్ష - జి. నాగయ్య
4. తెలుగులో కవిత్వోద్యమాలు - తెలుగు అకాడమి

⌘⌘⌘

BHAVAVEENA
Vol. 17, Issue. 8, August 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

'శారద లేఖలు' ఆధునిక భావ, రాగాల స్వరపేటికలు

- గొల్లంగి చిన్నబాబు, మెకానికల్ ఇంజనీరింగ్, రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం, నూజివీడు, కృష్ణా జిల్లా.

వాట్ నాట్ ?

మనిషి మనసు భిన్న సంచలన భావ సంచయం (=పొగు). మధురోహల సంలీనం. సంభ్రమల సంయుత సంలాపం (=ఇష్టంతో పరస్పరం మాట్లాడడం). అనుభూతుల గాఢ సంద్రతా మయం. బాల్యానుభూతి, రమ్యత, ఆర్జన, సౌందర్యాధన, తాదాత్మ్యికత, ఆనంద విషాదాల జంటలు, ప్రేమ వియోగ, సంయోగమాధురీ గరిమలు, శృంగార హారమయూరాలు, భావకళాత్మక భావాలు, అపురూప సందర్భాలు, భవిష్య భావా లోకాలు,'వాట్ నాట్' ఏవైనా తగిన భాషతో అద్భుతంగా చెప్పడానికి రంగస్థలమే లేఖలు.

లేఖలు ఆసక్తి ప్రదాలు :

లేఖలు వ్యక్తుల నిజ స్వరూపాల నీడలు. సామాజిక పరిస్థితుల ప్రతిబింబాలు. లేఖలవల్లరాసినవారి భావ స్వరూపం తెలుసుకునే వీలుంది. లేఖలు చారిత్రక విజ్ఞానం, విజ్ఞాన శాస్త్ర పరిజ్ఞానం, రాజకీయాల వైనం చూపుతాయి. 1990 వ దశకం వరకు లేఖల ప్రస్థానం చాలా వేగంగా సాగింది. ఇందులో ప్రేమ లేఖలు, రహస్య లేఖలు, వాణిజ్య లేఖలు అధికం. శాస్త్ర, సాంకేతికత అభివృద్ధి చెందని కాలంలో వీటికే అధిక ప్రాధాన్యం. ప్రేయసీ ప్రియులు, భార్యాభర్తలు, తల్లీబిడ్డలు తమ యోగ క్షేమాలు వీటి ద్వారానే తెలుసుకునేవారు. లేఖల వల్ల రచనా నైపుణ్యం, వర్ణనా పటుత్వం పెరుగుతాయి. ఆరోగ్యం బోనస్ గా వస్తుంది. కానీ నేటి ప్రపంచంలో లేఖలు లేవు. వాటి స్థానంలో చరవాణీల చలనం అధికమైంది. ఆనారోగ్యం అదనంగా అందుతుంది.

లేఖా నైపుణ్యం :

ఉత్తరం రాయడం ఒక కళ. అందరూ మంచి ఉత్త రాలు రాయలేరు. కానీ ప్రయత్నిస్తే ఈ కళలో సిద్ధహస్తులు కాగలరు. మిత హిత సరళ సహజ వాక్యవిన్యాసం ఉంటే లేఖలు పఠితులను ఆకట్టుకుంటాయి. ఎదురుగా ఉండి చెప్పినట్లు రాయడం ఒక అంశం. చూస్తూ ఉన్న సమాజాన్ని జరుగుతున్న సంఘటనలతో, జరిగిపోయిన సమాజానికి ముడిపెట్టి భవిష్యత్ ను ఊహించడం స్రష్ట చేసే పని. ఇలా లేఖా రచనను సృజనాత్మకంగా చేయడమే లేఖా నైపుణ్యం.

లేఖ అంటే ?

లేఖ అంటే ఉత్తర, ఎడమ లేక మిక్కిలి చేరికయగు వృక్షాదుల పంక్తి, లిపి, జాబు, ఇచ్చు పుచ్చుకోలు పత్రము, వేలుపు అని సూర్యరాయాంధ్ర నిఘంటువులోని అర్థాలు. కానీ నేటి పరిభాషలో ఉత్తరం అనే పేరే సుపరిచితం. 'ఖత్ ఆధీములాకాత్' అన్నారు ఉర్దూ వాళ్ళు. అంటే వ్యక్తుల సగం కలయిక అని అర్థం. ఆత్మీయతకు చిహ్నాలు, మర్యాదకు లక్షణాలు, అవనరానికి బంధువులు, ఆవేశానికి ఆయుధాలు, ప్రేమకు కానుకలు ఈ ఉత్తరాలు.

లేఖ అనే పదం "లిఖ్"అనే ధాతువు నుంచి పుట్టింది. అర్థం లిఖించడం(రాయడం). లిఖించినది అంతా సాహిత్యం కాకపోయినా, వ్యక్తిగత బంధాలని పలకరిస్తూనే, వ్యవస్థాపరమైన మార్పుల్ని, ఆకాంక్షల్ని ప్రతిఫలిస్తూ రాసే భావోద్వేగ భావాల రచనే "లేఖ". ఇది పరస్పర సమాచార భావ వినిమయానికి ఒక వారధి. వాస్తవిక వ్యక్తుల మధ్యగానీ, ఊహాజనిత వ్యక్తుల ద్వారా గానీ సాగే ఆత్మాశ్రయ గద్య రచన. మనసుతో మనసు పలికే ఓ ఆర్ద్ర సంభాషణ.

విషయానుగుణంగా, భాషా పరమైన చమత్కారాల్ని జోడిస్తూ, చదవగానే గుండెకు హత్తుకునేలా రాయడం నైపుణ్యం. అందుకే మనం లేఖల విషయం ప్రస్తా

వించేటప్పుడు కూడ మార్క్స్ ఏంగెల్స్, అబ్రహం లింకన్, జవహర్ లాల్ నెహ్రూ, మహాత్మాగాంధీ, స్వామి వివేకానంద, చలం, వరలక్ష్మమ్మ, గుంటూరు శేషేంద్ర శర్మ అంటూ ఏదో కొందరి నాయకుల పేర్లో, రచయితల పేర్లో చెబుతుంటాం. అయితే అవి ప్రామాణికం కాకపోయినా ప్రసిద్ధి చెందాయి.

"తోకలేని పిట్ట తొంభై ఆమడలు పోతుంది/ తొంభై ఊర్లు తిరిగింది" :

ఇది లేఖకు సంబంధించింది. తోక లేకపోవడం అంటే పోస్టు చేయడమే. దాని ద్వారా ఎన్నో ఊర్లు తిరిగి ఎవరికైతే ఆ సందేశాన్ని అందించాలో వారికి చేరడం. ఇది ఎప్పుడో పాడుపు కథలా జానపద సాహిత్యంలో చోటుచేసుకుంది. పేరు ఊరు లేని ఉత్తరాలు ఆకాశరామన్న ఉత్తరాలుగా మరో అంశం. సాంకేతికత, సమాచార వేగం విస్తారమై, విస్తృతమైన ఈ ఆధునిక కాలంలో ఉత్తరం గురించిన ఈ పాడుపు కథని విప్పేదెంత మంది? ఆంగ్ల భాషా మైకం ఒక పడగలా కమ్ముకున్న నేటి పరిస్థితులలో అసలు లేఖ, జాబు, ఉత్తరం అంటే అర్థమయ్యేది ఎందరికి? ఒకప్పుడు ఇంట్లో మనిషిలా, చదువుతున్నప్పుడల్లా మనసుకి అక్షర బంధనాలు వేసే ఆ ప్రేమైక గంధాలు ఇప్పుడు ఏమైనట్లు? తెలుగులో ఒక సాహిత్య ప్రక్రియగా కూడ విలసిల్లిన "లేఖలు"గమ్యం చేరకుండానే గాడి తప్పిపోయాయి ఎందుకని?.

స్త్రీ స్వేచ్ఛ, ప్రేమ, శృంగారాల పట్ల తన అభిప్రాయాలని రచనలుగా మలిచి, తెలుగు సాహిత్యంలో వివాదాస్పద రచయితగా పేరుగాంచిన గుడిపాటి వెంకటాచలం, అదే దృక్పథాన్ని తన వ్యక్తిగత లేఖల్లోనూ కొనసాగించారు. లేఖ ప్రాధాన్యత తెలిసిన వాడు కాబట్టి తన "ప్రేమ లేఖలు"రచనని గురించి చెబుతూ "సర్వకాల సర్వావస్థల్లో నిన్నే అన్వేషిస్తున్నానని జ్ఞాపకం చెయ్యడమే లేఖ" అంటాడు. చలం లేఖలు ఆయన విజ్ఞాన సర్వస్వానికి ప్రతీకలుగా గ్రహించవచ్చు. చలం జీవిత పరిణామక్రమం, కాలనుగుణంగా ఆయనలో వచ్చిన మార్పులు, వైఖరులు అన్నీ తన లేఖల్లో స్పష్టంగా కనిపిస్తాయి. శృంగార మోహితుడిగా అనిపించుకున్న వాడే ఆధ్యాత్మిక సాధకుడిగా మారి చేసిన జ్ఞానబోధలు కూడ మనం ఆయన లేఖల్లో చూడవచ్చు. మనిషి మనస్తత్వాన్ని నిర్మొహమాటంగా వ్యక్తపరిచిన ఆయన రచనలు మనో వైజ్ఞానిక శాస్త్ర పరిశోధనలకు కూడ ఉపయుక్తమవుతాయి.

డా. సంజీవ్ దేవ్ రాసిన ప్రతీ ఉత్తరం ఓ చిత్రకావ్యం. వాక్య నిర్మాణ శైలి అబ్బురపరుస్తుంది. "నిమ్మంటే నాకిష్టం, దానిమ్మంటే నాకిష్టం/ బొమ్మంటే నాకిష్టం, లేని అమ్మంటే నాకిష్టం."అంటూ తన కవి హృదయాన్ని వ్యక్తపరిచాడు ఓ లేఖలో. ఆయన లేఖల్లో ఎక్కువగా వేదాంత, తాత్విక విషయాలే దొర్లినా కొన్ని లేఖల్లో సంగీత, సాహిత్యాల పట్ల తన వైఖరి, ఇతర కవులపై తన అభిప్రాయాలు కూడ లిఖితం. "గద్యం అనేది ఆలోచన, పద్యం అనేది వేదన,సంగీతం అనేది సంవేదన"అంటూ వాటి ప్రాధాన్యతని వివరిస్తూ "గద్యం అనేది భూమి, పద్యం అనేది ఆకాశం, సంగీతం అనేది ఇంద్రధనస్సు"అని పోలుస్తాడు. పేరుకి ఇవే లేఖలే, వ్యాసంలాగా సుదీర్ఘంగా ఉంటాయి. ఆయన ప్రతీ లేఖ ఆకట్టుకొనే పదబంధాలతో, సందేశాత్మక లక్ష్యంతో జనరంజకాలు.

ప్రాచీనంలో లేఖా పరిజ్ఞానం :

మానవుల మొదటి భాష వింత సంజ్ఞలు, పరిమిత ధ్వనులు. అవీ ప్రకృతిలోని జీవులను అనుకరిస్తూ వారి అవసరం కోసం రూపొందించుకొన్నవే. తొలి భాషకి రా, పో, వేట, గాలి, వాన, పాము, జంతువు మొదలైన అంశాలను తెలిపే మిత పరిధి సొంతం. తొలినాళ్లలో ఆటవిక సంచార జీవి మనిషి. వేట ప్రధాన వృత్తి. అస్థిర నివాసి. వేటాడే సందర్భంలో ఒక వ్యక్తి ఇంకో వ్యక్తికి తన సంజ్ఞలు ద్వారా సమాచారం చేరవేస్తాడు. అంటే ఇది మౌఖికం. అదే చాలా దూరంలో ఉంటే తానే స్వయంగా వెళ్ళి చెప్పడం లేదా తెగలో ఉన్న వాళ్ళలో ఎవరో ఒకరిని పంపించడం చేసి సమాచారాన్ని చేరవేస్తాడు. ఒక ఏనుగు బొమ్మను గీచి దానిపై ఈటెని గుచ్చే, రాళ్ళతో కొట్టినట్టో

గుర్తులు పెట్టి సందేశం పంపితే వేటకి సిద్ధమవమని చెప్పడం. లిపి అలా చిత్ర సంకేతాల ద్వారానే పుట్టింది.

నేటికీ చైనా, జపాన్, టిబెట్ దేశాల లిపి బొమ్మలతోనే ఉంటుంది. వాటి అక్షారాలు చిత్రాల నుంచే పుట్టాయి. ఇలా వేటకే కాక దైనందిన అవసరాలకు కూడా చిత్ర లిపినే వాడారు. ఈ చిత్ర సంకేతాలే లేఖలకి మొదటిమెట్ట అనుకోవాలి. ఈ శైలి అంతా 5 వేల సంవత్సరాలకు ముందుంది. కానీ క్రీ.పూ. 4 వ శతాబ్దం నాటికి కొంత లిపిని కనిపెట్టడం జరిగింది. దాంతో లేఖలు రెండు రకాలుగా మారాయి. 1. మౌఖిక లేఖలు, 2. లిఖిత లేఖలు. ఈ రెండు నేటి సమాజానికి పరిచయమే. నాటి శాసనాలే నేటికీ వర్తమానాలు. అవే నాటి సంస్కృతి సంప్రదాయాలు తెలిపే ఆధారాలు. గుణగ విజయాదిత్యుని రాచమల్లు శాసనం, బెజవాడశాసనం మొదలైనవి తార్కాణాలు.

తెలుగు సాహిత్యంలో లేఖా ప్రస్థానం :

లేఖలు అన్నీ సాహిత్య బంధువులే. సాహిత్యం నుంచి ఉద్భవించినవే. మన పురాణాల్లో నారదుడు ఒక వార్తా హరుడు (పోస్టుమాన్). త్రిలోకాలు తిరిగి ఒక చోట నుంచి ఇంకో చోటకి సమాచారాన్ని చేరవేసేవాడు. రామాయణంలో హనుమంతుడు రాముని వార్తను సీతకి, సీత సమాచారాన్ని రామునికి చేరవేశాడు. భాగవతంలో రుక్మిణీ సమాచారాన్ని కృష్ణుడికి చేరవేసిన విప్రుడూ ఒక విధంగా తపాలా బంట్రోతే. శ్రీనాథుని 'శృంగార నైషధం' లో హంస రాయబారముంది. 'ప్రభావతి ప్రద్యుమ్నం' లోపింగళి సూరన శుచిముఖితో రాయబారం రమ్యంగా నడిపించాడు. తాళ్ళపాక తిమ్మక్క సుభద్రార్జునుల మధ్య చిలుక రాయబారం సుమనోహరం. మహాభారతంలో సంజయ, కృష్ణ రాయబారాలు తంతికి తార్కాణాలు. రామాయణంలో అంగద రాయబారం మరో నిదర్శనం. కాళిదాసు మేఘ సందేశం నేటికి ప్రతీక. ఇదంతా ప్రాచీన సాహిత్య ప్రస్థానం.

కొన్ని లేఖలు ప్రేమను, భావానురాగలను, విరహ వేదనలను వివరిస్తే, మరికొన్ని లేఖలు విజ్ఞానాన్ని, విహార యాత్రా విశేషాల్ని వివరిస్తాయి. వీటన్నింటిదీ ఒక ఎత్తు. సామాజిక లేఖలది మరో ఎత్తు. లేఖలకు విస్తృత వ్యాప్తి ఈ రూపంలోనే దొరుకుతుంది. ఆ వ్యాప్తి సామాజికాభివృద్ధిని కాంక్షిస్తుంది. సామాజిక లేఖలలో వస్తువు సమాజం, దానిలోని లోటుపాట్లు. తెలుగు సాహిత్యంలో ఎన్నో సామాజిక లేఖలు వచ్చాయి. దేని స్థానం దానిది. కానీ అందులో అగ్రగణ్యం కనుపర్తి వరలక్ష్మమ్మ శారద లేఖలదే.

శారద లేఖలు సాంఘిక సంస్కర్తలు :

ఏప్రిల్ 1930 - సెప్టెంబర్ 1933 మధ్య ప్రాంతంలో శారద లేఖలు గృహలక్ష్మి పత్రికలో ప్రచురితమైయ్యాయి. గృహలక్ష్మి అధిపతి కేసరి గారు 1934 లో వీటికి పుస్తక రూపాన్ని ఇచ్చారు (తర్వాత కాలంలో కొన్ని లేఖలను జత చేశారు). ఈ లేఖలు శారద అనే కల్పిత పాత్ర తన ఊహా మిత్రురాలైన కల్పలతకు రాసినవి. ఇవి నాటి కాలంలోని సామాజిక స్థితి గతులకు ప్రతిరూపాలు. ఈ లేఖలు ఆనాటి సామాజిక చైతన్యానికి దీపికలు. 20 వ శతాబ్దపు ప్రజల తీరుతెన్నులు తెలిపే వాహికలు. మొదటి సంపుటి 20 లేఖల పుస్తకం. ఇందులో ప్రధానంగా 1. జాతీయోద్యమ విషయాలు, 2. స్త్రీల సమస్యలు, 3. నైతిక, ప్రగతి, మహిళా చైతన్య విశేషాలు, 4. మత, సాంస్కృతిక, యాత్రా స్థలాల విశేషాలు ఉన్నాయి. ఇక రెండవది 49 లేఖల సుదీర్ఘ సంపుటి ఇది. ఇందులో 1. దర్శనీయ స్థలాలు, 2. వ్యక్తుల వ్యక్తిత్వాలు, 3. స్త్రీల సమస్యలు, 4. ఉద్యమాలు, 5. కుల, మత, వర్ణ విచక్షణాలు, 6. మూఢ నమ్మకాలు, 7. వరకట్నం, 8. ఇతర అంశాలు ఉన్నాయి. ఇవన్నీ శారద లేఖలకు మణిహారాలు. ఇప్పుడు ప్రథమ సంపుటికే పరిమితమౌదాం.

జాతీయోద్యమ విషయాలు : (1,2,3,7,8,17,18 ప్రధాన లేఖలు)

శారద లేఖల్లో పైన చెప్పిన లేఖల్లో జాతీయోద్యమ విషయాలు ప్రధానంగా ఉన్నప్పటికీ, అవకాశం వచ్చినప్పుడల్లా స్వాతంత్రోద్యమ, స్వదేశీయోద్యమ

విషయాలను ప్రస్తావిస్తూ మహిళల్లో జాతీయోద్యమ చైతన్యాన్ని రేకెత్తించింది రచయిత్రి. దేశభక్తి వరలక్ష్మమ్మ కలంలో నుండి పొంగి పొర్లింది. యాత్రా స్థలాలను దర్శించే సమయంలో అక్కడ వస్తువుల గొప్పదనాన్ని వివరిస్తూ, దేశీయ వస్తువుల వాడకాన్ని చాటి చెప్పే ప్రయత్నం చేసింది. శ్రీ కాళహస్తిని సందర్శించేటప్పుడు "స్త్రీలు విదేశపు గాజులు ధరించుట వలన సంవత్సరమునకు కోటి రూప్యములు విదేశముల పాలైపోవుచున్నవి" అని దేశ ఆర్థిక వ్యవస్థ గురించి ఆవేదన చెందింది. "తల్లి బిడ్డనాశీర్వదించ చెఱసాలకంపుచున్నది, భార్య భర్తను బంధీకృతడవు గమ్మని బహూకరించి వీడ్కొలుపుచున్నది" అని నాటి శాసనోల్లంఘన ఉద్యమం గురించి ఉత్తరాలు రాసింది.

స్త్రీల సమస్యలు : (3,5,10,12,15,20 ప్రధాన లేఖలు)

20 లేఖల్లో దాదాపు స్త్రీ సమస్యలను వస్తువుగా చేసి రాసినవే అధికం. మిగతా లేఖల్లో ఏదో ఒక విషయంలో స్త్రీ ప్రస్తావన వస్తూనే ఉంటుంది. ప్రతి లేఖలోనూ, అందులో ప్రతి అక్షరంలోనూ బాల్య వివాహాలు, శారదా చట్టం, స్త్రీ పురుష వివక్షత, విడాకుల చట్టం, మహిళల మానసిక చైతన్యం ప్రస్ఫుటిస్తూనే ఉంటాయి. ఇందులో సమాజాన్ని అత్యంత దారుణంగా పట్టి పీడించే పిశాచం బాల్య వివాహం. ఇది ఆనాటి సమాజంలో పాతుకు పోయింది. ఈ విషయంపై రచయిత్రి హృదయం కలమై అక్షరాల కన్నీటిని కార్చింది. " ఆ పిల్ల మూడేండ్లు నిండియు నిండని పసికూన.. పెండ్లి కొడుకో పదెండ్లవాడు. నిద్రచే తూగుచున్నాడు. మతిమాలిన తల్లిదండ్రులు తమపై వైచిన సంసారభారము నా బాలదంపతలెఱు గరుకదా!" లాంటి అక్షరాల కన్నీరు పరవళ్లుతొక్కింది.

ఈ బాల్య వివాహాలే కాక, వీటికి మూఢ నమ్మకాలతో దోస్తీ కట్టేకారు. బాల్య వయస్సులో సంభోగం జరిగితే పురుషుడి ఆయుష్షు పెరుగుతుందని, స్త్రీకి రజస్వలా నంతరం పెళ్లి జరిగితే అనర్థంమని అవాకులు చావాకులు పేలేవారు. ఇలాంటి నమ్మకాలపై వరలక్ష్మమ్మ కలం కత్తి దూసింది. బాల్య వివాహం బాట తప్పి భర్త మరణిస్తే స్త్రీకి వైధవ్యం తప్పదు. పోనీ పునర్వివాహం కి వెళ్దామంటే అది పురుషులకి మాత్రమే అని అడ్డంకులు. అందుకే బాల్య వివాహాల బంధీ నుంచి బయటకు తీసుకు రావడానికి శారదా చట్టం వచ్చింది. దానిపై రచయిత్రి ఈ లేఖల్లో చాలా సార్లు తన అభిప్రాయాల్ని వ్యక్తం చేసింది. "ఇపుడీ బాల్య వివాహ శాసనము విషయమై మన స్త్రీలు ఉపేక్షా భావముతో చూడరాదు" అంటూ మహిళా లోకాన్ని మేల్కొలిపింది.

సమాజంలో స్త్రీ పురుష వివక్ష ఊడలేసుకొని పాతుకు పోయింది. ఆడపిల్లల్ని మగ పిల్లల కన్నా హీనంగా చూసేది తల్లిదండ్రులే కావడం రచయిత్రి తట్టుకోలేకపోయింది. చెల్లని నాణెంలా, చిల్లు గవ్వలా ఆడపిల్లల్ని చూడటం అన్యాయమని ఆమె ఆక్షేపించింది. ఇలా ఎన్నో స్త్రీ హృదయంలోని బాధల్ని బయటకు తీసింది. తమ సమస్యల సవ్వడుల ధ్వనులను సమాజానికి వినిపించిది. సమస్యల ధ్వనులే కాక, పరిష్కార మార్గాలు, సందేశ చిత్రణలతో ప్రతిధ్వనించాయి శారద లేఖలు.

నైతిక, ప్రగతి, మహిళా చైతన్య విశేషాలు : (6, 9, 11, 13, 14, 16, 18, 19 ప్రధాన లేఖలు)

"కలము పట్టుట కంటే గరిటె పట్టుట అవసరమైన పనిగానున్నదని" రచయిత్రి ఆవేదన చెందారు. స్త్రీ జనాభ్యుదయాన్ని కాంక్షిస్తూ, స్త్రీ చైతన్యానికి చిహ్నంగా వరలక్ష్మమ్మ కలం కాగితంపై నిలిచింది. మహిళల ఆర్థిక, రాజకీయ లాంటి బాహ్యాభివృద్ధులే కాక, మానసిక చైతన్యానికై కలం కదం కదింపింది. సూక్ష్మాతి సూక్ష్మమైన విషయాల నుంచి, మారని అలవాట్లు వరకు సంకు చిత్వాన్ని ఎలా వదిలి అడుగులు ముందుకు వేయాలో చెప్పాయి శారద లేఖలు.

ఇవే కాకుండా పడతిల ప్రగతిని వరలక్ష్మమ్మ పై లేఖల్లో ప్రస్తావించారు. రాజకీయ, ఆర్థిక, సామాజిక రంగాల్లో మహిళలు వేసిన బాటను భావనాత్మకంగా బయట పెట్టారు. " ఆంధ్ర దేశమున లక్ష్మీ బాయమ్మ,

మద్రాసు రాజధాని నగరమున దుర్గాబాయమ్మ, గుజరాతీ రాజ్యమున కస్తూరి బాయి, బొంబాయి యందు కమలా దేవీ ఛటోపాధ్యాయినీ, సరోజినీ దేవి మొదలైన వాళ్ళు ...." అంటూ నాటి మేటి మహిళా లోకపు చైతన్య చిహ్నాలను చూపించారు. శాసన సభల్లో, డిప్యూటీ ప్రెసిడెంట్, విద్యా సంఘాలు లాంటి వాటిల్లో స్త్రీలు అధిరోహించిన ఉన్నత శిఖరాల్ని సగర్వంగా చూపించారు రచయిత్రి. " మీరు లక్ష్మీ పూజా చేయుదురు కానీ మీ బిడ్డలకు లక్ష్మీ ప్రసన్నత లేదు. సరస్వతీ ప్రసన్నత అసలే లేదు... స్త్రీ శక్తి స్వరూపం" అన్న సరోజినీ దేవి మాటల్ని రచయిత్రి మానసిక పరివర్తన మార్గాలుగా చూపించింది.

నైతికత నాస్తికత్వంగా మారకూడదు. సమాజం పది కాలాలు నిలబడాలంటే నైతిక పునాదులు అవసరం. ఈ విషయాలను రచయిత్రి పలు సందర్భాలలో నొక్కి వక్కాణించారు. భగవంతుడి సన్నిధిలో అర్చకుల అక్రమాలు, పోలీసుల దౌష్ట్యాలు, వైష్ణవ స్వాముల దురాచారాలు అనైతికతకు నిదర్శనాలని నిప్పులు చెరిగారు. ఈ సమాజం నైతిక న్యాయం పాటించాలని, ఏది తప్పో, ఏది ఒప్పో చెప్పే విచక్షణా జ్ఞానం పొందాలి.

మత, సాంస్కృతిక, యాత్రా స్థలాల విశేషాలు:- (2,4,7,8 ప్రధాన లేఖలు) :

మతము అంటే నిఘంటువులో అభిప్రాయం అని అర్థం. కానీ సమాజంలో హిందూ, ముస్లిం, క్రైస్తవ, జైన, బౌద్ధ మొదలైనవని అర్థం చెప్తారు. "మతము మానవునకు ప్రాణం కంటే ఉత్కృష్టమైనది" అని రచయిత్రి భావన. ప్రపంచంలో ప్రతి మనిషి ఏదో ఒక మతాన్ని అనుసరించడం సహజం. సర్వసాధారణం. అలా అని ఒక మతాన్ని విమర్శించి ఇంకో మతం గొప్పదని చెప్పడం తప్పు. భగవద్గీత, ఖురాన్, బైబిల్ అన్నింటినీ సమదృష్టితో చూడాలంటారు రచయిత్రి. "స్వేచ్ఛ సహజమైన మానవుల వర్తనము ఒక నీతికి ఒక ధర్మమునకు ఒక సత్యమునకు ఒక సంప్రదాయమునకు భద్రపరుచునదే మతము" అని వరలక్ష్మమ్మ గారి నిర్వచనం.

కాశ్మీర దర్శనంలో ప్రకృతి అందాల అరబోతను చూపించారు నాయని కృష్ణకుమారి గారు. తెలుగు సాహిత్యంలో యాత్ర సాహిత్యానిది ప్రత్యేక స్థానం. ఒక కవి తాను చూసిన విషయాలను పాఠకుడికి కళ్ళకు కట్టినట్లు దృశ్యీకరించాలి. అప్పుడే అది అందరు మెచ్చే సాహిత్యంగా అందలం ఎక్కుతుంది. అలా దృశ్యీకరణ చేసినవే శారద లేఖలు. ఒక విధంగా ఈ యాత్రా సాహిత్యానికి తెలుగు సాహిత్యంలో చోటు కల్పించినది వరలక్ష్మమ్మే. శ్రీకాళహస్తి, కాంచీపురం, చిదంబరం, కుంభకోణం, తంజావూరు, మధుర, రామేశ్వరం, ధనుష్కోటి, కుర్తాళం, పడమటి కనుములు, తిరావన్కూరు, జనార్ధన తీరం, తిరువనంతపురం, కన్యాకుమారి, సుచీంద్ర క్షేత్రం, నాగర్కోయిల్, తిరునల్వేలి, శ్రీ రంగం క్షేత్రాల చిత్రాలను అక్షరాల రూపంలో ఈ లేఖల్లో రచయిత్రి పొందుపరిచారు. ఇవి చదువుతున్నంత సేపు దృశ్య మోహంలో పాఠకుడు తేలియాడుతాడు.

యాత్రా వర్ణనలో కవయిత్రి తన ప్రతిభా పాఠవాలన్నింటినీ రంగరించారు. కాంచీపురాన్ని వర్ణిస్తూ అక్కడున్న ఉన్నతోన్నత ప్రాకారాలు, గోపురాలు, వరదరాజ స్వామి ఉత్సవాల్లో జరిగే తిరుమంజనం (స్నానం) ఒకటేమిటి ఇలా ప్రతి చిన్న విషయాన్ని ప్రత్యక్ష వీక్షణం చేయించారు. కాకతీయ ప్రతాపరుద్ర, కృష్ణ దేవరాయలు లాంటివారు నిర్మించిన శిల్పకళా విశేషాలను వివరిస్తూ జాతీయోద్యమ కవిత్వంలో కనిపించే గత వైభవస్మరణని తన లేఖల్లో చమత్కారంగా చిత్రించారు.

మారుతున్న పరిస్థితులు, ఆధునిక సంస్కృతి సంప్రదాయాలపై చేస్తున్న దాడులను నిరసించారు. భిన్నత్వంలో ఏకత్వాన్ని ప్రదర్శించి జాతి, మత, లింగ ప్రాంత భేదాలను పోగొట్టి అఖిలా భారత చిత్రాన్ని పాఠకుడి మదిలో గీసే ప్రయత్నం చేశారు. అందులో విజయులు కూడా అయ్యారు. ఉత్తరానికి, దక్షిణానికి ఉన్న కట్టు, బొట్టు, ఆహారపు అలవాట్లను వివరిస్తూ అఖండ భారతమంతా ఒకే తాటికి చెందినదని ఏకత్వ భావనను మదిలో నాటారు.

స్త్రీ జనోద్ధరణకు, జాతీయోద్యమానికి జవసత్వాలు 'శారద లేఖలు' :

20 లేఖలు 20 సంస్కరణలకు ప్రతిరూపాలు. సంఘంలోని దురాచారాలపై సంధించిన బాణాలు. బ్రిటీషు వారి గుండెల్లోకి పేల్చినతూటాలు. ఆడపిల్లల హక్కుల పై గళమెత్తిన సుతిమెత్తని గొంతులు. చారిత్రక, సంప్రదాయ, సంస్కృతులకు నిలువుటద్దాలు. ఈ లేఖల్లో స్త్రీ సమస్యలు, మహిళా లోకపు చైతన్యం, జాతీయోద్యమం, తీర్థ యాత్రా విశేషాలను బయటకు చూపించినా, స్త్రీల సమస్యలు, జాతీయవాదమే అందులోని ప్రధానాంశం. బాల్య వివాహాలు, వితంతు పునర్వివాహాలు, దేశ సంస్కృతుల గురించి శారద, కల్పలతకు చెప్పింది. ఈ రెండూ ఊహాజనిత పాత్రలే. అది పుస్తకం వరకు మాత్రమే. నిజ జీవితంలో శారద అంటే సామాజిక కట్టుబాట్లు, బానిస సంకెళ్ళను తెంచిన స్త్రీ. కల్పలత అంటే సమాజం.

ఈ రెండు పాత్రల ద్వారా స్త్రీ పడుతున్న అంతర్మథనాన్ని బయటకి తీసుకొచ్చింది వరలక్ష్మమ్మ. దాంతో దేశ ప్రజల్లో స్వాతంత్ర్య కాంక్షను నాటింది. ప్రధానంగా ఈ లేఖల్లో వస్తువు స్త్రీ. ఉప వస్తువులు తీర్థ యాత్రలు, ఉత్తమ వ్యక్తులు, జాతీయ ఉద్యమాలు. కానీ వీటన్నింటినీ కలిపి నాటి సమాజంలో స్త్రీ ఆట బొమ్మ కాదు అని నిరూపించింది. భిన్నత్వంలో ఏకత్వాన్ని చాటినప్పుడే స్వాతంత్ర్యం సిద్ధిస్తుందని చాటి చెప్పింది. అందుకోసం ఈ ఉపవస్తువులను ఉపయోగించుకుంది. మొత్తానికి శారద లేఖలుస్త్రీ జనోద్ధరణకు, జాతీయోద్యమానికి జవసత్వాలనందిచాయనడంలో సందేహమేలేదు.

లేఖల ఆవశ్యకత :

నాడు లేఖలు ఆప్యాతల సూచికలు. నేడో చిత్తు కాగితాలు. భర్త భార్యకు లేఖ రాసే సమయంలో ఏకాంతంలో కూర్చొని తన భావాలకు ప్రతిరూపాలుగా వాటిని తయారు చేసేవాడు. ఇందులో వాళ్ళిద్దరి మధ్య రహస్య ఒప్పందాలూ జరిగేవి. లేఖా ప్రభావం తగ్గిపోవడంతో ఏకాంతం కాస్త బహిరంగం అయింది. చరవాణిలలో సోది కబుర్లతో పక్క వాళ్ళకి ఇబ్బంది పెడుతూ వ్యక్తిగత విషయాలని వ్యవస్థాగతం చేస్తున్నారు.

భారత ప్రభుత్వం 1854 వ సంవత్సరంలో పోస్టాఫీసులను పరిచయం చేసింది. ఉత్తరప్రత్యుత్తర సాధనంగా శతాబ్ద కాలం రాజ్యమేలింది. నాటి కాలంలో ఉత్తరం కోసం వేచి చూసేవారు. ఎక్కడో దేశ రక్షణకై వెళ్ళిన భర్త నుండి ఉత్తరం వస్తుందని భార్య పస్తులుండేది. ఆ వచ్చిన ఉత్తరాలు చదివి చాలా జాగ్రత్తగా భద్ర పరిచేది. కానీ నేటి కాలంలో పోస్టాఫీసు పరిస్థితే మారిపోయింది. బ్యాంకుగాను, రైల్వే రిజర్వేషన్ ఆఫీసుగా, జీవిత భీమా ఏజెంటుగా పోస్టు ఆఫీసులు పాత్ర వహిస్తున్నాయి. కారణం లేఖలు అచలనం కావడం. ఆరోగ్యంగా ఉండాలన్నా, అప్యాతలు నిలవాలన్నా లేఖల నేటికి ఎంతో అవసరం.

నేటి స్థితి - లేఖల పరిస్థితి :

4 జి ని దాటి 5 జి లోకి పరుగు పెడుతుంది ఈ ప్రపంచం. ఏ చిన్న సమాచారాన్ని అయిన అంతర్జాల సహాయంతో అర నిమిషంలో పంపించేస్తున్నారు. అలాంటిది లేఖలు రాసి పోస్టు చేసి పంపించే ఓపిక ఎక్కడుంది? అది ఎప్పుడో అంతరించింది.వాట్సాప్, ఫేస్ బుక్, ఇంస్టాలు నేటి సమాచార సాధనాలు. లేఖలు అంటే లెక్కలు అనుకునే పరిస్థితిలో ఉంది నేటి సమాజం. సమాచార సాధనాల్లో good morning బదులు gm, how are you స్థానంలో hwru? లాంటి పదాలు చోటు చేసుకున్నాయి. ఇది అంతా ఆంగ్ల పైత్యం. ఇప్పుడు సరైన అక్షరం ఏదో? దోషాక్షరం ఏదో తెలియకుండా పోతుంది. ఇది ఇలాగే సాగితే భాష భ్రష్ట పట్టిపోతుంది. నాటి తెలుగులో లేఖలు రాసేటప్పుడు సమ వయస్కులకైతే ఉభయ కుశలోపరి, పెద్ద వాళ్ళకైతే మహారాజశ్రీ, చిన్నవాళ్ళకైతే చిరంజీవి అంటూ సంబోధన వాక్యాలతో విషయం చెప్పడం మొదలు పెట్టేవారు. ఆ పిలుపులులో ఉన్న ఆప్యాయత అంతా ఇంతా కాదు. ఇప్పుడు ఎవరికైనా hi అనడం ఆనవాయితీగా మారిపోయింది. మన ఆలోచనా ధోరణి మారాలి కానీ మన ఆచార వ్యవహారాలు మార కూడదు. ఇది గుర్తెరిగి మెలగడం మంచిది.

ఒకప్పుడు వ్యక్తిగతానికే పరిమితమైన లేఖలు కాలక్రమంలో శాస్త్ర సాంకేతిక, సాంఘిక,రాజకీయ, భాషా సాహిత్య, సాంస్కృతిక పరమైన అంశాలని చర్చించే

వేదికలయ్యాయి. ముఖ్యంగా రాజకీయంగా బహిరంగ లేఖల ఘట్టాలు తరచూ చూస్తున్నాం కదా. సినిమా పాటల్లో సన్నివేశాల్లో కూడ లేఖల ప్రస్తావన వస్తున్నా ప్రేక్షకులని ఆకట్టుకునే ఒక వాణిజ్య అంశంగానే అక్కడ గుర్తిస్తున్నారు. వాస్తవాలని పరిశీలిస్తే ప్రస్తుతం విద్యార్థులకు పాఠ్య ప్రణాళికల్లోబీ పాఠకుల ప్రతిస్పందనల కోసమని పత్రికల్లో మాత్రమే ఎక్కువగా కనిపిస్తున్న ఈ లేఖా ప్రక్రియ సామాన్య జన వ్యవహారికంలో బాగా తగ్గిపోయింది. పుట్టినరోజులకు, పండుగలకు ఏదో ప్రత్యేకమైన సందర్భాల్లో శుభాకాంక్షలు చెప్పడానికి అందులో కొన్ని వాక్యాలు తమవారికోసం రాసేవారు. ఇప్పుడు చరవాణి (సెల్ ఫోన్) పుణ్యమా అని అది కూడా దుస్థితిజారీ కళ్ళకు సంబంధించిన వ్యాధుల్ని కొని తెచ్చుకుంటున్నారు.

సాంకేతిక మాయాజాలం కలాన్ని కాకుండా కంప్యూటర్ కీ బోర్డుని పట్టేలా చేసింది. దాంతో లేఖా సాహిత్యం ఈ-మెయిల్ సాహిత్యంగా, ఆన్ లైన్ సాహిత్యంగా పరిణామం చెందింది. కరోనా కోవిడ్ 19 పుణ్యామా అని ఇది ఇంకా వేగాన్ని పుంజుకుంటుంది. అయితే ఆ సాహిత్యానికి పరిధి ఎక్కువే కానీ పాఠకుల సంఖ్య స్వల్పం. కారణం ఆన్లైన్లో సాహిత్యాన్ని ఎక్కువ సమయం కేటాయించి చదవడం అనేది అనారోగ్యమైన అనుకూలమైన అభ్యాసంగా తయారై ముంగిట కూర్చుంది.

విశ్వ శ్రేయః కాంక్షిసాహిత్యం :

నేటి సమాజంలో అభద్రతా భావం పెరిగిపోయింది. ఏకాంతంగా మాట్లాడటానికి అవకాశమే లేకుండా పోతుంది. ఎప్పుడు ఎవరు మన ఫోన్ ట్రాక్ చేస్తారో తెలియదు. సమాజానికి సందేశం ఇవ్వడానికి సమాచార సాధానాలదే ప్రధాన పాత్ర. నేటి కాలంలో ఆ అవకాశం ఉన్నా అది కొన్నిసార్లు తప్పుడు సమాచారంగా మార్పు చెందుతుంది. దీనికి ఆద్యులు మార్ఫింగ్ మాఫియాలు. అభివృద్ధి చెందవచ్చు అలాగని అభివృద్ధికి దోహదంపడే వాటిని వదిలేయమని అర్థం కాదు.

ఎప్పుడో గాంధీ గారో, నెహ్రూ గారో ఒక ఉత్తరం రాసారంట అది నేటి వేలంలో కోట్ల ధర పలుకుతుందంట. ఏమి చిత్రం!. ఇది చూస్తేనే అర్థం అవుతుంది లేఖలు ఏ స్థాయికి దిగజారిపోయాయో. ధరలు ఎక్కడికి ఎగబాకాయో. విద్యార్థుల్లో వర్ణనా నైపుణ్యం అంతరించింది. పదివ తరగతి పరీక్షలో 5 మార్కులు వస్తాయి కదా అని లేఖా రచనా నేర్చుకుంటున్నారు. అది కూడా ఉపాధ్యాయుడు రాసిన నమూనా లేఖే. పోనీ ఉపాధ్యాయుడికి వచ్చా అంటే అదీ ప్రశ్నార్థకమే? పై తరగతులు విద్యాభ్యాసం కోసం అభ్యర్థన లేఖలు రాయాల్సి వస్తే బిక్క మొఖం వేస్తున్నారు నేటి ఉత్త(మ)విద్యార్థులు. వీటన్నింటి కారణం లేఖా రచన లేకపోవడం, అవగాహన లేని విద్యాభ్యాసం, అవసరార్థం చెప్పే చదువుల శైలిలే. విద్యార్థికి మార్కులుతప్ప, సమాజంలో బ్రతకడం నేర్పిస్తున్నామా? లేదా? అలాగే నేటి అధ్యాపకులూ.

ఇవన్నీ మారాలి. అప్యాయతలు, అనురాగాలు నేర్పించాలి. సమాజం అంటే ఏంటో రుచి చూపించాలి. కుటుంబ వ్యవస్థలోని విలువలను తెలియచెప్పాలి. అప్పుడే సాహిత్యం కోరుకునే విశ్వ శ్రేయస్సు సాధ్యపడుతుంది. సాహిత్యంలో ఎన్నో అంశాలు దాగి ఉంటాయి. అవన్నీ అవగతం చేసుకొని ముందుకు సాగాలి. అభివృద్ధి మన వృద్ధిని చెప్పేదిగా ఉండకూడదు సమాజాభివృద్ధికి సూచీగా ఉండాలి. అందులో లేఖలు భావ రాగాల స్వరపేటికలుగా మనమే ఉపయోగించుకోవాలి. అలా ఉపయోగించి వందనాలు అందుకున్న వ్యక్తి వరలక్ష్మమ్మ. వందనాలు అందించినవి శారద లేఖలు. "శారద లేఖలు" తెలుగులో లేఖా సాహిత్యానికి ఒక నూతన అధ్యాయాన్ని తెరిపించాయ్.

ఆధార గ్రంథాలు :

1. అంతర్జాలం
2. లేఖా సాహిత్యం తెలుగు అకాడెమీ ప్రచురణలు
3. ప్రేమ లేఖలు - చలం
4. శబ్ద రత్నాకరం - బహుజన పల్లి సీతారామాచార్యులు
5. శారద లేఖలు (ప్రథమ, ద్వితీయ సంపుటిలు) - కనుపర్తి వరలక్ష్మమ్మ

⌘

BHAVAVEENA
Vol. 17, Issue. 8, August 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

'ఒక పరిమళ కాంతిదీపం' కవిత్వం – సమకాలీనత

– శశికళ యస్., పరిశోధక విద్యార్థి, తెలుగుశాఖ, మద్రాసు విశ్వవిద్యాలయం, చైన్నై.

ప్రాచీన సాహిత్యం నది లాంటిది. అయితే అలాంటి నదులన్నీ కలిసి నేడు ఒక పెద్ద మహా సముద్రంగా మారి ఆధునిక సాహిత్యం ఉప్పొంగుతుంది. తెలుగు సాహిత్యానికి వెయ్యి యేళ్ళ చరిత్ర ఉందని చెప్పవచ్చు. కాలంతో పాటు మారుతున్న సాహిత్య విలువలు, ప్రక్రియలు నూతన సృష్టి సృష్టించుకుంటుంది. ఎన్నో విలువైన రచనలు చేస్తూ రచయితలు, కవులు ఎవరికి వారు అభిరుచికి దగినట్లు తమ రంగంలో కృషి చేస్తున్నారు. ప్రాచీనకాలంలో ఇతిహాసాలు, కావ్యాలు ప్రబంధాలు అయితే ఆధునికకాలంలో నవల, నాటకం, కథ, కథానిక, కవిత్వం మొదలైన ప్రక్రియలు అనేకం ఉన్నాయి.

రచయిత పెరుగు రామకృష్ణ కవి రాసిన "ఒక పరిమళ భరిత కాంతిదీపం" కవితా సంపుటిలో మానవత్వంతో కూడిన కవితలు, సామాజిక నేపథ్యంలో సాగిన కవితలు రచయిత వివరించారు. ప్రధానంగా సమకాలీన సమాజంలోని పరిస్థితులను ఆధారంగా చేసుకొని తన చుట్టు జరిగే పరిస్థితులను గమనించి ప్రభావానికి లోనై తన భావాల్ని ఈ కవితా సంపుటిలో విశ్లేషణ చేశారు. సమాజంలో జరుగుతున్న ఘోరాలను, దోపిడీవ్యవస్థ, రాజకీయ, ఆర్థిక, సాంఘిక పరిస్థితులను అధ్యయనం చేశారు.

సమాజ శ్రేయస్సు కోసం తపించి, వ్యక్తికి మానవత్వం ముఖ్యమైనదని రచయిత భావించి రామకృష్ణ చెప్పారు. ఈ కవితా సంపుటిలో స్త్రీలపై జరుగుతున్న అన్యాయాలను అరాచకాలను, రాజకీయ నాయకుల మోసాలను, మేధావుల ఆదర్శాలను, సామాజికవేత్తగా ప్రతి విషయాన్ని లోతైన పరిశీలన చేశాడని ఈ కవితా సంపుటి ద్వారా సమసమాజ నిర్మాణాన్ని ఆకాంక్షించారు అని అర్థ మౌతుంది.

కవిత్వం – పరిచయం :

ఆధునిక సాహిత్య ప్రక్రియలో కవిత్వం ఒకటి. లలితకళలలో కూడా ప్రధానమైనది కవిత్వం. వ్యక్తి తన అనుభూతులను తాను చూసిన సంఘటనలను ఆధారంగా చేసుకొని తనకు అనువైన పద్ధతిలో చెప్పడం జరుగుతుంది. నేడు ఎన్ని ప్రక్రియలు వెలువడిన అందులో కవిత్వానికి ఎంతో ఆధునికతతో మార్పులు చేస్తుంది. కవిత్వం ఎప్పటికప్పుడు నిత్య నూతనత్వంతో ప్రకాశింపజేస్తుంది.

"కవిత్వమెంత పురాతనమైనదో అంత అదునాతన మైనది. సాంకేతికముగా వైజ్ఞానికముగా పురోభివృద్ధి నందుచున్న యుగంలో ఊహలతో జీవించు కవిత్వము బ్రతకగల్గునాయను సందేహమును కొందరు ప్రకటించిరి. కవిత్వం ప్రధానముగా మానవుని అనుభూతులపై ఆధార పడి ఉన్న కళ. అందుచేత మానవుడున్నంత కాలం కవిత్వమునకు క్షితి లేదు."

ఒక పరిమళ భరిత కాంతిదీపం-పరిచయం :

'ఒక పరిమళ భరిత కాంతి దీపం' కవితా సంపుటిలో రచయిత మానవత్వానికి సంబంధించిన విషయాలను చర్చిస్తూ సామాజికాంశాలను, సమాజంలో జరుగుతున్న స్త్రీ సంవేదన, కుల, మత, భేదాలను రైతన్న బాధలను, దళితుల పరిస్థితులను మొదలగు అంశాలను కూడా ఈ కవితా సంపుటిలో వివరించారు. ప్రతి కవిత్వం సమాజానికి అభివృద్ధికి తోడ్పడేటట్లు రచయిత రాయటం జరిగింది. రచయిత రాసిన ఒక పరిమళ భరిత కాంతిదీపం కవితా సంపుటిలో 53 ఖండికలను సమాజ శ్రేయస్సు కోసం రాస్తూ సందేశాత్మకమైన కవితలను తన కవితా సంపుటిలో వివరించారు.

ఒక పరిమళ భరిత కాంతిదీపం – సమకాలీనత:

పెరుగు రామకృష్ణ కవి ఒక నవ్య నిర్మాణ దీక్ష కావాలి అనే కవితా ఖండికలో సమసమాజ నిర్మాణం కోసం

తపిస్తున్నాడని అర్థమవుతుంది. సమాజంలో జాతి, కుల, మత భేదాలు లేకుండ అందరూ సమానత్వంతో నవచైతన్యంతో కూడిన నవ్య నిర్మాణం కోసం పాటు పడాలని ఈ కవితా ఖండికలో స్పష్టంగా కవి అభివ్యక్తం చేసిన విధానాన్ని చూద్దాం!

"మానవ ప్రపంచ ద్వారాలు తెరవడానికి
ఒక తాళం చెవి లాంటి దీక్ష కావాలి ....
విశ్వ వాకిలి ముందు
దేహ సౌందర్యంతో కాకుండా
ఆత్మసౌందర్యంతో, జాతి, జాగృతి కోసం చేపట్టే
ఒక నవ్య నిర్మాణ దీక్ష కావాలి ....." (పుట.21)

మనుషుల పట్ల రాగద్వేషాలు లేకుండా, అందరూ అభివృద్ధి పథం పెట్టాలి. అప్పుడే ఒక నిర్మితమైన నవ్య నిర్మాణం జరుగుతుంది. అందరిలోను తన మన భేదాలతో కలిగి మానవత్వంతో సహృదయంతో మనిషి ఉన్నప్పుడే నవ్యసమాజం నిర్మాణం అవుతుందని రచయిత అభిప్రాయం.

డ్రైవర్లను ఉద్దేశించి ప్రాణాలను జాగ్రత్తగా కాపాడుకోవాలని రచయిత "జరభద్రం! అనే కవితలో వివరించారు. ఎక్కడ చూసిన హత్యలు, ఆత్మహత్యలు, బుణ హత్యలు, అత్యాచారం ఎక్కడబడితే అక్కడ జరుగుతున్నాయి. మనిషికి ప్రాణం విలువ ఎంత గొప్పదో ఈ కవితలో తెలియజేసే విధానాన్ని చూద్దాం!

"హెచ్చరిక లేకుండానే ఆగిపోతున్నాయి...
ఇక జీవితానికి రబీ లేదు .... ఖరీఫ్ లేదు
ఉన్నదల్లా వెంటాడుతున్న ప్రమాదం
సునామీలతో తరుముకొస్తున్న ఎర్ర సముద్రం
జరభద్రం ... జాగ్రత్త జనాల్లారా ప్రాణం పదిలం
(పుట.41)

రచయిత ప్రాణం విలువ తెలియకుండా ప్రాణాలను అర్పించుకునే వాళ్ళకోసం రాసిన కవితగా చెప్పవచ్చు. రైతు పంట పండలేదని ఆత్మహత్య, ఆడపిల్లలు పుడితే బుణహత్యలు, స్త్రీలపై ఆకృత్యాలు ఇటువంటి అనేకమైన పరిణామాలను తీసుకుని రచయిత తెలియజేసారని అర్థమౌతుంది.

భ్రష్టుపట్టిన సమాజాన్ని ఉద్దేశించి 'జీవదృశ్యాలు' అనే కవితా ఖండికలో సమాజంలో జరిగే ఆకృత్యాలు, అరాచకాలు, అమానవీయ, రాజకీయాలు మొదలైనవన్నీ కూడా సమాజంలో జరుగుతున్నాయి. ఇటువంటి వాటిని రూపుమాపాలని కవి రామకృష్ణ ఉద్దేశం.

పాడైపోయిన ప్రపంచాన్ని
ఇక నడిచి మార్చలేనని తెలిసాక
ఈ ఆకృత్య, అరాచక, అమానవీయ
రాజకీయమే లేని నేలని
రహస్యంగా అన్వేషిస్తున్నాను
నాకు కలం పట్టడం
పిడికిలి బిగించడం తప్ప
పేదల పొట్ట కొట్టడం నేర్పనే లేదు మా అమ్మ.
(పుట.58)

రచయిత ఈ కవితలో పేద ప్రజలపై జరుగుతున్న అన్యాయాలను వెల్లడిస్తున్నాడు. మానవజాతిని సరైన మార్గంలో నడిపించాలి అంటూ కవి ఎంతో తాపత్రయ పడుతున్నారని అర్థమౌతుంది.

ఎన్నో భాషలు, జాతి, కులాలు, ఉన్నటువంటి సమాజంలో మనిషికి మానవత్వం లేదని, క్రూరంగా ప్రవర్తిస్తున్నారని కవి "మనిషి ఎక్కడో" అనే కవితా ఖండికలో సమాజ నేపథ్యం, మానవత్వాన్ని గురించి రాసిన కవితగా చెప్పవచ్చు.

"జీవితం జీవితమే గడిచిపోయింది
ఇప్పటికీ ఎదురు చూస్తూనే ఉన్నాను
మానవత్వం నిండిన మనిషితో ముచ్చటిద్దామని
కానీ
మనిషి ఎక్కడో తప్పిపోయిన జాడలు"

రచయిత తన జీవిత అనుభవంలో చూస్తున్న మనుషుల వ్యక్తిత్వాలను ఎదురు చూస్తున్నటువంటి మానవత్వంతో నిండిన మనిషి కనబడటం లేదని, మనిషి ఎక్కడో తప్పిపోయాడని రచయిత అభిప్రాయం.

ముగింపు :

ఈ విధంగా రచయిత పెరుగు రామకృష్ణ సమాజంలో జరుగుతున్న పరిణామాల దృష్ట్యా చూసిన వాస్తవిక సంఘటనలను ఆధారంగా చేసుకుని మానవత్వంతో, సహృదయతతో ప్రతి విషయాన్ని లోతుగా అధ్యయనం చేసి సమాజానికి ఉపయోగపడేలా తన రచన "ఒక పరిమళ భరిత కాంతి దీపం" కవితా సంపుటిని వెలుగులోకి తెచ్చారు. ఈ కవితా సంపుటిలో రచయిత మానవీయ విలువ లను, సామాజికతను విస్తృతమైన విషయాలను గురించి చర్చించారు. ఈ సమకాలీన సమాజంలో జరిగే సంఘటనలను దృష్టిలో పెట్టుకొని మనిషికి మనిషికి మధ్య స్నేహభావం, మానవత విలువలు, ప్రస్తుత సమాజంలో రాజకీయ, ఆర్థిక, సామాజిక పరిస్థితులకు అనుగుణంగా కవిత్వాలు రాయడం జరిగింది. సమకాలీన సమాజంలో కవి రచ యిత ప్రతి విషయాన్ని అధ్యయనం చేసి, విశ్లేషణ చేస్తూ ప్రజలను సరైన నడవడిక వైపు పయనించేటట్లు చేయాలని రచయిత ఉద్దేశం. ఈ విధంగా "ఒక పరిమళ భరిత కాంతి దీపం" కవితా సంపుటి సమాజానికి ఉపయోగ పడేలా రచన చేశారని పెరుగు రామకృష్ణగారు సమాజం కోసం ఎంతో కృషి చేస్తున్నారని చెప్పవచ్చు.

ఉపయుక్త గ్రంథాలు :

1. 20వ శతాబ్ది తెలుగు కవిత్వం - డా. కడియాల రామమోహన్‌రాయ్
2. ఆధునికాంధ్ర కవిత్వం-ఉద్యమాలు - రాచపాలెం చంద్రశేఖర్ రెడ్డి
3. తెలుగులో కవిత్వోద్యమాలు - తెలుగు అకాడమీ
4. ఒక పరిమళ భరిత కాంతిదీపం కవితా సంపుటి - డా. పెరుగు రామకృష్ణ

⌘⌘⌘

BHAVAVEENA
Vol. 17, Issue. 8, August 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

మీడియా వలలో పడ్డ యువతరం భవిష్యత్తుకు నిలువుటద్దం 'ప్రలోభం' నవల

- అంకిరెడ్డి సునీల్ కుమార్ రెడ్డి, పరిశోధక విద్యార్థి, హైదరాబాదు కేంద్రీయ విశ్వవిద్యాలయం, హైదరాబాదు.

రోజురోజుకు మానవుని ఆలోచనా విధానాలు మారు తున్నాయి. నాగరికత కొత్త పుంతలు తొక్కుతోంది. దీనికి తోడు టెక్నాలజీ ఊహించని రీతిలో అభివృద్ధి చెందు తోంది. నాగరికత ఎంత పెరుగుతున్నప్పటికీ ప్రజల జీవన విధానాల్లో, నైతిక విలువల్లో మాత్రం మార్పురావట్లేదు. సిగ్గు, బిడియం, మర్యాద, సభ్యత వంటి మాటలకు ఇప్పుడు తావులేదు. ఆరేళ్ల అమ్మాయి బూతు సినిమా పాటకు డాన్స్ చేస్తుంటే తల్లిదండ్రులు చప్పట్లు కొడు తున్నారు. అమ్మ, చందమామ పాట పాడుతూ గోరు ముద్దలు తినిపిస్తూ ఉంటే పిల్లవాడికి రుచించడం లేదు ఐఫోన్ చేతిలో పెడితే చాలు... బార్లల్లో ఆడ మగకి తేడా లేదు. ఇంకా వేసుకునే బట్టల గురించి చెప్పక్కరలేదు. అబ్బాయిలు అమ్మాయిల వెంటపడి ప్రేమించడం, కాదంటే వేధించడం, లేదంటే యాసిడ్ పోయడం. ఇలాంటి పరిస్థితులను రోజూ మనం చూస్తూనే ఉన్నాం. ఇలాంటి గందరగోళంలో సతమతమవుతున్న మనసు లోంచి ఎగదన్నుకొచ్చిందీ 'ప్రలోభం' నవల అంటాడు నాయని కృష్ణమూర్తి.

"ఒంటిమీద అచ్ఛాదన లేకుండా తిరిగిన మానవుడు బట్టలు కట్టడం నేర్చుకున్నాడు. గుహల్లో చెట్ల మీద నివసించే వాడు ఇల్లు కట్టడం తెలుసుకున్నాడు. కాలి నడకన ప్రయాణం చేసేవాడు కార్లు కనిపెట్టాడు. విమా నాలు ఎక్కి గాలిలో తిరుగుతున్నాడు. ప్రపంచం ఒక గ్రామమయింది. అంతా బాగానే ఉంది కానీ ఇప్పుడు ప్రపంచంలో అందరి మెదళ్లనూ మీడియా పురుగు కాటేసింది. ఒకరితో ఒకరు మాట్లాడుకోవడం ఎక్కడా కనిపించడం లేదెందుకు? ఎవరికీ భుజాలమీద తలలు ఉన్నట్లు లేదే! తలలకు బదులు టీవీలు, సినిమా తెరలు, కంప్యూటర్లు కనిపిస్తున్నాయెందుకు? మనుషుల మధ్య దూరమింత పెరిగిపోయిందేమిటి? ఎదురెదురుగా నిల బడి మాట్లాడుతున్నా మధ్యలో మహాసముద్రాలు కనిపిస్తున్నాయే!" అంటాడు నవల వెనుక కథలో రచయిత నాయుని కృష్ణమూర్తి. అవును ఈ మాటలన్నీ అక్షర సత్యాలు.

ప్రస్తుతం పత్రసమర్పనకు నేను ఎంచుకున్న ప్రలోభం అనే నవలలో కాలేజీ విద్యార్థులకు అందులోనూ ముఖ్యంగా యువతులకు ఎదురయ్యే ప్రలోభాలు, ఆ ప్రలోభాల వల్ల ప్రభావితమైన వారి జీవితాలు చివరికి ఎలా తయారయ్యాయో వైజయంతి, హరిత, మాలిని, ప్రణతి అనే పాత్రల చేత మనకు అవగతం అయ్యే విధంగా నవలను మలిచారు నాయుని కృష్ణమూర్తి. అంతేకాకుండా ఈ నవలలో కాలేజీ యూనియన్ ఎలక్షన్లు ప్రస్తుత రాష్ట్ర, దేశ రాజకీయాలను తలపించే విధానం, ఎదురుతిరిగి మాట్లాడే విద్యార్థులను రాజకీయ నాయ కులు పోలీసుల చేత తీవ్రవాదులుగా ముద్ర వేయించి వారిని చిత్రహింసలకు గురిచేసే విధానం ఈ నవలలో చూడవచ్చు. పై అంశాలు నవలలో ఏ విధంగా చిత్రించ బడ్డాయో విశ్లేషించడం ఈ పత్ర సమర్పన ఉద్దేశం.

ప్రలోభం నవల ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రికలో 15-8-2003 నుండి 2-1-2004 వరకు సీరియల్గా వచ్చింది. దీనిని వియన్నార్ బుక్ వరల్డ్ చౌడేపల్లి వారు 2012లో పుస్తక రూపంలో ప్రచురించారు. నవలా రచయితగా నాయుని కృష్ణమూర్తి యామిని కుంతలాలు, మనసు గుర్రము రోరీ మనిషి!, మహాభారత మూలకథకు నవలా రూపంగా 'జయమ్' వంటి నవలలను రచించాడు. ఖేల,

కాటుక కరిగిపోయింది నవలలను అయన చనిపోయిన తర్వాత విజయవాణి ప్రింటర్స్ వారు ముద్రించారు. కథ కుడిగా 'కథలు', 'ఏం లేదు' అనే రెండు కథా సంపుటాలను ప్రచురించాడు. 'ఈ కోతి డ్రామాకు పని కొస్తుందా', 'వియోగవిభావరి' అనే ఏకాంకికలను, రామాయణ భాగవతాలను వచనంలోనూ రచించాడు. ఆంగ్ల అభ్యసనానికి తోడ్పడే మూడు తెలుగు-ఇంగ్లీష్ నిఘంటువులను కూడా నిర్మించాడు. కొంతకాలం బొమ్మరిల్లు, విజయ, నీలిమ పత్రికలకు ఉపసంపాదకుడిగా పని చేశాడు. తర్వాత 'స్నేహబాల' అనే పిల్లల పత్రికను నిర్వహించాడు. వీటితోపాటు 1977లో 'మాబడి' 1978లో 'పాఠశాల' పత్రికలను విద్యార్థుల కోసం తాను స్థాపించిన విజయవాణి సంస్థ ప్రచురిస్తున్నవే. తెలుగు పత్రికా రంగంలో మా బడి, పాఠశాల పత్రికలకు విశిష్ట స్థానం ఉండడం అందరికీ తెలిసిందే. అలాగే సినీ రచయితగా కూడా మూడు పాటలను అందించడం గొప్ప విషయం. అక్షర తపస్మాన్ కార్యక్రమంలో చిత్తూరు జిల్లా సాక్షరతా సమితి అకడమిక్ కమిటీ చైర్మన్ గా, రాష్ట్ర సాక్షరతా సమితి కమిటీ సభ్యుడిగా, కేంద్ర స్థాయిలో నేషనల్ లిటరసీ మిషన్ సభ్యుడిగా సేవలందించారు.

ప్రలోభం నవలలో ప్రధాన పాత్ర వైజయంతి. బీఎస్సీ పూర్తి చేసి పెళ్లి కాకపోయినా పది నెలల కొడుకు ఉన్న ఈమె, కాలేజీ రోజుల్లో సెక్స్ విజ్ఞానం పేరుతో వస్తున్న వారపత్రికలకు, బూతులతో నిండిన సినిమాలకు, కథలకు అలవాటుపడి క్షనికావేశాలను అదుపులో ఉంచుకోలేక, వాటి ప్రలోభాలకు లోనై తన జీవితాన్ని నాశనం చేసుకుంటుంది. ఈమెతో పాటు మిగిలిన స్నేహితులు మాలిని, ప్రణతిలు కూడా వివిధ ప్రలోభాలకు లోనై జీవితాలను కష్టాలలోకి నెట్టుకొని చివరికి చంపబడుతారు.

నవల ప్రారంభంలో వైజయంతి ఒక లాయర్ దగ్గరికి వచ్చి "నేను మోసపోయాను లాయరుగారూ...! కళ్ళు తెరిచేసరికి పూర్తిగా ఊబిలో కూరుకుపోయి ఉన్నాను. కారణం ఈ సమాజమే!" అంటుంది. దీనికి లాయరు మీరు ఉంటున్న ఈ సమాజంలో నేనూ ఉంటున్నాను ఈ సమాజం నన్ను మోసం చేయలేదే. మీరు ఏదో తప్పు చేసి ఉంటారు దాని పర్యవసానంగా ఫలితాన్ని అనుభవిస్తుంటారు అంటారు.

దీనికి వైజయంతి "మీరు చెబుతున్నది అక్షరాల కరెక్ట్ లాయరుగారూ! మీరన్నట్టు నేను తెలియకుండా తప్పులు చేశాను. నష్టపోయాను. నేను తప్పులు చేయడానికీ, నష్టపోవడానికీ కారణం నేనే అంటే మాత్రం ఒప్పుకోను. నాలాంటి తెలిసీ తెలియని వయసులో ఉన్న యువతరాన్ని రెచ్చ గొడుతున్నది, బలహీనతల్ని సొమ్ము చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నది మీడియా. అది ప్రింట్ మీడియా కావచ్చు విజువల్ మీడియా కావచ్చు. నన్ను తప్పు చేసేలా రెచ్చగొట్టింది. చాలామంది నాలాంటి వాళ్ళు ఈ యువతరంలో ఉన్నారు. మంచి - చెడు మధ్య గీత గియ్యలేని నన్ను ఇప్పుడు విడుదల అవుతున్న పత్రికలు సినిమాలు రకరకాల టీవీ ప్రోగ్రాములు కరెప్ట్ చేశాయి. వెర్రితలలు వేస్తున్న నాగరికత, సెక్స్ వయోలెన్స్ ఇవే ఆదర్శంగా పత్రికలు, సినిమాలు, టీవీలు చూపడంతో నేను వాటి ప్రభావానికి లోనయ్యాను. ఫలితంగా నా జీవితాన్ని నేను నాశనం చేసుకున్నాను". అంటుంది.

పైన కనపడే ఈ సమస్యలు నేటికీ కూడా ఈ సమాజాన్ని పట్టిపీడిస్తున్నాయి. దిన పత్రికలు, వార పత్రికలు నేటికీ వస్తున్నాయి కానీ ఈరోజు వాటి కంటే ప్రమాదకరమైనది స్మార్ట్ ఫోన్. ఇది అరచేతిలోనే అన్నీ చూపించగలదు. పత్రికల్లో, టీవీల్లో రకరకాల ప్రోగ్రాములను ఇంటిల్లపాది చూడడానికి కూడా సిగ్గు పడాల్సిన పరిస్థితి నేడు నెలకొంది. జుగుప్సాకరమైన మాటలతో కూడిన డైలాగులు నిండిన ప్రోగ్రాములు మనం చూస్తూనే ఉన్నాం. వీటన్నింటి ప్రభావాలవల్ల నేడు ఎంత మంది నిగ్రహంగా ఉండగలరు. వారి జీవితాలను చెడు మార్గాలు పట్టకుండా ఎంతమంది కాపాడుకోగలరు. మంచీ చెడు చెప్పడానికి పిల్లలను కనిపెట్టుకొని ఉండడానికి నేడు

ఉమ్మడి కుటుంబాలు పోయి వ్యష్టి కుటుంబాలు ఏర్పడ్డాయి. కావాల్సినంత స్వేచ్ఛ వచ్చింది. దీనికి తోడు అధిక గారాబం. పది పాస్ అయితే మోటారు సైకిల్ కొనివ్వడం. కావలసిన ఫోను తీసివ్వడం. వీటికి తోడు చెడు సావాసాలు. చుట్టూ ఇన్ని ప్రలోభాలు ఉన్న ఈ సమాజంలో యువత చెడు దారి పడుతుందా లేదా అని ఆరా తీసేలోపే అన్నీ జరిగిపోయుంటాయి. ఇలాంటి ఆవేదననే రచయిత ఈ నవల ద్వారా తెలపదల్చు కున్నాడు.

నవలలో ఇలాంటి వ్యసనాలకు లోనై ప్రాణాలు పోగొట్టుకున్న పాత్ర మాలిని. మండల ప్రెసిడెంట్, గోపీకృష్ణ థియేటర్ ఓనర్ సురేంద్ర గారు వైజయంతిని ఒకసారి వచ్చి కనిపించమని చెప్పారమ్మా అంటూ చెప్పివెళ్తాడు ఒక మనిషి. వైజయంతి స్నేహితురాళ్ళతో నన్నెందుకు పిలుచుంటాడు. అయినా నా పేరేలా తెలుసుంటుంది అని అనుకుంటుంది. మరుసటిరోజు మాలిని వైజయంతితో "నేను వినడం ఎమంటే కాలేజీల్లో ఎవరన్నా మంచి బ్యూటీలు ఉంటే, రాజకీయనాయకులు వలలు వేసి పట్టుకుంటారని!" అంటుంది. మొత్తానికి విషయం ఎమైవుంటుందో కనుక్కొని రావడానికి మాలిని ప్రణతిలు మండల ప్రెసిడెంట్ ఉండే ఆఫీసు దగ్గరికి వెళ్తారు. మండల ప్రెసిడెంటు ఆ టైంలో అక్కడ ఉండరని థియేటర్ దగ్గర ఉంటారని తెలిసి వెనక్కి తిరుగుతుండగా గోపీకృష్ణాలో 'ది ఉమెన్ ఇన్ రెడ్' సినిమా కదా వెళ్దామా సురేంద్ర కూడా అక్కడే కదా ఉంటాడు అంటుంది సినిమాలపట్ల మోజున్న మాలిని. గోపీకృష్ణాలో ఇంగ్లీష్ సినిమాలు ఆడవు అక్కడ అన్నీ తెలుగు సినిమాలే అని ప్రణతి అంటుంది. "తెలుగు సినిమా ఏదైతే ఏంలే! బూతు డైలాగులు ఉంటాయి. కావాల్సినంత రోమాన్స్, వెళ్దామంటే వెళ్దాం" అంటుంది మాలిని.

మాలిని, ప్రణతిలు మండల ప్రెసిడెంట్, గోపీకృష్ణా థియేటర్ ఓనర్ సురేంద్రని కలిసి మాట్లాడుతుండగా, ప్రనతిని "ఏమ్మా, నువ్వు సినిమా చూస్తుంటావా? రెండు మాటలు మాట్లాడిన తరువాత మీ ఫ్రెండును కూడా పంపుతాను" అంటూ తన గన్ మాన్ ను పిలిచి ప్రనతిని సినిమాలో కూర్చోపెట్టిపిస్తాడు. తరువాత వైజయంతి కంటే నువ్వే అందంగా ఉన్నావంటూ మాలినికి మాయ మాటలన్నీ చెప్పి, కాసేపు సినిమా చూస్తావా అంటూ ప్రొజెక్టర్ రూముకు తెసుకు వెళ్లి తలుపులు గడిపెట్టి "మాలినీ! నువ్వు ఎవరివైనా ఈ క్షణం నుండీ నా దేవతవు. నీతో అబద్ధం చెప్పను. నేను ఎంతోమందిని చూసాను. నీలాంటి అందగత్తెను ఎక్కడా చూడలేదు. కారణం నువ్వు సుకుమారమైన గులాబీ పువ్వువి కాదు, ఎంత నలిపినా నలగని సంపెంగవు" అంటూ బలవంత చేస్తాడు. ఆ సమయంలో అంతా గమనించిన ప్రణతి తన దగ్గరున్న కెమరాతో ఒక ఫోటో తీసి పారిపోతుంది. ప్రనతిని పట్టుకునే ప్రయత్నం చేస్తే అరిచి గోల చేస్తుందేమో అన్న భయంతో మాలిని లోబరుచుకుంటే ఎగోడవా ఉండదు కదా అని, మాలినీ పై అత్యాచారాన్ని కొనసాగించ్తాడు. మాలినికి ఒక భాగం ప్రతిఘటించాలని ఉంది కానీ "ఇంకో భాగం వారపత్రికల సీరియల్లల్లో, శృంగారకథల్లో, సినిమాల్లో చదివిన, చూసిన దృశ్యాలు కలగాపులగంగా మెదడులో నాట్యం చేస్తూ "ఊ కానీ, ఏమైంది?" అంటున్నాయి" అంతే మాలిని ఆవేశంతో విచక్షణతను కోల్పోతుంది. ఈ విషయం తెలిసిన మాలిని ఫ్రెండ్స్ ప్రణతి తీసిన ఫోటోను అడ్డం పెట్టుకొని సురేంద్రను మాలినిని పెళ్లి చేసుకోమని బెదిరిస్తారు. దీనితో చేసేదేమీ లేక పెళ్ళికి ఒప్పుకున్నట్టే నటిస్తూ రాత్రికి రాత్రే మాలిని ఇంటికి నిప్పంటించి ఇంటిలోని వారందరినీ హత మారుస్తాడు.

అలాగే సినిమాల్లో హీరోయిన్గా నటించాలనే మోజులో పడి చివరికి తనకే తెలీకుండానే నీలి చిత్రాల్లో నటించి ఉరివేసుకొని చనిపోయిన దుస్థితి ప్రణతికి వస్తుంది. తన దగ్గరున్న కెమరాను ఎప్పుడూ ప్రొసెసింగుకి ఇచ్చే స్టూడియో ఓనర్ రఘు, ప్రణతికి జయేంద్రను పరిచయం చేస్తాడు. జయేంద్ర ఎవరో కాదు లోకల్ ఎమ్మెల్యేగారి

బామ్మర్ది. మద్రాసు ఫిల్మ్ ఇన్స్టిట్యూట్లో ఫిల్మ్ డైరెక్షన్ డిప్లమా చేసానని చెప్పుకుంటూ దొరికిన అమ్మాయిలకు మాయమాటలు చెప్పి గెస్ట్ హౌసుకు తీసుకెళ్ళి బ్లూ ఫిల్మ్ తీసి గల్ఫ్ దేశాల్లో అమ్మి సొమ్ము చేసుకుంటూ ఉంటాడు.

ప్రణతితో మీ నవ్వు చాలా బాగుందండీ. మీనవ్వు వీడియోలో బంధించి శ్రీదేవికి చూపిస్తే బాత్రూములోకి వెళ్లి ఉరివేసుకుంటుంది. అని ఆమెని పొగడడం, తనకు చిరంజీవి తెలుసు త్వరలో డైరెక్టరు చాన్సు ఇస్తానన్నాడు అంటూ, ఇంకా ఏవేవో మాటలు చెప్తూ "మిమ్మల్ని మీ మూవ్ మెంట్స్ ని వీడియో తీసి, ఏ ప్రొడ్యూసరుకు అయినా చూపామనుకోండి, ఏమో, మీ అదృష్టం ఎలా ఉందొ ఏమో! ఓవర్ నైట్ హీరోయిన్ అయిపోయినా అయిపోవచ్చు". అంటాడు. ప్రణతి సరేనంటుంది. విషయమంతా తెలిసిన వైజయంతి ఇలా బ్లూ ఫిల్ముల వ్యాపారం మొదలుపెట్టిన ఎమ్మెల్యే కొడుకు అలాగే ఇంకొక హీరో కేసుల గురించి చెపుతుంది. ఆకేసులు చివరికి కొట్టేసారుగా అంటూ పెడచెవిన పెడుతుంది ప్రణతి. మొత్తానికి సినిమాల్లో చాన్సు వస్తుందని ఒక ప్రమోషన్ వీడియో తీయడానికి జయేంద్ర రమ్మన్న గెస్ట్ హౌసుకు వెళ్తుంది. అక్కడ జయేంద్ర, ప్రణతితో పాటూ కో వర్కరుగా నటించడానికి వచ్చిన ఆఫ్రికన్ మాన్ తో కలిసి మందు తాగుతూ ప్రణతిని కూడాతాగమని బలవంతం చేస్తారు. పెద్దపెద్ద హీరోయిన్లు, హీరోలు ఒక్క పెగ్గన్నా వెయ్యనిదే సెట్లోకి అడుగు పెట్టరు తెలుసా అంటూ మభ్యపెడుతాడు. ప్రణతి కళ్ళ ముందర ఆక్షణంలో అందరు సినిమా తారలూ కనిపిస్తారు, పక్కన తననూ ఉన్నట్లు ఊహించుకొని మందు తాగేస్తుంది. ఆ మత్తులో జయేంద్రకు కావాల్సిన ఫిలిం రడీ అయి పొతుంది. మత్తు నుండీ తేరుకున్న ప్రణతికి విషయం అర్థమయ్యి సినిమాతారలంతా వేషాలు దొరకని రోజుల్లో ఇలాంటి ఫిల్ముల్లో నటించినవారేలే అనుకుంటూ జయేంద్ర ఇచ్చిన డబ్బు తీసుకుని ఇంటికెల్తుంది. దీని పర్యవసానంగా ప్రణతి నెలతప్పడం, తను నటించిన బ్లూ సినిమా గల్ఫ్ దేశాల్లోనే కాక తన ఊరిలో కూడా దొరుకుతుందని తెలియడం, ఈ విషయం వాళ్ళ నాన్నకు తెలిసి ఆయన గుండె ఆగి చావడం జరుగుతుంది. దీనితో ప్రణతి కూడా ఉరివేసుకుని చనిపోతుంది.

నేటికీ ఇలా సినిమా అవకాశం ఇప్పిస్తామంటూ ఎందరు ప్రొడ్యూసర్లు, డైరెక్టర్లు ఎంతమంది జీవితాలతో ఆడుకోవట్లేదు. అంతెందుకు మొనీమధ్య తెలుగు సినీ రంగంలో ఆడవాళ్ళ పట్ల జరుగుతున్న అన్యాయాలను క్యాస్టింగ్ కౌచ్ పేరుతో శ్రీరెడ్డి లాంటివాళ్ళు సోషల్ మీడియాల్లో వాళ్ళ భాదలను చెప్పుకోవట్లేదా. అయితే నిజానికి తప్పంతా మభ్యపెట్టిన వాళ్ళదే అనలేం మోస పోయిన వాళ్లది కూడా అని చెప్పొచ్చు. ఎందుకంటే వాళ్ళ బలహీనతలు అలాంటివి.

వైజయంతికి తన స్నేహితులకు పట్టిన పరిస్థితులను చూసి మొదటిసారిగా ఆత్మశోధన మొదలవుతుంది. పత్రికలు, టివీలు, సినిమాలు యువతరాన్ని ఎంత బలంగా ఆకర్షిస్తున్నాయో, పెడతోవాలు పట్టిస్తున్నాయో అర్థమవుతుంది. అయినప్పటికీ ఉద్యోగ ప్రయత్నమై తిరపతి నుండీ విశాఖపట్నం వెళ్ళే క్రమంలో నలుగురి ఆకతాయి కుర్రాళ్ళ శపధానికి ఎరగా మారుతుంది. రైలు విశాఖపట్నం వెల్లేలోగా వైజయంతిని పడేస్తానని పందెంకాసిన రాజశేఖరం నాలుగు తెలుగు పత్రికలు కొనుక్కొని "ఈ ఆయుధాలు చాలు ఎవర్నయినా లొంగ దీస్తాను" అంటూ వెళ్లి తన ముందు సీటులో కూర్చుంటాడు. కొన్ని మాటల తరవాత తను రాజశేఖరం దగ్గర ఉన్న తెలుగు పత్రికలను చదవడం మొదలుపెడుతుంది. చాలా కాలం తరవాత తెలుగు పత్రికలు చదవడం మొదలుపెట్టిన వైజయంతి మరీ ఉద్రేకానికి గురై తనని తాను నిగ్రహించుకోలేక మాలిని, ప్రణతి చేసిన తప్పే చేస్తుంది. పర్యవసానం తను నెలతప్పి ఒక బాబును కంటుంది.

ఈ నవలలో వీడేకాదు ఆలిండియా రేడియోలో తన కవితల్ని ప్రసారం చేపిస్తానన్న కృష్ణన్ చేతిలో బలవ్వడానికి

సిద్ధంగా ఉన్న విశాల, పది పాసు కూడా కాని అమ్మాయి నాగార్జున రామ్మన్నాడంటూ, హీరోయిన్ అవాల్సిందే అంటూ ఇంట్లో చెప్పకుండా ఎవరో రాసిన ఉత్తరాలకు బలవ్వబోతున్న జ్యోతి లాంటి వాళ్ళు మనకు ఈ నవలలో కనిపిస్తారు.

ఈ విధంగా ఒక్కొక్కరు ఒక్కొక్క రకమైన ప్రలోభానికి లోనై సమస్యల్లో ఇరుక్కొని తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. దీనికి గల కారణం ఎదుర్కోవాల్సిన ప్రలోభాలకు ప్రతిఘటించకుండా లేదా వారి మానసిక పరిపక్వతకు బుద్ధి చెప్పకుండా ఆ ఊబిలో పడిపోడానికి కారణం మాత్రం యువతలో నిద్రాణ స్థితిలో ఉన్న ఈ సెక్సు, వయోలెన్స్ లను నిద్రలేపుతున్న ఈ పత్రికలు, బూతు నిండిన సినిమాలు అని చెప్పక తప్పదు. ఇటు వంటి వాటివల్ల యువత చెడిపోకుండా ఉండాలని, మీడియాను కంట్రోల్ చెయ్యాలని, చట్ట పరంగా న్యాయాన్ని ఆశిస్తుంది నవలలో ప్రధాన పాత్ర వైజయంతి. ఈ సమస్యకు చట్ట పరమైన న్యాయాన్ని అటుంచితే వీలైనంత వరకూ ఈ విషయంలో యువతరం నష్ట పోతోంది అనే స్పృహ సమాజ సభ్యుల మధ్య మొదట కలిగించాలని ముందడుగు వేస్తుంది ప్రధాన పాత్ర.

ఆధార గ్రంథాలు :

1. నాయుని కృష్ణమూర్తి గారి అక్షర జ్ఞాపిక. చౌడేపల్లి: విజయవాణి సంస్థలు. 2018.
2. కృష్ణమూర్తి, నాయుని. ప్రలోభం. చౌడేపల్లి: వియన్నార్ బుక్ వరల్డ్. 2012.
3. శ్రీ నాయుని కృష్ణమూర్తి గారి అభినందన సంచిక. చిత్తూరు జిల్లా రచయితల సమాఖ్య. 2017.

⌘⌘⌘

BHAVAVEENA
Vol. 17, Issue. 8, August 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

అతడు అడవిని జయించాడు – ఏరుకల జీవిత అధ్యయనం

– చౌట బాలకృష్ణ , తెలుగు అధ్యాపకుడు, వియస్ఆర్ & యన్విఆర్ కళాశాల, తెనాలి.

క్రీ.శ. పంతొమ్మిదో శతాబ్ది ఉత్తరార్ధంలో ఆంగ్లసాహిత్య ప్రభావంతో తెలుగు సాహిత్యంలో అనేక ప్రక్రియలు వెలువడినవి. ఆంగ్ల ప్రభావంతో పుట్టిన ప్రక్రియలలో తలమానికమైనది నవలా ప్రక్రియ. ఆధునిక సాహిత్యంలో ఎక్కువ పాఠకాదరణ పొందిన ప్రక్రియ ఇది. ఈ ప్రక్రియ మొట్ట మొదటి సారిగా ఇటలీ దేశంలో ప్రారంభమైంది. ''సాంఘీక జీవితానికి ప్రతిబింబంగా వ్యక్తుల జీవిత గమనాన్ని చిత్రిస్తూ జనుల ఆచార వ్యవహారాలను వ్యక్తీకరించే గద్య ప్రబంధం నవల'' (తెలుగు నవలా వికాసం, మొదలి నాగభూషణశర్మ).

తెలుగు సాహిత్యంలో నరహరి గోపాలకృష్ణశెట్టి రచించిన 'రంగరాజచరిత్రము' మొదటి నవలగా పరిగణించ బడుతుంది. అలాగే కందుకూరి వారి 'రాజశేఖర చరిత్ర', ఉన్నవ లక్ష్మినారాయణ రచించిన 'మాలపల్లి' మొదలైన నవలలు సాంఘీక, సంస్కరణోద్యమం ఇతి వృత్తాలుగా వెలువడినవి. మధ్య తరగతి బ్రాహ్మణ జీవితాల్ని ఇతి వృత్తంగా స్వీకరించి శ్రీపాద సుబ్రమణ్యశాస్రి గారు సంప్రదాయబద్ధమైన జీవితాలు నేడు మారుతున్న సమాజంలో ఎలాంటి కష్టాలు ఏదుర్కోవాలో వివరించారు. స్త్రీ సమస్యలను పరిష్కరించాలంటు, స్త్రీ హృదయాన్ని ఆవిష్కరించాలంటు స్త్రీ స్వేచ్ఛను సమర్థించే ఇతి వృత్తంతో చలంగారు నవలలు రచించారు. హిందూ మత తత్వాన్ని వివరించే ఇతి వృత్తంతో విశ్వనాథ సత్యనారాయణ కూడా నవలలు రాశారు. 1940 తరువాత ఇతి వృత్తంలోనూ, శైలిలోనూ విప్లవాత్మకమైన మార్పులు వచ్చాయి. ఈ పరిణామానికి బుచ్చిబాబు, గోపిచంద్ లే కారణం.

స్వాతంత్ర్యానంతరం తెలంగాణ సాయుధ పోరాటం ప్రభావంతో నవలలు వెలువడ్డాయి. ప్రజలతో సహ జీవనం చేసి, వారి విముక్తి కోసం పోరాటం చేసిన వీరుల జీవితం ఇతి వృత్తంగా నవలలు వెలువడ్డాయి. ఇందులో ముఖ్యమైనవి వట్టికోట ఆళ్వారుస్వామి రచించిన 'ప్రజల మనిషి', 'గంగు' లక్ష్మీకాంత రాసిన 'సింహ గర్జన' అలాగే తెలంగాణాలోని వ్యూడల్ భావాలను ఇతివృత్తంగా తీసుకొని దాశరధి రంగాచార్య రచించిన 'చిల్లరదేవుళ్ళు' ముఖ్యమైనవి. స్వాతంత్ర్యానంతరం మొదటి దశాబ్ద నవలల ఇతివృత్తాలలో సామాజిక మార్పు అవసరమని నొక్కిచెప్తూ వివిధ వర్గ పరమైన సమస్యల్ని వారి మనస్తత్వాల్ని విశ్లేషిస్తూ, గ్రామీన రాజకీయ కక్షలకు అద్దం పడుతూ నవలలు వచ్చాయి. వీటిలో కోడవటిగంటి కుటుంబరావు గారి 'చదువు, ఐశ్వర్యమ్, ఎండమావులు' ముఖ్యమైనవి. రావిశాస్రి గారు తన నవలల్లో సామాజిక స్థితిగతుల్ని ఇతివృత్తంగా తీసుకొని వివిధ మనస్తత్వాలను ఆవిష్కరించారు.

తెలుగు నవలా సాహిత్యంలో అటు స్వాతంత్ర్యానికి పూర్వం కాని, ఇటు స్వాతంత్ర్యానంతరం కాని వచ్చిన నవలల్లో సాంఘీక, సంస్కరణోద్యమం, జాతియోద్యమం, మధ్య తరగతి బ్రాహ్మణ జీవితం, స్రీ సమస్యలు, హిందూ మత తత్వం, మనోవైజ్ఞానికత, తెలంగాణ సాయుధ పోరాటం మొదలైన వాటిని ఇతివృత్తాలుగా రాయడం జరిగింది. కాని సామాన్యుల్లో అతి సామాన్యులైన గిరిజనుల గురించి వచ్చిన నవలలు చాలా అరుదు.డా,, కేశవరెడ్డి గారు గిరిజన తెగలలో ఒకటైన ఏరుకల జీవితాన్ని ఇతివృత్తంగా తీసుకొని ''అతడు అడవిని జయించాడు'' అనే నవలను రాశారు . ఈ నవల తమిళం, హింది, ఇంగ్లీష్, మరాఠి, ఓడియా భాషలలోకి అనువదించ బడింది.

1946 మార్చి, 10 వ తేదిన చిత్తూరు జిల్లా తలపులపల్లి గ్రామంలో జన్మించిన డా॥ కేశవరెడ్డిగారు తన రచనల్లో

జీవన వాస్తవ దృశ్యాల్ని సజీవంగా చిత్రించి ఎనలేని కీర్తి ప్రతిష్టల్ని పొందారు. వీరి నవలలు మూగవాని పిల్లనగ్రోవి (1996), చివరి గుడిసె (1996), క్షుద్ర దేవత (1976), స్మశానం దున్నేరు (1976), అతడు అడవిని జయించాడు (1980), సిటీ బ్యూటిఫుల్ (1982), రాముడుండాడు రాజ్యముండాది (1982), మునెమ్మ (2008) మొదలైనవి. తెలుగు సాహిత్యంలో ప్రత్యేకమైన స్థానాన్ని ఆక్రమించాయి. భారతీయ కావ్యశాస్త్రం (Indian Poetics)లో కింది వర్గం లేదా కులానికి చెందినా వ్యక్తిని కావ్య నాయకుడిగా చేసిన లక్షణాలు కనపడవు. ఈయన రచనలు భారతీయ కావ్య శాస్త్ర పరిధుల్ని దాటి ఆధునిక సాహిత్య లక్షణాల్ని సంతరించుకున్నవి. అయినప్పటికీ కథానాయకుడిగా భారతీయ సమాజంలో అత్యంత దిగువ స్థాయిలో ఉన్న వ్యక్తిని ఎన్నుకోవడంలోనే రచయితకు ఉన్న సామాజిక చైతన్యం తెలుస్తుంది.

నవలా సారాంశం :

అతడు అడవిని జయించాడు నవలలో మానవ పాత్రలు ముసలివాడు, పిల్లవాడు(గోపాలు), మానవేతర పాత్ర సుక్కపంది మరియు ప్రకృతి. ఇందులో ముసలి వాడు గిరిజన తెగలలో ఒకటైన ఏరుకల తెగకు చెందిన వాడు. ఈ ఏరుకల తెగవారు పందులను మేపుకుంటు జీవనం సాగిస్తుంటారు. ఒక రోజు ముసలివాడు ఆరోగ్యం బాగాలేక తన మనవడిని పందులను మేపడానికి అడవికి పంపిస్తాడు అందులో ఒక పంది నేడో, రేపో ఈనేలా ఉంది దానిపేరే సుక్కపంది. పిల్లవాడు అనుభవం లేక పోవడం చేత దారులు సరిగా తెలియక పందులను మేపు కొని ఇంటికి బయలుదేరే సమయానికి బాగా చీకటి పడుతుంది. పొద్దు గూటిలో పడింది పందులు, పిల్లవాడు ఇంకా ఇంటికి రాలేదు అని వాటికోసం ఎదురు వెళతాడు అలా కొంత దూరం పోయెసరికి పందులు కనిపిస్తాయి. అన్నింటిని సూక్ష్మ దృష్టితో పరిశీలిస్తాడు అందులో 'సుక్కపంది' కనిపించదు.

ముసలివాడు ఆవేదనతో వేంటనే సుక్కపందిని వెతకడానికి అడవికి బయలుదేరుతాడు. వెన్నెల వెలుతురులో తికమక పెట్టేదారుల మధ్య తన సుక్కపంది జాడను వెతుకుతూ తాను రోజు పందులను మేపే ప్రదేశాలు, నీళ్ళు తాపే చెరువు, కుంటల దగ్గర వెతుకుతాడు. అలా వెతుకుతూ వెతుకుతూ పంది అడుగు జాడల్ని గుర్తించి వాటిని వెంబడిస్తూ వెళతాడు అలా వెళుతూ ఉండగా ఒక చోట గువ్వ ఒకటి అరుస్తూ ఉంటుంది.దానిని గమనించిన ముసలివాడు అక్కడ తప్పకుండా సుక్కపంది ఉంటుందని అక్కడికి వెళతాడు తీంట్రపాద దగ్గర సుక్కపంది పన్నెండు సలుగుల్ని ఈని పడుకొని ఉంటుంది. కాసేపటికి గాలి దిశ మార్చివీస్తుంది అటుగా ఉన్న నక్కలు పురిటి వాసన తెలుసుకొని వాసన జాడ ద్వారా తీంట్రపాద దగ్గరకు వచ్చి పంది సలుగుల్ని తీసుకు పోవాడానికి ప్రయత్నిస్తాయి సుక్కపంది వాటితో భీకర పోరాటం చేస్తుంది కాని రెండు సలుగుల్ని పోగొట్టుకుంటుంది. ముసలివాడు ఈ వాతావరణాన్ని అంతా చూస్తున్నా ఏమి చేయలేని పరిస్థితి తెల్లవారగానే ముసలి వాడు సుక్కపందిని దాని సలుగుల్ని తోలుకొని ఇంటికి వెళతాడు. ఇది నవలా సారాంశం.

ఏరుకల జీవిత అధ్యయనం :

అదిమ సమాజం నుండి నేటి ఆధునిక సమాజం వరకు ప్రకృతితో మానవునికి విడదీయరాని సంబంధం ఉంది. కేశవరెడ్డి ఈ నవలలో ఒక గిరిజనున్ని కేంద్రంగా చేసి మనిషి తన అస్థిత్వం కోసం చేసిన పోరాటాన్ని, అతను సాగించే జీవితాన్వేషణ లక్ష్యాన్ని అందించే ప్రయత్నం చేశాడు. గిరిజనులలోని ఏరుకల తెగకు చెందినవాడు కథానాయకుడు (ముసలివాడు). భారతదేశంలో ఏరుకల వారు ఐదు రాష్ట్రాల్లో, ఒక కేంద్రపాలిత ప్రాంతంలోఉన్నారు. వీరు ఆంధ్రప్రదేశ్‌లో ఏరుకల పేరుతో, తమిళనాడులో కొరద లేదా కొరచ పేరుతో, కర్నాటకలో కొరమరాలు పేరుతో, మహారాష్ట్రలో కైకాడీలు పేరుతో, మధ్యప్రదేశ్ లో కుర్రు పేరుతో, పాండిచ్చేరిలో నిద్దనా

రులు అనే పేరుతో పిలువబడుతున్నారు. ఏరుకల వారి జీవన విధానంలో పందులు మేపుకొని జీవించడం ఒకటి. దీనితో పాటు కొంత మంది తట్టలు,బుట్టలు అల్లూతూ, మరికొందరు చీపుర్లు కడుతూ, కొంత మంది చాటలు పూస్తూ, కొంత మంది సోది(భవిష్యత్) చెప్తూ జీవనం సాగిస్తుంటారు.

'అతడు అడవిని జయించాడు' నవలలో కథ చాలా చిన్నది. కథా సమయాన్ని రచయిత ఒకానొక సూర్యాస్తమయన మొదలుపెట్టి సూర్యోదయానికల్లా నవల ముగిస్తాడు. ఇందులో ప్రదాన మానవ పాత్ర ముసలివాడు ప్రదాన మానవేతర పాత్ర సుక్కపంది. ఈ రచనలో కథంతా సుక్కపందికి, ముసలివాడికి సంబంధించిందే సుక్కపంది లేకపోయినా, ముసలివాడు లేకపోయినా ఈ రచన ఉండేదికాదు. ''నవనవోన్మేషశాలినీ ప్రతిభామతా'' అని భట్టతౌతుడు నిర్వచించాడు. అంటే ప్రతిభ కలిగిన రచయిత తన ప్రజ్ఞ ద్వారా నూతనమైన ఆలోచనా సృష్టి చేయాలి. ఈ నిర్వచనం ఈ నవలకు బాగా సరిపోతుంది. ప్రజల్ని ఆలోచింపజేసూ పాఠకాదరణ పొందాలంటే ఎప్పటికప్పుడు మారుతున్న సామాజిక, రాజకీయ, సాంస్కృతిక అంశాలను ఆధారంగా చేసుకొని రచన జరగాలి.

అరణ్యమే గిరిజనుల లీలాకేతనం జంతువులూ, చెట్లూ వీరి ఆప్త మిత్రులు ప్రమాదాలు వీరి ప్రమోదాలు అడవి గురించి వీరికి తెలిసినంతగా మరెవరికి తెలియదనడంలో అతిశయోక్తి లేదు. వీరికి విద్యాగంధం లేనప్పటికి ప్రకృతి విజ్ఞానం, ప్రకృతి పరిశీలన ఉంది. అడవిలో నుండి ఉద్భవించే ధ్వనులు అవిరామంగ వినిపిస్తున్నా, కంటికి కనిపించకపోయినప్పటికి ఆ ధ్వనులు చేస్తున్న ప్రాణులను వీరు ఎరుగుదురు. నవలలో ముష్టి చెట్లు, బలసతుప్పలు, కాసెరాకు, బొంతజెముడు, కిచ్చిలిచెట్లు, తీంట్రపొదలు మొదలైనవి గిరిజనుల నిత్య జీవితంలో ఉండేవే. ''ఈ మహా ప్రపంచం అంతా ఓ అడవి. ఇందులో మనిషి అంతరాంతరాల్లో ఒంటరివాడు. ఆహారం, నిద్ర, భయం ఇత్యాదులు సర్వ ప్రాణి కోటికి సమానంగా కావలసినవే. కాని వాటిని పొందటానికి మనిషి పడే అవస్థ ఒక్కొక్కరికి ఒక్కలాగ ఉంటుంది. జయాపజయాలు, కామ, క్రోధాలు, లోభమోహాలు, మదమాత్సర్యాదులు, సుఖదు:ఖాలు అన్నీ మనిషి అనుభవించాల్సిందే. జీవన సంఘర్షణని, జీవన అవసరాన్ని చెబుతూ, జీవన తత్వాన్ని ఒక భాష్యకారుడిలా, వేదాంతిలా, నిర్మోహమాటంగా, నిశ్చలంగా చేప్పడమే ఈ అతడు అడవిని జయించాడు'' (ముందుమాట, మొదటి ముద్రణ:1985, పురాణం సుబ్రమణ్యశర్మ)

నవలను బాగా పరిశీలిస్తే అందులో అస్థిత్వ పోరాటం కనిపిస్తుంది. అడవిలో ముసలివాడు తన సుక్కపందిని వెతికే క్రమంలో ఆకలి కోసం ఒక కుందేలును చంపి దాన్ని ఆహారంగా మార్చుకున్నాడు. ఇది మానవ మనుగడ కోసం పోరాడే క్రమంలో భాగమే. పురిటి వాసన చూసిన నక్కలు వాసన జాడ ద్వారా తీంట్రపొదను చేరి పందితో పోరాడేది ఆహారం కోసమే ఇది కూడా అస్థిత్వంలో భాగమే. పంది సలుగుల్ని గద్దలు ముక్కుతో పొడుస్తాయి. అవి చనిపోతే వాటికి ఆహారంగా మరుతాయి కనుక ఇది కూడా అస్థిత్వ పోరాటమే. ఆహారాన్వేషణతోనే మానవ మనుగడ మొదలైంది తాను బతకాలంటే ఏదొ ఒకటి తినక తప్పదు.

ఉపయుక్త గ్రంథసూచి :

1. కేశవరెడ్డి, పి. అతడు అడవిని జయించాడు, రీతిక పబ్లికేషన్స్, హైదరాబాదు:1985.
2. వెంకటసుబ్బయ్య, వల్లంపాటి. నవలా శిల్పం, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాదు:1994.
3. హాస్ నైన్, నదీం. భారతీయ గిరిజనులు, ఓరియంటల్ లాజ్మన్, హైదరాబాదు:2000.

⌘

BHAVAVEENA
Vol. 17, Issue. 8, August 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

గిరిజన సాహిత్యంలో సుగాలీల మౌఖిక సాహిత్యంలో కథా సాహిత్యం

– డా॥. భూక్యా జ్యోతి, సహాయ ఆచార్యులు, యస్.ఎల్.యస్. డిగ్రీ కళాశాల, పుల్లారెడ్డి పేట, కడప జిల్లా.

ఆదిమ మానవుడు స్థిరపడిన తర్వాత తనకంటూ ఒక సంస్కృతి ఏర్పరుచుకొన్నాడు. అలా వారు గుంపులు, గుంపులుగా, వర్గాలు, ప్రాంతాలుగా, భౌగోళికస్థితిని బట్టి అనేక సమూహాలుగా ఏర్పడ్డారు. అలా ఏర్పడ్డ సమూహాలు వివిధ రకాలైన ధ్వనులతో భాషను స్వయంగా ఏర్పరుచు కొన్నారు. అలాంటి భాష కేవలం భావ వినిమయానికి మాత్రమేకాక అన్ని రకాలైన శ్రమలందు అది పాటగానో, గేయంగానో, కథగానో, పాడుపు కథగానో, జానపదకథగానో రూపుదాల్చుకుంది.

భాష ఏర్పడినట్లుగానే దానికి తగిన లిపి కూడా ఏర్పడ్డాయి. అలాంటి భాషల సాహిత్య మౌఖికం నుండీ గ్రంథస్థరూపం దాల్చాయి. కాని కొన్ని భాషలు కేవలం భాషగానే మిగిలాయి తప్పా లిపిని సంతరించుకోలేదు. అలాంటి సాహిత్యం నేటికి కేవలం మౌఖిక సాహిత్యం ద్వారానే తన మనుగడను సాగిస్తుంది. అలాంటి భాషల్లో సుగాలీ భాష ఒకటి. దేశంలో సుగాలీల జనాభా అధికంగా వున్నా లిపిని వాడలేదనది నేటి నగ్న సత్యం. సుగాలీల సాహిత్యమంతా గేయం, పాట, పద్యం, కథ అన్ని రకాలైన సాహిత్యం మౌఖికంగానే ఒక తరం నుండి ఇంకోతరానికి వ్యాపిస్తూవుంది.

ఈ వ్యాసములో బంజారాలు చెప్పుకొనే కథలను గురించి విశ్లేషించడం జరుగుతుంది. సుగాలీ కథ ప్రధాన మైన సంస్కృతి అంటే వారి జీవితములో అన్ని కథలే అడుగు అడుగికి సుగాలీ పాత కథలను చెప్పుకొంటారు. నెమరు వేసుకొంటారు. ఇది ఏమిటి అని అడిగితే ఏదో ఒక కథ చెప్పుతారు. తాండాలో న్యాయం చెప్పాలన్నా కథ చెప్పుతారు. (సాక్షి) ఇన్ని గోత్రలు ఎలా పుట్టాయన్నా కథ చెప్పుతారు. సుగాలీ చరిత్రను నిరూపించే శాసన ఆధారాలు ప్రామాణిక గ్రంథాలు ఏవీ లేవు. ఇప్పటికీ సుగాలీ చరిత్ర వారు చెప్పుకునే కథలే కొద్దిపాటి ఆధారాలు. సుగాలీలు ఆర్యజాతి వారు. సంచార జాతులు కొంత కాలం స్థిర జీవనులుగా ఉండి మధ్యయుగంలో సంచార జీవనులై మళ్ళీ ఆధునిక యుగంలో స్థిర జీవితానికి అలవాటు పడినారు. అందువల్ల వీరి కథలను గమనిస్తే చారిత్రక కథలు అధికంగా కనిపిస్తున్నాయి. ఉత్తరభారతంలో ఉండి కొన్ని వందల సంవత్సరాలపై దక్షిణానికి వలస వచ్చి ఇక్కడి వారిలో కలిసిపోయి ఇక్కడ భాషలు నేర్చుకొని శ్రామికులుగా బ్రతుకుతున వీరులో మిగిలినవి చారిత్రక కథలు మాత్రమే. ఈ కథలనే వారు తరతరాలుగా చెప్పుకొని వస్తున్నారు. దక్షిణ దేశంలోని ద్రావిడులతో ఎంతోకాలంగా కలిసి ఉంటున్నా ఈ కథల్లోని సంస్కృతి విలోనమైన ఆర్య సంస్కృతిగానే ఉండటము గమనించవచ్చు. సుగాలీ తెగవారు ఉన్నారు. వారు చెప్పుకునే కథలు కూడా ఉన్నాయి. ముఖ్యంగా పృథీరాజ్ చౌహన్ కథ అలా వ్యాప్తిలోనికి వచ్చినది.

సుగాలీల కథలు :

సుగాలీల కథ పూర్తిగా మౌఖికమైనవి. సుగాలీల కథలను వారి భాషలో 'సాకి' అని అంటారు. భాషాపరంగా వారి కథలను ఇప్పటికీ ఎవరూ శాస్త్రీయంగా పరిశీలించి వర్గీకరించలేదు. వారి కథలు ఒకరి నుండి మరొకరికి మౌఖికంగానే ప్రచారం జరుగుతున్నాయి. 'గోర్‌బోలి' గిరిజన భాష కావడంవల్ల, వారు గిరిజనపదులు కావడంవల్ల, వారి కథలు జానపద కథలను పోలి ఉండటంను వలన వారి కథలను గిరిజనపదకథలుగా పేర్కొనడం సముచితంగా ఉంటుంది. సుగాలీల కథలను స్థూలంగా గద్యకథలు (వాలేర్ సాకి) గేయకథలు (గీదేర్‌సాకి)గా పేర్కొనవచ్చు. సుగాలీల భాషకు లిపి, సాహిత్యం అభివృద్ధి చెందని కారణంగా సాహిత్య కథలు

లేవనే చెప్పాలి. సుగాలీల గద్య కథలను సామాన్యులు ఒకరినొకరు చెప్పుకోవడం జరుగుతుంది. సుగాలీలలో పండితుల కంటే పామరులే ఎక్కువ. తెలుగు వారికి తెలిసిన పురాణాలు సుగాలీలకు అంతగా తెలియవు. కొద్దిపాటి ధర్మజ్ఞానం కలిగిన సుగాలీల తాత్త్విక గురువులు 'భగత్'లు సుగాలీల జాతి పురాణం కొంతమందికి మాత్రమే తెలుస్తుంది. సుగాలీల గోత్రనామాలు కూడా ఎక్కువగా వారికి తెలుస్తాయి. వారి జాతికి సంబంధించి నంత వరకూ వారికి కొన్ని కథలు తెలుసు. సుగాలీలు ఎవరు? వారు ఎక్కడి నుండి వచ్చారు? అనే విషయాలు గురించి మాత్రం కొన్ని కథలు ఉన్నాయి. సుగాలీల జాతిలో పుట్టిన మహాపురుషుల గురించి వీరు కథలుగా చెప్తారు. పిల్లలకు చెప్పేనీతి కథలు కూడా సుగాలీల భాషలో ప్రచారంలో ఉన్నాయి.

సుగాలీల పుట్టుకకు సంబంధించిన కథలు, కథనాలు ప్రచారంలో ఉన్నాయి. సమాజంలోని ప్రతి జాతికి, తెగకు కులానికి పురాగాథలున్నట్లే సుగాలీలకు కూడా వారి తెగకు సంబంధించిన కథలు ప్రచారంలో ఉన్నాయి. సుగాలీల జాతి పుట్టుకకు సంబంధించిన కథ ఒకటి ఇలా ప్రచారంలో ఉంది.

సుగాలీల పురాణ కథనం :

సుగాలీల వయోవృద్ధులు, భాట్ మరియు ఢాడిలు చెప్పే ఇతివృత్తాలను బట్టి వారి తెగ యొక్క పురాణ కథనం ఒకటి ఈ విధంగా ప్రచారంలో ఉంది. "విష్ణు మూర్తి భృగు, రఘు అనే ఇద్దరు మహాఋషులను సృష్టించాడు. వీరిరువురు ధజ్ మహారాజు, లంబాబాయి లను సృష్టించారు. వీరిద్దరికీ 'కువల్ ధజ్' అనే వ్యక్తి జన్మించాడు. కువర్‌ధజ్‌కు రాజ్‌ఫల్, రాజ్‌ఫల్‌కు 'రీం' రీంహొబల్, కాబల్ అనే పుత్రులు జన్మించారు. వీరిలో హొబల్‌కు పుట్టిన సంతానమంతా హిందువులు, కాబల్‌కు పుట్టిన సంతానమంతా ముస్లిములు. హిందువైన హొబల్‌కు వగాదు, వగాదుకుకాసం, కాసంకు కర్ణ్ జన్మించారు. కర్ణ్‌కు తీడ, చాడ అనే ఇద్దరు కొడుకులు పుట్టారు. తీడాకు జన్మించిన వారంతా రాజపుత్రులు, చాడాకు పుట్టినవారంతా శూద్రులు. తీడకు ఆరుగురు కుమారులు జన్మించారు. వారు జోగడ్, భీమడ్, మోటా, మోలా, నాతడ్ రామడ్‌లు, జోగడ్‌కు కలిగిన సంతానం జొర్గీలు, భీమడ్‌కు కలిగిన సంతతివారు వాఘ్రీలు, మోటా సంతతి వారు లభానీలు, మోలా సంతతివారు గోర్‌లు, నాతడ్ సంతతివారు భేట్ కమ్రాలు, రామడ్ సంతతివారు మార్వాడీలు, మోలా, మోటాలు శ్రీకృష్ణుని గోవులకు కాపరులుగా ఉండేవారు. తీడా సంతానంలో ఒకడైన మోలా, రాధను పెండ్లాడాడు. వారికి చాలా కాలంగా సంతానం కలగక పోవడంతో ముగ్గురు రాజపుత్ర రాజుల నుండి ముగ్గురు పిల్లలను దత్తత తీసుకున్నారు. వారే పమార్, రాథోడ్ మరియు చౌహాన్‌లు. ఈ ముగ్గురి వివాహం కాకరేచి, మోదరేచి, నాగరేచి అనే అనాథ బ్రాహ్మణ అమ్మాయిలతో జరిగింది. పమార్ కాకరేచిలకు కలిగిన సంతానమే నేటికీ పన్నెండు గోత్రాలుగా విల సిల్లుతున్న బరగొతో పమార్‌లనీ, రాథోడ్ మొదరేచిలకు కలిగిన సంతానమే నేడు ఇరువై ఏడు గోత్రాలు, నలభై ఉపగోత్రాలుగా విలసిల్లుతున్న రాథోడ్‌లనీ, చౌహాన్ నాగరేచిలకు కలిగిన సంతానమే నేడు ఆరు గోత్రాలతో విలసిల్లుతున్న ఛొగోత్ చౌహాన్‌లు" ఇదీ పురాణ కథనం.

సుగాలీల కథలను, సుగాలీల తెగలోని ఢాడి, భాట్ లైన గాయకవృత్తులవారు గానం చేస్తూ తండావాసులకు గేయకథా రూపంలో వినిపిస్తారు. వారు చెప్పే కథలను బట్టి సుగాలీలలో వివిధ గోత్రాలు, ఉపగోత్రాలు (పాడా)లున్నాయని, గోత్రనామాల ఆధారంగానే వారిని గుర్తించవచ్చని చెప్పవచ్చు. గోత్రాలు వివాహ సందర్భా లలో ప్రాధాన్యత వహిస్తాయి. గోత్రాల ఆధారంగానే వివాహాలు జరుగుతాయి. గోత్రాలు కలువకుంటే వివాహం చేసుకోరు.

సుగాలీల చరిత్రకు సంబంధించిన మరో కథ ప్రచారంలో ఇలా కలదు. "పూర్వం ఒక ఆశ్రమంలో పుణ్య దంపతులకు ముగ్గురు కుమారులు కలిగారు. ఆ

ముగ్గురూ పెరిగి పెద్దవారై వివాహం చేసుకొని వేరు కాపురాలు పెట్టడానికి సిద్ధపడ్డారు. తండ్రి ఆ కొడుకులకు తన ఆస్తిని పంచి ఇచ్చాడు. పెద్దవానికి ఒక చెంబును పంచి ఇచ్చాడు. పెద్దవాడు తన వంతుకు వచ్చిన బెల్లాన్ని అమ్ముకొని తద్వారా వచ్చిన ధనంతో వ్యవసాయం చేసుకుంటూ అడవిలోనే తన జీవనాన్ని కొనసాగించాడు. రెండోవాడు తన వంతుకు వచ్చిన ఆవుల మందను రక్షించుకుంటూ, తద్వారా గోసంతతిని వృద్ధి చేసుకుంటూ సంచార జీవనాన్ని సాగిస్తూ వచ్చాడు. మూడోవాడు తనవంతుకు వచ్చిన చెంబును మారకం చేసి తద్వారా వచ్చిన సొమ్ముతో గ్రామంలో వ్యాపారం చేసుకుంటూ స్థిరపడ్డాడు. అడవిలో స్థిరపడ్డ పెద్దవాని సంచారియైన రెండోవాని వారసులు బంజారాలు, గ్రామాల్లో స్థిరపడి వ్యాపారంలో రాణించిన వారి వారసులు మార్వాడీలు" ఇది మరో పురాతన కథ. (చీనియానాయక్.బి, పుట.19, 1998)

ఇదే కాకుండా వీరి పుట్టుకకు సంబంధించి మరో కథ ప్రచారంలో కలదు. పూర్వం సుగాలీల పూర్వీకునికి ఇద్దరు భార్యలుండేవారు. మొదటి భార్యను అగ్నిసాక్షిగా పెళ్ళాడగా రెండో భార్యను గాంధర్వ వివాహం చేసు కున్నాడు. మొదటి భార్యకు కలిగిన సంతానానికి పశు సంపదను ఆస్తిగా ఇచ్చి వాటిని రక్షించుకుంటూ పశు వులను అభివృద్ధి చేసుకుంటూ జీవనం సాగించమని ఆదేశించాడు. రెండో భార్య సంతానాన్ని వ్యాపారం చేసు కొని జీవించమని ఆదేశించాడు. పశుసంపదను ఆస్తిగా కలిగిన వారు వాటిని కాపాడుకుంటూ అడవుల్లో తిరు గుతూ సంచారజీవనానికి అలవాటు పడి అడవుల్లోనే ఉండిపోయారు. వారే సుగాలీలు. వ్యాపారంలో స్థిరపడ్డ వారే మార్వాడీలు.

ఈ పై రెండు కథల వల్ల సుగాలీలకు, మార్వాడీలకు అవినాభావ సంబంధం ఉందని చెప్పవచ్చు. వీరిద్దరి పూర్వీకులు ఒకరేననీ, కాలంలో వచ్చిన మార్పులు, జీవనంలో వచ్చిన మార్పులు కారణంగా సుగాలీలు సంచార జాతులుగా మిగిలిపోయారని తెలుస్తుంది. సుగాలీల పుట్టుకకు సంబంధించిన కథలు, ఎన్నో ప్రచారంలో ఉన్నాయి. ప్రతి జాతికి, తెగకు, కులానికి పురాగాథలున్నట్లే సుగాలీలకు కూడా వారి తెగలకు సంబం ధించిన కథలు ప్రచారంలో ఉన్నాయి. సుగాలీల పురాణ కథలను పరిశీలిస్తే సుగాలీలు ఒక సంచారజాతిగా పరిగణింపబడుతున్నప్పటికీ వారిలో గోత్రనామాల సంప్రదాయం కూడా ఉన్నట్లు, సుగాలీలలో వివిధ గోత్రాలు ఎలా ఏర్పడ్డాయో కూడా తెలుస్తుంది. సగోత్రీకు లను వివాహమాడకపోవడం వీరిలో కనిపించే మరో ప్రత్యేక గుణం.

హతీరాం బావాజీ కథ :

సుగాలీలు తమ జాతిలో పుట్టిన హతీరాం బావాజీని గొప్ప యోగిగానూ, తత్త్వవేత్తగానూ భావించి ఆయన చరిత్రను గొప్పదనాన్ని కథలుగా చెప్తారు. హతీరాం బావాజీకి సంబంధించి అనేకమైన కథలు మౌఖికంగానే సుగాలీలలో ప్రచారంలో ఉన్నాయి. సుగాలీల వయో వృద్ధులు ద్వారా తెలుసుకున్న కథా వృత్తాంతం మరియు బాణాత్ కృష్ణానాయక్ రచించిన శ్రీశ్రీశ్రీ హతీరాం బావాజీ జీవిత చరిత్ర గ్రంథం ఆధారంగా హతీరాం బావాజీకి సంబంధించిన కథను కొంతవరకు అర్థం చేసుకోవచ్చు. హతీరాం బావాజీకి సంబంధించిన కథ - పూర్వం రాజ స్థాన్‌లో ఒక రాజ్యాన్ని పమార్‌గోత్రీకులైన రాజా రాధోభేణ్ పరిపాలిస్తున్నాడు. అతని భార్య రాణి కుమావతి. రాణి కుమావతి పతివ్రతా శిరోమణి, సకల ప్రాణులను ప్రేమించే గుణవతి. రాణి కుమావతికి రాజ్, దశరథ్, పూలణ్, వంజణ్ అనే నలుగురు తమ్ముళ్ళు. వారు రాజా రాధోభేణ్‌ను మోసంతో చంపివేశారు. అప్పటికీ రాణి కుమావతి మూడు నెలల గర్భవతి. కొంతకాలానికి ఒక బిడ్డకు జన్మనిచ్చింది. అతని పేరు హతియా. అతడే హతీరాం బావాజీ. హతీయా పుట్టిన రోజే ఏడువందల ఏభైమంది బాలలు జన్మించారు. హతీయా గురుగర్దార్ వద్ద సకల విద్యలను నేర్చుకొని పన్నెండు సంవత్సరాల

వయస్సు వచ్చే సరికి తన తండ్రిని చంపిన వారిని హతమార్చాలనే లక్ష్యంతో తన వయస్సు వాళ్ళతో జతకట్టి 'బాలక్ దళ్' ను స్థాపించాడు. తన గురువు బహుమానంగా ఇచ్చిన దడి (బండి) తన తండ్రి గురువైన దరియాయి జింతా మరియు బాలక్‌దళ్‌ల సహాయంతో తన మేనమామలను హతమారుస్తాడు. జీవహింస మహా పాపమని భావించే తన తల్లికి తెలియకుండానే పగతీర్చు కున్నందున క్షమించమని వేడుకుంటాడు.

హతియా మాతకుమావతి ఆజ్ఞమేరకు పాప పరి హారంగా గురుగర్దార్ సేవలో, దైవచింతనలో దేశమంతటా సంచరించాడు. తన యాత్రలో భాగంగా తిరుమలకు చేరుకొని, బాలాజీ దర్శనం కోసం పద్నాలుగు సంవత్సరాల ఘోర తపస్సు చేశాడు. బాలాజీ ప్రత్యక్షమై తనతో కొండపైకి తీసుకెళ్ళాడు. బాలాజీ, బావాజీని మూడు కోర్కెలు కోరమన్నప్పుడు తన శేషజీవితమంతా స్వామి చెంతనే ఉండాలని కోరుకుంటాడు. అందుకు స్వామి మెచ్చి 'నీవు నాకంటే ఎత్తులో ఉంటావు. భక్తులు ముందుగా నిన్ను దర్శించి ఆ తరువాత నన్ను దర్శించు కుంటారు' అని వరమిస్తాడు. జీవితాంతం బాలాజీ సేవలోనే ఉండే వరాన్ని పొందాడు. చంద్రగిరి మహారాజు హతీయా భక్తిని పరీక్షించదలచి చెరసాలలో పెట్టి బండెడు చెరుకు గడలను తినమని పరీక్ష పెట్టాడు. హతీయ బాలాజీని ప్రార్థించగా ఏనుగు రూపంలో ప్రత్యక్షమై గడలను తినేశాడు. అప్పటి నుండి హతీయా బాలాజీ పరమ భక్తుడుగా గుర్తించబడి హతీరాం బావాజీగా పిలువబడుతున్నాడు. బాలాజీ ఆలయ ప్రధాన అర్చ కునిగా పదవిని పొందిన తన శేష జీవితాన్ని బాలాజీకే అంకితమిచ్చి బాలాజీలోనే లీనమయ్యాడు.

ఈ కథ పరిశీలిస్తే సుగాలీల జాతిలో జన్మించిన ధార్మిక పురుషులలో ఒకరు హతీరాం బావాజీ అని తెలుస్తు న్నది. తన జన్మస్థలమైన రాజస్థాన్ వదిలి ఆంధ్రప్రదేశ్‌లో వెలసిన ఏడు కొండల వేంకటేశ్వర సన్నిధానానికి చేరుకొని భగవాన్ బాలాజీకి అత్యంత సన్నిహిత భక్తుడిగా పేరుగాంచి, తన శేష జీవితాన్ని భగవాన్ శ్రీ బాలాజీ సన్నిధానంలోనే గడిపి ఆయనలోనే లీనమైనట్లు ఈ మౌఖిక కథ ద్వారా తెలుస్తుంది. వేంకటేశ్వరుని ముగ్ధ భక్తుడు హతీరాంబావాజీ తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామిని ప్రసన్నం చేసుకొని తనివితీరా చూచి మాట్లాడాలని తలచి పద్నాలుగా సంవత్సరాలు ఘోర తపస్సు చేసి చివరికి స్వామి కటాక్షం సాధించిన మహాభక్తుడు హతీరాం బావాజీ.

ముగింపు :

వివిధ జాతులు కులాలు ఉన్న మన సమాజంలో ఏ సమూహానికి ఆ సమూహం తమకంటూ ఒక ప్రత్యేక సంస్కృతీకరణ, పట్టణీకరణ మరియు ప్రపంచీకరణ క్రమంలో ఆయా గ్రామీణ సమూహాల, గిరిజన సంస్కృ తులు కనుమరుగైపోతున్నాయి. వీరి వేషభాషాల్లోను, జీవన విధానంల్లోను అనేక మార్పులు వచ్చేశాయి. కావున ఈ సందర్భంగా వివిధ ప్రజా సమూహాల, సంస్కృతిని తిరిగి సంరక్షించుకోవాలి.

ఆధారగ్రంథాలు :

1. చీనియా నాయక్ -1998 బంజారా చరిత్ర.
2. గోనా నాయక్ - 2002 సుగాలీ సంస్కృతి భాషాసాహిత్యాలు.

⌘⌘⌘

BHAVAVEENA
Vol. 17, Issue. 8, August 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

రాయలసీమ రాగాల సొరభాలు

– డా॥. జి. స్వర్ణలత, ప్రభుత్వ మహిళా కళాశాల, గుంటూరు.

జనపదం అంటే పల్లెటూరు. జనపదాలలో నివసించే వారు జానపదులు. అక్షర జ్ఞానం లేని గ్రామీణులు అలవోకగా సృష్టించుకున్న మాటలు, పాటలు, పలుకులే జానపద సాహిత్యం. ఒక తరం నుండి మరో తరానికి మౌఖికంగా సంక్రమించే కథలు, గాథలు, గేయాలు మొదలైన వాఙ్మయాన్నంతా జానపద సాహిత్యమని చెప్పుకోవచ్చు. విస్తృతమైన జానపద విజ్ఞానంలో జానపద సాహిత్యం ఒక ప్రధానమైన భాగం. అందులోనూ జానపదగేయాలు విశిష్టమైనవి.

బ్రతుకులోని తీయదనాన్ని, విషాదాన్ని చవిచూసిన జానపదుడు రసోద్రేకుడై ఆలపించు మధురమైన భావ నిర్భరగీతాలే జానపదగేయాలు. Poetry is the spontaneous overflow of powerful feelings n" words worth కవిత్వానికిచ్చిన నిర్వచనం సహజ సుందరం, కృత్రిమ రహితం అయిన జానపదగేయాలకీ అన్వయించవచ్చు. Grimn పేర్కొన్న విధంగా జానపద గేయం జానపదుడి హృదయస్పందన కనుక అనాలోచితంగా అపూర్వమైన అనుభూతితో స్వయంభువులా ఉద్భవిస్తుంది. జానపద పరిశోధకులు జానపదగేయాల లక్షణాలను క్రింది విధంగా పేర్కొన్నారు.

అజ్ఞాన కర్తృత్వం :

శిష్ట సాహిత్యానికి ఒక రచయిత ఉన్నట్లు జానపద సాహిత్యానికి ఉండదు. జానపదుడు భావావేశంలో తీసిన కూనిరాగం నలుగురి నోళ్ళలో బడి వ్యాపిస్తుంది. గేయాన్ని కట్టిన వ్యక్తి కనుమరుగై పోతాడు. కనుక జానపదగేయాలు సమష్టి కర్తృత్వాలు అని చెప్పుకోవచ్చు.

అవిదిత కాలనిర్ణయం :

శిష్ట సాహిత్యంలో కవి తన గురించి, తన కాలాన్ని గురించి ప్రస్తావిస్తాడు. జానపదగేయాల మూలం అవిదితం. జానపదగేయాల్లో ప్రధానమైనది నిరర్గళత మరియు భావసౌందర్యమే.

సాంప్రదాయిక మఖిక ప్రసరణం :

జానపద సాహిత్యం మౌఖికంగానే ప్రచారం పొందుతుంది. ఈ మౌఖిక ప్రసరణం జానపదుల జ్ఞాపకశక్తి పైనా, జ్ఞాపకశక్తి వారి వినికిడి మరియు పునరుద్ఘాటన శక్తుల పైనా ప్రధానంగా ఆధారపడి వుంటుంది.

గాన యోగ్యం :

పాడడానికి అనువైనదే గేయం. ఈ లక్షణమే జానపదులు గేయాలను గుర్తుంచుకోడానికి ఉపకరించే అంశం. శిశుర్వేత్తి, పశుర్వేత్తి, వేత్తి గానరసం ఫణి: అనే చక్కని గుణం ఉండడం చేత జానపద గేయాలు జనప్రియత్వం పొందాయి.

విభిన్న పాఠాంతర సమన్వితం :

జానపదగాయకుడు అనేకసార్లు ఒక గేయాన్ని గానం చేసేటప్పుడు ఒక పదాన్నో, వాక్యాన్నో విస్మరించడానికి, మరిచిపోయినదాన్ని తన స్వశక్తితో పూరించడానికి అవకాశం ఉంది. ఒక్కొక్కప్పుడు రెండు గేయాలను కలగాపులగం చేసి పాడడం కూడా జరుగుతుంది. ఇలాంటి సందర్భాలలో గేయం యొక్క మునుపటి స్వరూపం మారిమార్పుల్ని, కూర్పుల్ని సంతరించుకొని విభిన్న పాఠాంతరాలతో ప్రచారమవుతుంటుంది.

ఆశురచనం :

జానపదుల నోటి నుండి వెలువడే భావస్ఫోరకమైన గేయాలన్నీ ఆశురచనలే. విద్యాగంధంలేని జానపదుల కవిత్వం వ్రాత, ముద్రణల సహాయాన్ని ఆశించనిది.

నిరాడంబర శైలి :

దేశీయ పద ప్రయోగాలతో కూడి భాషలోనూ భావం

లోనూ, జీవకళ ఉట్టిపడే జానపదగేయాలు ఆడంబర రహితంగా నిరలంకారయుతంగా ఉంటాయి. ఇవేకాక 8. పునరావృత్తం, 9. భావనిర్భరం, 10. కథా రహితం, 11. సార్వజనీనం, 12. రస ప్రధానం అనే లక్షణాలు కూడా జానపదగేయ లక్షణాలుగా చెప్పుకోవచ్చు.

జానపదగేయాలను వాటిలోని వస్తువును బట్టి పరి శోధకులు రకరకాలుగా విభజించారు. శ్రీ బేకుమళ్ళ కామేశ్వరరావు గారు జానపద గేయాలను తొమ్మిది విభాగాలుగా గుర్తించారు. అవి. 1. జంగం కథలు, 2. పౌరాణిక గేయములు, 3. పూర్వాచీన పదములు, 4. స్త్రీల పాటలు, 5. అర్వాచీన పదములు, 6. వాగ్గేయ ములు, 7. తత్వములు, 8. ఖండ గేయములు, 9. జంగం చరిత్ర కథలు

అలాగే శ్రీ కృష్ణశ్రీ 1. పనిపాటలు, 2. ఆటపాటలు, 3. వీరగాథలు, 4. బ్రతుకు బాటలు, 5. వినోదగేయాలు, 6. ఏల పాటలు, 7. పడవ పాటలు, 8. వేదాంతపు పాటలుగా జానపద గేయాలను సంకలనం చేశారు.

'రాయలసీమ రాగాలు' శ్రీ కె. మునయ్య గారి విశిష్ట రచన. రచయిత రాయలసీమ ప్రాంతంలోని రకరకాల జానపద గేయాలను సేకరించి చక్కని వ్యాఖ్యానంతో సంకలనం చేశారు. ఈ సంకలనంలోని గేయాలను స్థూలంగా 1. బృందగేయాలు, 2. వ్యక్తిగేయాలుగా విభ జించవచ్చు.

భారతీయ సంకీర్ణ సంస్కృతిలో ఒక పాయ అయిన తెలుగువారి జానపద సాహిత్యాన్ని ఈ రాయలసీమ రాగాలు చక్కగా ఆవిష్కరిస్తుంది. సంశ్లిష్ట లక్షణాలతో కూడిన మన గ్రామీణ జీవితంలోని సన్నకారు రైతులు, కూలీలు, వృత్తిపనివారి సామాజిక జీవనాన్ని ఈ గేయాలు కళ్ళకు కడతాయి. వస్తువును బట్టి ఈ గేయాలను క్రింది పేర్కొన్న విధంగా విభజించవచ్చు.

1. హాస్య పరమైనవి
2. ప్రణయ ప్రధానమైనవి (యువతీ యువకుల ప్రణయం, దాంపత్య ప్రణయం, దాంపత్యేతర ప్రయణం అనే భేదాలతో)
3. అనుకంప ప్రధానమైనవి
4. సాహసాన్ని వ్యక్తీకరించేవి
5. మత వేదాంత దృష్టిని తెలిపేవి

జానపద గేయ మౌలిక స్వభావాన్ని, పరిణామాన్ని ఈ గేయాలు విశదం చేయడమే కాక రాగ తాళాల పరిమితు లను కూడా గుర్తించడం వల్ల ఈ సేకర్త అపూర్వ పద్ధతిని అనుసరించారని చెప్పక తప్పదు.

జానపదులు నారుతోటల్లో నాటేటప్పుడు తమ శ్రమను మరిచిపోవడానికి ప్రధానగాయకురాలు పల్లవి చరణాలు పాడుతుంటే స్త్రీలు వంతలుగా ఏకకంఠంతో ఆ పాట మొత్తాన్ని పలుకుతుంటారు. ప్రణయ ప్రధానమైనది ఈ గేయం.

కలిగిరి కలిగిరి కలింగ్ర సెట్టు
కల్లే తాగబోయి ముల్లే దొక్కెను
పాత కడవ వరి మల్లల్లో
పాట పాడుదునా - ఓ వదినె
పాట పాడుదునా -
పాట పాడుదునా - ఓ వదినె
పప్పే రుబ్బుదునా
ఈ బుడిగి బుడిగి బుల్లోడు
వగలు బుల్లోడు బంగారు బుల్లోడు
శాలుకొడమ్మా - ఏలు
కొరకలేడమ్మా - మల్లితె
మంచి కోలుకొడమ్మా - ఎప్పుడు
ఏలుకుంటాడో - నా తట్టు
మల్లుకుంటాడో
సెన్నూరియే సెనిగె బ్యాల్లు
బల్లారిది బెల్లపచ్చు
బాగ వండి పూన్నం పెడితే
మందు వంటాడే పిల్లడు

మల్లుకుంటాడె - తన ప్రేమ సఫలమయ్యేటట్లు చూడమని వదినెకు చెబుతుందీ మరదలు. ఈ పాటలో ఆ పల్లెపిల్ల తపన, ఆరాధన, ఆవేదన, కల్తీలేని ప్రేమ ప్రస్ఫుటమౌతుంది. రాయలసీమ మాండలికంలోసాగే ఈ పాటలో ఎన్నో ఆణిముత్యాల్లాంటి పల్లెపదాలు మనకి కల్పిస్తాయి. ఉదా॥కు కలింగ్రసెట్టు, పూన్నం, బ్యాల్లు లాంటి మాండలిక పదాల్లో అచ్చు తెలుగు సొంపు కనిపిస్తుంది.

మరో పాటలో దంపతుల ప్రణయం కనిపిస్తుంది. పెద్దవారి కలహాలు కొత్త దంపతులను విడదీసి వారి ఆనందాన్ని ఆవిరి చేసిన వైనాన్ని ఈ పాట తెల్పుతుంది.

తోడురారా సందమామా
నాకు తోడు నీవు రారా
ఒంటిదాన్ని యింట్లో ఉంటె
కంటి మీద కునుకు రాదు
గుండె మింద చెయ్యియేసి
నిండు మనసు వొలకబోసి
ఎనక ముందు ఒడ్డుకోని
ఎవరు నన్ను నివురుతారు ॥ తోడు రారా॥

ఒంటరితనం తనను వేధిస్తున్నదనీ, ఊరంతా మాటు మణిగిందనీ, తనను కలుసుకోడానికి రమ్మనీ ఆహ్వానిస్తుంది. సున్నితమైన శృంగార భావాలతో ఈ పాట సాగుతుంది.

ఈ పాటలో కూడా యువతీ యువకుల ప్రణయం వ్యక్తమౌతుంది.

సందమామ వంటిదాన్నిరా - నా సామిరంగా
నందు గానను ఏమి సేతురా
మొగిలి పువ్వు వంటి దాన్నిరా - నా సామిరంగా
నాగుపాము నడకదాన్నిరా
ఇంటి ఎనకల ఇనుపరోలు
నందులోన చావ రోకలి
సన్నబియ్యం దంచుతుంటె
సూపులన్ని నీ మీదుండురా జాణ ॥సందమామ॥

వడ్లు దంచడం, తోట దగ్గర మల్లెలు ప్రోగుచేయడం, సింతసిగురు కోయడం, కపిలబావి వద్ద కాడిపైన కూర్చొని యాలపాటలు పాడడంలాంటి వ్యవసాయాధారిత పనులన్నీ పేర్కొంటూ శ్రమైక జీవన సౌందర్యాన్ని ఈ పాట మన కళ్ళముందుంచుతుంది.

వర్షాధార మెట్ట పంటకు కలుపు బెడద ఎక్కువే. కలుపు తీతలో కూడా సాధారణంగా స్త్రీలే పాల్గొంటారు. ఈ పనిచేస్తూ శ్రమ తెలియకుండా పాడే పాటల్ని కలుపు పాటలుగా సేకర్త పేర్కొన్నారు.

ఓరి మగడా! ఒయ్యారి మగడా
నా ఏలుపడె పాటు సూడు ఓరి మగడా
గొట్టూరు సెరువు కింద ఓరి మగడా
నేను వరిమడి నాటబోతి ఓరి మగడా
వరిమడి నాటబోతి ఓరి మగడా
గెనుమ్‌వార మునుముపడితి ఓరి మగడా
గనిమ్‌వార మునుపుపడితే ఓరి మగడా
నన్నెండ్రకాయ తేలు గుట్టె ఓరి మగడా ॥ఓరి॥
నాకు వరికూడు వండిపెట్టర ఓరి మగడా
నీవు రాగిసంకటి పాంకోర ఓరి మగడా
నాకు గోదుం రొట్టెలు కాల్సి పెట్ర ఓరి మగడా
నీవు జొన్న రొట్టెల్ పాంకోర ఓరి మగడా ॥ఓరి॥

భర్తను కొంగున ముడేసుకున్న స్త్రీ తనకు తేలో, ఎండ్ర కాయో కుట్టిందని భర్త చేత సేవలు చేయించుకొంటుంది. భర్త ఆమెను అపురూపంగా చూసుకోవడమే తన భాగ్యమనుకుంటున్నాడు. కోడిమాంసం, చేపలకూర, గోధుమరొట్టె తనకు వండిపెట్టమని, రాగిముద్దా, జొన్న రొట్టెలు మాములు కూరలు నువ్వు తినమని ఆమె భర్తకు చెప్పే మాటల్లో హాస్యం అలవోకగా జాలువారుతుంది.

పాటు, గెనుము, మునుము, సర్తు = చెమట మొ॥న మాండలిక పదాలు ఈ గేయంలో తొంగిచూస్తూ జాన పదుల సామాన్య జీవనాన్ని ప్రతిబింబిస్తున్నాయి.

మరో గేయంలో అగ్రకులస్తులకూ, నిమ్న కులపు వారికీ మధ్య ప్రణయం పరిణయం సాధ్యపడదనే

అంశాన్ని అక్కా తమ్ముళ్ళ మధ్య జరిగే సంభాషణలో అంతర్గతంగా మనకు కన్పిస్తుంది.

మగ : అక్క చూడు చిన్నదాని
చక్కదనము - ఒక్కతుంది
ఎవరి చిన్నదో - అది
ఎవ్వరింటిదో .....
ఆడ : ఏమిసేస్తుర తమ్ముడు - అది
కాని కూలపూది

మరో గేయంలో చంద్రమ్మ అగ్రకులానికి చెందింది. వెంకయ్య హరిజనుడు. సమాజం విధించిన హద్దులకు అంక్షలకు దూరంగా వెళ్ళి బ్రతుకుదామని చంద్రమ్మ వెంకయ్యను ప్రేరేపించడం కనిపిస్తుంది.

నందనాల సెందరమ్మో రెంకయ్య
పాయకారి సెందరమ్మో రెంకయ్య
వగలకారి సెందరమ్మో రెంకయ్య
వయ్ సుందరమ్మామ వయ్ పాయకారి
నందనాలు సెందరమ్మో రెంకయ్య
- - - - - - - - - - - - -
అంటుకుల పోడని - అందనియ్యరు నిన్ను
జంటగా దేశాలు - పోదమో రెంకయ్య
తగులుకొని నీయెంట - వత్తురో రెంకయ్య

ఈ గేయంలోని మిగిలిన చరణాలలో శృంగారం పాలు ఎక్కువైందనే చెప్పాలి. అయితే ఈ మోటు శృంగారాన్ని శ్రమభారాన్ని తగ్గించుకునే ప్రయత్నంలో జానపదుల హృదంతరాళం నుండి ఉబికి వచ్చిన ఆనంద రసవాహినిగానే భావించాలి.

కలుపు పాటల్లో కరుణ ప్రధానమైన పాటలు కూడా ఉన్నాయి. రాయలసీమ అంటేనే మొదట గుర్తొచ్చేది కరువు. అయితే వర్షాలు సమృద్ధిగా కురిసి, పంటలు బ్రహ్మాండంగా పండినా ధనవంతులు వాటిని నల్ల బజారుకు తోలించి పేదవాడికి పిడికెడు గింజలు లేకుండా చేసి 'మాయకరువు'ను సృష్టించిన విధాన్ని జానపదులు గేయంలో అభివర్ణించారు.

ఓరన్న మాయ కరువొచ్చెరన్న
మాయ కరువొచ్చరన్న
కరువొచ్చి కట్టమొచ్చి
కూడు లేదుర మనకు, గూడు లేదుర ।ఓరన్న।
వానలేమొ కురిసినాయి
కుంట లేమొ నిండినాయి
పంటలేమొ పండినాయి
గాదె లేమొ నిండినాయి ।ఓరన్న।
- - - - - - - - -
పొయ్యిలో పిల్లిని లేపి
కుండలో గింజలేసి
వండితే గంజికేను
ఆకలి అగ్గిలేసె ।ఓరన్న।

అంటూ వాస్తవిక జీవితాన్ని కళ్ళకు కడుతారు జానపదులు.

జానపదులు అలవోకగా పాడేపాటల్లో ఎనలేని మాధుర్యముంది. ముగ్ధత్వముంది. వివిధ సందర్భాల్లో వేడుకతో పాడుకొనే పల్లెప్రజానీకం ఇప్పటికీ కనిపిస్తారు. బహుప్రయాసతో అనేక గ్రంథాలు ప్రచురించిన నేదునూరి గంగాధరంగారు జానపద వాఙ్మయాన్ని గురించి "జాన పదులకు సంగీతము సాహిత్యము వేర్వేరు కావు. చంద్రునితో వెన్నెలలాగా కలిసేవుంటాయి. వారి నిత్య జీవితంలో ప్రతి ఘట్టమును అమాయిక అకల్మష హృదయతంత్రుల్ని యిట్టే స్పందింపజేస్తాయి. ఆయా సందర్భాలను బట్టి చేసే పనులను బట్టి తగిన నడకతో, లయతో, రసానుగుణ్యంగా సంగీత సాహిత్యాలు యేక కాలంలోనే ఉబికివస్తాయి" అని అంటారు. ప్రతి జిల్లాలో లభించే జానపద గేయాలు ఆయా ప్రాంతాల విశిష్టతను చాటుతాయి. ఆయా ప్రజల కష్టాలను కన్నీటిని ప్రతి బింబిస్తాయి. ఆయా ప్రజల సంతోషసుమాల్ని విర బూస్తాయి.

⌘

BHAVAVEENA
Vol. 17, Issue. 8, August 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

జానపద కళల పరిరక్షణ

– డా॥. కొమ్మనబోయిన సుజాత, తెలుగు లెక్చరర్, ప్రభుత్వ మహిళా కళాశాల, (స్వయంప్రతిపత్తి) గుంటూరు.

చదువు సంధ్యలు లేని పామరుడనబడిన ప్రాచీన మానవుని ఊహాశక్తికి, భావుకతకు, మేధస్సుకు సజీవ సాక్ష్యం జానపద విజ్ఞానం. ఒక జాతియొక్క సంస్కృతికి నిలువెత్తు అద్దం ఆ జాతియొక్క జానపద విజ్ఞానమే. ప్రతి జాతికి తనదైన ఒక సంస్కృతి ఉంటుంది. అది జానపద విజ్ఞానంలో నిక్షిప్తమై ఉంటుంది.

జానవద సాహిత్యం మరియు కళారూపాలు మనోల్లాసాన్ని కలిగిస్తాయి. శ్రమను పోగొడతాయి. ఉప దేశం చేస్తాయి. సంస్కృతిని నిలబెడతాయి. మనకు అపారమైన, అద్భుతమైన జానపద సంపద ఉంది. ఆ సంపదను మనమే నిర్లక్ష్యంతో పోగొట్టుకుంటున్నాము.

'ముఖేముఖే సరస్వతి' అన్నట్లుగా ఒకరి ముఖతః మరొకరికి ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి వ్యాపించి ప్రజల్లో ఉల్లాసాన్ని, ఉత్సాహాన్ని నింపిన ఈ జానపద సాహిత్యం మరియు కళలు ఈనాడు ప్రపంచీ కరణ ప్రభావం వలన కనుమరుగయ్యే పరిస్థితి ఏర్పడిం దంటే అంతకంటే బాధాకరమైన స్థితి మరొకటి ఉండదు.

ప్రపంచీకరణ ప్రభావానికి అమితంగా గురైన అంశా లలో ఒకటి జానపద కళారూపాలు. మన దేశంలో విద్య, వైద్యం, చేతి వృత్తులు, నిత్య జీవిత వస్తువులు, ఉత్స వాలు, సాహిత్యం, కళలు, ఇలా ఏ విషయం తీసుకున్నా ఇవన్నీ ప్రపంచీకరణ ప్రభావానికి లోనైనవే. ప్రపంచీకరణ పిల్లల బాల్యాన్ని మింగేసింది. పెద్దల విశ్రాంతిని మింగేసింది. వత్తిడితో కూడిన జీవన విధానంలోకి మనిషిని నెట్టేసింది. వ్యక్తిని సంఘంతో మమేకమై జీవించే పరిస్థితినుంచి ఎవరికి వారే యమునాతీరే అనే స్థితిలోకి తోసివేసి సంఘానికి దూరం చేసింది. మనిషి జీవిత విధానంలో తీవ్రమైన మార్పును తెచ్చింది. పెరిగిన సాంకేతిక అవకాశాలు గతంలోకంటే ఎక్కువ జ్ఞానాన్ని అందిస్తున్నమాట వాస్తవమే కాని అందువల్ల పిల్లలకి నిజమైన మానసిక, భౌతిక వికాసం జరగడం లేదు అనేది సత్యం. వీడియో గేమ్స్, పిల్లల టి.వి ఛానెళ్ళతో పూర్తిగా లీనమైపోయిన పిల్లలకు కోతికొమ్మచ్చులు, ఒప్పుల కుప్పలు, దాగుడుమూతలు, ఓమన గుంటలు వంటి ఆటల పేర్లే తెలియకుండా పోతున్నాయి. పల్లెల్లో కూడా పిల్లలు ఇలాంటి ఆటలాడే దృశ్యాలు చాలా అరుదుగా కనిపిస్తున్నాయి. పనులు పూర్తి చేసుకున్న పెద్దవాళ్ళు, పొడుపు కథలతో కాలక్షేపం చేసే దృశ్యాలు పల్లెల్లో కూడా కనిపించడంలేదు. సెల్‌ఫోన్లు, ఛాటింగ్‌లు, టి.వి సీరి యళ్ళు ఇవే ప్రజా జీవితాన్ని ఆక్రమిస్తున్నాయి.

ఇదంతా ప్రపంచీకరణ ప్రభావమే. ప్రగతి పేరుతో ఒక యాంత్రిక జీవితంలోకి, ఒక విష వలయంలోకి మనం ప్రవేశించాము. ప్రపంచీకరణ ప్రభావం మనిషిని మను షుల నుంచి వేరు చేసింది. సంఘ జీవితంనుండి వేరు పరచి సామూహిక ఆనందాలను కూడ వ్యక్తిగతం చేసింది. పండుగలు, పర్వదినాల్లో ఒకప్పుడు కనిపించే సంఘ జీవితం కనుమరుగయ్యేలా చేసింది. ప్రపంచీకరణ కొందరికి తీరికలేని వత్తిడితో కూడిన జీవితాన్ని ప్రసాదిస్తే మరికొందరిని సోషల్ మీడియా, ఇంటర్నెట్ వంటి వాటికి బానిసల్ని చేసింది. అక్షరమ్ముక్కరాని వాళ్ళు కూడా ఈ వ్యసనానికి లోనై సమయమంతా వృథా చేసుకుంటున్న పరిస్థితులకు కారణభూతమైంది. ఈ ఆధునిక జన జీవితంలోని యాంత్రికతను, స్తబ్ధతను బద్దలుకొట్టి ఉత్సాహాన్ని నింపే కళలు నిస్సందేహంగా జానపద కళా రూపాలే. వీటిని పునరుజ్జీవింపచేయవలసిన బాధ్యత కూడా మనపైనే ఉంది.

జానపద సాహిత్యం :

ఒకప్పుడు జానపద గేయాలు ప్రజల జీవితంలో ఒక

భాగమై పెనవేసుకోనుండేవి. సజీవమై, సహజ సుందరమై పండిత, పామర జనరంజకమైనది జానపద సాహిత్యం. జానపద కథలు ఆబాల గోపాలాన్ని అలరించేవి. ఎన్నో రకాలైన జానపద గేయాలు జానపదుల జీవితంలో ప్రధాన భూమికను వహించేవి. వివాహం, బారసాల వంటి వేడుక సమయాల్లో, పనిపాటల సమయాల్లో ఈ జానపద గేయాలకు పెద్దపీట. భాషాపరంగా చూసినా అచ్చమైన తెలుగు భాష మనకి జానపదుల్లో కనిపిస్తుంది. పల్లెల్లో పనితీరిన తర్వాత పదిమంది కూర్చొని కమ్మని కబుర్లు, కథలు, సామెతలు, పొడుపు కథలు చెప్పకునేవారు. అవి వారి శ్రమను పోగొట్టే కళలు. అలనాటి మానవుడు తన తర్వాత తరంవారికి అందించిన సంస్కృతి పరంపర.

ఆనాటి జానపదుల భాషలో సామెతలెన్నో అలవోకగా దొర్లేవి. అందంగా అమరేవి. వ్యక్తి జీవితంలోని అనుభవాల సారమే సామెత. ఈ సామెతల ప్రయోగంవల్ల భాషయొక్క అందాన్ని ఇనుమడింప చేయవచ్చు. సామెతల ద్వారా ఎవరినైనా విమర్శించవచ్చు, వ్యగ్యంగా తిట్టవచ్చు, నవ్వించవచ్చు, నీతులు గరపొచ్చు. తెలుగు భాషకివి పెట్టని అలంకారాలు. భాషకెంతో సొగసునిచ్చే ఈ సామెతల వాడకం క్రమంగా కనుమరుగవడం శోచనీయం. అలాగే ఆనాటి జానపదులు పొడుపు కథలద్వారా తమ గడుసుదనాన్ని, తెలివితేటల్ని ప్రదర్శించేవారు. ఇక అద్భుత కల్పనలతో కూడిన జానపద కథల గురించి ఎంత చెప్పినా తక్కువే.

పగటి వేషాలు :

ఒక్క తెలుగునాట కాక దేశమంతటా ప్రజల్ని అలరించిన కళారూపం ఆనాటి ప్రజల్ని అద్భుతంగా అలరించిన, ఉర్రూతలూగించిన జానపద కళారూపమిది. ఈ పగటి వేష కళాకారుల ప్రజ్ఞ చెప్పనలవి కాదు. పిట్టలదొర, గొల్లబోయడు, అర్ధనారీశ్వరుడు, శక్తి, పాములవాడు, అత్తరు సాయెబు, ఫకీరు, కన్నెకైరడు, మొదలగు వేషాలు దాదాపు 50 పగటి వేషాలదాకా ఆనాటి పగటి వేష కళాకారులు ప్రదర్శించేవారంటే ఈ కళారూపానికున్న ఆదరణ మనకు అర్థమవుతుంది.

బొమ్మలాట :

తెలుగు నాటే కాకుండా ఈ బొమ్మలాట ప్రదర్శనలు తమిళ, కన్నడ ప్రాంతాల్లో కూడా ప్రదర్శింపబడుతున్నాయి.

ఈ బొమ్మలాటల్లో కూడా చాలా రకాలున్నాయి. తోలు బొమ్మలాటలు, కొయ్య బొమ్మలాటలు, కీలుబొమ్మలు, బుట్ట బొమ్మలు, కర్రబొమ్మలు, మొదలగునవి. వీటికి ఎంతో సుదీర్ఘ చరిత్ర ఉంది. ఏది ఏమైనా ఇది ఆనాడు అందరికి అందుబాటులో ఉన్న అపురూపమైన వినోదం.

బుర్రకథ :

ఒక కథకుడు, భళి భళి అని వంత పాడే ఇద్దరు వంతదార్లతో చెప్పబడే అద్భుత రసవత్తర కథ బుర్రకథ. కథకుడు కథాగానంపై వంతలు వంత పాడతారు. బాలనాగమ్మ కథ, బొబ్బిలియుద్ధం లక్ష్మీ తిరుపతమ్మ కథ, పల్నాటి వీరచరిత్ర, బాలనాగమ్మ కథ, కాంభోజరాజు కథ మొదలగు ఎన్నో బుర్రకథలు ప్రజల్ని ఎంతగానో అలరించాయి.

ఇవేకాక వీధి నాటకాలు, బయలాటలు, కోలాటం, గొల్ల కలాపం, కొరవంజి వంటి జానపద కళారూపాలెన్నో ఆనాటి ప్రజలకి ఉల్లాసాన్ని, ఉత్తేజాన్ని పంచుతూ ఆనాటి జనజీవితంలో మమేకమైనాయంటే అతిశయోక్తి కాదు. అయితే ఈనాటి తరానికి వీటి పరిచయమైనా లేకపోవడం క్షంతవ్యం కాని చారిత్రక తప్పిదం.

మానవీయ విలువల్ని పెంపొందించి, మనోల్లాసాన్ని అందించే ఈ జానపద కళల్ని ప్రోత్సహించాల్సిన బాధ్యత మనందరిపై ఉంది.

జానపద కళల పరిరక్షణకు తీసుకోవాల్సి చర్యలు:

1) జానపద కళల పరిరక్షణ అంటే మనజాతియొక్క సంస్కృతి పరిరక్షణ కనుక ప్రభుత్వం కూడా తగిన చేయూతనిచ్చి ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా కలదు. ప్రభుత్వం ఈ దిశగా కొన్ని చర్యలు చేపట్టవలసిన అవసరంవుంది.
2) నేటి విద్యా విధానం కేవలం యంత్రాలను

తయారు చేసేదిగా ఉంది. విద్యా విధానంలో మార్పులు అనివార్యం, అంతేకాకుండా అన్ని స్థాయిలలో పాఠ్య పుస్తకాలలో ఒక అంశంగా ఈ జానపద కళలు మరియు సాహిత్యం ఉన్నట్లయితే విద్యార్థులకు వీటిపై ఒక అవగాహన వస్తుంది.

3) ప్రసార మాధ్యమాలలో టి.వి. చాలా ప్రధాన పాత్రను వహిస్తున్న నేపథ్యంలో "రేలా రే రేలా" వంటి ప్రోగ్రాములు అడపదడపా వస్తున్నప్పటికీ ఈ టి.వి. చానెల్స్‌లో జానపద కళలకు ఆదరణ లేదనే చెప్పాలి. ఈ టి.వి. ఛానెల్స్ ద్వారానైనా రకరకాలైన జానపద కళల్ని ప్రోత్సహించినట్లయితే ప్రజలకి నిజమైన ఉల్లాసం, ఉత్తేజం, అందించ బడటంతోపాటు ఆ కళలను బ్రతికించిన వారవు తారు.

4) ఎగ్జిబిషన్ల దగ్గర ఈ జానపద కళా ప్రదర్శనలు ఏర్పాటు చేసినట్లయితే ఈ కళల్ని మనం పోషించు కున్న వారమవుతాం.

5) కొన్ని ముఖ్యమైన పర్యాటక ప్రాంతాలవద్ద మన జానపద కళారూపాల ప్రదర్శనలు ఏర్పాటు చేయించినట్లయితే ఇతర ప్రాంతాల వాళ్ళకు, విదేశీయులకు సైతం మన జానపద కళల్ని రూచి చూపిన వారమవుతాం.

6) శ్రీరామ నవమి మొదలగు ఉత్సవాల సమయాల్లో పందిళ్ళ వద్ద ఒకప్పుడు బుర్రకథలు, వీధి నాటకాల వంటి ప్రదర్శనలు విరివిగా జరిగేవి. ఈనాడు దాదాపుగా ఈ జానపద కళా ప్రదర్శనలు లేవనే చెప్పాలి. ఈ పండుగల సమయాల్లో పందిళ్ళ వద్ద ఆరుబయట కోలాటం, బుర్రకథలవంటి ప్రద ర్శనలు ఏర్పాటు చేయిస్తే బాగుంటుంది.

7) ప్రతి విశ్వవిద్యాలయంలోనూ ఒక జానపద కళాపీఠం ఏర్పాటుచేసి కనుమరుగవుతున్న జానపద సాహి త్యాన్ని మరియు కళారూపాలను పునరుద్ధరించే ప్రయత్నాలు చేపట్టాలి.

8) "సంఘంలోని ప్రతి వ్యక్తికి ప్రత్యక్షంగా సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొనే అవకాశం ఉండాలి. ప్రపంచీకరణ ప్రతి మనిషిని సాంస్కృతిక వినియోగ దారుడిగా మార్చేస్తుంది. అందరినీ సాంస్కృతిక సృష్టికర్తలుగా మార్చడమే దానికి విరుగుడు. కాబట్టి మన విజ్ఞాన కేంద్రాల్ని సాంస్కృతిక సృష్టి కేంద్రా లుగా తయారు చేయాలి" అన్న బి.వి. రాఘవులు గారి అభిప్రాయం ప్రకారం మన విజ్ఞాన కేంద్రాల్ని, విద్యా వ్యవస్థలను సాంస్కృతిక సృష్టి కేంద్రాలుగా తయారు చేయాలి. తద్వారా జానపద కళాకారు లను, కళారూపాలను ప్రోత్సహించాలి.

9) కొన్ని జానపద కళారూపాలను ఈ కాలానికి తగిన విధంగా స్వల్ప మార్పులు చేసి ఉపయోగించడం ద్వారా పునరుద్ధరించవచ్చు.

10) ఏ కళ అయినా బ్రతికుండాలంటే అన్నిటికన్నా ముఖ్యమైంది ప్రజాదరణ. జానపద గేయాలు, కథలు, సామెతలు, పొడుపు కథలు, పగటి వేషాలు బుర్రకథలవంటి కళారూపాలు అన్ని కూడా నేడు కొడిగడుతున్న దీపాలే. ప్రజదరణ కోల్పోయి కొడిగడుతున్న ఈ జానపద కళలనే దీపాలను ప్రజల ఆదరణ అనే చమురుపోసి బతికించి ప్రాచీన మానవ సంస్కృతి మట్టిలో కలిసిపోకుండా కాపాడ వలసిన బాధ్యత ప్రతి ఒక్కరిది. నేను సైతం అంటూ ప్రతి ఒక్కరూకూడా తమ వంతు చేయూత నిచ్చి నట్లయితే ఈ కళలన్నీ పూర్వ వైభవాన్ని పొందు తాయి.

ఆధార గ్రంథాలు :

1) ప్రపంచీకరణ - సంస్కృతి (సం) - తెలకపల్లి రవి.
2) పగటి వేషాలు - వాటి ప్రాచీనత - విభూతి భవాని లింగం.

⌘

BHAVAVEENA
Vol. 17, Issue. 8, August 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

సమకాలీన సమాజ ప్రతిఫలనం ప్రాచీన సాహిత్యం

– డా॥. ఒభిన్ని శ్రీహరి, తెలుగు అధ్యాపకులు, రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం, నూజివీడు.

రచయిత సమాజం రెండూ వేరు కాదు, రెండూ అవినాభావ సంబంధం కలవే. రచయిత కూడా సమాజంలో ఒకడే కాబట్టి సమకాలీన సమాజ పరిస్థితులకు అద్దంపట్టే విధంగా రచనలు చేశాడు, చేస్తున్నాడు. ఒక్కొక్క కాలంలో ఒక్కొక్క సామాజిక ప్రయోజనాన్ని ఆకాక్షించే రచనలు వెలువడతాయి. ఆ కాలంలో ఆవిధంగా రచనలు వెలువడడానికి ఆ కాలంలో ఆర్థిక, సామాజిక రాజకీయ పరమైన అనేక కారణాలు రచయిత మీద ప్రత్యక్షంగా పరోక్షంగా ప్రభావం చూపుతాయి.

ప్రాచీన కాలంలో ఆయా సమాజ పరిస్థితులకు తగినట్లుగా రచనలు వచ్చాయి, అయితే నాడు సమాజిక సమస్యలకు అంతగా ప్రాధాన్యత ఇవ్వక పోవడానికి చాలా కారణాలు ఉన్నాయి. ప్రస్తుతం సాహిత్యం అప్పుడూ ఆ కాల పరిస్థితులకు లోనవుతుందని చెప్పవచ్చు. ఇయితే ఇక్కడ కవి ఒక సమస్యను చెప్పినప్పుడు అది ఏ కాలమైనా ఆ సామాజిక సమస్య అదే విధంగా ఉండవచ్చు. ఉదాహరనకు మద్యపానం వంటి దురలవాట్ల మీద నాడు నేడూ ప్రజలను రచయితలు చైత్యన్యవంతం చేస్తూనే ఉన్నారు. ఇక్కడ సమస్య ఒక్కటే, కలం మాత్రం మారింది.

ప్రస్తుత నా వ్యాసంలో ప్రాచీన సాహిత్యం ఏ విధంగా ఆ నాటి సమకాలీన పరిస్థితులను ప్రభావితం చేసిందో వివరిస్తాను. మొదటగా 17 వ శతాబ్దానికి చెందిన ప్రజాకవి వేమన పద్యాలు వినని తెలుగువారు ఉండరారంటే అతిశయోక్తి లేదు. "విశ్వదాభిరామ వినురవేమ" అన్నమాకుంటంతో వేమన పద్యాలు నాటికి నేటికీ ప్రజల నోళ్లల్లో లాస్యమాడుతూ ఉన్నాయి. దాదాపుగా 300 సంవత్సరాల పూర్వమే సమసమాజాన్ని ఆకాంక్షించిన మహనీయుడు వేమన అని చెప్పవచ్చు. సమాజంలో ఉన్న కులాల మీద, మతాల మీద, ముధాచారాల మీద తన కాలాన్ని ఎక్కుపెట్టి సమాజాన్ని అభ్యుదయ దృక్పధంలో చైతన్య పరచిన మహనీయుడు.

"కళ కళ కోసం కాదు కళ ప్రజల కోసం" అన్న నానుడిని నిజంచెసిన గొప్ప దార్శనికుడు వేమన. తన జీవితంలో ఎన్నో ఉద్దాన పతనాలను చూసి ఆ కాలపు సమాజాన్ని దగ్గరగా చూసి తనను తాను అభ్యుదయ సమాజ దిక్షూచిగా మార్చుకొన్న మహనీయుడు వేమన. మనం ఎంతకాలం బ్రతికామన్నది కాదు ముఖ్యం, సమాజానికి ఏమి చేశామన్న గొప్ప సదాశయంతో వేమన పద్య రచన చేసారు.

అటువంటి వేమన పద్యాలు మనకు వేల సంఖ్యలో కనిపిస్తున్నాయి. ఆ పద్యాలు అన్నీ ఆణిముత్యాలే. అయితే నేను మచ్చుకు కొన్ని పద్యాలు పరిశీలిస్తూ వేమన ఎంత ప్రగతిశీలవాదిగా కనిపిస్తున్నాడన్నది చర్చించడం ప్రస్తుత నా ఈ వ్యాస ప్రధాన ఉద్దేశ్యం. వాటిలో వేమన కుల,మతరహిత సమాజాన్ని ఏ విధంగా ఆక్షాంశి0చాడో ఒక పద్యంలో చెపుతూ

ఉర్వివారికెల్ల నొక్క కంచమువెట్టి
పొత్తు గుడిపి కులము పోలయజేసి
తలను చేయిపెట్టి తగనమ్మజెప్పరో
విశ్వదాభిరామ వినురవేమ.

నేడు సమాజంలో ప్రజల మధ్య కుల, మత, ప్రాంత భేదాలు పెరిగి ప్రజలు కలహించుకొంటున్నారు.ఇది మానవాళికి శ్రేయస్కరం కాదు. ఈ పద్యంలో మనవులం దరినీ ఒక చోట కూర్చోబెట్టు వారి మధ్య కుల, మత, ప్రాంత భేదాలు లేకుండా సహపంక్తి భోజానాలు ఏర్పాటు చేయమని కవి చెపుతున్నారు, అలాగే మా మధ్య ఏ విధమైన కుల, మత, ప్రాంత భేదాలు లేవని తల మీద

చేయిపెట్టి ప్రతిజ్ఞ చేయమని వేమన ఈ పద్యం ద్వారా చెపుతున్నాడు.

మానవులంతా ఒక్కటే దానిపేరే వసుధైక కుటుంబం. ప్రపంచమే కుగ్రామంగా మారిపోతుంది. దేశాల మధ్య సరిహద్దులు చెరిగిపోతున్నాయి. వసుధైక కుటుంబం అన్న మాట నిజమవుతుంది. ఇంత అభివృద్ధి వైపు వెళ్తున్న సమాజంలో నేటికి కులాల పేరుతొ మతాల పేరుతొ, ప్రాంతాల పేరుతో జరుగుతున్న దాడులకు నిజంగా మనం సిగ్గుపడాలి. వేమన అప్పుడు చెప్పినా, ఇప్పుడు చెప్పినా సమాజంలో ఏ విధమైన మార్పు రాకపోవడం బాధాకరం. ఎప్పుడైతే కులాలు, మతాల ఇతర భేదాలు లేకుండా సమాజం ఉంటుందో అ సమాజమే అభ్యుదయ మార్గంలో పయనిస్తూ, అభివృద్ధి చెందుతుంది. అలాగే వేమన మరో పద్యంలో మంచి ఎవరు చెప్పినా అన్నదానిని స్వీకరించాలని చెపుతూ.....

రామ నామ జపముచే మున్ను వాల్మీకి
పాపి బోయుడయ్యు బపడయ్యే
కులము ఘనము గాదు గుణమే ఘనమ్ము రా
విశ్వదాభిరామ వినురవేమ.

వాల్మీకి పుట్టుకతో బోయవాడు రామాయణ మహా కావ్యాన్ని రచించి, రామ నామ జపం వల్ల మహర్షి అయ్యాడు. ఆయన కులం కంటే గుణం ప్రధానమైనదని నిరూపించాడు.

కులం కంటే గుణం ప్రధానమైనది. పూర్వకాలంలో కులవృత్తిపై ఆధారపడి కుల వ్యవస్థ ఏర్పడింది. ఆ రోజుల్లో దుర్మార్గంగా వ వృత్తిని బట్టి సమాజంలో గౌరవ మివ్వడం జరిగేది. శ్రీమద్రామాయాణాన్ని సంస్కృతంలో రచించిన వాల్మీకి మహర్షి బోయవాడు. జంతువులను వేటాడి జీవించేవాడు. అరణ్యంలో మునీశ్వరుల ద్వారా జ్ఞానోదయాన్ని పొందాడు. వాల్మీకి తప్పసు చేసి,అతడు విజ్ఞానాలనార్జించి రామాయణాన్ని కావ్యంగా వ్రాశాడు. ఆయన ఉన్నతమైన మహర్షి పదవిని పొందాడు. కులం కంటే గుణం గొప్పదని నిరూపించాడు.

నేడు దేశం శాస్త్ర సాంకేతిక రంగాలలో ఎంతగా అభివృద్ధి చెందినా, శాస్త్రవేత్తలు మనిషిని, పోలిన మనిషి వలే రోబోలను స్త ృస్తిస్తున్నా కుల జాడ్యం పోవడం లేదు. అంబేద్కర్ లాంటి ఎందరో మహనీయులు పోరాటంచేసి కుల వ్యవస్థను రూపుమాపడానికి నిరంతరం పోరాటం చేశారు. మనిషిగా, మానవత్వం ఉన్న మనిషిగా బతికే సమాజాన్ని అందరం కోరుకోవాలి. కులాలు పోరుతో ఇంకా అడ్డుగోడలు నిర్మించుకుంటూపోతే చివరకు మానవ జాతి మనుగడే ప్రశ్నార్థకమయ్యే పరిస్థితి వచ్చినా ఆశ్చర్య పోనవసరం లేదు.

మహాభారతంలో ఆనాటి సమకాలీన సమాజ పరిస్థితులను చక్కగా విశ్లేషించారు. మహాభారతలో విదుర నీతిలో ధర్మానికి సత్యానికి కలిగే హానిని చెప్పి, చివరకు ధర్మమే విజయం సాధిస్తుందని చక్కగా చెప్పారు. ఆ పద్యంలో

సారపు ధర్మమున్ విమల సత్యము బాపము చేత బొంకుచే
బారము బొందలేక చెడబారినదైన యవస్థ దక్షులే
వ్వార లుపేక్షసేసిరది వారలచేటగు గాని ధర్మని
స్తారకమయ్యు సత్య శుభదాయకమయ్యును దైవ
ముండెడున్.

పాపాలు చేయడం వలన ధర్మానికి, అబద్దాలు ఆడడం వలన సత్యానికి హాని కలుగుతుంటే సమర్థులు చూస్తూ ఊరుకుంటే అది వారికే హాని కలుగుతుంది, కానీ ధర్మాన్ని కాపాడడానికి, సత్యాన్ని కాపాడి శుభాలను కల్గించడానికి దైవమున్నదన్న విషయం మరువకూడదు.

ఇల్లు కాలుతుంటే కళ్ళప్పగించి చూడడం నేరం అనే సామెత మనకందరికి తెలిసినదే. నేటి సమాజంలో అనేక మంది కేవలం డబ్బు సంపాదించడమే పరమావధిగా పెట్టుకొని అనేక అరాచకాలు చేస్తున్నారు. అధర్మ మార్గాలలో పయనించి చివరికి జీవితాన్ని ధుఖ సాగరం లోకి స్వయంగా వారే నెడుతున్నారు. అదే విధంగా అసత్యాన్ని పలుకుతూ అనేక దుర్మార్గాలు చేస్తున్నారు. సాధారణంగా కోర్టుల్లో చూస్తుంటాం, దొంగ సాక్ష్యాలు

చెప్పించి, అన్యాయంగా తప్పు చేసి కూడా బయట తిరుగుతున్న వారిని చూస్తున్నాం. అదే విధంగా ఏ తప్పు చేయకపోయినా దొంగ సాక్ష్యానికి బలైన వారు సమాజంలో నిత్యం కనిపిస్తున్నే ఉన్నారు. కాబట్టి ధర్మబద్ధమైన జీవన విధానాన్ని అలవారుకోవాలి.

భాస్కర శతక కర్త మారద వెంకయ్య చదువుకొన్న వినయ సంపన్నుడు కాకపోతే వాడు దుర్మార్గుడు అయితే ఎటువంటి పరిస్థితి ఏర్పడుతుందో చక్కగా వివరించారు. ఆ పద్యంలో .....

చదువది ఎంత గల్గిన రసజ్ఞత యింకుక చాలకున్న నా
చదువు నిరర్థకంబు, గుణ సంయుతులెవ్వరు మెచ్చరచ్చటం
బదునుగ మంచి కూర నలపాకము చేసిననైన, నందు, నిం
పొదవెడు నూప్పులేక రుచిపుట్టక నేర్చునటయ్య భాస్కరా!

ఈ పద్యంలో విద్యార్థులకు చదువు కాదు వినయ విధేయతలు ముఖ్యమనే విషయం స్పష్టమవుతున్నది. నేడు అనేక మంది విద్యార్థినీ, విద్యార్థులను చూస్తున్నాం వారు క్రమశిక్షణ అనేది లేకుండా వారి జీవితాలను స్వయంగా వారే నాశనం చేసుకొంటున్నారు. పెద్ద చదువులు పెద్ద కొలువులు ఇవ్వగలవేమోకాని సంస్కారమనేది మాత్రం చిన్నతనం నుండి ఎవరికి వారు ఏర్పరచుకోవలసినదే అన్న విషయాన్ని తెలుసుకోవాలి.

మరొక పద్యంలో సుమతీ శతక కర్త దుర్మార్గుడి లక్షణం ఎలా ఉంటాడో చక్కగా వివరించారు. అటువంటి వాడితో కలిగే నష్టాలను చక్కగా చెప్పాడు. ఆ పద్యంలో .....

తలనుండు విషము ఫణికిని
వెలయంగా దోకనుండు వృశ్చికమునకున్
తలతోక యనక యుండును
ఖలునకు నిలువెల్ల విషము గదరా సుమతి.

పామునకు నోటిలోని కోరల్లో విషము ఉంటుంది. తేలుకు తోక చివర ఉంటుంది. కానీ దుర్మార్గుడికి శరీరం అంతా విషం వ్యాపించి ఉంటుందని పద్య భావం. ఈ పద్యంలో చెప్పిన విధంగా నాటి సమాజంలో దుర్మార్గులు ఎలా ఉంటారో చెప్పినా నేడూ అదే విధంగా నేటి సమాజంలో ఉన్నారు. ఏదో విధంగా ఇతరులను ఇబ్బంది పెట్టెలని చూస్తూ, వారి ఎదుగుదలను చూసి ఓర్చుకోలేక దుష్ట ఆలోచనలో ఉంటారు. వారు ఎప్పుడూ జీవితంలో ముందుకు వెళ్లలేరు. సుమతీ శతక కర్త చెప్పినట్లు వారికి శరీరం అంతా విషం ఉంటుంది.

వేమన సమాజంలో మూఢనమ్మకాలను నిరసిస్తూ చెప్పిన పద్యంలో .....

పాలపిట్ట శకున ఫలమిచ్చునందురు
పాలపిట్టకేమి ఫలము దెలియు
తనదు మేలు కీళ్ళు తనతోడ నుండగా
విశ్వదాభిరామ వినురవేమ.

సమాజంలో మూఢ నమ్మకాల వల్ల పాలపిట్టను చూడడం మంచి శకునం. అదృష్టంగా భావిస్తారు. వేమన గారు ఎవరి అదృష్టం వారి వద్ద ఉంటుందని, పాల పిట్టకు అదృష్టానికి ఏమి సంబంధం లేదని చెపుతున్నారు. అలాగే ఎవరి కష్టాన్ని వారు నమ్ముకోవాలని చెపుతున్నారు.

శకునాలనేవి నేటికి మనం సమాజంలో చూస్తున్నాం. ఎక్కడికైనా వెల్లిటప్పుడు పిల్లి ఎదురు వచ్చినా, కట్టెలు మోపు ఎదురువచ్చినా అరిష్టమని ఇలా రకరకాల శకునాలు మనకు కనిపిస్తున్నాయి. నిజానికి వాస్తవికంగా శకునాలను మనిషి మనుగడకు ఏమీ సంబంధం లేదు. మనిషి తన మీద తనకు నమ్మకంతో తన కష్టాన్ని నమ్ముకోవాలి. అంతే కానీ శకునాలను కాదు. ఇటువంటి శకునాల వల్ల ప్రజలు శాస్త్రీయంగా ఆలోచించే దృక్పథాన్ని కోల్పోతున్నారు. ఇప్పుడేతే సమాజంలో శాస్త్రీయ ఆలోచనా ధోరణి తగ్గినప్పుడు రకరకాలుగా ప్రజలను మోసం చేసే

వారు ఎక్కువవుతారు. నేడు మనం అదే చూస్తున్నాం, దేవుడి పేరుతో ప్రజల నమ్మకాలను వాడుకొని, బరితెగి స్తున్న దొంగ స్వాములను చూస్తున్నాం.

వారి బండారం బయటపడినప్పుడు వారు ఎంత దుర్మార్గులో ప్రజలకు తెలుస్తున్నది.. ఈ విధంగా ప్రాచీన సాహిత్యంలో నాటి సామాజిక, ఆర్థిక, రాజకీయ పరమైన అంశాలతో పాటు, సామాజిక సమస్యలకు కూడా కొందరు కవులు ప్రాధాన్యత ఇచ్చి రచనలు చేశారు. ప్రాచీన కాలంలో ఉదర పోషణార్థమై అన్న విధంగా ఎక్కువగా రాజులకు సంబంధించిన రచనలు ఎక్కువ చేయడం, కొన్నిచోట్ల శృతిమించి శృంగారానికి ప్రాధాన్యత ఇవ్వడం వంటివి చేసినా అవి నాటి కాల పరిస్థితుల వల్లనే చేశారని అర్థం చేసుకొవచ్చు.

సంప్రదింపు గ్రంథాలు :

1. ప్రసిద్ధ పద్యాలు, సంకలనం : పి. రాజేశ్వరరావు.
2. మన వేమన, ఆరుద్ర
3. ఆంధ్రుల చరిత్ర సంస్కృతి - శ్రీ ఖండవల్లి లక్ష్మీరంజనం, బాలేందు శేఖరం.

⌘⌘⌘

BHAVAVEENA
Vol. 17, Issue. 8, August 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

కవి శిఖామణి కవిత్వం – సమకాలీనత

– ఎలగొండ రాములు, తెలుగు పండిట్, జిల్లా ప్రజా పరిషత్తు సెకండరీ స్కూలు, ఇటికాలపల్లి, నర్సంపేట, వరంగల్ రూరల్, తెలంగాణ.

"అప్పుడే పెళ్లయిన కొత్త దంపతులు
నక్షత్రం కోసం పగటి ఆకాశంలో వెతికినట్టు
అవసరం పడ్డ ఆడామగా
ఈ నేల మీది అరుంధతి కోసం
కళ్లను విచ్చిన పత్తికాయలు చేసుకొని
చౌరస్తా అంతా కలయ తిరుగుతారు"

(మోచి మా)

'కవి శిఖామణి' - ఆధునిక తెలుగు కవిత్వంలో వేళ్ళ మీద లెక్కించదగిన మహాకవుల్లో ఒకరు. అసలు పేరు - కర్రి సంజీవరావు. 1987 నుండి కవితా రంగాన్ని సునన్నం చేస్తున్న వీరు పది కవితా సంపుటులు ప్రచురించారు. అవి - మువ్వల చేతికర్ర - 1987, హోరు గాలి - 1988, చిలిక్కొయ్య - 1993, కిర్రు చెపజల భాష - 2000, ది బ్లాక్ రైస్‌బో - 2000, నల్లగేటు నందివర్ధనం చెట్టు - 2005, మువ్వల చేతికర్ర (పునర్ముద్రణ) - 2006, తవ్వకం - 2009, గిజిగాడు - 2012, పొద్దున్నే కవి గొంతు - 2015.

"తెలుగు సాహిత్యం - సమాకాలీనత" అనే అంశంపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుంటూరు జిల్లా తెనాలిలో గల వి.ఎస్.ఆర్. & ఎన్.వి. ఆర్. (స్వయం ప్రతిపత్తి) కళా శాలలో 2020 ఆగష్టు 24 & 25 తారీఖులలో జరుగు తున్న అంతర్జాతీయ అంతర్జాల సదస్సులో చేయనున్న పత్ర సమర్పణ కొరకు రూఎపొందించిన ప్రసంగ వ్యాస మిది. వందలాది వచన కవితలు రచించి, తెలుగు దళిత సామాజిక చైతన్యం కలిగించిన మహాకవి. 'కవి శిఖామణి' గారు. సమాకాలీన సమస్యలపై ఎట్లా స్పందించారో, సామాజిక మార్పు కొరకు ఎంతగా పరి తపించరో డా॥ అంబేడ్కర్ ఆశించిన సమ సమాజ స్థాపన కోసం ఏ విధంగా ఆరాట పడ్డారో... మొదలగు అంశాల్ని విశ్లేషించే ప్రత్యేక పరిశోధన ఈ వ్యాస రచన ముఖ్యోద్దేశం.

లక్ష్మింపేట మారణకాండ జరిగిన సందర్భంలో రచించిన కవిత - "నాకు తెలియకుండానే / నా మణికట్టు మీద / పచ్చబొట్టు పొడుస్తున్నారు. / కుల అకారణ కారణంగా నేను అవమానం పొందిన ప్రతిసారీ / నేల మీద పడి రక్తం సీసా భల్లున బద్దలైనట్లు / మానభంగానికి గురైన ప్రతిసారీ / నాకు తెలియకుండానే / నా మణికట్టు మీద / పచ్చబొట్టు పొడుస్తున్నారు / ..... / చంపబడింది. ఐదుగురు మాత్రమే / ఐదుగురు మృత వీరులు పంచ భూతాలై / సింహ పంచములై / ఐదు కోట్ల అక్షౌహిణుల సైన్యమై / పునరుద్భవిస్తారు". లక్ష్మిం పేటలో జరిగినదళితుల మారణకాండకు స్పందించిన కవి నిరసన ఇది. ఈ దేశంలో కులం పేరుతో అవ మానాలు, అవహేళనలు, అత్యాచారాలు, హత్యలు ... మొదలగునవి. వెయిలాది ఏండ్ల నుంచి నిత్యం జరుగు తూనే ఉన్నాయి. కారంచేడు నుంచి లక్ష్మింపేట దాకా ఈ ఆధునిక కాలంలో జరుగుతున్న హత్యాకాండకు నిరసనగా ఎనభైదశకంలో నుండి తెలుగులో దళితవాద కవిత్వం, ఒక ఉద్యమ రూపంలో వస్తున్నది. ఈ ఉద్యమంలో మొదటి వరుసలో ఉన్నారు 'కవి శిఖామణి' గారు. ఉండడమే కాదు ఉద్యమాన్ని ఉర్రూత లూగించారు.

'పలమనేను' అనే ప్రదేశానికి వెళ్ళినప్పుడు కవి శిఖా మణి గారు, ఆ ఊరును ఇలా వర్ణించారు - "ఎర్రని మట్టితో అలికి / ముగ్గులు తీర్చిదిద్దిన ఇంటిముందు / గడ్డిని మేస్తున్న / ఒంటరి కపిల గోవులా వుంది పలమనేరు". - సమకాలీనంగా కవిగారు చూసిన అన్ని అంశాలను కవత్వీకరించారు.

ఈ వ్యాసాన్ని విస్తరణ భీతితో కవి శిఖామణి గారి "పొద్దున్నే కవి గొంతు" అనే వచన కవితా సంపుటి

విశ్లేషణకు పరిమితమవుతున్నాను. ఇది 2015లో ప్రచురితమైంది. కవి సంధ్య గ్రంథమాల (యానాం - హైదరాబాద్) తరుపున 31 కవితలతో 108 పేజీలతో అచ్చయ్యింది.

2015 మే 16వ తారీఖు నాడు మహారాష్ట్రలోని షిరిడిలో నర్సింగ్ విద్యార్థి సాగర్ షెజ్వాల్‌ను డా॥. అంబేడ్కర్‌గీత్‌ను రింగు టోనుగా పెట్టుకున్నందుకు మనువాదులు చేసిన హత్యకు నిరసనగా 2015 జూన్ 05 తారీఖు రోజున రచించిన కవితా - 'భీమ్ పాటే పాడతాను' -

"అవును ముమ్మాటికీ నేను / భీమ్ పాటే పాడతాను - డెబ్భై రెండు మేళకర్త రాగాలలో / భూపాళ రాగం ఉం డొచ్చునేమో గానీ / భీమ్ పాలరాగం ఉండకపోవచ్చు / కానీ అది / మా జీవితాలను శ్రుతి చేసిన రాగం / ..... / భీమ్ పాట వినిపించిన / సెల్‌ఫోన్ రింగ్‌టోన్‌ను నొగలిగావు గానీ / దానిని నేల నేలంతా / పరివ్యాప్తం చేస్తూ మోసుకొచ్చిన / వాయువు గొంతు నొక్క గలవా ? / యంత్రమే అని భ్రమించి / ఫోనును నేల కేసి కొట్టి / కాలితో తొక్కి పట్టావు గాని / నువ్వు తొక్కింది / పగమీద ఉన్న నాగుబాము తోకనని / త్వరలో తెలుసుకుంటావు / భీమ్ ఎపాట / దళిత జాతి పాలిట మృత సంజీవని / భీమ్ పాట నిదురించే నా జాతిని మేలుకొలిపే / దళిత వైతాళిక గీతిక / కంచికచర్ల నుండి / లక్ష్మింపేట వరకూ దేశ వ్యాప్తంగా / నువ్వు హతమార్చిన మా మృత దేహాలను / శవ పరీక్షకు పంపించి చూడు / అందరిదీ ఒకటే / డి.ఎన్.ఎ. అంబేడ్కర్ అని వస్తుంది / ..... / అవును ముమ్మాటికీ నేను / 'భీమ్' పాటే పాడుతాను / ఒక్క గొంతుతో కాదు / కోటి గొంతుల దళిత కోరస్‌తో / నేను / భీమ్ పాటే / పాడతాను - "రింగ్ టోన్ కారణంగా మనిషిని హత్య చెయ్యడం జరుగుతున్న సమాజం ఏ యుగంలో ఉన్నదో అర్థం చేసుకోవచ్చు. అంటరానితనం నిషేధించిన దేశంలో అంటరానోళ్ళందరూ అవస్థల పాలవుతుంటే, పాలకులు మౌనంవహించడం దేశానికి అరిష్టం - 'భీమ్' పాట డా॥ అంబేడ్కర్ ఎపాట. ఆ పాటతోనే ఈ దేశ భవిష్యత్తూ, అభివృద్ధీ అని అందరూ గుర్తించాలి.

'దర్గాకు వెళ్లే దారిలో...' అనే కవితలో ఒక అనాథ గురించి రాశారు - "రోడ్డు గట్టుపై / చింకిరిగుడ్డల పేలికల మధ్య / నేనొక / సద్యోగర్భ / అనాథ శిశువునై / పుట్టినప్పుడు - / ద్రవీభూత స్థితిలో ఉన్న / సూర్యుడు / రాత్రిని కౌగిలించుకోడానికి / పడమటి కొండల / చీకటి రహదారుల్లోకి వెళ్లాడు / రోడ్డు గట్టు మీది / రాక్షస అకృత్యాలను తట్టుకోలేక / నాకు జన్మనిచ్చి / మా అమ్మ / స్వర్గంలో ఉన్న మా నాన్నను / కలుసుకోడానికి వెళ్లింది - / చీకటి మరకలు పడ్డ / మాసిన మాసికల చీరను ఉతుక్కోవడానికి" - అనాథతో మమేకమై వారి గొంతుగా కవిత్వమయ్యారు. 'కవి శిఖామణి' గారు.

ఖమ్మం కవి మిత్రులు సీతారాం, రమణమూర్తి, పంతంగిల తల్లుల వరుస మరణ వార్తలు విని, 'మృత శిశిరం' పేర 'కవి శిఖామణి' గారు రచించిన కవిత - "ఆకులు రాలుకోవడానికి / చెట్లకు శిశిర రుతువు ఉన్నట్టు / మనుషుల మరణాలకూ / ఒక రుతువు ఉన్నట్టుంది కాబోలు. / ఆకులు రాలిపోయినంత అల వోకగా / అమ్మలు రాలిపోతే ఎలా ? / చూడబోతే / ఇది తల్లుల మరణ రుతువులా వుంది. / ..... / ఈ తల్లి విత్తనాలు / ఇక మళ్ళీ మళ్ళీ తిరిగి మొలకెత్తవుగాక మొలకెత్తవు / ..... / ఈ తల్లులు ఎంతగా కళవళ చెందారో / ..... / ఇప్పుడు / అమ్మలేని యిల్లు / ధాన్యపు రాశిని బండ్లమీద తోలుకెళ్లిపోగా / బోసిపోయిన పంట కళ్లంలా ఉంది" - తల్లి లేని యిల్లు ఎలా వుంటుందో ఎంతో చక్కగా వర్ణించారు. ముగ్గురు మిత్రుల తల్లులు వరుసగా మరణించడాన్ని, ఇది తల్లుల మరణ రుతువుగా చెప్పారు. కవి కల్పించే లేదా సృష్టించే పదబంధాలకు చక్కని ఉదాహరణ - మరణ రుతువు.

గుజరాత్‌కు చెందిన ఉర్దూకవి జయంత్ పార్కర్‌ను కలిసిన జ్ఞాపకాలతో ... కవి శిఖామణి గారు 'ఒక నెలవంక

కవి' అనే శీర్షికతో రచించిన కవిత - "మొన్న భిలాయిలో / కవి మిత్రుడొకడు కలిసాడు / చూడ్డానికి చాలా సాదా సీదాగా ఉన్నా / చుక్కల్లో నెలవంకలా / కవి సమూహం మధ్య / విలక్షణంగా కనిపించాడు / ..... / చూడ్డానికి మామూలు ఎత్తులోనే ఉన్నాడు / అతని చిన్న చిన్న పద్యాలకు మల్లే / నాడు వేదాలు తాటాకుల మీద రాసారు / నేడు రాజ్యహింసను మా దేహాల మీదే లభిస్తున్నారన్న / అతని కవితా పంక్తుల్లానే / అతని ఊహలు అత్యంత పొడగరివి / ..... / మొన్న భిలాయిలో / కవి మిత్రడొకరు కలిసాడు / ..... / లోపల అంతరంగంలో / మా తల్లి వేరు ఒక్కటే అని గమనించాం / అప్పుడనిపించింది / కవిత్వానికి భాష ఒక ఉపరితల ఆచ్ఛాదన మాత్రమే అని / కవుల భాష లిపితోనూ స్వరంతోనూ / ప్రమేయంలేని విశ్వభాష అని / ..... / కావ్య జగత్తులో / సంభాషిస్తూనే ఉన్నాం కావ్య పరిభాషలో / కవులు దేశజనుల / మానస సస్యాలను పండించే జీవనములు / కవులు భూగోలపు విశ్వనరులు ..." - భిలాయి అనే ఊర్లో కవి సమ్మేళన సందర్భంలో యితర భాష కవిని కలిసిన అను భవాన్ని 'కవి శిఖామణి' చక్కగా వర్ణించారు.

పులస చేప స్వగతాన్ని కవి శిఖామణి కవిత్వీకరించిన తీరు అద్భుతం. "నా పేరు పులస / నా వూరు కోస్తాంధ్ర / నా తల్లి గోదావరి / పువ్వుల్లో పారిజాతంలా / జలపుష్పాల్లో మేటి పుష్పాన్ని / నా పేరు పులస / పర్వతాల్లో హిమాలయంలా / చేపల్లో రారాజును / నా రాజ్యం నోరూరించే షడ్రుచుల సరోవరం / నా సారం రససిద్ధాంతానికెక్కని దశమ రసం / అందానికి నిండు చందమామను / నా వొంటి మీద మిల మిలల పొలుసులు / తళ తళ లాడే వెండి రూపాయి బిళ్లలు / ..... / నా బతుకంతా ఎదురీతే / ఉరకలెత్తే వరద గోదావరి / సముద్రంలో కలిసే సంగమ స్థలి / నా పోరాట రణస్థలి / చాలామంది నాలో 'అమ్మో ముల్లులెక్కువ' అంటారు / మీ శరీరంలో ఎముకలున్నట్లు నా వొంట్లో ముల్లులుంటే తప్పేంటి / అయినా మీ మనసుల్లో ఉన్న / వవక్షల విద్వేషపు ముళ్ల కంటే / నా ముళ్లులేం ప్రమాదకరం కాదు. / ఎప్పుడైనా సన్నని నూలు దారం లాంటి / ఏ పొట్ట ముళ్ళో గొంతుకు అడ్డం పడితే / గుప్పెడు తెల్లన్నం ముద్ద చేసుకొని అమాంతం మింగేయండి / ముద్దతో పాటు ముళ్ళు / గుట్టు చప్పుడు కాకుండా పొట్టలోకి జారిపోతుంది / ..... / నెలలు నిండినా కాన్పురాని వాడ కోడలికి / పులసలొచ్చాయట అన్నమాట చెవిన పడితే గాని / పురిటి నొప్పులు మొదలవ్వలేదు. / రాత్రికి వేడి వేడి పులస కూర పులుసుతో అన్నం తిని / తెల్లార గట్ల దబ్బపండు లాంటి మగబిడ్డకు జన్మనిచ్చింది / ..... / నా జీవితం అంతమై పోతుందన్న బాధకంటే / లక్షలాది జనం రానిక్యపు నోళ్లలో / ఒక్క లాలాజల బిందువునై ఉదయిస్తున్నందుకు సంతోషిస్తాను". ఒంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా వారి ఉగాది రచనల పోటీలో ప్రథమ బహుమతి పొందిన కవిత. ఈ 'పులస చేప స్వగతం'. ఒక చేప తన గురించి తాను చెప్పడం... అందులో అనేకానేక విషయాలు తడుమడం ఆశ్చర్యంగా ఉంది. పులస చేపను తినడం, పులస దొరికే ప్రదేశంలో కవి గారు జీవించడం... ఇవన్నీ అనుభవంతో ఉన్నవి కాబట్టే, ఈ కవిత సమాకాలీనతను సంతరించుకున్నది.

'కవి శిఖామణి' గారి ఆప్తమిత్రుడు, పొగాకు వ్యాపారి అబ్బిరెడ్డి వెర్రియ్య గారి గురించి రచించిన కవిత - 'రహస్యం' - ఈ కవితలో పొగాకుకు, వెర్రియ్యకు గల అనుబంధాన్ని కవిగారు వర్ణించారు - "పొద్దువాలు తుందనగా పంచన కూచున్న తాత / బొద్లోని పొగాకు కట్టను బయటకు తీసి / ముక్కుకు ఆనించి / ఒకసారి గట్టిగా వాసన పీల్చి / ఘాటు బాగుందన్నట్టు తల పంకించాడు. / ..... / మూడు నిలువు మడతల మీద / రెండు అడ్డ చుట్టలు చుట్టిన కట్టను విప్పదీసాడు. / కట్ట కట్టి ఎన్నాళ్లయిందో ఏ మోగానీ / కట్టు విప్పదీసినా / ముసలివాని మోకాళ్లలా ముడుచుకునే వున్నాయి

ఆకులు. / ఇక లాభం లేదనుకుని / కాడ నుండి కొనదాకా / వాటిని మృదువుగా సవరించాడు / ..... / ముడుచుకున్నప్పుడు / అది చిన్న ద్వీపంలా వుంది కానీ / విస్తరించాక అది ఉపఖండమంత వైశాల్యం అయింది. / ..... / అంతి చూసాక / తాత చుట్టింది కేవలం చుట్టనే కాదని / కవిత్వం చుట్టడానికి కూడా / రహస్యం ఇదే అని బోధపడింది." - ఈ కవితలో 'తాత' అనే పాత్ర పొగాకును చుట్టగా చుట్టడంను సహజంగా వర్ణిస్తూ, కవిత్వం కూడా అలాగే చుట్టవచ్చునని కవి కొత్త రహస్య సూత్రాన్ని చెప్పడం అద్భుతంగా ఉన్నది. సాధారణ వస్తువుకు సాహిత్య రూపం ఇక్కడ విశేషం.

దేవిప్రియ గారు 'కవి శిఖామణి' కవిత్వం గురించి - 'శిఖామణి కవిత్వం అరటి ఆకులా, నెమలీకలా, గోదావరి తేట నీటిలా సున్నితంగా సుకుమారంగా ఉంటుంది' అని అంటారు.

డా॥. యు.ఏ. నరసింహమూర్తి గారు 'సాహిత్య ప్రస్థానం' మాస పత్రిక అక్టోబరు 2008 సంచికలో కవి శిఖామణిగారి కవిత్వాన్ని గురించి చెప్పిన మాటలు - 'శిఖా మణికి సాధారణ వచన రచన కవితా శిల్పం బాగా పట్టుబడింది. అతి నవ్యమైన అభివ్యక్తి నైపుణ్యం, అత్యంత సహజమైన వస్తు విస్తరణ శిఖామణికి తెలుగు కవులలో స్థానాన్ని కల్పించాయి. ఈ చాతుర్యంలో ఆధునిక కవిత్వంలో అతని సరసన నిలువ గల కవులను వేళ్ల మీద లెక్క పెట్టవచ్చు.

ఈ విధంగా 'కవి శిఖామణి' గారు తెలుగు వచన కవితా జగత్తులో చెరగని స్థానాన్ని ఏర్పరచుకున్నారు. కవిత్వంలో రెండు పి.హెచ్.డి.లు చేసిన వీరు, 'కవి సంధ్య' పేరుతో ద్వైమాస పత్రికను నడుపుతున్నారు. తెలుగు యూనివర్సిటీ ప్రొఫెసర్‌గా రిటైరైన వీరు, యానాం కేంద్రంగా కవిత్వోద్యమాన్ని నడుపుతున్నారు. ఎందరో నవయువ కవులకు కవన స్ఫూర్తిని, దీప్తిని కలుగ జేస్తున్నారు. సమకాలనీ సమస్యలను సామాజిక కోణంలో కైగడుతూ, అబ్బురపరిచే కవిత్వం రచిస్తూ, రచింపజేస్తూ, తెలుగు కవిత్వాన్ని సుసంపన్నం చేస్తున్నారు. వీరి కలం నుండి మరిన్ని మంచి కవితలు రావాలని, వస్తాయని మనం ఆశించవచ్చు.

ఆధార గ్రంథాలు :

1. పొద్దున్నే కవి గొంతు - 2015
2. సాహిత్య ప్రస్థానం - మాస పత్రిక - అక్టోబర్ 2008 సంచిక

⌘⌘⌘

BHAVAVEENA
Vol. 17, Issue. 8, August 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

స్వేచ్ఛనవల పాత్రలు – సమకాలీనత

- కవెడపు లలిత, తెలుగు ఉపన్యాసకురాలు, సెయింట్ జోసెఫ్స్ డిగ్రీ కళాశాల, కర్నూలు.

ఆకాశంలో సగం అని చెబుతున్నా స్త్రీని అబల అంటూ సమాజం వివక్ష చూపుతూనే ఉందన్న విషయం నిష్ఠుర సత్యం , ఈ సత్యాన్ని నేర్పుగా ఆవిష్కరించింది - "స్వేచ్ఛ" నవల.

మధ్యతరగతి కుటుంబాలలోని స్త్రీ పాత్రలకు అద్దం పట్టింది ఈ నవల, వాళ్ల భావనలనూ, అభిప్రాయాలనూ ఉద్వేగాలనూ కోరికలనూ నిస్సహాయతనూ సహజమైన రీతిలో వెలుగులోకి తెచ్చింది - స్వేచ్ఛ , తమ ఉద్వేగాల అభివ్యక్తి కోసం స్వేచ్ఛ ఎంత అవసరమో, ఎందుకు అవ సరమో, స్వేచ్ఛ అంటే తమ అవసరాలను ఎలా గుర్తిం చడమో కూడా చర్చించింది. స్వేచ్ఛ అంటే విచ్చల విడితనం కాదనీ " సంక్షోభ దశను దాటి జీవితపు సంఘర్షణలో ఆనందాన్ని పొందటమ" ని తెలియ జెప్పింది.

ఈ నవల ప్రస్తుత సమాజంలోని మహిళలకు చైతన్యాన్ని ప్రసాదించింది ప్రస్తుత సమాజంలోని మహిళల మనోభావాలను బలంగా ప్రస్ఫుటంగా వెల్లడయ్యేలా ఉన్న ఈ నవల సమకాలీన సమాజంలోని వివధ రకాల స్త్రీలనూ పురుషులనూ వారి మనస్తత్వాలనూ యథా తథంగా చిత్రీకరించింది.

కేవలం స్త్రీలు ఈ నవలలోని పాత్రలలో తమను తాము చూసుకోడమే కాకుండా ఈ నవలలోని పురుష పాత్రలు తమ వాస్తవ జీవితంలో ఎవరో, తాము వాళ్ల అణచివేతకు పరోక్షంగా, సూక్ష్మంగా ఎలా గురవుతున్నారో కూడా అర్థం చేసుకునే జ్ఞానాన్ని వాస్తవ సమాజంలో పురుషులకు కూడా సమకూర్చింది. కాబట్టేనేమో సమ కాలీన స్త్రీలోకంలో ఈ నవల విశేష ప్రాచుర్యం పొందింది. కేవలం స్త్రీలకే పరిమితం కాకుండా స్రీవాద భావాలను సమర్థించే విభేదించే వ్యక్తులుగా పైకి ప్రకటిస్తున్నా అంతరాల్లో వైముఖ్యం చూపే పురుషుల్లోనూ చర్చ నీయాంశం అయింది.అంటే కేవలం స్త్రీలే కాకుండా, పురుషులు కూడా ఈ నవలలోని పాత్రలతో తమను తాము గుర్తించుకొని(ఐడెంటిఫై చేసుకొని) తమలో కూడా స్త్రీ పట్ల వివక్ష ఎలా దాగుందో తెలియజెప్పేందుకు ఆస్కారమిచ్చింది. ప్రతి కుటుంబానికీ అంతో ఇంతో అన్వయించేలాగా నవలను రాశారు కాబట్టి ఈ నవలలో సమకాలీనత ఉందని అందరూ ఆమోదించాల్సిన విషయం.

నవలా నాయకురాలు అరుణ , ఆమె మేనత్త కనకమ్మ పాత్రలను రచయిత్రి ఎంత నేర్పుగా చిత్రించారంటే ప్రతి స్త్రీ తన జీవితంలోకి తొంగి చూసుకుంటే తమ ఇంట్లోనూ, అలాంటి మనస్తత్వం ఉన్న ఓ బామ్మో, అత్తో, చిన్నమ్మో ఉన్నట్టు గుర్తించి తీరుతుంది.

కనకమ్మ :

అరుణ మేనత్త కనకమ్మకు అరుణ ఏం చేసినా అందులో తప్పే కన్పిస్తుంటుంది.డాబా మీద ఎండబెట్టిన వడియాలు తెస్తూ యథాలాపంగా బయిటికి చూసిన వీధిలోకి చూసినందుకు తిట్లు తప్పవు.అరుణ కొంచం నెమ్మెదిగా నడుస్తే చీమ నడకలంటూ అధిక్షేపిస్తూ చురుగ్గా ఉండాలంటుంది.ఒకవేళ అరుణ మాత్రం చురుగ్గా ఉన్న ఆడపిల్లకు నిదానం అవసరం అంటూ మరో చురకవేస్తుంది. కనకమ్మ చెప్పదలచుకున్న విషయాలను చెప్పేస్తుంది. "అయినా నాకెందుకులే - తలచెడిన ముండను" చివరిగా అంటుంది. సమాజంలో ఇలాంటి వ్యక్తులను ఎంతోమందిని చూస్తాం.తమ మాట చెల్లుబాటు కావాలని చూస్తారు.అడుగడుగునా అత్త కనకమ్మ అనే మాటలు భరించలేని అరుణ ఓరోజు "అబ్బా అసలీ అత్త మనింట్లో ఎందుకుంటుంది? అని ప్రశ్నిస్తుంది

అంతే అరుణ నాన్న గారు రాగానే కనకమ్మ ఆయనకు అంటించివేసింది. ఆయన వెనుకాముందు చూడకుండా అరుణను కొట్టడం మొదలుపెట్టాడు అప్పుడు కనకమ్మ జోక్యం చేసుకొని ఒకవేళ అరుణకి ఏమైన అయితే అత్తే పొట్టనపెట్టుకుంది అని అంటారు. ఎవర్నని ఎమిలాభం నాఖర్మిలా కాలింది అని మాట్లాడుతుంది.

ఒకవేళ అరుణ తండ్రి కొట్టకుండా ఉండాలని నిజంగా కోరుకునేదే అయితే కనకమ్మ ఈ విషయాన్ని చెప్పేది కాదు. అరుణ తండ్రి కొట్టడమే కావాలి. అందుకే చాడీలు చెప్పి రెచ్చగొడుతుంది. కొట్టడం పూర్తయ్యాక ఏదో తానే ఆపినట్లు తాను దయగల వ్యక్తి అయినట్లు పైమాటలు అంటుంది. ఇలా అరుణ చదువు విషయంలో కూడా అడ్డుపడుతుంది. చదువుకున్న ఏ ఆడది బాగుపడలేదని తేల్చిచెబుతుంది. తమకు దక్కని సు:ఖం మరొకరికి దక్కకూడదని ఇలాంటి స్త్రీలు అడుగడుగున కనిపిస్తుంటారు. క్రూరత్వం ఉన్న మనుషులు సమకాలీన ప్రపంచంలో కోకొల్లలు.

సీతమ్మ :

అరుణ వాల్లమ్మ సీతమ్మ ఇలాంటి సాధ్వీమనులకు స్త్రీ ప్రపంచంలో కొదవేలేదు. సీతమ్మలాంటి వాళ్ళకు ఎలాంటి వ్యక్తిత్వం ఉండదు. వాళ్ళకు అసలు అభి ప్రాయాలే ఉండవు. అరుణ మేనత్త కనకమ్మ అరుణను బాధ పెడుతున్న తన కూతుర్ని వెనకేసుకోలేనంత అశక్తు రాలు కనకమ్మని బతిమాలుతుంది. అరుణ తన స్నేహితు రాలు ఉమతో సినిమాకెళ్లాలనుకుని తల్లితో చెబుతుంది. అప్పుడు సీతమ్మ నాన్నతో చెప్పావా? అని అడుగుతుంది. సొంతంగా నిర్ణయాలు తీసుకునే అధికారం సీతమ్మకు లేదు. అంతలోనే మేనత్త కనకమ్మ ఎత్తిపొడుపు మాట అంటుంది. ఆమె నిందను ఖండించలేక సీతమ్మ కన్నీరు పెట్టుకుంటుంది. ఇలాంటి ఆడపడుచులు మధ్య తరగతి కుటుంబాలలో ఎందరో సీతమ్మలో కూడా అందరుం టారు కాబోలు.

కమలమ్మ :

అరుణ భర్తగారి అమ్మగారు అంటే అరుణకు అత్తగారు. ఇలాంటి వాళ్ళుకూడా సమాజంలో లేకపోలేదు అరుణ అత్తగారు కమలమ్మ మంచితనం సాధుస్వభావం లాంటి మంచి గుణాలున్న మూర్తీభవించిన వ్యక్తి ఎన్నోసార్లు అరుణ, ప్రకాశం గొడవపడ్డపుడల్లా ఆమె అరుణను ఓదార్చేది. ఇంటి పనులలో సహాయపడుతూ ఉండేది. ఒకసారి అరుణ మీటింగ్‌కు వెళ్లడం ప్రకాశానిక ఇష్టముండదు. పాపకు ఆరోగ్యం చెడిపోయినపుడు. ఆమె మీటింగ్‌కు వెళ్ళడమే పాపకు అనారోగ్యకారణమైనట్లు వాదించి అరుణతో గొడవ పడుతాడు ప్రకాశం.అప్పుడు "నీకేమైన దెయ్యంపట్టిందా?" ఉత్తపుణ్యానికే అరుణను ఎడ్పించావు ఏమైందిపుడు? పాప శుభ్రంగానే ఉంటే కొడుకుని కోపడుతుంది.అరుణ అన్నం తినకపోతే నువ్వు తినకపోతే నేను తినను అంటుంది. వాడికి మీటింగ్ సంగతి తెలువకా ఆపిల్ల బాధచూసి మతిపోయిఅట్లా మాట్లాడినాడులే నువ్వేం పట్టించుకోకు పాపను ఇన్నాళ్లు నువ్వుచూడక వాడు చూశాడా అంటూ ఎన్నో సంఘటనల్లో అరుణను ఓదారుస్తుంది. అరుణ స్వయంగా ఆమె మంచితనాన్ని ఒప్పుకుంటుంది. " ఔను . నిజమే! అత్తయ్య దొరకటం నా అదృష్టమే" అని అంటుంది.

ముసలితనంలో తల్లులను కొడుకులు కోడళ్లు ఎలా నిరాదారనకు గురిచేస్తారో కూడా కమలమ్మ పాత్ర చేత రచయిత్రి చెప్పిస్తుంది. చేయించుకున్నంత కాలం పని చేయించుకుని, జీవితపు చరమాంకంలో నిస్సహాయులైన స్త్రీలను ఎలాకోడళ్లు విస్మరిస్తారో కూడా రచయిత్రి తెలిపారు. " నడిచినన్నాళ్లు ఇలా, మీరు పంపేస్తే ఎక్కడో ఇంత ఉడకేసుకు తింటానని అంటుంది కమలమ్మ, ఆమె స్వావంబలన సామర్థ్యాన్ని, ఒకరిపై ఆధారపడ కుండా కూడా బతకగలనన్న ధైర్యాన్ని ఆమెలో రచయిత్రి చూపిం చారు.

ఒకసారి పాపకు డాన్స్ నేర్పించాలని అరుణ అంటే, డాన్స్ అయితే పెద్దయ్యాక సాధన చేయటం కష్టం.

సంగీతం నేర్పితే సాధనకు ఎల్లప్పుడూ అవకాశం ఉంటుందని చెబుతుంది కమలమ్మ .ఆమె విశ్లేషణకూ, దూరదృష్టికీ అరుణ ఆశ్చర్యపడుతుంది కూడా.

ఎన్నో పాత్రలనూ, మంచితనాలనూ, ఒక పాత్రలో నింపి చూపారు. ఇలాంటి వాళ్లు తక్కువే అయినా సమకాలీన ప్రపంచంలో వీళ్ల ఉనికి నిర్వివాదాంశం.ఈ పాత్ర చిత్రణ ద్వారా సమాజంలోని సహృదయులను కూడా చూపుతారు రచయిత్రి. ఈ పాత్ర కూడా కొందరి సమకాలీన స్త్రీ మూర్తులకు ప్రాతినిధ్యం వహిస్తుంది.

తోటి లెక్చరర్లు :

అరుణతోటి ఆడలెక్చరర్ల మనస్తత్వాలను రచయిత్రి వివరిస్తారు. మీటింగ్‌కు అరుణ క్రమం తప్పకుండా వెళ్లడం సాటి లెక్చరర్లు ఎలాంటి అబిప్రాయాన్ని కలిగి స్తుందో రచయిత్రి వివరించారు.

వరలక్ష్మీ అనే లెక్చరర్ అరుణతో "మీరు ప్రతివారం మీటింగ్‌కు వెళ్తున్నారటగా" అని అడుగుతుంది.

"మీరు రావడం లేదెందుకు? అని అరుణ ప్రశ్నిచే తనకు కుదురదనీ, తాను వస్తే ఇంట్లో వాళ్ల ఆయనా, పిల్లలూ చిందులు , శివాలెత్తుతురాని చెబుతుంది. మరో లెక్చరర్ సుగుణ వ్యంగ్యంగా వ్యాఖ్యానాలు చేస్తుంది. విమలకుమారి చందా మటుకు ఇస్తాగానీ మీటింగులకు హాజరు కాలేనంటుంది. నిజంగా తమకోసం పనిచేస్తున్న అరుణను నిరసిస్తుంటారు.వ్యంగ్యంగా అధిక్షేపిస్తుంటారు ఆమె తోటి ఉద్యోగినులు.వాళ్ల అభప్రాయంలో మంచి వాళ్లు ఎవరో, వాళ్లు ఎలా ఉండాలో వ్యక్తపరుస్తారు.

"ప్రభావతిగారు నిజంగా గొప్ప మనిషండీ. అంత చది వినా ఎంత వినయమో! ఇంటి దగ్గర దించిన తల యూనివర్శిటీ డిపార్టుమెంటుకి వెళ్లిన తర్వాతే ఎత్తు తుంది. అదైనా ఏదన్నా పనుంటేనే. ఇంకోరి జోలి పట్టించు కోదు తన పనేమో తానేమో, మాట కూడా ఎంతో నిదానం".

ఇది ప్రభావతి మంచిదని చెప్పటం కోసం చెప్తున్నారో లేక అలా ఉండని కథానాయకురాలిని " నువ్వు చెడ్డదానివి సుమా" అనే భావం ఆమెలో కలిగించెందుకు వీళ్లు మట్లాడుతున్నారో అర్థం కాదు. కాని అంతరంగంలో మాత్రం వాళ్ల ఉద్దేశం - అరుణను దెప్పిపొడవడమే! ఒక వేళ తాము మీటింగులకు హాజరుకావడం లేదనే అపరాధ భావాన్ని అధిగమించి తమ తప్పులను, ఒప్పులుగా, ఎదుటివారి ఒప్పులను తప్పులుగా నిరూపిం చేందుకు కూడా ఇలా మాట్లాడి ఉండవచ్చు. ఇలాంటి వ్యక్తులు ప్రపంచంలో వెతక్కుండానే దొరుకుతారు. "ఆడవాళ్లే తనగురించి అంత చులకనగా మాట్లాడితే మగవాళ్లు మనసుల్లో యేమనుకుంటున్నారో " అని అరుణ ఒక దశలో ఆలోచిస్తుంది. చాలా మంది స్త్రీలు తమ కోసం పోరాడేవాళ్లను ఎలా చులకన చేస్తున్నారో తెలిపేం దుకు ఈ పాత్రలను సృష్టించారు.

ఇలాంటి స్త్రీలు ప్రపంచంలో లెక్కకు మిక్కిలి ఉన్నారు. ఈ పాత్రలు కూడా సమకాలీన స్త్రీ ప్రపంచాన్ని ప్రతిబింబిస్తాయి.

అరుణ :

ఇక ప్రధానపాత్ర అరుణ- చిన్నప్పటినుంచీ స్త్రీ సహజమైన రీతిలో వికాసం పొందకుండా ఎన్ని ప్రతి బంధకాల నడుమ తన మనుగడ సాగించాల్సి వస్తుందో ఈమె పాత్ర తెలుపుతుంది. ఈ పాత్రద్వారా నేటి సమాజంలోని ఎన్నో ప్రతిబంధకాలనూ నిరోధాలనూ రచయిత్రి ఆవిష్కరించారు. ఉదాహరణకు సినిమాకు వెళ్లాలన్నా, తన కంటూ కొంత డబ్బు ఉంచుకొని తన అవసరాలకు ఖర్చు చేసుకోవాలన్నా స్త్రీకి స్వేచ్ఛలేని వైనాన్ని తెలుపుతారు. ఇది నిత్యం అన్ని మధ్యతరతి కుటుంబాల్లో ఉన్న కథే. ఈ నవల చదివిన ప్రతి స్త్రీ నవలలోని సంఘటనలలో కనీసం ఒక సంఘటననైనా తన జీవితం లోనూ సంభవించిన సంఘటనగా భావిస్తుందనుకోడంలో అతిశయోక్తి ఏమీ లేదు.

ప్రకాశం :

అరుణ భర్త ప్రకాశంకు మీటింగుకు వెళ్లడం కాని

ఒక మంచిపనికి చందా ఇవ్వడం కాని లోకోద్ధరణకు ఆసక్తి చూపడానికి గాని ప్రకాశం ఇష్టపడడు. అరుణ ఒకసారి ఊరేగింపులో పాల్గొన్న ఫోటో పేపర్లో వస్తే తన భార్య ఫోటో పబ్లిక్‌గా ప్రచురితమైనందుకు ప్రకాశం కోపడు తాడు. ఒక్కమాటలో చెప్పాలంటే అరుణకంటూ ఒక సామాజిక జీవనం ఉంటనాన్ని అతడు వ్యతిరేకిస్తాడని అరణకు అర్థమవుతున్నది. సమాకాలీన ప్రపంచంలో ఇలాంటి పురుషులు కానవస్తారు.

జానకిరామయ్య :

అరుణ తండ్రి జానకిరామయ్యకు అక్క కనకమ్మ అయిదెకరాల మాగాణి మీద ఆశ. దాని కోసం ఆమెను సంతోష పెడతుంటాడు. "ఆవిడ పొలం మీద ఆశతో జానకిరామయ్య ఆమె మాట జవదాటే వాడుకాదు. సీతమ్మను నొరెత్తనిచ్చేవాడు కాదు". " అత్త ఏమన్నా సరే తల్లిదండ్రి నోరుమూసుకు పడుండేది ఇందుకేనని తెలుసుకోవడం అరుణకి కష్టమనిపించినా అది వాస్తవం". పై వాక్యాలు చదివితే బంధువులకు వారసులు లేకపోతే ఆ ఆస్తికోసం ప్రలోభపడే వాళ్లకు జానకిరామయ్య ప్రతినిధి. కనకమ్మ అరుణ మీద ఫిర్యాదు చేయగానే ఎక్కడ తగుల్తుందో కూడా చూడకుండా బాదేస్తాడు. బహుశా అరుణ మీద కోపమే పూర్తి కాకపోవచ్చు. తన అక్కను సంతృప్తి పరిచేందుకు అరుణను కోడతాడు. తన అహాన్ని సంతృప్తి పరుస్తున్న తనకు ఓ నాటికైనా ఆస్తి ఇవ్వకపోతుందా అన్న ఆశ. ఇలాంటి వాళ్లు ప్రపంచంలో ఎంతోమంది.

గోపాలరావు :

అరుణ అన్నయ గోపాలరావు వయసులో ఉన్న అమ్మాయిల తాలూకు అన్నయ్యల మనస్తత్వాన్ని గోపాల రావు పాత్ర ద్వారా చూపిస్తారు రచయిత్రి. వయసులో ఉన్న అమ్మాయి అన్నలూ, తమ్ముళ్లు ఆ అమ్మాయి రోడ్డు మీద అందరి కళ్లలో పడటానికి ఇష్టపడరు. తామెలా వేరే అమ్మాయిలను వేధిస్తారో తమచెల్లెళ్లు, అక్కలూ అలాంటి వేధింపులకు గురికాగూడదని ఆశిస్తారు. అందుకే ఈ అన్నలు ఇలా ప్రవర్తిస్తుంటారు. ఈ వైఖరిని అరుణ సినిమాకని యూనివర్శిటీకి వెళ్లివచ్చినప్పుడు "మన భయం సంగతి దానికెందుకు నాన్నా! దాని సరదాలు దానికి కావాలి. మనం భయపడ్డా, వీధిలో తలొంచు కోవాల్సి వచ్చినా దానికేం లెక్కలేదు" అనే వాక్యం ద్వారా తెలియజేస్తారు. రచయిత్రి. ఈ పురష పుంగవుల మనస్త త్వాన్ని అనుణ చేత ఒకే వాక్యంలో చెప్పిస్తారు రచయిత్రి. "ఈ ఇంట్లో వాళ్లంతా నన్నూ నా పవిత్రతనూ కాపాడ్డమే ధ్యేయంగా పెట్టుకున్నారు"

నమాకాలీన వ్యవస్థలోని తండ్రులూ అన్నల స్వభావాన్ని తెలియజేసేందుకు ఈ వాక్యం చాలు.

కేశవరావు :

లోకోపకారం కోసం పోరాడే వ్యక్తిగా కేశవరావు పాత్రను చిత్రీకరిస్తారు. కానీ వీళ్ల అసలు నైజం ఎలా ఉంటుందో కూడా చెప్పారు. కేశవరావు లెక్చరర్లందరికీ పూర్తి జీతం రావాలనే సదుద్దేశంతో అసోసియేషన్ ఏర్పాటు చేస్తాడు. మీటింగులు నిర్వహిస్తాడు. సమ్మె చేయించి మొత్తం మీద లెక్చరర్లందరికి పూర్తి జీతం వచ్చేలా చేయడంలో క్రియాశిల పాత్ర వహిస్తాడు.

సమాజంలో జరిగే అన్యాయాలను గురించి రాసి ప్రచు రించడం కోసం వెలుగు అనే ఓ పత్రిక నడుపుతాడు. ఆ పత్రికలో వ్యాసాలు రాసేందుకూ, ఇంటర్వ్యూలు చేసేం దుకూ. ఇలాంటి పనుల్లో సహాయపడేందుకు అరుణ సహాయం తీసుకుంటాడు.అతని ఆదర్శభావాలను అరుణ అభిమానిస్తుంది. తన ఇంట్లో చికాగ్గా ఉన్నప్పుడు అంతటి ఆదర్శమూర్తి ఇంట్లో ఉండే వాతావరణంలో కాసేపు సేదరీరుదారమని అనుకొని వాళ్లింటికి తీసుకెళ్లమని అడుగుతుంది అరుణ. కేశవరావు " అలాగే" అంటాడు. కానీ తీసుకెళ్లడు. మళ్లీ అరుణే గుర్తుచేస్తే అప్పుడు తప్పక తీసుకెళ్తాడు.

అక్కడ ఇంట్లో తన భార్యను కనీసం పేరుతోనైనా పిలవడనీ, ఇదిగో అంటూ సంబోధిస్తాడని తెలుసుకొని

అరుణ ఆశ్చర్యపడుతుంది. ఆయన నడిపే పత్రిక గురించి ఆమెకేమాత్రం తెలియదని గ్రహించి నమ్మలేకపోతుంది. ఇంట్లో కేశవరావు నిరంకుశత్వం తెలిపే ఈ వాక్యం గమనిస్తే.... ''ఆయన కాగితాలూ, పుస్తకాలూ అన్నీ బీరువాలో పెట్టి తాళం వేస్తారు''. ప్రపంచానికి ''వెలుగు'' చూపాలని భావించి పత్రిక నడిపే కేశవరావు ఆతనింట్లో తన భార్యకు విజ్ఞానాన్ని పంచుతున్న తీరిది.ఇది కేశవరావు ఒక్కడి విషయమే కాదు.అసలు ప్రపంచంలో కేశవరావులు ఎక్కడపడితే అక్కడ ఉంటారు. అసలు మేధావిమన్యుల ప్రపంచంలో కేశవరావులే ఎక్కువ.

అరుణ వేశ్యల ఇంటర్వ్యూలు తీసుకోవడం విషయంలో తన భర్తతో గొడవ అయిందని కేశవరావుకు చెప్తే.. పత్రిక మానేసి భర్త భావాలకు అనుగుణంగా నడుచుకొమ్మనీ, ఆయనకు కోపం రాకుండా చూసుకొమ్మని సలహా ఇస్తాడు కృష్ణమూర్తి అనే మరో మేధావి. ''ఈ చిన్న పత్రిక కొసం మీవారితో తగాదా పడటం, మీ జీవితమంతా పాడవటం మాకు బాధగా ఉంటుంది''. అని రమణారావు అంటాడు. '' పైగా పత్రికకి కూడా అది మంచిది కాదు. పత్రిక ఒక సంసారాన్ని పాడు చేసిందనీ చెడ్డపేరు రావటం కూడా బాగుండదు చూడండి'' అంటాడు కేశవరావు.

ఈ వ్యాసాలు ఆ మేధావులు తమ పత్రికను ఎంత ''కమిట్‌మెంట్'' తో నడుపుతున్నారో చెప్పక చెబుతాయి. అరుణ వీళ్లనుద్దేశించి''.. మీరు ఎన్ని పత్రికలు నడిపినా నా దృష్టిలో అల్పులే.మీతో కలిసి పనిచేసే మనిషికి ఒక సమస్యరాగానే భయపడిపోతారు. మీరు సమాజంలో సమస్యల గురించి ఏం చెయ్యగలుగుతారు?'' అంటూ ప్రశ్నిస్తుంది. ఈ ప్రశ్న కేశవరావుకో, కృష్ణమూర్తికో, రమణారావుకో, సత్యానికో కాదు. సమకాలీన ప్రపంచంలోని అదర్శమన్యులందరికి. ఈ విధంగా స్వేచ్ఛ నవలలో ప్రతిపాత్రా సమాజంలోని ఒక్కో వర్గానికీ ప్రతినిధి కాబట్టి సమాకాలీన వ్యవస్థకూ సమకాలీన మధ్యతరగతి భావన విధానానికి అద్దం పడుతుంది.

ఉపయుక్త గ్రంథం :

స్వేచ్ఛ నవల - ఓల్గా (పోపూరి లలిత కుమారి)

⌘⌘⌘

BHAVAVEENA
Vol. 17, Issue. 8, August 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

సమకాలీన తెలుగు సాహిత్యంలో 'హైకూ' ప్రక్రియ విశిష్టత

- మూడి శంకరబాబు, పరిశోధక విద్యార్థి, మద్రాసు విశ్వవిద్యాలయం, చెన్నై.

ఆధునిక తెలుగు సాహిత్యంలో ప్రారంభ దశ నుంచి ఎన్నో సాహిత్య ప్రక్రియలు వెలుగులోకి వచ్చాయి. వస్తు న్నాయి. వాటిలో గజల్, మినీకవిత, హైకూ, నానీలు ప్రధానంగా చెప్పవచ్చు. ఇందులో మినీకవిత ఆవిర్భావం ఒక గొప్పమలుపుగా చెప్పవచ్చు. మినీకవిత తర్వాత కవిత ప్రక్రియలలో నిలదొక్కుకున్న ప్రక్రియ హైకూ. ఈ క్రమంలో హైకూ ప్రక్రియ నేపథ్యం గురించి పరిశీలిద్దాం.

హైకూ ప్రక్రియ నేపథ్యం :

పాశ్చాత్య సాహిత్య ప్రభావంతో తెలుగు సాహిత్యం లోకి ప్రవేశించిన అనేక సాహిత్య ప్రక్రియలలో 'హైకూ' ప్రముఖమైనది. ఇది జపాన్ సాహిత్యం నుండి తెలుగు సాహిత్యంలోకి ప్రవేసించింది. జెన్ అనే ఒక తత్వం జపాన్ సాహిత్యంలోకి ప్రవేసించిన కొంతకాలానికి, ఆ తాత్విక భూమికతో ఏర్పడిన ప్రక్రియే ఈ హైకూ. ఈ హైకూ కవితాసృష్టి క్రీ.శ.14వ శతాబ్దంలో జపాన్ భాషలో జరిగింది. 17వ శతాబ్దంలో 'బషో' అనే కలం పేరుతో ప్రసిద్ధి పొందిన 'మాట్షియో బషో' ప్రఖ్యాత జపాన్ కవి ఈ హైకూ ప్రక్రియకు పితామహుడిగా పేరుపొందారు. ఈ 'బషో' ప్రభావంతో 18వ శతాబ్దంలో బుసాన్, ఇస్సా, గెనీషా, ర్యోటాలు మొదలైనవారు ఈ హైకూ కవిత్వాన్ని రాశారు. ఒక్క మాటలో చెప్పాలంటే క్రీ.శ.14వ శతాబ్దంలో 'జెన్ బౌద్ధులు' తమ సిద్ధాంతాలను ప్రచారం చేసుకోవడానికి నిర్మించుకున్న సాహితీ ప్రక్రియ హైకూ.

జపాన్‌లో ప్రారంభమైన ఈ హైకూ ప్రక్రియ క్రమ క్రమంగా ప్రపంచంలోని అన్ని బాషలలోకి ప్రవేసించింది. ఈ క్రమంలో భారతదేశంలో ప్రప్రథమంగా హిందీ, గుజ రాతీయులు ఈ ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. ఆ తర్వాత క్రమక్రమంగా తెలుగుసాహిత్యంలోకి ప్రవేసించింది.

తెలుగుసాహిత్యంలో హైకూ ప్రక్రియను గురించి తెలుసుకునే ముందు ఈ ప్రక్రియ లక్షణాలును గురించి తెలుసుకుందాం.

హైకూ ప్రక్రియ - లక్షణాలు :

1. మూడు పాదాలు కలిగి ఉండడం (మొదటి పాదంలో 5 అక్షరాలు, రెండవ పాదంలో 7 అక్ష రాలు, మూడవ పాదంలో 5 అక్షరాలు ఉంటాయి.)
2. పదచిత్రం - దృశ్య అనుభూతి
3. ప్రాకృతిక ప్రేరణ
4. లక్షణ వ్యంజనాభివ్యక్తి
5. ఝటిత స్ఫూర్తి
6. సార్వకాలీనత
7. ఒకే కాలం - ఒకే స్థలం
8. అమూర్తి భావాలమూర్తికరణ
9. అల్పంలో అనల్పాభివ్యక్తి
10. కొత్తకోణంలో ప్రకృతిదర్శనం

హైకూలకు అక్షరాల నియమం ఉంది. ఇందులో ఒకటి, మూడు పాదాలు ఐదు అక్షరాలు తోటి, రెండవ పాదం ఏడు అక్షరాలతోటి వుండాలి. ఏది ఏమైన మూడు పాదాల్లో హైకూ ని చెప్పాలి. అలాగే మూడు పాదాలలో ఒకే భావాన్ని, ఒకే అనుభూతిని ఇచ్చేవిగా ఉంటాయి. ఈ క్రమంలో సమకాలీన తెలుగు సాహిత్యంలో హైకూ ప్రక్రియ విశిష్టతను పరిశీలిద్దాం.

తెలుగు సాహిత్యం - హైకూ విశిష్టత :

ఆధునిక తెలుగు సాహిత్యంలో హైకూ ప్రక్రియను ప్రవేశపెట్టిన వారు డాక్టర్ గాలి నాసరరెడ్డి గారు. వీరి తర్వాత పెన్నాశివరామకృష్ణ, ఇస్మాయిల్, బి.వి.వి.ప్రసాద్, డాక్టర్ తలతోటి పృథ్వీరాజ్ మొదలైనవారిని చెప్పవచ్చు.

1990లో డా॥ గాలి నాసరరెడ్డి హైకూ రచన ప్రారంభించారు. హైకూను దాని మౌలిక సారంతో సహా అందించిన కవి గాలి నాసర రెడ్డి. ఈయన తెలుగు హైకూలు తక్కువ సంఖ్యలో రాశారు. అయితే అనువాదాలు మాత్రం ఎక్కువగా చేశారు. 1991లో ఆంధ్రజ్యోతి దినపత్రికలో 'వానాకాలం హైకూలు' అనే పేరుతో ఇస్మాయిల్ రాశారు. అలాగే 1993లో చెట్టు నా ఆదర్శం, 1997లో 'కప్పల నిశ్శబ్దం' పేరిట అనుభూతి ప్రధానం చేసుకొని హైకూలను వెలువరించాడు. మొట్టమొదటి సారిగా డా॥ పెన్నాశివరామకృష్ణ రాసిన 'రహస్య ద్వారం' అనే హైకూ సంపుటి ప్రచురించబడింది. తెలుగులో వెలువడిన తొలి హైకూ కవితాసంపుటి ఇదే. అలాగే ఈయన చినుకుల చిత్రాలు, సులోచనాలు అనే హైకూ కవితాలను వెలువరించాడు. ప్రముఖ హైకూ కవి బి.వి.వి. ప్రసాద్ 1995లో దృశ్యాదృశ్యం, 1997లో హైకూ, 1999లో పూలరాయి, 2015లో బివివి హైకూ అనే హైకూ సంపుటాలను వెలువరించాడు.

అలాగే మాకినీడి సూర్యభాస్కర్ - హైకూ చిత్రాలు, లలితానంద్ ప్రసాద్ - ఆకాశదీపాలు, పత్తిపాక మోహన్ - బంతిపూలు, రావిరంగారావు - సామాజిక హైకూలు, జి.గోపాలయ్య - సందెగుమ్మం, తలతోటి పుథ్వీరాజ్ - చినుకులు, వెన్నెల, వసంతం, కలువలు, నీలాకాశం, రోజుకో సూర్యుడు మొదలైనవి. ఎన్.శైలజ గారి - బాల్కనీలో పిచ్చుక ఇలా గుమ్మసాంబశివరావు, వంశీకృష్ణ, గంగరాజు మోహనరావు, రెంటాల శ్రీ వేంకటేశ్వరావు, మహ్మద్ షఫీ, మంతెన సూర్యనారయణరాజు, బొబ్బిలి జోసఫ్ ఇలా చెప్పుకుంటూ పోతే హైకూ కవిత్వాన్ని రాసిన కవుల పేర్లే లెక్కకు మించి ఉంటాయి. ఇవన్నీ సమకాలీన సమాజంలో పాఠకులను అలరించి చైతన్య పరిచినవే.

తెలుగు సాహిత్యంలో హైకూ సాహిత్య ప్రక్రియ వికాసానికి ఎంతగానో దోహదం చేసినవారు డా॥తలతోటి పృథ్వీరాజ్‌గారు. ఈయన హైకూ సాహిత్యంలో లోతైన అధ్యయనం చేసి ఎన్నో విశిష్టమైన కవితాసంపుటాలు వెలువరించడమేకాక ఆ సాహిత్య వికాసానికి ఎంతగాననో కృషిచేశారు. 2002లో అనకాపల్లి 'ఇండియన్ హైకూ క్లబ్' పేరుతో ఒక సంస్థను ఏర్పరచి ఎందరో కవులను ప్రోత్సహించడమే కాక 'హైకూ సాహిత్య మాసపత్రిక' ప్రారంభించి ప్రముఖమైన హైకూ వ్యాసాలతో, ఆ ప్రక్రియ లక్షణాలను, దాని చరిత్రను పలువురికి తెలిపే విధంగా ఎంతగానో కృషిచేశారు. 1999లో మాకినీడి సూర్యభాస్కర్ 'హైకూ కవిత్వం - అనుశీలన- ఒక అవగహన' అనే విమర్శ గ్రంథాన్ని రాశారు. ఇది హైకూ సాహిత్య ప్రక్రియను అవగహన చేసుకొనుటకు పాఠకులకు ఎంతోగానో ఉపయోగపడుతుంది. అలాగే రూప్‌కుమార్ డబ్బీకార్ రచించిన 'హైకూ సారస్వతం' విశిష్టమైంది. హైకూ ప్రక్రియ తాత్వికతను గురించి, పుట్టుపూర్వోత్తరాల గురించి వివరంగా విశ్లేషిస్తూ రాశారు.

ఒక పూల గుత్తిలో మూడు పువ్వుల్లా ఆ పదాలను ఒక చోట చేర్చినప్పుడే అది 'హైకూ' అవుతుంది. ఈ ధోరణితోనే తెలుగులో ఎక్కువ హైకూలు రచించబడ్డాయి. ఉదాహరణకు కొన్నిటిని పరిశీలిద్దాం.

ప్రకృతి సౌందర్యంతో కూడిన ఒక చమత్కార హైకూను పరిశీలిద్దాం.

పెద్ద కొండపై
ఆకాశాన్ని తాకుతూ
ఓ తాటిచెట్టు

- తలతోటి పృథ్వీరాజ్

వర్షం గురించిన హైకూ

క్షణం పూచే
నీటిపూలతో
డీరునిండిపోయింది

- బి.వి.వి.ప్రసాద్.

అలాగే ఒక తాత్విక హైకూను పరిశీలిద్దాం.

కట్టి క్షణమైనకాలేదు
ఇసుక గుడికి ఆలవచ్చి
దేవుడి పాదాలు కడిగేసింది - జి. రంగబాబు

మంచుకొండలు
అందమైన శ్రేణులు

ప్రకృతి వరం

- బొబ్బిలిజోసఫ్

మూసిన కన్ను
నాలోని లోకానికి
రహస్య ద్వారం

- పెన్నాశివరామకృష్ణ

ఈ హైకూ కవి అంతర్ముఖానికి ఇదొక మచ్చుతునక.

జీవన వేదాంతాన్ని తెలిపే హైకూలను పరిశీలిద్దాం.

నాడు కొడుకు
హాస్టల్లో, నేడు తండ్రి
వృద్ధాశ్రమంలో

- గుమ్మ సాంబశివరావు

పొంచి ఉంటుంది
నీడల్లే మరణము
జీవం వెనుక

- తలతోటి పృథ్వీరాజ్

ఒక అలంకారిక హైకూ ఇలా ఉంది.

వాన జల్లుకి
వంద గొడుగులు
వెంటనే వికసించాయి

- ఇస్మాయిల్

చిన్నప్పుడు
నేనేలిన మహాసామ్రాజ్యం
మేముంటున్న ఇంటి సందు

- మాకినీడి సూర్యభాస్కర్

పౌర్ణమిచంద్రుడు
ఊరంతా వెన్నెల
నిండుకుండ తొణకదంటారేమిటి?

పదచిత్రాలు సామాన్యంగా అన్పించినా భావం మనస్సును ఆకట్టుకుంటుంది. ఇది ఇస్మాయిల్ ప్రత్యేకత.

ఇలా చెప్పుకుంటూ పోతే తెలుగు సాహిత్యంలో హైకూ కవిత్వం సంపుటాలు కోకొల్లలు. అల్పాక్షరాల్లా అనల్పార్థ స్ఫురించేలా చేయడం హైకూ ప్రత్యేకత. హైకూ ప్రక్రియలో తాత్విక, చారిత్రక, సామాజికాంశాలు ప్రధానంగా కనిపించినా, సమాజంలో ప్రతి అంశాన్ని తనదైనశైలిలో పాఠకుల ముందుంచి ఆలోచింపజేయడం హైకూ ప్రత్యేకతలుగా చెప్పవచ్చు. అలాగే హైకూ ప్రక్రియ గురించి ప్రముఖులు చెప్పిన అభిప్రాయాలును పరిశీలిద్దాం.

కవి ప్రకృతితో తాదాత్మ్యం చెందినప్పుడు కలిగిన అనుభూతిని వ్యక్తికరించే సంక్షిప్త కవితల్ని 'హైకూ' అని ఇస్మాయిల్ గారు, హైకూ అంటే క్షణంలో యుగాన్ని దర్శించడం డా॥అద్దేపల్లి రామమోహనరావు, హైకూ తన మూడు పాదాలతోనే సమస్త లోక వృత్తాన్ని ఆవరించగల త్రివిక్రమ పరాక్రమం గల ప్రక్రియ అని ఆచార్య కాత్యాయనీ విద్మహే గారు పేర్కొన్నారు.

ముగింపు :

ఏది ఏమైన అనుభూతి ప్రధానంగా సాగే హైకూ తాత్వికతను జనింపజేస్తేనే నిలుస్తుంది. కవి ముందుగా అంతర్ముఖుడు కావాలి. అప్పుడే కవితా రహస్యం అవగత మవుతుంది. ప్రాకృతిపరమైన ఆలోచనలు ఉన్నపుడే హైకు జనిస్తుంది. నాలుగుకాలాల పాటు ఉంటుంది. అలాగే హైకూ ప్రక్రియ నియమాలను కవులు పాటించినప్పుడే ఆ ప్రక్రియ ప్రత్యేకంగా నిలుస్తుంది. 'హైకూను అర్థం చేసుకోవడంలో మేధ కంటే హృదయం పాత్ర ఎక్కువ. హృదయం మేల్కొన్నప్పుడే హైకూ అర్థవంత మౌతుంది. అందువల్ల హైకూ సృజనలో సృజనకారుడు ఒక గొప్ప ఊహాశిల్పి తప్పనిసరై ఉండాలి. ఊహాబలం ఎంత పదునగా ఉంటే పాఠకుడి భావన అంతగా విస్తరిస్తుంది.' అన్న యాకూబ్ మాటలు అక్షరసత్యాలు.

ఆధారగ్రంథాలు :

1. తెలుగు సాహిత్యంలో రా.రా. మార్గం - యాకూబ్ 2. అణిముత్యాలు (వ్యాససంపుటి) - డా॥ విస్తాలి శంకరరావు
3. సాహితీ వెలుగులు (వ్యాససంపుటి) - మందలపు నటరాజ్.

⌘

BHAVAVEENA
Vol. 17, Issue. 8, August 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

జానపదవైద్యం – సమకాలీనత

– పి. దర్గిబాబు, పరిశోధక విద్యార్థి శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి.

జానపద సాహిత్యం మన సంస్కృతిలో భాగం. పూర్వము నుండి నేటి నాగరికత మానవుని సంస్కృతిని మాత్రం వీడక వివిధ రూపాలలో కొన సాగుతూ ఉంది. ఈ సంస్కృతిలో జానపదుల జీవనానికి సంబంధించిన గేయాలు, కథలు, సామెతలు, భాష, నమ్మకాలు, ఆటలు, వంటకాలు, వైద్యం మొదలైనవి మనకు కనిపిస్తాయి.

సాధారణంగా జానపదులు కష్టపడే మనస్తత్వం కలవారు. కేవలం వ్యవసాయం మీదనే వారి జీవన విధానం ఆధారపడి ఉంటుంది. ఉదయం లేచినప్పటి నుండి పొద్దుగూకే వరకు పొలం పనులు చేసికొని ఇంటికి చేరుకుంటారు. అలాగే వారి జీవన విధానంలో భాగంగా జానపదులు అనేక సమస్యలను ఎదుర్కొంటారు. వాటిలో రోగాలు, వాటి నివారణ ఒకటి.

జానపద్యం వైద్యం తరతరాల నాటిది. ప్రకృతి మొట్ట మొదటి ఔషధంగా చెప్పుకోవచ్చు. పూర్వపు మానవుడు ఈ ఔషధాల నుండి వైద్యానికి కావలసిన పలురకాల వస్తువులను ఎంచుకొన్నాడు. ఆ వైద్యం ఇప్పటికి సాంప్ర దాయకంగా కొనసాగుతూ ఉంది. దీనినే జానపదవైద్యంగా పిలుస్తున్నాము. నాగరికత, విజ్ఞానంతోపాటు ఈ జానపద వైద్యం కూడా వివిధ రకాలుగా అభివృద్ధిని సాధించింది.

జానపద వైద్యాన్ని గృహవైద్యం, పసురువైద్యం, ఇంటి వైద్యం అని వివిధ పేర్లతో పిలుస్తారు. జానపద వైద్యం ఆధునిక వైద్యం కన్నా భిన్నమైనది. గ్రామాల్లో నాటువైద్యం వల్ల జబ్బులు నయంకాక ప్రాణాల మీదికి వస్తేనే జాన పదులు పట్టణాలకు వచ్చి ఆధునిక వైద్యం చేయించు కుంటున్నారు. లేకపోతే చిన్న చిన్న రోగాలకు నాటు వైద్యాన్ని వాడుతున్నారు. దీనికి కారణం నాటువైద్యంపై పల్లెప్రజలకు నమ్మకం ఎక్కువగా ఉంటుంది. అంతే కాకుండా కూలీపనులు చేసుకొని పొట్టపోసుకునే జాన పదులు ఆధునిక వైద్యానికయ్యే ఖర్చులను భరించలేరు కాబట్టి తక్కువ ఖర్చుతో కూడుకున్న నాటువైద్యం వైపు మొగ్గు చూపుతారు. జానపద వైద్యాన్ని మానవసంబంధ జానపదవైద్యం అని, ప్రాణిసంబంధ జానపదవైద్యం అని రెండు రకాలుగా తెలుపవచ్చు. మానవులకు వచ్చే పలు రకాల జబ్బులకు పలు రకాలతో బాగుచేసుకోవడమే మానవ సంబంధ వైద్యంగా చెప్పుకోవచ్చు. అందులో -

కడుపు నొప్పి :

జానపదులకు కడుపునొప్పి వచ్చినపుడు మొట్ట మొదటగా సేవించే మందు కషాయం. చిన్నపిల్లలకు కడుపునొప్పి వచ్చినపుడు శొంఠి బాగా నూరి, చిన్నదిగా చేసి, ఒక్కొక్కటిగా మింగిస్తారు. అలాగే బొడ్డు చుట్టు నాముకొమ్మును సాది పూస్తే కడుపునొప్పి తగ్గుతుంది. ధనియాలు వేయించి దానిని కషాయం చేసి తాగితే కడుపులో నొప్పి తగ్గిపోతుంది. అలాగే మిరియాలను దోరగా వేయించి, అందులో కొంచెం ఉప్పు వేసి బాగా నమిలి మింగాలి. అపుడు కడుపునొప్పి తగ్గుతుంది.

తలనొప్పి :

తలనొప్పి వచ్చినపుడు జానపదులు శొంఠి, వెల్లుల్లి పాయలను బాగా మెత్తగా నూరి కళ్ళకు పట్టిస్తే తలనొప్పి తగ్గుతుంది. ఒకవేళ ఇలాంటి వైద్యం వల్ల తలనొప్పి తగ్గకుండా మరీ ఎక్కువగా ఉంటే శొంఠిని కాస్త నీళ్ళలో కలిపి కంటి కొలికల్లో కొంచెం కొంచెం వేస్తే కళ్ళలోని నీరంతా వచ్చేసి తలభారం తగ్గిపోతుంది. పసిపిల్లలకు తలనొప్పి వస్తే వారి శరీరాలకు అనుగుణంగా చను బాలలో ఒక ఉప్పురాయిని వేసి, తెల్లని గుడ్డపీలికను అందులో ముంచి పిల్లల నొసటిపై వేస్తే తలనొప్పి తగ్గిపోతుంది.

పైత్యం :

పైత్యం వల్ల నోటిలో నీళ్ళు ఎక్కువగా ఊరుతూ వాంతులు వస్తూ ఉంటే అల్లం, ఉప్పు రెండింటిని కలిపి నమిలి మింగితే పైత్యం తగ్గుతుంది. చింతపండు, జీలకర్ర, ఉప్పు ఈ మూడింటిని దంచి చప్పరించినా పైత్యం తగ్గుతుంది. కళ్ళు తిరిగి, వాంతులు వచ్చేటప్పుడు నిమ్మకాయను లేదా వెంట్రుకలను వాసన చూసినా వాంతులు తగ్గుతాయి.

బేదులు :

దానిమ్మచెక్కను మెంతుల్ని దంచి కషాయం పెట్టుకొని తాగితే బేదులు తగ్గుతాయి. మెంతులు, మజ్జిగ కలిపి సేవించినా బేదులు తగ్గును. లేత జామకాయను తింటే బేదులు తగ్గుతాయి. కొబ్బరినీళ్ళను తాగడం వల్ల కూడా వాంతులు తగ్గును. ఒకవేళ రెండుమూడు రోజులు బేది కాకుండా కడుపు ఉబ్బసం అయినపుడు బేది కావడానికి బేదిచెక్క కషాయం పెట్టుకొని తాగితే అది కడుపులో బాగా కలిబెట్టి బేదవుతుంది.

జలుబు - దగ్గు - జ్వరం :

జానపదులు ఎండనకా వాననకా చలనక పని చేస్తూ ఉంటారు. జానపదులకు ఎక్కువగా వచ్చే రోగాల్లో జలుబు, దగ్గు, జ్వరం ముందు ఉంటాయి. ఇవి వారికి చాలా చిన్నవిగా కనిపిస్తాయి. వీటిని అంతా పట్టించుకోరు. జలుబు చేసినపుడు పసుపుకొమ్మును నిప్పులో కాల్చి దాని నుండి వచ్చే పొగను ముక్కుతో పీల్చి ఉపశమనం పొందుతారు. అంతేకాక ఒక గిన్నెలో నీళ్ళుపోసి అందులో పసుపు పొడిని వేసి బాగా కలిపి ఆ నీళ్ళను తాగితే జలుబు తగ్గుతుంది. అలాగే శొంఠి, మిరియాలు, బెల్లం బాగా దంచి నీళ్ళలో వేసి బాగా వడకట్టి, ఒక గ్లాసు తాగితే జలుబు తగ్గుతుంది. దీనినే జానపదులు శొంఠికాఫీ అంటారు.

దగ్గు ఎన్నో కారణాలవల్ల వస్తుంది. దగ్గులో పొడిదగ్గు, తల పగిలిపోయేలా దగ్గు వస్తూ ఉంటుంది. ఈ దగ్గు వచ్చినపుడు సాధారణంగా కరక్కాయను నోటిలో పెట్టుకొని రసాన్ని మింగుతూ ఉంటే దగ్గు తగ్గిపోతుంది. అంతేకాక తెల్లగడ్డ, మిరియాలు, ఉప్పు ఈ మూడింటిని బాగా నమిలి మింగితే దగ్గు పోతుంది. చిరునాలుక పెరిగి దగ్గువచ్చేటప్పుడు ఉప్పును చిరునాలుకకు తాకిస్తే తగ్గుతుంది. అలాగే ఆముదపు గింజలను కాల్చి, చిరునాలుకకు తాగించినా దగ్గు పోతుంది.

జ్వరం ఏ కారణాలవల్ల వస్తుందో కాని దానిని నయం చేసుకోవడం మాత్రం జానపదులకు తెలుసు. నేడు జ్వరాలలో రకాలున్నా ఒకప్పుడు జానపదుల దృష్టిలో జ్వరం మాత్రం ఒక్కటే. నేడు ఏ జ్వరమో తెలుసుకోకుండా మందుల్ని వాడరు. ఏదో ఒక కషాయాన్ని తాగడమే వాళ్ళకు తెలిసిన విద్య. జ్వరం ఎక్కువగా ఉంటే ఒక తెల్లటి గుడ్డను చల్లని నీటిలో తడిపి శరీరంపై వేసి, వేడి తగ్గించుకుంటారు. ఇది జానపదవైద్యంలో కాదు, నేటి ఇంగ్లీషు వైద్యంలో కూడా ఉంది. సాధారణంగా జ్వరం వస్తే అన్నం తినరు. రొట్టె, పాలును ఆహారంగా తీసుకుంటారు. ఇలా ఒక రకంగా ఉపవాసం తీసుకోవడం వలన జ్వరం తగ్గుతుందని వారి నమ్మకం.

అజీర్ణము :

అల్లం, జీలకర్ర, మిరియాలు, చింతపండు ఉప్పు వీటన్నింటినీ కలిపి దంచి చప్పరిస్తే బాగా జీర్ణమవుతుంది. నీళ్ళలో నిమ్మకాయ రసాన్ని కలిపి తాగితే జీర్ణం అవుతుంది. ఎర్రగడ్డను గాని, తెల్లగడ్డను గాని కాల్చి తింటే, తిన్నది జీర్ణమై, బాగా ఆకలి వేస్తుంది. ప్రతిరోజు ప్రొద్దున్నే కాస్త స్వచ్ఛమైన తేనెను తాగిన జీర్ణశక్తి బాగా పెరుగుతుంది.

పుండ్లు - నెత్తురు గడ్డలు :

శరీరంపైన చిన్న చిన్న పుండ్లు వచ్చినపుడు ఎర్రమట్టిని పూస్తారు. అలాగే నాలుగు ఐదు రోజులు పూస్తే, మెత్తబడి చీము, రక్తం వచ్చేసి తొందరగా మానుతుంది. ఒక్కోసారి గుల్లపుట్టిన వెంటనే తెల్లగడ్డను రాస్తే వెంటనే తగ్గుతుంది.

ఒకవేళ తగ్గకుండా ఇంకా పెద్దదైనపుడు పసుపు, తెల్ల గడ్డల్ని మెత్తగా నూరి నెత్తురుగడ్డపై పూస్తే అది మెత్తబడి చీము, నెత్తురు వచ్చి తొందరగా మానిపోతుంది.

ఆకులు - పసరువైద్యం :

జానపదుల్లో ఆకులు - పసరు వైద్యానికి ఎంతో ప్రాముఖ్యత ఉంది. జానపదులకు వచ్చే జబ్బుల్లో చాలావరకు ఆకులు పసరుతోనే నయం చేసుకోవడం ఆనవాయితీగా వస్తుంది. చెట్లు ఆకులు రసాలు చాలావరకు ఏదో ఒక జబ్బుకు ఉపయోగపడుతాయి.

శరీరంలో ఎక్కువ దెబ్బలు తగిలిన మునగాకును దంచి, కట్టుకుంటే నొప్పి తగ్గును. నోటిపుండు వచ్చినపుడు తులసి ఆకును మూడురోజులు పరగడుపునే నమిలి మింగితే నోటిపుండు తప్పకుండా నయం అవును. వేపాకును రోజూ కాస్త నమిలి మింగితే మధుమేహ వృద్ధి తగ్గుతుంది. అంతేకాకుండా కడుపులో ఉండే పురుగులు కూడా చచ్చిపోతాయి. నేలఉసిరి ఆకును తింటే పసరులు తగ్గుతాయి. కుంటగింజ ఆకుతోగాని, బలపాకుతోగాని పళ్ళ తోమితే పళ్ళ నొప్పులు తగ్గును. ఉత్తరేణి పుల్లతో నలభైరోజులు పళ్ళు తోమితే పళ్ళు గట్టిపడటంతో పాటు నొప్పులు కూడా పోతాయి.

మూలికా వైద్యం :

జానపదులు రకరకాల మూలికల్ని ఉపయోగించి ఆరోగ్యాలను కాపాడుకుంటారు. మూలికలు అంటే అడవులలో దొరికే చెట్లయొక్క వేళ్ళు, బెరడులు, కాయలు, మొగ్గలు, పూవులు మొదలైనవి జానపదులు సుగంధపాల వేళ్ళను ఉడకబెట్టి, రసాన్ని తీసి, అందులో తాటి కలకండను వేసి, ఒక గ్లాసు తాగితే వేడి తగ్గుతుంది. ఈత ఆకులను నమిలి మింగితే ఒంటిలో ఉండే వేడి తగ్గుతుంది.

తేలుకాటు :

తేలుకాటు వేసినపుడు జానపదులు ఉల్లిపాయలు గానీ, వెల్లుల్లిగానీ దంచి, తేలుకుట్టినచోట కడతారు. ఇది జానపదులు తేలుకాటుకు చేసే ప్రథమచికిత్స. ఆ తర్వాత మిరపకాయను నమిలిస్తారు. రాకమనిపించకపోతే విషయం ఎక్కలేదని, కారమనిపిస్తే విషం ఎక్కిందని భావించి, తేలుమంత్రం వేయించుకుంటారు. తేలు కుట్టినపుడు మంత్రగాడు మూడు చీపురు పుల్లలతోగాని, తలకు కట్టుకున్న కండువాతో గాని, వేపాకులతో గాని మంత్రిస్తాడు. తర్వాత తేలుకుట్టిన వ్యక్తిని ఎలా ఉంది అని అడుగుతాడు. వాళ్ళు తగ్గింది అంటే ఒక మంత్రంతోనే నిలిపేస్తాడు. లేదంటే ఆ మంత్రాన్ని మరొకసారి వేస్తాడు. మళ్ళీ తగ్గిందా అని అడుగుతాడు. ఇంకా కాస్త మంట ఉంది అంటే మూడోసారి మంత్రించి పంపిస్తాడు. ఏ మంత్రగాడికైనా పళ్ళు ఊడిపోకూడదు. ఒకవేళ ఊడిపోయి ఉంటే ఆ మంత్రం ఫలించదు అంటారు.

పాముకాటు :

పాము కాటువేసింది అని తెలిసిన వెంటనే, కాటు వేసిన పైభాగాన్ని గుడ్డతోగాని, దారంతోగాని గట్టిగా కట్టాలి. అలా కట్టడం వలన విషం శరీరంలోనికి ఎక్కదు. కాటువేసిన చోట చిన్న గాయాన్ని చేసి, విషపూరితమైన రక్తాన్ని చేతితో గట్టిగా వొత్తి, తీసేస్తే మంచిదంటారు. విషం ఎక్కిందా, లేదా అని మొదట మిరపకాయ నమిలి పరీక్షించుతారు. మిరపకాయ కారమనిపిస్తే విషం ఎక్కలేదని భావిస్తారు. ఒకటి రెండు మిరపకాయలు తిన్నా కారమే అనిపించకపోతే ఖచ్చితంగా విషమెక్కిందని భయపడి, మంత్రగాని దగ్గరకు పరుగెత్తుకొని వెళతాడు. వెళ్ళిన వెంటనే పాము కరిచింది అని చెప్పవలెను. అప్పుడు మంత్రగాడు తాను కట్టుకొని ఉన్న అంచులేని పంచలో కొంత చింపి, మంత్రించి, మెడకు దండలా కడతాడు. ఆ తర్వాత ఎలా వుంది అని అడుగుతాడు. తల ఇంకా భారంగానే ఉంది అంటే, మరొకసారి మంత్రించి దండ వేస్తాడు. మళ్ళీ ఎలా ఉంది అని అడుగుతాడు. తలభారం కొంచెం తగ్గింది అంటే మూడవసారి మంత్రించి దండను వేస్తాడు. దీన్నే పాముకాటుకు దండవేయడం అంటారు. ఇలా మంత్రాల నమ్మకంతోనే పాముకాటు విషాన్ని కూడా పోగొట్టుకుంటారు.

భూతవైద్యం :

జానపదులకు దెయ్యాలపైన, భూతాలపైన నమ్మకం ఎక్కువ. ఎవరైనా అర్ధాంతరంగా చనిపోయినా, ఉరిపోసుకొని గాని, బావిలో పడిగాని ఆత్మహత్య చేసుకున్నా దెయ్యాలుగా మారుతారని జానపదుల నమ్మకం. ఏదైనా అనారోగ్యం కలిగినపుడు ప్రాణాపాయస్థితిలో ఉన్నప్పుడు మంత్రవైద్యుడ్ని సంప్రదించడం సహజం. అపుడు మంత్రగాడు - నీకు దయ్యం పట్టిందని, ఆ దయ్యమే నిన్ను చంపుకు తింటూవుందని దీనికి పరిహారం చేస్తే తప్ప బయటపడటం కష్టం అని నమ్మబలుకుతాడు. అపుడు తనకు పట్టిన దయ్యాన్ని వదిలించుకోవడానికి మంత్రగాని సలహామేరకు కావాల్సినవి తీసుకువెళతారు. దెయ్యం పట్టిన వ్యక్తిని శ్మశానానికి రాత్రిపూట తీసుకెళతాడు మంత్రగాడు. అక్కడ ముగ్గుపిండితో మంత్రగాడు భేతాళుని బొమ్మను భయంకరంగా చిత్రిస్తాడు. దానిమీద దెయ్యం పట్టిన వ్యక్తిని కూర్చోబెట్టి, వేపాకులతో మంత్రిస్తాడు. కర్పూరం వెలిగించి, కొబ్బరికాయ కొట్టి, భూతానికి ఆహారంగా బొరుగుల్ని చల్లుతాడు. ఆ తర్వాత కోడిపుంజు నొకదాన్ని భూతానికి ఆహారంగా ఇచ్చి, నాలుగు పక్కలా రక్తాన్ని చల్లి, భూతం వదలిందని, ఇంటికి తీసుకు వెళతాడు.

దిష్టి-దిగదుడుపులు :

ఆకలి లేకపోయినా, మగతగా ఉన్నా, ఆవలింతలు వచ్చినా, ఒళ్ళు నొప్పులు ఉన్నా ఏదో దిష్టి తగిలిందని జానపదులు భావిస్తారు. ఈ దృష్టిదోషాన్ని పోగొట్టుకోవడానికి రకరకాలుగా దిష్టి, దిగదుడుపులు చేస్తారు. దిష్టిని అందరూ తీయరు. కొంతమందే తీస్తారు. అదీ ఆడవాళ్ళే తీస్తారు. దిష్టి తగిలినపుడు మూడిండ్ల చెత్త తెచ్చి, ఒక ఉప్పురాయి, మిరపకాయ దానితో కలిపి సూర్యునివైపు తిరిగి దణ్ణం పెట్టుకొని దిష్టి తగిలిన వ్యక్తిని మూడుసార్లు దిగదీసి 'చీపో, చీపో' అని మూడుసార్లు చెబుతారు. ఆ తర్వాత తమ ఏడమకాలి బొటనవేలికున్న మట్టిని దిష్టి తగిలిన వ్యక్తికి బండారుగా పెట్టి, చెత్తను, మిరపకాయల్ని, ఉప్పును పొయ్యిలో వేస్తారు. అది చిటచిటమని శబ్దం వస్తే దిష్టి తొలగిపోయిందని భావిస్తారు. అలాగే మూడు చీపురు పుల్లలతోను, భుజంపైన వేసుకున్న కండువాలతోను దిష్టితీసుకొని ఉపశమనం పొందుతారు.

భారతదేశం సంప్రదాయాలకు, ఆచారాలకు, కట్టుబాట్లకు పుట్టినిల్లు. మనదేశంలో జానపద వైద్యానికి ప్రత్యేక స్థానం కలదు. నాటినుండి ఏ ఆరోగ్యసమస్యకైనా ఆకో, పసరో వేసుకొని, రోగాలను మాన్పించుకుంటారు. కాని నేటి సమాజంలో తినే తిండిలో అనేక మార్పులను చూస్తున్నాం. కలుషితమైన ఆహారం తినటంద్వారా అనేక రకాలుగా ఆరోగ్యాన్ని చెడగొట్టుకుంటున్నాం. అలాగే ఆసుపత్రుల వెంట తిరుగుతున్నాము. నేడు చిన్న జలుబు చేసినా ఆసుపత్రికి వెళ్ళిపోతున్నాము. ఇలాంటి ప్రకృతి వైద్యాన్ని నేటి మానవుడు మరచిపోతున్నాడు.

ఆధార గ్రంథాలు :

1. జి.యస్.మోహన్ : 'జానపద విజ్ఞాన వ్యాసావళి', శ్రీనివాస పబ్లికేషన్స్, మలయనూరు, కళ్యాణదుర్గము, అనంతపురం జిల్లా. 515766
2. ఆర్.వి.యస్.సుందరం : 'ఆంధ్రుల జానపద విజ్ఞానం', తెలుగు విశ్వవిద్యాలయం, లలితాకళాక్షేత్రం, పబ్లిక్ గార్డెన్స్, నాంపల్లి, హైదరాబాద్-4.
3. యెల్లండ రఘుమారెడ్డి : 'పల్లెపదాలలో ప్రజాజీవనం' గురుకుల విద్యాపీఠ ప్రచురణలు, మహబూబ్‌నగర్ - 1979.

⌘⌘⌘

BHAVAVEENA
Vol. 17, Issue. 8, August 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

మహాభారతంలో కొన్ని స్త్రీ పాత్రలు సమకాలీనత

– పల్లుల శైలజ, అసిస్టెంట్ ప్రొఫెసర్ ప్రభుత్వ డిగ్రీ & పీ.జి కళాశాల (అటానమస్), సిద్దిపేట.

'హితేన సహితం సాహిత్యం'

అందరికీ హితం చేకూర్చేదే సాహిత్యం. వ్యాసుని కాలంలో గానీ కవిత్రయం భారతానువాదం చేసే కాలంలో గానీ ప్రత్యేకంగా వ్యక్తిత్వ వికాసం గురించి చర్చించుకోవాల్సిన అవసరం ఎవరికీ కలుగలేదు. కారణం ఉమ్మడి కుటుంబ వ్యవస్థ, మార్కులకు కాకుండా జ్ఞానానికి పెద్దపీట వేసే విద్యావ్యవస్థ, సమాజ హితాన్ని కాంక్షించే కావ్యాలు వీటన్నింటిలో అంతస్సూత్రంగా వ్యక్తిత్వ వికాసం గురించి చెప్పకనే చెప్పబడుతుండేది. ఉగ్రశ్రవసుడు శౌనకాది మహామునులకు భారతం కథంతా చెప్పి చివరకు "యది హాస్తి తదన్యత్ర, యన్నేహాస్తి నతత్ క్వచిత్" అంటాడు. ఇందులో ఉండేదే ఎక్కడైనా ఉంటుంది. ఇందులో లేనిది ఎక్కడా లేదు. అందుకే నేడు కేవలం భారతీయులకే కాక ప్రపంచానికే వ్యక్తిత్వ వికాస గ్రంథాలలోకూడా తలమానికంగా నిలిచింది భారతం.

భారతంలోని పాత్రలు నేటి సామాజానికి ప్రతింబింబాలుగా నిలిచాయి. అందులోని ఆఖ్యానాలు, ఉపాఖ్యానాలు వ్యక్తిత్వ వికాస సూత్రాలకు కాణాచిగా చెప్పవచ్చు. భారతంలో సమస్యలనే ఉలిచేత చెక్కబడి చక్కని వ్యక్తిత్వమనే అందమైన శిల్పాలుగా మనముందుకు వచ్చిన, అందరికీ అనుసరణీయమైన స్త్రీపాత్రలు అనేకం. కవిత్రయ భారతం ఆధారంగా కొన్ని స్త్రీ పాత్రలను ఈ పత్రంలో వివరిస్తాను.

శకుంతల :

మేనకా విశ్వామిత్రుల కన్నబిడ్డ, కణ్వమహర్షి ఆశ్రమంలో పెరుగుతుంది. వేటకు వచ్చిన దుష్యంతుని మాటలు అమాయకంగా నమ్మి అతన్ని గాంధర్వ వివాహం చేసుకుంటుంది. రాచలాంఛనాలతో నగరానికి తీసుకు వెళతానని మాటయిచ్చి వెళ్ళిపోయిన దుష్యంతుడు తిరిగి శకుంతలను కన్నెత్తి కూడా చూడడు. కొంత కాలానికి శకుంతల భరతునికి జన్మనిస్తుంది. అతడికి యుక్త వయసు వచ్చాక కణ్వమహర్షి వారిద్దరిని దుష్యంతుని దగ్గరకు పంపుతాడు. నిండు సభలో కొలువుదీరి ఉన్న దుష్యంతుడు శకుంతలను చూచి కూడా ఆమె ఎవరో తెలియదన్నట్టు కఠినంగా ప్రవర్తిస్తాడు.

మఱచిన దలఁపింపనగు/నెఱుగని నాఁడెల్లపాటు నెఱిగింప నగున్
మఱి యెఱిగి యెఱుఁగ నొల్లని / కఱటిం దెలుపంగఁగమలగర్భుని వశమే.

(భా. ఆ. 4 - 72)

అని బాధపడుతుంది, ఇంతదూరం వచ్చి, వచ్చిన కార్యం సాధించకుండా పోకూడదని దృఢంగా నిర్ణయించుకొని పూర్వ వృత్తాంతమంతా చెప్పి భరతుని చూపిస్తుంది. వాస్తవం తెలిసినప్పటికీ నువ్వెవరో నాకు తెలియదు, అనుచితాలు మాట్లాడకుండా వచ్చినదారినే వెళ్ళిపొమ్మంటాడు దుష్యంతుడు. 'ఏ తోడు లేనినాడు నీ నీడే నీకు తోడు' అని సినారె గారు అన్నట్లుగా శకుంతల బాధని కోపాన్ని దిగమింగుకొని 'హృదయ సంతాపంబు తనకు తానయుపశమించుకొని విమలయశోనిధీ! మహా పదార్థాలన్నీ పురుష వృత్తాంతాన్నంతటిని గమనిస్తూనే ఉంటాయి. పుత్రవతి, గుణవతి, అనుకూలవతి అయిన భార్యను తిరస్కరించే వారికి ఇహపరాలు రెండూ ఉండవు. గృహస్థు ధర్మాలను నెరవేర్చడానికి భార్యే మూలాధారం అని

నుతజలపూరితంబులగు నూతులు నూఱిటికంటె సూవృత
వ్రత ! యొకబావి మేలు; మఱిబావులు నూఱిటి కంటెను నొక్కస

త్క్రతువది మేలు; తత్క్రతుశతంబునకంటె సుతుండు మేలు; త

త్సుతశతకంబుకంటె నొక సూనృత వాక్యము మేలు సూడగన్ (భా.ఆ. 4-94)

నూరు మంచి నీటి నూతులు తవ్వించిన పుణ్యంకంటే ఒక దిగుడుబావి మేలు, అలాంటి దిగుడు బావులు నూరిటికంటే ఒక యజ్ఞం మేలు, అటువంటి నూరు యజ్ఞాలకంటె ఒక పుత్రుడు మేలు, అలాంటి నూర్గురు పుత్రుల కంటే ఒక సత్యవాక్యం మంచిదని, అన్నింటికంటే సత్యం ఉత్కృష్టమైనదని కాబట్టి దానిని కాపాడమని అనేక రకాలుగా దుష్యంతునికి ధర్మోపదేశం చేస్తుంది. ఎన్ని విధాలుగా శకుంతల ప్రయత్నించినప్పటికీ ఆమెను భార్యగా అంగీకరించకపోగా అవమానిస్తాడు దుష్యంతుడు. చివరకు ఆకాశవాణి చెప్పిన సాక్ష్యంలో శకుంతలను భార్యగా అంగీకరిస్తాడు.

యుక్త వయసులో అమాయకంగా మోసగింపబడినా అందుకు కారణమైన వాడు మహారాజైనా, అతడిని అతడి కొలువులోనే నిలదీయగలిగిన ధైర్యవంతురాలు శకుంతల. ఒక పక్క చీవాట్లు పెడుతూనే విమలయశోనిధీ, సూనృత వ్రతా, ఉదార ధర్మప్రియా అంటూ దుష్యయంతుని సంబోధించిన నేర్పరి. నిండుకొలువులో రాజు అవమానిస్తుంటే, అక్కడ తనకు తెలిసిన వారు గాని, తనకు సహాయ పడేవారుగానీ లేకపోయినా అధైర్యపడకుండా తనను తానే ఓదార్చుకుని, నిరాశా నిస్పృహలకు లోను కాకుండా చివరి వరకు శక్తి వంచన లేకుండా ప్రయత్నం చేసి విజయం సాధించి అందరికీ ఆదర్శంగా నిలిచింది.

దమయంతి :

విదర్భరాజైన భీముని కుమార్తె, నిషద దేశాధిపతియైన వీరసేనుని కుమారుడు నలుడు. వీరిద్దరూ ఒకరినొకరు ప్రేమించుకుంటారు. దమయంతీ స్వయం వరానికి ఇంద్రాది దిక్పాలకులు నలుగురూ నలుని రూపంలోనే వెళతారు. దమయంతి ఎవరు నలుడో తెలుసుకోలేక వినయంగా చాకచక్యంగా వారినే ప్రార్థించి, వారి అనుగ్రహం పొంది నలునిమెడలో వరమాల వేస్తుంది.

దమయంతి, పురోహితులు వారిస్తున్నా వినకుండా నలుడు పుష్కరునితో జూదమాడి సర్వం కోల్పోయి కట్టుబట్టలతో దమయంతితో రాజ్యాన్ని వీడతాడు. ఆకలికి తాళలేక పక్షులను వేటాడడానికి వెళ్ళి ఉన్న ఒక్క వస్త్రాన్ని కూడా కోల్పోతాడు. దమయంతి చీర చెరగుతో దేహాన్ని కప్పుకుంటాడు. సర్వం కోల్పోయి దైన్యస్థితిలో ఉన్ననలునితో దుఃఖమనే రోగ పీడితుడైన వాడికి మంచి మందు భార్యే. భార్యతో కలిసి ఉన్నవానికి ఎంతటి కష్టాలనైనా అనుభవిస్తునట్లు అనిపించదు.

అలసినెడ, డస్సినెడ, నా/కలి దప్పియునైన యెడలఁగడుకొని ధరణీ
తలనాథ ! పురుషునకుని / మ్ముల భార్యయ పాచుఁజిత్తమున దుఃఖంబుల్ (భా.అ.2-75)

అంటూ భార్య ఆలంభనగా ఉంటే అన్ని దుఃఖాలు దూరమౌతాయని ఓదారుస్తుంది దమయంతి. తనను ఎట్టి పరిస్థితులలోను వదిలిపెట్టవద్దని ప్రమాణం చేయించుకుంటుంది. కానీ తాను లేకపోతే పుట్టింటికి వెళుతుందేమో అనుకుని చీరను సగం చింపుకొని దమయంతి నిద్రిస్తూ ఉన్న సమయంలో ఆమెకు చెప్పకుండా నిర్ధయగా నట్టడవిలో వదిలేసి వెళ్ళిపోతాడు నలుడు.

ఆ భయంకరారణ్యంలో నలుని కోసం అత్యంత దయనీయంగా దుఃఖిస్తూ, పిచ్చిదానిలా వెదుకుతుంది. భర్తపై ప్రేమతో ధైర్యం కూడగట్టుకొని ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొంటుంది. భర్తను అన్వేషిస్తూ ఎక్కడెక్కడో తిరిగి విధివశాత్తు పుట్టింటికి చేరుతుంది.

బాహుకుడు అనే పేరుతో వికృతరూపంలో ఉన్నవాడు నలుడే అయి ఉంటాడని భావించి ద్వితీయ స్వయంవరం అనే వంకతో విదర్భకు రప్పించి చాకచక్యంగా తెలివిగా నలుని గుర్తిస్తుంది.

'నిశ్చితార్థంబు వదలరు నిపుణమతులు' అని భర్తృహరి

అన్నట్టుగా సమస్యను అధిగమించేవరకు, లక్ష్యాన్ని చేరే వరకు రాజీలేని పోరాటం చేసి, మనోబలంతో, సహనంతో తెలివిగా ప్రవర్తించి అందరికీ ఆదర్శణీయగా నిలిచింది దమయంతి.

సావిత్రి :

మద్రదేశాధీశుడైన అశ్వపతి కూతురు. సత్యవంతుని గుణ గణాలు, రూపలావణ్యాలు తెలిసి, అతడిని ప్రేమిస్తుంది. వివాహం చేస్తుకున్న సంవత్సరానికే చనిపోతాడని నారదుని ద్వారా తెలిసినా, త్రికరణ శుద్ధిగా సత్యవంతుడ్ని ప్రేమించిన సావిత్రి తండ్రిని ఒప్పించి వివాహం చేసుకుంటుంది. సత్యవంతునికి మరణ గడియలు దగ్గరపడిన విషయాన్ని గుర్తించి, సమిధులు తేవడానికి అడవికి వెళుతున్న భర్తతో అడవికి వెళుతుంది. అడవిలో సత్యవంతుడు మరణించగా అతడి ప్రాణాలు తీసుకువెళుతున్న యముని అనుసరిస్తుంది. ఎవరూ ప్రవేశించలేని మార్గాలలో యమునితో పాటు భర్త ప్రాణాలకోసం వెళుతుంది. ధర్మం తప్పని, సంస్కరించబడిన, నిర్మలమైన వాక్కు ఎంతటి కఠినాత్మునిలోనైనా దయపుట్టించగలదని నిరూపిస్తుంది సావిత్రి.

తృషితుఁడగు వాని శీతల / తుషారతోయములు మోదితునిఁజేయుగతిన్
హృషితాత్ముఁజేసే ననుఁగ /ల్మషహరణములైన సమంజసఫణితుల్ (అ.7-233)

దప్పిగొన్న వాడిని చల్లని మంచినీరు సంతోష భరితుని చేసినట్లు పాపాలను పారద్రోలే నీ మాటలు చక్కని సందర్భశుద్ధి కలిగి నన్ను సంతృప్తి పరచాయంటాడు యముడు.

"By her power of austerity, it appears that her life and her husband's life is inseparable and hance God of Death had to surrender and give her the boon of restoring her husband to life (The light of Ramayana P. 325) అని జస్టిస్ పమిడిగంటి కోదండ రామయ్యగారంటారు. తన వాక్చాతుర్యంతో ధర్మనిష్ఠతో యముని మెప్పును, తద్వారా భర్త ప్రాణాలను పొంది పుట్టినింటికీ, మెట్టినింటికీ కూడా మేలుచేసి చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయింది సావిత్రి.

కుంతి :

యాదవరాజైన శూరుని కుమార్తె. కుంతి భోజుని వద్ద పెరుగుతుంది. యుక్తవయసులో, చంచలమైన మనసుతో, ఆకతాయితనంగా కర్ణునికి జన్మనిచ్చి, సమాజానికి భయపడి, ఆ పసికందును నీళ్ళపాలుచేసి, ఆ రహస్యాన్ని ఎవరికీ చెప్పకుండా జీవితాంతం వేదన చెందుతుంది. ఇది నాణానికి ఒకవైపైతే, మరోవైపు దుర్వాసునంతటి వాడినే తన సేవలతో మెప్పించిన వినయశీలి, సహనశీలి కుంతి. భర్త చనిపోయిన తరువాత ఎదురైన అనేక ఆటుపోట్లను తట్టుకుంటూ పాండవులను వీరులుగానే కాదు. మనస్సున్న మారాజులుగా పెంచుతుంది. సవతి (మాద్రి) పిల్లలను తన పిల్లలకుంటే కూడా ఎంతో ప్రేమతో పెంచుతుంది.

ధృతరాష్ట్రుడు గ్రుడ్డివాడే కాదు, దుర్యోధనునిపై గ్రుడ్డి ప్రేమ కలిగిన వాడు కూడా. దుర్యోధనుడు పాండువులను, ద్రౌపదిని ఎన్ని ఇబ్బందులకు గురిచేసినా కిమ్మనకుండా చూస్తూ ఉండిపోయాడు. అయినప్పటికీ కురుక్షేత్ర యుద్ధానంతరం రాజమాతగా, సమస్త సౌఖ్యాలను అనుభవించే అవకాశం వచ్చినా, నూరుగురు పుత్రులను కోల్పోయి పుత్రశోకంలో ఉన్న గాంధారీ ధృతరాష్ట్రులకు ఆలంభనగా ఉండి, రాజభోగాలను తృణప్రాయంగా భావించి, వారితో కలిసి వాన ప్రస్థానికి వెళ్ళి అగ్నికి ఆహుతి అవుతుంది.

ద్రౌపది :

ద్రుపదునికి యజ్ఞగుండంలో ఆయోనిజగా జన్మిస్తుంది. మహాభారతంలో అసాధరణమైన స్త్రీమూర్తిగా వెలుగొందుతుంది. స్వయం వరంలో అర్జునుని ద్వారా గెల్చుకోబడి పంచ పాండవులకు భార్య అవుతుంది.

ధర్మరాజు ద్రౌపదిని తన ధనంగా భావించి జూదంలో ద్రౌపదిని ఓడిపోతాడు. నిండు సభలో కర్ణుడు ద్రౌపదిని

బందకి (వేశ్య) అని అవమానిస్తాడు. దుర్యోధనుడు వివస్త్రను చేయమంటాడు. గర్వాంధుడై తన తొడపై కూర్చోమని సైగ చేస్తాడు. నీచుడైన దుశ్శాసనుడు వస్త్రాపహరణానికి పూనుకుంటాడు. దిక్కుతోచక విల విలాడుతున్న ద్రౌపదికి పాండవులుగానీ, కురు వృద్ధులు కానీ, అక్కడున్న వారెవరు సహాయం చేయరు. అలాంటి నిస్సహాయస్థితిలో శ్రీకృష్ణుని దయతో గండం గట్టెక్కు తుంది. నిండు సభలో అత్యంత కిరాతకంగా తన పుత్రులు ప్రవర్తించినా మారు మాట్లాడకుండా ఉన్న ధృతరాష్ట్రుడు ద్రౌపదిని అవమానించే సమయంలో కలిగిన అపశకునా లకు భయపడి, అప్పుడు దుర్యోధనుని మందలించి, ద్రౌపదిని వరాలు కోరుకో మంటే క్షత్రీయకాంత రెండు వరాలకన్నా అధికంగా కోరకూడదనే ధర్మాన్ని తెలియజేసి భర్తలను దాస్య విమోచనులుగా చేస్తుంది. ఎంతటి క్లిష్టపరిస్థితులలోనైనా ధర్మం తప్పని ధర్మజ్ఞులు రాజ సూయయాగంలో అవభృతమైన ద్రౌపది వేణి పట్టి దుశ్శాసనుడు కౌరవసభకు ఈడ్చుకొచ్చినప్పుడు కూడా ధైర్యంగా తాను ధర్మ విజితనా? అధర్మ విజితనా? అని ప్రశ్నిస్తుంది కురు వృద్ధులను ప్రశ్నిస్తుంది.

రెండవసారి ధర్మరాజు, జూదంలో ఓడిపోయి పన్నెండు సంవత్సరాలు అరణ్యవాసం, ఒక సంవత్సరం అజ్ఞాత వాసం చేయాల్సి వచ్చినప్పుడు ద్రౌపది భర్తలను అను సరిస్తుంది.

నీవు పుట్టడం చేతనే ద్రుపద వంశానికి, మెట్టడం చేత పాండు వంశానికి శుభం చేకూరిందని కుంతి చేత ప్రశంసలు పొందింది. వరం వల్ల పుట్టి, భరతవంశంలో మెట్టి, అందునా పాండురాజు కోడలై, ప్రజలచేత నమస్క రించదగిన భర్తలను పొంది, రాజనీతిలోనూ, శౌర్యంలోను చలించని పుత్రులను కని, దృష్టద్యుమ్నుడు, శ్రీకృష్ణుడి లాంటి సోదరుల అండకలిగిన ద్రౌపది పన్నెండు సంవత్స రాలు అరణ్యవాసం చేసింది. ఒక సంవత్సరం అజ్ఞాత వాసంలో సైరంధ్రిగా సుదేష్ణకు సేవలు చేసింది.

వనవాస సమయంలో సైంధవుడు ద్రౌపదిని చూసి మోహాంధుడుకాగా తనకు సైంధవుడు తోబుట్టవుతో సమానమని మొదట నచ్చచెప్పడానికి ప్రయత్నించి సామ భేదోపాయాలను ప్రయోగించింది. తనను పెఱ వనిత లాగా భావించడం తగదని హెచ్చరించింది. అతనిని ఆత్మ విశ్వాసంతో చెక్కు చెదరని ధైర్యంతో ఎదుర్కొంది. చివరకు పాండువుల చేత కాపాడబడింది. కీచకుడు ద్రౌపదిని పరాభవించే సందర్భంలో కూడా అంతే ధైర్యంగా నిలుస్తుంది.

దుర్వారోద్యమబాహు విక్రమ రసాస్తోక ప్రతాపస్ఫుర
ద్గర్వాంధ ప్రతివీర నిర్మథన విద్యాపారగుల్ మత్పతుల్
గీర్వాణాకృతు లేవురిప్పుడ నిను డోర్లీలన్ వెసం బట్టిగం
ధర్వుల్ మానము ప్రాణముం గొనుట తథ్యం బెమ్మెయిం గీచకా ! (వి. 2-55)

ఓయి కీచకా ! వారించటానికి వీలులేని భుజ బల పరాక్రమం గలిగిన గర్విష్ఠులైన శత్రువుల నవలీలగా వధించే విద్యలో ప్రావీణులయిన ప్రఖ్యాతిగాంచిన ఐదుగురు గంధర్వులు నా భర్తలు. వారు ఇప్పుడే అవ లీలగా నీ మానప్రాణాలు హరిస్తారు సుమా! అంటూ కీచకుని భయపెట్టడానికి ప్రయత్నించింది. కీచక వధ ఘట్టంలో కూడా భీమునితో చాలా ఒడుపుగా మట్లాడి తన కార్యాన్ని నెరవేర్చుకుంటుంది.

ఎంత గొప్పవారికైనా సాక్షాత్తూ శ్రీకృష్ణుడే అండగా ఉన్నా అరవీరభయంకరులైన భర్తలు, పుత్రులు, సోదరులు కలిగి ఉన్నా ద్రౌపదికి కష్టాలు తప్పలేదు. కాబట్టి ఎంత మంది మన చుట్టూ ఉన్నారన్నది కాదు ముఖ్యం. సమస్యలను ఎంత ధైర్యంగా ఎదుర్కొన్నా మన్నదే ముఖ్యమని ద్రౌపది పాత్రద్వారా తెలుస్తుంది.

ముగింపు :

అమాయకంగా మోసపోయినా ధర్మమే ఊతగా,

తనకుతానే ఆలంబనగా, చివరికంటూ పోరాడి విజయం సాధించింది శకుంతల. జీవితంలో తెలిసీ తెలియక చేసే పొరపాట్లతో అక్కడికే జీవితం అయిపోయిందని కుంగి పోకుండా మరోజీవితం ఉందని తమ జీవితాన్ని అంతం చేసుకోకుండా మానసిక పరిపక్వతతో, ఔదార్యంతో నలుగురికీ ఉపయుక్తమైన జీవితాన్ని జీవించే అవకాశం కూడా ఉందని నిరూపించింది కుంతి పాత్ర.

భర్తల వ్యసనాలకు తాము బలైనా ఎప్పుడూ ఆత్మ విశ్వాసాన్ని కోల్పోకుండా ధైర్యంగా సమస్యలను ఎదుర్కొని అందరికీ ఆదర్శప్రాయులుగా అనుసరణీయులుగా నిలిచారు ద్రౌపది, దమయంతులు.

ధర్మాన్ని తప్పకుండా వాక్శుద్ధి కలిగి సమయోచితంగా మాట్లాడితే రాళ్ళలో కూడా రాగాలు పుట్టించగలుగుతారని నిరూపించింది సావిత్రి.

పైన తెలిపిన వారంతా కూడా ఎలాంటి సమస్యకైనా పరిష్కారం ఉంటుందని, సహనం ఆత్మస్థైర్యం, ధైర్యంతో ధర్మంగా వాటిని ఎదుర్కోవాలని నిరూపించి అందరికీ ఆదర్శప్రాయులైనారు.

ద్రౌపదీ వస్త్రాప హరణం ఘట్టంలోగానీ, కీచకుని భారి నుండి తప్పించుకున్నప్పుడు గానీ, సహాయం లభించడం, శకుంతల విషయంలో అశరీర వాణి నుండి సహాయం లభించింది అంటే వారు పురాణ స్త్రీలైనందుకు కాదు. వాళ్ళు గాలిలో దీపం పెట్టి దేవుడా నువ్వే దిక్కు అంటేనో ఎలాంటి ప్రయత్నం చేయకుండా ఉంటేనో వారికి సహాయం లభించలేదు. పూర్తిగా తమశాయశక్తులా ప్రయత్నించేసిన తరువాత మాత్రమే వారికి బయట నుండి సహాయం లభించింది.

కాబట్టి సమస్యలను సవాళ్ళగా ఎదుర్కొనే ఆత్మ స్థైర్యం, సాధించే వరకు విశ్రమించనితత్వం, ఏ దశ లోనూ నిరాశను దరికిరానివ్వ కుండా చేసే అలుపెరగని ప్రయత్నం కనక మన సొంతమైతే విజయం తథ్యమని పై కథల ద్వారా తెలుస్తుంది.

ఉపయుక్త గ్రంథసూచి :

1. చలపతిరావు దేవిశెట్టి : మహాభారతం ద్రౌపది
2. డా॥ఎస్. శాంతమ్మ : మహాభారత మహిళాదర్శనం
3. డా॥ సుబ్బన్న శతావధాని సి.వి. : కుంతి
4. తిరుమల తిరుపతి దేవస్థానము : కవిత్రయ విరచిత శ్రీమదాంధ్రమహాభారతము వారి ప్రచురణ

⌘⌘⌘

BHAVAVEENA
Vol. 17, Issue. 8, August 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

ఆధునిక సాహిత్య కవిత ప్రక్రియలో – మొగ్గలు కవిత ప్రక్రియ

– బసవరాజప్ప , అధ్యాపకుడు, మహబూబ్ నగర్, తెలంగాణ.

తెలుగు సాహిత్యం లో 1875 తర్వాత కాలాన్ని ఆధునిక యుగం అంటారు. నిగూఢతను కలిగి, సాధారణ వాక్యానికి భిన్నంగా ఉండి మనసును రంజింపజేసే, ఆలోచింపజేసే రచనను కవిత్వం అంటారు. కవిత్వం ఒక సృజనాత్మక సాహిత్య ప్రక్రియ. కవిత్వం ఒక అక్షర తాండవం, ఒక అన్వేషణ, ఒక తీరని వేధన. కవిత్వంలో చెప్పేదేదైన బలంగా ఉండాలి.

పాతకాలంలో పద్యమైతే వర్తమానం వచన కవిత. వచన కవితా పితామహుడుగా కుందుర్తి అంజనేయులు. తెలుగు కవిత ప్రక్రియలో ఎక్కువమందిని ఆకట్టుకున్నది వచన కవిత్వం. ఇది కొత్త ధోరణులలో తెలుగు కవితా ప్రక్రియలకు శ్రీకారం చూట్టాలన్న తపనతో యువ కవులు ఎంతోమంది ముందుకు వస్తున్నారు. అందులోనిదే -

మొగ్గలు కవిత ప్రక్రియ :

తెలుగు సాహిత్యంలో ముడు పాదాల ఆధునిక మినీ వచనకవితాప్రక్రియ మొగ్గలు. ఈ మొగ్గల సృషికర్త డా॥ భీంపల్లి శ్రీకాంత్, మహబూబ్ నగర్, తెలంగాణ రాష్ట్రం.

మొగ్గలు ఆవిర్భావం, నేపథ్యం :

ఈ మొగ్గల ప్రక్రియ యాదృచ్ఛికంగానే ఆవిర్భావించింది. ఇది మొదటగా 2017లో ఆవిర్భావించింది. ఒక ప్రక్రియను ప్రారంభించాలని చేసిన ప్రయత్నమేమి కాదు అంటాడు మొగ్గల సృషికర్త. ఈ మొగ్గలు ఆవిర్భావించడానికి ప్రేరణ ఆచార్య మసన చెన్నప్ప గారు అని అంటారు మొగ్గల సృషికర్త. తెలుగు కవిత ప్రక్రియలైన నానీలు, గజళ్ళు, రుబాయిలు మొదలగు ప్రక్రియలలో ఇదికూడ ఒకటి.

పూలు వికాసించడానికి ముందుగల రూపం మొగ్గలు. మొగ్గదశలో ఉన్నా పువ్వులాగనే ఆనందాన్నిస్తుంది. పూలు పూసే క్రమంలో మొగ్గలనేవి ఒక దశను సూచిస్తున్నాయి. మొగ్గలు ఎప్పటికీ వాడిపోనివి, తాజాగా ఉంటాయి. ఈ మొగ్గలు ఆధునిక కవితారూపాలకు తానొక స్వీయ కవితారూపాన్ని అందించి, దానికో పేరు పెట్టడం అతని నూతన కవితాతృష్ణను తెలియజేస్తుంది.

మొగ్గలు కవిత లక్షణాలు :

1. ఇది మూడు పాదాలు ఉండాలి
2. ఎలాంటి ఛందస్సు నియమాలు ఉండవు.
3. ప్రతి పాదంలో మూడు నుంచి ఐదు పదాలు ఉండాలి.
4. ఈ కవిత మొగ్గలలో సరళత, సంక్షిప్తత, గాఢత, క్లుప్తత ప్రధాన లక్షణాలు.
5. మూడు పాదాలలో మొదటి పాదాని కొనసాగింపుగా రెండవపాదం ఉండాలి. అంటే మొదటిపాదంలో వాక్యాం అంతం కాకుండా ఉండాలి. మొదటి రెండు పాదాలు భావయుక్తంగా, అర్థవంతంగా ఉండి, మూడవ పాదాన్ని సమర్థిస్తూ, అన్వయిస్తూ, బలపరుస్తూ ఉండాలి.
6. మొదటి రెండు పాదాలు సంశ్లిష్ట వాక్యంలా ఉండాలి.
7. మూడవ పాదం ఒక నినాదంగా, సూక్తిగా, సామెతగా చెప్పవచ్చు. ఈ మూడవ పాదం చెప్పడంలో కవి యొక్క కొత్తదనం, సృజనాత్మక శక్తి, ఉండే విధంగా ఉండాలి.
8. వస్తువు అనుకూలత, బలమైన శిల్పం, నూతన అభివ్యక్తి మొగ్గలు వికసించడానికి పాదుకలు.

ఈ మొగ్గలు చాలా సులభమైన ప్రక్రియగా అందరూ రాయడానికి అనుకులం. ఈ మొగ్గలు పువ్వుల్లా వికసించడానికి, పరిపుష్టికి చేయడానికి కవి సృజనపై ఆధారపడి ఉంటుంది.

ఇప్పటి వరకు వర్తమాన కవుల నుంచి ప్రముఖ కవుల దాక వరద ప్రహవంలా సాగుతోంది, మొగ్గల కవిత సంపుటిలు. ఈ మొగ్గలు సులభమైన ప్రక్రియ కావడంతో భిన్నమైన వస్తువుతో, వైవిధ్యమైన శైలిలో మొగ్గల కవితలు రాస్తున్నారు. ప్రణాళికబద్ధమైన, బలమైన శిల్పం, వస్తువు అనుకులత, సైద్ధాంతిక దృక్పథం ఇలాంటివి ఉన్నప్పుడు ఏ కవితా ప్రక్రియ అయిన ఎక్కువ కాలం సాహిత్యంలో ఉంటుంది. మొగ్గలు కవిత ప్రక్రియలో ఇప్పటి వరకు వివిధ సంపుటులలో వెలువరించడం జరిగింది.

కొన్ని అక్షరాలు చాలు
కవిత్వాన్ని ఆవిష్కరించడానికి
అక్షరం రసాత్మక కావ్యం

ఇందులో మొదటి రెండు పాదాలు కొనసాగింపుగా ఉన్నాయి. మూడవ పాదం ఆ రెండింటి పాదాలకు సమర్థింపు వాక్యాంగా ఉంది.

ఈవిధంగా కవి తన భావలను కవితగా ఆవిష్కరించడాని, అక్షరాలను రసాత్మకంగా వాడడం జరిగింది. అదేవిధంగా -

శిశువు కేరింతలు కొట్టనిదే
ఈ లోకంలోకి అడుగుపెట్టలేడు
కేరింత ఒక ఆనందం.

ఇక్కడ కవి శిశువు ఏడుపు, కేరింతలు, లోకం, ఆనందం అనే అక్షర కూరుపుతో తన సృజనతో మొగ్గ కవితను సృష్టించడం జరిగింది.

ఆలోచనలు వెంటాడినప్పుడల్లా
అక్షరాలు మొలకెత్తుతూనే ఉంటాయి.
అక్షర సంగమం కవిత్వం.

మనిషి ఆలోచన చేసే అక్షరలు పుట్టుతునే ఉంటాయి. కవి అలోచన తీరునుబట్టి అక్షరాలు మొలకెత్తుతాయి. అవి మొగ్గలు అయి, పూలు పూయాలి. మళ్ళీ కవి ఈ విధంగా అంటాడు.

పువ్వులు విచ్చుకున్నప్పుడల్లా,
సుగంధాలు అహ్లదపరుస్తూనే ఉంటాయి,
పరిమళం అందరికి మకరందం.
బతుకులు సాగిపోతున్నప్పుడల్లా,
కష్టాలు వెంటాడుతునే ఉంటాయి,
జీవితం కష్టసుఖాల కలబోత.

ఈ విధంగా కవి ఏ మొగ్గను చూసిన మనసు మహిమరిచిపోమే విధంగా ఉంటుంది.

మరొక మొగ్గ ను చూడండి
చినుకు స్నానమడితేనే కానీ
ఆకు ముత్యాన్ని కీరీటంలా ధరించదు,
వాన చినుకు మెరిసే ముత్యం.

ఇక్కడ వస్తువు చినుకు, చినుకు ఆకుపై పడి స్నాన మాడడమనేది కొత్త సృష్టించడం తన అభివ్యక్తి. ఆ చినుకును ఆకు ముత్యంలా ధరించడమనేది ప్రతీక. వానచినుకు ఆ ఆకుపై ఎలా ఉందంటే మెరిసే ముత్యంలా ఉంటుందనేది అర్థవంతమైన భావం. ఇలా మొదటి రెండు పాదాలకు మూడవ పాదం బలంగా, అర్థవంతంగా ఆవిష్కరిస్తేనే మొగ్గలు కవితాప్రక్రియకు బలం చేకురుతుంది.

కవిత్వం చదివితేనే కానీ
మనుసు హాయిగా నిద్రపోదు
అక్షరం ఆనంద విహారం.
గతాన్ని తవ్వితే కానీ
భవిష్యత్ కనిపించదు
చరిత్ర బక పాఠం.
పుస్తకాలను నిరంతరం చదివితేనే కదా,
మస్తిష్కంలో జ్ఞానం దీపమై వెలుగునిచ్చేది,
పుస్తకం బతుకుదారి చూపే చుక్కాని.
అమ్మ చేతి వంట తింటేనే కదా
ఏదైనా అమృతమై ఆకాలి తీరుస్తుంది,
అమ్మ ఆకాలి తీర్చే అక్షయపాత్ర.
కవి కవులను కవితలతో పలకరిస్తాడా,

అవి మానవతా పరిమళాలను వెదజల్లుతాయి,
కవితలు మమతానురాగాల మల్లెమొగ్గలు.

ఈ మొగ్గలు అనేక ప్రక్రియలో రావడం జరిగింది. ప్రేమ మొగ్గలు, నాన్న, ప్రముఖులపై మొగ్గలు, చేనేతమొగ్గలు, బాల్య మొగ్గలు, మొదలగు వాటిపై కవిత సంపుటిలు రావడం జరిగింది. అనేక మంది కవి మిత్రులు యువ కవులు, ప్రస్తుతం మొగ్గల ప్రక్రియలోనే తమతమ కవితలను రాస్తున్నారు.

ఆధారగ్రంథాలు :

"మొగ్గలు - నూతన కవితా ప్రక్రియ" పుస్తకం నుండి

⌘⌘⌘

BHAVAVEENA
Vol. 17, Issue. 8, August 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

శైవ సాహిత్యం – నవవిధ భక్తి మార్గాలు

- చంద్రమౌళి నాగమల్లేశ్వరి, పరిశోధక విద్యార్థి, ఆంధ్రా యూనివర్సిటి.

భక్తి (దేవనాగరి) ఒక పవిత్రమైన భావన. మనుషులలో భక్తి భావన కలవారిని భక్తులు అంటారు.

వైష్ణవులకు భక్తి ప్రక్రియ విష్ణువు, కృష్ణుడు లేదా అతని అవతారాలకు సంబంధించినది. అదే విధంగా శైవులకు శివుడు, శక్తి లేదా వారి అవతారాలకు సంబంధించినది.

భక్తి యోగం గురించి భగవద్గీతలో వేదాంతాల సారంగా పేర్కొన్నది. నారద భక్తి సూత్రాలు పలురకాల భక్తి విధాల గురించి పేర్కొన్నది.

భక్తిలో రకాలు :

భగవంతుని పొందడానికి భాగవతంలో నవవిధ భక్తులు అనగా 9 రకాలైన భక్తి మార్గాలు చెప్పబడినాయి. ఇందుకు ప్రామాణిక శ్లోకం భాగవతంలోని ప్రహ్లాద చరిత్రలో ఘట్టంలో చెప్పబడింది.

శ్రవణం కీర్తనం విష్ణోః
స్మరణం పాదసేవనం ।
అర్చనం వందనందాస్యం
సఖ్య మాత్మ నివేదనం ॥

పై శ్లోకాన్ని పోతన ఈ విధంగా చెప్పారు.

తను హృద్భాషలసఖ్యమున్, శ్రవణమున్, దాసత్వ
మున్, వందనార్చనముల్, సేవయు, నాత్మలో నెఱుక
యున్, సంకీర్తనల్, చింతనం బను తొమ్మిది భక్తి మార్గం
బుల సర్వాత్ముడైన హరిని నమ్మిన సజ్జనుడై యుండుట
భద్రమంచు దలతున్ సత్యంబు దైల్యోత్తమా.

శ్రవణ భక్తి :

సత్పురుషుల వాక్యాలు, సద్గ్రంధాలు విన్న మానవుడు మంచివాడుగా మారడానికి వీలవుతుంది. ఇవి జ్ఞానానికి మార్గం చూపుతుంది. దీని వలన మానవులకు భగవంతుని పట్ల విశ్వాసం పెరుగుతుంది. ఉదా : పరీక్షిత్తు మహారాజు శ్రవణ భక్తి నాశ్రయించి మోక్షాన్ని పొందాడు. హరికథ శ్రోతలు, ధర్మరాజు, జనమేజయుడు, జనకాదులు.

కీర్తనా భక్తి :

భగవంతుని గుణ విలాసాదులను కీర్తించుటకు కీర్తనా భక్తి భగవంతుని సాక్షాత్కరింప చేసుకోవడానికి కీర్తనా భక్తి ఉత్తమమైనది. వాల్మీకి, నారదుడు, తుంబురుడు, ప్రహ్లాదుడు, ఆళ్వారులు, నయనార్లు రామదాసు, తులసీదాసు, మీరాబాయి మొ॥న కీర్తనా భక్తితో పరమ పదం పొందారు.

స్మరణ భక్తి :

భగవంతుని లీలలను మనస్సులో నిలుపుకొని స్మరించుట స్మరణ భక్తి. ఇది నామ స్మరణం, రూప స్మరణం, స్వరూప స్మరణం అని 3 విధాలు మునులు ప్రహ్లాదుడు, ధృవుడు, తులసీదాసు, త్యాగరాజు మొ॥న నామస్మరణ భక్తితో ధన్యులైనారు.

పాదసేవన భక్తి :

భగవంతుని సర్వావయవాలలో ప్రాముఖ్యం వహించిన పాదాలు. వీటిని సేవించడం భగవంతుని పవిత్ర సేవలో సమానం. భరతుడు, గుహుడు మొ॥న వారు ఈ పాదసేవ ద్వారా ముక్తులైనారు.

అర్చన భక్తి :

ప్రతిరోజు తులసి పుష్పాదులు, ఇతర సుగంధ ద్రవ్యాలను సమర్పించి అర్చనా రూపంలో దేవుని పూజించడం అర్చనా భక్తి. మానవులు తాము నమ్ముకున్న భగవంతుని అర్చనా మూర్తులను ప్రతిష్టించుకొని పూజా ద్రవ్యాలతో దూప, దీప, నైవేద్యాలతో దేవతలను అర్చించడం ప్రస్తుత సమాజంలో ప్రాచుర్యం ఉంది. ఇంటిలోగానీ, హృదయంలోగానీ విధివిధానాలలో అర్చించటం.

ప్రస్తుత సమాజంలో ప్రాచుర్యం ఉంది. ఇంటిలోగానీ, హృదయంలోగాని విధివిధానాలతో అర్చించటం.

వందన భక్తి :

అనగా నమస్కారం. తన యందు మనస్సు నుంచి భక్తులై పూజించమని, నమస్కరింపుమని కృష్ణ పరమాత్మ భగవద్గీతలో ఉద్బోధించాడు. ఎన్ని యాగాలు చేసినా, శాస్త్రాలు చదివినా భగవంతుని నమస్కరించనివాడు ఆ ఫలితాన్ని పొందలేడు. ప్రణామం చేయడు.

దాస్య భక్తి :

ప్రతి మానువుడు తనకు ఇష్టమైన దేవునకు ఎల్లప్పుడు సేవకుడై, దాసుడై భక్తి శ్రద్ధలతో పూజించాలి. కులశేఖర ఆళ్వారు దాస్య భక్తికి అత్యంత ప్రాధాన్యమిచ్చారు. హనుమంతుడు, లక్ష్మణుడు మొ॥ వారు దాస్య భక్తినాశ్రయించి ముక్తిని పొందారు. హనుమంతుడు, రామదాసు.

సఖ్య భక్తి :

సఖ్యం అనగా స్నేహం. స్నేహం కలగని మంచి లేదు. భగవంతునిలో సఖ్య మేర్పరచుకున్న వారు ధన్యులు. అర్జునుడు, సుగ్రీవుడు మొ॥న వారు సఖ్య భక్తితో స్వామికి ప్రీతి పాత్రులైనారు. అర్జునుడు.

ఆత్మ నివేదన భక్తి లేదా ప్రపత్తి :

ఆత్మ నివేదన మనగా భగవంతుడు తప్ప అన్యులెవరూ లేరని శరణాగతి కోరడం. భక్తి మార్గాలన్నిటి కన్నా ఆత్మ నివేదన మోక్ష మార్గానికి సులభమైన మార్గం. ఈ మార్గాన ద్రౌపది, గజేంద్రులు ముక్తులైనారు. గోదాదేవి, మీరాబాయి.

శివ భక్తులు - శైవ భక్తి - భక్తి విధానం :

శివుడు సంస్కృతం. హిందూ మతంలోని ప్రధాన దేవతలలో ఒకరు. శివ అనగా సంస్కృతంలో శుభం, సౌమ్యం అనే అర్థాలున్నాయి. ఈయన త్రిమూర్తులలో చివరి వాడైన లయకారుడు. శివుడు పశుపతిగాను, లింగం రూపములోను, సింధూ నాగరికత కాలానికే పూజలందు కున్నాడు. నేటికీ దేశమంతటా శివాలయాలు అధిక సంఖ్యలో ఉన్నాయి. శివుడు రుద్రుడుగా పేర్కొన బడినవాడు.

శివుని ప్రత్యేకంగా ఆరాధించే హిందూ మతస్థులను శైవులు అంటారు. శైవణం, వైష్ణవం, శాక్తేయం హిందూ మతంలోని మూడు ముఖ్యమైన సంప్రదాయాలు. వినాయకుడు, కుమారస్వామి, అశోక సుందరి, జ్యోతి, మానసలు, పార్వతీ పరమేశ్వరుల పిల్లలు.

శివుడు ఆద్యంతాలు లేనివాడు, అతిశయించువాడు (ఎక్కడి నుండి ఎక్కడికైనా, ఏ కాలానికైనా అవలీలగా పయనించువాడు) రూపాతీతుడు. అందుకనే శివుణ్ణి

వందే శంభుముమాపతిం, సురగురం వందే జగత్కారణమ్..... వందే శివంశంకరమ్ అంటాం.

శివుడు జనన మరణాలకు అతీతుడు, కాలాతీతుడు. పరమ శివుని ఆకృతిలో ఒక్కొక్కదానికి ఒక్కొక్క అర్థం ఉన్నది.

1) శివుని త్రిశూలం : సత్వ, రజ, తమో గుణాలకు ప్రతిరూపాలు
2) ఢమరుకం : శబ్ద బ్రహ్మ స్వరూపం.
3) చంద్రవంక : మనోనిగ్రహానికి, గంగాదేవి, శాశతత్వానికి ప్రతీక.
4) సర్పాలు : భగవంతుని జీవాత్మలు గానూ, ధరించిన పులి చర్మం అహంకారాన్ని, ఆశీనంపై పులి చర్మం కోరికలకు దూరంగా ఉండమని ప్రభోదిస్తుంది.
5) భస్మం : పరిశుద్ధతను తెలియజేస్తుంది.

ఆయన పట్టుకున్న నాలుగు జింకకాళ్ళు చతుర్వేదాలకు, నందీశ్వరుడు సత్సంగత్వానికి, నంది ధర్మ దేవతకు, మూడువ నేత్రం - జ్ఞానానికి సూచికగా పరిగణించ బడ్డున్నవి.

ఈ పరమ శివుని పూజించి భక్తులు ఎందరో శివ కైవల్యమును పొందారు. ఈ పరమ శివుని రకరకాలుగా ధ్యానిస్తూ ఉంటారు 1) ఆదిదేవుడు 2) రుద్రుడు,

పరమశివుడు, గంగాధరుడు, గౌరీపతి, నటరాజు, కైలాసాధిపతి, పశుపతి, గరళకంఠుడు, హరుడు, చంద్ర మౌళి, ముక్కోటి, పాలాక్షుడు, నీలకంఠుడు, దక్షిణా మూర్తిగా వివిధ రూపాలలో భక్తులకి దర్శన భాగ్యం కలుగజేస్తాడు.

ప్రాచీన కాలంనుండి ఎందలో భక్తులు పైన పేర్కొన్న వివిద పద్ధతులలో శివుణ్ణి కొలిచి ముక్తిని పొందారు. వారిలో కొందరు ప్రముఖులు 1) ఆదిశంకరాచార్యుడు 2) నయనార్లు 3) భక్త కన్నప్ప 4) మార్కండేయుడు 5) రావణుడు

ఆదిశంకరాచార్యుడు :

సమకాలీన హిందూ మతం ఆలోచనా సరళిపై అత్యంత ప్రభావం కలిగిన సిద్ధాంతవేత్త ఆదిశంకరా చార్యులు. ఆదిశంకరులు, శంకర భగవత్పాదులు, త్రిమతాచార్యులలో ప్రథములు. ఈయన ప్రతిపాదించిన సిద్ధాంతాన్ని అద్వైతం అంటారు. క్రీ.శ. 788-820 మధ్యకాలంలో శంకరులు జీవించారని అంచనా. శంకరులు సాక్షాత్తు శివుని అవతారమని నమ్మకం ఉంది.

"దుష్టాచార వినాశాయ ప్రాతుర్భూతోమహీతలే
స ఏవశంకరాచార్యః సాక్షాత్ కైవల్య నాయకః

దుష్టాచారములను నశింపవేయటానికి కైవల్య నాయ కుడైన శంకరుడే ఆదిశంకరుని రూపంలో అవతరించాడు (శివ రహస్యము నుండి)

బౌద్ధ మత ప్రభావం వల్ల క్షీణించిన హిందూ ధర్మాన్ని పునరుద్ధరించడం. అయితే ఈ ప్రక్రియలో ఏ విధమైన బల ప్రయోగం లేదు. దేశదేశాలలో పండితులలో వాదనలు సాగించి, వారిని ఒప్పించి, నెగ్గి, శంకరులు తన సిద్ధాంతాన్ని వారిచే మెప్పించాడు.

ఉపనిషత్తులకు, భగవద్గీతకు, బ్రహ్మసూత్రాలకు, విష్ణు సహస్రనామాలకు భాష్యం వ్రాసారు. శృంగేరీ, ద్వారక, పూరి, జ్యోతిర్మఠం అనే నాలుగు మఠాలను స్థాపించారు. ఇవి హిందూ ధర్మానికి 4 దిక్కులా దీప స్తంబాల్లా పనిచేసాయి.

గణేశ పంచరత్న స్తోత్రం, భజ గోవిందం, లక్ష్మీ నృసింహ కరవాలంబ స్తోత్రం, కనకధార స్తోత్రం, శివానంద లహరి, సౌందర్య లహరి స్తోత్రాలు ఈనాటికీ శైవమతస్తులకు, హిందువలకు స్తోత్రాలుగా ఉపయుక్తమౌతున్నాయి. ఈయన 108 గ్రంథాలు రాసారు.

శంకరులు బోధించిన తత్వం "అద్వైతం" అనగా రెండు కానిది. ఆత్మ, బ్రహ్మము (పరమాత్మ) ఒకటే అనేది అద్వైతం మూలసూత్రం. ఇందుకు మౌలికమైన సూత్రాలను శంకరుల ప్రస్థాన త్రయం నుండి గ్రహిం చారు.

అద్వైతం అనే సిద్ధాంతాన్ని మొట్ట మొదటిసారి ప్రతిపాదించింది శంకరుడే. అతని "వివేక చూడామణి" అనే ప్రకరణ గ్రంధంలో అద్వైతం గురించి క్లుప్తంగా ఇలా చెప్పబడింది.

బ్రహ్మ సత్యం జగన్మిధ్య జజీవోబ్రహ్మవన-పరః

బ్రహ్మమమే సత్యం, జగత్తు, మిధ్య, జీవునకు, బ్రహ్మమునకు భేదం లేదు.

బౌద్ధ, జైన మతాలు ప్రాబల్యం కారణంగా హిందూ మతం క్షీణదశలో ఉంది. అనేక శాఖలు వారు తగవులాడుకుంటుండేవారు మీమాంస, సాంఖ్యవాదులు దాదాపు దేవుడిని నమ్మారు. చార్వాకులు వేదాలను నిరసించారు. ఆదిశంకరులు వివిధ శాఖలకు చెందిన వారిని పండితులను ఓడించి వారిచేత తన సిద్ధాంతాన్ని ఒప్పించారు. కేవలం 32 సం॥రాలు జీవించిన శంకరా చార్యులు దశ నామ సంప్రదాయం, షణ్మత విధానం, పంచాయతన విధానం శంకరులు నెలకొల్పినవే.

శంకరుల తరువాత రామానుజాచార్యుడు, మధ్వా చార్యుడు, హిందూమంతం పునరుద్ధరణలో ముఖ్యమైన పాత్ర వహించారు. ఇప్పటికీ ఈ ముగ్గురు ప్రారంభించిన తత్వ వేదాంత పూజాది నియమాలు, సంప్రదాయాలలో కొన్నింటిని హిందువులు పాటిస్తున్నారు.

నయనార్లు : నయనార్లు క్రీ.శ. 5, 10 శతాబ్దాల మధ్య తమిళనాడు రాష్ట్రంలో నివశించినట్లుగా చెప్పబడు తున్నది. 63 మంది గొప్ప శివభక్తులు. వీరి గురించి 13వ శతాబ్దంలో రచించబడిన తమిళ ప్రబంధం పెరియ పురాణంలో విపులంగా వ్రాయబడి వుంది. వీరు భక్తి ద్వారా మోక్ష సిద్ధ పొందినట్లు ఈ పురాణం ద్వారా తెలు స్తోంది. వీరు భగవతుని తల్లిగా, స్నేహితునిగా, కొడుకుగా, యజమానిగా, ప్రేయసిగా భావించి పూజించారు.

క్రీ.శ., 4,5 శతాబ్దముల వరకున్ను దేశములో బౌద్ధ, జైన మతములు సుస్థిరపడినవి. వాటి మూలమున వైదిక మతమునకు గొప్ప దెబ్బ తగిలినది. తమిళ దేశము నుండి వచ్చిన బ్రాహ్మణులు ఉత్తర వైదిక మతము కున్నూ, దక్షిణ వైదిక మతముకున్ను కలిగిన సమ్మేళనము వలన క్రొత్త సాంప్రదాయమును ఏర్పర్చిరి. ఇవియే తమిళ సంప్రదాయము, తమిళ వైష్ణవ సాంప్రదాయము అనేవి.

తమిళ శైవ సంప్రదాయము నయనార్లములుగ, తమిళ వైష్ణవ సంప్రదాయము ఆళ్వార్ల మూలమున వ్యాప్తి చెందినవి.

బౌద్ధ, జైన మతములు స్థిరపడడానికి తోడ్పడిన ముఖ్య విధానము ఆహార - అభయ - భైషజ్య శాస్త్ర దానము. వీటిలో ఆహార, అభయ, భైషజ్యములు వారైన ఈ మూడింటినీ వినియోగించే తమ మతమును వ్యాప్తిలోనికి తెచ్చుకొనేది. ఆ పద్ధతినే అవలంభించకపోతే శైవమతము వ్యాప్తిలోనికి వచ్చి, బౌద్ధ, జైన మతాలు నిలుపుదల చేయవచ్చని, దానికి తోడు కేవలం శాస్త్రమే కాదు, భక్యావేశము కూడా పుట్టిస్తేగాని, మొదటి మూడు నిష్ప్రయోజనములని ఆనాటి శైవమతావేశపరులు ఆచరణలోకి తెచ్చారు. అందులో భక్తి వ్యాప్తికి భక్తి చరిత్రములు చాలా ఉపయోగపడినవి. ఆ శైవభక్తులకే "నయనార్లు" అని పేరు.

నయనారు అంటే పూజ్యుడు అని అర్థము. శివ భక్తు లెవరైనా పూజ్యులే. వీరిలో ఎక్కువ ప్రసిద్ధి పొందిన వారి పేర్లు జనశ్రుతిలో స్థిరముగా నిల్చినవి. వీరినే అరవత్తు మూవురు అని అంటారు.

నయనార్లసంఖ్య 63గా ఏర్పడటానికి కారణం లేకపోలేదు. జైన సంప్రదాయములో త్రిషష్టి శలాక పురుషులున్నారు. త్రిషష్టి నటులే శైవులు ఉప యోగించుకున్నారు. వీరిలో 24 తీర్థంకరులు, 12 గురు చక్రవర్తులు, 9 గురు బలదీవులు, 9 గురు వాసుదేవులు, 9 గురు ప్రతి వాసుదేవులు చేరి మొత్తం 63 మంది అయినారు. తమిళ నయనార్లులో మొత్తం 63 మంది వీరిలో ఋషభుడు మొదటివాడు. శైవములో బసవైడ నాడు. మూడోవాడు శంభుడు. ఇతడు నయనార్లలో శంభుచిత్తుడైనాడు. నాల్గోవాడు అభినందనడు. ఇతడే అభిరాముడనే నయనారుడయినాడు.

భక్త కన్నప్ప :

భక్త కన్నప్ప గొప్ప శివ భక్తుడు. పూర్వాశ్రమంలో తిన్నడు అనే బోయవాడు. చరిత్ర ప్రకారం శ్రీకాళహస్తి పరిసర ప్రాంత అడవుల్లో సంచరిస్తూ వేటాడి జీవనం సాగించే వాడు. ఒకనాడు అలా వేడాడుతుండగా అతనికి అడవిలో ఒకచోట శివలింగం కనబడింది. అప్పటి నుంచి తిన్నడు దానిని భక్తి శ్రద్ధలతో పూజిస్తూ వేటాడి తెచ్చిన మాంసాన్నే నైవేద్యంగా పెడుతుండేవాడు.

కన్నప్ప తెలుగువాడు. రాజంపేట ప్రాంతంలోని ఊయన స్వస్థలం. ఆ ప్రాంతానికి నాగడు అనే ఒక బోయరాజున్నాడు. అతని ఇల్లాలు పేరు దత్త. వీరిరువురూ సుబ్రహ్మణ్యస్వామి భక్తులు. స్వామి దయవలన వీరికి కలిగిన పుత్రుడికి తిన్నడు అనే పేరు పెట్టుకున్నారు., నాగడు తిన్నడికి సకల విద్యలు నేర్పించి రాజుగా చేసాడు. ఒకనాడు బోయడు వేటకు వెళ్ళగా పంది అతని వల నుండి తప్పించుకొనిపోగా, తన అనుయాయులతో పందిని తరమగా అలసట వచ్చి చెట్టు ముందర ఆగింది. దాన్ని చూచి అందరూ అలసిపోయారు. వెంటనే దాన్ని చంపి దాన్ని స్వర్ణముఖీ నదీ తీరానికి తీసుకుపోయారు.

కాళహస్తి కొండ దేవాలయము కన్పించాయి. వెంటనే తిన్నడు శివుడిని చూడాలనే కోరికతో కొండపైకి వెళ్ళి నీవు ఒంటరిగా ఎలా వున్నావయ్యా అంటూ, ఈశ్వరా ఈ దట్టమైన అడవిలో ఎలా ఉన్నావు. నీకు ఆహారము ఎలా వస్తుందనే భావనతో పంది మాంసమును తెచ్చి ఈశ్వరునికి నైవేద్యం ఇస్తాడు.

నాముడు ఈశ్వరునికి ఆహారము సమర్పించే ముందు ప్రతిదినము నీటితో అభిషేకింపబడుతాడని, పూలతో పూజింపబడతాడని చెప్పాడు. అది విన్న తిన్నడు నోటితో నీళ్ళను పుక్కిలి బట్టి సేకరించి పూలను తన తలమీద వుంచుకొని, వచనము చేసిన మాంసమును చేతిలో ఉంచుకొని, విల్లు అంబులతో తిన్నగా శివునిపై వదిలాడు అది అభిషేకమైంది. తల మీద వున్న పూలతో శివుని అలంకరించాడు. అది అర్చనయింది. తెచ్చిన పంది మాంసం ముందు పెట్టాడు అది నివేదన అయింది. ద్వారం వద్ద ఉండి కాపలా కాశాడు. ప్రతి రోజు ఇతను మంత్రయుక్తముగా సంప్రోక్షణ చేసి, మళ్ళీ స్నానం చేసి, అభిషేకం చేసి, పూలతో అలంకరించేవుడ. ఈ విధంగా 5 రోజులు జరిగాయి.

అర్చకుడు దీనిని చూసి నివ్వెరపోయి రోదిస్తూ పరమ శివుని ప్రార్థించాడు. ఈ ఘోర కలినిలపు స్వామి అని ఎలుగెత్తి ప్రార్థించాడు. అర్చకునకు కలలో కనిపించి నీవు లింగము వెనుక దాగియుండు బయటకు రాక అక్కడ ఏమి జరుగుతుందో గమనించు అని ఆదేశించాడు.

6వ రోజు యదావిధిగా గుడికి వెళ్తుండగా, తిన్ననికి కొన్ని దుశ్శకునాలు కనబడ్డాయి. ఏదో శివునకు అపకారము జరుగుతుందని భావించాడు. గుడికి పరుగెత్తికెళ్ళి చూసాడు. శివుని కుడి కన్ను నుండి రక్తం కారుతున్నది. దేవుకి తెచ్చిన అభిషేక ద్రవ్యములు క్రిందపడిపోయినవి. బిగ్గరగా ఏడ్డాడు. తనకు తెల్సిన మూలికా వైద్యం చేసాడు. రక్తం ఆగలేదు. వెంటనే కన్నుకు కన్ను సిద్ధాంతముగా స్ఫూరించింది. సంతోషించాడు, నృత్యం చేసాడు. ఇప్పుడు శివునికి ఎడమ కన్ను నుండి రక్తం రావడం గమనించాడు. భయము లేదు ముందు గమనించాడు కాబట్టి శివుడు ఎడమకంటిపై కాలిని బెట్టి తన ఎడమ కన్నును తీసేలోపుగానే పరమ శివుడు వెంటనే ప్రత్యక్ష మయి నిలుపుము కన్నప్పా ! నీ భక్తికి మెచ్చాను. నీ చిత్తము అట్టి పవిత్రమైనది నా హృదయము సంపూర్ణా నందభరితమైనది.

తన కన్ను శివునిక్పించునందులకు తిన్నడు కన్నప్ప అయ్యాడు. కన్నప్ప నాయనారు అయ్యాడు. నేత్రశయ నారు అనునది సంస్కృత నామము. కన్నప్పను శివుడు తన దగ్గరకు చేర్చుకొని కన్నప్పకు రెండు కళ్ళను ప్రసాదించాడు. శివునికి తిన్నడు తన రెండు కళ్ళను పీకి ఇవ్వడంలో తిన్నని సంపూర్ణ శరణాగతి ఆత్మనివేదన గోచరిస్తోంది. అంతకన్నా అనితరమైన భక్తి తత్పరత కనిపించదు.

ఇలా వేదం, నాదం, యోగం, శాస్త్రాలు, పురాణాలు ఏమీ ఎరుగని ఒక మామూలు వ్యక్తి తన భక్తితో ఆ మహాదేవుని ప్రసన్నం చేసుకున్నాడు. ఈ సామ్రాజ్యరాజు శైవులకే కాదు, తెలుగువారందరికీ ప్రాతః స్మరణీయుడు

మార్కండేయుడు :

మృకండు మహర్షి యొక్క సంతానంబాలునిగానే యముని జయించి, శివుని ఆశీస్సులతో చిరంజీవిత్వాన్ని పొందిన సద్గుణుడు.

మృకుండు మహర్షి సార్థక నామధేయుడు. ఆయన తపస్సులో లీనమై నిశ్చయులుడై ఉన్న సమయంలో ఆయన శిలవలె ఉండడం వల్ల మృగములు వచ్చి తమ కండుయాన్ని తీర్చుకునేవి. మృగముల కండుయాన్ని తీర్చినవాడు కాబట్టి ఆయనను మృకండు మహర్షి అని పిలిచారు. మరుద్వతి అనే మహాసాధ్వి ఈయన భార్య. పుత్రులు లేకపోతే ఉన్నత గతులు కలగవని భావించి వారణాశి తపస్సు చేయడానికి సతీసమేతముగా బయలు దేరాడు. వారణాశిలో వారు రెండు లింగాలు ప్రతిష్ఠించి, శివుడి గురించి ఘోర తపస్సు చేసాడు. మహాదేవుడు మెచ్చి ప్రత్యక్షమై మృకుండ మహర్షిని మరోమారు పరీక్ష

చేయడానికి, సద్గుణుడైన 16ఏళ్ళు బ్రతికే పుత్రుడు కావాలా లేక దుర్గుణుడై చిరంజీవి కావాలా అని ప్రశ్నించగా, మృకుండ మహర్షి సద్గుణుడైన 16 ఏళ్ళు బ్రతికే పుత్రుడు చాలంటాడు. మహాదేవుడు సంతసించి పుత్రుడ్ని ఇచ్చాను అని పల్కి అదృశ్యమైపోతాడు.

మహాదేవుని మాట ప్రకారం మరుద్వతి గర్భవతియై 9 నెలలు నిండాక దివ్య తేజస్సును కలిగిన పుత్రుడిని ప్రసవించింది. మృకుండ మహర్షి కొడుకు కావడం వల్ల మార్కండేయుడు అయినాడు. 7 సం॥ 3 నెలలు నిండగానే ఉపనయనం చేసారు. సప్త ఋషులు ఈ వేడుకకు వచ్చి చిరంజీవా అని దీవిస్తారు.మృకుండుడు చిరంజీవిగా ఉంటాడా అని అడుగగా శివునికి, మృకుండు మహర్షి జరిగిన సంవాదమంతా తెల్సుకొని "మార్కండేయుడని నిరంతరం శివారాధన చేయమంటారు. బ్రహ్మ కూడా శివుని గురించి తపస్సు చేసి మార్కండేయుడిని కూడా చేయమని చెబుతాడు.

16 సం॥లు నిండిన తర్వాత యముడు యమ కింకరుల్ని పంపుతాడు. వారు మార్కండేయుని దివ్య తేజస్సును చూసి భయపడి వెళ్ళిపోగా, యమధర్మరాజు దున్నపోతు వాహనం మీద బయలుదేరి వస్తాడు. యముడు వచ్చే సరికి మార్కండేయుడు అకుంఠిత దీక్షతో శివారాధన చేస్తుంటాడు. యముడు తన యమపాశాన్ని విసరగా మార్కండేయుడు శివా ! మహాదేవా ! కాపాడు అంటూ మార్కండేయుడు అన్న వెంటనే శివలింగం నుంచి మహాదేవుడు ఉద్భవించి కాలరూపుడై యముడి పైకి వస్తాడు. దీన్ని జూసి యముడు క్షమించు పరమేశ్వరా అని వెళ్ళిపోతాడు.

రావణుడు :

రావణుడు హిందూ ఇతిహాసమైన రామాయణములో ప్రధాన ప్రతినాయకుడు. రామాయణం ప్రకారం రావణుడు లంకకు అధిపతి. పౌలస్త్య బ్రహ్మవారసుడు. రావణుడు ఒక గొప్ప రాజనీతి కలవాడు. ఒక రాజుకు ఉండాల్సిన లక్షణాలు కలవాడు. కనుకనే ఇప్పటికీ శ్రీలంక దేశంలో అతనిని పూజిస్తున్నారు. మహాశివుడు భక్తుడు, ఎంతో గొప్ప మేధావి అయినా ధర్మాన్ని పాటించక పోతే అన్నీ వ్యర్థమే అడానికి రావణుడు ఒక ఉదాహరణగా చెప్పవచ్చు.

రాక్షసులరాజు. ఇతని రాజధాని లంక. తండ్రి పులస్త్యునికి కొడుకు అగు విశ్రవసుడు. తల్లి సుమాలి, కూతురు అగు కైకసి, భార్య యముని కూతురు అగు మండోదరి, సోదరులు కుంభకర్ణ, విభీషణులు, కొడుకులు ఇంద్రజిత్తు మొ॥ వారు. ఇతనికి పది తలలు ఉండుటచే దశకంఠుడు, దశగ్రీవుడు అను నామధేయాలు కలవు.

ఇతడు మహత్తరమగు తపము సలిపి బ్రహ్మ వలన తనకు మనుష్యులు తప్ప తక్కిన వారిచే చావు లేకుండా వరము పొంది ఆ వర ప్రభావముచే మిగుల గర్వితుడైనాడు. త్రిలోకములందు ఉండు సాధువులను, ఎల్ల వారిని, మిగుల హింస పెట్టుచు ఉండెను. ఆ హింసలకు ఓర్వజాలక మునులను, దేవతలను, బ్రహ్మ వద్దకు పోయి మొరనాలపించిరి. అప్పుడు బ్రహ్మ వారిని పిలుచుకొని పాలసముద్రమున ఉండు విష్ణువు దగ్గఱకు పోయి ప్రార్థింపగా అతడు మనుష్య రూపమున ఉన్న శ్రీరాముడు అను పేర భూమి మీద అవతరించి ఈ రావణుని చంపెను అని తెలిపినాడు.

తర్వాత విజయగర్వముతో కిష్కిందకు పోయి అచట వాలిని కనబడక అతను స్నానార్థమై దక్షిణ సముద్రమునకు పోయినాడని తెల్సుకొని వాలిని బంధించ ప్రయత్నం చేయగా అతనిని పట్టుకొని నాలుగు సముద్రముల యందు ముంచి వేసి పిమ్మట ఏమీ ఎఱుగనట్లుండెను. దానితో రావణుడు సిగ్గుపడి వెడలిపోయెను.

లంకను జయించిన పిమ్మట రావణుడు మనోహరమైన కైలాస పర్వతాన్ని చూసాడు. తన బలనిరూపణకై దాన్ని పెకలించి ఎత్త ప్రయత్నించాడు. దశకంఠుని గర్వానికి కోపించిన శివుడు తన కాలి చిటికెన వేలుతో కైలాస పర్వతాన్ని నొక్కి దాని కింద రావణున్ని అణగదొక్కాడు.

అప్పుడు రావణుడు అతి బిగ్గరగా చేసిన ఆర్తనాదం వల్లనే అతనికి ఆ పేరు వచ్చింది.

రావణుడు భయంకరమైన 'రవం' (శబ్దం) చేయు వాడు. అతని అరుపుకి కంపించినట్లుగా వర్ణించబడింది. శివునితో తలపడ్డ తన తప్పుని ప్రమధ గణాలు తెలియ చెప్పగా రావణుడు మిక్కిలి పశ్చాత్తాపానికి లోనయ్యాడు. అప్పుడు శివుని మెప్పించుటకు ఎన్నో విధాలుగా, పలు సంవత్సరాల పాటు స్తుతించగా అతని శౌర్యానికి, భక్తికి మెచ్చిన ముక్కంటి ఎన్నో వరాలతో పాటుగా 'చంద్రహాస' ఖడ్గాన్ని కూడా ప్రసాదించాడు.

ఇంతేకాక ఈ రావణుడు దేవేంద్రునితో యుద్ధము చేయునప్పుడు ఇంద్రుని ఏనుగు అగు ఐరావతము తన కొమ్ములతో వీనిరొమ్మున క్రుమ్మగా ఆ కొమ్ములు విరిగి పోయెను. కనుక వీడు దృఢమైన దేహములు కలవాడు అని ఊహింపవలయును. ఇతనికి బ్రహ్మ వర ప్రభావము చేత కడుపున అమృత కలశము ఒకటి కలిగి ఉండుటచే వీని తలలు ఎన్ని మారు నరికినను మరల మరల మొలచుచు ఉండును.

ముగింపు :

కరుణ చూపమనో, కృప సాధించాలనో, అనుగ్రహం పొందాలనో, కోరికలు తీర్చుకోవాలనో భగవంతుణ్ణి ఆశ్రయిస్తాం. గుడికెళ్ళి కొబ్బరికాయలు కొట్టి పూజ చేయించి ఆ కోరికలు తీరగానే లేదా తీరకుండానో అవన్నీ మర్చిపోతాం. ఆ కోరిక తీరకపోతే అప్పుడు మనిషికి ఆ పని సాధించాలనే కోరిక, పట్టుదల, విశ్వాసం ఉండాలి. సహనంతో ఆలోచించగలగాలి. ఇబ్బందుల్ని తట్టుకొనే శక్తి ఉండాలి.

ఆ పని మన వల్ల కాదు అనుకున్నప్పుడు ఆ పనిలో నిపుణులనో, అనుభవజ్ఞులనో, ఆశ్రయించటం జరుగు తుంది. ఇక ఆ పని పూర్తవడానికి మనకెవరూ సహకరించరు అనుకున్నప్పుడు భగవంతుని మీద దృష్టి పెడతాం. ఆపదలో ఆదుకున్నవాడే ఆప్త మిత్రుడు. అందరినీ సమానంగా చూసే భగవంతుడే ఆప్తమిత్రుడు. మరి భగవంతుడు ఏం చేస్తే దగ్గరవుతాడు. అతనితో స్నేహం చేసేదెలా? మనకి భగవంతుడు రాళ్ళలోనో, ఫోటోల్లోనో తప్ప మనిషిలా కనిపించడే? అతనికి దగ్గరవటానికి ఒకేదారి ఉంది అది భక్తి మార్గం. మరి భక్తి అంటే ఏమిటి? భగవంతుడిపై అవ్యాజమైన ప్రేమే భక్తి. సర్వం పొందాలనే కోరిక ప్రేమలో ఉంటుంది. సమస్తం సమర్పించాలనే కోరిక భక్తిలో ఉంటుంది. భక్తి అంటే సర్వం సమర్పించుకోవడం. ఏది మనది అనుకుంటామో అదేది మనది కాదు. మరి భగవంతుడు మనిషి కాదుగా అంటే ..... రాముడు, కృష్ణుడు, సాయిబాబా, రమణమహర్షి, ఏసుప్రభువు, మహమ్మద్, గురునానక్ వీరందరూ మానవ రూపంలోనే భూమిపై అవతరించారు.

భగవంతునికి దగ్గరవ్వాలంటే ఏం చేయాలో తెల్సుకొని మనమందరం భగవంతున్ని సేవించిన పరీక్షిత్తు, నారదుడు, ప్రహ్లాదుడు, బిల్వ మంగళుడు, భక్త జయదేవుడు, హనుమంతుడు మొ॥ వారు ఏ విధంగా భగవంతుని అనుగ్రహం పొందారో తెల్సుకోవాలి.

భక్తి, జ్ఞాన, కర్మ యోగాల ద్వారా భగవంతుణ్ణి పొందవచ్చు అని శాస్త్రాల ద్వారా నిరూపణ జరిగినప్పటికీ, అవన్నీ ఒకటే తప్ప వేరు కాదు. భగవంతుడెవరు? అతని తత్వమేమిటి ? అతను సాధారణమైన రాయా లేక రప్పా ! విశ్వమంతా వ్యాపించిన చైతన్యమా ! దగ్గరవడం ఎలా? అనే విషయాలు తెల్సుకొంటే - అది (జ్ఞానం) ! భగవంతునికి దగ్గరవడానికి భక్తులు ఏం చేసి దగ్గరయ్యారో తెల్సుకొని ఆచరిస్తే (కర్మ) ఈ మొత్తాన్ని అర్థం చేసుకుంటే భగవంతుడి అనుగ్రహం పొందడంలో అవశ్యకత (భక్తి).

నిప్ప ముట్టుకుంటే కాలుతుంది. ఆకలి వేసినప్పుడు అన్నం తింటే కడుపునిండుతుంది. వ్యాయామం వల్ల ఆరోగ్యం కల్గుతుంది. ఇవన్నీ మనకు అనుభవానికి వస్తున్నప్పుడు వీటిని సృష్టించిన భగవంతుడెందుకు అనుభవానికి రాడు. భవగంతుణ్ణి ఆచరణలో పెట్టుకొనే మార్గమే "నవ విధ భక్తి మార్గం".

ఆధార గ్రంధాలు :

1) ముప్పాళ్ళ హనుమంతరావు (1997) పేజీ 615.

2) శివుడు వికీపీడియా https://te.m.wikipedia.org.

3) భగవద్గీత - భీష్మ పర్వము, 25వ అధ్యాయం నుండి 42వ అధ్యాయం వరకు.

4) నవవిధి భక్తి రీతులు - శ్రీ జయదయాళ్‌జీ గోయన్దకా.

5) ఓం నమో శ్రీనారసింహాయ - భండారు పర్వతరావు

6) శ్రీమద్భాగవతము - సరళాంధ్రపరివర్తన - ఏల్చూరి మురళీధరరావు.

⌘⌘⌘

BHAVAVEENA
Vol. 17, Issue. 8, August 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

ఆముక్త మాల్యద – సామాజికాంశాలు

– డా॥. భూపతిరాజు బంగార్రాజు, స్కూల్ అసిస్టెంట్, తెలుగు, జి.ప.ఉ. పాఠశాల, అలంపురం, ప॥గో॥ జిల్లా.

ప్రబంధమంటే అష్టాదశ వర్ణనలతో మలచిన కావ్యం. ఇతిహాస, పురాణాలలో చిన్న కథను తీసుకొని కల్పిత కథతోను, వర్ణనలతోను పెంచి చక్కని కావ్యంగా మలిచిన దానిని మనం ప్రబంధంగా చెప్పుకుంటున్నాం. నూతన మైన కల్పిత కథను వర్ణనలను జోడించినపుడు ఆ కవుల కాలం నాటి విశేషాలన్ని కావ్యంలో ఎంతో కొంత అవ్యవధానంగానయినా, చొప్పించడం జరుగుతుంది. అందులోను ప్రబంధాలలో వర్ణనాంశాలు ఎక్కువగా ఉంటాయి. కనుక ప్రబంధ కవుల కాలంనాటి సామాజిక విశేషాలు కావ్యంలో అక్కడక్కడా మనకు సాక్షాత్కరిస్తాయి అనడంలో అతిశయోక్తి లేదు. ఇక్కడ ఆచార్య నేతి అనంత రామశాస్త్రిగారి మాటలు గమనింపదగినవి.

''మన పూర్వులు ఎటువంటివారో, వారి జీవన విధానం ఎటువంటిదో ఎవరికి తెలుసు? సర్వసాధారణంగా ప్రతీతరం వారికి తమ పూర్వుల వ్యవహారాలను తెలుసుకోవాలనే తాపత్రయం ఉండడం సహజం. అయితే చరిత్ర మనకు అటువంటి విషయాలను అంతగా తెలుపకపోవచ్చు. అందువల్ల సాహిత్యానికి అగ్రతాంబూలం ఇచ్చారు. మన కవులు తమ తమ కావ్యాలలో సామాజిక జీవన విధానాలను పొందుపరిచారు. మన పూర్వులు ఏ ఏ వృత్తులను అవలంభించారో, ఎటువంటి ఆభరణాలను ధరించేవారో, ఏ ఏ దేవతలను పూజించారో, ఏ విశ్వాసాలతో జీవించేవారో, ఏ ఆట పాటలతో ఆనందించేవారో, ఎటువంటి కళలపట్ల ప్రీతికలవారో, ఏ ఏ దేశాలతో వాణిజ్య వ్యాపారాలు సాగించేవారో, ఎటువంటి భోజనాలు భుజించేవారో, ఉత్సవ సందర్భాలలో ఏ విధంగా ఆచరించేవారో, మొదలైన జనుల ప్రవర్తనా విధానాలను తెలుగు కావ్యాలద్వారా మనం సమాజాన్ని దర్శింపవచ్చు. ఇటువంటి చిత్రణ కేవలం సాహిత్యం ద్వారా ఎక్కువభాగం తెలుసుకోవడానికి వీలుంటుంది. తెలుగు కావ్యాలలో సమాజదర్శనం అనే విషయాన్ని గురించి వ్రాయడం ఒక సిద్ధాంత వ్యాసమే అవుతుంది''.[1] ఆ దృష్ట్యా చూసినపుడు నాకు కనిపించిన సామాజిక అంశాలను, మీ ముందుంచుతున్నాను.

ఆముక్త మాల్యద కర్త శ్రీకృష్ణదేవరాయలు రాజ్యపాలన చేసిన సమయంలో ఆయన పరిపాలనలో ప్రజా సంక్షేమం ఎలా ఉందో అని వారే స్వయంగా మారు వేషాలలో తిరుగుతూ తెలుసుకునేవారని చారిత్రక గ్రంథాల వలన మనకు తెలుస్తోంది. ఆ విధంగా సంచరిస్తున్నప్పుడు వ్యవసాయ విషయాలు, రక్షణ సంబంధమైన విషయాలు, ప్రజల జీవన విధానం మొదలైన అంశాలను పరిశీలించి చూసినట్టుగా ఆముక్తమాల్యద కావ్యం ద్వారా మనకు తెలుస్తోంది.

ఆముక్తమాల్యద ద్వితీయాశ్వాసంలో గ్రీష్మఋతు వర్ణన చేసే సందర్భంలో ప్రజలు ఎండాకాలంలో నీటికోసం ఎంతగానో అవస్థపడేవారని ఈ క్రింది పద్యం ద్వారా మనకు అవగతమవుతోంది.

శా॥ ప్రాతర్వేళల నట్టివెట్ట సొగసై పాటిల్లె గుంభోం భవో
ద్భూతాంబు ధ్వని వాద్యమై మరుదధఃపుంజీభవత్పాటల
వ్రాతామ్రేడిత సిక్త భూసుర భిళారాంమాంబుకుల్యా బహూ
స్రోత స్సంధుల సంధుయంత్రనతి కృత్పోద్గీత గేయౌఘముల్ - (ఆ.ద్వి.ఆ. - 55ప)

పై పద్యంలో ప్రాతఃకాలంలో లేచి పొలంవెళ్ళి ఏతాం వేసి నీళ్ళు తోడి సేద్యం చేసేవారని తెలుస్తోంది. ఎండాకాలంలో కూడా. ఆ రోజుల్లో నీటిని తోడుకుని కష్టపడి వ్యవసాయం చేసేవారని, తెల్లవారకుండానే రైతులు

మేల్కని శ్రద్ధగా సేద్యం చేసుకునేవారని తెలుస్తోంది. ఏతాం వేసి నీటిని తోడుతుంటే రమణీయమైన దృశ్యాన్ని ''కుంభోంభవోద్భాతాంబు'' అనే పద ప్రయోగం ద్వారా కృష్ణదేవరాయలు శబ్ద చిత్రం ద్వారా చూపించినట్ల య్యింది.

తే॥ తోఁటఁ బగలుండి, మల్లెలు దుఱిమి, కావు
లమర మాపైన నిక్షుయంత్రముల కొయ్యఁ
జేరు ప్రజవొల్చె భావి వృష్టికిని గ్రుడ్డు
తో మధురి మేచ్ఛడిగునెఱ్ఱ చీమలనఁగ

- (ఆ.ద్వి.ఆ.- 70 ప)

పైన పేర్కొన్న పద్యంలో ''ఇక్షుయంత్రముల'' పద ప్రయోగాన్ని చూస్తే చెఱుకును ఎక్కువగా పండించేవారని, చెఱుకురసాన్ని తీసే యంత్రములు 16వ శతాబ్దంలోనే ఉన్నట్లు మనకు తెలుస్తోంది. లేకపోతే కృష్ణదేవ రాయలం తటివాడు 'ఇక్షుయంత్రములు' పదప్రయోగం చేసి ఉండేవారు కాదు.

అతి సుందరమైన ప్రకృతి సన్నివేశాలను కళ్లకు కట్టి నట్లుగా వర్ణించారు. అలా ప్రకృతి విషయాలను వర్ణించు సందర్భాన ఆనాటి సామాజిక విశేషాలు కూడా మనకు గోచరిస్తాయి.

మ॥ తలఁబక్షచ్ఛట గ్రుచ్చి బాతువులు కేదారంపుఁ
గుల్యాంతర
స్థలి నిద్రింపంగఁ జూచి యారెకులుషస్స్నాత
ప్రయాత ద్విజా
వతి పిండీకృత శాటి కల్సవిదదావాసంబు
ఁజేర్పంగ రే
వుల డిగ్గన్వెస ఁబాఱువానిఁగని నవ్వున్మాలిగోప్యోష
ముల్ - ఆ.ప.ఆ. - 65వ.

మెడవంచి వీపున పెట్టుకొని నిద్రపోతున్న బాతులను చూచి బ్రాహ్మణులు స్నానం చేసి వస్త్రాలు పిండిపెట్టి మర్చిపోయి ఉంటారని భావించి అక్కడ ఉన్న కాపలా కాసే 'తలారులు' బ్రాహ్మణుల ఇంటికి పట్టికెళ్ళి ఇద్దామని అనుకున్నారు. తీరా దగ్గరకు వెళ్లేసరికి బాతులు ఎగిరి పోయాయి. 'తలారుల' భావనను, చేష్టను చూసి పైరు కాపరి స్త్రీలు నవ్వారని శ్రీకృష్ణదేవరాయలవారి చమత్కార కల్పన. ఇది కేవలం చమత్కార కల్పన అనుకోవడం సరికాదు. ఎందుకంటే రాయలవారు పర్యవేక్షించినపుడు ఈ దృశ్యం తారసపడి ఉండవచ్చు. అప్పుడు ఈ సన్ని వేశాన్ని చక్కగా ఇలా వర్ణించి ఉండవచ్చు.

రాయల పాలనలో గ్రామాలకు తలారులు కాపాలా దారులని, బ్రాహ్మణులు తెల్లని వస్త్రాలను ధరించేవారని తెలుస్తోంది. తెల్లటి వస్త్రధారణవల్ల వారు బాతులను చూసి తెల్లని వస్త్రాలుగా అపోహపడ్డారని, అలాగే పైరును కాపలా కాయడానికి స్త్రీలు కూడా పొలాలు వెళ్లేవారని తెలుస్తోంది. స్త్రీలు పురుషులతో సమానంగా అన్ని పనులను పంచుకునేవారని, నిర్భయంగా పైరును కాపలా కాసేవారని తెలుస్తోంది. బ్రాహ్మణుల వస్త్రాలను వారికి అప్పగించడానికి తలారులు ప్రయత్నించారు. అంటే ఆనాటి ప్రజలు మిక్కిలి నిజాయితీగా, ధర్మబద్ధంగా జీవించారని తెలుస్తోంది. ఆముక్తమాల్యదలో రాయల కాలంనాటి సమాజ సంపన్న జీవన విధానంతోపాటు, మానవస్వేచ్ఛ కనిపిస్తుంది.

రాయల పాలనాకాలంలో వేసవితాపం మనిషిని బాధ పెట్టకుండా ఉండే ఆహారపానీయాలను సేవించేవారని ఈ క్రింది పద్యం ద్వారా మనకు అర్థమవుతోంది.

చ॥ తెలి నులివెచ్చ యోగిరముఁదియ్యని చారులు
ఁదిమ్మనంబులున్
బలుచని యంబళు ల్చెఱకు పాలెడనీళ్ళు
రసావళుల్ఫలం
బులును సుగంధిశీత జలముల్వడ పిండెలు
నీరుఁజల్లయు
న్వెల యఁగఁ బెట్టు భోజనము వేసవిఁజందనచర్చ
మున్నుగన్ (ఆం.ప్ర.ఆ. - 81ప.)

గోరువెచ్చని ఆహారాన్ని తీసుకోవడం, తియ్యగా ఉం డేటట్లుగా చారు (రసం) పెట్టుకోవడం, పల్చగా ఉండే అంబళులు చేసుకోవడం, వడపిండితో చారుపెట్టు

కోవడం, చెఱుకు రసం, ఫలరసాలు, స్వచ్ఛమైన నీటిని పానం చేయడంతోపాటు మజ్జిగతో భోజనం చేసేవారు. ఇవన్నీ వేసవికాలంలో వడదెబ్బ తగలకుండా ఆహారం తీసుకునేవారు. నాటి ప్రజల ఆహార నియమాలు కాలాను గుణంగా ఉండేవి. ఏమేమి తయారు చేసుకోవాలో, వాటినే తయారు చేసుకుని తినేవారు. ఆనాడు వడ పిండెలతో చారు పెట్టుకోవడం అనే ప్రక్రియ ఉంది. వడపిండెలుతిన్నా, వడపిండెలతో చారు పెట్టుకునితిన్నా గాడ్పు దెబ్బఉండదని పెద్దలు చెబుతారు. ఇది వ్యతి రేకించలేని సత్యం. చెఱుకు పానకం ఈనాడు అంగడిలో అమ్ముతున్నారు. కొనుక్కొని త్రాగుతున్నాం. రాయల కాలంలో అది స్వయంగా ఎవరికి వారే తయారు చేసుకునే వారని ఆరోగ్యకరంగా జీవించేవారని తెలుస్తోంది.

ఈనాడు మానవ జీవన విధానాన్ని కంటికి కనిపించని ఒక చిన్న క్రిమి భయపెడుతోంది. ప్రపంచవ్యాప్తంగా కరోనా మహమ్మారి కబళిస్తోంది. కరోనా వ్యాధికి చారు మంచి ఔషధమని మేధావులు చెబుతున్నారు. వేడినీరు త్రాగమని, ఆవిరి పట్టమని పదే పదే చెబుతున్నారు. మిరియాలు, ధనియాలతో చేసిన చారుపొడి ఆరోగ్యానికి అత్యంత ప్రయోజనకారి అని చెవిని ఇల్లు గట్టుకుని మాధ్యమాల ద్వారా పోరుతున్నారు. నేటి ప్రజలు విశ్వ సించి, కరోనా దరిచేరకుండా ఆహార పానీయాలను స్వీక రించడానికి ప్రయత్నిస్తున్నారు.

రాయలకాలంనాటి స్నానాది విషయాలు విష్ణుచిత్తుని కథలో చక్కగా పొందుపరచి మనకు తెలియజేసారు. ఇక్కడ పుట్టపర్తి నారాయణాచార్యులవారి మాటలు గమనించతగినవి" విష్ణుచిత్తుడు వైష్ణవ ధర్మమునను సరించి భాగవతసేవతో కాలము గడుపుచుండెను. శ్రీ విల్లిపుత్తూరు వైష్ణవులతో కిటకిటలాడుచుండెడిది. వారి నాకర్షించినది 'రథ చరణపాణి' మాత్రమే కాదు విష్ణు చిత్తుని భాగవతసేవ కూడ. శనివారములైనచో మఱియు విశేషము ఆనాడు భాగవతులు తలంటు లాడుదురు. శనివారము నాడు అభ్యంగన మొనర్చికొనుటలో వైష్ణవ సంప్రదాయమున్నది. ఆ యందమును రాయలిట్లు చెప్పినారు.

చ॥ కదళిగభీర వుష్పవుటికాచ్ఛట రజేతుల నిప్పపిండిపై
గుదురుగ నిల్పి, యోప్రుగతి గూనల నూనియ నుంచి త్రాట ము
న్నుదికిన శాటివేల నది నొక్కటగ్రుంకిడి వత్తురెందరే
వదలక యాతనింట శనివారమునన్ పరదేశి వైష్ణవుల్ (1-83)

అఱచేతులలో అరటి దొప్పలలో పట్టుకొని ఉన్న ఇప్పపిండి, గూనియలలో ఉంచుకున్న నువ్వుల నూనె, మైలపడిపోతాయని త్రాటితో కూడ పట్టుకుపోతున్న మడిబట్టలు మొదలైన వాటిని చూస్తోంటే. ఓహో! దాక్షిణాత్య వైష్ణవ ఆచారం ఎంత చక్కగా పాటింప బడుతోందో కదా! నారికేళ కటాసములు, 'నను పాకపాత్తిం గుట్టిన దొప్పగము"లు. దక్షిణ దేశపుటాచారమే".[2] ఇవి కథలో విషయాలైన 16వ శతాబ్దం నాటి దక్షిణాది ఆచార వ్యవహారాలు ఉన్నాయనడంలో సందేహం లేదు.

ఈ విధంగా అముక్తమాల్యద ప్రబంధాన్ని పరికిస్తే నేటి సమాజానికి నాటి సమాజ విషయాలు అనుభవ యోగ్యమై మానవ జీవన విధానానికి మార్గదర్శకంగా కనిపిస్తున్నాయి.

ఉపయుక్త గ్రంథాలు :

1) సాహిత్యం - సమాజం - రాజకీయాలు, 214 పుట.
2) చైతన్యలహరి - ఉపన్యాసమంజరి - 132 పుట.

⌘⌘⌘

BHAVAVEENA
Vol. 17, Issue. 8, August 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

ఆచార్య కొలకలూరి ఇనాక్ గారి కథలలో స్త్రీ వాదం – సమకాలీనత

– డా॥. కొగిత సుబ్బారెడ్డి, లెక్చరర్, ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, బాపట్ల.

ఆధునిక తెలుగు సాహిత్యంలో అత్యంత ప్రజాదరణ పొందుతున్న వాటిలో ముఖ్యమైనది కథానిక.

తెలుగు కథానిక ఈ శతాబ్ధి సృష్టి. 1910లో గురజాడతో ఈ కథ పుట్టింది. అనంతరం బాగా అభివృద్ధి చెందింది. నాటి నుండి నేటి వరకు సామాజిక చైతన్యానికి తెలుగు అంశాల్ని కథలుగా మలచడంలో రచయితలు ఫలవంత మవుతున్నారు. ఈ ప్రయత్నంలో వచ్చిన రచయితల్లో ఒకరు ఆచార్య కొలకలూరి ఇనాక్ గారు. ఇనాక్ గారి కథలలో ఉన్న స్త్రీవాదాన్ని-సమకాలీనతను పరిశీద్దాం. అసలు స్త్రీ వాదం గురించి మొదట పరిశీద్దాం.

ఫెమినిజం అన్న ఆంగ్లపదానికి తెలుగులో రూఢమైన మాట స్త్రీవాదం. అయితే దీనికి స్త్రీ విముక్తి వాదం, స్త్రీ చైతన్య వాదం, స్త్రీ స్వేచ్ఛావాదం, స్త్రీ విమోచనోద్యమం అని కూడా పిలవడం జరిగింది.

"ఫెమినిజం అన్న ఆంగ్ల పదం ఫ్రెంచ్ పదమైన "Feminisme" నుంచి వచ్చినది. దీన్ని మొదటగా 1894లో యూటోపియన్ సోషలిస్ట్ చార్లెస్ ఫోరియర్ ఉపయోగించాడు. ఆ ఫ్రెంచి పదం ఆంగ్లంలోకి తీసుకు రావడం జరిగింది అని ఆక్స్‌ఫర్డ్ ఇంగ్లీషు డిక్షనరి 1933 లో పేర్కొంది.

పాశ్చాత్య ప్రభావంతో భారతదేశంలో ప్రవేశించిన అనేక ఉద్యమాలలో ఈ ఫెమినిజం కూడా ఒకటి. 1975 వ సంవత్సరం అంతర్జాతీయ మహిళా సంవత్సరముగా ఐక్య రాజ్య సమితి గుర్తించడంతో స్త్రీ వాదం పేరిట స్త్రీ ఉద్యమం ప్రారంభమైనది. అయితే ఒక సంవత్సరంలో మహిళా సమస్యలన్నింటిని చర్చించడం సాధ్యం కాదు. కనుక తిరిగి దీన్ని 1975-85 కాలానికి పొడిగించి మహిళా దశాబ్దంగా పిలిచింది. 1975-85 మధ్య కాలాన్ని ఐక్యరాజ్య సమితి మహిళా దశాబ్దంగా ప్రకటించింది.

స్త్రీవాద నిర్వచనం :

స్త్రీవాదం స్త్రీని కేంద్రంగా చేసుకోని చూస్తుంది. కనుక ఒక వాక్యంలో స్త్రీ వాదాన్ని నిర్వచించడం అసంభవం. అనేక మంది ప్రముఖులు స్త్రీ వాదాన్ని నిర్వచించడానికి ప్రయత్నం చేశారు. తమ పరిధిలో స్త్రీ వాదాన్ని నిర్వ చించారు.

"మాకు గోడలు లేవు" అనే స్త్రీ వాద సిద్ధాంత పరి చయంలో వనంతా కన్నాభిరామన్ ఫెమినిస్ట్ అంటే స్త్రీలు తమ సెక్సు వల్ల వివక్ష తో చూడబడుతున్నారనీ, స్త్రీలుగా వాళ్ళకున్న ప్రత్యేక అవసరాలు తీరాలంటే ఇప్పుడున్న సాంఘిక, ఆర్థిక, రాజకీయ విధానాలలో మౌళికమైన మార్పులు రావాలని కోరుకునే వారు" అని అంటుంది.

"స్వేచ్ఛా, సమానత్వాల ప్రాతిపదిక గల మానవ విలువలలో ఉద్భవించిన ఫ్రెంచి విప్లవ చైతన్యంతో ఆవిర్భవించిన ఆలోచనా ధోరణికి రూపకల్పనే ఫెమినిజం" అంటుంది రత్నకుమారి.

"స్త్రీ వాద సాహిత్యం - ఒక పరిశీలన" అన్న వ్యాసంలో వాణీ రంగారావు" స్త్రీల సమస్యలను గుర్తించి వాటి నిర్మూలన కొరకు జరిగే కృషిని స్త్రీ వాదం" అని నిర్వ చించింది.

స్త్రీ వాదమంటే ఏమిటో, ఆ ఉద్యమ ముఖ్య ఉద్దేశ్యం ఏమిటో చెప్తూ డాక్టర్ శ్రీమతి రావిభారతి "ఫెమి నిజం ఒక విశ్లేషణా పద్ధతి. జీవితాన్ని రాజకీయాలను అర్థం చేసుకునే ఒక విధానం. స్త్రీ యొక్క వ్యక్తిగత అనుభవాల

ద్వారా కలిగిన అవగాహనలతో రాజకీయ పరిష్కారాన్ని సూచించే ఒక సాధనం. ఈ విశ్లేషణ నింగి నుంచి కాక నేలనుంచి మొదలౌతుంది. ఒకే వాక్యంలో చెప్పాలంటే సమాజంలో స్త్రీ పరంగా ఆర్థిక, రాజకీయ, నైతిక రంగాలలో మౌలికమైన మార్పుల్ని కోరడమే ఈ ఉద్యమం యొక్క పరమోద్దేశం" అంటుంది.

స్త్రీల సాంఘిక అసమానత్వానికి లైంగిక వివక్షే కారణమని చెబుతూ "మానవ సమాజంలో సగభాగంగా ఉన్న స్త్రీలు లైంగిక వివక్ష కారణంగా పురుషుల కంటే తక్కువ స్థాయిలో సాంఘిక స్థితిలో ఉండడాన్ని ప్రశ్నిస్తూ వచ్చిన మానవీయ ఉద్యమం ఫెమినిజం" అంటుంది కాత్యాయని విద్మహే.

"మాకు గోడలు లేవు" అనే సిద్ధాంత వ్యాసంలో "ఫెమినిజం ఒక రాజకీయ సిద్ధాంతం కాదు. అది స్త్రీల జీవితాలలో ఉన్న రాజకీయాలను గురించి వివరిస్తుంది. విశ్లేషిస్తుంది. రాజకీయాలకు ఫెమినిజం కొత్త కోణాలను ఇస్తుంది" అంటుంది ఓల్గా.

ఫెమినిజం అనే మాట స్త్రీ, పురుషులు సమానమేనని చెప్పడాన్ని తెలియజేస్తుంది. అంటే స్త్రీలు తాము పురుషులతో సమానులమని అనుకోటాన్ని, అనడాన్ని సమర్థించే భావధారను ఫెమినిజం అంటున్నామన్న మాట. స్త్రీలు పురుషుల కంటే తక్కువ ఏమీ కారని నిరూపించే టందుకు చేసే ప్రయత్నం ఫెమినిజం క్రిందకు వస్తుంది.

ఆధునిక కాలంలో బాగా ప్రచారంలోకి వచ్చిన సాహిత్యోద్యమాలలో స్త్రీ వాదం ప్రధానమైనది. స్త్రీ కి ప్రాముఖ్యాన్ని ఇస్తూ ఇది విజృంభించినది. కుటుంబంలో గాని, సమాజంలో గాని స్త్రీలు పడుతున్న కష్టసుఖాలన్నింటిని ప్రశ్నిస్తుంది. అంతేకాక ఈ సమస్యలన్నింటి నుండి స్త్రీని విముక్తి చేసేందుకు స్త్రీ వాద ఉద్యమం అవసరమైనది. స్త్రీ హృదయాంతరాలలో ఉండి మరుగున పడిన నిరాశ, నిస్పృహ, నిర్వేదం, దు:ఖం బహిర్గతం కావడం స్త్రీవాద ఉద్యమానికి ఆరంభం. చైతన్యానికి కారణం. స్త్రీల సాంఘిక అసమానత్వానికి లైంగిక వివక్షే కారణమని చెబుతూ అనేక మంది స్త్రీ విముక్తి కొరకు రచనలు చేసిన వారు కలరు.

మాతృసామ్యం అంతరించి, పితృసామ్యం బలపడి నప్పటి నుంచి స్త్రీలు ఎన్నో రకాల అణచివేతలకు గురవు తూనే ఉన్నారు. దురాచారాల పేరిట స్త్రీలు అత్యంత హీనమైన స్థితిని అనుభవించారు. ఇంటికి పరిమితమై ఒక భర్తకు భార్యగానో, ఒక తండ్రికి కుమార్తెగానో, ఒక పుత్రుడికి తల్లిగానో గడపవలసి వస్తుంది.

పై నిర్వచనాలన్నింటిని పరిశీలిస్తే స్త్రీవాదం అన్ని రంగాలలో స్త్రీ స్వేచ్ఛా, సమానత్వం, స్వాతంత్ర్యాలను ఆకాంక్షిస్తుంది. పితృస్వామిక వ్యవస్థలో స్త్రీలు ఎదుర్కొంటున్న సమస్యలను పట్టించుకొని వాటి నిర్మూలనకు కృషిచేస్తుంది. లింగ భేద కారణంగా స్త్రీలు అనుభవిస్తున్న వేదనలను తిరస్కరిస్తుంది. కుటుంబంలో స్త్రీలు ఎదుర్కొంటున్న హింస, అణచివేతలను బహిర్గతం చేసి స్త్రీ పురుషుల జాగృతికి కృషిచేస్తుంది. స్త్రీల హక్కుల కోసం పోరాడుతుంది. స్త్రీ పురుష సమానత్వానికి నూతన సమాజోద్ధరణకు ప్రయత్నిస్తుంది.

ఆచార్య కొలకలూరి ఇనాక్ గారు రచించిన అస్పృశ్య గంగలో స్త్రీ వాద కథలు స్త్రీని సమర్థిస్తూ తన కాలాన్ని కదిలించిన పద్ధతి, స్త్రీకి న్యాయం జరిగేలా, సమాజంలో మార్పుకోసం స్త్రీ వాదం - సమకాలీనత పట్ల తన అభిప్రాయాలు వివరించడం జరిగింది. ఆచార్య ఇనాక్ గారి కథలలో కొన్ని స్త్రీ పాత్రలను మనం పరిశీలిద్దాం.

మాతమ్మ:

రెండు కన్నీటి బొట్లు అనే కథలో స్త్రీ పాత్ర మాతమ్మ. మాతమ్మ మొదట సంప్రదాయ లక్షణాలు గల స్త్రీ వలే కనిపిస్తుంది. ఎన్నో కోరికలతో మేనత్త కొడుకును వివాహం చేసుకుంది. మాతమ్మ, రాముడు మొదట ఎంతో అన్యోన్యంగా ఉండేవారు. రాముడంటే ఎక్కడ లేని ఇష్టం. రాముడుకు కూడా మాతమ్మంటే ఎంతో ఇష్టం.అయితే మాతమ్మ ఒక పిల్లవాడిని కన్న తరువాత భర్త పిల్ల అయితే

బాగుండునని అన్నాడు. ఆ మాట విన్న మాతమ్మ భర్త కోరిక తీర్చడానికి తాపత్రయ పడి మరలా ఆడపిల్లను కన్నది.

అయితే పిల్లలు పుట్టేసరికి మాతమ్మ పిల్లల మీద ఇష్టంతో భర్తను దూరంగా ఉంచసాగింది. ఇది సహించ లేక రాముడు పురుషాహంకారం కలవాడు కాబట్టి మాతమ్మకు చెరోప్రక్క పిల్లలిద్దరూ పడుకొనే సరికి, అతను ఒక భోగం అమ్మాయిని దగ్గరకు తీసుకోని ఆమెను పెళ్ళాడి, ఇళ్ళు కూడా కట్టించి ఆమెతో ఉండసాగాడు. ఈ విషయం తెలుసుకున్న మాతమ్మ భర్త వద్దకు వచ్చి, భోగం అమ్మాయిని విడిచిపెట్టమని ప్రార్థించింది. తన భర్త మరో స్త్రీ తో అక్రమసంబంధం పెంచుకోవడం ఇష్టం లేని మాతమ్మ అతని మీద కసితో ఏం చేయాలో తోచక "చస్తాం" అంటుంది. అతడు చావమంటాడు. ఇద్దరూ ఈ విషయంలో ఘర్షణ పడతారు. రాముడు కొడతాడు మాతమ్మని. చివరికి సహనం నశించి, నిద్రపోతున్న పిల్లలను తీసుకోని, ఆడపిల్లను భుజాన వేసుకొని, కొడుకు చేయి పట్టుకోని బావి దగ్గరకు వచ్చి , భర్తమీద కోపంతో జీవితం మీద విరక్తి తో పిల్లవాడు ఎంత గుంజుకున్నా విదిలించుకోని బావిలో పడవేసి, తను కూడా బావిలో దూకబోయింది. ఈలోగా రాముడు వచ్చి మాతమ్మను కాపాడతాడు. భర్తమీద కోపంతో ఇలాగే చాలా మంది స్త్రీలు చేస్తుంటారు.

మాతమ్మ రక్షించిన తరువాత ఆమె చేసిన పనికి న్యాయస్థానం రెండు సంవత్సరాలు జైలు శిక్ష, ఒక సంవత్సరం బావి చుట్టూ ఊడ్చి శుభ్రం చేయడం శిక్షగా విధించారు. ఇది ఆమె మానసిక స్థితిని ఆర్థిక పరిస్థితిని చూచి న్యాయస్థానం విధించిన శిక్ష.

ఇక ఆ శిక్షా కాలంలో ఆమె జీవచ్ఛవంలా ఉంది. పిల్లలు చనిపోయి తను మాత్రం బ్రతికి ఉండటంతో పిల్లలు పదే పదే గుర్తుకు వచ్చి, చేసిన పని తలచుకోని అనుక్షణం ఆమె ఎంతో నరకం అనుభవించింది. ఈ శిక్షా కాలంలో భర్త ఆమెకు భరణం ఇస్తూ వచ్చాడు. కానీ ఆమె మరలా మనిషి అవుతుందని అనుకోలేదు. ఇక్కడ కవి సగటు స్త్రీ మనస్తత్వాన్ని చిత్రీకరించాడు, ఉదా హరణకి ఏ స్త్రీ అయినా తన పిల్లలను సర్వస్వంగా భావిస్తుంది. అటువంటి పిల్లలు చనిపోయే సరికి జీవచ్ఛవంలా బ్రతికింది.

అయితే ఆమె మరలా శిక్షాకాలం పూర్తికాగానే చక్కగా అలంకరించుకోని భర్త దగ్గరకు వచ్చి ఆ రాత్రి భర్తతో ఆనందంగా గడిపి పిల్లలు గుర్తుకు వస్తున్నారని అన్నది. దానికి పురుషాహంకారం గల రాముడు మరలా నీకు పిల్లలు పుడతారులే వయస్సు ఉంది కదా అంటాడు. ఆమె పిల్లలు పిలుస్తున్నారని బావి దగ్గరకు వస్తుంది. ఆమెతో పాటు రాముడు కూడా వస్తాడు. బావిలోకి తొంగిచూస్తుంది. రాముడు కూడా ఆమెను వాటేసుకోని ఉంటాడు. కాబట్టి అతను కూడా బావిలోకి తొంగి చూస్తాడు. అంతే కాళ్ళు జారి బావిలో పడిపోయారు.

ఇది కవి ఇచ్చిన ముగింపు. పిల్లలతో పాటు చని పోవలసిన స్త్రీ బ్రతికి, ఇన్నాళ్ళూ జీవచ్ఛవంలా గడిపి, చివరికి భర్త చేసిన అన్యాయం చూస్తూ, భర్త చేసిన దానికి నేను మాత్రమే చావకూడదు. దానికి కారణమైన భర్తను కూడా చంపడం సమంజసమేనని రచయిత వాచ్యం చేయకపోయినా అలా జరగడం చాలా చక్కగా ఉంది. రచయిత మాత్రం వారిద్దరూ చనిపోయారో లేదో పాఠకుల ఆలోచనకే వదిలేశారు.

ఏది ఏమైనా భర్తకోసం ప్రాణం పెట్టే ఇల్లాలు, అపసర మైతే భర్త ప్రాణాలను తీయగలిగే స్థితికి ఎదిగింది. పాత్ర మనస్తత్వంలో వచ్చిన ఈ మలుపు ఒక గెలుపు. ఇక్కడ రచయిత స్త్రీవాద దృక్పథం ఆవిష్కరించబడింది. పురు షుడు చేసిన అన్యాయానికి స్త్రీ స్వయంగా తానే శిక్షించే స్థితికి చేరడమనే పరిష్కారంతో రచయిత స్త్రీ వాద దృక్పథం ఈనాటి సమాజ సమకాలీనత ఆవిష్కరించ బడింది.

నాగమ్మ :

గమ్యం కథలో నాగమ్మ ముఖ్య పాత్ర. నాగమ్మ

నాగిరెడ్డి అక్క కూతురు. అతను అయిన సంబంధం కాబట్టి అక్కపోరు పడలేక కొద్దిగా చదువుకున్న నాగమ్మను పెళ్లిచేసుకున్నాడు. నాగమ్మ పెళ్ళితో చదువు మానివేయ వలసి వచ్చింది. నాగమ్మ భర్త నాగిరెడ్డి పల్లె వదిలి పట్నం వచ్చాడు. నాగమ్మ చాలా అమాయకురాలు. అందుకని దానిని సాకుగా తీసుకొని భర్త నాగిరెడ్డి రెండవ వివాహం రమను చేసుకోవడానికి సిద్ధపడతాడు. అందుకని నాగమ్మను ఒప్పించాడు.నాగమ్మకు నీకు పిల్లలు లేరని, అందుకనే రెండవ వివాహమని చెప్పాడు. ఆ వివాహం వల్ల తనకు నష్టమని తెలియక సరేనని ఒప్పుకుంది. వివాహానికి సాక్షిగా కూడా తానే సంతకం చేసింది.

అయితే వివాహం జరిగిన దగ్గరనుండి తన భర్త రమను ఎక్కువగా చూడడం జరిగింది. నాగమ్మను తక్కువగా చూడడం జరిగింది. ఈ విషయం గ్రహించి ఇది ఎందుకు జరుగుతోందోనని అర్థం చేసుకోసాగింది. ఎందువలనంటే రమ కాలేజి లెక్చరర్ కాబట్టి. రమకు ఎక్కువ ఖరీదైన బట్టలు తేవడం, ఆమెకు కూరగాయలు తేవడం, కాఫీ చేసి పెట్టడం, కాళ్లు వత్తడం ఇవన్నీ నాగిరెడ్డి రమ దగ్గర చేస్తాడు. కానీ నాగమ్మ దగ్గరయితే చేయించుకుంటాడు. ఈ విషయం గురించి నాగమ్మ నాగిరెడ్డిని అడగ్గా ''ఎందుకు దండగ'' అంటాడు. దానితో పరిస్థితి క్రమంగా అర్థం కాసాగింది.

నాగమ్మ, రమలు ఒకేసారి గర్భం ధరించగా నాగమ్మ సంగతి పట్టించుకోడు నాగిరెడ్డి. రమ విషయంలో ఎంతో సంతోషంతో అందరికీ చెబుతూ ఉంటాడు. నాగమ్మ కానుపు కోసం పల్లె వెళుతుంటే పట్టించుకోడు. అలాగే పిల్ల పుట్టినా చూడటానికి రాడు. దీనికి కారణం తాను చదువుకోకపోవడమే అని తెలుసుకుంది. రమ జీతంతో అతడిని పోషిస్తుందని తెలుసుకున్నాడు. దానితో ఆమెకు చదువుకోవాలనే కోరిక పుట్టి, ఆ కాన్పు సమయంలో చదువుకుని పదవతరగతి పాసవుతుంది.

అయితే రమకు, నాగమ్మకు ఎటువంటి మనస్పర్ధలు లేవు. రమకు బాబు పుడతాడు. రమ తన బాబుని, నాగమ్మ కూతురిని ఇద్దరినీ సమానంగా చూస్తుంది. ఇలా సవతుల మధ్య ఎటువంటి భేదము లేదు. ఇంటర్ చదువుకోవాలని, ఎలాగ అని రమను అడిగింది. రమ ప్రైవేటుగా రాయమనగా, కాదు కాలేజీలో చేరతానని ధీమాను వ్యక్తం చేస్తుంది. మరి పిల్లని ఏం చేస్తావ్ అని అడుగగా, దానిని అవ్వకిచ్చి చదువుకుంటానని చెబుతుంది. ఇలా రమ, నాగమ్మ మంచి మిత్రులుగా ఉంటారే కానీ వారి మధ్య ఎలాంటి భేదాభిప్రాయాలు లేవు.

చివరకు నాగమ్మ చదువుకోవడానికి తాను పల్లెకు వెళతాను అని చెప్పి, భర్త నాగిరెడ్డి చెప్పినా వినిపించుకోకుండా తన జీవితాన్ని బాగుచేసుకోవడానికి పల్లెకు బయలుదేరుతుంది.

ఈ విధంగా భర్త రెండో పెళ్లి చేసుకున్నందుకు చాలా మంది స్త్రీ లలా సర్దుకుపోలేక పోయిన వెర్రిబాగుల పల్లెటూరి నాగమ్మ కథ ''గమ్యం''. పట్నం లో చదువుకోని ఉద్యోగం చేసే భార్య, పల్లెలో చదువుకోని తన ఆలనా పాలనకు అంకితమయిన భార్య వీరిద్దరినీ జీవితాంతం ఆదుకుంటున్న నాగిరెడ్డిని కంట్లో నలుసులా తీసిపారేసి క్రొత్త గమ్యం వెతుకుతూ వెళ్ళిపోయిన నాగమ్మ పాత్ర మరపురానిది. సవతుల మధ్య ఏ పోరూ లేదు. పరస్పరం ద్వేషం లేదు. ఇద్దరూ పురుషాహంకార బాధితులేనని ఇద్దరికీ తెలుసు. శాస్త్రాలు చదివిన కాలేజి లెక్చరర్ నాగిరెడ్డి చిన్న భార్య రమ. ఏ చదువూ లేని ఏ ఆధారమూ లేని నాగమ్మ మొగుణ్ణి ''నీకే వదిలేత్తా'' అని ధైర్యంగా అంటుంది.

ఇనాక్ పాత్రల్లో వైవిధ్యానికి, విన్నూత్న కథనానికి చెప్పుకోదగ్గ పాత్ర నాగమ్మ. భర్త ఆదరణ తనకు, పిల్లలకూ కరువైనా, తనకు సంపాదించేందుకు కావలసిన చదువు లేకపోయినా అవన్నీ సాధించడానికి ఏటికెదురీదడానికి సిద్ధపడుతుంది. అంతే కానీ, తనపై రవ్వంత ప్రేమ కూడా చూపని భర్తతో కాపురానికి ఆమె మనస్సు అంగీరించదు. ఇది ఆ నాగమ్మ పాత్ర ద్వారా ఇచ్చిన గొప్ప సందేశం.

స్త్రీ తరతరాలుగా సాగుతున్న భావ దాస్యం నుండి బయటపడిన తీరును రచయిత చిత్రీకరించారు. ఇది స్త్రీ అభ్యుదయానికి సంబంధించినది. పై కథలను మనం పరిశీలిస్తే నేటి ఆధునిక సమాజంలో స్త్రీలు ఎలా ఉండాలో, ఎలా ఉండకూడదో చెబుతూనే ఇనాక్ గారు సమాజంలో స్త్రీలు తమ పరిస్థితులను, సమకాలీనతలను, పురుష అహంకారాన్ని అర్థం చేసుకుంటూ ఏటికి ఎదురు నిలవాలని గీతోపదేశం చేశారు.

ఆధార గ్రంథాలు :

1. మునిలక్ష్మి మంగమార స్త్రీ వాద నవలాతత్వం, లింగ వివక్ష పుట:13
2. మునిలక్ష్మి మంగమార స్త్రీ వాద నవలాతత్వం, లింగ వివక్ష పుట:10,11
3. ఆచార్య కొలకలూరి ఇనాక్ గారి షష్టిపూర్తి సన్మాన సంచిక పుటలు: 140,141
4. ఆచార్య కొలకలూరి ఇనాక్ గారి షష్టిపూర్తి సన్మాన సంచిక పుటలు: 140
5. ఆచార్య కొలకలూరి ఇనాక్ గారి షష్టిపూర్తి సన్మాన సంచిక పుటలు: 140

⌘⌘⌘

BHAVAVEENA
Vol. 17, Issue. 8, August 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

ఆధునిక దళిత కథానిక – సమకాలీనత

– డా॥. తొండాటి రాజశేఖర్, పోస్ట్ డాక్టోరల్ ఫెలో (యూ.జి.సి.), ప్రాచ్యపరిశోధనసంస్థ, శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి.

సమాజం మారుతోంది. దానికి తగ్గట్టుగా సాహిత్యం కూడా మారితేనే సమకాలీనత సాధిస్తుంది. సమకాలీన సాహిత్యమే సమాజంలో నిలుస్తుంది. అయితే ఏ భాషకైనా లిపి వాడుకలో వచ్చినప్పటి నుండి ఆయా కాలాల్లో వచ్చిన సాహిత్యమంతా సమకాలీన సాహిత్యమే అవుతుంది. ఆ సాహిత్యం నడుస్తున్న కాలపు అవసరాల కోసం ఉద్దేశించబడి సాగితే సమకాలీన సాహిత్యం చక్కగా ఆవిష్కరించబడుతుంది. ఇరవయ్యో శతాబ్దం ప్రారంభం అయ్యాక తెలుగు సాహిత్యచరిత్రలో అంతవరకు వస్తున్న రచనలకంటే భిన్నంగా, కొత్తగా ధోరణులు, వాదాలు ప్రారంభమయ్యాయి. దాన్ని మనం ఆధునిక తెలుగు సాహిత్యంగా అభివర్ణించుకున్నాం. ఈ ఆధునిక తెలుగు సాహిత్యంలో సంప్రదాయ, భావ, అభ్యుదయ ధోరణులు, స్త్రీ, దళిత, మైనార్టీ, గిరిజన వాదాలు, కవిత్వం, నాటకం, నవల, వచన, కథ ప్రక్రియలు చోటుచేసుకున్నాయి. కానీ ఆధునిక సాహిత్యమంతా సమకాలీనం కాదు. అందులో కూడా పౌరాణిక సాహిత్యం కొంత వుంది. ఒక సరికొత్త మౌళిక పరిణామంతో ఆధునికత, వాస్తవికతలు జోడించి రాస్తున్న రచనలు సమకాలీనం అవుతున్నాయి. ఈ సమకాలీన సాహిత్యంలో కథానిక ప్రక్రియ విశిష్టమైనది. అందులో దళితుల జీవితం ఇతివృత్తంగా వచ్చిన్న కొన్ని సమకాలీన కథానికలను గురించి చర్చించడం ఈ వ్యాసోద్దేశ్యం.

నిచ్చెన మెట్లు లాంటి వర్గ సమాజం కలిగినది భారత దేశం. ఈ వర్గ సమాజంలో సామాజికంగా అణచివేయబడిన దళితుల జీవితాల్లో సహజంగా ఏర్పడే కష్టాలు, కన్నీళ్ళు, ఆనందాలు, అవమానాలు, నిర్లక్ష్య ధోరణి, హింస, సామాజిక దోపిడిని కథావస్తువులుగా స్వీకరించి నేడు రచయితలు దళిత కథలు రాస్తున్నారు. "రచయితలకు జీవితం పట్ల ఉన్న దృక్పథం ఏదో ఒకధోరణికి చెందవచ్చు" అంటాడు కేతు విశ్వనాథరెడ్డి, దళితుల జీవితాల మీద ఒక నిర్దుష్టమైన దృక్పథంతో రాస్తున్న కథలన్నీ ఆ ధోరణికిందకే వస్తాయి. ఆ నిర్దుష్టమైన ధోరణి గలిగిన రచయితలు సామాజిక బాధ్యతగా నేడు దళిత కథానికలు వెలువరిస్తున్నారని అనడంలో అతిశయోక్తి లేదు. ఆధునిక దళితకథానికను బీజాలు వేసిన కొలకలూరి ఇనాక్, గూడ అంజయ్యలు ప్రశంసనీయులు.

సమాజ దౌర్భాల్యానికి గురైన దళిత క్రైస్తవ జీవితాల గురించి వాస్తవ కోణాన్ని ఆవిష్కరించిన రచయిత్రి ఎమ్.ఎమ్. వినోదిని. ఆమె రాసిన 'బ్లాక్ ఇంక్' కథా సంపుటి నిండా దళిత క్రైస్తవ స్త్రీల జీవన వ్యథలే కనిపిస్తాయి. ఆ కథలన్నీ చదివితే దళిత సమాజం గురించి ఆమెకు గల నిశిత దృష్టి అర్థమవుతుంది. ఈ కథా సంపుటిలో 'ప్రియుడు కావాలి' కథ నేటి దళితయువతి జీవితానికి అద్దంపడుతుంది. అందం, తెలివితేటలు గలిగిన పిహెచ్.డి. పరిశోధక విద్యార్థి అయిన దళిత అమ్మాయి కథ. ఆమె పరిశోధనా కాలంలో ముగ్గురు అబ్బాయిల మనస్సులను అర్థంచేసుకున్న కథ. అగ్రకుల ప్రేమికుడైన మనోహర్ ప్రేమించిన్నాళ్ళు ప్రేమించి తీరా పెళ్ళి సందర్భాని కొచ్చే సరికి పిరికితనంతో జీవితాంతం ప్రియరాలిగా ఉండమని డొంకతిరుగుడు మాటలు చెబుతాడు. దానికి కారణం ఆమె శరీరమే దళితురాలునని చెబుతుందని అది తన కుటుంబానికి ఇష్టంలేదని చెబుతాడు. "నిజానికి నీ కులాన్ని మావాళ్ళు దాచిపెట్టగలరు. కానీ... నీ శరీరమే ఒక కులం సర్టిఫికేట్‌గా కనిపిస్తున్నప్పుడు వాళ్ళు మాత్రం ఏం చేయగలరు" అని సాకు చెబుతాడు. నిజానికి భారతదేశ వర్గ సమాజంలో ఒక్కో వర్గానికి ఒక్కో రకమైన రంగు, శరీర సౌష్టవం,

మాటతీరు ఖచ్చితంగా ఉంటుందనేది తాత్వికమైన అంశం. దాన్ని సాకుగా చెప్పి వదిలించుకోవాలని చూసే మనోహర్‌ని ఆ అమ్మాయి ఛీ కొట్టింది. కొన్నాళ్ళకి మరో ప్రేమికుడు పరిచయవయ్యాడు. తన పేరు శశాంక్. ఈమెను ఆదర్శంకోసం వివాహం చేసుకుంటానని చెబుతాడు. అతని కుటుంబంలో అన్ని యింటర్ కాస్ట్ పెళ్ళిళ్ళు అని, అన్నికులాల వాళ్ళు తన కుటుంబంలో ప్రవేశించడం ద్వారా ఒక పువ్వుల హారంలో ఉంటుందని అందులో నల్ల కలువ తగ్గిందని అది నువ్వేనని చెబుతాడు. ''నువ్వు మా ఫ్యామిలీలో కొస్తే, ఖాళీ పూడడమే కాదు. నిన్ను చూడగానే ఎవరకయినా యిట్టే అర్థమయిపోతుంది! దళిత్ వని...!!'' అన్న శశాంక్ మాటల్లో ఆంతర్యం ఆ అమ్మాయికి బోధపడింది. అగ్రవర్ణ దురహంకార నాణెనికి ఒకవైపు మనోహర్ అయితే రెండో వైపు తిప్పిచూస్తే శశాంక్. మరికొన్నాళ్ళకి పరిచయమైన దళితస్కాలర్ ప్రభాకర్! ఒకే కులం వాళ్ళం కదా పెళ్ళి చేసుకుందాం అని చెప్తాడు. వాస్తవానికి అతడిది నిజమైన ప్రేమ కాదు. పెళ్ళి పేరుతో ప్రతిక్షణం తనతో గడపడానికి ప్రయత్నిస్తున్న తీరు అతని మాటల్లోనే బయటపడింది. ఈ ముగ్గురి ప్రేమలను ఆమె తిరస్కరించింది. అగ్రవర్ణ యువకుల సానుభూతి, తన కులం వాడైన ప్రభాకర్ కాలక్షేప కబుర్లు ఆమెకు ఈసడింపు కలిగించాయి.[2]

బాగా చదువుకున్న పరిశోధక విద్యార్థులు, పరిణిత వయస్సు కలిగిన యువకులు ఆ అమ్మాయి అస్తిత్వాన్ని కులం అనే 'మూస'లో చూస్తున్నారే గానీ స్వచ్ఛమైన ప్రేమను పంచలేకపోతున్నారు. ఇది నేడు విశ్వవిద్యాలయ స్థాయిల్లో దళిత విద్యార్థినుల పట్ల సాటి విద్యార్థులకు గల అభిప్రాయాన్ని విశదపరుస్తోంది.

వర్తమాన దళిత కథారచయితల్లో అత్యాధునిక సమకాలీన కథలు రాస్తున్న యువరచయిత పసునూరి రవీందర్. ఆయన రాసిన 'గోవర్ణం' కథ నేటి దళితుల ఆత్మగౌరవం ఎలా ప్రశ్నార్థకమవుతుందో తెలిపే కథ. ఆధునిక సాంకేతిక యుగం గాలికన్నా, మనసు కన్నా వేగంగా పరిగెడుతోంది. బతుకు తెరువుల కోసం పట్టణాల్లో స్థిరపడదామని అన్నివర్గాల వారు ఆరాటపడుతున్న యుగమిది. పట్టణాల్లో సొంత ఇంటి గురించి అన్నికులాల వాళ్ళతో పాటు దళితులు కూడా కలలు కంటున్న తరుణమిది. ఒక దళిత యువకుడు స్వంత ఇంటికోసం కలలుగంటూ వాయిదాలు పద్ధతిలో స్థలం కొనుక్కోవాలని ఆశిస్తాడు. అందుకోసం ఒక ప్రకటన చూసి గోవర్ణభూమి వెంచర్స్ ఆఫీసుకు వెళ్ళి ఇంటి స్థలం కోసం ప్రయత్నిస్తాడు. ప్లాట్లు బ్రాహ్మణులకు తప్ప వేరే కులం వాళ్ళకు స్థలాలను విక్రయించరని అక్కడి వారు చెప్పడంతో 'కార్పోరేట్ సంస్కృతిలోకి కూడా మనువు కొత్తరూపంలో ప్రవేశించాడా' అని వ్యాఖ్యానిస్తాడు ఆ దళిత యివకుడు.

ఆధునిక సాంకేతికయుగం కూడా నేడు మనువాదాన్ని అనుసరించి నడుచుకుంటుందని గోవర్ణం కథ ఆలోచింప జేస్తుంది. అగ్రవర్ణాల ఆధిపత్యధోరణి నిమ్నకులాల ఎదుగుదలకు ఏవిధంగా అవరోధం కలిగిస్తుందో చిత్రించిన ఈ కథ వ్యాపార సంస్కృతిలో మనువాదుల సామాజిక దుర్మార్గాన్ని ప్రశ్నిస్తుంది.

ఆధునిక యుగంలో కూడా 'కులం' నశించడం లేదని వెళ్ళూనుకొని పాతుకుపోతోందని తెలిపే కథానిక డా॥. ఉద్యా రమ్యజోతి రాసిన 'మళ్ళీ నీళ్ళు'. తమకున్న దుర్ధర పరిస్థితుల ప్రభావం వల్ల దళితకులం వాళ్ళు అగ్రకులాలను ఆశ్రయించి బతికితే వివక్ష ఏ తీరులో ఉంటుందో వివరించే కథ ఇది. అగ్రకులానికి చెందిన పూర్ణ ఇంట్లో పనిచేసే సాలమ్మ కడిగిన గిన్నెలపైన మళ్ళీ నీళ్ళచల్లి లోపలికి తీసకెళ్ళడం, సాలమ్మకు వేరుగా కంచం గ్లాసు ఉంచడం పూర్ణ కూతురు బుజ్జిని ఆలోచింప జేస్తుంది. ఒంట్లో బాగా లేక సాలమ్మ కూతురైన మంజును పనికి పంపినపుడు టీ పోయడానికి సాలమ్మ ఓ మూల చెప్పల స్టాండు దగ్గర పెట్టిన గ్లాసును తీసుకొమ్మంటుంది పూర్ణ. తనతో పాటుగా ఆడుకోవాల్సిన మంజు ఇలా పనిచేయడం ఏంటని బుజ్జికి అర్థంకాదు. ఆ సంఘర్షణతో ''అమ్మా! మంజు కడిగిన గిన్నెలపై మళ్ళీ నీళ్ళు ఎందుకు

చల్లాలమ్మా" అంటూ అమాయికంగా ప్రశ్నించిన బుజ్జి మాటలకు సమాధానం చెప్పలేక పోతుంది పూర్ణ.

హోటళ్ళలో రెండుగ్లాసుల పద్ధతి ఆధునిక యుగంలో నశించిందని భావిస్తున్న తరుణంలో ఇంకా ఆ మార్పు అగ్రవర్ణాల గడపల లోనికి ప్రవేశించలేక పోతుందని బోధపడుతుంది. పనామె కూతురు పని పిల్ల గానే చూడాలని, పనివాళ్ళకు వారగా గ్లాసు కంచం ఉంచాలని అగ్రవర్ణాల వారు తమపిల్లలకు కూడా అన్యాపదేశంగా నేర్పుతున్నారని అది ఒక సంప్రదాయ పద్ధతిగా కొనసాగడానికి అవకాశం ఉందని ఈ కథ వల్ల అర్థమవుతుంది.

ఫెస్‌బుక్ వేదికగా సంచలనాత్మక కథనాలుగా ఇండస్ మార్టిన్ రాసిన కటికపూలు 'దళితుల ఆత్మగౌరవాన్ని గుర్తించాలని చెబుతున్నాయి. దళితుల యాసలోనే కథలు రాసి ప్రచురించాడు. ఈ కథాసంపుటిలోని 25 కథలూ కూడా అణచివేయబడిన దళితుల జీవితానుభవాలే. అందులో దళితుల ఔన్నత్యాన్ని ఓర్వలేని సవర్ణుల మనస్తత్వాన్ని తెలిపేదే 'ఊరేగింపు'. అగ్రవర్ణాల బజార్లలో దళితకులం వాళ్ళు పెళ్లిచేసుకొని ఊరేగింపుగా బయలు దేరితే వారు వ్యతిరేకిస్తారు. కానీ పట్టుబట్టి దళితులు ఊరేగింపు జరుపుతారు. అలా ఎందుకు వ్యతిరేకించారో కూడా రచయిత ఈ కథలోనే బట్టబయలు చేస్తాడు. వాళ్ళ దయాదాక్షిణ్యాల మీద బతికినంతకాలం ఊరేగింపుకు అనుమతిస్తారు గాని, ఇప్పడైతే దళితులు స్వంత కాళ్ళమీద నిలబడి స్వతంత్రంగా జీవిస్తున్నప్పుడు వాళ్ళు ఓర్చుకోలేక పోతున్నారు.

దళితులు తమమీద ఆధారపడి జీవించడం లేదనే అక్కసు చాలా గ్రామాల్లో నేటికి కనిపిస్తున్న కఠోరవాస్తవం. రాజ్యాంగం కల్పించిన వెసులుబాటు వల్ల, ప్రభుత్వాల చలువ వల్ల దళితులు చదువుకొని, ఉద్యోగవకాశాలు పొంది స్వంత కాళ్ళమీద నిలబడి బతుకుతున్నారు. దీనిని భూస్వామ్య భావజాలం ఉన్న వర్గం జీర్ణించుకోలేక పోతుంది. కారంచేడు, చుండూరు మారణకాండకు కూడా ఈ రకమైన భావజాలమే కారణమని మనందరికి తెలుసు.

ఇక ఆధునిక దళితకథ నేపథ్యంలో దళిత స్త్రీ జీవికను ఆవిష్కరించే లక్ష్యంతో ముందుకు సాగుతున్న రచయిత్రి జూపాక సుభద్ర. ఏ రంగంలోనైనా, ఎటువంటి సందర్భంలో నైనా మానవ సంబంధాలను కులం విడదీస్తుందనేది రుజువు చేసే కథ జూపాక సుభద్ర రాసిన 'మీరెట్ల వెజ్జులు'. వరంగల్ జిల్లా మారుమూల పల్లె నుండి ఉద్యోగ నిమిత్తం హైదరాబాదొచ్చింది ఒక దళిత యువతి. మధ్యాహ్నం కలసి భోజనం చేయడానికి ఆ కార్యాలయంలో ఏ మహిళా గ్రూపు తమలో చేర్చుకోలేదు. దానికి కారణం ఏంటో మొదట ఆ యువతికి అర్థం కాలేదు. తర్వాత తనపట్ల అస్పృశ్యతను పాటిస్తున్నారని ఆ యువతికి అర్థం అయింది. తాను గోమాంసం తింటుందని వాళ్ళు వెలివేస్తున్నారని తెలిసివచ్చింది. ఓరోజు తాను తెచ్చిన చిక్కుడుకాయ కూర మిగితా వాళ్ళకు వేయబోతే వాళ్ళు తిరస్కరిస్తారు. ఆత్మగౌరవం దెబ్బతిన్న ఆ యువతి పశువుల పాలను తాగుతూ వాటినుండి వచ్చే పెరుగును, నెయ్యిని తినేవర్గాలు వెజిటేరియన్లు ఎట్లవతారని ధిక్కరించింది. నేను తెచ్చిన కూర మీకెంత అంటరానిదో మీ కూరలు కూడా నాకు అంటరానివేనని తన ప్లేట్లో వాళ్ళేసిన కూరలను చెత్త బుట్టలో పారవేస్తుంది.

ఒకరకమైన ఆహారపుటలవాట్లు ఉన్నతమైనవిగా, మరొకరకమైన ఆహారపుటలవాట్లు హీనమైనవిగా ప్రపంచంలో హిందూమతం తప్ప మరే మతగ్రంథం చెప్పదు. భారతదేశంలో వృత్తులననుసరించి కులాలు ఏర్పడ్డాయని చెబుతారు. ఆయా కులాల వాళ్ళు వారికి తగిన ఆహారం తీసుకోకపోతే వారి వృత్తిని నిర్వహించడం కష్టం. కనుకనే మనకు ఆహారపుటలవాట్లలో భిన్నత్వం ఉంది. బాగా చదువుకున్న విద్యావంతులే కుల ప్రాతిపదికన విభజన పాటిస్తే వాళ్ళకి భారతరాజ్యాంగం అర్థం అయ్యినట్లా? లేదా? ఈ సందర్భంలో దళితుల ఆత్మాభి

మానమే శరణ్యం. నేడు చదువుకునే చోట, ఉద్యోగాలు చేసేచోట ఇలా కులప్రాతిపదికిన గౌరవాలు, అవమానాలు ఎదరవుతున్నాయనేది నిజం. ఉన్నత విద్యావంతులు సైతం ఆత్మగౌరవం కోసం అడుగడుగునా పోరాడాల్సి వస్తోంది. ఇంతకంటే దౌర్భాగ్యం ఇంకేం కావాలి?

ఈ విధంగా సమకాలీన దళిత కథానిక వాస్తవ జీవితాలను విశదీకరిస్తోంది. అన్నం ఉడికిన తీరును ఒకటి రెండు మెతుకులు పట్టిచూస్తే తెలిసినట్లు దళితుల జీవనం గురించి కొన్ని కథలను మాత్రం స్థాలీపులాక న్యాయంగా వివరించాను. ఇంకా వర్తమాన కథా రచయితలు బిరుసు సురేష్‌బాబు, జి. వెంకటకృష్ణ, కె. సుభాషిణి, గుమ్మడి రవీంద్రనాథ్, పి.రాజ్యలక్ష్మి లాంటి వారెందరో తమ కథల ద్వారా దళితులను చైతన్యం చేస్తున్నారు. దళితుల సామాజిక, ఆర్థిక, రాజకీయ ఆకాంక్షలను సాహిత్యంలో వ్యక్తం చేస్తున్నారు.

⌘⌘⌘

BHAVAVEENA
Vol. 17, Issue. 8, August 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

"తూరుపు" పోలికేక

– డా॥. జి.వి.యస్. జయపాలరెడ్డి,
భౌతిక శాస్త్ర ఉపన్యాసకులు, మహారాజ కళాశాల
(స్వయం ప్రతిపత్తి), విజయనగరం.

– డా॥. బి.వేణుగోపాల్
రిడర్ ఇన్ ఇంగ్లీష్, మహారాజు కళాశాల
(స్వయంప్రతిపత్తి), విజయనగరం.

బ్రిటీష్ సామ్రజ్యవాదుల పదఘట్టనలలో భారతదేశం నలిగిపోతున్నప్పుడు, సంపద పరాయి పాలవుతున్నప్పుడు, స్వాంత ప్రయోజనాలను దేశ ప్రయోజనాలుగా నియంత పాలకులు శాసిస్తున్నప్పుడు, స్వేచ్ఛా, స్వాతంత్రాల కోసం యోధులు పోరాటం చేస్తున్నప్పుడు, కవులు గళం విప్పడం, పత్రికలు కదం తొక్కడం సహజం. వలస వాద విధానాలకు వ్యతిరేకంగా, మానవ హక్కులు పరిరక్షణే ఏకైక కర్తవ్యంగా సాగిన స్వాతంత్ర పోరాటంలో ఎందరో కవులు, గాయకులు, రణన్నినాధానికి శంఖారావం పూనారు. అదొక అద్భుత ఘట్టం, చరిత్ర చెప్పిన పాఠం, మననం మన సంస్కారం. అమరోజ్వల కార్యంలో అనేకమంది తూరుపు ప్రాంతమనబడే ఉత్తరాంధ్ర కవులు వారి దేశభక్తిని చాటి చెప్పారు. జన హృదయాలను చూర గొనడమే కాకుండా, ఉద్యమంవైపు సామన్య జనాన్ని సైతం కదిలించి నాయకుల బాటలో జనాన్ని సమా యత్తం చేసే భాధ్యతలకు భాధ్యులయ్యారు. భారత స్వాతంత్ర్యోద్యమ చరిత్ర ప్రపంచానికీ మార్గ నిర్దేశనం అయింది. 'ఇది నా జాతి', 'ఇది నా దేశం'. నాదేశ సౌభా గ్యానికి కవులు, పత్రికా సంపాదకులు వారి వంతు పాత్రను పోషించినారు.

"స్వేచ్ఛకోసం, గౌరవ ప్రదమైన జీవితాన్ని గడపడం కోసం మనిషి ఎన్ని త్యాగాలకైనా సిద్ధపడతాడు. ఎన్ని కష్టాలనైనా ఎదుర్కోవడానికి సంసిద్ధుడవుతాడు. ఒక మనిషి మరో దేశానికి, మరో జాతికి దాసుడై బ్రతకడం కంటే హీనమైనది మరోకటనుండదు. బానిస బ్రతుకు దుర్భరమైనది (బి. సత్యన్నారాయణరెడ్డి, స్వాతంత్ర సమర యోధులు).

భారత స్వాతంత్ర సంగ్రామంలో ప్రజలను కార్యో న్ముఖులను చేసి మాతృమూర్తి విముక్తికి పోరాటం చేయటంలో అందరినీ ఏక తాటిపైకి నిలిపినది 'వందే మాతరం' (1905) గేయం. 1907 ఎప్రియల్ నెలలో. బిపిన్ చంద్రపాల్ ఉద్వేగభరిత ఉపన్యాసానికి అదే స్థాయిలో కిళాంబి. రామానుజాచార్యాలు తెలుగులో అనువదించి ప్రజలను ఉత్తేజుతులను చేసారు. వీరు లంక సుందరంతో కలిసి 'వందేమాతరం' పత్రికను 1946 వరకు నిర్వహించారు. ఉత్తరాంధ్ర ప్రజలను ప్రభావితం చేయడంలో ఈ పత్రిక తనదైన శైలిని ప్రదర్శించింది.

జాతీయ నాయకుడు బిపిన్ చంద్రపాల్ విజయనగరం పర్యటించినప్పుడు మహారాజ కళాశాల అప్పటి ప్రిన్సిపాల్ కిళాంబి రామానుజాచార్యులు, మహాకవి గురజాడ వెంకట అప్పారావు, ప్రముఖ పత్రికా సంపాదకులు చెరుపూరి సోమయాజులు సభానిర్వహణ గావించినారు నిగురజాడ వారు మొదటి సారిగా కాంగ్రేసు పార్టీ సమావేశంలో మాట్లాడి ప్రజలను ఉత్తేజతులను చేసినారు. 1908లో మద్రాసులో జరిగిన కాంగ్రేస్ సమావేశానికి హాజరయి బ్రిటిష్ పాలకులకు దేశ సమగ్రత మీద ధృడసంకల్పం, దూరదృష్టి లేవని విమర్శిస్తూ ఇంగ్లీషు పద్యానికి పేండీని వ్యంగ్యంగా చదివినారు దానికి 1953లో శ్రీశ్రీ గారు చేసిన అనువాదం "స్వామవేదం" ప్రకారం కాంగ్రేసుకు దిశానిర్దేశనం చేయు లక్ష్యంలో ఆత్మ అనే దీపం వెలిగేం దుకు ఆదర్శం మనే తైలం ముఖ్యం అన్నారు. ఇది ప్రజల ఉద్యమాన్ని బలపరచేటందుకు నిర్ధేశించబడినది. దారిద్యరేఖ దిగువనున్న వారి సంఖ్య అధికంగా వున్నదని గ్రహించిన గురజాడ "యీసురోమని మనుషులుంటే

దేశమేగతి బాగుపడునోయి అని హెచ్చరించినారు. సాంకేతి కంగా, కళాత్మకంగా, యువత తర్భదుపొంది విదేశాలలో డబ్బు సంపాదించుకొని కుటుంబాన్ని తద్వారా దేశాన్ని ఆర్థికంగా బలపడేటట్టు చేయాలన్న ఆకాంక్షతో జల్దుకొని కలనెల్ల నేర్చుకు దేశి సరుకులు నింపవోయి అన్నారు. అత్యధికంగానున్న గ్రామీణ భారతాన్ని బలపేతం చేయ్యలంటే వారి జీవన ప్రమణాలు మెరుగు పడాలంటే "పాడిపంటలు పొంగిపొర్లే దారిలో నువ్వు పాటు పడ వోయిఃఅంటూ నాయుకులకు, ప్రభుత్వాలకు ఆనాడే దిశా నిర్ధేశనం చేసినారు. సోమరితనం వీడి పనిచేయక పోతే" డబ్బు తేలేనట్టి నరులకు కీర్తి సంపద, రాణింపు వుండవని ప్రభోదచేసినారు. "వట్టి గొప్పలు చెప్పుకునే నాయకులను మనం నిత్యం చూస్తునే ఉంటాము. అందుకే పూని యేదైనను నాకు వోకమేల్ కూర్చి జనులకు చూపవోయి" అంటూ హెచ్చరించినారు గురజాడ. విశ్వ మానవ సౌభ్రాతృత్వాన్ని కాంక్షించి మతం వేరైతేను మేమోయి? మనుసు యకటై మనుషులుంటే ఇంతకన్నా విశ్వమానవ కళ్యానికి మించిన మరోకమాట యుండదు. ముప్పవరపు వెంకయ్య నాయుడుగారు భారత ఉపరాష్ట్రపతిగా ప్రమాణోత్సవం ఉపన్యాసంలోనూ, కింజారపు రామ్మోహననాయుడు భారత పార్లమెంట్‌లో ప్రత్యేక హోదాపై గళమెత్తినా వారికి గురజాడ "దేశభక్తి" స్ఫూర్తి. "దేశమంటే మట్టికాదోయ్, దేశమంటే మనుషో లోయి" అని తమతమ సందేశాలలో తెలుగువాడి సత్తాని ప్రపంచానికి చాటారు. "దేశంలో సగంమందికి పైగా మనుషులు, దారిద్యరేఖకు దిగువునున్నావారే, అంటే ఆకలితో లేదా అర్ధాకలితో మలమల మాడే వారే వీరంతా పూర్వ సాహిత్యం దృష్టిలో పడని అనామకులు. గురజాడ చేప్పేవరకూ, వీరి ఉనికి సాహిత్యానికి సరిగ్గా తెలి యదు. అంచేత, సాహిత్యానికి గురజాడ కలిగించిన ఇహలోక సృహ, దానికాయన చేసిన మహోపకారం, (సెట్టి ఈశ్వరరావు, సంపాదకుడు 1984). మత విశ్వాంశాలు, బహుళ వ్యాపారాలు సమైక్యస్ఫూర్తి, సంఘ బలం వేర్లుగా కలిగి దేశమనే వృక్షము పెరిగినపుడు శాఖోపశాఖలుగా పుష్పవంతం అగుటకు "దేశభక్తి" అనే నీరు పోయాలని ఉద్భోవించినారు. 1912లో జార్జిచక్రవర్తి ఢిల్లి రాక సందర్భముగా ముత్యాలసరమును వ్రాస్తు సున్నితముగు దేశ గొప్పతనము గురించి నిట్ల వివారించినారు'' మర్మ మెరుగని ధర్మమని యడి, నిర్మలంబగు నీతి పధమున, పేర్మి ప్రజలను మలచు నేర్పిరి అంటూ మర్మంగా దేశ ఔన్నత్యం అంతర్లీనంగా ఉంటూ, జార్జి మనవలయున్ అంటూ చక్రవర్తిని పొగిడినట్లు అర్ధం అయ్యెటట్లు ద్యందార్ధముగా చెబుతూ తన దేశభక్తిని చాటుకున్నారు.

16వ యేటనే ప్రతికారంగంలోనికి దుమికి జాతి విముక్తి కొరకు అనన్య సామాన్యమైన సంపాదకియాల నందించిన వారు చిర్రాపూరి యజ్ఞేశ్వర చింతామణి. 1894-99 మధ్య కాలంలో భారత వైస్రాయ్‌గా పదవి నిర్వహించిన "లార్ట్‌ఎర్విన్ వైఫల్యం" అన్న శీర్షిక మీద రాసిన వ్యాసాల పరంపర చింతామణిని 18 వ ఏటనే అ ప్రతిక సంపాదకున్ని చేసింది.

చింతామణి విజయనగరం వదలిపెట్టి మద్రాస్ వెళ్ళి "ఇండియన్ హెరాల్డ్" సంపాదకుడు జి. సుబ్రమణ్య అయ్యర్ వంటి ప్రఖ్యాత జర్నలిస్ట్‌ల ప్రశంసలు పొంది సంపాదక వర్గంలో చేరారు.1903 లో అలహాబాద్‌లో "ది ఇండియన్ పీపుల్" వారపత్రికలో సహ సంపాదకుడిగా చేరారు. మోతిలాల్ నెహ్రూ, మదన్ మోహన్ మాలవ్య, సిన్హా, తేజ్ బహుదూర్ నప్రూ బోర్డ్ సభ్యులుగా నున్న "దిలీడర్" పత్రికకు సంపాదుకులయ్యారు. వీరి సంపాద కత్వంలో వెలువడిన వ్యాసాలు జాతీయ నాయకులకు సైతం మార్గదర్శకాలయ్యాయి నిష్పక్షపాత విమర్శికుడిగా, సంపాదకుడిగా ఘనకీర్తిని ఆర్జించినారు. బ్రిటష్ పాలకులను తన కలంతో చీల్చిచెండాడి దేశభక్తీని చాటుకున్న మహనీయుడు చింతామణి.

విశాఖపట్నం కేంద్రంగా మారేపల్లి రామచంద్ర శాస్త్రి గారు (కవిగారు) సాహిత్యం, సంఘసంస్కరణ , విద్యా,

నాటక దేశ సేవారంగాల్లో అనేక జనహిత కార్యక్రమాలు నిర్వహించినారు, 1893 లో కాంగ్రేసు నివేదిక చదవటంతో శాస్త్రిగారు "నా దేశం -నాభాష" పట్ల కార్యాన్మోఖు లయ్యారు. "దేశ సేవకు, భాషా సేవకు తగినవారిని తయారు చేస్తేనే ఉద్యమాలు ఫలవంతం కాగలవని శాస్త్రిగారు (కవిగారు) భావించారు. ఈయన మంచి వక్త. 1914-33 మధ్యకాలంలో దేశస్వాతంత్రోద్యమంలో అలుపెరుగని పోరాటం చేసారు. కాంగ్రేసు సభలలో ప్రసంగిచేవారు. 1908లో హిందూపథన మందిరంలో విశాఖపట్నం గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసారు. 1926లో "కళాసమితి" అనే సాహిత్యవేదికను వీరి అధ్యక్షతన ఏర్పరచి విశాఖపట్నం ప్రజలను జాగృతం చేయటంలో చెరగని ముద్రవేసారు.

గరిమెళ్ళ సత్యన్నారాయణ తన "స్వరాజ్యగీతాలతో" నిస్వార్థంగా చిత్తశుద్ధితో, అకుంఠిత దేశభక్తి భావనలో స్వాతంత్ర సాధనకు తన వంతు కృషిసల్పినారు. బ్రిటిష్ రాజ్ కు వ్యతిరేకంగా. జనాన్ని ప్రభావితం చేయటంలోనూ, సమాయత్తం చేయటంలోనూ ఇతని పాటలు, ఉప న్యాసాలు తోడ్పడ్డాయి. 1921లో స్వయంగా వ్రాసి పాడిన "మాకోద్దీ తెల్ల దోరతనమూ" విస్తృత ప్రాచుర్యం పొందింది. జనుల నాల్కుల మీద నాట్యం చేసింది. శ్వేత జాతీయులపై విద్వేశ్వాన్ని రగిల్చింది. 1921 సం॥లో వేల్స్ యువరాజు మనదేశం వచ్చినపుడు వ్యతిరేక ప్రదర్శనలు జరిగాయి. తుపాకి గుళ్ళకు చాలామంది బలైనారు. "ఏమయ్యా యువరాజు, మాదేశానికి ఎందుకు వచ్చా వయ్యా అంటూ గరిమెళ్ళ గళమెత్తారు. ప్రజలను ఉర్రూతలూగించారు. తరువాత గరిమెళ్ళ జైలుకెళ్ళారు "దండాలండోయ్ దండాలు" ఇక మేము ఉండ లేవం డోయ్" మరియు ఈ సైతాన్ ప్రభుత్వాన్ని సాగనీయ మంటూ గీతాలతో "స్వరాజ్యగీతాలు" సంపుటి వెలు వడింది. ప్రభుత్వం నిషేధించింది. కాని స్కూలు పిల్లలు గాని, భిక్షమెత్తకోనేవారు గాని, పశువుల కాపరులు గాని ఏవరినోట విన్నా గరిమెళ్ళ పాటలే - స్వరాజ్య స్ఫురణలే- భారత జాతియ కాంగ్రేసు సమావేశం, కాకినాడలో మహాత్మగాంధీ గారు, మాకోద్ది తెల్లదొరతనం పాట తెలుగు కవులనేకమందికి స్ఫూర్తినిచ్చిం దన్నారు.

భోగరాజు నారాయణ మూర్తి నవలా రచయిత , వారు 1917 సం॥ దేశభక్తిని రగిలించిన ప్రభోదాత్మకమైనవల "ఆంగ్లరాజ్య స్థాపన" మరియు సమకాలీన సమాజాన్ని ప్రతిబించించే నవల "కాల చక్రము" వ్రాసినారు అత్యధిక ఆదరణ పొందటమే కాకుండా అలోచింప జేసినవి.

1924 మే 24వ తేదిన అల్లూరి సీతారామరాజును కాల్చి చంపినట్లు బ్రిటిష్‌దళం స్పెషల్ కమీషనర్ రూథర్‌ఫర్డ్ ప్రకటించారు. మన్యమంతా దాహలనంగా వ్యాపించింది ఆవార్త. ఆయన మరణాంతరం ఉత్తరాంధ్రాలో జానపద రూపంలో సీతారామరాజు ఇప్పటికి బ్రతికే ఉన్నాడు. హరికథ, బుర్రకథ, యక్షగానం వంటి అనేక కళారూపా లలో అల్లూరి కథలు పలికాయి. అంతవరకున్న జానపద సాహిత్యం రాజుల కథలలో ఉండేవి రూపం మార్చు కుంది. జముకుల కథకులు ఉరూరతిరిగి దేశభక్తితో కూడిన జానపద సాహిత్యాన్ని ప్రజలకు వినిపించమే కాకుండా ఆప్రమత్తంచేసి ఉద్యమం గురించి సామాన్య జనాలలో ఆలోచనలు రేకత్తాంచారు.

1921 లో స్వరాజ్య గీతామృతం అనే పత్రికలో పడ్డాది, పూడిపెద్ది అను కవులు ఈ విధంగా స్వాతంత్ర కాంక్షను రగిలించినారు. భారతమాత నోంచెడు సౌభాగ్య పిశాచము బారధ్రోలియిం పార స్వరాజ్యవైభవము నందగ కంకణ ధారువై మహా ధీర వరేణ్యుల నచ్చలుకు తెల్లియజేయురే పేరునిల్పరే! భారత పుత్రులార! కడుపారగ గాంచిన తల్లి గావరే!

అనకాపల్లి పట్టణానికి చెందిన గుళ్లపల్లి నారాయణ మూర్తి గారు డాక్టరుగా, స్వాతంత్ర యోధునిగా జాతికి సేవలందించడమే కాకుండా మంచినటులు, గ్రంథకర్త కూడా వారు వ్రాసిన కవిత "ఖాధీ"లో ఖాధీ అనగా ప్రభత్వ విధాన ఖాదీగాని, సంకర ప్రభుత్వ వాణిజ్య ఖాదీ

గాని నిష్కారణ పరదాస్య ఖాధీగాని, కద్ధరా! కాదు అంటూ అనాటి ప్రభుత్వ ఆర్థిక విధానాల మీద బ్రిటిష్ ప్రభుత్వానికి బట్టలూడ దీనేటంతా పని చేసారు. తురగా వెంకట రామయ్యగారు వ్రాసిన "దొరవు నీవయ్యెదవురా"! అనేగీతకలో పరమశివుడునీ తండ్రి ప్రకృతి నీ తల్లి, పాడియావులు పంటపొలములు, భాగ్యములు రాజ్యములు అంటూనే అటువంటి రాజ్యానికి దొరవు కావాలంటే తోలకరించిన పుణ్యభూమిని, కరువులేని స్వర్గ రాజ్యానికి శుభదమగు రాట్నంపు శృతితో, సుందరీమణి పాడుచుంటే పొంగుతూ ఆడేటి బిడ్డలే, ఈ భూమలన్నీ యేలదరని భావ్యభారతం గురించి కలగంటూ ఆశా భావం వ్యక్తం చేసినారు.

చర్ల గణపతి శాస్త్రి వ్రాసిన "స్వాతంత్ర దీక్ష" గ్రంథం నుండి "దేశసేవకుడు" అనే కవతలోస్వాతంత్ర పోరాట యోధుల మనసతత్వం వారి పడుతున్న అగచాట్లు, కష్టాలను అనువభించిన తీరును వర్ణిస్తూ "వజ్ర తుల్యము దేవసేవకుని మనసు", పూల పానుపువలె నుండు ముండ్లపాన్పు, మదిని మానవమానముల్ కదపలేవు, వేదనల గణింపడతడు ప్రేమయుడు అంటారు శాస్త్రి గారు.

వేదుల సత్యనారాయణ గారు వారు వ్రాసిన "జయ గీత" అనే కవితలో స్వేచ్చా వేకువ వచ్చేస్తున్నాదని త్రివర్ణ పతాకం జయ శంఖారావమ్ము మ్రెగిస్తుందని చెబుతూ వేదధాత్రివి, జ్ఞానధాత్రివి, పేదలపాలిటి యన్నపూర్ణవు, వీరరాజ్ఞే లేదు నీకిక పారతంత్ర్యమ్ము అంటూ జయ గీతికను ఆలపించినారు.

విజయనగరంలో ఘంటశాల సంగీత శిక్షణ పూర్తయిన సమయం దేశంలో "క్విట్ఇండియా" ఉద్యమం ఉధృతంగా సాగుతున్న రోజులు. స్వాతంత్ర్యం నా జన్మ హక్కు అని చాటండి అంటూ అనేక దేశ భక్తిగీతాలు పద్యాలు పాడుతుంటె వినేవారిలో దేశభక్తి రగిలి ఉత్తే జితులయ్యేవారట ఫలితం వారికి జైలు జీవితంతో మాటి వెంకటరెడ్డి ఘంటశాల వారు చదువుకున్న రోజుల్లో స్నేహితులు ఘంటశాల మద్రాసు చేరగానే వెంకటరెడ్డి గారు ఈయన స్వాతంత్రమ నాజన్మహక్కు" అని ఆమెగల్ రణధీరులు "పాటను భారతీయుల కళాప్రాభవమ్మోలి కించి అనేపద్యాన్ని అమ్మాసరజీనీదేవి" అనే పాటలను పాడించి గ్రామఫోన్ రికార్డింగ్ చేయించినారు. బహుళ ప్రజాదరణ పొందాయి.

సాతంత్రోద్యమ నాయకులు గాంధీజీ గురించి గాంధీజీ అన్న శీర్షకతో ఇలపై బుద్ధుని కంటేను, తలపర శిబికంటె, ధర్మతనయుని కంటెన్, నెలయినహింస శిలము, కవిలో వెవరీడు నీకు గాంధీతాత అంటూ కోట సోదరకవులు స్తుతించినారు. దారితప్పిన బాటసారులకు, దారిగానని పేదవారలకు, వెలిగించు కాగడు వెలిగించవోవ్ అన్నారు వేదుల వారు. విజయనగరం బోంకులదిబ్బ వద్ద సత్యాగ్రహం చేస్తున్న పనుమర్తి వీరభద్రస్వామి తదితర స్వాతంత్ర సమరయోధులను బ్రిటిష్ ప్రభుత్వం అరెస్ట్ చేసింది. ఈ ఆక్రమ అరెస్టెకు నిరసనగా 18 రోజుల పాటు విద్యార్థి ఉద్యమం నడిచింది. అనాటి విద్యార్థులు వి. స్వామిరంగారెడ్డి, కె. రామచంద్రా రెడ్డిలు "భారతీయుడా లేవరా" అంటూ గేయం విద్యార్థులోకాన్ని ఉత్తేజపరచి ఉద్యమం బలపడేటట్టు చేసింది. మంచి మాటల వలన ఫలిమిక కోంచెమైననూ లేదురా! పచ్చి మోసము చేయిచుండిడి, పగతురను పరిమార్చరా అంటూ సాగిన పాటలో దేశభక్తిని ప్రదర్శించే మంచి తరుణ మిదేనురా! అంటూ యువతను వెర్రింకించి నది ఈ పాట. పనుమర్తి వీరభద్రస్వామి గారు 1937 నుండి 1960 వరకు "మాతృసేవ" అనే పత్రికకు సంపాదకత్వం వహించటమే కాకుండా నిర్వహణా బాధ్యతలను కూడా చేపట్టినారు. ధనార్జన కొరకు కాకుండా మాతృసేవ పేరుతో స్వాతంత్ర సమరానికి ప్రజలను ఉద్యుక్తులను చేయటంలో సఫలీకృతాలయినారు. ఉత్తరాంధ్ర వాసులు (విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం, జయపూర్ రాయగడ్, కోరాపుట్ జిల్లాలు) స్వాతంత్రోద్యమంలో పాల్గొని అసువుల బాసిన అనేకమందికి "అనుశృతి" పేరుతో కవి

కులాలంకార చామర్తీ కృష్ణమూర్తి గేయాన్ని వ్రాసారు అందు "కేవలము దేశ సేవ కంకితములైన జీవితమ్ములన్నిట ప్రకాశింప జేసి భావితరాలను తేజపరపనయ్యే, ఇంతకంటే జగద్ధీతమేమిగలదు? అని వ్రాసినారు.

క్విట్ ఇండియా ఉద్యమం క్రిప్స్‌రాయభారం, ద్వితీయ ప్రపంచ సంగ్రామం, జపనీస్ దళాలు సింగపూర్, రంగూన్ అండమాన్ దేవులను ఆక్రమించుట కామేన్‌వెల్త్ దేశాల తీరుతెన్నులను, కమ్యూనిస్ట్ పార్టీల వ్యతిరేకత నేపద్యంలో విశాఖట్నం నుండి శ్రీశ్రీ "దేశచరిత్రలు" గేయం ప్రచురించినారు. "ఏదేశ చరిత్ర చూసినా ఏమున్నది గర్వకారణం, నరజాతి చరిత్ర సహస్తం పరపీడన పరాయణత్వం అంటూ నినదించారు స్వేచ్చా సౌభ్రాతృత్యాలు ఏ రాజ్యకాలంలోనూ లేవన్నది శ్రీశ్రీ భావన మానవ హక్కులు కాలరాయబడటాన్ని నిరసించాడు. విశాఖ జిల్లా కాంగ్రేసు నాయకులు, స్వాతంత్ర సమరయోధులు, కవి వేచలపు పాలవెల్లి గారు "నిత్య నూతన స్ఫూర్తితో జంకుబోంకు లేకుండా స్వాతంత్ర సమరాన దీక్షబూనినారు. తెల్లదోరలారా! మూట ముడియు కదలండని, భారత జనయిత్రి దాస్యమ్ము పారద్రోల వెలసి నారెక్క డెందరో వీరవరులుకూ "ప్రాంజలి" ఘటించినారు. నాటి స్ఫూర్తిని దీక్షను నేటి తీరము కూడా పొంది, సంపదను వృద్ధిచేసి సాటి దేశాల యందు మేటిగా నుండాలని హితవు పల్కినారు. స్వాతంత్ర సముపార్జనాకాలంలో ఉద్యమానికి స్ఫూర్తి నిచ్చిన కవులకు, రచయితలకు పత్రికా సంపాకులకు అంజలి ఘటిస్తున్నాను.

ఉపయుక్త గ్రంథాలు :

1) గురజాడ అప్పారావు గారి జీవితచరిత్ర, రచయిత : వసంతరావు బ్రహ్మాజీరావు.
2) మూడు శతాబ్దాల విజయనగరం, రచయిత : పున్నమరాజు నాగేశ్వరరావు, ప్రచురణ : అమ్మ పబ్లికేషన్స్. విజయనగరం.
3) ఘంటశాల జ్ఞాపకాలు, రచయిత : ఘంటశాల సావిత్రి, ప్రచురణ : నవోదయ బుక్ హౌస్, హైదరాబాద్.
4) తెలుగు వెలుగులు, గరిమెళ్ళ సత్యన్నారాయణ, ప్రచురణ : అమరావతి పబ్లికేషన్స్.
5) మహరాజ కళాశాల మోగజైన్స్
6) ఉత్తరాంధ్ర స్వాతంత్ర్యోద్యమ చరిత్ర, రచయిత : సి.హెచ్. ఆచార్య, ప్రచురణ : స్వాతంత్ర్యోద్యమ చరిత్ర పరిశోధనా సంస్థ : హైదరాబాద్.
7) గురజాడ రచనలు - కవితల సంపుటం, సంపాదకుడు : శెట్టి ఈశ్వరరావు, ప్రచురణ : విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్.

⌘⌘⌘

BHAVAVEENA
Vol. 17, Issue. 8, August 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

తెలంగాణ ఉద్యమ కవిత్వం – ప్రాంతీయ అస్తిత్వం

- గడ్డం నాగేందర్

తెలంగాణ సాహిత్యంలో ప్రాంతీయ అస్తిత్వానికి సంబందించిన రచనల్లో కవిత్వం (సంకలనాలు) ఎక్కువగా వచ్చింది. ఎలాంటి ఉద్యమ ప్రతిస్పందన లయిన కవితాప్రక్రియ ద్వారా సులువుగా సాహిత్య స్రవంతిలోకి చేరాయి. అదేవిధంగా తెలంగాణ ఉద్య మానికి సంబంధించిన కవిత్వం ద్వారానే ప్రజల్లోకి ఉద్యమం సులువుగా వెళ్ళింది.ఉద్యమ పంథాలోవచ్చిన కవిత్వ సంకలనాలు ప్రజా చైతన్యానికి తోడ్పడ్డాయి. అందువల్ల తెలంగాణ ఉద్యమ నేపథ్యంలో వచ్చిన కవిత్వం తీరుతెన్నుల్ని అర్థం చేసుకోవడం ద్వారా ఉద్య మాన్ని అర్థం చేస్కోవచ్చు. ఉద్యమం పక్కదారి పట్టి నప్పుడల్లా తెలంగాణ కవులు హెచ్చరికలయ్యారు. ఉద్యమం వెనకపట్టు పట్టినప్పుడల్లా ముల్లుగర్రలతో అదిలించారు. ఈ క్రమంలో తెలంగాణ కవులు ఎక్కడా వెనకడుగు వేసిన దాఖలా కనిపించదు. ఆత్మవిశ్వాసంతో ఎక్కడికక్కడ, ఎప్పటికప్పుడు నిలదీస్తూ ముందుకు సాగారు. యుద్ధ వీరులని తలపించారు. రాజకీయ ఉద్యమం చతికిల పడిన సందర్భాలొచ్చి నప్పుడల్లా కవిత్వంతో జవసత్వాలనిచ్చే ప్రయత్నం చేశారు.

1990 మధ్యకాలంలోనే తెలంగాణ కవులు ప్రాంతీయ స్పృహను ప్రబలంగా వ్యక్తం చేయడం కనిపిస్తుంది. ఎవరి అనుభవాల్ని వాళ్లే రాయాలన్న వాదం అప్పటికే వచ్చింది స్త్రీలు, దళితులు, మైనారిటీలు తమ పరిధిలో ఏకమై రచనలు చేసారు. ఇదే సమయాన ప్రాంతీయ స్పృహ కూడా కొత్తగా రాసేవారికి ఇది ఎంతో ఉత్సాహాన్ని కలిగిం చింది. ఆంధ్రప్రదేశ్ ఏర్పడ్డాక తెలంగాణ ప్రాంతం వివక్షకు లోనయింది. 1990 తర్వాత కాలంలో మరింత తీవ్రమైంది. తెలంగాణాలో ప్రజలు తమ అస్తిత్వాన్ని కోల్పోయారు. ఇక్కడి సంస్కృతి పండుగలు కేవలం గ్రామాల్లో జరుపుకునేవారు పట్టణాల్లో తెలంగాణ సంస్కృతి పండుగలు కొద్దిమేర కనబడే పరిస్థితి ఉండేది. ఇక్కడ మాట్లాడే బాషా తెలంగాణ కాకుండా పోయింది. ఇంకా సినిమాలో వాడే బాష కోస్తా ఆంధ్ర యాసలో ఉండడం గమనించవచ్చు . ఇంకోవైపు భాషా సంస్కృతి సైతం అపహాస్యానికి లోనయ్యాయి. మొత్తంగా ఈ ప్రాంత ప్రజల సామాజిక, సాంస్కృతిక జీవితం విచ్ఛిన్నమైంది. సరళీకృత ఆర్థిక విధానాల నేపథ్యం, గ్లోబలైజేషన్ క్రమంలో తెలంగాణ వాసులను మరింత దెబ్బతీసింది వ్యవసాయం, ఇంకా ఇతర రంగాల్లో ఇక్కడి ప్రజల బతుకు అస్తవ్యస్తం అయ్యింది. తెలంగాణ కార్మికుల బతుక్కి భద్రత లేకుండా పోయింది. నిరుద్యోగం ఎక్కు వైంది. ఉపాధి అవకాశాలు క్షీణించాయి ఈ వాస్తవాన్ని తప్పించుకోవడం ఏ కవికీ సాధ్యం కాదు. (గుడిపాటి, అభివ్యక్తి కవిత్వ విమర్శ) తెలంగాణ కవులు ఇక్కడ పడుతున్న ప్రాంతీయ అసమానతలు వెనుకబాటుతనం అన్ని గమనించి ప్రాంతీయ అస్తిత్వం దృష్టితో కవిత్వం రాయడం మొదలుపెట్టారు. ముందుగా ప్రాంతీయతత్వం గురించి మాట్లాడుకుంటే కవి దాశరథి ''నా తెలంగాణ కోటి రతనాల వీణ'' అంటూ గళమెత్తారు. తెలంగాణ వందల సంవత్సరాల నుండి ఈ రాచరిక పాలనలో ఉంటూ తనదైన సొంత అస్తిత్వాన్ని సంస్కృతిని కోల్పో లేదు. తెలంగాణ కవులు భూస్వాములపై జాగీర్దార్లలపై తిరగబడుతు సాయుధ పోరాటాన్ని ముందుకు తీసు కెళ్లారు.

ప్రపంచీకరణ సామ్రాజ్యవాద వ్యతిరేక భావజాలం అడుగుజాడల్లో నుంచి తెలంగాణ ప్రాంతీయ చైతన్యం అస్తిత్వ వేదన బాగా నిలదొక్కుకుంది'' (ముదిగంటి సుజాతరెడ్డి, ముద్దెర) తెలంగాణ ప్రాంతీయ అస్తిత్వాన్ని

చాటింగ్ కు కవులు తనవంతుగా కవిత్వం రాయడం మొదలుపెట్టి ప్రపంచీకరణలో సామ్రాజ్యవాద వ్యతిరేక సంఘర్షణలో ప్రాంతీయ అస్తిత్వాన్ని కూడా చూపించారు. తెలంగాణ చరిత్రలో పోరాట వారసత్వం విలువైన సంస్కృతి పుష్కలంగా కనిపిస్తుంది పాల్కురికి సోమన అప్పటి కాలంలో సాంప్రదాయ భక్తి తత్వాన్ని వదిలేసి నూతన భక్తితత్వాన్ని చెప్పి విప్లవాత్మకమైన భక్తి ఉద్యమాన్ని లేవదీశాడు. ఇలా అప్పటి నుండి తెలంగాణ ప్రాంతీయ అస్తిత్వాన్ని చాటుతోంది.

ప్రాంతీయవాదం (రీజినలిజం) :

ఒక దేశ సాహిత్యంలో ప్రాంతీయత అనేది ఒక నిర్దిష్ట ప్రాంతం యొక్క మాండలికం, ఆచారాలు, చరిత్ర, సామజిక అంశాలతో, ఆర్థిక సమస్యలు, వెనుకబాటు వంటి నిర్దిష్ట లక్షణాలపై దృష్టి సారించే, రచనలు లేదా కవిత్వాన్ని (సాహిత్యం) ఇలాంటి కవిత్వాన్ని మరో విధంగా "స్థానిక స్పర్శ" అని కూడా అంటారు ఇలాంటి లక్షణాలు కలిగిన కవిత్వాన్ని ప్రాంతీయ అస్తిత్వ కవిత్వంగా చెప్పవచ్చు.

ప్రాంతీయ అస్తిత్వ ఉద్యమాలు అమెరికా ఇంకా ఇతర యూరప్ దేశాల్లో ఆధునిక సాహిత్యంతో మొదలయ్యాయి. ఇలాంటిది అమెరికన్ రియలిస్ట్ మోడరన్ ఆర్ట్ ఉద్యమం, ఇది 1930 లలో ప్రాచుర్యం పొందింది. ఇది ప్రాంతీయత (అంతర్జాతీయ సంబంధాలు), గుర్తింపు, ప్రయోజనం అలానే కవులు, రచయితల వారి జ్ఞానంతో ఒక ప్రాంతపు ఆర్థిక సామజిక పరిస్థితులను తమ రచనల్లో వ్యక్తీకరణ, చేయడం జరిగింది. ఇంకా ఇలాంటి విషయాన్ని వ్యక్తీకరించే సంస్థల ద్వారా ప్రాంతపు భౌగోళిక, సామజిక, సాంస్కృతిక ప్రత్యేక గుర్తింపు కోసం తెలియా చేయడం కోసం ఒక విషయం అవగాహనతో కూడిన రచనలు చేయడం అనేది ప్రాంతీయ అస్తిత్వ సాహిత్యం గా గుర్తిస్తాము. వీటి ద్వారా ప్రజలు చైతన్యం పొంది ప్రాంతీయ రాజకీయాలు), నిర్దిష్ట ప్రాంతం లేదా ప్రాంతాల సమూహం ప్రయోజనాల కోసం రాజకీయ, సామాజికా ఉద్యమం మొదలవుతుంది.ఆప్రాంతపు అవసరాల తీర్చడంకోసం ప్రభుత్వాల ఆలోచన చేసే వీలుగా ప్రాంతీయ అస్తిత్వ కవిత్వం చదివిన వారికి అవుతుంది .

ప్రాంతీయ కవిత్వం ఉత్పన్నమవడానికి సాంస్కృతిక మూలాలు ఎంత అవసరమో అక్కడి అణచివేతలుకూడా అంతే కారణం.19వ శతాబ్దం మధ్య భాగాల్లో 20 వ శతాబ్దం మొదటిభాగాల్లో అమెరికాలో ప్రాదేశిక కవిత్వం వచ్చింది." Donna M. Campbell లాంటి విశ్లేషకులు ఈ సాహిత్యాన్ని అనుశీలన చేసారు. సివిల్ వార్ తరువాత వచిన సాహిత్యంగా దీనిని చెప్పుకుంటారు. ఫిలిప్పిన్స్ సాహిత్యంలోనూ ఇంగ్లీష్ భాష ఆధిపత్యాన్ని తిరస్కరిస్తూ ప్రాదేశిక సాహిత్యం వచ్చింది. ఈ మార్గంలో తెలంగాణా సాహిత్యం, కవిత్వం మినహాయింపు కాదు.

సాంస్కృతిక, రాజకీయ అణచివేతల తరువాత బలమైన ప్రాదేశిక కవిత్వం రావడం సాహిత్యంలో కనిపిస్తుంది. ఈ మార్గంలో మొదటి పరికరం భాష. ప్రాతిపదికంగా వర్తమానంలో ప్రవహంలో ఉన్న భాషను రూపగతంగా తిరస్కరించే పరికరం భాష మాత్రమే. తెలంగాణా కవులు కూడా భాషపై తొలిదశలోనే దృష్టి పెట్టారు. తమ ఉనికి వ్యక్తం చేయడానికి భాష ఒక ప్రధానపరికరం అన్న జ్ఞానం అనాడే కనిపిస్తుంది. అయితే ఈ కవిత్వం అనాటికి శబ్దముఖంగా ఉనికి వ్యక్తం చేసే ప్రయత్నం చేసింది.

తొలిదశ తెలంగాణా ఉద్యమం మలిదశకు మధ్య కాలంలో తెలంగాణా కవులు వివిధ సామాజిక, రాజకీయ ఉద్యమాలను మోయవలసి రావడం అందువల్ల వస్తువుగా తెలంగాణాను ప్రధానంగా వ్యక్తం చేయవలసిన అవసరాన్నుంచి దూరం చేసింది. ఎమర్జెన్సీ, సాయుధ పోరాటాలు, రైతాంగ పోరాటాలు, తొలిదశ రాజకీయ ఆకాంక్ష ఇవన్నీ వస్తువులుగా తెలంగాణా కవుల కవిత్వంలో చూపబడ్డాయి. మలిదశకు కొంత ముందు భాగాల్లో ఉన్న ప్రపంచీకరణ, పారిశ్రామిక విధానాలు, పట్టణీకరణ మొదలైనవి ఇందుకు మినహాయింపు కాదు. ఈ సమయంలోనే అస్తిత్వ ఉద్యమాలు పెరిగి తెలంగాణా

ప్రాంతీయ కవిత్వం రావడానికి మార్గాలేర్పడ్డాయి.దళిత కవిత, బహుజన కవిత, ముస్లిం మైనారిటీ కవిత అందుకు దోహదపడ్డాయి. ముద్రనుంచి జీవితాన్ని చిత్రించడం ఇక్కడినుండే ప్రారంభమయింది. అందువల్ల సాంస్కృతిక క్షేత్రం, వ్యక్తులు, వ్యక్తిత్వాలు, భాష నిర్దిష్టంగా వెలుగులోకి వచ్చింది. ఈ పై వాదాల కాలంలో కవిత్వం, కవితలు ప్రాంతీయ లక్షాన్ని కలిగి లేవు.అస్తిత్వ ప్రశ్నలను లక్షంగా చేసుకున్నవిగా ఉన్నాయి.

తెలంగాణ ఉద్యమ కవిత్వం - నేపథ్యం :

తెలంగాణ కవికి రచన కేవలం అభిరుచి కాదు ప్రాంతీయ సమస్యలను బాధ్యతగా తీస్కొని నిబద్ధతగానే కవిత్వాన్ని సృజించారు. ఉద్వేగమే ఇక్కడి కవుల్నీ, రచయితల్నీ నడిపించింది. కనుకనే మొదట్నించి ఇక్కడ కవిత్వ ప్రక్రియదే పైచేయి. జనం బాధల పల్లవిని కవిత్వంగా, పాటలుగా సృజించారు. ఈ నేల మీది కవులు. పాల్కుర్కి సోమనాథుడుగానీ, బమ్మెర పోతన గానీ జనం గుండె చప్పుళ్ళనే వినిపించారు. ఆధునిక కవిత్వంలోనూ జనం గొంతుకనే వినిపించారు. ఈ నేల మీది జీవన సంఘర్షణే, జీవన సౌరభమే తెలంగాణ కవిత్వ వస్తువులు. తెలుగు చదవడమ, రాయడమ అరుదయినప్పటికీ కవిత్వ సృజనలో తెలంగాణ ఎప్పుడూ వెనుకబడి లేదు. గోలకొండ కవుల సంచిక తర్వాత మొట్టమొదటి సారిగా తెలంగాణ ప్రాంతీయ చైతన్యాన్ని ఆవిష్కరించే బృహత్తర కవితా సంకలనం 'పాక్కిలి'. ఈ సంకలనానికి జూలూరు గౌరీశంకర్ సంపాదకులు. తెలంగాణ కవిత్వ భూమికను, ప్రత్యేకతల్ని వివరిస్తూ గుడిపాటి వివరమైన ముందుమాట రాశారు. ఇది 2002 మే నెలలో వెలువడింది. నల్లగొండ జిల్లాలోని కోదాడకు చెందిన స్పృహ సాహితీ సమాఖ్య దీనిని ప్రచురించింది. 130 మంది తెలంగాణ కంఠ స్వరాలకు ప్రాతినిధ్యం వహించే సంకలనమిది. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని ఆమోదించే వారి కవిత్వం మాత్రమే స్వీకరించడం ఈ సంకలనం ప్రత్యేకత. 'పాక్కిలి'. తెలంగాణ ప్రాంతీయ చైతన్యం పెల్లుబుకుతున్న క్రమాన ఇక్కడి కవుల అభివ్యక్తిని, ప్రాంతీయ ఆకాంక్షలను బలంగా వ్యక్తం చేసిన తీరును చెప్పిన కవిత్వ సంకలన మిది. తెలంగాణ ప్రాంతంలో కవులకు ఒక దిశానిర్దేశాన్ని, ఎజెండాను అందించిన సంకలనంగా 'పొక్కిలి' ప్రాధాన్యం సంతరించుకుంది. దీనికి ముందే జూలూరు గౌరీశంకర్ తెలంగాణ కవిత్వానికి ఒక ప్రత్యేకతను చూపించారు. అంతేగాక తెలంగాణ ప్రాంతీయ చైతన్యం ఆరంభ దశలోనే 'నా తెలంగాణ' పేరుతో 1998లోనే తొలి ఉద్యమ దీర్ఘకవితను రచించాడు. తెలంగాణ ఉద్యమం మొదలైన అప్పటి నుండి ఏర్పడిన ప్రాంతీయ అస్తిత్వ కవిత్వాన్ని వచ్చిన కవిత్వ సంకలనాలను ఈ వ్యాసం లో వెల్లడిస్తాను.

ఉద్యమ కవిత్వ సంకలనాలు :

కవిత్వచరిత్రలో మరో మలుపు 'మత్తడి'దీర్ఘ కవితలు రావడం కొత్తకాదు గానీ పూర్తి తెలంగాణ వాదం తోనే ఒక సంపుటి రావడం మాత్రం సుంకిరేడ్డి గారి ద్వారానే మొదలయింది 2002 డిసెంబర్లో తెలంగాణ సాంస్కృతిక వేదిక 'మత్తడి' సంకలనాన్ని వెలువరించింది. సుంకిరెడ్డి నారాయణరెడ్డి, అంబటి సురేంద్రరాజు సంపాదకులుగా వ్యవహరించారు. ఈ సంకలనంలో 258 మంది కవుల కవితలున్నాయి. అయితే తెలంగాణ రాష్ట్రం కావాలని కోరుకునే వారితోపాటు, అంధ్రప్రదేశ్ సమైక్యంగా ఉం డాలని కోరుకునే కవుల రచనలు కూడా దీనిలో చేర్చారు. ప్రాంతీయ ఆకాంక్షలే ప్రధాన కవితా వస్తువులయి తెలంగాణ అంతటా రాష్ట్ర సాధనే లక్ష్యంగా కవిత్వం రావడం మొదలయింది. ఈ నేపథ్యంలోనే తెలంగాణా కవయిత్రుల కవితా సంకలనం 'గాయాలే గేయాలై' కవితా సంకలనం నిజామాబాద్ జిల్లా నుంచి వెలువడింది. రాజీవ, జ్వలిత, అమృతలత సంపాదకులుగా వ్యవహరిం చారు. ప్రముఖ రచయిత్రి ముదిగంటి సుజాతారెడ్డి వివరమైన ముందుమాట రాశారు. ఈ పుస్తకంలో అరవై మంది మహిళల కవితలున్నాయి. ఇక్కడి తెలంగాణ చైతన్యాన్ని, మహిళల అభివ్యక్తులను ప్రతిఫలిస్తుందీ

సంకలనం. 2002లో 'పొక్కిలి'తో ప్రారంభమైన సామూహిక సంకలనాల పరంపర లో దీన్ని వెలువరించారు.

ముఖ్యంగా 2009లో తెలంగాణ ఉద్యమ రూపురేఖలు మారినాక సంకలనాల సంఖ్య పెరిగింది. విభిన్న తెలంగాణ జిల్లాల నుంచి కవిత్వ సంకలనాలు వస్తున్నాయి. వరంగల్ రచయితల ఐక్యవేదిక 'ఉరుములు-మెరుపులు' కవితా సంకనం వెలువరించింది. దీనికి సంపాదకులుగా డా. వి. వీరాచారి ఉన్నారు. అలాగే నల్లెల్ల రాజయ్య సంపాదకత్వంలో 'తెలంగాణ జంగ్-2010' కవితా సంకలనం వెలువడింది. దీనిని వరంగల్లు రచయితల సంఘం ప్రచురించింది. ఇదే కాకుండా వరంగల్ నుంచి 'ఒకరికొకరు' శీర్షికన టి. శ్రీరంగస్వామి సంపాదకత్వంలో వెలువడిన పుస్తకంలోనూ తెలంగాణ కవిత్వం పుష్కలంగా ఉంది.

'కరీంనగర్ జిల్లా కవిత -2012' కరీంనగర్ జిల్లా నుంచి వచ్చింది. అంతకుముందు ఈ జిల్లా నుంచి 'వల్లుబండ' సంకలనం వెలువడింది. సుంకర రమేశ్ సంపాదకత్వంలో 2007 నుంచి 2010 వరకు 'తెలంగాణ కవిత' శీర్షికన అయిదేళ్ళపాటు వార్షిక సంకలనాలు వెలువడ్డాయి. వేనేపల్లి పాండురంగారావు సౌజన్యం, సహకారం ఇందుకు ఉపకరించింది. నల్లగొండ జిల్లా ఆలగడపలోని 'మట్టి ముద్రణలు' వీటిని ప్రచురించింది. ఇదే సమయంలో 'దిమ్మిస' వంటి సంకలనాల్ని స్కైబాబా తదితరులు వెలువరించారు.

2012లో 'జూలూస్' శీర్షికన సంకలనంగా వెలువడింది. ఎస్. జగన్నెడ్డి దీనికి సంపాదకులుగా వ్యవహరించారు. కవుల సంఖ్య కుదించుకొని ఆ కవుల రచనల్లో బలమైన వ్యక్తీకరణ ఉన్న కవితలను దీనిలో ప్రకటించారు. కాగా, తెలంగాణ కవిత్వంలోని విశిష్టతల్ని పట్టిచూపే 'జిగర్' కవితా సంకలనం 2013లో అనిశెట్టి రజిత, కొమర్రాజు రామలక్ష్మి, కరిమిళ్ళ లావణ్య, భండారు విజయ, గడ్డం పద్మాగౌడ్ల సంపాదకత్వంలో వెలువడింది. దీనిలో 124 వైవిధ్యమైన కవితలున్నాయి. ఇరవయ్యో శతాబ్దపు తొలి, మలితరం కవులతోపాటు 21వ శతాబ్దిలో మాత్రమే రాయడం మొదలుపెట్టిన వారి కవితలు కూడా ఇందులో ఉన్నాయి. ఇక మెదక్ జిల్లా నుంచి 'ఇరుసు' అనే సంకలనం వెలువడింది. అలాగే పొట్లపల్లి శ్రీనివాసరావు, అనిశెట్టి రజిత సంపాదకులుగా వెలువడిన 'ఊపిరి' (2011) సంకలనంలో చాలా మంచి కవిత్వం వుంది. జయశిఖరం అనే మరో కవితా సంకలనం కూడా చెప్పుకోదగింది. మానుకోట సంఘటన నేపథ్యాన కందాళ శోభ, వంగాల సంపత్‌రెడ్డి, వడ్డెబోయిన శ్రీనివాస్ కలిసి 'మే 28 యుద్ధ గానం' అనే సంకలనం తీసుకువచ్చారు. 'హస్పైదూల' అనే సంకలనం కూడా వచ్చింది. ఈవిధంగా పలు జిల్లాల నుంచి కవితా సంకలనాలు వచ్చాయి.కెసిఆర్ నిరాహారదీక్ష తర్వాత నడిచిన ఉద్యమంలో ఈ సంకలనంలోని పాటలు, కవితలు విద్యార్థులకు, ఉద్యమకారులకు ఎంతో తోడ్పడ్డాయి. టాంక్‌బండ్పై విగ్రహాల కూల్చివేత సందర్భంలో 'దిమ్మిస' వినిర్మాణ కవిత్వం పేర 51 మందితో ఒక సంకలనం వెలువడడం విశేషం. ఈ సంకలనం వల్ల కూల్చివేత పట్ల ఎక్కువ వ్యతిరేకత రాకుండా తెలంగాణ కవులు చేయగలిగారు. శ్రీకృష్ణకమిటీ రిపోర్టు వెలువడిన వెంటనే ఆగ్రహోదగ్రులైన కవులు 31 మంది దాకా కలిసి తీసుకొచ్చిన 'క్విట్ తెలంగాణ' సంకలనంలోని కవితలు అప్పటి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం లో వివాదాస్పదమయ్యాయి .

ప్రాంతీయ చైతన్యం వెల్లువెత్తిన నేపథ్యంలో తెలంగాణలోని సకల అంశాల్ని కవితా వస్తువులుగా స్వీకరించారు తెలంగాణ కవులు. ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్ష నేపథ్యంలో వివక్ష, ఆధిపత్యం వంటి అంశాలు సైతం కవిత్వానికి ఇతివృత్తాలయ్యాయి. తమకు జరిగిన అన్యాయం పట్ల కవులు తమ వాణిని వినిపించారు. 2009లో ఉద్యమం మలుపు తిరిగిన నేపథ్యంలో ఎంతో కవిత్వం వచ్చింది. పుష్కరకాల ఉద్యమ గమనాన్ని సూచించే సంకలనంగా 'మునుం' వెలువడింది. ఈ

బృహత్తర సంకలనానికి వేముగంటి మురళీకృష్ణ, వర్ధుల శివకుమార్, అందెశ్రీ, దాసరాజు రామారావు సంపాదకులుగా వ్యవహరించారు. 285 మంది కవుల కవిత్వం ఈ పుస్తకంలో వుంది. తెలంగాణ జాతిపిత జయశంకర్ చనిపోయిన సందర్భంలో జూలూరు సంపదకత్వంలో 'జయశంకరా', వేముగంటి మురళీకృష్ణ సంపాదకత్వంలో 'జయశిఖరం' కవితా సంకలనాలు వెలువడ్డాయి. 'జాగో..జగావో' తెలంగాణ ఉద్యమ కవిత్వం పేర 120 మందికి పైగా కవులతో సంకలనం వెలువడి మలి ముద్రణ కూడా పొందింది 2012లో వచ్చిన ఈ కవిత్వ సంకలనం దాదాపు పదిహేనేళ్ళ తెలంగాణలోని పరిణామాలకు, ఉద్యమాలకు ప్రతిస్పందనగా వచ్చింది. తెలంగాణ కవిత్వంలోని వస్తువై విధ్యాన్ని, శైలీశిల్పాల విలక్షణతల్నీ అర్థం చేసుకోడానికి ఈ సంకలనాన్ని చదివి అర్థం చేసుకోవాల్సి ఉంటుంది.

భాషా స్పృహ ఆధునికానంతర కాలంలో సామాజిక జీవనంలో పెరిగిన భాషా ప్రాధాన్యతను గురించిన చర్చలు ఈ వరకే సాహిత్యంలో బోలెడన్ని జరుగుతున్నాయి. ఈ క్రమంలో తెలంగాణ కవుల్లో కొంతమందిలో యాదృచ్ఛికంగాను, కొందరిలో సాంస్కృతికోద్యమ స్పృహతోను వైవిధ్యమైన భాషా ప్రయోగం జరుగుతున్నది. కవితల్లో అక్కడక్కడా చక్కని పదాలు తెలంగాణ జీవన మూలాల్ని పాఠకునికి తాకే విధంగా చిత్రిస్తున్నారు. కొలిమి (జూలూరి), కుంపటి (బాణాల), పెత్రమాస (సిద్ధార్థ) లాంటి కవితా శీర్షికలు తెలంగాణ స్పృహను చూపించేవి. గంగ తెప్ప సాయమాను సొట్ట బుగ్గ (అంబటి వెంకన్న) లాంటి పదబంధాలు తెలంగాణ పల్లెల జీవన మూలాల్ని సాహితీ లోకానికి పరిచయం చేసేవి. అలాగే జూకంటి జగన్నాథం 'పాతాళ గరిగె', రాయగిరి నాగరాజు స్మృతిలో వచ్చిన 'సింగిడి' తెలంగాణ స్పృహతో సంకలనాలకే పెట్టిన పేర్లు.ముండ్ల గర్ర జూలూరి గౌరీశంకర్ "నది పుట్టు బడి, ఇక్కడి చెట్ల గాలి"ని డాక్టర్ నందిని సిద్ధారెడ్డి, "చెట్టును దాటుకుంటూ" ను జూకంటి జగన్నాథం, పొద్దుపొడుపు, "పొక్కిలి వాళ్ళ పులకింత" ను అన్నవరం దేవేందర్, జఖ్ము ఆవాబ్ ను స్కైబాబు వెలువరించారు. మరి కొన్ని కవిత్వ

మరికొన్ని సంకలనాలు :

లడాయి	- డా. పసునూరి రవీందర్
ఎర్ర మట్టి బండి	- తదల అంజయ్య
పిడికిలి	- బిళ్ళ మహేందర్
ముల్కీ	- వేముల ఎల్లయ్య
యాళ్లయింది	- డా. ఉదారి నారాయణ
నెగడు	- చింతల ప్రవీణ్
జంగ్	- దానక్క ఉదయభాను
మనం	- 2012 సంవత్సరంలో వేముగంటి మురళీకృష్ణ
మల్లు బండ	- అన్నవరం దేవేందర్
మశాల్-దీర్ఘకవిత	- వనపట్ల సుబ్బయ్య
కావడి కుండలు	- డా. కోయి కోటేశ్వరరావు

ఆధార గ్రంథాలు :

1. స్వరూప, బి. తెలంగాణ కవిత్వంలో ప్రాంతీయ చైతన్యం 2000-2010 (ఎం.ఫిల్) హైద్రాబాద్ విశ్వ విద్యాలయం, హైద్రాబాద్.
2. స్కైబాబ (సంపా) జగో జాగోవో తెలంగాణ ఉద్యమ కవిత్వం.
3. నారాయణ సుంకిరెడ్డి, దాలి, తెలంగాణ సాంస్కృతిక వేదిక ప్రచురణ, 2001.
4. ఉదయ్ భాను, దానక్క జంగ్, తెలంగాణ విద్యార్థి వేదిక ప్రచురణలు, హైదరాబాద్ 2010.
5. అంజయ్య వదల, పునాస, మంజీరా రచయితల సంఘం ప్రచురణ, సిద్దిపేట, 2006.

6. కింగ్ షేక్ నాగ్. తెలంగాణ ఉద్యమం చారిత్రక నేపథ్యం. న్యూ ఢిల్లీరీమ్ పబ్లికేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్. ప్రథమ ముద్రణ 2012.
7. 'సింగిడి' తెలంగాణ రచయితల సంఘం. ప్రథమ ముద్రణ.
8. గౌతం పింగ్లే. పడిలేచిన తెలంగాణ. హైదరాబాద్. ఓరియంట్ బ్లాక్ స్వాన్.ప్రథమ ముద్రణ, 2015.
9. గౌరీశంకర్, జూలూరు, పొక్కిలి. కోదాడ. స్పృహ సాహితీ సంస్థ. ప్రథమ ముద్రణ, 2000.
10. గౌరీశంకర్, జూలూరు. నాలుగోకన్ను, కోదాడ-హైదరాబాద్. స్పృహసాహితీ సంస్థ. ప్రథమ ముద్రణ, 2005.
11. ప్రజాస్వామిక ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమం. హైదరాబాద్ పోరు తెలంగాణ ప్రచురణలు. ప్రథమ ముద్రణ, 2009.

⌘⌘⌘

BHAVAVEENA
Vol. 17, Issue. 8, August 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

ఆముక్తమాల్యద – వ్యవసాయ జీవన ప్రతిఫలనం

– గల్లా వెంకటేష్, పరిశోధక విద్యార్థి, తెలుగు అధ్యయన శాఖ, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి.

విజయనగర సామ్రాజ్యాన్నే కాక ఆనాటి తెలుగు సాహిత్యంలో సైతం తిరుగులేని ఆధిపత్యం నెరపిన మహారాజు శ్రీకృష్ణదేవరాయలు. ఈయన పాలనాకాలం ఇటు సాహిత్య రంగంలోను, అటు చారిత్రకంగాను స్వర్ణ యుగంగా కీర్తి పొందింది. క్రీ. శ. 1510లో పట్టాభిషిక్తుడైన రాయలు 1530 దాకా పాలించి, ఎన్నో యుద్ధాలలో విజయం పొంది, సువిశాల సామ్రాజ్యాన్ని స్థాపించి సమరాంగణ సార్వభౌముడైనాడు. సంగీత సాహిత్యాది విద్యలలో ఎంతో నేర్పరియై, నానా కళావేత్త, అపర భోజుడని కీర్తిని పొందాడు. తన ఆస్థానంలో అష్టదిగ్గజ కవులను పోషించి వారి కృతులను మెచ్చుకుని, కొన్నింటిని అంకితం పుచ్చుకుని, తానే స్వయంగా ప్రౌఢ కృతి కర్త అయ్యాడు. మదాలస చరిత్ర, సత్యవధూ ప్రీణనం, సకల కథాసారసంగ్రహం, జ్ఞాన చింతామణి, రసమంజరి అనే గ్రంథాలను రచించినా ఆముక్తమాల్యద ప్రబంధం ఆయనకు కవిగా, కవిరాజుగా ఎనలేని ఖ్యాతిని సంపాదించి పెట్టింది.

ప్రాచీన తెలుగు సాహిత్యంలో సామాజిక జీవన చిత్రణ లేదని ఆధునిక విమర్శకులు భావిస్తున్నారు . అంటే ప్రాచీన కాలంలో కవులకు జన జీవితంతో పరిచయం, అందులో అనుభవం లేదని కాదు. దానికి కారణం కవులు కవిత్వానికి పరమ ప్రయోజనాలుగా ఉపదేశం, రసానందం ఉండాలని నిర్దేశించుకోవడమే. వాటికి అనుగుణంగా ఇతివృత్తాలు కూడా ప్రఖ్యాతంగా ఉండాలని భావించారు. ఫలితంగా పురాణ గాథలనే కొద్ది మార్పులు, చేర్పులతో ఇతివృత్తాలుగా స్వీకరించారు. ఐనప్పటికీ కవి ఊహలు తాను గడిపిన జీవితాన్ని, చూసిన సామాజికజీవనాన్ని పూర్తిగా దాటి విహరించలేవన్నది ముమ్మాటికీ నిజం. ఈ కోణంలో పరిశీలించినప్పుడు ప్రాచీన కావ్యాల్లో కూడా అక్కడక్కడ ప్రయత్న పూర్వకంగానో, అప్రయత్నంగానో కొంత ప్రజాజీవనం ప్రతిఫలించింది. అటువంటి కావ్యాల్లో ప్రధానమైనది, సాంఘిక చరిత్రల నిర్మాణానికి కొద్దో గొప్పో దోహదపడుతున్నది రాయల ఆముక్తమాల్యద.

వ్యవసాయక జీవన ప్రతిఫలనం :

భూమిని చెమటతో తడిపి ధాన్యాన్ని ఉత్పత్తి చేసే రైతులే రాజ్యవైభవానికి మూల కారణం అని రాయలు భావించాడు. అందుకే -

"నృపుల పదహల రేఖకెల్ల మా భూ
జాగ్రహల రేఖలే మూలమనుచు కోటి
కొండలుగ ధాన్యరాశులు పండువీట"

అని లేశమాత్రమైనా గర్వం లేకుండా ప్రకటించాడు. రాజ్యశ్రేయస్సు వ్యవసాయరంగం మీద ఆధారపడి ఉండటం మూలాన అనేక చెరువులు, కాలువలు, తటాకాలు తవ్వించాడు. "కృష్ణరాయలు తుంగభద్రానదిపై ఆనకట్ట కట్టి కాలువలను, చెరువులను త్రవ్వించి వ్యవసాయమును బాగుగ అభివృద్ధిచేసెను. "(కిలాంబి రాఘవాచార్యులు) అని ఆ విషయాన్ని చరిత్ర కారులు స్పష్టం చేశారు. అతివృష్టి, అనావృష్టి కాలాలలో రైతులకు పన్నులు రద్దుచేసాడు. కరువు సమయాల్లో పన్నులు కట్టలేక పశువులను, ఇండ్లను వదిలి వలసపోయే వారిని పిలిపించి, తగిన సహాయము చేసి, పెట్టుబడులు ఇచ్చి మరల వ్యవసాయం చేయడానికి కావలసిన సదుపాయాలు కల్పించమని ఉద్యోగులను ఆదేశించాడు. వ్యవసాయ రంగం మీద రాయలకు ఎంత శ్రద్ధ ఉందో కింది పద్యం ద్వారా స్పష్టమౌతున్నది.

"దేశ వైశాల్య మార్థసిద్ధికిని మూల
మిల యొకింతైన గుంటకాల్వలు రచించి

నయము పేదకు సరిగోరునన నొసంగి
ప్రబల జేసిన నర్థ ధర్మములు పెరుగు"

అంటూ రైతుల నుండి సగం పన్నును మాత్రమే తీసుకుని వారి ఆర్థిక సౌభాగ్యాన్ని ఆకాంక్షించాడు రాయలు.

ఆనాడు ప్రధానంగా వ్యవసాయం కాలువలు, చెరువులు, బావుల ద్వారా జరిగేది. బావి నుండి నీరు పొలాలకు అందించడానికి ఏతం వేసేవారు. కష్టాన్ని మరచి పోవడానికి పాటలు పాడుకునేవారు. "విజయ నగరంలో వరి, జొన్న, అపరధాన్యములు, చిక్కుడు, ప్రత్తి, గోధుమలు సమృద్ధిగానున్నవి. చాలా చౌకగా లభించును" (సురవరం ప్రతాపరెడ్డి). ఇవే కాక పనస, అరటి, కొబ్బరి, దోస, చెరకు, తమలపాకులు వంటి అనేక రకాలైన పంటలు పండుతుండేవి.

వరి పంట :

ప్రాచీన కాలం నుండి తెలుగునాట పండే ప్రధానమైన పంట వరి. ఈ పంటను పండించడంలో రైతు చేసే పనులను రాయలు ఉపమానంగా -

"మును దన సీమ చేసికుని, ముల్లిడి గుద్దట వెండి చేని మె
త్తనకయి వేరు వెల్లకియు ద్రవ్వెడు కర్షకునట్లు ....."

అని ఉపయోగించాడు. రైతు ముందు తన పొలాన్ని స్వాధీనం చేసుకుని, తర్వాత తన హక్కులకు భంగం కలగకుండా ఇతరులు దురాక్రమణ చెయ్యకుండా ఉండటానికి కంచెవేస్తాడు. ఆ పైన పొలం దున్నడానికి అనుకూలంగా అందులో వున్న గడ్డి, ముండ్ల చెట్లను గడ్డపారతో తవ్వి కాల్చివేస్తాడని వ్యవసాయ పనుల పరంపరను తెలియచేశాడు. నాడు పొలాన్ని దున్నడానికి ఎద్దులను, దున్న పోతులను ఉపయోగించేవారు.

పొలాలను దున్నే సమయంలో రైతుల కాళ్లకు నీరుకట్టె పాములు చుట్టుకున్నాయట (ఇది విషపూరితమైన పాము కాదు). వాటి కడుపులు మెరుస్తున్న బంగారు రంగులో ఉండటం వల్ల పొలం దున్నటంలో చూపిన నేర్పుకు రైతులను ప్రభుత్వం గండపెండేరాలతో సన్మానించగా ఆ బిరుదులను ధరించి ఉన్నారేమో! అన్నట్లుగా వున్నదని రాయలు ఉత్ప్రేక్షించాడు .

"వరాజు బడి రొంపి ద్రోక్కం
జరణంబుల జుట్టు పసిడి ఛాయకడుపులం
బొరి నీరుకట్టె లమరును
బిరుదులూ హాలికులు దున్నవెట్టిరో యనన్ "

ఈ పద్యం అతని సూక్ష్మపరిశీలనా దృష్టికి తార్కాణం. ఆనాడు రైతులు పండించే వరి పంటలలో తీగ మల్లెలు, ఖర్జూరాలు, పుష్ప మంజరులు, మామిడిగుత్తులు, కుసుమములు, సంపంగెలు, పచ్చగన్నేరులు, పాళలు అని పలు రకాలు ఉండేవి. వాటిలో రాజనం అనే వరి వంగడం ప్రత్యేకమైనది.

పంట ఎన్నుకాలం నుండి కోత సమయం దాకా రైతులు పొలాలకు కావలి వుండేవారు. పక్షుల నుండి ఇతర జంతువుల నుండి పంటను కాపాడుకునేవారు. దాన్ని రాయలు "తల బక్షచ్చట..... వెసబారు వాని గని నవ్వున్ శాలి గోప్యోఘముల్" అనే పద్యంలో తెలుపుతాడు. పంటలు పండిన తరువాత కోతలు మనుషుల ద్వారానే జరిగేవి . అందుకు అనుకూలంగా చివరి దశలో పొలానికి నీరు పెట్టకుండా ఎండబెట్టేవారు. ఫలితంగా మనుషులు పొలాల్లో దిగి కోతలు కొయ్యడానికి వీలుగా ఉండేది. వరి కంకులు గుత్తులు గుత్తులుగా పండి పంట కోసే సమయానికి పొలం వాలిపోయేది. కోసిన పంటను ఒడిపి ధాన్యాన్ని తూర్పార బట్టేవారని "గుళ్ళాన శూర్పవాత ఘట్టనల బారు పెను పొల్లకట్టు వోలె" అని అనడం వల్ల తెలుస్తుంది. తర్వాత ధాన్యాన్ని ఎండబెట్టి ఇండ్లలో భద్రపరుచుకునేవారు.

పనస, అరటి తోటలు :

విజయనగర రాజుల కాలంలో రైతులు పెంచే పండ్ల తోటలలో పనస, అరటి తోటలు ప్రధానమైనవి.

"అడుగున బండి వ్రీలి యాసలై మధువుట్టగా,
ద్రవదేంట్లు మ

ల్లడిగొని చుట్టరా బానిసల న్బొలుచు న్గలుగొండ్ల తోడ ..... "

అంటూ ఆకాలంలో పండే పనస పండ్ల స్థితి వివరించ బడింది. గండ శిలలంత పెద్దవైన పనస పండ్లు పండేవట. బాగా పండిన పనస పండ్ల తోటల నుండి సుగంధభరిత మైన గాలులు వీస్తుండేవి.

"చాలా దళంబుగా .... బండి మహీమండలి జీరుచు వ్రాలి
..... గెల ల్సుగంధ కదళీ వన పంక్తుల నొప్పు నప్పురిన్ "

అని అరటి పండ్లను వర్ణించాడు రాయలు. ఆ కాలంలో అరటిపండ్ల తోటలను కూడా రైతులు విరివిగా పెంచినట్లు తెలుస్తున్నది. అరటిపండ్లు చాలా సమృద్ధిగా పండేవి. అరటి చెట్ల కొనల నుండి వాలిన అరటి గెలలు నేలకు జీరాడుతూ వుండేవి.

మామిడి, చెరకు తోటలు :

మామిడి పండ్లకు రాయలసీమ ప్రసిద్ధి. రాయల కాలం నుండి కూడా ఈ ప్రాంతంలో మామిడి తోటలు ఎక్కువగా పెంచేవారు. ఎండాకాలంలో చేపలు తిన్నవారు కమురును పోగొట్టుకోవడానికి మామిడి పండ్లను ఎంతో ఇష్టంగా తినేవారట. ఆముక్తమాల్యదలోని "..... మామిడి తోపుల వీరులన్బయి న్నడువ బొల్చు పురాతన తీర్థ కుండబుల్" అనే పద్యం నాటి మామిడి తోపుల సౌందర్యం కళ్ళకు కడుతున్నది. మామిడి పంట ఈ కాలంలో మంచి వాణిజ్య పంటగా ప్రఖ్యాతిని పొందింది

చెరకు పంట విజయనగర రాజ్యంలో సమృద్ధిగా పండేది. ఆ నాడు విజయనగరం నుండి ఎగుమతి అయ్యే వ్యవసాయ ఉత్పత్తుల్లో చెక్కర ప్రధానమైంది.

".... .... జెఱకు ముత్తియము ల్చిటిలించు తద్రసం బనిశము వండు నంతిక తలాంతిక జూర్ణము జేయునప్పురిన్"

అనటం వల్ల చెరకు ఎంత సమృద్ధిగా పండేదో స్పష్ట మౌతుంది. చెరకును రైతులు స్వయంగా గానుగలు ఆడి బెల్లం తయారు చేసేవారు. అంతేకాక బజారుల్లో చెరకు రసాన్ని తీసి అమ్మేవారు. ఎండాకాలపు సాయంత్ర సమయాల్లో ప్రజలు చెరకు రసాన్ని త్రాగటానికి ఎర్రచీమల బారుల్లాగా తండోపతండాలుగా ఇక్షురస యంత్రాల దగ్గరికి వచ్చేవారట.

కొబ్బరి, దోస తోటలు :

కొబ్బరి చెట్లను ఆకాలంలో పొలాల వద్దనే కాకుండా ఇండ్ల వద్ద కూడా పెంచుకునేవారు. ఎండాకాలంలో ఎండ వేడిమిని తట్టుకోవడానికి ఇసుకలో ఉంచిన కొబ్బరి కాయల నీళ్లను తాగేవారు. దేవాలయాలలో కూడా పూజా ర్థమై కొబ్బరి కాయలు ఉపయోగించేవారు. విజయనగర రైతులు పండించిన మరో పంట దోస. దాన్ని రాయలు తన కావ్యంలో ...

"అళిగరు దంచలామల తదంబర బింబితమయ్యె బాక ని ర్దళిత మహాఫలాఘ హరిత చ్ఛదకర్కరీ కావనాలీ నా గలమ వన భ్రమచ్ఛుక నికాయము లోపల సాంధ్యరకి మం బలతిగా దాల్చి మింట గననయ్యె వింపాడు పయోద ఖండముల్"

అని వర్ణించాడు. నేలపైన ఆకుపచ్చని దోస తోట, అందులో పసుపు పచ్చని అరముగ్గిన పండ్లు, వాటిల్లో కొన్ని బాగా పండటం వల్ల పగిలి లోపలి తెల్లని గుజ్జు కనిపిస్తున్నదట .

తమలపాకు తోటలు :

తాంబూలం సేవించడం తెలుగునాట ప్రాచీన కాలం నుండి ఒక విలాసవంతమైన అలవాటుగా భావించేవారు. భోజనానంతరం తాంబూలం సేవించడం వైభోగంగా ఉండేది.

"ఖండిత పూగీ నాగార ఖండంబుల ఘనశశాంక ఖండంబులచే
హిండితమగు తాంబూలంబులు ..... "

అని తెల్పడంవల్ల వక్కలు, సొంటి, పచ్చకర్పూరములు, కలఖండ వంటి పదార్థాలు కూడా కలిపి తాంబూలం వేసుకునేవారని తెలుస్తున్నది. ఆనాటి ప్రజలు దీన్ని యవ్వనోద్రేకిగా కూడా భావించేవారు. అందుకోసం రైతులు తమలపాకులను కూడా విరివిగా పండించేవారు. దాన్ని రాయలు ...

"మన కనురక్తి హెచ్చనిదే మంది కంతము కొగిలించి ని
క్కిన ఫణిరాజవల్లి...."

అని తెలిపాడు. తమలపాకుల తీగెలతో పాటు వాటిని అల్లించడానికి పోక చెట్లను కూడా రైతులు పెంచేవారు. ఈ తమలపాకుల తీగెలను పాలాల గట్ల మీద, ప్రత్యేకంగా చేలల్లోనూ పెంచేవారు. తెలుగు సాహిత్యానికి వ్యవసాయ జీవనాన్ని తొలి సారిగా పరిచయం చేసిన కావ్యం ఆముక్తమాల్యద. శ్రీకృష్ణ దేవరాయలు రైతుల సంక్షేమార్థం దళారీ వ్యవస్థను నిర్మూలించి తమ పంటను తామే అమ్ముకునే అవకాశం కల్పించాడు. తానే స్వయంగా రాత్రుల్లో మారువేషంలో రాజ్యంలో తిరిగి రాజ్య పరిస్థితులను కళ్ళారా చూశాడు. దీని ద్వారా రాయలకు వ్యవసాయం పట్ల వున్న భావాలూ, శ్రద్ధ, సూక్ష్మ పరిశీలన, సేవాదృక్పథం వ్యక్తమౌతున్నది.

ఆధార గ్రంథాలు :

1. శ్రీకృష్ణదేవరాయలు, తుళువ. ఆముక్తమాల్యద, హైదరాబాదు : తెలుగు విశ్వవిద్యాలయం, 1995.
2. చంద్రశేఖరరెడ్డి, దుగ్గెపూడి (సం). శ్రీకృష్ణదేవరాయ వైభవం, హైదరాబాదు : తెలుగు సమితి, 2012.
3. ప్రతాప రెడ్డి, సురవరం. ఆంధ్రుల సాంఘిక చరిత్ర, హైదరాబాదు : విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, 2012.
4. రాఘవాచార్యులు, కిళాంబి. శ్రీ కృష్ణదేవరాయలు, హైదరాబాదు : ....., 1960.
5. కాత్యాయనీ విద్మహే (సం). తెలుగు సాహిత్య చరిత్ర, హైదరాబాదు : డా. బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం, 2011.

⌘⌘⌘

BHAVAVEENA
Vol. 17, Issue. 8, August 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

మధ్య యుగ ధిక్కార స్వరాలు : శివ కవులు

- నందిగాము నిర్మల కుమారి, అసిస్టెంట్ ప్రొఫెసర్ అఫ్ తెలుగు, ప్రభుత్వ డిగ్రీ & పీజి కళాశాల, సిద్ధిపేట.

ఆధునిక ఇతిహాసం ఉపరితల రాజకీయ నిర్మాణాలు మారిన ప్రతి సంధి దశలోనూ అనేక కుదుపులకు లోనయ్యింది. షోడశ జనపదాల మొదలు మధ్యయుగ రాజ్యాల దాకా పాళీ, ప్రాకృత, సంస్కృత భాషల్లో సార స్వతం విరాజిల్లినది. పన్నెండో శతాబ్దం నాటికి విశాల తెలుగురాజ్య ఆవిర్భావంతో బాటు స్వతంత్ర సాహిత్య సారస్వత రచన కూడా సమాంతరంగా కొనసాగింది. స్వీయ పాలనలోకి మారిన కాకతీయ సామ్రాజ్యం తెలుగు భాష, సంస్కృతి అభ్యున్నతికి ఎంతో కృషి చేసారు. వీరి కాలంలో పాళీ, ప్రాకృత భాషలతో బాటు తెలుగు లిపి, భాషా, సాహిత్య వికాసం సమాంతరంగా బయలుదేరింది. అప్పటి వరకూ జైన మతాన్ని అనుసరించిన కాకతీయులు వీరశైవ ప్రభావంతో అనేక దేవాలయ, శైవ ఆరామాల నిర్మాణం కూడా చేసి వీరశైవ ధార్మిక భావజాల వ్యాప్తికి ఇతోదికంగా తోడ్పడ్డాయి. శైవ ఆరామాల నిర్మాణం ఒక వైపు, శైవ మత వ్యాప్తిలో భాగంగా సాహిత్య వ్యాప్తి కూడా జరిగింది. మధ్యయుగాలలో ఈ సాహిత్య పరంపరను కొనసాగించిన దశను శివయుగం అంటారు. నన్నయ్య తిక్కన అనంతరం అవహించిన సంధి కాలానికి ఊత మిచ్చిన దశ ఇది.అనువాద యుగం అనంతరం పురుడు పోసుకున్న మధ్యయుగ సాహిత్య పరంపర ఈ సంధి యుగ అనంతరం తెరమీదకు వచ్చిన శివకవిత్రయం నన్నెచోడుడు, పాల్కురికి సోమనాథుడు, మల్లికార్జున పండితారాధ్యుడు వీరే కాకుండా శ్రీపతి పండితుడు, శివలెంక మంచన, యధావాక్కుల అన్నమయ్య. వీరి ప్రధాన లక్ష్యం ఆనాటి వీరశైవ ధార్మిక ఆలోచనలను పెంపొందించడం మాత్రమే కాకుండా దేశీ రూపకాలకు పెద్దపీట వేయడం, స్వచ్ఛమైన శైలీ విన్యాసాన్ని అనుస రించారు.

తెలుగు సాహిత్యంలో మధ్యయుగాలలో ముఖ్యంగా కాకతీయుల కాలాన్ని వికాస దశ లేదా సాహిత్య సాంస్కృతిక పునర జ్జీవన దశ అనికూడా అనుకోవచ్చు. అప్పటి వరకూ అన్యభాషల నుండి అనువాద పరంపరకు అలవాటు పడిన మధ్యయుగ తెలుగు సమాజ తొలి స్వతంత్ర కావ్య రచనకు పునాది దశ అనుకోవచ్చు. ఆ పునాది దశ క్రమానికి మూల పురుషులు శివకవులు. భాష, కావ్య ప్రక్రియ, కావ్యఅంశాలలో నూతన అభివ్యక్తిని, ప్రత్యామ్నాయ రచనా ఒరవడిని ప్రోది చేసుకున్న మధ్య యుగ శివకవులు నాటి సాహిత్య క్రమాన్ని సుసంపన్నం చేసారు. ఈ అన్వేషణ క్రమం లోనే మధ్య యుగ ధిక్కార స్వరాలు శివ కవులు అనే ఈ చిరు ప్రయత్నం.

వర్ణాశ్రమధర్మం, అమానవీయమైన చాతుర్వర్ణ విభజన, సనాతనధర్మాన్ని బలవంతంగా ప్రజల మీద రుద్దుతూ వైదిక క్రతువుల పేరుతో సాగుతున్న ఆచారాల మీద తిరుగుబాటుగా మొదలైనదే వీరశైవం. కర్నాటక కేంద్రంగా రాజరాజ నరేంద్రుని అనంతర పాలన కాలంలో కర్నాటకలో, ఆంధ్రలో కాకతీయుల కాలం లో ప్రజల ఆలోచనలోకి వీరశైవ ధార్మిక భావన భాగం అయ్యింది. బౌద్ధ, జైనములాగానే అద్వైత ఆలోచన వ్యతిరేకమైనదిగా అవైదికములుగా ముద్రవేయబడిన వీరశైవం ఎంత బలంగా ముందు కు వచ్చిందో అంతే బలమైన తాత్విక ధారనూ తన వెంట తీసుకొని వచ్చింది. అతాత్విక ధారను ముందుకు తీసుకొని వెళ్ళిన శివత్రయం నన్నెచోడుడు, పాల్కురికి సోమనాథుడు, మల్లికార్జున పండితారాధ్యుడు.

పురాణ యుగం అయ్యాక క్రీ.శ. ఆరు, ఏడు శతాబ్దాల మధ్య దక్షిణ భారత దేశ కేంద్రంగా బయలుదేరిన భక్తి సాహిత్యం ఈ దేశ విలక్షణమైన ప్రక్రియగా ముందుకు వచ్చింది. ప్రపంచవ్యాప్తంగా మత ఆధారిత సంస్కరణ

ఉద్యమాలు మిగతా ప్రాంతాలతో పోలిస్తే భారతదేశం లోనే ఎక్కువ. జైన, బౌద్ధ, లోకాయత, చార్వాక, శైవ, వైష్ణవ, వీరశైవ ఆలోచనలు ఆయా మతాల ధార్మిక పాయల వ్యాప్తి కోసం వాటిని మరింత సమర్థవంతంగా ప్రజలమధ్య నిలవడం కోసం వివిధ సాహిత్య ప్రక్రియ లను ముందుకు తీసుకొని వచ్చారు. ఆ ప్రక్రియను అత్యంత ప్రభావవంతంగా ముందుకు తీసుకొని వచ్చిన వాళ్ళు శివ కవులు. ఆ క్రమంలో శివకవులు అనుసరించిన కావ్య ఎత్తుగడలు, దేశీ సాంప్రదాయానికి పెద్దపీట వేసారు. అప్పటిదాకా కావ్య భాషగా ఉన్న గ్రాంధిక భాష స్థానే ద్విపద, అష్టకాలు లాంటి సున్నితమైన ఛందస్సును అనుసరించారు. "సాహిత్య చరిత్ర లో అయినా విజ్ఞాన శాస్త్రంలో అయినా పురోగమనం ఒకే విధంగా ఉండదు. చరిత్రలో మొదటి యుగాన్ని తర్వాత యుగం అప్రధానం చేస్తుంది. సాహిత్య చరిత్ర లో ఒక యుగాన్ని మరొక యుగం అధిగమిస్తుంది" అని ప్రఖ్యాత సాహిత్య చరిత్ర కారుడు త్రిపురనేని మధుసూధనరావు తన 'సాహిత్యంలో వస్తుశిల్పాలు' అనే గ్రంధం లో మధ్యయుగాలలో జరిగిన కావ్య ఉనికి, అస్థిత్వం,రాజకీయాలను ఒక క్రమభద్దంగా అధ్యయనం చేసాడు.

"పూర్వకాలంలో కావ్యానికి కావ్యపరంపరకూ పరిమిత మైన ఒక వర్గంఉంది. పండిత,పామర విభజన తోబాటు వేదం, పురాణ, ప్రబంధ కావ్యాలకు ఒక స్పష్టమైన శిష్ట వర్గం ఉంది. కానీ ఈ వర్గానికి బయట ఉన్న సాధారణ ప్రజలకు వేద, సాహిత్యం,పురాణ ప్రవచన పరంపర అంద నంత దూరంలో ఉంది. నాటి శివకవులు దేశీ భాషలలో అందునా సులభంగా అర్థం అయ్యే ద్విపద లాంటి ప్రక్రియల రూపంలో రచనలు చేయడం మూలంగా అంతకు ముందు ఉన్న సాహిత్యంలో ఉన్న యుగ లక్షణాన్ని శివకవులు అధిగమించారు అనుకోవచ్చు. దానికోసం వాళ్ళు ప్రజా భాషను వాహికగా చేసుకున్నారు. దానితో బాటు అప్పటివరకూ చలామణిలో ఉన్న కావ్య భాషకు రచనా ప్రక్రియకూ భిన్నమైన ద్విపదను అన్వ యించుకున్నారు. రాజభాషకీ ప్రజల భాషకూ మధ్య రూపంలో సారంలో అంతులేని అఘాతం ఉండేది. మధ్యయుగాల కాలం నాటి సాహిత్య లక్ష్యం ఆ నాటి సమాజంలో వేళ్ళూనుకొని పోయిన ధార్మిక పాయలను ప్రజా జీవనంలో వివిధ రూపాలలో కావ్యాల ద్వారా సుస్థిరం చేయడం మాత్రమే.. అయితే ఇంతకు ముందు ఉన్న యుగంలో ఈ రచనా ప్రక్రియలు మొత్తం సంస్కృత, పాళీ, ప్రాకృత భాషలలో ఉన్నా ఆ నాటి లాక్షణికుల అనుసార కావ్య పరిమితులను నాటి కావ్యకర్తలు ఏనాడూ అధిగమించలేదు. నాటి సంస్కృత భాష వాస్తవానికి రాజభాష మరియు పండిత భాష. అది ప్రజా బాహుళ్యం లోకి రావడానికి చానా కాలమే పట్టింది. ఈ ప్రక్రియలు వందల ఏళ్ళుగా స్థిరపడి కొన్ని నిర్దిష్టమైన లక్ష్యాలకు అను గుణంగా చలామణి అయ్యాయి. అటు వంటి సంధిదశను తమ శైవ, వీరశైవ ప్రబంధకావ్యాల రచనలతో సంపదత్వం చేసారు"(మధ్య యుగాలలో రసవాదం దిక్కార స్వరం: శివకవులు నందిగామ నిర్మల కుమారి జాతీయ సదస్సు పత్రం)"

కర్నాటక కేంద్రంగా బయలుదేరిన వీరశైవ వ్యాప్తి కాకతీయుల కాలంలో వారి ఆదరణతో పాలకుల అధికార ధార్మిక ఆలోచనగా విలసిల్లినది. కాకతీయులు స్వతహాగా జైనమత అనునాయులు వీరశైవ ధార్మిక ఆలోచనలను తమ కాలంలో వ్యాప్తి చేయడంకోసం అనేక ఆరామాలు, శివాలయాలు, కులపీఠాల నిర్మాణాలను ప్రోత్సహించారు. వీరశైవవ్యాప్తిలో భాగంగా ఆ మతాన్ని అంతకాలం అంట రానివారిగా ఈ సడించుకున్న వాళ్ళ అయిన కింది కులా లకు దేవాలయాల నిర్మాణాలతో బాటు కింది కులాల నుండి అర్చక పరంపరను కూడా అవలంభించారు.

అనువాద పరంపరగా సాగిన మధ్యయుగ సాహిత్యం పాల్కురికి సోమనాథునితో తొలి స్వతంత్ర కావ్య రచనతో ముందుకు వచ్చాడు. కవిత్రయం చేసిన సంస్కృత అనువాదాల స్థానే, కావ్య భాషస్థానే, ద్విపదను పురాణ రచనకు పునాది వేసిన వాళ్ళు శివకవులు. అప్పటి వరకూ

సంస్కృత భాషా ఆధిపత్యానికి సవాలుగా తెలుగులో అందునా సాధారణ ప్రజలు అర్థం చేసుకునే ద్విపద లాంటి ప్రక్రియలో రచన చేసిన శివకవులు మధ్యయుగ సాహిత్యాన్ని శాసించారు. అలా వాళ్ళు వేసిన తెలుగు భాష పునాది చాలా పటిష్టంగా నిలబడ్డది. తొలిసారి సంస్కృత భాష ఆధిపత్యాన్ని ప్రశ్నించిన వాళ్ళు శివకవులు. దానికి కారణం ఇతిహాస సృష్టి కర్తలు, భాషా లాక్షణికులు కావ్య భాషకు అనేక ప్రమాణాలు సృష్టించారు. అది కావ్య రచనకు, పురాణ రచనకూ ఇతర అనేక సాహిత్య ప్రక్రియ లకు ఆనమూనాను అనివార్యం చేసారు.

ప్రఖ్యాత చరిత్ర కారుడు మానవల్లి రామకృష్ణ కవి చేసిన అమూల్యమైన పరిశోధన ఫలితంగా సాహిత్య చరిత్ర రచనలో విమర్శలో అనేక పార్శ్వాలు బయటకు వచ్చినవి. ఆ క్రమంలో తంజావూరు సరస్వతి మహల్‌లో దుమ్ము ధూళిలో కొట్టుకుని పోయిన అనేక ప్రాచీన తాళపత్ర గ్రంధాలు వెలుగులోకి తీసుకొని వచ్చాడు. ఆ క్రమంలోనే నన్నెచోడుడు రాసిన 'కుమారసంభవం' కావ్యాన్ని పరిష్కరించి ఆయన రాసిన విపులపీటిక తెలుగు సాహిత్య పరంపరలో సంచలనం అనుకోవచ్చు, ఆనాడు కవుల జీవితం, సాహిత్యం, కాలాన్ని అంచనా వేయడానికి సాధారణంగా భాషప్రాచీనత, శాసన ప్రమా ణాన్ని, అలంకార విశేషము, పూర్వశబ్దములు, అర్థము లను అనుసరించి అంచనా వేసేవారు. ఆ క్రమంలోనే శివకవుల కాల నిర్ణయంమీద అనేక సూత్రీకరణలు వాదాలు బయటకు వచ్చాయి. ఆదికవి నన్నయ్య కాల నిర్ణయంలో ఉన్న అసంబద్ధాన్ని ప్రశ్నిస్తూ మహాపండితుడు అయిన మానవల్లి రామకృష్ణ కవి ఒక దశలో నన్నెచోడుడు నన్నయ్య కన్నా ముందు వాడు' అని చేసిన సూత్రీకరణ (ఆధునిక సాహిత్య చరిత్ర పింగళి లక్ష్మీకాంతం పేజి 79) పలు వాద వివాదాలకు కారణం అయ్యింది. అనేక అసంబద్ధ వాదనలను పూర్వపక్షం చేసిన సందర్భం అది. ప్రాచీన శాసన భాషను తాళపత్ర గ్రంధాలను పరిష్క రించిన ఆ కాలపు పరిశోధకులు నిష్పక్షపాత్రంగా చేసిన పరిశోధన అరుదైనది మరియు అమూల్యమైనది.

మధ్యయుగ ధిక్కార స్వరాలుగా మొదలైన శివకవుల పరంపర మొదలైన క్రమంలో తెలుగుభాషకు తన దైన లిపికానీ, స్వతంత్ర కావ్య రచన కానీ లేదు అనుకోవచ్చు అప్పటి వరకు కొద్దిపాటి శాసనాల లోనే పరిమితం అయిన తెలుగుభాష ఈకాలంలోనే పునరుజ్జీవం పొందింది అనుకోవచ్చు. అప్పటిదాకా తెలుగు పదాలు కన్నడ లిపిలోనే ఉండేవి. కన్నడ లిపి లోనే రాయబడిన ఆ నాటి కావ్యాల స్థానే తొలి తెలుగు స్వతంత్ర ద్విపద కావ్య రచనకు ఆద్యులు శివకవులు.

శివకవుల ప్రస్తానం మొదలయ్యేనాటికి తెలుగు ప్రాంతాన ఒక రకంగా అస్థిరమైనపాలననేఉండేది. ఒక నాటి మహా సామ్రాజ్యాలు అంతరించాక ఏర్పడుతున్న ప్రాంతీయ రాజ్యాలలో అతి పెద్ద రాజ్యంగా కాకతీయులు అవతరించారు. ఒక రకంగా తెలుగు ప్రజలందరినీ ఒకే ఛత్రం కిందికితెచ్చి భాష సాంస్కృతిక ఏకీకరణ చేసిన గొప్ప పాలకులు కాకతీయులు. ఒక నాటి జనపదాలు వాటి తర్వాత ఆవిర్భవించిన మహాసామ్రాజ్యాలు పాక్షికంగా ధ్వంసం అయ్యాక ప్రాంతీయ రాజ్యాల ఆవిర్భావంతో పాటు తెలుగు లాంటి ప్రాంతీయ భాష కూడా తన లిపి, భాషా, సాహిత్య వికాసం ఏకకాలంలో మొదలు పెట్టినది. ఆ క్రమానికి శివకవులు బలమైన సాహిత్య పునాదిని ఏర్పాటు చేసారు. మహా కావ్యాలను ప్రాంతీయ భాషల్లోకి అనువాదం చేయడం తోబాటు ఆ మహా కావ్యాలకు దేశీయ ప్రక్షిప్తాలు కూడా అదేకాలంలో మొదలు అయ్యాయి. ఈ సంధి దశలో శివకవులు వీర శైవ సాహిత్యాన్ని ధార్మిక పరంపరను ముందుకు తీసుకొని వచ్చారు.

దశాబ్దాల వెనక బాటు తనంలో భాష, యాస, సంస్కృతి పేరుతో అవమానాలకు గురి అయిన తెలంగాణ ఒక వైపు ఉద్యమ నిర్మాణం చేస్తూనే, మరో వైపు విస్మృత తెలంగాణ సాహిత్య మణిదీపాలను, సాహిత్యాన్ని వెలికితీసి పునర్నిర్మాణం చేసే పనిని సమర్థవంతంగా కొందరు చరిత్ర కారులు చేసారు. తొలి తెలుగు కథానిక

అని ప్రచారం లో ఉన్న 'దిద్దుబాటు' కథానిక చర్చను పూర్వపక్షం చేసి బండారు అచ్చమాంబ 'ధనత్రయోదశి', పాల్కురికి సోమనాథుని 'బసవపురాణ' రచనను తొలి తెలుగు స్వతంత్ర కావ్యంగా ముందుకు తీసుకొనివచ్చి ఆధారాలతో సహా నిరూపించిన క్రమం మన కళ్ళముందే ఉంది. ఆఉద్యమ స్ఫూర్తినే అనేక మంది కథ, నవలా రచయితలను వెలుగులోకి తీసుకొని వచ్చేలా చేసింది. పాల్కురికి సోమనాథుడు రాసిన 'బసవపురాణం' తొలి తెలుగు స్వతంత్ర కావ్యం అనే అభిప్రాయం ప్రత్యేక తెలంగాణ ఉద్యమ కాలంలో తెలంగాణ సాహిత్య నిర్మాణంలో భాగంగా మొదలైన పరంపరలో నన్నయ్య కేవలం అనువాదకవి మాత్రమేనని తొలి తెలుగు స్వతంత్ర ద్విపద కావ్యాలను 'బసవపురాణం' లాంటి ప్రబంధ పురాణ కావ్యాన్ని రాసిన పాల్కురికి సోమనాథుడు ఆదికవి అనే ప్రత్యామ్నాయ ఆలోచనలూ ముందుకు వచ్చాయి (మరిన్ని వివరాలకు తొలి తెలుగు ఆదికవి పాల్కురికి సోమనాథుడు జాతీయ సదస్సు పత్రాలు జోగిపేట కళాశాల). బసవపురాణం రెండు విప్లవాత్మకమైన ఆలోచనలను ముందుకు తెచ్చింది. ఒకటి సంస్కృతంలో కాకుండా, అనువాదం కాకుండా తెలుగులో స్వతంత్ర ఆదిపురాణ రచనగా మిగిలింది. రెండు అప్పటివరకూ పౌరాణిక లాక్షణికులు అనుసరించిన భాషా చట్రాన్ని ధిక్కరించి అచ్చ తెలుగులో అందునా ద్విపద లాంటి నవీన ప్రక్రియలో పురాణం రాసిన ఘనత పాల్కురికి సోమన దే అని అనుకోవచ్చు.

శివకవులు ఒక రకంగా సాహిత్య లోకంలో మిలిటెంట్ లాగా వీరశైవ సాహిత్యాన్ని సృష్టించారు. ఆ నాడు అన్ని ప్రక్రియల లోనూ శివకవులు ప్రయోగాలు చేసారు. ఉదాహరణ ప్రక్రియ, పంచకాలు, అష్టకాలు, స్థవాలు, గద్యకావ్యాలు, భాష్యాలు, పురాణాలు, పద్యకావ్యాలు, యక్షగానాలు, రగడలు, సీసపద్యాలు, శతకాలు అనేక సాహిత్య ప్రక్రియల్లో తమ సాహిత్య పరంపరను కొన సాగించారు. "శ్రీ రామకృష్ణకవి అపూర్వ ఛందో వ్యాకరణాది ప్రయోగ విశేషములు కొన్ని నన్నయ్య తరవాత కవులలో కానవచ్చుచున్నవనియు అందును ముఖ్యముగా పాల్కురికి సోమనాథుని రచనలలో విస్తారముగా ఉన్న వనియు ఆప్రయోగ విశిష్టతయే నన్నెచోడుని ప్రాచీనతకు నిదర్శనమగునేని సోమనాథ ప్రభృతులు కూడా నన్నయ్య కంటే ప్రాచీనులని చెప్పవలసి వచ్చుననియు రెండవ పక్షమువారు ఆ నిదర్శమును త్రోసిపుచ్చిరి (ఆంధ్ర సాహిత్య చరిత్ర పింగళి లక్ష్మీకాంతం 1974) శివకవులు ప్రాచీన కవుల వారసత్వ పరంపరను మాత్రమే కాదు దానిమూలంగా అనేక విమర్శలూ ఎదుర్కొన్నారు. 'బసవ పురాణం'అనే కావ్యంలో పురాణానికి ఉండాల్సిన పంచ లక్షణాలు లేవు అని లాక్షణికులు అభిప్రాయపడ్డారు. కానీ 'బసవపురాణం' మీద పని చేసిన బండారు తమ్మయ్య, మొదలు చిలుకూరి నారాయణరావు, వేటూరి ప్రభాకర శాస్త్రి, గడియారం రామకృష్ణశర్మ, ఆచార్య జీ.వి సుబ్రహ్మణ్యం దాక ఇటీవల పరిశోధకులు శివకవుల ధీరోద్ధత్తమ సాహిత్య తిరుగుబాటు స్వభావాన్ని ఎత్తి చూపారు. మధ్యయుగ సాహిత్యాన్ని శాసించిన శివకవులు భాషా విన్యాసంలో భావ ప్రకటన లోనూ, రచనా వైవిధ్యం తోనూ, ధిక్కార స్వరమే. ఆ స్వరాల భావ స్రవంతిని మరింత లోతుగా అధ్యయనం చేయాల్సిన అవసరం ఈ నాటి కవులు, మేధావులు, చరిత్ర కారుల మీద ఎంతైనా ఉంది.

ఉపయుక్త గ్రంథ సూచీ :

1. ఆరుద్ర : సమగ్రాంధ్ర సాహిత్యం మొదటి సంపుటి, తెలుగు అకాడమి 2002. హైదరాబాదు
2. పింగళి లక్ష్మీకాంతం ఆంధ్ర సాహిత్య చరిత్ర ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి, 1974, హైదరాబాదు.

3. చిలుకూరి నారాయణ రావు పండితారాధ్య చరిత్ర పాల్కురికి సోమనాథుడు తెలుగు విశ్వవిద్యాలయం, 1990, హైదరాబాదు.
4. డా.ఎస్ బేబీ రమణి : సాహిత్యం నవరసాలు, జాతీయ సదస్సు పత్రాలు, భావవీణ ప్రచురణలు, 2019, హైదరాబాదు.
5. నిర్మల కుమారి : మధ్య యుగాలలో రసవాదం దిక్కార స్వరం : శివకవులు భావవీణ ప్రచురణలు. 2019, హైదరాబాదు.
6. త్రిపురనేని మధుసూదనరావు: సాహిత్యంలో వస్తు శిల్పాలు : పర్స్పెక్టివ్స్ ప్రచురణలు. 1997, హైదరాబాదు.

⌘⌘⌘

BHAVAVEENA
Vol. 17, Issue. 8, August 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

నువ్వు లేవు నీ కథ ఉంది

- సుంకర గోపాలయ్య, తెలుగు శాఖాధ్యక్షులు, పీఠికాపురాదిస ప్రభుత్వ కళాశాల, కాకినాడ.

అవును, ఆయన ఎప్పుడో వెళ్ళాడు. నా కవిత్వం అంద మైన ఆడపిల్ల అన్నాడు. కొత్త ఊహలతో కవిత్వాన్ని కట్టు కున్నాడు. అమృతం కురిపించుకున్నవాడు. కానీ కథల్లో మాత్రం ఆకాశం వైపు చూడలేదు. అద్భుతాలు కలగన లేదు. నేల మీదే ఉండి, మధ్య తరగతి గతిని రాశాడు. వాస్తవాలను కురిపించాడు. ఊరి చివర ఇల్లు, నల్లజర్ల రోడ్డు, ఆశాకిరణం, దేవున్ని చూసినవాడు, పరివర్తన లాంటి కథలు మైలురాళ్లు. ప్రపంచ సాహిత్యంలో మాత్రం తీసి పోనివి. తిలక్ తన సాహిత్య హితాన్ని, కోరుకున్న మార్పుని కథలో పెట్టాడు. కవిత్వం ఆయన సౌందర్య హృదయం. కథ అసౌందర్య చిత్రణ ఇక్కడే ఆయన ఆశించిన లక్ష్యాలు కనబడతాయి. ఈ కథలు సాక్ష్యాలు గొప్ప ఋజువులు.

కథ అంటూనే మనకు ఓ సాధారణ అభిప్రాయం చివరిలో చెడు, మంచి ఐపోవాలి. ఓ నీతి ఉండాలి. ఈ మూసలో లక్షల కథలుంటాయ్. ఎన్ని గుర్తున్నాయ్. ఎన్ని వెంటబడుతున్నాయ్ ఎన్ని తిరుగుతున్నాయ్ అంటే జవాబు లేని ప్రశ్న.

మనం చదవడం మానేసాం కాని, నిర్లక్ష్యం చేశాం గాని వారానికి ఒక కథ బలవంతంగా చదివిన ఓ సంవ త్సరం యాభై రెండు మీ గుండెల్లో ఉంటాయ్. గమ్మున కూర్చోవ్. అవి కెలుకుతాయ్. నువ్వు వాటిని చెట్టు పండ్లను రాల్చుకున్నట్టు రాలుస్తావ్. కొందరు ఏరుకుంటారు. పంపకం మొదలౌతుంది. ఊర్లు ఊర్లు దాటుతాయ్. రైళ్లలో ప్రయాణిస్తాయ్.

కథా శిల్పం రాసిన వల్లంపాటి తిలక్ కథల్ని గురించి ఎక్కడా ప్రస్తావించలేదు. ఓ చోట మాత్రం తిలక్ 'దేవుడ్ని చూసిన మనిషి' కథ పేరును ప్రస్తావించాడు. అమృతం కురిసిన రాత్రి మాయలో ఆయన కథలు విస్మరింప బడ్డాయి. తిలక్ రాసిన పరివర్తన కథకు, ఇటీవల వచ్చిన నిను కోరి సినిమా కథకు కొన్ని పోలికలు ఉన్నాయ్. ఇప్పుడు ఓ కథను చూద్దాం.

"ఆ పెద్ద పెంకుటిల్లు వర్షంలో మరీ ఒంటరిగా, నిస్స హాయంగా ఉన్నట్లుంది". ఇదిగో ఆ ఇంట్లోనే ఈ కథ మొదలు అవుతుంది. వర్షం హోరుగా కురుస్తూనే ఉంది. ఇంటి చుట్టూ నీళ్లు. ఆ ఇంటిలో ఓ యువతి ఉంది. వయస్సులో ఉంది. గొప్ప అందంతో ఉంది. ఓ ముసలిది ఉంది. తెల్లని పురుగుల్లాగా కదిలే కళ్ళున్న ముసలిది. కేవలం బతకడం మాత్రమే తెలిసిన ముసలిది. వికృతమైన ముఖం ఉన్న ముసలిది.

తిలక్ కథ గొప్పతనం కథలో ఉన్న వాతావరణం తోనే తెలిసిపోతుంది. ఈ కథలో వర్షం లేకుంటే, చీకటి లేకుంటే పేలవంగా ఉండేది. ఈ కథ మంచి ఎండల్లో ఐతే కుదరదు. తొలకరి వాన ఐనా కుదరదు. ముసలి దాని పాత్రను పరిచయం చేయడంలోనే ఆయన, ఆ పాత్ర స్వభావం చెప్పేవాడు.

ఆ వర్షాన్ని చూస్తూ మండువాలో ముక్కాలి పీట మీద కూర్చుని ఆ యువతి దిగులుగా ఉంది. వయస్సు ఇరవై మూడు. తెల్లని చీరకట్టు. ఆమె చూపులు విరక్తంగా ఉన్నాయి. ముసల్ది రమను లోపలికి రమ్మని పిలుస్తూ ఉంది. రమను ఆడిపోసుకుంటు ఉంది. మూడు నెలల పసివాడి కోసం నువ్వు సచ్చిపోతావా, ఇదిగో పిల్ల అసలు ఈ ఇంట్లో పుట్టిన ఏ బిడ్డా బ్రతకలేదు. వేలెడు అంత వెధవ కోసం బెంగ వద్దు. లోపలికిరా నీ ఆరోగ్యం పాడు చేసుకోకు. నీకు ఏది ఐనా ఐతే నా బతుకు ఏంటి అంటూ ముసల్ది "మాటల్ని చేపల్లాగా కత్తి పీట మీద తరిగినట్టు మాట్లాడుతూ ఉంది. రమ ముసలి దాన్ని తిరగి తిడుతూ ఉంది.

ఈ వయస్సులో నాలుగు రాళ్లు వెనుక వేసుకోకుంటే, ఇక అంతే పిల్ల, నువ్వు వచ్చిన ప్రతీ వాణి&ణ వెల్ల గొడుతున్నావ్. నీకు రాజ కుమారులు కావాలంటే ఎలా, అప్పుడు నేను నిన్ను ఆదుకోకపోతే నీ గతి ఏంటి? ఆ మూడు నెలల ముంగి వెధవ పోయాడు. పీడ వదిలింది. ఇక నువ్వు తేరుకోవాలి. సంపాదించాలి ఇలా ముసలిది దయా దాక్షిణ్యాలు లేకుండా అరుస్తోంది.

రమ "కొండ చిలువ లాగా మెలికలు తిరిగి చీకట్లో కలిసిపోయిన రోడ్డు వైపు చూస్తూ ఉంటుంది. "ఎవరో ఒక వ్యక్తి చేత్తో గొడుగు, మరో చేత్తో సూట్‌కేసు పట్టుకుని రోడ్డు మీద వెళ్లడం చూస్తుంది. అతన్ని పిలుస్తుంది.ఈ సమయంలో ప్రయాణం కుదరదు అని చెబుతుంది. ఉదయం రైలుకి వెళ్లవచ్చు అని చెబుతుంది. దీప కాంతిలో అతని ముఖాన్ని చూసి రమ ఉలిక్కి పడుతుంది.

ఈ ఉలిక్కి పడటం ఎందుకు? ఇక్కడ మనకు కథకుడు కథలో ఏదో రహస్యం ఉన్నట్టు తెలియచేస్తున్నాడు. అతను నా పేరు జగన్నాథం. బహుశా మీరు అనుకునే వ్యక్తి నేను కాదేమో, వెళ్తాను అంటాడు. అతనికి భోజనం పెట్టి, పక్క ఏర్పాటు చేస్తుంది. ముసల్ది లోపల సంతోష పడుతుంటుంది. పిల్ల మాములు ఐపోయింది అనుకుంటుంది. అతను నిద్రపోతాడు. రమ ఆ గదిలోనే తిరుగుతూ, లాంతరు పెట్టి అతని ముఖం లోకి పరీక్షగా చూస్తుంది. అతను గమనిస్తాడు.

ఆమె వైపు అతను నిమిష నిమిషానికి దగ్గర కావడం మొదలౌతుంది. ఆమె కళ&ళల్లో ఏదో కథ ఉంది జాలి, దయతో కూడిన కథ. ఇక అప్పుడు ఇద్దరి కథలు చెప్పుకుంటారు. నువ్వు నా విజయుడివి అంటుంది.

ముఖంమీద మచ్చ ఆధారం అంటుంది. ఉల్కి పాటుకి ఇది కారణం. విజయుణ్ణి కాదు నా పేరు జగన్నాథం అంటాడు. ఒకరి కొకరు గత జీవితాన్ని లాంతరు కాంతిలో దృశ్యమానం చేసుకుంటుంది.

ఆ వ్యక్తి రమ నువ్వు నాకు కావాలి అంటాడు. జీవితాంతం కలసి ఉందాం అంటాడు. పెళ్లి పక్కా అంటాడు. రమ అతని గుండెలపై చేయి వేసి హాయిగా నిద్రలోకి జారుకుంటుంది. ఈ మాటలన్నీ ముసల్ది చాటుగా వింటుంది. ఈ పిల్ల వెళ్తే నా గతి ఏంటి అని దిగులు పడుతుంది. ఐతే ఈ సంగతి మనకు రచయిత చెప్పడు. అతగాడ్ని ముసల్ది పిల్చి ఇది అబద్దం అంటుంది. ఇదే కథ ఎంతోమందికి చెప్పింది. అది డబ్బు కోసం ఆడే నాటకం అని, అతని మనస్సును చిటికెలో విరిచిపారేస్తుంది. అతనికి రమను చంపేయాలన్న కోపం వస్తుంది అంతే తన పర్సు విసిరి, మంచం మీద కొట్టి, చీకట్లోనే బయిలుదేరుతాడు.

ముసల్ది వికృతమైన నవ్వు నవ్వుతుంది. రమ లేచి చూస్తే అతను లేడు. ముసల్ది ఏమి చెప్పిందో రమకు చెబుతుంది. రమకు తీవ్రమైన, దుఃఖం, కోపం, ముసలిదానిపై పీట విసిరి స్టేషన్‌కు బయలుదేరుతుంది. ఒక్కటే పరుగు. చేతిలో పర్సు. జీవితంలో ఎలాంటి మగాడి కోసం ఎదురు చూసిందో అతను వెళ్ళిపోయాడు. కాదు వెళ్లగొట్టింది. ఇప్పటి వరకు ఆమె శరీరాన్ని మాత్రమే అప్పగించింది. ఇప్పుడు మనస్సు కూడా అర్పించే మనిషి వెలుగులా వచ్చాడు. వెళ్లిపోయాడు.

రమ రేగిన జుట్టు, అలసిన ముఖం, బురదతో నిండిన బట్టలు స్టేషన్లోకి పరుగు తీసింది. రైలు బయలుదేరింది. జగన్నాథం చూస్తూ ఉన్నాడు రమ గట్టిగా అరుస్తూ పర్సు విసిరేసింది. చీర అడ్డువచ్చి కింద పడిపోయింది. అతను పర్సు అందుకున్నాడు. వెయ్యి రూపాయాలు అలానే ఉన్నాయి. అతని ఫోటో మాత్రం లేదు ఏమి కథ ఇది. తిలక్ రాసిన 'ఊరి చివరఇల్లు' అక్కడక్కడ తిలక్ రాసిన మాటలు అద్భుతంగా ఉంటాయి. 'ఒంటరి తనం అతి పెద్ద సహారా ఎడారిలా వ్యాపించి ఉంటుంది. అక్కడ నీళ్లు దొరకవు. అడుగు జాడలు కనిపించవు. బ్రతుకు వాసన ఉండదు. అక్కడ మండే కాలే ఇసుక మాత్రం అనంతంగా పరుచుకుని ఉంటుంది. ఎవరూ

ఆ ఎడారిలో ఉండలేరు. బ్రతుకలేరు. తనలో, రమలో ఆఖరికి అవ్వలో కూడా ఎడారి. ఈ ఇసుకలో కాళ్ళు మాడుతూ బ్రతుకునీడ్చుకుంటూ నాలుక పిడచకట్టుకు పోతుంటే ఒయాసిస్సుల కోసం కొన ఊపిరితో కూడా వెతుకుంటూ ఉంటారు.''

తిలక్‌కి కవితా రహస్యంతో పాటు కథా రహస్యం తెలుసు. ఐతే అక్కడక్కడ మనకు కథ ఏంటో తెలిసి పోతూ ఉంటుంది. బహుశా ఇది ఆయన బలహీనత కావొచ్చు. ఈ కథలో కూడా ముసల్ది తచ్చాడుతూ ఉంది. అని చెప్పగానే మనం కాస్త ఏమి జరుగుతుందో ఊహించవచ్చు. ఆయన తీసుకున్న వస్తువు గొప్పది. నేపథ్యం గొప్పది. సర్వసాక్షికోణంలో చెప్పిన కథ. ముగింపు కూడా తీసిపారేసింది కాదు. పర్సులో ఫోటో లేకపోవడం చూసి జగన్నాథం మళ్ళీ వచ్చి ఉంటాడా. రమ ఎడారి బతుక్కి ఓదార్పు దొరికి ఉంటుందా. అడగడానికి ఆయన లేడు. వస్తే ఎలా ఉండును. రాకపోతే ఎలా ఉంటుంది.

⌘⌘⌘

BHAVAVEENA
Vol. 17, Issue. 8, August 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

రామాయణంలో 'పిల్లల పెంపకం' – సమకాలీనత

– బమిడిపాటి గౌరీశంకర్, తెలుగు విభాగాధిపతి, గాయిత్రి కాలేజ్ ఆఫ్ సైన్స్ అండ్ మేనేజ్‌మెంట్, శ్రీకాకుళం.

'పిల్లల పెంపకం' పై టన్నుల కొద్ది పుస్తకాలు (నెట్) బజార్లో దొరుకుతున్నాయి. పుస్తకాలు చదివి పిల్లలను పెంచడం సాధ్యమా అనే అంశాలున్నాయి. అసలు పిల్లలను ఎలా పెంచాలి అనే ప్రశ్నలోనే ఓ చిక్కని సమాధానం ఉంది. 'శాకుంతలం'లో శకుంతల 'తల్లిదండ్రుల నీడలే పిల్లలు' అనే అర్థాన్ని ధ్వనింపజేస్తుంది. మన పూర్వీకులు నిర్దేశించిన సూత్రాలు, మార్గాలు వర్తమానంలో అనుసరణీయం కావచ్చు కాకపోచ్చు కాని రెండు తరాల ముందు వరకు గమనిస్తే ఇంతటి సాంకేతిక పరిజ్ఞానం, పుస్తక ప్రపంచం అందుబాటులో లేదు. అయినా ఎక్కువ మంది పిల్లలున్న తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను 'ఆరోగ్యకరమైన పెంపకం'లోనే పెంచారు. శ్రీపాద వారి 'నా అనుభవాలు - జ్ఞాపకాలు'ను చదివిన వారికి ఆనాటి అగ్రహారపు పెద్దలు పిల్లల మధ్య, గురువు - శిష్యులు మధ్య సంబంధ బాంధవ్యలు తెలుస్తాయి. ఆనాటి చదువుల విలువ ఎలా పిల్లలకు అక్కరకు వచ్చిందో తెలుస్తుంది. కాలం మారింది కదా అనే ప్రశ్నించే వారికి ఒకటే సమాధానం - 'తల్లిదండ్రుల బాధ్యత మారింది - పెరిగింది'. మరి అప్రమత్తత అవసరం లేదా?

తల్లిదండ్రుల ప్రభావం పిల్లలు మీద ఉంటుంది. 'గారాబం లేకుండా, ఆరోగ్యకరంగా పెంచమంటుంది. పిల్లల ప్రపంచం. తప్పు దారి పోకుండా తమని సరిదిద్ద మంటుంది భావితరం' ఈ వాఖ్యానం వెనుక తల్లి దండ్రుల బాధ్యతను గుర్తించవలసిన ఆవశ్యకత ఉందని మరువరాదు. వర్తమానంలో తల్లిదండ్రులలు 'పిల్లల పెంపకం' అనేది ఓ సవాల్ గా మారింది. కారణం సమాజం లోని సంక్లిష్టత జీవన వైరుధ్యాలు, ఏది ముద్దు, ఏది మొండితనం, ఏది మూర్ఖత్వం అనేది తెలుసుకోవటం కష్టమయింది. ఇరవై నాలుగు గంటలు 'చదువు, చదువు అని విద్యార్థుల మీద భారం' మోపుతూ 'ఖర్చు చేస్తూ వారిపై విపరీతమైన అంచనాలు పెంచకుంటున్న తల్లిదండ్రులు 'ఎప్పుడైతే అంచనాలు పెరిగాయో పిల్లలపై ఒత్తిడి పెరుగుతుంది'. అనే మాటను విస్మరిస్తున్నారు. వర్తమానంలో ఈ ఒత్తిడి కారణంగానే ఆత్మహత్యల శాతం పెరుగుతున్నది. 'గుడ్ పేరింటింగ్' అనేది తల్లి దండ్రులుగా మారిన ప్రతీ ఒక్కరికి వర్తించే సూత్రం. సమాజంలో పిల్లలను అనేక రకాలైన 'మార్గాలు' చెడు మార్గాన్ని నిర్దేశిస్తున్నాయి. సరైన దిశానిర్దేశంలేని వర్గం 'ఆ దిశగా' ఆకర్షించబడతారు. కారణం - తల్లిదండ్రులు సత్యం, శాంతి, ధర్మం, ప్రేమ, ఆప్యాయత, నిస్వార్థం వంటి సుగుణాలను పిల్లల్లో 'నేర్పటం' లేదని చెప్పే ఉదాహరణ కోకొల్లలుగా మన మధ్య ఉన్నాయి. ఇది విషాదం. ఈ తరహా సుగుణాలు ముందుగా తల్లి దండ్రులు నేర్చుకోవాలి. (అందరూ కాదు, కొందరు) ఇవి బజారులో దొరకవని అందరికి తెలుసు. ఒక్కొక్క అంశానికి కొన్ని వందల పుస్తకాలు ఉన్నాయి. వాటిలో వేల కొలది ఉదాహరణలు - సూత్రాలు ఉన్నాయి. వాటినన్నింటిని చదివి ఆయా అలవరసల్లో 'పెంపకం' ప్రారంభిస్తే టీ.వి చూస్తూ వంట గదిలో 'సాంబారు' వండినట్టే 'పెంపకం' ఉంటుంది. '24 సగుణాలున్న ఒకే ఒక వ్యక్తి ఈ లోకంలో ఉన్నాడా అని అడిగిన నారదునికి' ఉన్నాడు. అతడే శ్రీరాముడని 'వాల్మీకి సమాధానం'లో శ్రీరాముని వృత్తాంతంలో తల్లిదండ్రులు అతనిని పెంచిన వీరు అద్భుతమని పిస్తుంది. గమనించి చూడండి 'అద్భుతమైన సంపద, అల్లారు ముద్దుగా చూసుకొనే తల్లిదండ్రులు, కాలు కందకుండా ఎత్తుకొని ముద్దు చేసే బంధుజనం, దాస దాసీలు, స్వేచ్ఛ' ఇన్ని ఉన్నా 'ఆ నలుగురు' ధర్మబద్ధులే. బాల్యం నుంచి రామావతారం ముగింపు వరకు

'రామాయణం' చదివతే పిల్లల పెంపకం, తల్లిదండ్రుల బాధ్యత అనేవి ఎంతో చక్కగా అవగాహనకు వస్తాయి. 24,000 శ్లోకాలతో 640 సర్గలతో, అకాండలతో కూడిన మహాగ్రంధం 'రామాయణం'.తల్లిదండ్రులతో ఉన్న గుణ సౌశాల్యం పిల్లలకు వస్తుందని చెబుతుంది 'జెనెటిక్స్'. ఇక్కడ రాముని తల్లిదండ్రులైన దశరధుడు, కౌసల్య, సుమిత్ర కైకేయిలను గురించి కూడా చెప్పుకోవాలి.

దశరధుడు అటే పది దిశల్లో రథం నడపగలిగిన వాడని అర్ధం. సూర్యవంశపు రాజుల్లో కిరీటం వంటివాడు. ఇక్ష్వాకు వంశానికి మొదటి రాజు మనువు. అయోధ్య అంటే ఇతరులు జయంపశక్యముకానిది అని అర్ధముంది. రాముని తల్లి కౌసల్య ఈమె మరో పేరు 'హృలేఖ' అనగా దైవీ గుణములు కలిగినది. వాటిని అందరికి పంచేది అని భావం. కన్న కొడుకు కన్నా ప్రాణప్రధంగా రాముని పెంచిన తల్లి కైకేయి. ఈమె మరో పేరు 'కీర్తిలేఖ'. పేరు కలిగినది. దీనిని అందరికి పంచుతుందని అర్ధం. (ఏరకంగా అనేది చదివే వారి బుద్ధి కుశలతపై ఆధారపడి ఉంటుంది) సుమిత్ర. ఈమె మరో పేరు 'శ్రీలేఖ' అనగా తనకున్న సిరిని అందరితో సమానంగా పంచుకొనేదని అర్ధం. వీరందరి సుగుణాలను వారు తమతమ పిల్లలకు బాల్యం నుంచే చక్కగా తమ తమ విధులలో 'ప్రదర్శించి' నేర్పించారు. 'పెంపకం'లో ప్రథమ పాఠం 'తల్లిదండ్రులు' ఒకటి చేసి పిల్లలకు మరొకటి చెప్పటం కాదు. తాము ఏది చేస్తున్నారో పిల్లలు చేసి దానిని నేర్చుకుంటున్నారు అని గ్రహించటం. తాను టీ.వి చూస్తూ పిల్లాడిని చదువు కోమనటం కన్నా, కొంచెం సేపు టి.వి ఆఫ్ చేసి పిల్లాడి ప్రక్కన కూర్చోని చదివిస్తే... దాని ఫలితం వేరుగా ఉంటుంది. పిల్లలకు కౌసల్య, సుమిత్ర, కైకేయి గోరు ముద్దలు పెడుతున్న వేళ అక్కడ దశరధుడు కూర్చోని ఉండేవాడు. రాముడు ఆకాశంలో చందమామను తీసుకు రమ్మని మారాము చేస్తే అద్ధంలో దానిని 'చూపించిన' తండ్రి దశరధుడు. 'ధర్మం'ను ఆచరించి చూపిస్తే ఫలితం అద్భుతం. విద్యాభ్యాసం కోసం పిల్లలను వశిష్ట ఆశ్రమంలో దిగబెట్టే వేళ 'గురువులు చెప్పిందే వేదం సుమా! వారి సేవ కోసం నిత్యం శ్రమించండి. వారి ప్రేమాశీస్సులను పొందండి' అని 'వదిలి వెళ్ళి పోయిన' చక్రవర్తి అయిన తండ్రి దశరధుడు. నేడు గురువులను కొట్టమని పిల్లలను ప్రోత్సమించే తల్లిదండ్రుల పెంపకం ఎంత గొప్పదో వేరేగా ప్రస్తావించనవసరం లేదు.

ఒక చిన్న ఉదాహరణ....

కౌసల్య దశరధుడు విశ్రాంతి మందిరంలో ఉన్నారు. శ్రీరాముడు సంతోషంగా నవ్వుతూ వచ్చి అమ్మ ఒడిలో చేరాడు. తల్లి 'ఏమిటి రామా ఎప్పుడు లేనిది ఇంత ఆనందంగా ఉన్నావు' అని అడిగింది. 'ఈరోజు నేను భరతుడు ఆడుకున్నాం. ఆ ఆటలో తమ్ముడు భరతుడు గెలిచాడు అమ్మా' అని ఆనందంగా చెప్పాడు. ఇంతలో భరతుడు ఏడ్చుకుంటూ వచ్చి కౌసల్య ఒడిలో కూర్చున్నాడు ఏమిరా కన్నా ఏడుస్తున్నావ'ని అడిగింది. 'చూడమ్మా' అన్నయ్య నన్ను గెలిపించడం కోసం తాను ఓడిపోయాడు' అని చెప్పాడు. ఆతల్లి ఆర్తితో... ఆనందంగా వారిద్దరిని గుండెలుకు హత్తుకుంది... ఈ అనుబంధ వారికి ఎలా తెలిసింది..? ఆ తల్లిదండ్రుల పెంపకం కాదా? తరువాత కాలంలో భరతుడు తన అన్న పాదుకలకు పట్టాభిషేకం చేసి 12 సంవత్సరాలు రాజ్య పాలన చేసాడు. తనకు అరణ్యవాసం లేకపోయిన లక్ష్మణుడు రాముని వెంట వనాలకు వెళ్ళాడు.

రావణుడిపై అతని తల్లిదండ్రుల పెంపకం ప్రభావంను గమనించాలి. కైకసి సుమాలి అనే రాక్షసుని కుమార్తె. తండ్రి కోరిక మేరకు విశ్రవస్‌ను వివాహం చేసుకుంది. వీరికి ముగ్గురు పుత్రులు ఒక పుత్రిక పెద్దవాడు రావణుడు. రావణుడు అంటే ఎదుటివారిని ఏడిపించేవాడని ఒక అర్ధం. విశ్రవసుకు మరో భార్య ఉంది. ఆమె కుమారుడు కుభేరుడు. విశ్రవసు ఇద్దరు భార్యల మధ్య నిరంతరఘర్షన పిల్లలపై ప్రభావం చూపింది. ముఖ్యంగా పెద్దవాడైన రావణుని కైకసి

దుర్మార్గునిగా తీర్చిదిద్దింది. అతని మనసులో నిరంతరం అసంతృప్తిని రేపింది. కుబేరునితో సరిపోల్చి ఈర్ష్య, అసూయ, ద్వేషం, పగ వంటి గుణాలను ప్రోది చేసింది. తరువాత కాలంలో జరిగిని ఫలితం అందరికి తెలిసిందే. తల్లిదండ్రుల మధ్య సఖ్యత లేకపోవటం అనేది పిల్లల పెంపకంపై ప్రభావం చూపుతుంది. మరో కథ విశ్వామిత్రు నిది.

కుశనాభుడు కొడుకు గాధి. అతడిని ధర్మయుత మార్గంలో పెంచారు గాధి తల్లి వైదర్భి, కుశనాభుడు వైదర్భి ఆదర్శ దంపతులు. గాధికి ఇద్దరు పిల్లలు వారు కౌశికి, విశ్వామిత్రుడు. కౌశికి భర్త ఋచీక మహర్షి. ఈయన కొంతకాలం సంసారం చేసి మోక్ష సాధనకు బ్రహ్మలోకానికి బయలు దేరాడు. భార్యను తనతో రమ్మనగా ఆమె 'స్వామి ఈ మానవజన్మ ఎత్తినందుకు నాకంటూ ఓ ప్రయోజనకరమైన లక్ష్యం ఉండాలి కదా. కనుక నేను కొంతకాలం భూలోకంలోనే ఉండి, మానవులకు నదిగా ఉపయోగపడాలనుంది. కనుక నాకు ఆ వరమివ్వమని కోరింది'. సంతోషించిన మహర్షి 'తథాస్తని' దీవించాడు. విశ్వామిత్రుని గురించి అందరికి తెలిసింది. కుశనాభుడు, గాధిల యొక్క పరంపరలోని ధర్మయుతమైన సూత్రావళి కౌశి, విశ్వామిత్రుల పెంపకాన్ని ప్రభావితం చేసింది. పిల్లల ప్రవర్తన వాళ్ళ కుటుంబంలోని విలువలని, సంస్కృతిని ప్రతిబింబిస్తుంది. తన జీవితాన్ని సమాజ సేవతో తరింప జేసుకొన్న పిల్లలు వెనుక వారి తల్లిదండ్రుల పెంపకం ఉంటుంది. అంగదుడు, ఆంజనేకుడు, మేఘనాధుడు, లవకుశులు వంటి వారి కథలు వెనుక వారి తల్లిదండ్రుల పెంపకపు తీరులోని అవలక్షణాలు, శుభలక్షణాలను గమనిస్తే వర్తమానంలో తల్లిదండ్రులకు ఓ పాఠం నేర్చు కొనే అవకాశం కలుగుతుంది. రామాయణంలో సమ కాలీనత అర్థమవుతుంది. రామాయణం వర్తమానంలో నిత్య పారాయణ గ్రంధంగా చేసుకొంటే పాత్రలలోని సమాలీనత సత్యాలు అవగతమవుతాయి. పిల్లలను ఎలా పెంచాలి? వారి పెంపకంలోని సవాళ్ళను శాస్త్రబద్ధంగా ఎలా నేటి కాలానికి అన్వయించుకోవాలి, ఆచరించాలి అనే అంశాలు తెలుసుకోవచ్చు. రామాయణ, మహా భారతాలు ఎందుకు చదవాలి అని తర్కం లేకుండా నేటి కాలానికి అనుగుణంగా ఎలా చదువుకోవాలి అని అలోచించగలిగితే వాస్తవాలు అవగతమవుతాయి. రామా యణం ఒక గ్రంధం కాదు. ఓ జాతి జీవన సంస్కృతి ప్రతిబింబం. మానవ జీవన పరిణామక్రమానికి దిశ - దిశ చూపించగల మహోదాత్త రచన. వాల్మీకి ధన్య జీవి. పిల్లల పెంపకం, కుటుంబ నిర్మాణం, ఆరోగ్యకరమైన మానవబంధాలు, విలువలు వంటి ఎన్నెనో అంశాలను నేర్చుకొనే సులభతర మార్గం - రామాయణం.

ఆధార గ్రంధాలు :

1. 'సావిత్రి' - ఆరణ్యకృష్ణ
2. 'నీలిమేఘాలు - కవితా సంకలనం - ఓల్గా
3. స్త్రీవాద కవిత్వం - ఎమ్.ఎమ్. వినోదిని
4. 'రచన' 2000 ప్రత్యేక సంచిక

⌘⌘⌘

BHAVAVEENA
Vol. 17, Issue. 8, August 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

దళిత ధిక్కార స్వరం "నిప్పుల వాన"

- డా॥ ఎ.ఎ. నొగేంద్ర, పోస్ట్ డాక్టరల్ ఫెలో, తెలుగు తులనాత్మక సాహిత్యశాఖ, శ్రీకృష్ణదేవరాయవిశ్వవిద్యాలయము, అనంతపురము.

హిందూమతంలో అణగారిన వర్గాలను 'దళితులు' గా పేర్కొంటారు. హిందూమతంలో అతి తక్కువ స్థాయి వారిగా భావించబడతారు. దళితులు జన్యుపరంగా ఇతర అగ్రకులాలను పోలి ఉన్నా, వీరు సామాజికంగా తరతరాలుగా తక్కువ జాతిగా భావించబడుతున్నారు.

Dalit means Broken people, held under check; suppressed or crushed or in a looser sense, oppressed. 'దళి' అంటే 'గుంట', అంటరానితనం అనే శిక్షలో భాగంగా, గ్రామాలలో దళితులు ఊరెలపటి తనాన్ని, పేదరికాన్ని, వృత్తులైన చెప్పులు కుట్టడం, గొడ్డు తోలుతో వివిధ పనిముట్లు తయారుచేసి ఇతరులకు అందించి, వారిచ్చే 'మిరాసి' ద్వారా జీవనోపాధిని పొందడం, చచ్చిన పశువుల్ని తరలించడం, చనిపోయిన వారి దహన కార్యాలు నిర్వర్తించడం చేశారు. ఇప్పటికీ కొన్ని కొన్ని ప్రాంతాలలో చేస్తున్నారు. కర్నూలు జిల్లా దళిత రచయితలు 15 మంది వినిపిస్తున్న ధిక్కారస్వరమే 'నిప్పుల వాన" కథా సంకలనం.

"కులం పునాదుల మీద
ఒక జాతిని ఒక నీతిని
నిర్మించలేము
అలా నిర్మిస్తే, అది ఎప్పుడో ఒక సారి
బద్దలవుతుంది"

- డా॥ బి.ఆర్. అంబేద్కర్

'భారతరత్న' దళితుల ఆత్మగౌరవ ప్రతీక అయిన డా॥ బి.ఆర్. అంబేద్కర్ గారు చెప్పినట్లు 'కులం' అనే పునాది మీద మనం జాతిని కానీ నీతిని కానీ నిర్మించలేము అనేది వాస్తవ సత్యం. కానీ ప్రస్తుతం ఉన్న వ్యవస్థ ఈ పదాలను జీర్ణం చేసుకునే స్థాయికి ఎదగలేదనేది (కఠోర సత్యం) మనందరికీ తెలిసిన విషయమే.

శ్రీమతి కోట మలిగ అరుణ రచించిన 'విజేత' కథ కూడా మనకు గ్రామీణ భారతంలోని కులపు కంపు గురించి తెలియజేయడంతోపాటు చదువుకున్న దళిత విద్యార్థి తాను అనుభవించిన వివక్ష గురించి ఓ సభలో ధైర్యంగా ప్రసంగిస్తూ ... "ఒక వ్యక్తిని తాకితేనే మైల పడతాము అంటూ స్నానం చేసే నీవు ఆ వ్యక్తి కన్నా తక్కువ స్థాయి వాడివి కాదా" అన్న కబీర్ సూక్తితో మొదలుపెట్టి ... నేను మాదిగ అని తెలిసినా గంగాతల్లి నాకివ్వలేదేమి విషపానీయం. నాది నీచ అంశ అని తెలిసి అగ్నిదేవుడు నన్ను చేయలేదేమి భస్మం. మరి ఓ... అగ్రవర్ణ దురహంకారి... నీవు ఈ పంచభూతాల కన్నా ఉన్నతుడివా? అని ప్రశ్నిస్తూ... నిజంగా మన దేశాభివృద్ధికి పట్టిన చీడపురుగు ఈ కులం. అంటూ తాను అనుభవించిన వివక్ష గురించి సభికులలో ఆలోచనలు రేకెత్తిస్తాడు.

డెబ్భై ఏళ్ళు నిండిన స్వతంత్ర్య భారతం మనకు మిగిల్చిందేమి? అంటూ సమాజాన్ని, స్వాతంత్ర్యాన్ని ప్రశ్నిస్తాడు. అసమానతలు, అంటరానితనం, పరువు హత్యలు ఇంకా ఉన్నాయంటూ ఆవేదన చెందుతాడు. కులాలు వీడిన దేశాలు మాత్రమే అభివృద్ధి చెందాయి. కులం ఉన్నంత వరకూ ఈ సమాజం మారదంటూ ... కులాంతర వివాహాలను ప్రోత్సహించాలని కోరుతూ ప్రసంగాన్ని ముగించడం ఆ పోటీల్లో రాము 'విజేత'గా నిలవడం ఈ కథలోని ఇతివృత్తం.

రాము పాత్ర ద్వారా రచయిత్రి కులంలేని సమాజాన్ని కలగన్నారు. మనిషిని మనిషిగా చూసే రోజు రావాలని ఆకాంక్షిస్తారు.

'అంటరాని గాయం' కథను రచయిత డి. అయ్యన్న గారు స్వానుభవంతో రాసినట్లు అర్థమవుతుంది. దళిత

యువత వెలుతురు దారిలో నడవాలని కోరుకుంటాడు. అంబేద్కర్ గారు కోరినట్లు 'చదువు' నే ఆయుధంగా చేసుకొని, కష్టపడి చదివి టీచర్ కావడం. ఏప్రిల్ 14వ తేదీ డా॥. బి.ఆర్. అంబేద్కర్ గారి జయంతి రోజున పాఠశాలలో ఎలా ప్రసంగించి, విద్యార్థులలో చైతన్యం తీసుకురావాలో రచయిత ఆలోచనా విధానం మనకు తెలుస్తుంది.

రచయిత తన తండ్రితో పాటు ప్రభుత్వ క్వార్టర్స్ చూడటానికి కర్నూల్ వెళ్ళినపుడు అక్కడ వీరికి తాగడానికి నీళ్ళు ఇచ్చిన ఒకామె. వీరు తాగిన తర్వాత చెంబును గ్లాసును వీరు చూస్తుండగానే సబ్బుతో కడగడం, ఓసారి దేవాలయానికి వెళితే అక్కడ వుండే కాపలాదారుడు రచయితను మెడపట్టి రోడ్డుపైకి తోసేయడం, ఒంటిపై గాయం కంటే గుండెలపై పడ్డ అవమానకరమైన అంట రాని గాయం ఆయన్ని బాధించడం. కులం మనిషిని, మానవత్వాన్ని నైతికంగా ఎలా పతనం చేస్తుందో ఈ విషయాలన్నీ విద్యార్థులకు బోధించాలనుకోవడంతో కథ ముగుస్తుంది. 'చదువు - సమీకరించు - పోరాడు' అన్న అంబేద్కర్ గారి మాటలకు అర్థవంతమైనది ఈ కథ.

మనుషుల మధ్య కులాల మధ్య అంతరాలు ఉండకూడదు. మానవత్వం ఫరిడవిల్లాలంటే అందరూ సహృదయ భావనతో మెలగాలని, ఉన్నతవర్గం, నిమ్నవర్గం అంటూ గీతలు గీసుకోకూడదని, మరీ ముఖ్యంగా దళితులలోని మాల, మాదిగలు కూడా అన్నదమ్ముల్లా మెలగాలని 30 సం॥ క్రితమే హితవు బోధిస్తూ డా॥ కల్లూరి ఆనందరావు గారు రాసిన కథే "వేకువ".

ఉన్నత కులాల వారు మాల, మాదిగ కులాల మధ్య రాజకీయ చిచ్చుపెట్టి, వారి మధ్య దూరాన్ని పెంచాలని భావించినప్పుడు "బహుజన బహుళాభ్యుదయ పార్టీ"కి ప్రెసిడెంట్‌గా ఎన్నుకోబడిన మాల నారాయణరాజు. మూడువందల తొంభై మంది ప్రజల సమక్షంలో మాదిగ ఎంగటేసు వైపు ప్రేమగా అరుస్తూ పోవడం ఈ కథ ద్వారా తెలుస్తుంది.

దళిత వాడలోని పిల్లలు ఉన్నత చదువులు చదవక పోవడానికి కారణం ఎవరు, చిన్నచిన్న ఆనందాలకు, వ్యసనాలకు బానిసలయిన పిల్లలు వారి బంగారు జీవితాల్ని ఎలా నాశనం చేసుకుంటారో తెలియజేస్తూ, మంచి ఉపాధ్యాయుడైన రత్నమయ్య చెప్పిన గొప్ప విషయాలు దారిద్ర్యం పోవాలంటే చర్చికో, గుడికో కాదు... బడికి వెళ్ళాలి. అనుసరించాల్సింది దేవుళ్ళను మతాల్ని కాదు. ఆ జ్ఞానజ్యోతిని (డా॥ బి.ఆర్. అంబేద్కర్) అనుసరించండి అంటూ చదువుకుంటేనే బంగారు భవిష్యత్తు లభిస్తుందని చెప్పేకథ సంకటి మహేశ్వరయ్య రాసిన "చూపుడు వేలు" కథ.

చిన్న చేపను పెద్ద చేప తిన్నట్లు ఈ నిచ్చెనమెట్ల వర్గ సమాజంలో, ఒక మెట్టు పైనున్న సామాజిక వర్గం వారు దళితుల్ని ఎలా తొక్కివేస్తారో చెబుతూ, మాదిగలకు బోయలకు మధ్య ఉన్న వైరాన్ని చాలా చక్కగా తెలియ జేస్తాడు "పైగేరి నారప్ప కథ" లో రచయిత కెంగార మోహన్ గారు.

బోయవీధిలో ఉన్న మారెమ్మ గుడి పూసేది, రంగులు వేసేది మాదిగోళ్ళే కానీ ఆ గుడిలోకి మాదిగ వాళ్ళకు ఆహ్వానం వుండదు. పెళ్ళి తర్వాత జరిగే 'మెరివిణి' లాంటి సందర్భాలలో కూడా మాదిగలకు ఆలయంలోకి ప్రవేశం వుండదు. ఇదే విషయాన్ని ఒక సందర్భంలో పైగేరి నారాయణ, బోయవాళ్ళను ప్రశ్నిస్తాడు. మాదిగోడు మమ్మల్నే నిలదీస్తాడా? అన్న కారణంతో అతన్ని, అతని కుటుంబాన్ని బోయ కులానికి చెందిన కొందరు ఎలా నాశనం చేస్తారో చాలా ఆర్ద్రతగా చెబుతాడు రచయిత.

"మాదిగోళ్ళు అంటే ఈ సమాజానికి పట్టిన మలినాన్ని కడిగే మనుషులే కాదూ మానవత్వంలేని మనుషులను కూడా సహనం, ఓర్పుతో మార్చగలిగే వాళ్ళు" అలాంటి మాదిగ కులానికి చెందిన మత్తయ్యను, కొంతమంది

అగ్రవర్ణ కులానికి చెందిన యువకులు, గ్రామానికి చెందిన గ్రామ పెద్దకొడుకు హరినాథ్ రెడ్డి పెళ్ళి సందర్భంలో నానా మాటలతో దుర్భాషలాడటం ఆ మాటలకు మత్తయ్య హృదయం గాయపడటం. తర్వాత మత్తయ్య మరణంతో హరినాథ్‌రెడ్డి స్నేహితులు శ్రీధర్‌గౌడ్, రంగస్వామి, రవి, భరత్ లాంటి వాళ్లలో మార్పు వచ్చి ప్రతి ఒక్కర్ని మనిషిగా చూడటం, గౌరవించడం మాదిగ వ్యక్తిని కూడా మనిషిగానే చూడాలన్న స్పృహ వారిలో రావడంతో కథ ముగుస్తుంది. సూగూరు సుధాకర్ గారు రాసిన "పరివర్తన" కథ సమాజంలో ఇంకా మారని వారిలో కూడా పరివర్తన రావాల్సి ఉన్నదని తెలియజేస్తుంది.

సామిరెడ్డి కుయుక్తితో, చేనగట్ల పంచాయితీలో విర్ర వీగారనే కసితో తిమ్మారెడ్డిని సాధించడానికి పుల్లన్న చేత, తిమ్మారెడ్డి కులం పేరుతో తిట్టినట్లు తప్పుడు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం ఆధారంగా కేసు పెట్టమంటాడు సామి రెడ్డి. తనకు నేరుగా తిమ్మారెడ్డితో ఎలాంటి ఘర్షణ కానీ వైరుధ్యం కానీ లేనప్పుడు కేసు ఎలా పెట్టాలని ఆలో చించిన పుల్లన్న సామిరెడ్డికి ఎదురు ప్రశ్నవేసి కేసు పెట్ట లేనని చెప్పడమే రచయిత డా॥ ఎస్.జె. రవిప్రకాష్ రాసిన కథ "తిరగబడిన డప్పు".

కర్నూలు జిల్లాలోని కొన్ని ప్రాంతాలలో దొరలు, పెత్తందార్ల దౌర్జన్యాలను, దళితుల పట్ల వారు ప్రవర్తించే తీరు, వారి అరాచకత్వం గురించి బట్టబయలు చేసే కథ "దొరల దర్బార్" రచయిత ఆవుల బసప్ప రాసిన ఈ కథలో వివక్ష కనుమరుగు కాకుండా తన రూపాన్ని మార్చు కుంటూ విద్యావంతులైన అగ్రవర్ణ ఉపాధ్యాయులలో కూడా ఉండటాన్ని తీవ్రంగా ఖండిస్తాడు రచయిత.

'నర్సు'గా పనిచేసుకుంటూ, తన కొడుకును చది వించుకుంటూ గౌరవంగా బ్రతికే మార్తమ్మ ఎప్పుడో పది సంవత్సరాల క్రితం వదిలేసి, మరో స్త్రీతో వుంటూ, జులాయిగా తిరిగే బాధ్యతలేని భర్త ఇప్పుడు మళ్ళీ తన వద్దకు రావాలనుకుంటున్నాడన్న విషయం తెలిసి మార్తమ్మ పక్కింటి వారితో కన్నీరు పెట్టుకుంటుంది. తన భర్త తాగడానికి, పెద్దమాంసం రోజు కావాలని, తనని వేధిస్తాడని తన పాతజ్ఞాపకాలు గుర్తొచ్చి మార్తమ్మ పడే ఇబ్బందులు గురించి తెలియజేసే కథ పి. విక్టర్ విజయ్ కుమార్ గారు రాసిన కథ "బతుకుతునకలు".

దళితులను మనుషులుగా చూడని వ్యక్తి. దళిత వాడలోకి రావడానికి కూడా ఇష్టపడని ఓ అగ్రకుల వ్యక్తికి ప్రాణాపాయస్థితిలో దళితకులానికి చెందిన నారయ్య రక్తదానం చేసి ప్రాణాలు కాపాడుతాడు. తనను కాపా డింది నారయ్య అని తెలుసుకున్న అగ్రవర్ణ కులానికి చెందిన వ్యక్తి కులాలు, మతాలు, పేద, ధనిక ఇలా బేధాలు పనికిరావని తెలుసుకుంటాడు. ఇలా అతనిలో "కనువిప్పు" కలిగించిన ఈ కథ సీనియర్ కవి సవ్వప్ప గారి ఈరన్న గారు రాసినది.

ఎన్నో పూజలు, వ్రతాలు చేస్తే చాలా సంవత్సరాల తర్వాత పుట్టిన బిడ్డను అల్లారుముద్దుగా పెంచుకుంటూ, ఉన్న తల్లిదండ్రులకు ఆసరగా నిలబడాలని భావించిన ఆ యువకున్ని మోతుబారి రైతు వెంకటరెడ్డి అను కోకుండా ట్రాక్టర్ కింద నలిపేయడం 'కైమా' చేయడం హృదయవిదారక సంఘటన. కొండంత కొడుకును పోగొట్టుకున్న దళిత దంపతులకు కొంత పొలం ఇస్తానని మాటచ్చి, ఇవ్వకుండా వుంటారు వెంకటరెడ్డి. అనుకోకుండా ఓ రోజు వెంకటరెడ్డి కొడుకు కూడా కారు ప్రమాదంలో మరణిస్తాడు. పుత్రశోకం ఎలా ఉంటుందో చెప్పే కథ "కైమా". రచయిత్రి డా॥ మల్లెపోగు వెంకట లక్ష్మమ్మ రాసిన ఈ కథ చాలా హృద్యంగా ఉంది.

అంబేద్కర్ స్మారక చిహ్నమైన చైతన్య భూమిని సందర్శించేలా పిల్లలను ప్రోత్సహించడం, అంబేద్కర్ భావజాలాన్ని పిల్లల్లో నింపాలని, మనువాద సంస్కృతి పీడన నుంచి పిల్లల్ని బయటికెయ్యాలని కోరే కథ పెరికల రంగస్వామి గారు రచించిన "పరిచయం చేయండి."

పెద్దకులమోళ్లు చిన్నకులం వారితో ఎలా వెట్టిచాకిరీ చేయించుకుంటారో, వారిని ఎంత నీచంగా చూస్తారో,

కనీసం సరైన తిండి పెట్టకుండా గొడ్డుచాకిరీ ఎలా చేయించుకుంటారో డా॥ సక్కిరి భాస్కర్ గారు రాసిన "కాపులిండ్లు" కథ చదివితే మనలో మనిషితనం ఉందా? అనే ఆలోచన మొలుస్తుంది. మనిషిని మరీ ముఖ్యంగా దళితుల్ని మనుషులుగా చూడని వ్యవస్థ పై 'చదువు' తోనే తిరుగుబాటు చేస్తానని ప్రకటిస్తాడు రచయిత.

ఊర్లో ఎవరు చనిపోయినా పాత కాలంలో చావు వార్తను బంధువులకు చేరవేసేది, శవానికి గుంతలు తవ్వి శవ సంస్కారం పనులు చేసేది 'బ్యాగరోళ్ళు'. ఆ వృత్తిమీద అందులోని బలవంతపు వెట్టిచాకిరీ మీద తనదైన శైలిలో రచయిత గుంపుల వెంకటేశ్వర్లు రాసిన కథ 'బ్యాగ రోళ్ళు".

తెలుగు కథా సాహిత్యంలో పేరెన్నికగన్న వ్యక్తి డా॥. నాగప్పగారి సుందరరాజు. దళిత జీవితాల్ని స్కాన్‌చేసి చూపించే రచయిత. చెప్పదలుచుకున్న విషయాన్ని నిర్మొహమాటంగా వాడి అయిన పదాలతో అగ్రవర్ణ జాతులలో వణుకు పుట్టేటట్లు రాసే రచయిత డా॥ నాగప్పగారి సుందరరాజు. దళిత 'స్త్రీ' ని ఒక ఆట బొమ్మగా, ఒక వస్తువుగా చూసే అగ్రవర్ణ దురహంకారాన్ని ఎండ గడుతూనే, కుల సాంస్కృతిక విధ్వంసాన్ని, మాదిగ బోడెక్క బసివిరాలిని చేసే ఉత్సవంలో ఊరివాళ్ళ దుర్మార్గాన్ని కళ్ళకు కట్టేటట్లు చిత్రించిన కథ "నడిమింటి బోడెక్క బసివిరాలయ్యేద." మతం పేరుతో దళితులపైన తెలంగాణాలో జోగిని, మురళి రాయలసీమలో బసివిని, ఉత్తరాంధ్రలో దేవుడమ్మ, దక్షిణ కోస్తా జిల్లాలలో మాతంగి వ్యవస్థలు దళిత స్త్రీలను ప్రచ్ఛన్న వ్యభిచార కూపంలోకి నెడుతున్నాయి. ఇలాంటి దళిత స్త్రీల యొక్క యదార్థ గాధల్ని ఆవిష్కరించిన కథే "నడిమింటి బోడెక్క బసివిరాలిలయ్యేద".

ముగింపు :

కేవలం దళిత కథా రచయితలతోనే ఒక కథా సంకలనం వెలువడటం, కర్నూలు జిల్లా సాహిత్య చరిత్రలో కానీ, తెలుగు కథా సాహిత్య చరిత్రలో కానీ గుర్తించదగినటువంటి విషయం. 'నిప్పులవాన' కథా సంకలనాన్ని తీసుకువచ్చిన ఉపాధ్యాయుడు, రచయిత అయిన కెంగార మోహన్ గారికి అభినందనలు. అలాగే ఎన్నో విషయాలతో ముందుమాట రాసిన ప్రముఖ రచయిత జి. వెంకటకృష్ణ గారికి శుభాకాంక్షలు.

15 మంది కథారచయితల్లో కొంతమంది సీనియర్ రచయితలు కాగా మిగిలిన చాలామంది కొత్తవారే. ఇందులో ఇద్దరు మహిళలు కూడా తమ రచనలతో భాగస్వామ్యం కావడం శుభపరిణామం.

"గుణం లేని వాడు
కులం గొడుగు పడతాడు
మానవత్వం లేని వాడు
మతం ముసుగు వేస్తాడు
పసలేని వాడు ప్రాంతం ఊసెత్తుతాడు
జనులంతా ఒక కుటుంబం
జగమంతా ఒక నిలయం"

- గుర్రం జాషువా

మహాకవి గుర్రం జాషువా కలలు కన్నట్లు జనులంతా ఒక కుటుంబం, జగమంతా ఒక నిలయంగా మారి సమాజంలో ఉన్న వివక్ష అంటరానితనం పోవాలని దళిత ధిక్కారస్వరాన్ని వినిపిస్తున్న 'నిప్పులవాన' కథల సంకలనం నేటి సమకాలీనతకు అద్దం పడుతుంది.

ఆధార గ్రంథాలు :

1) 'నిప్పుల వాన' దళితకథలు, సంపాదకులు: కెంగారమోహన్, ప్రచురణ: మనస్విని ప్రచురణ, కర్నూలు, మే, 2020.
2) అంబేద్కర్ రచనలు.
3) జాషువా రచనలు.

⌘

BHAVAVEENA
Vol. 17, Issue. 8, August 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

విశ్వగీతి – సమకాలీన అభ్యుదయ దృక్పథం

– డా॥. సిహెచ్. పవన్‌కుమార్, సంస్కృత అతిథి అధ్యాపకుడు, తెలుగు & ప్రాచ్య భాషావిభాగం,
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, గుంటూరు.

ప్రస్తావన :

అభ్యుదయం, శాంతి, విప్లవం, మానవత, సమత - అన్ని వాదాలను ఆహ్వానించే సమన్వయ ధోరణికి నిలువు టద్దం డా॥ సి. నారాయణరెడ్డి గారు. వలయాలకు లొంగని తత్త్వం. సంప్రదాయం హమేషా జీవించే ఉంటుందన్న శ్రీశ్రీ వారసత్వం కొంత, పాతకొత్తల మేలుకలయిక కావాలన్న గురజాడ తత్త్వం కొంత పుణికిపుచ్చుకున్న 'సమన్వయకవి' సినారె.

"నాపేరు కవి
ఇంటిపేరు చైతన్యం"
"నా వచనం బహువచనం
నా వాదం సామ్యవాదం
కవిత్వం నా మాతృభాష
ఇతివృత్తం మానవత్వం"

అనటంలోనే సి.నారాయణరెడ్డి గారి కవిత్వం ఎలాంటిదో మనకు స్పష్టమవుతుంది. బహుముఖ ప్రజ్ఞాశాలియైన ఈ మహాకవిచే వ్రాయబడిన 'విశ్వగీతి' అనే గీతికావ్యంలోని సమకాలీన అభ్యుదయ దృక్పథాన్ని పరిశీలించటమే నా వ్యాస ముఖ్యోద్దేశ్యం.

విశ్వగీతి - సమకాలీన అభ్యుదయ దృక్పథం :

"నాలో విరిసిన గీతం
సంధ్యారాగ స్నాతం
నాలో మెరిసిన గీతం
సప్తవర్ణ సంకేతం.
నాలో ఎగిసిన గీతం
ఫాలాక్ష నిటలాగ్ని
జ్వాలామాలాపూతం.
నాలోపలికిన గీతం
మృత్యునర్తకీ కరాళ
నృత్యంలో తెగిన కింకి
ణీ గణ గళ సంగీతం."

అనే కవితలోని 'సంధ్యారాగస్నాతం', 'సప్తవర్ణ సంకేతం', 'జ్వాలామాలాపూతం', 'కరాళ నృత్యంలో తెగిన కింకిణీ గణగళసంగీతం' అనే పదాలు అభ్యుదయ, శాంతి, విప్లవ, సామ్యవాద, సమతావాదాలను ప్రతిబింబిస్తూ, ఈ గీతి కావ్యంలో కవిచే ఏఏ అంశాలు స్పృశింపబడ్డాయో సూటిగా సూచిస్తున్నాయి.

"అణుబీజం రూపంలో
జనియించిన నా గీతం
పల్లవ శీర్షాలనెత్తి
శాఖాహస్తాలు సాచి
జలనిధులు వినిర్మించిన
చెలియలికట్టలను గడచి
దేశదేశములకు నడుమ
గీసిన హద్దులను తుడిచి
విశ్వం నుండి విహాయస
వీధులదాకా ప్రాకెను
పరమాణువు నుండి పవన
పరిధులదాకా సోకెను"

అని సినారె పేర్కొనటంతో ఈ 'విశ్వగీతి' కావ్యం కేవలం ఒక వర్గానికో, ఒక ప్రాంతానికో, ఒక దేశానికో, ఒక వాదానికో పరిమితమైనది కాదని, ఎల్లలెరుగని అనంతవిశ్వంలోని సమస్త అంశాలను తనలో పొదువుకొని విశ్వమానవ కళ్యాణాన్ని కాంక్షించే మహోన్నత సాధనమని మనకు బోధపడుతుంది. ఈ క్రమంలో సినారె ముందుగా

తాడిత-పీడి-వ్యథాభరిత జీవుల కన్నీటిగాథలను, శ్రమదోపిడికి గురియై చావలేక బ్రతుకుతున్న శ్రామికుల దీనావస్థలను చూచి చలించిపోయి -

"మట్టిలోన భర్మం సృష్టించీ
రాళ్లలోన స్వర్గం నిర్మించీ
ఒక జేనెడు పొట్టకు వికటధనో
న్మాదుల కనుసన్నల కంపించే
దాన్యతమిస్రం తమ జీవిత మా
ర్థాలను మూయగ, దారిద్ర్యం అవ
హేళన సేయగ, చాలీ చాలని
కబళం కోసం కత్తుల బోనుల
శిరాల దూర్చీ శిక్షలకోర్చీ
చావూ బ్రతుకుల సంధ్యాలోకం
లో వసియించే శ్రమైక జీవుల
సమతాభావులగని నా గీతం
జార్చెను గోర్వెచ్చని బాష్పకణం."

అంటూ పెట్టుబడిదారులు, పెత్తందార్ల చేతుల్లో చిక్కి నలిగిపోతున్న వారికొరకు కవి కన్నీరు కారుస్తాడు. ఈనాటికీ మన సమాజంలో శ్రమదోపిడి నిరాఘాటంగా కొనసాగు తూండటం శోచనీయ విషయం. సమాజంలో స్త్రీ - పురుషులిద్దరూ సమానంగానే శ్రమదోపిడికీ గురౌతున్న ప్పటికీ, మహిళలు శారీరకంగా కూడా ఈ ధనమదాంధుల చేతుల్లో దోపిడికి గురియై, వేశ్యలనే ముద్రనుపొంది ఈ నాగరికసమాజంలో ఎదుర్కొంటున్న ఛీత్కారాలను, పురు షాధిక్య సమాజంలో వారి వెతలనూ, తప్ప తమది కాకున్నా, శిక్షనుమాత్రం అనుభవిస్తున్న వారి కన్నీటి కథలను కవి హృదయం ద్రవించేలా వర్ణిస్తాడు.

"తన తనూపాత్రలో
తొణికేటి తరుణ యౌ
వన శీధుశీకరా
లను శీలహర్తులకు
కామజ్వరార్తులకు
అందించి అందించి
ఆత్మనే వంచించి
పడుపు వృత్తియనేటి
అడుసులో అడుగేసి
కరివోని అందాలు
కాసులకు బలిజేసి
వెతలతో ఎగతాళి
కతలతో క్రుంగుతూ
.....
అవమాన భారాన
కదలివచ్చే పతిత
ముతక బ్రతుకును గాంచి
చెమ్మగిలిపోయెనా
చిరుగీతినయనాలు"

సినారె ఈ కవితా పంక్తులను చదివినపుడు అలిశెట్టి ప్రభాకర్‌చే వ్రాయబడిన -

"తనుశవమై .... ఒకరికి వశమై
తనువుపుండై .... ఒకరికి పండై
ఎప్పుడూ ఎడారై
ఎందరికో ఒయాసిస్సై"

'వేశ్య' అనే మినీకవిత గుర్తుకువస్తుంది. కర్షకులు, కార్మికులు, శ్రామికులు, కవులు, కళాకారులు, మేధావులు ఈ సమాజంలో తమప్రతిభకు, శ్రమకు సరియైన గుర్తింపు, ఆదరణ లభింపకపోవటంతో నిరాశా, నిస్పృహలకులోనై దిక్కుతోచక, గాఢాంధకారమైన జీవితపు పంజరాలలో చిక్కి మానసికంగా, శారీరకంగా కృంగి, కృశించి నశించి పోతున్నారనీ కవి ఆక్రోశిస్తున్నాడు. కవులు, కళాకారులు, కార్మికులు, కర్షకులు ఆదరింపబడని సమాజం ప్రగతి పథాన పయనించదని హెచ్చరిస్తున్నాడు.

"తన సుత్తెతో కొండ
లను బెండ్లుగా జేసి
ప్రస్తరమ్ములలోన
ప్రాణాలు వడబోసి
తమ కుంచెతో జగ

మ్మును పటాన కుదించి
జడపదార్థాలలో
చైతన్యమందించి
ఊహకందని సాగ
రోర్మికల పయనాలు
దృష్టి దూరగలేని
దినరాజనయనాలు
ఏకచిత్రాన రే
ఖా కల్పన మొనర్చి
ఎనలేని వర్ణనల
కేకరూపము దీర్చి
తన కలముతోడ సృ
ష్టిని నూతనమొనర్చి
మ్రోడువారిన మన
మ్ముల రసాలను జార్చి
వేనవేల యుగాల
లోని మానవకోటి
సభ్యతను కావ్యాన
శాశ్వతమ్మొనరించి
తన గానమున ప్రభా
తాల నామంత్రించి
శిశువులను పశువులను
శిరసెత్తి యాడించి
తన నాట్యమున జనుల
కనిమిషత్వము గూర్చి
లయతాండవాల కై
లాసాల మెప్పించి
తమ లలిత సుకళాసు
ధాసేచనము తోడ
మానవుని దేవతా
మాన్యునిగ మలిచే క
ళా స్రష్టలు సదా ని
రాశ్రయులుగా మారి
పటు నిరాశాలోహ
పంజరమ్ముల దూరి
చీకట్ల జీవింప
లేక సంఘర్షించి
వెలుతురుల నాశించి
విధికి యాక్రోశించి
కళదప్పిపడియుండ
గా జూచి నాగీతి
వ్యధితమై దీర్ఘని
శ్వాసమ్ము ప్రసరించె"

సామ్రాజ్యవాదులు తమ అధికార విస్తృతికాంక్షతో, ప్రపంచాన్నంతటినీ నిమిషములో భస్మీపటలమొనర్చు నంతటి పటుతరమైన అణ్వాయుధాలతో ఏ పాపం యెరుగని వివిధ దేశాల ప్రజల జీవితాలను దుఃఖ మయం చేస్తున్నారనీ, పచ్చని మానవజాతి సంస్కృతికి యుద్ధోన్మాదం కారుచిచ్చువంటిదనీ నిరసిస్తూ, శాంతి మార్గమే శరణ్యమని ఉద్బోధిస్తారు.

"సంపత్తిని కొల్లగొట్టి
సైన్యాలను కూడబెట్టి
పచ్చని దేశాల కారు
చిచ్చుల్లో కూలనెట్టి
మోహాలకు సంగ్రామ
వ్యూహాలకు దూరంగా
ఊపిరి పీల్చే చల్లని
జనపదాల గుండెలపై
అణుగోళాల కురిపించి
జనతాసౌఖ్యాల త్రెంచి
సామ్రాజ్యాలకు అర్రులు
సాచే పైశాచిక శ
క్తుల దాడుల కోర్వలేక
వెలుగుబాట కానలేక
తునిగిన తన పసిరెక్కల
తో మిన్నులకెగురలేక

చెదరి చెదరి పరుగెత్తే
శాంతి కపోతిని జూచి వి
షాద నిహతమై శిరమా
శ్వాసించెను నాగీతం."

పెట్టుబడిదారీ విధానం పైకి అందంగా కనిపించే పెద్ద ఊబి. దీని ముఖ్యవిధానాలు ఆకర్షణ, ప్రలోభాలు. ఈ విధానం కొన్ని వర్గాలకు చాలా ప్రయోజనకారిగా ఉండి ఇతరులని అనేక విధాలుగా ఇబ్బందులపాలు చేస్తూ ఉంటుంది. నూతన సామాజిక వ్యవస్థ నిర్మాణకోసం బయలుదేరిన అభ్యుదయ దృక్పథం ఈ పెత్తందార్లకు నచ్చదు. ప్రగతి నిరోధకులైన వీరెప్పుడు అసమసమాజాన్నే కోరుకుంటారనీ వీరు 'అభ్యుదయ నిరోధకులనీ, అస్త మయ పిపాసులూ' అనీ కవి అంటారు. తాడిత, పీడిత, క్షుధార్తుల రక్తాన్ని పీల్చిపిప్పిచేసే వీరి దురాగతాలను తీవ్రంగా గర్హిస్తారు.

ఒకవంక తిండిగింజలు దొరక్క పేదలు అన్నమో రామచంద్రా ! అంటూ ఆకలికి మలమల మాడి పిట్టల్లా రాలిపోతుంటే, మరొకవంక కృత్రిమ కొరతను సృష్టించి, ధాన్యాగారాల్లో నిలువచేసిన ధాన్యాలను నల్లబజారుల్లో అమ్ముకుంటూ కోట్లకు పడగలెత్తుతున్న చీకటి వ్యాపా రులు తమ పాపపుపసామ్మును అధికారుల లంచాలకూ, మఠాధిపతులకూ, రౌడీముఠాలకూ ఖర్చుచేస్తూ, పేదవాడి ప్రాణాన్ని రూపాయిల్లో కొలుస్తూ, అతడి జీవితంతో ఆటలాడుకుంటున్నారనీ, వీరు నిజమైన దేశద్రోహులనీ గద్దిస్తాడు.

"తిండిలేక దేశీయుల
గుండెల్లో కొనవూపిరు
లారిపోవ చీకటి బా
జారుల్లోపల ధాన్యా
గారాలను నిల్వబెట్టి
అధికారుల కళ్లు గట్టి
ప్రాణాలను రూకలతో
బరాబరిగ తూచివైచి
వంచనలకు, లంచాలకు,
మఠాలకూ, ముఠాలకూ,
మళ్లకొలది బంగారం
నీళ్లలాగ వెచ్చించే
దేశద్రోహులను గాంచి
దీపించెను నా గీతం
కోపించెను నా గీతం."

సమాజంలో అన్నదమ్ముల్లా కలిసిమెలసి తిరుగుతున్న ప్రజలలో మతోన్మాదాన్ని, వర్గవైషమ్యాలనూ రెచ్చగొట్టి తమ నీచ రాజకీయ ప్రయోజనాల కోసం, ఆ అమాయ కుల్ని పావులుగా వాడుకుంటున్న దుష్టరాజకీయ నాయకుల వికృత స్వరూపాన్ని వయసుమళ్ళినా గద్దెమీద మోజుచావక ఆ పీఠాన్ని పట్టుకువ్రేలాడుతూ నవతకు, యువతకు చోటివ్వని ప్రగతినిరోధకశక్తులైన వారి స్వార్థ బుద్ధిని కవి ఈ గీతంలో నిరసిస్తాడు. ధూర్తులనీ, తేనె పూసిన కత్తులనీ, స్వార్థంతో విషం చిమ్మే నాగులనీ ఆవేశంగా నిందిస్తాడు.

"మతం పేర మచ్చలేని
మానవతను రెచ్చగొట్టి
అన్నదమ్ములకు నడుమ
హాలాహలమంపించిన
మతకర్తలు, గతభర్తలు
ఓట్లకొరకు సీట్లకొరకు
కోట్ల ప్రజల మోసగించి
గద్దెలపై రాగానే
బుద్ధి గడ్డి తిన్నవాళ్లు
ఎదుటివారి కష్టాలను
చెదరగొట్ట ప్రయత్నించి
పెదవులపై దరహాసం
హృదయాల్లో విద్వేషం
పాదుకున్న స్వార్థపరులు
పయోముఖ విషాంతరులు
కలకాలంతామే అధి

కార పీఠమేలాలని
తలపండిన గానీ తమ
తారుణ్యం పోలేదని
నెరిసినట్టి మీసాలకు
నీలిరంగులనద్దించి
విస్సన్న వచించిందే
వేదంగా పరిగణించి
గతకాల మహాప్రవాహ
ఘర్షణలో ప్రక్కకొరిగి
వర్తమాన జలపాతం
నర్తనలకు కళ్లుతిరిగి
ప్రతినూతన సాంఘిక ప్ర
గతి నిరసించేటి నేటి
పౌరాతన్య జిగీషులు
నవతా యువతా ద్వేషులు."

ఇలా స్వార్థపరులతో, ధూర్తులతో, నయవంచకులతో, హంతకులతో, నియంతలతో నిండి క్రుళ్ళి కంపుకొడుతున్న ఈ లోకంపై తన కావ్యం ఆవేశంతో, ఉన్మాదంతో పిడుగుల వర్షం కురిపించగా ఈ సమస్త జగత్తు భస్మమై పోయిందని తనలోని ఆవేదనను, ఈ కుటిల ప్రపంచం పట్ల తను గల ఆవేశాన్ని వెల్లడిస్తారు సినారె. అలా మురికి కూపం వంటి ఈ లోకం నశించిపోగా -

"ప్రళయానంతర సమయం
మొలకెత్తిన సృష్టివోలె
భగ్గుభగ్గుమని మండిన
పాతజగత్తున లేచెను
క్రొత్తదనం చిగుళ్లుగా
మెత్తదనం గుబుళ్లుగా
వెచ్చదనం గుండెలుగా
పచ్చదనం గుత్తులుగా
రూపొందిన నవజగత్తు
లో పొంగిన సమతా సంగీతం."

కులమతాలకు, వర్గవైషమ్యాలకు, హెచ్చుతగ్గులకు, కక్షలూ కార్పణ్యాలకు, పెత్తందారీలకూ, దాస్యానికి, కుహనా రాజకీయవాదానికి తావులేని సమరసభావం, సమతావాదం, స్నేహసౌభ్రాతృత్వాలతో నిండిన, శ్రమకూ, కళకూ విలువనిచ్చే ఆనందభరిత సమాజం, ఎల్లలులేని మానవతను నింపుకున్న నూతనప్రపంచం ఆవిష్కరింప బడిందని అనటంలో కవికోరుకునేది ఎలాంటి సమాజమో మనకర్థమవుతుంది.

"జాతికులమతాలు చరమ
సంధ్యలోన తలదాచెను
జగమంతా ఒక కుటుంబ
ముగ కనువిందుగ దోచెను.
.....
జనులంతా సుందర భా
స్కర కిరణాలై పోవగ
జగమంతా వెచ్చని మో
దుగులు కిలకిలా నవ్వగ
ఆనందాశ్రువులు జలజ
లారాల్చెను నాగీతం
తన జీవితపూర్ణత కౌ
దలనూపెను నాగీతం"

ఇలాంటి మానవతా-సమతానిండిన సమాజాన్నిగని కవి కావ్యగీతం పులకించింది.

ముగింపు :

''విశ్వమానవ - హృదయాంతరాళాల్లోని చైతన్య జలపాతాల సవ్వడినీ, విప్లవజ్వాలల వేడినీ రంగరించి కవితా జగత్తులో మానవతాదృక్పథానికి మనోజ్ఞరూపాన్ని దిద్దుతున్న శిల్పి సి. నారాయణరెడ్డి. పద్యం నుండి గేయానికి, గేయం నుండి వచనానికీ అభ్యుదయాన్ని సాధిస్తూ పట్టింది. బంగారంగా, పలికింది కవిత్వంగా ప్రగతి సాధిస్తున్న కవి చంద్రులు రెడ్డిగారు. మనిషిలోని మమతను, బాధను, కన్నీటిని, మున్నీటినీ, అంగారాన్నీ, శృంగారాన్నీ, వియోగాన్నీ, విప్లవాన్నీ కవితలో కీర్తించడం

రెడ్డి గారి మతం'' అన్న జి.వి. సుబ్రహ్మణ్యం గారి మాటలు సినారె గారి "విశ్వగీత" కావ్యాన్ని పరిశీలించినపుడు అక్షర సత్యాలనిపిస్తుంది.

సమాజంలో పుట్టిన ప్రతివ్యక్తి స్వార్థచింతనను మానుకొని, వ్యక్తిత్వాన్ని అభివృద్ధిచేసుకొని, తనకూ, తన కుటుంబానికేకాక సమాజానికి ఉపయోగపడాలనే విశాల దృక్పథాన్ని, సమతాభావాన్ని, అభ్యుదయపథాన్ని, మానవతావాదాన్ని అభివృద్ధిచేసుకుంటే, సంకుచితభావాలను విడనాడితే జగమంతా ఒక యిల్లై, ఎల్లలన్నీ తొలగి, శాంతికపోతం యథేచ్ఛగా ఈ విశ్వయవనికపై విహరిస్తుందనే మహోన్నతభావాన్ని ఈ విశ్వగీతికావ్యంగా ద్వారా మనకందించి, మార్గనిద్దేశం చేశారు సినారె.

ఉపయుక్తగ్రంథ సూచి :

1. డా॥ ద్వా.నా. శాస్త్రి - తెలుగుసాహిత్య చరిత్ర
2. డా॥ సి.నారాయణరెడ్డి - డా॥ సి.నారాయణరెడ్డి సమగ్ర సాహిత్యం, మొదటిసంపుటం- విశ్వగీతి (గీతికావ్యం)

⌘⌘⌘

BHAVAVEENA
Vol. 17, Issue. 8, August 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

వేమన శతకం – మానవతా విలువలు

– డా॥. ఎం. ప్రభావతి

మన భారతీయ సంస్కృతి భవ్యమైనది, దివ్యమైనది. మన సంస్కృతి సాహిత్య సాంప్రదాయాలలో మానవతా విలువలు వెల్లివిరిసి ప్రతిబింబిస్తాయి.మానవులకు ముందుగా మానవత్వం అవసరం. మనుషుల్లో మాన వత్వం వుంటే లోకమంతా ఆనందంగా ఉంటుంది. మాన వత్వపు ఉత్తమ లక్షణం సహనం. ఓర్పు, సహనం, ఎప్పు డైతే కోల్పోతామో అప్పుడు మానవత్వం లోపిస్తుంది. ఏ సమాజంలోనైనా భిన్న నమ్మకాలు, విభిన్న తాత్విక దృక్ప థాలు ఉంటాయి. మనుషులు అందరిలో ఒకే విధమైన ఆలోచనలు వుండవు, విభిన్న మనస్తత్వాలు కలిగిన మను షులు ఇతరుల పట్ల మానవత్వం కలిగి ఉండాలి. నేడు ఎక్కువ మంది నైతిక విలువలు వున్నట్లు నటిస్తు న్నారు. వారిలో మానవత్వం మచ్చుకైనా కనిపించదు. మానవత్వం ఉంటే నైతిక విలువలు వాటంతట అవే వస్తాయి. కాబట్టి మనుషులకు మానవత్వం, సహృదయత ఉండాలి.

అశాశ్వతమైన వస్తువులపై మమకారాన్ని పెంచుకొని శాశ్వతమైన బంధాలను, కీర్తిని అవసరాలకు అర్థంగా మార్చే సుకుంటున్నాం. నిస్వార్థ భావంతో, త్యాగంతో నిగ్గ తేలే మన విలువలను పనికిరాని వస్తువులుగా భావి స్తున్నాం. మనిషి అశాశ్వతం మనిషికి హెూదానిచ్చే ఆడం బరాలు అశాశ్వతం. మనల్ని చిరస్థాయిగా చరిత్రలో నిలిచి పోయేట్లు చేసేవి మానవీయ విలువలే. అసలు మనిషికి మానవీయ విల్లువలే ఆస్తిపాస్తులు, అండదండలు, చెరగని చిరునామాలు.

మానవుడు ధనమును కోల్పోయిన ఏదో ఒక విధంగా శ్రమపడి ధనమును సాధించగలడు.కానీ మానవత్వపు విలువలను కోల్పోతే మరలా సాధించడం కష్టం. ముఖ్యంగా ఈ నాటి సమాజంలో మానవతా విలువలు కలిగిన మనుషుల అవసరం ఎంతో ఉంది. మానవతా విలువలు ఎక్కడో గ్రంథం నుంచి కానీ, గురువుల నుండి కానీ, బోధించబడి సాధించేటువంటివి కావు. మానవుని తోనే ఆవిర్భవించినటువంటివి. మన నిత్యజీవితము లోపల సత్యమైనటువంటి కర్మలను ఆచరించి,సత్యమైన భావములను మనము అభివృద్ధి పరచుకున్నపుడు, ఈ మానవతా విలువలు మన వెంట నీడలా వుండి మనలను కాపాడుతూ ఉంటాయి. మానవతా విలువలు మనకు సమాజంలో గౌరవ మర్యాదలు సంపాదించి పెడతాయి. విలువలతో కూడిన నడక ప్రతి ఇంటిలో, సమాజంలో ఉండాలి. శాంతి, ప్రేమ, అహింసలనే మానవతా విలువలు అందరూ ఆచరించాలి. మానవతా విలువలు లేని జీవితం పునాది లేని ఇల్లు వంటిది.

మానవతా వాదం గురించి కవుల నిర్వచనాలు :

"మనిషి చేసిన రాయికి రప్పకి మహిమ కలదని సాగి మొక్కుతు మనుషులంటే రాయి రప్పల కన్నా కనిష్టంగా చూస్తావేల బేలా" - గురజాడ.

"ఏ కలము వెన్నెలది? తుమ్మెద లెట్టి జాతికి చెందినట్టివి అట్టిదే కదా మానవత్వము అన్నిటికీ ఎతైన సత్యము" - సి. నారాయణ రెడ్డి.

"మీ ధ్వంస మనస్తత్వం లోంచే మిమ్ము సర్వ నాశనం చేసే మహాగ్రమానవతా విప్లవ శక్తి జనిస్తుంది"- దేవిప్రియ.

"మానవత్వం మాత్రం ప్రతి రోజూ ప్రతి క్షణం పుట్టి సచ్చే వెలుగు కిరణం. మానవత లేని లోకాన్ని స్తుతింప లేను మానవునిగా శిరసెత్తుకు తిరగలేను ఈ నాగరికతా రణ్యవాసం భరించలేను" - చెరబండరాజు.

"అహింసా పరమోధర్మ:"అన్నది మన వేదం. అదే మన వాదం. పరోపకారమే పుణ్యమని,పరులను పీడిం చడమే పాపమని అష్టాదశ పురాణాలు సారాంశం. నిరుపేదలకు, రోగులకు,అనాధలకు,ధైర్యం కోల్పోయి

భయపడుతున్న ప్రజలకు,ఆపదల్లో కొట్టుమిట్టాడే వారికి కాస్తంత ఊతమును,ధైర్యాన్ని,ఆశను, ఆత్మవిశ్వాసాన్ని కలిగించేదే మానవత్వం అంటారు పెద్దలు.

రచయిత పరిచయం :

శతక కర్తలు మానవుల జీవన విధానాన్ని కళ్ళముందు ఉంచారు. అన్ని భావజాలాలకు అనువైనది శతకం. తెలుగు కవిత్వంలో మానవ వికాసానికి ఆటపట్టు శతక వ్యాయమే అని చెప్పవచ్చు. సామాజిక రుగ్మతలను రూపు మాపడానికి తన పద్యాలతో విశ్వకవిగా యోగివేమన కీర్తి పొందారు. తెలుగు శతకాలలో వేమనకు మంచి గుర్తింపు ఉంది. ఈయన తెలుగు ప్రజల్లో ఒక మహాయోగిగా స్థిర స్థాయిగా నిలిచిపోయారు. మానవుల జీవిత సత్యాలను లోకానికి అందించిన మహానుభావుడు వేమన. చిన్నపిల్లలు మొదలుకొని పెద్ద వారి వరకు వేమన తెలియని తెలుగు వారు ఉండరు. వేమన శతక పద్యాలు వివిధ భాషల్లోకి అనువదింపబడ్డాయి. మొట్టమొదట వేమన పద్యాలను సి.పి.బ్రౌన్ 1829లో అచ్చు వేయించారు. అన్ని శతకాలు నీతిని భోధిస్తాయి. మనుషులు ఏ విధంగా ఉండాలి,ఏ విధంగా ఉండకూడదు అన్న విషయాలను తెలియ జేస్తాయి. నీతి శతకాలలో నుండి ఎవరికి ఏం కావాలో దాన్ని గ్రహించవచ్చు. మన మనస్సు లేదా అంతఃకరణం ఎప్పుడూ సవ్యంగానే ఉంటాయి. మనకు మంచినే చెబుతుంది.కానీ మనమే దాని మాట వినము. ఎప్పుడైతే మనసు చెప్పే మాట మనం వినమో అప్పుడే చిక్కులు వస్తాయి.

"భూమి నాది యనిన భూమి ఫక్కున నవ్వు
దానహీను జూచి ధనము నవ్వు...."

ఈ సృష్టిలో ఏదీ శాశ్వతం కాదు అన్న సంగతి మనుసు లందరికి తెలుసు కానీ ఈ భూమి నాది అని అంటే భూమి ఫక్కున నవ్వుతుంది.అలాగే ఎంత సంపాదించినా చివరికి చనిపోయేటప్పుడు మనతో ఏమీ రాదని తెలిసి కష్టాల్లో ఉన్న వారికి చిల్లిగవ్వ కూడా ఇవ్వకుండా ఉంటే ఆ ధనము నిన్ను చూసి నవ్వుతుంది అంటాడు వేమన. మానవతా దృక్పథంతో కష్టాల్లో వున్నవారికి నీకు తోచిన సహాయం చేసి తోటి మనస్సున్న మనిషిగా ప్రవర్తిస్తే బాగుంటుంది అని వేమన ఈ పద్యం ద్వారా తెలియ జేశారు.

'ధనము కూడబెట్టి ధర్మంబు చేయక
తాను తినక లెస్స దాచుగాక
తేనెటీగ గూర్చి తెరువరి కియ్యదా...."

తేనెటీగ ఎంతో కష్టపడి సంపాదించి దాచుకున్న తేనెను ఎవడో దారిన పోయేవాడు తన్నుకు పోయినట్లు, కూడ బెట్టిన ధనాన్ని తినక పోయినా, ధర్మం చేయక పోయినా, ఆ ధనాన్ని ఎవడో ఒకడు దోచుకుంటాడు.

నీవు బతికివున్నంత వరకు కష్టపడి సంపాదించిన ధనమును నువ్వు అనుభవించక,ఇతరులకు సాయం చేయక దాచి ఉంచితే నీవు పోయిన తరువాత ఆ ధనమును ఎవరు తీసుకుంటారో నీకు తెలియదు కదా!కావున నీవు జీవించినప్పుడే తోటివారికి నీకు చేతనైన సహాయం చేసి భువిలో స్థిరస్థాయిగా మానవత్వం వున్న మనిషిగా నిలిచిపో అంటారు వేమన. కావున మీకు వున్నదానిలో కాస్తా లేనివారికి మనస్సున్న మనిషిగా సాయపడు అని వేమన చూపిన మాట సత్యం.

"బొంది ఎవరి సొమ్ము పోషింప పలుమారు
ప్రాణమెవరి సొమ్ము భక్తి సేయ
ధనము ఎవరి సొమ్ము ధర్మమే తన సొమ్ము...."

నీది అనుకుంటున్నటువంటిది ఏదీ నీది కాదు. ప్రాణం వున్నంతవరకే ఆ శరీరం నీది. ప్రాణం ఎప్పుడు పోతుందో ఎవరికి తెలియదు. అలాగే ధనము కూడా నీ చేతిలో ఎంతవరకు వుంటుందో తెలియదు. నీకు తోచిన విధంగా పేదలకు దానధర్మాలు చేసిన యెడల నీవు పోయిన తరువాత కూడా ఆ ధర్మం కలకాలం నిలిచినిలిచి పోతుంది అంటారు వేమన.

"పరుల మోసపుచ్చి పరధన మార్జించుట" మానవత్వం కాదు అన్నారు.

"మేడి పండు చూడ మేలిమై యుండు
పొట్ట విప్పి చూడ పురుగులుండు"

అలాగే

"పురుషులందు పుణ్య పురుషులు వేరయా"
"నీతిగాని మాట రాతి వేటు"

ఇటువంటి పద్యాలలో వేమన మనిషి యొక్క వ్యక్తి త్వాన్ని తెలియజేసారు.

ఉచితానుచితాలు, సమయోచితాలు మనిషి వ్యక్తి త్వాన్ని తీర్చిదిద్దుతాయి. మన వ్యక్తిత్వాలు మన చుట్టూ వున్న స్నేహితులు,బంధువుల్ని బట్టి వెల్లడవుతుంటాయి. మంచివారితో స్నేహం చేయడం వలన మనల్ని ఉత్త ములుగా తీర్చిదిద్దుకోవచ్చు.

"దానములను సేయధర చేతులాడక
బహు ధనంబు గూర్చి పాతిపెట్టి
తుదును దండుగనిడి మె లదలు చెడు నరుడు....."

మనిషి ఆశకు హద్దులుండవు. అపార ధన రాశులను సంపాదిస్తాడు, కానీ విచిత్రం ఏమిటంటే దానధర్మాలు రూపంలో ఒక్కపైసా అయినా విదిల్చడు. పైగా వాటిని భూమిలో పాతి పెడతాడు. అతడు దానాలు చేయ్యక, అపరాధం చేశాడు. అపరాధికి ద్రవ్య శిక్ష తప్పదు. అంతే కాకుండా దానం చేస్తే పుణ్యం లభిస్తుంది. పుణ్యం కలగని అతని జీవితం నిర్మూలమైపోయింది. కాబట్టి సంపా దించిన దానిలో కొంతైనా నలుగురికి సాయం చేయడం మంచిది అనేది వేమన అభిమతం.

"వాక్కు శుద్ధి లేని వాడు చండాలుడు
ప్రేమ శుద్ధి లేక పెట్టు బెట్లు"?

చండాలుడంటే మాటలో స్వచ్ఛత లేని వాడు, స్నేహంలో పవిత్రత లేని వాడు. ఈ రెండు లేక ఎంత దానం చేసినా దానివల్ల ప్రయోజనం లేదు. దేనికైనా మనస్సునందు త్రికరణశుద్ధి ముఖ్యం అంటారు వేమన.

'పక్షి మీద నొక్క వృక్షము పుట్టెను
వృక్షము పదమూడు విత్తులయ్యె...."

ఒక పక్షి వలన ఒక చెట్టు పుట్టి పెద్ద వృక్షము అవు తుంది. ఆ వృక్షము వలన మరెన్నో వేల వృక్షాలు పుడు తాయి. అలాగే మనుషులు అన్న వాళ్ళు ఒక మనిషికి సాయం చేస్తే ఆ మనిషి మరికొంతమందికి సహాయం చేస్తాడు. అలాగే మనుషుల్లోని మానవత్వం లోకం అంతా వ్యాపించి దయా, ప్రేమ, శాంతి, సౌఖ్యాలు కలిగిన సమాజం ఏర్పడుతుంది అని వేమన తెలియజేసారు.

"చంపదగినయట్టి శత్రువు తనచేత
జిక్కెనేని కీడు చేయరాదు
పొసగు మేలు చేసి పొమ్మనుటే చాలు...."

శత్రువుకి కూడా హాని చేయవద్దు. అందరూ ఇలా ఉంటే సమాజంలో శాంతి సౌభాగ్యాలు మెండుగా ఉంటాయి. చంపేటటువంటి కోపం వున్న శత్రువు నీ చేతికి దొరికినా ఓర్పు,సహనంతో మానవత్వం వున్న మనిషిగా అతనికి కీడు చేయ్యకు. అతనికి నీవు మేలు చేసి వదిలి పెట్టటం మంచిది. ఇది నిజమైన మానవత్వం అంటారు వేమన.

విద్య, సంపద, అంతస్తుల వల్ల వినయగుణం అలవడాలి తప్ప "అహం" పనికిరాదు.అందుకే వేమన "అనువు గాని చోట అధికులమనరాదు" అన్నారు.

మరొక సందర్భంలో "స్థాన బలిమి కాని తన బలిమి కాదయా" అన్నారు.

అలాగే మనిషికి మాటే ప్రాణం, మాటలకి ఎంతో విలువ ఉంది. మాటలు నైతిక స్థాయికి ప్రతీకలు.అబద్ధపు మాటలు మనిషి వ్యక్తిత్వానికి మాయని మచ్చలు.కాబట్టి మనిషి అన్నవాడు నైతిక విలువలతో కనీస ధర్మాన్ని ఆచరించి, మానవత్వంతో మెలగాలి. తమ తోటి వారిని తక్కువ వారని, ధనం లేని వారని కించపరచకూడదు.

"పెట్టిపోయలేని వట్టి నరులు భూమి
పుట్టనేమి వారు గిట్టనేమి
పుట్టలోన జెదలు పుట్టవా గిట్టవా"

ఎదుటి వారికి సహాయము చేయనివాడు పుట్టినా చచ్చినా ఒకటే. పుట్టలో చెదలు పుట్టినా,చచ్చినా ఎవరు పట్టించుకోరు కదా! కావున మనిషి జీవితం నీటి బుడగ లాంటిది.ఎన్ని రోజులు ఉంటామో తెలియదు.కాబట్టి మనకు ఉన్నంతలో ఎదుటివాటికి సాయం చేద్దాము. మానవత్వం అనేది మంచి మనిషికి ఉండాల్సిన లక్షణం అని ప్రజలకి తెలియపరిచిన గొప్ప కవి వేమన.

పామరులకు సైతం అర్థమయ్యే రీతిలో పద్యాలు, గీతాలు ఆలపించి విశ్వకవిగా, యోగివేమనగా ప్రజల గుండెల్లో నిలిచిపోయారు. వేమన పద్యాలతో ప్రజల హృదయాల్లోకి వెళ్లిన జనకవి యోగివేమన. పండిత, పామర భేదం లేకుండా వేమన పద్యాలు వినని తెలుగు వారు లేరంటే అతిశయోక్తి కాదేమో. అంతగా ఆయన పద్యాలు జనబాహుళ్యంలోకి చొచ్చుకుపోయాయి. ఆయన రాసిన ప్రతి పద్యం ఒక ఆణిముత్యమే. సమాజంలో పాతుకు పోయిన రుగ్మతలపై తన కలాన్ని ఎక్కుపెట్టిన సామాజిక విప్లవకారుడు, మానవతావాది, సమాజంలో జరిగినటు వంటి విషయాలనే ప్రజలకు తెలియజేసిన ప్రజాకవి యోగి వేమన.

ముగింపు :

వేమన హితవులు లోకోక్తులయ్యాయి. ప్రజల నిత్య స్మరణతో అవి చిరంజీవులై నిల్చాయి. మానవుడిలో మానసిక మార్పు తేవడం చాలా ముఖ్యమైనది అని వేమన అంటారు. మనుషులు నూదిలా ఉండకూడదని, దారంలా ఉండాలని,సూది పని రంధ్రాలు చేయడమే కానీ దారం ఆ రంధ్రాలన్ని పుడుస్తూ వెళ్తుంది. అలాగే ఈ లోకంలో మానవుడు ఇతరులకు చేసిన మేలే అతనికి నిజమైన సంపద అని గొప్ప వ్యక్తులు ప్రభోదం చేశారు.

శ్రీరాముడు, శ్రీకృష్ణుడు, దధీచి, శిబిచక్రవర్తి వంటి మహాపురుషులెందరో నాడు మానవత్వపు విలువలకు పట్టంగట్టారు, ప్రాణం పోశారు. అంతరిస్తున్న మానవతా విలువలను చిగురింపజేస్తూ ప్రతి యువతీ,యువకుడు నిండుమనస్సుతో ముందుకు వచ్చి మంచి మనిషీగా ఎదగాలని కోరుకుందాం. మానవత్వపు విలువలు,నైతిక విలువలుతో కూడిన విద్యను పాఠశాల స్థాయి నుండి పిల్లలకి బోధించాలి. నీతి కథలను, మహనీయుల జీవిత చరిత్రలను తెలియజేయడం వల్ల సమాజంలో మంచి వారుగాను, మానవత్వం కలిగిన మనుషులుగా జీవిస్తారు.

ఆధార గ్రంథాలు :

1. వేమన శతకం - వేమన
2. ప్రజాకవి వేమన - ఆచార్య .ఎన్. గోపి.

⌘⌘⌘

BHAVAVEENA
Vol. 17, Issue. 8, August 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

ఉత్తరాంధ్ర గిరిజనుల జీవనం – సమకాలీనత

– డా॥. ఎం. ప్రసాదరెడ్డి, తెలుగు అధ్యాపకులు, యస్.వి.ఆర్ట్స్ కళాశాల, తిరుపతి.

మనిషి ప్రాథమిక సంస్కృతి దశను తెలియజేసేది ఆది మానవుని జీవన స్థితి. కాలక్రమంలో ప్రకృతిలో వచ్చిన పెనుమార్పులమూలంగా ఆదిమానవుని ఆలోచనా సరళి అతన్ని సంఘజీవిగా మార్చింది. ఈ ఆది మానవుని వికాసం ఆటవిక యుగంకు దారితీసింది. ఈ యుగంలో మానవుడు ఒంటరి జీవితాన్ని వదలిపెట్టి సామూహికంగా జీవించడం నేర్చుకున్నాడు. పనిముట్ల సహాయంతో కొత్త జీవితానికి నాంది పలికాడు. ఇలా ఆది మానవునిలో ఏర్పడిన ఈ వికాస దశను మోర్గాన్ 'ఆటవికయుగం'గా చెప్పాడు. నేటికీ కొన్ని తెగలు అడవుల్లోనే నివసిస్తూ ఆదిమ కాలంనుంచి పరంపరగా వస్తున్న తమ సంస్కృతిని పరిరక్షించుకుంటూ ఇంకా నాగరిక ప్రపంచానికి దూరంగా కొండకోనల్లో, అడవుల్లో నివసిస్తూ ఆదిమ సంస్కృతిని పాటిస్తున్నారు. వారినే గిరిజనులు అంటున్నారు. ఒక ప్రత్యేక భూభాగంలో నివసిస్తూ ప్రత్యేక సంస్కృతి లక్షణాలున్న ప్రజలను 'సమూహం', 'తెగ' లేదా 'గిరిజనులు'గా పరిశోధకులు పేర్కొంటున్నారు. వీరిని ఆదిమ జాతులు లేదా అణగారిన జాతులని ఆర్థర్ విల్కే అభివర్ణించాడు.

ఉత్తరాంధ్ర గిరిజనులు :

ఆంధ్రదేశంలో అంధ్, భగవత్, భిల్, చెంచు, గోండ్, జాతాపు, కొండకాపు, కోయ, నాయకులు, సవరలు, యానాదులు, ఎరుకల, నక్కల వంటి ముప్పై ఐదు రకాల గిరిజన తెగలున్నాయి. వారు అరణ్యాల్లో నివసిస్తూ ఒక ప్రత్యేకమైన జీవన శైలిని కలిగియున్నారు. అయితే వారు నాగరిక ప్రపంచానికి దూరంగా ఉంటున్నా, నేటి ఎన్నో సమకాలీనతాంశాలకు ఆకరంగా ఉంటూ మనుగడ సాగిస్తున్నారనవచ్చు. అయితే కొన్ని తెగలు మాత్రం సమకాలీనతకు దగ్గరగా జీవిస్తున్నారనకతప్పదు.

నాటి నేటి మానవుల ప్రాథమిక అవసరాలు కూడు, గూడు, గుడ్డ. పురాతన కాలంలో ఆది మానవుడు చాలా కాలం గుహల్లోనే తలదాచుకొన్నట్లు మనకు చారిత్రక ఆధారాలవల్ల తెలుస్తున్నది. తర్వాత చెట్టు తొర్రల్లో తలదాచుకొన్నాడు. వీటి తర్వాత పర్ణశాలల నిర్మాణం జరిగింది. వ్యవసాయం, పశుపోషణ చేపట్టిన ఈ తెగలు క్రమేణ మైదానాలలో నివసించవలసి వచ్చింది. చిన్నచిన్న గుడిసెల్ని నిర్మించుకొనే సంస్కృతి అప్పుడే ప్రారంభమైందనవచ్చు. తరువాత గృహాల్ని నిర్మించుకోవడానికి కావలసిన ఇటుకల్నివాడుకున్నారు. ముఖ్యంగా గృహాల్ని నిర్మించుకొనేందుకు ఎక్కువగా కలప, దబ్బ, గడ్డి, ఈత గడ్డి, కోపరిగడ్డి, ఈతాకు, తాటాకు వంటి వస్తువుల్ని మాత్రమే మొదట్లో వినియోగించుకున్నారు. ఆ అనుభవాలే తరువాత వాస్తు శాస్త్రానికి దారి తీయవచ్చు.

గిరిజనులు - జీవన విధానం :

ఉత్తరాంధ్ర ఆదివాస ప్రాంతంలో నివసిస్తున్న ముఖ్యమైన తెగలు, గదబలు, జాతాపులు, కొండదొర, కోంధ్, కోటియా, పోర్జ, సవర, ఎరుకల. మన్నెదొర, మూకదొర, భగత, వాల్మీకి, కొండదొర, కొండ కమ్మర. వీరిలో గదబలు, జాతాపులు, సవరలు, భగతలు, వాల్మీకిలు, కొండదొర, మన్నెదొరలు, మూకదొరలు వ్యవసాయం, పోడు వ్యవసాయం మీద ఆధారపడి జీవిస్తున్నారు. మొదటినుండి వాల్మీకులు వ్యాపారానికి అలవాటుపడిన తెగ కాబట్టి వారి సంస్కృతి కొంత నాజూకైనది. ఈ భగత, కొండదొర, కొండ కమ్మర తెగల జీవితం కూడా కాస్తా ఫర్వాలేదనిపిస్తుంది. కోందు, పోర్జ, గధబ, సూకదొర తెగలు పోడు వ్యవసాయానికి అలవాటు పడ్డారు. కాబట్టి వీరి సంస్కృతి మోటైనది. ఇదే జీవన సరళి వీరి గృహ నిర్మాణంలో కూడా కనిపిస్తుంది. అనంతగిరి, అరకు,

పాడేరు, జి.మూడుగల, కొయ్యూరు మండలాల్లో జీవిస్తున్న భగతలు, వాల్మీకులు, వ్యాపారస్తులు మరియు ముఠాదార్లకు లెక్కలు రాసే కరణాలుగా ఉన్నారు. వీరి సంస్కృతిలో నాగరికత ఛాయలు కనిపిస్తాయి. అయితే కొండప్రాంతాల్లో జీవించే భగత్ వాల్మీకి తెగలలో ఆ ఛాయలు కనిపించవు. రామమందిరంలో భజనలు, పూజలు చేయడం వీరి సంప్రదాయం. వీరి జీవితంలో నాగరికత ఛాయలు కనిపించవు. అయితే రోడ్డుపక్కన, మైదాన ప్రాంతాలకు దగ్గరలో నివస్తున్నవారిలో కొంతమేరకు నాగరికతా ఛాయలు కనిపిస్తాయి. పరిశీలనాత్మకంగా, పరిశోధనాత్మకంగా చూస్తే వివిధ గిరిజన తెగలు మధ్య అంతరాలు, సామ్యాలు కనిపిస్తాయి.

కోందులు ఆదిమ ఆదివాసీలు. వీరు గోమాంస భక్షణ చేయడం వల్ల ఇతర తెగలకు దూరంగా జీవిస్తారు. వీరు ఏ తెగవారితోనూ కలిసి జీవించడానికి అవకాశం ఉండదు. దీనికి ప్రధాన కారణం వీరు పరిశుభ్రంగా ఉండకపోవడమే. అందువలన వీరు ఆత్మన్యూనతకు లోనవుతున్నారు. వీరి గృహనిర్మాణ పద్ధతి సామూహిక గృహనిర్మాణం. గృహాలు నిర్మాణ పద్ధతి సామూహిక గృహనిర్మాణం. వీరు ఒకే వరుసలో గృహాలు నిర్మించుకొని జీవిస్తుంటారు. వీరి గృహనిర్మాణంలో ఇటువైపు ఒకటి, అటువైపు ఒకటి రెండు రాటలు పాతి వీటి మధ్యలో పెద్ద కర్రను కడతారు. ఈరెండు రాటల (స్తంభాల)కు ఆసరాగా కుడి ఎడమలకు రెండేసి చిన్నచిన్న రాటలు పాతి వీటిద్వారా వాసాలు వేలాడదీస్తారు. వాటిని రివ్వలతో అడ్డతాళ్ళతో కట్టి దాన్ని ఈతగడ్డి, దబ్బ గడ్డితో నేస్తారు. వీరు ఎక్కువగా పోడు వ్యవసాయం చేస్తారు. ఆ సంచారం చేస్తారు. ముఖ్యంగా వీరు సంచార జీవులు. ఆ సంచారం మొత్తం అడవిలోనే సాగుతుంది.

సాధారణంగా ఆదివాసీలు సమిష్టికుటుంబ జీవనానికి అనువుగా ఉండేవిధంగా గృహనిర్మాణం చేసుకుంటారు. వీటిని గుడిసెలు లేదా పాకలుగా వ్యవహరిస్తారు. కొందరు చుట్టుపాకలు (గుండ్రంగా ఉండేపాకలు) నిర్మించుకుంటే మరికొందరు నిటారుపాకలు (నిలువుపాకలు) నిర్మించుకుంటారు. ఈపాకల చుట్టూ కవుల్ని దగ్గర దగ్గరగా పాతి, వెదురు దబ్బలతో దడి కట్టి దాన్ని మట్టితో మెత్తి వాటిని గోడలుగా తయారు చేసుకుంటారు. వాన నీరు పాక చుట్టూ రాకుండా కాలువ తవ్వుతారు. దబ్బగడ్డితారు కాలువ తవ్వుతారు. ఉత్తరాంధ్ర ఆదివాసీలు ముఖ్యంగా దిబ్బగడ్డితారు ఈతగడ్డితో, వూతిక గడ్డితో ఇల్లు నిర్మించుకొంటారు. ఉత్తరాంధ్రలో ఎక్కువ ఆదివాసీ తెగలు పోడు వ్యవసాయం చేస్తారు. శ్రీకాకుళం జిల్లాలో ముఖ్యమైన ఆదివాసీలు గదబలు, జాతాపులు, కొండ దొర, కోంధ్‌లు, కొటియా, పోర్జ, సవరలు - పోడు వ్యవసాయంతోపాటు అటవీ ఉత్పత్తుల్ని సేకరించి వాటిద్వారా వచ్చిన సొమ్ముతో తమ జీవనాన్ని సాగిస్తారు. ఎరుకల వారు మాత్రం వెదురుతో బుట్టలు అల్లడం, ఎలుకల్ని పట్టడం, పందుల్ని పెంచడం, తాళ్ళు పేనడం వంటి వృత్తుల్ని చేస్తారు. ఎన్ని చేసినా వీరు నేటికీ మైదాన ప్రాంతాలకు వచ్చి జీవించడానికి ఇష్టపడటం లేదు. వారిని రప్పించటానికి ప్రభుత్వాలు చేసిన కృషి కూడా పెద్దగా లేదనవచ్చు.

ఈ ఆదివాసీ తెగలు ఒకో చోట కలసి మెలసి ఉండాల్సిన పరిస్థితి వస్తే ఒక్కొతెగవారు ఒక్కో వీధిలో నివసిస్తారు. శ్రీకాకుళం జిల్లాలో జాతాపులు, గదబలు, సవరలు, కోంధ్‌లు ఒకే గ్రామంలోనే జీవిస్తుంటారు. విజయనగరం జిల్లాలో గదబలు, జాతాపులు, సవరలు, యెన్నదొరలు, మూక దొరలు కలిసి ఒకే గ్రామంలో జీవిస్తారు. విశాఖ పట్టణం జిల్లాలో ఎక్కువుగా భగత్, వాల్మీకి, కొండదొర, పోర్జ, కొటియ, కొండకాపు ఒకే గ్రామంలో కలసి మెలసి ఉంటారు. తక్కిన తెగలవారు ప్రత్యేకంగా విడిగా నివసిస్తారు. అక్కడ ఆ తెగవారు తప్ప ఇతరులు ఉండరు. మీరు కూడా చేర్చుకొనుటకు ఇష్టపరు.

గిరిజనులు వేట - వ్యవసాయం :

ఆదివాసీల జీవితంలో అత్యంత ప్రధానమైనది వేట. వీరు అటవీజంతువులను వేటాడి వాటిని ఆహారంగా

స్వీకరిస్తారు. తిండిగింజలకు మాత్రం పోడు వ్యవసాయం చేస్తారు. వీరికి అడవిలోని అణువణువు తెలుసు. కొన్ని తెగలవారు వేటకు వెళ్ళేముందు పండుగ జరుపుతారు. ఈ పండుగలో ప్రధానాంశం కోడిగుడ్డిదే. వాళ్ళు కోడి గుడ్డను తీసికొని దానిని ఒక ఫర్లాంగు దూరంలో నున్న ఒక ఎత్తైన రాతిపై ఉంచుతారు. వేటకు వెళ్ళే ప్రతివారూ వయసుతో నిమిత్తం లేకుండా వింటి బద్దకు కోలను సంధించి గురిచూసి కొడతారు. అలా కోడిగుడ్డును ఛేదించిన వ్యక్తి అడవిలో జంతువుల్ని కొట్టినట్లుగా భావించి ఆ రోజు వేటలో ఆ వ్యక్తికి రెండు భాగాలు అదనంగా కేటాయిస్తారు. ఈ వేటలో ఒక గ్రామంలో ఉన్న అన్ని తెగల ఆదివాసులూ కలసికట్టుగా జట్టుగా వెళ్ళి వేటాడుతారు. వేటకు వెళ్ళేముందు వారి కులదేవతలైన గంగాలమ్మకు, సంకుదేవుడికి మొక్కి ఆకులతో వున్న పచ్చి రెమ్మల్ని విరిచి, దేవత మీద వేసి తాము వెళుతున్న పనికి ఎలాంటి ఆటంకాలు కలుగకుండా చూడాలని మొక్కుకుంటారు. వేటాడే సమయంలో వేట కోసం వెళ్ళిన వారు మూడు జట్లుగా విడిపోతారు. వీరిని 'కాపర్లు', 'పోకరు', 'వెనుకండ్లు' అని పిలుస్తారు. వీరు మూడు జుట్లగా విడిపోయి ఏ జట్టు తాము చేయాల్సిన పనిని నిర్ణయించుకుంటారు. కాపరులు విల్లుకు కోలను సంధించి ఎంత దూరం గురిచూసి కొట్టగలరో అంతదూరం కాపుకాసి ఉంటారు. వెనుకర్లు, సోపర్లు జంతువులంటే ప్రదేశాన్ని కనిపెట్టి ఆ గుంపుపై రాళ్ళు వేస్తారు. తరువాత డప్పులు వాయిస్తూ, గట్టిగా అరుస్తూ వాటిని భయపెడతారు. తమకు కనిపించిన జంతువు పేరు చెప్పి కాపరులను పురిగొల్పుతారు. ఎవరైనా జంతువుకు తగలకుండా బాణం వేస్తే వారిని తిడతారు. అలా వేటాడి చంపిన జంతువును ఎత్తైన బండపైకి చేర్చి దాన్ని భాగాలుగా కోసి పంచుకుని ఇంటిమొకంపడతారు. వీరికి జంతువు దొరికిందంటే పండుగే. వీరు దుప్పి, కణితి, అడవిపంది, కొండ గొర్రెలను వేటాడుతారు. అందరూ కలసికట్టుగా వెళ్ళి అలాగే తరిగి తమ గూడేలకు వస్తారు.

ఇలా గిరిజనులు సమకాలీనతను అనుసరిస్తూనే వారిదైన సాంస్కృతిక శైలితో జీవనం సాగిస్తున్నారు.

ఉపయుక్త గ్రంథాలు :

1. భారతదేశం - గిరిజన సముదాయాలు - ఎం. సూర్యనారాయణ, తెలుగు అకాడెమి, హైదరాబాద్, 1983.
2. ఆంధ్రుల జానపద విజ్ఞానం - ఆర్వీఎస్ సుందరం, పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, ప్రచురణ, 1983
3. విశాఖపట్నం జిల్లా గిరిజన విజ్ఞానం - ఒకపరిశీలన - డా॥ జర్రు అప్పారావు.
4. సవర గిరిజన సరళి - టి. వెంకటరావు
5. గిరిజన సాహిత్యం - ఆచార్య ఎం.గోనా నాయక్, తెలుగు అకాడెమి, హైదరాబాద్, డిసెంబరు 2012.
6. తెలుగువాణి - నాల్గవ ప్రపంచ తెలుగు మహాసభల ప్రత్యేక సంచిక, పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్, డిసెంబరు 2012.

⌘⌘⌘

BHAVAVEENA
Vol. 17, Issue. 8, August 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

తొలి తెలుగు వీధి నాటకం – క్రీడాభిరామం

– డా॥. మూల మల్లికార్జునరెడ్డి, అసోసియేట్ ప్రొఫెసర్, లలిత కళల విభాగం, యోగి వేమన విశ్వవిద్యాలయం, కడప.

క్రీడాభిరామం ఇప్పటి వరకు మనకు లభిస్తున్న తెలుగు నాటకాల్లో మొట్టమొదటిది. వీధి అనే రూపక శాఖకు చెందిన రచన. వినుకొండ వల్లభ రాయుడు రాశాడు. దీన్ని కడప జిల్లాలో ఉన్న మోపూరు భైరవేశ్వరుని తిరునాళ్లలో ప్రదర్శించారని కవి స్పష్టంగా చెప్పాడు. వినుకొండ వల్లభరాయుడు కడప జిల్లా పులివెందుల తాలూకాలో నున్న మోపూరు గ్రామ నివాసి. విజయ నగరం రాజుల పాలనలో ఉన్నత పదవిలో ఉన్నాడు. విజయనగర రాజుల ప్రాపకం సంపాదించాలన్న కోరికతో శ్రీనాథుడే క్రీడాభిరామాన్ని రాసి వల్లభరాయుని పేరుతో వ్యవహరింపజేశాడనే ఒక కథ ఉంది. దీనిపైన చాలా చర్చ జరిగింది. చివరకు వల్లభరాయుడే కృతికర్త అని తేల్చడం కూడా జరిగింది.

క్రీడాభిరామ అవతారికనుబట్టి, భరత వాక్యాన్ని బట్టి అశ్వాసాంత గద్యను బట్టి ఇది వల్లభరాయుని కృతమని తెలుస్తుంది. "ప్రత్యక్షమొనరించి భైరవస్వామిచే శుద్ధ సారస్వత శ్రీ వరించె" అనుటచే వల్లభరాయుడు మోపూరి భైరవ స్వామి మీద అనేక స్తుతులు, పద్యాలు రాసినట్లు విదితమవుతుంది. అవతారికలో పెక్కు పద్యాల్లో వల్లభ రాయుని వాగ్వైభావాలు, చాటు కవితా పాటవం వర్ణించ బడింది. 'ఇది శ్రీమన్మహామంత్రిశేఖర వినుకొండ తిప్పయా మాత్యనందన చందమాంబా గర్భ పుణ్యోదయ సుకవి జనవిధేయ వల్లభరాయ ప్రణీతంబైన క్రీడాభిరామంబను వీధి నాటకంబును సర్వంబు నేకాశ్వాసము' అని గ్రంథాంత గద్యనుబట్టి కూడా ఇది వల్లభరాయ కృతమని నిర్ధారణవుతుంది. నాటక నేపథ్యంగా ఈ నాటకాన్ని చర్చించవలసిన అవసరముంది.

తెలుగులో లక్షణయుక్తమైన మొట్టమొదటి రూపకం ఇదే! రెండవ ప్రతాప రుద్రుని కాలం (క్రీ.శ. 1295-1393)లో ఓరుగల్లు వట్టణ వైభవ మెట్లున్నదో తెలిసికొనుటకు క్రీడాభిరామం తోడ్పడుతుంది. కాకతీ యుల నాటి సాంఘిక పరిస్థితులు జనజీవనం, సంఘ దురాచారాలు, వినోదాలు మొదలైన అనేక విష యాలు క్రీడాభిరామం వల్ల తెలియుచున్నవి. అందువల్లనే తెలుగు సాహిత్యంలో దీనికొక ప్రత్యేక స్థానముంది. ఏ రచననైనా ప్రజలకు సన్నిహితంగా, వారి సమస్యలను ప్రస్తావిస్తూ రచింపబడినపుడే ప్రజలు దాన్ని ఆదరిస్తారు.

క్రీడాభిరామం స్వతంత్ర రూపకం కాదు. రావిపాటి త్రిపురాంతకుడు సంస్కృతంలో రాసిన ప్రేమాభిరామాన్ని అనుసరించి వల్లభరాయుడు క్రీడాభిరామం అనే పేరుతో వీధినాటకంగా అనువదించారు. త్రిపురాంతకుడు రెండవ ప్రతాపరుద్రుని కాలం వాడు. కావుననే కాకతీయ సామ్రాజ్యానికి రాజధానియగు ఓరుగల్లు నగరాన్ని ఉన్న దున్నట్లు వర్ణించాడు. వల్లభరాయుడు 15వ శతాబ్దం వాడు. ఆయన కాలానికి ఓరుగల్లు తురుష్కుల వశమైంది. ప్రేమాభిమానంలో ఉన్న వర్ణనలే క్రీడాభిరామంలో ఉన్నాయి.

క్రీడాభిరామం అవతారికలో ఇలా ఉంది.

తే॥గీ॥ గణన కెక్కిన దశరూపకముల యందు
వివిధరసభావ భావనా వీథి లెస్స
యే కవీంద్రుడు రచియించె నీ ప్రబంధ
మనుచు మీ రానతిచ్చెదరైన వినుడు

- క్రీడాభిరామం - 1

ఈ పద్యాన్ని బట్టి ఇది వీధి రూపకమనే స్పష్టమవు తుంది. పద్యమందలి 'ప్రబంధ' మనే పదం కొందరికి అనుమానం కల్గించవచ్చు. మనకు ప్రబంధమనగానే అల్లసాని పెద్దన మనుచరిత్ర, నందితిమ్మన పారిజాతా పహరణం, కృష్ణదేవరాయల ఆముక్త మాల్యద మొదలైన

ప్రబంధాలు గుర్తుకొస్తాయి. 'పెద్దనయే ప్రథమాంధ్ర ప్రబంధకర్తయా?" అనే వ్యాసంలో సుబ్రహ్మణ్య కవి గారు 'ప్రబంధ మనునది సర్వగ్రంథ వాచకము. భాగవత - రామాయణాదులు, నాటకములు మొదలగు వన్నియును ప్రబంధములే అనబడును' అన్నారు. అందువల్ల ఇచ్చటి ప్రబంధానికి నాటకం లేక రూపకమని మాత్రమే అర్థం. తర్వాత 'సర్వంబు నేకాశ్వాసము అన్నాడు కవి." ఇక్కడ కూడా వీధి రూపకాన్ని రచిస్తున్నానని చెప్పిన వల్లభ రాయుడు 'ఏకాశ్వాసమని' రాసే ప్రసక్తే లేదు. 'సర్వంబు ఏకాంకమనే రాసివుంటాడు'. ఆనాటి రాయసగాళ్లు అలా పొరపాటున రాసి ఉండవచ్చు.

లక్షణ సమన్వయం :

వీధి యందు ఒకటి లేక రెండు పాత్రలుండాలి. క్రీడాభిరామంలో గోవింద మంచన శర్మ అతని స్నేహితుడు టిట్టిభశెట్టి - ఈ రెండు పాత్రలు ప్రధానమైనవి. మరికొన్ని పాత్రలు రంగం మీదకు వచ్చినా మాటల్లేవు. "వీధి సర్వరససమ్మిళితం" అనే దాన్ని బట్టి ఇందు శృంగారం ప్రధానమైంది. తక్కిన రసాలు ఆయా సంద ర్భాల్లో ఉన్నాయి. ఇది శృంగార మగుటచే ఇందలి నాట్య వృత్తి కైశికి అనీ ఆయా రసాలు ప్రసక్తములైనపుడు ఆయావృత్తులు కలవని చెప్పవచ్చు. నాయకుడు గోవింద శర్మ, బ్రాహ్మణ శ్రేష్ఠుడు. అయిన ఇతను జారుడు కనుక అధమపాత్రే అవుతాడు. నాయిక కామమంజరి. రెండవ వివాహం చేసుకొన్నది. అందువల్ల నాయిక నాయికోచితం గానే ఉంది. ఇది సర్వంబు ఏకాంకం. ఇక్కడ కృత్య వతరణిక, ప్రస్తావన, కథ అనే మూడు భాగాలున్నాయి. చివర్లో భరత వాక్యాన్ని బోలిన రెండు పద్యాలున్నాయి. కథా వస్తువు ఒక రోజుకు సంబంధించినది. అందువల్ల ఇతివృత్తం అల్పమగుట స్పష్టమే. క్రీడాభిరామంలో కథలేదు. అర్థప్రకృతులు, సంధులు నిరూపించుట కష్టం. లాస్యాంగాలను కూడ స్పష్టంగా చెప్పేటందుకు వీలు లేకున్నా ఆయా వనితల విలాసాదులు వర్ణితములై నందున లాస్యచ్ఛాయలు గలవని చెప్పవచ్చును. ఈ విధంగా వీధి లక్షణాలన్ని దాదాపుగా క్రీడాభిరామానికి సమన్వయ పరచవచ్చును.

పాశ్చాత్య సాహిత్య ప్రభావం పడనంత వరకూ తెలుగులో నాటకరచన జరగలేదు. కొందరు ఆంధ్ర కవులు సంస్కృతంలో నాటకాలు రాశారుగాని తెలుగులో రాయలేదు. సంస్కృత నాటకాలను చేపట్టిన పినవీరభద్ర కవి, నందిమల్లయ, ఘటసింగనలు కూడా వాటిని కావ్యాలుగా రాశారేగానీ నాటకాలుగా అనువదించలేరు. అటువంటి పరిస్థితులల్లో వల్లభరాయుడు గొప్ప సాహసకృత్యానికి పూనుకొనే క్రీడాభిరామాన్ని రాశారు.

క్రీడాభిరామం ప్రదర్శన గూర్చి నాటకాంతాన కింది విధంగా ఉంది.

క. నటులది దోరసముద్రము
వీటులది యోర్గల్లు కవిది వినుకొండ మహా
పుట భేదన మీ త్రితయము
నిటఉగూర్చెను బ్రహ్మరసికులెల్లను మెచ్చన్

- క్రీడాభిరామం - 293

క్రీడాభిరామాన్ని ప్రదర్శించినవారు దోరసముద్రపు నటులు, అందలి ప్రధాన పాత్రలు గోవింద మంచన శర్మ, టిట్టిభశెట్టి ఓరుగల్లువారు. రచించిన కవి వినుగొండ ప్రభువు. దీన్నిబట్టి ఆ రోజుల్లో దోరసముద్రం నటులు నాటకాల్ని ప్రదర్శించేవారని తెలుస్తున్నది. అప్పటికే వాళ్లు యక్షగానాల్ని గాని వీధి నాటకాల్ని గాని ప్రదర్శి స్తూండవచ్చు. అంతకు ముందు తెలుగులో రూపకరచన లేక పోవుట చేతనే మొదటిదైన క్రీడాభిరామంలో యక్షగాన కథాకథన పద్ధతి కొంత అనుసరించబడింది.

కథా సంగ్రహం :

కాసల నాటి బ్రాహ్మణుడైన గోవిందమంచన శర్మ, తన స్నేహితుడగు టిట్టిభ సెట్టితో కలిసి ఉదయ కాలంలో ఓరుగల్లు నగర ప్రవేశ సమయం నుండి ఈ రూపకం మొదలవుతుంది. మంచనశర్మ కామ మంజరి అనే భోగం స్త్రీకి ప్రియుడు. ఆమె ఓరుగల్లు నివాసి. మంచన శర్మ

కార్యాంతరం దేశాంతరం వెడలి కొన్ని రోజుల తర్వాత మిత్రుడైన టిట్టిభ శెట్టితో గూడి ఒక రోజు ప్రాతఃకాలాన ఓరుగల్లు నగరం ప్రవేశించి నగర వీధులలోని వింతలు, విశేషాలను చూస్తూ రాత్రికి గమ్యస్థానమగు తమ ప్రియు రాండ్ర గృహాలకు వెళతారు. వారు మార్గమధ్యంలో చూచిన విశేషాలే క్రీడాభిరామంలో వర్ణింపబడినవి. అంటే ప్రతిరోజు జరిగే ప్రజాకార్యక్రమం చెప్పబడింది.

స్నేహితులిద్దరూ వేకువజామునే బయలుదేరి ఓరుగల్లు కోటకు బయట ఉన్న గూడెమగు తెలిపాళెం ప్రవేశించారు. అక్కడున్న మేదరవాడను వర్ణించి, అప్పుడే స్నానం కొరకు వచ్చిన ఛండాలాంగనను చూశారు. అగడ్తలోని నీరు కొని పోవుచుండ ఆమెను కూడ వర్ణించారు. అక్కడ నుండి అంగడి వీధిలో ప్రవేశించి అక్కడ జరుగుచున్న మైలసంతను చూశారు. అచ్చటున్న వస్తువులను చూచి ముందుకు నడచి వెలిపాళెం మధ్యనున్న హాలికవాటికను, అక్కడే ఉన్న కర్ణాటక వేశ్య సోయగాలను వర్ణించి వెళ్లారు. ఒకచోట జూదరులగుంపు కన్పించింది. మరోచోట కరణకాంత సంపెంగి నూనెనమ్ముట చూచి మోహరివాడ చేరారు. ఈ మోహరివాడ నగరానికి పోయే మార్గానికి ఉత్తరంగా ఉంటుంది. అందులో భటులుంటారు. వారు శత్రువుల బారినుండి నగరాన్ని రక్షిస్తుంటారు. మిత్రులిద్దరికి ఆ ప్రాంతంలోనే రవికలు కుట్టువారు కన్పించారు. కొన్ని గృహాలను, పసుపునూరు స్త్రీలను చూశారు. అక్కడ నుండి కోటలోకి వెళ్లారు. కోట లోపలికి వెళ్లు మార్గం రథగజాశ్వాలతో నిండి ఉంది. మంచన, టెట్టిభు లిర్వురు రాజమార్గాన గాక క్రాంతమార్గాన పోగా పల్నాటి వీరుల ఆలయం కన్పించింది. పల్నాటి వీరుల చరిత్రలు పాడేవారిని వర్ణిస్తూ పోవుచుండ ఏకవీరాదేవి ఆలయం కన్పించింది. అచ్చట జరిగే తిరునాళ్లలో కన్పించే వింతలు, విశేషాలు వర్ణిస్తూ పోగా జక్కుల స్త్రీ కన్పించగా ఆమెను వర్ణిస్తూ ముందుకు వెళ్లి మైలారు భటులను చూశారు. అచ్చట నుండి బయలుదేరి భైరవుని గుడి, చమడేశ్వరి మహాశక్తి నగరు, వీరభద్రేశ్వరాగార మండపం, బౌద్ధ విహారం, ముద్దరాలు ముస్తానమ్మ వసతి, కొమర సామిగుడి, పాండవుల గుడి, ముస్లింల మసీదు, కేశవ స్వయంభూ దేవాలయాలను చూశారు. అంత మధ్యాహ్న సమయాన్ని సూచిస్తూ రాజప్రసాదం మీది గడియారం పదునారుగంటలు కొట్టింది.

మధ్యాహ్న సమయంలో స్నేహితు లిద్దరు పూట కూటింటికి వెళ్లి షడ్రసోపేతమైన భోజనం చేసి, అచ్చట నుండి బయలుదేరి కేతకీ పుష్పాలనమ్ము పుష్పలావికను చూచి వర్ణిస్తూ వేశ్యావాటిక చేరారు. అందున్న మాచల్దేవి గృహాన్ని వర్ణించి, మదనరేఖ, పుష్పమాలికలు సంపెంగ నూనె విక్రయించు వారిని చూశారు. మేదర వాళ్లు చాపలు బుట్టలు మున్నగునవి అల్లుటను వర్ణించారు. వాళ్లరూ వేశ్యావాటికలో పాముల వాని ఆట, పొట్టేళ్లు, కోడిపుంజుల పందాలను చూచి మధుమావతి యనే వేశ్య ఇంటికి వెళ్లారు. అచట వింతలను వర్ణిస్తుండగా సూర్యుడస్తమించెను. అచటనే వారు జారధర్మాసన వింతలను చూశారు. అచ్చట నుండి ఆర్య వాటిక ప్రవేశించి ఒకసానియింట విడిది చేశారు. ఆ ఇంటి పూజారి విధవచేత మంచనశర్మ తన రాకను కామ మంజరికి ఎరిగించగా ఆమె వచ్చి మంచన శర్మను కలిసింది. వారిరువురూ పున్నమి చంద్రునికి ఆర్ఘ్యం, హారతి నివ్వడంతో కథ ముగుస్తుంది.

ప్రజల జీవన విధానం :

14వ శతాబ్దం నాటి ఓరుగల్లు పట్టణాన్ని అక్కడి ప్రజల విశ్వాసాలను, ఆచారాలను, భోగాలను, క్రీడా వినోదాలను క్రీడాభిరామం అద్భుతంగా చిత్రించింది. ఇందులో పద్యాలను పరిశీలిస్తే అప్పుడు చాతుర్వర్ణ వ్యవస్థ ఉన్నట్లు అర్థమవుతుంది. తక్కువ జాతివాళ్లు వేర్వేరు వాడల్లో ఉండేవారు. అటువంటి వాడలన్నీ వెలిపాళెంలో ఉండేవి. ఈ వెలివాడలో నివసించే వారికి కావలసిన మత్స్య మాంసాదులు మైలసంతల్లో దొరికేవి. వెలిపాళెం మధ్యలో ఉన్న హాలిక వాటికలో రైతులుండేవారు. బ్రాహ్మణ క్షత్రియ వైశ్య వేశ్యలు లోపాళెంలో నివసించే

వారు. అవసరంలేని వస్తువుల్ని, జాతుల్ని అవతలికి నెట్టి అవసరమున్న వేశ్యజాతిని లోపాళెంలోనే ఉంచుకొన్నారు. ఆ కాలంలో బ్రాహ్మణులకు వేశ్యాసంపర్కం సాధరణమే! భోజనంలో మాత్రం బ్రాహ్మనత్వం ఉండాలి. ఎంత ఆలస్యమైనా తమ తమ ఇండ్లకు వెళ్లి బోంచేయాల్సిందే!

ఆ కాలంలో శకునాలంటే భయంకరంగా నమ్మే వాళ్లు. పూటకూళ్ల ఇల్లు ఆహారానికి, విహారానికి, సంగమ స్థానాలు. ఒక రూకకే అద్భుతమైన బోజనం ఏర్పాటు చేసేవారట.

ఉ. కప్పుర భోగివంటకము, కమ్మని గోధుమపిండి వంటయున్,
గుప్పెడు పంచదారయును, క్రొత్త గఁగాచిన యాలనే, పెస
ర్పప్పును, గొమ్మనల్లనఁటి పండ్లును, నాలుగునైదు నంజులున్
లప్పలతోడఁ గ్రోంబెరుగు లక్ష్మణవజ్రుల యింట రూకకున్

- క్రీడాభిరామం - 166

ఇది ఒక విధంగా నాగరిక భోజనమే! ఈ అన్నం వెళి పాళెంలో నివసించేవారికి ఉంటుందని చెప్పవేం. అక్కడ మైలసంతల్లో దొరికే ఆహార పదార్థాలను బట్టి వారి భోజనముంటుంది. ఆకాలంలో వేశ్యాజాతి ప్రత్యేకమైంది. వ్యభిచరించే ఏకులం వారినైనా వేశ్యలంటారు. వారికి అనేక నియమాలుండేవి. వారిలో వివాదాలొస్తే వాటిని తీర్చడానికి జారధర్మాసనాలుండేవి. ఇక జూదం కూడా చాలా ప్రధానమైందే! అందులో జరిగే అనేక మోసాలు వర్ణింపబడినవి. ఈ జూదాలతో పాటు వ్యసనాల్లో చెప్పదగినవి కోడిపందాలు, పొట్టేళ్ల పందాలు. ఇవి సామాన్య ప్రజల వినోదాలు. కోళ్ల పందాల్లో కోళ్లకు రక్తం కారుతున్నా, అవి తూలిపడిపోతున్నా వాటిని ఇంకా పోరాడాలని ఎగదోసేవారు.

తే.గీ. హా! ఖగేంద్రంబులార! కయ్యమున నీల్గి
పోవు చున్నారె దేవతాభువనమునకు?

మీరు రంభాతిలోత్తమా మేనకాది
భోగ కార్యార్థమై కోడిపుంజులార!

- క్రీడాభిరామం - 236

అంటూ కోడిపుంజుల్ని వీరుల వరుసలో నిలబెట్టారు.

ఆ కాలంలో పల్నాటి వీరుల కథాగానాలు బాగా వ్యాప్తిలో ఉండేవి. పల్లె ప్రాంతాల వారు ఈ కథల్ని బాగా ఇష్టపడేవారు. పల్నాటి వీరుల మీద భక్తితో వారి పేరు మీద గుళ్లు కట్టేవారు. అటువంటి గుడే ఓరుగల్లులో ఉండేది. ఒక స్త్రీ పల్నాటి వీరుల కథను పాడుతుంది. ఇంకా కాకతమ్మ, ఏకవీరాదేవి కథల్ని కూడా గానం చేసేవారు. ఏకవీరాదేవి గుడి ఎదురుగా మాలెతలు జవనిక వాయిస్తూ పరుశురాముని కథలు గానం చేసేవారు. మరికొందరు మైలారుదేవున్ని కొలిచేవారు. వీళ్లను మైలార వీరభటులు అంటారు. వీరు భక్తితో గొప్ప సాహసకృత్యాలు చేసేవారు. ఆత్మబలిదానాలు చేయడం, గుండాల్లో చింతనిప్పులు పోసి దూకడం, శూలాలు పాతి పెద్ద గడ్డపై నుండి వాటి పై దూకడం, గండకత్తెరతో తలలు నరుక్కోవడం, కళ్లల్లో బాణాలు గుచ్చుకోవడం చేసేవారు. అప్పట్లో అనేక ఉత్సవాలు జరిగేవి. వివిధమైన వాద్యాలతో సాగే ఆ ఉత్సవాల్లో జనులందరూ ఉత్సాహంగా పాల్గొనేవారు.

ఆ కాలంలో చిత్రకళంటే ప్రజలకు బాగా ఇష్టమని తెలుస్తున్నది. మాచల్దేవి ఇంట నుండే చిత్రశాల ప్రత్యేకంగా చెప్పదగింది. ఆ చిత్రశాలలో చిత్రాల కింది భాగంలో ఆ చిత్రాలకు సబంధించిన వివరాలు రాసి ఉండేవి. ఈ వివరాలు పద్య రూపంలోనే ఉండేవి. ఆశ్చర్య మేమంటే ఆ చిత్రాలన్నీ మన్మథుడికి సంబంధించినవే. అహల్యా సంక్రందనులు, రతీమన్మథులు, తారా చంద్రులు ఉన్న చిత్రాలు కన్పిస్తాయి.

అప్పట్లో ఇప్పటివలె నోట్లు లేవు. ఆర్థిక వ్యవహార మంతా టంకాలు, రూకలోనే జరిగేవి. ఆడవాళ్లు బొమ్మంచు చీరలు, ఎర్రంగు అద్దకపు చీరలు కట్టేవారు.

చలికాలంలో ఉన్నితో చేసిన కంబళ్లు వాడేవారు. పండగ పబ్బాలకు గృహాలను బాగా అలంకరించుకొనేవాళ్లు. గోళ్లకు గోరింటాకు, నుదుట సింధూర తిలకం పట్టేవారు. తాంబూలం తప్పకుండా ఉండాల్సిందే! ఏడువందల సంవత్సరాల నాటి ప్రజల జీవనాన్ని మనోహరంగా వర్ణించిన రూపకం క్రీడాభిరామం.

ఆధార గ్రంథాలు :

1. క్రీడాభిరామం : ప్రజాజీవితం - డా. మద్దూరి సుబ్బారెడ్డి
2. వినుకొండ వల్లభరాయుడు - శ్రీ ఆరుద్ర
3. క్రీడాభిరామము సమకాలిక సాంఘిక జీవనము - శ్రీ కె.ఎల్. నరసింహారావు
4. క్రీడాభిరామం - శ్రీ పేర్వేల సూర్యనారాయణ ప్రసాద్
5. శాలివాహన సప్తశతి - క్రీడాభిరామ పద్యస్థితి - ఆచార్య కొర్లపాటి శ్రీరామమూర్తి
6. తెలుగునాట తొలినాటకం - క్రీడాభిరామం - డా॥ తిరుమల రామచంద్ర
7. క్రీడాభిరామ పాఠములు - శ్రీ బండారు తమ్మయ్య
8. క్రీడాభిరామపాఠములు; రచనము - శ్రీ బండారు తమ్మయ్య
9. క్రీడాభిరామకర్త శ్రీనాథుడా? - శ్రీ వేమూరి విశ్వనాథ శర్మ
10. వినుకొండ వల్లభరాయఁడు - శ్రీ కందుకూరి వీరేశలింగం

⌘⌘⌘

BHAVAVEENA
Vol. 17, Issue. 8, August 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

ప్రాచీన సాహిత్యం – రామాయణం – సమకాలీనత

– డా॥. వైరాగ్యం ప్రభాకర్, కరీంనగర్, తెలంగాణ.

రామాయణం మానవ జీవితాన్ని సంస్కరించగల మహాకావ్యం. రామాయణాన్ని చదవడమంటే మన జీవితాలను చదవడమనే అర్థం. రామాయణంలోని పాత్రలు ప్రస్తుత సమాజంలో సజీవంగా కన్పిస్తున్నాయి. అందుకే రామాయణం పారాయణ గ్రంథం కాదు. ఆచరణీయమైన అంశాలతో కూడిన భగవద్గీత. అమ్మానాన్నల అనురాగం, అన్నదమ్ముల అనుబంధం, బార్యాభర్తల సంబంధం, గురుభక్తి, శిష్యుల శ్రద్ధానురక్తి, స్నేహధర్మం, ధర్మ విజయం, వినయంతో ఒదగడం, వివేకంతో ఎదగడం, జీవకారుణ్య భావన, ఏకపత్నీవ్రత్యం, భూతదయ ఇలా ఒకటని కాదు సర్వసద్గుణ సంయుతమే రామాయణం. ఉత్తమ ధర్మాలను ఆచరిస్తే మనిషి ఎలా ఎదగగలడో చూపించిందే రామాయణం. రామాయణం లోని చిన్న చిన్న పాత్రలు కూడా గొప్ప సందేశాన్నిస్తాయి. ప్రపంచ సాహిత్యంలోనే ఆదికావ్యంగా గుర్తించబడింది రామాయణం. దీనిని రచించిన వాల్మీకి మహర్షి ఆదికవిగా పేరొందినాడు. రామాయణం, పౌలస్త్యవధ, సీతాయాశ్చరితం మహత్ అను పేర్లతో పిలువబడే ఈ ఉత్కృష్ట గ్రంథం ఆరు కాండాలతో (ఉత్తర కాండతో సహా ఏడు), ఇరవై నాలుగు వేల శ్లోకాలతో సాగిన సంస్కృత రచన. ఆ తర్వాత రామాయణానికి పలు అంశాలను జోడించి వందల రామాయణాలు వచ్చినా వాల్మీకి రామాయణమే మూలంగా నిలిచింది. అందుకే రామాయణం వంటి కావ్యం, రాముని వంటి ఆదర్శమూర్తి నభూతో నభవిష్యతి.

రామాయణం-పాత్రలు-సమకాలీత-సందేశం :

రామాయణంలోని ఒక్కో పాత్రని విశ్లేషిస్తూపోతే సమయం చాలదు... పుటలు సరిపోవు.అందుకే కొన్ని పాత్రలను సంక్షిప్తంగా పరిచయం చేస్తూ,నేటి సామాజిక వ్యవస్థకు అన్వయిస్తూ వివరించే ప్రయత్నం చేస్తాను.

రాముడు :

రామాయణంలో ప్రధానపాత్ర. సకల సద్గుణాల రాశి.రూపంలోను గుణంలోనూ శ్రేష్ఠుడు, మహావీరుడు, మృదుభాషి, శరణాగతవత్సలుడు, కోపం గర్వం లేనివాడు, సత్ససంధుడు, ఇతరుల సంపదలను ఆశించనివాడు, ఆర్తత్రాణపరాయణుడు, సమయం విలువ తెలిసిన వాడు, సత్సాంగత్యాభిలాషి, వినయశీలి, తల్లిదండ్రుల మరియు గురువుల పట్ల నిశ్చలభక్తి కలవాడు, సౌమరితనం, ఏమరుపాటు లేనివాడు, సకల కళావల్లభుడు, అరిషడ్వర్గాలను జయించిన వాడు, ప్రజావాత్సల్యం కలిగినవాడు శ్రీరాముడు. ఈ కాలంలో ప్రతి తల్లి రామునిలాంటి కొడుకును కనాలనే కోరుకుంటుంది.

ఉత్తమ శిష్యరికంతో గురువైన విశ్వామిత్రుని మెప్పించి ఆయనచేత తన పూర్వీకుల వంశచరిత్రను తెలుసుకోవడమే కాకుండ బల, అతిబల లాంటి గొప్ప శస్త్రవిద్యలను పొందాడు. ఆయన ద్వారా విశేషమైన జ్ఞానాన్ని పొందడమే కాకుండా సకల సద్గుణాల సంపన్నయైన సీతను భార్యగా పొందాడు.

గురుశిష్యుల మధ్య ఉండాల్సిన సంబంధాన్ని రామాయణం ఈనాటి సమాజానికి చక్కగా వివరించింది. రామునిలాంటి శిష్యులు, విశ్వామిత్రుడు లాంటి గురువులు నేటి విద్యా వ్యవస్థలో ఉండాల్సిన అవసరాన్ని గుర్తు చేస్తుంది.

తల్లి కైకేయి కోరిన వరాలను తండ్రి ఆదేశంగా భావించి పద్నాలుగు సంవత్సరాలు వనవాసానికేగిన పితృవాక్య పరిపాలకుడు

తండ్రి ఆస్తికోసం తగాదాలు పడి, తండ్రిని నిరాదరణకు గురిచేస్తున్న ఈనాటి పుత్రులకు ఒక చెంప పెట్టులా నిలుస్తుంది. కుమారుల బాధ్యతలను గుర్తు

చేస్తుంది. చెప్పుడు మాటలతో పొరపాటు చేసిన తల్లిని ఏవగించు కోకుండా ఆమె మాటను తండ్రి ఆదేశంగా గౌరవించడం రాముని ఔన్నత్యాన్ని తెలియజేస్తుంది. ఇది మనకు ఆదర్శం.

దశరథుడు రామునికి పట్టాభిషేకం చేస్తానని తెలిపి నపుడు పొంగిపోలేదు. తండ్రి కైకేయికి ఇచ్చిన మాట ప్రకారం వనవాసానికి వెళ్ళేటపుడు కుంగిపోలేదు. ఇదే స్థితప్రజ్ఞత.

సమస్యలకు భయపడకుండా, సంతోషాలకు పొంగ కుండా స్థితప్రజ్ఞత కలిగిన మానవసమాజం నిర్మించ బడాలన్నదే ఇక్కడ గొప్ప సందేశం.

తండ్రికి ఆప్తుడైన జటాయువుకు దహన సంస్కారాలు చేయడం, కబంధునికి అగ్నిసంస్కారం చేసి శాపవిముక్తి కలిగించడం, అగ్నిసాక్షిగా మిత్రుడైన సుగ్రీవునికి సహకరించడం, శరణన్న విభీషణునికి అభయమివ్వడం, రావణునితో యుద్ధానికి ముందు సంధికి ప్రయత్నించడం రాముని వ్యక్తిత్వానికి గీటురాయిలా నిలుస్తాయి. ఒక వ్యక్తి ఉత్తమగుణాలతో ఎలా ఎదగగలడో రాముని ద్వారా మనం గ్రహించవచ్చు. అందుకే రాముడు మనకు ఆదర్శం.

సీత :

జనకుని ఇంట కూతురై దశరథునింట కోడలుగా విచ్చేసిన సహనశీలి, ఉత్తమ ఇల్లాలు. ముగ్గురు అత్తల ముద్దుల కోడలిగా తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించిన కోమలి. భర్తమాట జవదాటని పతివ్రత. భర్తతోపాటు వనవాసం చేసిన మహా ఇల్లాలు. పతిని విడిచి ఉండుట సతి ధర్మం కాదని పలికిన ధర్మం తెలిసిన సాధ్వి. అరణ్యవాసంలో భర్తకు సంపూర్ణ సహకార మందించిన గృహిణి. రావణాసురుడు ఎన్ని రకాలుగా ప్రయత్నించినా, ఎన్ని వ్యామోహాల ఎర చూపి లోబరచు కోవడానికి యత్నించినా వాటన్నింటిని గడ్డిపోచలా భావించి తిరస్కరించిన ఉత్తమ ఇల్లాలు. నిద్రాహారాలు మాని శ్రీరాముని నామస్మరణతోనే కాలం గడిపిన పరమసాధ్వి. చివరగా తన ప్రాతివత్యాన్ని నిరూపించుకుంటూ భూదేవి ఒడిలో ఒదిగిన ఆత్మాభిమానం గల ఆదర్శ వనిత.

చిన్నచిన్న కారణాలతో, అనవసరమైన దురభిమానాలతో విడాకుల కోసం న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తున్న నేటి మహిళలకు సీతారాముల దాంపత్య జీవనం వారిలో మార్పును తీసుకురాగలదు. భార్యాభర్తలకంటే ఒకరి నొకరు గౌరవించుకోవటం, అర్థం చేసుకోవటం, సహకరించుకోవడం, సర్దుబాటు చేసుకోవడం, త్యాగం చేయడం, హెచ్చు తగ్గులు దూరం చేసుకోవడం, ఒకరికి తోడు మరొకరుగా మసలుకోవడం చేస్తున్న ఈనాటి దంపతులు సీతారాముల గురించి తెలుసుకోవాల్సిన అంశాలు చాలానే ఉన్నాయి.

లక్ష్మణుడు :

అన్నదమ్ముల అనుబంధాలకు ప్రతీకలుగా నిలుస్తారు రామ లక్ష్మణ భరత శత్రఘ్నులు. అందులో సుమిత్ర కుమారుడైన లక్ష్మణుడు అన్నను ఒక్క క్షణం విడువ కుండా నీడలా వెన్నంటి నడచినవాడు. రాముడు వన వాసానికి వెళ్ళినపుడు తనుకూడా తన సుఖాలను వదలు కొని పద్నాలుగు సంవత్సరాలు అన్నతోపాటు వనవాసం చేసిన మహోన్నతుడు. "సుగ్రీవుడు చూపించిన ఆభరణాలలో కేయూరాలను, కుండలాలను నేను గుర్తు పట్టలేను కానీ కాలి అందెలు మాత్రం వదినేగారివి" వదినెను తల్లిగా భావించిన లక్ష్మణుడు ఉదాత్తహృదయుడు. సోదరుని ఆజ్ఞలను జవదాటని సహోదరుడిగా, తల్లిదండ్రులపై ప్రేమానురాగాలు కలిగిన పుత్రునిగా, సీతను కోల్పోయిన రామునికి సాంత్వననిస్తూ తండ్రిలా నిలిచి, యుద్ధంలో విశేష ప్రతిభ కనపరచిన లక్ష్మణుడు రామునితో పాటు సజీవంగా నిలస్తాడు.

మద్యమనే వ్యసనానికి లోనై, కామంతో కళ్ళు మూసుకుపోయి, వావి వరుసలు మరచి లైంగిక దాడులకు దిగుతున్న మృగాళ్ళకు వదినెను తల్లిగా, స్త్రీలను

సోదరిలా భావించే లక్ష్మణుడు ఆదర్శంగా నిలుస్తాడు. అతని జీవితాన్ని అనుసరించడం ఉత్తమ మార్గం.

మంధర :

కైకేయి వెంట అరణపుదాసిగా వచ్చినది మంధర. తనవారు సుఖంగా ఆనందంగా ఉండాలనుకునే పాత్ర ఇది. శ్రీరామ పట్టాభిషేక సమయంలో కైకేయి మనసులో విషం నింపి శ్రీరాముడు అడవికి వెళ్ళేలా చేస్తుంది. చెప్పుడు మాటలు వినడం వలన ఎంత అనర్థం జరుగుతుందన్నది రామాయణంలో ఈ సంఘటన నిరూపించింది.

నేటి సమాజంలో మంధర, కైకేయి లాంటి వ్యక్తులు నిత్యజీవితంలో మనకు తారసపడుతుంటారు. కాని విచారించిల్సిన విషయమేమిటంటే అనుభవాలను విన్న విషయాలను అవగాహన చేసుకోలేకపోవడం. తిరిగి అదే తప్పు చేయడం. అందుకే బద్దెన,

"వినదగునెవ్వరు చెప్పిన,
వినినంతనే వేగపడక వివరింపదగున్,
కనికల్ల నిజము తెలిసిన
మనుజుడెపో నీతిపరుడు మహిలో సుమతీ".

ఏది నిజం ఏదబద్ధం అన్నది తెలుసుకునే విచక్షణా జ్ఞానం పెంపొందించుకోవడం ఉత్తమం.

దశరథుడు :

యోధులకు జయింపశక్యంగాని అయోధ్యను ప్రజాను రంజకంగా పరిపాలించిన ధర్మప్రభువు దశరథుడు. ఎంత గొప్పవాడైన కర్మఫలాన్ని అనుభవించక తప్పదంటారు. ఈ జన్మలో పాపం చేస్తే వచ్చే జన్మలో అనుభవించక తప్పదన్నది పాతకాలపు మాట. యజ్ఞదత్తుడను ముని బాలకున్ని చంపి అంధులైన వృద్ధ తల్లిదండ్రులకు పుత్రశోకం కలిగించినందున, అదే పరిస్థితిని ఎదుర్కొని పుత్రవియోగ దుఃఖంతో దశరథుడు తనువు చాలించాడు. ఈ ఉదంతం పాపపుణ్యఫలితాలు జీవించియున్నపుడే అనుభవించక తప్పదని తెలుపుతుంది.

సుగ్రీవుడు :

వానరరాజు సుగ్రీవుడు మహాబలశాలి వాలి సోదరుడు. మాయావితో పోరు సలుపుతున్న సందర్భంలో గుహనుండి రక్తపు ధారలు రావడం, అన్న వాలి చనిపోయాడనుకుని గుహను పెద్ద బండరాయి తో మూయడమనే చిన్న పొర పాటు పెద్ద ఆపదకు దారితీసింది.

తొందరపడి తీసుకునే నిర్ణయాలు దుష్ఫలితాలకు దారితీస్తాయన్న నిజాన్ని మన ముందుంచింది. మనిషి విచక్షణాజ్ఞానంతో సమస్యలను అధిగమించాలన్నదే ముఖ్యసారాంశము.

మిత్ర ధర్మాన్ని పాటించి తన వానర సైన్యాన్ని సీతాన్వేషణకై నలువైపులా పంపించి, సీత జాడను కనిపెట్టి, యుద్ధంలో రామునికి సహకరించాడు.

బంధాలలో స్నేహబంధానికే ఎక్కువ ప్రాధాన్యత నిస్తాము. "స్నేహానికన్న మిన్న లోకాన లేదురా" అంటారు. స్నేహితుల మధ్య ఉండాల్సిన అవగాహన, స్నేహితుని ధర్మాలను చక్కగా వివరించింది. నిజమైన స్నేహితులకు రామసుగ్రీవుల మైత్రి మార్గదర్శకం.

ఆంజనేయుడు :

రావణాసురుడుని హతమార్చి సీతను తీసుకురాగల సమర్థుడు హనుమంతుడు. ఐనా స్వామికార్యం సీత జాడ కనుక అందుకే పరిమితమయ్యాడు. రాముని బంటుగా రామాయణంలో మహితమైన పాత్రను పోషించినవాడు. రామ సుగ్రీవుల మధ్య మైత్రీ బంధానికి మూలమైనవాడు.

తనలోని శక్తిని సరిగ్గా అంచనావేసుకోలేని అమేయ బల సంపన్నుడు. "చూసి రమ్మంటే కాల్చి వచ్చాడన్న" సామెతకు రూపమిచ్చినవాడు. మూర్చబోయిన లక్ష్మణుని ప్రాణాలు రక్షించడానికి సంజీవనీ పర్వతాన్నే తీసుకొచ్చిన అమోఘ బలశాలి. సేవకుడిగా తన ధర్మాన్ని నిర్వర్తించాడు.

సేవాభావం కాస్త కరువైన ప్రస్తుత పరిస్థితుల్లో ఆంజనేయుడిలోని సేవాతత్పరతను అలవరచుకోవలసిన

అవసరం ఎంతైనా ఉంది. తనకు కేటాయించిన పనులను సక్రమంగా నిర్వర్తించడం మన బాధ్యతగా భావించాలి. ఇతరుల విషయాలలో అనవసరంగా జోక్యం చేసుకోవడం తప్పు. యజమానికి విధేయులుగా మెలగాలన్న గొప్ప విషయాన్ని మనం నేర్చుకోవాలి.

రావణాసురుడు :

దశకంఠుడైన రావణాసురుడు గొప్ప శివభక్తుడు. తన తపఃశక్తితో శివున్ని మెప్పించినవాడు. ధర్మం తెలిసినవాడు. న్యాయాన్యాయాలు గుర్తెరిగినవాడు. అందమైన సుందరమైన భవనాలతో, తోటలతో మరెక్కడా లేని విధంగా లంకానగరాన్ని నిర్మించుకొని భోగభాగ్యాలతో జీవిస్తున్న సుఖలాలసుడు. శూర్పనఖ సీత గురించి చెప్పిన మాటలకు శూర్పనఖ వ్యంగ్యోక్తులకు లోనై వంశనాశనానికి కారకుడైనాడు. సోదరుడు విభీషణుడు చెప్పిన హితవచనాలను పెడచెవిన పెట్టాడు. పరాయి ఆడదానిపై ఆశపడినవాడెవ్వడు బాగుపడిన దాఖలాలు చరిత్రలో లేవు. ధర్మం తెలిసినవాడు కనుక రామదూతగా వచ్చి హనుమంతుని వధించకుండా వదిలాడు. న్యాయ వర్తనుడు కనుక సీత అంగీకారం కోసం వేచి చూశాడు.

ఎన్ని సుగుణాలున్న ఒక్క దుర్గుణంతో మంచి గుణాలన్నీ విలువలేకుండా పోతాయన్న వాస్తవ విషయాన్ని మనం గ్రహించాలి. వివేకహీనుడికి హితవచనాలు రుచించవన్న విషయాన్ని గుర్తించాలి.

కుంభకర్ణుడు :

ఆరు నెలలు నిద్రలో ఉండే కుంభకర్ణుడు రావణుని తమ్ముడు.అన్నగారు చేసిన పనిని ఆక్షేపించినవాడు. సరిదిద్దుకోమని హితవు పలికాడు. ఐనా అన్నగారి ఆదేశాలకు కట్టుబడి యుద్ధంలో అన్నకు చేదోడువాదోడు నిలిచి ప్రాణాలు కోల్పోయాడు.

తప్పు ఎవరు చేసినా తప్పేని నిర్ద్వందంగా చెప్పినా భాతృధర్మాన్ని పాటించి తన బాధ్యతను పూర్తిచేశాడు.

విభీషణుడు :

రావణుని సోదరుడు. ధర్మం తెలిసినవాడు పరాయి స్త్రీని తల్లిలా భావించాలని, అన్న చేసిన సీతాపహరణం వంశనాశనానికి దారితీస్తుందని హితబోధ చేసిన ధర్మాత్ముడు. మంచిమాటలు రుచించని రావణాసురుడి పరుషపు మాటలతో విభీషనుడు వెతనొంది శ్రీరాముని శరణు జొచ్చినాడు.

మనకు విలువలేనిచోట ఉండుట తగదు. మూర్ఖులతో కూడియుండుటవలన మన విలువ తగ్గుతుంది. మంచివాడు శత్రువైనా సరే అతని పంచన చేరడమే ఉత్తమం అన్న విషయాన్ని గ్రహించాలి.

ఇలా రామాయణంలోని అనేక పాత్రలు మన జీవితాలకు చక్కని మార్గాన్ని నిర్దేశిస్తున్నాయి. రామాయణం అంటే మన జీవితం. ధర్మబద్ధంగా, న్యాయబద్ధంగా జీవిస్తూ పలువురిచే ప్రశంసించబడేలా జీవితాన్ని ఎలా గడపాలో తెలియజేసేదే రామాయణం.

ఆధార గ్రంథాలు :

1. మహాకవి వాల్మీకి విరచిత రామాయణం - గీతా ప్రెస్ గోరఖ్ పూర్

⌘⌘⌘

BHAVAVEENA
Vol. 17, Issue. 8, August 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

తెలంగాణ గిరిజనుల జాతరలు – పరిచయము

- కుర్రి రుక్మిణి

ప్రపంచ వ్యాప్తంగా జానపద విజ్ఞానాన్ని నిక్షిప్త నిధిగా భావించి, దానిని సేకరించి, భద్రపరచడం నేటి జానపద విజ్ఞాన పరిశోధకుల చారిత్రక బాధ్యత. ప్రతిదేశంలోను జానపద విజ్ఞానం తరగని గనిలా ఉంది. జానపద విజ్ఞానానికి, జాతరలకు అవినాభావ సంబందం ఉంది. జానపద విజ్ఞానాన్ని ప్రతిఫలింపజేసేవి జాతరలయితే, ఆ జాతరల ఆయువు పట్టంతా జానపద విజ్ఞానంలోనే ఉంది. ప్రపంచంలో ఏ మూల పరిశోధించినా ఈ అంశం తేటతెల్ల మవుతుంది.

మన భారవతదేశానికి వస్తే, ఈ విషయం ఇంకా స్పష్టంగా తెలుస్తుంది. మనదేశంలో ఉత్తర రాష్ట్రాలలోని జానపద విజ్ఞానంతో పోల్చినపుడు దక్షిణ భారత జానపద విజ్ఞానం విలక్షణంగా కనిపిస్తుంది.

జానపద విజ్ఞానానికి పల్లె పట్టులు ఆటపట్టులు ఆచార వ్యవహారాలు, వినోదాలు, వేడుకలు, ఉత్సవాలు, ఉర్సులు, సంతలు, సంబరాలు, పండుగలు, పబ్బాలు - జీవితంలో ఏడాది పొడుగునా సంభవించే సంఘటనలు, జానపదులకు నూతన చైతన్యాన్ని, ఆత్మ విశ్వాసాన్ని, ఆనందాన్ని చేకూరుస్తాయి. దేవతల మీద వారికుండే శ్రద్ధాసక్తులు, భయభక్తులు జాతర్లలో వెల్లడవు తుంటాయి. ఈ జాతరలు, ఉత్సవాలు జానపద విజ్ఞానానికి భాష్యాలు, భాండాగారాలు.

తెలంగాణాలో ఉన్న గిరిజన జాతుల్లో బంజారా, ఎరుకుల, యానాది, కోయ, గోండ్, చెంచు, అంధ్ నాయక్ పోడ్ మరియు ఇతర జాతులు కూడా ఉన్నాయి.

తెలంగాణ సంస్కృతిలో జాతర్లు కీలకమైనవి. ప్రతి గ్రామానికి ఏదో ఒక గ్రామదేవత ఇక్కడ ఉంటుంది. అలాగే చాలా కులాల కుల దేవతలు ఉంటారు. జాతర్ల వల్ల ప్రజలు - ఆడ, మగ, పిల్లా, పెద్ద తేడా లేకుండా తమ కష్టాలను కన్నీళ్లను మరచిపోయి ఆనందోత్సాహాలతో ఒకరినొకరు ఆప్యాయగా పలకరించుకొంటూ, చేతులు కలుపుకొంటూ సమైక్య పథంలో పయనిస్తారు. దేవతల అనుగ్రహానికి ఆరాటపడతారు. ఇదే విధంగా గిరిజనుల గ్రామాలలో కూడా కులదేవతలు ఉంటారు. ఆయా గిరిజన సాంప్రదాయ పెద్దల ఆధ్వర్యంలో జరిగే ఈ జాతరలలో గిరిజనులు, గిరిజనేతరులు కలిసి సుమారుగా వేల సంఖ్యలో భక్తులు జాతరలో పాల్గొంటారు. గిరిజన జాతర్లలో పాల్గొనడంతో తెలంగాణలో గిరిజన జాతరల విశిష్ఠత స్పష్టమౌతున్నది. తెలంగాణాలో గిరిజనుల సంస్కృతితో మమేకం కావడం ఆసియా ఖండంలో మరే ప్రాంతంలో జరగడంలేదని నిరూపితమైనది. ఇది ప్రపంచ సంస్కృతిలో కూడ ప్రశంసించదగిన విశేషం.

మైసమ్మ :

శక్తి దేవతలలో అతి శక్తివంతమైన గ్రామదేవత మైసమ్మ. ఈమె వెలసిన ప్రదేశాన్ని బట్టి కోటమైసమ్మ, కట్టమైసమ్మ, గండిమైసమ్మ, బంగారి మైసమ్మ అను పేర్లతో వ్యవహరిస్తారు. ప్రతి గ్రామంలో మైసమ్మలు ప్రతిష్ఠింపబడి వుంటాయి. వీటికి ప్రత్యేకంగా గుడులు అంటు ఏమి నిర్మించబడి ఉండవు. చదునుగా వున్న నాలుగు రాళ్లను తీసుకొని వాటికి సున్నంతో పూసి లోపల ఇంకొక చిన్న రాయిని వుంచి మూతతో మూసిబడివుంటాయి. ఇదే తరహాలో వెలసిన మైసమ్మ ఇప్పుడు తెలంగాణలోని నల్లగొండ జిల్లాలోని దామరచర్ల మండలంలోని గిరిజన గ్రామమయిన కళ్లేవల్లి గ్రామములో బంగారి మైసమ్మ కొలువదీరింది. కళ్లేపల్లి గ్రామములో కూడా సాధారణంగా మైసమ్మలకు దున్నపోతును బలి ఇవ్వడం, బైండ్ల కథలు వినిపించడం వంటిది జరుగుతుంది. సుమారు నూరు నుండి నూట

యాబై సంవత్సరాల క్రింద ప్రతిష్ఠింపబడిన బంగారు మైసమ్మను ప్రతి సంవత్సము భక్తులు పెరుగుతూ ఇప్పుడు జాతరగా నిర్వహించుచున్నారు. కళ్లేపల్లి బంగారి మైసమ్మ జాతర ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి గ్రామ పెద్దలు నిర్ణయించిన తేదీలలో మూడు రోజుల జాతరగా సాగుతుంది. బంగారు మైసమ్మ గిరిజన తండాలో వెలసిన కారణంగా ఇక్కడ లంబాడీలు మాత్రమే పూజారులుగా వ్యవహరించుచున్నారు. కళ్లేపల్లిలో జాతర సమయంలో గిరిజనులు కాకుండా, గిరిజనేతరులు కూడా జాతరలో పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి దున్న పోతులను, మేకలను, పోటేలను బలి యిచ్చి మొక్కులు తీర్చుకుంటారు. ఇక్కడికి వచ్చే భక్తులు తెలంగాణ రాష్ట్రంలోని భక్తులే కాకుండా ఆంధ్రప్రదేశ్ నుండి కూడా గిరిజనులు పెద్ద సంఖ్యలో జాతరలో పాల్గొంటారు. కళ్లేపల్లి జాతర సమయంలో 9 వెండి విగ్రహాలను తీసుకొచ్చి గుడి యందు 3 రోజుల పాటు వుంచుతారు.

బంజారాలు ఎక్కువగా ఆరాదించే దేవతలలో తుల్జా భవాని, మారెమ్మ మరియు సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలు. తుల్జాభవాని ప్రతి బంజారా ఇంటి యందు వెండి విగ్రహరూపంలో వెలసి ఉంటుంది. ప్రతి రెండు లేక మూడు సంవత్సరాలకు ఒకసారి ఈ విగ్రహాన్ని బయటికి తీసి జాతరగా జరుపుకుంటారు. అప్పుడు యాటలు, కోళ్లలను బలి యిచ్చి తుల్జాభవానికి నైవేద్యం పెడతారు. ఆరాత్రి భవాని పేరు మీదుగా జాగరణ చేస్తారు. మారెమ్మను కూడా బంజారాలు బాగా ఆరాధిస్తారు. మహారాష్ట్రలోని పురియఘడ్ దగ్గర ముందుగా గ్రామ ముఖ్యులు ముందుగా దర్శించుకొని వచ్చిన తరువాత దసర పండుగ జరుపుకుంటారు. మహారాష్ట్రలో కూడా దసర పండుగ రోజు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని యాటలు బలియిస్తారు. తెలంగాణలోని గిరిజన తండాలలో చాలా చోట్ల మారమ్మె గుడులు దర్శిన మిస్తాయి. లంబాడీలు తుల్జాభవాని, మారెమ్మలను కాకుండా ఇంకా హింగళా భవాని, దోళంగర్ భవాని, పిత్లాభవాని, కంకాళి భవాని, మాత్రల్ భవానిలకు కూడా పూజలు చేస్తారు.

సమ్మక్క-సారలమ్మ :

తెలంగాణ గిరిజన తెగలలో కోయ గిరిజనులు ఒకరు. వీరు తెలంగాణలో వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్, కరీంనగర్ తదితర జిల్లాలో నివసిస్తున్నారు. కోయలకు తమ దినచర్యలో జంతువులతోను, ఆడవితోను సహవాసం చేయవలసి రావడం అనేది వీరి దేవతారాధనను, ప్రకృతిని ఆరాధించడం ప్రతిబింబిస్తాయి. కావున వీరి పండుగలలో భూమిమీద పండే పంట మీద, జంతువుల మీద, ప్రకృతి మీద, చనిపోయిన తమ తోటి మనుషుల పట్ల అచంచలమైన విశ్వాసం కనిపిస్తుంది.

భూపాలపల్లి జిల్లాలోని మేడారం గ్రామంలో ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి మాఘశుద్ధ పౌర్ణమి రోజున మేడారం జాతర జరుగుతుంది. జాతర ప్రదానంగా కోయ గిరిజనులకు చెందినప్పటికి అసంఖ్యాక ప్రజలు రాష్ట్రం లోని వివిధ ప్రాంతాల నుండి కాక చుట్టు ప్రక్కల రాష్ట్రాల నుండి కూడా వస్తుంటారు.

పూర్వపు వరంగల్ జిల్లాలోని మేడారం గ్రామంలో సమ్మక్క గద్దెలకు ఈశాన్య భాగంలో చిలకల గట్టు పాద భాగంలో గుడి ఉంది. మేడారం జాతరలలో సమ్మక్క ప్రదాన దేవత. సమ్మక్కతో పాటుగా సారలమ్మ మరొక ప్రదాన దేవత. సమ్మక్క భర్త పగిడిద్ద రాజు, సమ్మక్క మరిది గోవిందరాజు గద్దెలు ఒకే ప్రాంగణంలో ఉంటాయి. భక్తులు ప్రదానంగా సమ్మక్కను ఆరాదిస్తూ మొక్కుబడులు చెల్లిస్తూ ఉన్నప్పటికి సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజులను కూడా ప్రధాన దేవతలుగానే భావిస్తారు. వీరితో పాటు జంపన్న వాగులో స్నానాలు చేయడం మరొక పుణ్యకార్యక్రమం. జంపన్నవాగులో స్నానం చేయందె గద్దెల వద్దకు రాకూడదనే సాంప్రదాయం ఉంది. జంపన్న వాగులో నాయకపోడు గిరిజనులు లక్ష్మీదేవరను ఎత్తుకొని తిరుగుతుంటారు.

భక్తులు మొక్కుబడులలో బంగారం (బెల్లం), వడిబాల బియ్యం, తొట్టెలు, కొబ్బరికాయలు, పసుపు కుంకుమలు, చీర, బటట్లు, పట్నాలు, చిలుకలు, బోనాలు తదితర మొక్కుబడులు చెల్లించుకుంటారు. వీటిలో బంగారం (బెల్లం), ఎదురుకోడి, యాటపోతులు, డబ్బు, కొబ్బరి కాయలు ఉంటాయి. సంతానం లేనివారు తమకు సంతానం కలగాలని కోరుకుని పుట్టిన బిడ్డకు సమానమైన బరువు తూకం గల బెల్లం సమర్పిస్తారు. రోగ పీడితులు, ఉద్యోగం కోరుకునేవారు, పెళ్లికోరుకునేవారు, తమను గండం నుండి గట్టెక్కిస్తే ఈ మొక్కు చెల్లిస్తామని కోరుకుంటారు. బెల్లం లేదా బంగారం అంత ప్రాముఖ్యం సంతరించుకోవడానికి కారణం తెలియదు. కోయ ఆదివాసీలలో ఉప్పు, తీపి ప్రధానమైనవి. వారు బయటి ప్రాంతం నుండి మాత్రమే తెప్పించుకోగలగిన పదార్థాలు బహుశా ఈ కారణంగానేమో తమకు అత్యంత ప్రీతకరమైన సమ్మక్క దేవతలను మెప్పించడానికి కోయలు బెల్లం సమర్పించుకోవడం జరిగేది.

కోయ గిరిజులు వీరితో పాటు ముత్యాలమ్మ, మహాలక్ష్మమ్మ, కొర్రాజులు, కుడిదేవర, కాతురుడు, ముసలమ్మ, కొమ్మాలమ్మ తదితర దేవతలను పూజిస్తారు.

నాంచారమ్మ జాతర :

తెలంగాణ గిరిజన తెగలలో ఎరుకల తెగ ఒకటి. వీరు తెలంగాణలో అన్ని జిల్లాల్లో విస్తరించియున్నారు. చాపలు అల్లడం, గంపలు అల్లడం, పందుల పెంపకం మరియు తీగలు అల్లడం వీరి యొక్క ప్రధాన సంప్రదాయ వృత్తి. వీరు ఆరాదించే దేవతలలో ముఖ్యంగా నాంచారమ్మ, ఎల్లమ్మ మరియు తదితర దేవతలను పూజిస్తారు. ఎరుకల కులానికి చెందిన మహిళలు "భవిష్య వాణి" చెప్పడంలో ప్రసిద్ధులు.

యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లి పిల్లాయిపల్లి గ్రామ పరిసరాల్లో ఉన్న ఎరుకల బండ దగ్గరున్న నాంచారమ్మను రాష్ట్రమంతటా ఉన్న ఎరుకల గిరిజనులు బోనాలతో వచ్చి ఆరాదించి ఆనందోత్సాహాలతో జాతర జరుపుకుంటారు. ఈ జాతర ప్రతి యేటా వైశాఖ పౌర్ణమినాడు జరుపుకుంటారు. ఎరుకలు వీటితో పాటు హైదరాబాద్ పరిసర ప్రాంతాలలో ఏకలవ్య జాతరను కూడా ఘనంగా నిర్వహించుకుంటారు.

నాగోబా :

తెలంగాణ గిరిజన తెగలలో గోండు తెగ మణకటి. గోండుల జీవన విధానంలో ముఖ్యమైనది మతం. అందరు గిరిజనులలాగే, మానవాతీత శక్తుల మీద నమ్మకం. గోండులు నివశించే ప్రాంతంలో పనిచేసిన అధికారులకు ఒక నమ్మకం ఉంది. వీరు అస్తమానం (పంటలను, పశువులను వదిలేసైనా) జాతరలు, పండుగలతోనే కాలక్షేపం చేస్తారని వారి అనుభవం. కాని పండుగలు, జాతరలు వారి సామాజిక వ్యవస్థలో ఎంత ముఖ్యమో తెలుసుకుంటే, యీ నమ్మకం కొంచెం తగ్గుతుంది. గోండులలో పండుగలు చాలా ఉన్నాయి. వాటిలో ముఖ్యమైనవి నాగోబా జాతర, దండారీ పండుగ.

నాగోబా జాతర ఆదిలాబాద్ జిల్లాలలోని ఇంద్రవల్లి మండలంలోని కేస్లాపూర్ గ్రామంలో గొండు గిరిజన తెగ ప్రతి సంవత్సరం పుష్యమాసంలో బహుళ అమావాస్య రోజున జరుపుకుంటారు.

నాగోబ జాతరలో పామును దేవతా రూపంల పూజిస్తారు. 1940 లో ప్రా॥ హైమన్‌డార్ఫ్ అనే గిరిజన స్కాలర్ నాగోబ జాతర సందర్భంగా గోండు దర్బార్‌ను నిర్వహించడానికి కలెక్టర్‌ను ఆహ్వానించి గిరిజన సమస్యలను విన్నవించుకునే సంప్రదాయాన్ని ప్రారంభించారు, ఇప్పటికి ఇది కొనసాగుతుంది. కేస్లాపూర్ గ్రామంలో గుడి ప్రక్కన ఒక నిర్ణయించిన స్థలంలో మేస్రాం గోత్రానికి చెందినవారు వంటలు చేసి, నాగోబా కుల నైవేద్యం సమర్పించిన తరువాతనే మిగిలిన గోండులు, ఇతర గిరిజన జాతుల వారు గుడిలోకి వెళ్ళేందుకు అనుమతి లభిస్తుంది. ఈ జాతరకు వచ్చే భక్తులు నాగదేవతకు పాలు, పెరుగు, వంటకాలు సమర్పిస్తారు. జాతర సమయంలో గుడి బయట, అదే ప్రాంగణంలో ప్రధా

నులు కూర్చుని కింగ్రి వాయిద్యానికి అనుగుణంగా పాటలు పాడతారు. వీళ్ళకి భక్తులు డబ్బులు, బీడీలు, బియ్యం వేస్తారు.

మేస్త్రాం గోత్రంలో (ఏడు అన్నదమ్ములనగ), బూయిగోతా అనే విభాగానికి చెందిన వారు చేసే పూజలు యీ జాతరలో ప్రదానం. వారి పుక్కిటి పురాణాల్లో ఒక కథను ప్రదాన్ పూజారులు పాటలుగా పాడతారు.

భౌరాపూర్ జాతర :

తెలంగాణ గిరిజన తెగలలో మరొక తెగ చెంచులు. చెంచు గిరిజనులు ఎక్కువగా అడవులలో నివసిస్తూ వుంటారు. వీరి వృత్తి అడవుల్లో జంతువులను వేటాడడం. వీరు నివసించే ప్రాంతాలను చెంచు పెంటగా పిలుస్తారు. వీరు శ్రీశైలం మల్లికార్జున స్వామిని ఎక్కువగా పూజిస్తారు. చెంచులు ఎక్కువగా జరుపుకునే పండుగ శివరాత్రి.

తెలంగాణ రాష్ట్రంలోని నాగర్ కర్నూల్ జిల్లాలోని భౌరాపూర్ చెంచుపెంటలో సాంప్రదాయకంగా భ్రమరాంబ జాతర జరుగుతున్నది. శివుడికి పార్వతి, గంగ అనే భార్యలున్నారని హిందువుల భావించగా చెంచు గిరిజనులు మాత్రం తమ మల్లన్న స్వామికి తమ ఆడపడుచు భ్రమరాంబ భార్య అయ్యిందని నమ్ముతూ ఆ కారణంగా ఆ స్వామికి తమ అల్లుడుగా భావిస్తూ శివరాత్రి నాడే జాతర జరుపుతారు. జాతరలో వేలాదిమంది గిరిజనులు, గిరిజనేతరులు పాల్గొని భ్రమరాంబదేవికి మొక్కులు చెల్లించుకుంటారు.

ఆధార గ్రంథాలు :

1. తెలంగాణ సంస్కృతి - కళలు - జాలూరు గౌరీశంకర్ పెన్నా శివరామకృష్ణ.
2. నల్లగొండ జిల్లా జాతరలు - పరిశీలన - డా॥ చింతల యాదయ్య.
3. మేడారం సమ్మక్క - సారలమ్మ జాతర - డా॥ ఆవుల మంజులత.
4. తెలంగాణ సమాజం - సంస్కృతి, సాహిత్యం.
5. తెలంగాణ మాసపత్రిక - జూన్ 2019.

⌘⌘⌘

BHAVAVEENA
Vol. 17, Issue. 8, August 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

దళిత స్త్రీవాద కవిత్వం – సమకాలీన ధోరణులు

– సూరేపల్లి పద్మావతి, సూపరింటెండెంట్, కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్, తెలంగాణ.

భారతీయ సమాజం మిగతా సమాజాల కంటె నిర్మాణంలో ఎన్నో వైరుధ్యాలను, సంక్లిష్టతలను కలిగి ఉన్న సమాజం. మిగతా సమాజాలలో లేని వర్ణం, కులం భారతీయ సమాజం ప్రత్యేకత. ఆ కులం కూడా శాఖోప శాఖలుగా విస్తరించినది. పంచమ కులస్థులుగా ముద్ర వేసి, ఊరికి దూరంగా నెట్టబడి, నీచమైన వృత్తులు అంట గట్టి, వారిపట్ల అస్పృశ్యతను పాటిస్తూ వారిని కనీస మానవులుగా గుర్తించలేదు భారతీయ సమాజం. ఆధునిక యుగంలో సంఘసంస్కరణోద్యమం ప్రారంభానికి ముందే తెలుగులో అస్పృశ్యతా నిరసన కవిత్వం కని పిస్తుంది.

ఆధునిక తెలుగు సాహిత్యంలో స్త్రీవాదం వెన్నంటి వచ్చిన ఉద్యమం దళిత ఉద్యమం వర్గ పోరాటం ద్వారానే స్త్రీల సమస్యలు కూడా పరిష్కారం అవుతాయనే విప్లవ కారుల మాటల్ని విశ్వసించని స్త్రీలు తమ సమస్యలకు తామే పరిష్కారం కనుక్కోవడానికి చేసిన ప్రయత్నమే స్త్రీవాదం. అయితే పురుషాహంకారం మీద, లింగవివక్ష మీద తిరుగుబాటు బావుటాను ఎగర వేసిన స్త్రీవాదం తనకు తెలియకుండానే కొన్ని పరిమితులకు లోబడి పోయింది. స్త్రీవాదం సంపన్న, మధ్యతరగతి ఉద్యోగినుల సమస్యలనే ప్రతిఫలించింది. కానీ అట్టడుగు దళితవర్గాల స్త్రీల సమస్యలను పట్టించుకోలేదనే విమర్శ ఎదుర్కొంది. దళిత స్త్రీలు కుల సమాజంలో అంటరానివారై అనేక ప్రతికూల పరిస్థితుల్లో, ప్రతికూల సామాజిక, సాంస్కృతిక అణచివేతల్లో అక్షరాల్ని అభ్యసించడం ఒక యుద్ధమైతే, వారిలో అతికొద్ది మంది రచయితలై సాహిత్య ప్రపంచం లోకి ప్రవేశించడం చిన్న విషయం కాదు. తమ రచనలను ప్రపంచానికి పరిచయం చేయటానికి మహా యుద్ధమే చేయాలి. వీరిపై మత, కుల పెత్తనం, మగపెత్తనం, కులహింసలు, శ్రమదోపిడీ, పేదరికం, అల్పదోపిడి, నిరక్షరాస్యత, అంటరానితనం అత్యాచారాలు, వెట్టిచాకిరి, అనారోగ్యాలు, బాల కార్మిక వ్యవస్థ, జోగినీ దురాచారం, దొర పెత్తనాలు, దొరసాని పెత్తనాలు, నిరుద్యోగం వంటి అనేక పీడనల్ని ఎదర్కొంటూ, శక్తిగా ఈ సమాజానికి సేవలందిస్తూ కూడా వారు మానవ హక్కులు లేని మనిషిగా గౌరవం లేని వారుగా చూడబడుచున్నారు. ఈ కుల సమాజంలో అంటరాని మగవాళ్ళు బానిసలైతే, ఆ బానిసలకు బానిస దళిత స్త్రీ. దళిత స్త్రీ రచనలు సాహిత్యానికి అంటరానిదిగా పరిగణింపబడుతున్న అప్రజాస్వామిక విధానాలపై తెలుగు సాహిత్యంలో విస్తృత చర్చ జరగాల్సి ఉంది. దళిత స్త్రీ రచనల గురించి మాట్లాడాలంటే, కుల వ్యవస్థ యొక్క సాంఘిక, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక కోణాల్ని జెండర్ దృక్పథంతో అధ్యయనం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఈ క్రమంలో దళిత సాహిత్యంలో దళిత స్త్రీవాదం అనే కొత్తకోణం వెలుగుచూసింది. అయితే 1995లో వచ్చిన "చిక్కనవుతున్నపాట" దళిత కవిత్వ సంపుటిలో ఒక్క దళిత బహుజన కవయిత్రి కూడా లేకపోవడం గమనించదగిన అంశం. దీన్ని గుర్తించిన సంపాదకులలో ఒకరైన జి.లక్ష్మీనరసయ్యగారు తన ముందుమాటలో "దళితుల్లో సగభాగమయిన దళిత స్త్రీలు తమ కోణం నుంచి రాసిన కవితలు ఈ సంకలనంలో లేవు. ముందు ముందు దళిత స్త్రీలు అటు కులపరంగా ఇటు లింగ పరంగా తాము ఎదర్కొంటున్న సమస్యల్ని కవిత్వంగా మలిచినప్పుడు ఇంకా మంచి దళిత కవిత్వం వచ్చే అవకాశం ఉంది. దళిత స్త్రీ దృక్కోణం ఎంతగా బలపడితే అంత సమగ్రత చేకూరుతుంది" అన్న మాటలు తరువాత కాలంలో నిజమయ్యాయి. చల్లపల్లి స్వరూపరాణి, జి.

విజయలక్ష్మి వినోదిని వంటి వారు దళిత స్త్రీల సమస్యలను తమదైన దృష్టికోణం నుంచి ఆవిష్కరించారు.

"నేను ముళ్ళకంపలో చిక్కుకుని
అల్లాడుతున్న పాలపిట్టను
ఎటుకదలినా ముళ్లన్నీ గుచ్చుకునేది నాకే
ఇవి ఈనాటి ముళ్ళుకావు
తరాల నుండీ నా చుట్టూ పేర్చిన బానిస సంకెళ్ళు
ముందు నుయ్యి వెనక గొయ్యిలా
నా చుట్టూ ఎప్పుడూ
ప్రమాదం బుసలుకొడుతుంది
అసలు నా జీవితాన్ని
నేనుగా జీవించిందెప్పుడు
ఇంట్లో పురుషాహంకారం
ఒక చెంప ఛెళ్ళుమనిపిస్తే
వీధిలో కులాధిపత్యం
రెండో చెంప పగలగొడుతుంది".

అని చల్లపల్లి స్వరూపరాణి "మంకెన పూపు" కవితలో ఆవేదన వ్యక్తంచేస్తారు.

దళిత స్త్రీ ఇంట్లో పురుషాహంకారాన్ని వీధిలో కుల వివక్షను ఏకకాలంలో అనుభవిస్తున్న దయనీయ స్థితిని ఆవిష్కరిస్తుంది. దళిత స్త్రీ శ్రమదోపిడికీ, అవమానాలకు గురవుతున్న వైనాన్ని జి. విజయలక్ష్మి "పనిపిల్ల" కవితలో శక్తివంతంగా ఆవిష్కరించారు.

కళ్ళు తెరచినప్పటి నుండీ
కన్నీళ్ళే కళ్ళల్లో నింపుకున్నదాన్ని
అమ్మా అమ్మాకి బదులు
దొర దొరసానీ అని ఏడ్చిందాన్ని
కడుపు నిండా తిన్నది కలలోనే
కులమే నా రంగు
కటిక దరిద్రమే నా కొంగు
కింది మెట్టే నా బతుకు

ఆకలి, దారిద్ర్యం, కులవివక్ష ఎదుర్కొంటున్న దళిత స్త్రీలు పనిమనుషులుగా మిగిలిపోతున్న విషాదాన్ని బొమ్మ కట్టించారు.

దళితవాదం ముఖ్యంగా అంబేద్కర్ ఆలోచనాధారను అనుసరిస్తుంది. గాంధీజీ హరిజనుల కోసం ఎంత శ్రమించినా, హరిజనోద్యమాన్ని నడిపినా గాంధీజీ తత్వం దళిత రచయితలకు ప్రేరణ కాదు. అంబేద్కర్ తాత్విక పునాదిపై వెలసిన దళిత వాదానికి జ్యోతిబాపూలే, శాహుమహరాజ్ మొదలైనవారు మార్గదర్శకులైయ్యారు.

స్త్రీవాదం పేరుతో సవర్ణ స్త్రీలు, దళిత స్త్రీలు అనేక అణచివేతలను, మాట్లాడనివ్వకుండా కేవలం పితృ స్వామ్యంను ఏర్పాటుచేసి సృష్టించిన పదమే "దళిత స్త్రీవాదము". దళిత కులాల్లోని సంప్రదాయాలకు, పూజలకు పునాది స్త్రీలే. దళిత స్త్రీల సాహిత్యం అంటే మౌఖిక సాహిత్యమేనన్న భావన ఉంది. ఆది ఆంధ్ర ఉద్యమ కాలం నుంచి నేటి ఆత్మగౌరవ పోరాటాల వరకూ దళిత స్త్రీలు రచనలు చేస్తున్నారు. 1940కి ముందు దళిత స్త్రీలకు చదువు అందనంత దూరంలో ఉండేది. నిరక్షరాస్యత జనాభాలో దళిత స్త్రీలే ఎక్కువ శాతం ఉన్నారు. దళిత పురుషులతోనూ, అగ్రకుల స్త్రీలతోనూ పోల్చినపుడు అత్యధిక పీడనకు గురవుతున్నది దళిత స్త్రీలే. దళిత పురుషులు శ్రమ దోపిడీకి గురైతే, దళిత స్త్రీలు శ్రమ దోపిడీతో పాటు లైంగిక దోపిడీకి కూడా గురౌపుతున్నారు. దళిత స్త్రీ తన పై కులాల పురుషుల నుంచే కాక తన సొంత మగవాళ్ళ నుండి కూడా దాడికి గురవుతుంది.

ముగింపు :

సమాజంలో ఒక అగ్రవర్ణ స్త్రీ ఒకే రకమైన వివక్షకు అనాదిగా గురవుతూనే ఉంది. కానీ దళిత స్త్రీ అనాదిగా 3 రకాలైన వివక్షకు గురవుతుంది. ఒక స్త్రీగా, ఒక దళిత స్త్రీగా, ఒక భర్తకు స్త్రీగా ఆమె తిన్న దెబ్బలు, ఎదుర్కొన్న సమస్యలు, దళిత స్త్రీ తన కష్టాన్ని తానే అక్షరబద్ధం చేసుకున్న తీరు ప్రశంసనీయం. అయితే ఆమె కష్టం

కవితగా మారటానికి యుగాలు పట్టినది. పురుషాధిక్య సమాజంలోని అణచివేతనీ, కులపరమైన వివక్షనీ ఎదుర్కొంటూ సాగిన ఆ జీవితాలను అక్షరీకృతం చేశారు కవయిత్రులు. దళిత స్త్రీవాద కవితా చరిత్రను నిర్మించుకున్నారు. తరతరాల అణచివేతను ధిక్కార స్వరంతో ఎదిరించినదే "దళిత స్త్రీవాద కవిత్వం" అట్టడుగున ఉన్న ఆయా కులాల నుంచి ఎదిగివచ్చే స్త్రీవాద కవిత్వం నేటి కాలానికి చాలా అవసరం. అన్ని రంగాల్లోనూ స్త్రీ సమానహక్కునీ, స్వేచ్ఛనీ కోరుతుంది. దళిత స్త్రీ సంఘంలో కోరేది తన అస్థిత్వానికి అర్థం, వ్యక్తిత్వానికి, ఆత్మకు గౌరవం, లోకం ప్రదర్శించే నీచత్వానికి విడుదల, నలుగురితో సమానంగా స్వతంత్ర్యంగా, స్వేచ్ఛా జీవిగా, సాంఘిక చైతన్య శక్తిగా దళిత స్త్రీవాద కవిత్వం కొన సాగాలని కోరుకుందాము.

ఉపయుక్త గ్రంథాలు :

1. తెలుగు సాహిత్య చరిత్ర - డా॥ ద్వా.నా. శాస్త్రి
2. తెలుగులో కవిత్వోద్యమాలు - తెలుగు అకాడమి
3. సాహిత్య చరిత్ర-ఎం.ఏ. తెలుగు - ప్ర॥సం॥ పేపరు - 4
4. దళిత స్త్రీవాద కవిత్వం - వికీపీడియా

⌘⌘⌘

BHAVAVEENA
Vol. 17, Issue. 8, August 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

గురజాడ రచనల్లో సమకాలీనత

- రవిందర్ అచ్చ, తెలుగు ఉపాధ్యాయులు, మహాత్మ జ్యోతి బా ఫూలే తెలంగాణ బాలుర గురుకుల పాఠశాల, వెంకటాపూర్, ములుగు (వరంగల్), తెలంగాణ.

తెలుగు సాహిత్యంలో ఆధునిక కాలంలో వేళ్ళ మీద లెక్కించదగిన మహాకవుల్లో, రచయితల్లో ఒకరు గురజాడ వెంకట అప్పారావు గారు. వ్యవహారిక భాషోద్యమానికి పునాదులు వేసిన మహనీయుడాయన. తాను సృష్టించి సాహిత్యంలో వాడుక భాషకు పెద్దపీట వేశారు. సనాతను సంప్రదాయ సంస్కృతి పాటించే కుటుంబంలో పుట్టినా, రాజరిక వ్యవస్థ కాలంలో జీవించినా, ఆధునికతను అర్థం చేసుకున్న మహోన్నతుడు. రచనల్లో అభూత కల్పనలకు తావులేకుండా, వాస్తవికతను వస్తువుగా చేసుకున్నారు. తాను చూసిన, తన అనుభవానికి దగ్గరగా ఉన్నటువంటి విషయాలపై రచనలు చేసి, సమకాలీనతను సాహిత్యంలో ప్రతిబించేటట్టు చేసిన వారిలో మొదటి స్థానంలో నిలిచారు గురజాడవారు. ఇట్టి రచయిత, కవి రచనల్లో సమకాలీనతను దర్శింపచేసే ప్రయత్నమే ఈ పత్ర సమర్పణ వ్యాసం ప్రధానోద్దేశం.

ఏ రచయితైనా, ఏ రచనల చేసినా, ఆ రచనలో సమకాలీనతకు చోటు కల్పించటం... ఆ రచయితకు చాలా సులభం. ఎందుకంటే, సమకాలంలో ... అనగా... రచయిత జీవిస్తున్న కాలంలో ... ఆనాటి సమాజంలో ... అంటే ... తను జీవిస్తూ ఉన్నటువంటి పరిసరాలలో ... మనుషులు చుట్టూ ఉన్న ప్రదేశాలు, సమాజం... మొదలగునవి - అన్నింటీని ప్రత్యక్షంగా చూస్తూ ఉంటారు. కాబట్టి రచయిత జీవిత కాలాన్ని సమకాలం అంటారు.

తెలుగు సాహిత్య రచనలో సమాకాలీనతకు సరైన స్థానం యిచ్చిన సాహిత్యవేత్త గురజాడ. సమకాలంలో సనాతసులతో చీవాట్లు తిన్నా, సమాకల వస్తువుకు సాహిత్యంలో స్థానం కల్పించిన ధైర్యశాలి గురజాడ.

కన్యాశుల్కం, బాల్య వివాహాలు, మూఢ నమ్మకాలు, కులం గొడవలు, మతం లొల్లులు, గ్రాంధిక భాష పెత్తనం, మహిళలను అణిచివెయ్యటం, వ్యభిచారం, తాగుడు వ్యసనం... లాంటి ఎన్నో సామాజిక జాడ్యాల్ని ఆ రోజులలో నిశితంగా పరిశీలించిన గురజాడవారు. వాటిని నిరసించటం, నిర్మూలించటం ప్రధాన ధ్యేయంగా పెట్టుకున్నారు. వీటిపై సాహిత్యం ద్వారా యుద్ధం చేశారు. ఈ విధంగా తెలుగు సాహిత్య రచనలోకి సమకాలీనతను తీసుకరావడం ఒక కొత్త పద్ధతిగా చెప్పుకోవచ్చు. ఇది గురజాడతో మొదలవడం, తెలుగు సాహిత్యంలో గొప్ప మలుపు.

గురజాడ జీవిత కాలం 1862 నుంచి 1915 వరకు సాగింది. అనగా 53 సంవత్సరాలు వారు జీవించారు. 19వ శతాబ్దంలో ఏడో దశాబ్దిలో జననమొది, 20వ శతాబ్ది రెండో దశాబ్దం వరకు వారి జీవనయానం కొనసాగింది. 53 ఏండ్ల జీవిత కాలంలో గురజాడ వారు 3 దశాబ్దాలకు పైగా సాహిత్య సేవ చేశారు. వీరి సాహిత్య కృషి అంతా శతాబ్దాలకు పైగా సాగిన జీవిత కాల పరిస్థితులతో ముడిపడి ఉన్నది.

గురజాడ రచనల్లోని సమకాలీనత స్పష్టీకరించే ప్రయత్నంలో భాగమే ఈ వ్యాస రచన. 1894లో 'కన్యాశుల్కం' నాటకం రచన, 1906లో 'కొండు భట్టీయం' నాటక రచన, 'వ్యవహారిక (వాడుక) భాషోద్యమం' రచన, 1907లో 'నీలగిరి పాటలు' రచన, 1910లో 'దిద్దుబాటు' కథానిక రచన, 'బిల్హణీయం' రచన, 'మీ పేరేమిటి' (పెద్ద కథ), ముత్యాల సరము (గేయం), 'కాసులు' గేయం, 'పూర్ణమ్మ' గేయం, 1913లో 'సుభద్ర' పద్యకావ్య రచన, 1914లో 'దించులంగరు' గేయం, 1915లో 'లగరెత్తుము'...

మొదలగు రచనలు మహాకవి, రచయిత గురజాడు గారు చేశారు.

ఈ రచనల్ని ఒక్కొక్కటి పరిశీలిస్తే, వీటిలో గురజాడ వారు సమకాలీనత ఎట్లా పాదివారో తెలుస్తుంది. 1894కు ముందటి కాలంలో కొన్ని చిన్న చితకా రచనలు చేసినా, గురజాడకు మంచి పేరు తెచ్చిన ప్రధాన రచన 'కన్యాశుల్కం' నాటకం. ఇది వ్యవహారికంలో అనగా, అనాటి ప్రజల వాడుక భాషలో రాయటం జరిగింది. నాటి సమకాలనీనతకు ఈ రచన పట్టం కట్టింది కాబట్టే, చరిత్రలో నిలిచింది. ప్రజలలో గుర్తింపు పొందింది.

'కన్యాశుల్కం' అనగా పెళ్ళి కూతురు తండ్రికి పెళ్ళి కుమారుడు చెల్లించే 'డబ్బు', ఆ రోజులలో ఇటువంటి ఆచారం ఉండేది. అది నేడు వరకట్న రూపంగా మారటం జరిగింది. ఈ వరకట్న సమస్యను నిరసిస్తూ కాళ్ళకూరి నారాయణ రావు గారు 'వరవిక్రయం' నాటకం రాయ టాన్ని మనం గమనించవచ్చు.

'కన్యాశుల్కం' నాటకంలో అనాటి బ్రాహ్మణ సమాజం వాడుక భాషను ప్రయోగించి, సమాజంలో గల దుష్టత్వంపై ధ్వజమెత్తారు గురజాడ వారు.

సమకాలీన రచయితలందరూ గతాన్ని ప్రశంసించి, గతాన్ని తవ్వుకుని, తిరిగి తిరిగి తలకెత్తుకుంటున్న రోజులలో 'మంచిగతమున కొచెమేనోయ్' అని కుండ బద్దలు కొట్టినట్లు గుండె నిబ్బరంతో చెప్పగలిగిన మేథావి గురజాడ ఇతిహాసాలన్నీ అబద్దాల పుట్టలని ఆయన ప్రకటించారు. అతి కామోద్రేక రచనలను చేసిన వారిని, చేయించిన వారిని ఆయన నిరసించారు. సమకాలీన జీవితంలోని సంక్షిష్ట సామాజిక పరిస్థితులను గూర్చి ఆయన తీవ్రంగా ఆలోచించాచరు. 'మృచ్ఛకటికానికి' సాటియైన నాటకంగా 'కన్యా శుల్కాన్ని' తీర్చిదిద్ది సమ కాలీన మేథావి వర్గంలో గురజాడ తన స్థానాన్ని పదిల పరుచుకున్నారు. గురజాడ మధ్య తరగతి అగ్రహారిక బ్రాహ్మణ కుటుంబాల మూర్ఖపు సామాజిక దురాచారా లను కథా వస్తువుగా గ్రహించి సమాజంలోని అట్టడుగు వర్గాల అజ్ఞాత జీవనభీభత్సాన్ని కళాత్మకంగా తీర్చిదిద్ది మానవతా వాడానికి పట్టం కట్టారు.

కన్యాశుల్కం నాటకంలో సగం డైలాగులు మన నిత్య జీవితంలో భాగమైపోయాయంటే అతిశయోక్తి కాదు. "ఆధునిక మహిళ చరిత్రను తిరగరాస్తుంది" చాలా ఆసక్తి కలిగించే వాక్యం. సమకాలీన రచయితల్లో గానీ, కుటుం బాల్లో గానీ, సమాజంలో ఉన్న స్త్రీలలో గానీ ఎవ్వరికీ అంత విశ్వాసం స్త్రీ జాతిపై ఉండి వుండదు. ఆయన చూపిన ఆ విశ్వాసమే ఈనాటి స్త్రీకి చైతన్య స్ఫూర్తినిచ్చే ఒక కరదీపిక అవుతోంది. గురజాడకు సమకాలీన స్త్రీలలో ఏదో శక్తి కనిపించి ఉండాలి. అప్పటి వారు ఎవరూ ఊహించని ఒక ఒక కొత్త ప్రపంచాన్ని చూడగలిగిన దార్శ నికత ఆయనలో ఉండి ఉండాలి. ఇంతకూ, ఆ శక్తి ఏ స్త్రీలలో కనిపించింది ? అంటే ఒకవైపు కుటుంబ వ్యవస్థలో ఉన్న స్త్రీలలోనూ (కమలిని, నాంచారమ్మ), మరోవైపు కుటుంబ వ్యవస్థ వెలుపల ఉన్న స్త్రీలలోనూ (మధుర వాణి, సరళ) ఆయన ఆ శక్తిని గుర్తించారు. ఇంకా పసితనం కూడా పూర్తిగా పోని పూర్ణమ్మలోనూ, కన్యక లోనూ కూడా ఆయన అలాంటి శక్తిని గుర్తించారు. ఈ శక్తి బహుశా సామాన్యుల కంటికి కనిపించేది కాదు.

'దిద్దుబాటు' కథలో కమలినికి వచ్చిన సమస్య ఆ కాలం నుంచి ఈ కాలం వరకూ స్త్రీలందరూ ఎదుర్కొనేది. భర్త వ్యసనాలకో, పరస్త్రీ వ్యామోహానికో గురికావడం, తద్వారా భార్య జీవితం విషాదం - నిత్యమే కాని, వైకల్పికం కాదు. ఇది సాధారణంగా స్త్రీలు తమలో తాము కుమిలిపోవడానికి, లేదా భర్తను వేధించడానికీ, సాధించ డానికీ, చివరికి రాజీ పడిపోవడానికి, లేదా భర్తను వేధించ డానికీ, సాధించడానికీ, చివరికి రాజీ పడిపోవడానికి దారితీసే సందర్భం. కానీ కమలిని పై మూడు పనులు చేయలేదు. అసలు భర్త రోజూ ఆలస్యంగా ఇంటికి రావడానికి కారణమైన విషయం ఒక గంభీరమైన సమస్య అని గుర్తించడం, గుర్తించిన తరాత్త మరెవరికీ చెప్పకుని ఏడవక, దానికి తన పరిష్కారం వెదుక్కోవడం, తక్షణమే

ఆ ఆలోచనను ఆచరణలో పెట్టి సమస్యను పరిష్కరించు కోవడం - ఒక విద్యావంతురాలైన స్త్రీ తన జీవితాన్ని మంచి పద్ధతిలో ఎలా మలచుకోగలదో వ్యాఖ్యానించే గొప్ప రచన.

ఆధునిక మహిళకు నాంచారమ్మ ఖచ్చితంగా మార్గ దర్శకురాలు. 'మీ పేరేమిటి?' కథలో నాయకత్వ లక్ష ణాలు సమృద్ధిగా ఉన్న ఈమె స్త్రీలు చరిత్రను తిరగరాస్తారు అన్న విశ్వాసాన్ని కలిగించే పాత్ర. సంస్కర్త హృదయంలో సరళ కావడానికి 'తప్ప' వృత్తిని నిర్వహించే వ్యక్తి అయినా, ఆమెలోని మేధ, సంస్కారం, చూడగలగడం, స్త్రీలు తమ గురించి తాము ఆలోచించాలని చెప్పడం.

'కన్యాశుల్కం'లో వేశ్యను ఒక సామాజిక చైతన్య మూర్తిగా చూడం ద్వారా ఒక స్త్రీని విముక్తం చేయడానికి అన్ని వర్గాలకు చెందిన స్త్రీలు (బాల వితంతువులు, పునిస్త్రీలు, వేశ్యలు) ఎలా కలిసికట్టుగా పూనుకోవాలో కూడా చూపారు గురజాడ. ఇప్పుడున్న అన్ని సమస్యల విషయంలోనూ స్త్రీలలో ఇలాంటి ఐక్యత సాధ్యమైతే వాళ్ళు చరిత్రను నిజంగా తిరగరాయగలరు అని గురజాడ వారు సాహిత్యం ద్వారా నిరూపించారు.

సంకోచాలు లేకుండా సమకాలీన సామాజిక రుగ్మతను ఎత్తిచూపిన గురజాడ వారి సూటిదనాన్ని దిగంబర కవిత్వంలో మనం చూస్తాము. 'నరుల చెమటను తడిసి మూలం - ధనం పంటలు పండవలెనోయ్' అన్న గుర జాడ దృక్పథ స్ఫూర్తి విప్లవ కవిత్వంలో కనబడుతుంది. "ఆధునిక స్త్రీ చరిత్రను తిరగ రచిస్తుంది. 'అంటూ వంద సంవత్సరాలకు పూర్వమే ప్రకటించిన గురజాడ భవిష్య ద్దర్శనం స్త్రీవాద సాహితీ వేత్తల ఆదరణ పొందుతున్నది. 'మంచి చెడ్డలు మనుజులందున ఎంచి చూడగ రెండె కులములు', వర్ణధర్మం అధర్మ ధర్మమని' నిర్వచించిన గురజాడ దృష్టి దళిత రచయితలకు ప్రీతి పాత్రమే. 'మతములన్నియు మాసిపోవును - జ్ఞానవాద సాహిత్య ధోరణులన్నీ గురజాడ సాహిత్యంలో అన్వేషించాల్సిన అంశాలు ఇంకా ఎన్నో ఉన్నాయి.

'పూర్ణమ్మ' కథా కావ్యంలో పూర్ణమ్మ తనకు ముసలి వాడితో వివాహం నిశ్చయిమని తెలిశాక, అమ్మా నాన్న దీవిస్తుంటే పక్కున నవ్వుతుంది. తన జీవితంలో అపసవ్యత ఆమెకు అర్థమైంది. తన తండ్రి తనను ఎలా "ఉపయోగించుకుంటున్నదీ" అర్థమైంది. ఇకపై తన జీవితం ఎంత దుర్భరంగా ఉండబోతుందో ఆమెకు తెలిసింది. అందుకే తన జీవితంపై తనకు ఉన్న హక్కును ఆత్మహత్య ద్వారా నిరూపించుకుంది.

ముగింపు :

ఆధునిక సాహిత్యంలో రాజ్యాన్ని దానికి ప్రాతినిధ్యం వహించే పాలకుడినీ ధిక్కరించిన తొలి స్త్రీ 'కన్యక'ను కన్యక కవిత్వం ద్వారా నిరూపించారు గురజాడ.

గురజాడ సమకాలీన చైతన్య, నిండిన మేధావి. సంస్కరణ దిశగా సాహిత్య కృషి చేసిన గొప్ప రచయిత, కవి, సాహిత్యవేత్త. తదనంతర కాల రచయితలకు ఆదర్శంగా నిలిచిన చైతన్య స్ఫూర్తి, మూర్తి.

ఆధార గ్రంథాలు :

1. గురజాడ రచనలు - సామాజిక చైతన్యం - కె. రుక్మిణీ కుమారి
2. గురజాడ మానవతావాదం - బి. భారతి
3. గురజాడ రచనలు - సామాజిక విలువలు - సిప్పో రాకుమారి
4. గురజాడ స్త్రీ పాత్రలు - ఎన్. రజని
5. గురజాడ సామాజిక సాహిత్య దృక్పథం - ఎస్. శ్రీదేవి
6. కన్యా శుల్కం - ఒక పరిశీలన
7. భాషా సాహిత్య విమర్శకుడిగా గురజాడ - టి. కిరణ్‌బాబు

⌘

BHAVAVEENA
Vol. 17, Issue. 8, August 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

చిల్లర దేవుళ్ళు నవల విశ్లేషణ

– ఖు. మోతీ నాయక్, పరిశోధక విద్యార్థి, హైదరాబాద్ విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

1946 నుంచి 1951వరకు సాగిన తెలంగాణా సాయుధ పోరాటం అభ్యుదయ సాహిత్యానికి స్వర్ణ యుగం. ఆ ఉద్యమం ఒక్క తెలుగు దేశంలోనే కాదు "విశ్వం నాలుగు చెరగులా" ఎందరినో ప్రభావితం చేసింది. పోరాటం జరుతున్న కాలంలో తర్వాత కూడా తెలంగాణా పోరాట స్ఫూర్తితో రచనలు వెలువడ్డాయి తెలంగాణా విమోచనోద్యమ రచయితలు కవిత్వం, కథ, పాట, నాటకం, నాటిక మొదలైన సాహిత్య ప్రక్రియలనూ, బుర్రకథ, ఒగ్గుకథ, బుడబుక్కల కథ, హరికథ, వీధి భాగవతం, యక్షగానం మొదలైన చూపారు.

ప్రజాకళారూపాల తర్వాత తెలుగు సాహిత్యమే గర్వించదగ్గ నవలా సాహిత్యాన్ని తెలంగాణా రైతాంగ పోరాటం సృష్టించింది. వీటిలో పోరాటం సాగుతూ ఉండగా 1947లో వెలువడ్డ తొలి నవల బొల్లిముంత శివరామకృష్ణ రచించిన "మృత్యుంజయులు". లక్ష్మీకాంత మోహన్ రచించిన "సింహ గర్జన" (1950) వెలువడ్డాయి. పోరాట విరమణ తర్వాత వట్టికోట ఆళ్వార్ స్వామి "ప్రజల మనిషి" (1955) వారిదే "గంగు" (1965) (అసంపూర్తి నవల), మహీధర రామ్మోహనరావు "ఓనమాలు" (1956), "మృత్యువు నీడల్లో" (1962) మొదలైన నవలలు వెలువడ్డాయి.

"ప్రజల మనిషి" తెలంగాణా గురించి తెలంగాణా వ్యక్తి రాసిన తొలి నవల ఇది 1934-40ల మధ్యకాలం నాటి తెలంగాణా పరిస్థితులను వివరిస్తుంది. 1946 - 53 మధ్యకాలంలో మూడు సంవత్సరాలకు పైగా జైల్లో ఉన్నప్పుడు ప్రారంభించి 1952 నాటికి పూర్తి చేసిన "ప్రజల మనిషి" 1955 జనవరిలో వెలువడింది. ఆ నవల రంగాచార్యమీద తీవ్ర ప్రభావం వేసింది.

వట్టికోట ఆళ్వార్ స్వామి తెలంగాణా ప్రజా జీవితాన్ని నవలలుగా రాసేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకున్నారు. ఆ క్రమంలోనే రెండో నవల "గంగు" రచన ప్రారంభించారు. అప్పటికి రంగాచార్య ఉద్యోగరీత్యా సికిందరాబాద్ కు చేరుకున్నారు. ఆళ్వార్ స్వామి రంగాచార్యకు బంధువు కూడా కావడం, ఇద్దరిదీ పోరాట, సాహిత్య నేపథ్యం కావడంతో వారి మైత్రి బలపడింది. "గంగు" ఇతివృత్తం గురించి, తన ప్రణాళిక గురించి రంగాచార్యతో తరుచు చర్చిస్తుండేవారు వట్టికోట. 1961 ఫిబ్రవరి 6న వట్టికోట ఆళ్వార్ స్వామి మృతితో "గంగు" అసంపూర్తిగా మిగిలింది. అదే రూపంలో 1965లో పుస్తకంగా వెలువడింది.

తెలంగాణా ఉజ్వల పోరాట చరిత్రను నవలీకరించాలన్న వట్టికోట ఆశయం మధ్యలోనే ఆగిపోవడం రంగాచార్యకు బాధ కలిగించింది. అళ్వార్ స్వామి వదిలి వెళ్లిన శేష కార్యాన్ని ఎవరైన పూర్తిచేస్తారేమోనని కొంతకాలం ఎదురుచూశాడు. ఆ శేషాన్ని పూర్తి చేయడం సామాన్య విషయం కాదు. నిజాం కాలం నాటి తెలంగాణా పరిస్థితులపై అవగాహన ఉండాలి. వాటిని అర్థంచేసుకోగల తాత్త్విక జ్ఞానం ఉండాలి. దీనికి తోడు ఆ చరిత్రను నవలీకరించే ప్రజ్ఞపాటవాలు కావాలి. ఈ పరిస్థితుల్లో ఎవరూ ముందుకు రాలేదు. చివరకు ఆ కార్యభారాన్ని తన భుజస్కంధాలపై వేసుకున్నాడు రంగాచార్య. "నేను కూడా పూనుకోకుంటే "జన్మజన్మాల బూజు నిజాం రాజు" ధర్మప్రభువుగా చలామణి అవుతాడని భయం. అందువల్ల తప్పనిసరి పరిస్థితుల్లో నేను నవల రాయడానికి పూనుకోవాల్సి వచ్చింది" అంటారు.

రచన :

రంగాచార్య నవలా రచనకు సిద్ధపడిన తర్వాత సాంతంగా ఒక ప్రణాళికను సిద్ధంచేసుకున్నారు. దాని

ప్రకారం తొలి నవలలో 1938కి పూర్వపు తెలంగాణా జన జీవితాన్ని చిత్రించాలనుకున్నారు. "ప్రజల మనిషి" కూడా ఇదే కాలాన్ని చిత్రిస్తుంది. అయితే రంగాచార్య అళ్వార్ స్వామి బాటలో కాకుండా, తన సొంత దృక్పథంలో నవలలు రాయాలనుకున్నారు. అందుకే సొంత ప్రణాళిక. తెలంగాణా చరిత్రలో 1938 ఒక మైలురాయి. ఆ సంవత్సరమే "హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్"ను ఏర్పాటు చేయాలనుకున్నారు. అయితే పార్టీ ఏర్పడకముందే నిజాం దాన్ని నిషేధించాడు. అంటే అప్పటికి తెలంగాణా ప్రజలో కొంత చైతన్యం వచ్చింది. తెలంగాణా చరిత్రలో 1938 ఒక విభజన రేఖ లాంటింది. అందుకే రంగాచార్య తొలి నవలలో 1938కి పూర్వపు తెలంగాణా ప్రజా జీవితాన్ని వస్తువుగా ఎంచుకున్నారు.

రంగాచార్య నవలా రచనకు సిద్ధమైన తర్వాత తెలుగు, హిందీ, ఉర్దూ, ఇంగ్లీష్ భాషల్లో అనేక నవలలు చదివారు. నవలా రచన గురించి ఇంగ్లీష్ పుస్తకాలూ చదివారు. 13.10.1964న ప్రారంభించిన నవలా రచన 10. 11. 1964 నాటికి పూర్తిచేశారు. అయితే అందులో రంగాచార్యకు కొన్ని లోపాలు కనిపించాయి మాడపాటి హనుమంతరావు, ఆర్యసమాజానికి చెందిన పండిట్ నరేంద్రజీల సలహాలు తీసుకుని నవలలో కొన్ని మార్పులు చేర్పులు చేశారు. నవలకు "రాతి మనుషులు" అని పేరుపెట్టి "ఆంధ్ర ప్రభ"కు పంపించారు. తన నవలకు బహుమతి వస్తుందని ఆశించారు. కానీ నవల వెనక్కి వచ్చింది. దాంతో మంచి నవల రాయలేదనుకుని మూలన పడేశారు. తర్వాత నార్ల చిరంజీవితో రంగాచార్యకు పరిచయం ఏర్పడింది. నార్ల చిరంజీవి సూచనమేరకు దేవులపల్లి రామానుజరావు సూచనలు తీసుకున్నారు. నవలకు నార్లచిరంజీవి "చిల్లర దేవుళ్ళు" అని పేరు పెట్టాడు. "ప్రగతి" వారపత్రిక, ఎమెస్కో పాకెట్ బుక్స్‌వారికి పంపించారు. ఇద్దరు ప్రచురిస్తామని ఉత్తరాలు రాశారు. అయితే చిల్లర దేవుళ్ళు ప్రగతి వార పత్రిక తొలి సంచిక (21.3.1969) నుంచి 13.6.1969 వరకు 13 వారాలు సీరియల్‌గా వచ్చింది. 1969 డిసెంబర్లో ఎమెస్కో వారు పుస్తకంగా ప్రచురించారు. "నిజాం నిరంకుశ పాలనలో ఊరూ పేరూ మాసిన ఆంధ్రజాతికి ఒకతీరూ, తెన్నూ కల్పించిన పద్మభూషణ, ఆంధ్రపితామహ శ్రీ మాడపాటి హనుమంతరావు పంతులు" గారికి అంకితం ఇచ్చారు. తెలంగాణా పాత్రోచిత భాషతో వచ్చిన "చిల్లర దేవుళ్లు" ఆనాడు చర్చనీయాంశం అయింది. తెలుగు సాహిత్యంలో తొలి నవలతోనే నవలాకారుడిగా రంగాచార్య తన స్థానం సుస్థిరం చేసుకున్నారు.

"చిల్లరదేవుళ్లు" నవలకు 1971లోనే ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ అవార్డు వచ్చింది. హైదరాబాద్ ఆకాశవాణి కేంద్రం 1971 జులై 19 నుంచి నాటకంగా ప్రసారం చేసింది. నవలను రంగాచార్యనే నాటకీకరించారు. కాకతీయ పిక్చర్స్ వారు సినిమాగా తీశారు. అది 11.3.1977న విడదలైంది. ప్రొఫెసర్ భీమ్ సేన్ నిర్మల్ చిల్లరదేవుళ్లను "ఘాట్‌కి దేవత" పేరుతో హిందీలోకి అనువదించారు. దాన్ని "లోక్ రాజ్" హిందీ పక్షపత్రిక సీరియల్ గా ప్రచురించింది. గీతాప్రకాశన్, హైదరాబాద్ వారు 1990లో పుస్తక రూపంలో వెలువరించారు. భీమ్ సేన్ నిర్మల్ హిందీ అనువాదానికి దక్షిణ భారత హిందీ ప్రచార సభవారి అవార్డు లభించింది. చక్రవర్తుల శేషాచార్యులు "Lesser Deities"గా ఇంగ్లీష్ లోకి అనువదించారు. దాన్ని తెలుగు విశ్వవిద్యాలయంవారు ప్రచురించారు. పలు విశ్వవిద్యాలయాల్లో చిల్లరదేవుళ్లపై ఎంఫిల్ కోసం పరిశోధన జరిగింది. పలు యూనివర్సిటీల్లో పాఠ్యాంశంగా ఉంది.

కథా పరిచయం :

1938కి పూర్వపు తెలంగాణా ప్రజల జీవితమే "చిల్లర దేవుళ్లు" కథా వస్తువు అందుకే రంగాచార్య కొందరు వ్యక్తుల జీవితాలను కాక, ఆనాటి సమాజానికి ప్రతిబింబమైన సంపూర్ణ గ్రామ జీవితాన్ని కథా వస్తువుగా స్వీకరించాడు. గ్రామానికి రెడ్డి, కరణం, రైతు, కోమటి, చాకలి, మంగలి, మాల మాదిగలు సప్తాంగాల వంటివారు, వారితో నాటి గ్రామ వ్యవస్థ తీరుతెన్నులను ప్రదర్శిస్తూనే,

అమానుషమైన దొరలు, అధికారుల దోపిడి, దుర్మార్గాలు, వెట్టి, బేగరిలాంటి కట్టుబాట్లు, ఆడబాపల దుర్భర జీవితాలను వర్ణించాడు.

రామారెడ్డి ఆ గ్రామానికి దేశ్ ముఖ్. వెంకట్రావు ఆ గ్రామానికి పట్వారీ (కరణం), వీరిద్దరి దయాదాక్షిణ్యాల మీదే గ్రామ ప్రజల జీవితం ఆధారపడి ఉంటుంది. ఇద్దరికీ అభిప్రాయ భేదాలు ఉన్నా, ప్రజలను దోచుకోవడంలో మాత్రం ఒక్కటిగానే ఉంటారు. గ్రామంలో దొరది మాత్రమే పెద్ద గడీ (భవనం), మిగతా ఒకటి రెండు పెంకుటిళ్లు తప్ప అన్ని పూరి గుడిసెలే. "ఈ గడీ వటవృక్షం. దీని నీడన ఏ గడ్డి మొలవడానికి వీలు లేదు. ఒక ప్రాణి కోసం, కాకుంటే ఒక్క కుటుంబం కోసమే ఈ ఊరంతా వెలిసి నట్లుందని" అనుకుంటాడు పాణి, ఆ గడిలో దొర, దొర భార్య, కూతురు మంజరి ఉంటుంది. వీరితో పాటు ఆడబాప వనజ కూడా ఉంటుంది. దొర కరణం అంత విషపు మనిషి కాదు. అతనిది కళా హృదయం, రసిక ప్రియులు అందుకే సంగీత విద్వాంసుడు సారంగపాణికి ఆశ్రయం కల్పించాడు. పాణి కరణం కూతురు తాయారుకు, మోతుబరి రైతు నారయ్య కూతురు సీతకు సంగీత పాఠాలు చెప్పుకుని బతుకుతుంటాడు.

బ్రిటిషాంధ్ర నుంచి వచ్చిన సారంగపాణికి చాలా విషయాలపై అవగాహన ఉంటుంది. దాంతో దొరకు, కరణానికి పాణిపై సదభిప్రాయం ఏర్పడుతుంది కరణం కూతురు తాయారు, దొర కూతురు మంజరి పాణిపై ప్రేమను పెంచుకుంటారు. తాయారు తన ప్రేమను బాహాటంగా వ్యక్తపరిస్తే, మంజరి మనసులోనే దాచుకుంటుంది. పాణి వనజకు సన్నిహితంగా ఉంటాడు. తను ఆడబాప అన్న విషయం గ్రహించిన వనజ పాణిని అన్నగా స్వీకరిస్తుంది.

లంబాడీల భూమి సమస్య నవలలో ప్రధాన పాత్ర వహిస్తుంది. కరణం భూమి ఇస్తానని అటు లంబాడీల నుంచి డబ్బులు తింటాడు. ఆ భూమి నారయ్య అధీనంలో ఉంటుంది. ఆ భూమిని నారయ్య పేర పట్టా చేయిస్తానని నారయ్యతో డబ్బులు వసూలు చేస్తాడు. చివరికి లంబాడీలు కరణం ఇంటి పైకి దాడికి వస్తారు. వారిని పోలీసుల చేత కొట్టించి, చిత్రహింసలు పెట్టిస్తాడు. పోలీస్ అమీన్ లంబాడీ లక్ష్మిని బలాత్కారం చేయబోగా ప్రతిఘటించే పరిస్థితుల్లో ఆమె మరణిస్తుంది. ఆమె భర్త భీక్యా కూడా పోలీసుల అమానుషానికి గురై మరణిస్తాడు. చివరకు కరణం లంబాడీల చేతిలో దారుణ హత్యకు గురవుతాడు.

చింతకాయల దొంగ పీరిగాని విషయంలో పాణి సలహాను దొర తిరస్కరిస్తాడు. తర్వాత పీరిగాని హత్య విషయంలో దొర కరణానికి లొంగాల్సి వస్తుంది. అప్పుడు కరణం తాయారును పెళ్లి చేసుకోవడానికి పాణిని ఒప్పించమంటాడు. తాయారుతో పెళ్లికి పాణి ఒప్పుకోక పోవడంతో ఇంట్లో నుంచి వెళ్ళిపొమ్మంటాడు దొర. అలా ఇంట్లోంచి వెళ్లిపోయిన పాణి మద్రాసు వెళ్లి సినిమాలకు పాటలు పాడుతుంటాడు. గ్రామంలో ఉన్న దొరకు ఆరోగ్యం విషమిస్తుంది. దాంతో ఆయనను వైద్యం కోసం మద్రాసుకు తీసుకెళతారు. అక్కడ దొర కుటుంబానికి పాణి కనిపిస్తాడు. వారికి మద్రాసులో పాణి స్నేహితుని సహాయంతో ఆశ్రయం కల్పిస్తాడు. ఆ సందర్భంలో సారంగపాణి చిన్నతనంలో బెజవాడకు కృష్ణా స్నానాలకు వెళ్లినప్పుడు తప్పిపోయిన రామారెడ్డి అల్లుడన్న విషయం బయటపడుతుంది. చివరకు దొర క్యాన్సర్ వ్యాధితో మరణిస్తాడు.

నవలలలో మాడపాటి హనుమంతరావు, నరేంద్రలు సజీవ పాత్రలు మతమార్పిడి ద్వారా ముస్లింలుగా మారిన వారిని తిరిగి హిందూమతంలో చేర్పించే శుద్ధి ఉద్యమం నిర్వహించిన ఆర్యసమాజం ద్వారా నరేంద్రను ప్రవేశ పెట్టారు. నాటి తెలంగాణాలో గ్రంథాలయోద్యమం, నిజాం రాష్ట్రాంధ్ర జనసంఘం, ఆంధ్ర మహాసభ, నాటి తెలంగాణా పరిస్థితుల కోసం మాడపాటి హనుమంత రావును ప్రవేశ పెట్టారు. వీటితోపాటు బతుకమ్మ, దసరా

ఉత్సవాలను చేర్చడం నవలకు నిండుదనాన్ని చేకూర్చాయి.

పరిశీలన :

బ్రిటీష్ వారి అధీనంలోని భారతదేశం సహా, ప్రపంచ మంతా రాజకీయంగా చైతన్యవంతమై, పారిశ్రామికంగా విజయాలు సాధిస్తుంటే, నిజాం పరిపాలనలోని హైదరాబాద్ సంస్థానం మాత్రం మధ్య యుగాలనాటి చరిత్రకు ప్రతిబింబంగా ఉండిపోయింది. పేరుకు నిజాం ప్రభువు అయినా, పెత్తనమంతా జాగిర్దార్లది. ఇక గ్రామాల్లో అధికారం మంతా దొరలు, పటేల్, పట్వారీలది. వీరికి అమీలాంటి అధికారుల అండ ఉంటుంది. ప్రజలను అజ్ఞానాంధకారంలో ముంచి, వారి ఆస్తిపాస్తులు, రక్త మాంసాలను జలగల్లా పీల్చారు. తమ ఆధీనంలో భూమి పైనే కాదు ఆ భూమిని ఆశ్రయించుకొని జీవనం సాగిస్తున్న వ్యక్తులపై కూడా సర్వాధికారాలు ప్రదర్శించారు. ఈ పరిస్థితి తెలంగాణాలో ఆంధ్రమహాసభ కాలం నాటి వరకు కొనసాగింది. ఇలాంటి సామాజిక అంశాలను తన పాత్రల ద్వారా అద్భుతంగా చిత్రించారు రంగాచార్య.

గ్రామానికి సంబంధించినంతవరకు దొర మాట శాసనం. అది ఎలాంటిదైనా అమలు జరగాల్సిందే. అందుకే చింతకాయలు దొంగతనం చేసిన పిరిగాడు దొర ఆగమన్న ఆగకుండా పారిపోవడం దొర తట్టుకోలేకో పోతాడు. అప్పటివరకు దొర ఆజ్ఞకు ధిక్కారం జరగలేదు. అందుకే వాణ్ణి పట్టి తెప్పించి చావ గొట్టించాడు. కేసు నుంచి తప్పించుకోవడానికి, పీరిగాని పెళ్లం పీరిని పిలిపించి దినవారాలకు పైకం ఇస్తాడు. తల్లీ పిల్లలు వచ్చి గడీలోనే ఉండమంటాడు. అప్పుడు పీరి, "దొరా నీ బాంచదాన్ని, దరమ దొరలు. దేవడిట్ల రాసిండు మొకాన. మీరేం చేస్తరుండి" అని ఏడుస్తూనే అంటుంది. (పే. 116). భూస్వామ్య వ్యవస్థలో ఒకణ్ణి హత్యచేసినా అది దొర నేరస్తుడు కాదు. అసలు అది తప్పు అనే విషయమే వారికి తెలియదు. అందుకే తమ తలరాత అనుకొని సమాధాన పడతారు.

నవలలో హిందువులను ముస్లింలుగా మార్చే సన్నివేశాలు మరో ముఖ్యాంశం ఆనాడు అదొక ఉద్యమంగా సాగింది. మతపరివర్తన కోసం నిజాం ఒక ప్రత్యేకశాఖను ఏర్పాటు చేశాడు. ఆర్థికంగా, సామాజికంగా వెనకబడ్డ మాలమాదిగ వర్గాలను ముస్లింలుగా మార్చి తమ జనాభాను పెంచుకోవాలనుకుంటాడు నిజాం మత పరివర్తనలో మగవారి మొలతాడులు తెంపడం, ఆడవారు తాళిబొట్టు తీయడానికి నిరాకరించడం, వారి బొట్లు తుడిపేయడం లాంటివి చాలా హృద్యంగా చిత్రించారు రంగాచార్య. (పే. 21, 22) భోజనాల దగ్గర "మేం మాల తురుకోండ్లమే, వాళ్లు మాదిగ తురుకోలే" (పే.23) అని వేర్వేరు పంక్తుల్లో భోంచేస్తారు. "మతం, భాష మనుషులను ఏకం చేయలేవు. వాటి వల్ల రాజకీయులకు తప్ప ప్రజలకు ఎలాంటి ప్రయోజనమూ ఉండదంటారు" రంగాచార్య. అయితే ముస్లింలుగా మారిన ప్రజలను అటు హిందువులు, ఇటు ముస్లింలు కూడా దగ్గరికి రానివ్వరు. దాంతో బతుకుదెరువు కోసం తప్పనిసరి పరిస్థితుల్లో, శుద్ధి ఉద్యమం ద్వారా మళ్లీ హిందువులుగా మారుతారు. శుద్ధి ఉద్యమాన్ని నరేంద్రజీ నాయకత్వంలో ఆర్యసమాజ్ చేపడుతుంది. నవలలో నరేంద్రజీ సజీవ పాత్ర.

నవలలో మరో సజీవ పాత్ర మాడపాటి హనుమంతరావు. చిల్లరదేవుళ్లు నవల 1938నాటికి ముందు మొత్తం తెలంగాణాను చిత్రిస్తుంది. ఆ మొత్తం పరిస్థితులు నవలలో చిత్రించాలంటే కష్టమవుతుంది. అందుకే రచయిత మాడపాటి హన్మంతరావును ప్రవేశపెట్టారు. పాణి హైదరాబాదుకు వచ్చినప్పుడు మాడపాటిని కలుసుకుని తెలంగాణా పరిస్థితులను చర్చిస్తారు. వారి చర్చలో, నాటి హైదరాబాద్ లో తెలుగు భాషా దీన స్థితి, గ్రంథాలయోద్యమం, ఆంధ్రోద్యమం, ఆంధ్రమహాసభ, సంస్థానంలో జనాభా తదితర అంశాలను ఏకబిగిన చర్చిస్తారు. (పే. 40) చర్చలో ముక్కోటి ఆంధ్రులు ఒక్కటవుతారని, హైదరాబాద్ రాజధానిగా విశాలాంధ్ర ఏర్పడుతుందని అంటారు మాడపాటి. దీనిపై రచయిత

నవల రాసేనాటి పరిస్థితులు కనిపిస్తాయి. అప్పటికి హైదరాబాద్ రాజధానిగా ఆంధ్రప్రదేశ్ ఏర్పడింది. అందుకే రంగాచార్య ఈ అంశాన్ని మాడపాటి చేత చెప్పించారు. అయితే విశాలాంధ్ర ఆలోచన తెలుగువారికి మొదటి నుంచి లేదు. ఆ ఆలోచన కమ్యూనిస్టులది. 1940లలో ''విశాలాంధ్రలో ప్రజారాజ్యం'' అనే పుస్తకం ద్వారా ఆలోచన రేకెత్తించారు పుచ్చలపల్లి సుందరయ్య.

''చిల్లర దేవుళ్ల'' లో భూమి సమస్య ప్రధానంగా చిత్రించబడింది. భూమి పట్టా విషయం పట్వారీ చేతిలో ఉంటుంది. అందుకే పట్వారీలు భూమి ఆశ చూపించి ప్రజలను మోసం చేసేవారు. కరణం వెంకట్రావు భూమి ఆశ చూపించి అటు లంబాడీల వద్ద, ఇటు నారయ్య వద్ద డబ్బులు వసూలు చేస్తాడు. ఆ భూమి నారయ్య ఆధీనంలో ఉంటంది. పంట ఆయనే పండించు కుంటాడు. చివరికి విసిగిపోయిన లంబాడీలు కరణం ఇంటికి గుంపులుగా వస్తారు. కరణం వారిని పోలీసుల చేత కొట్టస్తాడు. లంబాడి లక్ష్మిపై అమీన్ అత్యాచారం చేయబోగా, ఆమె తప్పించుకోబోయి ప్రాణాలు కోల్పో తుంది. దీనికి ప్రతికారంగా లంబాడీలు కరణాన్ని ముక్కలు ముక్కలుగా నరికి హత్యచేస్తారు. ఆమె భర్త భీక్యా కూడా పోలీసుల చేతిలో మరణిస్తాడు. అయితే, దాశరథి రంగాచార్య లంబాడీలు కరణాన్ని హత్యచేయడం వారిలో వచ్చిన చైతన్యంగా గుర్తిస్తారు. కాని, బానిస బతుకులతో విసిగి వేసారిన జనం దొరలను హత్య చేసిన సంఘటనలు, ప్రభుత్వాలకు ఎదురుతిరిగిన సందర్భాలు తెలంగాణాలో మొదటి నుంచి ఉన్నాయి. ఈ సంఘటన అందులో భాగంగానే కనిపిస్తుంది.

''చిల్లర దేవుళ్లు'' నవలలో పాణి, మంజరి మినహా మిగిలిన పాత్రలన్ని యథార్థాలే. వనజ ఆడబాష. నాటి సమాజంలో ''ఆడబాప''లు దొరతనానికి చిహ్నం ఎంతమంది ఆడబాపలుంటే అంత గొప్ప. వారు దొరకు, దొర ఇంటికి వచ్చే వారికి భోగవస్తువులు, వారి హృదయంతో ఎవరికీ అవసరం లేదు. వచ్చేవారి కోరికలు తీర్చడమేవారి పని. అలాంటి దుర్మార్గమైన వ్యవస్థకు మచ్చుతునక వనజ. అలాంటి వనజకు కూడా హృదయం ఉందనే విషయం గుర్తుచేస్తాడు పాణి. మంజరి దొర తనానికి చిహ్నం. పాణి పాత్ర కల్పితమైన పాత్ర అయినా, ఆ పాత్రకు న్యాయం చేయగలిగారు రంగాచార్య. నాటి తెలంగాణా వెనకబాటు తనాన్ని అర్థం చేసుకోవాలంటే, నిజాం వెలుపల అభివృద్ధి ఎలా ఉందో, వారు ఎలా చైతన్యవంతులై ముందుకు అడుగులు వేస్తున్నారో అర్థం చేసుకోవాల్సి ఉంటుంది. తెలంగాణాకు, తెలంగాణేతర ప్రాంతాలకు మధ్య తేడాను పాణి ద్వారా తెలియపరి చారు రంగాచార్య.

నవల చివర్లో పాణి దొరకు మేనల్లుడు కావడం సినిమా షక్కీగా ఉందని విమర్శకుల అభిప్రాయం. అయితే 1960ల నాటికి అభ్యుదయ కవులు కొందరు సినిమా బాట పట్టారు. రంగాచార్య సోదరులు దాశరథి కృష్ణమాచార్య 1962లో సినీరంగంలోకి ప్రవేశించారు. 1960ల తర్వాత పత్రిక, పుస్తక ప్రచురణ, సినిమాల్లో వ్యాపారాత్మక ధోరణి పెరిగింది. వీటి ప్రభావంతో ''సినిమా ప్రక్రియలోని ఫోటోగ్రఫీ శిల్పంతో కూడిన కథాకథన ప్రభావం కూడా నవలల మీద కన్పిస్తున్నది. అందుకే కొన్ని నవలలు సినిమాలలాగా స్ఫురించడం, కొద్ది కొద్ది మార్పులతో సినిమాలుగా రూపొందడం జరుగుతున్నది.'' ''చిల్లర దేవుళ్లు'' నవలపై సినిమాల ప్రభావం ఉండి ఉండవచ్చు. ఔత్సాహిక పరిశోధకులు ఈ అంశాన్ని ప్రత్యేకంగా పరిశోధనకు ఎంచుకుని పరిశీలించవచ్చు.

రంగాచార్య వాస్తవ సంఘటనలు చెప్పేందుకు కాల్పనిక కథను జోడించారు వాస్తవికతను మాత్రమే చెపితే, పాఠకులు స్వీకరించరు పైగా అది డాక్యు మెంటరీగా ఉంటుంది. ఆ వాస్తవికతకు కాల్పనికతను జోడించినప్పుడు అది పాఠకులను చదివింపజేస్తుంది. అయితే నవలలో కొన్ని సంఘటనలు, పాణి, వనజ, తాయారు సీతల మధ్య సంభాషణలు, సంగీతం గురించి పాణి దొరకు ఉపన్యాసాలు ఇవ్వడం కొంచెం అతిగానే

కనిపిస్తాయి. "రచయితకు వాస్తవికతపై ఎంత అభిమానం ఉన్నా కాల్పనికతపై మోజు కూడ తక్కువ లేదు." ఆ అతిని వదిలేస్తే, నాటి తెలంగాణా ప్రజల వాస్తవ స్థితి గోచరమవుతుంది. నాటి తెలంగాణాలో బతుకమ్మ, దసరా ఉత్సవాలు నవలకు నిండుదనాన్ని చేకూర్చగా, మాడ పాటితో చర్చ నవలకు ఒక చారిత్రకతను ఆపాదించింది. చిల్లరదేవుళ్లు తెలంగాణా జన జీవితాన్ని, సంస్కృతిని ప్రతిబింబించే గొప్ప సాంఘిక, చారిత్రక నవల.

ఆధార గ్రంథం :

డా॥ రంగాచార్య, దాశరథి. చిల్లరదేవుళ్ళు

⌘⌘⌘

BHAVAVEENA
Vol. 17, Issue. 8, August 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

'బంజారా పండుగలు – మానవ సంబంధాలు'

– బానోత్ స్వామి, తెలుగు విభాగము, కాకతీయ విశ్వవిద్యాలయము, వరంగల్.

భారతదేశంలో నివసిస్తున్న అనేక ఆదిమ జాతులలో బంజార ఒక విశిష్టమైన తెగ. ప్రధానంగా మన దేశంలోని బంజారాలను 'గోర్' లేదా 'గవార్' అని అంటారు. "గోర్ లేదా గోర్యా" అనే పదాలు "గవార్" అనే హిందీ పదం నుండి వచ్చినట్లుగా చరిత్రకారుల, బాషా శాస్త్రవేత్తల అభిప్రాయం. హిందిలో గవార్ అనగా గ్రామ గ్రామాలు తిరిగే వారని అర్థం. గో సంరక్షణ చేసేవారు కావున బంజారా లను గోర్ బంజారాలు అని పిలుస్తున్నట్లు భావన లున్నాయి. భారతదేశంలో వివిధ ప్రాంతాలను బట్టి ఆయా సంస్కృతి సాంప్రదాయాలనుబట్టి బాషలో మార్పులు ఉండవచ్చుకాని, ఉత్తర దక్షిణ రాష్ట్రాల ప్రజల గిరిజన సంస్కృతి చాలా దగ్గరగా పోలి ఉంటాయని చరిత్రకారుల అభిప్రాయం ప్రకారం అనేక అంచనాలు వీరి పై ఉన్నాయి."బంజారా లేదా సుగాలీలు" మోల మోట అనే సోదరుల సంతతికి చెందిన వారని, మరికొంత మంది చరిత్రకారుల అభిప్రాయం ప్రకారం స్వాతంత్ర్యం రాకముందు వీరు సంచార తెగలుగా జీవిస్తూ ఉండేవారు. బంజారాలు వనాలలో సంచరించడం వలన వీరిని బంజారాలని పిలువడం వెనుక ఒక చారిత్రక కథనం ఉన్నట్లు చరిత్రకారుల అంచనాలున్నాయి.

1192లో రెండవ తరైన్ యుద్ధంలో పృథ్వీరాజ్ చౌహాన్ ఓటమికావడం, బంజారసైనికులు అడవిపాలు కావడం జరిగింది. ఈ విధంగా అడవిపాలుకావడం, అడవిలో ఎర్రమట్టి శరీరానికి రాసుకోవడం, గుహలలో, చెట్ల పొదలలో జీవనం సాగించడం జరుగుతూ వస్తున్న క్రమంలో ప్రత్యేక భాష, ప్రత్యేక వేషధారణ ధరిస్తూ అడవిలో జంతువుల మధ్య జీవనాన్ని కొనసాగిస్తున్న క్రమంలో వీరు మాట్లాడే భాషకు లిపిని వ్రాయలేక పోయారు. 12వ శతాబ్ధం ప్రారంభం నాటికే తెలుగు సాహిత్యంలో అనేక శాసనాలు, తాళ్ళపత్ర గ్రంథాల ఆధా రాలు ఉన్నట్లు ప్రస్తుతం మనం చూస్తూన్నాము. కాని తెలుగు సాహిత్య చరిత్రలో బంజారాల జీవితాలను వారి సంస్కృతి సాంప్రదాయలలో పెద్దగా సాహిత్య ప్రక్రియ ఆనాడు జరుగులేదు. 19వ శతాబ్ధం ప్రారంభం నాటికి తెలుగు సాహిత్యంలో గిరిజన సాహిత్యం గురించి, గిరిజన జీవన విధానం గురించి సాహిత్య ప్రక్రియలు ప్రారంభ మైనట్లుగా ఎన్నో రచనలు వచ్చాయి. అయితే బంజారాల ముఖ్య వృత్తి ఆనాడు సంచార జీవనం గడపడం, కాలానుక్రమంగా వ్యవసాయ వృత్తిని ఎన్నుకోవడం జరు గుతూ వస్తున్న క్రమంలో వీరు పశుసంపదను అభివృద్ధి పరచుకున్నారు. ప్రస్తుతం ఇప్పటికి కొన్ని గిరిజన తెగలలో, గిరిజన తండాలలో పశుసంపదను కాపాడుకొంటూ వీరు జీవనాన్ని కొనసాగిస్తున్నారు.

వీరు ప్రాచీన కాలంలో వ్యవసాయం ప్రదాన వృత్తిగా ఉన్న నేపధ్యంలో వీరి సంస్కృతి సాంప్రదాయాలలో అనేక మార్పులు వచ్చాయి. వీరి సంస్కృతిలో భాగంగా వీరి వృత్తులను బట్టి ప్రకృతితో గొప్ప సంబంధాలను ఏర్పరచు కున్నారు. సాధారణంగా హిందూ సనాతన సంప్రదాయంలో ఏ కులానికి, ఏ మతానికి లేని విభిన్న సంస్కృతిని, వేశధారణను, సాంప్రదాయాలను, ఆహారపు అలవాట్లను వీరు ప్రత్యేక సంతతిగా పరిణామం చెందారు. ఈ క్రమంలో వీరి సంస్కృతిలో భాగంగా పండుగలు ప్రారంభ మైనావి. బంజారాలు ప్రకృతి ఒడి అయిన అడవిలో జీవనం కొనసాగిస్తారు, కాబట్టి వీరి పండుగలు కూడా ప్రకృతికి దగ్గరగా వీరి సంస్కృతి ప్రతిబింభిస్తుంది. వీరి వృత్తిలో భాగంగానే అనేక గేయాలు, జానపద పాటలు, సామెతలు, పొడుపుకథలు, వీరు నిరక్షరాస్యులైనా గొప్ప మౌఖిక సాహిత్యాని చెప్పగలరు.

వ్యవసాయం ప్రధాన వృత్తిలో భాగంగా ప్రతి సంవత్సరం జులై - ఆగస్టు మాసాలలో వీరి పండుగలు నాంది పలుకుతాయి. ఇందులో భాగంగానే మొదట జరుపుకునే పండుగ "సిత్లా భవాని". ఏ పండుగ జరుపుకున్నా ఏ ఉత్సవం చేసినా కూడా సామూహికంగా అందరూ కలిసి జరుపుకోవడం గొప్ప విశేషం. వీరు జరుపుకునే పండుగ పూజా కార్యక్రమం ఒక విలక్షణమైన రీతిలో ఉంటుంది. వీరు పూజించే దేవతలు హిందూ దేవతలై నప్పటికీ, వారి పూజా విధానం ఒక ప్రత్యేకమైనదిగా ఉంటుంది. బంజారాలకు జీవనాధారం, పశు సంపద కాబట్టి వారు పశు సంపద కోసం "ఈ సీత్లా భవానియాడీ" పండుగను జరుపుకుంటారు.

సామాన్యంగా హిందూసాంప్రదాయాలలో ఒక గిరిజన తెగలు తప్ప ఏ జాతులు కూడా జంతువులను, పశు వులను పూజించరు. ప్రతి సంవత్సరం శ్రావణమాసంలో జరిపే ఈ పండుగను "ధాటోడి" పండుగ అంటారు. ఈ పండుగను వర్షాలుపడి విత్తనాలు మొలకెత్తే సమయంలో జరుపుతారు. ఈ పండుగ శ్రావణమాసంలో మంగళవారం రోజున అందరూ తండా సమక్షంలో నిర్ణయించుకొని సామూహికంగా జరుపుకుంటారు. ఈ పండుగ యొక్క ప్రాముఖ్యత కేవలం వారి పశుసంపద బాగుండాలి, వ్యవ సాయం సంవృద్ధిగా పండాలి అనే కాంక్షతో తండాలో ఉన్న అందరు మహిళలు నవ ధాన్యాలతో నైవేద్యం తయారుచేసి ఒక పాత్రలో తీసుకువచ్చి దానికి పైన ఒక వస్త్రంతో తయారు చేసిన "పులియా గొన్నో"తో అలం కరించి తీసుకువచ్చే క్రమంలో, బియ్యం బెల్లంతో వండిన పాయసం వంటకమును (సీత్లా భవాని ప్రతిష్టించిన) ప్రదేశానికి అందరూ ఊరేగింపుగా వెళ్ళి ఐదుగురు కన్యలు "పాంచ్ బేడో" ఐదు దొంతరలలో నీటిని తీసుకొని రాగా వీరు వండిన నైవేద్యాన్ని పూజా కార్యక్రమం అనంతరం అందరికి పంచుతారు. సీత్లాయాడిని ఏడుగురు శక్తి దేవతలుగా కొలుస్తారు. వారు భవానీ, మత్రాల్, హింగాళ, ధ్యాళంగర్, కంకాళి, దండి, సీత్లా భవానీలుగా వీరికి పేర్లు కలవు. సీత్లా యాడికి జంతుబలిని చేసి ఆ రక్తంను, నైవేధ్యంను కలిపి పశువులపై చల్లుతూ, బలి ఇచ్చిన జంతువు యొక్క పేగులు బయటకు తీసి దాని మీద నుండి పశువులను దాటిస్తారు. కావున దీనిని "దాటుడు పండుగా" అని పిలుస్తారు. ఈ విధంగా కేవలం పశు సంపదను పూజించే పండుగగా వీరి సంస్కృతిలో భాగం.

బంజరా సాహిత్యంలో మరియు సంస్కృతిలో రెండవ గొప్ప పండుగ "తీజ్". సీత్లా భవానీ పండుగ ముగిసిన రోజున సాయంత్రం (మంగళవారం) తండా వారు అందరూ సామూహిక నిర్ణయంతో తండా నాయకుని అనుమతితో జరుపుకునే పండుగ తీజ్. ఈ పండుగను శ్లేష కార్తి నుండి ఉత్తర కార్తి మధ్యన జరుపుకుంటారు. సీత్లా పండుగ వర్షాలు సంవృద్ధిగా పడాలని జరుపుకుంటే తీజ్ పండుగ వర్షాలు బాగాపడ్డాక చెరువులు కుంటలు నిండిన తర్వాత ఆరుద్ర పురుగు కనిపించే సమయంలో తీజ్ పండుగను జరుపుకుంటారు. మంగళవారం రోజున సాయంత్రం తండా నాయకుని ఇంటి ముందు ఒక మండపాన్ని ప్రతిష్టించి ఎంతో నిష్టతో గేయాలు, పాటలు పాడుతు గోధుమలను నీటిలో నానబెడతారు.

ఈ విధంగా నానబెట్టిన గోధులమను వెదురుతో తయారు చేసిన బుట్టలలో గోధుమలను చల్లుతారు. ఈ విధంగా చల్లిన గోధుమలను మండపం పైన ప్రత్యేక పూజ నిర్వహించి గేయాల రూపంలో ఈ పండుగ ప్రాముఖ్యతను తెలియజేస్తూ మహిళలు మౌఖికంగా పాటలు పాడుతారు. ఈ పండుగ మహిళా సంతతికి చెందినప్పటికీ మానవ విలువలతో అందరూ కలిసి భిన్నాభిప్రాయాలు లేకుండా జరుపుకుంటారు.

ఈ పండుగ తొమ్మిదిరోజుల ప్రక్రియగా కొనసాగు తుంది. ప్రతిరోజు ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం మూడు పూటలా పెండ్లికాని యువతులు ఎంతో నిష్టతో ఎంతో పవిత్రంగా ఉంటూ గేయాలు పాడుకుంటూ గోధుమలకు నీరు పోస్తారు. ఈ క్రమంలో వారు వారి కోరికలను మదిలో తలచుకుంటూ గొప్ప జీవితాన్ని, మంచి భర్తను వారికిమ్మని మదిలో పూజిస్తారు. ఈ విధంగా తొమ్మిది రోజులు సాయంత్రం మండపం దగ్గరికి సామూహికంగా రావడం, పాటలు పాడటం, పండుగ

యొక్క విశిష్టతను తెలిపే గేయాలను పాడటం వీరి సంస్కృతితో భాగం. తొమ్మిది రోజులు ప్రకృతిని తలుస్తూ వారివారి సంస్కృతి, సాంప్రదాయాలను, జీవన శైలిని, మానవ విలువలను పెంపొందించే విధంగా ఈ పండుగను జరుపుకుంటారు. చివరిరోజైన "తీజ్ బొరాయెర్ దాడో" తీజ్ నిమజ్జనం చేయడం జరుగుతుంది. ఈ ప్రక్రియ గురువారం ఉదయం నుండే ప్రారంభమవుతుంది. గురువారం సాయంత్రం నాటికి పూజా కార్యక్రమాలలో భాగంగా నైవేద్యం తయారు చేసి "మేరమ యాడికి" నైవేధ్యం సమర్పిస్తారు. తీజ్ నిమజ్జనానికి ముందు తండా వాసులందరూ వలయాకారంగా కూర్చుంటారు. స్త్రీలందరూ పండుగ గేయాన్ని పాడుతూ తీజ్ తెంపి వారి చేతులలోకి ఇస్తారు. ఈ విధంగా పూజా వృత్తాంతం తరువాత తీజ్‌ను అందరూ కలిసి చెరువులో నిమజ్జనం చేసిన తరువాత ఆ గంగా జలాన్ని తీసుకువచ్చి ఇంట్లో అక్క, బావల కాళ్ళు కడుగుతారు. ఈ విధంగా ప్రకృతికి మానవునికి గొప్ప అవినాభావ సంబంధాన్ని తెలియజేస్తుంది.

బంజారాలలో "హోళి" గొప్ప సంస్కృతిని కలిగిఉన్న పండుగ. వీరు ఈ పండుగను 15రోజుల ముందు నుండే ప్రారంభిస్తారు. దీనిని "గేర్ వగాయేరో" (చందాలు వసూలు చేయడంగా) పిలుస్తారు. అడవికి వెళ్లి మోదుగు పూలను తెచ్చి నీటిలో నానబెట్టి ఆ నీరు రంగుగా మారినప్పుడు దానితో ఆడుకుంటారు. హోళిరోజు ఉదయం అందరూ కలిసి ఊరి మధ్యలో ఈ పండుగను జరుపుకుంటూ బంజారాల ఇష్ట దైవం రాముడు కాబట్టి, రామ భక్తుడైన హనుమంతుని వారసులమని, ఎవరైనా ఇంటికి వస్తే రాం! రాం !! అని అంటారు. రాం! అంటే రాముడు అని, రామ లక్ష్మణుల దారిలో నడవాలని గొప్ప మానవ సంబంధాన్ని, మానవ విలువలని లోకానికి చాటిచెప్పే గొప్ప సంస్కృతి మా పండుగ ద్వారా తెలుస్తుందని వీరి ప్రతీక. హోళిరోజు ఉదయం అందరూ చిన్నా పెద్దా కలిసి పాతవస్తువులను కాలుస్తూ, దానిచుట్టూ మహిళలు ఆ పండుగయొక్క ప్రాముఖ్యతను తెలియజేస్తూ గేయాలను పాడుతూ నవధాన్యాలు, ఇత్తడి చెంబులో నీరును పోసి నైవేద్యాన్ని చిన్నపిల్లలకు ఇస్తారు. ఈ నైవేధ్యాన్ని తీసుకున్న పిల్లలు రోగాల బారినుండి విముక్తులవుతారని గొప్ప నమ్మకం. ఈ విధంగా ప్రకృతికి, మానవునికి సంబంధాలను తెలిపే పండుగలు బంజారాలలో అనేకం ఉన్నాయి.

ఏ కుల, మతాలలో లేని విభిన్నమైన, విలక్షణమైన సంస్కృతి, సాంప్రదాయాలు ఉన్న గొప్ప మానవీయతను, మానవ సంబంధాలను ప్రేరేపించే విధంగా ఉన్న పండుగలు వీరి జీవితాలకు ప్రతీక. ప్రకృతికి మానవునికి ఉన్న సంబంధాల వలన సమాజంలో స్వేచ్ఛానురాగాలు, కులమత ధోరణులు, అరాచక ఒరవడులు, సామాజిక రుగ్మతలు అన్ని సమసిపోయే విధంగా వీరి పండుగలు ఆనవాలుగా చెప్పవచ్చు. అనాగరికులైన గిరిజనుల భాషకు లిపిలేకుండా గొప్ప మౌఖిక సాహిత్యాన్ని చెప్పడం, గేయాలు పాడటంలో గొప్ప సాహిత్య ప్రక్రియలు ఆవిర్భవించాయి. ఈ విధంగా వీరి సాహిత్యంలో కథలు, నవలలు, గేయ రచనలు, పాటలకు సంబంధించిన పరిశోధనలు జరుగుతున్నాయి.

ఉపయుక్త గ్రంథ సూచి :

1. నల్గొండ జిల్లా బంజారా సాహిత్యం - జీవన చిత్రణ - ప్రో. సూర్య ధనుంజయ్, 2009, ఉస్మానియా విశ్వవిద్యాలయం హైదరాబాద్.
2. బంజారాల చరిత్ర, సంస్కృతి - ప్రో. వీరన్న, 2016, కాకతీయ విశ్వవిద్యాలయం.
3. ఆంధ్రుల జానపద విజ్ఞానం - ఆర్.వి.యస్. సుందరం, 1983.
4. భారతదేశం, గిరిజన సముదాయం - మజుంధార్, 1986.
5. సుగాలి సంస్కృతి, బాషా సాహిత్యాలు - ప్రో. గోనా నాయక్, 2002, కేంద్రీయ విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

BHAVAVEENA
Vol. 17, Issue. 8, August 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

శైవసాహిత్యం– పాల్కురికి సోమన – సమకాలీనత

– డా॥. ఏటూరు జ్యోతి, అసోసియేట్ ప్రొఫెసర్, తెలుగు విభాగం, కాకతీయ విశ్వవిద్యాయం, వరంగల్.

సమకాలం అంటే మనం చూస్తున్న, జీవిస్తున్న కాలం. ఒక నిర్ణీత కాలంలో జీవించిన కవులు, వారి సాహిత్యంను అధ్యయనం చేయడం సమకాలీనత అవుతుంది. ప్రతి కాలానికి ఇంకా అర్థం చేసుకోవలసింది మిగిలి ఉండడం. ఆ తర్వాతి తరం ఆ అన్వేషణను తానుగా తన యుగ వ్యక్తిత్వంతో సాగించడం సమకాలీనతకు అర్థం.

"రాజు మరణించె నొక తార రాలిపోయే
సుకవి మరణించె నొకతార గగనమెక్కె
రాజు జీవించె రాతి విగ్రహములందు
సుకవి జీవించె ప్రజల నాలుకలయందు "

ఈ సుకవి స్థానం ఎవరిదైనా కావచ్చు. కాలం ఏదైనా అతడి పద్యం మాత్రం ప్రజల మనుషుల్లో నిలిచి పోయింది. చరిత్ర గమనంలో ఇప్పటికీ వీరిని స్మరించు కుంటున్నాం. ఇదే సమకాలీనత. గురజాడ గురించి చెప్తూ శ్రీశ్రీ " ఏకవికైనా సరే అతని చుట్టూ ఒక సమాజం, ఆ సమాజానికి ఒక చరిత్ర, ఆ చరిత్రకు ఒక పరిణామం ఉంటాయి. సామాజిక, పరిణామ గమనంలో కవి సాహిత్యం స్థానం నిర్ణయించబడుతుంది. కవి ప్రగతిశీలి అయితే అతడు ఈ గమనాన్ని మరింత వేగవంతం చేస్తాడు" అని చెప్పాడు. పాల్కురికిసోమన కాలాన్ని చరిత్రను, ఆర్థిక, రాజకీయ సామాజిక పరిస్థితులను అర్థం చేసుకుంటేనే తప్ప తెలుగు సమాజానికి పాల్కురికి సోమన అర్థం కాడు. సమాజానికి అనుగుణంగా సాహిత్యంలో మార్పును తీసుకొచ్చాడు. దానికోసం శైవమతాన్ని ప్రజల దగ్గరకు శ్రీపతిపండితుడు, శివలెంక మంచెన వంటి వారు శైవమతాన్ని పోషించారు. "పాల్కురికి సోమన బసవ పురాణం - సమకాలీనత"ను విశ్లేషించడం పత్ర ఉద్దేశ్యం. పాల్కురికి సోమన భావపరంగా, భాష పరంగా, వస్తువు పరంగా నూతనత్వాన్ని సాధించి తెలుగు సాహిత్యంలో ప్రవేశపెట్టాడు. మార్గసాహిత్యానికి వ్యతి రేకంగా జాను తెలుగు తీసుకువచ్చాడు. దేశీ చ్ఛందస్సు లను ద్విపదను ఆదించాడు. తన సమకాలికులైన చారిత్రక వ్యక్తులను, సామాన్య భక్తుల కథలను సాహిత్యంలో తీసుకున్నారు. ఈ రకంగా ప్రజా ఉద్యమానికి పాల్కురికి సోమన ఆనాడే శ్రీకారం చుట్టాడు. తనకాలం కంటే కొంత ముందుగా ఉన్న చారిత్రక వ్యక్తులు బసవన, పండితయ్యలపై అపారమైన గౌరవంతో ఉండేవాడు.

బసవని శరణన్న పాపక్షయంబు
బసవని శరణన్న పరమపావనము
బసవని శరణన్న ప్రత్యక్ష సుఖము
బసవని శరణన్న భవరోగహరము

బసవనను శరణంటే పాపములు పోతాయి. భాగ్యాలు కలుగుతాయి. ఆపదలు తొలగి సంపదలు కలుగుతాయి. అంటూ ఆ ఇద్దరి చరిత్రలను భక్తితో సాహిత్యీకరణ చేసాడు. సమకాలీన వ్యక్తుల జీవితాలను గ్రంథస్తం చేసాడు. బసవపురాణంలో బసవేశ్వరుడు, అతని సమ కాలికులైన భక్తుల, పురాతన భక్తుల మహిమలను నిరూ పిస్తూ ప్రజల హృదయాలను ఆకర్షించాడు.

అలాగే బసవపురాణంలో

ఉరుతర గద్య పద్యోక్తుల కంటె
సరసమై పరగిన జాను తెనుగు
చర్చింపగా సర్వ సామాన్యమగుట
గూర్చెన ద్విపదలు కొర్కిదైవార.

"జాను తెనుగు" గురించి ప్రస్తావించాడు. ఇది దేశీయతను సూచిస్తుంది.

శైవమందు అన్ని కులాల వారికి ప్రాతినిధ్యం ఇవ్వడం కనిపిస్తుంది. చాకలి, మంగలి, మాల, మాదిగ అన్ని

కులాల వారి ప్రస్తావన బసవపురాణంలో కనిపిస్తుంది. పూర్వకాలంలో సత్ర భోజనములు బ్రాహ్మణులకే ప్రత్యేకించి ఉండేవి. శైవసంప్రదాయంలో చండాలురకు కూడా అన్న, వస్త్ర దానములు నత్రాలయందు ఏర్పాటు చేయడం కనిపిస్తుంది.

తెలుగు సాహిత్య వికాసానికి తొడ్పడి సామాజిక స్పృహతో సాహిత్యాన్ని సృష్టించిన పాల్కురికి సోమన నిత్యమూ నిరంతరమూ తెలుగు ప్రజలకు సమకాలికుడే

- బసవేశ్వరుని చరిత్రను పురాణ కావ్యంగా నిర్మించిన ప్రథమాంధ్రవీరశైవకవి.

  మతవిజ్ఞానానికి, ప్రచారానికి కావలసిన ప్రక్రియలను రచించిన ప్రథమకవి.

- సామాజిక స్పృహతో సాహిత్యాన్ని సృష్టించిన భక్తి ఉద్యమ ప్రథమ కవిగా ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యం గారు బసవపురాణ పీఠికలో అభిప్రాయపడుతారు.

బసవపురాణ కావ్యం ఏడు ఆశ్వాసాల కావ్యం. చతుర్థాశ్వాసంలో మడివేలు మాచయ్యకథతో ప్రారంభం అవుతుంది. వీరశైవులు తమ బాసలను భక్తి మహిమతో పాటించి జంగమలింగరూపులై అనన్య సాధ్యులుగా వెలుగొందుతారనడానికి ఇతని కథ ఒక తార్కాణం. అలాగే బసవన సమకాలికులైన కిన్నర బ్రహ్మయ్య వంటి భక్తుడి మహిమలు పంచమాశ్వాసంలో కనిపిస్తుంది. కులానికి కనిష్టుడైనా మహిమలో ఉన్నతుడుగా శివనాగుమయ్య భక్తుడు కనిపిస్తాడు.

ఇలా బసవపురాణంలో శివభక్తుల కథలు కనిపిస్తాయి. అల్లమ ప్రభువు, ముగ్దసంగయ్య, మడివాలు మాచయ్య, సిద్ధరామయ్య, సకలేశ్వరమాది రాజయ్య, కిన్నెర బ్రహ్మయ్య, కన్నడ బ్రహ్మయ్య, కలకేత బ్రహ్మయ్య, ఏకాంత రామయ్య, బసవనాగుమయ్య మొదలగు వారు సమకాలీన భక్తులుగా కనిపిస్తే పురాతన భక్తుల చరిత్రలు కథాసందర్భంలో కనిపిస్తాయి. స్వచ్ఛమైన మనస్సుతో, పారవర్శంతో కూడిన భక్తిభావంతో వెన్నవంటి హృదయంతో శివున్ని ఆప్తునిలా, మిత్రునిలా భావించి, ముగ్ధభక్తితో కీర్తించి, సేవించి లాలించి, శివుని కోసం ప్రాణాలను కూడా త్యాగం చేసే త్యాగ మూర్తులుగా కనిపిస్తారు. వీరిలో రుద్రపశుపతి, నక్కనైనారు, బెజ్జమహాదేవి, గొడగూచి, ఉడుమూరు కన్నప్ప, సకలీశ్వర మాది రాజయ్య, ముగ్ధసంగయ్య మొదలగు ముగ్ధభక్తుల చరిత్రలు బసవపురాణంలో కనిపిస్తాయి.

బసవపురాణంలో కనిపించే ప్రధాన లక్షణం. వీర మహేశ్వర ప్రతుడైన జంగముడు ఏకులమయినా, ఏవృత్తికి చెందినవాడయినా శివుని లాగా పూజలందుకునే వాడే, సహపంక్తి భోజనాలకు అర్హుడే అనే ప్రత్యేకతను శైవమతంలో చూస్తాం.

వీరశైవంలో భక్తులకు జాతిభేదాలు ఉండవు. స్త్రీ. పురుషవిభేదాలు కనిపించవు. సమాజంలో ఉన్న అంతరాలను నిర్మూలించి సమానత్వాన్ని ప్రతిపాదించే దిశగా అడుగులు వేస్తాడు. పాల్కురికి సోమన. బసవపురాణ, పండితారాద్య చరిత్రలో తీసుకున్న వస్తువు సమకాలీనములైనవి కావడం వల్ల ఆకాలంనాటి జనజీవనాన్ని విస్తృతంగా వర్ణించాడు. ఇతని కావ్యాలు ప్రజాబాహుళ్యానికి అతి దగ్గరగా కనిపిస్తాయి.

మతం ఏరూపంలో వచ్చినా సంస్కరణ వాదాన్ని కోరుతుంది. అణిచివేతకు గురవుతున్న వారిని, పేదలను తనలో ఇముడ్చుకోవడానికి ప్రయత్నించింది. మతాల మధ్య వైరుధ్యాలు క్రింది వర్గాలకు కులాలకు ఉన్నత స్థాయిని అందుకోనడానికి పనికి వచ్చింది. మతప్రాబల్యం కోసం మానవ సమాజంలో సమానత్వాన్ని బోధించాయి. అయితే భారతేశంలో మతం కన్నా కులం సామాజిక సాంస్కృతిక సమానత్వానికి ఆటంకంగా మారింది. పాల్కురికి సోమనాధుడు వీరశైవాన్ని ఆలంబనగా చేసుకుని ప్రజల్లో చైతన్యం తేవడానికి కృషిచేశాడు. మనుషులంతా ఒకటేనని చాటి చెప్పింది వీరశైవం.

ప్రజల్లో సాంస్కృతిక, సామాజిక విప్లవాన్ని కోరుకున్నది. శివున్ని కొలవడం అంటే కులమతాలను పాటించక పోవడం, వర్ణవ్యవస్థను నిరసించడం అనే విశ్వాసాన్ని ప్రజల్లో నింపగలిగాడు. వైదిక ధార్మలను వదిలేసి కుల, వర్ణభేదాలులేని సమసమాజ నిర్మాణాన్ని కాంక్షించాడు. కులరహిత సమాజాన్ని 12వ శతాబ్దంలోనే ఆచరించి చూపించాడు. రజకుడైన మడివాలు మాచయ్యను, మాదిగ కులస్థుడైన చెన్నయ్యను, చిన్నబాలిక గోడగూచిని, స్త్రీ అయిన అక్కమహాదేవిని కులబేధాలు, వయో పరిమితులు, స్త్రీ పురుష అసమానతలు లేని సమానత దిశగా అందరిని ఉన్నత స్థానంలో నిలబెట్టాడు.

స్త్రీ పురుష సమానత్వాన్ని, కులరాహిత్యాన్ని వీరశైవం ప్రభోదించిన తీరును పాల్కురికి సోమన తన రచనల్లో చిత్రించాడు. సామాన్య ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా బసవపురాణ కావ్యాన్ని రచించి ప్రజాకవిగా నిలిచాడు. అట్టడుగు కులాల వారిని ఆదరించడంతో సామాజిక, విప్లవకారుడిగా సంస్కరణవాదిగా పాల్కురికి సోమనను అర్థం చేసుకోవాలి. శూద్రులకు, పంచములకు సాహిత్యంలో స్థానాన్ని కల్పించి వారికి సామాజిక గౌరవాన్ని ప్రసాదించాడు. బసవపురాణంలో కాటకోటడు అనే భక్తుడు గొల్లవాడు. కన్నప్ప గిరిజనుడు. మడివాలు మాచయ్య రజకుడు, గుండయ్య కుమ్మరి. నయనారు దాసరి. తెలుగు బొమ్మయ్య బోయవాడు. శ్వపచయ్య పంచముడు.

- సాహిత్య వస్తువులో విప్లవాన్ని తీసుకురావడం అట్టడుగు వర్గాల వారికి ప్రాధాన్యతనిస్తూ 'సమానత' సూత్రాన్ని పాటించడం.
- స్త్రీ పురుష అసమానతలను నిరసించే సామాజిక సంస్కరణ వాదిగా కనిపించడం శ్రమకు గౌరవాన్ని కల్పించడం.
- విప్లవోద్యమంతో దగ్గరి పోలికలను కలిగిన శైవ కవిత్యోద్యమం 12వ శతాబ్ధిలోనే సామాజిక మానవ సంబంధాలలో విప్లవాత్మకమైన మార్పును కోరు కున్నది. ఆ కాలానికి అది అభ్యుదయ మార్గమే అని ఆశించాలి.

మడివాలు మాచయ్య కథను పరిశీలిస్తే ఇతడు చాకలి కులమునకు చెందినవాడు. పరమ శివభక్తుడు బసవేశ్వరుని దర్శించి భక్తి, జ్ఞాన జంగమార్చన విధిని దీక్షగా తీసుకుంటాడు. తనకుల వృత్తినే తన కర్తవ్యంగా భావించి శివ భక్తుల మాసిన బట్టలు ఉతికి వారికి ఇచ్చు చుండెను. ఇలా శివభక్తుల బట్టలు ఉతికి తెచ్చేపుడు వానికి ఏరకమైన మైల సోకకూడదని, జనులకు అడ్డం రావద్దని చెప్పడానికి గంటవాయిస్తూ ఎవరి బట్టలు వారికి అందించేవాడు. శివసార సంపన్నుడైన మడివాలు మాచయ్య పనికి ఆటంకం కలిగించవద్దు. ఆటంకం కలిగిస్తే వారు అధోగతి పాలగుదురని తెలుస్తుంది. ఒక రోజు కత్తి తిప్పుతూ గంట వాయిస్తూ బట్టలు తెస్తుంటే ఒకడు తప్పించుకోలేక ఎదుటనిలబడుతాడు. అతని తలతెగి పడుతుంది. ప్రజలందరు భయంతో రాజకు మొరపెట్టుకుంటారు. రాజు మాచయ్యను భద్రగజంతో తొక్కించాలని పంపిస్తాడు. మాచయ్య భద్రగజాన్ని అంతమొందిస్తాడు. భక్తులకు అసాధ్యమైనవి ఏది లేవని బసవేశ్వరుడు, రాజుతో చెప్తాడు. తన వృతికి, తన పనికి ఆటంకము కలగవద్దు ఆటంకం కలిగించినవారు అధోగతి పాలవుతారని చెప్తారు. మడివాలు మాచయ్యను 'చాకలి' అని అనడం బసవేశ్వరుడికి నచ్చదు. శిలలొ జన్మించి ననను పసిడి పసిడియే. ఏ జాతిలో పుట్టిన భక్తుడు భక్తుడే. మానవుడు "కులభ్రాంతిని" వదిలిపెట్టాలి అని చెప్తాడు.

శిలలోపల జన్మించిననేమి పసిడి
శిలయు దానగునయ్య! చింతిపనట్లు
మానవులందు సంభవులైననేమి
మానవులగుదురె మా భక్తపరులు
పరుషులైన నపుంసకులైన
నారులైనను బ్రాహ్మణ కులీనులయిన
జండాలు లైనను శంభుపూజింప

శివభక్తులైన మాలలను కలుపుకుని వాళ్ళతో కలిసి తిరుగుతున్న బసవేశ్వరుడిని బిజ్జలుడు "కులసుకరము సేయగూడునే" అని ప్రశ్నించి అపుడు బసవన" మొన్న బుట్టిన కులమ్ముల మాలలేల" అని కులం గురించి మాట్లాడడం సరైన పద్ధతి కాదంటాడు. నిచ్చెన మెట్ల వర్ణ వ్యవస్థను వ్యతిరేకించటం శైవ మతం ప్రధాన లక్షణం. సప్తమాశ్వాసంలోని కథలన్ని శివ భక్తిని నిరూపిస్తూ మాలమాదిగలను గౌరవ ప్రపత్తిలతో సంభావించినవే. కాట కోటడు గొల్లవాడు. వారి జీవనాధారం గొర్రెలను పోషించడం. కాటకోటడు గొర్రె పెంటికను శివలింగంగా భావించి పూజించుకున్నాడు. మాల శివభక్తుడు తినటానికి మాంసం వండుకుంటూ బ్రాహ్మణుడి రాకను చూసి అతని దృష్టిసోకుతుందని దానిని చెప్పతో మూసివేస్తాడు.వృత్తి సంబంధంతో అతని దగ్గర ఉన్న వస్తువును అతడు శివధర్మ రక్షణకు వాడుకున్నాడు. శివుని ప్రసాదం శైవేతరులు చూస్తే అపవిత్రం అవుతుంది. అలా కాకుండా ఉండాలని చెప్పను మూతగా పెట్టి బ్రాహ్మణుని దృష్టినుంచి కాపాడుకుంటాడు. ఇదంతా గమనించి హేళన చేసిన బ్రాహ్మణుడి మంత్రశక్తి నశించడం కనిపిస్తుంది.

ఇలా అన్ని కులాల వారికి సమానతను కల్పించి వారికి సాహిత్యంలో సామాజిక గౌరవాన్ని అందించడమే పాల్కురికి సోమన సమకాలీనతను చూడాలి. స్త్రీ పురుష అసమానతలు లేకుండా, శివభక్తులు అయిన స్త్రీలకు ప్రత్యేక జీవితం ఉందని చెప్పి స్త్రీ స్వతంత్రంగా ఆలోచించడం, తన అభిప్రాయం ప్రకారం బ్రతకడం వంటి కొత్త హక్కులు, సంస్కరణను బసవపురాణంలోని వైజకవ్వ కథ తేడరదాసయ్య కథలో చూస్తాం. కుల అసమానతలు నిర్మించాలనే తపనను 12 శ॥లోనే చూస్తాం.

ఆధార గ్రంథాలు :

1. బసవ పురాణం-పాల్కురికి సోమన .
2. పాల్కురికి సోమనాధుడు-వీరశైవసిద్ధాంతం ఆచార్య తిమ్మావజ్జల కోదండరామయ్య.
3. వీరశైవసాహిత్యం-సమతా దృక్పథం - డా॥ కిల్లా పరమేశ్వరప్ప.

⌘⌘⌘

BHAVAVEENA
Vol. 17, Issue. 8, August 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

ఆంధ్రుల జానపద కళా సాహిత్యం – సమకాలీనత

– డా॥. ఐ. సరస్వతి, తెలుగు సహాయాచార్యులు, ఐడియల్ కళాశాల ఆర్ట్స్& సైన్స్, కాకినాడ, తూర్పుగోదావరి జిల్లా.

జానపదులు ప్రదర్శించే కళలను జానపదకళలు అంటారు. జానపద కళలు అతి ప్రాచీనమైనవి. ఈ జానపద కళలు ఒక దేశం, ఒక జాతి, సంస్కృతిని, సంప్రదాయాలను ప్రతిబింబించే దర్పణాలు. జానపద కళలు మానవునికి వినోదంతోపాటు విజ్ఞానం వికాసాన్ని కల్గిస్తాయి. ప్రతిజాతి తమ జానపద కళలను ఎనలేని వారసత్వ సంపదగా పరిగణిస్తుంది. "Human life without art is incomplete and barren" అని చైనీయులు ఆర్యోక్తి తరతరాలుగా మానవజీవితంలో జానపద కళలు విడదీయరాని సంబంధం కలిగివున్నాయి.

ఆంధ్రుల సాంఘిక చరిత్ర సుమారు రెండువేల సంవత్సరాల నుండి మనకు చారిత్రక ఆధారాలతో లభిస్తున్నది. నాటి నుండి నేటి వరకు ఆయా రాజులు, పాలకుల కాలంలో రకరకాలుగా జానపద కళలు పోషించ బడి, అభివృద్ధి చెందాయి. ఆంధ్రదేశంలో ఏ ప్రాంతంలో చూసిన వివిధ కులాలకు సంబంధించిన విశిష్టమైన జానపద కళారూపాలు అనేకం కన్పిస్తాయి. ఆంధ్రులు ప్రాచీన కాలం నుండి సహజసిద్ధంగా జానపద కళా పోషకులు. జానపద కళాభిమానులు. కావున నిన్న మొన్నటి వరకు ఈ జానపద కళలు ఆంధ్రదేశంలో ఎంతో వైభవోపేతంగా ప్రదర్శంపబడ్డాయి. కాని నేటి ఆధునిక సాంకేతిక కాలంలో మారిన ప్రజల ఆలోచన సరళి, తీరికలేని జీవన విధానం, అందుబాటులోనికి వచ్చిన ఆధునిక సాంకేతిక వినోదసాధనాలు మొదలైనవాటి కారణంగా గతమెంతో ఘనకీర్తి కలిగిన జానపద కళలు రోజురోజుకి తమ ఉనికినీ, ప్రాధాన్యతను కోల్పోతున్నాయి. ఆంధ్రదేశంలోని కొన్ని జానపదకళల గతవైభవం సమకాలీనత గురించి ఈ వ్యాసంలో తెలుసుకుందాం.

కోలాటం :

కోలాటం నృత్యాలు ఒకనాడు ఆంధ్రదేశమంతా విరివిగా ప్రదర్శింపబడ్డాయి. ఈ కోలాట నృత్యాలు తిరునాళ్ళు, ఉత్సవాలు, జాతరలు, ఊరేగింపులలో బహిరంగంగా వీధులలో ప్రదర్శిస్తారు. ఈ నృత్యాన్ని కొందరు సభ్యులు బృందంగా ఏర్పడి, సంగీత, సాహిత్య సమ్మిళతంగా నృత్యప్రదర్శన చేస్తారు. ఈ కోలాట నృత్యాన్ని మనం గమనిస్తే గొప్ప వ్యాయామ సంబందమైన నృత్య క్రీడ నేటికి ఆ కోలాటం ప్రదర్శన స్థానంలో ఉత్సవాలు, జాతరలు జరుగుతున్నపుడే రికార్డు డ్యాన్సులు స్టేజిషోలు మొదలైనవి రావడంతో దీనికి ప్రజాదారణ తగ్గింది.

తోలుబొమ్మలాట :

నేడు తెలుగు ప్రాంతంలోని తోలుబొమ్మలాట కళాకారులందరూ గతంలో మహారాష్ట్ర ప్రాంతం నుండి వలస వచ్చిన వారేనని తెలుస్తున్నది. ఈ తోలుబొమ్మలాట మన దేశంలో ఇప్పటికి నిలిచివున్న ప్రాచీన జానపద కళా రూపంగా చెప్పవచ్చు. శ్రీశైలం శివరాత్రి మహోత్సవాలలో తోలుబొమ్మలాటలు ప్రదర్శించినట్లు పాల్కురికి సోమనాధుడు 'పండితారాధ్య చరిత్ర' పర్వత ప్రకరణంలో వివరించడం జరిగింది. దీన్ని బట్టి ఆంధ్ర దేశంలో కొన్ని వందల సంవత్సరాల ముందునుంచే ఈ బొమ్మలాటలు ఆదరించబడి, ప్రజాభిమానాన్ని పొందుతున్నాయని తెలుస్తుంది. తోలుబొమ్మలాట కళాకారులు తమ కళలను ప్రదర్శిస్తూ కీర్తి గడిస్తున్నారు. అనంతపురము జిల్లా ధర్మవరం మండలంలోని 'నిమ్మలకుంట' గ్రామ కళాకారులు, తోలుబొమ్మల తయారీలోను, ప్రదర్శనలోను ప్రపంచ ప్రఖ్యాతి పొందారు. ఈ గ్రామంలోని దాళవాలు రంగమ్మ, దాళవాలు కుళ్ళాయప్ప మొదలైన కళాకారులు జర్మనీ, జపాన్, ఫ్రాన్స్, బెర్లిన్ వంటి విదేశాలలో కూడా

తమ ప్రదర్శనలు ఇచ్చి, ప్రశంసలు అందుకున్నారు. ఈ ప్రాంతంలో తోలుబొమ్మల వృత్తిని ప్రోత్సహించటానికి ఆంధ్రప్రదేశ్ పర్యాలకాభివృద్ధి సంస్థ వారు ఒక కళా మందిరాన్ని నిర్మించారు. అయితే ఇటీవలి కాలంలో తోలుబొమ్మలాట కళకి ప్రోత్సాహం తగ్గిపోతుంది. తోలు బొమ్మలాట కళాకారులు ఎనలేని కీర్తి ప్రతిష్టలు సంపాదించిన వారి ఆర్థికస్థితి మాత్రం మెరుగుపడటం లేదు. జానపద కళ అంతరించకుండా ఉండాలంటే ప్రభుత్వం వారు కళాకారులకు మెరుగైన ప్రోత్సాహక చర్యలు, మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించాల్సి వుంటుంది.

హరి కథ :

హరికథ కథాగానంలో పూర్వకాలంలో అధిక భాగం ఆధ్యాత్మిక బోధనే చేసేవారు. మారుతున్న సమాజ అభి రుచులకు అనుగుణంగా హరికథాగానంలో చతు రోక్తులకు, పిట్ట కథలకు, స్థానం పెరుగుతూ వచ్చింది. దీనివల్లనే 'హరికథలో పిట్టకథ' అనే సామెత పుట్టు కొచ్చింది. జానపదాలలో విరామ సమాయాల్లో ఆంధ్ర దేశపు హరిదాసులు ఈ కథలు చెప్పడం జరుగుతుంది. హరికథా గానం చేసేవారిని హరిదాస్, భాగవతార్ అని పిలుస్తారు. నిన్న మొన్నటి వరకు ఈ హరిదాసులకు సమాజంలో మంచి గుర్తింపు ఉండేది. శ్రీ ఆదిభట్ల నారా యణదాస్ గారు (1864 -1945) హరికథను ఒక విశిష్ట కళారూపంగా తీర్చిదిద్ది, హరికథా పితామహుడుగా కీర్తి గడించారు. ఆంధ్రదేశంలోని అనేకమంది హరిదాసులు ఈ హరికథను వృత్తిగా ఎంచుకొని, ఈ కళకు బహుముఖ ప్రచారం కలిగించారు. కాని నేడు ఈ కళ రోజురోజుకి కనుమరుగైపోతుంది.

బుర్ర కథ :

జానపద కళారూపాల్లో బహుళప్రాచుర్యం పొందిన కళ ఇది. శ్రీనాథుడు తన 'క్రీడాభిరామం' కృతిలో యక్షగానాన్ని గురించి పేర్కొనడాన్ని బట్టి లభ్యమైన ఇతర ఆధారాలను బట్టి బుర్రకథ ప్రాచీన జీనపదకళారూపం అని తెలుస్తుంది. యక్షగానాలలో ఇతివృత్తం పురాణగాథ లకు సంబందించి వుండేది. యక్షగానాలు, బుర్రకథలుగా రూపాంతరం చెందిన తరువాత కరుణ రస ప్రధానమైన ప్రాతివత్య కథలూ, భారత, రామాయణ గాధలకు సంబం ధించిన అనేక కథలు ఇతివృత్తంగా చెప్పడం జరిగింది. ఆధునిక కాలంలో ఈ బుర్ర కథలను రాజకీయ, సాంఘిక పరిస్థితులకు అన్వయించి ప్రచారం చేయడం జరిగింది. సమాజంలో సంభవించిన అనేకనేక, అభ్యుదయ, విప్లవోద్యమాలకు ఈ బుర్ర కథ ఒక ప్రధాన ఆయుధంగా ఉపయోగపడింది. షేక్ నాజర్ బుర్రకథను ప్రజలకు చేరువ చేయుటలో గణనీయమైన పాత్రవహించి 'బుర్ర కథా పితామహుడు' గా కీర్తి గడించాడు. పద్మశ్రీ బిరుదు పొందారు. సినిమాల్లో కూడా నాజర్ దళం - బుర్ర కథలు చెప్పింది. శిర్విశెట్టి సుబ్బారావు, దంటు కృష్ణమూర్తి, జూనియర్ నాజర్, మహమ్మద్ బాబ్జి మొదలైన అనేక మంది రచయితలు, కళాకారులు ఈ బుర్ర కథను రచించి ప్రదర్శించడంలో ఎంతో కృషి చేసి పేరు ప్రతిష్టలు గడించారు అనడంలో వాస్తవం ఎంతైన వుంది.

గతంలో మత ప్రభోదానికి, దేశభక్తికి, సమాజ చైతన్యా నికీ, సమాజంలోని దురాచారాల నిర్మూలనకు ప్రతి బింబంగా నిలబడిన ఈ బుర్రకథ కళారూపం క్రమ క్రమంగా తన వైభవాన్ని, ఉనికిని కోల్పోతున్నది. బుర్రకథలో ఈ నాడు కొన్ని కొన్ని వ్యాపార ప్రకటనలకు, కళాజాలరలు మొదలైన కార్యక్రమాల ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రచారాలకు మాత్రమే ఉపయోగపడు తుంది. గతంలో సమాజాన్ని చైతన్యపరచడంలో గణనీయమైన పాత్రవహించిన ఈ జానపద కళ ప్రాభవాన్ని పునరుద్ధరించవలసిన ఆవశ్యకత ఎంతైనా వుంది.

పగటి వేషాలు :

పగటి వేషాలు విశిష్టమైన ప్రాచీన జానపద కళ. అన్ని వర్గాల వారికి, అన్ని ప్రాంతాల ప్రజలకు ఆదరణీయమైన కళ ఇది. అభినయ, గీత నృత్య, ప్రదర్శానాత్మక అంశా లతో ఈ వేషప్రదర్శన జరుగుతుంది. పగటివేషాలు వేస్తూ అదే వృత్తి ద్వారా కొంతమంది జీవిస్తారు. కళాకారులు

ఒక ప్రాంతం నుండి సంచరిస్తూ, వేషాలాడుతూ పొట్ట పోసుకుంటారు. జాతరల్లో, ఉత్సవాల్లో, పండగ సందర్భాలల్లో ఆయావేషాలు వేస్తూంటారు. పగటి వేషం అనే వారి ఆహార్యం మీదే ఆధారపడి ఉంటుంది.

పగటివేషాలలో ఆదిభైరాగి వేషం, ఎరుకల సోదివేషం, అత్తరు సాయిబుల వేషం, ఫకీరు సాహేబుల వేషం, కోయ వాళ్ళ వేషం, కొమ్మ దాసరి వేషం, హరిదాసు వేషం, భట్రాజుల వేషం, బుడబుక్కలవారి వేషం, పిట్టలదొర వేషం, జంగం దేవర వేషం మొదలైనవి ఆంధ్రదేశంలో ప్రసిద్ధిచెందిన వేషాలు. గతంలో ఎందరో ఈ పగటి వేషదారులు వంశపారంపర్యంగా ఈ వేషాలను ప్రదర్శించి కీర్తి ప్రతిష్టలు పొందారు. అయితే నేడు ఈ పగటి వేషదారులకు విలువ, ఆదరణ ఉపాధి కరువైంది. సమకాలిన పరిస్థితిలో ఈ రోజులలో పగటి వేషాలు వేసినవారిని చులకనగా చూస్తున్నారు. ఈ వృత్తిలో కొనసాగే సంఖ్య క్రమక్రమంగా తగ్గిపోతుంది. ప్రస్తుతం ఆంధ్రదేశంలో మాత్రమే జాతరలు, ఉత్సవాలు జరుపుకునే సందర్భంలో అక్కడక్కడ పగటి వేషదారులు కన్పిస్తున్నారు.

నాటక రంగం :

ఆంధ్రదేశంలో నాటక రంగం ఎంతో పురోగతిని సాధించినదని చెప్పవచ్చును. ప్రాచీన కాలం నాటి యక్షగానాలు, వీధినాటకాలు నాటకరంగానికి పునాది వంటివి. ఈ పునాదుల పై విదేశీయ నాటక రంగం ప్రభావం కుదురుకొని కాలగతిలో మన నాటక రంగం పురోగతి చెందుతూ సమాజానికి ఒక మార్గ నిర్దేశకత్వాన్ని అందిస్తూ ఆలోచనను రేకిత్తించే ఒక ఉత్తమ సాధనంగా నాటక కళ రూపుదిద్దుకుంది. 1870-80 ప్రాంతంలో మహారాష్ట్ర నుండి 'ధార్వాడ నాటక సమాజం' వారు వచ్చి 'జంధిండి' నాటకాల పేరుతో బళ్ళారి నుండి ప్రారంభించి, ఆంధ్రదేశ మంతటా ప్రదర్శించారు. శ్రీ ధర్మవరం రామకృష్ణమాచార్యులు 1885 లో 'సరసవినోదిని' నాటక సమాజాన్ని స్థాపించారు. ఇదే ఆంధ్రదేశంలో ప్రపథమ తెలుగు నాటక సమాజం. రామకృష్ణమాచార్యులు 28 తెలుగు నాటకాలను రచించి 'సరసవినోదిని' నాటక సమాజం ద్వారా ప్రదర్శించారు. 1910 గద్వాల్ మహారాజు గారు ఆంధ్రనాటక పితామహుడు అనే బిరుదు కూడా ఇచ్చారు. శ్రీ బళ్ళారి రాఘవాచార్యుల వారు తెలుగు, కన్నడ, హిందీ, ఆంగ్ల భాషలలో సుమారు 60 పౌరాణిక, చారిత్రాత్మక, సాంఘిక నాటకాలను వందలసార్లు దేశ వ్యాప్తంగా ప్రదర్శించి అజరామరమైన కీర్తి గడించారు.

తరువాత కాలంలో సురభి నాటక సమాజం మొదలైన అనేక నాటక సమాజాలు, వందలమంది నటులు, ఆంధ్ర నాటక రంగాన్ని ఎంతో పురోగతిచెందించారు. 1929లో తెనాలిలో 'ఆంధ్రనాటక కళాపరిషత్‌ను' స్థాపించి, నాటక కళను అభివృద్ధి చేయడానికి కొత్త సంస్కరణ ప్రవేశ పెట్టడం జరిగింది.1940 దశకంలో ఆంధ్రదేశంలో ప్రజా నాట్యమండలి ఏర్పడి సాహిత్య సాంస్కృతిక రంగాలను అభ్యుదయ దృక్పథం వైపు ఒక మలుపు తిప్పింది. స్వాతంత్ర్యానంతరం ఆంధ్రదేశంలో నాటక రంగం మరింత పురోగతి సాధించింది.

సమకాలిన పరిస్థితులు చూచినట్లైతే సినిమా సీరియళ్ళ ప్రభావం ఎక్కువ కావడంతో, నాటకరంగానికి ఆదరణ కరువైంది. నేటి తరానికి నాటకాలను ఆస్వాదించే రసాస్వాదన శక్తి లోపించింది. ఇప్పటికీ అక్కడక్కడ ప్రసిద్ధి చెందిన నాటక రంగ కళాకారులు ఉన్నప్పటికీ, వారికి సరైన ప్రోత్సాహం, ఉపాధి అవకాశం లభించడంలేదు. నేడు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతి సంవత్సరం రాష్ట్రంలో ఏదో ఒక ప్రదేశంలో నంది నాటకోత్సవాల పేరుతో నాటక రంగ పోటీలు నిర్వహించి ప్రతిభావంతులైన కళాకారులకు 'నంది' బహుమతులను ప్రధానం చేసి, వారిని ప్రోత్సహించడం జరుగుతున్నది. సమాజంపై సినిమా సీరియళ్ళ ప్రభావం ఎంత ఉన్నప్పటికీ, నేటికీ విద్యాలయాలు, సంస్థలు మొదలైనవాటి వార్షికోత్సవాలలోను, ఉత్సవాలు, వేడుకులు మొదలైన సాంస్కృతిక కార్యక్రమాలలోను నాటకాలను ప్రదర్శించడం జరుగుతుంది. ప్రభుత్వం, సంస్థలు, ఔత్సాహికులైన కళాభిమానులు నాటకరంగానికి తగిన ప్రోత్సాహం అందించి, పూర్వ వైభవం తీసుకు రావలసిన అవసరం ఎంతైనా వుంది.

గొరవయ్య నృత్యం :

ఈ నృత్యం అనంతపురం జిల్లాలోని వివిధ ప్రాంతాలలో కన్పిస్తుంది. ఇది కురుబ కులానికి చెందిన నృత్యం తలపైన బంటి చర్మంతో చేసిన కిరీటం, ఒక చేతిలో ఢమరుకం మరొక చేతిలో త్రిశూలం, మెడలో తెల్లని గవ్వల హారం. నడుము చూట్టు జింక చర్మంతో తయారు చేసిన సంచితో గొరవయ్యల ఆహార్యం విచిత్రంగా ఉంటుంది. ఒకప్పుడు కన్నడ దేశ ప్రభావంతో శైవ మత ప్రచారానికి ఆలవాలైన కళారూపం. నేటి పరిస్థితులలో భిక్షాటన కళారూపంగా మారిపోతుంది కుల సంబంధమైన ఈ జానపద నృత్యాన్ని కాపాడుకోవల్సి బాధ్యత మనందరి మీద ఉన్నది.

గంగిరెద్దులాట :

శ్రీనాధుడు తన 'పల్నాటి వీర చరిత్ర' కావ్యంతో గంగిరెద్దుల వారిని గురించి ప్రస్థావించడం జరిగింది. దీన్ని బట్టి గంగిరెద్దులాట చాలా ప్రాచీనమైనదని తెలుస్తుంది. ఒకప్పుడు ఈ గంగిరెద్దులాటను ఆంధ్రదేశమంతా విరివిగా ప్రదర్శించడం జరిగింది. వీరు ఆవులను, ఎద్దులను ఇష్టంగా పెంచుకొని వీటి రాముడు, లక్ష్మణుడు, సీత అని పేరుపెట్టి వాటికి తగిన శిక్షణ ఇస్తారు. వీరు ఎక్కువగా సంక్రాంతి పండుగ సమయాలలో ఇంటింటికి వచ్చి పురాణ ఇతిహాస సంబంధమైన కథలు చెప్తూ మధ్య మధ్య హాస్యపూరితమైన పిట్టకథలు చెప్తూ, దానికి అనుగుణంగా గంగిరెద్దుతో అభినయం చేయిస్తారు. ప్రదర్శనలు చూచి ముగ్ధులైన ప్రేక్షకులు ధాన్యం, బట్టలు, డబ్బులు, ఎద్దు, ఆవులకు మేతా ఇచ్చి స్వయంగా మా ఇంటి ముందు బస్వేశ్వరుడు వచ్చాడు అని ఆనంద పడతారు ఆ గ్రామ ప్రజలు. ఇలా దేశ సంచారం చేస్తూ జీవనం సాగిస్తుంటారు. గంగిరెద్దుల వారు నేడు వీరి పరిస్థితి దయనీయంగా మారింది వీరికి తగిన జీవాదరణ లభించడంలేదు.

ఇతర ప్రదర్శన కళలు :

పైన పేర్కొన్నవే కాకుండా ప్రాచీన కాలం నుండి విరివిగా ప్రదర్శింపబడి, ఎనలేని కీర్తి గడించిన అనేక జానపద కళలు నేడు ఆదరణ, ప్రోత్సాహం లేక అంతరించిపోయే దశలో ఉన్నాయి. కొరవంజి బయలు నాటకాలు, బుడిగెజంగాలు, దేవదాసీ నృత్యాలు, చిందు బాగవతం, చిరుతల రామాయణం, జముకుల కథలు, ఒగ్గు కథలు, వీరశైవుల వీరభద్ర విన్యాసాలు, గిరిజన నృత్యాలు (కోయ, గుస్సాడి, మయూర, ధింసా నృత్యాలు) దొమ్మరాటలు, తప్పెటగుళ్ళు, కొమ్మదాసరలు, పాము లాటలు, పేరిణి నృత్యం, లంబాడీ నృత్యం మొదలైన అనేక జానపద కళలు గతంలో గొప్ప ప్రజాధరణ పొంది నేడు అంతరించే దశలో ఉన్నాయి.

ముగింపు :

పైన పేర్కొన్న కళారూపాలు రోజురోజుకి అంతరించిపోవడానికి కారణం ఆధునిక సాంకేతిక కాలంలో అందుబాటులోనికి వచ్చిన ఇతర వినోదసాధనాలు ఒక కారణమైతే మారిన ప్రజల జీవశైలి కూడా మరొక కారణమని చెప్పవచ్చును. ఆధునిక సాంకేతికపరమైన పరికరాలు ఉపయోగం ఎక్కువగా ఉన్న నష్టాలు కూడా అధికం అని భావించి, జానపద కళల ప్రాధాన్యతను, ఆవశ్యకతను నేటి తరాలవారికి తెలియజేసి, వీటికి సరైన ప్రోత్సాహక సౌకర్యాలను కల్పించి, ఈ జానపద కళలను పునరుద్ధరించే బృహత్తర బాధ్యతను ప్రభుత్వాలు, సమాజం, కళాభిమానులు, అంకితభావంతో చేపట్టవలసిన అవసరం ఉంది. అప్పుడే జానపద కళలు పూర్వ వైభవాన్ని సంతరించుకోగలవు.

ఆధార గ్రంథాలు :

1. తెలుగు జానపద గేయ సాహిత్యం - బిరుదురాజు రామరాజు.
2. ఆంధ్రుల జానపద విజ్ఞానం - ఆర్. వి. యస్. సుందరం.
3. తెలుగు జానపద గేయగాథలు - నాయని కృష్ణకుమారి.

⌘

BHAVAVEENA
Vol. 17, Issue. 8, August 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

పోతన భాగవతం – సమకాలీనత

– డా॥. బుశెట్టి ఉపేంద్ర, అతిథి అధ్యాపకుడు, ఎ.పి. ట్రిపుల్ ఐటి, ఆర్.కె.వ్యాలీ, కడప.

తెలుగు జాతికొక నిగూఢమైన ధర్మపథమును చూపి తెలుగు సంస్కృతికి రూపురేఖలు దిద్దిన ఉద్గ్రంథములు రామాయణ, భారత, భాగవతాలు. వీటిలో భారత రామాయణాలు మానవ సామాన్యములగు లౌకిక విషయాలను, నైతిక విషయాలను, ధర్మమార్గములో బోధించి ఆంధ్రజీవితమును తీర్చిదిద్దుటకు ఉప కరించినవి. ఇక భాగవతము ఆముష్మిక ధర్మమార్గ ప్రదర్శకమై మానవ జీవితమును తరింపజేయు భక్త కల్ప ద్రుమము. భారతము ఆంధ్రులకు ఐహిక జీవనమును దిద్దికొనుటలో లౌకిక, నైతిక ధర్మసూక్ష్మాలను కర్మ యోగంపరంగా ఉపదేశింపగా, భాగవతము మానవ జీవితాన్ని తరింపజేయుటకు భక్తిమార్గమును ఉద్బోధించు చున్నది.

మహాభాగవతములో అనేక సమకాలీన అంశాలు చెప్పబడ్డాయి. అసలు భాగవతాంధ్రీకరణమే నాటి సామాజిక ప్రయోజనాన్ని దృష్టిలో పెట్టుకొని రాయబడి నట్లుగా తెలుస్తున్నది. ఈ విషయాన్ని శ్రీ మల్లంపల్లి సోమశేఖరశర్మ ఇలా తెలిపారు.

''పోతనామాత్యుడు మహాభాగవత రచనమునకు పూనుకొను నాటికి తెలంగాణములో వైష్ణవమతము ముమ్మరముగ వ్యాపించినది. ఇట్లనుటచేత తెలం గాణములో వైష్ణవము ఇదివరకు లేనేలేదని నా అభిప్రాయము కాదు. వైష్ణవము వాతాపి చాళుక్యుల కాలము నుండియున్నది. ఇందుకు వాతాపి, కళ్యాణి చాళుక్యుల శాసనములను, వారి కాలమున మలచబడిన విష్ణ్వవతార ప్రతిమలు తార్కాణములు. చెన్నకేశవా లయములు తెలంగాణమున ఎక్కువగా ఉండెను. అయినను కాకతీయుల కాలములో శైవమెట్లు రాజమతమై జనాచార పాత్రమయ్యెనో అదేవిధంగా వైష్ణవము రాజ మతమై గొప్ప వ్యాప్తిని పొందినది. వైష్ణవము విజయ నగరాధీశ్వరుల కాలములోవలె తెలంగాణమున అమిత వ్యాప్తి పొందినది. రాచకొండ, దేవరకొండ రాజ్యాధిపతు లైన రేచెర్ల వంశజుల కాలములోనే శ్రీ విద్యారణ్య శ్రీపాదులకు సమకాలికులైన శ్రీ వేదాంత దేశికుల వారి కుమారుడు శ్రీ నైనాచార్యుల వారు సింగయయాద వేంద్రుని యాస్థానమునకు వచ్చి ఈ మతవాదులను ఓడించి ఆ రాజేంద్రునికి వైష్ణవ మతమిచ్చినట్లు వైష్ణవగ్రంథములు తెలుపుతున్నవి. రాజు వైష్ణవ మతా వలంబియైనపుడు సామంతనృపులును తద్ధర్మమునవ లంభించిరి. పోతన భాగవత రచనకీ వైష్ణవ మత వ్యాప్తి కూడా ప్రోత్సాహకరమయ్యెనేమో'' అన్నారు. దీనిని బట్టి భాగవత రచన సమకాలీనత ఆధారంగా చేసికొని రాయ బడినదని దృఢంగా చెప్పవచ్చు. కాలపరిస్థితుల కనుగుణంగా సాహిత్యం రూపుదాలుస్తుందని దీనినిబట్టి చెప్పవచ్చు. నన్నయ భారతం కూడా అలాగే అవతరిం చింది.

నేడు కొందరు తమను నమ్మినవారిని నట్టేట ముంచు తున్నారు. ఇది చాలా దుర్మార్గమైన రీతి, నీతి. కొందరు నమ్మిన వారికి ప్రాణమిస్తున్నారు. ఈ రెండు విధాల ప్రజలు నేడు సమాజంలో ఉన్నారు. అలా నమ్మి మోసపోయినవారే చాలా మంది ఉన్నారు. అది మంచిది కాదని భాగవతం తెలుపుతున్నది. అన్ని వేళలా అన్ని ఘటనలందు అర్జునుని రక్షించుకుంటానని శ్రీకృష్ణుడు మాట ఇచ్చి ఉంటాడు. అయితే కురుక్షేత్రయుద్ధములో అర్జునుడు భీష్ముని చేతిలో ముప్ప తిప్పలు పడుతుం టాడు. ఆ సమయంలో అర్జునుని పరిస్థితిని శ్రీకృష్ణుడు అర్థం చేసుకొంటాడు. తను ఇచ్చిన మాట నిలుపు కోవాల్సిన సమయమాసన్నమైందని గుర్తిస్తాడు. వెంటనే

రథం దిగి రంగంలోకి దిగుతాడు శ్రీకృష్ణుడు. భీష్ముని పైకి దూసుకుపోతాడు. ఆ ఘటనను పోతన ఇలా చిత్రించాడు.

కుప్పించి యెగసినఁ గుండలంబుల కాంతి
గగన భాగం బెల్లఁ గప్పికొనగ
నుఱికిన నోర్వక యుదరంబులోనున్న
జగముల వ్రేగున జగతి గదలఁ
జక్రంబు చేపట్టి చనుదెంచు రయమునఁ
బైనున్న పచ్చని పటము జాఱ
నమ్మితి, నాలావు నగుబాటు సేయకు
మన్నింపుమని క్రీడి మరలఁ దిగువఁ

గలికి లంఘించు సింహంబు కరణి మెఱసి
నేడు భీష్మునిఁ జంపుదు; నిన్నుఁ గాతు
విడువ మర్జున యనుచు మద్విశిఖవృష్టిఁ
దెరలి చనుదెంచు దేవుండు దిక్కు నీకు

- అంటాడు. అర్జునుడు వేడుకోవడంతోనూ, భీష్ముడు మెత్తబడుటతోనూ శ్రీకృష్ణుడు శాంతిస్తాడు. దీనిని బట్టి మనము ఏమి తెలుసుకుంటాము, పెద్దలైనా పిన్నలైనా ఆడినమాట తప్పరాదని, ఇంకా ఎవరైనా ప్రాధేయపడినా, విజ్ఞాపన చేసినా ఆలకించి సమ్మతించాలి. ఇది సార్వకాలిక సమకాలీనత. దీనిని పోతన భాగవతంలో అద్భుతంగా చెప్పాడు.

నేడు ఎందరో ఆడినమాట తప్పుతున్నారు. ఇది ఏ కాలానికీ తగినది కాదు. ఈ విషయాన్ని బలిచక్రవర్తి చేత శుక్రాచార్యునికి చెప్పిస్తాడు పోతన.

మేరువు తల క్రిందైనను
బారా వారంబు లింకఁ బాతిన, లోలో
ధారుణి రజమై పోయినఁ
దారాధ్యము బద్ధమైనఁ దప్పక యిత్తున్

- అంటాడు బలి. మూడడుగులు దానమడిగినది బ్రాహ్మణుడు కాదని సాక్షాత్తు విష్ణువని, అతడు అదానముతో దానవ వంశాన్ని నాశనం చేస్తాడని, అందు వల్ల ఆడిన మాటన వెనక్కి తీసికోవాలని బలిని శుక్రాచార్యుడు కోరతాడు. అప్పుడు బలి పై విధంగా స్పందిస్తాడు. మేరుపర్వతం తలకిందులైనా, సముద్రాలు ఇంకిపోయినా, భూమి బూడిదై పోయినా ఆడినమాట ప్రకారం దానం చేస్తానంటాడు. ఇది సార్వకాలిక సమకాలీనత సత్యమే కాదు, ప్రతిక్షణము ఆచరించదగిన నిత్యసత్యం కూడా.

నాడు, నేడు చాలామంది స్వార్థపరత్వంతో నడచుకుంటున్నారు. అది ఎంతమాత్రమూ తగ దంటాడు పోతన. బతికిన దానికి గుర్తింపు కీర్తి యొక్కటేనంటాడు. ఈ విషయాన్ని బలిచక్రవర్తి చేత గురువు శుక్రాచార్యునికి ఇలా చెప్పిస్తాడు.

కారే రాజులు రాజ్యముల్ గలుగవే గర్జోన్నతిం బొందరే
వారేరీ సిరి మూట గట్టుకొని పోవం జాలిరే భూమిపై
పేరైనంగలదే? శిబి ప్రముఖులున్ బ్రీతిన్ యశాంకాములై
యీరే కోర్కులు వారలన్ మఱచిరే యిక్కాలమున్ భార్గవా!

ఎంతోమంది రాజులు ఈ భూమిని పాలించారు గదా! వారి పేరు ప్రజలు తలచుకుంటున్నారా? వారు పోయేటపుడు సంపద మూటగట్టుకొని పోయారా? లేదు కదా! మరి శిబిచక్రవర్తి, కర్ణుడు వంటి వారి చరిత్రలు నేటికి ప్రజల నోళ్ళలో నానుతున్నాయి కదా! కాబట్టి నేను కూడా వాళ్ళను ఆదర్శంగా తీసుకుంటానని బలిచక్రవర్తి తేల్చిచెప్పాడు. ఇది భాగవతంలోని సమకాలీనత, నిత్య ఆచారణీయతగా భావించక తప్పదు.

పోతన భాగవతంలోని సమకాలీనతకు ప్రబల నిదర్శనంగా నిలుస్తున్నది విద్య ప్రాధాన్యం చెప్పడం. హిరణ్యకశ్యపుడు గురువుల వద్ద తన కుమారుడైన ప్రహ్లాదుని వదలుచూ విద్య ఆవశ్యకతను ఇలా తెలిపాడు.

కం॥ చదువని వాడజ్ఞుండగుఁ
జదివిన సదసద్వివేక చతురత గలుగున్
జదవఁగ వలయును జనులకు
జదివించెద నార్యులొద్దఁ జదువుము తండ్రీ!

- అని హితబోధ చేస్తాడు.

చదవని వాడు అజ్ఞాని అవుతాడని, చదివితే సద సద్వివేక చతురత అలవడుతుందని, అందువలన జనులందరూ చక్కగా చదవాలని అంటాడు. దీనికంటే మించిన సమకాలీనాంశం మరేదైనా ఉంటుందా! ఉండదని రూఢిగా చెప్పవచ్చు. చదువు విలువను పోతన ఆనాడే గ్రహించాడు. దానిని సమాజం నుంచే గ్రహించాడు. దానిని సాహిత్యంలో సమయం సందర్భాను కూలంగా చొప్పించాడు. అందుకే పోతన మహాకవి అయ్యాడు. సాధారణంగా సాహిత్యం ఆనాటి సమ కాలీనత ఆధరంగా రూపుదాలుస్తుందని చెప్పవచ్చు. దీనికి ప్రబల నిదర్శనంగా పోతన భాగవతాన్ని పేర్కొనవచ్చు. అందులోని ప్రతిఘట్టంలోనూ సమకాలీనత ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. అయితే అందుకు ఆ దృక్కోణంతో ఆ పురాణాన్ని చదవాలి, పరిశీలించాలి, పరిశోధించాలి.

ఉపయుక్త గ్రంథాలు :

1. పోతన భాగవతము - తిరుమల తిరుపతి దేవస్థానం ప్రచురణ, జనవరి 2005
2. పోతన - వెంపరాల సూర్యనారాయణ శాస్త్రి, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్, డిసెంబరు 2012
3. ఆంధ్ర మహాభాగవతోపన్యాసములు - సం॥ పులిజాల హనుమంతరావు, ప్రచురణ: ఆంధ్ర సారస్వత పరిషత్తు, హైదరాబాద్, జనవరి 1968.
4. శ్రీమద్భాగవత పురాణ పరిశీలనము - డి. నాగసిద్ధారెడ్డి, తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి, జూన్ 1983

⌘⌘⌘

BHAVAVEENA
Vol. 17, Issue. 8, August 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

భాగవతంలో నవవిధ భక్తి మార్గాలు, అనుసరణ

– డా॥. బోడిరెడ్డి మహేంద్రరెడ్డి , తెలుగు శాఖ, ట్రిబుల్ ఐటి విశ్వవిద్యాలయం, ఒంగోలు - ప్రకాశం జిల్లా.

తరతరాల భారతీయ సంస్కృతికి అక్షర రూపం కలిగించిన మహాజ్ఞాని భారత, భాగవతాలు. వ్యాసుడిచే రచించబడిన గ్రంథాలు. అందులో మహాభాగవతం సంస్కృతంలో ఈయన అందివేసిన చేయి. అదే అచ్చమైన తెలుగులో బమ్మెర పోతనచే లిఖించబడింది.

ఆంధ్ర మహాభాగవతంగా విఖ్యాతి పొందినది. మాతృమూర్తి ముద్దుబిడ్డల, తెలుగు తల్లి పలుకరించి, చిలుకరించి, పులకరించే విధంగా ఖ్యాతి చెందినది. 'భగవంతునికి భక్తుల కథలను గురించే తెలియచేసెడి' 'భాగవతం'. భారత జాతినీ, భారతీయ నాగరికతనూ, భారతీయ సంస్కృతీ సాహితీ వికాసానికి పట్టుకొమ్మలు. భాగవతం ఆధ్యాత్మికాంశాలకు నిలయం. భాగవతం ఎన్నెన్నో ఆధ్యాత్మిక జీవిత గాథలను బోధించింది. సామాజిక వికాసానికీ, మానవత్వ వికాసానికీ, ఆధ్యాత్మిక వికాసానికి, మానవుని వికాసానికి దోహదం చేస్తుంది.

అలా భాగవతంలో భక్తుల భక్తిమార్గాలు సూచిస్తుంది. అందులో ఎందరో మహానుభావులు భక్తి మార్గలే, నవవిధ భక్తి మార్గాలుగా చెప్పవచ్చు. అవి కర్మ భక్తి జ్ఞాన యోగాలుగా చెప్పబడింది. భగవంతుని చేరుకోవడం కోసం వివిధ మార్గాలు కలవు. అవి శ్రవణం, కీర్తనం, స్మరణం, పాదసేవనం, అర్చనం, దాస్యం, వందనం, సఖ్యం, ఆత్మనివేదనం. ఈ తొమ్మిది విధాలైన భక్తి మార్గాల్లో ఏ భక్తి మార్గంలోనైనా భగవంతుని పూజించి, అర్చించి మోక్షమార్గం పొందవచ్చు. వీటిలో అందరికి సులభమైన మార్గం 'భక్తిమార్గం'గా చెప్పవచ్చు. ఇలా ప్రతి మానవుడు ప్రతి జీవి మోక్షమార్గం పొందవచ్చు. మోక్షం అనగా 'తరువాత జన్మ లేకపోవడమే' పరమలక్ష్యం మోక్షం.

శ్రవణం :

నవవిధ భక్తిమార్గలలో మొదటిది శ్రవణం.

భక్తి జ్ఞానాలకు శ్రవణమే ప్రధానం. భగవంతుని గుణాలూ, పేర్లూ, కథలూ వినడంవల్ల కూడా భగవంతునికి దగ్గర కావచ్చు.

భక్తి మార్గంలో మొట్టమొదటి మెట్టు సత్సంగం. సత్సంగంలో ప్రధానంగా భగవంతుని కథలు వినడం, భగవంతుని భక్తులతో కూడి ఉండడం, వారి మాటలు వినడమే - 'సత్సంగం' అంటారు.

శ్రవణం కేవలం చెవులకు పనిగా కాకుండా తదేక నిష్ఠతో విన్నదంతా మనస్సులో పదిలపరచుకోవాలి. అటువంటి కథా శ్రవణమే ఒక యోగం అవుతుంది. అల కథాశ్రవణం ద్వారా సాధన చేసి, తరించిన వాళ్లు చరిత్రలు పురాణాల్లో కనిపిస్తాయి.

ఉదాహరణకు భక్తి మార్గానికి చెప్పదగ్గవారిలో పరీక్షిత్తు మహారాజు ఒకడుగా చెప్పవచ్చు. ఇతను కేవలం కథాశ్రవణాన్ని యోగంలా అనుసరించి, దాని ద్వారానే ముక్తి పొందాడు. 'శ్రవణాత్ ముక్తిః' శ్రవణం వల్ల ముక్తి అనే వాక్యం సార్థకమయింది.

విష్ణు కథల్ని వినేవాళ్ళనూ, ఆ కథలు చెప్పమని కోరే వాళ్ళనూ, చెప్పేవాళ్ళనూ, గంగాజలం వలె విష్ణు కథ పావనం చేస్తుంది. భగవంతుని గురించి చెప్పే కథలు వినడం వల్ల సర్వపాపాలూ తొలగిపోతాయని ఇదే శ్రవణం వల్ల కలిగే ప్రయోజనంగా చెప్పవచ్చు.

కీర్తనం :

నవవిధ భక్తిమార్గాల్లో కీర్తనం రెండవది.

భగవంతుని కీర్తన, సంకీర్తనతోను ప్రథమాచార్యునిగా నారదుని చెప్పవచ్చు. నారాయణ నామస్మరణం వల్ల పొందే ఆనందం అంతా ఇంతా కాదు. ఆ సంకీర్తన ఫలం వల్లే ఆయనకు మూడులోకాల్లో తిరిగి నారాయణుడి నామాన్ని కీర్తించే సామర్థ్యాన్ని కలిగించింది.

నారదుని నారాయణ కీర్తనను తల్లి గర్భంలో ఉన్న ప్పుడే వినిన ప్రహ్లాదుడు మహా విష్ణువు వరమ భక్తాగ్రేసరుడైనాడు.

భారతంలో కేవలం సంకీర్తనం ద్వారా తన సంతాపాన్ని పోగొట్టుకొన్న భక్తురాలు - స్వయాన భగవంతునికి మేనత్త అయిన కుంతీదేవి.

భాగవతంలో కూడా ప్రస్తావన కనిపిస్తుంది.

ప॥ శ్రీకృష్ణా! యదుభూషణా! నరసఖా! శృంగార రత్నాకరా! లోక ద్రోహినరేంద్ర వంశదహనా! లోకేశ్వరా! దేవతానీక బ్రాహ్మణ గోగణార్తి హరణా! నిర్వాణ సంధాయకా!నీకున్ మ్రొక్కెద ద్రుంపవే భవలతల్ నిత్యానుకంపానిధీ!

- అఖిలాండ కోటి బ్రహ్మాండనాయకుని ఆత్మీయునిగా చేసుకొనే విధానం కుంతిలో కనిపిస్తుంది. కుంతి నిరంతరం ఇలాంటి సంకీర్తనంలో కాలం గడిపేదని పోతన భాగవంతలో చెప్పాడు. కలియుగంలో భగవంతుని కీర్తించడమే మోక్షానికి సులభమైన మార్గం. 'కలౌ కేశవయ కీర్తనమ్' - అనే ప్రబోధాన్ని సార్థకం చేసు కొందాం!!

స్మరణం :

'భగవంతుని నిత్యం నిరంతరం మరచి పోకుండా ధ్యానించడమే స్మరణం'. దీనినే 'స్మరణ భక్తి' అంటారు.

భాగవతంలో కనిపించే 'ఖట్వాంగ ప్రభువును' చూడ వచ్చు. చక్రవర్తి అయిన ఖట్వాంగుడు ఒకానొక రోజు దేవదానవులకు యుద్ధం మొదలౌతుంది. దేవతలకు సహాయం కోరగా, ఖట్వాంగ మహారాజు వెళ్లి రాక్షసుల్ని సంహరించి, దేవతలకు విజయం చేకూర్చాడు. దేవతలు సంతోషించి వరం కోరుకోమన్నారు. తన జీవిత ప్రయాణం ఇంకా ఎంత కాలం ఉందో చెప్పమంటాడు - ఖట్వాంగ మహారాజు. దేవతలు ముహూర్తం ముందున్నది అంటారు. వెనువెంటనే ఖట్వాంగుడు గగనమార్గంలో తన రాజభవనానికి చేరుకొన్నారు. చతురంగబలాల్ని, అంతఃపుం కాంతల్ని, హితుల్ని, పండితుల్ని అందరినీ సమావేశపరి చారు. తన నిర్ణయాన్ని అందరికీ తెలియజేసి, అందరినీ వదలి తీవ్రవైరాగ్యంతో దైవస్మరణను తెలుపుతూ -

క॥ గోవిందనామ కీర్తన
గావించి భయంబు దక్కి ఖట్వాంగధరి
త్రీవిభుడు మూరగొనియెను,
గైవల్యము దొల్లి రెండు గడియల లోనన్

ఖట్వాంగ మహారాజు దైవనామ స్మరణతో, రెండు గడియల కాలంలోనే మోక్షం పొందాడు. ఈ కథను బట్టి పరమభక్తితో భగవంతుని స్మరించినంత మాత్రాన్నే భక్తులకు మోక్షం లభిస్తుందని అర్థమౌతుంది. అందుకే 'స్మరణాత్ ముక్తిః' అనే వాక్యంను స్మరించుకొందాం! దైవ స్మరణ వల్ల ముక్తి పొందగలరని చెప్పవచ్చు.

పాదసేవనం :

భగవంతుని పాదాల్ని, భక్తుల పాదాల్ని, గురువుల పాదాల్ని, సాధువుల పాదాల్ని సేవించటమే పాదసేవనం - దీనినే 'పాదసేవనభక్తి' అని అంటారు. శౌనకాదులు సూతుడితో ఇలా అంటారు -

క॥ పావనములు దురితలతా, లావనములు
నిత్యమంగళ ప్రాభవసం
జీవనములు, లక్ష్మీసం, భావనములు
వాసుదేవ పదసేవనముల్

నిజమే! శ్రీకృష్ణుడి పాదాలు పవిత్రమైనవి. పాపాలనే తీగెలకు కొడవళ్లు వంటివి. నిరంతరం శుభాన్ని కూర్చేవి. సుదాముడి చరిత్ర మంచి ఉదాహరణంగా చెప్పవచ్చు. మధుర నగరంలో పూలమాలలు కట్టే సుదాముడున్నాడు. అతను భగవంతుడి పాదసేవనం ప్రస్తావిస్తూ -

క॥ నీపాదకమల సేవయు
నీపాదార్చకుల తోడి నెయ్యమును, నితాం
తాపారభూత దయయును
దాపసమందార! నాకు దయసేయు గదే!

కంసుడి ధనుర్యాగం చూడడానికి వచ్చిన బలరామ కృష్ణుల్ని తన ఇంటికి అతడు ఆహ్వానించాడు. అర్ఘ్య పాద్యాలు, తాంబూల కుసుమ సుగంధాలు, సురభిళ పుష్పదామాలు అర్పించి, శ్రీకృష్ణుని పై విధంగా కీర్తించాడు.

ఇలా భక్తితో భగవంతుని పాదసేవ చేసే వాళ్లకు అంతులేని కీర్తిసంపదలు, ఆయుస్సూ పెంపొందించుకోవచ్చు.

అర్చనం :

భగవంతుని భక్తితో పుష్పం, పత్రం, తోయం, పసుపు, కుంకుమలతో అర్చించడం - దీనినే 'అర్చన' అంటారు.

తులసీ పుష్పమాలలతో భగవంతుని పూజించడం 'అర్చన భక్తి' అందురు. ఇందుకు మధురానగరంలో కంసుడి పరిచారిక అయిన 'కుబ్జ'ను చూడవచ్చు. రకరకాల సువాసనలతో లేపనాలు తయారు చేయడం ఆమె పని. తయారు చేసిన పూలు, పూలమాలలు, సువాసనల లేపనాలు కంసునికి తీసుకొని వెళ్లుతూ ఉంటుంది. అది గమనించిన కృష్ణుడు 'నీ పేరేంటి? లేపనాలు ఎవరి కోసం తీసుకుపోతున్నావ్?' అని ప్రశ్నించాడు. తమకే అన్నట్లుగా ప్రేమతో తన దగ్గరున్న లేపనాలు కృష్ణునికి అందించింది. ఆ లేపనాల్ని ఒంటికి పూసుకొని, కృష్ణుడు ఆమె పాదాలపై తన పాదాలు మోపి, గడ్డాన్ని స్పృశించగానే కురూపిగా ఉన్న కుబ్జ సురూపిగా మారిపోయింది.

ఇక్కడ భగవంతుని అర్చించిన ఫలం పలించినదిగా చెప్పవచ్చు.

వందనం :

'భక్తి శ్రద్ధలతో భగంతునికి నమస్కరించడమే వందనం' - లేక 'వందనభక్తి' అంటారు.

ఆకాశం నుంచి జారిపడుతున్న జలం, ఏదో విధంగా నైనా సముద్రంలో కలిసిపోయినట్లుగా, ఏ దేవతకు మనం నమస్కరించినా ఆ ఆది కేశవునికే దక్కుతుంది. చెందుతుంది. ఇందుకు ఉదాహరణగా అక్రూరుడిని చెప్పవచ్చు. ఒకానొక రోజు బృందావనంలో గోవిందుని, బలరాముని నమీపించి భక్తితన్మయత్వంతో, రోమాంచంతో, ఆనందబాష్ప ధారలతో, బలరామ కృష్ణులకు వినయంతో చేసిన అక్రూడి వందనం అత్యంత అభినందనీయం. శుద్ధ భక్తితో భగవంతునికి నమస్కరించడం వల్ల మోక్షం లభించింది.

అలా బలరామకృష్ణులకు వందనం చేయడం ద్వారా అక్రూరుడు భగవంతుని అనుగ్రహా పాత్రుడయ్యాడు.

దాస్యం :

'సర్వకాల సర్వావస్థల్లో భగవంతుని దాస్యం చేస్తూ ఉంటే' దానినే 'దాస్యం' అంటారు. అదే భగవంతుని భావనతో జీవించడమే దాస్యం. భగవద్దాస్యంతో పాటు భాగవత దాస్యమూ దాస్య భక్తులకు ఎంతో అవశ్యంగా చెప్పవచ్చు.

రుక్మిణీ దేవి సాక్షాత్తు లక్ష్మీదేవి. లక్ష్మీ విష్ణుదేవునికి ప్రథమ కైంకర్యపరురాలు. విష్ణువు ఎన్ని అవతారాలు దాల్చినా - లక్ష్మీదేవి ఏదో రూపంలో స్వామిని అనుసరించే ఉంటుంది. కృష్ణావతారంలోనూ లక్ష్మీదేవియె రుక్మిణిగా అవతరించి, ఆయన్నే వరించింది.

అలా గరుత్మంతుడు, గోపికలు, గోపబాలురు ఇలా ఎందరో విష్ణుతత్వాన్ని, శ్రీకృష్ణునిలో విశ్వరూప దర్శనం పొందిన వ్యక్తులు కలరు. వయోధర్మం లేక భగవతత్వాన్ని బట్టి దాసుడైనాడు.

అలా విశ్వమంతా భగవంతునికి దాస్యం అవుతుందని తెలియజేస్తుంది.

సఖ్యం :

భగవంతుని స్నేహితునిగా చేసుకొని, ఆయనను అనుసరించుటయే సఖ్యం. దీనినే 'సఖ్య భక్తి' అంటారు. భాగవతంలో కుచేలుడు, భారతంలో అర్జునుడు భక్తి సఖ్యభక్తికి తార్కాణంగా చెప్పవచ్చు. అలా దేవునితో స్నేహం

చేయడం వల్ల ఎన్నో మంచి గుణాలు అలవడుతాయి. ఆ విధంగా భగవంతునికి దగ్గరవ్వడమే సఖ్యభక్తిగా చెప్పవచ్చు.

ఆత్మ నివేదనం :

మనో వాక్కాయ కర్మలతో భగవంతునికి శరణాగతి చేయటం ఆత్మ నివేదనం, 'ఆత్మ నివేదనభక్తి' అంటారు. దీనినే ప్రపత్తి, వ్యాసవిద్య, ఆత్మనిక్షేపం అనికూడా అంటారు.

ఆత్మనివేదనకు గజేంద్రుడు నిదర్శనంగా కనిపిస్తాడు. ఏనుగు మొసలి మధ్య భీకర సంగ్రామం జరిగింది. అది సుమారు వెయ్యేండ్ల కాలం. అలాగే కాలం గడిచింది. స్థానబలం వల్ల మకరిబలం ఎక్కువైంది. గజేంద్రుడు తన భారమంతా ఆ భగవంతునిపై వేసి ఆత్మనివేదన చేసుకొన్నాడు. ఆ శ్రీహరి గజరాజును మకరి బారి నుండి రక్షిస్తాడు. ఈ విధంగా భాగవతంలో ఉండే నవవిధ భక్తి మార్గాల ద్వారా తెలుసుకొనవచ్చు. అప్పుడు భక్తుడికీ, భగవంతునికి మధ్యగల సంబంధం వ్యక్తమౌతుంది. నేటి సమాజంలో అధ్యాపకులు, విద్యార్థులు అందరు కూడా ఈ నవవిధ భక్తి విధానాల్ని దృష్టిలో పెట్టుకోవాలి. తాము తెలుసుకోవాల్సిన అంశాల్ని శ్రవణం చేయాలి. గొంతెత్తి కీర్తనం చేయాలి. చదివే విషయాల్ని స్మరణం చేయాలి. అక్షరాలకూ, అక్షర దేవతలకూ అర్చనం చేయాలి. అక్షరాల్ని పాదాలుగా భావించి సేవనం చేయాలి. తమ గురువులకూ, తాము చదివే గ్రంథాలకూ వందనం చేయాలి. ఆ విజ్ఞాన దేవతకు దాస్యం చేయాలి. తాము చదివే గ్రంథాలతో సఖ్యం చేయాలి.

చిట్ట చివరకు తాము చదివే వైజ్ఞానిక గ్రంథాల్ని దైవంగా భావించి, ఆత్మనివేదనం చేసుకోవాలి.

ఇలా నమ సమాజంలోని ప్రతి ఒక్కరు తమ బాధ్యతను గుర్తు ఎరిగి మసలు కోవాలని భాగవతంలో నవవిధభక్తి మార్గాలు అందరికి ఆదర్శంగా ఉన్నాయని భావిద్దాం!

ఆధార గ్రంథాలు :

1. టి.టి.డి. ఆంధ్ర మహాభాగవతం - పోతన
2. భాగవతంలో చిన్న కథలు - ప్రయాగ రామకృష్ణ
3. టి.టి.డి. వచన భాగవతం

⌘⌘⌘

BHAVAVEENA
Vol. 17, Issue. 8, August 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

రాయల కాలంలో ఆవిర్భవించిన శైవ ప్రబంధం

– డా॥. కె. ఈశ్వరమ్మ, తెలుగు అధ్యాపకురాలు, డి.ఆర్.డబ్ల్యూ. కళాశాల, గూడూరు. నెల్లూరు జిల్లా.

శ్రీకృష్ణదేవరాయల కాలానికి మతపరంగా ఒక ప్రత్యేకత ఉంది. వైదిక మతశాఖలైన శైవవైష్ణవాలు రెండూ సమానంగా రాయల ఆదరణకు నోచుకోవడం ఒక ప్రత్యేకత. రాయలు వైష్ణవుడు. వైష్ణవసంప్రదాయాన్ని చక్కగా అనుష్ఠించినావాడు. ఆయన రచించిన ప్రబంధం 'ఆముక్తమాల్యద' వైష్ణవసంస్కృతిని గొప్పగా ప్రతిష్ఠించింది. వైష్ణవకవులందరు దశావతారాలను వర్ణిస్తే రాయలు ఒక మెట్టు పైకి వెళ్ళి తన ప్రభందంలో ఏకాదశావాతారాలను వర్ణించాడు. బలరామ బుద్ధ అవతారాలను రెండింటిని చెప్పడం వల్ల ఏక దశావతారాలయ్యాయి. అది ఆయన వైష్ణవానురక్తి. రాయలు రాజు కాబట్టి దేశంలో వైష్ణవానికి అధిక ప్రాచుర్యం కలిగిందని భావిస్తారు కొందరు. విజయనగరాన్ని పాలించిన నాలుగు రాజవంశాలలో సంగమ వంశాలవాళ్ళు ఎక్కువగా శైవారాథకులే. శాళువ వంశ పరిపాలనలో శాళువ నరసింహరాయలు తిరుమల శ్రీనివాసుని భక్తుడు. వైష్ణవానికి తనవంతు కృషి చేశాడు. తుళువ వంశాభుది చంద్రుడైన శ్రీకృష్ణదేవరాయలు పాలకుడయ్యేనాటికి శైవ, వైష్ణవ సంప్రదాయాలు రెండూ సమ ప్రాథాన్యంలోనే ఉన్నాయి. రాయల ఆదరణతో వైష్ణవానికి ఎనలేని ప్రాభం కలిగింది. వైష్ణవ సంప్రదాయాలనుబట్టి చూపే అంశాలతో సాహిత్య గ్రంథాలు వెలువడ్డాయి. ప్రభువు మతానురక్తికి అనుగుణమైన రచనలు చేయాలని కవులు భావించారు. అప్పటి కవులు తాము వ్రాయబోయే ప్రబంథాలకు కథలెలాంటివైనా వైష్ణవాంశాలను జోడించి రచించడం ప్రారంభించారు. అప్పటివరకు శైవసంప్రదాయ ప్రవర్తకులుగా ఉండి శైవప్రబంథాలు చెప్పినవారు కూడా వైష్ణవంవైపు తిరిగారు. సాహిత్యం పరిస్థితి ఇలావుంటే వాస్తుశిల్పం విషయంలో కూడా పెను మార్పులు వచ్చాయి. అనేక వైష్ణవాలయాలు నూతనంగా నిర్మించబడడమేకాక పాత దేవాలయాలకు పెద్ద ఎత్తున మరమ్మత్తులు జరిగాయి. విజయనగర రాజుల ఆదరణతో ప్రసిద్ధమై తిరుమల ఆలయం ఒక గొప్ప వైష్ణవ క్షేత్రమైంది. ఈ ఆలయానికి కృష్ణరాయలు అపారమైన కానుకలు సమర్పించారు.

అలా వైష్ణవ సంప్రదాయం విశ్వవ్యాప్తం అవుతూ ఉండిన కాలంలో ఒక శైవప్రబంథం రావడం నిజంగా గొప్పవిశేషమే. ఆంధ్రభోజుడైన కృష్ణరాయల ఆస్థానాన్ని అలంకరించిన అష్ఠదిగ్గజ కవులలో అప్పటి పరిస్థితులను బట్టి ఏ కవి అయినా రాయల అభిరుచికి విరుథ్థంగా ప్రవర్తించగలడా?. సమస్థ దక్షిణ భారతాన్ని అప్రతిహతంగా తన కనుసన్నలతో శాసించిన రాయలు అలాంటి ఉపేక్షను సహించగలడా?. కేవలం రాజ్యాన్నే పరిపాలిస్తూ ఉండిన రాజుల విషయంలో పైరెండూ ప్రశ్నలు నిజమే అవుతాయి. కానీ రాయలు రాజ్యపాలకుడే కాదు సాహిత్య పోషకుడు సాహిత్య స్రష్ట, కవితా ప్రావీణ్య ఫణీసుడు. కవుల విలువ, వారు సృజించే కావ్యాల విలువ కవితాసామ్రాజ్య పట్టభద్రుడైన వానికే అర్థమవుతుంది. కవితారసతరంగిత మైన అలాంటి ప్రభువు అంతరంగం సుమకోమలంగా ఉంటుంది. ఉత్తమ కళాభిరుచిగల ప్రభువు సాహిత్య కళను, సాహిత్య స్రష్ఠలను అందించడంలో వింతేముంటుంది? ఈ లక్షణాలు ఉండడం వలననే రాయలు తన పాలనాపద్ధతులలో కూడా క్రౌర్యం, కాఠిన్యం లేకుండా ప్రవర్తించాడు. సాహిత్యాభిరుచి కఠినహృదయాలను కూడా మైనపుముద్దలుగా మార్చగలుగుతుంది. సాహిత్య హృదయమే లేకుంటే రాయలుకూడా ఇతర రాజులవలె నిరంకుశంగా ప్రవర్తించి ఉండేవాడు. కొన్ని తప్పనిసరి విషయాలలో రాయలు నిరకుంశుడుగా ప్రవర్తించిన అది అనుకంపాతిశయ నిరంకుశత్వం.

శత్రువుపై కూడా దయ చూపించే స్వభావం ఆయన ఆస్థానాన్ని దర్శించిన విదేశీయులందరూ ఏక కఠంతో కొనియాడిన గుణమిది. ముందెప్పుడూ థారానగరాన్ని పాలించిన బోజుడు సాహిత్య బోజుడుగా పేరుపొందితే 16వ॥ శతాబ్దంలో 'మూరురాయరగండ'డైన రాయలు ఆంధ్రబోజుడుగా చరిత్రలో ప్రసిథ్ధుడైనాడు.

కృష్ణరాయల మతసహనం గొప్పది. ఆయనకాలంనాటి సమాజంలో భిన్నసంప్రదాయలవారు ఉన్నారు. అన్ని సంప్రదాయలాలమథ్య సామరస్యం కూర్చడం రాజుపని. ఆ పనిని రాయలు అత్యంత శ్రథ్ధతో నిర్వర్తించారు. అందువల్ల ఏ సంప్రదాయానికి సంబంధించిన వారైనా ఆయన కొలువుకూటానికి స్వేచ్ఛగా వచ్చేవారని చరిత్ర వివరిస్తుంది. రాయలకు రామానుజసంప్రదాయ విషయాలపై చిన్నతనమునుండి అభిరుచి ఏర్పడింది. దానికి కారణం సప్తగిరుల సమీపంలోని చంద్రగిరిలో కొంతకాలం గడపడం కావచ్చు. రామానుజులవారు శ్రీవైష్ణవ సంప్రదాయాన్ని యథాశక్తిగా దక్షిణదేశమంతా సుప్రతిష్టతం చేసిన విషయాన్ని తెలుసుకొని తానుకూడా ఆ సంప్రదాయ సుస్థిరతకు కృషిచేయాలని అనుకుని ఉంటాడు. ఆదృష్టితోనే ఆసంస్కృతికి నెలవైన విశేషాలను పరిశీలిస్తూ ఉండి ఉంటాడు. రాజైన తరువాత ఆంధ్ర మహావిష్ణువు ఆనతితో ఆముక్తమాల్యదను సృష్టించాడు. ఈ ప్రబంథంలో వైష్ణవాచార్యులు శైవులైనా రాజులను వైష్ణవులుగా మార్చిన కథలను తన పద్ధతిలో వివరించారు. సాహిత్యవేత్తగా తనకునచ్చిన అంశాలను కవిత్వీకరణ ద్వారా ప్రతిపాదించడం ఆయనకు అందరిలాగే ఉన్న హక్కు రాయలలో ఇద్దరు వ్యక్తులున్నారు ఒకరు రాజ్యాన్ని పాలించే ప్రభువు, మరొకరు సాహిత్యాన్ని ప్రేమించే కవి.

ఎందరో కవి పండితులకు రాయలు ఆశ్రయం. ఆయన కవితా ప్రీతిని, కవిపండిత పోషణను దాతృత్వాన్ని తెలుసుకొని ఎన్నో ప్రాంతాలనుండి కవులు, కళాకారులు, రాయల ఆస్థానానికి వచ్చారు. అష్ఠదిగ్గజ కవులందరు అలా వచ్చిన వారే. పెద్దన, తిమ్మన, మల్లన, థూర్జటి, అష్టదిగ్గ జాలలోని కవులు. వీరుకాక మిగిలినవారి విషయంలో ఎవరనే సందేహం ఉంది. నందితిమ్మన గురువు ఒక శైవ ఆచార్యుడు. అయినా పారిజాతాపహరణమనే వైష్ణవ ప్రబంథం వ్రాసాడు. రాజ్యవిషయం, కవితావిషయం మతాతీతంగా ఉండాలన్నది రాయల అభిప్రాయం. ఎవరి మతసంప్రదాయాన్ని అనుసరించి వారు గ్రంథం వ్రాసినా ఆ సంప్రదాయం మరొకరికి ఆక్షేపణీయం కాకుండా ఉండాలన్నది మతాతీతం అనే మాటకు అర్థం. కవితా సౌభాగ్యం హృదయానందాన్ని కలిగించడం, కథాప్రస్తానం ఆలోచనీయంగా ఉండడం రాయలకు ప్రథానాంశాలు. రాయలది విశాలదృష్టి కాబట్టి థూర్జటిని ఆస్థాన కవిగా అంగీకరించి అతని ప్రబంథాన్ని మెచ్చుకుంటూ 'స్తుతిమతియైన యాంధ్రకవి థూర్జటి పల్కులకేల గల్గెనో యతులిత మాధురీమహిమ' అని కవులందరిలో ప్రశంసించాడు. రాయల సభాప్రాంగణం (భువనవిజయం) లో హృదయావర్ణకాలైన కవితా పఠనాలు, సాహిత్య చర్చలు జరిగిన కాలం ఒక అపూర్వ సంథర్భం. 'కవితకు పెళ్ళిపందిళ్ళు కప్పించిన ' కాలం. సంగీత నృత్యాలు కళలను ఆమని కాలం. ఇవన్నీ కలసిన సాహిత్య స్వర్ణయుగం.

సింగమ రామానారాయణుల పుత్రుడైన థూర్జటి శ్రీకాళహస్తి ప్రాంతమునుండి రాయలసాహిత్య కొలువుకూటానికి వెళ్ళాడు. తమ గ్రంథాలను ప్రభువుకు అంకితమిచ్చి మెప్పుపొందడానికి కవులందరూ ప్రయత్నిస్తున్నకాలంలో థూర్జటి శ్రీకాళహస్తి మహత్మ్యం అనే తన ప్రబంధాన్ని రాయల ఆస్థానకవిగా ఉంటూ, రాయలకు సమర్పించకుండా తన ఇష్టదైవమైన శ్రీకాళహస్తిపతికే భక్తితో సమర్పించాడు. రాయలు పెద్దనను మాత్రమే కావ్యాంకితము చేయమని అడిగాడు. కానీ ఇతర కవులెవ్వరినీ అడగలేదు థూర్జటినీ అడగలేదు. అయినా కొందరు అంకితం చేశారు. థూర్జటి దైవాంకితము విషయము తెలిసికూడా రాయలు ఆ కవితామాథుర్యాన్ని కొనియాడారు. దీన్ని బట్టి రాయలు పోషించిన కవులకు ఎంత స్వేచ్ఛ ఉందో అర్థమవుతుంది. రాయలు బ్రతికి

ఉన్నంతకాలం ధూర్జటి ఆస్థాన కవిగానే కొనసాగారు. రాయలు వైష్ణవుడైనప్పటికి శైవదేవాలయాలకు కూడా భూరి విరాళాలిచ్చాడు. కాళహస్తిలో కూడా ఒక గోపురం నిర్మించాడు. తెనాలి రామకృష్ణకవి మొదట రామలింగకవి. రాయల ఆస్థానానికి వచ్చిన తరువాత పేరుమార్చుకొని వైష్ణవ ప్రబంధం పాండురంగ మహత్మ్యంను రచించాడని చెబుతారు. ధూర్జటి రాయలకోసం అలా పేరు మార్చుకోలేదు.

ధూర్జటి నిలువెల్ల శైవం మూర్తీభవించిన శివభక్తుడు. అందరిలాగా యవ్వనంలో శృంగార అనుభవాలున్నా అవి కాస్త ఎక్కువై తరువాత రోతగా తోచాయి. జీవితాన్ని కాళహస్తిస్వామికి ముడుపుగా కట్టాడు. రాయలు అస్తమించిన తరువాత ధూర్జటి విజయనగరం వదిలి కాళహస్తికి చేరుకొని ఉంటాడు. రాయలు లేని లోటు తరువాత రాజులైన వారి అంత:కలహాల కుట్రలు అతనికి భరించరానివై ఉంటాయి. 'రాజుల్మృత్తులు వారి సేవ నరకప్రాయంబు'... అని ధూర్జటి రాజులను నిందించడం చూస్తే ఆ నింద రాయల అనుయాయులకు సంబంధించినదై ఉంటుంది. అష్టదిగ్గజ కవుల కవితారీతులను ప్రశంసించే సందర్భంలో ప్రత్యేకించి 'స్తుతిమతియైన ధూర్జటి పల్కుల' ను మెచ్చుకొన్న రాయలను ఈ శివకవి నిందిస్తాడా? ఆయన మనస్సు అందుకు సాహిస్తుందా? నిందించడు, సాహసించడు, రాయలతో దివికేగలేక జీవచ్ఛవంలాగా బతుకుతున్నాని బాధపడిన పెద్దనవలె ధూర్జటికూడా వ్యధచెంది ఉంటాడు.

మత సామరస్యానికి ప్రాతినిద్యం వహించిన రాయల ఆస్థానకవులలో ఒకరు శైవ ప్రబంధనిర్మాణం చేశారు. ఆ ఒక్కరు ధూర్జటి. ఆ ప్రబంధం శ్రీకాళహస్తిమహాత్మ్యం. తెనాలి రామకృష్ణకవి చారిత్రకంగా చూచినప్పుడు రాయల అష్టదిగ్గజకవి కాడనిపిస్తుంది. ఈయనను ప్రక్కనబెడితే మత సంప్రదాయాలను ప్రథానీకరించుకొని ప్రబంథాలను నిర్మించినవారు రాయలు, ధూర్జటి. ఆముక్తమాల్యద, శ్రీకాళహస్తిమహత్మ్యం ఆ ఇద్దరి ప్రబంధాలు వీటిలో ఏది ముందు ఏది వెనుక అనేది ప్రధానం కాదు. ఒకటి వైష్ణవకథలను, మరొకటి శైవకథలను గ్రంథస్తం చేశాయి. ఈ రెండూ గ్రంధాలలోని కథలకు రంగం తమిళదేశమే. ధూర్జటి గ్రంధంలోని కథలను సాక్షాత్తు శివుడే నారాయణ వనాల్ని పాలించిన యాదవరాజుకు చెప్పారు. రాయల కావ్యంలో కూడా వరాహస్వామి భూదేవికి చెప్పిన కథ ఉంది. ఇదేగాక ఇంకా కొన్ని విషయాల్లో ఈ రెండూ గ్రంధాలకు పోలికలున్నాయి. ధూర్జటి ఇష్టదేవతా పద్యమిది.

శ్రీవిద్యానిధియై మహామహిమచే జెన్నై, వసిష్ఠాజ లూ
తావాతాశన సామజాటవిక గోత్రాదేవ సత్కీరరా
జీవాక్షీయుగ యాదవాధిపులకున్ శ్రేయస్కరంబైన యా
ర్యావామాంగము, దివ్యలింగము మదీయాభీష్టముల్ సల్పెడున్.

పై పద్యములో ప్రబంధములోగల కథలన్నీ ఉన్నాయి. ఈ కథలను వివరిస్తే ఈ ప్రబంధవైశిష్యము చక్కగా బోధ పడుతుంది.

⌘⌘⌘

BHAVAVEENA
Vol. 17, Issue. 8, August 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

ఆధునిక కవిత్వ రూపం – సమకాలీనత

– డా॥. గొనపాటి ధర్మారావు, సహాయ ప్రాంతీయ సంచాలకులు,
ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం, విశాఖపట్నం ప్రాంతీయ కేంద్రం.

ప్రాజ్ఞన్నయ యుగం నుండి నేటి వరకు ప్రతి సందర్భంలోనూ సాహిత్య సృష్టికి, ముఖ్యంగా కవిత్వ సృష్టికి దోహదపడే అంశాలు కొన్ని వున్నాయి. ఇక్కడ కవిత్వం అని నిర్దిష్టంగా అనడానికి ఒక కారణం వుంది. నన్నయ భారతాంధ్రీకరణ చేపట్టిన నాటి నుండి సుమారు వెయ్యేళ్ళ పాటు కేవలం కావ్యాలే సాహిత్యంగా కన బడ్డాయి తప్ప ఇతర సాహిత్య ప్రక్రియలకు చోటు లేదు. ముఖ్యంగా ఆధునిక యుగారంభం నుండే కొత్త సాహిత్య ప్రక్రియలు తెలుగు సాహిత్యంలోకి ప్రవేశించాయి. ఆంగ్ల భాషా ప్రభావం, ఆంగ్ల సాహిత్య పరిచయం, సమాజం లోకి ఆధునిక భావాల చొరబాటు - ఇవన్నీ కొత్త వచన ప్రక్రియలకు బాటలు వేశాయి. కావ్యం లేదా కవిత్వం అప్పటి నుండి ఇప్పటి వరకు నిలబడిన సాహిత్య ప్రక్రియ. అందుకే ఈ వ్యాసంలో కవిత్వ రూపానికి సంబంధించిన చర్చజరిగింది.

ఒక కవి (సాహిత్యకారుడు) ఒక రచనని, కావ్యాన్ని రాయడానికి తోడ్పడే అంశాలు కొన్ని వుంటాయి. ఏ కవి కూడా ఏదో అశరీరవాణి చెప్పిందనో, ఆకాశవాణి రాయించిందనో అంటే నమ్మాల్సిన పనిలేదు. కవి తానున్న సమాజంలోని అంశాలకు తన జీవితం చుట్టూ ఆవరించుకొని వున్న సామాజిక వ్యవస్థ, దాని సిద్ధాంతాలకులోబడి తన రచనలు చేస్తాడు. దీంతో పాటు అతని స్వీయ చైతన్యం లేదా అతని భావనలు కూడా ఈ రచనకు పురికొల్పుతాయి. అయితే కవి స్వీయ చైతన్యం కూడా మళ్ళీ అతనున్న సమాజ సూత్రాలను అనుసరిస్తూనే వుంటుంది.

ఈ విధంగా కవి చుట్టూ వున్న సామాజిక వ్యవస్థ, కవి భావనలు కలిసి సాహిత్య లేదా కవిత్వ సృష్టికి దోహదం చేస్తాయి. ఈ రెండు అంశాలకు నిరంతరం ఘర్షణ వుంటుంది. ఆ ఘర్షణల్లోంచే సాహిత్య / కవిత్వ సృష్టి జరుగుతుంది. ఇందులో ఎలాంటి అలౌకిక, అమూర్త భావనలకు నాలుకల మీద బీజాక్షరాలు రాసే శక్తులకు తావులేదు.

మలి ప్రబంధ యుగం వరకు కావ్య స్వరూపంలో చెప్పుకోదగ్గ మార్పులు కనిపించవు. వస్తువులోనూ ఏ మార్పులు రాకా సాహిత్య / కావ్య రచన నిస్తేజంగా మారిపోయింది. రాజుల భోగ విలాసాలు, కళాపోషణ, శృంగార భావనలు, వర్ణనలు కవిత్వాన్ని ముంచేసి మూల కూర్చోబెట్టేసిన తరుణంలో ఆధునిక భావనలు సమాజంలోని అన్ని రంగాలతో పాటు కవిత్వ క్షేత్రంలో కూడా ప్రభావాన్ని వేశాయి. 19వ శతాబ్దం రెండవ భాగంలో ఊపందుకున్న ఈ ధోరణి తరువాతి కాలంలో ఒక యుగంగా భాసిల్లింది. ఆధునిక యుగంగా పేరొందిన ఈ కాలంలో కవిత్వం బహుముఖాలుగా విస్తరించింది. ఆంగ్ల కవిత్వంలో జార్జియన్ కవిత్వం (Georgian Poetry) పేరున వున్న కవిత్వం ఈ మార్పుల్ని మొదటగా గుర్తించింది. ఈ పరిణామ దశలో కవిత్వవస్తువు తమ రూపం, తమ భావంలో మార్పులు సంభవించాయి. శైలి, అభివ్యక్తులలో భిన్న పోకడలు సంతరించుకుంది కాలపు కవిత్వం. సింబాలిజం (Symbolism), ఇంప్రెషనిజం (Impressionism), ఇమేజిజం (Imagism), ఫ్యూచరిజం (Futurism), నేచురలిజం (Naturalism), క్యూబిజం (Cubism) మొదలైన ధోరణులతో పాటు ఎక్స్‌ప్రెషనిజం (Expressionism), డాడాయిజం (Dadaism), సర్రియలిజం (Surrealism) వంటి ధోరణులు ఆ కాలంలో విరివిగా కనిపిస్తాయి.

తెలుగు సాహిత్య లోకంలోకి కొంత ఆలస్యంగా అంటే సుమారు 19వ శతాబ్దం చివరి పాదంలో ఈ భావనలు ప్రవేశించాయి. కందుకూరి వీరేశలింగం సామాజిక సంస్కరణలకు తోడుగా గిడుగు భాషా సంస్కరణం తోడై కవిత్వంలో నిర్దిష్టత, మాటల వాడకంలో పొదుపు, వ్యవహారిక భాషను సమర్థవంతంగా వినియోగించుకోవడం వంటివి అలవడ్డాయి. ఈ భావనలు కొత్త రకపు శైలి శాస్త్రానికి దారులు వేశాయి. వెయ్యేళ్ళుగా వర్ధిల్లుతూ వచ్చిన సాంప్రదాయ రచనా విధానాన్ని నిర్ద్వందంగా ఖండించిందీ యుగపు కవిత్వం. ఆధునిక భావనలు తెలుగు కవిత్వంపై చాలా ప్రభావాన్ని వేశాయి. ఆధునిక భావన తెలుగు నేలపై కాలూనడానికి ప్రధానంగా ఆంగ్లేయుల వలస పాలన కారణమైంది. ఆంగ్లభాషా పరిచయంతో పాశ్చాత్య సాహిత్య పోకడలు, వైవిధ్యాలు అన్నీ తెలుగులోకి రావడంమొదలు పెట్టాయి. ఆ కాలంలో తెలుగు సాహిత్యాన్ని మరీ ముఖ్యంగా తెలుగు కవిత్వాన్ని ప్రభావితం చేసిన అంశాలు ఇలా వున్నాయి.

1. భారతదేశంలో ఆంగ్లేయుల విద్యా విధానం
2. ఆంగ్ల సాహిత్యంతో పరిచయం పెరగడం
3. ఇంగ్లీషువారి సేవ (సాహిత్యానికి)
4. పెరిగిన ముద్రణా సౌకర్యాలు
5. తెలుగు సమాజంలో అడుగుపెట్టిన వివిధ పత్రికలు
6. మత, సాహిత్య, సామాజిక సంస్కరణోద్యమాలు
7. జాతీయోధ్యమం

ఈ అంశాలన్నీ ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ప్రభావం వేసి కవిత్వంలో వస్తువు, తమ రూపాలు రెంటిలోనూ గణనీయమైన మార్పులకి దోహదం చేసాయి.

కవిత్వం : సమకాలీన వస్తువు - రూపం :

ఆధునిక జీవితంలోని విభిన్న అంశాలు అన్నీ ఆధునిక కవిత్వంలో వస్తువులే. వాస్తవికతే ఆధారమైన సాహిత్యంలో వస్తువుకు ప్రాధాన్యం వుంటుంది. కవి ప్రాపంచిక అనుభవం నుండి కొన్ని అంశాలను ఎంచుకుని వాటిని ఇతరులకు అనుభూతమయ్యేటట్లు రచన సాగిస్తాడు. ఈ విధంగా కవి దేనినయితే అందించదలచుకున్నాడో దానినే వస్తువుగా పరిగణించాలి. ప్రాచీన కవిత్వంలో వస్తువు పురాణాల చుట్టూ, ఇతిహాసాల చుట్టూ తిరుగుతూ వుండేవి. రాజులను కీర్తించడం, రాజ వంశాలను కీర్తించడం, ప్రకృతి వర్ణనలు, స్త్రీ వర్ణనలు, శృంగారం ఇవే వస్తువులుగా సుమారు తొమ్మిదివందల ఏళ్ళు కనిపించాయి. అయితే ఆధునిక భావన కవిత్వ వస్తువులో గణనీయమైన మార్పుల్ని తీసుకువచ్చింది.

కవితా వస్తువులకు సంబంధించిన ప్రాచీన అలంకారికులు విధించిన నియమ నిబంధనలన్నీ విస్మరించాడు ఆధునిక కవి. ఆధునిక భావన కవిత్వం పరిధిని అనంతంగా మార్చి వేసింది. వస్తువులో వచ్చిన మార్పు అనివార్యంగా రూపంలో కూడా మార్పుకు కారణమైంది. ప్రాచీనులు కవిత్వానికి నియమించిన ఛందోలక్షణాలన్నింటినీ ఆధునిక కవులు పక్కన పెట్టేసారు. వృత్తాలు, గణాలు అన్నింటినీ ప్రక్కన పెట్టి స్వేచ్ఛగా కవిత్వం రాసే వీలు కల్పించారు.

ఆధునిక కవిత్వోద్యమాన్ని ప్రారంభించిన గురజాడ తన కవిత్వానికి సంబంధించి వస్తువుతో పాటు రూపాన్ని మార్చడంపై ఎక్కువ దృష్టి పెట్టినట్టు కనిపిస్తుంది. ఆధునిక కవిత్వం మారింది అక్కడి నుండే. అక్కడి నుండి ఇప్పటి అస్తిత్వవాద ఉద్యమాల కవిత్వం వరకు కవిత్వ రూపం ఎన్నో రకాల మార్పులకు, కుదుపులకు లోనైంది. అలా మారిన రూపం ముఖ్యంగా మూడు రకాలుగా, మూడు దశలుగా కనిపిస్తుంది.

1. దేశి ఛందస్సులు లేదా మాత్రా ఛందస్సుల దశ: ఈ దశ గురజాడతో ప్రారంభమైంది. గురజాడ తనకెంతో ఇష్టమైన ముత్యాల సరాలను దేశి ఛందస్సులో రచించాడు. ఈ ఛందస్సులు రగడల్లోనూ జానపద రీతుల్లో కూడా కనిపిస్తాయని కొంత మంది పరిశోధకులు నిరూపించే ప్రయత్నం కూడా చేశారు. ఈ దశ చాలా కాలం కొనసాగింది. గురజాడ

మార్చిన వస్తువు కన్నా, గురజాడ ఎంచుకున్న రూపాన్ని అతని తరువాత వచ్చిన భావ కవులు ఎంచుకున్నారు. ఎక్కువ మంది భావకవులు తమ కవిత్వాన్ని గేయ రూపంలోనే రాశారు. వస్తువుకు సంబంధించినంత వరకు వీరు మళ్ళీ ప్రబంధ యుగ పోకడలకే పోయారు. వర్ణనలు, శృంగారం, స్త్రీ, విరహం, తాపం ఇలాంటి కృత్రిమ అంశాలే చాలా మంది భావకవుల్లో కనిపిస్తాయి. నిజానికి గురజాడ బలంగా తీసుకువచ్చిన సామాజిక అంశాలు, ఆధునిక భావనలు భావకవుల కాలంలో కొంత వెనక్కి పోయాయి. అయితే ఎలిజీలు, యాత్రా చరిత్రలు, జాతీయ భావనల వంటి కొన్ని నవీన అంశాలు కొత్తరూపులో కనిపిస్తాయి. అయితే మాత్రా ఛందస్సుల వాడకం అక్కడితో అగిపోలేదు. అభ్యుదయ కవిత్వం రాసిన శ్రీశ్రీ వంటి కవులు మాత్రా ఛందస్సుల్ని, దేశిరూపాల్ని, గేయ రూపాల్ని సమర్థవంతంగా కవిత్వంలో చొప్పించి ఒప్పించ గలిగారు. ఆ రకంగా మాత్రా ఛందస్సు చాలా కాలం పాటు తెలుగు కవిత్వ రంగంలో బలంగా నిలిచింది.

2. మాత్రా ఛందస్సులు దాటి, ప్రాసలు వాడి లయ బద్ధంగా సాగిన దశ: ఈ దశలో అంత్యప్రాసలు, అనుప్రాసలతో చమత్కారాలు, కవితాపుష్టి కలిగించే అంశాలు ముందుకు వచ్చాయి. అభ్యుదయ విప్లవ కవులు ఇందులో భాగమయ్యారు. గేయాల్లో ఊపును తెప్పించడానికి తాము చెప్పదలచుకున్న లక్ష్యం పాఠకునికి తమ కవిత్వం చేరడానికి వీరు గేయరూపాన్ని, దానితో పాటు లయబద్ధప్రాసల్ని వాడుకున్నారు. మళ్ళీ ఈ ధోరణులు బలంగా కొనసాగుతున్న కాలంలోనే ప్రాసలు కూడా లేని కేవల వాక్యరూపం కూడా కనిపిస్తుంది. ఈ ధోరణి తరువాతి కవుల్లో బలంగా వచ్చి ఇప్పటికీ కొనసాగు తుంది.

3. కేవల వాక్యరూపం : ఈ రూపం చాలా వరకు దిగంబర కవులతో ప్రారంభమైంది. వీళ్ళు దిక్‌లుగా చెప్పుకున్న తమ కవిత్వంలో కేవల వాక్య ప్రయో గాలు చేశారు. అంతకు ముందు శ్రీశ్రీ, నారాయణ బాబు, శిష్లా వంటి కవులు కూడా కేవల వాక్యరూపం ప్రయత్నించారు. సఫలీకృతులయ్యారు కూడా, అయితే వచన కవిత్వ ధోరణి తరువాత వచ్చిన అస్తిత్వవాద ఉద్యమ కవిత్వాలు (స్త్రీ, దళిత, ముస్లిం కవిత్వాలు) ఈ మూడవ దశను కొనసాగిస్తూ వస్తున్నాయి.

రూపం - సమకాలీనత :

వస్తువు సాధారణంగా తనకు కావాలసిన రూపాన్ని కోరుకోవడం, తయారు చేసుకోవడం, వున్నవాటిలో అను కూల రూపాన్ని ఎంచుకోవడం జరుగుతుందనేది ఒక వాదన. అయితే రూపం కూడా కొన్ని సందర్భాలలో నిస్తేజం అయిపోయి, ముఖ్యంగా సమకాలీనతను (Relevance) కోల్పోయి కొత్త రూపాన్ని పొందే వైపుగా ప్రయత్నిస్తున్నది అన్నది కూడా ఆధునిక కవిత్వ రూపాన్ని పరిశీలిస్తే గ్రహించదగిన అంశం. ఈ రకమైనమార్పు రూపానికి సంబంధించి ఆధునిక యుగంలో నాలుగు చోట్ల కనిపిస్తుంది. అంటే రూపం తనకు తానే విలువ కోల్పోయి అప్రధానం (Invalid) అయిపోయి, అసంబంధం / సంబంధం లేనిదిగా (Irrelevant) మారిపోయాయని గ్రహించి కొత్త రూపంవైపు పరుగెత్తడం కనిపించే దశలు నాలుగు కనిపిస్తాయి.

గురజాడ ప్రారంభించిన మాత్రా ఛందస్సులు:

మొదటి దశలో అప్పటి వరకు వున్న మలి ప్రబంధ యుగం నాటి ఛందోబద్ధ కావ్యరూపం పూర్తిగా పాతబడి పోయింది. ఎక్కువ కాలం వున్నది ఏదైనా కొంత కాలానికి తన ప్రాభవం, గుర్తింపు, సమకాలీనత కోల్పోవడం జరిగే తీరుతుంది. ఇది సామాజిక ధర్మమే. తెలుగు ప్రబంధ స్థితిగతుల ఫలితంగా అప్పటి ఆ రూపం ముఖ్యంగా ఒకే రకం కథలు, వర్ణనలు, స్తోత్రాలు ఇలా - ఒకే రకం

వస్తువు, దానిని ప్రకటించే రూపం రెండూ నిస్తేజం అయి పోయాయి. అప్పటి రూప లక్షణాలుగా - అల్లిక జిగిబిగి, ముద్దుపలుకులు, పదగుంఫనం - వంటివే చర్విత చర్వణంగా అన్ని కావ్యాల్లో కనిపిస్తూ వచ్చాయి. ఈ దశలో రూపమే తన దశను మార్చుకునే ప్రయత్నం కనిపిస్తుంది. ఇదే విషయం 'సరస్వతీ నారద విలాపం'లో కందుకూరి వ్యంగ్యంగా వ్యక్తపరిచాడు. ఈ దశలో గురజాడ తెచ్చిన రూపం ఆ మూస ధోరణి నుండి ప్రయత్న పూర్వకంగా బయటకు వచ్చే ప్రయత్నమే.

భావ కవిత్వం నుండి ప్రయోగవాదులు (పఠాభి):

రెండో దశలో భావ కవిత్వం నుండి ప్రయోగాల మధ్యలో జరిగిన పరిణామం. ఇక్కడ కూడా రూపం తన వేషాన్ని మార్చాలనుకునే ధోరణి కనిపించింది. పూర్తిగా రూపం కృతకంగా మారి అప్పటి సామాజిక పరిస్థితులకు గాని, కవిత్వంలో వస్తువుకుగాని స్పందించడం కుదరని పరిస్థితుల్లో ప్రయోగవాదులైన పఠాభి, శిష్టా మొదలైన వారు మొదట 'రూపం'తోనే తిరుగుబాటు చేశారు. కవిత్వతాత్త్విక భూమికల కన్న కేవలం కవిత్వ రూపం మారాల్సిన ఆవశ్యకతను బలంగా గుర్తు చేసి రూపానికి సంబంధం (Relevance) అవసరం అన్న విషయాన్ని స్పష్టం చేసిన దశ ఇది.

అభ్యుదయ కవిత్వం నుండి దిగంబర కవులు :

మూడో దశలో అభ్యుదయ కవిత్వం నుండి దిగంబర కవిత్వం వైపుకు మళ్ళీన దశ. ఈ దశలో అభ్యుదయ కవులు తాము వచన కవిత్వానికి పూర్తి వ్యతిరేకం అని ప్రకటించుకున్న వైనం కనిపిస్తుంది. దీనికి కారణం అభ్యుదయ కవిత్వం పేరుతో వచ్చిన లయబద్ధ దేశి ఛందస్సులు, వచన కవిత్వం రెంటిలోనూ భావం, అభివ్యక్తి పేలవంగా కనిపించడం. దిగంబర కవిత్వం వచ్చేనాటికి అభ్యుదయ కవిత్వంలో వస్తువు పాతబడి పోయింది. కవిత్వంలో వాడిన భాష, పడికట్టు పదజాలం మూసలో పోసినట్లుగా తయారయ్యాయి. ఈ కారణంగానే వీరు వచన కవిత్వానికి వ్యతిరేకమని చెప్పుకున్నారు. కానీ వీరు రాసింది అచ్చంగా వచన కవిత్వమే. అయితే విపరీత లైంగిక ప్రతీకలతో, తీవ్రంగా, షాక్‌కి గురి చేసేలా వున్న అభివ్యక్తి వాడడం ఈ రూపం తెచ్చిన విప్లవం.

విప్లవ కవిత్వం నుండి స్త్రీవాద, దళిత కవిత్వం :

నాల్గో దశలో విప్లవ కవిత్వం తరువాత స్త్రీవాద, దళిత వాదాలు పరిణమించిన దశ. ఇక్కడ కూడా దిగంబర కవులకెదురైన పరిస్థితే. అయితే ఈ కాలానికి వచ్చేసరికి ప్రచార మాధ్యమాలు పెరుగుతూ రావడం, కవిత్వం రాసేవారు పెరగడం, ప్రతి సంఘటనకు కవిత్వం రాసే వారు పెరగడం, ప్రతి సంఘటనలకు స్పందనలు రావడం అంతేగాక వచన కవిత్వంలోనే రాయాలను కోవడం వల్ల కొత్త అభివ్యక్తి మార్గాల కోసం రూపం ప్రయత్నించింది. అప్పటి సాంఘిక చైతన్యాలను చూపించడంలో విప్లవ కవులు వాడుతూ వచ్చిన అభివ్యక్తి విధానం విఫలమౌతూ రావడం వల్ల కొత్త అభివ్యక్తులు పుట్టడానికి దోహదం చేసిందని చెప్పవచ్చు. అప్పుడు ప్రారంభమైన దశే ఇంకా ప్రాంతీయ చైతన్యం, బి.సి. వాద కవిత్వం పేరుతో వచ్చిన కవిత్వాలలో కొనసాగుతూ వుంది. కవిత్వంలో సాంద్రత పెరగడం ఇప్పటి మరో పరిణామం.

ఈ నాలుగూ సందర్భాలలో కవిత్వం తన రూపం తానే మార్చుకోవడానికి చేసిన ప్రయత్నం స్పష్టంగా కనిపిస్తుంది. అది కూడా ఒక అనివార్యత రావడం ఒక విశేషం. గురజాడ చేసిన రూపంలో మార్పులు ప్రయత్న పూర్వకంగా ఒక తప్పనిసరి సంస్కరణగా జరిగినట్టే భావకవులు నుండి పఠాభి వంటి వారు చేసిన ప్రయోగాలు కూడా అటువంటి ప్రయత్నమే. దిగంబర కవుల ప్రయత్నంలోని లక్ష్యం నిజానికి అప్పటి మూస ధోరణిలో వస్తున్న అభ్యుదయ భావనల కవిత్వాన్ని మార్చాలని చేసే ప్రయత్నం. అయితే ఆ ప్రయత్నంలో భాగంగా దిగంబర కవులు అప్పటికి స్థిరపడుతున్న వచన కవిత్వ రూపాన్ని కాదంటూనే మళ్ళీ అదే రూపంలోనే కవిత్వ రచన చేశారు.

వారి దిక్కులన్నీ వచన కవిత్వ రూపాలే. ఇక రూపం సమకాలీనతను కోల్పోయిన నాల్గవ సందర్భం విప్లవ కవిత్వం బలంగా వస్తున్న రోజుల్లోనే ప్రారంభమైంది. ఈ సందర్భంలో వచ్చిన కొత్త రూపం ఇప్పుడు స్థిరపడింది. ఈ రూపం కూడా శాశ్వతం కాకపోవచ్చు. అయితే రూపం వచనమే అయినా ఎప్పటికప్పుడు కొత్త కొత్త కవిత్వ నిర్మాణ వ్యూహాలు కవులు తయారు చేసుకుంటూ వుండడం, స్త్రీ, దళిత, ముస్లిం, బహుజన, ప్రాంతీయ ధోరణులన్నీ ఎప్పటికప్పుడు కొత్త వస్తువుని, కొత్త పదబంధాల్ని, భాషను పరిచయం చేస్తూ వుండడంతో ఈ రూపం ఇలా మరి కొంత కాలం కొనసాగుతూ వుండే అవకాశం వుంది.

ఉపయోగపడిన పుస్తకాలు :

1. అఫ్సర్ ఆధునిక, అత్యాధునికత (వ్యాసాలు), ప్రథమ ముద్రణ, పాయిట్రీ ఫోరం ప్రచురణ, తెనాలి, 1993.
2. అరుణ కుమారి జి, ఆధునిక తెలుగు కవిత్వంలో మానవతావాదం విభిన్న ధోరణులు, ఈస్ట్ వెస్ట్ రిసెర్చ్ సెంటర్, హైదరాబాదు, 1989.
3. ఆంజనేయులు, కుందుర్తి, కుందుర్తి వ్యాసాలు, తెలుగు పరిశోధన ప్రచురణలు, హైదరాబాదు, 1987
4. ఆరుద్ర, సమగ్ర ఆంధ్రసాహిత్యం, తెలుగు అకాడమీ, హైదరాబాదు, (సం.4), 2007
5. చంద్రశేఖరరెడ్డి, రాచపాళెం, ఆధునికాంధ్ర కవిత్వం ఉద్యమాలు - సందర్భాలు, ప్రథమ ముద్రణ, విశాలాంధ్ర, అనంతపురం, 2002.
6. చంద్రశేఖరరెడ్డి రాచపాళెం, ప్రాచీనాంధ్ర కవుల సాహిత్యాభిప్రాయాలు - అభిరుచులు, ప్రథమ ముద్రణ, తెలుగు అకాడమీ, హైదరాబాదు, 1992.
7. నారాయణరావు, వెల్చేరు, తెలుగులో కవిత్వ విప్లవాల స్వరూపం, హైదరాబాదు బుక్ ట్రస్టు, హైదరాబాదు, 1987.
8. నారాయణరెడ్డి సి. ఆధునికాంధ్ర కవిత్వం సంప్రదాయములు: ప్రయోగములు, ఆరవ ముద్రణ, విశాలాంధ్ర పబ్లికేషన్సు, హైదరాబాదు, 2007.
9. నిఖిలేశ్వర్, ప్రపంచ సాహిత్యంలో తిరుగుబాటు ఉద్యమాలు, ప్రథమ ముద్రణ, విశాలాంధ్ర, హైదరాబాదు, 1995.
10. మధుసూధనరావు, త్రిపురనేని, కవిత్వం - చైతన్యం, ప్రగతి ప్రింటర్స్, ప్రొద్దుటూరు, 1978.
11. రంగనాథాచార్యులు, కె.కె., ఆధునిక తెలుగు సాహిత్యంలో విభిన్న ధోరణులు, ద్వితీయ ముద్రణ, నవోదయ, హైదరాబాదు, 2005.
12. రంగనాథాచార్యులు, కె.కె., తెలుగు సాహిత్యం - చారిత్రక భూమిక, ఆంధ్ర సారస్వత పరిషత్తు, హైదరాబాదు, 1990.
13. రంగనాథాచార్యులు, కె.కె., తెలుగు సాహిత్య వికాసం, ఆంధ్ర సారస్వత పరిషత్తు, హైదరాబాదు, 1979.
14. రంగనాథాచార్యులు, కె.కె., ఆధునిక తెలుగు సాహిత్యంలో విభిన్న ధోరణులు, తెలుగు సాహిత్యం చారిత్రక భూమిక, ఆంధ్రసారస్వత పరిషత్తు, హైదరాబాదు.

⌘⌘⌘

BHAVAVEENA
Vol. 17, Issue. 8, August 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

వేమన శతకం – సమకాలీనాంశాలు

– డా॥. కె. శ్యామలాదేవి, తెలుగు అధ్యాపకురాలు, ప్రభుత్వ కళాశాల (అ), రాజమండ్రి.

తెలుగు సాహిత్యంలో సార్వజనీనత కల్గి, సర్వజనాదరణ పొందిన విశిష్ట ప్రక్రియ శతకం. సంస్కృత స్తోత్ర రచన ప్రభావంతో తెలుగులోకి వచ్చిన శతకం భక్తి, వైరాగ్య, నీతి, శృంగారం, వ్యంగం మొదలగు విలక్షణ, వస్తువైవిధ్యతతో బహుముఖాలుగా విస్తరించింది.

"చట్టాన్ని చెపుతుంది శాస్త్రం
హితాహితాలు చెపుతుంది ఇతిహాసం
బుద్ధులు చెపుతుంది పురాణం
సుద్దులు చెపుతుంది శతకం"

శతకం గురువులా విజ్ఞానాన్ని బోధిస్తూ స్నేహితుడిలా సలహాలిస్తూ, శ్రేయోభిలాషిగా హితబోధ చేస్తుంది. మానవ జీవనానికి కావలసిన నిత్యసత్యాలను, ధర్మా ధర్మ విషయాలను చిన్న చిన్న పద్యాలలో అందించడమే కాక బుద్ధిబలాన్ని పెంచి, మనోవికాసాన్ని పెంచేందుకు దోహదపడేది శతకం.

వేమన శతకం :

17వ శతాబ్ధికి చెందిన వేమన తన అనుభవ జ్ఞానమంతా నీతుల రూపంలో మానవాళికందించాడు. జీవనసారాన్ని ఆటవెలది పద్యాలలో అలతి అలతి పదాలతో సూక్తుల రూపంలో వెలువరించాడు. వేమన పద్యం రాని తెలుగువాడు లేడనేంతగా ప్రజల నాలుకల పైకి చేరిన వేమన శతకం శతక సాహిత్యంలోనే కలికితురాయి వంటిది.

సమకాలీనత సాహిత్యానికి ప్రాణం కనుకనే వేమన తన కాలంనాటి సాంఘిక, మత, ఆర్థిక పరిస్థితులను, ఆచార వ్యవహారాలను, విభిన్న మనస్తత్వాలను, హితోక్తుల, జోడింపుతో అసువుగా వెల్లడించి ప్రజాదరణ పొందాడు. వేమన బోధించిన సూక్తులు సర్వకాల, సర్వావస్థలందు ఆచరించదగినవి కనుకనే నేటికీ మానవ జాతి మనుగడకు దిశానిర్దేశకములైనవి.

ఏకాగ్రత ప్రాధాన్యతను వివరిస్తూ...

ఆత్మశుద్ధిలేని యాచారమదియేల?
భాండశుద్ధిలేని పాకమేల?
చిత్తశుద్ధిలేని శివపూజలేలరా?
విశ్వదాభిరామ వినురవేమ.

మనిషి తాను చేసే ఏ పనియైనా ఏకాగ్రతతో చేయాలి. అలా ఏకాగ్రత లేకుండా చేసిన పని వ్యర్థమే అవుతుంది. నిర్మల మనసుతో పాటించని ఆచారం, శుద్ధిలేని పాత్రలో వండి ఆహారం ఏ విధంగా నిష్ఫలమో, నిశ్చల మనస్సులేని భగవంతుని పూజ కూడా వ్యర్థమేనని భావం.

లోకంలో ధనానికున్న ప్రాధాన్యతను తెలుపుతూ...

కులము గలుగువాడు గోత్రంబు గలవాడు
విద్యచేత విఱ్ఱవీగువాడు
పసిడి గలుగువాని బానిస కొడుకులు!

గొప్ప కులగోత్రములు, అధిక విద్య కలిగినవారు కూడా ధనము కలవానికి బానిసలుగానే బ్రతుకుతారని, సంపద వ్యక్తులపై అత్యంత ప్రభావం చూపుతుందని తెలిపాడు.

కులము లేనివాడు కలిమిచే వెలయును
కలిమి లేనివాడు కులము దిగును
కులముకన్న భువిని గలిమి యెక్కువ సుమీ

కులంలో తక్కువవాడు ధనము సంపాదించి గొప్పవాడగును, ఉత్తమ కులంలో పుట్టినా ధనంలేనిచో అధమ స్థానమును పొందుతాడు. లోకంలో కులం కన్నా ధనమే ప్రధానం. అది ఉన్నవానికి అన్నీఉన్నట్లే.

సమాజంలో మంచి చెడులకు, నైతికానైతిక పనులకు మనుషుల స్వభావమే కారణం. కనుకనే వేమన వ్యక్తుల మనస్తత్వాలను పేర్కొంటూ...

అల్పుడెపుడు పల్కు నాడంబరముగాను
సజ్జనుండు బల్కు జల్లగాను
కంచుమ్రోగునట్లు కనకంబు మ్రోగునా!

ఉత్తమ వ్యక్తులను బంగారంతో, అధమ వ్యక్తులను కంచుతో పోల్చి వారి స్వభావాలను వివరించాడు.

వేరు పురుగు చేరి వృక్షంబు జెఱచును
చీడపురుగు జేరి చెట్టు జెఱచు
కుత్సితుండు చేరి గుణవంతు జెఱచురా

మహావృక్షాన్ని వేరుపురుగు ఏ విధంగా నాశనం చేస్తుందో, దుష్ట స్వభావం కలిగినవాడు గుణవంతుడిని నాశనం చేస్తాడని. కనుక దుష్టునికి దూరంగా ఉండాలని తెలిపాడు.

కోపం, శాంతం గుణాల గురించి చెప్తూ...

శాంతమె జనులను జయమునొందించును
శాంతమునెె గురుని జాడ తెలియు
శాంత భావ మహిమ జర్చించలేమయా

శాంతముతో దేనినైనా సాధించవచ్చు. గురువులు శాంత స్వభావముతో గొప్పవారిగా పరిగణింపబడు తున్నారు. శాంతం యొక్క గొప్పతనము చెప్పనలవి కాదని భావం.

కోపమునను ఘనత కొంచమైపోవును
కోపమునను మిగుల గోడుగల్గు
కోపమడచెనెని కోర్కెలీడేరు

వ్యక్తి తన కోపమును తగ్గించుకోకుంటే అతని గొప్ప తనం నశిస్తుంది. కేవలం శాంతం ద్వారానే సర్వ కార్యములు సిద్ధిస్తాయి. కావున మనిషి శాంత స్వభావాన్ని అలవరచుకోవాలని వేమన వాదం.

నేటి మన వ్యవస్థలో విద్యా విధానం విద్య యొక్క స్వరూపాన్ని పూర్తిగా మార్చివేసింది. మార్కుల కొలబద్ధతో అర్ధరాహిత్యమైపోయింది. అర్ధవంతం కాని చదువు వ్యర్థమని పేర్కొంటూ...

చదివి చదివి కొంతచదువంగ చదువంగ
చదువు చదివి యింక జదువు చదివి
చదువు మర్మములను చదువు లేడయ్యెను

చదువు యొక్క మర్మము తెలియకుండా ఎంత కాలం చదివినా ఆ చదువు నిరర్థకమని చెప్పిన తీరు మన వ్యవస్థలోని విద్య అవస్థను వివరిస్తుంది.

ప్రతి మనిషి తప్పుచేస్తాడు. కానీ తన తప్పును తెలుసు కోకుండా ఇతరుల తప్పులను ప్రశ్నించడాన్ని తెలుపుతూ..

తప్పులెన్నువారు తండోప తండంబు
లుర్విజనులకెల్ల నుండు దప్పు
తప్పులెన్నువారు తమ తప్పు లెరుగరు
విశ్వదాభిరామ వినురవేమ.

తనకు గల్గు పెక్కు తప్పులనుండగా
ఓగు నేరమెంచు నోరులంగాంచి
చక్కిలంబుగాంచి జంతిక నగినట్లు

జంతికలో చుట్లు ఎక్కువగా ఉండును. చక్కిలములో తక్కువగా ఉండును. అయినా చక్కిలాన్ని చూసి జంతికవెక్కిరించినట్లు దుష్టుడు కూడా తన తప్పులను ఎరుగక ఎదుటివారి తప్పులను ఎంచునని భావం.

మన వ్యవస్థలోనున్న అనాగరిక భావాలలో కులవ్యవస్థ ఒక్కటి. మానవత్వానికి మాయని మచ్చగా మిగిలిన కులతత్వాన్ని నిరసిస్తూ...

పూజకన్న నెంచ బుద్ధి ప్రధానంబు
మాటకన్న నెంచ మనసు దృఢము
కులము కన్న మిగుల గుణము ప్రధానంబు

మనిషి ఏ కులంలో పుట్టినా అతని గుణము మంచిదిగా ఉండాలని. మనిషికి కులం కంటే గుణమే ప్రధానమని పేర్కొనడం నేటి సమాజానికి అన్వయింప దగినది. వేమన కాలంనాటి సామాజిక పరిస్థితులు, వ్యక్తిగా

తన అనుభవాలైన స్త్రీ వ్యామోహం, ధనకాంక్ష మొ॥న భావములు, సంకుచిత భావము కలగలిపి శతకంగా రూపుదిద్దుకుంది. వేమన చెప్పిన పద్యం నాటిదైనా నేటికీ వ్యవస్థలో నిత్య నూతనంగా వెలుగుటకు కారణం సమకాలీనత. వ్యక్తి కేంద్రంగా, వ్యక్తిత్వాన్ని ఆలంబనగా, వ్యవస్థను సూక్ష్మంగా పరిశీలించిన వేమన ప్రజారంజకమైన తన పద్యజ్యోతుల ద్వారా తదుపరి తరాలకు వెలుగుబాట లను నిర్మించాడు.

ఆధార గ్రంథాలు :

1) శతక వాఙ్మయం - కళాస్రవంతి, హైదరాబాదు
2) వేమన శతకం

⌘⌘⌘

BHAVAVEENA
Vol. 17, Issue. 8, August 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

సినిమా ముసుగులో నవ్య సంప్రదాయం

– డా॥. పి.ఎ. సత్యనారాయణ, అసిస్టెంట్ ప్రొఫెసర్, ప్రభుత్వ కళాశాల (అ), రాజమహేంద్రవరం.

ప్రాపకం కోసం రాజుల చుట్టూ, రంభల చుట్టూ తిరుగుతూ ఏలికల్ని ఏకేశ్వరుణ్ణి చేసే రాతలే ఆధునిక యుగంలో కూడా పునరావృత్తం కావటమే నవ్య సంప్రదాయం. రాజులు, రాయసగాళ్ళు కలసి ప్రజల్ని గొడ్డు చాకిరీకి పరిమితం చేసి వాళ్ళకోసం వాళ్ళు స్వర్ణయుగం నిర్మించుకున్నారు. అంతఃపురాల్లో, అప్సరసలతో పల్లకీల్లో, తూగుటుయ్యాలలో మత్తిల్లారు. ప్రజల్ని అక్షరం ముక్కకు దూరంచేసి అనాగరికులని, పామరులని ముద్రవేసి వాళ్ళ స్వేదంతో పురుడోసుకున్న సంపదను స్వాధీనం చేసుకుని వదిలించుకోలేని పీడగా పరాన్నజీవులుగా బతికారు. వాళ్ళ మాయమాటల, రాతల మంత్రతంత్రాలతో ప్రజల్ని నోరెత్తకుండా చేసారు.

వాళ్ళ కరపెత్తనాన్ని గప్పు ఔదార్యంగా నమ్మబలికారు ప్రజలపట్ల వాళ్ళ కర్తవ్యాన్ని ప్రజల పై వాళ్ళు కురిపించే దయాభిక్ష అని భ్రమింపజేసి ఊడిగం చేయించుకున్నారు. వాళ్ళ బాధ్యత త్యాగంగా చలామణిఅయ్యింది. వాళ్ళ వైభవ కాముకత్వం ప్రజలకన్నీళ్ళు చూడలేని గుడ్డి వాళ్ళుగా వాళ్ళను తయారుచేసింది. ప్రజలకు పరలోకం గురించి చెబుతూ ఇహంలోని వాళ్ళు రుచిమరిగిన భోగాలు వాళ్ళను కఠినుల్ని చేసాయి. వాళ్ళ కళ వాళ్ళను కరుణలేని వాళ్ళుగా తయారుచేసింది. వాళ్ళ కత్తులు, కలాలు మానవత్వాన్ని తుడిచిపెట్టేసి ఆధిపత్యమే పరమార్థం అని పరమధర్మం అని ప్రవచించాయి.

సంపద కత్తి చుట్టూ, కలంచుట్టూ తిరుగుతుందని కనిపెట్టి ప్రజల్ని కష్టాల్లో, కడగండ్లలో నిలువునా ముంచేసి పారలౌకిక మత్తులో ఉంచి వాళ్ళు మాత్రం లౌకిక భోగ భాగ్యాలతో మునిగి తేలారు. భోగం, భాగ్యం వీరభోజ్యం అని వంచించారు. జగద్ధితం అంటే వాళ్ళ ఉద్దేశంలో వాళ్ళకు అనుకూలంగా జగమంతా ఉండటం; వాళ్ళ కర్మ ఫలితాలను ఉపశ్రేణివర్గాల వాళ్ళు భరించే వాతావరణం ఉండటం వాళ్ళ క్షేమమే జనం క్షేమం కాని అందరూ బాగుంటేనే మనమూ బాగుంటాం అని కాకుండా తేనె టీగల్ని చెదరగొట్టి తేనెపట్టు ఎత్తుకు పోయే బాటసారిలా అందరి శ్రమలోను తమసౌఖ్యం వెతుక్కోవటం అన్నమాట.

సామ్మొకడిది సోకొకడిది అన్నట్టు శ్రమ ఒకరిది, సౌఖ్యం మరొకరది. ఈ విధమైన వాళ్ళయధేచ్ఛ దోపిడీ విధానానికి అనుగుణమైన శాసనాలు, చట్టాల తయారీలో భాగంగా వీళ్ళ సాహిత్యం పుట్టుకొచ్చింది. హితేనసహితం సాహిత్యం హితంతో కూడినది సాహిత్యం, అంటే వాళ్ళకు మాత్రమే అది హితాన్ని కలిగిస్తుంది. బహు జనులకు మాత్రం కాదు. దానికనుగుణమైన వ్యవస్థను నిరంతరం కొనసాగే క్రమంలోకి చాతుర్వర్ణాలను, చతుర్వేదాలను చతుర్పురుషార్థాలను కనిపెట్టారు. వాటికి అనుగుణమైన సామాజిక, పాలనావ్యవస్థల్ని నిర్మించారు.

అయితే ఈ సాలిగూడు చిక్కుముళ్ళ వ్యవస్థ పారిశ్రామిక విప్లవం, తద్ద్వారా భావవిప్లవం అందుబాటులోకి వచ్చాక బీటలువారటం మొదలెట్టింది. బహుజన హితాయ బహుజన సుఖాయ, సర్వేజనా సుఖినోభవంతు లాంటి సూత్రాలు సిద్ధాంతాలుగానే మిగిలిపోయాయి. ఆచరణకు ఆమడదూరంలో నిలిచి పోయాయి. అందరూ చదువుకోవడం మొదలెట్టాక, అందరూ ఎదగడం ప్రారంభించారు. ఈ ఎదిగే సామాజిక అభివృద్ధిలో వర్గదృక్పథం అనివార్యం. ప్రత్యేకతకోసం పలుకుబడికోసం ప్రతివర్గం అవిశ్రాంతంగా ప్రయత్నిస్తూనే ఉంటుంది. ఈ క్రమంలో వర్గ సంఘర్షణ మొదలవుతుంది.

చిన్నగీత ప్రక్కన, పెద్దగీత పెట్టే ప్రక్రియ అవిచ్ఛిన్నంగా సాగుతూనే ఉంటుంది. ఈ నేపథ్యంలో ఆయా వర్గ

దృక్పథాలు వాదాలు తెరమీదకొస్తాయి. అవి అదనపు హంగులతో తమదైన సృజనతో సమకాలీన సంకేతికతను రంగరించుకుని వేదికమీదకొస్తాయి.

పాతకాలపు అరిష్టదాయక చట్టాలు సమకాలీనతలో సంప్రదాయాలుగా నిగూఢంగా చాపకిందనీరులా కొనసాగుతాయి, అందుకే వాటికనుగుణంగా సమాజం స్పందిస్తుంది. పారిశ్రామిక విప్లవం గొడ్డుచాకిరీ నుంచి విముక్తి కల్పించింది, ఫలితంగా మనిషికి విరామం దొరికింది. సమాచారాన్ని దొరకబుచ్చుకునే వీలుకలిగింది. ఆలోచించే అవకాశాన్ని కల్పించింది. ఈ శాస్త్ర, సాంకేతిక, సమాచార, భావ విప్లవాల పరంపరలో వ్యవస్థలోని వ్యక్తి సామాజిక అంతస్తు ప్రశ్నించబడింది. పరిణామం చెందడం ప్రారంభించింది.

ఫలితంగా కొత్త చట్టాలు కొత్త సంప్రదాయాలు ఉపశ్రేణివర్గాల భౌతిక, మానసిక ఆర్థికస్థాయిల్ని మెరుగుపరచాయి. శాస్త్ర సాంకేతిక విప్లవం, అక్షరాస్యతకు అక్షరాస్యత భావవిప్లవానికి, భావవిప్లవం స్వేచ్ఛా సమానత్వాలకు దారితీస్తుంది. సమానత్వ భావన ప్రత్యేకంగా, గొప్పగా కనిపించాలనే వాళ్ళ మధ్య పోటీ తీవ్రతరం అవుతుంది. తత్ఫలితంగా ఈ పోటీ సృజనరూపంలో అభివ్యక్తం అవుతుంది. మాధ్యమాలను అందిపుచ్చుకున్న పరస్పర వైరుధ్య వర్గ దృక్పథాలమధ్య ప్రజాస్వామ్యం పరిధిలో ప్రచ్ఛన్నయుద్ధం అవిచ్ఛన్నం అనివార్యం.

ఇవాళ వాళ్ళ వారసులు అదే భావజాలాన్ని, అదే చారిత్రక చేదు సత్యాన్ని అందంగా, వాళ్ళదైన కథనంలో వోల్డు గోల్డు అని మళ్ళీ ఆధునిక యుగాన్ని నమ్మించడానికి వంచించడానికి తయారై కాసుల్నికొల్లగొట్టే సఫలయత్నాల్లో దృశ్యకావ్యాల్ని తెరకెక్కించే పనిలో తలమునకలవుతున్నారు. రాజుల దర్పాన్ని, వైభవాన్ని కొనియాడే 'బాహుబలి' సంపద పంపకానికి సమతూకాలీన ప్రాతిపదిక కావాలని ఎలుగెత్తే 'శ్రీమంతుడు' భావజాలం సమాంతరంగా అవిచ్ఛిన్నంగా కొనసాగుతూనే ఉంటాయి. సంపద పంపిణీని మోచేతినీళ్ళు తాగిబతకడంగా అభివర్ణించిన చినరాయుడు, పెదరాయుడు లాంటివి ఉదారవాద భావజాలాన్ని పేదల పరమార్థంగా నూరిపోసాయి.

ఈ సినిమాలు సమాజాన్ని పాలకుడు - పాలితులు అనే రెండు ముక్కలుగా నిమ్నోన్నత తరగతులుగానే చూస్తాయి. కాకపోతే ఇక్కడ బడుగులకు పీడనకు బదులు కాస్త స్వాంతన ఉంటుందంతే కాని బడుగులు పేదరికం ఊబిలోంచి బయటపడినట్టు మాత్రం కనిపించదు. బడుగులు అసమానతల్లోంచి సమానత్వంలోకి రావటం మాత్రం వాటికి ఇష్టం ఉండదు. ఇవి బడుగుల బతుకుల్ని పాలకుల బిక్షగా చూపిస్తాయి. బడుగుల్ని పాలకుల కీర్తిపతాకల్ని ఎత్తిపట్టుకుని, జన్మధన్యం చేసుకోమంటాయి. ఇవి ఉన్నతవర్గాలకు నిమ్నవర్గాలు సేవ చేసుకుని బ్రతకడానికే వాటిని బ్రహ్మపుట్టించాడని నమ్మబలికిన మనువు వారసత్వాన్ని పుణికి పుచ్చుకున్నాయి.

రాజుల ఘనతను, రాణుల సౌందర్యాన్ని, సౌశీల్యాన్ని గానం చేయడమే దేశభక్తి అనే భ్రమలో జనాన్ని ముంచుతాయి. ఎంతసేపూ అవి పాలకుల సౌధాల్ని, సౌందర్యాన్ని శౌర్యాన్ని, పరాక్రమాన్ని, దాతృత్వాన్ని స్తుతిస్తూ పాతివ్రత్యాల చుట్టూ తిరుగుతూ, గతించిన వాటి గతకాలపు వైభవాల్ని తిరగదోడుతూ వర్తమాన కాలానికి పులిమే పనిలో నిమగ్నం అయి ఉంటాయి. మధ్య యుగాల బురుజుల శిధిలాలను బూజుపట్టిన బూర్జువా భావజాలాన్ని గొప్ప సాంస్కృతిక చిహ్నంగా చూపించే ప్రయత్నం చేస్తాయి. వీటికి భిన్నంగా ప్రతిదృశ్యం ప్రజలపక్షం వహిస్తూ "ఒకే ఒక్కడు", అపరిచితుడు, భారతీయుడు ఇటీవల "భరత్ అనే నేను" లాంటి సినిమాలు పాలకులకు ప్రజలపట్ల భక్తి శ్రద్ధల్ని నేర్పటానికి అంకితమయ్యాయి. అయినా సమకాలీనత ఆహార్యంగా సంప్రదాయం పడగ విప్పుతూనే ఉంది.

ఆధార గ్రంథాలు :

1) తెలుగు సాహిత్య చరిత్ర - డా॥ ద్వానా శాస్త్రి 2) ఒక వస్తువు భిన్న సందర్భాలు - డా॥ పి.ఎ. సత్యనారాయణ.

BHAVAVEENA
Vol. 17, Issue. 8, August 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

అంటరాని వసంతం – సమకాలినత

– డా॥. పి.సి. వెంకటేశ్వర్లు, ఆసిస్టెంట్ ప్రొఫెసర్, ప్రాచ్యపరిశోధన సంస్థ, శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి.

ఆధునిక సాహిత్యం ఆంగ్ల సాహిత్య ప్రభావంతో మొలకెత్తి మారాకు వేసి శాఖోపశాఖలుగా విస్తరించింది. ఆంగ్ల సాహిత్య ప్రభావంతో తెలుగు సాహిత్యంలో అడుగుపెట్టిన నవలా ప్రక్రియ ఎన్నో సంచలనాలకు నిలయమైంది. ఎన్నో తియ్యని ఫలాల్ని అందించింది. ఏ ఆధునిక ప్రక్రియ ఆకట్టుకోలేని విధంగా నవల తెలుగువారిని సమ్మోహనపరచింది. వీరేశలింగం గారి 'రాజశేఖర చరిత్ర' మొదలుకొని నిన్నటి 'అంటరాని వసంతం' వరకు వచ్చిన ఎన్నో నవలలు మానవ జీవితానికి నిలువెత్తు దర్పణాలు.

ఇరవై ఒకటవ శతాబ్దంలో అడుగుపెట్టిన మనిషి రాకెట్ కన్నా వేగంగా ముందుకు దూసుకెళ్తున్నాడు. గతాన్ని గురించి, గతకాలపు మన సంస్కృతి గురించి ఆలోచించే తీరిక లేని పరుగు ఒకటే పరుగు. ఎటువైపు వెళ్తున్నామో ఆలోచించకుండా తీసే పరుగు. ఏ పెట్టుబడిదారీ దేశం వెనుక నుండి తరుముతూ మనల్ని ఎటువైపు నెట్టేస్తుందో గుర్తించే స్థితిలో లేని పరుగు. చుట్టూవున్న ఆత్మీయుల్ని నోరారా పలకరించే స్థితిలో లేని పరుగు. ఇలాంటి స్థితిలో పుస్తకాల్ని చదివే తీరిక, ఓపిక చాలామందికి లేదు. అందుకే సాహిత్యంలో అన్ని ప్రక్రియల్లాగా నవలా ప్రక్రియ కూడా కొడిగట్టిన దీపంలా అయిపోయింది. ఇలాంటి స్తబ్ధమైన స్థితిలో వ్యాపార ధోరణిలో సాగే కొన్ని నవలలు తప్ప సామాజిక జీవితాన్ని ప్రతిబింబించే నవలలే కరువైనాయి. ఆ స్తబ్ధతను చీలుస్తూ కారుచీకటిలో కాంతిరేఖలా దళితుల జీవితాన్ని ప్రతిబింబించే నవలగా "అంటరాని వసంతం" ఈ శతాబ్ది ఆరంభంలో తెలుగులో వచ్చింది.

రచయితగా జి.కల్యాణరావును గురించి తెలియని వారుండరు. ఆయన రాసిన 'అంటరాని వసంతం' నవల నిజంగా అందరూ హాయిగా ఆస్వాదించదగిన వసంతం. రిచర్డ్ క్రాస్ చెప్పినట్లు "యథార్థ జీవితాన్ని యథార్థ దృష్టితో అధ్యయనం చేసి తీర్చిదిద్దేదే నవల". అలాంటి వాస్తవిక జీవితాన్ని శోధించి, పరిశోధించి రాయబడ్డ నవలే ఇది. దీన్ని నవల అనడం కంటే దళితుల జీవితాన్ని ఎనిమిది తరాల వెనుకవరకు చూపించిన ఒక డాక్యుమెంటరీ, ఒక ఎన్‌సైక్లోపీడియా అనవచ్చు. రచయితకు ఈ నవలా రచనకు ప్రేరణ కల్గించిన పుస్తకాలు ఎన్నో ఉన్నాయి. మాక్సింగోర్కి - అమ్మ, ముల్క్‌రాజ్ ఆనంద్ - కూలి, అంకుల్ టర్మ్స్ క్యాబిన్- రిచర్డ్‌రైట్, గూగీ- రివర్స్ బిట్వీన్, అలెక్స్ హేలీ - రూట్స్, ఉన్నవ మాలపల్లి మొదలైన పుస్తకాలు. అన్నిటికన్నా తాను సమీపం నుండి చూసిన దళిత జీవితాలు.

కల్యాణరావుగారి మాటల్లో చెప్పాలంటే అంటరాని వసంతం నవల రాయడానికి కారణం "ఈ దేశంలో పాశ్చాత్య నాగరికత ఒకవైపు, స్వదేశీ నాగరికత ఒకవైపు. ఈ దేశంలో ఉన్న నదికి నా ఒడ్డు ఏది? భారతీయ సంస్కృతిలో నా అడుగులు, నా ఉచ్ఛ్వాసాలు ఎక్కడ? అని వెదికే ప్రయత్నమే ఈ నవల. భారతదేశ చరిత్రలో మిస్సయింది తనపేజీ మాత్రమే" ఆ కన్పించని పేజీ కోసం ఏ రికార్డులలో కన్పించని తమ జీవితాల కోసం కల్యాణరావు చేసిన నిరంతర కృషే ఈ అంటరాని వసంతం. ఈ నవల రెండు గ్రామాల్ని కేంద్ర బిందువులుగా చేసుకొని సాగింది. అవి, ఒకటి ఎన్నెలదిన్నె, రెండోది ఆవలపాడు. అవి రెండు ఎక్కడో లేవు. మొదటిది నెల్లూరు జిల్లా కావలి మండలం ముంగమూరు సమీపంలోని శంకర అగ్రహారం (ఎన్నెలదిన్నె), రెండోది ప్రకాశం జిల్లా టంగుటూరు మండలం ఆలకూరు పాడు (ఆవలపాడు). ఈ రెండుగ్రామాలు రచయిత పుట్టి పెరిగిన అమ్మమ్మ, నాయనమ్మవాళ్ళ గ్రామాలు. ఈ నవలలో కథంతా

ప్రకాశం, నెల్లూరు జిల్లాల సరిహద్దు ప్రాంతాల్లో (ఒకప్పటి నెల్లూరు జిల్లా) నడచింది. ఈ రెండు గ్రామాలను కేంద్రంగా చేసుకొని యథార్థ సంఘటనలకు రూపకల్పన చేయడం జరిగింది. రచయిత పసితనంలో అనుభవించిన దళిత జీవితం, బాల్యంలో నమ్మిన క్రిస్టియానిటీ, యవ్వనంలో ప్రేమించిన భగత్‌సింగ్. ఈ మూడింటి కలయికే అంటరాని వసంతం నవల. ఆస్తిపాస్తులకు కాదు అంటరానితనానికి మాత్రమే వారసులైన దళితుల జీవితాలు ఎనిమిది తరాలు సజీవంగా మన ముందు నిలుస్తాయి. ఉన్నవ లక్ష్మీనారాయణ మాలపల్లి నవలలో కన్పించే చైతన్యం మళ్ళీ 75 సంవత్సరాల తర్వాత వచ్చిన 'అంటరాని వసంతం'లో కన్పిస్తుంది.

'అంటరాని వసంతం' రూతూ, రుబేను తరంతో ప్రారంభమవుతుంది. ఎనిమిది తరాల జీవితాన్ని ఒక క్రమ పద్ధతిలో చిత్రించాడు రచయిత. అన్ని తరాలకు కేంద్రం 'ఎన్నెలదిన్నె' గ్రామం. అందరి జీవితాలకు ప్రతీక ఎన్నెల పిట్ట చేసే రొద. ఎన్నెలదిన్నె నుండి చినసుబ్బడు - ఎల్లన్న - ఎర్రెంకడు - ఎల్లన్న - శివయ్య (సిమోను) రుబేను - ఇమ్మాన్యుయేలు - జెస్సీ, వారి జీవితాన్ని పంచుకొన్న చినసుబ్బి - లచ్చిమి - లింగాలు - సుభద్ర - శశిరేఖ - రూతు - మేరీసువార్త - రూబీలు పుట్టుకొచ్చారు. అయితే ఎన్ని తరాలు మారినా, ఇన్ని జీవితాలు మారినా వారిని మాత్రం అంటరానితనం తాకకుండా పోలేదు. ఆ అంట రానితనమే ఎన్నెలదిన్నె లోని నాటకాల గుడారాల నుండి పసిపిల్లాడిగా వున్న ఎల్లన్నను అగ్రవర్ణాల చేత తరిమి తరిమి కొట్టించింది. ఆ తరిమి కొట్టడం ఆ తరంతో ఆగ లేదు. ఎల్లన్నకు పుట్టిన శివయ్యకు జరిగింది. అయితే ఎన్నెలదిన్నె అగ్రకులాలు కాదు దాడిచేసింది. కరువుతో పొట్ట చేతబట్టుకొని బకింగ్‌హామ్ కాలవ పనుల కోసం వెళ్ళిన శివయ్య, శశిరేఖలు చేసిన తప్పల్లా ఒక్కటే. "ఎన్నెలదిన్నె మాలోళ్ళి, పనికావాలి" అని అడగడమే. ఆ మాట చెవిన పడడంతో ఇద్దర్నీ తరిమి తరిమి కొట్టారు. ఆ దాడి చివరకు శివయ్యను సీమోనుగా మార్చేంత వరకు సాగింది. ఎల్లన్నపై అగ్రవర్ణాలు చేసిన దాడి అతన్ని 'పాటల ఎల్లడి'గా 'మాలబైరాగి'గా మారిస్తే శివయ్యపై జరిగిన దాడి అతన్ని క్రైస్తవుడిగా మార్చింది. సొంత రక్తం లోనే పరాయితనం, పరాయిరక్తంలో ప్రేమ ఎలా వుంటాయో రచయిత ఈ సంఘటన ద్వారా వివరించాడు. అంతేకాదు భారతీయ సమాజంలో దళితులు కొద్ది కాలంలోనే క్రైస్తవమతానికి ఎంత చేరువయినారో రచ యిత ఈ సంఘటన ద్వారా తేటతెల్లం చేశాడు. క్రైస్తవ మతం మాల, మాదిగ పల్లెల్లోకి ఎందుకు పాకిందో చిన్నోడు - మార్టిన్‌గా, పోలమ్మ - శారమ్మగా, శివయ్య - సీమోనుగా ఎందుకు మారిపోయారో ఆధారాలతో సహా వివరించాడు. అయితే ఉన్నత వర్ణాల వారు క్రిస్టి యన్‌లుగా మారడానికి కారణాలు కూడా రచయిత వివరించాడు. జాన్‌పాల్‌రెడ్డి, ఇమ్మాన్యుయేలు శాస్త్రి, యెహోవాచౌదరిలు, అలా మారడానికి కారణం హోదా కోసం, పదవుల కోసం స్వార్థపు పనులకోసం మాత్రమేనని, సిలువ మోసే వాళ్ళు, సిలువ వేసే వాళ్ళు ఒకే కప్పు కింద చేరిన వైనం నవల్లో స్పష్టంగా వివరించాడు రచ యిత.

కథ అంతటితో ఆగలేదు. క్రైస్తవులుగా మారడంలో ఉన్నత వర్ణాల వారి పనులైతే సాగాయి గాని, క్రైస్తవులుగా మారిన దళితుల పరిస్థితి మళ్ళీ మొదటికొచ్చింది. దళిత క్రిస్టియన్ పల్లెలపై జరిగిన దాడిని రచయిత కళ్ళముందు చూపించాడు. ఆ దాడిలో భాగం, పల్లెలు ఎలా కాలి బూడిదైనాయి, మార్టిన్, శారమ్మలు ఏ విధంగా చంప బడ్డారో రచయిత చూపించారు. ఆ పరిస్థితులలో నుండే శివయ్య (సిమోను) మనుమడైన ఇమ్మాన్యుయేలు, ఆయన కొడుకైన జెస్సీ విప్లవ మార్గంవైపు అడుగు లేశారని రచయిత వివరించాడు.

జాషువా తన ఆవేదన చెప్పడానికి గబ్బిలాన్ని ఎంచు కొన్నాడు. కల్యాణరావు దళితునికి ప్రతీకగా 'ఎన్నెలపిట్ట'ని ఎంచుకొన్నాడు. ఈ ఎన్నెల పిట్ట ఎనిమిది తరాల వారికి పరిచయం. ఎన్నెలదిన్నెలో వుండేది కేవలం రొదచేస్తూ

వెళ్ళే ఎన్నెలపిట్టలే కాదు, పరిస్థితులను ఎదిరించి నిలబడే ధైర్యశాలులు వున్నారు. వరద వచ్చి ఎన్నెలదిన్నె మాల, మాదిగ వాడలు మునిగిపోతున్నపుడు మాల, మాదిగల్ని ఏకంచేసి, ఊర్లో పెద్దల్ని ఎదిరించి అందర్నీ మాలాడి దిబ్బపైకి తీసికెళ్ళిన మాతయ్య, నారిగాడు నిజమైన ధైర్యశాలులు. ఎన్నెలదిన్నె చరిత్రలో ఆ ప్రజలమనస్సులో తరాల కొద్దీ నిలచిపోయిన వ్యక్తులు. ఆ పనిచేసినందుకు నారిగాణ్ణి అగ్రవర్ణాలు దెయ్యం పేరుతో చంపగా, ఆ పనిచేసిన కరణాన్ని మాతయ్య అదే దెయ్యం పేరుతో అచ్చిరెడ్డి తల్లి రంగాయిసాక్షిగా, తాటితోపు సాక్షిగా నరికి చంపాడు. ఆ సమయంలో రంగాయికి మాతయ్య దేవుడిలా కన్పించాడు. అందుకు కారణం రంగాయిని కరణం బలవంతంగా లంగదీసుకున్నాడనే కసి. ఎన్నెల దిన్నెలో ధైర్యం చూపిన స్త్రీమూర్తులు భూదేవి, సుభద్ర, శశిరేఖ ఇలా ఎందర్నో చెప్పొచ్చు. ఎల్లన్న భార్య సుభద్ర నీళ్ళమడవపై కాలుపెట్టి పారచేత్తో పైకెత్తి ఊరి పెద్దల్ని ''నరుకుతా ఎవడో ముందుకు రండని'' చెప్పడం సాధారణ విషయం కాదు. అప్పటికి పెద్దలు ఏమి చెయ్యలేక దేవత ఒంట్లోకి వచ్చిందని సర్దుకున్నారు.

బూర్జువా మనస్తత్వం మార్పును, చైతన్యాన్ని ఎట్టి పరిస్థితుల్లోను ఓర్చుకోదు. ఆ చైతన్యాన్ని అణచివేయడానికి ఎంతకైనా తెగిస్తుంది. నాగప్ప, ఎల్లన్న ఆడే నాటకానికి ముందు 'కరణం గారు వచ్చారా, కాపులు వచ్చారా' అనడానికి బదులు ''ఘనత వహించిన పెద్దమాల వచ్చాడా, అంతే ఘనత వహించిన పెద్ద మాదిగ వచ్చాడంట్రా'' అని పిలవడం మొదలెట్టారు. ఆట వాళ్ళది, పాట వాళ్ళది, నాటకం వాళ్ళది, చూసే జనం వాళ్ళే అయినపుడు వారి కులపెద్దల్ని అలా గౌరవించుకోవడం వారికి తప్పనిపించలేదు. కాని అది కరణాలకు, కాపులకు తల కొట్టేసినంత పనైంది. పంచాయితీ పెట్టి నాగప్ప, ఎల్లన్న ఆడే ఆటల్ని కూడా నిరోధించారు. ఇలాంటి ఎన్నో సంఘర్షణలను రచయిత వివరించాడు. అందుకే ఉరుముల చంద్రప్ప నోట ''తవ్వాల్సింది పూడ్చాల్సింది ఎంతో వుంది'' అని నర్మగర్భంగా పలికించాడు రచయిత.

దళితుల జీవనంలో కన్పించే కళల్ని రచయిత కళ్ళ ముందు చూపించాడు. అతి లాఘవంగా, నైపుణ్యంగా గొడ్డుచర్మాన్ని ఒలిచే పోలడు, కొయ్యల్ని చెక్కే పిట్టోడు, గోగునారతో నానావిధాలుగా నాట్యాలు చేయించే ఎంకట నర్సు ఇలా ఎందరో కళాకారులు ఈ నవల్లో కన్పిస్తారు. మాల బైరాగిగా మారిన ఎల్లన్న పదాల్లోను, యానాది రమణయ్య డప్పుపుల్ల లయ లోను, కుమ్మరి కోటేసు రాతలోను ఈ కళ కన్పిస్తుంది. అయితే ఈ పాటల్ని, రాతల్ని కూడా బూర్జువా శక్తులు సహించవు అని చెప్పడానికి రచయిత కుమ్మరి కోటేసు రాత కాగితాల్ని చింపి తగలేసి అతడ్ని ఎంత కిరాతకంగా చంపినారో వివరించాడు. అందుకే రచయిత ''మా నిషాదం మొదలు మహా ప్రస్థానం దాకా పుట్టుకొచ్చిన పదాలనన్నీ రాశిపోస్తే, ఆ రాశిలో దొరికేవి మూడే మూడుపదాలు - అలజడి, ఆందోళన, తిరుగుబాటు. ఆ అలజడే కళ. ఆ ఆందోళనే పాట. ఆ తిరుగుబాటే ఆట'' అని అక్షరసత్యాలు చెప్పాడు.

దోసెడు నీళ్ళకోసం, జానెడు పొట్టకోసం ఎన్నెలదిన్నెలో గాని, ఆవలపాడులో గాని మాల, మాదిగలు పడిన పాట్లు వాళ్ళు అనుభవించిన కష్టాలు వారిని కమ్యూనిజం వైపు మళ్ళించాయని రచయిత కథను మరో మలుపు తిప్పాడు. దీనితోపాటు 1985లో జరిగిన కారంచేడు దురంతాన్ని కూడా కళ్ళముందుంచాడు. రచయిత ఏ సిద్ధాంతం వైపు ముగింపును తీసుకెళ్ళాడు అనే చర్చను పక్కనపెడితే ప్రతి మలుపుకు కారణమైన సంఘటనల్ని స్పష్టంగా, సున్నితంగా వివరించాడు. అందులో అతిశయోక్తులు లేవు. ఆర్తనాదాలు మాత్రమే ఉన్నాయి. అందుకే ఇందులోని విషయాల్ని అర్థంచేసుకోకుంటే ఈ వసంతం మనకి కూడా అంటరానిదే అవుతుంది. ఈ నవలల్లో ఎన్నెలపిట్ట చేసిన రొద జాతి యావత్తు వినాలి. మరుగునపడి కన్పించని ఇలాంటి చరిత్రలన్నీ బైటకు రావాలి. ''మొహంజదారోని తవ్విన పరిశోధనకి, చీల్చుకొనివచ్చిన ఈ అతి చిన్న సత్యం కన్పించలేదు. హరప్పా గుండె పగుళ్ళలో

నాగరికత వెదకిన మేధస్సుకి ఈ అతిచిన్న సత్యం చుట్టూ మట్టిని తొలగించి, మురికిని కడిగి ఇట్టా జరిగింది ఈ దేశంలో ప్రత్యేకించి ఈ తెలుగు నేలమీద అని చెప్పాలనే ఆలోచన రాలేదు" అని రచయిత పడిన ఆవేదన సమంజసమైంది. "ఇతిహాసపు చీకటి కోణం అట్టడుగున పడి కాన్పించని చరిత్రలన్నీ కావాలిప్పుడు" అని చెప్పిన శ్రీశ్రీ మాటల్ని ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలి. కల్యాణరావు ఆచరణలో పెట్టాడు. ఆయన ఒక సభలో చెప్పినట్లు "నన్ను నేను వెతుక్కున్నా, నావాళ్ళను, నావాళ్ళ జీవితాన్ని వెతుక్కున్నాను". నిజంగా చాలా లోతుగా, తీక్షణంగా వెతికాడు. ఆ వెతుకులాటలో దళితుల ఐక్యతను, ప్రత్యేక సంస్కృతిని, కళల్ని, జీవన స్థితిగతుల్ని పూర్తిగా వెదికాడు.

'అంటరాని వసంతం' నవల్లో రచయిత అంతర్లీనంగా చెప్పింది. ప్రతిమలుపులోను చెప్పింది ఒక్కటే. దలితుల మధ్య ఐక్యత. ఒకే సంస్కృతి, జీవనంలో నుండి పుట్టుకొచ్చిన బలహీన వర్గాల ఐక్యత. అయితే నేడు ఈ ఐక్యతకు కోలుకోలేని దెబ్బ తగిలింది. అదే వర్గీకరణ. దళితులమధ్య వర్గీకరణ చిచ్చురేపిన పెద్దలు మాత్రం "తాంబూలాలు ఇచ్చేశాం తన్నుకు చావండి" అని చోద్యం చూస్తున్నారు. మాల, మాదిగ వర్గాల ప్రజలు మాత్రం తమ అణగారిన స్థితిని మరచి దండించాల్సిన వాడ్ని విడిచి నవలలో చంద్రయ్య చెప్పినట్లు "తవ్వాల్సిన దాన్ని పూడ్చాల్సిన దాన్ని' వదిలేసి, వేలకోట్ల ఎకరాలు బడా భూస్వాముల కాళ్ళకింద వున్న సంగతి మరచి ప్రభుత్వం ఇచ్చే ఉద్యోగాల్లో రిజర్వేషన్ల కోసం కొట్లాడుకొంటున్నారు. ఈ గొడవ సద్దుమణిగే లోపు ప్రభుత్వం తన బరువును దింపుకొని ఉద్యోగాలన్నీ భూమిలో పాతేసి ప్రపంచ బ్యాంకు కర్రపెత్తనం కింద కొనసాగే ప్రైవేటు వ్యక్తులకు అన్నీ అమ్మేసి మెల్లగా ఉండిపోతుంది. అపుడు అరుదుగా దొరికిన రొట్టెను పంచమని రెండు పిల్లులు కలసి కోతి దగ్గరకెళితే ఏమైందో చెప్పే కథ వాస్తవ మవుతుంది. రొట్టెను కొంచెం కొంచెం తిని చేతులు దులిపేసిన కోతి లాగా ప్రభుత్వం, మళ్ళీ పేద బ్రతుకులు ఈ వ్యవస్థ ఇలా గుండ్రంగా తిరుగుతూనే వుండాల్సిందేనా? అందుకే అందరిలో ఐక్యత, నిజంగా పోగొట్టుకొన్న దానికోసం పోరాటం అవసరం.

⌘⌘⌘

BHAVAVEENA
Vol. 17, Issue. 8, August 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

గుర్రం జాషువగారి ఖండకావ్యాలు – సమకాలీనత

– డా॥. టి. జాన్ కిరణ్ బాబు, సహాయాచార్యులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, రేపల్లె, గుంటూరు జిల్లా.

సమాజానికి - సాహిత్యానికి మధ్యగల సంబంధం విడదీయరానిది. ఇవి రెండూ అనునిత్యం ఒకదానిచేత మరొకటి ప్రభావితమౌతూ ఉంటాయి. సమాజం సాహిత్యంలో ప్రతిఫలిస్తుంది. సాహిత్యం సమాజాన్ని ప్రభావితం చేస్తుంది. ఇదొక నిరంతర ప్రక్రియ. సమకాలీన సామాజిక పరిస్థితులు వ్యక్తి జీవితం మీద ఎంత ప్రభావాన్ని చూపిస్తాయో వ్యక్తి జీవితంలో అంతర్భాగమైన సాహిత్యంపైన కూడా అంతకంటే ఎక్కువ ప్రభావాన్నే చూపిస్తాయి. అందుకే సాహిత్యం సమాజానికి ప్రతిబింబం కాదు, ప్రతిఫలనం అన్నారు ప్రముఖ విమర్శకులు ఆర్. ఎస్. సుదర్శనంగారు. రచయిత సామాజిక పరిస్థితిని ఉన్నది ఉన్నట్లుగా చిత్రించినట్లైతే అది ప్రతిబింబమౌతుంది. కానీ రచయిత తన అనుభవాన్ని పునాదిగా సమాజ స్వరూపాన్ని అవగాహన చేసుకుని భవిష్యత్తును దర్శించి దానిని తన రచనలో ప్రతిఫలింపజేస్తాడు. రచయిత అభ్యుదయభావాలు కలవాడైనప్పుడు అతని దర్శనం సమాజ పురోగమనానికి దోహదం చేస్తుంది.

'నా కవితా వధూటి వదనంబు నెగాదిగ జూచి, రూపు రేఖా కమనీయ వైఖరులు గాంచి భళీ! భళియన్న వాడె "మీ దేకుల" మన్న ప్రశ్న వెలయించి చివుక్కున లేచి పోవుచో బాకున గ్రుమ్మినట్లగును పార్థివచంద్ర! వచింప సిగ్గగున్" అంటూ సమకాలీనంగా తాను వ్యక్తిగతంగా కులమతాలు గీసిన గీతల మధ్య చిక్కి అమానుషమైన అవమానలలో ఉక్కిరిబిక్కిరి అయినప్పటికీ, ద్వేష భావాల్ని, ఆగ్రహావేశాల్ని ఏ కోశానా పెంచుకోకుండా, తనను పీడించిన పేదరికం, కులమత భేదం - ఈ రెండిటినీ తన శత్రువులుగా కాక, గురువులుగా గ్రహించి తనలో మంచిని పెంచుకుని, తనను క్షోభపెట్టిన సమాజానికి సాహిత్యలోకానికి అత్యంత ఉత్కృష్టమైన మానవత్వ సాహిత్య మాధుర్యాన్ని అందించి ప్రజల నాలుకలయందు సుకవిగా శాశ్వతంగా నిలిచిపోయిన విశ్వనరుడు గుర్రం జాషువ. వారి కలం నుండి జాలు వారిని స్వప్నకథ, అనాథ, గబ్బిలము, కాందిశీకుడు, బాపూజీ, నేతాజీ, స్వయంవరం, రాష్ట్రపూజ, కొత్తలోకము, ముసాఫరులు, నాగార్జునసాగర్ ఖండకావ్యాలలో ప్రతిఫలించబడిన సమకాలీనతను అనుశీలించడమే ఈ వ్యాసం యొక్క ప్రధాన లక్యం.

స్వప్నకథ (1934) :

సమకాలీన సమాజంలో నెలకొన్న దురన్యాయాలను చూసి కవి వదిలిన వేడినిట్టూర్పుల ప్రతిరూపమే స్వప్నకథ మరియు అనాథ. ఈ రెండు కథలు ఒకే కావ్యంగా కవి ప్రచురించారు. 'సమంచిత నవ్యయుగోచితంబులైన యాకటి చిచ్చులార్చు హృదయ ప్రవిదారి దయాకథాంశములు. . . మొదటిది సమగ్రము. రెండవది అసమగ్రము. ఒకటి మూటగట్టిన గాలి, యొకటి సలసల గ్రాగి చిందిన కన్నీటి బిందువు' అని కవి ఈ కావ్యాన్ని వ్యాఖ్యానించారు. తెలుగునాట, తెలుగువారి నోట చంద్రునిలో మచ్చ రాట్నం వడికే అవ్వగా పరిచితమైన కథను 'విషాదములో నానిన గుండెతోడ గగనంబుకెక్కించ'డానికి ఈ కావ్యం ద్వారా ప్రయత్నించారు. సామాన్యప్రజలు సామాజిక దురన్యాయాలకు బలై సంఘంలో ఎంతటి యాతనలకు గురౌతున్నారో ఈ కావ్యంలో తర్కించారు. 'చిన్నప్పటి నుండియు నా కన్ను పరుల కష్టములను గని యోరువ లేదన్నా! బడాయిగాదీ వెన్నెల నా కనుల నుద్భవించుచు నుండున్' అన్న పంక్తులు అట్టి అన్నార్తుల పట్ల వీరి వేదనాభరిత హృదయాన్ని ఆవిష్కరిస్తాయి. పుట్టుకతో తల్లి

దండ్రులను పోగొట్టుకొని, చేరదీసిన ఒక ఒక సాలెతల్లి దయాదాక్షిణ్యాలతో పెరిగి, కూటికోసం బిక్షమెత్తుకోడానికి డొక్కలంటుకుపోయిన దేహాన్ని భారంగా ఈడ్చుకొంటూ వీధులవెంట తిరిగే ఒక పేదబడుగును ఆదుకోవడానికై ప్రయత్నించి, లోకులచేత ఈసడింపబడి,అపనిందలకు గురై, కారాగార బంధితయై, 'పరోపకారమునకే తనువెల్ల వ్యయించిన' ఒక రెడ్డిసాని 'విషాదములో నానిన గుండె తోడ గగనమునకెక్కిన' వృత్తాంతం ఇందులో చిత్రించ బడింది. లేమికి కులవివక్ష ఉండదనీ, దరిద్రులు సంఘంలో అస్పృశ్యులుగా పరిగణింపబడి దుర్భర పరిస్థితులకు గురిచేయబడతారనీ ఈ ఖండకావ్యంలో కవిగారు స్థిరీకరించడానికి ప్రయత్నించారు. పట్టెడన్నం కోసం అలమటించేవారిని కడుపునిండినవారు కసిరికొట్టే తీరు ఈ కావ్యంలో అత్యంత దయనీయంగా చిత్రించారు. దుస్సహమైన దారిద్ర్యం మనిషిని ఎంతగా దిగజార్చేటట్లు చేయగలదో కూడా నిరూపించారు.

అనాథ (1934) :

సమాజంలో తరతమభేదాలకు దారితీసే ఆర్థిక దోపిడీని, అసమానతలకు ఊపిరిపోసే అనాటి వ్యవస్థని దృష్టిలో పెటుకుని కవి రాసిన కావ్యమే ఈ అనాథ. భర్త చనిపోగా 'పిత్ర్యద్రవ్యమగు ధనము'గా సంక్రమించిన గంపెడు సంతానంతో, 'ఒడలిమీది బట్ట'తో, 'సత్తు గాజుల'తో, 'జోలె'తో వీధులపాలైన ఒక మాలెత కన్నీటి గాథను హృదయవిదారకంగా ఈ కావ్యంలో చిత్రించారు. అస్పృశ్యత, దారిద్ర్యం అనే రెండు ప్రధాన సమస్యలు ఈ కావ్య రచనాకాలంనాటికి భారతీయ సమాజాన్ని పట్టి పీడిస్తూవున్న భయంకర జాడ్యాలు. గుండెల్ని తాలిచేసే అస్పృశ్యతకు, నిలువునా కృంగదీసే దారిద్ర్యం తోడైతే ఇక ఆ నికృష్ట పరిస్థితి వర్ణనాతీతం. సమకాలీనంగా అటు వంటి సామాజిక దురన్యాయాలకు గురై దుర్భర జీవితాన్ని గడుపుతున్న దళితజాతుల ఆర్తనాదానికి అంతులేదు. ఆ పరిస్థితులన్నిటినీ స్వయంగా చవిచూసిన కవి దారుణ సాంఘిక దురాచారాలకు బలియైన తాడిత జాతికొక ప్రతీకగా అనాథ వృత్తాంతాన్ని ఈ ఖండకావ్యంలో మలి చారు. 'నిమ్నజాతుల కన్నీటి నీరదములు పిడుగులై దేశమును కాల్చివేయు'నంటూ దేశప్రజల్ని హెచ్చరిం చారు. అర్థాంతరంగా ముగిసిన ఈ కథ అధ్వాన్నపు బ్రతుకులకొక అంతం లేదన్న భావాన్ని ధ్వనింపజేస్తుంది. హరిజనోద్ధరణ, అస్పృశ్యతా నిరసన వంటి అంశాలను గురించి జాతిపిత చేసిన మహనీయ బోధనలు ఏవిధంగా ఆనాటి అగ్రకులాలకు చెందిన కొందరి హృదయాల్లో సంస్కారభావాలు మోసులెత్తేటట్లు చేశాయో కవి ఈ కావ్యంలో ప్రస్తావించారు. అగ్రకులానికి చెందిన ఒక సహృదయుడు ప్రమాదానికి గురైన అనాథను ఆసుపత్రికి చేర్చి 'గంగను మునిగిన భక్తుని యంగంబుల నోలలాడు నానందంబుప్పొంగెడు నెద'తో ఇంటికి చేరాడు. కానీ 'కుడి యెడమల'ను పాటించడంలో నిష్ఠను కనబరిచే అతని ధర్మపత్ని 'ముక్తికలుగునె మాలల బులిమికొనిన' అని భర్తను అధిక్షేపించింది. ఆ సందర్భంలో సహృదయు డైన ఆ భర్త చేత 'కులభేద పిశాచ తృప్తికై నరపే మడి ఆమారములు' అర్థరహితాలని పలికించిన కవి మాధవ సేవ కన్నా మానవసేవే అత్యంత ఉత్కృష్టమైనదని ప్రకటిం చారు. ఆ జీవకారుణ్యమే ఈ ఖండకావ్యానికి ప్రాతిపదిక.

గబ్బిలం (ప్రథమభాగం : 1941 - ద్వితీయభాగం : 1946) :

సమకాలీన సామాజిక అసమానతలపై ఏవగింపు, సంస్కరణ ఫలాలు చేతికందగలవవన్న ఆశ రగుల్కొం టున్న తరుణంలో వర్ణాశ్రమ ధర్మాల పరిరక్షణను పరి రక్షణను సమర్థించే లక్షణాలు ముందుకొస్తున్న వైనం జాషువ గారిని కలవరపరిచాయి. హక్కుల సాధనకు ఉద్యమించే తరుణం ఆసన్నమైందని భావించారు. హరి జనులుగా పిలువబడుతున్న వారిలో చైతన్యం రగిల్చి ఉద్యమించేలా చేసి దళితుల్లో ఆత్మగౌరవ సాధనకై తపిం చాలని ఊహించారు. పీడకవర్గాల ముక్కుగుద్ది సాధనా

దిశగా సాగిన మహాప్రస్థానంలో కవిగారు ఎత్తిన అనలపతాకమే గబ్బిలం కావ్యంగా రూపుదిద్దుకుంది. ఈ కావ్యంలో అస్పృశ్యత, అరుంధతేయుల దారిద్ర్యం, వారి శ్రమైకజీవనం, వారి సాత్త్వికప్రవృత్తి, వారికి దేవాలయ ప్రవేశం లేకపోవడం వంటివి చిత్రించబడ్డాయి. తన దుర్భరమైన జీవితాన్ని భగవంతుడికి విన్నవించుకోవడానికి పంపిన సందేశం మొదటిభాగం. గబ్బిలం తన సందేశం వినిపించి వచ్చాక భారతదేశంలో వచ్చినమార్పుని కవి గమనించారు. 'అరుంధతీనుతుని నిరాకాశంలో నాశాతటిల్లతలు మోసులెత్తినవి. సర్వసమత్వమను మంత్రరాజ్యాన్ని భారతదేశం వల్లె వేయసాగింది. సందేశం ఫలితంగా నాల్గుమూలలనుండి ప్రసన్న వాయువులు వీవసాగినవి. దేవాలయప్రవేశం, గాంధీజీ ఛరఖా ఝంకరణం శ్రవణశుభ గంగాగానం చేసినవ'ని కవి రెండవభాగం ముందుమాటలో హర్షం వ్యక్తంచేశారు. తనలాగే దళితులకు సేవచేసిన మహామహుల్ని గాంధీజీ, పటేల్, అంబేథ్కర్ వంటి జాతీయనాయకులు కొందరిని ఈ రెండవ భాగంలో సత్కరించినట్లు కవి కల్పిస్తారు. అంతటితో అగిపోక 'ఆత్మదేశం, ఆత్మభారతాంధ్రజాతిలో గల అనైకమత్యం, స్వార్థలుబ్ధత, బహుకుల మతావేశ వ్యాధిపీడ, కాబట్టనితనం నేడవనిలోని తీరని వేదనలు తన దాస్యవిముక్తికి తోడుగా దేశానర్థకములై విషమస్యలై కారింపసాగినవ'ని వాపోయాడు.

కాందిశీకుడు (1942-43) :

రెండవ ప్రపంచయుద్ధ నేపథ్యంలో వెలువడిన కావ్యమిది. ఈ కావ్య రచనా కాలం నాటికి రెండవ ప్రపంచ యుద్ధం ముమ్మరంగా జరుగుతుండగా అక్షరాజ్య కూటమికి చెందిన జపాన్ తన ఇరుగుపొరుగు రాజ్యాలపై విరుచుకుపడింది. 1942వ సంవత్సరం మార్చి 7వ తేదీన మిత్రరాజ్య కూటమికి చెందిన గ్రేట్ బ్రిటన్ జపాన్ సైన్య పురోగమనాన్ని శంకించి రంగూన్‌ని విడిచిపెట్టడంతో జపానుకు బర్మా ఆక్రమణ సులభతరమై మార్చి 8న బర్మాను వశీకరించుకుంది. ఈ దారుణ దురాక్రమణ ఫలితంగా బర్మాదేశంలో స్థిరపడిన భారతీయులెందరో నిరాశ్రయులయ్యారు. తమ ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని స్వదేశోన్ముఖులయ్యారు. ఆ కాందశీకుల్లో ఆంధ్రులు కూడా ఉన్నారు. ఆ సందర్భంలో సోంపేటలో 4000 బర్మా కాందిశీకుల యాత్ర అనే శీర్షికతో నెల్లూరు నుండి వెలువడే 'జమీన్‌రైతు' పత్రికలో ప్రచురితమైన వార్త భీతావహమైన పరిస్థితుల్లో చిక్కి స్వదేశోన్ముఖులైన కాందిశీకుల కడగండ్లను విశదీకరించింది. ఆ కాందిశీకుల హృదయవిదారక స్థితి కవిగారిని కావ్యరచనకు ప్రేరేపించింది. అయితే అప్పటికే జాషువగారు యుద్ధప్రచార శాఖలో ఉద్యోగం నిర్వహిస్తున్నారు. ఆ కారణంచేత అప్పటి బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా కత్తిగట్టిన జపాన్ దురాక్రమణాన్ని నిరసిస్తూ ప్రచారం చేయవలసి రావడంతో ప్రచారపద్ధతికి అనుగుణమైన విసుర్లు ఈ కావ్యంలో కనిపిస్తాయి. . . కావ్యంలోని కథ కల్పితం. ఆంధ్రుడైన ఒక బర్మా కాందిశీకుడు ఆ విధ్వంసకరమైన మారణకాండ నుండి తప్పించుకొని ప్రాణాలరచేతిలో పెటుకొని భయంకరమైన అడవుల్ని, ఎత్తైన పర్వతాలని, లోతైన నదీనదాల్ని దాటుకుంటూ ఒక నడిరేయి దట్టమైన కీకారణ్యంలోని చొచ్చుకుపోయి, బయటపడే దారి తెలియనంతగా చిక్కుబడిపోయి, చుట్టూ భీతిగొలిపే అడవి మృగాల ఘర్జనల మధ్య ఉలికిపాటుతో తన కష్టాలను తలపోసుకుని తిరుగులాడుతోంటే, అకస్మాత్తుగా మానవకపాలం ఒకటి వాడి కాలికి తగలడంతో అదిరిపడి, ఆపై కొంత నిబ్బరించి, దానివైపు చూస్తూ చావుభీతితో తల్లడిల్లుతోంటే, ఆ కపాలం పకపక నవ్వి, కుశల ప్రశ్నలువేసి మాటల్లోకి దింపగా, కాందిశీకుడికీ ఆ కపాలానికీ మధ్య జరిగిన వాదప్రతివాదాలే ఈ కథావస్తువు. అధికారంకోసం, ఆధిపత్యంకోసం, గెలుపోటముల మధ్య కొట్టుకులాడుతూ యుద్ధంలో నిమగ్నమై ఉన్న ప్రపంచ దేశాలు గుర్తించవలసిన శాంతి-అహింసల ఔన్నత్యాన్ని

చాటిచెప్పడానికి ప్రయతించారు. హింసా కాలుష్యంతో, కులమత విద్వేషాలతో కల్మషమైపోయిన నాటి ప్రపంచానికి అతీతంగా విశ్వశ్రేయస్సుని కాంక్షించిన మహా పురుషుల మహనీయభావనలైన బుద్ధుని 'మృదూక్తి పటుత్వం', క్రీస్తు 'ప్రేమ వాక్సారము', రామకృష్ణుని 'తాత్విక సౌరభంబు' వెరశి కవిగారి కవిత్వ మూలతత్వమైన సమతాభావం అంతస్సవంతిగా ఈ కావ్యంలో ప్రవహిస్తుంది.

స్వయంవరం (1950) :

స్వాతంత్ర్యానంతరం భారతదేశ రాజకీయ, సామాజిక, మతరంగాలలో తలెత్తిన అవాంఛనీయ ధోరణుల్ని తీవ్రంగా విమర్శించిన కావ్యమిది. 'పరరాజ్యం పోయి ప్రజారాజ్యమై పాముకొన్నది లేదు. కొందరికి ప్రజారాజ్యంగా, కొందరికి మజారాజ్యంగా, కొందరికి క్షుధారాజ్యంగా తయారై అష్టనష్టాల కాలవాలమైంది. విద్యాభివృద్ధి తప్ప విజ్ఞానాభివృద్ధి శూన్యమై వింత ప్రకృతులతో విర్రవీగుతుంది. నిజాయితీ నిండుకొన్నది. మూఢతాజల నిధియై స్థంభించిపోయిందు. మేడలు పెరిగి మేథస్సు తరిగింది. ఫలశున్యాలై పైపై నవ్వులు, పల్కరింపులు, ప్రమాణాలు సభ్యతా చిహ్నాలయ్యాయి. వనప్రతిష్ఠలు, శిథిల శిలాఖండ పునరుద్ధరణలు, ఉరుసులు, ఉత్సవాలు, దేశాభ్యుదయానికి సాధనాలై బక్కపేదల డొక్క నూరించి కారుస్తున్నాయి పురోగమనం తిరోగమనమైంది.' ఈ ఖండకావ్యానికి ప్రేరకమైన అంశాలను కవిగారి ఈ రీతిగా వెల్లడించారు. స్వాతంత్ర్యానంతరం అధికారాన్ని హస్తగతం చేసుకోడానికి రాజకీయనాయకులు పన్నిన ఎత్తుగడలు, మానవత్వాన్ని దూరం చేసే మత సంస్థలు, దేవతాయతనాలు, జంతుబలులు ఈ కావ్యంలో వ్యంగ్యంగా విమర్శించబడ్డాయి. 'కాశ్మీరంబు పంజాబు నావల బంగాళము దక్షిణోత్తర దిశా పర్యంత భాగంబులన్ బలదర్పారుల వివాదమోహములతో వంశ ప్రతాపాలతో తల్లకిందైన విశాలభారతా'న్ని కళ్ళకు కట్టినట్లు వర్ణిస్తారు. 'ప్రత్యేక రాష్ట్రమునకై వ్యత్యస్తావేశ రభసలడ్డముగా నిత్యము పోరాడు కళాదిత్యుల కాంగ్రులకు' స్వాతంత్ర్యం మచే దీవెనలిప్పించడం గమనార్హం.

కొత్తలోకం (1956) :

ఆంధ్రుల చిరకాల కోరికైన సమైక్యాంధ్రరాష్ట్రం ఆవిర్భవించిన శుభతరుణంలో రచితమైన ఈ కృతి ప్రారంభంలో కవి 'స్వరాజ్య రాష్ట్ర యుద్ధాన విజేతనై యభిమతంబులు తీరినవాడనైతి'నన్న ఒక సంతృప్తిని వ్యక్తీకరించారు. 'మాది కలికి తెలుగు కులం' అన్న ఒక అభిమానాతిరేకాన్ని ప్రదర్శించాడు. ఆంధ్ర రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేయగల 'నాగార్జునసాగర్' బృహన్నిర్మాణాన్ని కొనియాడుతూ రాసిన పద్యాలు ఇందులో ఉన్నాయి. సమైక్యాంధ్ర రాష్ట్రావతరణను పురస్కరించుకొని కవి ఎదలో పొంగి పొర్లిన ఆంధ్రాభిమానానికి 'కొత్తలోకపు'టంచులను తాకిన కవి 'కోర్కెల'కు ఉన్న వ్యత్యయం ఈ కావ్యంలో కనిపిస్తుంది. హింసా కాలుష్య కులమత విద్వేషరహితమైన 'కొత్త లోకము'ను గూర్చి కవి కన్న కలలే 'తొలికోర్కె'గా రూపుదాల్చాయి. సమకాలీన సామాజిక, రాజకీయ, మత, శాస్త్ర, కళాది రంగాలలో నెలకొన్న అవాంఛనీయ ధోరణులు జాషువ గారి హృదయాన్ని ఎంతగానీ కలచివేశాయి. ఇటువంటి వ్యాకులమైన చిత్తస్థితితోనే కవిగారు అసమానతలకు అతీతమైన ఒక 'కొత్త లోకమును' సృజింపుమని సర్వేశ్వరుడికి చేసిన అభ్యర్థనకు ప్రతిరూపమే ఈ ఖండకావ్యం.

ముసాఫరులు (1963) :

1962లో భారతదేశంపై చైనా చేసిన దాడిలో మాతృదేశ స్వాతంత్ర్య పరిరక్షణ మహత్తర కార్యసాధనలో ముష్కరులతో వీరోచితంగా పోరాడి, వీరమరణం పొంది చంద్ర మండల సమీపంలో సత్రాన్ని సమీపించి సేదదీర్చుకుంటున్న ఒక సైనికుడికి, నూతన జన్మనెత్తడానికి వినీలాకాశాన తేలివస్తున్న ఒక క్రొత్త ప్రాణికి మధ్య జరిగిన సంభాషణే ఈ ఖండకావ్య కథావస్తువు. ఈ సంవాదాన్ని

అడ్డంపెట్టుకుని కవిగారు చిత్రవిచిత్ర గాథలను ప్రస్తావించి, పుట్టిన వ్యక్తి తన జన్మను సార్థకం చేసుకోవడానికి నిర్వర్తించవలసిన కర్తవ్యాన్ని ప్రబోధించారు. విశ్వమానవ గోత్రీకులైన కవులకు సైతం లక్షసబ్బులు పెట్టి తోమినా పోని కులపు రంగుల్ని పులమడం, శాంతి సామరస్యాల కోసం కాకుండా విద్వేషాలను రెచ్చగొట్టే మతపిచ్చి, విద్యా సారాన్ని వంటబట్టించుకోని విద్యావంతులు లోకపరపతి కోసం పన్నే కుయుక్తులు, మాయాతంత్రాలు, సైద్ధాంతిక భేదాలతో వెర్రిబుర్రలతో తల్లక్రిందులైపోయే ప్రజల విభిన్న మనస్తత్వాలు, సత్యధర్మాలు - పాపపుణ్యాలు, నిర్హేతుకవిద్యలు, నిర్హేతుక సంప్రదాయాలు, భూలోకంలో తిష్టవేసుకున్న జిత్తుల విద్యలు, మాంత్రికుల అభూత కల్పనలు, అహంకారుల వితండవాదం, యుద్ధభూమి వంటి లోకం వంటి నాటి లోకపు పోకడలన్నిటినీ తన అనుభవసారాన్ని రంగరించి ఆ నవ్యజీవికి ఉగ్గుపాలుగా పోశారు. ఆ భీకరయుద్ధంలోనే ఫిరంగిగుండ్లకు బలై ప్రాణాలు కోల్పోయిన కొందరు చైనీయులు కూడా ఆ సైనికుడి వెంట వచ్చి అతడికి స్నేహితులై సంభాషించడం కావ్యంలో మరొక విశిష్ఠత. 'ఈ విమతవ్యాధి నశించినం గలుగు నుర్వీగోటి వైకుంఠముల్' అని ఆ సన్నివేశాన్ని వ్యాఖ్యానిస్తూ కవిగారు పేర్కొన్న మాటలు 'చీనాభుజంగంబు దగ్ధమయిపోవున్ యుద్ధయజ్ఞంబులో' అని అభిశసించిన వారి చిత్తోద్వేగానికి అతీతంగాను, వసుధైక కుటుంబానికి దోహదకరాలుగాను ఉండడం గుర్తింపదగినది. చైనా రాజ్యం అనే మేఘం, అకారణంగా హిమాలయాలలో ఉరుముతోంది. భారతీయుల ప్రతాపాగ్నికి చైనా పారిపోక తప్పదు. శత్రువుల గుండెలను చీల్చి, వారి నులివెచ్చని రక్తాన్ని ఆపోశన పట్టే వీర సింహాలు భారతదేశంలో లెక్కలేనంతమంది ఉన్నారంటూ నాటి భారతీయ సైనికుల యొక్క విక్రమపరాక్రమాలపై అపార విశ్వాసం ప్రకటించారు.

బాపూజీ (1948) :

భారతజాతిని పునరుజ్జీవింపజేసిన జాతిపిత విషాద మరణానికి యావద్భారతదేశం ఒక్కసారిగా ఉలిక్కిపడి గుండెలవిసేలా రోదించింది. ఆ సందర్భాన కవి కన్నుల నుండి 'నాడు రాలిన అశ్రుకణాలే' ఈ కావ్యం. కావ్యారంభంలో 'జగమొక్కుమ్మడిగా రొమ్ము గుద్దుకొని మూర్చన్ దేలి తబ్బిబ్బు చెందగ' నంభవించిన మహాత్ముని మరణం, అంతిమయాత్ర మొదలైన హృదయవిదారకమైన అంశాలు ప్రస్తావించబడ్డాయి. కరుణరసస్ఫోరకమైన ఆ చిత్రణ పాఠకుల హృదయాలను కదలించివేయగల శక్తివంతంగా ఉంది. బాపూజీ నేల కొరిగిన విషమగడియలను తలచుకొని చెప్పిన ఈ పంక్తులు కవిహృదయంలో పెల్లుబికిన శోకోద్వేగాన్ని సూచిస్తున్నాయి. 'అది తలపోయరాని హృదయప్రవిదారి విషాదవాత్యకాస్పదమయి పంచఖండములు బావురు మన్న పిశాచివేశ ముప్పదికోట్ల భారత తపస్సముదాయము భస్మరాశియై చిదికిన ఘోర దుర్దినమిసీ! వచియింపగల జిహ్వాలాడునే.' సత్యం, అహింసల ఉత్కృష్టత, విశ్వమానవ సౌభ్రాత్రం, సర్వమత సామరస్యం వంటి సర్వకాలిక, సర్వజనీనాలైన అంశాలకు తోడు అస్పృశ్యతా నిరశనం, స్త్రీజనాభ్యుదయం, స్వదేశీ పరిశ్రమల పునరుజ్జీవనం వంటి దేశీయ సమస్యలకు సంబంధించిన మహాత్ముని ఆలోచనాసంళి ఈ కావ్యంలో ప్రతిఫలించింది.

నేతాజీ (1948) :

వీరనారి అయిన భరతమాత కన్న కూమారుల్లో సుభాష్ ఛంద్రబోస్ అగ్రగణ్యుడన్న భావావేశంతో వీరారాధనగా ఆ నేత జీవితంలోని ప్రధానఘట్టాలను కొన్నిటిని తీసుకొని వీరరసస్ఫోరకంగా చిత్రింపబడిన కావ్యమిది. 'వంగక్షోణి గంగాసుతుడైన' నేతాజీకి పట్టిన నీరాజనమే ఈ కావ్యానికి ప్రాతిపదిక. అది 'చరఖా పద్ధతుల'ను వ్యతిరేకించి, 'కత్తులేబట్టక స్వేచ్ఛ రాద'ని గాంధి మునితో సిద్ధాంతం చేసిన బోస్ అనుసరించిన మార్గాన్ని కూడా ఈ కావ్యం స్థిరీకరిస్తోంది. తొలి నిట్టూర్పు-మలి నిట్టూర్పు పేరుతో రెండు విభాగాలుగా సుబాష్ చంద్రబోస్ జీవితం

లోని ప్రధాన ఘట్టాలు ఇందులో వర్ణింపబడ్డాయి. మూడుసార్లు భారత జాతీయ కాంగ్రెస్‌కు అధ్యక్షుడిగా ఎంపికై, జాతికి గుండెయై, తన విప్లవ భావోద్వేగంతో అప్పటి బ్రిటిష్ ప్రభుత్వపు గుండెల్లో నిద్రపోయిన బోస్ గృహనిర్బంధం తొలి నిట్టూర్పులో ప్రస్తావింపబడగా, నిర్బంధం నుండి తప్పించుకొనిన అతని ఫలాయనగాథ మలినిట్టూర్పులో ప్రస్తరించబడింది. అప్పటి ప్రభుత్వం ఆ మహానేత మరణాన్ని ధృవీకరించినా 40 కోట్ల భారతీయ హృదయాల్లో ఆయనెక్కడో దేశాభ్యుదయ కాంక్షియై ప్రచ్ఛన్నంగా ఉన్నాడన్న ఊహ చోటుచేసుకుంది. ఈ ఖండకావ్యంలో నేతాజీ మరణం ధృవీకరించబడలేదు.

రాష్ట్రపూజ (1953) :

ఆంధ్రుల అచిరకాల ఆకాంక్షయైన ప్రత్యేకరాష్ట్ర అవతరణ సందర్భాన్ని పురస్కరించుకొని కవి ఈ ఖండ కావ్యాన్ని రచించారు. 35 పద్యాలతో కూర్చబడిన ఈ కావ్యంలో ప్రత్యేకాంధ్ర రాష్ట్రసిద్ధికై ప్రాణాలర్పించిన కీ.శే. పొట్టి శ్రీరాములు, సత్యాగ్రహోద్యమ యజ్ఞం నిర్వాహకులైన టంగుటూరి ప్రకాశం పంతులు, గొల్లపూడి సీతారామ శాస్త్రి వంటి త్యాగధనుల ప్రశంస, రాష్ట్ర రాజధాని విషయమై చెలరేగిన వివాదం, ముఠా రాజకీయాల గొడవలు, జీవనదులతోనూ, సహజ ప్రకృతి సంపదలతోనూ పెంపారు ఆంధ్రదేశ సౌభాగ్యం, ఆంధ్రజాతి ఔన్నత్యం మొదలైన అంశాలు అభివర్ణింపబడ్డాయి. ఈ కావ్యంలో కేవలం ఆత్మప్రత్యయాన్ని మాత్రమే ఘోషించకుండా ఆంధ్రజాతిలోని లోపాల్ని కూడా ఎత్తిచూపారు.

నాగార్జునసాగర్ (1966) :

నాగార్జునసాగర్ ప్రాజెక్టు నిర్మాణాన్ని గురించిన ప్రచార కావ్యంగా ప్రభుత్వ ప్రోత్సాహంతో రచింపబడి, సమాచార పౌరసంబంధాలశాఖ వారిచే ప్రకటితమైన కావ్యమిది. ఈ బృహత్తర కట్టడం నిర్మితమైన ప్రదేశం ఒకప్పుడు చారిత్రకంగా ఆంధ్రజాతి బౌద్ధికంగానూ, భౌతికంగానూ ప్రగతి సాధించిన సంగమస్థలం. ఆచార్య నాగార్జునుడ పేరున వెలసిన ఈ కట్టడపు ప్రాశస్త్యాన్ని కీర్తిస్తుందీ కావ్యం. 'మేని చెమ్మటలు గురిసె', 'భూములను తడిపేవారు', 'తలలు తాకట్టు పెట్టి' సర్కారువారికి శిస్తులు చెల్లించే వారు, ఏటేటా బుంగెడు నీటికొరకు పాతాళ కూపశ్రేణి త్రవ్వేవారు అయిన కర్షకుల కడగండ్లను పోగొట్టి, 'కరువు బెబ్బులి పండ్లు రాలిపోవునట్లు'గా ఇది అవతరించింది. ఈ విధంగా సాగిన ఈ ప్రచార కావ్యంలో ప్రాజెక్టు నిర్మాణ విశేషాలు అందులో పాల్గొన్న ఇంజనీర్ల ప్రతిభ, పంచర్ల ప్రణాళిక లను ఆధారంగాచేసుకుని ఆంధ్రదేశం పొందిన అభ్యున్నతి వంటి అంశాలు చోటుచేసుకొన్నాయి. తన కృతుల్లో వర్తమాన సామాజిక, రాజకీయ రంగాలలో నెలకొన్న కుళ్ళును తీవ్రంగా నిరసించి, లోపాలను ఎత్తి చూపిన కవి ఈ కావ్యంలో ఇరవై యేండ్ల స్వేచ్ఛాపాలన సంక్రమించ జేసిన సౌభాగ్యాన్ని వ్యాఖ్యానిస్తూ చెప్పిన పంక్తులు ప్రచారానికి ఉన్న పరిధిని వారి వ్యక్తిత్వాన్ని నిరూపిస్తున్నాయి.

ఆధార గ్రంథాలు :

1. ముసాఫర్లు(1963): గుర్రం జాషువ, బుక్ లవర్స్ ఆఫ్ ఇండియా, గుంటూరు.
2. నేతాజి (1978 నవపునర్ముద్రణ): గుర్రం జాషువ, హేమలతా లవణం, పటమట, విజయవాడ -520006
3. గబ్బిలం (ఏడవ ముద్రణ2011): గుర్రం జాషువ, విశాలాంధ్ర ప్రచురణలు, హైద్రాబాద్
4. కాందిశీకుడు(పునర్ముద్రణ): గుర్రం జాషువ, హేమలతా లవణం, పటమట, విజయవాడ
5. నా కథ (పునర్ముద్రణ): గుర్రం జాషువ, బుక్ లవర్స్ ప్రైవేటు లిమిటెడ్,గుంటూరు.

6. సమాజము - సాహిత్యము(1972): ఆర్.ఎస్. సుదర్శనం, చిత్తూరుజిల్లా రచయితల సహకార ప్రచురణ సంఘం, చిత్తూరు.
7. జాషువా కవికోకిలం(1978): బి. థియడోర్(సం), మహాకవి జాషువా జయంతి సమితి, మిషన్ హైస్కూల్ రోడ్, నర్సాపురం, ప.గో.
8. జాషువ కృతుల సమాలోచన(1982): డా.బి. భాస్కరచౌదరి, సమతా పబ్లికేషన్స్, జైల్‌ఖనావీధి, చిత్తూరు.

⌘⌘⌘

BHAVAVEENA
Vol. 17, Issue. 8, August 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

అస్తిత్వవాదం – సమకాలీనత

– డా॥. ఉడుము రఘొన్స్, తెలుగు అధ్యాపకులు,
రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం, నూజివీడు ప్రాంగణం, కృష్ణాజిల్లా, ఆంధ్రప్రదేశ్.

రెండవ ప్రపంచ యుద్ధానంతరం తెలుగు సాహిత్యంపై ప్రభావం చూపిన అంశాల్లో అస్తిత్వవాదం ఒకటి. అస్తిత్వ వాదాన్ని ఆంగ్లంలో 'Existentialism' అంటారు. Existence అనే పదానికి నిఘంటువుల్లో అనేక అర్థాలు న్నాయి. శబ్దార్థ చంద్రికలో అస్తిత్వం అనే మాటకు 'ఉండుట' అనే అర్థం (శబ్దార్థ చంద్రిక.2003:103), శ్రీ సూర్యరాయాంధ్ర నిఘంటువులో 'ఉనికి, వుండుట' అనే అర్థం (శ్రీ సూర్యరాయాంధ్ర నిఘంటువు.1979:339), సి.పి.బ్రౌన్ ఇంగ్లిష్ - తెలుగు నిఘంటువులో To Exist అనే మాటకు 'ఉండుట', 'కలిగి వుండుట', 'జీవించుట', 'బ్రతుకుట'... 'ఉనికి', 'స్థితి', 'వుండటం', 'జీవితకాలం', 'జీవించడం' అనే అర్థాలున్నాయి. జుఞఱ్‌వఅఎవ అనే మాటకు "మానవుడు స్వతంత్రుడు. తన కర్మకు తానే బాధ్యుడు. జీవితం సత్యం, అనుభవనీయమే కానీ శాస్త్రార్థమైన విచారణ కాదు" అనే వాదం అని వివరించడం జరిగింది. (తెలుగు అకాడమీ ఇంగ్లిష్ - తెలుగు నిఘంటువు -2000 : 344)

అస్తిత్వవాదం - ఆవిర్భావ వికాసాలు :

అస్తిత్వవాదానికి మూలపురుషుడు కీర్క్ గార్డ్. ఈయన 1813లో జన్మించి, 1855లో మరణించారు. ఈయన డెన్మార్క్ దేశానికి చెందినవారు. "కీర్క్ గార్డ్ తత్వం అస్తిత్వ తత్వం. అంటే మానవుని అస్తిత్వం దీనికి పునాది. అస్తిత్వం అంటే ఆయన దృష్టిలో జీవించడం కాదు. తనను తాను తెలుసుకొని జీవించడం. అంటే జ్ఞానంతో జీవించడం. జ్ఞానంతో జీవించడం వల్ల మానవునికి స్వతంత్రత సంభావమయ్యింది. తనకు తానే పునాది అయ్యాడు. ప్రపంచ నాటక రంగంలో వ్యక్తిత్వం గల పాత్రను అభి నయించ గలుగుతున్నాడు" (గోపీచంద్, త్రిపురనేని: పుట: 267 : 2005).

కీర్క్ గార్డ్ ప్రబోధించిన అస్తిత్వవాదం క్రైస్తవ అస్తిత్వ వాదంగా అభివర్ణించబడింది. భగవంతుని అన్వేషణ వ్యక్తి జీవితం ఒక్కటేనని గార్డ్ నమ్మకం. ఈయన అంతర్ముఖా నికి ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చారు.

అస్తిత్వస్పృహ - నేపథ్యం :

సృష్టిలో మానవ జన్మ ప్రారంభమైన నాటినుండి నేటి వరకు అస్తిత్వపోరాటం లేదా అస్తిత్వఘర్షణ మానవ ప్రపంచంలో ఏదో ఒక రూపంలో కనిపిస్తూనేవుంది. మనిషి తనలో తాను సమాజంతో తాను నిత్యం సంఘర్షణకు గురికావడం మూలంగా అతని ఆలోచనల్లో, భావాల్లో మార్పు వచ్చింది. తద్వారా అనేక సిద్ధాంతాలు రూపు దిద్దుకుంటూ వచ్చాయి. అలా ఏర్పడిన సిద్ధాంతాల్లో అస్తిత్వవాదం ఒకటి.

క్రీస్తుపూర్వం 4, 5 శతాబ్దాల కాలంలో ప్లేటో, అరిస్టాటిల్ మొదలైన వారిలో తాత్విక చింతనగా ప్రారంభమై మానవత్వపు విలువలకు ప్రాధాన్యమిస్తూ వచ్చింది. ఈ భావ చైతన్యంతోనూ సామాజిక చైతన్యంతోను కూడిన ఆలోచన, జిజ్ఞాస, మేధావుల చేత ముందడుగు వేయించింది. ఫలితంగా వ్యక్తి చైతన్యం, ఆధ్యాత్మిక చైతన్యం మానవ జీవితంలో చోటుచేసుకున్నాయి. ఇలా చైతన్యం అనేక విధాలుగా విస్తరిస్తున్న కాలంలోనే అస్తిత్వవాదపు బీజాలు మొలకెత్తాయి.

అస్తిత్వస్పృహ ఎప్పుడు కలుగుతుంది అనే ప్రశ్నకు సమాధానంగా 'విషమ పరిస్థితి సంభవించినప్పుడు' అని చెప్పారు. పరిస్థితులన్నీ సజావుగా కొనసాగుతున్నంత కాలం ఏ వ్యక్తి తన గురించి తాను ఆలోచించడు. పరిస్థితులు సజావుగా సాగనప్పుడో, విషమ పరిస్థితి వచ్చినప్పుడో తన గురించి తాను ఆలోచించుకుంటాడు.

కాబట్టి మానసిక సంఘర్షణ కలిగినప్పుడు మాత్రమే వాస్తవికతను తెలుసుకోగలం అని అంటారు కీర్క్ గార్డ్.

"ఆతృత వల్ల, భయం వల్ల, మానసిక ఆందోళన తీవ్ర మైనప్పుడు ఎవరికి వారికి అస్తిత్వ స్పృహ ఏర్పడుతుంది. ఆందోళన అధికమైన కొద్ది ఈ స్పృహ బలపడుతూనే వుంటుంది. ఇది బాహ్యలక్ష్యాలను అధికమించినప్పుడు ఒక మొత్తంగా తయారై తాత్విక చింతనగా రూపొందు తుంది. అస్తిత్వం అంటే ఏమిటో అప్పుడు కాని తెలి యదు" అని హెన్రి డి వ్యాఖ్యానించారు.

అస్తిత్వవాదులు వ్యక్తి అస్తిత్వానికి ప్రధానంగా మూడు అంశాలు చెప్పారు. అవి 1. వ్యక్తి స్వేచ్ఛ, 2. నిర్ణయం, 3. బాధ్యత.

వ్యక్తి మనుగడకు ఆధారమైనవి ఇవే. వ్యక్తి స్వేచ్ఛగా తన భవిష్యత్తును తీర్చిదిద్దుకోగల సామర్థ్యం కలిగి వుండటం వల్లనే ఇతర జంతువుల కంటే వున్నతంగా పరిణతి చెందాడు. సామర్థ్యం అనేది వ్యక్తి నిర్ణయం, బాధ్యత కలిస్తే ఏర్పడుతుంది.

స్వేచ్ఛ, బాధ్యతాయుతమైన నిర్ణయాల వల్ల వ్యక్తి సాధికారికంగా 'తాను' కాగలుగుతాడు. అస్తిత్వం గురించి సమగ్రమైన అవగాహన కలిగిన అస్తిత్వవాదులు వ్యక్తిత్వం, వ్యక్తిగత చైతనం ఈ రెండింటికే ప్రాధాన్యం ఇచ్చారు.

అస్తిత్వవాదం - లక్ష్యం :

అస్తిత్వవాదానికి మూలబిందువు వ్యక్తి. ఈ వ్యక్తి తన అస్తిత్వవాదాన్ని ఎలా కాపాడుకుంటాడు? అస్తిత్వ పోరాటంలో అతను ఏ విధంగా నిలబడతాడు.. మొదలైన అంశాలను వివరించడమే అస్తిత్వవాదంలో వున్న మూల సారం.

అస్తిత్వాన్ని గురించి ఒక్క మాటలో చెప్పాలంటే, వ్యవస్థ కంటే వ్యక్తికి ప్రాధాన్యం ఇవ్వాలని చెప్పేదే అస్తిత్వ వాదం. వ్యవస్థ విధించిన ధర్మాన్ని, నీతి నియమాలను వ్యక్తి అనుసరించినప్పుడు లేదా వ్యవస్థ కోసమే వ్యక్తి బ్రతుకుతున్నప్పుడు అతని స్వేచ్ఛ పూర్తిగా నాశన మౌతుంది. అతడొక జడపదార్థంగా మారిపోతాడు. వ్యక్తి ప్రత్యేక అస్తిత్వం కలిగి జీవించాలనుకుంటే తనకై తాను తన ధర్మమేమిటో నిర్ణయించుకోవాలి. ఒక లక్ష్యాన్ని ఏర్పరచుకోవాలి. తానేమిటో తాను తెలుసుకోవాలి. కాబట్టి ఆత్మాన్వేషణ అనేది అస్తిత్వవాదంలో ప్రధానమైన అంశం.

అస్తిత్వవాదులు - భిన్న అభిప్రాయాలు :

అస్తిత్వవాదంలో ఉన్న అనేకాంశాలను అనేకు అనేక రకాలుగా వివరించారు. వ్యక్తిని కేంద్రంగా చేసుకొని ఒక్కొక్కరు ఒక్కొక్క రకమైన అభిప్రాయాలను వెల్లడి చేశారు. వీటిలో ముఖ్యమైన వ్యక్తుల అభిప్రాయాలను పరిశీలిద్దాం.

నీట్షే :

నీట్షే 1844-1900 మధ్య కాలానికి చెందినవాడు. ఈయన వ్యక్తి సంకల్పానికి (will) ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చాడు. సంకల్పాన్ని అస్తిత్వపు లోతుల్లుంచి దృఢ పరచుకోవడం ద్వారా వ్యక్తి ధర్మానికి భిన్నమైన ధర్మాలను ఎదుర్కొని వాటికి లోబడక స్వధర్మ సాధన చేయడానికి వీలవుతుందంటాడు. కీర్క్ గార్డ్ వలే నీట్షే కూడా నిజా యితీకి, స్వయం నిర్ణయాలకి ప్రాధాన్యమిచ్చిన అంత ర్ముఖత్వానికి బదులు కార్యోన్ముఖతను బోధించాడు.

సృజనాత్మక శక్తుల ద్వారా విలువలని తనదైన ప్రపంచాన్ని వ్యక్తి నిర్మించుకోవాలని నీట్షే అభిప్రాయం.

సాత్రే :

సాత్రే వ్యక్తి స్వేచ్ఛకు ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చాడు. సాత్రే వ్యక్తి హృదయంలోని పారమార్థికాన్వేషణను గుర్తిస్తాడు కానీ ఈ అన్వేషణకు గమ్యం లేదని అతని అభిప్రాయం. మానవ జీవితానికి గమ్యమని ఊహించుకే భగవంతుడు ఒక భావం, ఒక కల్పన. అందువల్ల అది మానవుని అస్తిత్వాన్ని, స్వేచ్ఛని భంగపరిచే ఆత్మవంచన తప్ప మరేమి కాదని అన్వేషణకు సార్థకత కేవలం అన్వేషణే తప్ప మరొకటి కాదని అతని అభిప్రాయం.

సాత్రే అస్తిత్వాన్ని మూడు పొరలుగా విశ్లేసిస్తాడు. అవి 1. తనలో తాను, 2. తనకై తాను, 3. ఇతరుల కోసం తాను.

1. తనలో తాను (Being in itself)

   ఈ అస్తిత్వ పొరలో ఏకత్వం, అద్వైతం వుంది.

2. తనకై తాను (Being for itself) ఈ పొరలో ద్వైతం వుంది. అంటే తనను వేరుగా ఒక వస్తువుగా చూడటం. ఇక్కడ తనను గురించిన ఆలోచనకు, ఊహకు, కల్పనకు అవకాశం వుంది. ఆత్మ జ్ఞానానికి, ఆత్మవంచనకు కూడా అవకాశం వుంది.

3. ఇతరులకోసం తాను (Being for others) ఇతరుల దృష్టిలో తనను గురించి ఏ అభిప్రాయం వుందో ఊహించడం వల్ల వ్యక్తి తన ప్రవర్తనను ఆ విధంగా రూపొందించుకోవడం జరుగుతుంది. తద్వారా వ్యక్తికి స్వేచ్ఛపోయి జడత్వం, బానిసత్వం సంభవిస్తాయి. వ్యక్తి తనలో తాను అనే పొరలో జీవించినప్పుడే నిజాయితీ, బాధ్యత, స్వేచ్ఛ అనే విలువలు కలుగుతాయి. సామాజికుడైన మనిషిలో ఈ మూడు పొరల అస్తిత్వం వుంటూనే వుంది. ఎవరూ దీనిని తప్పించుకోలేరు. అయితే ఈ మూడు పొరల్లో ఏది ప్రాధాన్యం వహిస్తున్నదన్న విషయమే ముఖ్యం.

హైడిగర్ :

డిజైన్ Design అనే పదాన్ని అస్తిత్వం అనే అర్థంలో ఉపయోగించిన మార్టిన్ హైడిగర్. ఇతది దృక్పథం ప్రకారం అస్తిత్వం అనేది ప్రామాణిక అస్తిత్వంగా రూపొందే అవకాశం వుంది. అయితే ఈ పరిణామంలో వ్యక్తి నిజమైన వ్యక్తిగా రూపొందడం, తన ఉనికిని అనుభూతికి తెచ్చుకోవడం అనే రెండు కార్యాలు జరుగుతాయి. "అస్తిత్వం అనేది మొదట్లో మూసివుంచిన కిటికీ వంటిది. ప్రామాణిక అస్తిత్వంలోనే అది తెరుచుకుంటుంది. తద్వారా లోతైన వైయక్తిక అనుభవం వ్యక్తికి కలుగుతుంది".

సామాజిక వ్యక్తిత్వం అనేది ఉనికి, అస్తిత్వాల మధ్య వారది వంటిది. ఇక్కడ ఉనికి విషయంలో వ్యక్తి నిత్య చైతన్యస్పృహను కలిగివుండాలనేది హైడిగర్ అభిప్రాయం. కాబట్టే అస్తిత్వ విషయంలో ఉనికి అనేది ఆధ్యంతాలు లేనటు వంటిది. వ్యక్తి అస్థిత్వానికి ఉనికి అనేది నిత్య చైతన్య ధారవంటిది.

పాల్ టిల్లిచ్ :

ఈయన కూడా సాత్రే వలే అస్తిత్వవాదంలో మూడు రకాలైన అస్తిత్వ వేదనలను (Existencial anxieties) పేర్కొని వాటికి ప్రాముఖ్యం ఇచ్చాడు.

1. విధి - మృత్యువు : ఎప్పుడు ఏమౌతుందో అనే భయం, మృత్యువు తప్పదనే స్పృహ.
2. శూన్యం - నిరర్థకత : ఎప్పుడు ఏదో చేయాలనే ఆతృత, చేస్తున్నదానికి అర్థమేమిటనే ప్రశ్న.
3. పాపం - శిక్ష : చేస్తున్నది తప్పు, పాపమనే భావన, దానికి శిక్ష తప్పదనే భయం. ఈ మూడు అస్తిత్వ వేదనలు వ్యక్తి అస్థిత్వవాదానికి బంధకాలని పాల్ టిల్లిచ్ పేర్కొన్నారు. ఈయన దృష్టిలో వ్యక్తికి ముఖ్యమైనవి ధైర్యం, విశ్వాసం. వీటి ద్వారానే వ్యక్తికి అస్థిత్వం సిద్ధిస్తుందని అభిప్రాయపడ్డారు.

20వ శతాబ్ధపు అస్తిత్వవాదుల్లో మార్టిన్ హైడిగర్, యాస్పర్, సాత్రే, కేయూ, పాల్‌టిల్లిచ్, గాబ్రియెల్, బార్త్, మార్టిన్ బాబర్ ముఖ్యులు. సాహిత్య పరంగా అస్తిత్వ వాదానికి ప్రాభవాన్ని, ప్రాచుర్యాన్ని తెచ్చిన రచయితలు సాత్రే, కేయూ. వీరిద్దరికి నోబెల్ బహుమతి లభించింది.

పైన వివరించిన అస్తిత్వవాదుల దృక్పథాలను పరిశీలించినట్లయితే వ్యక్తి వైశిష్ట్యాన్ని గుర్తించి మనవుల్లో ఒక్కొక్క వ్యక్తికి అనిర్వచనీయమైన వ్యక్తిత్వం వుందని, దాని అభివ్యక్తి భిన్నంగా వుండక తప్పదని, తద్వారా వ్యక్తి జీవితం, ప్రవర్తన వ్యవస్థను వ్యతిరేకించినప్పుడు వ్యక్తి ధర్మాన్నే ఉన్నతమైన విలువగా అంగీకరించి, వ్యక్తినే సమర్థించడం అస్తిత్వవాదం యొక్క మూల సారాంశంగా చెప్పవచ్చు. అస్తిత్వ వాదం వ్యవస్థ కంటే వ్యక్తి ధర్మానికి, స్వేచ్ఛకు, సమాజ వికాసానికి ప్రాధాన్యమిచ్చినట్లు తెలుస్తోంది.

ముగింపు :

తెలుగు సాహిత్యంలో అస్తిత్వవాదృక్పథంతో రచనలు

చేసి, అస్తిత్వవాదాన్ని ప్రచారం చేసిన వారిలో త్రిపుననేని గోపీచంద్, ఆర్.ఎస్. సుదర్శనం చెప్పుకోదగిన వారు. 20, 21వ శతాబ్దంలో ఉద్యమ రూపాన్ని దాల్చినటువంటి స్త్రీ వాదం, దళితవాదం, మైనారిటీ వాదం, ప్రాంతీయ వాదం... మొదలైన సాహిత్యాలలో అస్తిత్వవాద దృక్పథాలు మనకి కనిపిస్తాయి. నేటి పరిశోధకులు ఈ దృష్టితో అయా సాహిత్యాలను అధ్యయనం చేసినట్లయితే అస్తిత్వ వాదాన్ని గురించిన మరిన్ని అంశాలు తెలుసుకోవడానికి అవకాశం వుంటుంది.

ఉపయుక్త గ్రంథ సూచిక :

1. గోపీచంద్, తత్వవేత్తలు - సిద్ధాంతాలు - జీవిత విశేషాలు - అలకానంద ప్రచురణలు: విజయవాడ: 2005.
2. కుటుంబరావు, కొడవటిగంటి 1980. (సాహిత్యప్రయోజనం వ్యాసావళి). విజయవాడ: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.
3. రామకృష్ణారావు, వై. 1987. ఆధునికాంధ్ర సాహిత్యంలో చైతన్య స్రవంతి. హైదరాబాద్:
4. సుదర్శనం.ఆర్.ఎస్. 1989. సాహిత్య నేపథ్యం: నవోదయ పబ్లిషర్స్.

⌘⌘⌘

BHAVAVEENA
Vol. 17, Issue. 8, August 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

తీరాన్ని చేరిన 'అల్పజీవి' మనోవ్యథలు – మనోవైజ్ఞానిక దృక్పథాలు

– డా॥. జొడ సీతాపతిరావు, తెలుగు శాఖాధ్యక్షులు, రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం, నూజివీడు.

నవలకు నాంది :

మనసు చంచల స్వభావి. పరిస్థితులను బట్టి మారి పోతుంది. కొన్నిసార్లు వాటిలోనే లీనమైపోతుంది. అలా జరిగినపుడు మనిషి వ్యక్తిత్వంలో మార్పు వస్తుంది. పరిస్థితులను ఎదురొడ్డి నిల్చుంటే అదే ఆత్మస్థైర్యం. తల వంచితే అదే ఆత్మన్యూనతా భావం. ఈ లోపానికి కారణం చుట్టూ ఉన్న సమాజం, పరిస్థితులు, పెరిగిన వాతావరణం. ఇవే వ్యక్తి వ్యక్తిత్వాన్ని నిర్దేశిస్తాయి. ఆత్మ న్యూనతా భావంతో ఉన్న వాళ్ళ జీవితాలు మధ్యలోనే అంతమౌతాయి. అలా కాకుండా ఆ భావం నుండి బయటపడి బ్రతకడం నేర్చుకోవడం ముఖ్యం. ఆ నేర్చు కోవడం ఎలానో తెలిపేదే అల్పజీవి నవల. ఆ నవలలో ఏం జరిగింది? నవలకి మనోవైజ్ఞానిక సిద్ధాంతాలకి సంబంధం ఏమిటి? ఇలాంటి ప్రశ్నలకు సమాధానమే ఈ వ్యాసం.

రచయిత పరిచయం :

అల్పజీవి రాచకొండ విశ్వనాథ శాస్త్రి గారి రచన. 1955 లో దీనిని తొలిసారిగా ముద్రించారు. రావిశాస్త్రికి విశేషమైన పేరు తెచ్చిన ఆయన తొలి నవల. జేమ్స్ జాయిస్, శ్రీశ్రీ 'కోనేటి రావు' పాత్రల ప్రభావంతో తాను ఈ నవల రాశా నని రావిశాస్త్రి చెప్పుకున్నాడు. రచనలో విశేషమైన వేగం, ఆ రోజుల్లో కొత్త కావడం వల్ల కూడా దీనికి ఆదరణ లభించింది. రచనలకు కథనమే ముఖ్యం. కానీ రాచకొండ విశ్వనాథ శాస్త్రి గారు దీనికి మరో కోణం జోడించారు. అదే అంతర్లీనంగా ఉన్న మనోవైజ్ఞానికత. ఈయన వృత్తి రీత్యా న్యాయవాది. ప్రవృత్తిరీత్యా కూడా న్యాయం పక్షాన నిలబడి తన రచనల ద్వారా సమాజంలోని అన్యాయాన్ని ప్రశ్నించారు.

నవల - కథనం :

నవలలోకి వెళ్తే సుబ్బయ్య కథానాయకుడు. ఈ సుబ్బయ్య మన చుట్టూ ఉన్న సమాజంలో ఉన్నటువంటి సగటు మనిషి. సుబ్బయ్య గురించి అందరూ పలు రకాలుగా అనుకుంటూ ఉంటారు. "సుబ్బయ్య ఒట్టి నంగిరి పింగిరి గాడు" అని చుట్టుపక్కల వాళ్ళు అను కుంటారు. "మా ఆయన ఏమీ చేతకాని మనిషి" అని సుబ్బయ్య భార్య అనుకుంటుంది. "మా నాన్న వెర్రి బాగులవాడు" అని పిల్లలు అనుకుంటూ ఉంటారు. ఇలాంటి సుబ్బయ్య మంచి ప్రభుత్వ ఉద్యోగమే వెలగబెడుతూ ఉంటాడు. "సుబ్బయ్య కాక మరొకరు ఆ కుర్చీలో ఉంటే బల్ల కింద, పైనా బాగా సంపాదించే వాళ్ళే!" అని కూడా ఆఫీసులో ఉండే తోటి ఉద్యోగులు అనుకుంటూ ఉంటారు.

అందరూ అనుకున్నట్టే సుబ్బయ్య పిరికివాడు, మంచి వాడు కూడా. ఏ నిర్ణయం గట్టిగా తీసుకోలేక సతమత మవుతూ ఉంటాడు. అలాంటి సుబ్బయ్య బావమరిది వెంకట్రావు బాగా గడుసుపిండం. జమీందారు వంశంలో పుట్టి, ఆస్తి హారతి కర్పూరమైనా, నోటి దురుసుతనం, లౌక్యంతో ఎలాగో నెట్టుకు వస్తూ ఉంటాడు. బావమరిది కోసం కాంట్రాక్టరు గవరయ్య దగ్గర అయిదు వందలు అప్పు చేస్తాడు. వెంకట్రావు అప్పు తీర్చడు. గవరయ్యేమో అప్పు తీర్చమని సుబ్బయ్య నెత్తి మీద కూర్చుంటాడు. అప్పటి వరకు ఆఫీసులో తన పని తను చేసుకునే సుబ్బయ్య జీవితం అల్లకల్లోలం అవుతుంది. నవలంతా అల్పజీవి అయిన సుబ్బయ్య సంఘర్షణతో సాగుతుంది.

బొత్తిగా ధైర్యం లేని మనిషి. ఏది ఎప్పుడు ఎలా చేసినా అది పిరికి చర్యలానే అనిపిస్తుంది. రోజూ అరుగు మీద కూర్చుని దారంటా వచ్చి పోయే మనుషులని చూస్తూ ఉంటాడు. తన భార్యని ఎవడో వచ్చి పిల్లల్ని ఎట్లా చూసు కోవాలో చెప్తూ ఉంటే కోపానికి బదులు ఆశ్చర్యపోయే

అల్పజీవి. భార్యతో మాట్లాడాలన్నా పిరికితనం. చుట్టూ ఉన్న మనుషుల్లో ఏదో ఒక్క గొప్పతనం ఆపాదించేసి తనని తాను "అల్పుడి"గా భావించేసుకుంటాడు.

చిన్నప్పుడు సవతి తల్లి చేతిలో కష్టాలు పడి పైకి వచ్చిన సుబ్బయ్య, తన తండ్రి ఒక చిరు ఉద్యోగిగా అధికారుల చేతిలో ఎలా దగా పడి మోసపోతాడో కళ్ళారా చూసినవ్యక్తి. అప్పటి నుండి సమాజం అంటేఅతనికి భయం. మానసిక దౌర్బల్యుడై సమాజంలో భయస్థుడిగా, నెమ్మదస్థుడిగా, ఇతరుల దృష్టిలో ఏమీ తెలియని లోకజ్ఞానం లేని వాడిగా మిగిలిపోతాడు. బాగా చితికిపోయి, వ్యసనాలకు లోనయ్యి సర్వస్వం కోల్పోయిన ఒక జమిందారైన వెంక ట్రావు చెల్లెల్ని వివాహం చేసుకొంటాడు. అయి నప్పటికీ భార్య నుంచి కూడా ప్రేమను, గౌరవాన్ని పొందలేక పోతాడు. ఇలా సమాజంలో తనను తక్కువ చేసుకుంటూ ఒక "ఇన్ఫీరియారిటి కాంప్లెక్స్"తో బాధ పడుతూ తనలో తనే మథన పడుతుంటాడు.

ఇక ఆఫీసులో సుబ్బయ్య చేసేది ఒక అతి చిన్న ఉద్యోగం. డిస్పాచ్ క్లర్కు గా అతి తక్కువ జీతం తీసు కుంటూ, అందరి కన్నా తక్కువాడిని అన్న భావాన్ని రోజు రోజుకూ మనసులో పెంచుకుంటూ, మేనేజర్ దగ్గర నుండి ప్యూన్ వరకూ అందరి చేతా తిట్టించుకుంటూ ఒక మానసిక రోగిలా తయారవుతాడు. ఎవరి కోసమో అప్పు చేసి తను ఇబ్బందిలో పడి ఆ అప్పు తీర్చలేక సుబ్బయ్య పడే వేదన వర్ణనాతీతం. అందరూ సుబ్బయ్యను ఈసడించుకోవడం మొదలు పెడతారు. ఒక గౌరవం, పరపతి లేని మనిషిగా సుబ్బయ్య తయారవు తాడు.

ఇంతలో ఒక వేశ్య అనబడే టీచర్ (మనోరమ) వ్యామోహంలో పడతాడు. ఆమె ఇతని పక్కన ఉన్నంత వరకూ అత్మస్థైర్య వంతుడిలా ప్రవర్తిస్తాడు. తన కష్టాలను చెప్పుకుంటాడు. ఐదు వందల అప్పు గురించి చెప్పి బాధ పడతాడు. చివరికి ఆమె సహాయంతో ఆ గొడవ నుండి బయట పడతాడు. ఆనందంగా సముద్ర తీరాన్ని చేరు తాడు. ఇలా సుబ్బయ్య జీవితం అనేక కోణాలను ఆవిష్క రిస్తుంది ఈ నవల.

రావిశాస్త్రి గారు ఈ నవలను ఒక న్యాయవాదిగా, సామాన్యుల జీవితాలను బాగా పరికించి చూసి రాసారని పిస్తుంది. ఈ నవలలో పాత్రల విశ్లేషణ కూడా అదే స్థాయిలో ఉంది. మనో విశ్లేషణల మీద వచ్చిన రెండు నవలలు "అసమర్థుని జీవయాత్ర -గోపీచంద్", "చివరకు మిగిలేది-బుచ్చిబాబు" తర్వాత బాగా ప్రాచుర్యం పొందిన నవల అల్పజీవి. ఒక సామాన్య మనిషి జీవితంలో వివిధ కోణాలను ఆవిష్కరించిన ఈ నవల చదవడానికి చాలా ఆసక్తిదాయకంగా ఉంటుంది.

మనోవైజ్ఞానిక సిద్ధాంతాలు - విశ్లేషణ :

'అల్పజీవి'మనోవ్కెజ్ఞానిక నవల. దీనికి ముందు వెలువడిన 'అసమర్థుని జీవయాత్ర', 'చివరకు మిగిలేది' నవలల్ని కూడా మనోవ్కెజ్ఞానిక నవలలన్నారు. ఇలాంటి రచనలముఖ్య లక్షణం పాత్రల బాహ్య రూపాన్ని కాకుండా మనసుల్ని శోధించటం. ప్రధానంగాపాత్రల మనస్సుల్లో చెలరేగుతున్న సంఘర్షణను చిత్రించటం. ఈ చిత్రణకు ఆధారంసిగ్మండ్ ఫ్రాయిడ్, ఆడ్లర్, యాంగ్ లాంటి మానసికశాస్త్రవేత్తల సిద్ధాంతాలు.

సిగ్మండ్ ఫ్రాయిడ్ సిద్ధాంతం :

ప్లేటో కవిత్వాన్ని పరిశీలన నాటి నుంచి మనస్తత్వ శాస్త్రం సాహిత్య విమర్శతో ముడిపడి ఉంది. కావ్య నిర్మాణ విషయంలో కవి మనస్థితి కొంత అస్తిమితంగా ఉంటుందని ప్లేటో భావన. తర్వాత కాల్పనిక యుగంలో వర్డ్స్ వర్త్, కోల్ రిడ్జ్ లు మనస్తత్వ ప్రసక్తిని తీసుకువచ్చారు. సైకో అనాలిస్ కళా కారులలోని మౌలికంగా న్యూరోటిక్ జబ్బు మనిషి లక్షణాలున్నాయని అంటుంది. అయితే అతడు కళ ద్వారానే తన రుగ్మతను తగ్గించుకొని రక్షించుకుంటాడు. కళద్వారా భ్రాంతినుంచి వాస్తవ ప్రపం చాన్ని చేరుకుంటాడు.

ప్రతి వ్యక్తిలోనూ అతనికి తెలియని అంతశ్చేతన అనేదొకటుంటుందని, ఆ అంతశ్చేతనలోకి అణిచివేసిన

అనేక శక్తులు అతని బాహ్యజీవితాన్ని ప్రభావితం చేస్తాయని ఫ్రాయిడ్ చెప్పాడు.

- ఇతను ప్రకారం ఒక వ్యక్తిలో చేతన, అచేతన, సుప్తావస్థలు ఉంటాయని చెప్పారు
- సిగ్మండ్ ఫ్రాయిడ్ చాలా మనోవైజ్ఞానిక సిద్ధాంతాలను చెప్పారు. అందులో అల్పజీవి నవలకి ఉపయోగపడేవి.

1. స్మృతి స్రవంతి, 2. స్వప్న రహస్య భేదనం, 3. స్ఖాలిత్యాలు

స్మృతి స్రవంతి :

ఇందులో రెండు ఉంటాయి. 1. నిరోధ శక్తి (Resistance), 2. నిరోధించడం (Repression). రెండూ ఒకటే అయినప్పటికీ చిన్న తేడా ఉంది. ఉదాహరణకి మనకి పంటి నొప్పి వస్తే డాక్టర్ దగ్గరకి వెళ్తాం. ఆయన పరీక్షించి ఆ పన్నుని తీసేయాలంటాడు. మనం కూడా దానికి సిద్ధం అవుతాం. కానీ సరిగ్గా పంటిపై పరికరం పెట్టి తీసేసరికి మనం నోటిని మూసి నిరోధిస్తాం. ఇలా నోటిని మూయడమే నిరోధక శక్తి. అడ్డుకోవడం నిరోధించడం.

స్వప్న రహస్య భేదనం :

ఈ సిద్ధాంతం ప్రకారం ఒక మనిషికి తన చిన్నతనంలో (పుట్టిన రెండు సంవత్సరాల నుంచి) జరిగిన ప్రతీ విషయం గుర్తుంటుంది. అది దానికి సంబంధించిన సందర్భం ఏదైనా జరిగితే గుర్తుకొస్తుంది. ఆ జ్ఞాపకాలన్నీ చేతన, అచేతన, సుప్తావస్థల్లో ఉంటాయని చెప్పారు.

ఉదా :

1. హిప్నోటిసమ్ చేసి చిన్న నాటి జ్ఞాపకాలు బయటకి తెప్పించడం
2. చిన్న నాటి ఆలోచనలు గానీ, ముందు రోజు జరిగిన విషయాలు గాని కలలుగా రావడం
3. ఏదైనా విషయం గుర్తు రాకపోతే దాని చుట్టూ జరిగిన విషయాలను ఆలోచిస్తూ ఉంటే అసలు విషయం గుర్తుకు రావడం.

ఈయన స్వప్న రహస్య భేదన సిద్ధాంతం ప్రకారం తీరని కోర్కెలను కలలు తీరుస్తాయని చెప్తారు.

స్ఖాలిత్యాలు :

వీటినే ఊత చేష్టలు లేదా ఊత పదాలు అని మనం చెప్పవచ్చు. ఇవి రెండు రకాలు 1. జిహ్వా స్ఖాలిత్యం (SlipofTongue), 2. లేఖినీ స్ఖాలిత్యం (SlipofPen).

ఉదా :

1. ఉపన్యాసిస్తూ తప్పులు మాట్లాడటం
2. ఒకటి రాయాలనుకొని ఇంకోటి రాయడం

వీటన్నింటికీ కారణం రెండు పనులు ఒక దానితో ఒకటి సంఘర్షణలు పడటం. ఉదాహరణకి ఒక నాయకుడుకి తర్వాత రోజు జరగబోయే మీటింగ్ కి వెళ్లాలని లేదు. కానీ వెళ్లాల్సి వచ్చింది. అతనే ప్రారంభ ఉపన్యాసం చేయాలి. అప్పుడు అతను ఈ మీటింగ్ ప్రారంభిస్తున్నందుకి బదులు, ముగిస్తున్నందుకు నాకు చాలా ఆనందంగా ఉంది అంటాడు. దీనికి కారణం అతనికి ఆ మీటింగ్ కి రావడం ఇష్టం లేకపోవడమే. రెండు ఆలోచనలు ఘర్షణల వల్ల అలా మాట్లాడటం జరుగుతుంది.

అడ్లర్ సిద్ధాంతం :

అడ్లర్ ప్రతివ్యక్తిలోనూ ఆత్మన్యూనతా భ్రాంతి ఉంటుందని, బాల్యంలో తీవ్రంగా కలచివేసిన సంఘటనలు ఇది ఏర్పడటానికి కారణమవుతాయన్నాడు. వ్యక్తి పెరిగి పెద్దయ్యాక ఏవోకారణాల వల్ల అతని బాల్య జీవితంలో జరిగిన ఆ భయంకర సంఘటన గుర్తొచ్చి, ఆ సంఘటనా స్వరూపం అతనికి స్పష్టంగా కనిపించాక అతనిలో ఏర్పడిన ఆత్మన్యూనతా భ్రాంతి తొలగిపోవచ్చనికూడాఅడ్లర్ చెప్పాడు.

- బాల్యంలో విపరీతమైన గారాభానికి లోనైన/ అతి నిర్లక్ష్యానికి గురైన/ అంగ వైకల్యంతో ఉన్నవారైనా

తర్వాత కాలంలో ఆత్మ న్యూనతతో (Crisis of Conscience) బాధపడే అవకాశం ఉంటుంది

- ◆ ఆత్మన్యూనతా భావం గల వ్యక్తులు సమాజం, ఉద్యోగం, లైంగిక రంగాలలో తనకు లేని ఆధిక్యాన్ని నిరూపించుకోవాలనుకుంటారు.
- ◆ మనోవైజ్ఞానిక శాస్త్రం రీత్యా ఆత్మ సమర్థనా రీతులు రెండు రకాలు.

1. స్వైర కల్పనలు (Fantasy),
2. తాదాత్మత (Identification).

సుబ్బయ్య పాత్ర - మనోవైజ్ఞానికాంశాల అన్వయం :

'అల్పజీవి' కథానాయకుడు సుబ్బయ్య. ఇతనిలో ఆత్మన్యూనతా భ్రాంతి ఉందనిరచయిత మనకు నవల ప్రారంభంలోనే చెప్తారు. "సుబ్బయ్య సుందరుడు కాడు'- ఇదిసుబ్బయ్య అభిప్రాయంబీ 'సుబ్బయ్య ఒట్టి చచ్చు దద్దమ్మ'- అదీ సుబ్బయ్యఅభిప్రాయమే!". ఇలా అతని లోని ఆత్మ న్యూనత భ్రాంతిని బయట పెడతాడు. తనను తాను తక్కువ చేసుకోవడం ఆత్మన్యూనతాభ్రాంతి ఉన్న వాళ్ల ప్రధాన లక్షణం. తనను తాను తక్కువ చేసు కోవ డమే కాకుండా తనచుట్టూ ఉన్నవాళ్ల దృష్టిలో కూడా తను తక్కువవాడే అనుకుంటాడు ఈ భ్రాంతికిలోనైన వాడు.

మనోవ్కెజ్ఞానిక నవలల్లోని కథంతా ప్రధాన పాత్ర మనసులోనే జరుగుతున్నట్టుగా రచయిత చిత్రిస్తాడు. ఈ తరహా నవలల్లో పాత్రల సంఖ్య చాలా తక్కువగా ఉం టుంది. 'అల్పజీవి'లో సుబ్బయ్య ఒక్కడే ముఖ్య పాత్ర. మిగతా పాత్రలన్నీ అతని చుట్టే తిరుగుతుంటాయి.

సుబ్బయ్యలో ఆత్మన్యూనతా భ్రాంతి ఏర్పడటానికి కారణం అతని బాల్యంలో జరిగిన ఓ సంఘటన. సుబ్బయ్య తల్లి చనిపోయాక తండ్రి సోమయ్య ద్వితీయ వివాహం చేసుకున్నాడు. అతని రెండో భార్య చాలా వికృతంగా ఉండడమే కాకుండా చాలా క్రూరమైంది. అవిణ్ణి - అంటే తన సవతితల్లిని మొదటిసారి చూడగానే భయపడి తండ్రిచుట్టూ చేతులు వేసి గట్టిగా పట్టుకొని నిల్చుండిపోయాడు సుబ్బయ్య. వచ్చిన మర్నాడే ఆవిడ సుబ్బయ్యను కొట్టింది. అప్పట్నించి ప్రతిరోజూ కొట్టేది. లేత వయసులో ఆమె ఉన్నన్నాళ్లు సుబ్బయ్య పడిన మనోవేదన, యాతన ఇంతా అంతా కాదు. ఆమె ఒక్క సంవత్సరం మాత్రమే సుబ్బయ్య తండ్రితో కాపురం చేసింది. తర్వాత ఆవిడ పక్కింటి వాడితో లేచిపోయింది. ఆవిడ అలా వెళ్లిపోయినందుకు ఎవరూ పెద్దగా బాధపడ లేదు. కానీ సుబ్బయ్యలో ప్రవేశించిన భయం మాత్రం అలానే ఉండిపోయింది. ఇక్కడ మనం అడ్లర్, సిగ్మం0డ్ ఫ్రాయిడ్ చెప్పిన సిద్ధాంతాల్ని అన్వయించుకోవచ్చు.

సుబ్బయ్య బాల్యంలో అతన్ని తీవ్రంగా భయపెట్టిన మరో సంఘటన కూడా జరిగింది. ఒక రాత్రి సుబ్బయ్య తన తండ్రితో కలిసి ఎక్కడికో వెళ్తొంటే ముగ్గురు మనుషు లొచ్చి సుబ్బయ్య నాన్నను కొట్టడం మొదలపెట్టారు. వాళ్ళు ఎక్కణ్నించి వచ్చారో, తన తండ్రిని ఎందుకు కొడ్తు న్నారో సుబ్బయ్యకు తెలియలేదు. దెబ్బలకు తాళలేక తండ్రి బాధతో మూలుగుతున్న చప్పుడు సుబ్బయ్యను కలచివేసింది.

సుబ్బయ్య తండ్రిని ఆ అర్ధరాత్రి కొట్టినవాళ్లెవరు, వాళ్లెందుకు అతన్నికొట్టారు. ఈ విషయాల్ని రచయిత వివరించలేదు. ఎందుకంటే ఈ సంఘటన సుబ్బయ్య మీద ఎలాంటి ప్రభావాన్ని కలిగించిందో చెప్పడమే రచ యిత ఉద్దేశం. ఈ సంఘటన సుబ్బయ అంతశ్చేతనలోకి నెట్టివేసి అతని బాహ్య ప్రవర్తనను ప్రభావితం చేసింది. అతన్నో పిరికివాడిగా మార్చేసింది. తర్వాతా కాలంలో సుబ్బయ్య తనని కూడా కొంతమంది కొట్టినట్టు కల కంటాడు. ఇక్కడ మనం సిగ్మండ్ ఫ్రాయిడ్ స్వప్న రహస్య భేదన సిద్ధాంతం చూడొచ్చు.

నవలలో చాలా చోట్ల సుబ్బయ్య తనతో తనే మాట్లాడుకుంటాడు. దీన్ని ఇంటీరియర్‌మోనోలాగ్ అంటారు. పాత్ర తనతో తను, తనలో తను మాట్లాడు కోవటాన్ని స్వగతం అనిఅంటారు. ఇలా సుబ్బయ్య తనతో

తను మాట్లాడుకుంటూ మథనపడటమే ఈ నవలంతా. ఈ విషయం ద్వారా సుబ్బయ్యను మనం కార్ల్ యూంగ్ సిద్ధాంతం అన్వయించుకోవచ్చు.

"నల్లచీరావిడ..,నీలి వెన్నెల్లో నల్లటి నలుపు చీర వెనక ఆవిడ తెల్లగామెరుస్తోంది. ఈవిడ మనుషకాంత కాదు.. ఈవిడ దేవతామూర్తి"- ఇవీ మనోరమనుగురించి సుబ్బయ్య ఆలోచనలు. ఆమెను చూసినప్పుడు సుబ్బయ్యలో సంతోషం ఉప్పొంగిగట్లు తెంచుకుంటుంది. మనోరమ అతని మీద జాలిని చూపిస్తుంది. "జాలి. జాలి.జాలి. ఈ ప్రపంచంలో ఈ విశాల విశ్వంలో సుబ్బయ్యను చూసి జాలిపడే వ్యక్తిసుబ్బయ్యే. కానీ ఈవిడకు నన్ను చూచి జాలి కల్గిందట" అనుకుంటాడు సుబ్బయ్య. ఈమనోరమ అతనిపట్ల ఎందుకంత 'కన్‌సర్న్' లేక జాలి లేక సానుభూతిని చూపిస్తుందోరచయిత మనకు స్పష్టంగా చెప్పరు. కానీ మనోరమ సుబ్బయ్యకు దగ్గరవుతున్నకొద్దీ అతనిలోని ఆత్మన్యూనతా భ్రాంతి తగ్గిపోతుంది. ఆడ్లర్ సిద్ధాంతం ప్రకారం కొన్ని సందర్భాల వల్ల ఆత్మ న్యునతా భావం తొలిగిపోతుంది.

ఇక్కడ రచయిత చెప్పదల్చుకున్నది ఓ స్త్రీ ఓ పురుషుడికిదగ్గరైనప్పుడు, అతనిమీద సానుభూతిని, సహానుభూతిని చూపించినప్పుడు ఆపురుషుడిలోని పిరికితనం పోయి ఆత్మవిశ్వాసం చోటు చేసుకుంటుంది. తను గవర్రాజు దగ్గర లంచం తీసుకున్న విషయం చెప్పి, అతడు ఆ డబ్బు తిరిగి ఇమ్మంటున్నాడనిసుబ్బయ్య చెప్పినప్పుడు "మీరా డబ్బు గవర్రాజుకు తిరిగివ్వాల్సిన అవసరంలేదు, నేను గవర్రాజుతో మాట్లాడతాను, నాకు గవర్రాజు తెలుసంటుంది మనోరమ.దాంతో సుబ్బయ్యకి కొండంత బలం వస్తుంది. ఇదే ఆత్మస్థైర్యం అంటే.

మనోరమ పాత్ర పేరు - ప్రాముఖ్యత :

నవల చివరిలో సముద్రాన్ని సుబ్బయ్య మనసుకు ప్రతీకగా రచయిత సూచించాడు. సుబ్బయ్యమనసులాగే సముద్రం కదులుతూనే ఉంది. అది చంచలం. కానీ ఇప్పుడు ఆ సముద్రం మనోహరంగా ఉంది. అతని మనసు మనోరమ కారణంగా మనోహరంగా మారింది. (మనోరమ అన్న పేరును రచయితకావాలనే పెట్టారు. మనసును రంజింపచేసేది కదా మనోరమ) 'సముద్రం కదలకుండాఎప్పుడుంది' అనడంలో మనిషి మనసు కూడా కదలకుండా ఎప్పుడూ ఉండడని, అతని మనసు మారుతూనే ఉంటుందని చెప్పడం. సుబ్బయ్య మనసిప్పుడు మారింది. అతనిలో స్థిరపడినఆత్మన్యూనతా భ్రాంతి తొలగిపోయింది. ఎవరూ తోడు లేని వ్యక్తికి మనోరమ లాంటిస్త్రీ తోడు లభించినప్పుడు అతనిలో పిరికితనం స్థానంలో ఆత్మవిశ్వాసం ప్రోదిచేసుకుంటుందన్నది ఈ నవల ద్వారా రావిశాస్త్రి ఇవ్వదల్చుకున్న సందేశం.

'జయమ్ము నిశ్చయమ్ముర', 1989 లో వచ్చిన చిత్ర కథకు ఆధారం ఈ నవలే. "అల్పజీవి నన్ను చాలా ఆకట్టుకుంది. అందులోని అంశాలకు సినిమా రూపమిస్తే బాగుంటుందనిపించింది" అంటారు ఆ చిత్ర దర్శకుడు శివరాజ్ కనుమూరి. 'అల్పజీవి' ఈతరం పాఠకులనూ ప్రభావితం చేస్తోందంటే...రావిశాస్త్రికలం బలమే దానికి కారణం.

తెగుతున్న బంధాలు, సంబంధాలు :

ఇగో కాల్చేస్తోంది. ఆనందం బదులు ఘర్షణ వాతావరణం అలుముకుంటోంది. ఎవరికివారే తక్కువ కాదనే అహం, పెరుగుతున్న వ్యతిరేక ఆలోచనాధోరణిప్రస్తుత సమాజంలోని ప్రజల స్థితిని మార్చుతున్నాయి. ఒకే జనరేషన్‌లో ఆర్థిక అసమానతలు చోటు చేసుకుంటుండడంతో కిందిదశలో ఉన్న వారిలో అహం దెబ్బతింటోంది. సమాజంలో ఇతరులు ఉన్నతులుగా ఉంటుండడం, తాము ఆ స్థాయికి ఎదగలేకపోవడం మనస్సుపై ప్రభావం చూపుతోంది. తమని తాము తక్కువగా చూసుకునే పరిస్థితి వస్తుంది. పరీక్షలో తప్పానని ఆత్మ చేసుకోవడం నేటి సమాజంలో పరిపాటి. దానికి కారణం వేరే వాళ్లతో పోలిక. ఫలితంగా ఆత్మన్యూనతా భావం. ఆత్మహత్యే శరణ్యమని నమ్మడం. ఇదే కాకుండా

రెండురకాల వ్యక్తులు ఒకచోట కలిస్తే మరొకరిలో ఇగో పెరుగుతుంది. తమను చిన్నచూపు చూస్తున్నారనే భావన వారిలో ఏర్పడుతుంది. ఇలాంటి సమయంలో చిన్నమాట ఎవరైనా అంటే చాలు, ఒక్కసారిగా రియాక్టు అవడం మనం చూస్తూనే ఉంటాం. వారిపై ద్వేషం పెట్టుకొని వారిని ఇబ్బంది పెట్టాలని కాచు కూర్చోవడం చూస్తూనే ఉన్నాం. అన్న తమ్ముళ్ళు నుండి, స్నేహితుల వరకు ఈ ఇగో అనే జాడ్యం వల్ల సంబంధాలు ముక్కలయ్యే పరిస్థితి నేటి సమాజంలో ఉంది.

నెగిటివ్ ఆలోచనలతోనే :

చాలామందికి నెగిటివ్ ఆలోచనలు ఎక్కువగా ఉంటున్నాయి. ఎవరైనా ఏమైనా అంటే దానిని నెగిటివ్‌గా ఆలోచించి వారిపై ఇగో పెంచుకుంటున్నారు. దీంతో ఇద్దరి మధ్య మనస్పర్థలు చోటు చేసుకుంటున్నాయి. ముఖ్యంగా ఈ తరహా అంశాలు భార్యాభర్తల మధ్య ఎక్కువగా చోటు చేసుకుంటున్నాయి. గతంలో ఆర్థికంగా బాగా ఉన్న సమయంలో విలాసంగా జీవించిన వారి కుటుంబాలు తారుమారు అయితే తట్టుకోలేని పరిస్థితులకు చేరుతున్నాయి. విలాసాలకు చెక్ పెడుతుండడంతో కుటుంబంలో తరచూ తగాదాలు ఏర్పడుతున్నాయి. అంతవరకు బాగా బతికిన కుటుంబం ఒక్కసారిగా చితికిపోవడంతో సమాజంలో తమకు స్టేటస్ తగ్గిందనే ఆత్మ న్యూనతాభావం వారిలో ఏర్పడుతుంది. దీనికి కారణం నువ్వేనంటూ దంపతులిద్దరూ పరస్పరం నిందించుకోవడం పరిపాటిగా మారింది. ఆ తరువాత ఇది మరింత పెరిగి ఆత్మహత్యలకు దారితీస్తోంది. తల్లిదండ్రుల్ని ఎదిరించి పెళ్ళి చేసుకున్న కుటుంబాల్లో కూడా ఇద్దరి మధ్య దూరం పెరిగిపోయే పరిస్థితి కనిపిస్తోందని వైద్యులు పేర్కొంటున్నారు. పెళ్ళి చేసుకుని మంచిగా బతకాలనే ఆశతో ఒక్కటైన దంపతులకు అనుకున్నట్లుగా పరిస్థితులు లేకపోవడంతో ఇలాంటి ఘటనలు ఎక్కువయ్యాయి.

గతంలో భార్యాభర్తల మధ్య ఏవైనా తగాదాలు వస్తే రియలైజేషన్ వచ్చేది. ఒకరికొకరు తప్పు తెలుసుకుని సర్దుకుపోయేవారు. ఇప్పుడా పరిస్థితులు లేవు. ఎవరికి వారు ఏమాత్రం తగ్గడం లేదు. తరచూ ఒకరినొకరు నిందించుకోవడం గొడవలకు దారితీస్తుంది. భార్యాభర్తలు ఒకరినొకరు గౌరవించుకోవాలి. అప్పుడే మాట పట్టింపులు ఉండవు. భార్యాభర్తలు ఇద్దరూ ఉద్యోగాలు చేస్తున్న కుటుంబాలలో ఉద్యోగ రీత్యా పని ఒత్తిడి, ఇంటి పర్యవేక్షణ కారణాలతో ఒకరికొకరూ పూర్తిగా మాట్లాడుకోవడం లేదు. ఏదో మొక్కుబడిగా ఉన్నామనే ధోరణితో వ్యవహరిస్తున్నారు. దీంతో పరిష్కరించుకోవాల్సిన సమస్యను పెద్దవి చేస్తుండడంతో ఘర్షణ పెరుగుతోంది. దీంతో ఇగో అడ్డు వస్తోంది. వారు ఒకరి అభిప్రాయాలు మరొకరు అర్థం చేసుకోవాలి. సమస్యకు కారణాలు గుర్తించాలి.

ఆత్మస్థైర్యమే అభివృద్ధికి ఆయుధం :

సామాజిక స్థాయి విజయం వైపు పరుగులు తీసినా, మానసిక స్థాయి మాత్రం అపజయాల పాలౌతూనే ఉంది. కారణం రచ్చ గెలిచి ఇంట గెలవలేకపోవడం. తమ మనసుని తాము అదుపులో ఉంచుకోలేకపోవడం. మనసు అదుపులో ఉంటే సగానికి సగం సమస్యలకి ఆరంభమే ఉండదు. మన జీవితం మన నమ్మకాల ప్రతిబింబం. ఈ నమ్మకాలన్నీ మన సబ్ కాన్సస్ లోలోతుగా రిజిస్టర్ అవుతాయి. సగటు మనిషి మనసులో చాలా వరకు నమ్మకాలు ప్రతికూలం(నెగిటివ్)గా ఉంటాయి. మానవ జీవితంలో ఎదురైన సంఘటనలు అనుభవాలుగా మారి చివరికి నమ్మకాలౌతాయ్. వీటినే మనం మానసిక ముద్రలు అంటాం. వీటివల్ల అనుమానం, భయం, ఆందోళన, ఒత్తిడి, పిరికితనం, ఆత్మన్యూనతా భావం పెరిగి కలవరపెడతాయి. వాటిని అధిగమించాలి. మనసును అదుపులో పెట్టుకోవాలి. మిథ్యా జీవితాన్ని వదిలి, నిజ జీవితంలోకి రావాలి. ఎప్పుడో ఏదో జరిగింది అది మళ్ళీ ఇప్పుడు జరుగుతుందనే భావన వదలాలి. వర్తమానంలో బ్రతకాలి.

ముఖ్యంగా చిన్న పిల్లకివేరొకరి పోలిక పెడుతూ తిట్టడమో, పొగడటమో చేయకూడదు. అది వారి వ్యక్తిత్వాన్ని నిర్ణయిస్తుంది. పోటీ పడటం నేర్పించాలి. కానీ వేరొకరితో కాదు. వారితో వారికే పోటీ తత్వం అలవాటు చేయాలి. అప్పుడే వారికి ఎవరి కన్నా మేము తక్కువ ఎక్కువ అనే ఆలోచనలు రావు. నిజ జీవితంలో బ్రతకడం అలవాటు అవుతుంది. రచయిత సుబ్బయ్య గుమాస్తాగా ఉన్నప్పుడు నుండి నవల్ని ప్రారంభించవచ్చు. కానీ చిన్న పిల్లప్పుడు నుండి చెప్పడం వెనుక ఉన్న మర్మం కూడా ఇదే. చిన్నతనంలో ఎదురైనా పరిస్థితులు, వాతావరణం పెద్దైన తర్వాత ప్రభావం చూపుతాయి. అందుకే సుబ్బయ్యను ఆదర్శంగా తీసుకొని ఆత్మస్థైర్యంతో వ్యక్తిగత అభివృద్ధి చెందాలి. అదే రచయిత కల. ఆశ. ఆకాంక్ష.

ఆధార గ్రంథాలు :

1. అంతర్జాలం
2. అల్పజీవి (నవల) - రాచకొండ విశ్వనాథ శాస్త్రి
3. పాశ్చాత్య సాహిత్య విమర్శ చరిత్ర సిద్ధాంతాలు - వదలి మందేశ్వర రావు, తెలుగు విశ్వవిద్యాలయం ప్రచురణ. హైదరాబాద్.
4. సిగ్మండ్ ఫ్రాయిడ్ - తెలుగు అకాడెమి ప్రచురణ
5. The Interpretation of Dreams -- Sigmund Freud
6. The Psychopathology of Everyday Life - Sigmund Freud
7. Understanding Human Nature -- Alfred Adler
8. The Individual Psychology of Alfred Adler - Alfred Adler

⌘⌘⌘

BHAVAVEENA
Vol. 17, Issue. 8, August 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

మాడభూషి కవిత్వం – సమకాలీనత

- జి. యన్. శ్యామలరాణి, పరిశోధక విద్యార్థి, తెలుగుశాఖ, మద్రాసు విశ్వవిద్యాలయం.

సాహితీవేత్తగా, భాషావేత్తగా, పరిశోధకులుగా, పర్యావేక్షకులుగా, పాత్రికేయులుగా, కవిగా, రచయితగా, ఆచార్యులుగా తెలుగు భాషకు సేవలందిస్తున్న మహోన్నత వ్యక్తి, గురువర్యులు ఆచార్య మాడభూషి సంపత్‌కుమార్‌గారు. వీరు చిత్తూరు జిల్లా కమ్మపల్లె అను కుగ్రామంలో శ్రీనివాసాచార్యులు, పట్టమ్మ దంపతులకు సెప్టెంబరు 17వ తేదిన 1959వ సంవత్సరాన జన్మించారు. ప్రాథమిక విద్య నుండి డిగ్రీ వరకు చిత్తూరులోనే చదువు కున్నారు. మద్రాసు విశ్వవిద్యాలయంలో ఎం.ఏ, ఎం.ఫిల్, మధురై కామరాజ్ విశ్వవిద్యాలయంలో పిహెచ్.డి లను పూర్తిచేశారు.12 యేండ్లు పాత్రికేయులుగా పనిచేసిన తరువాత 2000 నవంబరు 16న మద్రాసు విశ్వవిద్యా లయంలో తెలుగు లెక్చరర్‌గా చేరారు. దాదాపు 20 సంవత్సరాలు నిరంతరాయంగా కృషి చేసి అనేకమంది విద్యార్థులకు మార్గదర్శకులైయ్యారు. వీరి ఆధ్వర్యంలో మద్రాసు విశ్వవిద్యాలయంలోని తెలుగు శాఖ నిత్య శోభితంగా ప్రకాశించింది. మద్రాసు విశ్వవిద్యాలయంలో గురువర్యులు మాడభూషి సంపత్‌కుమార్‌గారంటే తెలియని వారుండరు. అందరితో ప్రేమగా, ఆప్యా యతతో పలకరించి అందరికి ఆప్తులుగా మారిన గొప్ప వ్యక్తి, అజాతశత్రువు మా గురువుగారు.

మాడభూషి కవిత్వం - సమకాలీనత :

సమాజహితమే సాహిత్య లక్ష్యమని సాగే వీరి కవిత్వం సమకాలీన సమాజ పరిస్థితులకు అద్దం పట్టేలా ఉం టుంది. మాడభూషి వారు స్వతహాగా శ్రీశ్రీ అభిమాని కావడం వల్ల గురువుగారి కవిత్వంలో అభ్యుదయవాదం చాలా చోట్ల కనబడుతుంటుంది. సమాజంలోని అసమా నతలను, అరాచాకాలను యథార్థంగా, ధైర్యంగా తెలియ జేశారు.

నేటి రైతు పరిస్థితి :

భారతదేశంలో వ్యవసాయం ప్రధానం. కానీ రైతులకు మాత్రం విలువ ఉండదు. పెద్ద పెద్ద మాల్స్‌లో బేరాలు ఆడకుండా వారు చెప్పిన ధరకు సరుకులు కొంటారు కానీ రైతుకు మాత్రం పెట్టిన పెట్టుబడి కూడా వెనుకకు రాదు. అందరికన్నా ఎక్కువ ధనవంతులుగా ఉండాల్సిన రైతు నేడు గిట్టుబాటు కాకుండా ఆత్మహత్యలు చేసు కుంటున్నారు. అందుకు మాడభూషివారు అంటారు.

కొనేవాడికి
అమ్మేవాడు లోకువ
దళారివాతపడ్డ రైతు!

ఇది నేటి రైతుల పరిస్థితి.

రైతులు విత్తనాలు, ఎరువులు కొనాలంటే అవి అందుబాటు ధరలో ఉండవు. కాబట్టి అప్పు చేయాల్సి వస్తుంది. కొన్ని సార్లు ప్రకృతి వైపరిత్యాల కారణంగా పంట నాశనం, మరికొన్ని సార్లు పంట బాగా పండినా కొనేవారు మంచి ధరకు కొనక నష్టంలో కుటుంబాన్ని పోషించాల్సిన పరిస్థితి. తినడానికి తిండిలేక బక్కచిక్కిపోయి, కడుపు వీపుకు అంటుకుపోయి, కళ్ళు గుంతలు పడిన శరీరంతో ఉన్న రైతులు నేడు కొక్కొల్లలు. అందుకే రైతు మనో వ్యధను ఇలా తెలియజేస్తారు

పస్తులతో చావాలా
ఆత్మహత్యలు చేసుకోవాలా
పాలుపోయిన రైతు!

అగ్గిపుల్లను రైతుతో సరిగ్గా పోలుస్తారు కవిగారు.

లోకానికి తిండిపెట్టి
కడుపుమాడి చనిపోయిన
రైతులా!

నిజమే తన కడుపు మాడ్చుకొని ఇతరుల కడుపు నింపుతుంటాడు రైతు. అతనికి పట్టెడన్నం పెట్టే దాత ఉండడు. కోట్లల్లో అప్పులు చేసి మోసం చేసి వేళ్లేవారిని ఈ ప్రభుత్వం ఏమి చేయలేదు కానీ వేలల్లో అప్పులు చేసి ప్రభుత్వానికి ఆసారాగా ఉన్న రైతు అప్పును మాత్రం ఋణమాఫీ చేయదు. దీనిని చాలా చక్కగా తెలియజేశారు మాడభూషిగారు

'అన్నం పెట్టిన చెయ్యి
అప్పుకోసం పడిగాపులు కాస్తోంది
వేలకొట్లు ఎగ్గొట్టిన వాడిముందు
మోకరిల్లుతున్న బ్యాంకులు'

దీనివల్ల ఆత్మహత్యలు ఎక్కువైయ్యాయి. చాలా మంది తమ సాగుభూములను అమ్ముకొనే పరిస్థితి. ఈ కల్తి ఆహారానికి అలవాటు పడిన మనం రైతును మరచి పోతున్నాం. రైతుకు సహాయపడని మనం కల్తీ ఆహారం తిని లక్షలు ఆసుపత్రులకు చెల్లిస్తున్నాం. అందుకే కవిగారు అంటారు.

నేను బురదలో
కాలుపెట్టకపోతే
నువ్వు బువ్వతో
చెయ్యిపెట్టలేవు!

వారిలో అనేకమంది ఆత్మహత్యలు చేసుకుంటున్నా, వారికి అందులో లాభం లేకపోయినా, వారు పస్తుండాల్సి వచ్చినా వారింకా వ్యవసాయాన్ని వదలకుండా భూమి తల్లిని నమ్ముకొని బ్రతుకుతున్నారు కాబట్టే మనం మూడు పూటల తినగలుగుతున్నాం. రైతు కథ అనేకమందికి ఇతివృత్తంగా మారిందే కానీ రైతు కష్టాలు మాత్రం మారలేదు.

రాజకీయాలు- ప్రజలు- నాయకులు :

పేరుకే ప్రజాస్వామ్య దేశం. కాని ప్రజలు పాలకులుగా ఉండరు. యథారాజా తథా ప్రజ అన్నట్లు ప్రజలు నేడు ఉన్నారు. పై అధికారి రూపాయి తీసుకుంటే అది చూసిన మిగిలిన వారు అర్ధరూపాయి అయిన తీసుకుంటాం అన్నట్లు ఉన్నారు. ప్రభుత్వం ఆమోదించిన నివారణలు, ఆర్థిక వనరులు ప్రజలకు చేరే లోపు మూట బియ్యం కాస్త ఒక్క మెతుకుగా మారిపోతుంది. అందుకే గురువుగారంటారు

ఆపులకు అన్నంలేదు
నాయకులు గడ్డితిన్నారు
లాలు గెలుపు!

ప్రజల కడుపులు కొట్టి తింటున్న ప్రజానాయకు లెందరో. దక్షణ ఇవ్వనిదే పూజారి వరమివ్వడనట్లు పైసా ముంటందే పైలుపై సంతకం పడదు, డబ్బు ఇవ్వందే పని జరగదు అన్నట్లు నేటి పరిస్థితి ఉంది.

దాతలు విరాళాలు కురిపించినా
నాయకులు చిల్లర రాల్చరు
తుఫాను బీభత్సం!

దాతలు లక్షలు, కోట్లు ప్రజల కొరకు, ప్రజల సహాయం కొరకు విరాళాలు ఇస్తుండడం హర్షదాయకం. కాని అవి ప్రజల యొద్దకు చేరడం లేదు ఎందుకో మరి. వరదలు, భూకంపాలు, ఈ కరోనా లాంటి పరిస్థితుల్లో ఇబ్బంది పడుతున్న మన తోటి వారిని చూస్తుంటే అర్థమౌతుంది వారికి సహాయం చేసేవారు లేక, చేసే సాయం వారి వరకు చేరక ప్రజలు ఎన్ని ఇబ్బందులు పడుతున్నారో అని. సాయం చేయకపోయినా పర్వాలేదు దాతలు చేసే సహాయం వారికి అందేలా చూడాలి.

ఎన్ని సార్లు కాటేసినా
పాము ఆరాధ్యదైవమే
ఓట్లెయ్యడానికి బారులు తీరిన జనం!

గొఱ్ఱె కసాయివాడిని నమ్మినట్లు ప్రజలు నాయ కులును నమ్ముతుంటారు. వారి కులమనో, వారి మతమనో లేక ఇంట్లో అందరు వేయమన్నారనో, లేక ఓటు వృథా అవుతుందనో ఓట్లు వేస్తుంటారు. ఆ ఓటు కున్న విలువను ఎవరు కూడా పట్టించుకోరు. ఒక్క

ఐడియా జీవితాన్ని మార్చినట్లు ఓటు కూడా పరిస్థితులను మార్చివేస్తుందని గమనించగలగాలి. రాబోయే తరానికి మంచి పాలకులను మనమే ఎంపికచేయాలి.

కోసేసిన ఆకుల్ని
అతికిస్తున్న మనిషి
చెట్లునాటే కార్యక్రమం!

వారే నరికి వారే మళ్ళీ చెట్లు నాటుతుంటారు నాయకులు. ఇది మెప్పుకోసం, తమ ఆక్రమణాలను కప్పి పుచ్చేందుకు వారెంచుకున్న మార్గాలు. వారే తప్పు చేస్తారు వారే సంతాపం తెలియజేస్తారు. వీరి సహాయం కోరడం కొరివితో నెత్తి గోకున్నట్లు ఉంటుంది.

అధికారం అశాశ్వతం
ప్రజాసేవే పరమార్థం
ఎన్నికలు దగ్గరపడ్డట్టుంది!

ఎన్నికలు దగ్గర కొచ్చాయంటే చాలు గొఱ్ఱెతోలు కప్పుకున్న తోడేళ్ళలా ప్రజలమధ్యకు వస్తారు పాలకులు. ప్రతీ పౌరుడి మనస్సులోని మాటను గురువుగారు ఈ కవిత ద్వారా బయటపెట్టారు.

చివరకు చెట్లకన్నా
జెండాకొమ్మలే ఎక్కువవుతాయి

నాయకుడికో పార్టీ! రోజుకొక పార్టీ పుట్టుకొస్తుంది, ఒక్క పార్టీయే మూడు నాలుగు పార్టీలుగా విడిపోతున్నాయి. అందుకే మాడభూషిగారు అలా అన్నట్లు ఉంది. మనిషికో పార్టీ పెడితే చివరకు చెట్ల కన్నా జెండాలే ఎక్కువగా ఉంటాయి.

సమకాలీన - సామాజికాంశాలు :

నేడు సమాజంలో ఉన్న, జరుగుతున్న వాటిని యథార్థంగా తెలుపగలిగేది సాహిత్యమే. భిన్న కవితోద్యమాలు వచ్చినా, అనేక ప్రక్రియలను ఆవిష్కరించినా అవి ప్రజలకు చేరాలనే ఉద్దేశంతోనే జరిగాయి. మాడ భూషివారి కవితలు ఇందుకు చక్కటి నిదర్శనాలు.

పల్లె పొమ్మంటుంది
పట్నం రమ్మంటుంది
పొట్టకోసం వలస!

ఇది పల్లెల నుండి జీవనం కోసం పట్టణాలకు వచ్చే పేదవారి జీవితాలను, అప్పుల బాధ భరించలేక పనికోసం వ్యవసాయాన్ని వదలి వచ్చిన రైతులను గురించి తెలిపే కవిత. ఈ కరోన వల్ల వలస కార్మికుల పరిస్థితి మరీ కష్టంగా మారింది. పనులు లేక, తినడానికి తిండి లేక, ఉండడానికి నీడ లేక, వలస కార్మీకులు పల్లెలకు వెళ్లలేక, పట్టణాలల్లో ఉండలేక అవస్థలు పడుతున్నారు.

స్త్రీ వాదం, స్త్రీ సమస్యలు, స్త్రీల విప్లవాలకు సంబంధించిన అనేక కవితలను మాడభూషివారు రచించారు. వీటిని చదువుతుంటే స్త్రీవాద రచయిత్రినే రాసి ఉంటుందన్నంత యథార్థంగా ఉన్నాయి. అందుకు ఈ చిన్న కవితే ఉదాహరణ.

అర్ధరాత్రి ఆడవాళ్ళ
ఒంటరి ప్రయాణమే అసలైన స్వాతంత్ర్యం
సామూహిక అత్యాచారం!

దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 74 సంవత్సరాలైంది కానీ స్త్రీకి భద్రత లేదు. నేడు పసిపిల్లలపై అత్యాచారాలు ఎక్కువైయ్యాయి. మగాళ్ల రూపంలో ఉన్న కొన్ని మృగాలు ఆడ అయితే చాలనట్టు క్రూరంగా వేటాడి చంపుతున్నాయి. ఇలాంటివి జరుగకుండా కఠిన నియమాలు అమలుపరచాలి. చిన్నప్పుడే మగపిల్లలకు ఆడవారిని గౌరవించడం నేర్పించాలి.

వ్యాపారంగా మారిన విద్యాబోధనను గురించి మాడ భూషి వారు లోతుగా ఆలోచించి వాస్తవాన్ని కళ్ళకు కట్టినట్లు చూపించారు.

"పుట్టుకతోనే పిల్లల
విద్యాభ్యాసం ప్రారంభం
'క్రష్' అయిపోతున్న బాల్యం!

ధనలాభమే ధ్యేయంగా పోటి తత్వంతో పిల్లలను

మానసిక ఒత్తిడికి లోనైయ్యేలా చేస్తున్న విద్యాసంస్థల సంఖ్య నేడు విస్తృతంగా పెరిగిపోయాయి. ఈ కరోనాలో ఇబ్బంది పడుతున్నా వారికి ఫీజులు పోతాయని ఆన్‌లైన్ తరగతులను మొదలుపెట్టారు. పిల్లల ఒత్తిడి, వారి ఇబ్బంది ఇప్పుడు తల్లిదండ్రులకు తెలిసేలా చేసింది ఈ కరోనా.

నిరక్ష్యరాస్యత
దేశానికి తలవంపులు
విస్తరిస్తున్న విద్యావ్యాపారం!

చదువుకున్న వారికన్నా చదువులేని వారే ఎక్కువగా సంపాదిస్తున్న కాలమిది. చదువుకున్నవారు తమ చదువుకు తగిన ఉద్యోగాలు దొరకగా, కూలి పనులు చేయలేక అనేకమంది నిరుద్యోలుగా మిగిపోతున్నారు, కొందరు మనస్సు చంపుకొని చదువు కోసం తమ తల్లి దండ్రులు చేసిన అప్పులను తీర్చడానికి రాజీపడి ఉద్యోగాలు చేస్తున్నారు. దీనికి ప్రధాన కారణం నాణ్యత లేని విద్య, భరించలేని ఫీజులు. దీనికి ప్రభుత్వమే సరియైన పరిష్కారాన్ని చూపించాలి.

ముగింపు :

రాత్రి నిద్రపోయే ముందు నెమరువేసుకొనేందుకు కొన్ని మంచి పనులు, నిద్ర లేచాక రోజంతా చేయడానికి ప్రణాళిక వేసుకొని జీవిస్తే అది ఉపయోగకరంగా ఉంటుంది. లేకపోతే ఆ జీవితమే వృథా అంటారు ఆచార్య మాడభూషి సంపత్‌కుమార్‌గారు. ఈ కవితకు వారే నిలువెత్తు నిదర్శనం. ప్రణాళికబద్ధమైన జీవితం, మంచి మనస్సుతో అందరి మంచిని కోరే సహృదయులు మాడభూషిగారు. మనిషి బాగుంటేనే సమాజం బాగుంటుంది. సమాజం బాగుంటేనే దేశం బాగుటుంది. ఇలాంటి పరిస్థితుల్లో అందరితో ఒకరిగా, మంచిగా, నిస్వార్థంతో, మానవత్వంతో జీవిద్దాం. ఇన్ని రోజులు వృథా చేసిన సమయాన్ని, సహాయాన్ని, సలహాలను అందరితో పంచుకొని జీవిద్దాం.

ఆధార గ్రంథాలు :

1. ఆలోచనలు- మాడభూషి సంపత్‌కుమార్
2. చివరకు నువ్వే గెలుస్తావ్- మాడభూషి సంపత్‌కుమార్
3. వికారి- మాడభూషి సంపత్‌కుమార్
4. మూడోమనిషి- మాడభూషి సంపత్‌కుమార్
5. శత్రువుతో ప్రయాణం- మాడభూషి సంపత్‌కుమార్

⌘⌘⌘

BHAVAVEENA
Vol. 17, Issue. 8, August 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

యన్. పూజిత ప్రేమకు పట్టాభిషేకం నవల – సమకాలీనత

– పి. జ్యోతి, పరిశోధక విద్యార్థి, తెలుగు శాఖ, మద్రాసు విశ్వవిద్యాలయం, చెన్నై.

ఆధునిక సాహిత్య ప్రక్రియలలో నవలకు ప్రత్యేకమైన స్థానం కలదు. నవల అనే మాటలోనే నవీనత్వం ఉంది. సాహిత్య ప్రక్రియలలన్నింటిలోను మానవ జీవన చిత్రణ ఉన్నప్పటికీ నవలలో కనిపించినంత విస్తృతంగా, వివరణాత్మకంగా మరె ప్రక్రియలోను కనిపించదు. 'వ్యక్తుల జీవితాన్ని ప్రధానంగా తీసికొని సామాజిక జీవితాన్ని స్ఫురింపజేసే సాహిత్య ప్రక్రియ నవల' అని ఆర్.యస్ సుదర్శనం గారు నవలను నిర్వచించారు. ఆధునిక యుగంలో నాగరికత పురోభివృద్ధి చెందడం, శాస్త్ర సాంకేతిక రంగాలలో అభివృద్ధి సాధించడం వలన మానవ జీవన విధానంలో కూడా మార్పులు వచ్చాయి. అనాటి సమాజంలోని ప్రజలు జీవన శైలిలో పాటించినటువంటి పద్ధతులు, అలవాట్లు, ఆచారావ్యవహారాలు ప్రస్తుత జీవన విధానంలో లేవు. మనంఉన్నతమైన స్థానంలో ఉన్నప్పటికి మన సంస్కృతి సాంద్రాయాలను, విలువలను మరిచి పోకూడదని, చేసే పనులలో ఏకాగ్రత ఉండాలని మరియు సమాజాన్ని ప్రభావితం చేస్తున్నటువంటి మూఢ నమ్మకాలు, వర్ణవ్యవస్థను గురించి వారి నవలలో తెలియజేశారు రచయిత్రి యన్.పూజిత. ఈ నవల మొదట ఆంధ్రభూమి దినపత్రికలో సీరియల్‌గా వచ్చింది ఆతరువాత సాహితి ప్రచురణ వారు జనవరి 2013 పుస్తకంగా ప్రచురించారు.

ప్రేమకు పట్టాభిషేకం నవల - ఇతివృత్తం :

మానసిక వైద్య నిపుణుడైనా డాక్టర్ నాగార్జున అమెరికాలో జరుగుతునటువంటి మానసిక రోగులకు సంబంధించిన కాన్ఫరెన్స్‌లో పాల్గొనడానికి ఇండియా తరపున అమెరికాకు వెళ్ళతాడు. సమావేశంలో చక్కగా ప్రసంగించి గ్రేట్ ఇండియా అని అందరి దగ్గర ప్రశంసలు పొందుతాడు. సమావేశం ముగిసిన తరువాత అమెరికాలోనే స్థిరపడినటువంటి వాళ్ళ అన్నయ్య అరవింద్ ఇంటికి వెళ్ళతాడు. ఇంటిలో వాళ్ల వదిన అమెరికాలో నివసిస్తూన్నప్పటికి మన దేశ సాంప్రదాయాలు, పద్ధతులు పాటించడం మరియు వాళ్ల అబ్బాయి స్వీటీ చక్కగా తెలుగులో మాట్లాడడం చూసి ఆశ్చర్యపోతాడు. అన్నయ్య మీరు గొప్ప స్థానంలో ఉన్నప్పటికి మనదేశ ఆచారావ్యవహారాలను పాటిస్తున్నటువంటి మిమ్మల్ని చూస్తే చాలా గర్వంగా ఉంది అని అంటాడు నాగార్జున.

సాఫ్టవేర్ ఉద్యోగం చేస్తున్న గీతిక కంపెనీ ప్రాజెక్ట్ పని మీద అమెరికాకు వస్తుంది, అక్కడే ఉద్యోగం చేస్తున్నటువంటి ఆమె స్నేహితురాళ్లు రాధ, రేణుక వచ్చి గీతికను రిసీవ్ చేసుకొని వాళ్ళు ఉంటున్న అపార్ట్ మెంటుకు తీసుకొని వెళ్ళుతారు. మరుసటి రోజు వాళ్లు ఇద్దరు గీతికకు అమెరికాలోని సందర్శన ప్రదేశాలకు తీసుకొని వెళ్ళుతారు. అక్కడ వాళ్ళకు డాక్టరు నాగార్జున మరియు అతని వదినతో పరిచయం ఏర్పడుతుంది, అందరూ తెలుగు వాళ్ళు కావడంతో కొంత సమయంలోనే బాగా కలిసిపోతారు. నాగార్జున మరియు గీతిక వాళ్ళ పని ముగించుకొని తిరిగి ఇద్దరూ ఇండియాకు వచ్చేస్తారు.

గీతిక తల్లిదండ్రులు ఆమె సాధించినటువంటి విజయానికి సంతోషించి ఆమెను అభినందిస్తారు. నాగార్జున, గీతికను ఇష్టపడుతాడు అవిషయం ఇంట్లో వాళ్ళకి చెప్పి పెళ్ళికి ఒప్పిస్తాడు. ఇరు కుటుంబాల వాళ్లు వారి పెళ్లికి అంగీకరిస్తారు. గీతిక తండ్రి పనిచేస్తున్న కంపెనీ యజమాని కూతురు అయిన ప్రీతి వివాహానికి గీతిక, ఆమె తల్లిదండ్రులు వెళ్ళుతారు. కొద్దిపాటి సమయంలోనే ప్రీతి, గీతిక మంచి స్నేహితులు అవుతారు. ప్రీతిని తీసుకొనివచ్చి పీటల మీద కూర్చొపెడుతారు, పెళ్ళితంతు జరుగుతున్నటువంటి సమయంలో

అగ్ని హోమంలోని మంటలు చూసిన ప్రీతి, తనకు ఈ పెళ్ళి వద్దు ఆపండి అని గట్టిగా అరచి కళ్ళు తిరిగి పడిపోతుంది. పెళ్ళికి వచ్చినవారంతా ప్రీతికి ఏమైయిదో అనుకొని తిరిగివెళ్ళి పోతారు. ప్రీతి తండ్రి డాక్టర్‌ని పిలిపిస్తాడు, డాక్టర్ ఇన్‌జెక్షన్ వేసిన కొంతసేపటికి ప్రీతికి మెళకువ వస్తుంది, ఆమె గట్టిగా అరుస్తూ నన్ను వెళ్ళ నివ్వండి అని పెద్దగా కేకలు పెడుతుంది. ఆమె మానసిక పరిస్థితి బాగాలేదని మంచి సైక్రియాటిస్టుకు చూపించండి అని డాక్టర్ చెబుతాడు.

గీతిక, ప్రీతి విషయం గురించి నాగార్జునకి చెబుతుంది. ప్రీతికి ట్రీట్‌మెంట్ చేయడానికి వాళ్ళ ఇంటికి వెళ్ళుతాడు నాగార్జున. ఎవ్వరిని తన గదిలోకి రానివ్వని కిపీతి, నాగార్జునని చూసి కృష్ణ అని పిలిచి, నేను నీరాధను అంటుంది. మనమిద్దరం గతజన్మలో ప్రేమించుకున్నాము, మన ప్రేమను అంగీకరించని పెద్దలు మనల్ని సజీవదహనం చేశారని చెబుతుంది. ప్రీతి మానసిక స్థితి బాగాలేదని అర్థంచేసుకున్న నాగార్జున ఆమె మాటలను నమ్మినట్టుగా నటిస్తాడు. ఒకరోజు ప్రీతి గతజన్మలో వాళ్ళు నివసించినటువంటి గ్రామానికి నాగార్జునని తీసుకొని వెళ్ళుతుంది. వారిని చూసిన ఆ గ్రామస్తులందరు రాధాకృష్ణలు వచ్చారు అని అంటారు. ప్రీతి అనగా రాధ, నాగార్జునని గతజన్మలోని ఆమెకు అన్నయ్య అయిన రంగయ్య ఇంటికి తీసుకొనివెళ్ళుతుంది. రాధను చూసిన ఆమె అన్నయ్య సంతోషపడుతాడు, ప్రీతి చెప్పిన విధంగానే అతనికి ఒక కాలు ఉండదు, ఆ తరువాత ప్రీతి, గతజన్మలోని నాగార్జున అనగా కృష్ణ ఇంటికి తీసుకొని వెళ్ళుతుంది, అక్కడ తన ఫోటో చూసిన నాగార్జున ఆశ్చర్యానికి గురివుతాడు. ప్రీతి చెప్పినవన్ని నిజాలు అని నమ్ముతాడు, కాని తను ఈజన్మలో వేరొకరి బిడ్డనని మరియు గీతికకు కాబోయే భర్తను అని అనుకొని, ప్రీతికి ట్రీట్‌మెంట్ చేసి మాములు స్థితికి తీసుకొని వస్తాడు.

నాగార్జునని, ప్రీతి ఇష్టపడుతుంది కనీసం ఈ జన్మలోనైనా నాగార్జునతో కలిసి జీవించాలని అనుకుంటుంది. కాని అప్పటికే గీతికకు, నాగార్జునకి నిశ్చితార్థం అయిందని తెలుసుకొని బాధపడుతుంది. ప్రీతి దగ్గరుండి గీతిక మరియు నాగార్జున పెళ్ళి జరిపిస్తుంది. గీతిక మేనత్త కొడుకు తనకు గీతిక దక్కలేదనే కోపంతో పెళ్ళి జరుగుతున్న సమయంలో గీతికను గన్‌తో కాలుస్తాడు. గీతికను కాపాడబోయిన ప్రీతికి బుల్లెట్ తగులుతంది ఆమెను అందరూ కలిసి హాస్పిటల్‌కి తీసుకొని వెళ్ళుతారు అంతటితో ఈనవల ముగుస్తుంది.

సమకాలీన అంశాలు సాంప్రదాయాలు :

గీతిక తన స్నేహితురాళ్లు అయిన రాధ, రేణుకతో మీరిద్దరూ ఇక్కడ ఎవరినైనా పెళ్ళి చేసుకొని,ఇక్కడే సెటిల్ అవ్వాలని అనుకుంటున్నారా అని అడుగుతుంది. అందుకు వాళ్ళు గీతికతో ఇలా అంటారు. 'ఒకనాడు స్త్రీలని గడపదాటనిచ్చేవారు కాదు కాని ఈనాడు అన్ని రంగాల్లో, అన్నిదేశాలలో, అన్ని విభాగాలలో స్త్రీ ముందంజలోనే ఉంది. కానీ మన మీద నమ్మకంతో అమ్మనాన్నలు మనల్ని ఇంతదూరం పంపించారు. వారి నమ్మకాన్ని వమ్ముచేయటం సబబు కాదు అని మా అంత రంగంలో ఉంది, అందుకే ఎంతమంది స్నేహానికి చేయి అందించినా మేము ముందుకు పోలేదు. ఎక్కడకి వెళ్లినా మన సాంప్రదాయాలను,మన పద్ధతుల్ని పాటించాలనేదే మాఅభిప్రాయం, మాఇద్దరి ధ్యేయం అని అంటారు'. అందుకు గీతిక వివాహ వ్యవస్థలో ఎన్నో కుటుంబాలు కలహాలకాపురాలు అవుతున్నాయి. కాని మీరింత హోదాలో ఉండి ఎంతోఅవకాశం వున్నా మీపెద్దల మాటకు విలువ ఇవ్వటం హర్షించదగ్గ విషయం అని తన స్నేహితురాళ్లను మెచ్చుకొంటుంది. మనం గొప్ప గొప్ప చదువులు చదువుకొని ఉన్నతమైనా స్థానంలో ఉన్నప్పటికీ మన సాంప్రదాయలను. విలువలను మరిచిపోకూడదని రచయిత్రి తెలియజేశారు.

ఆత్మస్థైర్యం :

గీతిక కంపెనీ ప్రాజెక్టును సమకూర్చి మంచి పేరు ప్రతిష్టలు సంపాదించినందుకు ఆమె తల్లిదండ్రులు

మెచ్చుకుంటారు. 'ఆడవాళ్లమి మేము అనుకన్నప్పుడే... ఆడవాళ్లు. ఆత్మస్థైర్యంతో అన్ని సాధించినప్పుడు గొప్ప వాళ్లు అవుతారు అన్ని విషయాల్లో విజయం సాధిస్తారు అని గీతికను ప్రోత్సాహిస్తారు ఆమె తండ్రి. పట్టుదల, సాధించాలనే తపన, కృషి కలిగిన ఆడవాళ్లు అన్ని పనులలో విజయం సాధిస్తారు అని రచయిత్రి తెలిపారు.

అగ్రవర్ణాలా ఆధిపత్యం :

గ్రామంలో పెద్ద ఆసామి రాయుడు, ఆ గ్రామంలో ఆయన మాటే వేదవాక్కుగా ఉండేది. రాయుడు కొడుకు కృష్ణ మెడిసిన్ చదువుతుంటాడు. రాయుడు దగ్గర పనిచేసే రంగయ్య చెల్లెలు రాధ. ఆమె కూడా మెడిసన్ చదువు కుంటుంది. ఆవిషయం తెలునుకున్న రాయుడు, రంగయ్యను పిలిపించి ఈ ఊరిలో నా కొడుకు మాత్రమే డాక్టర్ కావాలి ఇంకెవ్వరు కాకుడదు నీ చెల్లెలను మెడిసిన్ చదవిచటం ఆపేయాలి అంటాడు. అందుకు రంగయ్య నాచెల్లెల్ని నాకష్టార్జితంతో చదివించుకుంటున్నాను కాబట్టి నేను నా చెల్లెలను చదువుమాన్పించను 'ఈ దేశంలో ఎవరికైనా చదువుకొనే హక్కు వుంది ఎవరైనా చదువు కోవచ్చు 'అని రంగయ్య ఎదురు సమాధానం చెబుతాడు. ఈ దేశంలో చదువుకొనే హక్కు ఉంది.. కాని ఈ ఊరిలో లేదు అంతా నాఇష్టం నేను చెప్పినట్టు వినాలి అని దౌర్జన్యం చేస్తాడు రాయుడు.

అంతేకాకుండా రంగయ్యను పనిలోనుంచి తీసేస్తాడు. తన మాట రంగయ్య వినలేదని రాయుడు మనుషులను పెట్టి కొట్టిస్తాడు ఆ తగదాల్లో రంగయ్య కాలు ఒకటి పోతుంది.అయినా కూడా రంగయ్య తన చెల్లెలు రాధను చదువు మాన్పించకుండా తన పొలంలో వ్యవసాయం చేస్తూ చదివిస్తాడు. తక్కువ కులం వారు పెద్ద చదువులు చదువుకోకూడదు ఒకవేళా చదువుకుంటే ఉన్నత వర్గంకు చెందినవారు వాళ్లను ఏవిధంగా కష్టపెడుతారనే విషయా లను తెలియజేశారు రచయిత్రి

మూఢనమ్మకాలు :

ప్రీతి పెళ్ళికి వెళ్ళడానికి బయలుదేరుతారు గీతిక, ఆమె తల్లిదండ్రులు. అయితే మంచి శకునం జరగలేదని బాధపడుతుంటుంది గీతిక తల్లి వేదవతి. మనం కొంచెం సేపు ఆగి వెళ్ళదామని చెప్పి కూర్చోమంటుంది.

ఈ రోజులో ఈ మూఢనమ్మకాలు ఏమిటి అని ఆమె భర్త అడిగినప్పటికి, ఆమె మాటను కాదనలేక ఇద్దరు కూడా కూర్చుంటారు. పదే పదే టైమ్ చూసుకుంటున్నటు వంటి భర్తను గమనించిన వేదవతి పూజ గదిలోకి వెళ్ళి బొట్టు పెట్టుకొని, గీతికను పిలిచి విభూది పెడుతుంది తరువాత పెళ్ళికి బయలుదేరి వెళ్ళుతారు. ప్రస్తుతం సమాజంలో అందరూ కూడా శకునం చూసుకొని పను లను ప్రారంభిస్తున్నారు. ఆ రోజు తిది బాగాలేకపోతే ఎంత ముఖ్యమైన పనైనా వాయిదా వేసుకుంటున్నారు. రోజురోజుకి టెక్నాలజీ అభివృద్ధి చెందుతున్నప్పటికి తిదులు, శకునాలు నమ్మటంపై నిజమెంత అనేది ప్రజలలో అవగాన కలగటం లేదని రచయిత్రి తెలిపారు.

కులహత్యలు :

రాయుడు కొడుకైనా కృష్ణ, వాళ్ళ ఇంటిలో పని చేస్తున్న తక్కువ వర్గనికి చెందిన రంగయ్య చెల్లెలు రాధ ఒకే కాలేజీలో మెడిసిన్ చదువుతుంటారు. ఇద్దరు ఒకే ఊరుకి చెందిన వారు కావడంతో వారి మధ్య స్నేహం, ప్రేమగా మారుతుంది. ఈవిషయం తెలుసుకున్న రాయుడు ఈరోజు స్నేహం అంటారు, రేపు ప్రేమ, పెళ్ళి అంటారు అని, రంగయ్య కుటుంబాన్ని మొత్తాన్ని సజీవదహనం చేయమని తన దగ్గర పనిచేస్తున్న పాలెరులకు చెప్పి పంపుతాడు. ఆమాటలను విన్న కృష్ణ (నాగార్జున) రాధ (ప్రీతి) కుటుంబాన్ని కాపాడాలని వెళ్ళుతాడు అప్పటికే రంగయ్య ఇల్లు నగం కాలిపోయివుంటుంది. కృష్ణ రంగయ్య కుటుంబంలోని అందరిని కాపాడుతాడు కాని రాధాను కాపాడడానికి లోపలకు వెళ్ళిన కృష్ణ మంటలలో చిక్కుకుంటాడు, ఇద్దరూ ఆ మంటలలోనే సజీవ దహనం అయిపోతారు. సమాజంలో ఒక కులంకు చెందినవారు వేరొక కులంకు చెందిన వారిని ప్రేమిస్తే

వారి ప్రేమను అంగీకరించని పెద్దలు వాళ్ళ జీవితాలను మధ్యలోనే ముగించేస్తున్నారు. దేశం అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతూ కొత్త అలవాట్లను, పద్ధతులను అలవరుచుకుంటునప్పటికి సమాజంలోని వర్ణవ్యవస్థను మాత్రం అంతంచేయలేకపోతున్నారు అందువలనే నేటి సమాజంలో కులానికి సంబంధించిన మరణాలు ఎక్కువగా జరుగుతున్నాయని రచయిత్రి తెలియజేశారు.

మన దేశంలో భిన్న సంస్కృతులు, సాంప్రదాయాలు ఉన్నాయి. కాని ప్రస్తుతం మన దేశ సాంప్రదాయాలు, పద్ధతులు, ఆచారావ్యవహారాలు అన్ని కూడా ఒక్కొక్కటిగా మాయమైపోతున్నాయి. మనం ఉన్నత చదువులు చదువుకొని ఉన్నతమైన స్థానంలో ఉన్నప్పటికి మన సాంప్రదాయాలను, విలులను మరిచిపోకూడదని మరియు చేసే పనిలో ఏకాగ్రత ఉంటే ఆపనిలో ఆడ, మగ అనే తేడా లేకుండా అందులో విజయం సాధించ గలుగుతారని చెప్పారు. టెక్నాలజీ అభివృద్ధి సాధిస్తున్నప్ప టికి సమాజంలో మూఢనమ్మకాలపై నమ్మకం తగ్గడం లేదని, కులం సమాజాన్ని ఏవిధంగా ప్రభావితం చేస్తుం దనే విషయాలను తెలిపారు. సమాజానికి సంబం ధించిన మరెన్నో అంశాలను వారి నవలలో తెలియజేశారు రచ యిత్రి యన్.పూజిత. ఇలాంటి మరెన్నో నవలలు వారి కలం నుండి రావాలని కోరుకుంటున్నాను.

ఉపయుక్త గ్రంథాలు :

1. తెలుగు నవల - సమకాలీనత - ఆర్. యస్. సుదర్శనం
2. ప్రేమకు పట్టాభిషేకం నవల - యన్. పూజిత

⌘⌘⌘

BHAVAVEENA
Vol. 17, Issue. 8, August 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

అత్యాధునిక సాహిత్య ధోరణులు – సమకాలీనత

– డా॥. పి. కాళియప్ప , చెన్నై.

వేల సంవత్సరాల చరిత్ర కలిగిన తెలుగు సాహిత్యం ఎంతో సుసంపన్నమైంది. ఒక సాహిత్య ప్రక్రియ లేదా సాహిత్య పరికరాన్ని పాఠకునికి ఒక నిర్దిష్ట ప్రభావాన్ని అందించటానికి సాహిత్య రచనలో ఉపయోగిస్తారు. సమకాలీనత పాఠకుడిలో ఉత్సుకతను రేపుతుంది. రచయిత దృక్పథం, శైలి, సమర్థత సమకాలీన వస్తువుని మంచి సాహిత్యంగా మలచవచ్చు. ఆ సాహిత్యం గొప్ప సాహిత్యం కావాలన్నా, నాలుగు కాలాలు నిలవాలన్నా అందులో సార్వజనీనత, సార్వకాలికత కూడా ఉండాల్సిందే. సమకాలీన దృష్టి కోణం కలిగిన సాహిత్యం సమకాలీనత అని పించుకుంటుంది. సమకాలంలోని సాంఘిక, రాజకీయ, ఆర్థిక, ప్రాకృతిక ఘటనలు కవిత్వంలో ప్రతిబింబిస్తే దాన్ని సాహిత్యంలో సమకాలినత అనవచ్చు. కాని ఒక కావ్యంలో తీసుకున్న వస్తువును (ఇతివృత్తం) సమకాలీనత అనవచ్చు. కానీ సమకాలీన ఘటనల్ని తీసుకొని దాన్ని కవిత్వంలోకి మలిచినపుడు సమకాలిక ప్రబల కవితా ప్రక్రియలో చెప్పిన కొన్ని విషయాలను బట్టి కవిత్వాన్ని సమకాలిక కవిత్వం అని ఖచ్చితంగా చెప్పలేం. ఈ క్రమంలో అత్యాధునిక సాహిత్య ధోరణుల గురించి చర్చించడమే ఈ వ్యాస ముఖ్య ఉద్దేశం.

అత్యాధునిక సాహిత్యం - పరిచయం :

సామాజిక వ్యవస్థ ఎలా మారితే దానికి అనుగుణంగా సాహిత్యం కూడా పరిణామం చెందుతుంది. రచయిత సృష్టించే సాహిత్యం కూడా సమాజ పరిణామంలో భాగమై ఉంటుంది. సాహిత్యం అనేది శాశ్వతంగా ఒకే కోణంలో ప్రయాణం సాగిస్తుంది అనుకొంటే పొరపాటే అవుతుంది. కాలం మారేకొద్ది, ప్రజల జీవన విధానానికి అనుగుణంగా, వారి ఆలోచనలకు అనుగుణంగా వస్తువుతో పాటు సాహిత్యం తన దారిని మార్చుకుంటూ నూతనమైన రూపును సంతరించుకుంటూ, ప్రయాణం సాగిస్తుంది. అత్యాధునిక కాలాన్ని గమనిస్తే సమకాలీనత, శాస్త్రీయత, హేతుబద్ధత వంటివి అత్యాధునిక లక్షణాలుగా గుర్తించ వచ్చు. ఈ లక్షణాలు కలిగిన వస్తువును ఆవిష్కరించడానికి ఇతర ప్రక్రియలకంటే వచన కవితా ప్రక్రియలే ఎక్కువ అనుకూలమైందిగా కవులు గుర్తిస్తుండాన్ని ఇక్కడ ప్రధానంగా చెప్పుకోవాల్సిన అంశం. పద్య ప్రక్రియతో పోల్చినప్పుడు వర్తమానంలో వచన కవితే ఎక్కువగా కన్పిస్తుంది. అందుకు కారణాన్ని గమనిస్తే నేటి కవిత అన్నదానికి 'వచన కవిత' పర్యాయపదంగా ఇంచు మించుగా రూఢి అయింది.

ఒక నాడు సార్వకాలికం, సార్వజనీనం అనే భావాలు సాహిత్యంలో బలంగా ఉండేవి. ఆ భావనలు పోయి ప్రాంతీయత, సమకాలీనత అనే వాటికి ప్రాధాన్యత వచ్చింది. ఆధునిక సాహిత్య ఉద్యమాలు కేవలం స్థూల దృష్టితో సమస్తాన్ని చూడడంతో 'ఐడెంటిటీ' అనే సూక్ష్మ దృష్టితో చూడడం అత్యాధునిక సాహిత్య ఉద్యమ లక్ష్యంగా చెప్పవచ్చు. ఇంకా చెప్పాలంటే తెలుగు సాహిత్యంలో ఆధునికత్వం మీద మొదటి శంఖారావం, అత్యాధునికత జీవన సందర్భానికి తొలి సాక్ష్యాలు - దిగంబర కవిత, నక్సల్బరి(విప్లవ) తరం కవితలే.

విప్లవ కవులు 'పదండి', 'పోరాడండి' సరళిలో కవిత్వం రాసిన సందర్భాలున్నాయి. కాని అవి చాలా తక్కువే. వారు ఎంచుకున్న మార్గానికి ఒక చట్రం ఉంది. ఆ తరువాత రాను రాను దైనందిన జీవితంలోంచి ఉత్పన్నమయ్యే 'ఐడెంటిటీ' ప్రముఖంగా చోటుచేసుకుంది. ఈ దశలో విప్లవ కవులు కొందరు చట్రాన్ని వదిలించుకుని తమకు తాము మిగలడానికి తెగించారు. అలా తెగించిన వారు మూగబోయారు. ఈ తరానికి స్వాభావికం కాదనడానికి

ఈ పరిణామం ప్రబల సంకేతం. తమకు తాము మిగలడానికి తెగించినవారు అదే 'ఐడెంటిటీ పోయెటిక్స్'ను కొనసాగించారు. మరింత నిర్దిష్టమయ్యారు. ఈ క్రమంలోనే తరువాత పెల్లుబికిన గుర్తింపు ఉద్యమాలకు వారు సహజ మిత్రులైయ్యారు. తమ సుఖదుఃఖాలు కూడా ఐడెంటిటీకి సంబంధించినవేనని విస్పష్టంగా ప్రకటించుకున్నారు. ఉదాహరణకు గమనిస్తే తాను దళితుడు, ముస్లిం, నేను స్త్రీ, స్త్రీ కాకపోయినా, తనకూ ఒక నిర్దిష్టమైన అస్తిత్వం చోటుచేసుకుంది.

ఈ క్రమంలో ప్రపంచవ్యాప్తంగా సంభవించిన మార్పుల నేపథ్యంలో నుంచి వచ్చిన అత్యాధునికతకు ముందు తెలుగు సమాజంలో నిర్ధిష్టంగా ప్రచారమైన సాహితీ తాత్విక సిద్ధాంతం మార్క్సిజం మాత్రమే. అత్యాధునికత వెలుగులో దళిత, స్త్రీవాద ఉద్యమాల నుంచి వచ్చిన విమర్శ మార్క్సిస్టు సిద్ధాంతాన్ని సంక్షోభంలో పడేసింది. ఈ క్రమాన్ని దృష్టిలో పెట్టుకొని సమకాలీన తెలుగు సాహిత్యాన్ని గమనిస్తే, సాహిత్యం కాలంతో పాటు నిరంతరం పయనిస్తూ ఉంటుంది. అందులో భాగంగా రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక రంగాలలో అనేక మార్పులు జరుగుతూ ఉంటాయి. దీని ప్రభావం కవితా ప్రక్రియల మీద కూడా ఉంటుంది. కవి స్వీకరించిన వస్తువులోనూ, ఎంపిక చేసుకొన్న శ్రోతలోనూ మార్పు వచ్చినప్పుడు భావాభివ్యక్తికి కొన్ని సందర్భాలలో వాడుకలో ఉన్న పదజాలం, వర్తమానంలో ఉన్న కవితాప్రక్రియలకు అనుగుణంగా ఉండకపోవచ్చు. అలాంటప్పుడు అందకు అనుగుణంగా భాషలో నూతన పదాలను పరికల్పన చేసుకుంటాడు. ప్రక్రియాపరమైన ప్రయోగాలకు పూనుకుంటాడు. ఆధునిక కవులలోని అనివార్యమైన ఈ ప్రయోగాల మూలంగానే వచన కవితలోనూ ఈనాడు అనేక రూపాలు కన్పిస్తున్నాయి. ఇలా నేడు మనకు తారసపడే కవితా ప్రక్రియలను గమనిస్తే దీర్ఘకవిత, మినీ కవిత వంటి అనేక కవితా ప్రక్రియలు వచన కవితలో వచ్చిన నూతన ఆవిష్కరణలుగా చెప్పవచ్చు. అత్యాధునిక సాహిత్యంలో వీటి సంఖ్య నిరంతరం కాలానుగుణంగా పెరుగుతూనే ఉంది.

అత్యాధునిక సాహిత్య ధోరణులు - సమకాలీనత:

కాలమార్పుతోపాటు సాహిత్య ప్రక్రియా రూపాలు కూడా మారిపోతుంటాయి. ప్రాచీనం పద్యానికి పట్టం కట్టింది. ఆధునికత వచనాన్ని అందలం ఎక్కించింది. ఈ పరిణామమే తర్వాతి కాలంలో సాహిత్యంలో గుణాత్మకమైన మార్పు ఏర్పడడానికి కారణమైందని స్పష్టంగా చెప్పవచ్చు. దాన్నే మనం అత్యాధునిక సాహిత్యం అనవచ్చు. అత్యాధునికతకు బీజం 1965 మేలో ప్రారంభమైన దిగంబర కవిత్వం. ఇదే తెలుగులో అత్యాధునిక సాహిత్యానికి ప్రారంభదశగా మనం గుర్తించవచ్చు. తెలుగు సాహిత్యంలో దిగంబర కవిత్వం ఒక గొప్ప మలుపుకి కారణమైందని నిస్సందేహంగా చెప్పుకోవచ్చు. జనం మధ్యలో సంచలనాత్మకంగా చదువుతూ కవిత్వాన్ని ఒక ప్రదర్శనగా నిర్వహించడం దిగంబర కవిత్వం సాధించిన మొట్టమొదటి విజయం. "దిగంబర కవిత్వం ఆధునికానంతర కవిత్వానికి తాత్త్విక మూలాన్ని అందిస్తోందన్నది నా ప్రతిపాదన" అంటారు సుమనశ్రీ.

1990లో కవి అఫ్సర్ రాసిన వ్యాసాలు 'ఆధునికత - అత్యాధునికత'తో ఒక సంపుటిగా వెలువడ్డాయి. ఈ పుస్తకంతో ఒక రకంగా అఫ్సర్ తెలుగులో అత్యాధునికత విమర్శకు ఒక రకంగా తెరతీసినట్లయ్యింది. అఫ్సర్ రాసిన ఈ పుస్తకాన్ని ఆధునిక - అత్యాధునిక సాహిత్యాల మధ్య ఒక విభజన రేఖను సూచించినట్లుగా భావించవచ్చు.

అత్యాధునిక సాహిత్యంలో కవులు నిరంతరం ప్రయోగశీలిగా, తమ బలాన్ని చాటుకోవడం మనకు స్పష్టంగా కనపడుతుంది. ఈ క్రమంలో అత్యాధునిక దశను మరీ ముఖ్యంగా గమనిస్తే కవిత్వంలో దీర్ఘకవితలు ప్రారంభం కావడాన్ని గమనించవచ్చు. బైరాగి నూతిలో గొంతుకలు, ఆరుద్ర సినీవాలి, శివారెడ్డి ఆసుపత్రి గీతం, నగ్నముని కొయ్యగుర్రం, వరవరరావు సముద్రం, శేషేంద్ర నా దేశం నా ప్రజలు, సి.నా.రె. విశ్వంభర, మట్టీ మనిషి ఆకాశం,

ఎన్.గోపి జలగీతం, శ్రీకాంతశర్మ సుపర్ణ, అలా ఇప్పటి కవులను గమనిస్తే పైడి తెరేష్‌బాబు హిందూ మహా సముద్రం, విస్తాలి శంకరరావు నా ఊరు, జి.వి. రత్నాకర్ అట్లేటి అల మొదలైనవి. ప్రతి కవీ తనదైన స్థానం కోసం కృషి చేయడం ప్రస్ఫుటంగా కన్పిస్తుంది దీనినిబట్టి. ఇలాంటిదే ఒక ధోరణిని వేగుంట మోహనప్రసాద్ తెలుగు సాహిత్యంలో చప్పుడు లేకుండా ప్రవేశపెట్టారు. ఈ ధోరణిని కొనసాగిస్తున్న కవులు వేగుంట మోహన ప్రసాద్, అఫ్సర్, సీతారాం, ప్రసేన్, సిద్ధార్థ, ఎమ్.ఎస్.నాయుడు, పుటిపాటి గురుస్వామి, సైదాచారి లాంటి వారి కవితల్లో అత్యాధునిక కవికి ముందుగానే చెప్పినట్లు తన అస్తిత్వం గురించిన వేదనతో పాటు సమాజం గురించిన ధ్యాస కన్పిస్తుంది.

నవీనత మొత్తం కవిత్వాన్ని నాలుగు పాదాలుగా కుదించి వివిధ శీర్షికలతో వెలువడే అవకాశం కల్పించింది. ఏది ఏమైనా కాలం ఒడిలో మొగ్గ తొడుగుతున్న కొత్త కొత్త ప్రక్రియలతో, సంవిధానాలతో, నవీన వస్తు పరిగ్రహణతో సాహిత్యం మమేకమై సామాజిక రుగ్మతల లోతుపాతుల్ని భావదాస్యంతో మనం మనం కాకుండా పోతున్న సందర్భాల్ని, రహస్యపు నడకల్ని, పసిగట్టాలంటే సాహిత్యాన్ని కొత్త కొలమానాలతో సమాజాన్ని కొలవాల్సి ఉంటుంది.

కావ్యమన్నా, కవిత్వమన్నా ఒకనాడు తెలుగువారికి స్ఫురించేది పద్యమే. 'పద్యం'లో ఉంటేనే దాన్ని కవిత్వంగా పరిగణించేవారు. పద్యానికి అనేక ఛందోనియమాలు ఉంటాయి. పాశ్చాత్య, సాహిత్య సంపర్కం మూలంగా తెలుగు కవులు కూడా ఆధునిక స్ఫూర్తిని పొందడం ప్రారంభమైంది. ఈ క్రమంలో అత్యాధునిక సాహిత్యాన్ని గమనిస్తే వచన కవిత ప్రక్రియ పూర్తిగా ఆధునికమైంది. దీనికి భారతీయ సంస్కృత సాహిత్యంతోగానీ, ప్రాచీన తెలుగు సాహిత్యంతోగానీ ఏ విధమైన సంబంధం లేదు. భావగణాల విషయంలోనే కాదు, స్థూలంగా వచన కవిత్వానికి నియమితమైన లక్షణాలంటూ ఏమీ ఉండవు. ఏమీ ఉండకుండా ఉండటమే వచన కవిత్వ లక్షణం. రచనలో ఇంతటి స్వేచ్ఛ ఉంది కాబట్టే వచన కవిత్వంపై ఎన్నో ప్రయోగాలు జరిగాయి. ఈనాటికీ జరుగుతున్నాయి.

ఇటీవలి కాలంలో ఎక్కువగా వెలువడుతున్న వచన కవితా ప్రక్రియ దీర్ఘకవిత. ఆంగ్లంలోని 'లాంగ్ పోయమ్' అనే మాటకు సమానార్థకంగా తెలుగులో దీర్ఘకవిత అని వ్యవహరిస్తున్నాం. వచన కవితలాగే దీర్ఘకవితకు కూడా పునాదులు ఆంగ్లసాహిత్యంలోనే ఉన్నాయి. వచన కవిత మీద జరగిన ప్రయోగ ఫలితంగా వచ్చినదే దీర్ఘకవిత అని చెప్పవచ్చు. కుందుర్తి 'తెలంగాణ', నగ్నముని 'కొయ్యగుర్రం', శేషేంద్ర 'నా దేశం నా ప్రజలు' సి.నారాయణ రెడ్డి 'మట్టి మనిషి ఆకాశం', పైడి తెరేష్‌బాబు హిందూ మహాసముద్రం, విస్తాలి శంకరరావు నా ఊరు, జి.వి. రత్నాకర్ అట్లేటి అల మొదలైనవి.

దీర్ఘకవితలాగే మినీకవిత కూడా 1975 ప్రాంతంలో తెలుగులోకి ప్రవేశించింది. పత్రికల ప్రోత్సాహం మూలంగా ఒక దశాబ్దంపాటు ఉద్యమంగా చెలరేగింది. అప్పటి నుంచీ ఇప్పటి వరకు అవిచ్ఛిన్నంగా కవులచేత రూపు దిద్దుకుంటూ, పాఠకులచేత ఆదరించబడుతూ ఈ ప్రక్రియ కొనసాగుతూనే ఉంది. పాదబద్ధత, వచనత్వం వంటి వచన కవితాలక్షణాలు మినీకవితలోనూ సర్వ సాధారణంగా కన్పించేవే. వీటికంటే అదనంగా కొన్ని ఇతర లక్షణాల్ని మినీకవితలో గమనించవచ్చు. ఈ మినీకవితకు పితామహుడు రావి రంగారావు. 'మినీకవిత'లోని 'మినీ' అనేపదం ఈ ప్రక్రియ భౌతికరూపాన్ని స్పష్టం చస్తుంది. 'సంక్షిప్తత' అనేది మినీకవితకు సంబంధించిన ఒకానొక ముఖ్యలక్షణం. "దీర్ఘకవిత, మినీకవిత రెండూ రెండు విభిన్న ధృవాలు. మినీకవితను ఫాష్ పాయట్రీ" అని నిర్వచించారు అద్దేపల్లి. ఇందుకు ఉదాహరణగా ఈ కవితను చెప్పుకోవచ్చు.

"పుట్టుక నీది / చావు నీది / బతుకంతా దేశానిది" - కాళోజి నారాయణరావు. మినీకవిత వచన కవితా యౌవనరూపం. మినీకవిత సామాజిక చైతన్య చురకత్తి.

ఆత్యాధునిక తెలుగు కవితారూపాలలో కొన్ని ఆంగ్ల సాహిత్య ప్రభావంతోనూ, మరికొన్ని ఇతరేతర భాషా సాహిత్యాల ప్రభావంతోనూ వెలువడ్డాయి. వీటిలో రెండో కోవకు చెందిన కవితాప్రక్రియ హైకూ. జపనీయ భాషా ప్రభావంతో వెలువడి తెలుగులోనూ బలంగా నిల దొక్కుకొన్న ప్రక్రియ హైకూ. జీవితానికి సంబంధించిన సున్నితతత్త్వం, తాత్వికత, ప్రకృతివంటి ఉదాత్తభావాలను అలౌకిక ప్రపంచంలోంచి అద్భుతంగా ఆవిష్కరించ గలిగిన ప్రక్రియ హైకూ. హైకూ రచనలో కవికి ఒక పథకం ఉండదు. అప్పటికప్పుడు ఒక మెరుపులాగా పుట్టేది హైకూ. ఏ ఆలోచన చేయకుండా ఒక దృశ్యాన్నో, సంఘటననో చూసి కవి మెరుపు వేగంతో చెప్పే ప్రక్రియ. అంటే అప్పటి సమకాలీన అంశాలు వస్తువులుగా ఉం టాయి. సాధారణ విషయాలలో అద్భుతాన్ని చూపగల ప్రక్రియ.

"వాగు ప్రవాహానికి / అన్నీ కొట్టుకపోతున్నాయి / చంద్రుడు తప్పించి" - తలతోటి పృథ్వీరాజ్

"అసాధారణమైన పోలికలతో ఆలోచనలను రేకెత్తించే ప్రతీకలతో ఒక సహజ సన్నివేశాన్ని, విషయాన్నీ చాలా సంక్షిప్తంగా, ప్రభావపూరితంగా అందించే చిన్న కవితా రూపం" అని హైకూను సాహిత్య నింఘంటువులు నిర్వచిం చాయి. "మానవాత్మనీ, భూమ్యాకాశాల్ని, వెలుగునీడలను ఒకే స్నాప్ షాట్లో పట్టే ప్రక్రియ హైకూ" అని అంటారు వాడ్రేవు చినవీరభద్రుడు. తొలిరోజుల్లో ఇస్మాయిల్, అద్దేపల్లి, మాకినీడి సూర్యభాస్కర్ హైకూను సాహిత్య లోకానికి పరిచయం చేశారు. రూప్‌కుమార్ డబ్బీకార్ అనే కవి, విమర్శకుడు 'హైకూ సారస్వతం' పేరుతో పరిశోధనా గ్రంథాన్ని ప్రకటించారు.

తెలుగులో ఇటీవలి కాలంలో బాగా ప్రాచుర్యం పొందుతున్న మరో కవితాప్రక్రియ నానీలు. ఈ కవితా ప్రక్రియ దేశీయ సాహిత్యం నుండిగానీ, విదేశీయ సాహిత్యం నుండిగానీ దిగుమతి అయింది కాదు. ఈ ప్రక్రియ పురిటిగడ్డ తెలుగుగడ్డ. సృష్టికర్త తెలుగుబిడ్డ, ప్రముఖ కవి, విమర్శకుడు ఎన్.గోపి. 1998లో 'నానీలు' పేరుతో ఎన్.గోపి తొలిసారిగా ఒక సంపుటాన్ని ప్రచురిం చారు. ఇందులో 365 నానీలు ఉన్నాయి. 'నావీ, నీవీ కలిపి నానీలు' అని ఈ కవితాప్రక్రియకు 'నానీలు' అని పేరు పెట్టడంలోని ఔచిత్యాన్ని గోపి చమత్కరించారు. నానీలకు శీర్షికలు జోడిస్తే మినీ కవితలు అవుతాయి. ఒక పాదాన్ని తగ్గిస్తే హైకూలను భ్రమింపజేస్తాయి. శీర్షిక పెట్టి కొన్ని పాదాలను పెంచితే సాధారణ వచన కవితలు అవుతాయి. ఉదాహరణకు...

"పల్లెదనం / చల్లని చద్దిబువ్వ / పట్నవాసం / వేడివేడి ఫాస్ట్‌ఫుడ్" - సోమేపల్లి. వస్తువులోనూ, అక్షర నియమాల్లోనూ కవుల స్వేచ్ఛకు ఈ నానీలు అద్దం పడతాయి.

ఇటీవలి కాలంలో తెలుగులో ప్రాచుర్యం పొందు తున్న మరో ప్రక్రియ రెక్కలు. నానీలు తెలుగుతల్లి ఒడిలో స్వతంత్రంగా ఎలా పురుడు పోసుకున్నాయో రెక్కలు కూడా అలాగే ఆవిర్భవించాయి. రెక్కలు సృష్టికర్త సుగమ్ బాబు. 'రెక్కలు' కు ఉన్న లక్షణాలను గమనిస్తే ఇందులో ఆరు పాదాలుంటాయి. మొదటి నాలుగు పాదాలు ఒక భావంశం (యూనిట్) గానూన చివరి రెండు పాదాలూ మరో భావాంశం గానూ ఉంటాయి. ఈ రెండు విడివిడిగా ఉంటాయి. 'రెక్కలు' ప్రక్రియలోని మొదటి నాలుగు పాదాలు పక్షి శరీరం అయితే, చివరి రెండు పాదాలు పక్షి రెక్కలవుతాయి. హైకూలు, నానీలలోలాగా రెక్కలు కూడా స్వతంత్ర అస్తిత్వం కలిగి ఉంటాయి. ఇతర ప్రక్రియలతో పోలిస్తే రెక్కలు అంత సులభమైంది కాదు.

"ఎండలో నడక / నీడ అనుసరిస్తున్నది / నీడకు చేరాడు / నీడ నీడలో కలిసిపోయింది // విలువలకు కిరీటం / కష్టాల్లోనే" - కైలాసపతిరావు

ఇతర ప్రక్రియలతో పోలిస్తే 'రెక్కలు' రచన అంత సులభమైంది కాదు. అయినప్పటికీ చాలా మంది కవులు

రెక్కల రూపకల్పనలో సుగమ్‌బాబును అనుసరించారు. వారిలో ప్రధానంగా కైలాసపతిరావు, పి. వీరారెడ్డి, శిరీష, డి. హనుమంతరావు మొదలైన కవులు కవితా సంపుటాలను ప్రకటించారు. "మినీ కవిత, హైకూ, రెక్కలు - ఈ మూడింటికీ వస్తువికేంద్రీకరణలో కూడా ప్రత్యేకత రావడం గమనించవలసిన విషయం. కేవలం సామాజిక వైరుధ్యాల ప్రకటన మినీకవితలో ఉంటుంది. ప్రాకృతిక అనుభూతిపరమైన స్పందన హైకూలో ఉంటుంది. జీవిత సంఘటనల్లోంచి సారభూతంగా ప్రతిపాదించే తాత్వికత 'రెక్కలు'లో ఉంది. వీటికి అవ్యాప్తి, అతివ్యాప్తిలు ఉండటం ఎక్కడైనా నిర్మాణంలో ప్రత్యేకత ఉండటం నిర్వివాదం. అందుకే ఈ మూడు వస్తుశిల్ప సమ్మేళన దృష్టితో విశిష్ట మార్గాన్ని నిర్దేశిస్తున్నై" అని అంటారు అద్దేపలి.

ముగింపు :

భాష, సమాజం, సంస్కృతి సంప్రదాయాలు ఎప్పుడూ స్థిరరూపంలో ఉండవు. ఒకదానితో ఒకటి అసంబంధమై వైయక్తిక నిర్దిష్టతని కలిగి ఉండవు. కట్టూ బొట్టూ ఆచార వ్యవహారాలు వంటి లక్షణాల్లో ఇరుగు పొరుగు సంప్రదాయాలు, రూపాలు, మరో సంప్రదాయ రూపానికి అంటుకుంటాయి. ఇలా దేశీయ, ఇతర దేశాల సాహిత్య ప్రభావంతో 1980 దశకం తర్వాత తెలుగులో అత్యాధునిక సాహిత్యంలో విలక్షణతతో కూడిన ప్రక్రియలు ఆవిర్భవించి వికాసం చెందాయి. నేటి కాలంలో వాటికి వారధిగా నిలిచినది అంతర్జాలం. తెలుగు సాహిత్యాన్ని సుసంపన్న చేయడంలో, సాహితీ ప్రియులకు సాహిత్యాన్ని చేరువ చేయడంలో దీని పాత్ర ఎంతో విశిష్టమైనదిగా చెప్పవచ్చు.

ఆధార గ్రంథాలు :

1. ఆధునికత - అత్యాధునికత - అఫ్సర్
2. విమర్శ ఒక అన్వేషణ - సుమనశ్రీ
3. అద్దేపల్లి సాహిత్య వ్యాసాలు - అద్దేపలి రామ్మోహనరావు
4. సాహిత్య విమర్శ పదాల డిక్షణరీ - ఎస్. ఎస్. నళిని
5. సత్యాన్వేషణ పాశ్చాత్య తత్వశాస్త్ర పరిచయం - ఎంపిక చేసిన కొన్ని రచనలు - వాడ్రేవు చినవీరభద్రుడు

⌘⌘⌘

BHAVAVEENA
Vol. 17, Issue. 8, August 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

గురజాడ రచనల్లో స్త్రీలు – సమకాలీనత

- పల్లేమోని జయమ్మ

గురజాడ అప్పారావును తలచుకొగానే ఎన్నో గొప్ప వాక్యాలు గుర్తుకు వస్తాయి. "దేశమంటే మట్టికాదోయ్, దేశమస్త్రంటే మనుషులోయ్", "మంచి చెడ్డలు ఎంచి చూడగమనుజులందున రెండె కులములు", "భగ వంతుని సృష్టిలో కెల్లా ఉత్కృష్టమైన వస్తువు - విద్య నేర్చిన స్త్రీ రత్నమే' వంటివి. కన్యాశుల్కం నాటకంలోనైతే నగానికి నగం డైలాగులు మన నిత్య జీవితంలో భాగమైపోయాయంటే అతిశయోక్తి కాదు. కానీ, గురజాడ, ముని సుబ్రహ్మణ్యం గారికి రాసిన లేఖలో యధాలాపంగా రాసిన ఒక వాక్యం "ఆధునిక మహిళ చరిత్రను తిరగ రాస్తుంది" చాలా ఆసక్తి కలిగించే వాక్యం. ఈనాడు మనకు ఉపన్యాసాలు మొదలు పెట్టేందుకు ఉల్లేఖనంలా పనికి వస్తోందేమోగానీ, దాని అంతరార్థం గురించి ఇంకా ఆలో చించాల్సి ఉందని అనిపిస్తుంది.

చరిత్రను తిరగరాయగల శక్తి సామర్థ్యాలు స్త్రీలకు ఉన్నాయని గురజాడ ఏ ఉద్దేశంలో అన్నారో గానీ, దీనివల్ల ఆయన స్త్రీల గురించి గొప్ప ఆశ, నమ్మకం కలిగి వున్నా డని ధ్వనిస్తుంది. బహుశా ఆయన సమకాలీన రచ యితల్లో గానీ, కుటుంబాల్లో గానీ, సమాజంలో ఉన్న స్త్రీలలో గానీ ఎవ్వరికీ అంత విశ్వాసం స్త్రీ జాతిపై ఉండి వుండదు. ఆయన పండితుడు. ఆ విశ్వాసమే ఈనాటి స్త్రీకి చైతన్య స్ఫూర్తినిచ్చే ఒక కరదీపిక అవుతోంది.

అసలు, గురజాడ ఈ మాల ఏ ధైర్యంతో అన్నాడు ? ఈ శతాబ్ద ఆరంభంలోనే ఇంతటి వ్యాఖ్య చేసాడంటే, ఆయనకు సమకాలీన స్త్రీలలో ఏదో శక్తి కనిపించి వుండాలి. అప్పటి వారు ఎవరూ ఊహించని ఒక కొత్త ప్రపంచాన్ని చూడగలిగిన దార్శనికత ఆయనలో ఉండి ఉండాలి. ఇంతకూ,.. ఆ శక్తి ఏ స్త్రీలలో కనిపించింది ? అంటే ఒకవైపు కుటుంబ వ్యవస్థలో ఉన్న స్త్రీలలోనూ (కమలిని, నాంచారమ్మ), మరో వైపు కుటుంబ వ్యవస్థ వెలుపల ఉన్న స్త్రీలలోనూ (మధురవాణి, సరళ) ఆయన ఆ శక్తిని గుర్తించారు. ఇంకా పసితనం కూడా పూర్తిగా పోని పూర్ణమ్మలోనూ, కన్యకలోనూ కూడా ఆయన అలాంటి శక్తిని గుర్తించారు. ఈ శక్తి బహుశా సామాన్యుల కంటికి కనిపించేది కాదు.

ఆయన చూసిన, ఊహించిన, ఆశించిన చైతన్యం స్త్రీలలో ఈనాటికైనా సంపూర్ణంగా వచ్చిందా అన్నది ఆలోచించాల్సిన విషయం. గురజాడ కథలు, కవితలు, నాటకాల్లో, సృష్టించిన స్త్రీ పాత్రల్ని ఒక్కసారి తలచుకుంటే ఆయన ఆ పాత్రల ద్వారా ఎటువంటి స్త్రీల చైతన్యాన్ని ఆశించారో, ఈనాటి సమాజానికి దాని ప్రాసంగికత ఏమిటో అర్థమవుతుంది. గురజాడ రచనలన్నిటిలోనూ స్త్రీలే ప్రధానమన్న విషయం తెలిసిందే. పురుషులలోని వికారాలను సునిశితంగా విమర్శిస్తూ ఎసాగిన ఆయన రచనల్లో స్త్రీల పట్ల గౌరవం, నమ్మకం ఆశాజ్యోతుల్లా తళుక్కుమంటూంటాయి.

కవితల్లోని స్త్రీలు : ప్రతిఘటన చైతన్యం :

గురజాడ ఖండకావ్యాలు "కన్యక" "పూర్ణమ్మ కథ" రెండూ స్త్రీల అకాల మరణాలను చూపించేవే. అందుకే బహుశ అందరూ అవి హృదయ విదారకమైన కావ్యాలనీ, స్త్రీల కన్నీటి గాథలనీ వర్ణించారు; వర్ణిస్తున్నారు కూడా. అది పూర్తిగా నిజమే. అయినా, ఈ ఇద్దరు అమ్మాయిలు తమ జీవితాల్లో తీసుకున్న నిర్ణయాలను మరో కోణం నుంచి చూసినపుడు గురజాడ ఈ కథల ద్వారా స్త్రీల గురించి ఏం చెప్పదలచుకున్నదీ కొంతవరకు అర్థమవు తుంది.

'కన్యక'లో / 'రాజు తలచిందేను ధర్మం,' రాజు చెప్పిందెల్ల శాస్త్రం, / రాజులకు పేరైన పద్ధతి కాద,

గాంధర్వం" / అన్న అహంభావం, దుర్మార్గం మూర్తీభవించిన రాజుతో కన్యక ఎదురుపడి మరీ అంటుంది. "కండకావరమెక్కి నీవీ / దుండగము తలపెట్టినందుకు / వుండదావొక దైవమంటూ / వుండి వూర్కొనడా" అంటుంది.

రాజుగారి దుర్మార్గాన్ని చూస్తూ మౌనంగా ఉన్న పురజనులను కూడా ఘాటుగా ఖండిస్తుంది. ఆ రోజుల్లో ఒక స్త్రీ తనను చెరపట్టడానికి వచ్చిన పాలకుడిని నడివీధిలో నిలబెట్టి ప్రశ్నించడం, చూస్తున్న పురజనులను నిలదీయడం ఊహించలేని విషయమే. బహుశా ఆధునిక తెలుగు సాహిత్యంలో రాజ్యాన్ని, దానికి ప్రాతినిధ్యం వహించే పాలకుడినీ ధిక్కరించిన తొలి స్త్రీ కన్యకే. ఆమె మంటల్లో దూకి ఆత్మహత్య చేసుకోవటం తన జీవితంపై తనకు మాత్రమే అధికారం ఉందన్న ప్రకటన చేయడమే తప్ప, పిరికితనం, నిస్సహాయత్వం కాదు.

పూర్ణమ్మ కథా కావ్యంలో పూర్ణమ్మ తనకు ముసిలి వాడితో వివాహం నిశ్చయమని తెలిపాక, అమ్మానాన్న దీవిస్తూంటే ఫక్కున నవ్వుతుంది. తన జీవితంలోని అపసవ్యం ఆమెకు అర్థమైంది. తన తండ్రి తనను ఎలా "ఉపయోగించుకుంటున్నదీ" అర్థమైంది. ఇకపై తన జీవితం ఎంత దుర్భరంగా ఉండబోయేదీ ఆమెకు తెలిసింది. అందుకే తన జీవితం తన చేతుల్లో ఉన్న ఈ ఆఖరి క్షణాలను ఎలా మార్చుకోవాలో ఆలోచించుకుంది. తన జీవితంపై తనకు ఉన్న హక్కును ఆత్మహత్య ద్వారా నిరూపించుకుంది.

కన్యాశుల్కంలో వెంకమ్మలో కూడా ఇలాంటి ప్రతిఘటనే కనిపిస్తుంది. భర్త నిర్ణయించిన సంబంధాన్ని వ్యతిరేకించడం, ఆ వివాహం తప్పిపోవడానికి ఏదైనా పన్నాగం వేయమని అన్నగారిని అడగడం, తన మాట లెక్క చేయక, సుబ్బి పెళ్లి లుబ్ధావధాన్లతో నిశ్చయించడంతో, నూతిలోకి దూకి ఆత్మహత్యయత్నం చేయడం - ఆ రోజులలో సంప్రదాయ కుటుంబంలో ఏపుట్టిన మధ్య వయస్కురాలి నుంచి మనం ఊహించలేని ప్రతిఘటనలు.

అంటే గురజాడ తమ జీవితాలకు సంబంధించిన ప్రధానమైన నిర్ణయాలు స్త్రీలు తీసుకుంటారనీ, తీసుకోవాలనీ ఆశించాడు. ఒక్కసారి గత శతాబ్దపు తొలి రోజుల్లో గురజాడ ఆశించిన ఈ మార్పును తలచుకుంటే, ఈనాటికీ స్త్రీలలో అధిక శాతం తమ నిర్ణయాలు తామే తీసుకోగల పరిస్థితులు లేవని అర్థమై, ఆందోళన కలుగుతుంది. ఈ పందేళ్లలో మన ఆడపిల్లలు ఆత్మహత్యలు చేసుకోవడం నేర్చుకున్నారు. కానీ ఆ రోజుల్లో అది ప్రతిఘటన కానీ, ఈ రోజుల్లో పిరికితనం. ఇప్పుడు ఎన్నో అవకాశాలు, సదుపాయాలు, న్యాయపరమైన, చట్టపరమైన అలంబనలు, ఎన్నో రకాల జీవన విధానాలు ఉన్నపుడు ఆత్మహత్య చేసుకోవడం క్షమించలేని నేరమవుతుంది. కానీ ఏ రకమైన ఆసరా, అండదండలు, ఆదుకోగల వ్యక్తులూ లేని రోజుల్లో అదే ఆత్మహత్య ప్రతిఘటన అవుతుంది. తన జీవితాన్ని తను అంతమొందించుకోవడం అలాంటి పరిస్థితుల్లో విప్లవాత్మక నిర్ణయమే అవుతుంది. ఇక్కడ కన్యక నుంచీ, పూర్ణమ్మ నుంచీ నేర్చుకోవలసినది ఆత్మహత్య చేసుకోవడం కాదు. తమ జీవితాలపై, తమ శరీరాలపై తమకు హక్కు ఉందనీ, దాన్ని తాము గౌరవ ప్రదంగా కాపాడుకోవాలనీ నేటి యువతులు గ్రహించడం, ఆచరించడం.

కథల్లోని స్త్రీలు - సమస్యలు పరిష్కరించుకునే ధీరత :

గురజాడ చూపించే మరో రకం స్త్రీలు తమ సమస్యలను అర్థం చేసుకుని, వాటిని పరిష్కరించడంలో ఎవరి సహాయమూ, ఆసరా కోరకుండా తామే పరిష్కరించుకునే కమలినిలు, నాంచారమ్మలు. 'దిద్దుబాటు'లో కమలినికి వచ్చిన సమస్య ఆ కాలం నుంచీ ఈ కాలం వరకూ స్త్రీలందరు ఎదుర్కొనేదే. భర్త వ్యసనాలకో, పరస్త్రీ వ్యామోహానికో ఎర కావడం, తద్వారా భార్య జీవితంలో విషాదం - నిత్యమే కానీ, వైకల్పికం కాదు. ఇది సాధారణంగా స్త్రీలు తమలో తాము కుమిలిపోవడానికీ, లేదా భర్తను వేధించడానికీ, సాధించడానికీ, చివరికి రాజీ

పడిపోవడానికీ దారి తీసే సందర్భం. కానీ కమలిని పై మూడు పనులు చేయదు. అసలు భర్త రోజూ ఆలస్యంగా ఇంటికి రావడానికి కారణమైన విషయం ఒక గంభీరమైన సమస్య అని గుర్తించడం; గుర్తించిన తర్వాత మరెవరికీ చెప్పుకుని ఏడవక, దానికి తను పరిష్కారం వెదుక్కోవడం, తక్షణమే ఆలోచనను ఆచరణలో పెట్టి, సమస్యను పరిష్కరించుకోవడం - ఒక విద్యావంతురాలైన స్త్రీ తన జీవితాన్ని ఎలా మలచుకోగలదో వ్యాఖ్యానించే గొప్ప రచన. ఇక్కడ భర్త కూడా స్వతహాగా కొద్దో గొప్పో సంస్కారి, మంచివాడు కావడం కమలిని వ్యూహం ఫలించడం ఎవరూ కాదనలేని విషయం. కానీ గమనించాల్సింది ఏమిటంటే - స్త్రీలు తమ సమస్యలను గుర్తించడం, దానికి ఉద్వేగంతో, ఆవేశంతోకాక, తెలివితో, సంయమనంతో (కమలిని రాసిన లేఖ) దాన్ని ఎదుర్కొవడం.

ఇక "మీ పేరేమిటి"లో నాంచారమ్మ ఒక అసాధారణమైన స్త్రీ. ధైర్యం తెలివితేటలు, తక్షనం నిర్ణయాలు తీసుకోగల ఆమె ధీశక్తి, మతం పేరిట రాగల అపాయాన్ని ఆమె నివారించడానికి దోహదం చేశాయి. మామగారు నిస్సహాయులై, భర్తగారు పిరికివారై సమస్యను తప్పించుకోగా, పరిస్థితిలోని తీవ్రతను (అది ఎంత మూర్ఖపు కారణం వల్ల వచ్చినదైనా) గుర్తించి, "పేర్" మీద విశ్వాసం చూపడం ద్వారా అసలు దైవభక్తి, విశ్వాసానికీ మతంతో నిమిత్తమే లేదని నిరూపించిన మహిళ నాంచారమ్మ, ఆధునిక మహిళకు ఈమె ఖచ్చితంగా మార్గదర్శకురాలు. నాయకత్వ లక్షణాలు సమృద్ధిగా ఉన్న ఈమె స్త్రీలు చరిత్రను తిరగరాస్తారు అన్న విశ్వాసాన్ని కలిగించే పాత్ర.

సంస్కర్త హృదయంలో సరళ కావడానికి 'తప్పు' వృత్తిని నిర్వహించే వ్యక్తి అయినా, ఆమెలోని మేధ, సంస్కారం, అభిరుచి అతి తక్కువ సంసారుల్లో కనిపిస్తుంది. ఏ చెడులోనైనా మంచి చూడగలగడం, స్త్రీలు తమ గురించి తాము ఆలోచించాలని చెప్పడం ఆమెను ఆధునిక స్త్రీగా నిలబెట్టే లక్షణాలు.

నాటకంలో స్త్రీలు :

గురజాడ ఒక సందర్భంలో స్త్రీల బాధల్ని ఈ రకంగా విశ్లేషించారు. "ఈ సమాజంలో స్త్రీల కన్నీటి గాధలకు కారణం నాకు తెలుసును. తిరిగి వివాహం చేసుకోకూడదనే నియమం, విడాకుల హక్కులేని కారణం, ఆర్థిక స్వాతంత్ర్యం లేకపోవడం - స్త్రీల కన్నీటి గాధలకు హేతువులు' అని, ఆ రోజుల్లో విడాకుల గురించి, స్త్రీల ఆర్థిక స్వాతంత్ర్యం గురించి ప్రస్తావన చేయడం అనూహ్యమైన విషయమే. భార్యభర్తల మధ్య ఉండాల్సింది స్నేహమని చెప్పడం ఎంత విప్లవాత్మకమైన భావనో (కాసులు) ఇవి కూడా అంతే. దీన్ని బట్టి ఆయన ఆలోచన ఎంత సుదూర భవిష్యత్తులోకి వెళ్ళిందో, స్త్రీల గురించి ఆయన ఎంత తపన పడ్డారో, ఎంత లోతుగా ఆలోచించారో తెలుస్తుంది.

కన్యాశుల్కం నాటకంలో మధురవాణి, మీనాక్షి, వెంకమ్మ, బుచ్చమ్మ, పూటకూళ్ళమ్మ - వీళ్ళందరి గురించి ఇప్పటికీ చాలా చర్చలు జరిగాయి. ఇందులో కుటుంబ వ్యవస్థలో ఉన్న స్త్రీలు, వెలుపల ఉన్న స్త్రీలు ఇద్దరు ఎలా ఉన్నారో, ఎలా శిఏఉండాలో కూడ గురజాడ సూచించారు.

కె.వి.ఆర్. "మహోదయం"లో అన్నట్టు గురజాడ ఉద్దేశంలో వేశ్యల సమస్యలను వేశ్యలే పరిష్కరించుకోవాలి. వారికే తమకేం కావాలో తెలుస్తుంది. అంటే స్త్రీలు తమ గురించి తామే ఆలోచించుకోవాలి. మధురవాణి, సరళ చేసిన పనే అది. అయితే మధురవాణి అంతకంటే ఓ అడుగు ముందుకు వేసి, సమాజాన్ని భ్రష్ట పట్టిస్తున్నారన్న ఛీత్కారాలకు గురయ్యే తాము సమాజంలో ఓ మంచి మార్పుకు సహాయపడగలమని నిరూపించింది.

కన్యాశుల్కంలోని స్త్రీ పాత్రల ద్వారా గురజాడ నిరూపించింది స్త్రీలలో ఉండవలసిన ఐక్యతను, కథలో కనిపించని సుబ్బి క్షేమానికి నాటకంలోని తక్కిన స్త్రీలు పాటు

పడడం, అందరూ ఎవరికి తోచిన రీతిలో వారు సహాయం చేయడం - స్త్రీలలో ఉండవలసిన తోటి స్త్రీల పట్ల సానుభూతిని చాటి చెప్పే నాటకమిది. మధురవాణి కరటకశాస్త్రి పన్నిన వ్యూహంలో కీలకపాత్ర నిర్వహిస్తుంది. బుచ్చమ్మ తన అమాయకత్వంతో, తను గిరీశంతో లేచిపోతే సుబ్బి పెళ్ళి నిలిచిపోతుందని నమ్మి, అందుకు సిద్ధపడుతుంది. వెంకమ్మ సరేసరి. భర్తతో అనునిత్యం సుబ్బి పెళ్ళి ఆపడం గురించే వాదిస్తుంది. మీనాక్షి తన తండ్రి ఈ వయసులో పెళ్ళి చేసుకోవడంలోని అనంబద్ధతను గుర్తిస్తుంది; ప్రశ్నిస్తుంది.

ఇలా కన్యాశుల్కంలో వేశ్యను ఒక సామాజిక చైతన్య మూర్తిగా చూపడమే కాదు. ఒక స్త్రీని విముక్తం చేయడానికి అన్ని వర్గాలకు చెందిన స్త్రీలు (బాలవితంతువులు, పునిస్త్రీలు, వేశ్యలు) ఎలా కలిసికట్టుగా పూనుకోవాలో కూడా చూపారు గురజాడ. ఇప్పుడున్న అన్ని సమస్యల విషయంలోనూ స్త్రీలలో ఇలాంటి ఐక్యత సాధ్యమైతే వాళ్ళు చరిత్రను నిజంగానే తిరగరాయగలరు.

గురజాడ స్త్రీలకు చూపిన చైతన్య మార్గాన్ని ఎంత వరకు ఇప్పటివారు అందుకున్నారన్నది ప్రశ్న. ఆయన సాహిత్యాన్నంతటినీ చూస్తే పురుషుల పట్ల ఆయనకు అట్టే గౌరవం గానీ, నమ్మకం గానీ ఉన్నట్టు కనిపించదు. ఏదైనా మార్పు అంటూ సమాజంలో జరిగితే అది స్త్రీల వల్లే జరుగుతుందని ఆయన నమ్మారేమో అనడానికి కమలిని, నాంచారమ్మ, మధురవాణి, సరల మంచి ఉదాహరణలు. పురుషులను ఎక్కువగా కేరికేచర్లను చేసిన ఆయన, స్త్రీల మీద గొప్ప విశ్వాసాన్ని పెట్టుకున్నారనిపిస్తుంది.

ముగింపు :

అందుఉకేనెమో ఈనాడు స్త్రీలు గురజాడ చూపిన మార్గాన్ని కొంతైనా అర్థం చేసుకోగలుగుతున్నారు. తమ జీవితాలపై తమకు హక్కు ఉందని, ఆ హక్కుల కోసం పోరాడాలనీ గుర్తించారు. గురజాడ చూపిన బాటలో స్త్రీలు కొందరైనా నడవగలుగుతున్నారు. పురుషులు ఇంకా ఆ స్ఫూర్తిని అందుకోవడం మిగిలే ఉంది.

ఆధార గ్రంథాలు :

1. గురజాడ రచనలు - సామాజిక చైతన్యం - కె. రుక్మిణీ కుమారి
2. గురజాడ మానవతావాదం - బి. భారతి
3. గురజాడ రచనలు - సామాజిక విలువలు - సిప్పో రాకుమారి
4. గురజాడ స్త్రీ పాత్రలు - ఎన్. రజని
5. గురజాడ సామాజిక సాహిత్య దృక్పథం - ఎస్. శ్రీదేవి
6. కన్యా శుల్కం - ఒక పరిశీలన
7. భాషా సాహిత్య విమర్శకుడిగా గురజాడ - టి. కిరణ్‌బాబు

⌘⌘⌘

BHAVAVEENA
Vol. 17, Issue. 8, August 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

పింగళి నాగేంద్రరావు నాటకం–పరిశీలన–సమకాలీనత

– పేరం శాంతి, తెలుగు అధ్యాపకురాలు, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, గుంటూరు.

నృత్య, గీత, వృత్త వాద్యములతో నిండి నటుల ద్వారా పండిత పామరులందరినీ మెప్పించగల సామర్థ్యం నాటకానికి ఉంది. అందుకే "కావ్యేషు నాటకం రమ్యం" అని నాటక ప్రక్రియను ఉత్కృష్ట సృష్టిగా సంస్కృత పండితులు పేర్కొన్నారు. తెలుగులో 1860వ సంవత్సరంలో మొదలైన నాటక ప్రక్రియ, అనేక క్రొత్త పుంతలు త్రొక్కుతూ చారిత్రక, పౌరాణిక, సాంఘిక విభాగాలలో విస్తరించింది. ఈ మూడు విభాగాలలో నాటకాలను రచించి పాఠకలోకానికి తన రచనా శైలితో కళ్ళకు కట్టి నట్లుగా చూపించిన రచయిత శ్రీ పింగళి నాగేంద్రరావు.

అపూర్వ భాషా విన్యాసంతో తెలుగు ప్రేక్షకులకు నిత్యనూతన హృదయోల్లాసాన్ని చేకూర్చిన శ్రీ పింగళి నాగేంద్రరావు 1901 డిసెంబరు 29న విజయనగరం జిల్లా బొబ్బిలి తాలూకా 'రాజాం' గ్రామంలో గోపాలకృష్ణయ్య, మహాలక్ష్మమ్మ దంపతులకు జన్మించారు. తల్లిదండ్రులు బందరుకు రావడం వల్ల బందరు నేషనల్ కళాశాలలో విద్యాభ్యాసం పూర్తి చేసి ఖరగ్‌పూర్‌లో రైల్వే ఉద్యోగం పొందారు. బెంగాల్‌లో ఎన్నో నాటక ప్రదర్శనలు తిలకించిన పింగళి ఎన్నో నాటకాలను అత్యుత్తమంగా రచించారు. గొప్ప చలనచిత్రాలకు మాటలు, పాటలు రాయడమే కాక తొమ్మిది నాటకాలను అణిముత్యాల్లా రచించారు. ఆయన కలం నుండి విరబూసిన నాటక నవసుమాలు

1) జేబున్నిసా 2) వింధ్యరాణి 3) మేవాడ్ రాజ్యపతనము 4) గమ్మత్తుచావు 5) పాషాణి 6) నారాజు 7) క్షాత్రహిందు 8) ఒకే కుటుంబం 9) కవి సామ్రాట్

సమయాభావం వల్ల అంతర్జాల అంతర్జాతీయ వెబినార్‌లో మేవాడ్ రాజ్యపతనము చారిత్రక నాటకాన్ని నేను విశ్లేషిస్తున్నాను. బెంగాల్ కవి ద్విజేంద్రలాల్‌రాయ్ వ్రాసిన ప్రదర్శించిన 'మేవాడ్ పతన్' నాటకాన్ని చూసి, దాని ప్రభావం చేత స్వయంగా బెంగాల్ భాష నేర్చుకుని 1922లో 'మేవాడ్ రాజ్యపతనం' అనే 5 అంకములు గల చారిత్రక వచన నాటకాన్ని ఆంధ్రీకరించారు.

ఇతివృత్తం :

భారతదేశాన్ని బ్రిటీష్ వారు పరిపాలిస్తున్న సమయంలో ప్రస్తుత రాజస్థాన్ రాష్ట్రంలోని ఉదయ్‌పూర్ (అప్పటి మేవాడ్) అను ప్రాంతము చిత్తూరు రాజపుత్రులచే పాలించబడింది. దాదాపు 700 సంవత్సరాలు స్వతంత్ర రాజ్యముగా ఉన్న మేవాడ్ పై దండెత్తి వచ్చిన వారెందరో వెన్నుచూపక తప్పలేదు. కాలక్రమంలో మేవాడ్ రాజ్యము మొగలుల హస్తగతం కావడమే ఈ నాటక ఇతివృత్తం.

అప్పటి మేవాడ్‌ను పాలిస్తున్న ప్రతాపసింహ మహారాణా మరణానంతరము అతని కుమారుడు అమరసింహ మహారాణాకు అధికారం దక్కుతుంది. ప్రధాన సేనాపతి గోవింద్‌సింగ్ సహాయంతో అప్పటికే దేవారు యుద్ధంలో, కామనేరు యుద్ధములో విజయం సాధించి, ప్రజలందరూ ధనికులై సుఖసంపదలతో ఉన్నారని, రక్తపాతాన్ని వ్యతిరేకించే అమరసింహుడు సంధి దిశగా ఆలోచన చేస్తాడు. కానీ క్షత్రియుల ధర్మం ప్రకారం విజయమో, వీరస్వర్గమో రణరంగం నిర్ణయిస్తుందనే గోవింద్‌సింగ్ సలహాతో మొగలులతో యుద్ధానికి సిద్ధమవుతాడు.

అమరసింహుని కుమార్తె, క్షత్రియకన్య అయిన మానసి కూడా విశ్వమానవ ప్రేమ కలిగిన మహిమాన్విత. తల్లిదండ్రులపై గౌరవమర్యాదలు కలిగి, మనుష్యజాతిపై తనకు గల ప్రేమను చూపిస్తూ కుష్టురోగుల నివారణకై వైద్యశాలను కట్టించి వారికి సేవ చేస్తుంది. ధర్మశాలను కట్టించి అతిథి సత్కారములు చేసి తృప్తి పడుతుంది.

మనుష్యులంతా ఈశ్వరుని సంతానమే అని, ఈ సంసారము నందు ధర్మము పేరుతో ఎంతో రక్తపాతం, సోదర విరోధం కలుగుతుందని దానిని నిరోధించాలనే ప్రయత్నం చేస్తుంది. గోవిందసింగ్ కుమారుడైన అజయుడు ఈమెను భార్యగా పొందాలని భావించి తన మనసులోని మాటను వ్యక్తం చేయగా, ఈ విశాల విశ్వమంతటిపై తనకు ప్రేమ కలదని, దానిని ఏ ఒక్కరికోసమో త్యాగం చేయలేనని వివాహాన్ని నిరాకరిస్తుంది. మానవజాతి అంతా విశ్వమానవ ప్రేమ కలిగి ఉండాలని ఆశిస్తుంది. జాతీయత అనేది మనుష్యత్వమునకు విరోధమైనట్లైతే అటువంటి జాతీయత సముద్ర గర్భంలో కలసి విలీనమవడం శ్రేయస్కరమని నమ్మిన వనిత. 'మనుష్యత్వం లేని దేశము యొక్క స్వాధీనత నష్టము' అనే అభిప్రాయం కల్గిన మానవ మూర్తి.

మేవాడు మానగౌరవమునకు పూర్వవైభవం తీసుకు రావాలనే సంకల్పంతో ఒక భిక్షుకురాలి వేషంలో ఆగ్రా నుండి వృద్ధ మహిళ వస్తుంది. మొగలులపై విజయం సాధించాలని అక్కడి ప్రజలను చైతన్యపరుస్తూ తన గీతాలతో వారిని ఉత్తేజపరుస్తుంది. క్షాత్రతేజమునకు చిహ్నమైన పౌరుషము, శౌర్యగౌరవము, మానము లేక తుచ్ఛమైన ప్రాణభయముచే యుద్ధము చేయకుండా విరోధహస్తమగుట న్యాయము కాదని రాణాతో చెప్తుంది. మాతృదేశము కోసం రక్తమునోడ్చి వీరస్వర్గమునలంకరించిన నీ పూర్వ పురుషులను స్మరించుకొనుము. వారి గౌరవార్థం ఖడ్గము పట్టుకొమ్మని ప్రోత్సహిస్తుంది. ఈ మాటలు విన్న రాణా "నీవు సామాన్య భిక్షుకురాలివి కాదని నీ నేత్రములయందు విద్యుచ్ఛక్తి, నీ అంగవైఖరి యందు విలాసవిజృంభణము సూర్య సమాన తేజముతో వెలుగుచున్నది. నీ వాగ్ల హరి జల ప్రవాహము వలెనున్నది" అని పలుకగా "నేను రాణావారి సోదరుడైన సగరసింహుని పుత్రికను సత్యవతిని' అని సమాధానం ఇస్తుంది. జోధ్‌పుర రాజైన గజసింగ్ మహారాజుతో యుద్ధానికి తలపడి తన భర్త ప్రాణాలు పోగొట్టుకున్నప్పటికీ తన మాతృదేశమైన మేవాడును రక్షించుకోవడానికి విశ్వప్రయత్నం చేస్తుంది. ఆమె తండ్రి సగరునికి, కుమారుడు అరుణుకి హిందూదేశ సంస్కృతినీ తెలియజేస్తుంది. తల్లి నుండి మేవాడు చరిత్రను తెలుసుకున్న అరుణుడు "మొగలుల పాదాల దగ్గర కూర్చుని రాజభోగాలు అనుభవించడం కంటే నా తల్లి ఒడిలో కూర్చుని అటుకులు నములుట మంచిది"2 అని భావించి తాత అయిన సగరునితో కలసి మేవాడుకు వస్తాడు.

సగరుని కుమారుడు, సత్యవతికి సోదరుడైన మహబత్ఖాన్ రాజ్యాధికారం కోసం మొగలుల వంచన చేరతాడు. ఎవరి వలన స్త్రీలకు పరాభవం, మనుష్యహీనత కలిగాయో అలాంటి మొగలులకు మీరు దాసులయ్యారా అని నిలదీస్తుంది. రాజ్యాధికారం కోసం మొగలుల పక్షాన చేరినప్పటికీ తమ మాతృదేశమైన మేవాడుపై కత్తిపట్టి యుద్ధం చేయనని మహబత్ఖాన్ చెప్తాడు. అందుకు నిరాకరించిన అమరసింహుడు తనతో యుద్ధము చేయమని రణభూమిలో సిద్ధమౌతాడు. సోదరులైన వీరిరువురు యుద్ధం చేస్తుండగా మానసి అక్కడికి వచ్చి వారిని శాంతపరుస్తుంది. మానవులు ఎప్పుడైతే దేశాచారములకు బానిసలుకాకుండా స్వతంత్ర ధీరులై యోగ్యతా యోగ్యతలను నేర్చుకుంటారో, ప్రేమపూర్వకంగా మనగలుగుతారో అప్పుడే జాతి ఔన్నత్యమునకు మార్గము సుగమం అవుతుంది. 'శత్రు మిత్ర జ్ఞానం మరచి ద్వేషమును పరిత్యజించి తన కళంకమును మరియు దేశము యొక్క కళంకమును విశ్వప్రేమ బిందువులచే ప్రక్షాళన చేయమని" చెప్పెను. మేవాడు సైనిక బలం కోల్పోయి చేతులు జోడించి మొగలుల హస్తగతమవుతుంది. ఈ నాటకంలో మరో చెప్పుకోదగిన పాత్ర అజయుడు. మానసిని వివాహం చేసుకోవాలని ఉన్నప్పటికీ ఆమెకు గల విశ్వమానవ ప్రేమకోసం తన ప్రేమను త్యాగం చేయడమే కాక ఆమె ప్రేమను తన హృదయంలోనే బంధించాలనే ఆలోచనకు సిగ్గు పడుతాడు. అజయుని సోదరి కళ్యాణి, మహబత్ఖాన్‌ను

వివాహం చేసుకున్నందువల్ల తండ్రి ఆమెను ఇంటి నుండి వెళ్ళగొట్టినప్పుడు ఆమెకు రక్షణగా నిలుస్తాడు.

ఈ చారిత్రక అనువాద నాటకాన్ని పింగళిగారు సజీవంగా మలిచారు. ఇందులోని పాత్రలు సమకాలీన అంశాలకు అద్దం పడుతాయి. కొన్ని అంశాలు నేటికీ ఆచరణీయాలు. యుద్ధంలో గాయపడిన వారికి సేవ చేయడమే లక్ష్యంగా కలిగిన మానసి పాత్ర ద్వారా ప్రతి స్త్రీ మానసిక ధైర్యము, ధీరత్వము, విశ్వమానవ ప్రేమ కలిగి ఉండాలని చెప్పారు. భర్తను పోగొట్టుకొని వృద్ధ రాలైనప్పటికీ ఆగ్రా నుండి మేవాడుకు వచ్చి ప్రజలందర్ని తన చైతన్యగీతాలతో ఉత్తేజపరచిన సత్యవతి పాత్ర ప్రతిమనిషికి దేశభక్తి ఉండాలనే విషయాన్ని బోధిస్తుంది.

సగరుడు తన సోదరుడైన అమరసింహ రాణా కోసం చిత్తూరు దుర్గమును వదలివెళ్ళడం ద్వారా సోదర ప్రేమను చూపించడమే కాక తన తండ్రి కోర్కెను తీర్చడం కూడా కనిపిస్తాయి. తోబుట్టువుల మధ్య ప్రేమకు ఈ దృశ్యం అద్దం పడుతుంది. యుద్ధ సమయంలో స్త్రీలకు హాని తల పెట్టవద్దని తన సైనికులను మహబత్ఖాన్ హెచ్చ రించడం ద్వారా స్త్రీలను గౌరవించడమనే మన హైందవ సంస్కృతిని నేటికీ ఆచరించదగిన విషయమని స్పష్ట మవుతుంది. అధికారం కోసం మతమార్పిడి చేసుకున్న మహబత్ఖాన్ పాత్ర ద్వారా వ్యక్తి శ్రేయస్సు కంటే జాతి శ్రేయస్సు కోరడం ముఖ్యమని మనకు విశదమవుతుంది. కళ్యాణికి మహబత్ఖాన్‌తో జరిగిన వివాహం అంగీకరించని అమె తండ్రి ఇంటి నుండి వెళ్ళగొట్టినప్పుడు ఆమె సోదరుడు అజయుడు అండగా నిలిచి దోపిడీదారుల నుండి ఆమె ప్రాణాలు కాపాడతాడు. తోబుట్టువుల ప్రేమ, సహకారం ఉంటే ఎలాంటి ఆపదనుండైనా బయటపడవచ్చనే విషయం ఈ ఘటన ద్వారా మనం తెలుసుకోవచ్చు.

ముగింపు :

పింగళిగారు రచించిన నాటకాల్లో మేవాడు రాజ్య పతనము గొప్ప చారిత్రక నాటకము. ఈ నాటక సాహిత్యం ద్వారా ఎంచుకున్న పాత్రలు సజీవంగా నిలిపే ప్రయత్నం చేయడమేకాక, ఎన్నో మానవీయ విలువలను చూప్పించారు. ప్రతి పౌరుడు దేశభక్తిని కలిగి ఉండాలని చెప్తూ నేల తల్లిని పరాయి పాలనకు వెళ్ళకుండా తుదిశ్వాస వరకు పోరాటం చేయాలని ఇందులోని పాత్రల ద్వారా చక్కని సందేశం అందించారు. కుటుంబ వ్యవస్థ పటిష్టంగా ఉండాలంటే వారి మధ్య ప్రేమానురాగాలు ఉండాలని, ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనప్పటికీ బంధాలు బలంగా ఉంటే, కష్టాన్ని అధిగమించడం సులభమని ఇందులోని పాత్రలు చెప్తాయి. ఇందులో ప్రతిపాత్ర పొందికగా, కథలోని ఔచిత్యానికి ఏమాత్రం భంగం వాటిల్లకుండా చక్కని దృశ్యకావ్యాన్ని పింగళిగారు ఆంధ్రులకు అందిం చారనడంలో అతిశయోక్తి లేదు.

ఆధార గ్రంథాలు :

1. నాగయ్య. జి - తెలుగు సాహిత్య సమీక్ష (రెండవ సంపుటము)
2. పింగళీయం - పింగళి నాగేంద్రరావు (భాగము-1)

⌘⌘⌘

BHAVAVEENA
Vol. 17, Issue. 8, August 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

'మోడి' – జానపద కళారూపం

– ఆచార్య డి. వి. శ్రవణ్‌కుమార్, ప్రొఫెసర్-కం-డైరెక్టర్, ప్రచురణల కేంద్రం, ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం.

'మోడి' ఒక జానపద కళారూపం. ఇది ఒక ఒళ్లు గగుర్పొడిచే జానపద కళ. మోడి ప్రధానంగా రాయలసీమ, నెల్లూరు జిల్లా ప్రాంతాల్లో బాగా ప్రచారంలో ఉండేది. మిగిలిన చాలా జానపద కళల్లాగే ఇది కూడా ఇప్పుడు దాదాపు అంతరించిపోతున్న కళ. ఒకప్పుడు మోడిని వృత్తిగా ఆశ్రయించిన వారు, వారి కుటుంబాలు దాన్ని వదిలేసి జీవిక కోసం వేరేవృత్తుల్ని ఎంచుకున్నారు.

చిత్తూరు, నెల్లూరు జిల్లాల్లో మోడి ఎత్తే వాళ్లకందరికీ పెద్దగా నెల్లూరు జిల్ల వాసి అయిన 'పెద్ద దెయ్యాల మంగ' అనే ఆమెను చెప్తారు. ఈమె నెల్లూరు నుండి చిత్తూరు జిల్లాలోని "కల్లూరు చిన్నగిరి"కి వచ్చి తన బంధుగణంతో ఒక జట్టుని ఏర్పాటు చేసుకుని మోడి ప్రదర్శనలిచ్చేదని తెలుస్తోంది. ప్రస్తుతం ఆమె లేకపోయినా, వారి బంధువులున్నారు. మోడిలో హస్తలాఘవం ముఖ్యమైంది. ఇందులో కనికట్టు విద్యలు కూడా ప్రదర్శింపబడతాయి. మోడిలో మంత్ర తంత్రాలుంటాయని చెప్తారు. అయితే మంత్రతంత్రాలకంటే కూడా ప్రదర్శనలో 'విజ్ఞానం' ఎక్కువగా ఉపయోగపడుతుందని కూడా అంటారు. అయితే ఈ విషయాలపై పరిశోధించాల్సి ఉంది.

మోడి ప్రధానంగా నాలుగు రకాలు. అవి

1. బండమోడి
2. రణ మోడి
3. పారమోడి
4. శక్తి మోడి

బండమోడి :

నాలుగు మూరల పొడవు, నాలుగు మూరల వెడల్పు ఉన్న పెద్ద బండను మంత్రంతో పైకి లేపి శూన్యంలో దారంతో నిలబెడతారు. ఈ బండ క్రింద నిమ్మకాయను గాని, రూపాయిని గాని పెట్టి దాన్ని ఎత్తుకోమని సవాలు చేస్తారు. మోడి ఎత్తే వారు దాని వద్దకు వెళ్లితే ఆ బండ వాళ్లపై పడుతుంది. అలా తమపై పడకుండా తప్పించుకుని ఆ నిమ్మకాయలేదా రూపాయిని తీసుకోవాలి. అలా తీయకపోతే ఓడిపోయినట్లే. మోడి కళాకారులు తమ మంత్ర తంత్రాలతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారని చెప్తారు.

రణమోడి :

మోడి కళాకారులు ఒక రాతి రోలుని ఒక వెంట్రుకతో గాని, సన్నని దారంతో గాని ఏ ఆధారం లేకుండా తమ మంత్ర బలంతో శూన్యంలో వేలాడదీస్తారు. మోడి ఎత్తేవారు దాన్ని సమీపించగానే, అది తిరుగుతూ వాళ్లపైన పడుతుంది. అలా పన పడకుండా తమ శక్తియుక్తులతో దీన్ని క్రిందకు దించాలి. అలా దించలేకపోతే వారు ఓడిపోయినట్లవుతుంది.

పారమోడి :

ఈ 'పారమోడి' కళారూపంలో పారను నిప్పుల్లో పెట్టి కాలుస్తారు. దీనిమీద నూనె పోస్తే మంట ఎగచిమ్ముతుంది. మోడి ఎత్తే వారు ఆ మంటల్ని నోటితో మింగేస్తారు. ఇలా సుమారు ఓ అరగంట జరిగిన తర్వాత మోడి ఎత్తే వ్యక్తులు తమ మంత్రబలంతో నూనెపోసినా మంటలు రాకుండా చేస్తారు. ఇలా చేస్తే మోడి ఎత్తినట్లవుతుంది. ఈ ప్రక్రియలో విజయం సాధించిన వారవుతారు.

శక్తిమోడి :

ఈ శక్తిమోడిలో కూడా మోడి పెట్టేవారు, ఎత్తేవారు అనే రెండు వర్గాల వారుంటారు. ఇందులో మోడి పెట్టే వారు ఒక గుడిని ఏర్పాటు చేసి అందులో శక్తి ప్రతిమను ఏర్పాటు చేసి 'మోడి' పెడతారు. మోడి ఎత్తేవారు

కలశంలోని డబ్బులు గెలుచుకోవాలి. ఈ శక్తి మోడినే 'పెద్దమోడి' అని మోడి కళాకారులు వ్యవహరిస్తారు.

ఒకప్పుడు ఈ మోడి ప్రదర్శన ఆంధ్ర రాష్ట్రమంతా ప్రదర్శింపబడేదని తెలుస్తుంది. అయితే ఇప్పుడు 'మోడి' ప్రదర్శన చాలా అరుదుగా జరుగుతుంది. ప్రస్తుత పరిశీలనలో మోడి కళాకారుల కుటుంబాలు చిత్తూరు జిల్లా, నెల్లూరు జిల్లాలోని వారినే తీసుకోవడం, విషయ సేకరణ చేయడం జరిగింది. చిత్తూరు జిల్లాలోని పీలేరు ప్రాంతం లోనూ, కొత్తపల్లి, సారకాయలపేట, మదనపల్లి దగ్గర బూడిదేడు, కల్లూరు తదితర ప్రాంతాలలో ఉన్నారు. నెల్లూరు జిల్లాలోని కావలి, వెంటకగిరి పరిసర ప్రాంతాల్లోనూ, నాయుడుపేట దగ్గర తుమ్మూరులోనూ మోడి కళాకారులున్నారు. గొలగమూడి వద్ద కూడా మోడి కళాకారులుండేవారు. ప్రస్తుతం ఆ కుటుంబీకులు వేరే వృత్తుల్లోకి మారిపోయారు.

మోడి - ప్రదర్శన :

మోడి కళాకారుల వేషధారణ :

మోడిని ప్రదర్శించే సమయంలో మోడి కళాకారుల వేషధారణ సాధారణంగానే ఉంటుంది. మోడి పెట్టే వారు నుదుటిన కుంకుమ, విబూదితో బొట్టు పెట్టుకుని, ధోవతి కట్టుకుని, శరీరంపై విబూది రేఖలు రాసుకుని, నడుముకి గుడ్డ కట్టుకుని చూడటానికి ఒక మాంత్రికులుగా ఉంటారు.

మోడి ఎత్తే పురుషులు ఎర్ర లంగోటాలు కట్టుకుని, బనియన్లు ధరించి, నడుముకి కాశిపాగ కట్టుకుంటారు. కాళ్ళకు గజ్జెలు ధరిస్తారు. చేతికి మంత్ర కడియాలు ధరించి, ముఖాన 'కావు' బొట్టు పెట్టుకుంటారు. నడుముకి వేపాకు మండల్ని కట్టుకుని, నోటితోబుర్ర ఊదుతూ, చేతిలోని డక్కీ వాయించుకుంటూ, ఎగురుతూ, పాటలు పాడుతూ మోడి ఎత్తడానికి బయలు దేరుతారు.

మోడి ఎత్తేవారిలో స్త్రీలు కూడా ఉంటారు. 'బలిగంప'ను ఎత్తుకునేది స్త్రీ కళాకారులే. ఈమెనే 'దెయ్యాలమంగ' అంటారు. ఈమె కూడా నడుముకి వేపాకుమండలు కట్టుకుంటుంది. తలపై గుడ్డచుట్టు పెట్టుకుని 'బలిగంప'ను ఎత్తుకొని తన వారందరితో కలిసి మోడి ఎత్తేందుకు పాటలుపాడుతూ, ఆడుతూ బయలుదేరుతుంది.

మోడి ప్రదర్శనకు కావలసిన వస్తు సామగ్రి :

మోడి పెట్టేవారి వస్తువులు :

పసుపు కుంకుమలతో కలిసిన అక్షింతలు, విబూది పండ్లు, తమలపాకులు, వక్కలు, నిమ్మకాయలు, కోడి గుడ్డు, బండి చక్రం, అరటిమాను, కరువు, కొబ్బరికాయ, వెలగపండు, కోడి, పొట్టేలు, కత్తి, కలశం, పందిరి, పచ్చిబియ్యం, వడ్లు, పీట, సాంబ్రాణి కడ్డీలు, మూడు బావుల నీళ్లు, మామిడాకులు, పూలు మొదలైనవి.

మోడి ఎత్తేవారి వస్తువులు :

అక్షింతలు, వేపాకుమండలు, నిమ్మకాయలు, బలిగంప, బుర్ర, డక్కి (డప్పు), మంత్ర కడియం, పుర్రె, తాటాకు గ్రంథాలు (తాళపత్రాలు) మొదలైనవి.

C²q| ¥Š£²¢ ¥Šáq\ Å£ XaxQÔýTq sÁ>dŸe+ – +&ƒŠ ný²> yÖ&¿ì Å£&†n+ÔûyÖ& ¢ ¥Šáq kÍ<ísÁ+>±}] ‹ j æ² >±ú, ÔÃ ý Ë>±' @s Î³ T #kÍísÁ yÖ& ¢ ¥Šáq | ¥{ | Ÿf ñEsÁ>TÔæ+~. yÖ& ¢ ¥Šáq Å£$Xae yTq sÁ>dŸe+– +&†* . m+<Š£f ñ yÖ& mÔû Þø¢+ ¥ eT+~ €&ƒÔê, bÍ&ƒÔê &ƒ ðŸ (&£Ø y sTTdŸi ‹ Tçs} <ŠÔê yÖ&mÔû<Š Å£ ekÍísÁ MÞø¢U] ›+<Š Å£ dŸe+ $Xae+>±– +&†* . yÖ& ç<ŠŠáH dŸeTj æ+ý Ë yÖ& ¶ºf ñ¼y Þø¢+ mÔû Þø¢m+ÔÃXø²>±– +{ ²sÁ – | ÿ d¥ – +& ×* * >+| Ÿq TÔá ëösÁ#ðŸ Å£' | Ÿ› kÍísÁ

yÖ& ¢ ¥Šáq Å£ eTT+<Š#ðŸ¿Ãe\ dæ¼@s Î³ T¢ # ý² – +{ ²sTT. eTT+<Š›±ÿ¿Ä ¥~] " ykÍísÁ€ | ¥~] ý Ë¿£ Xø ¶ºf&ÔsÁ | ¥~{ Ëÿ¿£eTÖ\ Xøi u¤eT eTT>TŸðæ¾¢ ¥ú eÖ+¢ÙÅ£&ƒXøi| Ÿ£ #ðŸi

ఉంటాడు. పందరికి ముందు భాగంలోనూ, కలశం ముందు అర్ధగజం దూరంలో ముగ్గులు (మంత్రాలు) వేస్తారు. ప్రతి ముగ్గు దగ్గర కర్పూరం, కొబ్బరికాయ, నిమ్మకాయ, తాంబూలం పెట్టాలి. ఈ ముగ్గుల్ని దేవతా వశీకరణ మంత్రాలుగా భావిస్తారు. కొన్ని చోట్ల వేపాకుతో గుడి ఏర్పాటు చేసి, అందులో నిలువెత్తు శక్తి బొమ్మను పెడ్తారు. మోడి పెట్టేవారు పందరికి ముందు ఏడు గీతలు గాని, ఐదు గీతలు గానీ, మూడు గీతలు గానీ గీస్తారు. ఈ గీతల మధ్య అందరం కనీసం అర్ధగజం ఉంటుంది. ఒక్కొక్క గీత మీద ఒక్కొక్క వస్తువుని పెడతారు. ఈ వస్తువుల్ని మోడి ఎత్తేవారు తీసుకునిపోవాలి.

మోడి పెట్టేవారు ఒక్కో సందర్భంలో పది మంది వరకూ ఉంటారు. కొన్ని సందర్భాల్లో ఇద్దరే ఉంటారు. ప్రధాన మాంత్రికుడు, అతడి సహాయకుడూ ఉంటారు. వీరు కొత్త మూఉకుడులో నూనె పోసి దీపం వెలిగిస్తారు. దీన్నే అగండలం అంటారు. మోడి పెట్టే వారు ఇద్దరున్న సందర్భంలో ప్రధాన మాంత్రికుడు మొదటిగీత వద్ద, సహాయకుడు చివరిగీత వద్ద ఉంటారు. వీరి చేతుల్లో అక్షింతలు ఉంటాయి. మోడి పెట్టేవారు పది మంది ఉన్నప్పుడు ఏడు గీతల వద్ద ఏడు మంది, శక్తి బొమ్మ వద్ద ప్రధాన మాంత్రికుడు మిగిలిన ఇద్దరూ అందరికీ సహాయకులుగా ఉంటారు.

ఇక పందిరి దగ్గర నుండి ఒకటోగీత మీద వెలగ పండు పెడతారు. ఈ గీత మీద మాంత్రికుడుంటాడు. రెండవగీత మీద నిమ్మకాయ పెడతారు. మూడవగీత మీద అరటిమాను ఉంచుతారు. నాలుగో గీత మీద కొబ్బరికాయను ఉంచుతారు. ఐదవ గీత మీద కోడి గుడ్డుని పెడ్తారు. ఆరవ గీత మీద విబూదిపండును పెడతారు. ఏడవగీతపై బలిచక్రం (బండిచక్రం) పెడ్తారు. ఈ బండి చక్రాన్ని వెంట్రుకలతో పైకి వేలాడదీసినట్లు మంత్రబలంలో నిలబెడ్తారు. ఈ గీతలపై పెట్టే వస్తువులు మోడి పెట్టే వారి ఇష్టం మీద ఆధారపడి ఉంటుంది. మోడి ఎత్తేవారికి కష్టసాధ్యంగా ఉండేట్లుగా గీతలపై వస్తువుల్ని ఏర్పాటు చేస్తారు.

ప్రదర్శన మొదలయ్యే ముందు మోడి ఎత్తేవారు, పెట్టేవారు పరస్పరం సవాళ్లు విసురుకుంటారు. మోడి ఎత్తేవారు బలి గంపను ఎత్తుకుని, బుర్ర ఊదుతూ డక్కివాయిస్తూ, పాటలు పాడుతూ, ఎగురుతూ అక్షింతలు వేసుకుంటూ, ఏడవ గీత నుండి బయలుదేరుతారు. ఈ విధంగా ఏడు గీతల్ని దాటి పందిట్లో ఉన్న కలశాన్ని ఎత్తుకోవడమే మోడి ఎత్తడం. ఈ ప్రదర్శన ఒక్కోసారి ఏడు రోజుల పాటు జరుగుతుందని వారు తెలిపారు. ఒక్కో సందర్భంలో ఒక్కోరోజుకే ముగుస్తుంది. ఇదంతా మోడి పెట్టేవారి, ఎత్తేవారి ప్రతిభపై ఆధారపడి ఉంటుంది.

మొదటగా ఏడు గీత మీద ఉన్న బలిచక్రాన్ని దాటి మోడి ఎత్తే వారు ఆరోగీతమీదకు రావాలి. ఈ బలిచక్రం గిరగిరా తిరుగుతూ ఉండే విధంగా మోడి పెట్టేవారు ఏర్పాటు చేస్తారు. మోడి ఎత్తేవారు తమ మంత్ర తంత్రాలతో బలిచక్రాన్ని తిరగనీయకుండా చేసి ఏడవ గీత దాటి ఆరవ గీత మీదకు వెళ్లగలగాలి. అలా ఆ రోజుకి వెళ్లలేకపోతే ఓడిపోయినట్లవుతుంది. అంతేగాక దయ్యాలమంగ బలిగంపను తలపై పెట్టుకుని తన వాళ్లతోఆడుతూ, పాడుతూ ఉంటుంది. తమ వారిపై ప్రత్యర్థులు ప్రయోగించే మంత్ర ప్రయోగాల్ని తిప్పి కొట్టడానికి ఆమె వద్ద లక్షింతలుంటాయి. మోడిపెట్టే వారు రకరకాలుగా దయ్యాలమంగ వద్ద ఉన్న బలిగంప క్రింద పడిపోయేలా ప్రయత్నిస్తారు. ఈ గంప కింద పెట్టినా, పడినా మోడిఎత్తేవారు ఓడిపోయినట్లవుతుంది.

ఇలా ఇరుపక్షాల వారూ తమ శక్తియుక్తుల్ని ప్రయోగిస్తారు. పరస్పరం ఓడించాలని, గెలవాలని ప్రయత్నం చేస్తూ ఉంటారు. మోడి ఎత్తే వారు ఆరవగీత మీదకు వచ్చి అక్కడున్న విబూది పండును ఎత్తుకునేందుకు ప్రయత్నిస్తారు. విబూది పండుని తాకగానే వారినోట్లో నుండి లేదా ముక్కునుండి రక్తం వచ్చేటట్లు మోడి పెట్టేవారు మంత్రం వేస్తారట. దెయ్యాల మంగ వెంటనే అక్షింతలు వేసిరక్త స్రావాన్ని నిలిపి వేస్తుందని అంటారు.

ఈ విధంగా విబూది పండుని తీసుకున్న తర్వాత, ఐదవ గీతపైనున్న కోడిగుడ్డుని తీసుకోవాలి. ఈ సందర్భంలో కూడా మంత్రతంత్ర ప్రయోగం జరుగుతుంది. వీటిని ఎదుర్కొని కోడిగుడ్డుని తీసుకునినాల్గవ గీతపై ఉన్న కొబ్బరికాయని తీసుకోవడానికి ప్రయత్నించాలి. ఈ సందర్భంగా మోడి పెట్టే వారు వెలగపండు గానీ, వేరొక కొబ్బరికాయతో గానీ మోడి ఎత్తేవారి వద్ద వున్న బుర్ర, డక్కి పగలగొట్టేందుకు ప్రయత్నిస్తుంటారు. ఎందుకంటే ఇవి పగిలిపోతే వీరికి ఆటా, పాటా ఉండదు. ఉత్సాహం తగ్గిపోతుంది. ఈ మంత్ర ప్రయోగాల్ని ఎదుర్కొంటూ కొబ్బరికాయను తీసుకోవాలి.

ఆ తర్వాత మూడోగీతపై ఉన్న అరటి మాను వద్దకు వస్తారు. మోడి పెట్టేవారు ఈ అరటిమానును కత్తితో గాటు పెడ్తారు. అరటిమానుని గాయపరిస్తే, మోడి ఎత్తేవారి తొడలు గాయపడి రక్తం కారుతుందని అంటారు. ఈ విధంగా అరిటమానుని కూడా వశపర్చుకున్న తర్వాత రెండవ గీతపై ఉన్న నిమ్మకాయను తీసుకోవాలి. నిమ్మకాను ఎత్తే సందర్భంలో రక్తం కక్కేట్లు మోడి పెట్టేవారు మంత్రం వేస్తారు. అయితే తమ మంత్రబలంతో రక్తం కక్కుకోకుండా నియమ్మకాయను తీసుకోవాలి. ఆ తర్వాత మొదటిగీతపై ఉన్న వెలగపండును ఎత్తడానికి ప్రయత్నించాలి. ఈ ప్రయత్నంలో వెలగపండు కదలి మోడి ఎత్తే వారి కాళ్ల కింద దూరిపోతుందట. అప్పుడు మోడి కళాకారులు వాయించే బుర్ర పగిలిపోతుంది. అందుకని వెలగపండుని సాధించిన తర్వాత కలశాన్ని తీసుకోవాలి. కొబ్బరికాయ కొట్టి, నిమ్మకాయ కోసి, కోడిని దావు ఇచ్చి కలశాన్ని ఎత్తాలి. కలశంలో వేసిన రూపాయిని మోడికళాకారులు సాధించాలి. అప్పుడే మోడి ఎత్తేవారు సంపూర్ణ విజయం సాధించినట్లవుతుంది. ఈ విధంగా మోడి కళాకారులు ఊరూరా తిరిగి మోడి ప్రదర్శనలిచ్చి, అందులో వచ్చే డబ్బుతోనే గతంలో జీవనం గడిపేవారని తెలుస్తోంది. అయితే రాను రాను ఆదరణలేక ఈ కళా ప్రదర్శన కనుమరుగవుతోంది.

మోడి కళాకారుల వృత్తులు - జీవన విధానం :

ఒకప్పుడు మోడి ఎత్తేవాళ్లకు ఇది కులవృత్తిగానే ఉన్నా, రాను రాను జీవికకై విభిన్న వృత్తులు స్వీకరించాల్సిన పరిస్థితుల వచ్చాయి. మోడి కళాకారుల్లో కొందరు ఆయా గ్రామాల్లో వ్యవసాయం చేసుకుంటూ స్థిర నివాసాలు ఏర్పరుచుకున్నారు. కొందరు ఈతాకు చాపల వ్యాపారం, పందుల్ని మేపడం వంటి వృత్తుల్లో ఉన్నారు. ఇంకా చీపుర్లు, తాటాకు, ఈతాకు బుట్టల వ్యాపారం చేస్తున్నారు. ఒకప్పుడు సంచార జీవులుగా ఉన్న వీరు ఇప్పుడు చాలా వరకు స్థిర నివాసాలు ఏర్పర్చుకున్నారు. మోడి ఎత్తే కళాకారులు పోలేరమ్మ, పోతురాజులను కులదైవాలుగా పూజిస్తారు. మోడి స్త్రీలు కుడిపైటను వేసుకుంటారు. వీరి పెళ్లి విషయానికి వస్తే ఒకప్పుడు తాళి కట్టే ఆచారం లేదని చెప్తారు. నల్లపూసల దండే పెళ్ళి కూతురికి తాళిబొట్టుతో సమానంగా భావిస్తారు.

మోడి నేటి దుస్థితికి కారణాలు :

అన్ని జానపద కళల్లాగే మోడి కూడా నేడు అంతరించి పోయే దశకు చేరుకుంది.

ఇందుకు కొన్ని కారణాలు :

1. మోడి కళ ప్రచార, ప్రసార సాధనంగా ఉపయోగ పడకపోవడం.
2. ఈ ప్రదర్శన ఒక్కో సందర్భంలో ఏడు రోజులు, ఐదు రోజులు ప్రదర్శించబడటం, దీర్ఘకాల ప్రదర్శన కావడం వల్ల మారుతున్న సమాజం వేగవంతం కావడదం వల్ల ఈ ప్రదర్శనను తిలకించడం కష్టంగా భావించి నిరాదరణకు గరి అయి ఉండొచ్చు.
3. ముఖ్యంగా టి.వి., సినిమాల ప్రభావం నేటి సమాజంపై ఎక్కువగా ఉంది. వీటి ప్రభావంతో తెలుగునాట అనేక కళలు మరుగునపడిపోయాయి.
4. అదేవిధంగా ఇతర కళల్లాగే దీనికి ప్రభుత్వ ఆదరణ కొరవడింది.

సమాజం ఎంత మారినా, అభివృద్ధి చెందినా మనకు మూలమైన సంస్కృతీ, సంప్రదాయాలను, కళలను విస్మరించడం మంచిది కాదు.

తెలుగు జానపద సంస్కృతీ, సంప్రదాయాలను, కళలను పరిరక్షించుకోవాల్సిబాధ్యత ప్రభుత్వంపైనే కాక, ప్రతి జానపదుడిపై ఉంది.

ఆధార గ్రంథాలు :

1. ఆంధ్రుల జానపద విజ్ఞానం - ఆచార్యఆర్వీయస్ సుందరం, తెలుగు విశ్వవిద్యాలయం ప్రచురణ, 1992.
2. రాష్ట్ర స్థాయి జానపద కళోత్సవాలు - తెలుగు వఙవ్వవిద్యాలయం, కరీంనగర్ జిల్లా సాంస్కృతిక మండలి సంయుక్త ఆధ్వర్యంలో - ప్రచురణ, తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాదు, 1990.
3. ముఖాముఖి - గంగయ్య, పీలేరు మండలం, చిత్తూరు జిల్లా.
4. ముఖాముఖి - శంకరమ్మ, పీలేరు మండలం, చిత్తూరు జిల్లా.
5. ముఖాముఖి - రెడ్డెన్న, పీలేరు మండలం, చిత్తూరు జిల్లా.

⌘⌘⌘

BHAVAVEENA
Vol. 17, Issue. 8, August 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

డా॥ దేవపాలన "బతుకు పాట" – సమకాలీనత

- తన్నీరు బాలాజి

" పిచ్చిపట్టిన వాడిలా
గుక్కపట్టిన బిడ్డలా
మింటికేసి చూస్తో
ఎంత కన్నీటిని తాగాడో
ఆ శ్రమజీవి"

కూడు, గూడు కోసం కాయకష్టం చేసేవారే శ్రామికులు. అలసి సొలసిన మనసులకు సేదదీర్చేవే వారు పాడుకునే బతుకుపాటలు.

"పని యంత్రమైతే పాట ఇంధనం" మొలలోతు దు:ఖంలో మోకాలి లోతు సుఖంలాగా వారికి ఓదార్పుని, ఉల్లాసాన్ని అందించి, ఆత్మబంధువులా అలరించేదే శ్రమజీవుల పాట.

ఆచార్య జి.నాగయ్యగారన్నట్లుగా తెలుగులోని గేయ రచనలు ప్రత్యేకంగా "ప్రజాశాఖ" అని చెప్పదగినవి.

జనపదమనగా పల్లె. అందు నివశించేవారు జానపదులు. వారికి సంబంధించిన వాఙ్మయమే జానపద కవిత్వము. కథాగేయాలు, సామెతలు, ముక్తక గేయాలు, శ్రామిక గేయాలు ఇత్యాది జానపద సాహిత్యం "ముఖే ముఖే సరస్వతి" అన్నట్లుగా ఒకరి నుండి ఒకరికి సంక్రమించింది. ఇవి ఎవరు వ్రాసారో తెలియదు. కానీ పాల్కుర్కి సోమనాధుని తుమ్మెద పదముల నుండి, నేటి సినిమాపాట వరకు జానపద గేయం తెలుగు వాడి గుండెకాయ అయింది.

బిరుదురాజు రామరాజు ప్రతపాదించిన తొమ్మిది లక్షణాలు జానపదగేయానికి కలవు. అవి ఆశురచన, అనామక కర్తృకము, నియమిత స్వరూపరాహిత్యం, అనిర్ణీత రచనాకాలికం, మౌఖిక ప్రచారము, ఆకృతకశైలి, గానయోగ్యత, పునరావృతి, జనసామాన్య పరిచిత వస్తువు వంటివి. డాక్టర్ బిరుదురాజు రామరాజు, డాక్టర్ తూమాటి దొణప్ప, ఆచార్య నాయని కృష్ణకుమారి, ఎన్. వి. జోగారావు లాంటి ఎందరో మహానుభావులు జానపద గేయాల లోతులను పరిశోధించి మార్గాలను అన్వేషించారు. వారి అడుగుజాడల్లో పరిశోధనలు గావించి జానపద గేయాన్ని తెలుగు లోకానికి అందించినవారు 20 మంది వరకు ఉంటారు. వారిలో ఒకరు ప్రకాశం జిల్లా శ్రామిక గేయాలపై పరిశోధనచేసి పి.హెచ్డి. సిద్ధాంత గ్రంధాన్ని శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయానికి సమర్పించినవారే డాక్టర్ ఉబ్బా దేవపాలన గారు.

1987 ప్రాంతంలో ఒకవైపు లెక్చరర్గా విధులు నిర్వహిస్తూ భుజాన సంచి, టేపురికార్డరు, కెమేరాలతో గ్రామ గ్రామం తిరుగుతూ శ్రామిక గేయాలు సేకరిస్తున్న డాక్టర్ దేవపాలనగారు ఒక శ్రమజీవిని తలపించేవారు. వారి విద్యార్థిగా కందుకూరు ప్రాంతంలో పాడుకునే కొన్ని శ్రామిక గేయాలు వారికందించే భాగ్యం ఈ వ్యాసకర్తకు కలిగింది.

ప్రిన్సిపాలుగా, ఉన్నత విద్య ఆర్.జె.డిగా సేవలందించి, విశ్రాంత జీవనం సాగిస్తున్న డాక్టర్ దేవపాలన గారి జీవితం జానపదమయం. వారి రచనలన్ని ప్రజా కళారూపాలే. అద్దంకిలో జానపద కళాపీఠాన్ని స్థాపించి పల్లెపదాల కోసం పరితపిస్తూనే ఉన్నాడు.

మట్టిలో బంగారం వంటి ఈ శ్రమజీవుల పాటల్నీ, వాటి బాణీల్ని సంరక్షించి నేటి సమాజానికి కావలసిన, కావలసిన సందేశాన్ని, ఆనందాన్ని అందించడానికి తమ పరిశోధనా గ్రంధం నుండి కొంత భాగాన్ని 'బతుకు పాట' రూపంలో ఆవిష్కరించారు శ్రీ దేవపాలన.

జిల్లా నాలుగు చెరగులా తిరిగి తిరిగి తాను 'రాసి' పోసుకున్న నిధి నుంచి గట్టి గింజల్ని సమకూర్చి 'బతుకు పాట'ను అందించారు రచయిత. ఇందులో ప్రస్తావించిన

వాన, ఏరువాక, సంక్రాంతి, కథాగేయాలు, జాలిపాటలు, వలపుపాటలు, బాంధవ్య పాటలు, హాస్యగీతాలు మొదలైనవి నాటి, నేటి జానపదుల జీవనశైలి, వారి జీవన భాష, కుటుంబ వ్యవస్థ, కష్టసుఖాలు, ఆవేదనాశ్రువులు, అనురాగ భావనలు కళ్ళకు కట్టినట్టు కనిపిస్తాయి.

కర్షకునికి హర్షము కలిగించి, నేలమ్మను పలకరించి పులకరింప చేసేది వాన.

"వానబడుతుంది జాన, వదినె వచ్చెనమ్మ
ఎట్లా పొమ్మందు వాన, వానంటే వాన గాదు
వడగండ్ల వానొదిన . . . . . .
నెర్రెలు పగిలిన నేల బుర్రున పొంగేనమ్మ"

ఇలా గుండా లక్ష్మమ్మ గారి పాట సాగుతుంది.

"వానదేవుడా నీకు వరుస కూతుర్ని
వానలే కురిపించు వాగు వంకల్లా"

- అని కాల్వ జయమ్మ "నీ కూతురు కష్టాలు దీర్చు" అని వానదేవుడ్ని వేడుకొంటుంది. సకాలంలో వాన కురవకపోతే కష్టజీవి ఎంతగా అల్లాడిపోతాడో, ఎందరు దేవుళ్ళకు మొక్కుకుంటాడో, చివరకు ప్రకృతి కనికరించి వాన చినుకై కురిస్తే ఆ రైతన్న "వానా వానా వల్లప్పై" ఎంతగా సంతోషిస్తాడో.

వాన పలకరించగానే నేల, రైతు పులకరిస్తారు. పశు గణ, మంది మార్బలంతో బయలుదేరిన రైతురాజు దుక్కి దున్నకాన్ని ఆరంభించే పండుగ ఏరువాక.

"ఏరువాకొచ్చింది ఏరువాకమ్మ
ఏళ్ళు నదులు పొంగి ఏకమయ్యాయి
ఏటి ఒడ్డున నేను పాట పాడే వేళ
ఆ కొండ కోయిలపైన గూడు కట్టే వేళ
లేతమనసు వచ్చి పూత పూసే వేళ"

ముత్తయిదువులందరు పాట పాడారట. ఈగ తన పేరును మరచిపోయినట్లు పల్లెటూరి బ్రతుకుని ప్రతి బింబించే కమ్మని పదాలను మరచిపోతున్నాము. తొలికోడి, మలికోడి, కవ్వం, కళ్ళాపి, చద్దిమూట, చల్ల దుత్త, పాలకంకి, కర్రు, గొర్రు, వరదగుడి, పైరగాలి ఇత్యాది కమ్మని తెలుగు పలుకుబడులు మరుగునబడి పోతున్నాయి. అందుకే ఏరువాకను ఆహ్వానించుకుందాం. "ఏరువాక" వానగాలిగా ఎంత చల్లని మాట.

ఆరుగాలం పడిన శ్రమను పళ్ళెం వంటి పంట కల్లంలో చూసుకొని ఆనందభాష్పాలు రాల్చే పర్వదినం సంక్రాంతి.

"సంక్రాంతి పండగల్లో - గొబ్బియ్యళ్ళో
ముత్యాల ముగ్గుల్లో - గొబ్బియ్యళ్ళో
రత్నాల రంగుల్లో - గొబ్బియ్యళ్ళో
భోగిపళ్ళ వెలుగుల్లో - గొబ్బియ్యళ్ళో

అని తాళ్ళూరి లక్ష్మీదేవి గారు సంక్రాంతి వాయినం పాటనిస్తే,

ధనుర్మాసాన ధాన్యలచ్చికి - గొబ్బియ్యళ్ళో
పూజలు చేసి కొలిచిన - గొబ్బియ్యళ్ళో
సిగ్గులు నిగ్గుల కన్నెలంతా - గొబ్బియ్యళ్ళో
కోరిన కోర్కెలు తీరునమ్మ - గొబ్బియ్యళ్ళో

అని బెంగుళూరు ఆదెమ్మ "పుచ్చుకుంటి నమ్మ" వాయినం అంటుంది. సంక్రాంతి పండుగ కుటుంబ వ్యవస్థకు చక్కని ప్రతీక. కొడుకులు, కూతుళ్ళు, కోడళ్ళు, అల్లుళ్ళు అందరు కలిసి ఆత్మీయతను పంచుకొనే పండుగ. మూడోతరం పసివారికి తలపై రేగుపండ్లు పోయడం ఆరోగ్యానికి అనురాగానికి ప్రతీక.

ఏరువాక, సంక్రాంతి మొదలైన పాటలు చదువు తుంటే ఒక్కసారిగా మన మూలాలు పల్లెసీమల్లోకి వెళ్ళి నట్లనిపిస్తుంది.

నాట్లు, కోతలు, నూర్పిళ్ళు, దంపుళ్ళు, తిరుగళ్ళు, కవ్వం, రాట్నం, కమ్మరి, కుమ్మరి, జాలరి ఇత్యాది వృత్తి, గృహ సంబంధమైన పనుల్లో పాడే పాటలు, పెళ్ళిళ్ళు, పేరంటాలు, పురుళ్ళు, ఇలాంటి సందర్భాల్లో పాడే పాటలు మనకు వినిపిస్తుంటాయి. ఎవరో ఒకరు కైకట్టి పాడిన పాటలను అందరు తమ సొంతం చేసుకుంటారు. సమాజానికి ఉమ్మడి ఆస్తులు ఈ పాటలు ఉయ్యాలో,

గొబ్బియ్యల్లో, చందామామయ్యో, గురిగింజ గుమ్మడి మొదలగు పల్లవులు పల్లవిస్తాయి, ఆయా సందర్భాలను బట్టి.

లలితమైన భావాలను అనుభవంతో సానదీరిన పదాల్ని, కాస్త ఊహను, పనిపాటల్లో తమకు అబ్బిన లయల్ని మేళవించి కథాగేయాలను ఆలపిస్తారు.

"రామన్న, భీమన్న అన్నదమ్ములు ॥ రావన రామన్న, బోయినాడు రేగళ్ళు దున్నో
భీమన్న బోయేడు పిగిలి వేటలకి. . . . . .

ఇలా రామన్న భీమన్నల కథాగేయం సాగుతుంది. కుంచాల వెంకట శేషమ్మ గారు పాడిని ఈ పాటలో పాఠ్యాంతరాలు కనిపిస్తాయి. ఒకరు కైకట్టిన పాట కాలం గడిచేకొద్ది విరిగి, తరిగి, పెరిగి, పలు ప్రాంతాలు తిరిగి పాట అందరి సొంతమా అన్నంతగా నిలిచిపోతుంది. కథలోని నీతి, జాతి వెన్నంటి నడుస్తుంది. ఇలాంటివే శివశంకు కథ, కుశలవుల కథ, అక్కమ్మ కథ, ఎరుకల నాంచారి కవిత.

"నెత్తి నెరుకల బుట్ట - నెలవంక చుట్ట
బిత్తరా చూపులకు బిడ్డనొక చంక
కొప్పెంత చక్కనిది కోమలి ఎరుకలా
చీరెంత చక్కనిది చిత్రాంగి ఎరుకలు"

- అని తమ్ముల కొండమ్మగారు పాడిన ఈ కథా గేయంలో పేదరికంలో ఉన్న ఎరుకల నాంచారి కుంచెడు వరహాలకు లోబడడం సహజం. నరబలి ఉందనడానికి జానపదుల గుండెల నుండి జాలువారిన ఈ జాలికథే నిదర్శనం. ఈనాడు కూడా ఎరుకల నాంచారి లాంటి జీవితాలు మృగాళ్ళ చేతిలో ఎలా నలిగిపోతున్నాయో చూస్తున్నాము.

"కట్టామీదా కిట్టయ్యా చెంగేపట్టేడు, కొంగే పట్టేడు
విడువిడువూ కృష్ణయ్య చెంగిడవయ్యా, కొంగీడవయ్యా"

లాంటి పాటల ద్వారా ఆడపిల్లలపై మగవాళ్ళ అఘాయిత్యాలు కనిపిస్తూనే ఉన్నాయి.

వడగలిగిన వడిసెల, గాజుల బేరం, సీంకుర్తి కొండ, సామిరారా సారంగధరా, మొదలగు పాటలు, వలపు పాటలు, పంటపాలాలు, చెట్టు, పుట్ట, వాగు, వంకా వీరి విహారస్థలాలు. గాజులు కమ్మలు, కడియాలు, చీరలు, రవికలు, మొదలగు పేద పడతుల కోరికలు. ఇందులో కులాంతర ప్రేమలు, అక్రమ సంబంధాల పర్యవసానాలు కూడా కనిపిస్తాయి.

కన్నోరి భూముల మీద భ్రమలు, ఆడబిడ్డల కన్నీటి మంటలు, అత్త ఆరడిలాంటి బాంధవ్య గీతాలు అను బంధాలకు అద్దాలు.

కడవంత కష్టాన్ని కడుపులో దాచుకొని, ముంతంత సుఖాన్ని ముందుంచుకునే కష్టజీవులు పాడుకునే హాస్య గీతాలు, చతురోక్తులు జంధ్యాల గారన్నట్లు నవ్వుతూ నవ్వించే భోగులు, యోగులు వీరు.

ఇవిగాక వృత్తుల పరంగా పాడుకునే జాలరుల పాట, జానపదుల నాటువైద్యం, మాతపురాణం, అంకమ్మ కథ, నాగులమ్మ పాట, చెంచులు మొదలగు అడవి బిడ్డల పాటలు వారి జీవన సంస్కృతిని, ఆచార వ్యవహారాలను ప్రతిబింబించే పాటల్ని కూడా రచయిత ప్రస్తావించారు.

"కోటలు రానీ, కోటలు పోనీ
మాటను తప్పదు మాకులము. . . . . .
..... గోత్రాలు మాకేల, గీతాలు మాకేల
నేత్రాలు ఒకటైతే సూత్రాలెందుకయ్యా"

ఉలవపాడు వాసి శ్రీ మేక వెంకటేశ్వర్లు పాడిన ఈ పాటలు శారీరక కష్టంతో సానదేరి, నీతి నిజాయితీలకు మారుపేరుగా బ్రతికే యానాదులు - వీరే అనాథలు - శ్రావ్యమైన కంఠస్వరం - వీధి భాగోతాలు వీరి సొత్తులు.

ఈ శ్రామిక గేయాల సాహితీ విశ్లేషకులకు కట్టుబడని స్వేచ్ఛాగీతాలు. శ్రామికులు తాము ఉత్పత్తి జేసే వస్తు విశేషాల వంటివే ఇవి. జానపదుల మనసుల్లాగానే మృదువుగా, మధురంగా, సహజంగా, సరసంగా, సరళంగా ఉంటాయి. భాషా నుడికారానికి గుడులు కడతాయి.

అనునిత్యం మాట్లాడుకునే మాటలే ఆ పాటల్లో దొర్లు తాయి. వారి కష్టంతోపాటు పాటలు కూడా పరాధీన మయ్యాయి అనడానికి నిదర్శనం పనిచేయని వారు నేడు పాడుకొంటున్న భక్తి, సినిమా బాణీలే. నగరీకరణ వలన వ్యవసాయ సంబంధ పనులు కనిపించకుండా పోయినా ఆ పాట బాణీలు మాత్రం సజీవంగానే ఉంటాయి.

అంతో యింతో తిరునాళ్ళ పుణ్యమా అని కోలాటం ప్రదర్శనల్లో ఈ పాటలు వినిపిస్తున్నాయి. ''మమ్మీ'', ''అమ్మా'' అంటే అర్థం ఏంటని అడిగే ఈ రోజుల్లో చరవాణి ద్వారా ''పల్లెపదాల్ని'' తన్మయత్వంతో వింటున్న నేటి యువతను చూస్తే తెలుగు భాష ఉన్నంతకాలం ఈ జానపద సాహిత్యం తెలుగువాడి గుండెల్లో గూడు కట్టుకునే ఉంటుంది.

ప్రముఖ భాషా శాస్త్రవేత్త డాక్టర్ తూమాటి సంజీవ రావు గారన్నట్లుగా జానపదుల విజ్ఞానమనే ముడిపదార్థాన్ని ఆసరాగా చేసుకొని, సాహిత్యం దశదిశలా వికసించింది. అటువంటి సాహిత్యాన్ని విస్మరించడం శ్రేయోదాయకం కాదు. స్మరించడం మన నిత్య విధి.

డాక్టర్ యు. దేవపాలన గారి ''బతుకుపాట'' స్ఫూర్తిగా నేటి సాహితీవేత్తలు, కవులు, రచయితలు, వైవిధ్యమున్న జానపద గేయాలను సేకరించి, పరిశోధించి తెలుగు పలుకుబడిని అమృతమయం చేద్దామని ఆకాంక్ష.

ఆధార గ్రంధాలు :

1. తెలుగు సాహిత్య సమీక్ష - డా॥ జి.నాగయ్య
2. సమగ్రాంధ్ర సాహిత్యం - ఆరుద్ర
3. ప్రకాశం జిల్లా శ్రామిక గేయాలు - డా॥ యు.దేవపాలన
4. బతుకుపాట - డా॥ యు.దేవపాలన

⌘⌘⌘

BHAVAVEENA
Vol. 17, Issue. 8, August 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

చలం వ్యాసాలు – పరిశీలన

– ఆంజనేయులు.ఐ., టి.ఎస్.డబ్ల్యూ.ఆర్.ఎస్. (బి) వీపనగండ్ల, వనపర్తి (జిల్లా), తెలంగాణ.

బ్రహ్మసమాజము - సంఘసంస్కరణము :

చలంగారి దృష్టిలో పాపపుణ్యాల నిర్ణయం ఆనంద అనుభూతులను బట్టి ఉండాలి. ప్రేమే నీతి బ్రహ్మ సమాజం వారు ఈశ్వరుని చూపిస్తారు. బ్రహ్మసమాజం వారు వారికి ఏది తోస్తే అది చేస్తారు. ఏమి చేస్తే జనం అంగీకరిస్తారో అంగీకరించుకో! ఏది ఆమోదయోగ్యం! ఏది ఆమోదయోగ్యం కాదని వారని ఆలోచించారు. మతధర్మమే వారికి ముఖ్యం అంటూ ఒక మాట అంటాడు. "సంఘసంస్కరణ నింత కఠినంగా కోరుట చేతనే బ్రహ్మసమాజం జనకంటకమై యిప్పటికి విస్తరించుకున్నది"

రామమోహనుడు - స్త్రీలోకము :

సమాజంలో దేశాలకు, జాతులకు క్షామాలు, యుద్ధాలు సంభవించిన అంతా కలిసి చాలా తీవ్రంగా విచారిస్తారు. కాని స్త్రీకి నిరంతరం కుటుంబంలో హింసను గురించి ఎవరు మాట్లాడరని తెలిపాడు. స్త్రీ పురుషుడు కన్న శారీరక బలం లేకపోవడం కూడా కూడా ఒక కారణంగా ఆమెను సొంత ఆస్థిగా భావించి ప్రత్యేక వ్యక్తిగా గుర్తించకపోవడం జరుగుతుంది. రామమోహనుడు అనేక రకాలైన ప్రత్యక్షి జీవిత అనుభవాల నుండి స్త్రీకి స్వేచ్ఛను కాంక్షించెను. తనలో పాశ్చాత్యస్వేచ్ఛా భవన, హిందూ సాంప్రదాయకమైన కఠోర నియమాలు స్త్రీని ఎంతగా హింసిస్తున్నాయో వాటిని చాలా వరకు నిరసించాడు. ప్రధానంగా సతీసహగమనం కాలంలో బహుభార్యలను చేసుకొనుట, స్త్రీ పట్ల బాధ్యతయుతమైన విధానం లేకపోవడం పట్ల ప్రభుత్వంతో కలిసి పోరాడాడు.

ఆనందం :

సర్వసృష్టిలో ఉన్న పుతి జీవరాశి విభిన్నమైన జీవన పరిస్థితులు కల్గి ఉంటుంది. భిన్నమైన జీవరాసులకు భిన్నమైన సంతోషాలుంటాయి. దేని ప్రత్యేకత దానిదే. కాకపోతే శరీరం పెద్దది చిన్నది అంతే తేడా. అన్నింటికి ఒకే రకమైన ఆనందం ఉండదు. మనుషులమైన మనం అన్ని రకాలైన ఆనందాల్ని చూడలేము. ఒక్కొక్కరికి ఒక్కోరకం ఆనందం ఉంటుంది. కొందరికి లౌకిక ఆనందాలు మరికొందరికి అలౌకిక ఆనందాలుంటాయి. లౌకిక ఆనందాలలోను నిర్దేశించుకున్న ఆనంద నియమాలు అందరికి ఒకేలా ఉండవు. ఒక్కొక్కరిదారి ఒక్కోలా ఉంటుంది.

అశ్లీలాలు - బూతులు :

వాస్తవ ప్రపంచంలో అశ్లీలాలు, బూతులు అనేవి ఏవి లేవు. అవి అన్ని మన మనుసులోనుంచి వచ్చినదే. తరతరాలను సంప్రదాయ వెగటు నుంచి పుట్టినవే. పురుషుడిలో ఉన్న రొమ్ములు, బాహువులు, దేహాన్ని వర్ణిస్తే తప్పుకాదు కాని అదే స్త్రీ దేహాన్ని వర్ణిస్తే అంగాల్ని వర్ణిస్తే మాత్రం తప్పు అని అంటారు. ఇది సరైంది కాదు. పురుష స్త్రీ తత్వాలన్నీ ప్రకృతి సహజాలే సంప్రదాయాల నిమయాల కట్టుబాట్లు బూతులను సృష్టించాయి. వాస్తవానికి ఇవే నిజమైన బూతులు అవుతాయి.

ఆశయంగా చూపించతగినది మానవుడి ప్రేమ :

సాంప్రదాయంగా ఏర్పాటు కాబడిన లైంగిక నియమ విషయంలో తన భావ బంధుత్వాన్ని గురజాడలో చూసుకున్నారు చలంగారు ఈ వ్యాసంలో. అనాదిగా చూస్తే వివాహం మానవ మనుగడ అభివృద్ధికి ఎంతగానో దోహద పడ్డది. అయితే కొందరి అమాయకత్వంలో అది దుర్మార్గ మయింది. వివాహం పేరు మీద చక్రబంధనంలో పడి నశించిపోతున్న స్త్రీలు ఎందరో ఉన్నారు. విదేశాలలో చాలా వరకు లైంకగికనీతి మనకు చాలా విభిన్నంగా

ఉంటుంది. వేశ్య చాలామంది రహస్యంగా జరిపే లైంగిక విసృంకళులు కన్నా గొప్పది. ఆమె దాని వృత్తిగానే నిర్వర్తి స్తుంది. లైంగిక నియమం నియమించుకున్నదే వాస్తవంగా చూపాల్సింది ప్రేమ మాత్రమే.

కవిత్వం దేనికి :

ఈ వ్యాసంలో చలం, కవిత్వాన్ని ఆస్వాదించటానికి వైవిధ్యమనస్తత్వాలున్నాయంటాడు. మనుషులకు చాలా మందికి కంటికి కన్పించే ఆనందాల్ని చూసి ఈర్ష్యాకాని కళాకారుని, కవి ఆనంద హృదయాన్ని చూసి చూసి వారు ఈర్ష్యపడరు. ఎందుకంటే వారికి అంత తెలివి లేదు. కవిత్వం ఎవరికోసం అంటే కళాహృదయంతో ఆస్వాదించే వారికోసం అంటాడు.

అన్యకాంతలడ్డంబైన :

చలం అభిప్రాయంతో ఇతర స్త్రీలు పురుషులకు ఎదుర్కొన్నప్పుడు ఉండే వాస్తవ అవాస్తవాల్ని చర్చించాడు. తరతరాలుగా పురుషుడి ఆధీక్యం ఫలితంగా అనేక సాంఘిక నియమాల్ని పాటిస్తూ తన వ్యక్తిని వదిలి నటిస్తుంది. పురుషుడు ఎదురై పలకరించబోతే ముడుచు కుంటుంది. పరాయి పురుషుడుకి తన దేహం అవయ వాలు కనిపించరాదని వస్త్రాల్ని సరి చేసుకుంటుంది. వస్త్రాలు లేని వారు కూడా సిగ్గుపడి సరిచేసుకొనే ప్రయత్నం చేస్తారు. చూపులు పైన ఉన్న తలంపులు కింద ఉంటాయి. మాటమాటికి దాచుకున్న దాన్నే పురు షునికి ఇస్తుంది. పరాయి పురుషునితో ఎలాంటి సంబంధం ఉన్నా సోదరా! నాయనా! అనే బయటికి నటిస్తుంది. స్త్రీ పురుషుని ఆధీపత్యం వల్ల నటించి బతుకుతుంది.

సెక్స్ కంట్రోల్ :

సెక్స్ కంట్రోల్ గురించి వీరి అభిప్రాయం ప్రకారం ఇది ప్రకృతి సహజమైన శారీరక ధర్మం. దీనికి రకరకాలైన నియమాల్ని సమాజం ఏర్పాటు చేసింది. ఎక్కువ మాత్రం కంట్రోల్ చేసుకుంటే ఏమవుతుంది. శరీరానికి ఇబ్బంది అలాగే వీర్యం వల్ల కూగా గరిష్ఠ ప్రయోజనం ఉండదు. సంతానం కల్గుతుందనే భయంతో నియమానికి భయపడి చాలా వరకు దూరంగా ఉండి కంట్రోలు చేసుకుంటారు. అయినా సమాజ ప్రవాహంలో మతాలు, రాజ్యాలు అనేకమైనవి కొట్టుకొని పోయాయి.

మ్యూజింగ్ :

మ్యూజింగ్ అనేది అనేకమైన వ్యాసాల సంకలనం. ఇందులో కూడా లైంగిక నియమాలను వాస్తవిక మానవీయచిత్రణను చిత్రించాడు. స్త్రీ, పురుషుల మధ్య ఉండేది. శారీరక అవసవరం. పురుషుడు ఆ అవసరం కోసం స్త్రీని ప్రేమిస్తాడు. అందులో తన స్వార్థం ఉం టుంది. కాని తన కోసం నా ప్రాణం ఇస్తానని, సరస్వం తనే అని చెప్తాడు. ఇలాంటి విషయాల్ని మానసిక చిత్రణను ఈ వ్యాసాలు తెల్పుతున్నాయి.

కవి హృదయం :

కవి హృదయం అన్న పేరుతో నండూరి సుబ్బారావుగారి గురించి రాశారు. ప్రధానంగా ఇందులో ఆయన గారి పాటల ప్రస్థానం ఉంటుంది.

మరువరాని మిత్రుడు :

చలంగారు తన భావ విరుద్ధమైన స్వభావం గల రమణ మహర్షి గురించి మరువరాని మిత్రుడు అని ఎంతో చక్కగా వ్యక్తిగత జీవిత చిత్రణను మూర్తిభవింప జేశాడు.

ఆధార గ్రంథాలు :

1. బ్రహ్మసమాజం - సంఘసంస్కరం (వ్యాసం) - 1916
2. రామమోహనుడు - స్త్రీలోకము (వ్యాసం) - 1917
3. ఆనందం (వ్యాసం) - 1931

4. అశ్లీలాలు - బూతులు (వ్యాసం)
5. ఆశయంగా చూపించదగినది మానవుడి ప్రేమ (వ్యాసం)
6. కవిత్వం దేనికి (వ్యాసం)
7. అన్యకాంతలడ్డంబైన (వ్యాసం)
8. సెక్స్ కంట్రోలు (వ్యాసం)
9. మ్యూజింగ్స్ (వ్యాసాలు)
10. కవి హృదయం (వ్యాసం)
11. మరువరాని మిత్రుడు (వ్యాసం)

⌘⌘⌘

BHAVAVEENA
Vol. 17, Issue. 8, August 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

దోనయమాత్యుని సస్యానందము – సమకాలీనత

– డా॥. అప్పిరెడ్డి హరినాథరెడ్డి, అనంతపురము.

భారతీయ సాహిత్యంలో ప్రాచీన కాలం నుండి అనేక శాస్త్ర గ్రంథాలు వెలువడినాయి. శాస్త్ర గ్రంథాల కంటే ఎక్కువగా సాహిత్యం, చరిత్ర, మతసంబంధిత గ్రంథాలు వెలువడటం సహజం. ఇతివృత్తం ఏ కాలానిదైనా అప్పటి సమకాలీన సమాజం కూడా వాటిలో ప్రతిబింబిస్తుంది.

ప్రస్తుత సమకాలీన సమాజానికీ ఆ రచనలు, లేదా అందులోని అన్ని అంశాలు ఉపయోగపడకపోవచ్చు. అవి ఒక చారిత్రక పరిణామక్రమం అధ్యయనానికి తోడ్పడ తాయి. శాస్త్రగ్రంథాల విషయయానికి వచ్చినప్పుడు నేటి సమాజానికి తప్పకుండా అవి వినియోగపడతాయి. మనిషి బౌతిక అవసరాలను తీర్చడానికి ఉపయోగపడే విజ్ఞానశాస్త్రం ఏ కాలంలో అయినా ప్రకృతి పరిశీలన, కార్యకారణ సంబంధం, ప్రాథమిక శాస్త్ర నియమాలతో రూపొందుతుంది. ఆ శాస్త్రనియమాలు ఏ తరానికైనా ప్రామాణికంగా నిలుస్తాయి.అందుకే ఒకనాటి భారతీయ శాస్త్ర గ్రంథాలు నేటి సమాకాలీన సమాజంలోను నిలబడుతూనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో దోనయ మాత్యుని "సస్యానందం లేదా వర్షశాస్త్రం" గ్రంథాన్ని గురించి ఇందులో పరిశీలిద్దాం.

దోనయమాత్యుడు గ్రంథ అవతారికలో రాసుకొన్న పద్యం బట్టి క్రీ.శ 1356 కాలం చెందిన వారని, తల్లి దండ్రులు మాచిరాజు, రుద్రమ్మలుగా తెలుస్తుంది.

మరొక పద్యంలో...

"వసుధలోన బరమ వంశ విభూషణ
మైన న న్నుపేంద్రుడాదరింప
శ్రీకరముగ సర్వలోకాశ్రయము జెప్పి
మిన్నుముట్టు కీర్తిగన్నవాడ"

అని చెప్పుకున్నాడు. ఉపేంద్ర చక్రవర్తి ఆదరణతో "సర్వలోకాశ్రయం" అనే గ్రంథం రాసి లోకంలో ప్రసిద్ధి పొందానని తెలియజేసాడు. ఈ ఉపేంద్రుని విషయమై నిడదవోలు వేంకటరావు భారతిలో వంశవృక్షం ప్రకటిం చాడు. ఉపేంద్రుడు తూర్పు చాళుక్య శాఖవారు. కళింగ సీమలోని ఎలమంచిలి సర్వసిద్ధి మండలంలో పాలన చేసాడు.1350 లలో ఇతను ఉన్నట్లు నిడదవోలు వారు నిర్ణయించారు.

మరో పద్యంలో సింహాచల స్వామిని ప్రస్తుతించాడు. "పాపములను గొప్పగొప్ప కొరువులను అణగద్రొక్కి, దు:ఖమనే కారుచిచ్చును చల్లార్చి, చక్రము యొక్క కాంతులనేటు వంటి మెరుపులు మెరయుచుండ, నదాప్రీతితో సింహాచలం నందు కాపురమున్న సుందరేశ్వరుడనేటు వంటి మేఘం లోకానికి కృపామృత వృష్టిని వర్షిస్తుందని" పేర్కొన్నాడు. సందర్భోచితంగా ఆ సింహాచలస్వామిని మేఘంతో పోల్చాడు. ఈ ఆధారాలను బట్టి దోనయమాత్యుడిది ఎలమంచిలి ప్రాంతంగా నిర్ణయించవచ్చు. అద్దంకి లింగకవి కొన్ని ప్రక్షిప్తాలను చేర్చి సస్యానందం ప్రకటించాడు. అందులో శ్రీశైల మల్లి కార్జునుని, సిద్ధవటం ప్రస్తావనలున్నాయి. అయితే అది ప్రక్షిప్తమని పరిశోధకులు నిర్ధారించారు.

సస్యానందం గ్రంథం నాలుగు తాళపత్రాలు, రెండు రాతప్రతులు సి.పి బ్రౌన్ సేకరించాడు. ఇవికాక ఇంకా జనంలో ఉండే వీలుంది. 1891లో పువ్వాడ సూర్య నారాయణ రావు అండ్ బ్రదర్స్ వారు తడకమళ్ళ వేంకట కృష్ణారావు గారిచే పరిష్కరింపచేసి ప్రచురించారు. సంగ శేషాచలశాస్త్రి తాత్పర్యం రాసారు. ఆతర్వాత 1915, 1921 లలో ఇది పునర్ముద్రణ అయింది. 1955 లోను ప్రచురణ అయినట్టు ఆరుద్ర గారు పేర్కొన్నారు. 'సస్యానందము-దోనయమాత్యుడు' అనే వ్యాసాన్ని భారతిలో 1946లో జూన్ నెలన నిడదవోలు వేంకటరావు రాసారు. విలువైన

అంశాలు అందులో వెలుగు చూసాయి. ఆ తర్వాత కాలంలో చాగంటి శేషయ్య, ఆరుద్రలు తమ గ్రంథాలలో దోనయమాత్యుడికి స్థానం కల్పించారు. 1921 ప్రతి ఆధారంగా ఉన్నం జ్యోతివాసు పరిష్కరణ- విస్తృత పీఠిక రాసారు. 2016 లో శ్రీమతి రావి కృష్ణకుమారి, చీరాల వారు ప్రచురించారు. కొత్త చూపుతో జ్యోతివాసు ఇందులో విషయాలను ప్రస్తావించారు.

సస్యానందానికి మరో పేరు వర్ష శాస్త్రం. సస్యాలు అంటే పంటపొలాలు. అవి ఆనందంగా పండాలంటే వానలు కావాలి. వానల గురించి వివరిస్తుంది కాబట్టే వర్షశాస్త్రం అని కూడ ఈ గ్రంథానికి పేరు వచ్చింది. వాన రాకడ ప్రాణం పోకడ చెప్పలేమనే సామెత కూడా ఉంది. వానల రాక గురించి తెలుసుకొవాలసిన అవసరం, ఆసక్తి రైతులకు తప్పని సరి అవుతుంది. జ్యోతిష్య శాస్త్రంలో నిష్ణాతుడయిన దోనయమాత్యుడు ఈ వానల విషయమై రాయలనుకొన్నాడు.

"వాన చేత సస్యవర్గంబు వర్ధిల్లు
సస్యవృద్ధి సకల జన సమృద్ధి
కారణంబు దాన గావున ధరలోన
వానవలయు నెల్లవారలకును"

..అని అంటాడు. ఈ గ్రంథం రాయడానికి పూర్వుల గ్రంథాలను, అప్పటికే ప్రజలు అనుసరిస్తున్న పద్ధతులను ఆధారంగా చేసుకొన్నాని వివరిస్తూ.."అను లోకోక్తులా కర్ణించి గార్గ్య, వరాహమిహిర, లల్లాది, సంహితా సారంబులు గూర్చి ప్రవర్ష వివర్షణంబులు జనులకు బోధ సేయుటకై సస్యానందము జెప్ప నుద్యోగించితిని" అని అంటాడు.

తన పూర్వుల కృషిని నిజాయితీగా దోనయమాత్యుడు ప్రకటించాడు.

వేదాంగాలలో జ్యోతిషం ఒకటి. గ్రహగతులు, నక్షత్రాల ఆధారంగా కాలనిర్ణయం చేయడం, ఆయా కాలల బట్టి మంచి చెడుల ప్రభావాలను జ్యోతిష్యం తెలియచేస్తుంది. జ్యోతిష్యశాస్త్రం ఆధారంగా వర్షాలపై కూడా పూర్వ గ్రంథాలలో అనేక ప్రస్తావనలు ఉన్నాయి. సంస్కృత భాషలో ఉన్న వాటిని తెలుగు భాషలో రైతాంగానికి అర్థమయ్యే విధంగా పద్యగద్యాలలో దోనయమాత్యుడు రాసారు. సస్యానందం లోని పద్యాలు రైతుల నోళ్ళలో వ్యాపించాయి. కేవలం పూర్వ గ్రంథాలలోనివే కాకుండా, లోకంలో అనుసరిస్తున్న ఇతర శాస్త్రీయ పద్ధతులను కూడ ఇందులో దోనయమాత్యుడు చేర్చాడు. ప్రక ృతి, వాతవరణ పరిస్థితులను పరిశీలించి, ప్రయోగం ద్వారా నిరూపణయైన వాడుకలోని అనుభవాలను కూడా సస్యానందంలో వివరించడం విశేషం.

సస్యానందం మొత్తం 232 పద్యగద్యాలతో, నాలుగు ప్రధాన అధికారాలుగా విభజించాడు. ఆయా ఆంశాలబట్టి అంతర్గత విభజన కూడా చేసాడు. సరైన పద్ధతిలో మేఘము కనిపెట్టి, మేఘ గర్భ ధారణను, గర్భ పాతమును, గర్భ పాత కారణాలను, గర్భ పరిపక్వ కారణాలు, గర్భము ఫలించు కారణాలు చక్కగా తెలుసుకొని వర్షము కరియుట, కురవకపోవుట చెప్పాలి. నోటికి వచ్చనట్లు తెంపు చేసి చెబితే సభలలో అవమానం పొందుతారు. గౌరవం కోల్పోతారని దోనయమాత్యుడు హెచ్చరిస్తాడు.

శాలివాహన శక సంవత్సరాలను ఎనిమిదితో పెంచి వచ్చిన మొత్తాన్ని తొమ్మిదిచేత భాగించగా వచ్చిన శేషము బట్టి ఆయా సంవత్సర మేఘాల నిర్ణయం చేయాలంటాడు. శేషము 1 అయితే ఆవర్తన మేఘము, 2 సంవర్తన మేఘము,3 పుష్కర మేఘము, 4 ద్రోణ మేఘము, 5 కాలమేఘము,6 నీల మేఘము,7 కారు మేఘము,8 గౌనీ మేఘము, 9 తమము అని శేష సంఖ్యల ఆధారంగా మేఘనిర్ణయం చేసాడు.

వర్షానికి ఆధారమైన ధాతువులుగా వాన, మంచి ఎండ, మంచి శీతము నలువైపుల వ్యాపించు మేఘము, ఉరుము, మెరుపు, పరివేషము,ఇంద్రధనుస్సు, మంచు,

వాయువులను పేర్కొన్నాడు. సూర్యుడు వేడికిరణాలు భూమిపై వ్యాపించి జలం ఆవిరి రూపాన పైకి తీసుకెళ్లే కాలాన్ని గర్భ కాలము అన్నాడు. ఆ ఆవిరి మరల వర్షంగా మారే కాలాన్ని ప్రసవకాలం అని వివరించాడు. మేఘాలు గర్భందాల్చి నూట నలుబది ఏడవ దినం భూమంతయు కానరాకుండ వర్షిస్తుందని వివరించాడు.

గ్రహాల స్థితిగతులు, రాశుల బట్టి ఆయా మాసాలలో వర్షం పడే విధానాన్ని తెలిపాడు.

ఉదాహరణకు...

వృశ్చిక రాశియందు సూర్యుడు ఉన్నప్పుడు సూర్యుడు ఉండే రాశికి, రెండు, మూడు, నాలుగు రాసులతో అనగా ధనస్సు ,మకర, కుంభమందు శుక్రుడు, బుధుడు, బృహస్పతి చంద్రుడు అనే ఈ నాలుగు గ్రహాలు ఉన్నట్ల యితే భూమి అంతటా వర్షాలు పడతాయంటాడు.

సూర్యుడు అనురాధలో ప్రవేశించునపుడు గానీ , మూలా నక్షత్రములో ప్రవేశించునపుడు గాని కొంచమైన వాన పడకపోతే ఆ కార్తె మొదలు పదునాలుగు దినాలు వాన ఉండదంటాడు.

సూర్యుడు జేష్ఠ నక్షత్రంలో ప్రవేశించునపుడు మేఘాలు దట్టంగా ఉంటే వర్షం వస్తుందని వివరించాడు.

మార్గశిర, స్వాతి, ఆరుద్ర, శతభిషములలో వాన, ఎండ మేఘము, ఉరుము, పరివేషము అనే ధాతువులలో ఏ ఒక్కటి ఆకాశంలో కనిపించినా సస్య సమృద్ధిగా వానలు వస్తాయి.

పుష్యమాసములో మూలా నక్షత్రం మొదలుకొని అమావాస్య వరకు తూర్పుగాలితో కూడిన వాన దట్టంగా వస్తే మొదటి కారు పంటలకు సమృద్ధిగా వానలొస్తాయి.

వైత్ర శుద్ధ పూర్ణిమకు లోపల నాలుగు దినములలో వానలు కురిస్తే, ఆ సంవత్సరం రెండవ పంట సమయంలో వానలు తక్కువగా కురుస్తాయి.

వైశాఖంలో ముందుగా పడమటి వైపున మబ్బుపట్టి ఎంత నేల చినుకులు పడతాయో ఆ నేలంతా ఆ సంవత్సరం చక్కగా వానలు పడతాయి. ఈ మాసంలో మబ్బుపట్టి ఉరుము శబ్దం ఎంతవరకు వినిపిస్తుందో అంత దాకా వానలుంటాయని వివరించాడు. ఈ విధంగా ఆయా మాసాలలో వర్షాల స్థితిగతులు క్రమపద్ధతిలో వివరించాడు.

జ్యోతిష్య శాస్త్రం ప్రకారమే కాకుండా ప్రకృతి పరిశీలన, వాతావరణ మార్పులు, జీవరాశుల ప్రతి స్పందనల బట్టి కూడా శాస్త్రియంగా వానల గురించి సస్యానందంలో నమోదుచేసాడు.

సంవత్సరకాలంలో మొత్తంగా వానల పరిస్థితిని అంచనా వేసేందుకు నాగలికి దూది పెట్టి వర్ష రాకలను అంచనా వేసే తులాపరీక్ష పద్ధతిని వివరించాడు.

పుష్య శుద్ధ పూర్ణిమ నాటి ప్రదోష సమయంలో పలిమెడు దూది నాగలికి తగిలించి ఏ అడ్డు లేకుండా బయలులో ఉంచాలి. మరునాడు ఉదయం ఆ దూది పిండాలి. ధారగా నీళ్ళు వస్తే మరుసటి సంవత్సరం వానలు సమృద్ధిగా పడతాయి. కొన్ని బిందువులే దూది నుండి వస్తే మధ్యరకంగా వానలొస్తాయి. దూది మంచు నీటితో కనీసం తడవకపోతే వానలు కురియవు అని పేర్కొన్నాడు. ఒక ప్రయోగం ద్వారా ఇలా శాస్త్రియంగా ఇలా ఆరోజులలో ఒక అంచానకు రావడం విశేషం.

మెట్టకప్పలు కూసినపుడు, జంతువులు నీళ్ళలోకి దిగినపుడు, చిన్న చిన్న చేపలు ఎగిరినపుడు, తామర పుప్పొడిలో తొండలు పొర్లాడినపుడు పంటలు బాగా పండేలా వానలొస్తాయి. భూనాగాలు మెట్టను విడవ కుండా పొర్లాడినపుడు, పశువులు కారణం లేకుండా పుట్టలు, మెట్టల మీదికి ఎక్కినపుడు దట్టంగా వాన లొస్తాయి. ఊరి పొలిమేరలలోని పశువులు తోకలెత్తుకొని, అంభారాలు చేస్తూ గ్రామంలోకి ప్రవేశించినపుడు, సంతోషంతో చీమలు ముక్కున గ్రుడ్లు కరచుకొని బారులు తీరి పోతుంటే, సకల దిశల వ్యాపించిన మేఘాలు నడినెత్తిన మెరుములతో ఉంటే, అనేక సార్లు తూర్పుగాలులు భూమిపై వ్యాపిస్తే, ఆకాశంలో

గోమూత్రం వంటి కాంతులు దట్టంగా వ్యాపిస్తే తప్పక వానలొస్తాయి.

సూర్యోదయం, సూర్యాస్తమయాలలో కొంచం ముందుగా కుక్కలు మొరుగకున్న ఎడల నష్టం కలిగించని, పైరులకు భంగంలేని వాన వస్తుందని వివరించాడు.

పై వాటిలో జంతువుల వింత ప్రవర్తనలు, అరుపుల వెనుక శాస్త్రీయ అంశాలు దాగి ఉన్నాయి. సునామి వచ్చిన సందర్భంలో కొంత ముందుగానే అనేక తీరప్రాంత జీవ రాశుల విచిత్ర ప్రవర్తనను గుర్తించారు. అలాగే భూకం పాలు తదితర సందర్భాలలో తక్కువ స్థాయి తరంగాలను కూడా జీవరాశులు ముందుగా గుర్తిస్తాయని పరిశోధనలు తెలుపుతున్నాయి. ఈ గ్రంథంలో వర్షాలకు ముందు జీవరాశుల ప్రవర్తనను దోనయమాత్యుడు నమోదు చేసాడు.

తొలకరి వాననీటి రుచిని బట్టి ఆ సంవత్సరం ఏయే పంటలు పండుతాయో ఇలా వివరిస్తాడు. వగరు,కారంగా ఉంటే కొర్రపైరు, చేదుగా ఉంటే నువ్వులు, తియ్యగా ఉంటే పత్తి, కుసుమలు, చప్పగా ఉంటే మద్దిగడ్డలు, కసురుగా ఉంటే జొన్నలు,గోధుమలు, పుల్లగా ఉంటే వరిగెలు, సజ్జలు, చిట్టిచామలు బాగా పండుతాయి. ఉప్పుగా ఉంటే ఆ సంవత్సరం పంటలు ఎక్కువ తాలు కంకులే అవుతాయని వివరించాడు.

వర్షం రావడానికి వాయువు కీలకం అంటాడు. వాయువు వలనే మేఘములు పుడుతాయి. మేఘాలు విచ్చిపోయి వానలు వస్తాయి. వాయువు వలన ఉరుముల వస్తాయి. సర్వానికి వాయువే కారణం అని వాయు లక్షణాలు వివరించాడు.

ఆషాడ శుద్ధ పున్నమి నాడు మొదటి జామున గాలి వీస్తే శ్రావణంలో, రెండవ జామున గాలి వీస్తే భాద్రపద మాసంలో, మూడవ జామున వీస్తే అశ్వయుజమాసంలో, నాలుగోవ జామున వీస్తే కార్తీకమాసంలో తగినవిధంగా వర్షాలొస్తాయంటాడు.

వాయు ప్రసారం బట్టి వానలను అంచనా వేసే మరో ప్రయోగాన్ని వివరించాడు. ముతకనూలుతో ఎనిమిది మూరల పొడవు, రెండు మూరల వెడల్పు వస్త్రం నేయించాలి. నలబై ఎనిమిది మూరల పొడవున్న కర్రకు ఆ గుడ్డను పతాకంగా కట్టి ఆషాఢ శుద్ధ పూర్ణిమనాడు తెల్ల వారుతున్నప్పుడు నిలబెట్టాలి. ఆ వస్త్రం గాలికి తూర్పుకు దిశకు ఊగితే వానలు బాగా పడతాయి. ఆగ్నేయ దిశకు పోతే వానలు పడవు. దక్షిణ,నైరుతి వైపు పోతే మేఘాల పుడతాయే కానీ వానలు ఉండదు. పడమటి దిక్కుకు పోతే అతివృష్టితో పాటు, గాలి ఉంటుంది. వాయువ్యం వైపు పోతే అతివృష్టి, సుడిగాలి ఉంటుంది. ఉత్తరం వైపు పోతే పంటలకు తగినంత వాన ఉంటుంది. ఈశాన్య వైపు పోతే మధ్యరకంగా ఉంటుంది. అన్ని వైపులకు తిరుగుతూ మెలికలు పడుతుంటే పంటలు పండే సమయంలో వానలు దట్టంగా పడి చెడిపోతాయి. లేదా శత్రువులైనా చెడగొడతారని వివరించాడు.

మేఘం పరివేషం లక్షణాలు, ఆకారాలను బట్టి కూడా వర్షాల రాకను వివరించాడు. భారతదేశంలో ఏయే ప్రాంతాలకు ఏయే గ్రహాలు ఆధిపత్యం వహిస్తాయో వివరించాడు.

సస్యానందం గ్రంథ అవతారికలో తన కవిత్వ రచన మంచి వాక్యములు, లలితములయిన పదాలతో ఉంటుందని ..

"సదమల వాక్యస్ఫురణయు
పదలాలిత్యంబు జూపి ప్రాజ్ఞులు మెచ్చన్
ముదమున సస్యానందము
వదలక రచియింతు విభుధ వర్గము మెచ్చన్"

.. అని తెలిపాడు. సర్వసాధారణంగా వాడే వృత్తాలనే కాకుండా అరుదైన తోటకము, మత్తకోకిల, తరలము, మానిని, కవిరాజితము, తరువోజ, చౌపద తదితర వైవిధ్యమైన వృత్తాలను కూడా ఉపయోగించారు.

సస్యానందాన్ని శాస్త్రీయ దృష్టి చేతనే గాక భాషా, వాఙ్మయ విషయ దృష్టి చేతను పరిశీలింపదగియున్నది" అని నిడదవోలు వేంకటరావుగారు అన్నారు.

"చందస్సు విషయంలో కొన్ని క్రొత్త సంగతులు చెప్పి నట్లే దోనయమాత్యుడు మన భాషలో ఆనాడు వాడుకొనే కొన్ని మాటలను గురించి కూడా మనకు చెప్పాడు. ఇవి మనకు తరచుగా కనబడని ప్రయోగాలు, మన తిథులలో ద్వాదశి మనకెంతో పుణ్యమైనది. దానికి పారశి అనే పర్యాయపదమున్నట్లు దోనయమాత్యుడు యతి ప్రస్థానంలో వాడినందువల్ల తెలుస్తున్నది" అని ఆరుద్ర పేర్కొన్నారు. ఈ పదం పై జ్యోతి వాసు వివరణ తర్వాత చూపుతాను.

మేఘాల వర్ణనలో " కాటుక క్రోవులు" ఇంకా రైతులు వాడే "ఓదెలు, ఓరంత ప్రొద్దు, నులిపున్నమ, నొంకొలదులు వంటి పదప్రయోగాలను ఆరుద్ర చూపాడు.

నిఘంటువులకెక్కని పదాలు సస్యానందంలో ఉన్నా యని జ్యోతి వాసు వివరించారు. "తొలుతటి వానలోదోయంబు లొగరైన, వఱ్ఱెన యగునేన కొఱచేలు"..లో వగరుగా, వఱ్ఱగా పదాలలో వఱ్ఱు నిఘంటువులలో లేదని బ్రౌణ్యం "కారము"గా స్వీకరించిందని చూపుతాడు. "తలివమ్ము ముతకనూలున"లో "తలివమ్ము" పదానికి పరువు, శయ్య అర్థాలున్నాయి. కానీ ఇక్కడ కంబళి, దుప్పటి అర్థం వస్తుంది. "వెంగలియై సస్యకోటి పెంపడగించున్"లో వెంగలికి అవివేకి, జఱుడు, మూఢుడు అని అర్థాలున్నాయి. కానీ ఇక్కడ కవి "వెనుక" అనే అర్థంలో వాడారు. ఇదే పద్యంలొ రెండవ పాదంలో ముంగలి పదం ఉంది. దానికి వ్యతిరేకంగా వెంగలి అని వాడారు."ప్రతిపద" పదాన్ని పాడ్యమి అర్థంలో ఇందులో వాడటం ఉంది. "ద్వాదశి"కి వికృతి రోదసి, బారసి పదాలున్నాయి. బారసి పదం ఇందులో ప్రయోగించాడు. అచ్చు ప్రతిలో పారశి అని ఉండటంతో ఆరుద్ర గారు కొత్తపదంగా అనుకొన్నారని అది "బారసి" అని జ్యోతి వాసు వివరించాడు.

వస్తు పరంగాను, భాషాపరంగాను దోనయమాత్యుడి సస్యానందం ఎంతో విలువైంది. సమకాలీన సందర్భం లోను ఇది నిలబడుతుంది. ఈ గ్రంథంలో వర్షాల విషయంగా ప్రతిపాదించిన జ్యోతిషశాస్త్ర విషయాలు, అదే విధంగా వర్షాలపై లోకవ్యవహారంలో ఆ రోజులలో చేసిన ప్రయోగాలను నేటి ప్రస్తుత శాస్త్ర సాంకేతిక విజ్ఞానంతో మరింత అధ్యయనం చేసి అందులో ప్రామాణిక అంశాలను నిరూపించి వెలుగులోకి తీసుకొని రావాలి. లక్షలకు లక్షలు ఖర్చు చేసే వాతవరణ శాఖలు, విశ్వవిద్యాలయాలు ఈ గ్రంథ విషయమై అధ్యయనానికి ప్రయత్నించాలి. సాహిత్య, జ్యోతిషశాస్త్ర నిపుణుల సహకారం తీసుకోవాలి.

ఒక్క ఈ సస్యానందం గ్రంథమే కాక తెలుగులో వెలువడిన, ఇంకా తాళపత్రాలకే పరిమితమైన మరెన్నో శాస్త్ర గ్రంథాలపై అధ్యయనం జరగాలి. అలనాటి వారి శాస్త్ర సాంకేతిక, అనుభవ జ్ఞానాన్ని నేటి సమకాలీన ప్రపంచానికి అందచేయాలి. ఈ క్రమంలో ఇప్పటికీ అలభ్యంగా ఉన్న దోనయమాత్యుని "సర్వలోకాశ్రయం" గ్రంథం కూడా వెలుగులోకి వస్తుందని ఆశీద్దాం.

ఆధార గ్రంథాలు:

1. సస్యానందం (వర్షశాస్త్రం) - పరిష్కర్త - తడకమళ్ళ వేంకటకృష్ణారావు. తాత్పర్యం : సంగ శేషచల శాస్త్రి, పునర్ముద్రిత పరిష్కరణ - పీఠిక: ఉన్నం జ్యోతివాసు, ప్రచురణ: శ్రీమతి రావి కృష్ణకుమారి, చీరాల, 2016.
2. సమగ్ర ఆంధ్ర సాహిత్యం - ఆరుద్ర
3. సస్యానందము - దోనయమాత్యుడు (వ్యాసం)- నిడదవోలు వేంకటరావు (భారతి- 1946, జూన్)

⌘⌘⌘

BHAVAVEENA
Vol. 17, Issue. 8, August 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

దాశరథి "నేనంటాను"లో నేటి రాజకీయ పరిస్థితులు

– డా॥. ఆర్. తొలీన కళ, వి.పి.ఆర్. జూనియర్ కళాశాల, నెల్లూరు.

భారతదేశంలో రాజకీయాలు పతనమైపోతున్నాయని, ఉన్నత భావాలుగల నాయకులు కనుమరుగైపాతునారని, స్వల్ప కాలంలో డబ్బు సంపాదించాలని, గూండాలు, నేరస్థులు రాజకీయ వ్యాపారం చేస్తున్నారని, ప్రజల నిస్సహాయత్వాన్ని ఆసరాగా చేసుకొని కోట్లు సంపాదించాలని, ఓట్లు వేసిన ప్రజలను మరచిపోయి, నోట్లు సంపాదించుకొంటున్నారు, ఈ దుస్థితి ఇంకెన్నాళ్ళు? అంటూ దాశరథి భారతీయులందరికి అనేక అచరణాత్మక, ఆవశ్యకమైన అంశాలను తన ఖండికల ద్వారా ప్రదర్శించారు. వీరి రచన అందరిని వెలుగులోని తీసుకు రావడానికి ప్రయత్నించాయి. ఈనాటికి ఈ ఖండిక సజీవమే. పరిస్థితులు మారాలని, మానవుల ఆలోచనా సరళిలో మార్పురావాలని దాశరథి ఆనాడు రాసిన ఖండిక ఈనాటికి మన్నన పొందుతుంది. ఇప్పటికీ ఈ పరిస్థితులు అలాగే కొనసాగుతున్నాయనే భావించవచ్చు. దాన్ని ప్రతిపాదించిన దాశరథి గురించి....

దాశరథి కృష్ణమాచార్యులు ఆయన పూర్తిపేరు. దాశరథి పేరు వినగానే రుద్రవీణ, గాలిబ్ గీతాలు, అగ్నిధార ముందుగా జ్ఞాపకానికి వస్తాయి. తెలంగాణాలోని వరంగల్లు జిల్లాలో మానుకోట తాలూకా అంటే ఇప్పటి మహబూబ్‌నగర్ జిల్లాలో గూడూరులో జన్మించారు.

తెలంగాణాలోని ప్రజల కష్టాలను, ఇక్కట్లను అనుభవించి ప్రతిస్పందించిరి దాశరథి. 'నా తెలంగాణా కోటి రతనాల వీణ' అని పల్కి తెలంగాణా పోరాటములో పాల్గొని 'తరతరాల బూజు నిజాం రాజు ఖబడ్దార్' అని హెచ్చరించాడు. కారాగారాన ఉన్నప్పటికీ ఆలోచనలకు, భాషకు, పాండిత్యానికి పదునుపెట్టుకొని 'ముసలి నక్కకు రాచరికము దక్కునే' అని గళమెత్తి పాడిన ఆధునికాంధ్ర వైతాళికుడు. సంస్కృతాంధ్ర, ఉర్దూ కవితలను జీర్ణించుకొని, రచనకు, వ్యక్తిత్వానికి అవసరమైన వాడిని సంతరింపచేసుకొని అపారమైన ప్రతిభను ప్రదర్శించిన మహాకవి దాశరథి.

అగ్నిధార, పునర్నవం, మహాంధ్రోదయం, మహాబోధి, రుద్రవీణ, కవితాపుష్పకం, గాలిబ్‌గీతాలు, దాశరథి శతకం, తిమిరంతో సమరం, ఆలోచాలోచనాలు దాశరథి రచనలు. సినిమా పాటల రచయితగా ఆంధ్ర ప్రజలందరికీ పరిచయం. తిమిరంతో సమరం కవితాసంపుటికి కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం. గాలిబ్ గీతాలకు ఉత్తమ అనువాదక బహుమతి, కళాప్రపూర్ణ, 'డాక్టర్ ఆఫ్ లెటర్స్' బిరుదులు. ఆంధ్రాభిమానము, శాంతికాముకత, సర్వేజనా:సుఖినోభవంతు సర్వమానవ సౌభ్రాతృత్వం వీరికి నచ్చిన విషయాలు.

'నేనంటాను' అను ఖండిక ఆలోచనాలోచనాలు అను గ్రంథం నుండి గ్రహించబడినది. వీరుడిగా, విప్లవవాదిగా, శాంతమూర్తిగా వారి రచనలు మనకు దర్శనమిస్తాయి.

"ఆలోచనాలోచనాలు" సమాజ సహజ దర్పణంగా దర్శమనమిన్నుంది. నేటి సమాజంలో మానవుని మనస్తత్వం ఈ ఖండికలో తేటతెల్లం. కష్టించి పనిచేయాలని, ప్రజలందరూ ఐకమత్యంగా కలిసిమెలసి ఉండాలని ఈ గ్రంథంలోని సారాంశం.

ఆలోచనల యొక్క లోచనాలు ఈ ఖండిక ద్వారా దాశరథి ఉద్వేగపూరితమైన తత్వం వ్యక్తపరుస్తుంది. అర్హతలేని వాళ్ళ అందలాలు ఎక్కడం. ఆడంబరాలకు పోతే అరిష్టమని, పైపై డాబులకు విలువిస్తే లోపలున్న దంతా డొల్లన్న సంగతి గ్రహించలేరన్న హెచ్చరిక ఉంది.

కళ్లెం ఉన్నది మనచేతిలో,
గుఱ్ఱం మాత్రం పడె గోతిలో

దప్పి తీరదని నేనంటాను
నీళ్ళే అందని మన నూతిలో

ఈ ఖండికలో దాశరథి చెప్పింది కళ్ళెం మన చేతిలోనే ఉన్నది. గుఱ్ఱం మాత్రం గోతిలో పడింది. ఎంత సమర్థవంతమైన చోదకత్వమో. నీళ్ళే అందని నూతులున్నాయి. ఇంకా దప్పికెలా తీరుతుంది? నీరు దానంతటదే రాదు. మనం చేదుకోవాలి, దప్పిక తీరాలంటే. కనుక కళ్ళెం బిగించకపోతే బండి తల్లక్రిందులైపోతుంది. నీటితో గొంతు తడుపుకొనే అవకాశముండదని దాశరథి భావం. నేటి సమాజంలో ప్రజలెట్లా ఉన్నారంటే పడవ నడపలేని వాడు నావికుడౌతున్నాడు. పదం పాడలేనివాడు గాయకుడౌతున్నాడు. కాబట్టి ప్రజలను పాలించలేనివారే నాయకులౌతున్నారని వేదనతో రచయిత చెపుతున్నాడు. పనికి అర్హతలేని వారు ఉంటే ఆ పని ఎంత చక్కగా నెరవేర్చబడుతుందో అర్థమవుతుంది. దేశమంతా ఇలాంటి విధానం కొనసాగితే దేశ భవిష్యత్తు ఏమవుతుందోనని ఆందోళన కలుగుతుంది.

పై పై సొగసులు కల్లసుమా!
లోపలిదంతా డొల్లసుమా!
నిజం తెలియదని నేనంటాను
లేదా కొంపే గుల్ల సుమా!

పై పై సొగసులు అంతా అబద్ధం, లోపలంతా డొల్ల సుమా! ఆడంబరాలకు, డాంబికాలకు, దర్జాలకు విలువిస్తే మనకు మిగిలేది డొల్లేనని గుర్తు చేస్తున్నాడు. ఈ నిజము తెలుసుకొనకపోతే కొంపంతా గుల్ల అయిపోతుంది. బూడిదైపోతుంది. భవిష్యత్తు అంధకారమవుతుందని దాశరథి భావం. మన పొరుగు దేశాలు మనతో ప్రవర్తిస్తున్న తీరు ఇప్పుడు మనం గమనిస్తే దాశరథి మాటలు నిజమని నిస్సంకోచంగా ఒప్పుకోవచ్చు. స్వాతంత్ర్యాన్ని సంపాదించుకొని దశాబ్దాలు గడుస్తున్నా మనపై మన నాయకులు చూపుతున్నదంతా స్వార్థపు త్యాగాలే, అదే పైపై సొగసులు, లోపలి డొల్లగా భావించవచ్చు.

బండను కోయాలి కుసుమదాళం
గుండెను కోయాలి నయనజలం
కదనరంగమున, నేనంటాను
కత్తిని మించాలి కవుల కలం

కుసుమ దళాలు కోయాలి బండనైనా. గుండెను కోయాలి లేదా కరిగించాలి కన్నీరు. అనగా స్థూలత్వం, మూర్ఖత్వం, కాఠిన్యం సున్నితత్వానికి, కంటినీటికి కలిగిపోవాలి. అందుకే కదనరంగంలో కత్తులను కవుల కలాలు మింగేయాలి. కలాలతో పని ఉండాలిగాని కత్తుల అవసరం రారాదని కవి హృదయ వేదన. బండను కోయలేవు పుష్పాలు, కాని గుండెను కరిగించగలవు కన్నీరు అందుకే దాశరథి కోరారు కన్నీటితోనైనా యుద్ధాన్ని నివారించాలి. కత్తికి పనిలేని కలం కావాలి మనకు, కలాన్ని నమ్మి పయనించాలి, సాధించాలి దాశరథి ఉద్దేశం.

నవబాష్పధారలో నవ్వు కాగలవు
ముళ్ళతీగెలోన పువ్వు కాగలవు
యత్నించి చూడమని అంటాను నేను
రాళ్ల రాసులలోన రవ్వ కాగలవు

మానవులు ప్రయత్నిస్తే ఋషులు కావచ్చును. కనుక నవ్య బాష్పధారలో నవ్వు కావచ్చును, ముళ్ళ తీగెలో పువ్వు కావచ్చును. ప్రయత్నిస్తే రాళ్ళ గుంపులో రత్నం కావచ్చును. ప్రయత్నిస్తే అసాధ్యం ఏదీ లేదు. ప్రయత్నంతో ఎలాంటి కార్యానైనా సాధించగలం. కష్టంలోను నవ్వుకాగలవు, ముళ్ళలోనూ పువ్వు పూయగలవు, రాళ్ళలోనూ రవ్వ కాగలవు, ఎప్పుడంటే ప్రయత్నించినప్పుడు మాత్రమే. కాని ఆ ప్రయత్నమే లేనినాడు రాళ్ళు రాళ్ళుగానే ఉంటాయి రత్నం కాలేవు.

కోటినదులు పోలలేవు ఒక్క సింధువుని
కోటితారలు పోలలేవు లోకబాంధవుని
అందుకనే గళం విప్పి నేనంటాను
కోటినేతలు పోలలేరు ఒక్క గాంధీని

ప్రకృతితో సహజీవనం చేస్తున్నాం మనం. దాని

ఆదీనంలో ఉన్నాం మనం. కాని వాటిని వినియోగించి జీవించగలమే గాని వాటిని ఎదిరించి బ్రతకలేం. ఎన్ని నదులైనా చివరకు సముద్రంలో కలుస్తాయి. కనుక ఎన్ని నదులైనా సముద్రంతో సరిపోవు. కోటి తారలైనా సూర్యుని కాంతితో సమానమవుతాయా? కావు, ఎప్పటికీ కావు. అదే విధంగా ఎంతమంది నాయకులైనా త్యాగశీలి, నిస్వార్థ నాయకుడు, భారత స్వాతంత్ర్య రథసారథి గాంధీజీతో సరికారు. ఇప్పుడు నిస్వార్థపూరిత నాయకుడు మన దేశానికి కావాలని దాశరథి భావన. అందుకే గాంధీజీలాంటి త్యాగశీలి దేశం కోరుకుంటుందని దాశరథి అభిప్రాయాన్ని వెల్లబుచ్చారు.

బిరుదూ, సనదూ ప్రతిమానవుడికి కావాలి
పదవీ, హోదా ప్రతిపౌరుడికీ కావాలి
ప్రభుత్వ మెప్పుడు బడసిన పిమ్మట ఏంకావాలి ?
ప్రజల మెప్పుకై ప్రభుతను దెప్పుట కావాలి !

లోకంలో ప్రతి వ్యక్తికి బిరుదు కావాలి. ప్రతి మానవుడికి పదవి, హోదా కావాలి. తొలుత ప్రభుత్వం మెప్పును పొందుతారు. ప్రజల మెప్పును పొందుతారు. ప్రజల మెప్పు కొరకు ప్రభుత్వంను దెప్పుట, హోదాలు సంపాదించు కోవాలని భావిస్తారు. ప్రభుత్వపు మెప్పును పొందుతారు. వెంటనే ఇంకొకదాని కొరకు ఆ ప్రభుత్వాంనే విమర్శిస్తారు. దాశరథిగారి మహోన్నతమైన ఇంకొక అభిప్రాయం ఏమంటే గంగానది భారతీయులదైనా, రావీనది పాకిస్థానీయులదైనా, నదులెట్లున్నా, ఎటు పారినా భారత, పాకిస్థానీయుల వారి హృదయం, మనస్సు కలవాలి. అలాగే ఖండాంతర వాసులైన మనసులు కలిపిన మనషులు కావాలన్నది, వర్గ వైషమ్యం తొలగా లన్నది రచయిత అభిప్రాయం. ప్రజల కొరకు ఏర్పడ్డ ప్రభుత్వాలు వారి శ్రేయస్సుకు పాటుపడాలి తప్ప ఇతరా లైన బిరుదులు, పదవులకోసం కాదు. భారతీయులందరికి సమాన పదవీ, హోదా లభించాలని దాశరథి ఆశిస్తు న్నారు.

ఉత్తరానగల హిమాచలం
దక్షిణానగల జలధిజలం
మన అందరిదని నేనంటాను
ఐకమత్యమే మనకు బలం

ఉత్తరాన హిమాలయాలున్నా, దక్షిణాన సముద్ర జలాలున్నా అవి మనందరివి కనుక మనకున్న బలమంతా ఐకమత్యమే. కనుక కలిసి ఉంటే కలదు సుఖం అన్న మంచి భావన రచయితది. ద్వీపకల్పమైన భారతదేశానికి గల నైసర్గిక స్వరూపం అత్యున్నతమైనది. వనరులు అనంతం. ఇలాంటి సునంపన్నంగా ఉన్న దేశాన్ని విదేశీయులనుండి పోరాడి కాపాడితే దాన్ని రక్షించు కోవాల్సిన బాధ్యత, ధర్మం మనపైనే ఉంది. కాని మన రాజకీయాలు అందుకు భిన్నంగా ఉన్నాయి. నాయకులు పాలనావిధానంలో నిజాం పాలకులులా అంత నియం తృత్వంగా లేకపోయినా ప్రజలకు అవసరాలు తీరడం లేదు. స్వాతంత్ర్యం వచ్చాక ఇంకా కనీస అవసరాలు కూడా తీరని ప్రజలు దేశంలో ఉన్నారంటే నాయకులంతా ఎంలాంటి పరిపాలన అందిస్తున్నారు అన్నది కళ్ళకు కట్టినట్టు మనకు తెలుస్తుంది. సంపదంతా తక్కువమంది చేతుల్లోనే ఉందంటే సామాన్య ప్రజలకు అవసరమైన హక్కులు ఎలా అందుతాయి, దాన్ని సాధించాలంటే దాశరథి అభిప్రాయం ఐకమత్యం అనే ఆయుధాన్ని చేపట్టాలని భావించారు. అదే పై పాదాలలో ప్రతిధ్వనిం చేట్టు చేశారు దాశరథి.

రక్తం నదులై పారకపోతే రాదా రెవల్యూషన్ ?
బుర్రలు బుర్రలు పగులక సమస్యకు లేదా సొల్యూషన్ ?
హింసా, యుద్ధం ఔట్‌డేటెడ్ అని నేనంటాను
శాంతి ఒక్కటే మానవజాతికి సరియగు సాల్వేషన్.

రక్తం నదులై పారితేనైనా వచ్చేది రివల్యూషన్ అంటే విప్లవం? తలలు పగిలితేనైనా దొరికేది సమస్యకు సొల్యూషన్ అంటే పరిష్కారం? హింస, యుద్ధం పాత కాలంనాటివి. ఆ భావాలకు బూజు పట్టింది. కనుక

మానవజాతికి ముక్తి శాంతిమాత్రమే ఎంత గొప్ప ఊహ ఆచరిస్తే ఆనందమే ఫలితం. ప్రతి సమస్యకు పరిష్కారాన్ని సూచించాలంటే తరాలకు తగ్గట్టుగా మార్గాన్ని అన్వేషించాలి. నూతన దారిని కనిపెట్టినప్పుడే నవీన ఆలోచనలు ముందుకు సాగుతాయి. పాత ఆలోచనలకు అభ్యుదయ మార్గాన్ని సాధించాలి. దేశ రాజకీయాలలో రావాల్సిన మార్పులు, అనన్యమైనవి. వాటిని రెవల్యూషన్‌తోనైనా సంపాదించాలని కాని సొల్యూషన్స్ హింసతోనూ, యుద్ధంతోనూ వచ్చినా దాని నష్టం అత్యధికం కాబట్టి శాంతి మాత్రమే మనుషులకు అవసరమైన సాల్వేషన్‌గా దాశరథి సూచించారు.

ఇది అధిక్షేపక, వ్యంగ్యాత్మక రచన. విమర్శ, కోరిక, ఊహ, ఆలోచన అన్నీ ఉన్నాయి. కనుకనే 'నేనంటాను' అన్న కవితా ఖండిక అన్నివిధాలా గొప్పదైనది. రాజ్యాధికారంతో సంపదను సంపాధించాలన్న ఆలోచనలు రాజకీయాలలో ఎక్కువైనాయి. అధికారంతో అక్రమాలు, అరాచకాలు నిరంతరంగా, నిర్విరామంగా సాగించేందుకే రాజకీయాలుగా మారిపోయాయని కవి భావిస్తున్నారు. అందుకే కత్తిని కలంగా మార్చాలని, శాంతిని యుద్ధం లేకుండా సాధించాలని, ఐకమత్యమే బలంగా భావించాలని రాజకీయం ప్రజల బలంగా మారాలని కవి కోరుకుంటున్నారు. నాటినాటికి దేశపరిస్థితుల్లో మార్పు రావాలని ఆర్థికంగాను, సామాజికంగాను ప్రగతికి సాధనంగా రాజకీయాలు, నాయకులు మారాలి. చాందసిక భావజాలాన్ని సమాధిచేసి దేశపరిరక్షణలో భాగం కావాలి. సంఘటితంగా ముందుకు సాగాలి. సమరంలేని సాయుధ పోరాటం సాగాలి. నిరంతరం పరిశ్రమిస్తూ ప్రజా చైతన్యం తేవాలి. సమర్థవంతమైన పరిపాలను ప్రజలకు అంధించాలి. సమకాలీన పరిస్థితులకు అద్దంపట్టే ఈ కవిత ఎన్నటికి సమాధికాదు. నాయకులు, రాజకీయాలు మారేవరకు ఈ ఖండిక సజీవమై నిలిచేవుంటుంది. అభ్యుదయ భావజాలం కలిగిన దాశరథి పాలకులను పరిశీలించి మనకు అందించిన ఖండిక ఇది. అందుకే ఇది నిత్య నూతనత్వాన్ని సంతరించుకుంది. రాజకీయాలు అనవసరపు వాటిపై ఆసక్తి చూపుతూ కాలాన్ని వృథా చేయడం మంచిది కాదని కవి భావం. అభ్యుదయ మార్గం కోసం పరితపించారు కవి. అజ్ఞానాన్ని వదలి విజ్ఞానం వైపుకు పయనించాలి మానవుని ప్రయాణం. దానికి అవసరమైన ఆలోచనలను విరామంలేకుండా ప్రయత్నించాలి. పరిస్థితులను అవగాహన చేసుకుంటూ మరమార్థాన్ని సాధించాలి. అదే దాశరథి అంతిమ లక్ష్యం.

"ఐకమత్యమే బలం బలం
అనంతశక్తి గళం గళం
మానవులకది వరం వరం
శాంతి సాధనకు ఫలం ఫలం"
"మనమందరం భారతీయులం - భావితరాలకు సారధులం"

ఆధారగ్రంథాలు :

1. ఆలోచనాలోచనలు - దాశరథి
2. తెలుగులో కవిత్వోద్యమాలు - తెలుగు అకాడమి
3. ఆధునిక తెలుగు సాహిత్యంలో ప్రక్రియలు, ధోరణులు - తెలుగు అకాడమి

⌘⌘⌘

BHAVAVEENA
Vol. 17, Issue. 8, August 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

హెలన్ కెల్లర్ స్త్రీవాదం – సమకాలీన దృక్కోణం

– వై. ఋజ్జి , లెక్చరర్, జి.బి.ఆర్. డిగ్రి కాలేజి, అనపర్తి.

'జీవిద్దాం' అనునది 'జీవిస్తాను' అనుపదానికి బహు వచనం. జీవిస్తాను అనుటలో స్వార్థం, అహంకారము రెండు ఉన్నవి. జీవిద్దాం అనుటలో సామాజిక బాధ్యత ఉంది. మనుషులందరితో కలసి జీవించాలనే తపన ఉంది. జీవిస్తాను. జీవిస్తాము అనే పదాలకు భిన్నమైనది. జీవిద్దాం మానవునిగా పుట్టినందుకు ప్రస్తుత సమాజంలో అందరిని కలుపుకొని జీవిద్దాం. మనం జీవించడానికి సృజనాత్మకత తాత్విక చింతన అవసరం. మనం గత కాలాన్ని పూర్తిగా నెట్టివేసి శూన్యంగా మార్చి వేస్తే జీవితంలో ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేం. మానవునిగా పుట్టినందుకు మేధా సంపద కలిగి ఉన్నందుకు ఆలోచనా శక్తితో జన్మించినందుకు ఎవరికి వారు పరిష్కారాన్ని ఆలోచించవలసిందే ఈ సృష్టిలో ప్రకృతి అందమైనది. ఈ ప్రకృతిలో ఎన్నోరకాల చెట్లు, పూలు, ఆకులు, తీగలు ఉంటాయి. వాటితోపాటు అద్భుతమైన శిల్ప సంపద ఉంటుంది. వీటన్నింటినీ మనం చూడాలంటే మనకు కళ్ళు ఉండాలి. కానీ ఈ అందమైన ప్రకృతిలోని అన్నిరకాల వస్తువులను చూడగలుగుచున్నారు. సమాజంలో వికలాంగులు ఎందురో ఉన్నారు. వారు నిరాశ నిస్పృహలతో ఉండక పట్టుదలతో అన్నిరకాల వ్యవస్థలలో పనిచేస్తూ వారిలో ఆత్మవిశ్వాసాన్ని నింపు కొనుచున్నారు.

కొందరు చూడలేక, వినలేక, మాట్లాడలేక జీవించు చున్నారు. వారందరిలో నేను గొప్పవాడిని, అన్ని చూడ గలను, చేయగలను వినగలను ఇవన్నియు చేయుటకు నాకు శక్తి ఉంది కనుక నేను గొప్పవాడిని. ప్రపంచంలోని అనేకానేక వర్ణాల వారికి తాకవు. మనిషి తన సామర్థ్యాలకు ఎప్పుడు తావివ్వడు. ఎల్లప్పుడు అందని వాటికోసమే పరితపిస్తూ ఉంటాడు. బాధాకరమైన విషయం "దృష్టి" అనే వరాన్ని మనుషులు ఒక సాధారణమైన అంశంగా భావించడం కాని ఈ వరంతో జీవితాన్ని సంతోషాల ఇంద్రధనుస్సుగా మార్చుకొని రాగరంజితం చేసుకోవచ్చు. అలా జీవితమును రాగరంజితం చేసుకొనినవారిలో హెలన్ కెల్లర్ ఒకరు. ఈమె అంధురాలైనప్పటికి, విని పించకపోయినప్పటికి జీవితంలో ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొని ధైర్యముతో ముందుకు వెళ్ళి స్త్రీవాద హక్కుల కోసం తనలాంటివారికోసం సమాజంతో పోరాడి తమ హక్కులను సాధించిన ధీరవనిత.

బాల్యం :

హెలెన్ ఆడమ్స్ కెల్లర్ జూన్ 27, 1880న అమె రికాలోని అలబామా రాష్ట్రంలోని టస్కాంబియా అనే బస్తీలో జన్మించింది. ఈమె పుట్టినపుడు అంగవికలురలు కాదు కాని ఏడాదిన్నర గడచిన తర్వాత పెద్ద జబ్బుచేసి మెదడు తీవ్రత రుగ్మతకు గురై క్రమక్రమంగా చూపు, వినికి తర్వాత మాట్లాడు శక్తిని కోల్పోయారు. ఈమెలోని తెలివి తేటలకు ఇతర అవయవాల ఆరోగ్యానికి ఏ మాత్రం లోపం రాలేదు. మాడేళ్ల వయస్సులో ఒకరోజు "ఏప్రన్" పే తడుపుకొని ఆరబొట్టుకొనేందుకు గది హెచ్చ దనం కోసం ఉంచిన పొయ్యి దగ్గరకు చేరుకోవడంతో అమె బట్టలు అంటుకొని కనుబొమ్మలు, జుట్టు, నుదురు కలిపోయినవి. వెంటనే తన తల్లిదండ్రులు చలించి దగ్గరలోని ప్రముఖ నేత్రవైద్యుని సంప్రదించగా చూపు వచ్చే అవకాశం లేదుగానీ మెదడులోని నరాలన్నీ చురుకుగా పనిచేస్తున్నాయి. వాషింగ్టన్ అలెగ్జాండర్ గ్రహంబెల్ వద్దకు తీసుకెళ్ళమని సలహా అందింది.

విద్యాభ్యాసం :

ప్రపంచ ప్రఖ్యాత అయిన అలెగ్జాండర్ గ్రాహంబెల్ భార్యకు దారుణమైన చెముడు. ఆమెకు మాటలు నేర్పే

పట్టుదల, అవిరామ ప్రయత్నాల ఫలితమే టెలిఫోన్ ఆవిష్కరణ. అతని సలహా మేరకు అంధులకు విద్య నేర్పే "పెర్కిన్స్ ఇనిస్టిట్యూట్" యాజమాన్యాన్ని (బోస్టన్) కెల్లర్ తండ్రి అభ్యర్థించాడు. తన కూతురుకు విద్య నేర్పే అధ్యాపకురాలిని ఒప్పించి తన ఇంటివద్దే విద్య నేర్పేందుకు పంపమన్నాడు. ఈ ఇనిస్టిట్యూట్ వారే మూగ, గుడ్డి వ్యక్తి మాట్లాడడం రాయడం నేర్పిన ప్రపంచంలో మొదటి వ్యక్తి "లారా బ్రిడ్జియన్సు" తీర్చిదిద్దారు. కెల్లర్ విద్య నేర్పించడానికి "అన్నే సలీవాన్" నియమించబడింది. ఈమె పూర్తి పేరు "అన్నెమాన్స్ ఫీల్డ్ సలీవాన్" ఈమె పట్టుదలకు ప్రతిరూపం. ఈమె బాల్యంలోనే తల్లిదండ్రులను కోల్పోయింది. అందుల సేవకు అంకితమైన సలీవాన్ అధ్యాపకురాలిగా నియమించడం ప్రపంచ వికలాంగుల చరిత్రలో పరమాద్భుత అధ్యాయానికి ప్రారంభం కాగలిగింది. దృష్టి లేదు. కనుక జీవితం వృధా అని భావించే వారికి ఈమె ఒక ఆశాకిరణం అయింది. కెల్లర్‌కు జ్ఞానేంద్రియాలలో ముఖ్యమైన మూడు అవయవాలు లోపమే. ఇటువంటి ఆమెకు విద్యనేర్పడం ఊహలకు అందని విషయం. అయినా సాధ్యం చేసింది. మొదటగా హెలెన్ ఒక బొమ్మ అందించి ఆమె అరచేతి మీద "డాల్" అని రాసింది. తాను నేర్చుకొనిన మొదటి పాఠము, పదము ఇదే. ఎ,బి,సి,డి లు చేతి మీద రాసి చూపడం ప్రారంభమైన తర్వాత కెల్లర్ అంచలమైన ఆత్మ నిబ్బరంతో, అత్యద్భుత ధారణా శక్తితో టీచర్ బోధనలను బాగా ఆకళింపు చేసుకొని సాధనచేస్తుంటేది. తల్లిదండ్రుల నుండి హెలెన్‌ను వేరుచేసి, దూరంగా ఒక వైట్ హౌస్‌లో విద్యాబోధన జరిగింది. తనకు కనబడిన ప్రతి వస్తువు పేరు టీచరు ఆమెతో రాయించడం, గుర్తించడం చేయిస్తూండడంతో నిరంతర విద్యార్థన కొనసాగుతూ వచ్చింది.

బ్రెయిలీలో విద్యార్జన :

వినికిడి శక్తి ఉన్న అంధులు సులభరీతిలో రాసే పద్ధతి ఫ్రెంచ్ దేశస్థుడు. పుట్టుగుడ్డి అయిన "లూయీబ్రెయిలీ" కృషి ఫలితంగా ఏర్పడినది. అది ప్రపంచ వ్యాప్తంగా అమలుకు వచ్చిన పద్ధతి "బ్రెయిలీ లిపి" వినికిడి, మాటకూడా లేని కెల్లర్ ఈ పద్ధతిలో రాయడం నేర్పడం అత్యంత కష్టభరితమే కాకుండా, ఎంతో సహనం, మెళకువ, నేర్పుకూడా అవసరం అయినప్పటికీ సలీవాన్‌కు సాధ్యమైంది. ప్రతి భావాన్నీ, అంశాన్నీ తన అరచేతిలో వ్రాయడం దానిని గ్రహించే ఆకళింపు శక్తి"ని పెంచుకున్న కెల్లర్ పట్టుదలతో నేర్చుకొని అతి తొందరగానే బ్రెయిలీ లిపిలో ఉన్న పుస్తకాలన్నీ జీర్ణించుకున్నారు. సేవాన్ అధ్యాపకురాలిగా చేరిన (1887) మూడు సం॥లలోనే బ్రెయిలీ లిపిని అపోసన పెట్టినది. ఆ ఉత్సాహంతో 1900లో కాలేజీలో అడుగు పెట్టి బి.ఎ. పట్టా పుచ్చుకున్నారు. కాలేజీలో తరగతికి తన టీచర్‌ను వెంట తీసుకెళ్ళేవారు. అని తరసాధ్యాన్ని సుసాధ్యం చేసి విద్యాభ్యాసం చేశారు.

ప్రపంచ పర్యటనలు :

కెల్లర్ తండ్రి మరణంతో ఆర్థిక సంక్షోభం ప్రారంభమవగా స్వశక్తితో జీవనయానం చేసి జ్ఞానముపార్జన కోసం అనేక గ్రంధాలను చదివారు. భాషాంతర తర్జుమాల ద్వారా స్వంతగా రచనలుచేసి సంపాదనను ప్రారంభించారు. జర్మన్, ఫ్రెంచ్, ఇలాలీయన్ భాషలు నేర్చుకున్నారు. 1914 నుండి ప్రపంచ పర్యటనలు ప్రారంభించి, మొదటి, రెండవ ప్రపంచ యుద్ధాలలో క్షతగాత్రులైన సైనికల పునరావాస కేంద్రాల ఏర్పాటుకు నిరంతర కృషి చేశారు. యుద్ధంలో చనిపోయిన వారి కుటుంబాలకు సహాయం చేయుటకు వివిధ పధకాల ప్రారంభానికి ఆయాదేశాల పాలకులను, స్వచ్ఛంధ సేవా సంస్థలను అభ్యర్థిస్తూ పర్యటనలు జరిపి గణనీయమైన స్పందనను సాధించారు. 1968 నాటికి మొత్తం 39 దేశాలలో పర్యటించారు.

మహావక్తగా :

కెల్లర్ వయసు పెరుగుతున్న కొద్ది ప్రతిది నేర్చుకోవాలన్న తపన ఏర్పడుటచే తన శారీరక మానసిక

శక్తులన్నీటినీ కేంద్రీకరించి, చేతి వేళ్ళతోనే తన మనోభావాలను ఎదుటి వారికి అర్థంకాగల రీతిలో చెప్పడంతోనే తృప్తి చెందలేదు. ఒకరోజు నార్వేలో ఒక మూగమహిళ మాట్లాడం నేర్చుకో గలిగింది. అనే వార్త తెలిసి తాను మాట్లాడాలని కఠోర శ్రమపడింది. నార్వే మహిళ మూగదైనా చూపు చక్కగా ఉన్నదని, ఇతరులు మాట్లాడే టప్పుడు పెదాల కదలికలను అనుకరించి నిత్యం సాధ్యంతో ఆమె సాధించినదని, మరి చూపులేనప్పుడు సాధ్యపడదని టీచర్ వారించినా సమాధాన పడలేదు. మాట్లాడడం నేర్పే టీచరును నియమించుకుని, ఆమె మాట్లాడుతున్నపుడు ముఖం, నాలుక, పెదాలు, గొంతు నాళాలు ఆమె ఏఏవిధంగా కదులుతున్నాయో, తన వేళ్ళతో తడిమి తెలుసుకొని తానూ ఆవిధంగా అనుకరించి కఠోర శ్రమతో సాధన చేశారు. మొదటలో కెల్లర్ మాటలు సలీవన్‌కు, కొత్త టీచర్ (పుల్లర్) కు మాత్రమే అర్థమయ్యేవి. మొత్తం మీద కెల్లర్ నిరంతర కఠోర శ్రమతో రానురాను తన స్వరపేటిక చలించి, స్వరంలో స్పష్టత చేకూరింది అతి కొద్దికాలంలోనే మహావక్తగా కాగలిగినది.

విశేష మానసికశక్తులు :

మనోబలం, దీక్షలనే ఆక్సిజన్‌గా ఉపయోగించుకుంటూ, కాలక్రమేణా అందరి మాదిరిగానే చెస్ ఆడడం గుర్రపు స్వారీ చేయడం, సైక్లింగ్ మొదలైన రంగాలలో చొరబడ్డారు. ఈమెకు సంగీత కచేరీలు, సారస్వత గోష్ఠులలో పాల్గొనడమంటే చాలా ఇష్టం. బదిరత్వాన్ని జయించే అద్భుతమైన శక్తిని కూడా అందుకున్నారు. ఈమె శరీరం శబ్దతరంగాలలోనే సునిశిత తారతమ్యాన్ని గాలిలో వచ్చే అతి సూక్ష్మమార్పులను (తరంగ ధ్వనులు) కూడా గ్రహించ గలిగినంత సుకుమారంగా, సునిశితంగా రూపొందడం అత్యంత విశేషం. ఈమెకు పరిచయమై వ్యక్తులు మరల ఏదో ఒక సందర్భంలో కనబడితే వెంటనే వారిని గురించేది. మన దేశంలో ఎం.యస్. సుబ్బలక్ష్మి మాధుర్యాన్ని, తన వేళ్ళ ద్వారా ఆమె గొంతును తాకుతూనే నిర్ధారించగలిగారు. మనిషి నడుస్తున్నపుడు భూప్రకంపనల ద్వారా అవ్యక్తి ఎవరో కూడా చెప్పగలిగేవారు. తన అద్భుత మానసిక శక్తులలో ప్రపంచ దేశాలు తిరిగి అచటి వారిని ఆకట్టుకొని వికలాంగుల సేవా కార్యక్రమాలకు నిరంతర కృషిచేశారు.

అంధుల సేవ :

తన జీవితాన్ని అంధుల సేవకు సమర్పించి, అమెరికన్ ఫౌండేషన్ ఫర్ ద బ్లైండ్ సంస్థను స్థాపించి, దాని నిధి సేకరణకు ప్రపంచ వ్యాప్తంగా పర్యటించారు. సదస్సులు సమావేశాలు ఏర్పాటు చేశారు. భారీ స్థాయిలో నిధులు సేకరించి వికలాంధులకు ఖర్చు చేశారు. 1955లో భారత దేశాన్ని సందర్శించారు. ఢిల్లీలో నెహ్రూ అధ్యక్షతన బహిరంగ సభ జరిగింది. తరువాత బొంబాయిలో అప్పటి ముఖ్యమంత్రి, గవర్నర్ ఆధ్వర్యంలో సభ జరిగింది. కెల్లర్ నెహ్రూను స్పృశించి, స్పర్శించి తరువాత అతనిని ఒక కళాఖండమని, శాంతస్వరూపుడని, విశాల హృదయుడని అభివర్ణించింది. వికలాంగులకు ఆత్మస్థైర్యాన్ని, మనోబలాన్ని కలిపించింది. ఆమె పేరు మీద అమెరికా, ఇంగ్లండ్, స్వీడన్ వంటి అనేక దేశాలలో సేవా కార్యక్రమాలు నెలకొల్పబడుతున్నాయి. 1902 కొనసాగించిన రచనా రంగము జీవితాంతము కొనసాగించారు. "ద ప్రోర్చి ఆఫ్ ద డార్క్‌నెస్, అనంతరం డార్క్‌నెస్, ద ఓపెన్ డోర్, లెట్ అజ్ హోప్ పెయింగ్, దసాంగ్ ఆఫ్ ద స్టోరీ వెల్ మొదలైన రచనలు చేశారు. ఈమె జీవిత ఆధారంగా పలువురు డాక్యుమెంటరీ చిత్రాలు తీశారు. ఆస్కార్ అవార్డ్ 1955లో లభించింది.

అవార్డులు, రివార్డులు :

అమెరికా దేశపు అత్యున్నత అవార్డు

1. 'ప్రెసిడెన్సియల్ మెడల్ ఆఫ్ ఫ్రీడమ్' అవార్డు
2. ఫి లీప్పిన్స్ దేశపు 'గోల్డెన్ హార్ట్' అవార్డు
3. లెబానాన్ దేశపు 'ఆర్డర్ ఆఫ్‌క్రాస్ అవార్డు
4. జపాన్ ప్రభుత్వం వారి 'సీక్రెట్, ట్రిషర్' అవార్డు.
5. బ్రెజిల్ దేశపు ఆర్డర్ ఆఫ్ అవార్డు.

6. ప్రపంచంలో ప్రతిష్టాత్మక విశ్వ విద్యాలయాలలో డాక్టరేట్లు.
7. ఫ్రెంచ్ జాతీయ వికలాంగుల సంస్థ గౌరవ సభ్యురాలు.

ఈమె అంధులకు, బదిరులకు, మూగవారికి వారధిగా, వికలాంగుల ఉద్యమాల సారధిగా ప్రపంచ స్థాయిలో పేరు గాంచింది. ఎందరెందరికో స్ఫూర్తినిచ్చారు. ఊహ అందీ అందక పూర్వమే పెద్ద జబ్బుచేసి చూపు, వినికిడి, మాట పోగొట్టుకుని పూర్తి వికలాంగురాలై ప్రపంచాన్ని చూసింది లేదు. కాని అందరికంటే ఉన్నతంగా జీవించారు. పట్టుదలతో సాధించ లేనిది లేదు అని తన జీవితం ద్వారా ప్రపంచ పౌరులందరికి ఆదర్శవంతమైన స్మారక సేవా విదుషీమణిగా వన్నెకెక్కారు. 19శతాబ్ధంలో శక్తివంతులు ఇద్దరే ఒకరు నెపోలియన్, రెండు కెల్లర్ ప్రసిద్ధ రచయిత మార్క్ ట్వయిన్ మన్ననలు అందుకున్న ఈమె "వికలాంగుల హక్కుల మీదనే కాక, మహిళల హక్కులను గూర్చి" పుంఖాను పుంఖాలుగా పత్రికా రచనలు చేశారు.

'మహిళా హక్కుల" సాధనకు స్వయంగా ఉద్యమాలు నడిపారు. "డిస్టోరీ ఆఫ్ మై లైఫ్, గ్రంధ రచనలో తన పుస్తక రచనకు శ్రీకారం చుట్టి అనేక రచనలు చేశారు. వికలత్వానికి అంధత్వానికి మూలం పేదరికమని, అది లేక సమాజ స్థాపన ద్వారా వికలాంఉల సమస్యల పరిష్కారం సాధ్యమనీ అట్టిది సమసమాజ స్థాపన ద్వారానే సాధ్యమని ధృడంగా విశ్వసించి వికలాంగుల భవిష్యత్తుకు విశేష కృషి చేశారు.

ముగింపు :

1887 మార్చి 7 న విద్యార్ధన సాగించి 1900లో కళా శాలలో చేరి గ్రాడ్యుయేషన్ చేసి రచయితగా, వికలాంగుల సమస్యలను, స్త్రీల హక్కులను గూర్చి పత్రికలలో పరం పరంగా వ్యాసాలు రాసి, అంధులకు, బదరులకు, మూగవారికి వ్యాసాలు రాసి, అందు అనేక సేవా కార్యక్రమాలను చేపట్టిన కెల్లర్ 1968 జూన్ 1న మరణించారు. వికలాంగుల మనోప్రపంచంలో శక్తివంతమైన వెలుగుగా ప్రవేశించి వారికి ఆషాజ్యోతిగా ఆత్మబంధువుగా మనోనిబ్బరాన్ని కల్పించిన హెలన్ కిల్లర్ మహిమాన్వితురాలు.

⌘⌘⌘

BHAVAVEENA
Vol. 17, Issue. 8, August 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

దళిత సాహిత్య రచనలు – సమకాలీనత

– సారంగపాణి బండి, పొట్టి శ్రీరాములు, తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్, తెలంగాణ.

దళిత సాహిత్యం అనేది దళితుల జీవితాలను చూపించడంతోనో లేక దళితులను ప్రభావవంతులుగా ప్రేరేపించడంతోనో పూర్తికాదు. వారిలో చైతన్యాన్ని రగిలించి, పోరాడేటట్లు ప్రేరేపించి వారిలో ధైర్యాన్ని మేల్కొల్పాలి. అన్ని రంగాలతోపాటు సాహిత్య రంగంలోనూ దళితులు నిరాదరణకు గురయ్యారు. కొన్ని తరాలుగా దళితులను బానిసలుగా, ఉరితీసే తలారులుగా, నీచులుగా తెలివిలేనివారిగానే చూపిస్తున్నారు. దళిత వనితలను దాసీలుగానూ, భోగించుటకుగానూ వర్ణించి, వీళ్ళందరినీ కనీసం మనుషులగా కానీ, వ్యక్తిత్వం ఉన్నవారిగా కానీ చూపించలేదు. దళితేతరులను మాత్రం శక్తివంతులుగా చూపించడం జరుగుతుంది. వీటన్నింటి నుండి విముక్తి కోసం, దళితులు ఎదుర్కొంటున్న బాధలను అనుభవాలను వారిపై జరుగుతున్న అత్యాచారాలను తెలియజేయడానికి మరియు దళితులను చైతన్య పరచడానికి ''దళిత సాహిత్యం'' ప్రారంభమయింది.

తెలంగాణ ప్రాంత దళితుల సమస్యలను గుండెడప్పు కనకయ్య ''మేమిట్లుండం' అనే కథల సంపుటిలో తెలంగాణ భాషలో రాశారు. దళితులలో ఆత్మన్యూనత పోలేదని దానిని ఉద్దేశించి రాశారు. 1906వ సం॥లో భాగ్య రెడ్డి వర్మ సారధ్యంలో స్థాపించిన ''జగన్ మిత్ర మండలి'' తెలంగాణ స్వాతంత్ర్య దళిత జాగృతి మేలుకొలుపుకు నాంది పలికింది. ప్రస్తుతానికి సుమారు 104 సం॥ క్రితం హైదరాబాద్ పట్టణంలో ప్రారంబమైన దళిత చైతన్యం కాలక్రమంలో పరిణతి చెంది ఒక నిర్ధిష్టమైన దళిత ఉద్యమానికి రూపకల్పన చేసింది. శతాబ్దాల పాటు కుల దోపిడి, అణచివేతకు గురై అవమాన పరిస్థితుల్లో మగ్గుతున్న దళిత కులాల విముక్తికి ఆలోచనా విధానానికి పరిష్కార మార్గాన్ని చూపించింది. దళిత ఉద్యమాలకు మూల పురుషుడు భాగ్యరెడ్డి వర్మ, ఆ తర్వాత అరిగె రామస్వామి మొదలగు వారు. దళిత జాగృతికి ఉద్యమాలకు ఎంతగానో శ్రమించారు. వారు చేపట్టిన ఉద్యమాలకు కృషికి అగ్రవర్ణ నాయకుల సహాయ, సహకారాలు కూడా ఉన్నాయి. తెలంగాణాలో మాడపాటి హన్మంతరావు, సురవరం ప్రతారెడ్డి, వామన నాయక్, రాజా ధనరాజగిరి, రామ్ బాల ముకుంద్‌లను ప్రముఖంగా చెప్పవచ్చు. దళిత కథల్లో కనిపించే మరొక ధోరణి దళితులు క్రైస్తవులుగా, ముస్లిములుగా మారడాన్ని వివరించే కథలు, స్వాతంత్ర్యానికి పూర్వం హిందూమతంలో దళితులపై ఉన్న నిర్భందాల కారణంగా దళితులు ఇతర మతాల్లోకి వెళ్ళాలని వర్ణించారు. నిజాం రాష్ట్ర దళిత నాయకత్రయంగా పిలువబడే భాగ్యరెడ్డి వర్మ, అరిగె రామస్వామి, వెంకట్రావు అణగారిన వర్గాల్లో సామాజిక స్పృహ, చైతన్యాన్ని పెంపొందించడానికి విశేషకృషి చేశారు. జగన్ మిత్రమండలి హైందవ (వైదిక) ధర్మాన్ని వర్ణ వ్యవస్థను నిరసించి, బౌద్ధ ధర్మాన్ని ప్రచారం చేసింది

1993 వ సం॥లో జయధీర్ తిరుమలరావు ప్రధాన సంపాదకత్వంలో వెలువడిన 'దళిత గీతాలు' చాలా వరకు అస్పృశ్యత నివారణకు ప్రయత్నించిన గేయాలున్నాయి. 1930వ సం॥లో జాలా రంగస్వామి రాసిన 'అంటరాని వారెవరు' అనే గేయం బొబ్బిలి యుద్ధం బుర్రకథగా సాగింది. నక్కా చిన వెంకయ్య 'హరిజన కీర్తనలు', 1992 సం॥లో బోయి భీమన్న డా.బి.ఆర్. అంబేద్కర్ పై రాసిన 'జయ జయ అంబేద్కర్, 1933 సం॥రంలో కుసుమ ధర్మన్న రాసిన 'హరిజన శతకం' అస్పృశ్యత నివారణకై శక్తివంతమైన పాటలు, గద్దర్ రాసిన 'దళిత పులులమ్మా'', ''పొట్ట కూటి కోసం పోలీసోడు', గూడ అంజయ్య రాసిన 'ఊరు మనదిరా ఈ వాడ మనదిరా'' గేయాలు

దళితులను చాలా ప్రభావవంతం చేస్తున్నాయి. 1941వ సం॥లో గుర్రం జాషువా రాసిన ''గబ్బిలం'', 1963వ సం॥లో ఎడపల్లి సామ్యూల్‌రాసిన 'చిక్కుడు', 1974 స॥లో మల్లవరపు జాన్ రాసిన ''విశ్వప్రకాశం'', ''అతుకుల బ్రతుకులు'', ఎంతోమంది కవులు కుల నిర్మూలనను ఆకాంక్షిస్తూ, దళితులను ఉత్సాహపరిచారు.

గుర్రం జాషువా పద్యాలు నాటికి, నేటికీ దళితులకు ప్రేరణనిస్తూనే ఉన్నాయి. దళిత సాహిత్యంతో పరిచయం ఉన్న ప్రతీ ఒక్కరికీ గుర్రం జాషువా రాసిన పద్యం ఒక్కటైనా నోటికి రాకుండా ఉండదు. గబ్బిలం కావ్యంలో పరమేశ్వరునికి సందేశం పంపిస్తూ దళితుని గురించి ఆయన రాసిన. . . . . .

ముప్పు ఘటించి వీని కులమున్, గలిమిన్ గబలించి దేశమున్
బిప్పి యొనర్చు నీ భరత వీరుని పాదము కందకుండా
జెప్పులు కుట్టి జీవనము సేయును గాని నిరాకరింపలే
దెప్పుడు నప్పువడ్డది సుమీ భారతావని వీని సేవకున్

అని వర్ణించారు. జాషువా. . దళితులు శ్రమను విలువ కట్టడం సాధ్యం కానిదని జాషువా రాసిన పద్యం ద్వారా తెలియజేశారు. అలాగా దళితేతరుడైన తుమ్మల సీతా రామమూర్తి, గాంధీ ప్రభావంతో అస్పృశ్యత నివారణను కోరుతూ

"హరిజనుల యందు నేను నొక్కరుండననుచు
నెపుడు ప్రతి హైందవుడు నిర్ణయించుకొననో
యపుడె యస్పృశ్యత భూతమాపసరిల్లు
నపుడె శుచితామయ సమాజమవతరించు

అనే పద్య కవిత్వం ద్వారా దళిత సమస్య గురించి వివరించారు. గుర్రం జాషువా, బోయి భీమన్న, కుసుమ ధర్మన్నలను దళిత పద్య కవిత్రయంగా అభివర్ణించవచ్చు.

జాతీయోద్యమ కాలంలో చూస్తే స్వాతంత్రపోరాటంతో సమాంతరంగా దళిత ఉద్యమాలు జరిగాయి. 'మాకొద్దీ తెల్ల దొరతనము'' అని నినదించిన ప్రఖ్యాత గీత రచయిత, జాతీయ గేయ కవి సార్వభౌముడిగా ప్రశంస లందుకున్న గరిమెళ్ళ సత్యనారాయణ గాంధీజీ ఉపవాస దీక్షను ప్రారంభించినప్పుడు 1913 ఫిబ్రవరి 18న హరి జనుల పాటలు ప్రకటించాడు.

హరిజనులము మనము - దు:ఖములనుభవించ మికను
సరినమముగా తక్కిన ఆకులతో - సంస్తుతి నందుదము
స్నానమువాడుదము దొహము - న్వచ్ఛము చేయుదము'

అంటూ వారి పక్షాన్ని వహించి పద్యాలల్లారు.

దళితేతర కవులు కూడా ఎన్నో రచనలు చేశారు. వారిలో ప్రధానంగా చేఱుకువాడ వెంకటరామయ్య, ఆమో జీపురపు వెంకట నరసింహారావు, గంజపల్లి జగన్నాధదాసు, బసవరాజ అప్పారావు. ఇలా ఎంతోమంది దళిత ఉద్యమానికి తమ వంతు పాత్ర పోషించారు. అందులో "మాల మాదిగల మొఱ' బసవరాజు అప్పారావు రచించిన

మాలమాదిగలం - మనష్యులం గామా?
క్కుక్కలకన్న - తక్కువయ్యామా?
మా మొరలాలకించు - స్వామీ మీరేదిక్కు అని

'మాల మాదిగల మొఱ' అంటూ గాంధీజీని కొందరు కవులు ప్రాదేయ పడ్డారు.

మాల మాల యంచు మమునంటరాదంచు
తొలగి పరుగులెత్తు దొరలు మీరు
మాలజేసి పెట్టు మరినంపు ఫలితంబు
తినుట కంటులేదె? తెలుపుడయ్యా?

('మాదిగోడు' ఖండిక-నారపురెడ్డి రామిరెడ్డి) అంటూ అగ్ర జాతుల వారిని దయనీయంగా అభ్యర్థించారు మరి కొందరు.

ఈ నాటికీ సమాజంలో దళితులపై దాడులు ఎదో ఒక చోట నిత్యం జరుగుతూనే ఉన్నాయి. అది రాజకీయ

దాడులు కావచ్చు, సాంఘిక దాడులు కావచ్చు. ఆధునిక సమాజంలో కులాంతర, మతాంతర వివాహాలు సహజం గానే జరుగుతుంటాయి. అగ్రకులాల వారి విషయంలో ఏ ఇబ్బందీ ఉండదు. కానీ దళితులు ఎవరైనా అగ్ర వర్ణాల వారిని ప్రేమించినా వివాహమాడినా వారిపై దాడులు చేస్తున్నారు, వారిని హత్య చేయడానికి కూడా వెనుకాడడం లేదు. ఈ దాడులనే ఈ మధ్య కాలంలో పరువు హత్యలు అని అంటున్నాము. దళితులపై దాడు లను నివారించడానికి ఎన్నో చట్టాలను తీసుకువచ్చినా సమాజంలో ఏమాత్రం మార్పు కనిపించడంలేదు. దళితులపై దాడులను, నివారించడానికి చట్టాలు ఉంటే మాత్రమే సరిపోదు. వాటిని ఆచరణలో కూడా చూపించాలి. ధన బలంతోనో, రాజకీయ అండదండ లతోనో, వీరు ఈ కేసులనుండి సులువుగా తప్పించు కుంటారు. ఎందుకంటే వారికి వ్యవస్థలను సైతం ప్రభావితం చేయగల సమర్థత ఉంది. ఎన్ని చట్టాలు ఉన్నా సమాజంలో పూర్తిస్థాయిలో మార్పు రావాలంటే ప్రజల అలోచనా విధానంలో మార్పు రావడం ప్రధానం. అలాగే చట్టాల అమలు విషయంలో, కఠినంగానూ, నిస్పక్షపాతంగానూ వ్యవహరించాలి. అప్పుడే దళితులకు న్యాయం జరుగుతుంది అని చెప్పవచ్చు. ఈ మార్పులను మనం సాధించాలంటే, ముందుగా దళితులంతా సంఘటితంగా ఉండడం ప్రధానం మరియు కొంతమంది దళిత నాయకులు వారి స్వార్థ ప్రయోజనాలకోసం దళితుల ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టి, అగ్రవర్ణాల వద్ద, రాజకీయ నాయకుల వద్ద మోకరిల్లకుండా ఉండాలి.

ఉపయుక్త గ్రంథాలు :

1. దళిత సాహిత్య నేపథ్యం - డా।. ఎస్వీ సత్యనారాయణ
2. తెలంగాణ సమాజం సంస్కృతి - సాహిత్యం-రాగిరి లక్ష్మణ్
3. దళిత కథానిక-పరామర్శ - డా।.కె. లక్ష్మీనారాయణ

⌘⌘⌘

BHAVAVEENA
Vol. 17, Issue. 8, August 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

వర్తమాన సమకాలీన కవిత్వం – పరిశీలనం

– ఆచార్య జి.ఐ.ఆనందకుమార్, శాఖాధిపతి, తెలుగుశాఖ, నోబుల్ కళాశాల, మచిలీపట్నం.

సాహిత్యం యొక్క పరమ ప్రయోజనం ఆనందమే. బ్రహ్మానంద సబ్రహ్మచారియైన తెలుగు సాహిత్యం విభిన్నమైన ప్రక్రియా రూపాలైన కావ్యము, నాటకము, కథ, కథానిక, గేయం, పాటల ద్వారా జనరంజకమౌతూ సమాజాన్ని జాగృతం చేస్తూనే వచ్చింది. ప్రాచీన కవుల కావ్య సృష్టి బహుచందోభూయిష్టంగా కొనసాగింది. కందుకూరి వీరేశలింగం తదనంతరం వచ్చిన తెలుగు సాహితీ సృష్టి సరళంగా, సరళాతి సరళంగా ప్రజల గుండెల్లోకి దూసుకెళ్లిందని చెప్పవచ్చు. నాటి నుండి నేటి వరకూ తెలుగు సమకాలీన సాహిత్యం నూతన ఒరవడిని సృష్టిస్తూనే వచ్చింది.

సమకాలీన సాహిత్యం అనగానే ఒకే కాలానికి సంబంధించినది అనే అర్థంలో ఆలోచిస్తారు గానీ సమకాలీన సాహిత్యం -

భూత కాలంలో వున్న సంగతుల్ని పరీక్షించుకొని
భవిష్యత్ కాలాన్ని బేరీజు వేసుకుంటూ
వర్తమాన కాలంలో సమీక్షించుకుంటూ రాయటం.

తెలుగు సాహిత్యంలో ఎప్పటికప్పుడు క్రొత్త పోకడలు కనిపిస్తూనే వస్తున్నాయి. పూర్వ కవులు వేసిన మార్గంలో కాకుండా, నవ నూతనమైన మార్గంలో ఒక దిశను సృష్టించుకొని ముందుకు వెళ్ళటం వర్తమాన సమకాలీన సాహిత్యంలో కనిపించే ముఖ్యాంశం. ఎవరి ప్రత్యేకత లను బట్టి వారు వారి మార్గాన నడుస్తూ కవితా సృష్టి చేస్తున్నారు. నేడు తెలుగు సాహితీలోకంలో కవిత్వంలో అనేకానేకమైన కొత్త గొంతులు వినిపిస్తున్నాయి.

ఒక్కొ గొంతుకు ఒక్కొ ప్రత్యేకత

ఈ వర్తమాన సమకాలీన సాహిత్యానికి సంబంధించిన ముఖ్యాంశాలను పరిశీలించటం మంచిది.

వర్తమాన సమకాలీన సాహిత్యం - ప్రత్యేకతలు :

1. వాడుక బాషకు ప్రాధాన్యత యివ్వటం.
2. అభివ్యక్తిలో క్రొత్తదనం.
3. స్త్రీ వాద, దళిత వాదాలపై ప్రత్యేకమైన శ్రద్ధ.
4. వస్తు వైవిధ్యం
5. సమకాలీన సమస్యలకు ధీటుగా ప్రతిస్పందించటం.

వర్తమాన సమకాలీన సాహిత్యంలో ప్రముఖంగా కనిపించే కొందరు-వారి సాహిత్యానుశీలనం :

సుమనశ్రీ :

విలక్షణమైన కవి. తన మనసులో కలిగిన అనుభూతిని సామాజిక వేదనలో మిళితం చేయటం ఈ కవి ప్రత్యేకమైన శైలి. సామాజిక వేదన ద్వారా సమిష్టి జీవన సౌందర్యానికి, ఐకమత్యానికి బాటలు వేసేలాగా వీరి రచనలు వుంటాయి.

రక్త నేత్రోదయం, రెప్పల మధ్య ఆకాశం, గీతం పునీత మవుతుంది, నేత్రం నా సంకేతం, మహాస్వప్నం వంటి సంపుటాల ద్వారా సామూహిక ఆత్మ నివేదన వ్యక్తీకరణం కనిపిస్తుంది.

'రెప్పల మధ్య ఆకాశం' నుండి -

"నీవు బావిలో చేదవైతే నీళ్ళని ముద్దుపెట్టుకోవచ్చు
నదిలో పడవలోని తెడ్డువలే నీళ్ళని కౌగించుకోవచ్చు
గుక్కెడు నీళ్ళు దొరక్క
యుద్ధంలో నాలిక పిడచగట్టటం చూశాను
వొళ్ళు చల్లబడ్డం చూశాను
గుడిసె గూటిలో కువకువలాడే కూనలు
కళ్ళు నదిలో బిందెలు ముంచడం చూశాను

ఆకలితో నకనకలాడే నిరుద్యోగి
వీధి కుళాయి క్రింద దోసిలి పడ్డటం చూశాను"

తనకెందుకులే కవి అనుకోలేదు. ఒక సగటు సాదా సీదా మనిషి పడే దౌర్భల్యస్థితి కనిపిస్తుంది. కడుపు నింపుకోవటానికి కనీసం గుక్కెడు నీళ్ళు కూడా దొరకని, దాహం తీరని సగటు జీవి బక్క చిక్కిన హృదయ నివేదనం చూస్తాము. ఆకలితో నకనకలాడుతున్నారు, మలమల మాడిపోయే, ఎండిపోయిన శరీరాకృతిగల దయనీయమైన స్థితిగతులు హృదయాన్ని పిండేస్తాయి. ఈ కవి కలం నుండి యిటువంటి సామాజిక స్పృహతో కూడిన కవితలు అనేకానేకం వచ్చాయి. పూర్వకాలంలో కాకుండా వర్తమాన కాలంలో వాస్తవికతతో కూడిన అభివృద్ధిని ఆకాంక్షించిన కవి సుమనశ్రీ.

సి.వి. కృష్ణారావు :

తెలుగు సాహితీలోకాన 'మరో కుందుర్తి'గా కృష్ణా రావును ప్రస్తావించవచ్చు. 'నెలనెలా వెన్నెల' కార్యక్రమాల ద్వారా యువతీయువకుల్ని ప్రోత్సాహిస్తూ వచన కవితలుగా కవితా పుష్టికై ఈయన చేసిన కృషి అభినంద నీయం. మానవ మనుగడ, అభ్యుదయం, మానవత్వం కోసం వీరి రచనల్ని ప్రత్యేకంగా చెప్పవచ్చు.

''వైతరిణి'' నుండి

"నేడు మనిషి ఉజ్వల భవిష్య
దధ్యాయానికి మకుటాన్ననుకోవటం లేదు
తిండిబోతు కంచం అంచున
జారిన అన్నం మెతుకుననుకుంటున్నాడు
నేడు మనిషి అరుణగభస్తి
బింబాన్ననుకోవటం లేదు
వెలుగు దిగమింగిన శలభాన్ననుకుంటున్నాడు

మనిషి గురించిన గొప్పతనం మాటల్ని అభి లషించటం లేదు కవి. ప్రాక్తన కాలాన ఏదో చేసిన మంత్ర, తంత్రాలకు సంబంధించిన విషయాలుకాదు, భవి ష్యత్తులో ఏదో వుంటుదనే మీమాంస కాదు, ప్రస్తుత కాలాన బ్రతికే తీరుతెన్నుల దురవస్థను వివ్యక్తం చేస్తు న్నాడు. నాటి నుండి నేటి వరకు భూకామందుల బూర్జువా వ్యవస్థలో చిక్కి శల్యమైన బలహీనుని దీనవ్యధా u¶Ôá>±<ê¶T అమానవీయ పార్శ్యంలో కన్పించే సంగతుల బహిష్కరణను కళ్ళకు కట్టినట్లు వర్ణించారు కవి.

నాగభైరవ :

ఈ కవి గేయ కథాకావ్యాల ద్వారా కాకుండా వచన కవిత్వం ద్వారా మంచికవిగా, అభ్యుదయ కవిగా ప్రసిద్ధు డైన వాడు. వెలుతురు స్నానం, తూర్పు వాకిళ్ళు, నా ఉ దయం అనే కవితా సంపుటలు ప్రచురించారు.

"మా ఊరు దొడ్డది
పశువులున్నాయిగా
మా ఊరు చెడ్డది
మనుషులున్నారుగా"

నేటి సమాజంలో పూర్తిగా మానవత్వం నశించి పోతుంది. పశువులు మాట్లాడలేవు. మూగజీవాలు. వాటిని కొట్టినా, తిట్టినా ఎవ్వరితోనూ పంచుకోలేవు. ఆ ఊళ్లో వున్న మనుషులు కూడా యిలాంటి వారే. పశువుల్లా ప్రవర్తించటం, మానవత్వం లేకుండా దానవత్వంతో చేయరాని అరాచికాలు చేయటంలో వారంతా సిద్ధ హస్తులు. మనుష్యులకు పశువులకు పెద్ద తేడా ఏమీ లేదని తెలియ చెప్పే సంక్షిప్త కవితయిది.

అద్దేపల్లి రామ్మోహనరావు :

అసలు సినలు మానవత్వం కోసం పరితపించి రచనలు చేసిన కవిగా అద్దేపల్లి కనిపిస్తారు. ఒక ప్రక్క మానవత్వాన్ని ఆహ్వానిస్తూ, అనుభూతి ద్వారా సామాజిక చైతన్యం అభిలషించే కవిగా ఈ కవి కనిపిస్తాడు. మొదట్లో ఈ కవి పద్య కవిత్వం వైపు మొగ్గు చూపాడు. ఆ తద నంతరం మానవ కవిత్వమే రాస్తూ యువకవులకు మార్గ దర్శకత్వం వహించారు. ఈ కవి కవిత్వంలో అభ్యుదయ భావాలు ఎక్కువగా కనిపిస్తాయి. 'గోదావరి నా ప్రతి బింబం' లోని చాలా కవితలు అద్దేపల్లి వారి కవితాశక్తిని

ప్రకటిస్తాయి. "Poetry is a Spontaneously" అన్నట్లుగా కవిత్వం ఆశుధారగా ఉబికిరావాలనేది వీరి రచన.

"రాజమండ్రిలో గోదావరి ఒడ్డున నిలబడి
నీళ్ళలోకి తొంగిచూస్తే నా ముఖం కనిపించదు
వీరేశలింగం గారి ముఖం కనిపిస్తుంది"
ఆ ఆరేళ్ళ కుర్రాడు నాకు ప్రతిరోజూ
పోస్టాఫీసు ముందు కనిపిస్తాడు
వాడి మొహం మీద ప్రజాస్వామ్యశవం వేలాడుతూ వుంటుంది
వాడు చేతిలో పట్టుకొన్న మరకల గుడ్డ
సుడిగుండంలో తిరిగేవాడు పట్టుకున్న
గడ్డిపరకలా వుంటుంది
వాడికళ్ళల్లో నా చిన్నప్పటి ఆకలి బావురుమంటూ వుంటుంది
వాడి ఆకారం దరిద్ర దేవత యిల్లాలికి గుడ్డలా వుంటుంది"

సంఘసంస్కరణే ధ్యేయంగా కొనసాగిన కందుకూరి వీరేశలింగాన్ని పలుచోట్ల అద్దేపల్లి ప్రశంసిస్తాడు. పేదరికం, ఆకలి, అస్పృశ్యత, దారిద్ర్యం మూర్తీభవించిన ఆరేళ్ళ కుర్రాడి భౌతిక చిత్తరువును ఈ కవి కళ్ళముందుంచాడు. గోదావరీనదీ పవిత్రతతో తనకున్న ఆత్మీయతను వ్యక్తం చేస్తూ ఆ నదీమతల్లి బిడ్డలుగా వర్తమాన కాలాన వారు యింకా -

"చేతిలో వాలిన వార్తాపత్రిక
దేశం మీద కప్పిన కఫన్‌లా వుంటుంది
ప్రజాస్వామ్యం ఆక్టోపస్ చేతుల్లా వ్యాపిస్తుంది
ప్రజాస్వామ్యం స్లోపాయిజన్‌లా ఎక్కుతుంది
మనిషి కాటుపడ్డ మానవత్వానికి
ఏయాంటీ బయోటిక్ పనిచెయ్యదు"

తరతరాల జీవన వ్యధాభరితమైన వృధా జీవితంలో దగాపడిన దయనీయమైన అశ్రుతర్పణ హృదాభరితమైన సంవేదన ఈ కవితలో కనిపిస్తుంది. కాలకూట సర్పంకంటే మరీ దారుణమైన మనిషి కాటు ఘాటును గోపి చక్కగా వర్ణించారు. వాడు చిద్రంచేసే బ్రతుకుల్ని ఎవరూ నయం చేయలేరేనే ఆవేదన కవి వ్యక్తం చేశాడు.

కవయిత్రుల్లో నాయని కృష్ణకుమారిని అగ్రజురాలిగా పేర్కొనవచ్చు. వచనా కవిత్వం ఉద్యంగా వెలువడుతున్న రోజుల్లో 'అగ్నిపుత్రి' కవితా సంపుటి ప్రచురించారు. ఈ దేశం మీద సమాజం మీద అభిమానంలో నూటిగా కవత్వం చెప్పిన కవయిత్రి ఈమె.

"ఈ మట్టి తొలకరి తడుపుకు
చిలకరించిన వాసనల చిక్కదనంలో
అమ్మ వాత్సల్యపు కమ్మదనం.....
మట్టి మనిషిని నేను "

కవితా శీర్షికలోనే ఆలోచనా సరళి వుంది. అమ్మ వాత్సల్యాన్ని, ఆ కమ్మదనాన్ని చాలా స్పష్టంగా సరళంగా రచించిన కవయిత్రి.

ముగింపు :

ఈ విధంగా పలువురు కవులు, కవయిత్రులో భూత కాలాన వున్న సామాజిక, రాజకీయ, మత పరిస్థితుల్ని, పరిశీలించి, భవిష్యత్ కాలంలో ఉద్ధరణ పొందే దిశగా మానవ ప్రస్తానం కొనసాగాలని, తద్వారా మానవుడు సముద్ధరింపబడాలని, సమసమాజ కళ్యాణమే ధ్యేయంగా రచనలు చేశారు. వర్తమాన కాలంలో జరుగుతున్న పరిస్థితుల్ని బేరీజు వేసుకుంటూ, అస్తవ్యస్తమైన సమాజ స్థితిగతుల్ని , మానవ జీవన యదార్ధ సంఘటల్ని వివరిస్తూ కవిత్వం రాశారు. యిది వర్తమాన సమకాలీన కవిత్వానికి సంబంధించిన పరిశీలనం.

ఆధార గ్రంథాలు :

1. తెలుగు సాహిత్య చరిత్ర - డా॥ ద్వా.నా.శాస్త్రి
2. ఆధునికాంధ్ర కవితా సమీక్ష - ఆచార్య కె.వి.ఆర్. నరసింహం
3. కవి సమయములు - ఇ. కృష్ణమూర్తి
4. మహతి - యువభారతి ప్రచురణలు
5. ప్రతిభామూర్తులు - అక్కిరాజు రమాపతిరావు

⌘

BHAVAVEENA
Vol. 17, Issue. 8, August 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

స్త్రీవాదకవిత్వంలో – వాస్తవిక అంశాలు

– డా॥. కసుల నరేందర్, అసిస్టెంట్ ప్రొఫసర్ (సి), తెలుగు శాఖ, నిజాం కళాశాల, హైదరాబాద్.

తరతరాల సామాజిక వ్యవస్థలో పురుషభావజాల ఆధిపత్యంలో అణచివేతకు గురవుతున్న స్త్రీలు తమకు తామే తమ బాధలను, వేదనలను, ఆవేదనను వ్యక్తీకరించుకునే ప్రయత్నంలో ప్రత్యేకంగా 'స్త్రీవాదకవిత్వం' తెలుగు సాహిత్యప్రక్రియలల్లో భాగం అయ్యింది.

అనేక నిర్భందాల మధ్య నిల్గిపోతున్న స్త్రీ విముక్తికి, సాహిత్యకారుడిగా సామాజిక చైతన్యం తీసుకురావడంలో కవుల పాత్ర ఉంది.

కందుకూరి వీరేశలింగం పంతులు స్త్రీ ఉన్నతిని ఆకాంక్షిస్తూ సాహిత్యాన్ని వెలువరించారు. స్త్రీలకు విద్య, బాల్య వివాహాల నిర్మూలణ, వితంతు పునర్వివాహం ద్వారా పురుషులతో సమానంగా స్త్రీలు రాణించగలరని భావించాడు. సత్యవతిచరిత్ర నవలలో ఆయన అంత రంగ ఆవిష్కృతం అయ్యింది.

కందుకూరి తర్వాత కవిత్వంలో స్త్రీ అభ్యున్నతిని ఆవిష్కరించిన సాహిత్యవేత్త గురజాడ. కుటుంబ జీవనం కోసం ఇచ్చే కన్యాశుల్కంకు ఆశపడి వృద్ధులకు ముక్కు పచ్చలారని బాలకలను ఇచ్చి పెళ్లిచేసే దురాచారాన్ని వ్యతిరేకిస్తూ 'పూర్ణమ్మ' గేయంలో ఆవిష్కరించాడు. అలాగే మగవాని దౌర్జన్యానికి ప్రతీకగా రాజును పేర్కొంటూ 'కన్యక'ను ఉదహరించాడు. కందుకూరి, గురజాడల సాహిత్యాన్ని స్త్రీవాద సాహిత్యానికి నేపథ్యంగా పేర్కొనాలి. 1862 నాటికే తామినేని ముద్దు నరసింహం తన హితసూచని గ్రంథంలో స్త్రీలకు జరుగుతున్న అన్యాయాలను ప్రస్తావించి స్త్రీ జనోద్ధరణకు ప్రయత్నించారు.

ఆధునికకాలంలో స్త్రీ తమపై జరుగుతున్న 'పెత్తనాన్ని' వ్యతిరేకించేటట్లుగా, స్త్రీల క్షోభను మానసిక సంఘర్షణను కవిత్వంలో ఆవిష్కరించి స్త్రీలు చైతన్యం పొందాలని ఆకాంక్షించిన కవి రచయిత చలం ఆయనను స్త్రీవాద రచయితగా విమర్శకులు పేర్కొన్నారు.

తిలక్, పట్టాభి, శ్రీశ్రీ, కుందుర్తి, కె.వి. రమణారెడ్డి, చెరబండరాజు లాంటి వారు స్త్రీపక్షపాతంగా కవిత్వాన్ని ఆవిష్కరించారు.

తెలుగు సాహిత్యంలో 'స్త్రీవాద కవిత్వం' ఉద్యమంలా పుట్టింది. సోషలిస్టు, రాడికల్ భావాలు కలిగినవారు, ఫ్రెంచ్ విప్లవం వల్ల స్వేచ్ఛ, సమానత్వం, పారిశ్రామిక విప్లవ ప్రభావంవల్ల ఆర్థిక సామాజిక రంగాలలో వచ్చిన మార్పుల ఫలితంగా ప్రపంచవ్యాప్తంగా వచ్చిన అనేక పరిణామాలు స్త్రీ చైతన్యానికి కారణంగా చెప్పవచ్చు. హక్కులు, సమానత్వం స్వేచ్ఛ అనే మాటలు స్త్రీవాదం రావడానికి ప్రధానం.

ఫెమినిజం అనే ఆంగ్లపదానికి స్త్రీవాదం అని మనం చెప్పుకుంటున్నాం. ఫెమినిజం కొత్తమాటే అయినా ఆర్థిక, సాంఘిక, సామాజిక, సాంస్కృతిక, రాజకీయ రంగాలలో పురుషులతో సమానంగా ఉండాలన్న స్త్రీల ధ్యేయం పాతదే.. దాదాపు 160 ఏళ్లక్రితం పితృస్వామ్య వ్యవస్థను ప్రశ్నించి తన ఆవేదనను వ్యక్తీకరించినపుడే స్త్రీవాదం మొదలయ్యింది. అయితే ప్రత్యేకంగా తమకు తామే తమ గురించి రాసుకుంటాం, మా బాధలు మేమే చెప్పుకుంటాం అంటూ కవిత్వాన్ని వెల్లడించడం ప్రారంభమయింది.

అణచివేతకు గురవుతున్న స్త్రీలు విముక్తికై తపన పడుతూ ఆత్మచైతన్యాన్ని అభివృద్ధి చేసుకోవడంలో రూపొందిన ఒక ఆలోచనా విధానం...ఆచరణ కార్యకలాపం అని కాత్యాయనీ విద్మహే అన్నారు. ఫెమినిజం అంటే పురుషులకు సమానంగా స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలను కోరేది. ప్రస్తుతం ఆర్థిక, రాజకీయ, సమానతను కూడా

ఫెమినిజంలో పేర్కొనాలి. రాజ్యాధికారంలోనూకూడా స్త్రీలకు సమానత ఉండాలి. వారసత్వంగా వచ్చే ఆస్తి, ఆర్థికరంగంలో కూడా సమానత ఉండాలి. ఈ మధ్యే సుప్రీంకోర్టు కూడా కొడుకుతోపాటు, కూతురికి కూడా సమాన హక్కు ఆస్తిలో ఉంటుందని వెల్లడించింది.

ఇక కవిత్వంలో వాస్తవిక స్త్రీవాద అంశాలను పరిశీలిస్తే... తీవ్రమైన భావ సంఘర్షణ, ఆధిపత్య వ్యరేకత, నియంత్రణా వ్యతిరేకత సంప్రదాయ వ్యతిరేకత మొత్తంగా పితృస్వామ్య వ్యతిరేకత కనిపిస్తుంది.

'నొసళ్లమీద పురుష చేతిరాతల గుర్తులు
ఏ ఎరై జర్లు, రిమూవర్లు తడవలేనిది
తరతరాలు శాసనాలు
ఒక నువ్వువినా ఇంకెవ్వరూ తుడవలేరు
మళ్లా మనమే
మన చతను తిరగరాద్దాం!'

అని 'శిలాలోలిత' అనే ప్రముఖ స్త్రీవాద రచయిత్రి కేవలం స్త్రీలు మాత్రమే కవిత్వం రాయాలి పురుష రచయితల, కవుల సానుభూతి తమకు అక్కర లేదన్నట్లుగా వెల్లడించింది. ఆమె మాటలలో ఆవేదన కనిపిస్తుంది. స్త్రీపై మగవాడు చేసిన దాగుర్తులు, లైంగిక ఆధిపత్య ఆనవాళ్లుగా ఆమె భావించింది.

'గాయం' ఎవరికి అయ్యిందో వాళ్లు మాత్రమే దాని బాధను చెప్పగల్గుతారు. గాయాన్ని చూసినవాళ్లు కాదనే వాస్తవికతను ఆమె గుర్తించింది. అందుకే స్త్రీలను మాత్రమే బాధలను వెల్లడిస్తూ కవిత్వం రాయమన్నది.

తెలుగు కవిత్వంలో స్త్రీవాదులు తమను సోషలిస్టు ఫెమినిస్టులుగా చెప్పుకున్నారు. వారిలో ఓల్గా, జయప్రభ, కొండేపూడి నిర్మల, ఘంటసాల నిర్మల, పాటిబండ్ల రజనీ, మహెజబీన్, కల్పన రెంటాల, కుప్పిలి పద్మ, వసంత కన్నాభి ఉన్నారు. వీరు సోషలిస్టు నేపథ్యంగానే కవిత్వాన్ని వెల్లడించారు.

త్రిపురనేని శ్రీనివాస్ 'గురి చూసి పాడే పాట' (1900) స్త్రీవాద నేపథ్యంగా వచ్చింది.

'1975-85' దశాబ్దకాలాన్ని ఐక్యరాజ్యసమితి అంతర్జాతీయ మహిళాదశాబ్దంగా ప్రకటించింది. ఇది రచయిత్రులకు ఒక మార్గదర్శనమయ్యింది. వారు తమ భావాలను ఫెమినిజంగా ఆవిష్కరించారు. 1985 నుంచి తెలుగు ఫెమినిజం కవిత్వం ప్రారంభమయ్యింది. కొంతమంది సోషలిస్టు భావ రచయిత్రులు 'అస్మిత' అనే సంస్థను ఏర్పాటుచేసి ఆ సంస్థద్వారా 'భూమి' అనే మాసపత్రికను వెలువరించారు. 'అస్మిత' ద్వారా 1993 అక్టోబర్‌లో 'నీలిమేఘాలు' అనే పూర్తిస్థాయి స్త్రీవాద సంకలనాన్ని వెలువరించారు. ఇందులో స్త్రీ అణచివేత, లైంగికత్వం, సంతానోత్పత్తి, వెట్టిచాకిరీ, పురుషాధిక్యత లాంటి అంశాలను వర్ణిస్తూ కవితలున్నాయి.

అయితే 1978లోనే 'ఓల్గా' ఒక నిర్మల కావాలి' అనే స్త్రీవాద కవిత రాసింది.

అందమైన దోపిడీకి
పవిత్రమైన హింసకూ
న్యాయమైన దాస్యానికీ
బలైపోయిన నేను
భారత స్త్రీని

భారత స్త్రీని అనడంలో ఔచిత్యముంది. వేదాలు, పురాణాలు, భారత, రామాయణ భాగవతాలలో అలాగే వాటికాలంలో కూడా 'స్త్రీ' అణచివేతకు గురయ్యింది. ఆ తంతు అప్పటినుంచి ఇప్పటివరకూ కొనసాగుతుంది అనేది ఆమె భావన అయి ఉండవచ్చు.

రేవతీదేవి 1980లో 'శిలాలోలిత' కవితా సంకలనం తీసుకొచ్చింది. అందులో పురుషునికి ఉన్న ప్రత్యేక సదుపాయాలు, స్త్రీకి లేవన్న సత్యాన్ని వెల్లడించారు. పురుషుడికి 'శీలం' తో పనిలేదు. స్త్రీకి మాత్రమే శీలం పరిమితం చేయబడింది అని వాపోయారు.

అంతేస్త్రీకి ఉన్న నిబంధనలను ఎత్తిచూపిస్తూ ...ఇలా అంటుంది.

'ఇన్నాళ్లూ గలగలా మాట్లాడితే
నే చెప్పాల్సిందేమీ లేనందున

నేనేం చెప్పినా విన్నారు
ఇప్పుడేమో నాకూ చెప్పాల్సిందేదో వుండి
మాట్లాడబోతే
ఎవరూ వినిపించుకోరు
అందుకో మరెందుకో...ఈ గొంతు మూగబోయింది.

స్త్రీ అభిప్రాయాన్ని పురుషాధిపత్యం కట్టడి చేస్తూంది. వారి భావాలను, వారి మాటలను గుర్తించటం లేదన్న వాస్తవికతను వెల్లడించింది.

1984లో ఆంధ్రజ్యోతి వారపత్రికలో 'బందిపోట్లు' అనే కవితరాసి సంచలనం కల్గించిన కవయిత్రి సావిత్రి. పురుషాధిక్యాన్ని భారతీయ వివాహ వ్యవస్థను ప్రశ్నించింది.

పాఠం ఒప్పచెప్పకపోతే పెళ్లిచేస్తానని
పంతులు గారన్నప్పుడే భయంవేసింది
ఆఫీసులో నా మొగుడున్నాడు
అవసరమొచ్చినా సెలవివ్వడని
అన్నయ్య అన్నప్పుడే అనుమానం వేసింది
వాడికేం మగమహారాజని
ఆడమగ వాగినప్పుడే అర్థమయిపోయింది.
పెళ్లంటే పెద్ద శిక్ష అని
మొగుడంటే స్వేచ్ఛా భక్షకుడని
మేం పాలిచ్చి పెంచిన జనంలో సగమే
మమ్మల్ని విభజించి పాలిస్తోందని

పెళ్లి ఓ శిక్షగా, భర్త భార్య స్వేచ్ఛను హరించేవాడుగా భావించింది. ఇప్పటికీ వివాహ వ్యవస్థలో కొన్నిలోపాలు అలాగే ఉన్నాయి. వరకట్నం, గృహహింస లాంటివి కొంత మంది స్త్రీల స్వేచ్ఛా జీవితానికి అడ్డుగోడగా ఉన్నాయి.

మరో కవితలో పెళ్లి తర్వాత స్త్రీ కోల్పోయే స్వేచ్ఛను అనుభవించే స్థితి గురువు మందవరపు హైమావతి ఇలా అంటుంది.

కుక్కర్ విజిల్స్‌లోనే
మనోజ్ఞ సంగీతం వింటాను
పతిదేవుని పేబిల్‌పై
కాఫీకప్పుగా, మీల్స్ కొరియర్‌గా
పిల్లల లంచ్ బాక్స్‌లుగా
బహు పాత్రాభినయం పోటీలో
నా చేతులకెప్పుడూ ఫస్ట్‌ప్రైజ్...

కుటుంబ వ్యవస్థ నిర్మాణంలో స్త్రీ... భార్యగా చాలా శ్రమను వెచ్చిస్తుంది. భర్త యజమానిగా ఆర్థికదారుడిగా మసలుతున్నప్పుడు భార్య వంటపని చేయడం పిల్లలకు పనులు చేసిపెట్టడం భార్యకు పరిమితమైపోయిన పనులు. పోనీ భార్య ఆర్థికవనరు అయినప్పుడు భర్త వంటింటికి పరిమితమవుతాడా? అనే ప్రశ్న కాలేదు. ఏదేమైనా తన శ్రమను తాను చెప్పుకున్న తీరు ఇక్కడ వర్ణించింది హైమావతి.

పురుషాధిపత్యాన్ని వెల్లడిస్తూ కవిత్వం రాసినవారు
విమల
రకరకాల శవాలు నిండిన శ్మశానంలా మా వంటిల్లు
భయం, భయంగా నిశ్శబ్దంగా నిరాశగా
మా అమ్మొక ప్రేతంలా తేలుతూ వుంటుందిక్కడ
అసలు మా అమ్మే నడుస్తున్న వంటగదిలా
వుంటుంది
ఈ వంటింటి సామ్రాజ్యానికి మా అమ్మే రాణి
అయినా చివరకు వంటింటి గిన్నెలన్నింటిపైనా మా
న్నాపేరే...
వంటింటి సంస్కృతి
వంటింటి ముచ్చట్లు - వంటలక్కలమైన మనం
మనం ఏమాన మన అంతిమ కర్తవ్యం
గరిట తిప్పటంగా చేసిన
ఈ వంటిళ్ళను ధ్వంసం చేద్దాం రండీ....
అంటుంది...

భార్య రూపంలో స్త్రీ తన శ్రమను ధారపోస్తుంది. భార్యపై భర్త ఆధిపత్యం ఉంది. స్త్రీలు వంటింటికే పరిమితం చేసిన పురుషాధిపత్యాన్ని ప్రతీకారంగా ఆ వంటగదినే ధ్వంసం చేద్దాం అంటుంది.

లైంగిక వాంఛతో ఉన్న మగవాడి బుదిణధని వెల్ల డిస్తూ జయప్రభ కవిత్వం రాసింది.

రెండు కళ్ళనుంచి చూపులు
సూదుల్లా వచ్చి మాంసపు ముద్దలై
విచ్చలవిడిగా తిరుగుతుంటాయి.

స్త్రీ అందానికి ప్రతిరూపం. కాని మగవాడి చూపులు స్త్రీ ముఖంపై కంటే ఎక్కువ ఆమె శరీరంపైనే పడుతాయి. ఇది స్త్రీలు అనుభవిస్తున్న మానసికక్షోభ.

లింగభేదాన్ని చెబుతూ చకకని కవిత రాసారు
శ్రీమతి అనే కవయిత్రి
చీర ఒక అంచును గుండెలపై పదిలంగా
అమర్చుకున్నట్లు
అమ్మ తమ్ముణి హృదయానికి హత్తుకుంటుంది
కాళ్లకు అడ్డుపడే అంచులా
నన్ను మాటల్తో తన్నుతుంది..

ప్రతి తల్లిదండ్రులు ఆడపిల్లలకంటే మగపిల్లలని ఇష్టపడతారు. అందు తల్లి ఎక్కువ ఇష్టపడుతుంది. మగప్లివాడు వంశానికి వారసుడు. పున్నామ నరకాన్ని తొలగించేవాడు. అందుకే ఆడ,మగ మధ్య వ్యత్యాసం కనిపిస్తూందీ ప్రేమలో.

రజియాబేగం స్త్రీలకు విలువనివ్వని దుస్థితిని వర్ణిస్తూ కవిత రాసింది.

బాల్యంలో

'చిన్నపిల్లవి నీ కెంత తెల్వద కోర్చో' అన్నారు.

యవ్వనంలో

'ఉడుకురక్తం మంచీచెడూ తెలీదు కోర్చో' అన్నారు.

వృద్ధాప్యంలో

'ముసల్దానివి ఇంకేం చేస్తావు కూర్చో' అన్నారు.

అవకాశం రానందుకు కోపంగా లేదు నాకు కూర్చొని, కూర్చొని బద్ధకం వచ్చినందుకు బాధగా ఉంది.

ప్రతి విషయంలో స్త్రీని అంతర్భాగం చేయకుండా... కూర్చోబెట్టినందుకే బాధ. అన్న అభిప్రాయం వాస్తవికతకు అద్దం పడుతుంది.

స్త్రీవాదుల కవిత్వాన్ని అందరూ ఆహ్వానించలేదు. కొన్ని కవితా పంక్తులు విమర్శలకు తావిచ్చాయి. జ్వాలాముఖి ఎస్వీలాంటివారు విమర్శిస్తూ వ్యాసాలు వెల్లడించారు.

'ఫెమినిజం' కవిత్వంలో కొందరు కవయిత్రులు స్త్రీని లైంగిక వాంఛకు మాత్రమే పరిమితం చేసా అని వాపో యారు. కొందరు స్త్రీ శ్రమను దోచుకుంటున్నారు అన్నారు. ఇంకొందరు స్త్రీని మనిషిగా కూడా చూడడం లేదు. కనీసం గుర్తింపుకూడా ఇవ్వడం లేదని బాధపడ్డారు. మొత్తంగా పురుషాధిక్య సమాజంలో స్త్రీ ఆట బొమ్మగా మారి పోయింది. లింగభేదం వల్లే ఇదంతా జరుగుతుంది. కనుక స్త్రీ పురుషులు ఇద్దరు సమానమే.

ఆర్థిక, సామాజిక, రాజకీయరంగాలలో స్త్రీకి సమాన హక్కులు కల్పించాలనే అభిప్రాయం చాలామటుకు కనిపిస్తుంది. అందరూ ఆహ్వానించదగిన అభిప్రాయాలు ఫెమినిజంలో ఉన్నాయి.

కేవలం పురుడివల్లే స్త్రీకి అన్యాయం జరుగుతుందని భావించినపుడు కోడలిని హింసిస్తున్న అత్తకూడా స్త్రీనే కదా అన్న ప్రశ్నలు లేకపోలేదు. అలాగే ఆడపిల్లను చిన్నచూపు చూస్తూ మగపిల్లాన్ని ప్రేమిస్తున్న అమ్మ స్త్రీనే కదా! అన్న ప్రశ్నకూడా లేకపోలేదు.

స్త్రీవాదకవిత్వం చాలావరకు వాస్తవికత ఉన్నా కొన్ని చోట్ల అవాస్తవికత అంశాలు ఉన్నాయి. 1980 నుంచి సమాజంలో ఎన్నో మార్పులు చోటుచేసుకున్నాయి. 1980 నుంచి 2020 వరకు స్త్రీపురుషులమధ్య చాలా వ్యత్యాసం ఉంది. ఆర్థిక, సామాజిక, రాజకీయ, విద్యారంగాలలో స్త్రీలు ఉన్నతమైన శిఖరాలకు చేరుకున్నారు.

రాజ్యాంగంలో సవరణలు చేసి స్త్రీలకు హక్కులు కల్పించారు. స్వేచ్ఛను కల్పించారు. విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాలలో రిజర్వేషన్లు కల్పించారు. 1980కి ముందు ఉన్న స్త్రీ జీవితానికి 2020లో అభ్యున్నతి, స్వేచ్ఛా, స్వాతంత్ర్యం లలో కనిపిస్తుంది.

మంచిలో స్త్రీ విజయం సాధించినట్టుగానే... హింసాత్మక, ఉన్మాదితనంలో 'స్త్రీ' తన దుర్బుద్ధిని ప్రదర్శిస్తుంది. ఒకనాడు మగవాడి చేతిలో 'హింసకు' గురయిన స్త్రీ ఈనాడు ప్రతీకారబాటలో పయనిస్తుంది.

ఆస్తికోసం, అధికారం కోసం వరపురుషిని వ్యామోహంలో పడి భర్త అత్యంత కిరాతంగా చంపస్తికి చేరింది. ఇప్పటికీ బాలికలపైన, యువతులపైనా, స్త్రీలపైనా లైంగికదాడులు జరుగుతున్నాయి. ప్రపంచ శాస్త్ర, సాంకేతిక, ఖగోళ రంగాలలో ఎన్నో అద్భుతాలు సాధిస్తున్నా...రకరకాలుగా జరుగుతున్న దాడులు స్త్రీజాతికి గొడ్డలి పెట్టుగా నిలిచాయి.

స్త్రీ, పురుషు లిద్దరిలో వ్యాపార, వాణిజ్య, రాజకీయ రంగాలలో పోటీతత్వం నెలకొంది. ఆధునిక స్త్రీ దేశ చరిత్రలను తిరగరాస్తుందన్న గురజాడ మాటలు నిజమవుతున్నాయి. స్త్రీవాద కవయిత్రులు, రచయితలు ఆశించిన స్వేచ్ఛా, స్వాతంత్ర్యం చట్టాల ద్వారా వారికి లభించాయి. అయితే ఎక్కడో కొంత అసహనం, ఆవేదన అలముకొని ఉంది. స్త్రీ, పురుషుడు నాణానికి ఉన్న బొమ్మ బొరుసు లాంటివారు. ఇద్దరిలో సహనం, సమయస్ఫూర్తి ఉండాలి. ఎక్కువ, తక్కువ అనే బేధం ఉండొద్దు.

మానసిక పరిణితిలో లోపాలు ఉండటం, వయసుకు మించి ప్రవర్తించడం, వస్త్రధారణ విషయంలో చెల్లు బాటు, నిత్యకార్యకలాపాలలో చెల్లుబాటు పైచేయి కావాలన్న తపన, ఫెమినిజం అంటే తమకు నచ్చినట్లుగా ఉండటం అనే ధోరణి ఉండటంవల్ల కుటుంబవ్యవస్థ బద్దలవుతుంది. ప్రస్తుతం సమాజంలో స్త్రీ, పురుషుల మధ్య అలుముకున్న అంశాలపై స్త్రీవాద సాహిత్యకారులు దృష్టిని కేంద్రీకరించాలి.

ఫెమినిజం స్త్రీ పురుష సమానత్వాన్ని కాంక్షిస్తుందేగాని స్త్రీలని, పురుషులని విడదీయదు. ఇవాల అన్ని రంగాలలోను స్త్రీపురుషుల మధ్య ఉన్నవి ప్రధానంగా అధికారి బానిస సంబంధాలే. ఈ తత్వాన్ని ఫెమినిజం ప్రశ్నిస్తుంది. సరి చేస్తుంది. సామాజికంగా ఆర్థికంగా లైంగికంగా స్త్రీలను దోపిడీనుండి విముక్తిచేసే రాజకీయ సిద్ధాంతమే ఫెమినిజం అన్న జయప్రభ గారి నిర్వచనం సముచితంగా ఉంది. ప్రస్తుతం సమాజంలో స్త్రీ పురుషులమధ్య సమన్వయం, సాధికారత ఉండాలి. తెలుగు సాహిత్యంలో స్త్రీవాదం ధోరణిగా, వాదంగా నిర్మాణమై ఉంది. అయితే స్త్రీవాద సాహిత్యంలో నూతన ఆవిష్కరణలు జరగాలి.

⌘⌘⌘

BHAVAVEENA
Vol. 17, Issue. 8, August 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

జాషువా రచనల్లో దేశభక్తి

– డా॥. మందలపు నటరాజ్, తెలుగు శాఖ, సహాయక ఆచార్యులు డి.జి.వైష్ణవ కళాశాల, చెన్నై.

'జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ' అన్నారు విజ్ఞులు, 'దేశమును ప్రేమించుమన్నా మంచియన్నది పెంచుమన్నా, దేశమంటే మట్టిదాదోయ్ దేశమంటే మనుజులోయ్' అంటారు ఆధునిక కవితా వైతాళికుడు గురజాడ, 'ఏ దేశమేగినా ఎందుకాలిడినా పొగడరా నీతల్లి భూమి భరతని - నిలుపరా నీ జాతి నిండు గౌరవము' అన్నారు భావకవి రాయప్రోలు, 'జయజయ భారత జనయిత్రీ దివ్య ధాత్రి' అన్నారు దేవులపల్లి, 'మా తెలుగు తల్లికీ మల్లెపూదండ మా కన్న తల్లికి మంగళారతులు' అని కీర్తించారు శంకరంబాడి, 'చేయెత్తి జైకొట్టు తెలుగోడా! గతమెంతో ఘనకీర్తి కలవాడా! అన్నారు కామ్రేడ్ వేముల పల్లి శ్రీకృష్ణ, 'తెనుగుతల్లీ! నీకు జోహారు - దేశమాతా! నీకు జేజేలు' అని రాష్ట్రగానం చేశారు తెనుగులెంక తుమ్మల సీతీరామమూర్తి ఇలా చెప్పుకుంటూ పోతే బసవ రాజు అప్పారావు, చిలకమర్తి, త్రిపురనేని, గరిమెళ్ళ మొదలైన వారెందరో తమ జాతీయతను చాటుకున్నారు. ఇదే కోవలో మన జాషువా కూడా చేరుతారు. అయితే కవి జాషువా గురించి పూర్తిగా తెలియని వారు - ఆయన సాహిత్యాన్ని పూర్తిగా అధ్యయనం చేయనివారు మాత్రమే ఆయన జాతీయవాదాన్ని శంకిస్తారు. అసలుసిసలైన కవి అనేవాడు సమకాలీన, సామాజిక, దేశ, కాల పరిస్థితుల్ని ఏదో ఒక విధంగా తన రచనల్లో ప్రతిబింబింపచేస్తాడు. చేయాలి కూడా. అలా చేయని వాడు నిజమైన రచయిత, సిసలైన కవి అనిపించుకోలేడు. తన దేశకాల సామాజిక పరిస్థితులకు కవి అనేవాడు ప్రతినిధిగా నిలుస్తాడు.

'చావలేదు భారత జాతీయ సంస్కృతి, జాతి జీవశక్తి చావబోదు' అని చాటాడు జాషువా. స్వాతంత్ర్యం ఆవశ్యకతను గూర్చి జాషువ నొక్కిచెప్పాడు. మతబోధనలు చేసి ముక్తినిచ్చే బ్రిటీషు దొరలు కాదు మనకు కావల్సింది. సమత కావాలి, స్వేచ్ఛ కావాలి అంటారు జాషువా. భరత మాతను గూర్చి జాషువా చెప్పిన ఈ పద్యం ఆయన దేశాభిమానానికి ప్రతీక.

"నగర మాంధాత్రాది షట్చక్రవర్తుల
అంకసీమల నిల్చినట్టి సాధ్వి
కమలనాభుని వేణు గాన సుధాంబుధి
మునిగి తేలిన పరిపూత దేహ
కాళిదాసాది సత్కవికుమారుల గాంచి
కీర్తినందిన పెద్ద గేస్తురాలు
బుద్ధాది మునిజనంబుల తపంబున మోద
బాష్పములీడిన భక్తురాలు
సింధు గంగా నదీ క్షీర మెపుడు
కురిసి బిడ్డల పోషించుకొనుచునున్న
పచ్చి బాలెంతరాలు మా భరతమాత
మాతలకు మాత సకల సంపత్సమేత!!

ఇలా భరతమాతను కొనియాడిన జాషువా, భారత స్వాతంత్ర్య సంగ్రామంలో ప్రాణాలను ఫణంగా పెట్టిన వీరులకు కవితా నీరాజనాలు అర్పించారు. జాషువా తానెన్నుకున్న వస్తువును, బాణిని, తనదైన వాణిగా మార్చి పదాలకు పదును పెట్టి, కవిత్వపు వాడిని పుట్టించగలిగిన ప్రతిభాశాలి. అఖండ సాహితీ సంపద కలిగిన జాషువా బాపూజీ అడుగుజాడలలో శాంతియుత పోరాటం చేసే కవిత్వాన్ని సృష్టించారు. స్వాతంత్ర్యోద్యమంలో ఎందరో వీరులు పాల్గొన్నారు. వారందరిలోనూ ప్రజలను భిన్న మార్గాలలో చైతన్య పరచిన వ్యక్తులలో చెప్పుకోదగిన వారు బాపూజీ, నేతాజి. వీరి త్యాగాలనే కవితా వస్తువుగా తీసుకొని జాషువా అపూర్వమైన ఖండకావ్యాలను వెలువరించారు.

ప్రజాస్వామ్య పరిరక్షణకు కవులు పూనుకొనే కాలంలో జాషువా తమ కవిత్వాన్ని ప్రత్యక్షంగా ఉపయోగించి

వీరోత్సాహమైన యుద్ధ ప్రచారక ప్రబోధ సాహిత్యాన్ని సృష్టించి తమ దేశభక్తిని చాటుకున్నారు. రెండవ ప్రపంచ యుద్ధ కాలంలో జాషువా 'నేషనల్ సాంగ్సు పబ్లిసిటీ ఆర్గనైజరు'గా మద్రాసులో పనిచేస్తున్నారు. ఆ సమయంలో వారు రచించిన ప్రచారక గీతములు 'రక్తగానం' అనే పేరుతో రెండు భాగాలుగా వెలువడ్డాయి. మొదటి భాగం ముద్రితం, రెండవ భాగం అముద్రితం. ఇందులో పద్యాలు, గేయాలు, బుఱ్ఱకథలు, తోలుబొమ్మలాటలు మున్నగు సాహిత్య ప్రక్రియలను ఉపయోగించి ప్రచారక గీతాలు రచించారు జాషువా. ప్రచారానికి అనువుగా ఉంటాయనే ఇలాంటి ప్రక్రియలను జాషువా ఎంచుకున్నారు. జాషువా తన గీతాల ద్వారా యుద్ధ వీరుల కందించిన ఉత్సాహం, సామాన్య ప్రజలకందించిన అమూల్య సందేశాలు వారి దేశభక్తికి నిదర్శనాలు.

బాపూజీ అంటే జాషువాకు అనిర్వచనీయమైన భక్తిభావం. 'మహాత్ముని చెప్పుల జాడలోన కాలడ చరించెదన్ / లోక మోహన సబర్మతి సన్మునికిన్ కుమారుడన్' అంటూ గాంధీ గారి పట్ల తనకున్న భక్తి భావాన్ని వెల్లడించారు. ఇంకా 'గోచిపాత గట్టుకొని జాతి మానంబు నిలిపినట్టి ఖదరునేతగాడ'ని, 'పండ్లు నూరు చున్న బహుమతంబులలోన నహన విద్య నేర్పు సాధకుండని', విశ్వసామరస్య విజ్ఞాన సంధాత' అనీ బాపూజీని జాషువా ప్రస్తుతించాడు.

సుభాస్ చంద్రబోస్ ప్రదర్శించిన ధైర్యసాహసానికి ముగ్ధుడైన జాషువా ఇలా అంటారు. "బోసు చరిత్ర అద్భుతమైనది. అతని అజ్ఞాన పలాయనముతో నా సేతు హిమాచలమాశ్చర్య చకిత నేత్రమైనది. ఒక భారతదేశమే కాదు, ఖండాంతరములు కన్ను దెరచినవి. బోసు మహా త్యాగి....ఆ మహనీయునకు కావ్య నమస్కారము చేయక నా చేతులూరుకొనక పోయినవి" అని నేతాజి కావ్యాన్ని రచించారు. నేతాజీ సాహసంతో బ్రిటిషు ప్రభుత్వంపై చేసిన యుద్ధపు దాడికి జోహారులర్పిస్తూ జాషువా ఇలా అంటారు. "ఉన్న యటులుండి చెరసాల నుత్తరించి యుగ్ర రణరంగమున శంఖమెత్తి నిలిచి మెరసి మొలకెత్తు నీ కోరమీసములకు వందన సహస్రములు బోసు బాబు వీర!" 1962లో భారతదేశంపై దాడి చేసిన చైనా వాణ్ణి గూర్చి చెబుతూ.....

"ఇట నీ యబ్బ గడించినట్టి ధరలేదేనాడు నీ పిచ్చి మ
ర్కట చేష్టల్ పనిచేయ వెన్నడును ధైర్యంబేది నీ కోర్కె దీ
ర్ఘట కిచ్చో ముసలమ్మలై వెఱచు వారున్ లేరు నీ లాహిరీ
నటనల్ మాననిచో ప్రమాదమగు చీనా నాయకాగ్రేసరా!"

అని చైనా నాయకత్వాన్ని గట్టిగా హెచ్చరిస్తూ...

"హైందవ మహార్వి సరిహద్దు లాక్రమించి
కాలుమోపిన కుటిల ముష్కరుని శిరము
మంచు మలమీద దృష్టి కెత్తించుదాక
నిద్రపోవదు భారత భద్రకాళి!"

భారత దేశ సరిహద్దుల్ని అతిక్రమించిన చైనా ముష్కరుని తల నరికే వరకు భారత జాతికి నిద్రరాదని మహాకవి అభిభాషించాడు.

"బహుదేశ మత మహాపరిషత్తు తలయూచ
పలికి వచ్చినది మా భరత సుతుడు
కండెబొట్టున నైదు ఖండాల నోడించి
కొలువు లందినది మా కోమటన్న
సీమలో నాచార్య సింహపీఠిక మీద
నిలిచివచ్చినది మా తెలుగువాడు
విశ్వసన్మానంబు వెలయు నోబెలుకీర్తి
రంగ మెక్కినది మా వంగ సుకవి
చెట్టు చేమల సుఖదుఃఖ జీవతములు
నిజము తేల్చినవాడు మా నేలవాడు
నన్ను దొలగించి లెక్కించినారుగాని
మొదట నెల్లర మన్నదమ్ములము మేము"

వివేకానందుడు మా భారత సుతుడని, గాంధీజీ మా కోమటన్న అనీ, సర్వేపల్లి మా తెలుగువాడని, ఠాగూరు మా వంగ సుకవి అనీ, జగదీస్ చంద్రబోస్ మా నేలవాడని సగర్వంగా చెప్పుకోవడంలోనే జాషువా జాతీయత స్పష్టంగా కనిపిస్తుంది.

బహుదేశములను బేర్వడసి మీసము దీటు భరత ఖండంబు నా పాఠశాల / భక్తి వైరాగ్య భావముల తావల మైన భాగవతంబు నా బాలశిక్ష / ఘన పురాణ గ్రంథకర్త దేవర్షి వ్యాసుండు మా యాస్థాన పండితుండు / గాన వైదుషిగాడు గరగుభక్తుడు త్యాగరాయండు మా యింట గాయకుండు అంటూ గర్వపడతారు జాషువా.

'మా శిల్ప నైపుణ్య మహిమంబు ఘోషించు తాజ మహాలు నుదాహరించి / మా కవిత్వ విలాస మార్దవంబుం జిందు ఘను దిగ్గ కవిని మచ్చునకు జూపి / మా ధనుర్వి ద్వారమా వైఖరం జాటు వీరుడౌ గాండీవి పేరు చెప్పి / మా సతీశీల సంపద లచ్చుగ్రుద్దించు సావిత్రి మాంగల్య చరితమెన్ని / భరతమాతకు గగ్గరుపాటు దోప గగన మండలి మార్మ్రోయ కంఠమెత్తి / విశ్వ ప్రపంచమందు పందెమొడ్డిన నుడువు తప్పని యాంధ్రభూపుడు మహాకవి జాషువా.

మనకు స్వాతంత్ర్యం వచ్చిన సందర్భంలో జాషువా ఇలా అంటారు "అపరంజి గురిసి మా కన్నంబు దిని వించు తల్లి భారతి నేడు దక్కెమాకు..... / అమర సన్నుత మైన హస్తినాపుర రత్నపీఠంబు తిరుగ బ్రాప్తించె మాకు / తలవంచి పగర కత్తులకు జోహారించు దీన భావము నెమ్మదించె మాకు / అననుభూత రసానంద జనితమైన చేతన జ్యోతి దిక్కుల చెంగలించె / గోచరంబయ్యె మా నేత్రగోళములకు అచ్చముగ భారతీయుడ నయితి నేను"అని జాషువా సగర్వంగా చెప్పుకున్నాడు.

బాపూజీ, నేతాజీ, శివాజి, రాష్ట్రపూజ, నాగార్జున సాగర్, స్వయంవరం, గబ్బిలంలోని దేశారాధన, కాందీశీకుడులోని దేశవైభవ ప్రస్తావన, ఖండకావ్యాల్లోని భరతమాత, తెలుగు తల్లి, నవభారతం, ఆంధ్రుడు, శ్రీకృష్ణదేవరాయులు, ఆంధ్రబోజుడు మొదలగు రచనలు జాషువాలోని జాతీయ బావాన్ని, దేశభక్తిని ప్రస్ఫుటంగా తెలియజేస్తాయి. "చావలేదు భారత జాతీయ సంస్కృతి జాతి జీవశక్తి చావబోదు" అని ఉద్ఘాటించిన జాషువా కవి ముమ్మాటికీ తిరుగరులేని జాతీయవాది. జాతీయకవి. జాషువా దేశభక్తి అప్రతిహతమైనది, జాషువా జాతీయత పరిపూర్ణమైనది.

⌘⌘⌘

BHAVAVEENA
Vol. 17, Issue. 8, August 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

సమకాలీనతకు అద్దం పట్టే చా.సో గారి "ఎంపు" కథ

– డా॥. శిల్లీశ్వరరెడ్డి సనపల, తెలుగు అధ్యాపకుడు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, సీతంపేట.

తెలుగు కథ 1910లో పుట్టింది అని భావిస్తే అది పుట్టిన 5 సం॥కి పుట్టారు చా.సో గా పిలవబడే చాగంటి సోమయాజులు. తెలుగు కథా వీధిన తనకంటూ ఒక ఉన్నత స్థానం ఏర్పాటు చేసుకొని తనుమాత్రమే రాయగలడనేటువంటి కథలును రాశాడు చా.సో.

సమకాలీన సమాజపు పోకడలకు అద్దంపట్టే అనేక మంచి కథలు చా.సో కలం నుండి వెలువడ్డాయి. అభ్యుదయ భావాలు నిండిన చా.సో స్వతహాగా మార్క్సిస్టు భావ జాలం కలవాడు కావడంతో అభ్యుదయ కాంక్షతో పాటుగా తాడిత, పీడిత, అనగారిన వర్గాల పక్షాన నిలిచి అనేక కథలును రాశాడు. సమకాలీన సమాజంలోని అనేక విషయాలుపై సంపూర్ణ అవగాహణతో రచన చేయడం చా.సో గొప్పతనం.

సామాజిక, ఆర్థిక, రాజకీయ విషయాలు పట్ల లోతైన కోణాలను పరిశీలించి సమకాలీన సమాజ అవసరాన్ని గ్రహించి అందుకు సాహిత్యాన్ని ఆయుధంగా మలిచి మంచి కథలను రాశాడు చా.సో. నిత్యజీవితంలో తటస్థ పడే సన్నివేశాల్ని ఒక తాత్విక వేత్తలా పరిశీలించి ఆ సంఘ టనలకు తన భావనా బలాన్ని జేర్చి, కొద్ది పాత్రల సాయంతో అనువైన పరిమితమైన పదాలతో, మొదటి నుండి జిగీ బిగీ ఉండేలాగ కథ చెప్పడం చా.సోకు అలవాటైన అంశం.

బుచ్చిబాబు గారు చెప్పినట్లు కథానికంటే మళ్ళీ మళ్ళీ చదివించే వచన ఖండకావ్యం. వెనుక నుంచి సముద్రం హోరు వినిపిస్తూ చూడ్డానికి మాత్రం కెరటంలా కనిపించే విధంగా ఉండే కథలు రాయడంలో చా.సో. సిద్ధ హస్తుడు అనవచ్చు.

కథకి గొప్పతనం పట్టాలంటే కథ చిత్రించే జీవితం భూమినుండి పైకి లేవాలి అని పలికిన చలం గారి మాటలు చా.సో కథలకు సరిగ్గా సరిపోతాయి. చా.సో కథల్లో ప్రతి కథా ఏదో ఒక విధంగా నిషికీ డబ్బుకీ ఉన్న సంబంధాన్ని మనిషిపై డబ్బు ప్రసరించే ప్రభావాన్నీ, డబ్బు సృష్టించే సమస్యల్నీ పాఠకుడికి స్ఫూరింప చేస్తుంది.

ఎంపుకథ :

బిచ్చగాళ్ళ జీవిత విధానం వారి పరిస్థితి మాత్రమే పైకి కనిపించే విధంగా ఉండే ఎంపు కథలో పాత్ర చిత్రణ సన్నివేశ సంకల్పన పరిశీలిస్తే మనిషీకి డబ్బుకీ ఉన్న సంబంధంతో పాటు సమకాలీన పరిస్థితులు అనేకం దర్శన మిస్తాయి.

కుంటాడు - ఎర్రీ పాత్రల మధ్య జరిగిన సంభాషణ మనిషి జీవన విధానాన్ని కొత్త కోణంతో దర్శింపచేస్తుంది. "రేపు తిరిపెమెత్తవా? జానెడు పొట్ట కేటోరె? మూడు పిడుకిళ్ళు దొరికితే సాల్దా? కొన్రా సేపలు అని బలవంత పెట్టింది ఎర్రి" పై మాటల్లో సాధారణంగా చూస్తే ఏదో బిచ్చగాడి జీవనంగా అగుపించే విధంగా ఉన్నా సగటు మనిషి జీవితం అంతర్లీనంగా దర్శనమిస్తుంది. సంపాదన దాచుకోవడానికి మాత్రమే కాదనే భావనతో పాటుగా ఉన్నదానితో సంతోషంగా జీవించాలనే విషయాన్ని స్ఫూరింప చేస్తుంది. రేపటికోసం దిగులు చెంది ఈరోజు దుర్భరంగా జీవించడం తగదనే తాత్వికతను తెలియజేసేవిగా ఉంటాయి మాటలు. అన్నార్తులకు సైతం రేపు అనేదానిపై ఆశకలిగి ఆ ఆశతో జీవించే విధానం పై మాటల్లో దర్శన మిస్తుంది.

"మూడు పిడికిళ్ళు దొరికితే చావకుండా బతకొచ్చు! నలుగురమ్మలకు దయగలిగితే పొట్ట నిండిపోతుంది అదీ ముష్టివాళ్ళ ధీమా!"

జానెడు పొట్టకోసం పట్టెడన్నం అనే సాధారణ వ్యవహారపు మాటలను రచయిత చక్కగా తెలియజేశాడు.

అంతేకాకుండా సమాజంలో వ్యక్తుల మధ్యగల అవినా భావ సంబంధం కూడా పై మాటల ద్వారా తెలియ వస్తుంది.

కులం ప్రస్థావన అన్ని వర్గాల్లోనూ ఎలా విస్తరించి వేళ్ళు నాటుకుపోయిందో క్రింది మాటలు తెలియ జేస్తున్నాయి.

''నాకా జాత్తక్కువ ? నాను కాపోళ్ళ కుర్రోణ్ణి ఏనుకుర్నావో ! ఆ నీ కూతురు గొప్పయిపోనేదు. జటకా వోడితో పోయిన సెటకారీ, ఆ జటకావోడు జోన్నగుడ్డి మాలోడు ! అన్నాడు సొట్టోడు'' పై మాటలలో ప్రస్థావించ బడిన కులం మాటలు సమజంలోని దానికి గల ప్రభావాన్ని చూపిస్తుంది అనడంలో సందేహం లేదు. కులం పేరుతో జరుగుతున్న అరాచకాలకు పై మాలలు కేవలం ఒక ఉదహరణ మాత్రమే. కూటికిగతిలేనోడు మొదలు కొని కోట్లకు పడగెత్తిన కుబేరుడు వరుకు ప్రతి ఒక్కరికీ ఒక కులం ఉంటుందని భావించినపుడు అన్ని కులాలూ సమానమనే భావన కలిగి ఉండడం అవసరం. అలా లేక పోవడం కారణం గానే సమాజంలో కులం పై విరివిగా ఒట్లు, తిట్లు వంటివి స్థిరపడి ఉన్నాయి. నేటికీ కులం పేరుతో పరువు హత్యలు జరగడం కులవ్యవస్థ అనేది నిత్య సమస్య గానే ఉంది అనడానికి అర్ధపడుతుంది

'' ఈ వెదవా దొరికినాడు నీకు? సరైనోని నానే సూత్తాను. అని ఎర్రికి చెప్పి ఎక్కడికో వెళ్ళపోయాడు ముసలాడు''

ఈ మాటలు ఎర్రి తండ్రైన కుష్ఠిరోగి ముసలాడున ఎర్రి తో చెప్పిన మాటలు. పై సంభాషణలు సగటు భారతీయ వివాహ వ్యవస్థ తీరుతెన్నులకు అద్దం పడు తుంది అనవచ్చు. ఆడపిల్ల పెళ్ళి విషయంలో వారి నిర్ణయం కంటే తలిదండ్రుల నిర్ణయమే అంతిమం అనే అంశానికి ప్రతిరూపం పై సంభాషణ. తన బిడ్డ మనసు పడిన వాడికంటే కూడా తన నిర్ణయం అంతిమం కావలనీ కోరుకుంటాడు ముసలోడు. బిడ్డల యోగక్షేమాలు తల్లిదండ్రులమైన మాకంటే ఎవరికీ ఎక్కువ తెలీదనీ వారికి అన్ని విషయాల్లో మంచి కోసమే తల్లిదండ్రులుగా మేము ఉన్నామనే భావన చాలా మంది తలిదండ్రులో ఉంటుంది అనేది జగమెరిగిన సత్యం. ఐతే తల్లి దండ్రులు ఎంత మంది పిల్లల మనసెరిగి వారి మంచి చెడ్డల్లో భాగస్వాములౌతున్నారో ఊహించ వచ్చు. మరీ ముఖ్యంగా ఆడపిల్ల పెళ్లి విషయంలో నేటికీ కొన్ని సమా జాల్లో ఇంటి పెద్దదే అంతిమ నిర్ణయం గా ఉంటుంది.

తను మనసు పడిన సొట్టోడుని కాదని తన తండ్రి మరో వ్యక్తిని తనను మనువాడమని ఎర్రితో చెప్పి ఎర్రికి అదే నిచ్చియం చేసి తన బాగుకోరిన వాడినని చెప్పి ఎర్రికి ఇష్టంలేని మనువు చేసి గుడ్డి వాడికిచ్చి కట్టబెడతాడు. ప్రతి ఆడపిల్లకీ తనకు ఈడున్నవాడి తో మనసైన వాడి తో మనువు జరగాలని భావించడం సహజం. అటువంటి సందర్భంలో తల్లిదండ్రులు పిల్లల అభిప్రాయాలకు కొంత విలువ ఇవ్వాల్సి ఉంటుంది. ఎంపు కథలో ఎర్రి తన మనసుకు నచ్చిన వాడిని మనువాడలేని ఆడపిల్లగా మిగిలిపోతుంది. ఐతే దీనిని పురుషాదిక్యత లేదా పితృ స్వామ్య వ్యవస్థగా అభివర్ణించడానికి కూడా కొంత పరిమితి ఉన్నప్పటికీ పిల్లల మంచి చెడ్డలు తల్లిదండ్రులు భాధ్యతగా భావించి నిర్ణయాలు తీసుకుంటారు అనే భావనను కూడా విస్మరింపరానిదిగా కనిపిస్తుంది.ఏది ఏమైనా ఎర్రి తను మనసు పడిన వారిని గాక మరో మనిషిని మనువాడే పరిస్థితి ఏర్పడిందనేది చెప్పవచ్చు. ఈ సందర్భం సమకాలీన సమజంలో భిన్న వాదాల మధ్య నలుగుతూ నిత్య నూతనంగానే మిగిలుందనడంలో సందేహం లేదు.

పరిస్థితులకనుగుణంగా స్త్రీ తన మానసిక స్థితిని మార్చుకోగలదనే మరో విషయాన్ని కూడా ఎంపు కథలో ఎర్రి పాత్ర ద్వారా రచయిత చక్కగా చిత్రించాడు.''ఎర్రీ! ఇంద. ఇందులోవి తీసి రేపు కడేలూ, అందెలూ కొనుక్కో! అని గుడ్డివాడు మొలగుడ్డల్లో పైకి కనబడకుండా దాచుకున్న ముంతంత డబ్బులు మూట పైకి తీశాడు. కానులు, దమ్మిడీలు ఎన్నాళ్ళబట్టి కూడబెడుతున్నాడో

ముంతంత మూటని చేశాడు. అన్ని డబ్బులు ఏ ముష్టివాడి దగ్గరున్నాయి? ఎర్రికళ్ళు చెదిరిపోయాయి. నాకు మెళ్ళోకి ఎర్ర పూసలు కావాలి అన్నాది. ఎర్రికి ఎర్ర పూసలు ఎన్నాళ్ళ నుంచో మనసు"

ఎర్రికి తను కోరుకున్న వ్యక్తి లభించలేదు అనేది విస్మరించరానిదైనప్పటికీ తను ఎప్పటి నుండో మనసు పడిన ఎర్రపూసలు కోరిక ఫలించింది. కోరుకున్న మనువు లభించకపోయినా కోరుకున్న జీవిత అవసరాలు తీరే మార్గం లభించిందనే విషయాన్ని పై సందర్భం ఋజువు చేస్తుంది. పరిస్థితిని ఎదిరించి ముందుకు సాగడం అందరి జీవితాల్లో సాధ్యం కాదాన్నది వాస్తవం. తనుకోరుకున్న మనువు దక్కాలంటే రోగిష్టి తండ్రిని దిక్కులేని వాడిగా వదిలి పోవాల్సిన పరిస్థితి ఎర్రిది. అలా ఎన్నటికీ ఎర్రి చేయలేదు. కాబట్టి తను మనసుపడిన మనిషిని వదులు కుంది. ఐతే అంతటితో తన జీవిత గమనం ఆగిపోలేదని గ్రహించిన ఎర్రి తన తండ్రి తెచ్చిన సంబంధంతో సరి పెట్టుకుంది. అలా చేయడం ద్వారా తన మనసులోని మరో కోరిక నెరవేర్చుకుంది. ప్రతికూల పరిస్థితికి తలవొగ్గి పారిపోవడమో లేదా కోరుకున్నది లభించనందుకు ప్రాణాలు తీసుకోవడమో ఎర్రి చేయలేదు. అలా చేస్తే అది మరో సందర్భానికి నాంది. పరిస్థితి తన చేతిలో లేనప్పుడు తను మరొకరికి ఆధారమని భావించిన బాధ్యతగల వ్యక్తిగా ఎర్రిని చిత్రించిన రచయిత దృక్పథం సమకాలీన జీవన విధానానికి మార్గదర్శకంగా నిలుస్తుంద నవచ్చు. కోరుకున్నది లభించలేదని ముందు వెనుకలు ఆలోచించకుండా ప్రవర్తించే అనేకమంది నేటికాలపు మనుషులకు ఎర్రి సమాధానంగా నిలుస్తుంది. జరిగి పోయిన దాన్ని తలచుకుంటూ భవిష్యత్ జీవితాన్ని బలి చేయడం మంచిది కాదనేది సుస్పష్టం. కోరుకున్న మనువు దొరకనప్పటికీ ఎర్రికి గుడ్డివాడి రూపంలో కోర్కెలు తీర్చు కోగల ఆర్థిక పరిపక్వత లభించింది. జీవితం ఉంది అని ముందుకు సాగితే, జరగబోయేదానిలో మంచిని వెతు కుతూ ముందుకు సాగితే జీవితం ప్రతి ఒక్కరికీ అవ కాశాలు ఇస్తుంది అనే సానుకూల ధృక్పథాన్ని కథలో అంతర్లీనంగా చెప్పిన విధానం సమకాలీన సమాజానికి అవసరం అవుతుందోనవచ్చు.

కథ అనేది మనకి జీవితంతో, జీవిత రహస్యంతో, జీవిత వైచిత్రితో కొంత కొత్త పరిచయం కలగజేయ్యాలి అని దేవరకొండ బాలగంగాధర్ తిలక్ కథ గురించి చెప్పిన మాటలు చా.సో కథలలో అడుగడుగునా దర్శనమిస్తాయి. మనిషి తను ఏ స్థితిలో ఉన్నవాడైనా ఉన్న స్థితి నుండి ఉన్నత స్థితికి చేరాలనే కోరిక సహజం. ఎంపు కథలో అదే విషయాన్ని చా.సో చక్కగా తెలియజేశాడు. పూట గడవని స్థితిలో ఉన్న ముసలాడు తనకు, తనకూతురుకూ ఎటువంటి లోటు లేకుండా ఉండాలని భావించి సొట్టోడు, గుడ్డివాడు ఇద్దరూ ముష్టివాళ్ళే అయినా వారిలో ఒకరిని కాదని మరొకరిని తమలోకి చేర్చుకొనే ఎంపిక ఎంపు కథకు ప్రధాన భూమికగా నిలుస్తుంది.

కథను ఏ రూపంలో రచించినా కథ ద్వారా పాఠకుల కొక సంస్కారాన్నీ ఒక కొత్త దృష్టినీ కలిగించడం ముఖ్యం అని కథా నిర్వచనం చేసిన గోపీచంద్ మాటలు చా.సో. గారి ఎంపు కథకు సరిగ్గా సరిపోతాయి.

ఆధార గ్రంథాలు :

1. తెలుగు కథానిక - తెలుగు అకాడమీ ప్రచురణ
2. తెలుగు కథా రచయితలు - ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ ప్రచురణ
3. కథానిక స్వరూప స్వభావం - పోరంకి దక్షిణామూర్తి
4. చా.సో కథలు - విశాలాంధ్ర పబ్లికేషన్

⌘⌘⌘

BHAVAVEENA
Vol. 17, Issue. 8, August 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

తెలుగు కథాసాహిత్యం – ముస్లిం స్త్రీల జీవన చిత్రణ

– పి. ఉషారాణి, ఆంధ్రోపన్యాసకురాలు, యస్.జి.వి. ఓరియంటల్ కళాశాల, తిమ్మసముద్రం.

ఏ వాదమైనా ఏదో ఒక అణచివేతలోంచే పుట్టుకొస్తుంది. తామనుభవించే కష్టాల్ని, దుఃఖాల్ని, ఎదుర్కొన్న అవమానాల్ని ఆ వ్యక్తులు చెప్పుకుంటేనే అందులోని గాఢత, తీవ్రత, నిజాయితీ ఎదుటివారికి అర్థమౌతుంది. ఎవరి సంస్కృతి గురించి వారు చెప్పినంత బలంగా, హృదయానికి హత్తుకునేలా చెప్పడం వేరే సంస్కృతి వాళ్ళకు కష్ట సాధ్యమౌతుంది. ముస్లింలు తమ సమస్యల్ని - తమ ప్రత్యేకమైన సంస్కృతిని - తరతరాలుగా అనుభవిస్తున్న పరాయీకరణని - వెలివేతని - దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న నిర్లక్ష్యాన్ని గొంతెత్తి చెప్పే ప్రయత్నం లోంచి పుట్టిందే ముస్లిం వాదం.

లింగవివక్షతకు వ్యతిరేకంగా స్త్రీవాదం, అగ్రవర్ణాల - అమానవీయ ప్రవర్తనకు నిరసనగా దళిత వాదం ఆవిర్భవిస్తే, ఒక మతానికి సంబంధించిన వ్యక్తుల మీద సంధించబడుతున్న అనేకానేక విమర్శనాస్త్రాలకి, అనుమానపు చూపులకి, అవహేళనలకి సమాధానంగా ముందుకొచ్చిందే ముస్లింవాదం.

"మతం వల్ల ఒనగూడే ప్రయోజనాలూ ఉన్నాయి. మతం మనుషుల్ని సంఘటిత పరుస్తుంది. మనిషిని సన్మార్గం వైపుకు నడిపిస్తుంది. క్రమశిక్షణ నేర్పుతుంది. పాపభీతిని కలుగజేస్తుంది. ఏ మతమైనా మానవత్వాన్ని నేర్పుతుంది. మతం ఉండాల్సిందే. సమాజానికి హాని చేసేది మతం కాదు. మతమౌఢ్యం... పరమత విద్వేషం..." రాచరిక కాలంలో ఒక మతానికి సంబంధించిన రాజులు ఇతర మతస్థుల ప్రార్థనా మందిరాల్ని పడగొట్టి అదే స్థలంలో తమ మత మందిరాల్ని కట్టించిన దాఖలాలు చరిత్రలో కోకొల్లలు. ఇదే విషయాన్ని గురజాడ తన 'పెద్ద మనీదు' కథలో చెప్పాడు. శివాలయం మసీదుగా మారటం - లక్షణభట్టు సాహెబుగా మారటం ఈ కథలో కనిపిస్తుంది. ఇలాగే హిందూ మత రాజులు కొందరు మసీదుల్ని పడగొట్టి దేవాలయాలు కట్టిన రుజువులు కూడా ఉన్నాయి. అయితే ఒక ప్రజాస్వామ్య దేశంలో అన్ని మతాలవారికీ సమానమైన బాధ్యతలు, హక్కులు ఉన్నాయని చాటుకున్న భారతదేశంలో మైనారిటీ వర్గాలు ఇక్కడ ఉన్నంత భద్రంగా ఏ దేశంలో ఉండరని గర్వంగా చెప్పుకునే హిందూదేశంలో బాబ్రీ మసీదు కూల్చివేత చరిత్ర ఎన్నటికీ మర్చిపోలేని ఓ దుర్ఘటన. ప్రపంచ ముస్లింలు ఎప్పటికీ క్షమించని ఓ దుర్మార్గం. కూలింది బాబ్రీ మసీదు గోడలే కాదు. భారతీయ ముస్లింల నమ్మకాలు కూడా. తెగిపడింది మినార్లే కాదు, ముస్లింల ఆత్మగౌరవం కూడా.

ముస్లింలను ఈ సంఘటన దిగ్భ్రాంతికి గురిచేసింది. అభద్రతాభావంలోకి నెట్టేసింది. మెజారిటీ వాదులు సాగిస్తున్న ఈ అమానుషమైన అణచివేతను అంతం చేయడానికి ఓ ధిక్కార స్వరం లేచింది, అదే ముస్లింవాదం.

ఇంతటి క్రూరమైన సంఘటన జరక్కముందు 'రావి చెట్టులో మొలిచిన వేపచెట్టులా కల్సిపోయినోళ్ళం' అంటాడు రహ్మతుల్లా. "మా పల్లెటూరులో మతకలహాల గురించి ఎప్పుడూ విన్లేదు. ముస్లిం మగవాళ్ళు ఉగాది రోజు రామాలయానికి వెళ్ళి పంచాంగం వినేవాళ్ళు. ఉగాది పచ్చడిని కళ్ళకద్దుకొని తినేటోళ్ళు. మస్తాన్ వలీ దర్గాకు వచ్చేవాళ్ళలో సగం మంది హిందూవులే. తమకు పిల్లలు పుడితే మస్తాన్ వలి పేరు పెట్టుకుంటామని మొక్కుకునేటోళ్ళు. తావీజులు కట్టించుకునేవాళ్ళు. పీర్ల పండగప్పుడు పప్పులు బెల్లం పంపించి ఫాతెహా చదివించేటోళ్ళు. పీర్లెత్తిన ముస్లింల కాళ్ళమీద హిందువులు బిందెల్తో నీళ్ళు కుమ్మరించేటోళ్ళు. పీర్లు మోసేటోళ్ళు. పెళ్ళిళ్ళకీ, పబ్బాలకీ ముస్లింలని భోజనాలకి పిల్చే

టోళ్ళు.'' అంటూ హిందూ, ముస్లింల మధ్య ఉన్న ఐక్యతని గురించి సలీం చెప్పిన ఈ మాటలు అక్షర సత్యాలు. ఈ ఐక్యత ఇప్పుడేమైంది అన్న ఆక్రోశం కూడా ఉంది.

బాబ్రీ మసీదు సంఘటన తర్వాత ఒకర్ని ఒకరు అనుమానంగా, భయంగా చూసుకోవడం ఎక్కువైంది. ముస్లింలు అవాంఛితుల, అనుమానితుల జాబితాలోకి చేరిపోయారు. తమ దేశభక్తిని ప్రతిక్షణం నిరూపించుకోవాల్సిన దయనీయమైన పరిస్థితిలోకి నెట్టివేయబడ్డారు. ''నేను పుట్టకముందే దేశద్రోహుల జాబితాలో నమోదైంది నా పేరు - కన్నబిడ్డని సవతి కొడుకుగా చిత్రించింది చరిత్ర'' అంటాడు ఖాదర్ మొహియుద్దీన్. తాము ముస్లిం లైనా తమ రక్తంలో ప్రవహించేది భారతీయతే అని ప్రతి సందర్భంలో చాటుకోవాల్సిన అగత్యం ఏర్పడింది. ''దేశ ద్రోహులనే బురదని కడుక్కోడానికి కన్నీళ్ళనే కాదు తమ రక్తాన్నే ధారపోయాల్సిన పరిస్థితి ఎదురైంది.'' ఈ నేపథ్యంలో ముస్లిం రచయితలు తమ కష్టాల్ని, కన్నీళ్ళని, ఆవేదనని, ఆక్రోశాన్ని బలంగా చెప్పడానికి ముస్లింవాద ఆవిర్భావం ఒక చారిత్రక అవసరమైంది.

ఆవేదన, ఆవేశం, ఆక్రోశాలతోపాటు ముస్లింల ఆచార వ్యవహారాల్లో ఉన్న బూజుని దులిపే ప్రయత్నం కూడా చేస్తున్నారీ రచయితలు. అర్థరహితమైన, అమానుషమైన ఆచారాల్ని, మత పెద్దల దుర హంకారాల్ని, ఖురాన్‌కి చేస్తున్న వక్రభాష్యాల్ని, ముల్లాల, మౌల్వీల అనవసర జోక్యాల్ని ధిక్కరిస్తూ సంస్కర ణాభిలాషతో కథలు రావడం ఆహ్వానించదగిన అంశం. పురోగమనానికి అడ్డుపడుతున్న కట్టుబాట్లని, పరదాల్ని, బురఖాల్ని తెంపుకొని ముందు కెళ్ళాలనే తపన ముస్లిం స్త్రీలలో కనిపించడం అభినందించ దగిన మార్పు. 'వూహ తెలీని వయసులో గుమ్మానికి పరదా కడితే రంగురంగుల కుచ్చులు చూసి మురిసి పోయేదాన్ని - అప్పుడే స్వేచ్ఛకి మొదటి బేడీ అని తెలుసుకోలేని పసిదాన్ని' అంటుంది షాజహానా.

గుజరాత్ హింసాకాండ అగ్నిలో అజ్యం పోసింది. కరెంటు తీగలు వదిలిన దిగుడు బావుల్లోకి ముస్లింలను తోసి, పసిపిల్లల నోళ్ళలో పెట్రోలు పోసి నిప్పంటించి, ఆడవాళ్ళను మానభంగాలు చేసి, కడుపుతో ఉన్న స్త్రీల గర్భాలు చీల్చి పిండాల్ని శూలాలకు గుచ్చి... ఎంతటి రాక్ష సత్వం... పారుతున్న రక్తం... తెగిపడిన చేతులు... కట్టెల్లా కాలుతున్న కాళ్ళు... బంతుల్లా దొర్లుతున్న శిరస్సులు... ఎంతటి భీభత్స భయానక దృశ్యాలో...

''గుజరాత్‌లో జరిగిన ఘోరమైన, ఆటవికమైన మత మారణకాండ ప్రకంపనలు కూడా చోటు చేసుకున్నాయి. మొత్తం దేశాన్నంతా సందిగ్ధంలో పడవేసిన భయానక చారిత్రక సందర్భం అది. రెండు నెలలపాటు సాగిన సామూహిక హత్యాకాండలో, పిల్లలూ, పెద్దలూ, స్త్రీలూ అన్న తేడా లేకుండా, వేలాదిమంది ముస్లింలను దారు ణంగా ఊచకోత కోశారు - వందల సంఖ్యలో స్త్రీలపై లైంగిక అత్యాచారాలూ జరిగాయి! స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత దేశచరిత్రలో, ఇంతపెద్ద మారణకాండ జరగలేదు. దేశ ప్రజల్లో లౌకికతత్వం ప్రశ్నార్థకమై పోయింది. మైనార్టీల్లో తీవ్రమైన అభద్రతా భావాన్ని పెనువృక్షంలా పెంచింది ఈ సంఘటన! రచయితలూ, కవులూ, కళాకారులూ గుజరాత్‌లో జరిగిన ఈ విధ్వంసాన్ని నిరసిస్తూ ఎలుగెత్తి తీవ్రంగా ఖండించారు. వాళ్ళ బాధను తమ బాధగా విలపించారు. కొన్ని వందల కవితలు, ఈ సంఘటన పట్ల ఆగ్రహాన్నీ, ఆవేదననూ, ముక్తకంఠంతో ఆలపించాయి. తక్కువగానే అయినా కథలూ వచ్చాయి. అయితే కవిత్వానికుండే 'ఫ్రేమ్' కథకు ఇలాంటి సందర్భాల్లో వెనువెంటనే కుదరపోవచ్చు గాని, నిజాయితీతో ఆర్తితో కూడిన ప్రతిస్పందనలు కథల్లో గాఢంగా ప్రతిఫలించాయి.''

'ఎక్కడెవరు నూకలు చల్లినా - పావురాల గుంపే బలపుతుంది. గుజరాత్‌లో కాలుతున్న వేల శవాల ఒంటరి కఫన్ నేను' అంటుంది షాజహానా. సంఖ్యాపరంగానే కాక ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా బలమైన వర్గం

చేతిలో అమాయకమైన, బలహీనమైన పేద ముస్లింలు ఎలా బలౌతారో గుజరాత్‌లో ప్రత్యక్షంగా చూశాక ముస్లింల హృదయాలు భగ్గుమన్నాయి. గుజరాత్ గాయం లోంచి వేనవేల కొత్త గొంతుకలు విచ్చుకున్నాయి. హిందుత్వవాదులు ముస్లింలపై జరిపిన, జరుపుతున్న దాడులు - ముస్లింల వెనుకబాటు తనం, ముస్లింల ప్రత్యేక సమస్యలు - దూదేకుల దయనీయమైన పరిస్థితి - ముస్లింల అస్తిత్వ పోరాటం... ప్రధానాంశా లుగా ఎన్నెన్నో కవితలు, కథలు వచ్చాయి.

నల్లూరి రుక్మిణి రాసిన 'నెత్తురోడుతున్న నేల' అన్న కథలో బాధనంతా ఒక స్త్రీగా చర్చకు పెట్టింది. ఒక ఆఫీసులో పనిచేసే ఉద్యోగుల్లో ఈ సంఘటన పట్ల కొన్ని అనుకూల, ప్రతికూల ధోరణులు వ్యక్తం కావటాన్ని ఈ కథలో చూడొచ్చు. 'పాపం అమాయకులైన ప్రయాణికుల్ని ఎంత అమానుషంగా తగలబెట్టారో. మనవాళ్ళు నోరు విప్పటానికి వీల్లేదు. ఇక్కడా వీళ్ళదే దౌర్జన్యం. అంత పిచ్చి ఉంటే వాళ్ళ దేశం వాళ్ళు వెళ్ళిపోవచ్చుగదా' ఇలా మైనార్టీల పట్ల వ్యతిరేకంగా రన్నింగ్ కామెంటరీలు చేసేవాళ్ళు ఆ ఉద్యోగుల్లో ఉన్నారు. 'మన జోలికి వస్తే వూరుకుంటామా' అనే హిందూత్వవాదులూ ఉన్నారు. ఈ ధోరణిని, అక్కడ పనిచేసే కరుణ ఎదుర్కొంటుంది. 'ఏమిటండీ? మనదేశం, మనదేశం అంటారు. వాళ్ళు ఇక్కడ పుట్టలేదా? పెరగలేదా? ఎక్కడన్నా పుట్టి ఇక్కడకు వచ్చారా? వాళ్ళ మతం వేరైనంత మాత్రాన మనం చెప్పి నట్టల్లా నోరెత్తకుండా పడివుండాలా?' అంటూ వాళ్ళ వాదనను ఖండిస్తుంది. గుజరాత్ 'నెత్తురోడుతున్న నేల'గా మారటాన్ని చూసి కరుణ విలపిస్తూ - 'యుద్ధం, అరాచకం, ఏదైనా కానివ్వండి! ఇది తెచ్చేది ఆడదానికి దుఃఖం మాత్రమే. పురుష ప్రపంచపు ద్వంద్వనీతే స్త్రీల రోదనలకు మూలం' అంటూ స్త్రీల పక్షాన తన ఆవేదనను వ్యక్తం చేస్తుంది.

గీతాంజలి రాసిన 'బిచ్‌డీ చమన్!' గుజరాత్ మారణ కాండ తర్వాత, హిందువులు, ముస్లింలు కలిసి సఖ్యంగా ఉండే ఒక గల్లీలోని హాస్పిటల్ వాతావరణమే మారి పోయింది. ఆ హాస్పిటల్‌లో ముస్లిం నర్సుల్లో, ఉద్యో గస్తుల్లో ప్రవేశించిన అభద్రతాభావం, వాళ్ళ ప్రవర్తనను, మాట తీరునే మార్చివేస్తుంది. "ముస్లిం కమ్యూనిటీ మీద జరుగుతున్న హత్యాకాండ, పూర్తిగా ఒక ఖామోషీనే నింపింది. స్వేచ్ఛతోని, ప్రేమతోని, స్నేహంతోని ఇన్ని దినాలు, హిందూ, ముస్లింలు ఒకర్నొకరు చూసుకున్న చూపులల్ల ఇప్పుడు ఒక ప్రశ్న. ఒక అపనమ్మకం, అభద్రత కన్పిస్తున్నయ్. గల్లీల ఉప్పొంగినట్టుండే ముస్లింల ప్రవర్తన, చప్పున చల్లం గయ్యినట్టయింది. ఒదిగి ఒదిగి నడుస్తున్నారు. ఈ బస్సులల్ల, రైళ్ళల్ల, స్టాపులల్ల, బజార్ల వెంట పోతున్న ముస్లింలలో ఒక బెదురు కన్పిస్తుంది.." అంటూ ముస్లింలలో ఏర్పడిన ఒక అభద్రతా భావాన్ని, ఈ కథ బరువుగా చూపిస్తుంది. గుజరాత్‌లో జరిగిన హత్యాకాండలో, భర్తను, పిల్లల్ని, అత్తమామల్ని పోగొట్టు కుని, మానాన్ని పోగొట్టుకొని, ఆస్తులు పోగొట్టుకొని ఇక్కడికి తిరిగి వచ్చిన నూర్జహాన్ అనే మహిళ దీన హీన గాథను, ఆర్తనాదాన్ని కూడా ఈ కథ విషాద భరితంగా చిత్రించింది.

⌘⌘⌘

BHAVAVEENA
Vol. 17, Issue. 8, August 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

బసవేశ్వరుడు మరియు దళిత మూల వచన కారులు

– డా॥. సి. శివన్న , మడకశిర.

12వ శతాబ్దంలో వీరశైవ వచన కారుల మాటల ధోరణులు గమనిస్తే వాళ్లు ఒక కొత్తదనాన్ని స్థాపించి, నూతన సమాజాన్ని నిర్మించే పనిలో నిమగ్నమైనట్లు అర్థమౌతుంది. వచన చమత్కృతులను గమనిస్తే దాని నాయకుడు బసవేశ్వరుడు. అయితే అందులో పాల్గొన్న అధిక సంఖ్యాకులు దళిత వర్గ వచనకారులే. 12వ శతాబ్దంలో సామాజిక, రాజకీయ, ధార్మిక సాహిత్య క్షేత్రములో సంక్రమణలకు దారిచూపిన కాలం. కర్నాటక సాహిత్య చరిత్రకు కొత్త ఆయుస్సును పోసిన సమయం. మాల, మాదిగ, కీడుజాతి, అస్పృశ్యులు, అంటరాని వాళ్ళు, వారు చేసెడి "కాయకము"నకు గొప్ప మహాత్యాన్ని తెచ్చి ఇచ్చారు. కాయకములో కైలాసాన్ని కల్పించిన శరణులు తాముచేసేడి కులవృత్తులకు గొప్ప గౌరవాన్ని పొందారు. ప్రతి వచన కారునికి ఒక్కొక్క కాయకముండేది. అందరూ కాయక శ్రామికులే కానీ, సోమరులు కాదు. జీవితానుభవాల జతకు వారి కాయకానుభూతి మాటలె వారి వచనాలైనాయి. వచన రచన వారి సాహిత్య ఉద్ధేశ్యం కానప్పటికీ అదొక సందర్భాను సారముగ, అనుభవాలలో లోతు వున్నది. సమాజంలోని కళల రకాలు వున్నవి. సామాజిక హితత్వమున్నది.

12వ శతాబ్దంలో భక్తి ఉద్యమం పేరుతో వెలసిన వీరశైవ యుగము. దీనికి మూలపురుషుడు బసవేశ్వరుడు. కర్నాటక రాష్ట్రములోని బాగేవడిలో మాదారస మాదలాంబిక దంపతులకు జన్మించినవాడు బసవన్న. లోకోద్ధరణ కోసం సమాజంలో నెలకొన్న కుల, మత, వర్గ, వర్ణ వైషమ్యాలను రూపుమాపడానికి జన్మించి, కాయకమే కైలాసమని నిరూపించిన కారణభూతుడు బసవేశ్వరుడు.

కర్నాటక రాష్ట్రమేగాక యావత్ భారతదేశం మొత్తం వైదిక యాజమాన్యానికి వ్యతిరేకంగా అనేక పోరాటాలు జరుగుతుండేవి. బసవేశ్వరుడికి వేలకొలది శరణుల వెన్నంటి వుండి ఈ పోరాటంలో పాల్గొనేవారు. స్థానిక, సాంస్కృతిక, కాయక పోరాటంలో బ్రతికిన సాంఘిక వ్యవస్థను గుర్తించిన దేవుడు బసవేశ్వరుడు. కాయకములోనే దైవసేవ చేసి, దేహములో దేవాలయాన్ని దర్శించే శరణుల ఆశయం మహోన్నతమైనది. బసవన్న అల్లమ ప్రభు, అక్కమహాదేవి, అంబిగ చౌడయ్య, సూళే సంకవ్వ, మేదర కేతయ్య, మడివాళ మాచయ్య, హడపద అప్పణ్ణ, దానిమయ్య మొదలైనవారు తమతమ వచనాల నుండి వచన చమత్కారాలనుండి సంచలనాలను రేకెత్తించిన విధానంలోనే దళిత శరణులైన మాదార చెన్నయ్య, మాదార బొప్పయ్య, దోహర కక్కయ్య, సమగార హరళయ్య, కల్యాణమ్మ, ఉరిలింగపెద్ది, కాళవ్వ, సమగార భీమవ్వ మొదలైనవారు వచన రచనల నుండి తాము చేసే వృత్తి మూలంగానే వచనాలు చెప్పి సమాజానికి శక్తిని, చైతన్యాన్ని నింపారు. అది రాజకీయ, సాంస్కృతిక క్షేత్రములో ఆమూలాగ్రంగా అభివృద్ధి చెందినదు ఇతిహాసము.

బసవన్న కలలుగన్న సమాజాభివృద్ధి, ఆశయ సిద్ధికి పూరకమైనది వచన సాహిత్యము. అనుభవ మంటంలోని చర్చల నుండి ఆకారం పొందింది. అది కూడా వ్యక్తి యొక్క అత్యున్నతకు కాక సమాజ సమిష్టి కల్యాణంవైపు నడిపించింది. ఇటువంటి ఘనమైన శరణుల సంగమం, కల్యాణం మరియు వాళ్ళు నివసించిన ఊరు కల్యాణ పట్టణం లాగానే అర్థాన్ని సూచిస్తుంది.

అల్లమ ప్రభు అధ్యక్షతన అనుభవ మంటపం లోని అన్ని వృత్తుల శరణు, శరణీమణులు చేరి తమ తమ లింగభేదములు మరచి పరస్పరం తమతమ జీవితానుభవాలను గూర్చి మాట్లాడుకున్న మాటలే వచనాలుగా

అభివ్యక్తి అయ్యాయి. ఇదే దృష్టి నుంచి చూసిన వచన సాహిత్యము అనుభవ సాహిత్యమైనది. అట్టడుగు వర్గాల జాతులవారు అత్యధికంగా పాల్గొనడం వల్ల కన్నడ నేల ఆశ్చర్యం పొందిం, ప్రామాణికం పొందిన నేల "కావ్యమై నది" అని ఎం.ఎం. కలబుర్గి గారు బసవన్న వచనల సంపుటం "సంపాదకీయం" మాటల్లో తన అభిప్రాయాన్ని వెలిబుచ్చినారు.

వచన సాహిత్యము "ప్రాచీన సంస్కృత ప్రాకృత సాహిత్యాల శైలి, ఛందస్సు, సాహిత్యమీమానంసాలను అనుసరించక సామాన్య జనుల భాషనే ప్రామాణికంగా తీసుకొన్నది. గ్రాంధిక భాషను తిరస్కరించి జనుల భాషను ఆధారం చేసుకొని వెలువడినదే వచన సాహిత్యము. ప్రభుత్వ పరిపాలన భాషకు స్వస్తి చెప్పి, వచనాలతోనే సాహిత్య రచన చేసిన వచన సాహిత్య కారులు, అదే ఒక పెద్ద ఒరవడి అయ్యినది.

మాలమాదిగ అస్పృశ్యుల వంటి అంటరాని జాతుల వచన కారులు జనుల భాషలోనే కావ్యరచనలు చేసి చందోబద్ధ రచనలకు స్వస్తి పలికారు. దీని ముఖ్య కారకుడు బసవేశ్వరుడు. బసవన్న తన వచనంలో దళితులనుద్దేశించి ఇలా అంటాడు.

"అప్పనుమా మాదర చెన్నయ్యన
జొప్పడు మా దోహర కక్కయ్య"

అని పిలిచి దళితులపై తనకున్న బంధుత్వమును చాటుకున్నాడు.

వీరశైవ ధర్మాన్ని రూపొందించింది అనుభవ మంటపం. అనుభవ మంటపం అంటే వివిధ కాయకాల మూలల నుండి విశేషంగా దళిత వర్గాల నుండి వచ్చిన కుశల కర్ముల శక్తి కేంద్రం. వారిలో మేదరులు, మదా రులు, చాకలివారు, డోహరులు, ఈడిగ, సూళేగాళ్ళు, వడ్రంగులు, కాపువాళ్ళు మొదలైన కాయకము వారు న్నారు. వీళ్ళందరూ వర్ణాశ్రమ ధర్మాన్ని వ్యతిరేకించి "అను భవ మంటపం" అనే సమానత వేదికను కల్యాణములో రూపొందించుకున్నారు.

ఇందులో అందరూ సమానమనే సంకేతాన్ని మార్గంగా చూపించడం బసవేశ్వరుడు చేపట్టిన లింగాయత సూత్రము. సూత్రమంటే లింగధారణ. వర్గ సమాజంలో యజ్ఞోపవీత ధారణ పురుషులకు మాత్రమే నాడు ఆచరణలో వుండేది. కానీ బసవేశ్వరుడు లింగధారణ నియమాన్ని స్త్రీ పురుషులు అందరూ ధరించవచ్చని మార్చివేశాడు. అందుకే అతడు క్రాంతి పురుషుడైనాడు.

సమసమాజ స్థాపనే ధ్యేయంగా వెలసిన అనుభవ మంటపంనుండే వీరశైవ సాంప్రదాయం పుట్టుకొచ్చింది. అందులోని సభ్యులందరూ పుట్టుకతో ఏకులం వారైనా సరే, వారు శీల, శివాచార, సిద్ధాంత పాలన, కాయక తత్వం, అనుష్ఠానం దృష్టి నుండి నిష్ఠతను పొందటం వంటి నియమాలు కలిగి, శివ శరణుడైనందున, వాడు జాతి, కుల, మత నిర్భంధాలనుండి విముక్తి పొంది, క్రొత్త సామాజిక సమతల వ్యవస్థను అనుభవ మంటపం ప్రతిపాదించి పెట్టింది.

బసవేశ్వరుడు చెప్పినటువంటి

"ఏ కులమైతే ఏమి?
శివలింగమున్నవాడే కులజుడుప
కులాన్ని లెక్కించగలరా శరణుల్లో
జాతి సంకర మైతేనేమి?
భక్తులలో కులాన్ని లెక్కించడం సాధ్యమా
కూడల సంఘమ దేవా"

- అంటూ కుల నిర్మూలనకు చేసిన సేవ అపార మైనది. బసవన్న సామాజిక న్యాయానికి కట్టుబడి ఉన్నందువల్లనే అల్లమ ప్రభువు "అనుభవ మంటపం" పీఠాధ్యక్షుడైనాడు. సామాజికంగా వెనుకబడిన కులాల నుండి అనేక శరణులు శైవసిద్ధాంతాన్ని అనుసరించడం వల్ల వీరశైవములో వీరికి ఉన్నతమైన స్థానమిచ్చాడు బసవన్న.

మహామానవతావాది బసవేశ్వరుడు. ఇతనికి పురాణా లలోని అనేక మంచి మునిపుంగవుల పుట్టుక గురించి

ముందే తెలిసి ఉండెను. మునిపుంగవులుగాని, కుల పురుషులుగాని, గోత్రప్రవక్తలుగానీ, వృత్తి ఆధారిత కులం నుండి వచ్చినవారే అని కుండబద్ధలు సకొట్టినట్లు చెప్పిన వచన కారుడు బసవేశ్వరుడు.

జానపద కవులు బసవేశ్వరున్ని కులబేధాలను నాశనం చేసిన క్రాంతి పురుషునిగా చిత్రించారు

"మాల మాదిగల బేధాన్ని తొలగించాడు
భలిరా బసవయ్య సవరస
నీ ఊపిరి నిజమైనది నిత్య జనపథానికి"

అని పాడుకున్నారు. దళిత వచనకారుడు మాదార చెన్నయ్య తన వచనంలో ఆర్య, ఋషి, మునుల కులం గుర్తులన్నియూ అస్పృశ్య జాతి మూలం నుండి వచ్చినవే అని గుర్తించాడు. దాని జతకు మా కుల గోత్రాలె గొప్ప అని చెప్పుకునే సాంప్రదాయాన్ని ఖండించాడు.

"సాంఖ్యశ్వపచ అగస్త్య కబ్బిల
దుర్వాసుడు మశ్చగంధి దదీచి కొడుకు
కశ్యప కుమ్మారీ రోమజకమగారుడు

కౌండిల్యుడు నానావిధ కులంబుల వాడని - చెన్నయ్య తన అభిప్రాయాన్ని తెల్పినాడు. అంటే ఆర్య సప్తఋషులు ఆదినుండి అనత్యమున నడిచారని అలాంటి ఋషుల ముందు బ్రాహ్మణులు మేమే గొప్ప వాళ్ళమని చెప్పుకోవడం తప్పుఅని చాటి చెప్పినాడు చెన్నయ్య.

భారతీయ దర్శనములో సాంఖ్యదర్శనం ప్రముఖ మైనది. సాంఖ్యాన్ని మాదార చెన్నయ్య శ్వపచుడని గుర్తించాడు. బసవేశ్వరుడు చెప్పినట్లు శ్వపచోపి అయితే ఏమి? శివభక్తుడేకులజుడని అన్నాడు.

"దళితుల స్థానాన్ని గురించిన శరణుడు బసవన్న
చెన్నయ్య ఇంటి దాసుని కుమారుడు

కక్కయ్య ఇంటి దాసి కూతురు. వీరిరువురు పాలం పనులకు పోయి 'సంఘం' చేసినారు. వీళ్ళకు పుట్టిన కుమారుడ నేను, కూడల సంఘమేశ్వరుడే సాక్షి" ఈ వచనాన్ని చూపాడు బసవన్న.

బసవన్న తన వచనాలలో దళిత శరణులైన మాదార చెన్నయ్య, డోహార కక్కయ్య, శ్వపచయ్య మొదలైన వారిని అత్యంత గౌరవభవముతో అప్ప, అయ్య, ముత్తాత, తాత శబ్ధములను సంబోధించి, తనకున్న రక్త సంబంధాన్ని అన్వయించాడు బసవన్న.

బసవన్న దళితులనే గాక వాళ్ళ పెంపుడు కుక్కలను గూడా పంచ మహావాద్యాల నడుమ మెరవణిగా చేస్తాడు.

బసవన్న ఈ వచనము గమనించండి.

"మాల మాదిగ భక్తుడైతే
అతని ఇంట సురగంగ
పంచమహా వాద్యాలతో సన్మానం చేయడా!

అప్పడోహారు కక్కయ్య అయితే! ముత్తాత చెన్నయ్య అయితే అని, వర్ణ వ్యవస్థను తూర్పారబట్టిన మహా చైతన్యవాది బసవేశ్వరుడు.

మాదార చెన్నయ్య :

బసవేశ్వరునికి ఎక్కువ ప్రేమ, వాత్సల్యము కలిగిన దళిత శివ శరణుడు మాదార చెన్నయ్య. బసవేశ్వరుడు తన వచనాలలో చెన్నయ్యను 29సాంన్లు తలచుకున్నాడు.

హరిహరుడు మొదలుకొని వచనాలు రచించిన కవు లందరు మాదార చెన్నయ్యను పొగిడినారు. శివ పార్వతులు చెన్నయ్య ఇంటిలో గంజినితాగి కైలాసములో నాట్యం చేశారని జానపద కవులు కొనియాడారు. కరికాల చోళ మహారాజు చెన్నయ్య భక్తిని చూసి నా శిరస్సు నీ చెప్పులకు సమమేనయ్యా? అని తలదించి నమస్కరించి నాడు. కడుజాతులైనా కూడా వారి "ఆధ్యాత్మిక తత్వం" ఎలాంటిదని అర్థం చేసుకోవాలి. వేదాలు వణుకుతాయి. శివుడు మాదార చెన్నయ్యుని ఇంటిలో తిన్న కారణంతోనే అని బసవేశ్వరుడు అన్న మాటలను బట్టి చూస్తే మాదార చెన్నయ్య ఎలాంటి మహాత్యాలు కలిగిన వచనాలు రాశాడో అర్థమవుతుంది.

12వ శతాబ్దంలో మాదార చెన్నయ్య, బసవేశ్వరుని వచనాల లాగానే ఋషుల, మునుల మూల వృత్తాంతాన్ని

చెప్పినాడు. హరిహరుడు మాదార చెన్నయ్యని జీవన విధానాన్ని గురించి మాదార చెన్నయ్య రగడలే రాసినాడు. మాదార చెన్నయ్య 12వ శతాబ్దంలో బెళగావిలోని "కోడిమఠం"లో విద్యార్జనకు వచ్చినట్లు తెలుస్తున్నది.

చెన్నయ్య కక్కయ్య మొదలైన దళిత శరణులను కులానికి "తిలకం" వంటి వాడని తలచినారు. మాదార చెన్నయ్య గుప్త భక్తుడని చెప్పవచ్చు.

తన ప్రీతిపాత్రమైన వృత్తి చర్మకారవృత్తి. దానిని గూర్చి మాదార చెన్నయ్య ఇలా అంటాడు.

"స్థూల సూక్ష్మ కారణమనే మూడు స్తంభాలను నిలబెట్టు
న్యాయాలయమనే సానిరాయిపైన
బలిసిన ఎనుము చర్మాన్ని తీసి
ఉభయ నామమనే నారులో తోలుతిత్తిని చేసి
భావమనే నారుతో
సర్వసారమనే కారపునీళ్ళను పోసి
చర్మపు దుర్గుణం పోయి
మేల్కొతి వారికి తాకించాలని వచ్చితి"

- అని తాను పనికిరాని చర్మాన్ని సుందరంగా కర చేసి ఇచ్చిన పని కౌశలాన్ని తెల్పినాడు. అంటే మనస్సు లోని దుర్గుణాలను తొలగించుకొని భావశుద్ధమయ్యే అనుభవాన్ని వృత్తి పరంగా తెల్పినాడు చెన్నయ్య. కాయ కములో బ్రతికిన నిజనడతను నేర్పిన పెద్ద అనుభవశాలిగా మనకు కనబడతాడు.

ఎద్దుమాంసం మరియు ఆహార సంస్కృతిలో హరళయ్య మరియు కాళవ్వరు :

ఆది జాంబవంతుడు నిరూపించిన జానపద మౌఖిక కథనాలు మరియు పాటలలో శరణుడు హరళయ్య చని పోయిన ఎద్దుల మాంసం తినేవాడని అనేక రచనలు దొరుకుతున్నాయి. ఇదే సమకాలీన వచన కారిణి కాళవ్వ తన వచనంలో ఎద్దుమాంసం తినే సంస్కృతిని తిరస్క రించింది.

గోమాంస భక్షణ సరికాదని, గోమీమాంసకరుల రాజ్యకారణ విరుద్ధంగా స్వాభిమానానికి సంకేతంగా పలకిన పలుకులు చూడండి.

"గొఱ్ఱెలు, కోళ్లు, చిన్న చేప తినేవాళ్ళనందరిని కులజులు కలుజులంటారు
శివుని పంచామృతాన్ని వొసగే పశువు తినే మాదిగ వాన్ని కడుజాతి అంటారు
వాళ్ళెలా కడుజాతులౌతారు? జాతులు మీరెందుకు కీడౌతారు?
బ్రాహ్మణుడు భుజించిన మల్లె పువ్వులా ప్రకాశించి కుక్కనాకిపోతు
మాదిగవారు భుజించిన మల్లెలు బ్రాహ్మణులకు ప్రకాశవంతమౌతుంది
అది ఎలాగంటే సిద్ధంగా తయారవుతుంది, సక్కగా వుంటుంది
శుద్ధమని తాగారా బుద్ధిమంతుడా విప్రులకు న్యాయ నరకం తప్పదు"

అని చెప్పినది. కాళవ్వని ఈ వచనము ఆహార పద్ధతిలో శ్రేష్ఠకనిష్ఠ అనే తారతమ్య నెరిగి, గోవును దేవా లయములో నిలబెట్టి పూజించి, గొడచేసి దాని మాంసం తినే బ్రాహ్మణులను మంచివారని, దాని చర్మాన్ని తీసి చెప్పులు కుట్టి బ్రతికే వారని కీడుజాతి వారని నిందించడం సమంజసం కాదని తెలిపింది.

అవమాన మూలాలధాదువలునే స్వాభిమానం సంకే తంగా వ్యక్తం చేసిన సామాజిక భద్రతను కాళవ్వ తన వచనంలో తెల్పింది.

హరళయ్య - కల్యాణమ్మ గారి చెప్పులు :

శరణుల పరంపరలో హరళయ్యకు విశేష స్థాన మున్నది. హరళయ్య చర్మకార వృత్తికి ఆధ్యాత్మిక ఘనతను తెచ్చి ఇచ్చినవాడు. హరళయ్య చేసేటి చర్మకారపు చిత్ర పటాలను ఇప్పటికి మాదిగల ఇండ్లలో పెట్టికొని పూజిం చడం ఆనవాయితీగా వుంది.

బసవేశ్వరునికి హరళయ్య అతని భార్య కల్యాణమ్మ ఇరువురు తమ తొడలలోని చర్మాన్ని తీసి, చెప్పులు కుట్టి బసవేశ్వరునికి నెత్తిమీద మోసుకొని పోయి సమర్పించి నారు. అప్పుడు బసవన్న "ఇవి నరలోకానికి చేరే పాదరక్షలు కావు, కైలాసానికి చేరే పవిత్ర పాదరక్షలు" అని తను కూడా వాటిని నెత్తిమీద మోసుకొనిపోయి శివార్పణ చేస్తాడు.

శరణుల పాదరక్షలనే తమ జీవనోపాధిగా పొందిన కల్యాణమ్మ, హరళయ్యల సంసార జీవనము ఆదర్శ ప్రాయమైనది. బసవేశ్వరుని సమానమైన తత్వాలకు ఆకర్షితులైన కులకర్మల అట్టడుగు వర్గాల సముదాయ ములు అతని నేతృత్వంలో అనేక రకాలైన రచనాత్మకమైన పనులు చేసినారు. జాతి రహిత సమాజ నిర్మాణపు సామా జిక క్రాంతిలో వెలసిన బసవన్నకు హరళయ్య ఒకసారి శరణు నమస్కరిస్తే, బసవన్న వెంటనే శరణు శరణార్థి అని బదులు చెప్పినాడు.

హరళయ్య గురించి జానపద గీతం ఒకటి ఇలా వుంది.

"కర్మకాలి శరీర చర్మపు అవతారి బహు అందగాడు
చదువు సంధ్యలు మొదలే తెలియవు
ఎంతటి భక్తివంతుడు హరళయ్య"

అని పాటలు ఇప్పటికీ పల్లెల్లో పాడుకోవడం మనకు కనిపిస్తుంది.

మాదార దూళయ్య :

12వ శతాబ్దంలో వచ్చిన శరణులలో మాదార దూళయ్య ఒకరు. మట్టికి దగ్గరగా శ్రమించిన కాయకము నుండి వచ్చినదానితో ఇతరులకు ఇచ్చి తాను తిని ఉన్నదానిలో తృప్తి నొంది అనుభవ మంటపంలో ఒకనిగా సమానతను సాధించిన దళిత వచనకారుడు దూళయ్య. అక్షరాలు నేర్చే నేర్వకనో వచన రచనలు చేసి సమర్థులైన శరణుల మనస్సులో భక్తి కాయకాన్ని చూపి సత్యం, దయ, ధర్మాల మూలకంగా హింసను విరోధించి వచన సాహిత్య రచన చేసిన దూళయ్య గొప్ప విప్లవకారుడు. చెప్పులు కుట్టుకుంటూ 106 వచనాల కన్నా ఎక్కువ రచనలు చేసినాడు దూళయ్య. దూళు అంటే తెలుగు దుమ్ము అని అర్థం. ధూళి(దుమ్ము)నే నమ్ముకొని బ్రతికిన దూళయ్యకు దూళయ్య అనే పేరు సార్థకమైనది. సమా జోద్ధతని పొంది కావ్య లక్షణాలను కలిగినవి ఇతని వచనాలు. కావ్య, ఆధ్యాత్మిక అనుభవాల సమ్మిళితము దూళయ్య వచనములో ప్రస్ఫుటంగా కనిపిస్తుంది.

భైరవేశ్వరుని కావ్య "కథామణి సూత్ర రత్నాకరం" 6వ పుటలో లింగం పదాన్ని చెప్పేటప్పుడు భైరవాంకడు "మాదార ధూళయ్య మహిమచే ఎగిరే జింకను చంపే పుటి, జింకను చంపకుండా వెనుదిరిగి పోయిన దృశ్యాన్ని" ఆనాటి రాజు సిద్ధేరామేశ్వరుడు, నందీశ్వరుడు చూసి, ఆశ్చర్యాన్ని పొందినారని తెలుపుతాడు.

మాదార ధూళయ్య చెప్పులు కుట్టే సమయంలో పనిలో నిమగ్నమైనప్పుడు "చెప్పుల అట్టలను కుట్టే 'సిల్కులి' తుది మొనసందులో శివుడు ప్రత్యక్షమైనప్పుడు" ఇక్కడికెందుకొచ్చావయ్యా కాయక తిత్తిని మోసేవాని ముందెందుకు వచ్చినావు, నీభక్తుల మనస్సులలోకి దూరి వారిని పావనమ్ము చెయ్యి అని చెప్పి, తన వృత్తి పవిత్రతను తెల్పినాడు.

ఇతని వచనాలల్లో తర్క మీమాంశాలే ఎక్కువగా కనిపిస్తాయి.

కన్నడ : "అప్ప ఉళ్ళ నక్క తొప్పె కిచ్చరగోళ గొప్పుదె!
అంతసేపు వోకినా ముట్టడుగదా
తొప్పె అనే పేరు ఎక్కడికి వెళ్ళినది"

తెలుగు : నీళ్ళు ఉంటేనే పేడకు విలువ తెలుస్తుంది
నీరే లేకుంటే పేడ కాలిపోతుంది అప్పుడు దాని విలువ ఏమిటి?

అలాగైతే నీరు అనే పేరు ఎక్కడికెళ్ళింది

పై వచనంలో నిగూఢార్థము ఇమిడి ఉంది. నీళ్ళు ఉన్నంత వరకు పేడ గొప్పతనము, ఆ పేడ నీటిలో కరిగిపోతే, పేడ విలువ తెలియదు. ఆ పేడ నీటిలో

నానకపోతే అది ఎండి బూడిద అవుతుంది. అప్పుడు నీరు పేరు ఎక్కిడికి పోయిందని? మనకు అర్థం కాదు. ఇక్కడ మనిషి విలువ తెలియాలి అంటే తను చేసే పని ఇతరులకు ఉపయోగపడాలి. నీటిలో పేడను కలిపి కల్లాపి చల్లితే క్రిమికీటకాదులు దరి చేరవు. అంటే పేడకు నీరు విలువనిచ్చింది. అదే పేడ నీరు లేకపోతే ఎండితే? దానిని కాలిస్తే బూడిద అవుతుంది. బూడిదకు అంతగా విలువ ఉండదు. కానీ అదే బూడిదను నీటి తేమతో కలిపి వుండను తయారు చేస్తే అదే విభూతి అవుతుంది. ఇక్కడ నీరు అనే దేహానికి, పేడ ఆత్మ అయితే, ఆత్మతో కూడిన దేహము కాయకము చేసి, ముక్తిని పొందుతుంది అని అర్థమౌతుంది. విభూతి శివార్పణమౌతుంది. అందుకే పేడకు విలువ రావాలంటే నీరు అవసరం. నీరే ప్రకృతి మూలాధారము అని అర్థమౌతుంది.

డోహర కక్కయ్య :

ఉత్తమ కులంలో పుట్టినానని కష్టతరమైన మోపును మోపకండి అంటే డోహర కక్కయయ బరిస్తున్నాడు చూడయ్యా! కూడల సంఘమదేవా! అని కక్కయని ఎంగిలి ప్రసాదానికి కాచుకున్నాడు బసవేశ్వరుడడు. ''అప్పను'' మాదార చెన్నయ్య, బొప్పడను మాడోహరా కక్కయ్యా అని చెప్పాడు. ఉత్తర కర్నాటకలో మాదిగల ఉపకులంవారు డోహారులు. వీరు అధిక సంఖ్యలో అక్కడ నివసిస్తున్నారు. వీరందరూ కక్కయ్యకు ఎక్కువ ప్రాముఖ్యతనిచ్చారు. బసవేశ్వరునికి సమకాలికునిగా వుంటూ 'అభినవ మల్లికార్జును'నిగా బసవన్నచే కీర్తించ బడినవాడు కక్కయ్య.

కల్యాణి ప్రాంతంలో ఎక్కువ సాహిత్య రచనలను లిఖితం చేసే సన్నివేశంలో బసవేశ్వరుని ప్రాణరక్షణకు తన ప్రాణాన్నే అర్పించిన కక్కయ్య చర్మాన్ని కరచేసే కక్కయ్యకు శరణునిగానే ప్రసిద్ధికెక్కినాడు. దళితవర్గ పోరాట సమిధల్లో సాహిత్య వ్యాసంగంలో అపురూపంగా కనబడే కక్కయ్య హృదయానికి జీవనాన్నే చీల్చి చర్మాన్ని కరచేసినాడు. రోడ్డుపై బసవేశ్వరుడు వచ్చేటప్పుడు కాచుకొని కూర్చున్న కక్కయ్య ఒకరోజు బసవన్నతో కలిసి తనను ఉద్ధరింపమని ప్రాధేయపడి ''నా కష్టాలన్నీ నీ చేతి స్పర్శతో పారిపోతాయని'' అంటే బనవన్న కక్కయన్నను అన్నా! అని సంబోధించి అతని కులవృత్తిని చేర్చి డోహర కక్కయ్య అని బిరుదును ప్రసాదిస్తాడు.

నులియ చందయ్య :

చందేశ్వరలింగ అనే అంకితంలో సుమారు 49 వచనాలను రాసిన నులియ చందయ్య బసవేశ్వరుని సమ కాలీన దళిత వచనకారుడు. డా॥ చిలుమూరు శ్రీనివాస రావు గారు తెలుగులో రాసిన మాదిగల చరిత్ర సంస్కృతి (2010) పరిశోధనలో వీరు ఆంధ్రప్రదేశ్, తెలంగాణాలోని నల్గొండజిల్లా, భువనగిరి తాలూకా కొలనుపాక గ్రామంలో నివసించేవారని తెలిసింది. ఇప్పటికీ వీరి వంశస్థులు కొలనుపాక గ్రామంలోనే వున్నారు. ఇక్కడే నులియ చందయ్యల మఠం వుంది. వీరు పుట్టినది బీజాపూర్ జిల్లా శివణగి గ్రామం. ఈ గ్రామానికి ఇరువైపుల మాదిగ గేరిలు అధికంగానే వున్నాయి. వీరు నేటికి బసవ జయంతి రోజున బసవేశ్వరుని విగ్రహానికి ముందు నుల చందయ్య విగ్రహాన్ని ఊరేగింపు చేస్తారు.

12వ శతాబ్దంలో శరణుల పరంపరలో వచ్చిన హర ళయ్య, నులియ చందయ్య ప్రముఖులు. శివపురం కాశికావుల కుమారుడైన గొడకులజుడు రక్షి అనే శరణు డొకడు చెన్నబసవన్న హరళయ్య మొదలైన వచనకారులకు ఆశ్రయమిచ్చినట్లు ఇతిహాసాలు తెలుపుతున్నాయి. ఉళవి, శివపురము మధ్యలో వేడినీటి చెలుమ గట్టున హరళయ్య, చందయ్యల వచనాలు రాయించినట్లు స్థల పురాణం తెలుపుతున్నాయి. ఇక్కడికి సమీపంలోనే శివ శరణి అక్క నాగమ్మ గుహ ఒకటున్నది. ఇది ప్రశాంత వాతావరణంలో ఉన్నందువల్లనే చెన్నబసవేశ్వరుడు అక్కడే అనేక వచనాలను రాసినట్లు తెలుస్తున్నది.

ఉరిలింగ పెద్ది :

ఉరిలింగ పెద్దిలోని పెద్ది అనే విశేషణము ఉరి లింగపెద్ది ద్రావిడ మూలద తెలుగు భాషిక పదమైనట్లు

కనబడుతుంది. తా॥సు॥ శామరాయలు "శివశరణ కథా రత్నకోశం" రచనలో ఉరిలింగ దేవి తెలుగు దేశంలో పుట్టి మహారాష్ట్రానికి వలస వెళ్ళినట్లు తెలిపినారు. ఆంధ్ర నుండి పోయి అక్కడ స్థిరమైనారని వారు వాదన చేశారు. ఉరిలింగదేవుడు హైదరాబాద్ సంస్థానానికి చెందిన మరాఠ ప్రాంతం నాందేడ్ జిల్లాకు చెందిన కందార్ అనే ఊరి నందు మఠం పీఠాధిపతి అయ్యినాడు. ఆయన శరణుసతి లింగపతి అనే భావం తెలిసి అనుభవి అయ్యి వున్నాడు. జానపదుల మాట ప్రకారం అతనొక "తిని, ఉపసించి, వాడుకొన్న బ్రహ్మచారి. ఈ ఉరిలింగదేవుని శిష్యుడే "ఉరిలింగ పెద్ది". వర్ణవ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడిన బసవ శరణుడు అంటరాని కుల ఉరిలింగ పెద్దిని "నందూరి మఠం" ఉత్తరాధికారిగా నియమిస్తారు.

ఉరిలింగదేవ - ఉరిలింగ పెద్ది వీరిరువురి "గురు శిష్యం" గురించి ఒక కథ ప్రచారంలో ఉన్నది. అస్పృశ్యుడు, సంసారవంతుడు, మందబుద్ధి కలిగి, నిరక్ష రాస్యుడైన ఉరిలింగ పెద్ది దొంగతనం చేసి జీవిస్తున్నాడు. ఉరిలింగ దేవుడు అతనికి లింగ దీక్షను ఇచ్చి ఉరిలింగ పెద్ది అని పిలిచి శిష్యునిగా స్వీకరింపజేసి అతనిని మామూలు మనిషిగా మార్చి నందూరి మఠానికి ఉత్త రాధికారిగా నియమిస్తాడు బసవేశ్వరుడు. మిగిలిన శరణుల మాదిరిగానే ఉరిలింగ పెద్దిని కూడా అనేక మార్లు తలుచుకుంటాడు. "సద్భక్తి బవన్నుని వట్టుపెట్టి, బసవుడే భక్తుడు, బసవన్నని ధ్యానించడమే భక్తిమార్గము, బసవన్నుని చెరేదె ముక్తి మార్గమని తెలిపాడు ఉరిలింగ పెద్ది. సంస్కృతంలో ఉన్న వేద, ఆగమన, ఉపనిషత్తు, స్మృతి, పురాణం మొ॥ వాటిని లోతుగా అధ్యయనం చేసి, సంస్కృత భూయిష్ఠమైన శైలిలలో కన్నడ వచనాలను రాస్తాడు. సద్గురువునిచే శిష్యరికం తీసుకున్నవారు సన్మార్గంలో నడుస్తారని నిరూపించాడు ఉరిలింగపెద్ది.

12వ శతాబ్దంలో శైవారాధన అత్యంత భక్తిశ్రద్ధలతో నడచిన సందర్భాన దళిత శరణులతో కూడిన వీరశైవ మతం ఇంతింతై వటుడింతై అన్నట్లు కైలాసగిరిని చేరినది. దళితుల పాదస్పర్శతో మానవులందరూ సమానులేనని కులంకన్నా గుణం ముఖ్యమని, కాయకమే కైలాసమని, వృత్తులవల్లనే కులాలుగాని, కులంవల్ల వృత్తులు కావని తెలిపిన బసవన్న, అతని సమకాలీన దళిత వచనకారుల వచనాలు మనకు స్ఫూర్తిదాయకాలు, రాబోవు కాలానికి అవి వారధి వచనాలు.

సంఘసంస్కర్తలో ఒకరుగా తన స్థానాన్ని పదిల పరచుకొన్నారు.

ఆధార గ్రంథాలు :

1. బసవపురాణము - పాల్కురికి సోమనాథకవి, పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ప్రచురణ.
2. అడపద అప్పణ వచనాలు - లింగప్ప గోవాల్
3. బసవపథం (త్రైమాసిక పత్రిక) - ఏప్రిల్ -జూన్ (2014), బసవ జయంతి - బెంగళూరు.
4. కూడల సంఘము - హొసూరు మునిశ్యామప్ప
5. అనుపమ అణ్ణ - బసవణ్ణ - డా॥. వి. కమలమ్మ

⌘⌘⌘

BHAVAVEENA
Vol. 17, Issue. 8, August 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

దక్షిణాంధ్రయుగ కవయిత్రులు

– డా॥. ఎన్. దీపిక, సహాయాచార్యులు, తెలుగు శాఖ, నాగార్జున ప్రభుత్వ కళాశాల (స్వ), నల్లగొండ.

శ్రీకృష్ణదేవరాయల సామంతులైన నాయకరాజుల ఆధ్వర్యంలో దక్షిణాదిన తంజావూరు ఆంధ్ర రాజ్యంగా స్థాపించబడింది. విజయనగర సామ్రాజ్య పతనానంతరం అక్కడి కవులు, కళాకారులు దక్షిణాంధ్ర నాయక రాజుల ప్రాపకం సంపాదించుకున్నారు. 1550 సంవత్సరంనుండి సుమారుగా 1673 సంవత్సరం వరకు ఆంధ్రనాయక రాజులు తంజావూరు కేంద్రంగా పరిపాలన సాగించారు. వీరి కాలంలో తెలుగు ప్రబంధ, యక్షగాన సాహిత్యం ఉజ్వలంగా ప్రకాశించింది. తంజావూరు రాజుల కాలంలో తెలుగు కావ్యాలకి, యక్షగాన, ప్రబంధం మొదలైన ప్రక్రియలకి, కవయిత్రులకి సముచిత స్థానం లభించింది.

తెలుగులో కవిత్వం చెప్పిన తొలితరం కవయిత్రులను, రచయిత్రులను వేళ్ళమీద లెక్కపెట్టవచ్చు. దీనికి కారణం స్త్రీని దేవతగా ఒకవైపు ఆరాధిస్తూనే నిత్య జీవితంలో ఇవ్వవలసిన సముచిత స్థానాన్ని మన పూర్వులు ఇవ్వకపోవడమే. క్రీ.శ.1260లో ఖడ్గతిక్కన తల్లిపోలమ్మ, భార్య చానమ్మ చెరొక చాటువు చెప్పారని, ఈ అత్తాకోడళ్ళే మన తొలి తెలుగు రచయిత్రులని భావిస్తున్నాము. క్రీ.శ 1370లో కాకతీయుల ఆడపడచు, విజయనగర రాజ్యస్థాపకులలో ఒకడయిన బుక్కరాయల తృతీయ కుమారుడయిన కుమార కంపరాయల భార్య గంగాదేవి మధురావిజయం రచించినది. క్రీ.శ. 1260 నుండి 1370 మధ్యకాలంలో కర్ణాటకలో అక్కమాంబ అద్భుతమైన దేశిసాహిత్యాన్ని సృష్టించినప్పటికి తెలుగు కవయిత్రులు మృగ్యమనే చెప్పవచ్చు. క్రీ.శ.1460లో తాళ్ళపాక తిమ్మక్క ద్విపదలో సుభద్రకళ్యాణం రచించింది. తదుపరి క్రీ.శ.1560లోరామాయణం వ్రాసిన మొల్ల పేరు వినబడుతుంది.

అతరువాత చాలా సంవత్సరాలకు దక్షిణాంధ్ర యుగంలో నాయకరాజుల ఆస్థానంలో కవయిత్రులను పోషించడం ప్రారంభమైంది. ఈ యుగంలో విదుషీమణులైన స్త్రీలు పురుషులతో సమానంగా రచనలు చేస్తూ రాజ సన్మానాలను పొందారు. వారిలో పేర్కొనదగినవారు రామభద్రాంబ, మధురవాణి, రంగాజమ్మ, ముద్దుపళని, కృష్ణజమ్మ, చంద్రరేఖ. వీరు సంగీత, నృత్య విద్యలలోనేగాక సంస్కృతాంధ్ర భాషాపాండిత్యాల్లో కూడా పేరుగాంచారు. శృంగార ప్రబంధాలేకాక, భక్తి రసాత్మకమయిన వేదాంత గ్రంథాలు కూడా ఈ యుగంలో వెలువడ్డాయి.

రామభద్రాంబ :

17వ శతాబ్దంలో దక్షిణ దేశంలో తెలుగు రాజ్యాన్ని అత్యంత ప్రతిభా పాటవాలతో పాలించిన రఘునాథ నాయకుని ఆస్థాన కవయిత్రుల్లో రామభద్రాంబ ఒకరు. ఈమె రాజుకి ఉపపత్ని అని పరిశోధకుల అభిప్రాయం. 'రఘునాథాభ్యుదయము' ను పన్నెండు సర్గలతో, 900 శ్లోకాలతో సంస్కృతంలో రఘునాథుని నాయకుడుగా ఆయన జీవిత వృత్తాంతాన్ని కావ్యంగా మలిచింది. రఘునాథుని విజయాలను, సాహిత్య ప్రియత్వం, కళా పోషణ పండిత గోష్ఠుల వంటి విశేషాలను ఉత్సాహంతో వర్ణించింది. వీరు శతలేఖిని, సమయ లేఖిని విద్యలలో, చతుర్విధ కవితలు చెప్పుటలో, నేర్పరులని, అష్టభాషలలో విశారదులని, సమస్యాపూరణం, ఆశుకవిత్వం, చిత్ర కవితాప్రక్రియల్లో దిట్ట అని, చెంగల్వకాళకవి శిష్యురాలని తెలుస్తుంది.

మధురవాణి :

తంజావూరును పరిపాలించిన రఘునాథ నాయకుని ఆస్థానంలోని విదుషీమణులలో ఒకరు. వీరి మొదటి పేరు 'శుకవాణి'. సంస్కృతంలో సుందరకాండ వరకు రామాయణాన్ని రచించింది. 1500 శ్లోకాలున్న 14 సర్గల గ్రంథం మాత్రం లభిస్తున్నది. రామాయణసార

కావ్యతిలకము 9 సర్గాంత గద్యలలో "మధురైక ధురంధ రాంధ్ర కవితా నిర్మాణ సమ్మాన్యయా" అని చెప్పుకున్నది. దీన్నిబట్టి ఈమె ఆంధ్రకావ్యాలను కూడా రచించినట్టు తెలుస్తుంది. రఘునాథరాయల దయవల్ల సంస్కృతాంధ్ర కవితాపాటవాన్ని, వీణావాదనా నైపుణ్యాన్ని గడించినట్లు రామాయణసారమునేగాక నైషధ, కుమారసంభవ కావ్యాలను కూడా రచించినట్లును తెలుస్తున్నది.

మధురవాణి మహాప్రజ్ఞాశాలియైన ప్రౌఢకవయిత్రి. చతుర్విధ కవితల్లో ఆరితేరినది, వ్యాకరణశాస్త్రంలో ప్రజ్ఞ కలది. అరఘడియలో వంద శ్లోకాలు చెప్పగలదు అని, ఆరు భాషలలో కవిత్వం చెప్పగలదు అని, చిత్ర కవిత్వం ఆమెకు తెలుసునని ఆమెకున్న బిరుదులను బట్టి తెలు స్తుంది. రఘునాథ నాయకునిచే కనకాభిషేకం పొందిన మహిళ, అంతేగాక సరస్వతీ మహల్‌ని పండితవాగ్వాదంలో గెలిచి మధురనుండి తంజావూరుకు తెచ్చిన అపర సరస్వతి.

రంగాజమ్మ :

17వ శతాబ్దికి చెందిన రంగాజీ అని పిలవబడే రంగా జమ్మ, దేవదాసి కుటుంబంలో పసుపులేటి వెంకటాద్రి, మంగమాంబ దంపతులకు జన్మించింది. ఈమె 1633 నుండి 1673 వరకు తంజావూరును పరిపాలించిన విజయరాఘవ నాయకుని ఆస్థానంలో కవయిత్రి.

మన్నారు దాస విలాసము అనే పేరుతో ఒక యక్ష గానాన్ని, ప్రబంధాన్ని రచించారు. ఈ రెండింటిలోను ఇతివృత్తం ఒక్కటే. విజయరాఘవుని రాజసభ, విద్వత్ గోష్ఠులు, అనాటి జన జీవన విధానం, విజయరాఘవుని పరిణయం ఇందులోని సారాంశం. వీరు ఉషాపరిణ యము అనే మరొక ప్రబంధాన్ని రాశారు. తన 'ఉషా పరిణయము' కృత్యాదిలో

"వేంకటేంద్రుని పుత్రి! వినుత సద్గుణ ధాత్రి! /
ఘనయబు లలిత ఫణితి /
గావించి, మిగుల శృంగారంబు గన్పట్ట /
బదములు మృదు రసాస్పదములగుచు /
రాణింప రచియించి, రామాయణంబును /
భాగవతంబును, భారతంబు"అని
"సంగ్రహంబుగ రచియించి సరస రీతి / మమ్ము
మెప్పించితివి చాల నెమ్మి దనర/
బరగ హరివంశమున ఉషాపరిణయ కథ / తెనుగు
గావింపు మిక నీవు తేట గాగ."

అని చెప్పుకున్నారు. దీనినిబట్టి భారత, భాగవత, రామాయణ సంగ్రహాలను కూడా రాసినట్లు తెలుస్తున్నది.

విజయ రాఘవుడి ఆస్థాన కవయిత్రిగానూ, ఆయన పట్టమహిషిగానూ ప్రఖ్యాతి పొందారు. పాత్రచిత్రణ, పాత్రోచిత భాష, సంభాషణాచాతుర్యం, కథాగతికి అను కూలంగా చేసే కల్పనలు ఆమె సృజనాత్మకశక్తికి, పాండితీ ప్రకర్షకు దర్పణాలు. అందుకే స్వయంగా కవి, పండితుడు, సంగీత నృత్య కళాప్రవీణుడైన విజయరాఘవుడినుంచే కాక, విద్వత్కవుల ప్రశంసలూ అందుకున్నారామె. "భరత సంగీత సాహితీ ప్రముఖ విద్యలాకృతులు గన్న చందాన వెలయుచు విజయ రాఘవ నాయకుని ఆస్థాన మలం కరించిన సంగీత సాహిత్య విద్యా చతురులలో రంగాజమ్మ మేటి" అని కీర్తించారు ఆంధ్ర శేషగిరిరావు.

వాగ్గేయకారుడు, పదకర్త క్షేత్రయ్య విజయ రాఘవుడి ఆస్థానానికి వచ్చినపుడు ఆయన ప్రభావం ఆమెపై పడి ఉండవచ్చు. ఎనిమిది భాషల్లో కవనం అల్లగలిగిన ప్రతిభ రంగాజమ్మ సొంతం. ఈ విషయాన్ని 'మన్నారుదాస విలాసము' నిరూపిస్తుంది. ఇందులో ఒక్కో భాషలో ఒక్కో పద్యం రాశారామె. అంతేకాదు, రంగాజమ్మ రాజనీతి విశా రద కూడా. అందుకే రాజుకి అంతటి అభిమాన పాత్రు రాలయింది ఆమె చదివి సమాధానాలు రాసిన లేఖలు రాజ వ్యవహారాలకు సంబంధించినవే కావొచ్చన్నది చాలా మంది అభిప్రాయం. విజయరాఘవుడినుంచి కనకాభి షేకం పొందిన విషయాన్ని ఆమె స్వయంగా వెల్లడించారు.

విజయరాఘవనాయకుని భార్య, తనభర్తకు ఉంపుడు కత్తె అయిన రంగాజమ్మకు, తన భర్తను తనకు వదలి వేయవలసినదిగా అభ్యర్థిస్తూ, పంపిన రాయబారానికి,

సమాధానంగా రంగాజమ్మ పంపినదని చెప్పబడుతున్న పద్యం :

"ఏ వనితల్ మముందలుపనేమిపనో తమరాడు వారుగా
రో, వలపించునేర్పెరుగరో,తమ కౌగిలిలోననుండగా
రావదియేమిరా విజయరాఘవ యంచిలుదూరి బల్మిచే
దీవరకత్తెనై, పెనగి తీసుకవచ్చితినా తలోదర"

రాజనీతి విశారదనని, రాజగోపాల దేవుని భక్తురాల నని, వాచకత్వంలో ప్రవీణురాలనని, విచిత్రంగా రాసిన పత్రికలను చదివి అర్థం చేసుకోగల సమర్థురాలనని, వాటికి సమాధానంగా స్వహస్తాలతో వందలాది పత్రికల్ని రచించే నేర్పుకలదానినని (విచిత్రతర పత్రికాశత లిఖిత వాచికార్థవగాహన ప్రవీణయు, తత్ప్రతిపత్రికాశత స్వహస్త లేఖన ప్రశస్తకీర్తియు) పేర్కొని శృంగార రస నిర్భరమైన పదాలు రచించినట్లు (శృంగార రసతరంగిత పదకవిత్వ మహనీయ మతిస్ఫూర్తియు) ప్రకటించుకొని, విజయ రాఘవ నాయకుడి ఆస్థాన కవయిత్రిగా కలకాలం నిలిచి పోయే అద్భుత రచనలు చేసిన విదుషీమణి రంగాజమ్మ, తంజావూరులో ఇప్పటికీవీరి మేడ ఉంది.

ముద్దుపళని :

ముద్దుపళని క్రీ.శ.1730-1790 కాలానికి చెందిన తెలుగు కవయిత్రి. 1739 నుంచి 1763 వరకు తంజావూరును పాలించిన ప్రతాపసింహుడు ఆస్థానంలో నెల్లూరు శివరామకవితోపాటు ఆస్థాన కవయిత్రిగా కొలువు చేసిన రాజనర్తకి. గొప్ప సంగీత, సాహిత్య వేత్త అయిన ఈమె విశిష్టమైన శృంగార కావ్యాన్ని రాయాలనే తలంపుతో రాధికా సాంత్వనము రచనను చేపట్టారు. దక్షిణాంధ్ర యుగపు తంజావూరు తెలుగు సాహిత్యంలో ముద్దుపళని రాసిన "రాధికా సాంత్వనము" ప్రత్యేకతను సంతరించుకొని, వాద వివాదాలకు గురైన ఒక గొప్ప శృంగార ప్రబంధకావ్యం. దీనికే ఇళాదేవీయము అనే పేరు కూడా ఉంది. ఇది రాధాకృష్ణుల శృంగారాన్ని వర్ణించే పద్య కావ్యం. అలిగి కోపంగా ఉన్న 'రాధను కృష్ణుడు బుజ్జ గించడం' ఈ కావ్య ఇతివృత్తం. చిన్ని కృష్ణునికి అంకితమైన ఈ గ్రంథంలో నాలుగు ఆశ్వాసాలతో, 584 పద్య, గద్యాలతో రచింపబడింది. ముద్దుపళని తాను నాట్య కత్తెనని, శరీర కాంతిలో రత్నం వంటిదానినని, సకల లలిత కళా ప్రౌఢితో వెలసినట్లు, పండితులకు సన్మానాలు చేసి నట్లుగా రాధికాసాంత్వన అవతారికలో చెప్పుకుంది.

దురదృష్టం కొద్దీ మహిళ రచనగా, అంతకంటే హీనంగా వేశ్య రచనగా దీనిని తీసిపారేశారు అప్పటి పండితులు. ఆంగ్లేయుల కాలంలో దీనిని నిషేధించారు. తర్వాత టంగుటూరి ప్రకాశం పంతులు ముఖ్యమంత్రి అయ్యాక ఈ నిషేధం ఎత్తివేయించారు. కాని అంతకుముందు కూడా రహస్యంగా ఈ కావ్యాన్ని ప్రజలంతా చదివేవారు. బెంగుళూరుకు చెందిన నాగరత్నమ్మ తాటాకుల ప్రతి సంపాదించి, పాఠాన్ని పరిష్కరించారు. తర్వాత ఎమెస్కో సంప్రదాయ సాహితి పేరిట మళ్లీ పాత కావ్యాలను ప్రచురించినప్పుడు రాధికా సాంత్వనానికి ఆరుద్రతో ప్రవేశిక రాయించింది. ఆ పుస్తకమే ప్రస్తుతం మనకు దొరుకుతోంది.

ముద్దుపళని గురువు తిరుమల తాతాచార్యుల వంశానికి చెందిన వీరరాఘవదేశికుడు. దేవదాసీల కుటుంబంలో జన్మించిన ముద్దుపళని తల్లి పోతిబోటి, అమ్మమ్మ తంజనాయకి కూడా కవియిత్రులని, తండ్రి పేరు ముత్యాలు అని రాధికా స్వాంతనముకు రాసిన ప్రవేశిక ద్వారా తెలుస్తున్నది. ముద్దుపళని వర్ణనా శైలిని అనుకరించి, నంది తిమ్మన పారిజాతాపహరణము రచించాడని వినికిడి కలదు. ముద్దుపళని కవితా జాలమునకు మచ్చుకు ఒక ఉదాహరణ:

"శౌరిని బిల్వగా జనిన చక్కని కీరమదేల రాదొయే
దారిని జన్నదో నడుమ దారెనో చేరెదొలేదొ గోపికా
జారుని గాంచెనోకనదొ చక్కగ నావెతవిన్నవించెనో
సారెకులేక శౌరినుడి చక్కెరయుక్కెబుఅ మెక్కి చిక్కెనో"

ముద్దుపళని గొప్ప విష్ణు భక్తురాలు. ఈమె గోదాదేవి రచించిన తిరుప్పావై లోని 30 పాశురాలలో పదింటిని తెలుగులోకి అనువదించి సప్తపది అని నామకరణం చేసింది. వీరిని గూర్చి 'కావ్యంలోని గుణంకన్నా కవయిత్రి కులానికి ప్రాముఖ్యం ఇవ్వడం తగని పని. మన పూర్వులు ఆ దృష్టితోనే చిన్నచూపు చూశారు. అయితే తిరుపతి వేంకట కవులు, మల్లాది రామకృష్ణ శాస్త్రి తదితరులు మాత్రం రాధికా సాంత్వనానికి ఇవ్వవలసిన స్థానం ఇచ్చారు.' అని ఆరుద్ర అన్నారు. మధురశృంగార భావపద్ధతిలో, రాధా కృష్ణుల పవిత్ర ప్రణయాన్ని ఉత్కంఠతో వర్ణించిన ముద్దుపళని విశిష్ట కవయిత్రి.

కృష్ణాజమ్మ :

రంగాజమ్మ అక్కగా చెప్పబడ్డ కృష్ణాజమ్మ విజయ రాఘవ నాయకుని ఆస్థానంలోని విదుషీమణి. కృష్ణ జమ్మ విజయ రాఘవుడి ఆస్థానంలోని విదుషీమణు లందరితో కలిసి, వసంత కేళికలు వినిపించేదని రంగా జమ్మ పేర్కొంది. ఛందశాస్త్రంలోని పదమూడు కోట్ల నలభై రెండు లక్షల పదిహేడు వేల ఏడు వందల ఇరవయ్యారు వృత్తాలలో ఏ వృత్తంలో పద్యం చెప్పమన్నా కూడా వెంటనే చెప్పగలిగేటంత ప్రావీణ్యురాలు. ఆశుకవిత్వం, ధారణ, ఛందోశాస్త్రం, సమస్య పూరణంలో కూడా ఆమె దిట్ట అని తెలుస్తుంది. ఈమె కూడా రామభద్రంభ వలె చెంగల్వ కాళకవి శిష్యురాలు. ఇంతటి పాండిత్యం ఉన్నా వీరు రాసిన గ్రంథాలు దొరకనందున తగిన గుర్తింపును పొందలేకపోయింది.

చంద్రరేఖ :

విజయరాఘవుని ఆస్థానంలోని మరొక మణిపూస చంద్రరేఖ. క్రీ.శ.1584-1616 వరకు విజయనగర సామ్రా జ్యాన్ని ఏలిన వీరవెంకటరాయల ఆస్థాన నర్తకిగా ఉన్నారు. ఆయన మరణానంతరం తంజావూరు ఆస్థానాన్ని ఆశ్రయించి, విజయ రాఘవునికి ఉపపత్ని అయింది. విజయరాఘవుని ఆస్థానంలో జరిగే సాహిత్య గోష్ఠులలో పాల్గొంటూ, సమస్యాపూరాణం చేయుటలో దిట్ట, ఆశు కవిత్వం చెప్పడంలో విశారద. నర్తకిగా, విదుషీమణిగా తన జీవితాన్ని కొనసాగించింది. విజయ రాఘవుని కాలంలో రచించబడ్డ 'రాజగోపాల విలాస కావ్యము'లోని అన్ని ఆశ్వాసాల చివర చంద్రరేఖ విజయ రాఘవుడి భార్యగా అభివర్ణించబడింది.

దక్షిణాంధ్రయుగ కవయిత్రులు తమ రచనలలో సమకాలీన భాషనుపయోగిస్తూ, పూర్వసాహిత్యంలో కనబడని, పలుకుబడిలోలేని కొత్తపదాలను సృష్టిస్తూ, సాహిత్య ప్రక్రియలలో, విద్యావినోదాలలో, విలాస క్రీడలలో, ఆర్థికసాంఘిక పరిస్థితులలో, ఆచార వ్యవహా రాలలో వీరి సారస్వతం కొనియాడదగినది.

ఆధార గ్రంథాలు :

1. తెలుగు సాహిత్య సమీక్ష (రెండవ సంపుటం) - డాక్టర్ జి. నాగయ్య
2. సమగ్రాంధ్ర సాహిత్యం - ఆరుద్ర
3. అంతర్జాలం - వికీపీడియా

⌘⌘⌘

BHAVAVEENA
Vol. 17, Issue. 8, August 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

మూడో కన్నీటి చుక్క – సామాజిక దర్శనం

– డా॥. ఎన్. సుజాత, తెలుగు ఉపన్యాసకులు, పీఠికాపురాదిస ప్రభుత్వ కళాశాల, కాకినాడ.

"భూమంటే విద్యుత్ కాంతుల్లో
బెల్లేడాన్స్ చేసే ఆటకత్తె - వాడికి
భూమంటే నొసటన దిద్దుకొనే
ఆకుపచ్చని విభూతి పండు వీడికి
యుద్ధానంతరం
భూమికి మాత్రం వీరిద్దరూ
ఓ అరడగుల బాధ్యత..."

సమాజంలో జరుగుతున్న అకృత్యాల మీద తన కలం అనే 'ఆయుధాన్ని' సంధించిన యోధుడు మన బొల్లోజు బాబా గారు. బాబాగారిలో కవీ, విమర్శకుడూ ఇద్దరూ పుష్కలంగా వున్నారు. ఈయన మొదట బుద్ధిజీవి. అతనికి స్థానిక చరిత్రలూ, సంస్కృతుల మీద వున్న అనేక, పరిశోధనా అనుభవం చాలా మట్టుకు తన కవిత్వం వ్యక్తిత్వాన్ని కూడా ప్రభావితం చేస్తూ వుంటాయి.

కవిత్వ విమర్శ మీద గత కొంతకాలంగా నిక్కచ్చిగా కొంతు విప్పి, పరిభాష వెతుక్కుంటున్నాశేవ్-శేఅఱ్ఱఱఎ బాబాగారు. సంప్రదాయ కవిత్వశైలిని నిరాకరించడం, కవిత్వంలో వొదగని సాంస్కృతిక లక్షణాలను స్వీకరించడం ఈ రెండు పనులూ చక్కగా ఒకతాటిపై తీసుకొచ్చిన ఆధునిక కవి వీరు. బాబాగారు రాసిన "మూడోకన్నీటి చుక్క" అనే కవితా గ్రంథంలో అనేక సామాజిక అంశాల మీద కవితలు రాసారు. ఈ పుస్తకంలో వున్న కవితలు మొత్తం 118. కవితలు రాయడంలోనే కాదు, వీటికి శీర్షికలు పెట్టడంలోనూ తనదైన శైలిని చూపించారు. ఉదాహరణకి 'ఒక...పురా...ప్రకాశం"; "బక్క చిక్కిన ప్రశ్న వివరణ"; "కీరంగి మాంగ్రేవ్స్" ఇలా చెప్పుకుంటూ పోతే అనేకం. చక్కటి శీర్షికలతో, ఆలోచింపచేసే కథనంతో, అల్పాక్షరాలతో అనల్పార్థం రీతిగా వీరి రచనా విధానం కొనసాగుతోంది.

ఆయన రాసిన "కలలు" అనే కవితలో

"జీవితం అనే పదునైన కత్తి
కాలాన్ని
ఆఫీసు, అనుబంధాలు, స్వప్నాలుగా
ముక్కలు ముక్కలు చేసి వడ్డిస్తుం
దినాంతాన
స్వప్నాలు మాత్రమే
మన జేబులో మిగిలే
చివరి చిల్లర నాణేలు
అపుడెపుడో మేసిన వెన్నెల్ని
చందమామ రజనుగా రోడ్డుపై కార్చుకొంటూ
క్షతగాత్ర నది
ట్రక్కులు ట్రక్కులుగా ప్రవహిస్తోంది
నగరం వైపు"

ఈ కవితలో వాడిన పదాలతో కవి ఒక చిత్రం గీశాడు క్షతగాత్ర నదిని చూపాడు. ఎండిన కన్నీటి చారికలా నది, ఎడారి నగరాల నిర్మాణం, ఆదీనాన్ని అరణ్య రోదన, చందమామ రజను ఈ పదాలు చాలా బాగున్నాయి.

బాబా కవిత్వంలో నినాదాలు ఉండవు, చచ్చు మాటలు ఉండవు, కవిత్వ రహస్యం తెలిసిన వాడు. కవిత్వ భాషను ఎరిగిన వాడు కథనాత్మక శైలిలో హాయిగా చదువుకుంటూనే మనకు ముల్లు గుచ్చుకుంటుంది. ముల్లు తీయించుకోవడం ఉంటుంది. జీవితాన్ని ఇంత కన్నా సులభవాక్యాలలో వ్యాఖ్యానించలేము.

పైన ఉదహరించిన 'భూసేకరణ' కవితలో సెజ్‌లు, రాజధానులు, ప్రాజెక్టులు, రియల్ ఎస్టేట్ వ్యాపారాల కోసం జరిగే భూసేకరణ దృష్టా ఆ కవిత రాశారు.

ఈ మధ్య 'ఇసుక' బంగారమైన సంగతి మనకు తెలుసు. ఇసుకాసురులు నదీ గర్భాల్ని ఎలా నాశనం

చేస్తున్నారో 'క్షతగాత్ర నది' అనే కవితలో బాబా అద్భుత మైన భావన చేశారు. నదిని యూనిట్లు యూనిట్లుగా నగర నిర్మాణాల కొరకు తరలిస్తున్నారంటూ

"మెలికలు తిరిగి, లుంగ చుట్టుకొని
తరుచ్ఛాయల్ని తలచు కొంటూ
బుల్ డోజర్ కింద ఆదీవాసీ చేసిన
అరణ్య రోదనను గుర్తు చేసుకుంటూ"

కుట్రలు, భమ్యా నేను అన్నీ గమనిస్తూనే ఉన్నాను. రక్తహేల, పర్సనల్ లాంటి కవితల్లో తన మార్గాన్ని స్పష్టంగా చెప్పాడు. రక్తహేల, పర్సనల్ లాంటి కవితల్లో తన మార్గాన్ని స్పష్టంగా చెప్పాడు. అనుభూతి కవితల్లో సామాజికతను తప్పిపోనివ్వలేదు. తన గొంతును ధైర్యంగా వినిపించాడు.

"ఏంపని ఉంటుంది నీకూ!" అనే కవితలో సాధారణంగా ఇంట్లో స్త్రీల కష్టాన్ని, పురుషులు గమనించరు. ఎలా అంటే అలా మాట్లాడతారు. ఒక స్త్రీ హృదయంతో రాసిన కవిత.

"వెళ్తూ వెళ్తూ అతనన్నాడూ
నే వచ్చే వరకూ
ఏం పని ఉంటుంది నీకు"

అని తను తిరిగి వచ్చేసరికి 'ఇల్లు' అంతా గందర గోళంగా ఉంది. ధూళి, ఈగలు, ముసిరిన నేల, కిచెన్ సింక్‌లో దట్టమైన వాసన ఎక్కడ పడితే అక్కడ మురికి శకలాలు ఉన్నాయి. అతను తిరిగి వచ్చాక.

"ఇల్లు మొత్తం
క్వారీ పక్కన జుత్తు నెరిసి
కాంతి నశించిన చెట్టులా ఉంది
అతను ఇంకెప్పుడూ అలా అనలేదు"

స్త్రీ యొక్క కష్టాన్ని ఈ కవితలో బాబా ప్రతిబింబించారు

గోదావరినదిలో బోట్ ప్రమాదంలో అనేక ప్రాణాలు కాపాడిన స్థానికులు దృష్టి నుండి బాబాగారు రాసిన కవిత 'ఎవరు వీళ్లంతా!'

కులమతభేదాలు మరిచి వీళ్ళ దాదాపు 24 మందిని రక్షించారు.

"ఆ కొద్ది క్షణాలూ
బొట్టు, టోపీ, శిలువా, రోలెక్స్ వాచీ
ఏ తారతమ్యం లేదక్కడ
ఆ కొద్ది క్షణాలు
మనం నిర్మించుకున్న
గోడలన్నీ
కుప్ప కూలిపోయాయి"

అంటూ బాబా ప్రాణాలు కాపాడిన వారి పక్షాన గొప్పగా మాట్లాడారు, మానవత్వం ఒకటే ప్రాణం పోస్తుందని, మనిషి గమ్యం మనిషి తనమే అని చెబుతారు.

ఈ విధంగా 'మూడో కన్నీటి చుక్క' కవితా సంపుటిలో బాబా వ్యక్తిగత అనుభవాల ద్వారా సామాజిక అనుభవాలను మన ముందు రూపు కట్టాడు. మానవ వ్యవహారాల్ని మాంత్రిక వాస్తవికతతో ప్రవేశ పెట్టి మెప్పించగలిగారు.

⌘⌘⌘

BHAVAVEENA
Vol. 17, Issue. 8, August 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

నా ఊరు (దీర్ఘ కవిత) – సమకాలీనత

– డా॥. శివ కుమార్ నందనవనం, ఆంధ్రోపన్యాసకులు, ఎన్ఎన్ఎన్ డిగ్రీ కళాశాల, ఒంగోలు.
అధ్యక్షులు, గురజాడ ఫౌండేషన్ (అమెరికా), ప్రకాశం జిల్లా శాఖ, ఒంగోలు

ఆధునిక కవితా ప్రపంచంలో కవిత్వం అనేక నూతన ప్రక్రియా వైవిధ్య భరితంగా సాగిందనుటలో సందేహం లేదు. ఈ నేపథ్యంలో వచ్చిందే దీర్ఘ కవిత. అయితే ఈ దీర్ఘ కవిత ప్రక్రియలో రచనలు మన తెలుగు భాషా సాహిత్య ప్రపంచంలో చాలా తక్కువగానే వచ్చాయని చెప్పవచ్చు. అందుకు కారణాలు ఏవైనా కావచ్చు ప్రస్తుతం నేను ఆ అంశం జోలికి వెళ్ళదలచుకోలేదు. అయితే దీర్ఘ కవిత ప్రక్రియలో తన రచనను కొనసాగించిన వారిలో అద్యుడుగా కుందుర్తివారి 'తెలంగాణ' అని డాక్టర్ కాసల నాగభూషణం (తెలుగు శాఖాధ్యక్షులు, డి.జి. వైష్ణవ కళాశాల, చెన్నై) "నా ఊరు" దీర్ఘ కవితలో "సంకల్ప సిద్ధిరస్తు" అంటూ ముందు మాటలో ప్రస్తుతించారు. ఈ కోవలోనే దీర్ఘ కవితా ప్రక్రియను ఎంచుకొని తమ రచనలను సాగించిన వారిలో డాక్టర్ సి.నారాయణ రెడ్డి రాసిన "విశ్వంభర" దీర్ఘకవిత ఆధారంగా జ్ఞానపీఠ పుర స్కారం అందుకోవడం జరిగింది. ఈ నేపథ్యంలో దీర్ఘకవిత ప్రక్రియ కొంత ప్రాధాన్యతతో బాటు సరైన గౌరవం దక్కిం దని భావించాల్సి ఉంటుంది.

ఆ కాలంలో దీర్ఘకవితలుగా వచ్చిన కొన్నింటిని యిచ్చట ప్రస్తుతించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అవి వరుసగా కె.శివారెడ్డి రాసిన ఆసుపత్రి గీతం, దిగంబర కవి నగ్నముని రచించిన "కొయ్యగుర్రం" కె.ఎస్వి రాసిన "రాత్రి", బి.కిరణ్‌క్రాంత్ చౌదరివారి "రాగధూళి", ఎండ్లూరి సుధాకర్ కలంనుండి జాలువారిన "వర్గకర ణీయం", ఆచార్య రాచపాళెం చంద్రశేఖర్ రెడ్డి చేవ్రాలులో రూపుదిద్దుకున్న "పాలి" మొదలైనవి.

ఇలా తెలుగు సాహిత్య ప్రపంచంలో ఉద్ధండులైన ఈ కవుల వరుసలోనే నేను ఎందుకు ఆ ప్రక్రియను ఎంచుకోకూడదు అనుకున్నారు కాబోలు డాక్టర్ విస్తాలి శంకరరావు దీర్ఘకవిత ప్రక్రియను ఎంచుకొని "నా ఊరు" రచనను సాగించే ప్రయత్నం చేసారు. ప్రయత్న చేయడమే కాదు సరికదా కృతకృత్యులయ్యారని ఘంటాపథంగా చెప్పవచ్చు. "నా ఊరు" దీర్ఘ కవిత చదివిన పాఠకులు ఎందరో తమ అభిప్రాయాల్ని నాతో పంచుకున్నారు. ఈ దీర్ఘకవిత పాఠకులుగా వారు ఆ కవితలో లీనమై తమ చిన్ననాటి స్నేహితులు, బాల్య చేష్టలు, బడి, గుడి, చెరువు, వాగు-వంకా, పొలము-పొట్లా, చెట్టు-చేమలు, ఆట-పాటలు గుర్తుకొస్తున్నాయంటూ నాతో ముచ్చ టించిన వైనం ఈ సందర్భంగా నేను స్పష్టం చేస్తున్నాను.

అయితే తెలుగు భాషలో అనేక సాహిత్య ప్రక్రియలు ఉండగా రచయిత డాక్టర్ విస్తాలి ఈ దీర్ఘకవితా ప్రక్రియనే ఎందుకు ఎంచుకున్నారు? అనే దిశగా నా పరిశీలన గావిం చాను. సహజంగా కవులు తాము రచనలు చేయబోయే ముందు వారు ఎన్నుకునే కవితా వస్తువును బట్టి వారి కవితా వ్యాసంగం ఆధారపడి ఉంటుందని చెప్పవచ్చు. కవి తన రచనకు కావలసిన ప్రధాన ముడి సరుకు "కవితా వస్తువు". దానిపై ఆధారపడే కవి కలం ముందుకు సాగు తుంది. డాక్టర్ విస్తాలి శంకరరావు చేవ్రాలులో వెలువడిన నావూరు దీర్ఘ కవితపై పత్రసమర్పణ చేసే ముందు వారి గురించి సంక్షిప్తంగానైన రెండు మాటలు ప్రస్తుతించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. లేకపోతే "చెట్టుపేరు చెప్ప కుండా కాయలమ్ముకుంటున్న చందంగా" ఉంటుంది. ఇక్కడే మరోవిషయం కూడా చెప్పాల్సిన అవసరం ఉంది. డాక్టర్ విస్తాలి శంకరరావు గురించి చెప్పడమంటే. "జగమెరిగిన బ్రాహ్మణునకు జంధ్యమేల?"అని మీలో ఎవరైనా ప్రశ్నిస్తారని తెలుసు. కానీ ప్రస్తుతించడం ఒక

పరిశోధకునిగా నా బాధ్యత. అందుకే వారి కుటుంబ నేపథ్యాన్ని, విద్యాభ్యాసం, వృత్తి ఉద్యోగాల పరంపరను గురించి ఇచ్చట ముచ్చటించాను. డాక్టర్ విస్తాలి శంకర రావు గారి గురించి సంక్షిప్తంగా పరిచయం చేయదలచాను. అయితే ఆచార్య విస్తాలి శంకరరావు గారిని పరిచయం చేయడమంటే చంద్రునికో నూలుపోగు చందంలా ఉంటుంది. అయినా ఓ చూపు ఆ దిశగా నా పరిశోధనను సాగించాను.

కుటుంబ నేపథ్యం :

డాక్టర్ విస్తాలి శంకరరావు గారు ప్రకాశం జిల్లా అద్దంకి మండలం జార్లపాలెం అనే చిన్న పల్లెటూరులో (కుగ్రామంలో) "మట్టిలో మాణిక్యంలా" పుణ్య దంపతులైన విస్తాలి హనుమయ్య పున్నమ్మగార్లకు1967వ సంవత్సరం జూన్ 1వ తేదిన రెండవ పుత్ర రత్నంగా జన్మించారు. వీరి తల్లిదండ్రులకు మొత్తలు ఆరుగురు బిడ్డలు కలిగారు. నలుగురు ఆడపిల్లలు, ఇద్దరు మొగపిల్లలు. అయితే వీరి కుటుంబ వంశానుక్రమిణాక దిశగా పరిశీలిస్తే అనేక విషయాలు వెలుగు చూసాయి. సుమారుగా నాలుగు తరాలుగా వీరి తాత ముత్తాతల కాలం నుండి జానపద నేపథ్యం గల కుటుంబం డాక్టర్ విస్తాలి శంకరరావు గారిది కావడం విశేషం. అద్దంకి ప్రాంత పరిసరాలలోని చుట్టు ప్రక్కల గల 20 - 30 గ్రామలలో వీదినాటక కళాకారులుగా తమ ప్రదర్శనలు ఇచ్చేవారు. వీరి వీధి నాటకాలలో ప్రధానంగా హరిశ్చంద్ర, భక్త ప్రహ్లాద, చెంచు లక్ష్మి, విరాటపర్వం, లంకాదహనం మొదలైనవి ప్రదర్శించే వారు. ఈ వీధినాటకాల ట్రూపులో డాక్టర్ విస్తాలి శంకర రావు గారి తండ్రి హనుమయ్యగారు ప్రధన భూమిక పోషించేవారు. ఈ నేపథ్యంలో తాతల కాలం నాటి నుండి వచ్చిన ఆ వీధినాటక కళలో నిష్ణాతులైన డాక్టర్ విస్తాలి శంకరరావుగారి తండ్రితో కలసి తన సత్యహరిశ్చంద్ర నాటకంలో లోహితాస్యుడి పాత్రధారిగా వంశపారంపర్యంగా వచ్చిన వీధినాటక కళనున పుణికి పుచ్చుకున్న వారు కావడం చెప్పదగిన విశేషం. అంతే కాకుండా రచయితకు చెన్నై నగరంతో అనుబంధం వారు మద్రాసు విశ్వవిద్యాలయంలో తెలుగుశాఖలో ఉద్యోగరీత్యా చేరిన నాటి నుంచే అని మాత్రమే తెలుసు. కానీ ఒకప్పటి ఉమ్మడి మద్రాసు రాష్ట్రంగా ఉన్నప్పుడే డాక్టర్ విస్తాలి శంకరరావు గారు తన తండ్రితో కలసి చెన్నపురిలో వీధి నాటకాలు ఆడినట్లుగా తెలియవచ్చింది. అందుకే కాబోలు నేడు ఒకప్పుడు ఉహా తెలిసీ తెలియని నాడు చెన్నై నగరంతో ఉన్న అనుబంధమే వారిని మద్రాసు విశ్వవిద్యాలయానికి ఆహ్వానించిందేమోనని తలపుకు వస్తుంది. ఆ చిన్ననాడు వీధినాటకాలు ఆడటానికి వచ్చిన విస్తాలి హనుమయ్య కుమారుడు శంకరరావుకు చిన్ననాడే మన మనసులో ఎప్పటికైనా నేను ఒక మహానగరంలో ఉన్నతమైన ఉద్యోగంలో స్థిరపడాలనే ఒక ఆశయం బీజం వేసిందని, ఆ దిశగా వారి కృషి, పట్టుదల ఆయనను ఒక ప్రముఖ విశ్వవిద్యాలయ స్థాయిలో తెలుగు ఆచార్యునిగా నిలిచేందుకు కారణభూతమయ్యిందని వారి మాటల్లో ఒకసారి నాతో మిత్ర సమానుడిగా ముచ్చటించారు. నేడు కేవలం చెన్నపట్టణమే కాదు, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పేరు ప్రఖ్యాతులు గడించే స్థాయికి వారు ఎదిగారు, ఎదుగుతున్నారనడంలో సందేహం లేదు. నేటి సమకాలీన సమాజంలో ఇటువంటి కృషి పట్టుదల నేటి యువతలో కొరవడుతున్నాయి. అటువంటి యువతకు ఆదర్శంగా నిలుస్తాడు రచయిత డాక్టర్ విస్తాలి శంకరరావు అని స్పష్టంగా చెప్పవచ్చు.

విద్యాభ్యాసం :

వీరి విద్యాభ్యాసం విషయానికి వస్తే ఒకటవ తరగతి నుండి 5 వ తరగతి వరకు తమ స్వగ్రామమైన జార్ల పాలెంలోనే పూర్తి చేసారు. హైస్కూలు విద్యనుంచి అద్దంకి లోను, బి.ఏ. డిగ్రీని ఎస్ఎస్ఎన్ డిగ్రీ కళాశాల, నరసారావు పేటలోను, పండిత శిక్షణ ఆంధ్ర సారస్వత పరిషత్, హైదరాబాదులో, ఎం.ఏ., ఎంఫిల్., పి.హెచ్డి.లను యూనివర్శిటీ ఆఫ్ హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీలోను

పూర్తిచేసారు. అలాగే ఎం.ఏ (భాషా శాస్త్రం)ను అన్నామలై యూనివర్శిటీ, తమిళనాడులోను పూర్తిచేసారు. ఇంత ఉన్నత విద్యాభ్యాసాలకు చిన్ననాడే పునాదులు వేసిన తమ గురువు విద్వాన్ జ్యోతి చంద్రమౌళి గారి విషయం ఇచ్చట ప్రస్తుతించక పోవటం అంటే గురుభక్తిని మరచినట్లే నని చెప్పక తప్పదు. రచయిత హైస్కూలు విద్యను ప్రభుత్వ వసతి గృహములో ఉంటూ కొనసాగించారు. అప్పుడు అనగా 1978వ సంవత్సరంలో అద్దంకి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తెలుగు అధ్యాపకులుగా పనిచేస్తున్న విద్వాన్ జ్యోతి చంద్రమౌళిగారి దృష్టిలో పడ్డారు. అది మొదలు నేటి వరకు అనగా 2020 వరకు వారి గురుశిష్య బంధం ఎనలేనిది. డాక్టర్ విస్తాలి హైస్కూలు విద్యను అభ్యసించేటప్పుడు పేరుకు ప్రభుత్వ వసతి గృహంలో ఉంటున్నా గురువుగారి ఇంటి వద్దనే ఎక్కువ సమయం గడుపుతూ వారి సాహిత్యాభిలాషకు ఆకర్షితులయ్యారు కాబోలు.వారినే గురువుగా భావించి గురువును మించిన శిష్యుడను అవ్వాలనే కృషి, పట్టుదలకు తోడు నాటి సామాజిక వివక్షతలు సైతం రచయితలో మరింత కసిని స్వయంకృషి దిశగా ముందడుగు వేసేందుకు బాటలు వేసినట్లు గోచరిస్తుంది. ఇలా నాలుగు దశాబ్దాల కాలంగా నమ్ముకున్న గురువును అంటిపెట్టుకోవడం బట్టి చూస్తే రచయితలో వున్న గురుభక్తికి తార్కాణంగా నిలుస్తుంది. ఈసందర్భంగా డాక్టర్ విస్తాలి శంకరరావు గురువైన విద్వాన్ జ్యోతి చంద్రమౌళిగారిని ఈ కోవిడ్-19 నేపథ్యంలో తంతి ద్వారా సంప్రదించి తన ప్రియశిష్యుని గురించి చర్చించగా ఆయన ఆనందభాష్పాలతో చెప్పిన ఒకే ఒక్కమాట "శంకర్ నా పెద్దకుమారుడు" అని. అదిచాలు వారి గురుశిష్య సంబంధానికి, ఆత్మీయతాను రాగానికి ప్రతీకగా నిలుస్తుంది. కావునా నేటి సమకాలీన ప్రపంచంలో గురుశిష్య సంబంధాలు నానాటికీ ఛిద్ర మౌతున్న తరుణంలో ఆచార్య విస్తాలి శంకరరావు వంటి వారు స్ఫూర్తిగా నిలుస్తారనడంలో సందేహం లేదు.

స్నేహానికి మారుపేరు డాక్టర్ విస్తాలి శంకరరావు:

"స్నేహానికన్న మిన్న లోకాన లేదురా" అంటూ "స్నేహం కోసం" అనే తెలుగు చిత్రానికి ఓ సినీ గేయ రచయిత రాసిన పాటకు నిలువెత్తు సాక్ష్యంలా నిలుస్తాడు రచయిత డాక్టర్ విస్తాలి శంకరరావు. నా పరిశీలనలో భాగంగా నా ఊరు దీర్ఘకవితతో తన ఊరుతోబాటు తన చిన్ననాటి మిత్రులతో కలసి మెలసి ఆడిన ఆటలు, పాటలు, చేష్టలు తప్పని సరిగా ఎవరికైనా పెనవేసుకున్న బంధంలో జీవితంలో మరువలేని గుర్తులుగా నిలుస్తాయి. ఆ దిశగా నా పరిశోధన సాగించాను. తన చిన్ననాటి స్నేహితుడు షేక్. అజీమ్‌ను ఓ సందర్భంలో అద్దంకి పట్టణంలో కలిసాను. ఆయన ఒక సాధారణ దర్జీ వృత్తిలో కొనసాగుతున్నాడు. ఆయనకు అంతగా చదువు సంధ్యలు కొన సాగించలా. అందుకు కుటుంబ, సామాజిక, ఆర్థిక నేపథ్యం ఒక ప్రధాన కారణం కావచ్చు. తన బాల్య మిత్రుడు కేవలం ఐదవ తరగతి వరకు మాత్రమే చదివాడు. చదువు మానేసి వృత్తినైపుణ్యతను పెంచుకొని వృత్తిరీత్యా దర్జీగా (టైలర్‌గా) తన జీవనం సాగిస్తున్నారు. నేడే రచయిత ఎంతో ఉన్నత పదవులు అలంకరించి, దేశంలోనే ఒక ప్రముఖమైన మద్రాసు విశ్వవిద్యాలయంలో ఆచార్యులుగా పనిచేస్తున్నా, సుమారు 50 సంవత్సరాలు తన బాల్య స్నేహితుని వదలకుండా కొనసాగిస్తున్న వారి స్నేహబంధం చెప్పదగింది. ద్వాపర యుగకాలంలోని మహాభారతంలో శ్రీకృష్ణుడు - కుచేలులు ప్రాణస్నేహితులు (చూడుము: మహాభారతం - కుచేలోపాఖ్యానం) అయితే ఇక్కడ శంకరరావు - అజీమ్‌లు స్నేహానుబంధానికి ప్రతీకలుగా నిలుస్తారు. నేటి సమకాలీన సమాజంలో స్నేహబంధాలు అడుగంటి పోతున్న తరుణంలో ఓ చుక్కానిగా నిలుస్తాడు రచయిత డాక్టర్ విస్తాలి శంకరరావు.

"నా ఊరు" దీర్ఘకవితను గురించి పరిశీలిస్తే రచయితకు ఈ దీర్ఘకవితతో తన జీవితం ముడిఉందని తెలుస్తుంది. పేరుకి ఇది దీర్ఘకవిత అయినా ఇందులో డాక్టర్ విస్తాలి శంకరరావు జీవనగాథ దాగివుంది.

సహజంగా ఎవరైనా తన కన్నతల్లిని, జన్మభూమిని మరువరు. అందుకే కాబోలు రచయిత తన జన్మభూమిపై ఉన్న మమకారంతో తన కవితా వస్తువుగా తను పుట్టి పెరిగిన ఊరినే ఎంచుకున్నాడు. అటువంటి తన ఊరుతో తనకున్న సంబంధ బాంధవ్యాలను ఈ దీర్ఘకవిత ద్వారా పాఠకులతో పంచుకున్నాడు. ఒక దేశం అభివృద్ధి చెందాలంటే "పల్లెలే పట్టుగొమ్మలు" అనే వాస్తవమెరిగిన కవి తన రచన సాగించారు.

"నా ఊరు / అందానికి పెట్టింది పేరు /
తెలవారగానే మధుర - కిల కిలరావాలు చేసే
పిట్టలు" (నా ఊరు పుట సంఖ్య 11)

అంటూ ప్రారంభించి పల్లెటూళ్ళ ప్రకృతి అందచందాలను ఆస్వాదించిన చిన్ననాటి స్మృతులను గుర్తుచేసుకుంటూ పాఠకులకు రుచి చూపించారు. ప్రకృతిని పరిరక్షించుకోవాలనే ఒక సందేశం చెప్పకనే చెప్పారు. ప్రకృతి వికటిస్తే వచ్చే "కరోన" (కోవిడ్-19) ని ప్రస్తుతం మనం చూస్తూనే వున్నాంకదా! "ఉమ్మడి కుటుంబాల సరసాలలోగిళ్ళు" అనడంలో ఒకప్పుడు మన దేశంలో ఉమ్మడి కుటుంబ వ్యవస్థ ఉండేది. నేడు అది ఛిన్నాభిన్నమై పోయిన విషయాన్ని గుర్తుచేస్తూ "కలసి ఉంటే కలదు సుఖం" అనే సందేశాన్ని సమకాలీన స్థితిగతుల నేపథ్యంలో రచయిత చెప్పారు.

"వీధినాటకాలతో కిక్కిరిసిన / శ్రీరామనవమి పందిళ్ళు / ప్రేమపక్షులతో ముసురుకుంటున్న / అట్లతద్ది ఉయ్యాలల ప్రేమ ఊపులు / పల్లె పడుచుల కేరింతలతో / నిండిన దసరా మ్యాట్నీ షోలు, / ఎన్నటికీ మరువలేని ఆ జ్ఞాపకాలు / అదే మన సంస్కృతికి ఆనవాళ్ళు"(నా ఊరు పుట సంఖ్య 12) అనడంలోనే ఆనాటి జానపద కళలకు ఉన్న ప్రాధాన్యతను, పాతకాలంననాటి పండుగలలో ఉన్న సంస్కృతి సంప్రదాయాలను చాటి చెబుతారు. నేటి సమకాలీన స్థితులలో ఆనాటి సంస్కృతి సంప్రదాయాలు, జానపద కళారూపాలు కనుమరుగవుతున్నాయని ఆవేదన చెందుతూ, నేటితరానికి వాటి అవసరం ఎంతో ఉందని చాటిచెప్పారు.

"గబ్బిలాల స్వాగతం అందుకునే కర్షక జీవులు" అనడంలో తెల్లారగట్టే లేచి పొలంపనులకు, ఇతరత్రా పనులకు వెళ్ళి తిరిగి సాయం సమయానికి ఇంటికి చేరే కూలీలు, శ్రామిక స్త్రీలకు గబ్బిలాలు స్వాగతం చెబుతున్నాయనడంలో కవిలోని అంతర్గతంగా పలుకుతున్న ధ్వనిని ఇచ్చట దర్శించవచ్చు. "గబ్బిళం"ను ఇచ్చట కవి ప్రస్తుతించడంలో పాఠకుని హృదయాలలో మెట్ట మొదటగా మెదిలేది గుఱ్ఱం జాషువా రచించిన "గబ్బిళం" కవితా ఖండిక. ఆ ఒక్క పదంలో గుఱ్ఱం జాషువా రచనలోని సారాంసాన్ని అమూలాగ్రం ఇచ్చట కవి పాఠకులకు గుర్తుచేయడం చెప్పదగిన అంశం.

"స్కూలుమాని గొడ్లకాడ కెళ్ళే స్నేహితులు, / నాగుల పాడు పంతులు / రాయమన్న చూచిరాతలు, / శాంతమ్మ పంతులమ్మ చెప్పే / అయ్యో నా ముంగిస కథలు / పోటీలు పడి పల్కిన / ఎక్కాలు, సుమతి, వేమన పద్యాలు / పాఠం చెప్పకపోతే / విరిగిన చింత మల్లెలు" (నా ఊరు పుట సంఖ్య 15) అంటూ తన చిన్ననాటి బాల్యపు గుర్తులను ఒకసారి నెమరు వేయడంలో అంతరార్ధము ప్రతిపాదిస్తే, సహజంగా పుట్టిన ప్రతి మానవునికి తన చిన్ననాటి బాల్యదశలోని తీపి గుర్తులు కంఠంలో ప్రాణం ఉన్నంతవరకూ మర్చిపోలేరు.

"చిటారు కొమ్మన / నల్లతుమ్మ చెట్ట బంక గుబ్బలు, / అనవాయమ్మ కొట్లో అమ్మిన తీరులు, / పోటీలు పడి ఆడిన / కోతికొమ్మచ్చి, చిట్టంకి ఆటలు, / "సూరిగాడితో పందెం వేసి / తాగిన తుమ్మబీడీలు" (నా ఊరు పుట సంఖ్య 16) అనండంలో నేటి సమకాలీన యంత్రిక జీవనంలో కేవలం బట్టీ చదువులకే పరిమితమౌతున్న నేపథ్యంలో పాతకాలపు ఆటలైన కోతికొమ్మచ్చి, కోడింబిళ్ళ, చిట్టంకి, బిల్లంకోడు వంటి ఆటలు శరీరానికి మంచి వ్యాయామాన్నందిస్తాయని చెప్పకనే చెబుతారు. ఇలాంటి

కనుమరుగౌతున్న ఆటలు నేటి సమకాలీన ప్రపంచానికి కవి గుర్తుచేసారు. వాటి అవసరాన్ని చాటిచెప్పారు.

ఇక్కడ "సూరిగాడితో పందెం వేసి తాగిన తుమ్మ బీడీలు" అని కవి ప్రస్తుతించడంలో కవి "తుమ్మబీడీలు" అంటే కవి బీడీలు తాగాడని కాదు, ఎంతో లోతైన అర్థం ఇందులో దాగి ఉంది. అదేమంటే తాతల కాలంనాడు ఏటి ఒడ్డున వున్న తుమ్మ చెట్ల వేర్లు బయటకు కనబడుతుంటాయి. కొద్ది లావుపాటి వేర్లకు సన్నపాటి రంధ్రాలు ఉంటాయి. వాటి ద్వారా పొగ వస్తుంటుంది. (నేటికి పల్లెటూర్లలో మనం క్షేత్ర పర్యటన ద్వారా చూడొచ్చు) కవి బాల్య చేష్టలలో భాగంగా ఏటికి ఈతకు వెళ్ళిన పిల్లలు ఏటి గట్టున ఉన్న ఆ తుమ్మచెట్ల వేర్లను నోటిలో పెట్టుకొని సరదాగా ఊదేవారు. ఆ పొగ నాలుకకు కొంత ఘాటును కలిగిస్తుంది. ఈ విషయాన్ని ఇక్కడ కవి ప్రస్తుతించారు.

నేటి ప్రపంచీకరణ నేపథ్యంలో ఒకప్పటి పల్లెటూర్లలో ఆ ఆహ్లాదకరమైన వాతావరణం కనపడడం లేదు, కను మరుగైపోతుందన్న ఆవేదన కవి ఈ దీర్ఘకవిత ద్వారా వ్యక్తం చేసారు. అందుకే అంటరు

"నేడు / ఊరు / ఊరులా లేదు /నా చిన్ననాటి ఊరులా లేదు. . . . /నిజంగా ఊరు ఊరులా లేదు / అసలు బ్రతికున్నట్లే లేదు" అంటూ తన ఊరు నేటి సమాకాలీన పరిస్థితులలో మారిన తీరును గురించి బాధను వ్యక్తంచేసారు.

నా ఊరు / కురుక్షేత్ర సంగ్రామాన్ని తలపిస్తుంది / కలుషిత నీరు, / ఫ్లోరైడ్ విజృంభణ,/వికలాంగులౌతున్న పసి మొగ్గలు, / రోగాలతో బ్రతుకు జీవనం, / మందులు లేని ఆసుపత్రులు, / డ్యూటీలకు రాని డాక్టర్లు, / టీచర్లు లేని బడులు, / దుర్గంధంలో ఐజూఊరు / కలరా, మలేరియా, చికన్ గున్యా వ్యాధులు, / దోమలతో నిండిన / మురికి కాలువలు, / ఊరు గుర్తుకొస్తే / అరణ్య రోదన" (నా ఊరు - పుట సంఖ్య 31)అంటూ ఒకప్పుడు పచ్చని పసిడిక బయళ్ళతో ఎంతో ఆహ్లాదంగా కనిపించే పల్లె టూర్లలో సైతం రాజకీయాలు మొదలై కక్షలు, కార్పణ్యా లతో ఓ కురుక్షేత్ర సంగ్రామాన్ని తలపించేలా ఉన్నా యంటారు. అదేవిధంగా పర్యావరణ పరిరక్షణకు భంగం కలుగుతున్నదని ఆవేదన చెందుతారు. నేటి సమకాలీన సమాజాన్నిపట్టి పీడిస్తున్న అనేక సమస్యలను ఏకరువు పెట్టారు.

"అయినా. . . . . / నా ఊరంటే నా కిష్టం / పోగొట్టు కున్న చేటనే అన్వేషిస్తాను./ నా ఊరిని తట్టి లేపుతాను / రాలిపోయిన పూలు మిగిల్చిన / తొడిమలు వికసిస్తాయని /ఓ ఆశ!" (నా ఊరు - పుట సంఖ్య 33) అంటూ నేడు పల్లెటూర్లను సంరక్షించుకోవాల్సిన అవసరాన్ని దీర్ఘకవితా ప్రక్రియద్వారా ఎంతో సున్నితంగా పాఠకుల మనసును ఆలోచింపచేస్తాడు. గత కాలపు స్మృతులను నెమరు వేసుకుంటూ పాఠకుల మనసును రంజింప చేస్తూ ఎప్పటి కైనా పల్లెటూర్లు పూర్వపు వైభవాన్ని పొందగలవన్న ఆశావహ దృక్పథాన్ని తెలియచేసారు.

ఆధార గ్రంధాలు :

1. నా ఊరు (దీర్ఘకవిత)
2. మహాభారతం కుచేలోపాఖ్యానం

⌘⌘⌘

BHAVAVEENA
Vol. 17, Issue. 8, August 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

స్వాతంత్రోద్యమంలో స్త్రీవాదుల పాత్ర హక్కులు – పరిణామ దశ

– డా॥. ఉమ్మిడి శాంతి, ఫ్యాకల్టీ, తెలుగు శాఖ, అంబేడ్కర్ విశ్వవిద్యాలయం, శ్రీకాకుళం.

స్త్రీవాద పుట్టుక-వ్యాప్తి :

1789 ఫ్రెంచి విప్లవంలోని స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం, డిమాండ్ పునాదిగా స్త్రీవాదం అంకురించిందని చెప్పవచ్చు. స్త్రీ వాద మొదటి ఉద్యమం 19, 20వ శతాబ్దంలోని ఉధృతంగా సాగింది ఈ ఉద్యమం ప్రధానంగా మహిళల ఓటు హక్కు, ఆస్థి హక్కులపై మొదటిసారిగా దృష్టి కేంద్రీకరించింది. ప్యూడల్ వ్యవస్థను తొలగిస్తూ పెట్టుబడిదారీ విధానం ఆవిర్భవిస్తున్న దశలో శుద్ధ స్త్రీవాద ఉద్యమం సామాజిక మౌలిక మార్పులకు అంతర్భాగంగా ప్రయాణం చేయడంలో చారిత్రక పాత్రను పోషించింది. స్త్రీలను శృంగార వస్తువుగా పరిగణిస్తున్న ప్యూడల్ శక్తులను ఎదుర్కొని పెట్టుబడిదారి నాయకత్వంలో స్త్రీలు సైతం సంఘటితమయ్యారు. 19వ శతాబ్దం చివరిలో ముఖ్యంగా 1871 నాటి ప్యారిస్ కమ్యూన్‌లో స్త్రీలు విప్లవాత్మక పాత్ర పోషించారు. అప్పటి నుండి స్త్రీవాద ఉద్యమ వెల్లువ మొదలైనది. రష్యాలో సోషలిస్టు ఉద్యమం ముందు కాలానికి పెట్టుబడిదారీ ప్రపంచంలో సోషలిస్టు స్త్రీవాద భావాలు (అప్పటికింకా పేరు స్థిరపడలేదు) శ్రామిక మహిళా సంఘంగా సంఘటితమైనాయి. పురుషాధిక్య సమాజం నుండి అన్ని వర్గాల మహిళల విముక్తి లక్ష్యంగా సామాజిక విప్లవానికి సమాంతరంగా అంతర్భాగంగా మహిళలు ఉద్యమించాలని సోషలిస్టు స్త్రీవాదం తెలిపింది. పెట్టుబడిదారీ విధానం సామ్రాజ్యవాద దశకు చేరుకున్న నేపథ్యంలో పెట్టుబడిదారీ వర్గం స్త్రీవాద ఉద్యమానికి చేయూత నిచ్చింది.

స్త్రీలను శృంగార వస్తువుగాను వంటింటికి పరిమితం చేసి ఎలాంటి చట్టబద్ధత హక్కులు లేని రెండవ శ్రేణి పౌరురాలిగా పరిగణించిన ప్యూడల్ సంస్కృతిక వ్యతిరేక పోరాటంలో మహిళలకు తోడుగా పెట్టుబడిదారీ శక్తులు నిలిచాయి. పెట్టుబడిదారీ వ్యవస్థ సామ్రాజ్యవాద వ్యవస్థగా మారిన పిదప మార్పును కోరే, స్త్రీవాద ఉద్యమాల అవసరం లేకుండా పోయింది. స్త్రీ, పురుషుల సంబంధాలు కేవలం ఆర్థిక సంబంధాలుగా, మార్కెట్ సంబంధాలుగా రూపాంతరం చెందాయి.

స్త్రీవాదం - మేధావుల తోడ్పాటు :

స్త్రీకి స్వతంత్రం ఉంటేనే దేశ స్వాతంత్ర్యానికి ప్రయోజనం మన భావించిన కందుకూరి స్త్రీ విద్యకు పునాదులు వేశారు. వేమూరి శారదాంబ 1896లోనే తన మాధవ శతకంలో మహిళల హక్కులకు నిరోధకంగా ఉన్న సామాజిక, కుటుంబ అసమాన సంస్కృతిని స్త్రీ విద్య పట్ల ఆలోచనలను రేకెత్తింపజేసింది. రాజ్యాంగ సమాన హక్కులకు, విద్యా హక్కులకు దీనితోనే పునాదులు పడ్డాయని చెప్పవచ్చు. 1902లో విద్యావంతులైన స్త్రీలు, విదేశీ స్త్రీల జీవితాలు, వారి రాజకీయ హక్కులను తెలుసుకుంటూ తమ కుటుంబంలో తమ అస్తిత్వాలను గురించిన ఆలోచనలను పెంచుకున్నారు. బండారు అచ్చమాంబ స్త్రీ విద్యాభివృద్ధి చెందటానికి స్త్రీల సమాజాలను ఏర్పాటు చేశారు. 1902-1903 నాటికే విద్య ద్వారా జ్ఞానాన్ని పొందిన స్త్రీలు తమ బానిసత్వాన్ని తొలగించుకునే స్వతంత్ర్య ఆలోచనలను కొనసాగించినట్లు ఆమె రచనలో కనబడుతుంది.

స్త్రీలు పత్రికా రంగంలో ప్రవేశించారు. విద్య స్త్రీలలో ధైర్య స్థైరాలను పెంచింది. మహిళలు చదువుకోవడానికి వివాహ సంస్కృతి అటంకంగా ఉన్నదగి గుర్తించి బాల్య వివాహాలను నిరసించారు. స్త్రీ, పునర్వివాహ హక్కును, గౌరవ ప్రధానమైన జీవన హక్కుగా గుర్తించారు.

దేశ స్వాతంత్ర్యం కోసం స్త్రీ, పురుషులు ఐక్యంగా పోరాడాల్సిన అవసరాల్ని గుర్తిస్తూనే తమ స్వతంత్ర్యం కోసం స్త్రీలే ఐకమత్యంతో పోరాటం చేసుకోవాలని కర్త వ్యాన్ని గుర్తించారు. 1905లో బెర్లిన్ ప్రపంచ స్త్రీల సభలో పాల్గొన్న భారతీయ స్త్రీలు తమ దేశ అస్తిత్వాన్ని చాటడానికి తమ చీర చెంగులను చించి జెండాను తయారు చేయడం వారి స్వతంత్ర నిర్ణయాలకు నిదర్శనం. 1906లో లండన్ నుండి వచ్చిన దాదాభాయ్ నౌరోజీ కోసం ఏర్పాటు చేసిన సభలో పారసీక స్త్రీ పతాక ఆవిష్కరణ చేశారు. 1910 నాటికీ స్త్రీల సాహిత్యంలో స్త్రీ పురుషుల స్వతంత్ర జీవనంలో తేడాలను గుర్తించే భావనలకు పెద్దపీట వేశారు. ఆ విద్య, అస్తి హక్కులేమి స్త్రీ పురుషుల అసమానత్వానికి కారణమనీ స్త్రీ అదనంగా సాంఘిక, ఆర్థిక, స్వాతంత్ర్యాల కోసం పోరాడాలని చర్చించారు. 1911 నాటికి ఆరోగ్య భద్రత గురించి ఆలోచించారు. బహు భార్యత్వపు సమాన సంస్కృతిని, లైంగిక హక్క ఉండాలని భావించారు. 1914 నాటికి విడాకుల ప్రస్తావన తెచ్చారు. 1916లో స్త్రీకి సమాన ఆర్జనావకాశాల ఆవశ్యకత గుర్తించారు. 1920 గాంధీజీ పిలుపుతో సత్యాగ్రహోద్యమంలో భాగస్వాములై సహాయ నిరాకరణ ఉద్యమాన్ని ముందుండి నడపగలిగారు. 1925 నాటికి స్వరాజ్య సాధన స్త్రీల విద్యుక్త ధర్మమని భావించారు. 1929 లో స్త్రీని నిర్వచిస్తూ ఆమెకు శరీరముందని, మెదడుందని, హృదయముందని, స్త్రీ, పురుషుని హక్కు కాదని, స్త్రీ స్వతంత్ర జీవన హక్కు మానవ హక్కుని 1930లో ఉప్పు సత్యాగ్రహంలో 32వ శాసనోల్లంఘన ఉద్యమంలో 1935 నాటి ఎన్నికల ద్వారా శాసన సభ్యత్వానికై సమాన ప్రాతినిధ్యం ఉండాలని, ఉన్నత విద్యావంతులైన స్త్రీలకే కాక సంతకం పెట్టడం వచ్చిన స్త్రీలందరికి ఎన్నికల హక్కును విస్తరింపజేయాలని శాసనసభలో బిల్లును పెట్టాలనుకున్నారు. 1936లో సాంఘిక, రాజకీయ, ఆర్థిక రంగాలలో స్త్రీ పురుష సమానత్వం ఆవశ్యకతను గురించి ఇంటి చాకిరికి వేతనాలు కావాలన్నారు. 1937లో సైన్యంలో చేరాలని సంతానం కనే యంత్రాలు కాదని నిరసించారు. 1937 నాటి శాసన సభకు ఎన్నికై రాజకీయ హక్కును పొందారు. 1938 నాటికి చట్టాల్లో ఉన్న లింగ వివక్షను నిరసించారు.

ముగింపు :

1947 ఆగష్టు 15వ తేదీన ఎగరబోయే జెండాను తెలుగింటి కోడలైన సరోజినీ నాయుడు నెహ్రూకు అందించారు. తెలుగు వనిత దుర్గాభాయ్ దేశ్‌ముఖ్, డా॥. అంబేడ్కర్ రూపొందించిన రాజ్యాంగ నిర్మాణానికి సంఘ సభ్యురాలుగా ఉన్నారు. స్త్రీలకు సమాన హక్కులు, సమాన న్యాయం ఉండాలనే సూచనలు, దేశ స్వాతంత్ర్యానికి స్త్రీ హక్కుల చైతన్యానికి దేశ రాజ్యాంగ నిర్మాణానికీ గల అవినాభావ సంబంధం నుంచి స్ఫూర్తి పొందటం, అంతర్జాతీయ మహిళా దినోత్సవం లక్ష్యం. భారత రాజ్యాంగం 70 ఏళ్ళుగా అమలులో ఉన్నా స్త్రీ, పురుషులు సమానంగా జీవించలేని దశలో ఉండానికి కారణాలు విశ్లేషించుకుంటూ స్త్రీలు తమ హక్కుల పరిరక్షణకై మరింతగా కృషి చేసే దిశగా సాగటానికి స్వాతంత్రోద్యమం నాటి స్త్రీల సాహిత్య పఠనం ఎంతో అవసరం. వివిధ సాహిత్య ప్రక్రియల రూపంలో పాత తెలుగు పత్రికలో నిక్షిప్తమై విస్తృతంగా ఉన్న నాటి స్త్రీ సాహిత్య చైతన్యం, నేటికీ స్ఫూర్తిదాయకం. అనాటి స్త్రీల సాహిత్యంలో ప్రతిబింబించిన స్వతంత్ర జీవన చైతన్యం నేటివారికి ఆదర్శం.

⌘⌘⌘

BHAVAVEENA
Vol. 17, Issue. 8, August 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

సామాజిక సమస్యలపై సమర శంఖారావం – అలిశెట్టి ప్రభాకర్ కవిత్వం

– శ్రీమతి నెరోజు వెంకటరమణి, అసిస్టెంట్ ప్రొఫెసర్, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, కరీంనగర్, తెలంగాణ.

సిద్ధాంత గ్రంధాల సారమేది వడబొయ్యకున్నా
సిద్ధార్థుడు వదిలి వెళ్ళిన ఈ రాజ్యమ్మీది నెత్తుటి దారల్ని కడిగేందుకు
కవిత్వం నాకవసరమైన ఆయుధమైంది. (రక్త రేఖ : 1989, చివరి అట్ట)

అని అన్నాడు అలిశెట్టి ప్రభాకర్.

అలిశెట్టి ప్రభాకర్ సాహిత్య ప్రస్థానం తన పద్దెనిమిది సంవత్సరాల వయస్సులోనే ప్రారంభమైంది. జగిత్యాల లోని సాహితీ మిత్రదీప్తి అనే సాహితీ సంస్థతో సాహితీ లోకానికి కవిగా పరిచయం అయ్యాడు. ఆ తర్వాత వివిధ పత్రికలలో ప్రత్యేక సంచికలలో తరచు పాఠకులను పలక రించేవాడు. సమాజం లోని కుళ్ళును, ప్రజానీకానికి తెలియజెయ్యాలని వారిలో చైతన్యం తీసుకరావాలని నిరం తరం తపన పడేవాడు.

"సాహితీ మిత్ర దీప్తి" ఆహ్వానం మేరకు వచ్చే కవిత లను చూసి మెప్పుకోసం మాత్రమే రాస్తున్నారని విసుగు చెంది సమాజం కోసం, ప్రజల కష్ట నష్టాల గురించి కవిత్వం రాయాలనే ఉద్దేశ్యంతో "జగిత్యాల జైత్రయాత్ర" స్ఫూర్తితో చిన్న చిన్న పదాలతో కవితలను అల్లడం మొదలు పెట్టాడు.

అక్షర మక్షరం అనలమై మండుతున్నప్పుడు
సమీకరించి, సైన్యంలా రూపొందించిన కృషి ఫలితమే
ఈ కవితా చిత్రాలు
రక్త రేఖలతో నిర్మించిన దృశ్యాలే ఈ కవితా చిత్రాలు

(రక్తరేఖ : 1989, రెండవ ముద్రణ లోని ముందు మాట)

ప్రభాకర్ రూపొందించిన ఈ కవితా చిత్రాలను, ప్రద ర్శనా యోగ్యంగా తీర్చిదిద్ది వివిధ కళాశాలల్లో, విశ్వవిద్యాలయాల్లో ఇంకా పలుచోట్ల తన చిత్రాలను ప్రదర్శించాడు. కవిత్వాన్ని ప్రాణవాయువుగా మార్చి తన కవితా చిత్ర ప్రదర్శనలతో ఈ సమాజాన్ని అంగుళం మేరకైనా కదిలించగలనని నిరూపించాడు.

కవిత్వం, చిత్రలేఖనం, ఫోటోగ్రఫీ ఈ మూడు రంగాల్లో అసమాన ప్రతిభ కనబరిచిన సృజనశీలి అలిశెట్టి ప్రభాకర్. ఆయనది సిసలైన తెలంగాణ ఆత్మ. కల్లా కపటం లేని తత్వం, సమసమాజమే ఆశయం. ధనికులకు, పేదలకు మధ్య వర్గపోరుకు ఉపకరించే కవిత్వాన్ని ఆయన పదునైన చురకలో ఆవిష్కరించాడు.

ఆకలి

ఆకలి మండిపోతున్నప్పుడు
ఎదుట
ఎంత మనోహర దృశ్యమున్నా
దగ్ధమైపోవాల్సిందే

ఆకల్ని
నిగ్రహిస్తున్నా కొద్దీ
కడుపులో పేగుల్ని
కత్తిరిస్తున్న బాధే

ఆకలి
పూటకో దరిద్రున్ని వేపుకు తిని
అది ఉమ్మేసే తొక్కలే
అసంఖ్యాక అస్తి పంజరాలు"

అన్న ప్రభాకర్ కుటుంబం ఆకలితోనే అలమటించిం దని నేను నిష్కర్షగా ప్రకటిస్తున్నాను.

అసలు సిసలైన కవిత్వానికి చిరునామా అలిశెట్టి ప్రభాకర్. అట్టడుగు వర్గాల జీవితాలే ఆలంబనగా, సమాజంలోని అంతరాల దొంతరలను కూల్చేస్తేనే బడు

గుల జీవితాలు బాగుపడతాయనే నమ్మికతో చివరి వరకు అక్షర యుద్ధం చేసిన, కవితా ప్రభాకరుడు అలిశెట్టి ప్రభాకర్.

ఎర్ర పావురాలు, మంటల జెండాలు, చురకలు, సంక్షోభ గీతం, రక్తరేఖ, సిటీలైఫ్, మరణం నా చివరి చిరునామా కాదు ఇవీ ప్రభాకర్ రచనలు. చిన్న వయస్సు లోనే క్షయతో మరణించాడు. అది తెలుగు సాహిత్యం చేసుకున్న దురదృష్టం.

చల్లని వెన్నెలా, పుష్పాల సౌరభాలు, మంచు చల్ల దనము, మలయమారుతాలు, ఆహ్లాదము, సెలయేర్ల గలగలలు ఇలా మొదలైన వర్ణనలు పూర్వ రచనల్లో కనిపిస్తాయి. కానీ కష్టజీవుల్లో చైతన్యాన్ని తీసుకరావడం కొరకే జగిత్యాల జైత్రయాత్ర స్ఫూర్తితో ముందుకు సాగిన మనీషి అలిశెట్టి ప్రభాకర్. అవార్డుల కోసమో, ఇస్త్రీ నలక్కుండా విప్లవ సందేశాన్ని అందించే మేధావుల కోసమో, కవిత్వంలోనూ, జీవితంలోనూ ద్వంద్వ ప్రమాణా లను అవలంబించే దౌర్భాగ్యుల కోసమో కాకుండా సామాన్య బడుగుల కోసమే నా కవిత్వం అని

"మరణం నా చివరి చరణం కాదు
మౌనం నా చితా భస్మం కాదు
నిర్విరామంగా నిత్యనూతనంగా
కాలం అంచున చిగురించే
నెత్తుటి ఊహను నేను."

అని ప్రకటించుకుని అసలు సిసలైన కవిత్వానికి చిరు నామాగా నిలిచిన విప్లవకవి అలిశెట్టి. సమాజంలోని అంతరాల దొంతరలను కూల్చేస్తేనే బడుగుల జీవితాలు బాగుపడతాయనే నమ్మకంతో తన ఖడ్గాన్ని సమాజం పైకి సంధించాడు.

నిజాం నిరంకుశ పాలన నుండి తెలంగాణ అప్పు డప్పుడే స్వేచ్ఛా వాయువులు పీల్చుకుంటున్న కాలం అంటే 20వ శతాబ్దం మధ్య భాగం 1954 జనవరి 12వ తేదీన కరీంనగర్ జిల్లాలోని జగిత్యాల పట్టణంలో అంగడి బజారు ప్రాంతంలో జీవనం సాగిస్తున్న ఓ పేద దంపతుల ప్రేమ చిహ్నానికి ప్రభాకర్ జన్మించాడు. ఈ దంపతులకు ఏడుగురు కూతుళ్ళు, ఇద్దరు కుమారులు. ఈ తొమ్మిది మంది సంతానంలో ప్రభాకర్ ఐదవ వాడు. చినరాజం పరిశ్రమల శాఖలో పనిచేస్తూ అకస్మాత్తుగా చనిపోయాడు. చినరాజం పోయేనాటికి ప్రభాకర్‌కు పదకొండు సంవత్స రాలు. ఇద్దరి కుమారులలో ప్రభాకర్ పెద్దవాడు కావడం వల్ల కుటుంబ భారమంతా తనపై పడింది.

అలిశెట్టి ప్రభాకర్ తన జీవితంలో ఆదర్శాలకు, పోకడలకు తావివ్వలేదు. కానీ తానే ఆచరించి చూపిం చాడు. కట్నకానుకల జోలికి పోకుండా 1978 జగిత్యాల మండలం లోని కిష్టంపేట గ్రామానికి చెందిన ఓ పేదింటి అమ్మాయి అయిన భాగ్యను తన సోదరి వివాహంతో పాటే వివాహమాడాడు. అక్షర జ్ఞానం లేని అమాయకు రాలు భాగ్య. వీరిద్దరి ప్రేమకు చిహ్నంగా ఇద్దరు మగ సంతానం : వారే సంగ్రామ్, సాకేత్‌లు, విప్లవానికి గుర్తుగా తన పెద్ద కుమారునికి పోరు, యుద్ధం అనే అర్థం వచ్చే సంగ్రామ్ అని పేరు పెట్టాడు. భాగ్యతో పంచుకున్న జీవి తాన్ని తన " మరణం నా చివరి చరణం కాదు" లో భాగ్యలక్ష్మి శీర్షికతో కవితను రాసుకున్నాడు.

"నాకు బెర్నాడ్ షాలు, షేక్ స్పియర్ లూ తెలియదు
తనకు గుడిపాటి వెంకటా చలం, గురజాడా తెలి యదు
ఇద్దరం ఉత్త పిచ్చివాళ్ళం / కాని.....
అడుగంటిన కిరసనాయిలు స్టవ్ తో / అన్నం ఎట్లా ఉడికించాలో తనకు తెలుసు
దగ్గు తెరల నెత్తుటి రెపరెపల ఊపిరితిత్తుల్లో
కవిత్వమెట్లా రాజేయాలో నాకు తెలుసు
ఇద్దరు కలిసి ఒక కలగా / కలగాపులగంగా కలిసి పోయిన రోజుల్లో
తులతూగే ఐశ్వర్యమో / తులం బంగారమో కావాలని
ఏనాడూ ప్రాధేయ పడలేదు."
ఎన్నెన్ని / గాయ పడిన ఉదయాల్ని
సంకలనంగా కూర్చినా / ఎవరెవరి

బాధామయ గాథల్ని / ఈ కలంతో
జాలు వార్చినా / మిత్రుడా
నిరంతరం / సూర్యుడే నా ముఖ చిత్రం"

అని అనడంతో సమాజంలో ఉన్న వర్గకసితో విప్లవానికీ, చైతన్యానికీ ప్రతీక అయిన సూర్యుడే తన ముఖ చిత్రమని తిరుగుబాటు తత్వాన్ని చూస్తే సమాజాన్ని చైతన్య పరచడం కనిపిస్తుంది.

రోజు కొన్ని వాక్యాలైనా రాయనిదే ఈ రోజు భోజనం చేసే అధికారం తనకు లేదని ప్రేమ్‌చంద్ గారన్నట్లు ప్రభాకర్ కూడా నిత్య విద్యార్థిగా మారి ప్రతి రోజు కవిత్వాన్ని రాసేవాడు.

జగిత్యాల పిలుస్తోంది
జైత్రయాత్ర నన్ను కలవరపెడుతుంది.

అన్న అలిశెట్టి ప్రభాకర్ అమరుడు, అతని సాహిత్యం సమకాలీన సామజిక, రాజకీయ, ఆర్థిక సమస్యలను ఎప్పటికీ ప్రశ్నిస్తూనే ఉంటుంది. నిలదీస్తూనే ఉంటుంది.

⌘⌘⌘

BHAVAVEENA
Vol. 17, Issue. 8, August 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

జగదభిరాముడు శ్రీరాముడు

- యం. రామనాథం నాయుడు

"శ్రీరాఘవం, దశరథాత్మజ, మప్రమేయం
సీతాపతిం, రఘుకులాన్వయ రత్నదీపమ్
ఆజానుబాహు, మరవింద దళాయతాక్షం
రామం నిశాచర వినాశకరం, నమామి"

భగవంతుడు అపార కరుణాసముద్రుడు. మానవులను వారి భవబంధాల నుంచి విముక్తి చేయడానికి రకరకాల మార్గాలను చూపి, ఎన్నో దివ్యధామాలను సృష్టించాడు.

ప్రాచీనులు "అయోధ్యా మధురామాయా కాశీ కాంచీ అవంతికాపురీ ద్వారవతీచైవసప్తై తే మోక్షదాయకాః"

అని అన్నారు. మోక్షదాయకమైన ఏడు నగరాల్లో అయోధ్య మొదటిది. శత్రువులు చొరబడడానికి వీలులేని సురక్షిత స్థానం అయోధ్యానగరం. ఇది మానవోత్తముడు, మర్యాదా పురుషోత్తముడూ అయిన శ్రీరాముని జన్మ భూమి, సరయూ నదీతీరంలో వెలసిన "అయోధ్య" దర్శనమాత్రంగా జన్మను చరితార్థం చేసే మోక్షదామం.

వాల్మీకి మహర్షి రచించిన సంస్కృత రామాయణం ఆది కావ్యంగా పేరు గాంచింది. జానపదుల్లో అప్పటికే ప్రచారంలో వున్న రామాయణ కథను వాల్మీకి మహర్షి ఒక మహాకావ్యంగా తీర్చిదిద్ది వుండవచ్చు. అలాగే రామాయణ కథను భానుడు, ఉత్తర రామచరితను భవభూతి గొప్ప నాటకాలుగా రచించారు. తమిళభాషలో కంబ రామాయణం స్వతంత్ర కావ్యంగా భాసిల్లింది. కన్నడ భాషలో పంపరామాయణం, తొరవె రామాయణం వంటి ప్రాచీన కావ్యాలే కాకుండా కువెంపు రామాయణ దర్శనం, వీరప్పమొయిలీ రామాయణ మహాన్వేషణం వంటి ఆధునిక మహాకావ్యాలు వెలువడ్డాయి. తెలుగులో అయితే ఏ భాషలోనూ లేనంతగా రామాయణ సాహిత్యం వెలువడింది.

రంగరాథ, భాస్కర, మొల్ల రామాయణం వంటి ప్రాచీన కావ్యాలే కాకుండా విశ్వనాథ వారి రామాయణ కల్పవృక్షం వంటి ఆధునిక రామాయణం కూడా వెలువడింది. జానపద రామాయణాలు వందల సంఖ్యలో వచ్చాయి. ఇలా సాహిత్య ప్రక్రియలన్నింటిలోనూ 'రామాయణ గాథ' పలు విధాలుగా ప్రఖ్యాతి గాంచింది.

రామాయణం వేదసమ్మతమైనది. దశావతారాలలో రామావతారం ఏడవది. మోక్షదాయకమైన సప్తనగరాల్లోని 'అయోధ్య' రాముని జన్మస్థలం. లంకలో యుద్ధం జరిగిన రోజులు ఏడు. శ్రీనివాసుడు వెలసింది సప్తగిరుల్లో. ఇలా సప్తసంఖ్యకు ఒక విశేషం వుంది. ఆంధ్రసారస్వత ప్రపంచమంతా రామమయమే. భక్తులు "అంతా రామమయం, జగమంతా రామమయం" అని పాటలు పాడుకుంటుంటారు. రాముడు, సీత పేర్లతో గ్రామనామాలు, కొండల పేర్లు, ప్రజల పేర్లు అనేకం కన్పిస్తాయి. రామకథ జానపదులకు పెన్నిధి. జానపదులు సీతారాములను స్వయంగా చూసినట్లు చెపుతారు. ఆ దంపతులు విహరించిన కొండలు, గుట్టలు, అటవీ ప్రాంతాలు, నివసించిన పర్ణశాలలు, గోదావరీ తటాలు మొదలైన విషయాలనెన్నింటినో హృదయాలకు హత్తుకునేటట్టు నూటిగా, తోచిన విధంగా కథలు కథలుగా పూసగుచ్చి నట్లు చెపుతారు.

జనపదాలలో పెద్దలు కూర్చునే సమయంలోనూ, లేవబోయే సమయంలోనూ రామా! కృష్ణా! గోవింద! అంటూ వారిని తలచుకుంటుంటారు. తల్లిదండ్రులయితే చిన్నపిల్లలచేత రాం! రాం! సీతారం! అని వ్యాయామం చేయిస్తారు. "ఎంత మంచివాడివయ్య రామయ్యా తండ్రి, నువ్వు ఎంత మంచివాడివయ్య

రామయ్య తండ్రి" అని, "జగదభి రాముడు శ్రీరాముడు" అంటూనే "దిక్కులు చూడకు రామయ్య పక్కనే వున్నది సీతమ్మ" అని రకరకాలుగా పాటలు పాడుకుంటుంటారు. పాఠశాలల్లో "రాముడు మంచి బాలుడు" అని, రాముడు చంద్రుని వంటి అందగాడని అందుకే అయన శ్రీరామ చంద్రుదయ్యాడని చెపుతుంటారు. కొందరు విషయ మంతా విని మళ్ళీ అమాయకంగా ప్రశ్నించినప్పుడు "రాత్రంతా రామాయణం విని, తెల్లారి సీతకు రాముడే కావలెన"ని అడిగెనట నీబోటివాడు అని అంటుంటారు. అలాగే "చూచిరమ్మంటే కాల్చుకు వచ్చే రకం" అని హనుమంతుడు లంకను దహనం చేసిన విషయాన్ని, సీతాపతి నీకు చిప్పే గతి అని రాముని వనవాసాన్ని; ఎవరైనా చిన్న సహాయం చేస్తే రామసేతువు కట్టే సమయంలో ఉడుత చేసిన సహాయాన్ని గుర్తుకు తెచ్చుకుని ఉడుతాభక్తితో పోల్చడం, ఎక్కువగా మాట్లాడు తుంటే నిలపరా నీ రామాయణం అని దండించడం వంటివి ఎన్నో జరుగుతుంటాయి. రామాయణ గాథను క్లుప్తంగా 'కట్టె, కొట్టె, తెచ్చె' అని అంటారు. కట్టె అంటే శ్రీరాముడు లంకా నగరానికి సముద్రమార్గాన వారధి కట్టెనని, కొట్టె అంటే రావణుని వధించెనని, తెచ్చె అంటే సీతాదేవిని తీసుకువచ్చాడని చెపుతారు. జనపదాలలో రామాయణ గాథ ప్రతి ఒక్కరి నరనరాన జీర్ణించుకు పోయింది.

వేమన శ్రీరాముని మంచితనం గురించి, దుర్యోధనుని చెడ్డతనం గురించి కింది పద్యంలో చక్కగా వెలి బుచ్చాడు.

"రాముడొకడు పుట్టి రవికుల మీడేర్చె
కురుపతి జనియించి కులము జెఱిచె
ఇలను పుణ్యపాప మీలాగు గాదోకో
విశ్వదాభిరామ వినురవేమ"

అని రామాయణ మహాభారతాల గురించి ఒక్కొక్క వాక్యంలో పుణ్యపాపాలను విశదీకరించాడు.

విశ్వామిత్రుడు రాక్షస సంహారంకోసం చిన్నతనంలోనే రామలక్ష్మణులను అడవికి పిలుచుకుని పోయి విలువిద్య నేర్పించాడు. అక్కడ మహర్షులను హింసిస్తున్న మారీచ, సుబాహు, తాటకి వంటి రాక్షసులను రామలక్ష్మణులచేత సంహరింపజేశాడు. ఇక్కడ అరణ్య సంస్కృతి లేకుండా సంస్కృతే లేదనే విషయాన్ని రామాయణం నిరూపిస్తుంది. అరణ్యవాసం మానవ జీవన వికాసంలో అనివార్యమైన భాగం. ప్రకృతి వైచిత్రిని వర్ణించేటప్పుడు కూడా కవి మానవునితో ప్రకృతి సంబంధాన్ని దృష్టిలో వుంచుకునే రచించడం విశేషం.

భూభారాన్ని మోసే ఫణీంద్రుడు కూడా మోయ లేనంతగా రామాయణభారం పెరిగిపోయిందని, అందు వల్లనే నేను మహాభారతాన్ని రాస్తున్నారని కన్నడ మహాకవి కుమార వ్యాసుడు చెప్పుకున్నాడు. అయితే ఇదే విష యాన్ని విశ్వనాథ సత్యనారాయణ గారిని అడిగితే ఆయన

"మఱల నిదేల రామాయణంబన్నచో
నీ ప్రపంచకమెల్ల నెల్ల వెళలఁ
దినుచున్నయన్నమే తినుచున్నదిన్నాళ్ళు
తన రుచి బ్రతుకులు తనవిగాన
చేసిన సంసారమే సేయుచున్నది
తనదైన యనుభూతి తనవిగాన
తలచిన రామునే తలచెద నేనును
నా భక్తి రచనలు నావిగాన"

అని తన మనసులోని వాస్తవాంశాలను వెలిబుచ్చాడు. విశ్వనాథ గారు రచించిన ఈ మహాకావ్యానికే (శ్రీరామా యణ మహాకల్పవృక్షం) తెలుగులో మొట్టమొదటి జ్ఞానపీఠ అవార్డు లభించింది.

ఒక మహాకావ్యాన్ని రాసేటప్పుడు కవి ఏ విషయాన్న యినా అలవోకగా చదువరులకు అందజేసే శక్తిని కలిగి వుండాలి. మహాకవికి అందుబాటులో లేనిదంటూ ఏదీ వుండదు. అతనికి పట్టిందల్లా బంగారంగా మార్చే 'రస విద్య' తెలిసి వుండాలి. పాత్ర చిత్రణ విషయంలో ఒక్కొ కవికి ఒక్కొక్క దృష్టి ఉంటుంది.

రామాయణకర్తలు ఒక్కొక్క పాత్రకూ స్పష్టమైన రూపాన్ని కల్పించారు. వాల్మీకి, రంగనాథుడు, కంబర్, జైన బౌద్ధ రామాయణాలను రచించిన ప్రాకృత రచయితలు, తెలుగు, కన్నడ కవులు రామయణంలోని పాత్రలను వారి అభిరుచికి, ఆసక్తికి తగినట్టుగా చిత్రించారు.

దశరథ మహారాజు 'పుత్రకామేష్టి' అనే యజ్ఞం చేసి, యజ్ఞపురుషుడిచ్చిన పాయసాన్ని తన ముగ్గురు రాణులైన కౌసల్య, సుమిత్ర, కైకేయిలకు ఇచ్చాడు. దాని ఫలితగా కౌసల్యకు శ్రీరాముడు, కైకను భరతుడు, సుమిత్రకు లక్ష్మణ, శత్రుఘ్నులు జన్మించారు.

రామలక్ష్మణులు విశ్వామిత్రుడి వెంట అడవులకెళ్ళి విలువిద్య నేర్చి, రాక్షసులను సంహరించి తర్వాత మిథిలా నగరానికెళ్ళి జనక మహారాజును దర్శించి, అక్కడి శివధనుస్సును ఎత్తి సీతాదేవిని శ్రీరాముడు వరించెను. దశరథ మహారాజు శ్రీరామపట్టాభిషేకం చేయాలని నిశ్చయించుకున్నప్పుడు మంధర ప్రోత్సాహంతో కైక నా బిడ్డకు పట్టాభిషేకం చేయమని భర్తను కోరెను. దాంతో ఆడినమాట తప్పలేక, ముద్దులబిడ్డ రామునికామాట చెప్పలేక దశరథుడు సతమతమవుతున్న సమయంలో శ్రీరాముడు తండ్రిమాటకు కట్టుబడి అరణ్యవాసం వెళ్ళాడు.

సీతారాముల పాత్రలకు అనుబంధంగా లక్ష్మణుడు లేకపోతే అసలు రామయణమే లేదు. అందుకే సీతా రామలక్ష్మణులనే పదబంధం ఏర్పడింది. ఆధునిక మహా కావ్యమైన శ్రీరామాయణ మహాన్వేషణలో కవి లక్ష్మణుని పాత్రను అతిశయంగా చిత్రించడం జరిగింది.

వాల్మీకి రామాయణంలో సీత అయోనిజ, భూమిజ, క్షేమేంద్రుని దశావతార చరిత్రలో కమంలో సీత ఉద్భవించింది. గుణభద్రుని ఉత్తర, అద్భుత, స్వయం బాహు రామాయణాలలో మండోదరి కూతురు సీత. బ్రహ్మ వైవర్తన పురాణంలో సీత వేదవతిగా లంకలో జన్మిస్తుంది.

టిబెటన్ రామాయణంలో రావణుడు సీతను సముద్రంలోకి విసిరేస్తాడు. మరికొన్ని రామాయణాలు 'సీతాయణం' అని నిరూపించాయి.

రామాయణంలో వాల్మీకి మహర్షి శ్రీరాముడి సత్య సంధతను విశేషంగా వర్ణించాడు. శ్రీరామచంద్రుడు జగదభిరాముడు ఎలా అయ్యాడంటే, అలాగే జగజ్జేత ఎలా కాగలిగాడంటే అది ఆయనకు పట్టుబడిన కోదండ విద్యవల్ల కాదు. ఆయన దగ్గరున్న తిరుగులేని రామబాణం వల్ల కాదు. దశకంఠుడితో సహా సమస్త రాక్షసవంశాన్ని సమూలంగా నిర్మూలించి, ధర్మరక్షణ కావించడం వల్ల కాదు. అశ్వమేదాధి క్రతువుల్ని నిర్వహించడం వల్ల అసలే కాదు. కేవలం సత్యవాక్పరిపాలకుడు కావడంవల్ల మాత్రమే శ్రీరాముడు 'విశ్వవిజేత' కాగలిగాడని వాల్మీకి మహర్షి తేల్చి చెప్పారు.

పోతనామాత్యుడు భాగవత రచన చేస్తూ

"పలికెడిది భాగవతమట
పలికించెడువాడు రామభద్రుండటనే
బలికిన భవహర మగునట
పలికెద వేఱొండుగాథ పలుకగనేలా"

అంటూ నేను నామమాత్రమని అంతా శ్రీరామ చంద్రుని దయే అని తెలిపాడు.

మొల్ల రామయణంలో కవయిత్రి శ్రీరామచంద్రుని మనోహరరూపాన్ని తత్సమ పదాలతో రూపు కట్టిస్తుంది.

"నీలమేఘచ్ఛాయ బోలు దేహమువాడు
దవళాబ్జ పత్రి నేత్రములవాడు
కంబు సన్నిభమైన కంఠంబు గలవాడు
బాగైనయట్టి గుల్ఫములవాడు"

నీల మేఘం వంటి శరీరం, తెల్లని కలువరేకుల వంటి కన్నులు, శంఖం వంటి కంఠం, పొడవైన చేతులు, పాదములందు పద్మరేఖలు, అందమైన వక్షస్థలం కల వాడని శ్రీరాముని అందచందాలను మొల్లం వర్ణించింది.

శ్రీరాముడు సీతను ఎడచాసినప్పుడు అతని ఆవేదనను గోనబుద్ధారెడ్డి తన రంగనాథ రామాయణంలో ఇలా చిత్రించాడు.

"ఇది మహారణ్యమై యిప్పుడు తోచె
నిది పర్ణశాలయై యిప్పుడు తోచె
నిది నాకు దపమని యిప్పుడు తోచె
నిది నాకు దుఃఖమని యిప్పుడు తోచె"

అని సహజగుణాన్ని చెప్పుకొచ్చాడు.

అలాగే లంకలోవున్న సీతాదేవికి శ్రీరాముని గురించి ఆందోళన వుంది. సీతజాడ తెలుసుకుని రావడానికెళ్ళిన హనుమంతుడు సీతాదేవి బెంగను పోగొట్టడానికి నేను శ్రీరాముడి దగ్గరనుండి వచ్చానని, రామదూతనని చెప్పాలి. ఈ విషయాన్ని మొల్ల ఎంతో పాత్ర ఔచిత్యంతో...

"ఉన్నాడు లెస్స రాఘవు
డున్నాడిదె కవుల గూడియురుగతిరానై
యున్నాడు నిన్ను గొనిపో
నున్నాడిని నిజము నమ్ముమూర్వీ తనయా!"

అంటూ తెలియజేసింది. ఈ పద్యం మొల్ల ప్రతిభకు గీటురాయి. క్రియతో ప్రారంభించి "ఉన్నాడు లెస్స..." అని అనడం కవితా నైపుణ్యం. అలాగే సీతను గురించి శ్రీరామునికి చెప్పేటప్పుడు "కంటిన్ జానకీఁబూర్ణచంద్ర వదనన్ గల్వాణి నా లంకలో" అని హనుమంతునిచేత చెప్పించడం ఎంతో ఔచిత్యంగా వుంది.

సీతారామలక్ష్మణుల తర్వాత రామాయణంలో అత్యంత ముఖ్యమైన వ్యక్తిత్వం గల పాత్ర హనుమంతుడిది. ఈ కపివీరుని మాటలు వింటే సాక్షాత్తు శ్రీరామచంద్రుడే భావతన్మయుడై తన్ను తాను మరచిపోతాడు. ఆయన సౌమిత్రితో "వింటివా! అతని మాట తీరు. ఏమి వినయము చూడు. అతని గాంభీర్యం, గుణస్వభావాలు, ఏమి అద్భుతం. మాటలాడెడి మర్మమును సంపూర్ణముగ ఎరిగిన వాడితడు" అంటూ ఎంతో అతిశయంగా పొగిడాడు.

హనుమంతుడి అసలు భక్తిని, శక్తిని, అమోఘ సేవానిరతిని, ఆధ్యాత్మిక జ్ఞానాన్ని సుందరకాండలో చూసినంతగా మరెక్కడా చూడలేం! అలాగే తన వంశాన్ని కాపాడినందుకు శ్రీరాముడు తన ఆలింగనాన్ని అందించి హనుమంతుని హృదయంలో శాశ్వతంగా నిలిచాడు.

కంచర్ల గోపన్న భద్రాచలం శ్రీరాముడుని దర్శించి ముగ్ధుడై, అతనికి దాసుడయ్యాడు. తర్వాత శ్రీరామునిపై భక్తిని మెండుగా చేసుకుని, నిత్యం భజనలు, పూజలు చేయిస్తూ, స్వామివారికి విశాలమైన గుడి కట్టించి, జాతి, వర్ణ, లింగ, వయోభేదం లేకుండా స్వామివారిని అందరూ దర్శించి, పూజించేటట్టు చేశాడు. తర్వాత శ్రీరామునిపై భక్తిరస కీర్తనలు రచించి, అతనికి దాసుడయ్యాడు. అప్పటినుండి ఆయన 'రామదాసు'గా కీర్తి పొందాడు.

రామదాసుకు రామయ్యపై ఎనలేని విశ్వాసం. అతనే సర్వాంతర్యామి అని నమ్మాడు. మన కష్టాలన్నీ తీర్చి, సుఖశాంతులతో జీవింపజేసే దయామయుడు. లోకాభిరాముడు. దాసులపాలిట దైవం.

"తక్కువేమి మనకూ రాముండొక్కడుండు వరకూ" అని శ్రీరాముడిని పూర్తిగా నమ్మిన దాసు. అతను తారకమంత్ర ఉపదేశంతో ఆశ్చర్యచకితుడయ్యాడు. తర్వాత

"తారకమంత్రం కోరిన దొరికెను - ధన్యుడనైతిని ఓరన్నా!" అంటూనే
"ఓ రామ నీనామమేమి రుచిరా!
శ్రీరామ నీనామమేమి రుచిరా!"

అంటూ శ్రీరాముడు, శ్రీరామకథ అత్యంత మధుర మైందని తెలియజేశాడు.

"గౌతముని భార్య పాలిట కామధేనువితడు
ఘాతల కౌశికు పాలి కల్పవృక్షము
సీతాదేవి పాలిటి చింతామణి ఇతడు
ఈతడు దాసులపాలిట ఇహపర దైవము"

అని శ్రీరాముని గొప్పతనాన్ని చిత్రించాడు. కామధేనువు, కల్పవృక్షము, చింతామణి భక్తుల కోర్కెలు తీర్చే కల్పవల్లులు. వీటన్నింటికి ప్రతిబింబం శ్రీరాముడు.

భగవంతుడు భక్తుల భక్తిని అప్పుడప్పుడు పరీక్షిస్తుంటాడు. అలాగే శ్రీరాముడు రామదాసును పరీక్షిస్తాడు. అప్పుడు "ఏ తీరుగ నను దయజూచెదవో ఇన వంశోత్తమ రామా!" అంటూ వాపోతాడు. మళ్ళీ 'పలుకే బంగార మాయెనా కోదండపాణి పలుకే బంగారమాయెనా! పలుకే బంగారమాయే పిలిచినా పలుకదాయె" అని కలలో నీ నామస్మరణ మరువచక్కని తండ్రి అంటూ వేడుకుంటాడు.

ఇంకా

"నను బ్రువుమని చెప్పవే సీతమ్మతల్లి
నను బ్రోవుమని చెప్పు నారీ శిరోమణి
జనకుని కూతుర జనని జానకమ్మ"

అని సీతాదేవికి మొరపెట్టుకుంటాడు రామదాసు. చివరకు రామయ్య తండ్రి రామదాసును కరుణిస్తాడు.

అన్నమాచార్యులవారు శ్రీరాముని గురించి శ్రీరామ కథ గురించి తన కీర్తనల్లో పొందుపరచాడు.

"ఇతడే పరబ్రహ్మ మిదియె రామకథ
శతకోటి విస్తరము సర్వపుణ్యఫలము"
"ధరలో రాముడు పెట్టె ధరణిజ పెండ్లాడె
అరణ్యవాసులకెల్లనభయమిచ్చె"

దయానముద్రుడు, జగదేన సుందరుడు, ధర్మ రక్షకుడు అయిన శ్రీరామచంద్రుని త్యాగయ్య తన సర్వస్వంగా భావించాడు. అందుకే ఈమేను కలిగినందుకు సీతారామనామమే పలుకవలెను అని భావించాడు.

"ఊరకయే గల్గునా రాముని భక్తి
సారెకును సంసారమునజొచ్చి
సారమని యెంచువారి మనసున"

అని సంసారమనే వ్యామోహం గలవారికి రామభక్తి సాధ్యం కాదన్నాడు త్యాగయ్య.

"రామభక్తి సామ్రాజ్యమే మానవులకబ్బెనో, ఆ మానవుల సందర్శన మత్యంత బ్రహ్మానందమే"

అంటూ పరవశించిపోయాడు.

త్యాగయ్య తన జీవితకాలంలో చాలా భాగం శ్రీరామ మంత్రం జపానికి వినియోగించినాడనే మాట సత్యం. ఆయన జీవితం శ్రీరామమయమైంది. శ్రీరాముడు త్యాగయ్యకు పరమాత్మగా ప్రత్యక్షమయ్యాడు. "పర మాత్ముడు వెలిగే ముచ్చట" వంటి కీర్తనల్లో ఈ విషయం అర్థమవుతుంది. "రామా నీపై తనకు ప్రేమపోదు" అని త్యాగయ్య తన మనోగతిని తెలిపాడు. ఆయన లక్ష్యం, నమ్మకం అంతా "కోదండపాణి రూపముతో వెలిసిన వాడేరా దైవము" అని తెలియజేశాడు.

"నీ దయచే రామ - నిత్యానందుడనైతి
నాద బ్రహ్మానంద రసాకృతిగల - నీ దయచే
పరమృధుభాష - సుస్వరమయభూష
వరత్యాగరాజ వాక్కేలావృత"

అని ధ్యానించిన అఖండత, అమేయత, అనిర్వచనీయత - ఈ నాదప్రపంచమందే త్యాగయ్య అనుభవానికి వచ్చింది.

రామాయణంలోని 'రామగాథ' మానవజాతికే ఆదర్శవంతమైంది. కుటుంబ గౌరవాన్ని కాపాడుకోవడానికి శ్రీరాముడు వనవాసం చేశాడు. అన్నను లక్ష్మణుడు అనుసరించాడు. భర్తకు తోడుగా సీతమ్మ నిలిచింది. తనవల్ల కలిగిన కుటుంబ కలహాన్ని భరతుడు పాదుకా పట్టాభిషేకంతో సమర్ధవంతంగా అణచాడు.

శ్రీరాముడు ఆనాడు వర్ణవ్యవస్థను పట్టించుకోలేదు. గుహుడిని పరమ మిత్రుడిగాను, శబరిని కన్నతల్లిగాను ఆదరించాడు. విభీషణుని అత్యంత ఆత్మీయుడిగా చేరదీశాడు. యుద్ధంలో మరణించిన రావణుని పల్లెత్తుమాట అనలేదు. "మరణాంతాని వైరాణి" మరణంతోనే సమస్త విరోధాలు సమసిపోతాయనే నగ్నసత్యాన్ని శ్రీరామ చంద్రుడు తెలియజేశాడు.

శ్రీరాముడు అవతార పురుషుడుగా వ్యవహరించకుండా ఒక సామాన్య మానవుడిగా ఎన్నో కష్టాల్ని, దుఃఖాల్ని అనుభవించాడు. అందుకే మనకు ఆదర్శ

పురుషుడయ్యాడు. ఆయన పితృవాక్య పాలకుడు. ఏకపత్నీ వ్రతుడు. ఆడినమాట తప్పనివాడు. సకల గునాభిరాముడు.

రామయణంలో మందర, శూర్పణఖల కోరికలు చిన్నవే. అయితే వాటి పరిణామం ఎంత తీవ్రత అనేది చెప్పలేం. ఈనాటి సమాజంలో కూడా మందర, శూర్పణఖల స్వభావం కలిగిన వ్యక్తులు మనమధ్యనే ఎంతోమంది ఉన్నారు. మనం రామాయణం ద్వారా పరకాంతా వ్యామోహం తగదని తెలుసుకోవచ్చు. అలాంటి వ్యామోహాలు కలిగివుంటే సర్వస్వం కోల్పోవలసి వస్తుంది. "లక్ష్మి యేలినట్టి లంకాపురం" ఏ విధంగా నాశనం అయింది. మనకు రామాయణంలో గోచరిస్తుంది.

మందాకిని నదీతీరాన సీతాదేవి నిద్రించుచుండగా కాకాసురుడు కాకిగా మారి సీతపట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. దానిని గమనించిన శ్రీరాముడు కోపించి తన బాణాన్ని కాకాసురునిపై ప్రయోగించాడు. కాకాసురుడు ఆ బాధను తట్టుకోలేక శ్రీరాముని పాదాలపై పడి శరణుకోరాడు. శరణుకోరిన వారిని క్షమించే గుణం కలిగిన కరుణామయుడు శ్రీరాముడు. అతనిని కరుణించాడు. అయితే రామబాణానికి తిరుగులేదు. కాబట్టి అతని శరీరంలోని ఏదో ఒక అంగాన్ని సమర్పించాలి. అతను ఒక కంటిని రామబాణానికి సమర్పించాడు. వాడినే ఒంటి కన్ను రాక్షసుడు అని అంటారు.

రామాయణంలో ఇలాంటి ఘట్టాలు కోకొల్లలు. ప్రతి ఘట్టమూ రసభరితంగానే ఉంటుంది. అయితే శ్రీరాముని అద్భుతచరితం సుందరకాండలో రసవత్తరంగా, రసార్ణవంగా, రమణీయంగా సాగుతుంది. కవులందరూ శ్రీరామచంద్రుడిని మానవమాత్రుడైన దైవాంశ సంభూతుడు గాను, ధర్మమూర్తి గాను, ఏకపత్నీవ్రతుడు గాను, తల్లిదండ్రుల ఆజ్ఞను మీరని వాడుగాను చిత్రీకరించారు.

ఏ రాజ్యమైనా చల్లగా వుందంటే, సకాలంలో వర్షాలు కురిసి పాడిపంటలతో సస్యశ్యామలంగా తలతూగుతుందంటే, ప్రజలు ఎలాంటి కష్టాలకు లోనుకాకుండా వున్నారంటే అటువంటి రాజ్యాన్ని 'రామరాజ్యం' అని అంటారు. రామయ్యను తండ్రిగాను, సీతమ్మను తల్లి గాను భావిస్తారు.

భగవంతుడు "దుష్టశిక్షణ, శిష్టరక్షణ" కోసం రామావతారం ఎత్తి ఎంతోమంది దుష్టులను శిక్షించి, శిష్టులను రక్షించి, అపనిందలను, లోకనిందలను రూపుమాపి రాజ్యాన్ని సుభిక్షం చేశాడు. శ్రీరామునితో యమధర్మరాజు మీరు పదకొండువేల సంవత్సరాలు రాజ్యాన్ని పరిపాలించారు. రాజ్యం చల్లగా ఉంది. ఇక మీరు మీ అవతారాన్ని చాలించమని కోరాడు. అతని కోరిక మేరకు శ్రీరాముడు సరయూ నదిలో దిగి తన అవతారాన్ని చాలించాడు.

ఈ విధంగా రామాయణగాథ ప్రపంచంలోని అనేక భాషల్లో, విభిన్న కథనాలతో వెలువడింది. రామాయణం ఒక ప్రవాహం. అది భారతదేశంలోనేకాక ఇతర దేశాలలోనూ జనహృదయ వీణారస తంత్రులను మీటిన మహాకావ్యం. ఈ కావ్యం మహాకవులకు ఉత్సాహాన్ని, ఉత్తేజాన్ని, ఉల్లాసాన్ని ప్రసాదించింది.

ఆధార గ్రంధాలు :

1. తెలుగు సాహిత్య సమీక్ష - డా॥. జి. నాగయ్య.
2. రామాయణ కల్పవృక్షము - విశ్వనాథశాస్త్రి.
3. రామాయణ మహాన్వేషణము - వీరప్ప మొయిలీ.
4. అన్నమాచార్య సంకీర్తన సుధ - ఆచార్య ఎస్. రంగప్ప.
5. వేమన పద్యాలు

⌘

BHAVAVEENA
Vol. 17, Issue. 8, August 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

'కాలుష్యం కోరల్లో' కథలోని సమకాలీనత

– డా॥. చిలక అనిత, ఆంధ్రోపన్యాసకులు, ప్రభుత్వ మహిళా కళాశాల (స్వయంప్రతిపత్తి), గుంటూరు.

"రాయలసీమ చిన్నోణ్ణి
రాళ్ళమద్దె బతికేవాణ్ణి"

అంటూ సాహిత్య సేద్యం చేసే అక్షర కర్షకుడు శ్రీ పులికంటి కృష్ణారెడ్డి గారు. ఈయన 1931 జులై 30న చిత్తూరు జిల్లా జక్కదొన గ్రామంలో జన్మించారు. ఈయన ఇంటర్మీడియట్ చదువుతుండగానే రైల్వేలో బుకింగ్ క్లర్క్ ఉద్యోగం వచ్చింది. ఆ తరుణంలోనే కవిత్వం వైపు నాటక రంగం వైపు దృష్టి సారించి ఉద్యోగానికి రాజీనామా చేశారు. ఇక సాహిత్యసేవ విషయానికొస్తే భావస్ఫోరకమైన కథలు, గాథలు, గేయాలు, నవలలు, బుర్రకథలు, దళిత కథలు ఇలా ఎన్నో సాంఘిక ఇతివృత్తాలను సంస్కరణాభిలాషతో రచించారు. వాటిలో పులికంటి కృష్ణారెడ్డి కథలు, పులికంటి దళిత కథలు, గోయిందా! గోయిందా ఆటవెలదుల సంస్కృతి, అనువాద రచనలు పంజరదపక్షి, పాడిందే పాట, మోసుల ఎండిపోతున్నాయ్, పిచ్చిమనిషి, రాష్ట్ర వాణి, పరమగురు మొదలైనవి ఈయన సాహితీ సేద్యంలో పండిన పంటలు. స్వార్థం మనిషిని ఏవిధంగా మార్చుతుందో స్వార్థం కాలుష్య కోరల్లో చిక్కుకున్న మానవుడు ఏ విధంగా విలవిల్లాడుతున్నాడో ఈ కథలో చిన్న చిన్న సన్నివేశాల ద్వారా కళ్లముందు ఆవిష్కరింప చేశాడు.

మనిషి నాగరికుడయ్యేకొద్దీ స్వార్థపరుడై పోతున్నాడు. తను సమాజం వేరువేరు అన్నట్లుగా విడివడి పోతున్నాడు. సమాజ బాధ్యతల నుండి దూరంగా పోతున్నారు. సమస్య పరిష్కారానికి సామూహిక ప్రయత్నాలు కొనసాగటం లేదు. ఒకవేళ ఎవరైనా ప్రయత్నం చేస్తే వాడొక పనికిరానివాడుగా ముద్ర పడిపోతుంది అని చంద్రయ్య అనే ఒక ఫారెస్ట్ రేంజర్ ద్వారా మనకు తెలియజేశారు. ఈ 'కాలుష్య కోరల్లో' అనే కథ పులికంటి కథావాహిని నుండి తీసుకోబడింది.

చంద్రయ్య సమాజంపైన ఒక సదుద్దేశ్యాన్ని కలిగి ఉంటాడు. అటువంటి చంద్రయ్యకు అనుభవంలోకి వచ్చిన కొన్ని సన్నివేశాల్ని బట్టి కాలుష్యం ఎంతగా ప్రబలిపోయిందో అవగతమౌతోంది. చంద్రయ్య ట్రీ ప్లాంటేషన్‌లో పనిచేసే అమ్మాయిపై ఒక సదభిప్రాయానికి వచ్చి ఈ అమ్మాయికి ఎంతటి కష్టమో కష్టపడి పనిచేస్తోంది. ఇప్పటి పిల్లలు ఎండలో ఇంత కష్టపడడానికి ఒప్పుకోరు కదా అనుకుంటూండగా ప్రక్కన పనిచేసే వారు ఆ అమ్మాయిపై నిందమోపడంపై చంద్రయ్య ఆలోచించి ఆ అమ్మాయి దారి తప్పినదన్న అభిప్రాయానికొచ్చాడు. తనలో తాను ఆలోచించుకుంటూ తాగుతున్న నీటిలో కాలుష్యం అనుభవిస్తున్న వెలుతురులో కాలుష్యం, కొంటున్న నిత్యావసర వస్తువుల్లో కల్తీ, వింటున్న మాటల్లో కాలుష్యం, చూస్తున్న మనుషుల చూపుల్లో కాలుష్యం, చేస్తున్న పనుల్లో కాలుష్యం, రాస్తున్న సాహిత్యంలో కాలుష్యం, రాజకీయాల్లో చెప్పలేని అనలు సిసలైన కాలుష్యం. ఇవి ఏ గొప్ప గొప్ప విశ్వవిద్యాలయలు సహితం పనిగట్టుకుని పరిశోధనలు చేసినా నిగ్గు తేల్చలేవు. ఎందుకంటే అక్కడ కూడా కాలుష్యమే. సమాజంలో కాలుష్య కరాళ నృత్యానికి ఎవరికి వారే తమ వంతు కర్తవ్యంగా తాళం వేస్తున్నారు అనేది చంద్రయ్య అభిప్రాయం. ఇన్ని రకాలుగా సమాజంలో కాలుష్యం ఉండగా ఆ అమ్మాయి మాత్రం పవిత్రంగా ఎందుకు ఉండాలి? ఎందుకు ఉంటుంది అనేది ఒక చిన్న ఆలోచన. ఆ అమ్మాయికి ఒళ్ళొంచి కష్టపడే దానివి ఒళ్ళమ్ముకోవడం తప్ప కదా! "తప్పో ఒప్పో తెల్దుగాని మట్టిలో మట్టి అయేపోయె జల్మ మణుసులు తినేసి పోతే పోనీలే" ఆ మాట అనే సమయంలో మంచు కడిగిన ముత్యంలా స్వచ్ఛంగా అమాయకంగా ఉందామె ముఖం 'పరోపకారార్థం ఇదం శరీరమ్' అన్న సూక్తిని నరనరాల్లో జీర్ణించుకుపోయిందేమో అనుకున్నాడు.

చెట్టుకు స్త్రీకి మధ్య సంబంధం గురించి ఆలోచిం

చాడు. స్త్రీ మానవ సృష్టికోసం మరి చెట్టో సృష్టిలో కాలుష్య నివారణ కోసం. స్త్రీ వేదాంత భ్రమలో పడి మట్టిలో కలసిపోయే జన్మను మనుషులు తింటే తానేదో ఒరగబెట్టే భ్రమలో కాలుష్య వ్యాప్తికి తనకు తెలియకుండా తనే కారకురాలవుతుంది. క్షణిక సుఖంతో ఎంతోమందికి సుఖ రోగాలు అంటే అమ్మాయి కూడా సమాజంలో కాలుష్యా నికి కాలుష్య వ్యాప్తికి తనవంతు పాత్ర కృషి చేస్తుందన్న మాట. ఆ సంగతి తెలియక తాను ఇతరులకు సుఖపడ డానికి ఉపయోగపడుతున్నానన్న భ్రమలో ఉంది.

మరో ప్రక్క వేషం చూస్తే చదువుకున్న వాడిలా ఉన్నాడు. బస్సులో కూర్చొని తుపుక్కుమన్నాడు. చదువు కున్నవాడు కానీ ఏమీ ఎరుగునట్లు మూతి తుడుచుకున్న సందర్భంలో బస్సులో ఇది తప్పు కదా అని అడిగితే నీ మీద పడలేదు కదా! అని సమాధానం. మానవుడు నాగరికుడయ్యే కొద్దీ స్వార్థపరుడై పోతున్నాడు. తన స్వార్థం తనదిగా సమాజ బాధ్యతలనుండి వైదొలగిపోతున్నాడు. అదే బాధ్యత తీసుకున్నట్లయితే జన సంచారం తిరిగే చోట ఫ్యాక్టరీ నిర్మించడం ఆ కంపు పీల్చుకుని ప్రజలు అనారోగ్య పాలవ్వడం. ఆర్టీసీ బస్సులు శబ్దం చెయ్యడం కాలంచెల్లిన బస్సులు తిరుగుతూ అవి వదిలే పొగ, శబ్దం వల్ల వాతావరణ మరియు శబ్ద కాలుష్యాన్ని గురించి చంద్రయ్య తన అనుభవంలో చెప్పడం ఈ కథలో మనము గమనిస్తాము. ఒకవైపు కల్తీ సారా అది తాగిన వారంతా అనారోగ్య పాలవ్వడం. ఇవన్నీ కూడా కాలుష్యంలో అంతర్భాగమే.

ఇవన్నీ ఒక ఎత్తైతే ఒకప్పుడు రైతులు తమ పొలాల్లోనే కళ్ళాలు తయారు చేసుకునే వారు. చిక్కని పేడ నీళ్లతో అలికితే సిమెంటు గచ్చులాగా ఉండేది. ఆ కళ్ళాల్లో పండిం చిన ధాన్యపు కంకుల్ని పలుచగా నెరిపి ఎద్దుల్ని బంతి కట్టి తొక్కించేవారు. అటువంటి కాలక్రమంలో తారురోడ్లే కళ్ళాలయ్యాయి. వాహనాల కిందపడి నుజ్జు నుజ్జయిన కుక్కలు, కప్పలు, పాములు. అదే చక్రాలు తారు రోడ్డు మీద కుక్క నెత్తురే కాదు రోడ్డు మీద పేద, పెంటల్ని తొక్కిన చక్రాలు మార్చిన ధాన్యం. ఆ ధాన్యమే మనకు ఆహారం.

మట్టితినే వానపాము కాలుష్య నివారణకు తన వంతు కృషి చేస్తూ ఉంది. మట్టిపాలైన ఈ శరీరం కంపు గొట్టి పోకుండా పురుగులు మట్టిలో కలిపేస్తున్నాయి. సృష్టిలో క్రిమికీటకాలు కాలుష్య నివారణకు కృషి చేస్తున్నాయి. మరి మనిషో చాతనైనంత కాలుష్యాన్ని పెంచి పెద్ద చేస్తు న్నాడు. ఒక "అమ్మాయిని నువ్వు చేసేది తప్పు" అని మందలించినపుడు "నీ వల్ల ఎయిడ్స్‌కి గురౌతారు" అని చెప్పినపుడు ఆ అమ్మాయి తన మనసుకు నచ్చిన వాణ్ణి తను మెచ్చిన వ్యక్తిని వివాహం చేసుకుని చంద్రయ్య సూచనను పాటించి ఆయన ఆశీర్వాదం కోసం వచ్చింది. మనిషికొక మాట గొడ్డుకొక దెబ్బ అన్న విషయం ఈ అమ్మాయి విషయం ద్వారా వ్యక్తం అయింది.

బస్సులో ఉమ్మేసిన వ్యక్తికి గాని, కల్తీ సారా అమ్ము తున్న ప్రభుత్వానికి కాని తారు రోడ్లను కళ్ళాలుగా మార్చు తున్న రైతులకు కాని బాధ్యత లేదా? అనేది చంద్రయ్య సందేహం. కాలుష్యం అనేది మనిషి మనసులోనే ఉంది. మనుషుల్లో పేరుకున్న కాలుష్యాన్ని కడిగేయాలి. కాలుష్య మన్న మాటకు తావులేకుండా చెయ్యాలనేది చంద్రయ్య కోరిక. కాలుష్య రహిత లోకానికి ప్రతినిధిగా ఉండాలనేది చంద్రయ్య కల.

సమాజానికి కాలుష్యం ఒక సవాల్‌గా మారిన వైనాన్ని మారిన విషయం దాన్ని తగ్గించడానికి ప్రతి ఒక్కరు భాగ స్వామ్యం అవ్వాలని తమ వంతు కృషిగా పనిచేస్తున్న వానపాములను మనకు ఉదాహరణలుగా చూపించి చంద్రయ్య యొక్క అంతర్మథనాన్ని పులికంటి కృష్ణారెడ్డి గారు చక్కగా కథకు మలిచారు.

ఆధార గ్రంథాలు :

1. పులికంటి కృష్ణారెడ్డి గారి పులికంటి కథా వాహిని, విశ్వంభర పబ్లికేషన్స్, తిరుపతి.
2. పులికంటి కృష్ణారెడ్డి గారి 'సీమబారతం', విశ్వంభర పబ్లికేషన్స్, తిరుపతి.

⌘

BHAVAVEENA
Vol. 17, Issue. 8, August 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

తెలుగు సాహిత్యం – సమకాలీనత

ఆధునిక కవిత్వం – సమకాలీనత (ఉపో ద్ఘాతం)

- కె. వి. పద్మావతి

శాఖాధిపతి, వి.యస్.ఆర్ & యన్.వి.ఆర్ కళాశాల
(స్వయంప్రతిపత్తి), తెనాలి, గుంటూరు జిల్లా.

- చెళ్ళపిళ్ళ శ్యామల

స్కూలు అసిస్టెంట్, తెలుగు విభాగం, ప్రభుత్వ
బాలికోన్నత పాఠశాల, విజయనగరం.

సమాజ హితమే సాహిత్య లక్ష్యం కావాలి. అప్పుడే సమాజానికి సాహిత్యం వల్ల ప్రయోజనం కలుగుతుంది. సాహిత్యం కూడా సమాజాన్ని ఉద్ధరించేదిగా ఉండాలి. అప్పుడే అది శాశ్వతంగా నిలుస్తుంది. ఆదినుంచీ సమాజం, సాహిత్యం ఒకదానిపై ఒకటి ప్రభావం చూపిస్తూనే ఉన్నాయి.

ప్రతీ కవి తన సృజనతో సమాజహితాన్ని కోరుకోవాలి. సామాజిక స్పృహ కల్గిన సాహిత్యం అందించే ప్రయత్నం చేయాలి. సమాజంలో పాతుకుపోయిన అవినీతిపై కవిత్వం కొరడా ఝళిపించాలి. సమకాలీన సమస్యలపై కలం కరవాలంతో పోరాటం సాగించాలి.

కవి ఏ కాలం వాడయినా కావచ్చు. కానీ అతడు ఆనాటి సమాజ విధ్వంసక మూలాలను ఎత్తి చూపించాలి. సమాజాభివృద్ధిని కాంక్షించే రచనలు చేయాలి. పీడిత పక్షానికి తన కవిత్వంతో ఊరట నివ్వాలి. ఊతమివ్వాలి. కవిత్వం కాలక్షేపం బఠానీ కాకూడదు. కష్టజీవుల కన్నీటి గాయాన్ని తుడిచే లేపనం కావాలి. ఆనాటి సమాజంలో భగ్గుమంటున్న సమకాలీన సమస్యలపై పన్నీటి జల్లె కురవాలి. అటువంటి సాహిత్యమే కాలంలో పాటూ ప్రయాణించగలుగుతుంది.

"విశ్వ శ్రేయం కావ్యం" అన్నారు. అంటే, సమాజ హితాన్ని కోరేది సాహిత్యం అని అర్థం. ఇలా అన్నప్పుడు హితం అంటే ఏమిటి? ఎవరికి హితంగా ఉండాలి అనే ప్రశ్న ఉత్పన్నమవుతుంది. ఈ ప్రశ్నకు సమాధానం దేశ, కాల, సామాజిక స్థితిగతులను అనుసరించి ఉంటుంది.

సమాజం, సాహిత్యం రెండూ అవినాభావ సంబంధం కల్గి ఉంటాయి. ఏదయినా సాహిత్య సృజన చేసేటప్పుడు, అందులో కవి ప్రత్యేకత, నైపుణ్యం మనకి కన్పిస్తాయి. ఇక్కడ కవుల మధ్య విభిన్న వ్యక్తీకరణ, నైపుణ్యాలు ఉండొచ్చు. అయితే కవితా వస్తువు లేదా రూపం మాత్రం కవులందరికీ సమాజం నుంచే వస్తుందని గమనించాలి.

ఒక జాతి యొక్క సంస్కృతిని, నాగరికతను మందు తరాలవారికి అందించడంలో సాహిత్యం కీలకపాత్ర వహిస్తుంది.

ప్రజాకవి వేమన, ఆనాటి సమాజంపై ప్రభావం చూపే అధికారం, వివక్ష, మూఢనమ్మకాలు మొదలగు సమకాలీన సమస్యలపై తన పద్యాలతో ధ్వజమెత్తాడు. సమాజ రుగ్మతలు రూపుమాపే సాహిత్యాన్ని అందించిన చైతన్యశీలి అతడు. ఆనాటి సమాజంపై ప్రభావం చూపే అనేక అంశాలెన్నింటినో తన సాహిత్యం ద్వారా ముందు తరాలకు తెలియజేశాడు. నేటికీ ఆనాటి సామాజిక పరిస్థితులు మనకి కనపడుతూనే ఉన్నాయి.

మహాకవి గురజాడ విషయానికి వస్తే గురజాడని మహాకవి స్థానంలో నిలబెట్టింది అతని దేశభక్తి గేయమే. "దేశమును ప్రేమించుమన్నా - మంచియన్నది పెంచుమన్న, ఒట్టిమాటలు కట్టిపెట్టవోయ్ - గట్టిమేల్ తల పెట్టవోయ్" అంటూ సమకాలీన సమజానికి అద్దం పట్టే ఈ గీతం ఒకే కాలానికి స్థలానికి పరిమితం కాదు. ఈ సందేశం అన్ని కాలాలకు, అన్ని స్థలాలకు ఆమోదయోగ్య

మైనదే. ఈ ఒక్కటి చాలు గురజాడ ముందుచూపుతో భావి సమాజాన్ని చూడగలిగాడు అని చెప్పడానికి. కులం కన్నా మతం కన్నా, భగవంతునికన్నా దేశాన్ని ఎక్కువగా ప్రేమించమంటాడు కవి. దేశమంటే మనుషులని గుర్తు చేస్తూ మనిషిని గౌరవించే వాడే నిజమైన దేశభక్తుడని చెబుతూ, ప్రజల్ని మనిషివైపు మళ్ళిస్తాడు. గురజాడ గేయం అందుకే సార్వజనీనమైంది.

గురజాడ సర్వమానవ సమానత్వాన్ని కోరుకుంటాడు - కనుకనే

"యెల్ల లోకము వొక్కయిల్లె
వర్గ భేదము లెల్ల కల్లె"

అనగలిగాడు. దేశ ప్రజలంతా అన్నదమ్ముల వలె ఉండాలని కోరుకుంటూ... చెట్టాపట్టాల్ పట్టుకుని, దేశస్థులంతా నడువ వలెనోయ్! అన్నదమ్ముల వలెను జాతులు / మతములన్నియు మెలగ వలెనోయ్ అంటాడు. కవి సామాజిక సమానత్వాన్ని కోరుకుంటాడు.

ఆనాటి సమాజంలో కనిపించిన రుగ్మతలను తన కలంతో సరిచేసే ప్రయత్నం చేస్తాడు. ఆనాటి సమాజాన్ని పట్టి పీడిస్తూ, ఎందరి కన్యల జీవితాలనో కబళించిన కన్యాశుల్కంపై తిరుగుబాటు చేశాడు. నాటి సమాజంలోని సామాజిక రుగ్మతలను ఎద్దేవా చేస్తాడు. పూర్ణమ్మలాంటి చిన్నారులకి జరిగే అన్యాయాలకు స్పందించి

బలబల కన్నుల కన్నీరొలికెను
పుత్తడి బొమ్మకు పూర్ణమ్మకు

అంటూ ఏమీ చేయలేని ఆమె నిస్సహాయతను తెలియజేస్తూనే చివరిలో ఆ మూఢాచారానికి తలవొగ్గక పూర్ణమ్మ మరణంతో తిరుగుబాటు పతాకనెగరేస్తాడు.

మూఢవిశ్వాసాలు, దురాచారాలు పట్టిపీడిస్తున్న సమాజాన్ని తన కలంతో ప్రక్షాళన చేసిన మహాకవి. ప్రజలను చైతన్యపరచిన నవయుగ వైతాళికుడు.

"బ్రతికి చచ్చియు ప్రజల కెవ్వడు
ప్రీతి కూర్చునో వాడే ధన్యుడు"

ఆయన ప్రజల నోటికి పాటై కదిలాడు. జనం నోటి మాటై కదిలాడు. ప్రజల వద్దకు పద్య సాహిత్యం చేర లేదని భావించి ప్రజల కర్థమయ్యే విధంగా తేలిక పదాలతో కొత్త ఛందస్సు నుపయోగించి ముత్యాల సరాలు వ్రాశాడు.

ఒక మరో మహాకవి శ్రీశ్రీ విషయానికి వస్తే తిక్కన, వేమన, గురజాడలను తన గురుత్రయంగా భావించిన శ్రీశ్రీ తన రచనలతో సామాజిక శ్రేయస్సే లక్ష్యంగా చేసి సాహిత్యాన్ని కొత్తమలుపు తిప్పాడు. సమాజంలో నిత్యం దోపిడీకి గురవుతున్న దీనులు, పీడితుల పక్షాన తన కవిత్వ గొంతెత్తాడు. సామాజిక అసమానతలను తన సాహిత్యంతో సరిచేసే ప్రయత్నంలో భాగంగా ఒక వ్యక్తిని మరో వ్యక్తి, ఒక జాతిని మరోజాతి పీడించడం ఇకపై సాగదంటూ....

పదండి ముందుకు పదండి త్రోసుకు
పోదాం పోదాం పైపైకి అంటూ
శ్రామిక లోకపు స్వర్గమైన మరో
ప్రపంచానికి మహా ప్రస్థానం సాగించాడు.

తన ఒక్కో కవితను ఒక్కో డైనమైట్‌ని చేసినవాడు, విప్లవ కేతనాన్ని ఎగరేసినవాడు తన కవిత్వంతో - ఎండిన పేదరైతు డొక్కల్ని నిమిరాడు. కార్మికుడి స్వేదానికి ఖరీదు కట్టే షరాబు లేడంటూ ఎలుగెత్తి చాటి, శ్రామిక శక్తి విలువ కట్టలేనిదని చెప్పాడు.

కర్షక వీరుల కాయం నిండా
కాలువ కట్టే ఘర్మజలానికి
ఖరీదు లేదంటాడు - శ్రీశ్రీ

స్వేదాన్ని.. తన కవితా వస్తువుగా భావించి శ్రామికుడ్ని తన కవితా పతాకను చేసి ఎగరేశాడు.

తాజమహల్ నిర్మాణానికి
రాళ్ళెత్తిన కూలీలెవ్వరు

అంటూ కష్టజీవుల కిరువైపులా తన కవిత్వంతో భరోసా కల్పించాడు శ్రీశ్రీ. సమకాలీన పరిస్థితులకు తగ్గట్టుగా

కవితా వస్తువును రూపొందించుకోవాలనే సందేశాన్ని భావితరాలకు అందించిన సాహితీ సమరయోధుడు.

యమున మహిషపు లోహ ఘంటలో
మబ్బు చాటున ఖనేల్మన్నాయి..... అన్నా.
కదం తొక్కుతూ, పదం పాడుతూ
హృదయాంతరాళం గర్జిస్తూ.... అన్నా,
ఏ చరిత్ర చూసినా ఏమున్నది గర్వకారణం
నరజాతి చరిత్ర సమస్తం పరపీడన పరాయణత్వం
అన్నా,

అది శ్రీశ్రీకే చెల్లింది.

ఎల్లకాలం కాలంతోపాటే ప్రయాణించగల కవిత్వం అందించినవాడు అందుకే ఆయన మహాకవి అయ్యాడు.

ఈ వరుసలోకే వస్తాడు పీడిత పక్షాన నిలిచి సాహిత్య సృజన చేసే ఉత్తరాంధ్ర కవి, గంటేడ గౌర్నాయుడు. వీరు కళింగాంధ్ర ఉచ్ఛ్వాస నిశ్వాసాలు గుర్తెరిగిన కవి. వీరి కవిత్వం గ్రామీణ కవితా పతాక పంట పొలాన రైతు చిందించిన చెమట చుక్కలకు స్పందించి రైతును చెమట పూలచెట్టుతో పోల్చి, బ్రతుకు భారమై ఆత్మహత్యకు సిద్ధపడ్డ రైతులో

కనింత గుండె దిటం సేసుకోవాల
చెట్టుకొమ్మకి ఊరితాడు
ఏలాగ గట్టుకోకు
ఈ నర తోటమీద
అప్పులేనోడు ఎవరు సెప్మీ

అంటూ రైతు కన్నీళ్ళు తుడిచే ప్రయత్నం చేస్తాడు.

ప్రపంచీకరణ నేపథ్యంలో నాగరికత ముసుగులో జరుగుతున్న దౌర్జన్యాలను, దోపిడీలను చూసి - కొండ గుండె మండుతోందని

కొండ ఘనీభవించిన కన్నీటి కుండ

అని అంటాడు.

వీరి కవిత్వం చెమటపూల వాసనతో పరిమళిస్తుంది. శ్రమ సౌందర్యమై గుభాళిస్తుంది.

ధాన్యపు గింజల మీద
అందరి బొమ్మలు చిత్రించే
మట్టి చేతుల మహాద్భుత చిత్రకారుడు
తన బొమ్మను చిత్రించుకోలేక పోవడం
ఎంత విషాదం

అంటూ రైతుని తలుచుకు వాపోతాడు. అక్షరాల పల్లకిలో రైతును ఊరేగిస్తాడు. రైతు కష్టానికి మేఘమై కరిగి కవిత్వమై కురుస్తాడు. సమకాలీన పరిస్థితులపై వ్యంగ్యాస్త్రాలను సంధించి ఉత్తరాంధ్రా మాండలికంతో వాటిని మనముందుంచారు గౌర్నాయుడు. కష్టజీవి కిరువైపులా నిలిచి తన కవిత్వంతో పోరు సాగించాడు గౌర్నాయుడు.

సమాజాన్ని అనునిత్యం పరిశీలిస్తూ చైతన్యంతో ప్రగతి శీల భావజాలంతో అక్షరాలను దివ్వెలుగా వెలిగించే కవులెపుడూ కాలం కెరటాలై ప్రజల జీవన తీరాన్ని చేర గల్గుతారు. సమకాలీన సమాజం కవిత్వ దర్పణంలో రూపమై కదలాలి.

సమాజ సమగ్ర రూపాన్ని భావితరాలకు దృశ్యమై చూపించే కవిత్వం రావాలి. సమాజం, సాహిత్యం రెండూ ఒక చెట్టుకి పూచే పూవుల్లాంటివి.

⌘⌘⌘

BHAVAVEENA
Vol. 17, Issue. 8, August 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

1980వ దశకం నవలలు – సమకాలీనత

– డా॥. గడ్డం శ్యామల, విశ్రాంత అసోసియేట్ ప్రొఫెసర్, హైదరాబాద్.

సమకాలీనత ప్రధానాంశమైనా, సమకాలీనత అంతా ప్రగతిశీలతే అనుకోరాదని ప్రముఖ దివంగత కవి అద్దేపల్లి వారన్నారు. ఒక కవిగానీ, రచయిత గానీ తన సొంత ముద్రని నిల్పుకోవడమంటే అభివ్యక్తిని ప్రత్యేకంగా ఆవిష్కరించుకోవాలి.

ఎవరైనా కవి ప్రారంభ దశలో పద్యాలు రాసినా, కాలానుగుణంగా అన్ని ప్రక్రియలతో సంబంధం కలిగి ఉండాలి. మనిషి గురించి, మట్టి గురంచి, మానవ హితంగా వినూత్న సమాజానికి అడుగులు వేసే దిశగా రచన ఉండాలి. లేదా పద్య కవిత్వం వంటి ప్రక్రియల్లో కూడా సమకాలీన అంశాలను, వస్తువును జోడించి రాసినప్పుడు అది స్వీకారయోగ్యమే! సమాజం నుండి కవి, రచయితా ఎప్పుడూ వేరుపడరు.

ఇలాంటి కవులను గురించి చెప్పుకోవాలంటే ఆధునిక కవిత్వంలో గురజాడ, శ్రీశ్రీ, దాశరథి, సినారే వంటి కవులను చెప్పుకోవచ్చు.

ఈనాటి కవుల్లో, కవి శివారెడ్డి, డా॥. ఎన్.గోపి, గోరటి వెంకన్న మొదలైనవారు సమాజాన్ని నిశితంగా పరిశీలిస్తూ, సమకాలీనతను జోడిస్తూ చైతన్యవంతమైన కవిత్వాన్ని రాశారు, రాస్తున్నారు.

ఆధునిక యుగంలో స్వాతంత్ర్యోదమ, అభ్యుదయ, దిగంబర, విప్లవ కవిత్వాలు వచ్చాయి. ఆ తరువాత కాలంలో అంటే 1980ల నుండి స్త్రీవాద కవిత్వం, దళితవాదం కవిత్వం, ప్రపంచీకరణ కవిత్వం, మైనారిటీ వాదం మొదలైన ఆధునిక ధోరణులతో కవిత్వాలు వచ్చాయి, వస్తున్నాయి.

కాలానికనుగుణంగా కవిత్వం వస్తువును మార్చుకుంది. కవిత్వం ఏదైనా, ఉద్యమం కానీ, సంఘటన కానీ జరిగినప్పుడు వెంటనే వెలువడుతుంది. కథలు కూడా వెంటనే రావడానికి అవకాశముంటుంది. కానీ నవల మాత్రం 3, 4 నెలల కాలం తరువాతే రావడానికి అవకాశ ముంటుంది. ఒక ఉద్యమం చరిత్ర కానీ, ఒక మనిషి జీవిత చరిత్ర కానీ సమగ్రంగా చర్చించేది నవల. అందు వలన సమకాలీన విషయంపై నవల రావడానికి సమయం పడుతుంది.

ఇక ఆధునిక తెలుగు నవల గురించి చెప్పాల్సివస్తే..

1. సంస్కరణ వాద నవలలు.. ఉదా : కందుకూరి నవలలు
2. స్వేచ్ఛావాద కవలలు... ఉదా : చలం నవలలు
3. సాంప్రదాయవాద నవలలు... ఉదా : విశ్వనాథ నవలలు
4. స్వాతంత్రోద్యమ కాలం నవలలు.. రథచక్రాలు.. మహీధర
5. తెలంగాణా సాయుధ పోరాట నవలలు.. దాశరథి రంగాచార్చ... మోదుగు పూలు వట్టికోట ఆళ్వారు స్వామి - ప్రజల మనిషి...
6. స్త్రీల కౌటుంబిక సమస్యలతో వచ్చిన నవలలు... లత, యద్ధనపూడి, పోల్కంపల్లి శాంతాదేవి.... నవలలు.
7. సమకాలీన పోరాటాల ప్రభావంతో వచ్చిన నవలలు.
8. సమకాలీన పోరాటాల ప్రభావంతో వచ్చిన నవలలు.
9. స్త్రీవాద నవలలు..
10. దళితవాద నవలలు...
11. ప్రపంచీకరణ నేపథ్యంలో వెలువడిన నవలలు...

ఇలా కాలానుగుణంగా, సమకాలీన విషయాలను, ఉద్యమాలను, పోరాటాలను వస్తువులుగా చేసుకుని

నవల తన రూపం మార్చుకుంటూ వస్తుంది. అలాగే భాషలో కూడా ఆధునికతను సంతరించుకున్నది.

1980-90 దశాబ్ది కాలంలో వచ్చిన నవలలను చర్చించే సందర్భంలో... ఈ దశాబ్ది ఆధునికతతో, సమ కాలీన పోరాటాలను, ఉద్యమాలను నవలల్లో ప్రభావితం చేసిన కాలం... ఈ నవలలను 3 రకాలుగా విభజించ వచ్చు.

1. గిరిజన విముక్తి నవలలు.
2. కార్మిక పోరాటం నవలలు.
3. స్త్రీవాద నవలలు.

1. గిరిజన పోరాటం నవలలు :

ఈ విభాగంలో

1. కొమురం భీం.... అల్లం రాజయ్య, సాహు రచయితలు
2. అడవి... వసంతరావు దేశ్ పాండే...
3. వెదురు పొదలు నినదించాయి... జాతశ్రీ

2. కార్మిక పోరాటం నవలలు :

ఈ విభాగంలో....

1. నల్లవజ్రం.. వవన్ కుమార్.. తుమ్మేటి రఘోత్తమరెడ్డి.
2. సింగరేణి మండుతోంది... జాతశ్రీ.
3. కార్మిక గీతం.. అక్కినేని కుటుంబరావు.

3. స్త్రీవాద నవలలు :

1. జానకి విముక్తి.... రంగనాయకమ్మ.
2. స్వేచ్ఛ, మానవి.... ఓల్గా.
3. వంశాంకురం... మల్లాది సుబ్బమ్మ.
4. అట్టడుగు వర్గ పోరాటం నవలలు...

1. అగ్ని కణం.. అల్లం రాజయ్య.
2. బ్రతుకుపోరు... బి.యస్. రాములు.

కొమురం భీం :

1901 అక్టోబర్ 22న సంకేపల్లి, ఆసిఫాబాద్‌లో జన్మించిన చారిత్రక వీరుడు కొమురం భీం. గిరిజన సంక్షేమం కోసం నిజాం ప్రభుత్వాన్ని ఎదిరించి, ఉద్య మించి వీరమరణం పొందిన గిరిజనోద్యమ నాయకుడు... గోండు జాతి కోసం ప్రాణాలనర్పించిన త్యాగశీలి.

20వ శాతాబ్ది పూర్వభాగంలో జరిగిన వాస్తవ విషయాన్ని, పోరాట చరిత్రను అదే శతాబ్ది చివరి భాగంలో నవలగా రావడం సమకాలీనతను రుజువు చేస్తుంది.

ఆ చరిత్రను ఏ విధమైన కల్పనలూ లేకుండా నవలగా రూపొందించారు అల్లం రాజయ్య. సాహులు... ఎంతో మంది గిరిజన పౌరులను చైతన్యంతులను చేయడంలో, ఈ నవల పాత్ర ఎంతైనా ఉంది. కాకపోతే అదే దశాబ్దిలో వచ్చిన వ్యాపారాత్మక నవలలు పోటీకి తట్టుకోలేక పోయింది. కానీ, ఎవరిని ఉద్దేశించి, ఎవరి సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ఈ నవల రచన జరిగిందో ఆ మేరకు రచయితలు ఫలితం సాధించి కృతకృత్యులయ్యారని చెప్పుకోవచ్చు.

అడవి :

ఈ నవల కూడా కొమురం భీం చరిత్రను ఆధారంగా తీసుకుని రాసిన నవలే అయినా, నవల మొత్తం అతని చరిత్ర కాదు. 1981వ సంవత్సరంలో ఇంద్రవెల్లిలో గిరి జనులు వారి సమస్యలను చర్చించుకోవడానికి సభ జరుపుకోవడానికి రాగా అనాటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అమాయకులైన గిరిజనులపై కాల్పులు జరిపించడం, పరాయి పాలనలో జలియన్ వాలా బాగ్ సంఘటనను గుర్తు చేసింది.

ఈ సమకాలీన ఇతివృత్తాన్ని ప్రధానంగా చేసుకుని, గిరిజనుల జీవన విధానము, ఆచార వ్యవహారాలు, విశ్వాసాలు, సందర్భవశాత్తూ కొమురం భీం చరిత్ర చెప్పడం జరిగింది. ముఖ్యంగా ఈ నవలా శైలి కూడా పఠితులను ఆకట్టుకుంది.

అల్లం రాజయ్య నవల కొమురం భీం నవలలో భీం చరిత్రే ప్రధానం.

అడవి నవలలో ఇంద్రవెల్లి సంఘటన ప్రధానం. అంతర్భాగంగా కొమురం భీం చరిత్ర చెప్పారు దేశ్‌పాండే.

ఈ రెండు నవలల్లో ఆధునికత... సమకాలీనత రెండూ ప్రధానాంశాలే. వెదురు పొదలు నినదించాయి.

జాతశ్రీ కొత్తగూడెం ప్రాంతానికి చెందిన నవలా రచయిత.

ఒక సంవత్సర కాలం క్రితం కాలం చేశారు. వారు రాసిన నవల.

దీనిలో గిరిజన జాతియైన కోయజాతి వారి సమస్యలు, వారి జీవన విధానం, సంస్కృతి తెలియజేస్తూ మైదానం ప్రాంతం ప్రజల వలన వారు మోసపోతున్న విధానం.. చివరగా వారందరూ కలిసి అన్యాయాన్ని ఎదిరించడానికి పోరాటదిశగా పయనించి చైతన్యవంతులు కావడం ఇతివృత్తం. స్వేచ్ఛా వాయువులను పీల్చే గిరిజనులు మామూలు జనజీవన స్రవంతిలో కలవాలని సందేశం ఈ నవల.

కార్మిక పోరాట నవలల్లో :

నల్లవజ్రం - పవన్ కుమార్ రాసిన నవల. సింగరేణి కార్మికుల సమస్యలు, అధికారుల దుర్మార్గాలు. అణచి వేతకు గురవుతున్న కార్మికులు, శంకరయ్య లాంటి భయస్తుడైన కార్మికుడు కూడా నిప్పుకణికలా మారడం ఇతివృత్తం.

మార్పు మనిషి చైతన్యానికి ప్రతీక... అలా మనిష య్యాడు శంకరయ్య. సింగరేణిలో కార్మికులపై జరుగు తున్న యదార్థ సంఘటనలను నవలగా చెప్పగలిగారు పవన్ కుమార్.

సింగరేణి మండుతోంది :

ఈ నవల కూడా కార్మికుల సమస్యలను చర్చించిన నవలే. ఇది జాతశ్రీ రాశారు. కార్మిక గీతం కూడా సింగరేణి కార్మికుల గురించి కాకపోయినా కార్మికుల చైతన్యాన్ని ప్రధానంగా తీసుకు రాసిన నవల. అక్కినేని కుటుంబరావు గారు రాశారు. కవిత్వంలో శ్రీశ్రీ కార్మికుల పట్ల సాను భూతితో ఆవేశంగా మహాప్రస్థానం గేయాలు రాసినట్లు.. నవలా కర్తలు ఆ విధంగానే నవలలు రాశారు.

వీటన్నింటినీ సామాజిక పోరాటం నవలలు అని కానీ సామాజిక ఉద్యమ నవలలు అని చెప్పవచ్చు. ఇలానే పోలీసు శాఖలో కూడా కింద తరగతి ఉద్యోగుల వేదన లను పతంజలి ఖాకీ వనం నవలలో చెప్పారు.

స్త్రీవాద ఉద్యమ నవలలు :

1975 - 85, అంతర్జాతీయ మహిళా దశాబ్దం సందర్భంగా ప్రపంచంలో మహిళలు ఆలోచనా విధానంలో మార్పు వచ్చింది. అలాగే మనదేశంలో కూడా సభలు, సమావేశాలు, మహిళల సమస్యలపై మహిళలే నిర్వహిం చుకున్నారు. ఇంటి చాకిరీ, వ్యక్తిత్వ రక్షణ, లైంగిక వేధింపులు మొదలగు విషయాలపై నూతన ఆవిష్క రణలు జరిగాయి.

ఆ ప్రభావం తెలుగు సాహిత్యంపై కూడా పడింది. ఇంతకాలంగా కేవలం వరకట్నం వేధింపులు. భ్రూణ హత్యలు, బాల్యవివాహాలు మొదలగు సమస్యలే మహిళల సమస్యలుగా చూస్తుండటం. అవే కాకుండా ఉద్యోగం చేస్తున్నా స్త్రీకి కూడా స్వేచ్ఛ కరువవుతున్నదని పురుషాధిక్య సమాజంలో మహిళల శ్రమశక్తికి విలువ లేకపోవడం, పురుషులతో సమానంగా వేతనాలు ఉండక పోవడం.. ఇవన్నీ మహిళల కవిత్వానికి, రచనలకి వస్తు వయ్యాయి.

ఈ నేపథ్యంలోనే నవలలు కూడా వచ్చాయి. 1950లో నుండే స్త్రీ సమస్యలను రాసినప్పటికీ.. 1980వ దశకంలో వచ్చిన నవలలు ప్రత్యేకతను సంతరించుకున్నాయి.

వాటిల్లో రంగనాయకమ్మ జానకి విముక్తి నవల... ఇది మార్క్సిస్టు భావజాలం కలిగిన నవల అయినా జానకి అన్న సత్యం బోధలతో, మూర్ఖుడైన భర్త పెట్టే బాధల నుండి విముక్తి పొందడానికి, తనకు తానుగా చైతన్య

వంతురాలై కొడుకుతో స్వతంత్రంగా బ్రతకాలని భర్తని, కుటుంబాన్ని వదిలి బయటకు వెళ్తుంది. ఈ విధమైన మార్పును చెప్పిన జానకి విముక్తి నవల స్త్రీవాద నవలగానే చెప్పొచ్చు.

ఇంకా అచ్చంగా స్త్రీవాద నవలగా ఓల్గా స్వేచ్ఛ నవల చెప్పుకోవచ్చు. ఇంటి పని, పిల్లల పని కేవలం ఆడవాళ్లదే అనే పురుషాధిక్య సమాజంలో, అరుణ వేదనకు గురవు తుంది. లెక్చరర్‌గా పనిచేస్తున్నా కూడా సమాజంలో జరుగు తున్న తన భాగస్వామ్యాన్ని అడ్డుకునే భర్త నుండి విడి పోయి తన ఆత్మగౌరవాన్ని నిలబెట్టుకుంటుంది అరుణ.

మానవి నవలలో వసంత కుటుంబాన్నెంతో ప్రేమించే మనిషి... తను చేయాల్సిన బాధ్యతలన్నీ అయిపోయాక కుటుంబమే తనది కాదన్నప్పుడు, సామాజిక వ్యక్తిగా ఎదిగి మానవిగా నిలబడుతుంది.

స్త్రీవాదం అంటే పురుష ద్వేషాన్ని కలిగి ఉండాలో, లేదా కుటుంబాన్ని వదలి పోవాలనో కాదు. మహిల ఇంటా, బయటా తన ఆత్మగౌరవాన్ని కాపడుకుంటూ, తన ప్రత్యేకతను ఇంటా బయటా చాటుకోవాలని తన సందేశాన్ని మనం అర్థం చేసుకోవాలి. సమాజంలో కూడా ఒక గుర్తింపు పొందాలి అని ఈ నవలలు సూచిస్తున్నాయి.

ఇలా 1980-90లో మధ్య నవలా సాహిత్యం, సమ కాలీనతలను, ఆధునికతనూ తనలో పొదుపుకుంటూ.. సమాజాన్ని ప్రభావితం చేసింది అనడానికి ఏ మాత్రం సందేహం లేదు.

⌘⌘⌘

BHAVAVEENA
Vol. 17, Issue. 8, August 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

భాగవత సప్తమ స్కంధం – సమకాలీనత

– డా॥. పైడిపాటి ఉమానాథశర్మ, ప్రొఫెసర్, తెలుగుశాఖ, కె.ఎల్. విశ్వవిద్యాలయం.

వేద విభాగం చేసి, వేద తత్వాన్ని కథా రూపంలో మిత్రసమ్మితంగా 18 పురాణాలలో ఈ లోకానికి అందించిన కారణజన్ముడు, నారాయణ స్వరూపుడు అయిన మహర్షి వేదవ్యాసుడు. "పురా2పి నవం ఇతి పురాణం" అని పురాణ శబ్ద నిర్వచనం. ప్రాచీనమైనప్పటికీ ఎప్పటి కప్పుడు నిత్యనూతనంగా గోచరమయ్యే అంశాల సమాహారం పురాణం. అలాంటి అష్టాదశ పురాణాలలో ఒకటి భాగవత పురాణం. ఒక రకంగా మానవ జీవన ప్రవర్తనా విధానాన్ని నిర్దేశించిన భగవద్గీతకు భాష్యప్రాయమైన గ్రంథరాజమిది. "సర్వవేదేతిహాసంగా" చెప్పబడిన ఈ సంస్కృత భాగవతాన్ని భక్త కవి, సహజ పాండిత్య సంశోభితుడు అయిన బమ్మెర పోతన తెలుగులోనికి అనువదించాడు. భారతదేశ భాషలన్నింటిలోను తెలుగు భాషలోనే మొట్టమొదటి అనువాదం రావటం తెలుగు భాష, ప్రజల అదృష్టం. తన ముందున్న మహాకవుల వలెనే పోతరాజు కూడా జగత్తు యొక్క హితాన్ని ఆకాంక్షించే "ఈ బమ్మెర పోతరాజొకడు భాగవతంబు జగద్ధితంబుగన్" అంటూ భాగవత ఆంధ్రీకరణ చేశాడు. ద్వాదశ స్కంధ నిర్మితమైన మహాభాగవతంలో 5, 6, 11, 12 స్కంధములు తప్ప మిగతా 8 స్కంధములను పోతనామాత్యుడు తెలుగులోనికి అనువదించాడు. 15వ శతాబ్దానికి చెందిన లక్కమాంబ, కేశయ దంపతుల కుమారుడైన ఈ కవి భాగవతంలోని సప్తవ స్కంధాన్ని 482 గద్య పద్యాలతో అనువదించాడు. ఈ మహా పురాణంలోని సప్తమ స్కంధం ఆధారంగా ఈ కాలానికీ, ఈ మాటకు వస్తే సర్వకాలాలకు అన్వయమయ్యే వివిధ విషయాలను ఆవిష్కరించటమే ఈ పరిశోధనా పత్ర ప్రధాన ఉద్దేశ్యము.

మానవత్వం – రాక్షసత్వం :

మహాభాగవతంలో మనిషి, రాక్షసుడు ఎలా వుంటారో స్పష్టంగా పేర్కొంటాడు పోతనామాత్యుడు. హిరణ్య కసిపుడు రాక్షసుడు. అతని కొడుకు ప్రహ్లాదుడు కనుక, తన కొడుకు కూడా తన వలెనే అసుర కృత్యాలు చేయాలని కోరుకోవడంలో తప్పు లేదు. అందుకనే కొడుకుతో ఏ పనులు చేస్తే తనకు ఆనందంగా వుంటుందో ఇలా చెప్పాడు.

"సురులం దోలుటయో, సురాధిపతులన్ స్రుక్కించుటో సిద్ధులన్
పరివేధించుటయో, మునిప్రవరులన్ బాధించుటో? యక్షకి
న్నర గంధర్వ విహంగ నాగ పతులన్ నాశంబు నందించుటో
హరియించున్, గిరియించునేల చెడ మోహాంధుడవై పుత్రకా!" (7 - 146)

రాక్షస పనులు గురించి రాక్షసుడికే ఇంత స్పష్టత వుంటే మానవుడికి మానవ కృత్యాల గురించి ఇంకెంత స్పష్టత వుండాలి? సమస్తమైన ప్రాణులు తన లాంటివే అనే భావన వుండాలి. చిన్ని నా పొట్టకు శ్రీరామ రక్ష అనే స్వార్థంతో ఎల్లప్పుడూ వుండకూడదు. మనకన్న వయస్సులోనో, పాండిత్యంలోనూ పెద్దవారు కనబడితే వినయంతో నమస్కరించాలి. ఇతర స్త్రీలు ఎవరు కనపడినా తల్లిలాగా భావించి పక్కకు తొలగిపోవాలి తప్ప ఎదురువెళ్లి వెకిలి చూపులో, మాటలో మాట్లాడకూడదు. ఎవరైతే సమాజంలో దీనులో వారిని తల్లిదండ్రులవలే ఆదరించాలి. (శ్రీశ్రీ అన్నట్లు పతితులు, భ్రష్టులు, బాధాసర్ప దష్టులను ఆదరించాలి) స్నేహితులను కేవలం స్వార్థం కోసము వాడుకోకుండా సొంత సోదరులవలే చూసుకునే సహృదయం ఉండాలి. తనకు జ్ఞానాన్ని ప్రసాదించే గురువులను దైవము వలే భావించాలి. నవ్వులాటకు

కూడా అబద్ధాలాడకూడదు. ఇలాంటి లక్షణాలన్నీ వున్నవాడు జీవితంలో అత్యుత్తమ మానవుడిగా గుర్తింపు పొందుతాడు. పోతన ఈ విషయాన్ని ఇలా పేర్కొంటాడు.

"తనయందు సఖిల భూతములయందునొక భంగి సమహితత్వంబున జరగువాడు!
పెద్దలబొడగన్న భృత్యునికైవడిజేరి సమస్కృతుల్సేయువాడు!
కన్నుదోయికినన్యకానతలడ్డంబైన మాతృభావనసేసి మరలువాడు!
తల్లిదండ్రులభంగిధర్మవత్సలతను దీనులగావ జింతించువాడు!
సఖులయెడ సోదర స్థితి జరుపువాడు, దైవతము లంచుగురువలదలచువాడు
లీలలందున బొంకులులేనివాడు, లలిత మర్యాదు డైన ప్రహ్లాదుడధిప" (7 - 115)

అలాగే రూపు రేఖల విషయంలోగాని, విద్య, ఐశ్వర్యం విషయంలోగాని అధికుడై కూడా గర్వం లేకుండా వుండాలి. కామ, క్రోధాదులు తగ్గించుకుని, చంచలత్వం లేకుండా ప్రవర్తించాలి. ఈ విషయాలన్నీ ప్రహ్లాదుడి పాత్ర ద్వారా పోతన గారు చెప్తాడు. అన్ని ప్రాణుల యెడ సమదర్శిగా వ్యవహరించడం స్త్రీల పట్ల గౌరవం, దీనుల పట్ల జాలి ఇవన్నీ మానవత యొక్క లక్షణాలు. ఈ విషయాలన్నీ ఈ కాలానికి కూడ వర్తిస్తాయి అనడంలో ఏ మాత్రం సందేహం లేదు. మనిషైనవాడు తనకు లేదని ఎవరినీ యాచించకూడదు. అయ్యో! ఇతరులకు వుంది. నాకు లేదే అని బాధపడకూడదు. ఇతరులు వారంతట వారు ఏదైనా పంపితే కాదనాల్సిన పనిలేదు. ప్రేమ, ద్వేషము, సుఖము, దుఃఖము అనే భేదాలతో మననును పాడుచేసుకోకూడదు అని ప్రహ్లాదుడి పాత్ర ద్వారా మనకు తెలియజేస్తున్నాడు.

"లేదనినెవ్వరినగడను - రాదని చింతప బరులు రప్పించినచో
గాదని యెద్దియు మానను - ఖేదము మోదమును లేక క్రీడింతుమదిన్ ॥ (7 - 439)

చదువు :

స్వాతంత్ర్యం వచ్చిన ఏడు దశాబ్దాల తర్వాత కూడా సంపూర్ణ అక్షరాస్యతకు సంవత్సరాలను మార్చుకుంటూ తృప్తిపడుతున్నాము. భాగవకారుడు జనులందరూ చదువు కోవాలి, తద్వారా అజ్ఞానం పోగొట్టుకోవాలి అని ఏనాడో చెప్పాడు. చదివితే ఏమొస్తుంది? సత్తు, అసత్తులమధ్య గల తేదా తెలుస్తుంది అని ప్రయోజనాన్ని కూడా తెలి పాడు. కేవలం ధనసంపాదన మాత్రమే చదువుయొక్క ప్రయోజనంగా భావించకూడదు. హిరణ్యకశిపుడు కొడుకు గురించి. "వీడు విద్యాభ్యాసంబునగాని తీవ్రమతిగాడని" అనుకున్నాడట. చదువు వలన మతి చైతన్యం కలుగు తుంది. జడత్వం పోతుంది. ఇవాళ ఉద్యోగ సంపాదనే ప్రధానమైపోయింది. అది ఎలా సంపాదించుకోవాలో తెలియాలంటే కూడా చక్కగా చదువుకోవాలి. అలాగే గురువులు చెప్పేటప్పుడు ఏదో హీరోయిజం కోసం కొంటె ప్రశ్నలు, వెకిలి ప్రశ్నలు వేయడం కూడా మంచి కాదు అంటాడు పోతనామాత్యులు. చదువు కూడా పైపైన ముఖ్యమైన అంశాలను పరిమితమవ్వకూడదు. మనం ఆంగ్లంలో డెప్త్‌గా చదివాను అంటామే అలా చదవాలి. "చదువులో మర్మమెల్ల జదివితి తండ్రీ" అంటాడు ప్రహ్లాదుడు.

"చదవని వాడజ్ఞుండగు చదివిన సదసద్వివేక చతురత గలుగున్
చదవంగ వలయును జనులకు జదివించెద ఆర్యులొద్ద చదువుము తండ్రీ" (7 - 130)
"ఏ పగిది వారు చెప్పిన, నా పగిదించదువుగాని యట్టిట్టనియా
క్షేపింపడు, తాననియు రూపించిన మిథ్యలని నిరూఢ మనీషన్" (7 - 135)

అలాగని గురువులందరూ మంచివారే అని, వారు చెప్పేవన్నీ మంచివేనని పోతన చెప్పలేదు. గురువులలో కూడా స్వార్థపరులుంటారని, వారికి కావలసినట్లుగా విద్యార్థులను మార్చుకుంటారని, తస్మాత్ జాగ్రత్త అని

హెచ్చరించాడు. మన జీవితానికి లక్ష్యానికి అనుగుణంగా చదువు చెప్పని గురువును విడచిపెట్టాలని నిర్మొహ మాటంగా ప్రహ్లాదుడి పాత్ర ద్వారా చెప్పిస్తాడు. "విషయా సక్తులైన విబుధాహితులతోడి మనకి వలదు" "కోరికలతో కూరుకుపోయి విషయాసక్తులైన ఈ రాక్షస గురువులు మన క్షేమం కోరేవారు కాదు.

సంతానం చదువులు - తల్లిదండ్రుల బాధ్యత :

బాగా డబ్బులు చెల్లించి మంచి విద్యాసంస్థలో పిల్ల లను చేర్పించటంతో తల్లిదండ్రులు తమ బాధ్యత అయి పోయిందని భావించకూడదు. ఎప్పటికప్పుడు వారు ఏమీ చదువుతున్నారో, గురువులు ఎలా చెప్తున్నారో విచారణ చెయ్యాలి. అప్పుడే పిల్లలకు చదువు పట్ల బాధ్యత పెరుగుతుంది. ఇక్కడ రాక్షసరాజు తన కొడుకుని ఆరుయలొద్ద చదువుకు పంపించి కొన్నాళ్ళు అయిన తర్వాత అసలు వీడు ఎలా చదువుతున్నాడో, తన కొడుకు చదువులో ఎంత కష్టపడుతున్నాడో తెలుసుకోవాలను కున్నాడట. మరి ఈనాటి సమాజంలో తల్లిదండ్రులందరూ ఆలోచించవలసిన విషయమిది.

శా॥. అంతం కొన్ని దినంబులేగిన సురేంద్రారాతి శంకాన్విత
స్వాంతుండై నిజనందనున్ గురువులేజాడం పఠింపించిరో
భ్రాంతుండేమిపఠించెనో, పిలిచి సంభాషించి విద్యా పరి
శ్రాంతిం జూచెదగాక నేడని మహా సౌధాంతరాసీను డై ॥ (7 - 136)

అసలీనాటి కుటుంబ వ్యవస్థలో సామాజిక మాధ్య మాల పుణ్యమా అని పిల్లలు తండ్రులతో మాట్లాడటం తగ్గిపోతోంది. స్నేహితులతోనే ఎక్కువ కాలక్షేపం అలవాటుగా మారిపోయింది. అసలు పిల్లల మాటలే తండ్రులకు నిత్య సంతోషదాయకాలు. తండ్రులు పడిన శ్రమ, తాపము, దుఃఖములను పోగొట్టే శక్తి తనయుల మాటలకే వుందంటాడు కవి.

అనుదిన సంతోషణములు, జనిత శ్రమ తాప దుఃఖ సంశోషణముల్
తనయుల సంభాషణములు, జనకులకుంగర్ణయుగళ సద్భూషణముల్ ॥ (7 - 140)

తండ్రి తను అడిగినవన్నీ ఇవట్లేదు అనే అసంతృప్తితో సతమతమయ్యే సంతానాన్ని మనం చూస్తుంటాము. కానీ తల్లిదండ్రులు తమ సంతానం వృద్ధిలోకి రావాలని కోరు కుంటారే కానీ అది విఫలమైనంతమాత్రాన వారి ప్రేమ మాత్రం తగ్గదు పిల్లలపై కన్నవారికి ఎప్పటికీ శత్రుభావం వుండదు. చెడు పనులు, చెడు అలవాట్లు చేసుకోకపోతే చాలు అని తృప్తిపడతారు ఈ విషయాన్ని పోతన ఇలా చెప్తారు.

పుత్రుల్ నేర్చిన నేర్వకున్న జనకుల్ పోషింతురెల్లప్పు డున్
మిత్రత్వంబున బుద్ధి సెప్పి దురితోన్మాదంబు వారింతురే
శత్రుత్వంబు దలంపరిట్టి యెడ నా సౌజన్య రత్నాకరుం
బుత్రున్లోకపవిత్రుం దండ్రి నెగులుం బొందింప నెట్లోర్చెనో ! (7 - 126)

లక్ష్యం :

ప్రతి మనిషి తమ జీవితానికి ఒక లక్ష్యం అంటూ ఏర్పరచుకోవాలి. దానిని నెరవేర్చుకోవటానికి నిత్యం తపన పడాలి. లక్ష్యం ఏర్పాటు చూసుకునేటప్పుడు వున్న శ్రద్ధ దానిని సాధించుకోవటంలో కూడా ఉండాలి. వేరు ఆలోచన చేయకుండా లక్ష్యం వైపే సమస్త ఇంద్రియాలను లగ్నం చేయాలి. అప్పుడే లక్ష్యాన్ని సాధించగలగుతాము. ప్రహ్లాదుడి లక్ష్యం విష్ణుభక్తి. శ్రీ మహావిష్ణు సాక్షత్కారం. తపనతో భగవంతుడే దిగిరావటం సాధ్యమైనప్పుడు భౌతిక జీవితంలోని లక్ష్యాలు ఎందుకు సాధ్యం కావు. ప్రహ్లాదుడి తపనను వర్ణస్తూ.....

పానీయంబులు ద్రావుచుం గుడుచుచున్ భాషించు చున్ హాసలీ

లానిద్రాదులు సేయుచున్ దిరుగుచున్ లక్ష్మించుచున్ సంతత
శ్రీనారాయణ పాద పద్మ యుగళీ చింతనామృతస్వాద సం
ధానుండై మఱచెన్ సురారుసుతుడేతద్విశ్వమున్ ॥

ఆత్మస్తుతి - పరనింద :

అలాగే వర్తమాన సమాజంలో పర్సనాలిటి డెవలప్ మెంటులో అతి ముఖ్యమైనదిగా భావించే ఆత్మస్తుతి - పరనిందను గురించి కూడా పోతనామాత్యుడు చెప్పి యున్నాడు. ఎంతసేపు మనం సాధించిన విషయాల గురించి మనమే డబ్బా కొట్టుకోకూడదు. మన ప్రగతిని ఇతరులు చెప్పేటట్లుగా మన ప్రవర్తన వుండాలి. మనను మనం పొగుడుకుంటూ వుంటే వినే వారికి మన మీద విసుగు, వ్యతిరేకత ఏర్పడతాయి. అలాగే మన పరాయ జాలకు ఎదుటి వారిని నిందించటం కూడా సత్పురుషుల లక్షణం కాదు. ఇక్కడ ప్రశ్నించడానికి, నిందించడానికి మధ్యగల తేడాను గమనించి ప్రవర్తించాలి. ఎప్పుడూ నిశ్చితంగా, సంతృప్తిగా వుండగలగాలి. వర్తమాన కాలంలో ఇది ఎక్కువగా లోపిస్తుంది. ఈ విషయాన్ని కూడా ప్రహ్లాదుడి ద్వారా కవి మనకు ఇలా చెప్పిస్తున్నాడు.

నిందింపపరులనెన్నడు, వందంపననేనకపీడ
వచ్చిన, మదినా
క్రందింప, విభవములకానందింప బ్రకామవర్తనంబు
ననఘిస్తా !

మనో నియంత్రణ :

ఈనాటి యువత నుండి వృద్ధుల వరకు అందరూ మనకు అసలైన శత్రువు ఎవరు అని మనని మనం ప్రశ్నించుకోవాలి. మనిషి జీవితానికి, ప్రవర్తనకు మూలము వారి మనసు. మనం చెప్పినట్లు మన మనసు వినాలి గానీ, మన మనసు చెప్పినట్లు మనం వినకూడదు. అలా మనసును నియంత్రణలో వుంచుకుంటే మానవ జీవితం ఆనందమయమౌతుంది. ప్రహ్లాదుడు తన తండ్రితో అంటున్న ఈ క్రింది మాటలు సమకాలీన సమాజం మొత్తానికీ అక్షరాలా సరిపోతాయి.

"చిత్తంబు సమముగా చేయుము, మార్గంబు తప్పి
వర్తించు, చిత్తంబు కంటె
వైరులెవ్వరు, చిత్తంబు వైరిగాక! చిత్తమును నీకు
వశముగా జేయువయ్య ! (7 - 266)

పై అంశాలన్నీ సమకాలీన సమజానికీ వర్తిస్తాయ నటంలో సందేహం లేదు. కథ, భగవంతుడు అనేవి కాసేపు పక్కన వుంచి సమాజానికి ఏఏ అంశాలు ఉప యోగపడతాయి అనే దృష్టి కోణంలో చూస్తే మహాభాగ వతంలో ఇలాంటి అనేక విషయాలు ద్యోతకమవు తాయనటంలో రెండవ ఆలోచనకు తావే లేదు. భాగవతం సమకాలీనము, సార్వకాలీనము కూడా.

ఆధార గ్రంధాలు :

1. పోతన భాగవతము - మూడవ స్కంధము.
2. భాగవతోపన్యాసములు - ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి.
3. తెలుగు సాహిత్య చరిత్ర - ఆచార్య వెలమల సిమ్మన్న.

⌘⌘⌘

BHAVAVEENA
Vol. 17, Issue. 8, August 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

తెలంగాణ కథ – సమకాలీనత

– భానోతు కృష్ణ , తెలుగు అధ్యాపకులు, అశోక్‌నగర్ సైనిక్‌స్కూల్, నర్సంపేట, వరంగల్, తెలంగాణ.

కథ పరిచయం :

ఆధునిక మరియు సాహిత్య ప్రక్రియలో ఒకటైన కథ, సమాజ నడవడికను సంపూర్ణంగా చిత్రిస్తుంది. కథ అనగా కొంత సత్య అంశాలతో కూడిన కల్పిత గద్య గ్రంథం అని తెలుగు అకాడమి నిఘంటువులో పేర్కొన్నారు. 'కథ' అనే ధాతువు నుండి "కథ అనే పదం పుట్టింది. దీనికి సంభాషించుట, చెప్పట అనే అర్థాలున్నాయి".

తెలంగాణాలో ఆధునిక సాహిత్య ప్రక్రియలో భాగంగా ఉన్న కథ పుట్టుక, క్రమ పరిణామం, నిలువరించిన పరిస్థితులు మూల్యాంకనం చేయబడుతుంది. ఆధునిక సాహిత్యంలో గురజాడ అప్పారావు వ్రాసిన "దిద్దుబాటు" మొదటి కథగా భావింపబడుతూ వస్తున్నది. ఇక తెలంగాణలో తెలుగు కథ ఎప్పుడు ఎట్లా ఉంటుందని తెలుసుకోవటానికి అప్పటి తెలుగు భాషా పరిస్థితిని, సామాజిక స్థాయిని పరిగణలోకి తీసుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది.

గ్రంథాలయోద్యమ ప్రభావంతో తెలంగాణ విద్యా వ్యవస్థలో గణనీయమైన మార్పులు వచ్చాయి. నిజాం పరిపాలన అంతం అయ్యే కాలానికి తెలుగు భాషకు గౌరవం పెరిగిందని చెప్పవచ్చు. ప్రభుత్వం ఉద్యోగ వర్గం నుండి మధ్య తరగతి రూపుదిద్దాల్సింది. ఆంధ్రలో అప్పటికే చాలా రంగాలలో దూసుకుపోతున్న మధ్య తరగతి ఆలోచనలు, ఆదర్శాలు, వేషభాషలు, ఆహార వ్యవహారాలు, మానవ సంబంధాలు ఇక్కడ రచయితలకు నమూనాగా తోచాయి. తెలంగాణాలో ఉపాధ్యాయ ఉద్యోగవర్గంగా ఎదిగి వచ్చిన యువత రచయితలు అయి ఆంధ్ర సాహిత్య వాతావరణాన్ని అనుసరించారు.

అలాగే తెలంగాణ ఉద్యోగస్తులు వాళ్లను అనుసరిస్తూ కథలు వ్రాసి కథా రచయితలుగా సుప్రసిద్ధులు అయ్యారు.

తెలంగాణ కథ - రచయితలు :

తెలంగాణ యాసకు సాహిత్య గౌరవాన్ని తెచ్చిపెట్టిన గొప్ప రచయిత కాలువ మల్లయ్య. వీరి కథ ప్రస్తావన తాను జన్మించిన గ్రామీణ జీవన నేపథ్యం నుంచి రచయితగా ఎదిగారని చెప్పవచ్చు. తెలంగాణ ప్రాంతీయ స్పృహతో రాసిన వీరి కథల్లో తెలంగాణలో నివసిస్తున్న స్త్రీల జీవన విధానంను దర్శింపజేశారు నాలుగు దశాబ్దాల నుండి తన సృజన శక్తితో తెలంగాణలో తెలుగు సాహిత్యంలో అత్యధిక కథలు వ్రాసిన ప్రముఖ రచయిత. ప్రస్తుత సమాజానికి ఉపయోగపడేలా తెలంగాణ ప్రాంత సాహిత్యంను పరిచయం చేస్తూ "తెలంగాణ కథ - తెలుగు కథ" గల 14 వ్యాసాల సంపుటిని వ్రాశాడు. వీరి రచనల్లో దళితులు, రైతులు, కార్మికులు జీవితాలలోని కష్టాలు వంటివి చూస్తూ వాళ్ళలో చైతన్యం నెలకొల్పే కథలు వ్రాశాడు. 'దొరసాని చీర' కథ దొరల పశుత్వ లైంగిక దోపిడీకి నిదర్శనం. 'చావు' కథలో సంప్రదాయాల వల్ల మనుషులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు తెలియ జేస్తుంది. 'వెలి' కథలో దొరల పెత్తనాన్ని సవాల్ చేసిన కింది కులాల చైతన్యం, ఇలా అనేక సమస్యలను చూపెడ తాయి కాలువ మల్లయ్య కథలు.

ఆధునిక సమాజంలో సాహిత్యాన్ని సమాజాన్ని రెండింటిని అధ్యయనం చేయడం బి.ఎస్. రాములు ప్రత్యేకత. 1968లో 'బాలమిత్ర' జనవరి సంచికలో 'జగిత్యాల కథ' పేరుతో ఆయన తొలి రచన ముంద్రించారు. కథ రచయితగా బి.ఎస్. రాములు తెలంగాణ ప్రజల దీనస్థితిని అక్షరీకరించారు. కాలువ మల్లయ్య కథల్ని మూడు భాగాలుగా వర్గీకరించారు. విప్లవ సాహిత్య గ్రంథాలు, తాత్విక సైద్ధాంతిక గ్రంథాలు, సామాజిక, ఆర్థిక రాజకీయ,

మానవ సంబంధాల కథలుగా విభజించారు. బి.ఎస్. రాములు కథలల్లో విస్తారమైన దళిత జీవితం ఉంది. ప్రపంచీకరణ, పారిశ్రామికీకరణ దేన్నయినా దళితులు తమ ప్రయోజనాలకు అనువుగా మార్చుకుని ఎదిగి, రావాలన్న సరికొత్త కోణం బి.ఎస్. రాములు కథల్లో కన్పిస్తుంది. 'స్మృతి' సంపుటిలో కథలన్ని ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించే పాత్రలనే కలిగి ఉంటాయి. విప్లవ ఉద్యమాలలో కూడా దళితులు వివక్షకు గురయ్యారని దక్షయజ్ఞత కథ వ్రాశాడు.

నేరెళ్ల శ్రీనివాస్‌గౌడ్ జీవితాల గురించి 'మా బతుకులు' కథా సంపుటి వెలువరించారు. 'పేదోళ్ల బతుకులు' అనే మరో కథ సంపుటిలో వివిధ కులవృత్తి జీవితాల కథలు వ్రాశాడు. కల్పవృక్షం కథలో ఎక్సైజ్ అధికారుల వ్యతిరేక నిర్ణయాలు, కల్లు అమ్మకాలకు పోటీగా వచ్చిన గుడుంబా తాగుబోతుల చేష్టలను వివరించిన తీరు అద్భుతం.

పెద్దింటి అశోక్ కుమార్ తెలంగాణ గర్వించదగ్గ గొప్ప కథకుడు. తన ఊరి పరిస్థితులను దగ్గర నుండి చూసి, తన రచనల్లో ప్రతిబింబింపజేశాడు. తన గ్రామం యొక్క సంస్కృతి అస్థిత్వం కోల్పోతున్న ఆ రోజుల్లో అశోక్ కుమార్ తన రచనల ద్వారా తన ఊరిని, సమాజాన్ని మేల్కొనిపే ప్రయత్నం చేశాడు. "పోరుగడ్డ" కథలలో మలిదశ తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున్న ఎగిసి పడుతున్న రీతిని తన కథ సంపుటంలో పొందుపర్చారు. 'మా ఊరి బాగోతం' కథా సంపుటిలో మనిషి మనిషికి బతుకు ఉంటుంది. ఆ బతుకుల కథలు, దుక్కులు, మంచి చెడులు అన్ని ఉంటాయి. అవి అన్నింటిని ఉన్నది ఉన్నట్లు రాసేవాడు. గొప్పోండు. ఆ పని పెద్దింటి అశోక్ కుమార్ "మా ఊరి భాగోతం" కథ సంపుటి ద్వారా నెరవేర్చుకున్నాడు. అరబ్బు దేశాలలో పని చేసిన తిరిగి సొంత ప్రాంతాలకు వెళ్ళి పోవలసిందే. ఇదొక చారిత్రక విషాదం వంటి సంఘటనల నుండి పెద్దింటి అశోక్ కుమార్ వలస కార్మికుల గాథలకు అక్షరరూపం ఇవ్వట "వలస బతుకుల" కథ సంపుటి ప్రత్యేకత.

ముగింపు :

తెలంగాణ రచయితలు గొప్ప కథకులుగా, శైలీ శిల్పాలలోనూ, ఒక చలం, కొడవటిగంటి కుటుంబరావు రచనలకు ఏ మాత్రం తీసిపోకుండ, వారి రచనలు తెలంగాణ ప్రాంత పరిస్థితులను అద్దం పట్టినట్లుగా చిత్రించారు. తెలంగాణ పాఠ్య ప్రణాళికల్లో వార్షిక విధానం వల్ల ఈ ప్రాంత విద్యార్థులకు తమ చరిత్ర తెలియకుండా పోయింది. నేడు తెలంగాణ ప్రాంతం వెనుకబడడానికి మూడు ప్రధాన కారణాలు, దీనిస్థితిలో వ్యవసాయం, ఆదరణ లేని కులవృత్తులు, మానవ సంబంధాల విధ్వంసం, సామ్రాజ్యవాదం వంటివి తొక్కి పెట్టారు. దీన్ని ధిక్కరించి నిలబడే ప్రయత్నంలో తెలంగాణ అస్థిత్వ కథ సాహిత్యం రూపుదిద్దుకున్నది.

ఆధార గ్రంథాలు :

1. తెలంగాణ తెలుగు కథ సంపాదకులు - పంతంగి వెంకటేశ్వర్లు.
2. తెలంగాణ కథకులు, కదనరీతులు - బి.ఎస్. రాములు.
3. మా బతుకులు - నేరెళ్ల శ్రీనివాస్ గౌడ్.
4. మా ఊరి భాగోతం - ఒక పరిశీలన (సిద్ధాంత గ్రంథం).

⌘⌘⌘

BHAVAVEENA
Vol. 17, Issue. 8, August 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

మధుసూదన్ కవిత్వం – మానవతా దృక్పథం

– డా॥. ఎ. విజయలక్ష్మి, తెలుగు పండిట్, చెన్నై, తమిళనాడు.

సమాజ హితమే సాహిత్య పరమ ప్రయోజనం అయినప్పటికీ తొలినాటి తెలుగు కవులు ఆనందానికి, ఉపదేశానికి ప్రాధాన్యతనిస్తూ కవిత్వం వెలయించారు. కాగా, ఆధునిక సాహిత్యం మాత్రమే సగటు మానవుని కష్టాలకు, కన్నీళ్ళకు, వెనుకబాటుకు, సంఘర్షణలకు, అడ్డుతెరలకు, అంతరాలకు ప్రాధాన్యతనిస్తూ మనిషి అస్థిత్వానికి దన్నుగా నిలచింది. అలా సాగుతున్న నవకవనంలో కప్పగంగుల మధుసూదన్ కవితా సంకలనం బతుకుబండి ఈ ఒక ప్రత్యేకతను సంతరించుకున్నదని చెప్పవచ్చు.

"బతుకు బండి" సంపుటి శీర్షిక కవితలో దుర్భర బతుకులు గడుపుచున్న పేద బాలబాలికల జీవితాలపై స్పందిస్తూ "ఎక్కడ మన ప్రగతంటూ అడుగుతోంది. ఎర్రకోట / పలుకులేక వలవల విలపిస్తోంది భరతమాత" అన్న వాస్తవం చెబుతూ "నా కనిపిస్తోంది నా దేశంలో గతమే బాగుండేదని" అంటూ గతకాలము మేలు వచ్చు కాలముకంటెన్ అనే సామెతను గుర్తుచేశాడు మధు సూదన్.

"ఏమున్నది, యేమున్నది, యేమున్నది నేటి ప్రగతి / డెబ్బదేళ్ళ పాలనలో సాధించదేమున్నది" అని ఆక్రోశించి "ప్రజాస్వామ్య పాలనలో ప్రజల పాత్ర కానరాదు" అంటూ నేటి వాస్తవాలను చెప్పాడు.

దేశ ప్రజల విధ్వంస గతిని పేర్కొన్నాడు, "ఏమున్నది నేటి ప్రగతి" కవితలో. వెన్వెంటనే "విముక్త గీతి" కూడ రాసి విముక్తం చూపాడు. మహిళాభ్యుదయం, వారి సాధికారితపై దృష్టి సారించి "భయం" కవితలో బాలికలు, యువతులు, మహిళల మనసుల్లోని భయానకాలను తెలుపుతూ...

అమ్మలకుకూడా మగాళ్ళంటే భయం
అడుగడుగునా భయం.. అణువణువా భయం"

అంటూ సమాజపు దుర్దశను తెలిపాడు. "సంకురాత్రి" కవితను లయాత్మకంగా వుండునట్లు మాత్రాబద్ధంగా గురజాడ వారిని గుర్తుచేస్తూ ప్రారంభించాడు మధు గారు. ఇందులో రైతులు, పాడి - పంటలు, సంప్రదాయాలు వగైరాల సంకురాత్రి ప్రాముఖ్యతను తెలుపుతూ..

"పల్లెపట్టుకు అన్నదాతకు పశువులకు పాడావుకు
హితవు పలికే జీతగాళ్లకు, పేదలకు, పిల్లోళ్ళకు
బండిలాగే చిదుగు బతుకును సంకురాత్రే సిసలు
పండుగ"

అంటూ సంప్రదాయ సమాజాన్ని తెలిపాడు. ఇపుడు మనమున్న కలికాలాన్ని గూర్చి చెబుతూ తస్మాత్ జాగ్రత్త అని మనందరినీ హెచ్చరించాడు.

వెలుగులతో రమ్మని తెలుగు సంవత్సరాలను కోరుతూ రెండు కవితలు రాశాడు. "జైహింద్" కవితలో విదేశాలకు వలసలు పోయే సంస్కృతిని నిరసించాడు రచయిత.

"జాతి కొరకు, ప్రగతి కొరకు, శ్రమిద్దాం
ఈ నేలనె జీవిద్దాం
కమ్మనైన కన్ననేలలోనె మళ్ళీ మొలకెత్తుదాం
"జైహింద్"

అంటూ జననీ జన్మ భూమిశ్చ భావనను గౌరవించాడు. సమాజంలో మార్పును కోరుకున్నాడు. సమాజ శీలతను గుర్తు చేశాడు. విశ్వశాంతి వైపు చూశాడు విశ్వ శాంతి కవితలో. "కర్మయోగి" కలాం అంటూ గొప్పవ్యక్తిని గూర్చి మంచి కవిత రాశాడు. "ఓ కర్మయోగీ! అబ్దుల్ కలాం మహాశయా/మాకై మరలా ప్రభవించవూ" అని అర్థించాడు.

ఒక పోస్ట్‌మాన్ తన రిటైర్మెంటు సమయంలో

అప్పటిదాకా తన వీపును ఆపుచేసుకొని శుభాశుభాలను మోసుకొచ్చి ప్రజలకు చేర్చిన తన నిత్య మిత్రుడు బట్వాడా సంచి నుండి శలవు తీసుకొని వెళుతున్న సందర్భ కవిత "ఇక సెలవు" నాకు కన్నీరు తెప్పించింది. ఈ కవిత ఎవరికైనా కన్నీరు తెప్పిస్తుందని నమ్ముతాను. అది సుదీర్ఘ స్నేహం, మమేకం నుండి విడిపోతున్న దృశ్యం. సంచి ప్రాణం లేనిదే కావచ్చు. కాని అది పోస్ట్‌మాన్‌కు సత్య స్నేహితుడు. ఇకపై సంచికి తోడుగా లేకున్నా, అలసిపోకు, సేవకు వెరవకు అని వీడ్కోలు వాక్యం చెబుతూ, మంచి మిత్రునకు దూరమైపోతున్న సంఘటనకు బొమ్మకట్టి చూపుతూ..

"అలసిన పెద్దను కదా
ఆత్మీయంగా చూసుకో...
వీడ్కోలును అందుకో"

అంటూ తనతోనే గుండెలు కరిగేలా వీడ్కోలు చెప్పించాడు రచయిత చివరిలో "మా ఊరు" కవితలో....

ఎర్రనది మావూరు - సూరనది మావూరు
ఎందరో గొప్పోళ్ళ నెలవమి మా ఊరు

వాసి యందును - జనులరాసి యందును పేరు గాంచిన ఊరు పేరు "గుడ్లూరు" అంటూ అంతటి ప్రాభవ మున్న ఊళ్ళోతాను జన్మించానని, ఎర్రన, సూరన పరంపరలో వాడినని మాట వరసకైనా సగర్వంగా చెప్పుకున్నాడు మధుసూదన్.

ప్రత్యేకతేమిటంటే ఏ అంశాలపై రాసినా వాటిల్లో సమ సమాజం నిక్షిప్తం చేయబడింది. మధు గారు సమాజంతో జతకట్టి నడుస్తున్నాడని అర్థమౌతుంది. ఆరుపదుల స్వతంత్ర భారత ఘనత కన్నా నేడు కార్మికులు, కర్షకులు, అనాథలు, పసికందులు పడుతున్న అగచాట్లతో నా దేశంలో గతమే బాగుండేదనే నిర్ణయానికొస్తాడు. "ఏమున్నది నేటి ప్రగతి?" అంటూ డెబ్బదేళ్ళ పాలను ఎంగడట్టాడు. వాడుతున్న బాల్యానికి, మాడుతున్న యువతకు చదువే చక్కని పరిష్కారమని 'విముక్తి గీత' విన్పించాడు.

"ఇప్పుడు అమ్మలకు కూడా
మగాళ్ళంటే భయం, మృగాళ్ళంటే భయం
అడుగడుగునా భయం.. అణువణువునా భయ"

అంటూ 'ఆడ' అనే పదానికే భద్రత లేకుండా పోయిందని బాధపడతాడు. అయితే అందుకు పరిష్కారంగా...

"అమ్మలు ఆగ్రహించాలి
బుద్ధివక్రించినప్పుడు.. చిత్త చలించినప్పుడు
పైత్యం ప్రజ్వలించినప్పుడు
వ్యసనం... విలాసం.. విధ్వంసం వైపు పయనం సాగినప్పుడు
వ్యవస్థ పతనం దిశగా పరుగులు తీసినప్పుడు..
అమ్మలు ఆగ్రహించాలని" సూచించాడు.

'సంకురాత్రి' గేయకవిత మాత్రా చందస్సులోసాగి అచ్చంగా గురజాడ వారి ముత్యాల సరాలను తల పిస్తుంది. సిరుల పండుగ సంక్రాంతి వేళ.

"పంటవేసి అలసి సొలసే రైతులకు మెతుకెక్కడ?
కండలను కరగించి పోసెడి కార్మికుల బ్రతుకెక్కడ?
రంగు రంగుల చీరనేసి సాలె మనుగడ ఎక్కడ?
జాలిగొలిపే బతుకు గడిపే జాలరుల ఊసెక్కడ?

అని రైతులు, కార్మికులు, సాలెలు, జాలరులు వంటి శ్రామికులకు నిజమైన సంకురాత్రి ఎక్కడుందని తన ఆవేదన వెళ్ళగక్కుతాడు కవి. శ్రామికజన పక్షపాతం కవికి సహజమే కదా!

"ద్రవ్యోల్బణం, పంచశీల - అంటువ్యాధులు, అనారోగ్యం
దేశరక్షణ, తీవ్రవాదం - అక్రమాలు, నల్లధనం
అత్యాచారాలు, ఆకతాయి విజృంభణలు - జూదాలు, వ్యసనాలు
అశ్లీలత, అసంపూర్ణ విద్య - దొమ్మీలు, దొంగతనాలు

ఇంకా ఇలాంటివెన్నో?" సామాజిక సమస్యలు కవితా వస్తువులుగా, ప్రగతిశీలక దృక్పథం పరిష్కార మార్గంగా 'జయవసంతం' కవిత్వమైంది.

అధ్యాపక వృత్తిలో ఉండడం చేతనేమో కవి నవజీవన 'ఓనమాలు' దిద్దించి, 'నీటిపాఠం' బోధించాడు. వర్తమాన 'కొత్తపోకడ'లను వర్ధమాన భారతమని ఉపన్యసిస్తుం డాలిగ!' అంటూ పర్యావరణ పరిరక్షణకోసం ప్రతిఘటిం చాడు. గాలి, నీరు, ఆకాశం, ఆహారం, నివాసం, ఉనికి లను కుళ్ళబారనీయకుండా స్వచ్ఛంగా ఉంచాలని, స్వేచ్ఛాభారత జగతిని వదులుకోవద్దని 'జైహింద్' చెప్పాడు.

నేడు సమాజంలో జరుగుతున్న అక్రమాలు, అన్యాయాలు, సంఘర్షణలు, జాతి వైరుధ్యం వంటి సామా జిక రుగ్మతలకు కవి చలించిపోయి రేపటి ప్రపంచం ఎలా ఉంటుందో ఒక 'దుఃస్వప్నం' కంటాడు.

"..... సంస్కృతిని, సంప్రదాయాన్ని
చెరిపేసి మరీ మేం చరిత్రను తిరగరాసుకుంటున్నాం.
. . . . . .
మా జాతి సమైక్యతకు
మా చేతులతోనే చెల్లురాస్తున్నాం"

సామాజిక అల్లకల్లోలాలు, సుఖదుఃఖాలు ఈ కవితలో అన్యాపదేశంగా దర్శనమిస్తాయి.

కపటీకృత ఆర్థిక విధానాలతో రైతును కుళ్ళబొడుస్తున్న దుర్మార్గపు వ్యవస్థను వ్యంగోక్తితో 'దండిచాల్సిందే' నంటూ దండయాత్ర చేసిన ఈ కవి నిజంగా రైతు పక్షమే అని నిరూపితమౌతుంది.

"మేమేదో కొత్తదనం కోసం 'ఋణమాఫీ' అంటే
అది కుబేరులకు మాత్రమే వర్తించే కాన్సెప్టని
గుర్తించరే వీళ్ళు
. . . . . .
ధర్మం తప్పిగూడా గొంతుపెగుల్తుందీళ్ళకి
ఈళ్ళని ఖచ్చితంగా దండిచాల్సిందే!"

ఈ వ్యంగ్య కవితలో వాస్తవికత దర్శనమిస్తుంది. ఉద్యోగ విమరణ చేస్తున్న ఓ పోస్ట్‌మ్యాన్ (కవి గాంచిన వ్యక్తి)

"ఓరెక్కల పంజరమా! మన చెలిమికి యింకసెలవ్
సజావుగానే సాగిన సహవాసానికి గుడ్ బై"

అని తన ఉద్యోగ మధుర స్మృతులను తలపోసుకున్న కవిత విశ్వకవి రవీంద్రుని "ది పోస్ట్‌మాస్టర్" రచనను గుర్తుకు తెస్తుంది. పోస్ట్‌బాక్స్‌ను రెక్కల పంజరం, ఎర్రని గుండెలతో ప్రతీకరించడం కవి భావుకతకు అద్దం పడు తుంది.

పుణ్యానికిపోతే పాపం ఎదురైందన్న చందంగా గోదావరి పుష్కరాల దుర్ఘటనకు చలించిన కవి...

"పుష్కరం జనసంద్రం
మన ప్రవాహం... మహాప్రవాహం
మూర్ఖత్వం నేర్పినపాఠం, అమాయకులకు అందిన ఫలితం
మన స్వార్థం రేపిన పుణ్యం చరిత్రలో చెరగని గాయం"

అంటూ 'ఓంశాంతిః' చెప్పినా, ఇందులో శాస్త్రీయ దృక్పథం ధ్వన్యాత్మకంగా విన్పిస్తుంది.

'కవిత్వం జీవితానికి వ్యాఖ్యానం' అన్న సత్యాన్ని నిరూ పించేదిగా ఉంది ఈ బతుకు బండి - కవిత్వం. దైనందిన జీవితంలో కలిగే అనుభవాల్లోంచి వల్లవించిన అనుభూతు లను కవిత్వీకరించడంలో మధుసూదన్ గారు కృతకృత్యు లయ్యారని భావిస్తున్నాను.

కవిత్వమంటే ఏమిటో? అది ఎలా గుండాలో? చాలా మంది కవులు, విమర్శకులు చెప్తూనే ఉన్నా మనకాలంలో మన మధ్య తిరుగుతున్న కవితాయోధుడు కె. శివారెడ్డి గారు...

"కవిత్వమంటే మరేదోకాదు...
కవిత్వమంటే జీవితం,
కవిత్వమంటే తాను నివసించే ప్రాంతం
కవిత్వమంటే అస్థిత్వం

కవిత్వమంటే అనుభవాలు
కవిత్వమంటే ప్రజల సమస్యలు, ఉద్యమాలు"

అంటూ సామాజిక కవిత్వాన్ని సరళీకరించారు. దీనిని బట్టి 'బతుకుబండి' నిండా అసలైన కవిత్వం కనిపిస్తుంది.

ఆధార గ్రంధాలు :

1. బతుకుబండి
2. ఆధునిక సాహిత్య సమీక్ష
3. ఆధునిక సాహిత్యం - సంప్రదాయాలు - ప్రయోగాలు
4. తెలుగు సాహితీ వికాసం
4. తెలుగు సాహిత్యంలో చర్చనీయాంశాలు

⌘⌘⌘

BHAVAVEENA
Vol. 17, Issue. 8, August 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

'ప్రజల మనిషి' నవలా కాలంనాటి పరిస్థితులు, సందేశం

– డా॥. దేవినేని జ్యోతి, ఎడిటోరియల్ అసిస్టెంట్, ప్రచురణల కేంద్రం, ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం.

ఆధునిక తెలుగు సాహిత్యంలో నవల ప్రధాన భూమిక పోషిస్తున్నది. నేడు సమకాలీనాంశాలను వస్తువుగా తీసుకొని రచయితలు ఈ ప్రక్రియలో రచనలు చేస్తున్నారు. సరళశైలిలో వుండటం వల్ల నవలకు పాఠకాదరణ తక్కిన ప్రక్రియల కంటే ఎక్కువగా వుంది. కథ, వచన కవిత్వానికి కూడా నవలలాగా పాఠకాదరణ ఎక్కువే. కథ, వచన కవిత్వం కంటే నవల అన్ని వర్గాల ప్రజల జీవన స్థితిగతులను చక్కగా చిత్రిస్తున్నది. నిజ జీవితాన్ని నిత్యజీవితాన్ని నవల సమగ్రంగా పేర్కొంటున్నది. అందువల్లనే నవలను రచనా కాలానికి చెందిన అన్ని సామాజికాంశాలకు దర్పణం పడుతుందని విమర్శకులంటున్నారు. తెలుగులో నవల పాశ్చాత్య ప్రభావంతో రూపుదాల్చిన కాలక్రమంలో అది తెలుగు ప్రక్రియే అన్నంతగా గుర్తింపుపొందింది. దీనికి నవలా రచయితలే కారకులని చెప్పవచ్చు. అలాంటి నవలాకారుల్లో అగ్రగణ్యులు వట్టికోట ఆళ్వారుస్వామి.

'ప్రజల మనిషి' నవల తొలి తెలంగాణా నవల. ఇది సాంఘిక నవల. ఇందులో ఇతివృత్తం 1938కి పూర్వం తెలంగాణా ప్రాంతంలోని ప్రజాజీవితం. ఇది ఉద్యమం కోసం అల్లిన కథ. తెలంగాణా ప్రాంతంలోని పట్వారీలు, ప్రభుత్వ అధికార్లు చేస్తున్న దోపిడీని, దౌర్జన్యాన్ని కళ్ళకు కట్టిన నవల. సామాన్య ప్రజలు అధికారుల దౌష్టానికి నలిగిన తీరును వర్ణించిన నవల. అణగారిన ప్రజలను చైతన్యపరచి ఆవేశంతో ముందుకు నడిపించిన నవల. ప్రజల కోసం, ప్రగతి కోసం పోరాటం చేయడం తప్ప మరొక గత్యంతరం లేదని బోధించిన నవల. ప్రజల సౌఖ్యమే పరమావధిగా భావించి పోరాటం సాగించిన ప్రజల మనిషి ఎలా ఉంటుందో చూపించిన నవల. అమలిన జీవితాన్ని, ప్రేమను, ఆప్యాయతను, వేదనను సున్నితంగా చిత్రించిన నవల. నెత్తుటి మరక, తుపాకీల చప్పుడు, కత్తుల చెలగాటం. కనిపించని అహింసా సిద్ధాంతంతో పోరాటాన్ని వర్ణించిన నవల. 'ప్రజల మనిషి' నవల ఉద్యమం కోసం అల్లిన కథ, పోరాటమే ప్రజల సమస్యలకు పరిష్కారమని ఈ నవల సందేశం.

ఈ నవలలో ఆనాటి సాంఘిక చరిత్ర ఉంది. రాజకీయ విశేషాలున్నాయి. మతమార్పిడి, మత సహనాలతో పాటు ఆర్థిక స్థితిగతులు కూడా వర్ణించబడ్డాయి. ఇది చదివితే తెలంగాణా ప్రజల జీవన విధానం కళ్ళముందు కన్పిస్తుంది.

సాంఘిక పరిస్థితులు :

'ప్రజల మనిషి' అనే నవల సాంఘిక జీవనాన్ని ప్రతిబింబించిన నవల. ఈ నవలలో ఆనాటి తెలంగాణా సమాజంలోని అనేక విషయాలు కన్పిస్తాయి.

ఆ రోజుల్లో పట్వారీలు గ్రామాధికారులుగా అధికారాన్ని చెలాయించే వారు. వారిని ఆ గ్రామ ప్రజలు 'దొర' అని పిలిచేవారు. వీరు ప్రజలను అనేక రకాలుగా పీడించేవారు. లంచాలు తీసుకునేవారు, పొలాలను స్వాధీనం చేసుకునేవారు. ప్రభుత్వ చెరువులను వేలం వేసినట్లు చూపించి, అతి తక్కువ సొమ్ము చెల్లించి వ్యవసాయం చేసుకొనేవారు. ఎవరైనా వారికి ఎదురు తిరిగినా, వారి చర్యల గురించి ప్రశ్నించినా వారిని విపరీతంగా కొట్టేవారు. ఈ గ్రామ పట్వారీలు ప్రభుత్వ అధికారులను విందులతో, వినోదాలతో మచ్చిక చేసుకునేవారు. సర్వ సదుపాయాలు సమకూర్చి వారిని ఆనందింపజేసేవారు.

పట్వారీలు తమ పరపతికి భంగం కలుగుతుందనుకుంటే ఎంతైనా ఖర్చు చేయడానికి వెనుకాడేవారు. హైదరాలీ హరిజనులను తురకలుగా మార్చి పరపతి

పెంచుకోవడం చూసి సహించలేక, రామభూపాల్ రావు ఆర్య సమాజం వారిని కలిసి, విజయదేవును తీసుకువచ్చి హరిజనులందరిని హిందూ మతంలో మార్పించాడు. ఆ సమయంలో వీరికి ఐదుసేర్లు వడ్లు ఇచ్చేవాడు. ఇదంతా గ్రామంలో తన అధికారాన్ని కాపాడుకోవడంకోసమే. పట్వారీలు తమ రాజసాన్ని చూపించడానికి బండ్లలో ప్రయాణించేవారు. ఆబళ్ళను లాగడానికి కూడా వారికి ఎద్దులున్నా ఇతరుల ఎద్దులను పిలిపించుకునేవారు.

పట్వారీల ఇళ్ళలో పెళ్ళిల్లు జరిగితే ఆ గ్రామంలోని ప్రజలంతా పెళ్లిల్లకు తమకు చేతనంత సహాయం చేసే విధంగా పట్వారీలు ఆజ్ఞలు జారీ చేసేవారు. ఈ నవలలో రామభూపాల్‌రావు తన కూతురితో అత్తవారింటికి పంపడానికి కోటయ్య ఆవును తెప్పించుకున్నాడు. అలాగే అండాళమ్మ చేత విస్తళ్ళు కుట్టించి తెప్పించుకున్నాడు. కోటయ్య చేత కూరగాయలు తెప్పించుకున్నాడు. పెళ్ళి పనులన్నీ గ్రామంలోని ప్రజలు ఉచితంగా ఆయనకు చేసి పెట్టే వారు. ఈ నవలలో రామభూపాల్‌రావు దిమ్మెగూడెం పట్వారీ. ప్రజలను బాధించేవాడు. ప్రజల ఆస్తులను హరించే దుర్మార్గుడుగా కన్పిస్తాడు.

కొంతమంది ఉపాధ్యయులు విద్యార్థులను విపరీతంగా కొట్టేవారు. బాధతో అరిచినా వారి మనస్సు కరిగేది కాదు. కోదండం వేయించేవారు. వేంకటాచార్యుల్ని ఉపాధ్యాయులు హింసించడం చూసి తండ్రి అతనిని చదువు మాన్పించి తీసుకెళతాడు. కొంత మంది ఉపాధ్యాయులు విద్యార్థులను ఆదరంగా ఆప్యాయంగా చూసేవారు. ఈ నవలలో కంఠీరవానికి విద్య నేర్పిన ఉపాధ్యాయుడు అతనిని ప్రేమగా చూశాడు. తను వేరే మతానికి చెందినవాడైనా కఠీరవాన్ని తన ఇంటికి తీసుకెళ్ళి అతనిని ప్రోత్సహించేవాడు.

బ్రాహ్మణులు అనేక ఆచారాలు పాటించేవారు. కంఠీరవం తురక పంతుల ఇంట్లో ఉంటే ఆ ఇంట్లోకి వెళ్ళడానికి కూడా అండాలమ్మ సంకోచించింది. మోహనాచార్యులు బొట్టుపెట్టుకో లేదనే కారణంతో వైష్ణమతానికి చెందిన బ్రాహ్మణులు అతనితో సహపంక్తి భోజనానికి విముఖత చూపారు. జైలుకి వెళ్ళిన వారికి ప్రాయశ్చిత్తం కల్పించాలనే అభిప్రాయం కొంతమందిలో ఉండేది. ఇతర మతాల వారితో భోజనం చేయడాన్ని కూడా కొంత మంది తప్పుగా భావించేవారు. ఇలాంటి ఆచారాలను లెక్కించనివారు కూడా ఆ కాలంలో ఉండేవారు. కంఠీరవం మహమ్మదీయుడైన బషీరుతో కలిసి భోజనం చేశాడు. ఆచారాలు, కట్టుబాట్లు, సంప్రదాయాలు అన్నీ మానవ కల్పితాలని, వాటిలో మంచి వాటిని మాత్రమే పాటించ వచ్చును గాని మానవత్వానికి మచ్చ తెచ్చేవాటిని పాటించనవసరం లేదని చెప్పేవాడు.

వేదాంతాచార్యుల వంటి వైద్యులు డబ్బుఇవ్వక పోయినా వైద్యం చేసేవారు. రోగి డబ్బు ఇస్తానన్న తాను మూడు రోజుల వరకు పైకం తీసుకోనని మూడు రోజులకు కూడా జ్వరం తగ్గకపోతే ఆ తర్వాత చూద్దామని వేదాంతాచార్యులు చెప్పారంటే వైద్యవృత్తిని ఆయన ఎంత పవిత్రంగా భావించారో అర్థమౌతుంది. తమకు తెలిసిన వాళ్ళు ఆపదలో ఉంటే సహాయపడుతూ వారిని పెంచి, చదివించే వాళ్ళు ఉన్నారని వేదాంతాచార్యుల్ని చూస్తే అర్థమౌతుంది. తల్లిదండ్రుల పోషణ, ఆదరణ లేని పిల్లలు దొంగతనాలు చేసేవారు. బషీర్, అతని ఇద్దరు మిత్రులు దొంగతనం చేస్తూ పోలీసులకు పట్టుపడ్డారు. జైలు నుంచి తిరిగివచ్చిన వారిలో పశ్చాత్తాపం కన్పించ లేదు. అమాయకులను మోసగించడం వ్యాపారస్థుల్లోనే గాక, ఉద్యోగం చేసేవారిలో కూడా వుంది. లక్ష్మీనారాయణ అనే బట్టల వ్యాపారి తమ వద్దకు వచ్చిన వినియోగదారులను మోసగిస్తే, రైల్వే స్టేషను మాస్టరు ప్రయాణీకులను మోగసించి డబ్బు తీసుకున్నాడు. కొంత మంది మతాచారులు నియమ నిష్టలను పాటించినా, కొంత మంది అభ్యుదయ భావాలు కల్గిన వారు ఆ ఆచారాలను విడిచిపెట్టారు. కంఠీరవం బ్రహ్మణుడయినా అతడు బషీరుతో కలిసి భుజించేవాడు. వెంకటేశ్వరరావు బ్రాహ్మణుడైనా బషీరుకు తన బట్టలు ఇచ్చేవాడు. కరువు, కాట

కాలు వచ్చినపుడు తల్లిదండ్రులు డబ్బు కోసం తమ సంతానాన్ని అమ్ముకొనేవారు. బషీరు తల్లిదండ్రులు అతనిని సొమ్ము కోసం ఒక మహమ్మదీయ గిర్దావరుకు అమ్మేశాడు.

రాజకీయ పరిస్థితులు :

తెలంగాణ ప్రాంతాన్ని నైజాం నవాబు పరిపాలిస్తూ వుండేవాడు. ఆ ప్రభువు మహమ్మదీయుడు కావడం వల్ల ఆ రాజ్యంలో ముస్లీంలకు అదనపు సౌకర్యాలుండేవి. సభగాని, సమావేశం గాని జరుపుకోవాలంటే ప్రభుత్వం అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలి. అనుమతి ఇచ్చే టప్పుడు అనేక విధాలైన నిబంధనలు విధిస్తూ ఉండే వారు. కథాకాలానికి స్టేట్ కాంగ్రెస్ సంస్థ నెలకొల్పబడింది. అది నైజాం ప్రభుత్వానికి వ్యతిరేఖంగా ఉద్యమం ప్రారంభించింది. ప్రభుత్వం వారిని అణచడానికి నిర్బంధించి, జైలుకు పంపుతూ ఉండేది. తప్పులు చేసిన అధికారులను ప్రభుత్వం పట్టించుకోనేది కాదు.

మత పరిస్థితులు :

కథా కాలం నాటికి తెలంగాణలో హిందూమతం, మహమ్మదీయ మతం ఉండేవి. ఆంగ్లేయులు కూడా క్రైస్తవ మత వ్యాప్తి కోసం ప్రయత్నిస్తూ వుండేవారు. హిందువులు హరిజనులను ఊరికిదూరంగా ఉంచేవారు. వారి చేత పనులన్నీ చేయించుకొనేవారు. అంజుమన్ అనే మత సంస్థ ప్రభుత్వ సహాయంతో హరిజనులను మహమ్మదీయ మతంలోకి మార్చడానికి కృషి చేస్తుండేది. అలా హరిజనులు తురకలుగా మారినప్పుడు హిందువులు సహించే వారు కాదు. వారిని సాంఘికంగా బహిష్కరించే వారు. ఆర్య సమాజం అనే హిందూమత సంస్థకు చెందిన వారిని పిలిపించి వారిచేత ఉపన్యాసాలు చెప్పించేవారు. శుద్ధి సంస్కారం జరిపి మళ్ళీ హిందువులగా మార్పించే వారు. మతం మార్చుకుంటేభూములు ప్రభుత్వ ఉద్యోగాలు ఇస్తామని ప్రలోభాలు పెట్టేవారు. మత మార్పిడిని హిందువులు ఎదిరిస్తే జైల్లో పెట్టేవారు. ప్రభుత్వం ఎలా వున్నా మత సామరస్యం కూడా తెలంగాణాలో కన్పించేది. బ్రాహ్మణ కుటుంబానికి చెందిన కంఠీరవాన్ని మహమ్మదీయుడైన పంతులు, అతని భార్య తమ సొంత కుమారుడిలా ఆదరించారు. సమాజంలో బ్రాహ్మణులకు గౌరవం ఉండేది. వారిని అగ్రకులంగా గౌరవించేవారు. ఆంగ్లేయులు క్రైస్తవ మత వ్యాప్తి కోసం పాఠశాలలు నెలకొల్పేవారు. మత మార్పిడికి అనుకూలంగా సభలు ఏర్పాటు చేసేవారు.

ఆళ్వారు స్వామి ఈ నవలలో మొదటగా ఒక ఎద్దు వృత్తాంతాన్ని చెప్పడం జరిగింది. "రైతుకు ఎద్దు మేత వేస్తాడు. దారినపోతున్న ఒక ఆవు ఆ గడ్డిలో మూతిపెట్ట బోతుంది. తన హక్కును హరించబోతున్న దీన్ని కోపంతో ఎద్దు ఆవును కుమ్మబోతుంది. అందరికీ సంబంధించి నదిగా తలచబడే వస్తువును ఇతరులు హరించబోతుంటే అడ్డుపడి రక్షించుకొనే ఆలోచన ఆ ఎద్దుకు కలిగింది". ఈ సంఘటన ఈ నవలకు వస్తు నిర్దేశంగా రచయిత చెప్పడంజరిగింది. తమ వస్తువును హరిస్తుంటే జంతువులే సహించలేనప్పుడు మనిషి ఎలా సహిస్తాడని ప్రశ్నిస్తూ మనిషి సహించడని ఈ నవలలోని ఇతివృత్తం తెలియ జేస్తుంది అని రచయిత సూచించాడు.

వెంకటేశ్వరరావు పొలాన్ని కాజేసినందుకు అతనికి జైలుశిక్ష పడే విధంగా చేయడంలో వెంకటేశ్వరరావు, పరంధామయ్యలు చేసిన కృషి హర్షించదగ్గది. దిమ్మెగూడెంలోని హరిజనులను మహమ్మదీయ మతంలోకి మార్చే సందర్భంలో వారిప్రయత్నాన్ని ప్రశ్నించిన కంఠీరవం కొమరయ్య నిర్భందింపబడ్డారు. మతం మార్చుకున్న వారే మళ్ళీ రామభూపాలరావు ప్రోద్భలంతో హిందూమతంలోకి మారారు. ప్రజల అమాయకత్వాన్ని, ఆశలను ఆధారంగా చేసుకొని మతమార్పిడికి ప్రయత్నించే సంస్థలను, ప్రభుత్వాలను సహించకూడదని వానికి వ్యతిరేఖంగా పోరాడాలని 'ప్రజల మనిషి' నవల ఇచ్చే సందేశం.

కులమతాలు, ఆచార వ్యవహారాలు మనుషులు ఏర్పాటు చేసుకున్నవే గాని అవిసృష్ట్యాది నుంచి వున్నవి కావు. వీటి కారణంగా మనుషుల మధ్య అడ్డుగోడలు

ఏర్పడకూడదని, అలా ఏర్పడితే మానవ సంబంధాలు దెబ్బతిని ఐక్యమత్యంపోతుందని ఈ నవల ద్వారా తెలుస్తుంది. విచక్షణ, వివేకం ఉన్నవారు వీటిని తొల గించడానికి ప్రయత్నించాలని కంఠీరవం పాత్ర తెలియ జేస్తుంది.

బ్రాహ్మణ కులంలో పుట్టిన కంఠీరవం మహమ్మదీయ పంతులికి ఇష్టడయ్యాడు. బషీరుతో కలిసి భోజనం చేశాడు. అన్నమ్మ చేతివంట భుజించాడు. ఐకమత్యంగా వున్నప్పుడే ప్రగతిసాధ్యమని ప్రబోధించాడు.

కోటయ్య రామభూపాల్‌రావును ఎదిరించలేక అవును, కూరగాయలను ఆయనకు ఇచ్చాడు. అండా ళమ్మ అతనిని ఎదిరించలేక విస్తరాకులను కుట్టి ఇస్తుంది. రఘునాథచార్యులు అతనిని ఎదురించలేక పొలాన్ని వదులుకున్నాడు. ఈ ముగ్గురు పరిస్థితులకు తలవంచి నష్టపోయారు. కాని కోటయ్యకొడుకు కొమరయ్య దొరతో పోరాడి లాభం పొందాడు. అండాళమ్మ రఘునాథా చార్యుల కుమారుడు కంఠీరవం పోరాడి గ్రామానికి మేలు కల్గించాడు. కనుక పోరాటాలు ద్వారా ప్రయోజనం పొందవచ్చునని ఈ నవల సందేశాన్నందించింది.

ఈ నవలలో కోటయ్య అనే రైతు కొడుకు కొమరయ్య దిమ్మెగూడంలో బ్రాహ్మణుల పొలాన్ని కోటయ్య కౌలుకు తీసుకొని వ్యవసాయం చేసేవారు. కొన్ని రోజులకు ఆ బ్రాహ్మణుడు చనిపోగా భార్య కొడుకుతో పాటు ఊరి విడిచి వెళ్ళారు. కోటయ్య తర్వాత కొమరయ్య సాగు చేసుకుంటున్నాడు. ఈ విషయం పట్వారీ రామభూపాల రావుకు తెలుస్తుంది. కొమరయ్యను పిలిపించి ఆ భూమి నీది కాదు నేను వేరేవాళ్ళకు కౌలుకు ఇస్తానని చెప్పి వెళ్ళిపొమ్మంటాడు.

బ్రాహ్మణుడి కుమారుని పేరు వెంకటేశ్వర్లు. రామ భూపాలరావు వేంకటాచార్యునికి భూమి ఇస్తానని ఆశపెట్టి తన పేరు వెంకటేశ్వర్లు అని చెప్పమన్నాడు. వెంకటా చార్యులు పట్వారిపై భయంతో, పొలం మీద ఆశతో వెంకటేశ్వర్లుగా నటించారు. ఒకరోజు రామభూపాలరావు కొమరయ్య భూమిలో దున్నడానికి మనుషులను పంపుతాడు. దున్నడానికి వచ్చిన వారిలో హైదరాలీ కొమయ్యను నీ వస్తువులను తీసుకొని వెళ్ళమంటాడు. చచ్చిపోయిన బ్రాహ్మణుడు పొలం ఎట్లా అమ్మాడని కొమరయ్య నిలదీశాడు. అందుకు రామభూపాలరావు కొమరయ్యను చావకొట్టాడు.

కంఠీరవంతో పాటు వెంకటేశ్వరరావు అనే వకీలు ఆ ఊరికి వచ్చాడు. చివరికి ఆ పొలం వెంకటేశ్వరరావు అనే వకీలుదని, అతడు ఎంరికీ ఆ పొలం అమ్మడం లేదని తెలుస్తుంది. వెంకటేశ్వరరావు, పరంధామయ్యా తహ శీల్దారు వద్దకు వెళ్ళి తెలుసుకొంటారు. కంఠీరవం అన్న వెంకటాచార్యులు, వెంకటేశ్వర్లుగా నటించి ఆ పొలాన్ని రాంమభూపాలరావుకు రిజిష్టరు చేసినట్లు తెలిసింది. ఈ విషయాన్ని న్యాయాది పతికి తెలియజేయడంతో వెంకటా చార్యుల్నీ రామభూపాలరావునూ నిర్భందించమని ఆజ్ఞా పిస్తాడు. ఈ విధంగా వీరికి జైలు శిక్ష పడుతుంది. పొలం వెంకటేశ్వరరావు వశమైంది. తిరిగి కొమరయ్య సాగు చేస్తాడు.

గ్రంథపఠనం వల్ల లోకజ్ఞానం కలుగుతుందని సమా జాన్ని అర్థం చేసుకునే అవకాశం ఉంటుందని ఈ నవల ద్వారాతెలుసుకోవచ్చు. కంఠీరవం నిజామాబాద్ గ్రంథా లయంలోని గాంధీ ఆత్మకథతో పాటు అనేక గ్రంథాలను పఠించడం వల్ల అతని దృక్పథంలో మార్పు వచ్చింది. బుద్ధి వికసించింది. పరిపూర్ణమానవుడై ప్రగతి శీల భావా లతో సమాజోద్ధరణకు కంకణం కట్టుకున్నాడు.

జైళ్ళు ఖైదీలతో పరివర్తన కల్గించి మంచి మను షులుగా మార్చే పద్ధతిలో వుండాలని ఈ నవల తెలియ జేస్తుంది. వాస్తవానికి హైదరాబాదు జైలులో అధికారులు పెట్టే బాధలు భరించలేక ఒకడు పిచ్చివాడయ్యాడు. వారు కొట్టే దెబ్బలు సహించలేక బషీరు కేకలు పెట్టాడు. దొంగతనాలు మానివేద్దామని అనుకున్నా వారిని దొంగతనాలకు పోలీసులే ప్రోత్సహించేవారు. జైలులో

చేరినవాడు మనో నిబ్బరం కోల్పోతాడు. ఆత్మ విశ్వాసాన్ని పోగొట్టుకుంటాడు. జైలు వాతావరణం మారినప్పుడే ఖైదీల ప్రవర్తన మారుతుందని ఈ నవల సూచిస్తుంది.

మంచి ప్రభుత్వం ఎలా వుంటుందో కంఠీరవం ద్వారా రచయిత చెప్పించాడు. ''మంచి ప్రభుత్వంలో తల్లి దండ్రులు కన్న బిడ్డలను అమ్ముకోరు. అన్యాయంగా ఇతరుల ఆస్తులను ఆక్రమించరు. ఒకరికి మరొకరిపై ద్వేషం వుండదు. ఆకలి అని అరిచేవారుండరు. చదువు రాని వాడుండడు. అందరూ నీతితోవుంటారు. కట్టుగా వుంటారు. దయతో మెలుగుతారు. అంతా ఆప్తులుగా ఉంటారు'' ఇలాంటి ప్రభుత్వం ఉండాలని ఆళ్వారు స్వామి ఈ నవల ద్వారా సూచన చేశాడు.

పోరాటం చేసిఒక విజయం సాధించినంత మాత్రాన సమాజం మారిపోదు. కొత్త వ్యక్తులు వస్తారు. కొత్త దోపిడీ ప్రారంభమౌతుంది. పరిస్థితులు మారినప్పుడు ఒక్కొక్క సారి పాతవారే మళ్ళీ పుంజుకుంటారు. ఈ పోరాటం అవిశ్రాంతంగా జరుగుతూ ఉండవలసిందే అని నవలలో రచయిత సూచించాడు.

ఆధార గ్రంథాలు :

1. 'ప్రజల మనిషి' నవల - వట్టికోట ఆళ్వారుస్వామి

⌘⌘⌘

BHAVAVEENA
Vol. 17, Issue. 8, August 2020
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ

UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

రామాయణం – సమకాలీనత

– పరుచూరి విజయలక్ష్మి, కె ఆర్ కె గవర్నమెంట్ డిగ్రీకళాశాల, అద్దంకి. ప్రకాశం జిల్లా.

వేదాలు, పురాణాలు, ఇతిహాసాలు, మన జీవన సంస్కృతిని ప్రతిబింబిస్తాయి. ఆనాడే కాదు ఈనాటికీ కూడా ఇవి మన జీవితాలతో ముడిపడి ఉంటాయి. రామాయణం నారద మహర్షి ప్రేరణచే వాల్మీకి చేత రచించబడింది. రామాయణంలో పితృ వాక్య పరిపాలన. మాతృ, భ్రాతృ ప్రేమా. ఏకపత్నీ వ్రతం. రాజ్య పాలనా, రాజ లక్షణాలు కుటుంబ సంబంధాలు, ఇవన్నీ నేటి కాలానికి ఆదర్శంగా నిలుస్తాయి అనడంలో సందేహం లేదు. రామాయణం మత సంబంధ గ్రంధం, రాముడు దేవుడు అనే కంటే ఒక ఆదర్శ పురుషుడు. ఆయన జీవితం అందరికీ ఆదర్శప్రాయం అనేది మనం అర్థం చేసుకోగలిగితే రామాయణం ఈ కాలానికి కూడా మేలు కొల్పులాంటిది అనడంలో ఎటువంటి సందేహము లేదు.

కుశనాభుడు ఘృతాచి అను అప్సరసను వివాహం చేసుకొని నూరుగురు కుమార్తెలను పొందాడు. ఆ కన్యలు సౌందర్య రాసులు .రూప యౌనాలతోనూ, సద్గుణాల తోనూ ఉన్న ఆకన్యలను చూసి వాయుదేవుడు మోహి తుడై వారిని వివాహం చేసుంటానని అడుగుతాడు. అంతే కాకుండా తనను వివాహం చేసుకుంటే దైవత్వం, నిత్య యౌవనము వస్తుందని చెబుతాడు. అదివిని ఆకన్యలు సురోత్తమా! నువ్వు సమస్త ప్రాణికోటిలోనూ సంచరించే వాడివి.నీ ప్రభావం మాకు తెలుసు కానీ, నువ్వు ఇప్పుడు మాట్లాడిన మాటలు నీకు తగినవి కావు. మేము కుశనా భుడీ కుమార్తెలం. నువ్వు దేవుడివైనా నీ నుంచి ఆత్మ రక్షణ చేసుకొనే తపశ్శక్తి మాకుంది. నువ్వు దేవుడవు. నీకు మంచిచెడ్డలు తెలియాలి కదా. సత్యవాది ఐన తండ్రిని కాదని కన్య స్వయంగా తన భర్తను నిర్ణయించుకోవచ్చా? మా తండ్రి ధర్మాత్ముడు.ఆయన మమ్మల్ని ఎవరికి కన్యాదానం చేస్తాడో వారికే మేము భార్యలమౌతాము. ధర్మ మార్గం వదలని మాతో ఇటువంటి ప్రవర్తన నీకు తగదు. అనగానే వాయుదేవుడు కోపించి వారి శరీరాలలో ప్రవేశించి శరీరాలను శిధిలం చేశాడు. వారు పొట్టిగా బలహీనంగా అయి, కాళ్ళు తడబడుతూ నిలువలేక నేలపై పడిపోయారు.

ఇక్కడ రెండు విషయాలు మనం ఎప్పటికీ గమనిం చాలి. మొదటిది ఆడపిల్లలు కానీ మగపిల్లలు కానీ కన్నవాళ్లను తిరస్కరించి ప్రేమలు పెళ్లిళ్లు అంటూ స్వతంత్రించి నిర్ణయాలు తీసుకొని జీవితాలను నాశనం చేసుకోవడం చూస్తూనే ఉన్నాము. ఇక్కడ వాయుదేవుడు తనను వివాహం చేసుకుంటే దేవతా స్త్రీలు అవుతారని ప్రలోభ పెట్టినా ఆ కన్యలు లొంగిపోలేదు. పైగా మా తండ్రి ఎవరికి కన్యా దానం చేస్తాడో వారికే భార్యలము అవుతాము అని సమాధానమిస్తారు.ఇక్కడ తండ్రికి వాళ్ళు ఇచ్చిన గౌరవం ప్రతి బిడ్డా ఆడ కానీ మగ కానీ తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనాఉంది. ఈ కథ ఈనాటి పిల్లలకు చాలా అవసరం కూడా.

ఇక రెండవ విషయానికి వస్తే ఆడ పిల్లలకు ఆ రోజుల్లో కూడా రక్షణ లేదనిపిస్తుంది. వాయు దేవుడు తనను కాదన్నారనే కోపంతో వారిని శక్తి హీనులను చేశాడు. ఈ కాలంలో కూడా తమ ప్రేమను కాదన్నారనే కోపంతో, నరికెసేవాళ్ళు,యాసిడ్ దాడులకు పాల్పడుతున్న వాళ్ళను చూస్తూనే ఉన్నాము. అనాది నుండి స్త్రీకి తన ఇష్టాయిష్టా లను ప్రకటించే అవకాశమే లేదనేది మనకు కనిపిస్తూనే ఉంది.

తండ్రి మాట జవదాటని ఆదర్శ పుత్రుడిగా రాముడిని ఉదహరించడం అనాటి నుండి ఈ నాటి వరకూ మనం చూస్తూనే ఉన్నాము. రాముడికి పట్టాభి షేకం అన్న మాట విన్న కైకేయి మంధర మాటలతో స్వార్థాన్ని మనసంతా

నింపుకొని దశరథుడు ఎప్పుడో ఇస్తానన్న వరాల్బీఅను ఇప్పుడివ్వమని అడుగుతుంది అందులో మొదటిది రాముడి వనవాసం, రెండవది భరతుని పట్టాభిషేకం. దశరథుడు ఆ విషయాలను రాముడికి చెప్పలేక పోతే కైకేయి స్వయంగా రాముడికి వనవాసం గురించి చెబుతుంది అది విని రాముడు ఏమాత్రం చెక్కు చెదరకుండా స్థిర చిత్తంతో

అహం హి వచనాన్ రాజ్ఞ: పతేయమపి పావకే
భక్షయేయం విషం తీక్ష్ణం మజ్జేయమాపి చార్ణవే
నా హ్యతో ధర్మ చరణం కించిదాస్తి మహత్తరం
యధా పితరి శుశ్రూషాతస్యావా వచన క్రియా

మహారాజు ఆదేశించినచో నేను అగ్నిలో నైనా దూకగలను, భయంకరమైన విషమును కూడా తాగ గలను. అగాధమైన సముద్రములోనూ దూకగలను, తండ్రిగారిని సేవించుట, వారి ఆజ్ఞను పరిపాలించుట అనే వాటికంటే ప్రపంచములో మానవులకు శ్రేష్టమైన ధర్మము వేరొకటి లేదు. అని చెప్పి రాముడు వనవాసానికి వెళ్లడానికి సంతోషంగా అంగీకరిస్తాడు. ఇక్కడ తండ్రి పట్టాభిషేక మంటే సంతోషంగా ఒప్పుకున్నాడు. ఇపుడు వనవాసమన్నా అదే సంతోషంతో ఒప్పుకున్నాడు.

ఇప్పటి తరంలో చాలామంది పిల్లలు తాము కోరింది ఇవ్వలేదనో, వాళ్ళు నడిచే బాటసరైనదికాదన్నారనో కోపంతో తల్లితండ్రులను ఎదిరించే సందర్భాలు ఎన్నో చూస్తున్నాము. ఆస్తుల కోసం తలి తండ్రులను హత్యలు చేస్తున్న వారినీ చూస్తున్నాము. మరీ దారుణంగా తీర్చలేని కోరికలు కోరి తలితండ్రులను ఇబ్బందిపెట్టడమే కాకుండా అంత తీర్చలేనివాళ్లు మమ్ములను కనడం ఎందుకని? హృదయాలను గాయపరుస్తున్న వాళ్ళు ఉన్నారు. వారందరూ శ్రీ రాముడి గురించి తెలుసుకుంటే తలితండ్రులను ఎలా గౌరవించాలో తెలుసుకో గలుగుతారు.

శ్రీ రాముడికి సోదరులమీద అపారమైన ప్రేమ, అభిమానం మెండుగా కనిపిస్తాయి. దశరథ మహారాజు తనకు యువరాజు పట్టాభిషేకం చేయబోతున్నాడని తెలుసుకొని తమ్ముడైన లక్ష్మణుడితో

లక్ష్మణే మాం మయా సార్ధం ప్రసాధిత్వమ్ వసుంధ రామ్
ద్వితీయం మేం న్తరాత్మానం త్వామియమ్ శ్రీరుపస్థితా
సౌమిత్రే భుంక్ష్వ భోగాస్త్వమ్ ఇష్టాన్ రాజ్యఫలానిచ
జీవితం చాపి రాజ్యం చ త్వదర్ధ మభికామయే

ఓ లక్ష్మణా! నీవు నాకు బహి:జూరానము, కాబట్టి ఈ రాజ్యము నీకు వచ్చినట్లే. కనుక నాతో కలసి నీవు కూడా ఈ రాజ్యాన్ని పరిపాలించు.నీకిష్టమైన సకల సుఖాలను అనుభవించు.అమూల్యమైన రత్నాలను, ఆభరణాలను ధరించు. ఈ రాజ్యమే కాదు. నా ప్రాణాలే నీవి. నీ కోసమే నేను ఈ రాజ్యాన్ని కోరుతున్నాను. అన్న మాటలను బట్టి రాముడికి లక్ష్మణుడికి అభేదం కనిపిస్తుంది.

అరసెంటు భూమికోసం అన్నదమ్ములు ఒకరిని ఒకరు చంపుకుంటూ శతృత్వాలు పెంచుకుంటున్న వాళ్ళు, కేసులు పెట్టుకుంటూ కోర్టులచుట్టూ తిరుగుతున్నవారు, రామ లక్ష్మణులను చూసి అన్నా తమ్ముళ్ళు ఎలా ఉండాలో ఎంత ప్రేమను పంచుకోవాలో తెలుస్తుంది.

శ్రీ రాముడు కృతజ్ఞతకు నిలువెత్తు సాక్ష్యం. సీతకోసం వెతుకుతున్నరాముడికి రక్తసిక్తమైన దేహంతో జటాయువు కనిపిస్తాడు.ఆ పక్షిని చూసి రాముడు సీత నా ప్రాణము. ఆ దేవి ఎక్కడకు వెళ్లింది. అని దు:ఖంతో పడిపోతాడు. జటాయువు రావణుని గురించి చెప్పి ప్రాణములు విడువగానే ఆ మహోత్ముడగు రాముడు స్వయంగా దహన సంస్కారాలు చేసి తన కృతజ్ఞతను చాటుకుంటాడు. ఈ విషయాన్ని గమనిస్తే నేడు కృఘ్నులుగా ఉన్న ఎంతో మందికి కనువిప్పు అవుతుంది.

కుటుంబ బంధాలు, భార్యాభర్తల మధ్య అనురాగాలు, ప్రజాను రంజకంగా పరిపాలన ఎలా చేయాలి, మొదలైన ఎన్నో అంశాలు ఈనాటికీ రామాయణం ద్వారా తెలుసుకోవటానికి అవకాశాలు ఎన్నో ఉన్నాయి. ⌘


WELCOME


వ్యక్తిత్వ వికాసం - శిక్షణా శిబిరము
తేది : 23-01-2019



అభినందనలు

తెలుగు సాహిత్యం - సమకాలీనత
అనే అంశంపై వి.ఎస్.ఆర్ & ఎన్.వి.ఆర్
కళాశాల (స్వయంప్రతి) తెలుగుశాఖ
నిర్వహిస్తున్న 'అంతర్జాతీయ అంతర్జాల
సదస్సు (వెబినార్)' విజయవంతం
కావాలని... మనస్ఫూర్తిగా
అభినందనలు తెలియజేస్తూ...

మీ

నన్నపనేని సుధాకర్